శ్రీ ర స్తు

# మాధవనిదానము.

మా ధ వ క ర వి ర చి త ము

బ్రహ్మశ్రీ పండిత నుదురుపాటి
విశ్వనాథశాస్త్రి ప్రణీతాంధ్రవ్యాఖ్యానసమలంకృతము

చింతలపాటి వెంకటసుబ్బయ్య
బహూకరించినది
1972

చె న్న పు రి :
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
వా రి చే ప్ర క టి త ము.
1965

*All Rights Reserved.*

Printed by
V. VENKATESWARA SASTRULU TRUST
For V. RAMASWAMY SASTRULU & SONS
AT THEIR 'VAVILLA' PRESS
MADRAS—1965.—1000 Copies.

# ఉపోద్ఘాతము

శ్రీ పరమకారుణికుండును పరాత్పరుండును సకల భూతాంతర్యామియు నగు నాదిదేవుని యనంతసృష్టికి లోనగుమానవులకు ఐహికాముష్మికఫలప్రాప్తికిని అనశ్వరమైన నిర్వాణమునకును, ప్రాపకము లగు శ్రుతిచోదితకర్మములు ముఖ్యసాధనములు. అట్టి కర్మములే ధర్మపద వాచ్యము లగును. వానిని విధ్యుక్తముగ నెరవేర్చుటకు శరీరము ముఖ్యసాధనము. అయ్యది వ్యాధిపీడితముగాక యారోగ్యస్థితి నుండినగాని సకలక్రియాదక్షము కానోపదు. అట్టియెడ మనుజుల ప్రజ్ఞాపరాధమునంజేసి మిథ్యాహారవిహారాదులచే నారోగ్యము చెడును. అట్టి యారోగ్యము చెడకుండుటకును, నొకవేళ పొరపాటున నారోగ్యము చెడినచో దానిని మరల సరిజేసికొనుటకును సాధనముగ ప్రాచీన మహర్షులు ఆయుర్వేదమును నిర్మించిరి. అట్టి యాయుర్వేదము తొలుదొలుత బ్రహ్మవలన సహస్రాక్షు డుపదేశము నొందెను. పదంపడి వారివలన భరద్వాజుండును, వారివలన నాత్రేయాదిమహర్షులును గ్రహించి వేరువేరుగ నాయుర్వేదతంత్రములను లోకహితార్థమై రచించిరి.

అట్టి యాయుర్వేదము హేతు - లక్షణ - ఔషధరూపస్కంధత్రయాత్మకమై యుండును. ఈవిషయము "తస్మై ప్రోవాచ భగవానాయుర్వేదం శతక్రతుః. పదైరల్పైర్మతిం బుద్ధ్వా...... హేతులిఙ్గౌషధజ్ఞానం స్వస్థాతురపరాయణమ్. త్రిసూత్రం.........పితామహః" (చ. సూ. అ. ౧) అను వాక్యముచే చరకాచార్యులు చెప్పిరి. అందు జ్వరాదిరోగములయుత్పత్తికి కారణములు దెలుపుభాగము హేతుస్కంధము. వానిలక్షణముల నిర్దేశించి వివరించుభాగము లక్షణస్కంధము. ఔషధముల స్వరూపగుణాదులను వివరింపుచు వాని

నాయా వ్యాధులయం దుపయోగించు చికిత్సావిధానాదుల వివరించు భాగము ఔషధస్కంధము. ఈస్కంధత్రయమును వివరించుగ్రంథము ఆయుర్వేద మని యార్షసిద్ధాంతము.

అందు వ్యాధిహేతువులను లక్షణములను వివరించుభాగమును నిదానశబ్దముచే వ్యవహరించిరి. మరియు, "నితరాం దీయతే (జన్యతే) కార్యం అనేనేతి—నిదానం" అను వ్యుత్పత్తిచేత వ్యాధుల గల్గించు మిథ్యాహారవిహారాదు లగు కారణములెల్ల నిదానశబ్దముచే గ్రహింపబడును. "నిశ్చిత్య దీయతే(ప్రతిపాద్యతే)వ్యాధిః అనేనేతి—నిదానమ్" అను వ్యుత్పత్తిచేత "ఈవ్యాధి యీకారణములచేత నీరీతిగ జనించి యిట్టి లక్షణముల గల్గియున్నది" అని నిర్ణయించుటకు సాధనభూతము లన్నియు నిదానశబ్దవాచ్యము లగును. అయ్యవి నిదాన - పూర్వరూప - రూప-ఉపశయ -సంప్రాప్తులగును. అట్టి నిదానాదులచే వ్యాధి యియ్యది యని స్వరూపము పూర్తిగ దెలిసినను దానిసాధ్యాఽసాధ్యపరిజ్ఞానము నెరుంగక చికిత్స జేయ వలనుపడదు; కావున అట్టినిర్ణయమునకైన వ్యాధులకు సంబంధించిన స్వరూపలక్షణంబులును, ఉపద్రవంబులును, అరిష్ట (మరణసూచక) లక్షణంబులును నిదానభాగమున వివరించుట యావశ్యకము; కావున నిదాన - పూర్వరూప - రూప - ఉపశయ - సంప్రాప్తులను, ఉపద్రవ - అరిష్ట - వ్యాధిలక్షణములను వివరించి చెప్పునట్టిభాగము నిదాన మని యాయుర్వేదాచార్యులయభిమతము. ఈయుద్దేశముచేతనే యీసంగ్రహకారుఁడు గ్రంథారంభమున "సోపద్రవాఽరిష్టనిదానలిఙ్గో నిబధ్యతే రోగవినిశ్చయోఽయమ్" అని ప్రతిజ్ఞచేసెను. పరీక్షాపూర్వముగ రోగముల తొలుత నిశ్చయించియే చికిత్సచేయవలెను. ఈవిషయమునే "రోగమాదౌ పరీక్షేత తతోఽనన్తరమౌషధమ్." (చ. సూ. అ. ౨౦) అని చరకాచార్యు లుపదేశించిరి.

అట్టి రోగనిశ్చయరూపమైన నిదానభాగమును ఆయుస్తంత్రకారులగు ఆత్రేయ-చరక-సుశ్రుతాది ఋషిపుంగవులు వారివారిసంహితా

గ్రంథములయందు నిదానస్థానమున వివరించి చెప్పిరి; కాని వానినన్నింటి నొక్క ప్రకరణముననే చెప్పక కొన్నిరోగముల నిదానస్థానమునను, కొన్నిటిని చికిత్సయందును, కొన్నిటిని ఉత్తరతంత్రము మున్నగుప్రకరణాంతరములయందును నిరూపించి చెప్పిరి. దానంజేసి యాయాతంత్రములను సాంతముగ జదివినగాని రోగములయన్నింటి నిదానములను దెలియ వలనుపడదు. అందును కొన్నితంత్రములయందు కొన్ని నిదానములు కానరావు. తంత్రముల నన్నింటిని పరిశీలించినగాని పూర్తిగ రోగముల నన్నింటి నిశ్చయింప వలను పడదు.

అట్టికష్టముల తొలగించుటకై మాధవకరు డను విద్వద్వైద్యవరుడు ఆయాతంత్రములయందు గల రోగనిదానముల నన్నింటిని సంగ్రహించి యనేక గ్రంథముల జదువు ప్రయాసములేక ఒకగ్రంథము చేతనే నిదానముల నన్నింటిని సులభముగ తెలిసికొన వలనుపడునట్లు ఒక్కెడ జేర్చి, యాగ్రంథము తనపేర వెలయునట్లు మాధవనిదాన మను నీ గ్రంథమును రచించెను. ఈవిషయమునే యీగ్రంథకారుడు కంఠోక్తిగ నిట్లు తెలిపెను. "నానాతంత్రవిహీనానాం భిషజామల్పమేధసామ్, సుఖం విజ్ఞాతు మాతఙ్కమయమేవ భవిష్యతి." ఈవాక్యముచేత ననేక తంత్రముల జదువనేరని వైద్యవరులకు అన్నిరోగములను సులభముగ నెరుంగ నీగ్రంథము సాహాయ్యకరమగు నని స్పష్టముగ తెలిసెడి. అట్టి సౌలభ్యమును గమనించియే "నిదానే మాధవశ్శ్రేష్ఠః" అని యీ గ్రంథమును ప్రాచీనులు మిక్కిలి కొనియాడిరి.

మరియు నియ్యది సంగ్రహరూపమైన గ్రంథము. చరక - సుశ్రుతాది సంహితలయందలి శ్లోకములనే యేర్పరిచి యొక్కెడ గూర్చి గ్రంథరూపముగ రచింపబడినది. ఈవిషయమునే గ్రంథకర్త "నానామునీనాం వచనై రిదానీం సమాసతః......నిబధ్యతే రోగవినిశ్చయోఽయమ్" అని గ్రంథోపక్రమంబునను; "సుభాషితం యత్ర యదస్తి కిఞ్చిత్ తత్సర్వమేకీకృతమత్ర యత్నాత్. వినిశ్చయే సర్వరుజాం నరాణాం

శ్రీమాధవేనేన్దుకరాత్మజేన" అని గ్రంథాంతమునను స్పష్టముగ జెప్పెను ఇందు చరక-సుశ్రుత-విదేహ-వాగ్భటాదితంత్రములయందలి వచనము లున్నను వాగ్భటవచనములే విశేషముగ గన్పట్టుచున్నవి.

ఈగ్రంథమున నధ్యాయములకు బదులుగ నాయారోగముల పేరిట జ్వరనిదానము, అతిసారనిదానము మున్నగు సాంకేతికపదముల చేతనే ఆయాప్రకరణములు విభజింపబడినవి. అందు మొదటి ప్రకరణము పంచనిదానలక్షణము. ఇందు నిదానపదవాచ్యములగు నిదాన - పూర్వ రూప - రూప - ఉపశయ - సంప్రాప్తు లైదిటికిని వేరువేరు లక్షణములు వివరింపబడినవి. ఈ నిదానాదిపంచకమును జ్వరాదిరోగము లన్నిటి యందును రోగముల గుర్తింప సాధనములై సామాన్యముగ నుండును కావున వ్యాపకమైనది. కావుననే వాగ్భటాచార్యులు "అథాత స్సర్వ రోగనిదానం వ్యాఖ్యాస్యామః" అని యుపక్రమించి తొలుత పంచ నిదానలక్షణముల వివరించెను. చరకాదులును రోగసామాన్యముగ నుండు నిదానాదిపంచకమును తొలుత వివరించి తక్కినరోగముల వరు సగ వివరించిరి.

ఈగ్రంథకర్తయగు మాధవకరునికాలము నివాసస్థలము మున్నగు చారిత్రకవిషయములను చర్చించి నిర్ణయించుట చరిత్రకారుల పని యని తలంచి యట్టివిచారము మానితిని. అయినను ఈమాధవకరుడు వేదము లకు భాష్యములరచించిన విద్యారణ్యాపరనామకమాధవాచార్యులకన్న నితరుడని చరిత్రకారుల విమర్శనలచే నిర్ణయింపదగియున్నది. మరియు మాధవాచార్యుల నుద్దేశించి పరాశరమాధవీయము పీఠికయం దిట్లు చెప్పబడినది. "యస్య బోధాయనం సూత్రం శాఖా యస్య చ యాజుషీ, భారద్వాజకులం యస్య సర్వజ్ఞ స్సహి మాధవః. శ్రీమతీ యస్య జననీ సుకీర్తిః మాయణః పితా, సాయణో భోగనాథశ్చ మనోబుద్ధి సహో దరౌ." ఈవాక్యములబట్టి వేదభాష్యప్రణేతయగు మాధవాచార్యులు మాయణపుత్రుడనియు నివిమున్నగువిషయములు స్ఫుటముగ దెలియు

చున్నవి. నిదానకర్తయగు మాధవకరుడు "శ్రీమాధవేనేందుకరాత్మజేన" అని తన గ్రంథముననే తాను ఇందుకరుని పుత్రుడని స్ఫుటముగ దెలిపియున్నాడు. కావున నీమాధవకరుడు వేదభాష్యకర్తయగు మాధవాచార్యులకు భిన్నుడనుసంశయము నిర్వివాదము. మరియు ఉత్తర హిందూస్థానమున నామాంతమునందు "కర్" అని చేర్చుట ప్రాయికముగ నలవాటులో నున్నది. వీరితండ్రి పేరు 'ఇందుకర' అనియు, వీరి పేరు 'మాధవకర' అనియు "కర" శబ్దము నామాంతమున నుండుటం బట్టిచూడ నౌత్తరాహుడనిమాత్ర మూహింపదగియున్నది.

అట్టి యీమాధవనిదానమునకు అనేకులు సంస్కృతవ్యాఖ్యానములు రచించిరి. అందు శ్రీవిజయరక్షితవిరచిత మధుకోశం బను వ్యాఖ్యయు, వాచస్పతి వైద్యవిరచిత ఆతంకదర్పణవ్యాఖ్యయు సుప్రసిద్ధముగ గానంబడుచున్నవి. ఈవ్యాఖ్యానములచేత సంస్కృతభాషాభిజ్ఞులకుమాత్రము నిదానభాగమును సులభముగ దెలిసికొనుటకు సౌకర్యముగ నున్నది. కాని కేవల మాంధ్రభాషాభిజ్ఞులకు దెలియుట కష్టసాధ్యము.

అట్టిలోపమును నివర్తిపరచుటకై నేను ఆంధ్రలోకమునకు సుబోధమగునట్లు తేటతెల్లమగు నాంధ్రభాషచే నీవ్యాఖ్యానమును రచించినాడ. ఇయ్యది మధుకోశ ఆతంక - దర్పణముల ప్రాయికముగ ననుకరించియుండును. సందర్భానుసారముగ చరక-సుశ్రుత-వాగ్భటాది వాక్యముల ననువదించి పరస్పరభేదముల నిరూపించుచు వివరింపబడినది. ఇది యాంధ్రలోకమునకు చాలగ నుపకరించు నని నాయుద్దేశము.

నే నీవ్యాఖ్య రచించుటకు ఆంధ్రభాషాభిమానులును, గ్రంథోద్ధారకులును, దిగంతరవ్యాప్తకీర్తిమంతులును, పరోపకారపరాయణులును, శ్రీవావిళ్ల రామస్వామిశాస్త్రిసుపుత్రులును నగు బ్రహ్మశ్రీ శ్రీయుత వేంకటేశ్వరశాస్త్రులుగారు నాకు పారితోషికము మున్నగు తగువసతుల గల్పించి ప్రోత్సహించుటయేగాక ముద్రణాదివ్యయప్రయాసముల సరకుసేయక ముద్రింపించి లోకోపకార మొనరించిరి.

ఈవ్యాఖ్యయందు భ్రమప్రమాదాదులచే నెచ్చటనైన లోపమున్నచో పండితవరేణ్యులు నాకు దెల్పి నావలననే సవరింపజేయ బ్రార్థించెద.

ఇదివరలో చరకసంహిత - వాగ్భటము - గదనిగ్రహము - రావణ కుమారతంత్రము - భేషజకల్పము - చక్రదత్త - శార్ఙ్గధరకృతత్రిశతి - రాజమార్తాండము - విషవైద్యచింతామణి - శార్ఙ్గధరసంహిత - బసవ రాజీయము - వైద్యశతశ్లోకి - రసప్రదీపిక - నాడీజ్ఞానము - వస్తుగుణ మహోదధి - చారుచర్య - ఇలాజుల్ గుర్బా - *సుశ్రుతము - వైద్య చింతామణి మున్నగువైద్యగ్రంథముల శ్రీవావిళ్లవారు ప్రకటించి యున్నారు:

మరియు ననేకసంస్కృతాంధ్ర గ్రంథముల ముద్రింపించి లోకము నకు ప్రచారమొనరించి సారస్వతమునెల్ల నుద్ధరింప బద్ధదీక్షులగు శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రిగారికి ఆయురారోగ్యభాగ్యముల నొసగూర్చి తగు ప్రోత్సాహమును పరమకారుణికుండగు శ్రియఃపతి గలిగించుగాక !

ఇట్లు విన్నవించు, పండితపాదసేవకుడు,
పండిత నుదురుపాటి విశ్వనాథశాస్త్రి,
వ్యాఖ్యానకర్త.

---

☞ *శ్రీనుదురుపాటి విశ్వనాథశాస్త్రిగారు సుశ్రుతసంహిత పూర్తియగుటకు పూర్వమే మరణించినందులకు విచారపడుచున్నాము.

ఇట్లు,
ప్రకాశకులు.

# విషయానుక్రమణిక


| విషయము. | పుట. |
|---|---|
| **౧. పఞ్చలక్షణనిదానమ్** | |
| వ్యాఖ్యానప్రారంభము | 1 |
| అనుబంధచతుష్టయము | 3 |
| గ్రంథప్రాశస్త్యము | ,, |
| వ్యాధినిదెలుపునుపాయములు | 4 |
| నిదానలక్షణము | 6 |
| పూర్వరూపలక్షణము | 13 |
| రూపలక్షణము | 14 |
| ఉపశయలక్షణము | 15 |
| అనుపశయలక్షణము | 19 |
| సంప్రాప్తిలక్షణము | ,, |
| సంప్రాప్తిభేదములు | 20 |
| వికల్పలక్షణము | ,, |
| ప్రాధాన్యలక్షణము | 21 |
| బలాబలలక్షణము | 22 |
| కాలనిర్ణయము | ,, |
| నిదానవిశేషము | 23 |
| చరకోక్తనిదానము | 25 |
| రోగము రోగాన్తరమును కల్గించు క్రమము | 26 |
| **౨. జ్వరనిదానమ్** | |
| జ్వరముయొక్క ప్రాగుత్పత్తియు, భేదంబులును | 28 |
| జ్వరసంప్రాప్తి | 29 |
| జ్వరసామాన్యలక్షణము | 30 |
| జ్వరసామాన్యపూర్వరూపము | ,, |
| జ్వరవిశేషపూర్వరూపములు | ,, |
| వాతజ్వరలక్షణము | 31 |
| పిత్తజ్వరలక్షణము | 32 |
| కఫజ్వరలక్షణము | 33 |
| వాతపిత్తజ్వరలక్షణము | 34 |
| వాతకఫజ్వరలక్షణము | ,, |
| పిత్తకఫజ్వరలక్షణము | 35 |
| సన్నిపాతజ్వరలక్షణము | ,, |
| సన్నిపాతజ్వరాసాధ్యలక్షణము | 43 |
| సన్నిపాతజ్వరమునకు కాలనియమము | 44 |
| సన్నిపాతజ్వరోపద్రవము | ,, |
| అభిన్యాసలక్షణము | 45 |
| ఆగంతుజ్వరలక్షణము | 46 |
| ఆగంతుజ్వరమునకు ప్రత్యేకలక్షణము | ,, |
| ఆగంతుజ్వరములయందు దోషసంబంధము | 47 |
| విషమజ్వరసంప్రాప్తి | 48 |
| విషమజ్వరభేదములు | ,, |
| సంతతజ్వరసంప్రాప్తి | 49 |
| సంతతజ్వరలక్షణము | ,, |
| సతతకజ్వరలక్షణము | 51 |
| అన్యేద్యుష్కలక్షణము | ,, |
| తృతీయకచతుర్థకములలక్షణములు | ,, |
| మతాన్తరమున విషమజ్వరలక్షణము | 52 |
| తృతీయకజ్వరభేదము | ,, |
| చతుర్థకజ్వరభేదములు | 54 |
| చతుర్థకవిపర్యయలక్షణము | 57 |
| వాతబలాసకజ్వరలక్షణము | 58 |
| ప్రలేపకజ్వరము | 59 |
| మరికొన్ని విషమజ్వరములు | ,, |
| దాహపూర్వ-శీతపూర్వజ్వరలక్షణములు | 60 |
| రసగతజ్వరము | 61 |

| విషయము. | పుట. |
|---|---|
| రక్తగతజ్వరము | 62 |
| మాంసగతజ్వరము | ,, |
| మేదోగతజ్వరము | ,, |
| అస్థిగతజ్వరము | 63 |
| మజ్జగతజ్వరము | ,, |
| శుక్రగతజ్వరము | ,, |
| ధాతుగతజ్వరములలో సాధ్యాసాధ్యములు | 64 |
| జ్వరమునకు ప్రాకృతవైకృత భేదములు | ,, |
| ప్రాకృతజ్వరోత్పత్తిక్రమము | 65 |
| అంతర్వేగజ్వరలక్షణము | 66 |
| బహిర్వేగజ్వరలక్షణము | ,, |
| ఆమజ్వరలక్షణము | 67 |
| పచ్యమానజ్వరలక్షణము | 69 |
| పక్వజ్వరలక్షణము | ,, |
| సాధ్యజ్వరలక్షణము | ,, |
| అసాధ్యజ్వరలక్షణములు | 70 |
| జ్వరము విడుచుసమయమున గల్గు లక్షణములు | 73 |
| జ్వరవిముక్తలక్షణములు | ,, |
| **3. అతిసారనిదానమ్** | |
| అతిసారసంప్రాప్తి | 76 |
| అతిసారపూర్వరూపము | 77 |
| వాతాతిసారలక్షణము | 78 |
| పిత్తకఫాతిసారలక్షణములు | ,, |
| సన్నిపాతాతిసారలక్షణములు | ,, |
| శోకాతిసారలక్షణము | ,, |
| ఆమాతిసారలక్షణము | 79 |
| ఆమమలలక్షణము | ,, |
| పక్వమలలక్షణము | ,, |
| అసాధ్యాతిసారలక్షణము | 80 |
| రక్తాతిసారలక్షణము | 81 |
| ప్రవాహికాలక్షణము | ,, |
| ప్రవాహికాభేదములు, లక్షణములు | 82 |
| అతిసారనివృత్తిలక్షణము | ,, |
| జ్వరాతిసారలక్షణము | 83 |
| **౪. గ్రహణీనిదానమ్** | |
| గ్రహణీరోగసంప్రాప్తి | 84 |
| గ్రహణీసామాన్యలక్షణము | ,, |
| గ్రహణీపూర్వరూపము | 85 |
| వాతికగ్రహణీసంప్రాప్తిలక్షణము | ,, |
| పిత్తజగ్రహణీలక్షణము | 87 |
| కఫజగ్రహణీలక్షణము | ,, |
| సన్నిపాతగ్రహణీలక్షణము | 88 |
| సంగ్రహఘటీయన్త్రగ్రహణీలక్షణములు | ,, |
| అసాధ్యగ్రహణీలక్షణము | 89 |
| **౫. అర్శోనిదానమ్** | |
| అర్శోరోగసంఖ్య | 90 |
| అర్శస్సమ్ప్రాప్తి | [illegible] |
| వాతార్శోనిదానము | ,, |
| పిత్తార్శోనిదానము | 92 |
| కఫజార్శోనిదానము | ,, |
| ద్వంద్వజసన్నిపాతజార్శోనిదానము | 93 |
| వాతార్శోలక్షణము | 94 |
| పిత్తార్శోలక్షణము | 95 |
| కఫజార్శోలక్షణము | ,, |
| సాన్నిపాతికార్శోలక్షణము | 96 |
| రక్తార్శోలక్షణము | ,, |
| దోషానుబంధమునకల్గినరక్తార్శోలక్షణము | 97 |
| అర్శోరోగపూర్వరూపములు | 98 |
| అర్శోరోగప్రాబల్యకారణము | ,, |
| సుఖసాధ్యార్శోలక్షణము | 99 |
| కృచ్ఛ్రసాధ్యార్శోలక్షణము | ,, |
| అసాధ్యార్శోలక్షణము | ,, |
| యాప్యార్శోలక్షణము | 100 |

| విషయము. | పుట. |
|---|---|
| ఉపద్రవవిశేషములచే నసాధ్యత్వము | 100 |
| స్థానవిశేషమునజనించునరోగ్యలక్షణము | 101 |
| చర్మకీలలక్షణము | ,, |
| **౬. అగ్నిమాంద్యాజీర్ణవిసూచికాలసకవిలంబికానిదానమ్** | |
| జాఠరాగ్నిభేదములు | 103 |
| మందాద్యగ్నికృత్యములు | ,, |
| అజీర్ణభేదములు | 105 |
| అజీర్ణకారణములు | 107 |
| ఆమాజీర్ణలక్షణము | 108 |
| విదగ్ధాజీర్ణలక్షణము | ,, |
| విష్టబ్ధాజీర్ణలక్షణము | ,, |
| రసశేషాజీర్ణలక్షణము | ,, |
| అజీర్ణోపద్రవములు | 109 |
| అజీర్ణ[illegible]ముఖ్యకారణము | ,, |
| విసూచ్యలసకవిలమ్బికానిదానములు | ,, |
| విసూచియన్వర్థసంజ్ఞ. | ,, |
| విసూచీలక్షణము | 110 |
| అలసకలక్షణము | 111 |
| విలంబికాలక్షణము | 112 |
| ఆమవిశేషకృత్యములు | ,, |
| అసాధ్యవిసూచ్యలసకలక్షణములు | 113 |
| జీర్ణాహారలక్షణము | 114 |
| **౭. క్రిమినిదానమ్** | |
| క్రిమిభేదములు | 115 |
| బాహ్యక్రిములలక్షణము | ,, |
| క్రిములు కల్గుటకు కారణములు | 116 |
| అభ్యంతరమలములు జనించుటకు కారణములు | ,, |
| క్రిమివ్యాధిలక్షణము | ,, |
| కఫజక్రిమిలక్షణము | ,, |
| రక్తజక్రిమిలక్షణము | 117 |
| పురీషజక్రిములలక్షణము | 118 |

| విషయము. | పుట. |
|---|---|
| **౮. పాండురోగకామలాకుంభకామలాహలీమకనిదానమ్** | |
| పాండురోగభేదములు | 120 |
| పాండురోగనిదానము సంప్రాప్తి | ,, |
| పాండురోగపూర్వరూపములు | 122 |
| వాతజపాండురోగలక్షణము | 123 |
| పిత్తజపాండురోగలక్షణము | ,, |
| కఫజపాండురోగలక్షణము | ,, |
| సన్నిపాతజపాండురోగలక్షణము | 124 |
| మృజ్జపాండురోగసంప్రాప్తి | ,, |
| మృజ్జపాండురోగలక్షణము | 125 |
| అసాధ్యపాండురోగలక్షణములు | ,, |
| కామలాలక్షణము | 126 |
| కుంభకామలాలక్షణము | 127 |
| అసాధ్యకామలాలక్షణము | ,, |
| అసాధ్యకుంభకామలాలక్షణము | ,, |
| హలీమకలక్షణము | 128 |
| **౯. రక్తపిత్తనిదానమ్** | |
| రక్తపిత్తనిదానము, సంప్రాప్తి | 129 |
| రక్తపిత్తపూర్వరూపములు | 131 |
| కఫవాతములచే జనించినరక్తపిత్తము | ,, |
| పిత్తముచే జనించిన రక్తపిత్తము | ,, |
| ద్వంద్వజరక్తపిత్తలక్షణము | ,, |
| రక్తపిత్తసాధ్యాసాధ్యనిర్ణయము | 132 |
| రక్తపిత్తోపద్రవములు | ,, |
| అసాధ్యరక్తపిత్తము | 133 |
| **౧౦. రాజయక్ష్మనిదానమ్** | |
| రాజయక్ష్మకారణములు | 134 |
| రాజయక్ష్మసంప్రాప్తి | 135 |
| రాజయక్ష్మపూర్వరూపములు | 137 |
| రాజయక్ష్మసామాన్యలక్షణములు | 138 |
| రాజయక్ష్మరూపము | ,, |
| అసాధ్యరాజయక్ష్మలక్షణము | 139 |

| విషయము. | పుట. |
| --- | --- |
| అసాధ్యత్వనియమము | 139 |
| అసాధ్యరాజయక్ష్మలక్షణములు | 140 |
| సాధ్యరాజయక్ష్మలక్షణము | ,, |
| వ్యవాయాదిశోషపరిగణనము | 141 |
| వ్యవాయశోషలక్షణము | ,, |
| శోక-జరా అధ్వశోషలక్షణములు | ,, |
| వ్యాయామశోషలక్షణము | 142 |
| వ్రణశోషలక్షణము | 143 |
| ఉరఃక్షతలక్షణము | ,, |
| ఉరఃక్షతపూర్వరూపము | 144 |
| క్షతక్షీణసామాన్యలక్షణము | ,, |
| క్షతక్షయసాధ్యాసాధ్యనిర్ణయము | 145 |
| **౧౧. కాసనిదానమ్** | |
| కాసోత్పత్తికారణములు, కాససంప్రాప్తి | 146 |
| కాసరోగభేదములు | 147 |
| కాసపూర్వరూపము | ,, |
| వాతజకాసలక్షణము | 148 |
| పైత్తికకాసలక్షణము | 149 |
| శ్లైష్మికకాసలక్షణము | ,, |
| క్షతజకాసలక్షణము | 150 |
| క్షయకాసనిదానము | 151 |
| క్షయకాసలక్షణము | ,, |
| సాధ్యాసాధ్యకాసములు | ,, |
| **౧౨. హిక్కా-శ్వాసనిదానమ్** | |
| హిక్కా-శ్వాసములు జనించు కారణములు | 153 |
| హిక్కాసంప్రాప్తి | 154 |
| హిక్కాభేదములు | 155 |
| హిక్కాపూర్వరూపములు | 156 |
| అన్నజహిక్కాలక్షణములు | ,, |
| యమళహిక్కాలక్షణము | ,, |
| క్షుద్రహిక్కాలక్షణము | 157 |
| గంభీరహిక్కాలక్షణము | ,, |

| విషయము. | పుట. |
| --- | --- |
| మహాహిక్కాలక్షణము | 157 |
| అసాధ్యహిక్కాలక్షణము | 158 |
| శ్వాసభేదములు | 159 |
| శ్వాసవ్యాధిపూర్వరూపము | 160 |
| శ్వాసవ్యాధిసంప్రాప్తి | ,, |
| మహాశ్వాసలక్షణము | ,, |
| ఊర్ధ్వశ్వాసలక్షణము | 161 |
| ఛిన్నశ్వాసలక్షణము | ,, |
| తమకశ్వాసలక్షణము | 162 |
| ప్రతమకసంతమకశ్వాసలక్షణములు | 163 |
| క్షుద్రశ్వాసలక్షణము | 164 |
| శ్వాసములలో సాధ్యాఽసాధ్యములు | 165 |
| **౧౩. స్వరభేదనిదానమ్** | |
| స్వరభేదనిదానసంప్రాప్తులు | 166 |
| స్వరభేదవిభాగము | ,, |
| వాతిక-పైత్తికస్వరభేదలక్షణము | [illegible] |
| శ్లైష్మికసాన్నిపాతిక[illegible] | ,, |
| క్షయజస్వరభేదలక్షణము | ,, |
| మేదోజస్వరభేదలక్షణము | 168 |
| అసాధ్యస్వరభేదలక్షణము | ,, |
| **౧౪. అరోచకనిదానమ్** | |
| అరోచకము జనించుకారణములు | 169 |
| వాతాద్యరోచకలక్షణములు | ,, |
| అభిఘాత-సన్నిపాతములచే గల్గిన యరోచకలక్షణములు | 170 |
| వాతాద్యరోచకములవిశేషలక్షణములు | ,, |
| **౧౫. ఛర్దినిదానమ్** | |
| ఛర్దిసంఖ్య | 172 |
| ఛర్దిరోగకారణములు, సంప్రాప్తి | ,, |
| ఛర్దిపూర్వరూపము | 173 |
| వాతికచ్ఛర్దిలక్షణము | ,, |
| పైత్తికచ్ఛర్దిలక్షణము | 174 |
| కఫజచ్ఛర్దిలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| సన్నిపాతజచ్ఛర్దిలక్షణము | 174 |
| ఛర్దిరోగాసాధ్యలక్షణములు | 175 |
| ఆగంతుకచ్ఛర్దిలక్షణము | ,, |
| క్రిమిజచ్ఛర్దిలక్షణము | 176 |
| అసాధ్యచ్ఛర్దిలక్షణము | ,, |
| **౧౬. తృష్ణానిదానమ్** | |
| తృష్ణాసంప్రాప్తి | 177 |
| తృష్ణాభేదములు | 178 |
| వాతజతృష్ణాలక్షణము | 179 |
| పైత్తికతృష్ణాలక్షణము | ,, |
| కఫమున జనించిన తృష్ణాలక్షణము | 180 |
| క్షతజ-క్షయజతృష్ణాలక్షణములు | ,, |
| ఆమజతృష్ణాలక్షణము | 181 |
| అన్నజతృష్ణాలక్షణము | ,, |
| ఉపసర్గజతృష్ణాలక్షణము | 182 |
| అసాధ్యతృష్ణాలక్షణము | ,, |
| **౧౭. మూర్ఛాభ్రమనిద్రాతంద్రా సన్న్యాసనిదానమ్** | |
| మూర్ఛాసంప్రాప్తి | 184 |
| మూర్ఛాపూర్వరూపము | 185 |
| వాతికమూర్ఛాలక్షణము | ,, |
| పిత్తజమూర్ఛాలక్షణము | ,, |
| శ్లైష్మికమూర్ఛాలక్షణము | 186 |
| సాన్నిపాతికమూర్ఛాలక్షణము | ,, |
| రక్తజమూర్ఛాలక్షణము | ,, |
| విషజ-మద్యజమూర్ఛాలక్షణములు | 187 |
| రక్తజవిషజమద్యజమూర్ఛల స్వరూపము | 188 |
| మూర్ఛ-భ్రమ-నిద్రలకు కారణములు | ,, |
| తన్ద్రాలక్షణము | 189 |
| సన్న్యాసమూర్ఛలకు పరస్పరభేదము | 190 |
| సన్న్యాసలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| **౧౮. పానాత్యయ-పరమద-పానాజీర్ణ-పానవిభ్రమనిదానమ్** | |
| మద్యపానమున మూర్ఛకల్గుటకు కారణములు | 191 |
| యుక్తియుక్తమద్యసేవచే జనించు గుణములు | 192 |
| ప్రథమమదలక్షణము | 194 |
| ద్వితీయమదలక్షణము | 195 |
| తృతీయమదలక్షణము | ,, |
| చతుర్థమదలక్షణము | 196 |
| అయుక్తమదసేవచే గల్గువికారములు | 197 |
| మద్యపానమునకు దగనిసమయము | 198 |
| మద్యమున గల్గురోగములు | ,, |
| వాతాధిక మదాత్యయలక్షణము | ,, |
| పిత్తాధిక మదాత్యయలక్షణము | 199 |
| కఫాధికమదాత్యయలక్షణము | ,, |
| సాన్నిపాతిక మదాత్యయలక్షణము | ,, |
| పరమదలక్షణము | ,, |
| పానాజీర్ణపానవిభ్రమ లక్షణములు | 200 |
| మదాత్యయాసాధ్యలక్షణములు | ,, |
| **౧౯. దాహనిదానమ్** | |
| మద్యజదాహలక్షణము | 202 |
| రక్తజదాహలక్షణము | ,, |
| పైత్తిక-తృష్ణానిరోధజదాహలక్షణములు | ,, |
| కోష్ఠజదాహలక్షణము | 203 |
| క్షయజదాహలక్షణము | ,, |
| మర్మజదాహలక్షణము | ,, |
| **౨౦. ఉన్మాదనిదానమ్** | |
| ఉన్మాదశబ్దార్థము | 204 |
| ఉన్మాదభేదములు | ,, |
| ఉన్మాదసామాన్యకారణములు | ,, |
| ఉన్మాదసామాన్యసంప్రాప్తి | 205 |
| ఉన్మాదసామాన్యరూపము | |

| విషయము. | పుట. |
|---|---|
| వాతికోన్మాదనిదాన-సంప్రాప్తి-లక్షణములు | 205 |
| పైత్తికోన్మాదనిదాన-సంప్రాప్తిలక్షణములు | 206 |
| కఫజోన్మాదలక్షణము | 207 |
| సన్నిపాతజోన్మాదనిదాన-సంప్రాప్తి-లక్షణములు | ,, |
| శోకజోన్మాదనిదాన-సంప్రాప్తి-లక్షణములు | 208 |
| విషజోన్మాదలక్షణము | ,, |
| అసాధ్యోన్మాదలక్షణము | 209 |
| భూతోన్మాద సామాన్యలక్షణము | ,, |
| దేవగ్రహోన్మాదలక్షణము | ,, |
| అసురగ్రహోన్మాదము | 210 |
| గన్ధర్వగ్రహోన్మాదలక్షణము | ,, |
| యక్షగ్రహోన్మాదలక్షణము | 211 |
| పితృగ్రహోన్మాదలక్షణము | ,, |
| నాగగ్రహోన్మాదలక్షణము | ,, |
| రాక్షసగ్రహోన్మాదలక్షణము | 212 |
| పిశాచగ్రహోన్మాదలక్షణము | ,, |
| గ్రహముల అసాధ్యలక్షణము | 213 |
| దేవాదిగ్రహములావహించుకాలము | 214 |
| ఆవహించినగ్రహములు కనబడనికారణములు | ,, |
| **౨౧. అపస్మారనిదానమ్** | |
| అపస్మారసంప్రాప్తి | 216 |
| అపస్మారసామాన్యలక్షణము | ,, |
| అపస్మారపూర్వరూపము | 217 |
| వాతాపస్మారలక్షణము | ,, |
| పిత్తాపస్మారలక్షణము | ,, |
| కఫమునజనించిన యపస్మారలక్షణము | ,, |
| సాన్నిపాతికాపస్మారలక్షణము | 218 |
| అపస్మారప్రకోపకాలనియమము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| **౨౨. వాతవ్యాధినిదానమ్** | |
| వాతవ్యాధినిదానసంప్రాప్తులు | 219 |
| వాతవ్యాధిపూర్వరూపము | 220 |
| వాతవ్యాధిస్వరూపము | ,, |
| కోష్ఠగతవాతలక్షణము | 221 |
| సర్వాఙ్గగతవాతలక్షణము | ,, |
| గుదగతవాతలక్షణము | 222 |
| ఆమాశయగతవాతలక్షణము | ,, |
| పక్వాశయగతవాతలక్షణము | ,, |
| శ్రోత్రాదీన్ద్రియగతవాతలక్షణము | 223 |
| త్వగ్గతవాతలక్షణము | ,, |
| రక్తధాతుగతవాతలక్షణము | ,, |
| మాంసమేదోగతవాతలక్షణము | ,, |
| అస్థిమజ్జగతవాతలక్షణము | 224 |
| శుక్రగతవాతలక్షణము | ,, |
| సిరాగతవాతలక్షణము | ,, |
| స్నాయుసంధిగతవాతలక్షణము | 225 |
| పంచవిధవాతభేదములు | ,, |
| పిత్తావృత-కఫావృతప్రాణవాతలక్షణము | ,, |
| కఫపిత్తములతోఁగూడిన యుదాన వాతలక్షణము | 226 |
| పిత్తకఫములతోఁగూడిన సమానవాతలక్షణము | ,, |
| పిత్తకఫములతోఁగూడిన యపానవాతలక్షణము | ,, |
| పిత్తకఫములతోఁగూడినవ్యానవాత ,, | ,, |
| ఆక్షేపకవాతలక్షణము | 227 |
| అపతంత్రకవాతలక్షణము | ,, |
| అపతానకవాతలక్షణము | ,, |
| దండాపతానకలక్షణము | 228 |
| ధనుస్తమ్భవాతలక్షణము | ,, |
| అంతరాయామలక్షణము | ,, |
| బాహ్యాయామలక్షణము | 229 |
| అభిఘాతజ ఆక్షేపకవాతవ్యాధి | 230 |

EM NA


| విషయము. | పుట. |
|---|---|
| అసాధ్యాక్షేపకలక్షణము | 231 |
| ఏకాఙ్గసర్వాఙ్గవాతలక్షణము | ,, |
| ఏకాంగవాతసాధ్యాసాధ్యలక్షణములు | 232 |
| అర్దితవాతలక్షణము | ,, |
| అర్దితవాతాసాధ్యలక్షణములు | 234 |
| ఆక్షేపకాదివాతములవేగకాలనియమము | ,, |
| హనుగ్రహవాతలక్షణము | ,, |
| మన్యాస్తమ్భవాతలక్షణము | 235 |
| జిహ్వాస్తంభవాతలక్షణము | ,, |
| సిరాగ్రహవాతలక్షణము | ,, |
| గృధ్రసీవాతలక్షణము | ,, |
| గృధ్రసీవాతవిశేషలక్షణములు | 236 |
| విశ్వాచీవాతలక్షణము | ,, |
| క్రోష్టుకశీర్షలక్షణము | ,, |
| ఖంజ-పంగువాతలక్షణము | 237 |
| కలాయఖంపవాతలక్షణము | ,, |
| వాతకంటకవాతలక్షణము | ,, |
| పాదదాహలక్షణము | 238 |
| పాదహర్షవాతము | ,, |
| అంసశోషావబాహుకవాతలక్షణము | ,, |
| మూక-మిన్మిన-గద్గదవాతలక్షణములు | ,, |
| తూనీవాతలక్షణము | 239 |
| ప్రతితూనీవాతలక్షణము | ,, |
| ఆధ్మానప్రత్యాధ్మానవాతలక్షణము | ,, |
| అష్ఠీలావాతలక్షణము | 240 |
| కంపవాత-ఖల్వీవాతలక్షణములు | ,, |
| అనుక్తవాతవ్యాధినిర్ణయము | ,, |
| వాతవ్యాధిసాధ్యాసాధ్యనిర్ణయము | 241 |
| వాతవ్యాధ్యుపద్రవములు | ,, |


౨౩. వాతరక్తనిదానమ్


| | |
|---|---|
| వాతరక్తముజనించుటకుకారణములు | 243 |
| వాతరక్తసంప్రాప్తి | 244 |
| వాతరక్తపూర్వరూపము | 245 |
| వాతాధికవాతరక్తలక్షణము | 264 |
| విషయము | పుట |
| రక్తాధికవాతరక్తలక్షణము | 246 |
| పిత్తాధికవాతరక్తలక్షణము | ,, |
| కఫాధికద్వన్ద్వజవాతరక్తలక్షణము | 247 |
| వాతరక్తగమనభేదములు | ,, |
| వాతరక్తాసాధ్యలక్షణము | 248 |
| ఉపద్రవములచే వాతరక్తాసాధ్యత్వము | ,, |


౨౪. ఊరుస్తమ్భనిదానమ్


| | |
|---|---|
| ఊరుస్తమ్భకారణము సంప్రాప్తి | 250 |
| ఊరుస్తంభప్రాగ్రూపాదులు | 251 |
| ఊరుస్తంభసాధ్యాసాధ్యనిర్ణయము | 252 |


౨౫. ఆమవాతనిదానమ్


| | |
|---|---|
| ఆమవాతము జనించుటకు కారణము, సంప్రాప్తి | 253 |
| ఆమవాతసామాన్యలక్షణములు | 254 |
| ఆమవాతస్వరూపము, ఉపద్రవములు | ,, |
| ఆమవాతవిశేషలక్షణము | 255 |
| ఆమవాతసాధ్యాఽసాధ్యలక్షణములు | ,, |


౨౬. శూలపరిణామశూలాన్నద్రవశూలనిదానమ్


| | |
|---|---|
| శూలభేదములు | 256 |
| వాతికశూల-నిదానలక్షణములు | 257 |
| పిత్తజశూలనిదానలక్షణములు | 258 |
| కఫజశూల-నిదానలక్షణములు | 259 |
| సాన్నిపాతికశూల-నిదానలక్షణములు | 260 |
| ఆమజశూలలక్షణము | ,, |
| ద్విదోషజశూలలక్షణము | 261 |
| శూలవ్యాధిసాధ్యాసాధ్యలక్షణములు | ,, |
| పరిణామశూలసామాన్యలక్షణము | ,, |
| వాతజపరిణామశూలలక్షణము | 262 |
| పిత్తజపరిణామశూలలక్షణము | 263 |
| కఫజపరిణామశూలలక్షణము | ,, |
| సంసర్గజపరిణామశూలలక్షణము | ,, |
| అన్నద్రవశూలలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| **౨౭. ఉదావర్తానాహనిదానమ్** | |
| ఉదావర్తకారణములు | 265 |
| వాతనిరోధజోదావర్తలక్షణము | ,, |
| పురీషనిరోధజోదావర్తలక్షణము | 266 |
| మూత్రనిరోధజోదావర్తలక్షణము | ,, |
| జృంభానిరోధజోదావర్తము | ,, |
| అశ్రునిరోధజోదావర్తము | ,, |
| తుమ్మునిరోధించుటచేఁగల్గునుదావర్తం | 267 |
| ఉద్గారనిరోధజోదావర్తము | ,, |
| ఛర్దినిరోధజోదావర్తలక్షణము | ,, |
| శుక్రనిరోధజోదావర్తలక్షణము | ,, |
| క్షుత్తునునిరోధించుటచేనైనయుదావర్తము | 268 |
| దప్పిని నిరోధించుటచేఁగల్గునుదావర్తము | ,, |
| శ్వాసనిద్రల నిరోధించుటచేనైనయుదావర్తము | ,, |
| వాతప్రకోపమునఁగల్గినయుదావర్తము | 269 |
| ఆనాహలక్షణము | ,, |
| ఆమజన్యానాహలక్షణము | 270 |
| పురీషజన్యానాహలక్షణము | ,, |
| **౨౮. గుల్మనిదానమ్** | |
| గుల్మము జనించుటకుకారణములు | 271 |
| గుల్మముయొక్కరూపము | ,, |
| గుల్మవ్యాధిభేదములు | 272 |
| గుల్మవ్యాధిపూర్వరూపము | 273 |
| గుల్మసామాన్యరూపము | ,, |
| వాతికగుల్మము జనించుటకు కారణములు | ,, |
| వాతికగుల్మలక్షణము | 274 |
| పైత్తికగుల్మకారణములు | 275 |
| పైత్తికగుల్మలక్షణములు | ,, |
| కఫజసాన్నిపాతిక గుల్మకారణములు | ,, |
| కఫజగుల్మలక్షణము | 276 |
| సంసర్గజగుల్మలక్షణములు | ,, |
| సాన్నిపాతికగుల్మలక్షణము | 277 |
| రక్తగుల్మనిదానసంప్రాప్తులు | 277 |
| రక్తగుల్మలక్షణములు | 278 |
| గుల్మాసాధ్యలక్షణములు | 280 |
| **౨౯. హృద్రోగనిదానమ్** | |
| హృద్రోగసంప్రాప్తి | 281 |
| వాతజహృద్రోగలక్షణము | ,, |
| పైత్తికహృద్రోగలక్షణము | 282 |
| కఫజహృద్రోగలక్షణము | ,, |
| సాన్నిపాతికక్రిమిజహృద్రోగలక్షణము | ,, |
| హృద్రోగోపద్రవములు | 283 |
| **౩౦. మూత్రకృచ్ఛ్రనిదానమ్** | |
| మూత్రకృచ్ఛ్రకారణములు, సంఖ్య | 284 |
| మూత్రకృచ్ఛ్రసంప్రాప్తి | ,, |
| వాతాదిజనితమూత్రకృచ్ఛ్రలక్షణం | 285 |
| శల్యజమూత్రకృచ్ఛ్రలక్షణము | ,, |
| పురీషజమూత్రకృచ్ఛ్రలక్షణము | 286 |
| అశ్మరీజమూత్రకృచ్ఛ్రలక్షణము | ,, |
| శుక్రజమూత్రకృచ్ఛ్రలక్షణము | ,, |
| అశ్మరీశర్కరలభేదము | 287 |
| **౩౧. మూత్రాఘాతనిదానమ్** | |
| మూత్రాఘాతకారణంబులు, సంప్రాప్తి | 288 |
| వాతకుండలికాలక్షణము | ,, |
| అష్ఠీలాలక్షణము | 289 |
| వాతవస్తిలక్షణము | ,, |
| మూత్రాతీతలక్షణము | ,, |
| మూత్రజఠరము | ,, |
| మూత్రోత్సఙ్గలక్షణము | 290 |
| మూత్రక్షయలక్షణము | ,, |
| మూత్రగ్రంథిలక్షణము | ,, |
| మూత్రశుక్రలక్షణము | 291 |
| ఉష్ణవాతలక్షణము | ,, |
| మూత్రసాదలక్షణము | 292 |
| విడ్విఘాతలక్షణము | ,, |

విషయము. — పుట.

వస్తికుండలి లక్షణము 292
వస్తికుండలిసాధ్యాసాధ్యలక్షణములు 293

32. అశ్మరీనిదానమ్

అశ్మరీకారణములు-సంఖ్య 294
అశ్మరీసమ్ప్రాప్తి „
అశ్మరీపూర్వరూపము 295
అశ్మరీసామాన్య లక్షణములు „
వాతజాశ్మరీ లక్షణము 296
పిత్తజాశ్మరీ లక్షణము „
కఫజాశ్మరీ లక్షణము „
బాలురకు జనించు అశ్మరీగుణము „
శుక్రాశ్మరీ లక్షణము 297
శర్కరా లక్షణము „
అసాధ్యశర్కరాశ్మరీ లక్షణము 298

33. ప్రమేహనిదానమ్

ప్రమేహకారణములు 299
ప్రమేహసంప్రాప్తి „
ప్రమేహసాధ్యాది విభాగము 300
ప్రమేహదోషదూష్య విభాగము 301
ప్రమేహపూర్వరూపములు 302
ప్రమేహసామాన్య లక్షణము „
1. కఫజమేహములు పది; అందుదక మేహము 303
2. ఇక్షుమేహ లక్షణము „
3. సాంద్రమేహ లక్షణము „
4. సురామేహ లక్షణము „
5. పిష్టమేహ లక్షణము „
6. శుక్రమేహ లక్షణము „
7. సికతామేహ లక్షణము „
8. శీతమేహ లక్షణము 304
9 శనైర్మేహ లక్షణము „
10. లాలామేహ లక్షణము „
11. పైత్తికమేహము లారు; అందు క్షారమేహ లక్షణము „
12.13. నీల-కాలమేహలక్షణములు 304
14. హారిద్రమేహ లక్షణము „
15. మాంజిష్ఠమేహ లక్షణము 305
16. రక్తమేహ లక్షణము „
17. వాతమేహములు నాల్గు; అందు వసామేహము „
18. మజ్జమేహ లక్షణము „
19. క్షౌద్రమేహ లక్షణము „
20. హస్తిమేహ లక్షణము „
కఫజప్రమేహోపద్రవములు 306
పైత్తికప్రమేహోపద్రవములు „
వాతికప్రమేహోపద్రవములు „
ప్రమేహాసాధ్య లక్షణములు „
మరికొన్ని యసాధ్యలక్షణములు 307
మధుమేహము జనించుటకు కారణము; లక్షణములు „
మధుమేహద్వైవిధ్యము „
మధుమేహ మనుటకు కారణము 308
పిటికాభేదములు, వానికి కారణము „
శరావికాది దశవిధ పిటికాలక్షణములు; అందు శరావిక 310
సర్షపికాలక్షణము „
కచ్ఛపికా లక్షణము „
జాలినీ లక్షణము „
వినతా లక్షణము 311
పుత్రిణీ లక్షణము „
మసూరికా లక్షణము „
అలజీ లక్షణము „
విదారికావిద్రధి లక్షణములు 312
పిటికలకు దోషసంబంధనిర్ణయము „
పిటికాసాధ్య లక్షణములు 313

34. మేదోనిదానమ్

మేదోవృద్ధికారణములు 315
మేదస్సంప్రాప్తి „

| విషయము. | పుట. |
|---|---|
| మేదోవృద్ధిచే గల్గు నుపద్రవము | 315 |
| మేదస్థ్సానములు | 316 |
| మేదోవృద్ధిచే గల్గు విశేషములు | ,, |
| మేదోవృద్ధిచే రోగములుకల్గుక్రమము | 317 |
| స్థూలకాయ లక్షణము | ,, |
| **3౫. ఉదరనిదానమ్** | |
| ఉదరవ్యాధికి కారణములు | 318 |
| ఉదరరోగసంప్రాప్తి | ,, |
| ఉదరవ్యాధిసామాన్యరూపము | 319 |
| ఉదరవ్యాధి భేదము | ,, |
| వాతికోదర లక్షణము | 320 |
| పిత్తోదర లక్షణము | ,, |
| కఫోదర లక్షణము | 321 |
| సన్నిపాతోదర లక్షణము | ,, |
| ప్లీహోదరయకృద్దాల్యుదరలక్షణము | 322 |
| ప్లీహోదరమున దోషసంబంధముచే గల్గు లక్షణములు | 323 |
| బద్ధగుదోదర లక్షణము | ,, |
| పరిస్రావ్యుదర లక్షణము | 324 |
| జలోదరసంప్రాప్తి లక్షణము | 325 |
| సాధ్యాఽసాధ్య ఉదరనిర్ణయము | 326 |
| మరికొన్ని యసాధ్య లక్షణములు | 327 |
| మరికొన్ని యసాధ్య లక్షణములు | ,, |
| ఉపద్రవములు, అసాధ్యత్వము | ,, |
| **3౬. శోథనిదానమ్** | |
| శోథసంప్రాప్తి, భేదములు | 329 |
| శోథపూర్వరూపము | 330 |
| శోథజనించుటకు కారణము | ,, |
| శోథసామాన్యలక్షణములు | 331 |
| వాతికశోథ లక్షణము | ,, |
| పైత్తికశోథ లక్షణము | 332 |
| శ్లైష్మికశోథ లక్షణము | ,, |
| ద్వంద్వజ-సన్నిపాతజశోథలక్షణములు | 333 |

| విషయము. | పుట |
|---|---|
| ఆగంతుకశోథ లక్షణము | 333 |
| విషజశోథ లక్షణము | 334 |
| శోథము జనించుక్రమము | ,, |
| అసాధ్యశోథ లక్షణము | ,, |
| ఉపద్రవములచే నసాధ్యత్వము | 335 |
| వేరొండసాధ్య లక్షణము | ,, |
| మరికొన్ని సాధ్యాసాధ్యలక్షణములు | 336 |
| **3౭. వృద్ధినిదానమ్** | |
| వృద్ధిసంప్రాప్తి | 337 |
| వృద్ధిరోగసంఖ్య | ,, |
| త్రిదోషవృద్ధి లక్షణములు | ,, |
| రక్తజ-మేదోజవృద్ధి లక్షణములు | 338 |
| మూత్రజవృద్ధి లక్షణము | ,, |
| ఆంత్రజవృద్ధి లక్షణము | ,, |
| అండవృద్ధి నుపేక్షించుటచే గల్గు బాధలు | 339 |
| ఆంత్రవృద్ధికసాధ్య లక్షణము | ,, |
| **3౮. గలగండ-గండమాలాఽపచీ గ్రంథ్యర్బుద నిదానమ్** | |
| గలగండసామాన్య లక్షణము | 340 |
| గలగండసంప్రాప్తి | ,, |
| వాతికగలగండ లక్షణము | ,, |
| కఫజగలగండ లక్షణము | 341 |
| మేదోజగలగండ లక్షణము | ,, |
| అసాధ్యగలగండ లక్షణము | 342 |
| గండమాలా లక్షణము | ,, |
| అపచీ లక్షణము | ,, |
| అపచీసాధ్యాసాధ్యనిర్ణయము | 344 |
| గ్రంథిసంప్రాప్తి | ,, |
| వాతజగ్రంథి లక్షణము | 345 |
| పైత్తికగ్రంథి లక్షణము | ,, |
| కఫజగ్రంథి లక్షణము | ,, |
| మేదోజగ్రంథిలక్షణము | 346 |

| విషయము. | పుట. |
|---|---|
| సిరాజగ్రంథిలక్షణము | 346 |
| అర్బుదసంప్రాప్తి | 347 |
| అర్బుదభేదములు | 348 |
| రక్తార్బుదసంప్రాప్తి లక్షణము | ,, |
| మాంసార్బుద లక్షణము | 349 |
| అర్బుదసాధ్యాసాధ్యనిర్ణయము | ,, |
| అధ్యర్బుదద్విరర్బుద లక్షణములు | 350 |
| అర్బుదములు పక్వములు కానందుకు కారణము | ,, |
| **౩౯. శ్లీపదనిదానమ్** | |
| శ్లీపదసంప్రాప్తి | 351 |
| వాతజాదిశ్లీపద లక్షణము | ,, |
| అసాధ్యశ్లీపద లక్షణము | 352 |
| శ్లీపదమున కఫప్రాధాన్యము | ,, |
| శ్లీపదము జనించుదేశములు | ,, |
| కొన్ని యసాధ్యశ్లీపద లక్షణములు | ,, |
| **౪౦. విద్రధినిదానమ్** | |
| విద్రధిసంప్రాప్తి | 353 |
| విద్రధిసంఖ్యా-భేదములు | ,, |
| వాతవిద్రధి లక్షణము | ,, |
| పైత్తికవిద్రధి లక్షణము | 354 |
| కఫజవిద్రధి లక్షణము | ,, |
| విద్రధియందుదోష భేదముచేస్రావ భేదం | ,, |
| సాన్నిపాతికవిద్రధిలక్షణము | ,, |
| ఆగంతుకవిద్రధి లక్షణము | 355 |
| రక్తజవిద్రధి లక్షణము | ,, |
| అంతర్విద్రధిసంప్రాప్తి, స్థానములు | ,, |
| అంతర్విద్రధిసామాన్యవిశేషలక్షణము | 356 |
| విద్రధిసాధ్యాసాధ్యవిచారము | 357 |
| విద్రధిసాధ్యాసాధ్యనిర్ణయము | 358 |
| కొన్నియసాధ్యలక్షణములు | ,, |
| **౪౧. వ్రణశోథనిదానమ్** | |
| వ్రణశోథసంప్రాప్తిసంఖ్య | 359 |

| విషయము. | పుట. |
|---|---|
| వ్రణశోథపరిపాక భేదములు | 359 |
| అపక్వశోథ లక్షణము | ,, |
| పచ్యమానవ్రణశోథ లక్షణములు | 360 |
| పక్వవ్రణశోథ లక్షణము | ,, |
| పాకకాలమున దోషత్రయప్రకోపమునకు కారణములు | 361 |
| చీమును వెడలించనియెడ గల్గుదోషము | 362 |
| పక్వాపక్వజ్ఞానావశ్యకత | ,, |
| **౪౨. శారీరవ్రణనిదానమ్** | |
| వ్రణద్వైవిధ్యము | 363 |
| వాతికవ్రణ లక్షణము | ,, |
| పైత్తికవ్రణ లక్షణము | ,, |
| శ్లైష్మికవ్రణ లక్షణము | 364 |
| రక్తజ-సంసర్గ-సన్నిపాతవ్రణలక్షణము | ,, |
| సాధ్యాఽసాధ్యనిర్ణయము | ,, |
| దుష్టవ్రణ లక్షణములు | 365 |
| శుద్ధవ్రణ లక్షణము | ,, |
| మానుచుండువ్రణములయొక్కలక్షణము | ,, |
| మానిన వ్రణముయొక్క లక్షణము | ,, |
| కష్టసాధ్యవ్రణములు | 366 |
| స్రావభేదముచే సాధ్యాఽసాధ్యత్వము | ,, |
| గంధవిశేషముచే నసాధ్యత్వము | ,, |
| కొన్ని యసాధ్యవ్రణ లక్షణములు | 367 |
| **౪౩. సద్యోవ్రణ నిదానమ్** | |
| సద్యోవ్రణసంప్రాప్తి, వాని భేదములును | 368 |
| ఛిన్నవ్రణ లక్షణము | ,, |
| భిన్న లక్షణము | ,, |
| భిన్నవ్రణసామాన్య లక్షణము | 369 |
| భిన్నవ్రణవిశేష లక్షణములు | ,, |
| విద్ధవ్రణ లక్షణము | 370 |
| క్షతవ్రణ లక్షణము | ,, |
| పిచ్చితవ్రణ లక్షణము | ,, |
| ఘృష్ట లక్షణము | 371 |

| విషయము. | పుట. |
|---|---|
| శల్యముతోఁగూడిన వ్రణ లక్షణము | 371 |
| కోష్ఠభేదము | ,, |
| కోష్ఠభేదమునందసాధ్య లక్షణములు | 372 |
| మర్మక్షతసామాన్య లక్షణము | ,, |
| సిరావిద్ధ లక్షణము | 373 |
| స్నాయువిద్ధ లక్షణములు | ,, |
| సంధిక్షత లక్షణము | ,, |
| అస్థివిద్ధ లక్షణము | 374 |
| సిరాదిమర్మవిద్ధ లక్షణము | ,, |
| వ్రణోపద్రవములు | 375 |
| **౨౨. భగ్ననిదానమ్** | |
| భగ్నభేదములు | 376 |
| సంధిభగ్నసామాన్య లక్షణములు | ,, |
| ఉత్పిష్టాదిభగ్నవిశేష లక్షణములు | ,, |
| కాండభగ్నభేదములు | 377 |
| కాండభగ్నసామాన్య లక్షణములు | 378 |
| కాండభగ్నవిశేష లక్షణము | 379 |
| కృచ్ఛ్రసాధ్యభగ్న లక్షణములు | ,, |
| భగ్నాసాధ్య లక్షణము | ,, |
| మరికొన్ని యసాధ్య లక్షణములు | ,, |
| విన్యాసభేదముచే నసాధ్యత్వము | 380 |
| అస్థివిశేషములఁగల్గు భగ్నభేదములు | ,, |
| **౨౩. నాడీవ్రణనిదానమ్** | |
| నాడీవ్రణసంప్రాప్తి | 381 |
| నాడీవ్రణభేదములు | ,, |
| వాతికనాడీవ్రణ లక్షణము | 382 |
| పైత్తికనాడీవ్రణము | ,, |
| కఫజనాడీవ్రణ లక్షణము | ,, |
| సాన్నిపాతికనాడీవ్రణ లక్షణము | 383 |
| శల్యజనాడీవ్రణ లక్షణము | ,, |
| సాధ్యాసాధ్యనాడీవ్రణ లక్షణము | ,, |
| **౨౪. భగందరనిదానమ్** | |
| భగందరసామాన్య లక్షణము | 384 |
| వాతిక (శతపోనక) భగందరము | 385 |
| పైత్తిక (ఉష్ట్రముఖ) భగందరము | 386 |
| కఫజ (పరిస్రావి) భగందరము | ,, |
| సాన్నిపాతిక(శంబూకావర్త)భగందరము | ,, |
| ఆగంతుక (ఉన్మార్గి) భగందరము | 387 |
| భగందరసాధ్యాఽసాధ్యనిర్ణయము | 388 |
| **౨౫. ఉపదంశనిదానమ్** | |
| ఉపదంశముజనించు కారణములు, వాని సంఖ్యయు | 389 |
| వాతిక ఉపదంశ లక్షణము | ,, |
| పిత్తరక్తములచేనైన ఉపదంశ లక్షణములు | ,, |
| కఫజ ఉపదంశ లక్షణము | 390 |
| సాన్నిపాతికోపదంశ లక్షణము | ,, |
| అసాధ్యోపదంశ లక్షణము | ,, |
| ఉపదంశము నుపేక్షించుటచే గల్గు విశేషములు | ,, |
| లిఙ్గార్శోలక్షణము | ,, |
| **౨౬. శూకదోషనిదానమ్** | |
| సర్షపికా లక్షణము | 392 |
| అష్ఠీలికా గ్రథితంబులను శూకదోష లక్షణము | 393 |
| కుంభికా లక్షణము | ,, |
| అలజీ లక్షణము | ,, |
| మృదిత-సమ్మూఢ పిటికాలక్షణములు | ,, |
| అధిమంథ లక్షణము | 394 |
| పుష్కరికా లక్షణము | ,, |
| స్పర్శహాని లక్షణము | ,, |
| ఉత్తమా లక్షణము | ,, |
| శతపోనక లక్షణము | ,, |
| త్వక్పాక లక్షణము | 395 |
| రక్తార్బుద లక్షణము | ,, |
| మాంసార్బుద లక్షణము | ,, |
| మాంసపాక లక్షణము | ,, |
| విద్రధి లక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| తిలకాలక లక్షణము | 396 |
| అసాధ్యకుష్ఠ దోషములు | ,, |
| **౪౯. కుష్ఠనిదానమ్** | |
| కుష్ఠకారణములు, సంప్రాప్తియు | 397 |
| కుష్ఠ భేదములు | 399 |
| కుష్ఠపూర్వరూపము | 400 |
| కపాలకుష్ఠము | ,, |
| ఔదుంబరకుష్ఠము | 401 |
| మండలకుష్ఠము | ,, |
| ఋశ్యజిహ్వాకుష్ఠము | ,, |
| పుండరీకకుష్ఠము | 402 |
| సిధ్మకుష్ఠము | ,, |
| కాకణకుష్ఠము | ,, |
| ఏకకుష్ఠ-చర్మకుష్ఠములు | 403 |
| కిటిభకుష్ఠము | ,, |
| వైపాదికకుష్ఠము | ,, |
| అలసకకుష్ఠ లక్షణము | ,, |
| దద్రుకుష్ఠము | 404 |
| చర్మదలకుష్ఠము | ,, |
| పామాకుష్ఠము | ,, |
| విస్ఫోటకుష్ఠము | ,, |
| శతారుకుష్ఠము | 405 |
| విచర్చికాకుష్ఠము | ,, |
| వాతికాదికుష్ఠముల ప్రత్యేకలక్షణము | ,, |
| రసాదిసప్తధాతుగతకుష్ఠములు; అందు రసగతకుష్ఠము | 406 |
| రక్తగతకుష్ఠము | ,, |
| మాంసగతకుష్ఠము | ,, |
| మేదోగత కుష్ఠలక్షణము | ,, |
| అస్థి-మజ్జగతకుష్ఠము | 407 |
| శుక్రగతకుష్ఠము | ,, |
| సాధ్యాసాధ్య కుష్ఠనిర్ణయము | ,, |
| కొన్ని యసాధ్యలక్షణములు | ,, |
| వాతికాది కుష్ఠవిభాగము | 408 |

| విషయము. | పుట. |
|---|---|
| మహాకుష్ఠములు | 409 |
| శ్విత్రసామాన్య లక్షణము | ,, |
| శ్విత్రములకు దోషదూష్య సంబంధమున గల్గు వర్ణభేదములు | 410 |
| శ్విత్రమునకు కృచ్ఛ్రత్వము | 411 |
| సాధ్యాసాధ్య శ్విత్రనిర్ణయము | 412 |
| సాంక్రామికవ్యాధులు | ,, |
| **౫౦. శీతపిత్త-ఉదర్ద-కోఠనిదానమ్** | |
| శీతపిత్త సంప్రాప్తి | 414 |
| శీతపిత్తాది పూర్వరూపములు | ,, |
| శీతపిత్తోదర్దలక్షణములు | ,, |
| ఉదర్దవిశేష లక్షణములు | 415 |
| కోఠలక్షణము | ,, |
| **౫౧. అమ్లపిత్తనిదానమ్** | |
| అమ్లపిత్త సంప్రాప్తి | 416 |
| అమ్లపిత్త సామాన్యలక్షణము | ,, |
| అధోగతామ్ల పిత్తలక్షణము | ,, |
| ఊర్ధ్వగతామ్ల పిత్తము | 417 |
| అమ్లపిత్త సాధ్యాదినిర్ణయము | ,, |
| అమ్లపిత్తమున వాతకఫసంబంధము | 418 |
| వాతజామ్లపిత్త లక్షణము | ,, |
| కఫజలతామ్లపిత్త లక్షణము | ,, |
| వాతకఫజాఽమ్లపిత్త లక్షణము | 419 |
| శ్లేష్మపిత్త లక్షణము | ,, |
| **౫౨. విసర్పనిదానమ్** | |
| విసర్పము జనించుటకు కారణములు; అన్వర్థత | 420 |
| విసర్ప భేదములు | ,, |
| విసర్పమున దోషదూష్యసంబంధము | 421 |
| వాతికవిసర్పలక్షణము | 423 |
| పైత్తికవిసర్పలక్షణములు | ,, |
| కఫజవిసర్పలక్షణము | ,, |
| సాన్నిపాతికవిసర్పలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| అగ్నివిసర్ప (వాతపిత్తజ) లక్షణము | 423 |
| గ్రంథి (వాతకఫ) విసర్పలక్షణము | 424 |
| కర్దమ (కఫపిత్త) విసర్పలక్షణము | 425 |
| క్షతజవిసర్పలక్షణము | 426 |
| విసర్పోపద్రవములు | 427 |
| విసర్ప సాధ్యాసాధ్యనిర్ణయము | ,, |
| **౫౩. విస్ఫోటనిదానమ్** | |
| విస్ఫోటము జనించు కారణములు, సంప్రాప్తియు | 429 |
| విస్ఫోట సామాన్యలక్షణము | 430 |
| వాతిక విస్ఫోటలక్షణము | ,, |
| పైత్తిక విస్ఫోటలక్షణము | ,, |
| కఫజ విస్ఫోటలక్షణము | ,, |
| ద్వంద్వజ విస్ఫోటలక్షణము | ,, |
| సాన్నిపాతిక విస్ఫోటలక్షణము | 431 |
| రక్తవిస్ఫోట లక్షణము | ,, |
| విస్ఫోట సాధ్యాసాధ్య నిర్ణయము | ,, |
| **౫౪. మసూరికానిదానమ్** | |
| మసూరికాకారణములు, సంప్రాప్తియు | 432 |
| మసూరికా పూర్వరూపములు | 433 |
| వాతిక మసూరికా లక్షణము | ,, |
| పైత్తిక మసూరికా లక్షణము | ,, |
| రక్తజ మసూరికా లక్షణము | 434 |
| కఫజ మసూరికా లక్షణము | ,, |
| సాన్నిపాతిక మసూరికా లక్షణము | ,, |
| చర్మపిటికా లక్షణము | ,, |
| రోమాంతిక లక్షణము | 435 |
| రసగత మసూరికా లక్షణము | ,, |
| రక్తగత మసూరికా లక్షణము | ,, |
| మాంసగత మసూరికా లక్షణము | ,, |
| మేదోగత మసూరికా లక్షణము | ,, |
| మజ్జగత మసూరికా లక్షణము | 436 |
| శుక్రగత మసూరికా లక్షణము | ,, |
| సుఖసాధ్య మసూరికలు | 437 |
| కృచ్ఛ్రసాధ్య మసూరికలు | ,, |
| అసాధ్య మసూరికలు | ,, |
| మసూరికా సామాన్యముగ నసాధ్య లక్షణములు | 438 |
| కొన్ని యసాధ్య లక్షణములు | ,, |
| ఉపద్రవములచే నసాధ్యత్వము | ,, |
| **౫౫. క్షుద్రరోగనిదానమ్** | |
| అజగల్లికా లక్షణము | 439 |
| యవప్రఖ్యా లక్షణము | ,, |
| అంత్రాలజీ లక్షణము | 440 |
| వివృతా లక్షణము | ,, |
| కచ్ఛపికా లక్షణము | ,, |
| వల్మీక లక్షణము | ,, |
| ఇంద్రవిద్ధ లక్షణము | 441 |
| గర్దభికా లక్షణము | ,, |
| పాషాణగర్దభ లక్షణములు | ,, |
| పనసికా లక్షణము | 442 |
| జాలగర్దభ లక్షణము | ,, |
| ఇరివెల్లికా లక్షణము | 443 |
| కక్షా లక్షణము | ,, |
| గంధనామ్నీ లక్షణము | ,, |
| అగ్నిరోహిణీ లక్షణము | ,, |
| చిప్ప లక్షణము | 445 |
| కునఖ లక్షణము | ,, |
| అనుశయీ లక్షణము | ,, |
| విదారికా లక్షణము | ,, |
| శర్కరార్బుద లక్షణము | 446 |
| పాదదారీ లక్షణము | 447 |
| కదర లక్షణము | ,, |
| అలసక లక్షణము | 448 |
| ఇంద్రలుప్త లక్షణము | ,, |
| దారుణక లక్షణము | 449 |

| విషయము. | పుట. |
|---|---|
| అరూంషికా లక్షణము | 450 |
| పలిత లక్షణము | ,, |
| యువానపిటికా లక్షణము | 452 |
| పద్మినీకంటక లక్షణము | ,, |
| జతుమణి లక్షణము | ,, |
| మషక లక్షణము | 453 |
| తిలకాలక లక్షణము | ,, |
| న్యచ్ఛ లక్షణము | 454 |
| వ్యంగ లక్షణము | ,, |
| నీలికా లక్షణము | 455 |
| పరివర్తికా లక్షణము | ,, |
| అవపాటికా లక్షణము | 456 |
| నిరుద్ధప్రకశ లక్షణము | 457 |
| సన్నిరుద్ధగుద లక్షణము | 458 |
| అహిపూతన లక్షణము | ,, |
| వృషణకచ్ఛూ లక్షణము | 459 |
| గుదభ్రంశ లక్షణము | ,, |
| సూకరదంష్ట్రక లక్షణము | ,, |
| **౫౬. ముఖరోగనిదానమ్** | |
| ముఖరోగ సామాన్యకారణములు | 460 |
| ఓష్ఠగతవ్యాధు లెనిమిది: అందు వాతిక లక్షణము | ,, |
| పైత్తిక ఓష్ఠవ్యాధి లక్షణము | 461 |
| కఫజ ఓష్ఠవ్యాధి లక్షణము | ,, |
| సాన్నిపాతిక ఓష్ఠవ్యాధి | ,, |
| రక్తజ ఓష్ఠవ్యాధి | ,, |
| మాంసజనిత ఓష్ఠవ్యాధి | ,, |
| మేదోజనిత ఓష్ఠరోగము | 462 |
| ఆగంతు ఓష్ఠవ్యాధి | ,, |
| దంతమూలగతవ్యాధులు పదునైదు: అందు శీతాదము | ,, |
| దంతపుప్పుటకము | 463 |
| దంతవేష్ట లక్షణము | ,, |
| శౌషిర లక్షణము | 463 |
| మహాశౌషిర లక్షణము | ,, |
| పరిదర లక్షణములు | 464 |
| ఉపకుశ లక్షణము | ,, |
| వైదర్భ లక్షణము | ,, |
| ఖలివర్ధన లక్షణము | 465 |
| కరాళ లక్షణము | ,, |
| అధిమాంస లక్షణము | ,, |
| దంతనాడీ లక్షణము | ,, |
| దంతరోగము లెనిమిది: అందు దాలన లక్షణము | 467 |
| క్రిమిదంతక లక్షణము | ,, |
| భంజనక లక్షణము | 468 |
| దంతహర్ష లక్షణము | ,, |
| దంతశర్కరా లక్షణము | ,, |
| కపాలికా లక్షణము | 469 |
| శ్యావదంతక లక్షణము | ,, |
| దంతవిద్రధి లక్షణము | ,, |
| నాలుకయందుగల్గు రోగము లైదు: అందు వాతాదులచే గల్గు మూడు భేదములు | ,, |
| అలాస లక్షణము | 470 |
| ఉపజిహ్వికా లక్షణము | 471 |
| తాలుగతవ్యాధులు తొమ్మిది: అందు కంఠశుండీ లక్షణము | ,, |
| తుండికేరీ లక్షణము | 472 |
| అధ్రుష లక్షణము | ,, |
| కచ్ఛప లక్షణము | ,, |
| తాల్వర్బుద లక్షణము | ,, |
| మాంససంఘాత లక్షణము | 473 |
| తాలుపుప్పుట లక్షణము | ,, |
| తాలుశోష లక్షణము | ,, |
| తాలుపాక లక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| కంఠగతరోగములు పదునేడు: అందు రోహిణీసంప్రాప్తి | 474 |
| వాతికరోహిణీ లక్షణము | 475 |
| పైత్తికరోహిణీ లక్షణము | ,, |
| కఫజనిత రోహిణీ లక్షణము | ,, |
| సాన్నిపాతిక రోహిణీ లక్షణము | 476 |
| రక్తజరోహిణీ లక్షణము | ,, |
| కంఠశాలూక లక్షణము | ,, |
| అధిజిహ్వ లక్షణము | 477 |
| వలయ లక్షణము | ,, |
| బలాస లక్షణము | ,, |
| ఏకబృంద లక్షణము | 478 |
| బృంద లక్షణము | ,, |
| శతఘ్నీ లక్షణము | 479 |
| గలాయు లక్షణము | ,, |
| గలవిద్రధి లక్షణము | 480 |
| గలౌఘ లక్షణము | ,, |
| స్వరఘ్న లక్షణము | ,, |
| మాంసతానక లక్షణము | 481 |
| విదారీ లక్షణము | ,, |
| సర్వసరములు మూడు: అందు వాతికము | ,, |
| పైత్తికసర్వసర లక్షణము | 482 |
| కఫజసర్వసర లక్షణము | ,, |
| ముఖరోగములకు సాధ్యాసాధ్యనిర్ణయము | 483 |

౫౭. కర్ణరోగనిదానమ్

| విషయము. | పుట. |
|---|---|
| కర్ణశూల లక్షణము | 484 |
| కర్ణనాద లక్షణము | 485 |
| బాధిర్య (చెవుడు) లక్షణము | ,, |
| కర్ణక్ష్వేడ లక్షణము | 486 |
| కర్ణస్రావ లక్షణము | ,, |
| కర్ణకండూ, కర్ణగూథ లక్షణములు | ,, |
| కర్ణప్రతీనాహ లక్షణము | 487 |
| క్రిమికర్ణ లక్షణము | 487 |
| చెవిలో కీటకముజొచ్చినదానిలక్షణం | 488 |
| కర్ణవిద్రధి లక్షణము | ,, |
| కర్ణపాక లక్షణము | 489 |
| పూతికర్ణ లక్షణము | ,, |
| కర్ణశోథకర్ణార్బుదకర్ణార్శోలక్షణములు | ,, |
| వాతిక కర్ణరోగము | 490 |
| పైత్తిక కర్ణరోగలక్షణము | ,, |
| కఫజ కర్ణరోగలక్షణము | ,, |
| సాన్నిపాతిక కర్ణరోగలక్షణము | 491 |
| కర్ణపాలియందు గల్గురోగములు ఐదు; అందు పరిపోటకము | ,, |
| ఉత్పాత లక్షణము | ,, |
| ఉన్మథక లక్షణము | ,, |
| దుఃఖవర్ధన లక్షణము | 492 |
| పరిలేహి లక్షణము | ,, |

౫౮. నాసారోగనిదానమ్

| విషయము. | పుట. |
|---|---|
| పీనస లక్షణము | 493 |
| పూతినస్య లక్షణము | 494 |
| నాసికాపాక లక్షణము | ,, |
| పూయరక్త లక్షణము | ,, |
| క్షవథు లక్షణము | 495 |
| ఆగంతుకక్షవథు లక్షణము | ,, |
| భ్రంశథు లక్షణము | ,, |
| దీప్తలక్షణము | 496 |
| ప్రతీనాహ లక్షణము | ,, |
| నాసాస్రావ లక్షణము | ,, |
| నాసాపరిశోష లక్షణము | ,, |
| ఆమపీనస లక్షణము | 497 |
| పక్వపీనస లక్షణము | ,, |
| ప్రతిశ్యాయనిదానము, సంప్రాప్తియు | ,, |
| ప్రతిశ్యాయ పూర్వరూపము | 499 |
| వాతిక ప్రతిశ్యాయము | 500 |

విషయము. పుట.
పైత్తికప్రతిశ్యాయలక్షణము 500
కఫజనితప్రతిశ్యాయలక్షణము 501
సాన్నిపాతికప్రతిశ్యాయలక్షణము ,,
దుష్టప్రతిశ్యాయలక్షణము ,,
రక్తప్రతిశ్యాయము 502
అసాధ్యప్రతిశ్యాయలక్షణములు 503
పీనసముచే గల్గువ్యాధులు ,,
నాసార్బుదాదిలక్షణము ,,

౫౯. నేత్రరోగనిదానమ్

నేత్రరోగములు జనించుటకు కారణము 505
సర్వగతరోగములు 17, అందు అభిష్యన్దభేదములు 507
వాతాభిష్యందలక్షణము ,,
పిత్తాభిష్యందలక్షణము 508
కఫాభిష్యందలక్షణము ,,
రక్తాభిష్యందలక్షణము ,,
అధిమంథసంప్రాప్తి సామాన్యలక్షణము ,,
అధిమంథతీవ్రతకు దోషభేదముచే కాలనియమము 509
నేత్రరోగముల యామత్వలక్షణము ,,
నేత్రరోగముల పక్వావస్థలక్షణము 510
నేత్రపాకలక్షణము ,,
వాతాధిమంథలక్షణము 511
వాతపర్యయలక్షణము ,,
శుష్కాక్షిపాకలక్షణము 512
అన్యతోవాతలక్షణము ,,
అమ్లాధ్యుషితలక్షణము 513
సిరోత్పాతలక్షణము ,,
సిరాప్రహర్షలక్షణము 514
నల్లగ్రుడ్డునజనించు రోగములు నాల్గు, అందు సవ్రణశుక్లలక్షణము ,,
సాధ్యాసాధ్య శుక్లనియమము ,,
అవ్రణశుక్లలక్షణము 515

విషయము. పుట.
అసాధ్యావ్రణశుక్లములు 515
కొన్ని యసాధ్యలక్షణములు ,,
అక్షిపాకాత్యయలక్షణము 516
అజకాజాతలక్షణము ,,
ప్రథమపటలగతదోషలక్షణము 517
రెండవపటలమునందలి దోషముచే గల్గు లక్షణములు 518
మూడవపటలమునగల దోషలక్షణము 519
దృష్టిలో నూర్ధ్వాదిస్థానములలో దోషము జేరినచో వానిలక్షణములు 520
చతుర్థపటలగత దోషలక్షణము 521
లింగనాశసంజ్ఞ ,,
వాతికతిమిరరోగలక్షణము 523
పైత్తికతిమిరరోగలక్షణము ,,
కఫజతిమిరరోగలక్షణము 524
రక్తజతిమిరరోగలక్షణము ,,
సాన్నిపాతికతిమిరరోగలక్షణము 525
పరిమ్లాయిలక్షణము 526
లింగనాశమున వర్ణభేదముచే గల్గు నారుభేదములు ,,
పరిమ్లాయియందుకల్గుదృష్టివర్ణభేదము 527
లింగనాశమున వాతాదిభేదముచే గల్గు దృష్టిమండలవర్ణభేదములు ,,
దృష్టిగతరోగసంఖ్యాపరిగణనము 528
పిత్తవిదగ్ధదృష్టిలక్షణము 529
కఫవిదగ్ధదృష్టిలక్షణము 530
ధూమదర్శిలక్షణం, హ్రస్వజాడ్యలక్షణం ,,
నకులాంధ్యలక్షణము 531
గంభీరికాలక్షణము 532
బాహ్యనేత్రరోగములు రెండు; దాని లక్షణము ,,
అనిమిత్తబాహ్యనేత్రరోగము ,,
అనిమిత్తలక్షణము 533
అందు ప్రస్తార్యర్మలక్షణము 534

| విషయము. | పుట. |
|---|---|
| శుక్లార్మలక్షణము | 534 |
| రక్తార్మలక్షణము | ,, |
| అధిమాంసార్మలక్షణము | 535 |
| స్నాయ్వర్మలక్షణము,శుక్తికాలక్షణము | ,, |
| అర్జునలక్షణము పిష్టకలక్షణము | 536 |
| సిరాజాలలక్షణము | 537 |
| సిరాజపిటికాలక్షణము | ,, |
| బలాసగ్రథిలక్షణము | ,, |
| అందు పూయాసకలక్షణము | 538 |
| శ్లేష్మోపనాహలక్షణము | ,, |
| స్రావములునాల్గు; వానిసంప్రాప్తి | 539 |
| పూయస్రావలక్షణము | ,, |
| శ్లేష్మస్రావలక్షణము | 540 |
| రక్తాస్రావలక్షణము, పిత్తాస్రావము | ,, |
| పర్వణికాలక్షణము | ,, |
| అలజీలక్షణము | 541 |
| క్రిమిగ్రంథిలక్షణము | 542 |
| వర్త్మగతరోగములు ఇరువదియొకటి అందుత్సంగపిటికాలక్షణము | ,, |
| కుంభికాలక్షణము | 543 |
| పోతకీలక్షణము | 544 |
| వర్త్మశర్కరాలక్షణము | ,, |
| అర్శోవర్త్మలక్షణము | ,, |
| శుష్కార్శోలక్షణము | 545 |
| అఞ్జననామికాలక్షణము | ,, |
| బహలవర్త్మలక్షణము | 546 |
| వర్త్మబంధనలక్షణము,క్లిష్టవర్త్మలక్షణము | ,, |
| వర్త్మకర్దమలక్షణము | 547 |
| శ్యావవర్త్మలక్షణము | ,, |
| ప్రక్లిన్నవర్త్మలక్షణము | ,, |
| అక్లిన్నవర్త్మలక్షణము | 548 |
| వాతహతవర్త్మలక్షణము | ,, |
| అర్బుదలక్షణము | ,, |
| నిమేషలక్షణము, రక్తార్శోలక్షణము | 549 |
| నగణలక్షణము, బిసవర్త్మలక్షణము | 550 |
| కుంచితలక్షణము | ,, |
| పక్ష్మకోపలక్షణము | 551 |
| పక్ష్మశాతలక్షణము | 552 |
| నేత్రరోగపరిగణనము | 553 |


### ౬౦. శిరోరోగనిదానమ్


| | |
|---|---|
| శిరోరోగభేదములు | 554 |
| వాతికశిరోరోగలక్షణము | 555 |
| పైత్తికశిరోరోగలక్షణము | ,, |
| కఫజశిరోరోగలక్షణము | 556 |
| సాన్నిపాతికశిరోరోగలక్షణము | ,, |
| రక్తజశిరోరోగలక్షణము | ,, |
| క్షయజశిరోరోగసంప్రాప్తిలక్షణము | 557 |
| క్రిమిజశిరోరోగలక్షణము | 558 |
| సూర్యావర్తలక్షణము | 559 |
| అనంతవాతసంప్రాప్తిలక్షణము | 561 |
| అర్ధావభేదకనిదానసంప్రాప్తి, లక్షణము | ,, |
| శంఖలక్షణము | 562 |


### ౬౧. అసృగ్దరనిదానమ్


| | |
|---|---|
| రక్తప్రదరముజనించు కారణములు | 565 |
| రక్తప్రదరసామాన్యలక్షణము | ,, |
| కఫజరక్తప్రదరలక్షణము | 566 |
| పిత్తజరక్తప్రదరలక్షణము | ,, |
| వాతికరక్తప్రదరలక్షణము | ,, |
| సన్నిపాతజరక్తప్రదరలక్షణము | ,, |
| అసాధ్యరక్తప్రదరలక్షణములు | ,, |
| నిర్దుష్టార్తపలక్షణము | 567 |


### ౬౨. యోనివ్యాపన్నిదానమ్


| | |
|---|---|
| యోనివ్యాపత్సంఖ్యాకారణములు | 568 |
| వాతికయోనివ్యాపత్తులైదు, అందు ఉదావర్తలక్షణము | 569 |
| వంధ్యావిప్లుతాలక్షణములు | ,, |
| పరిప్లుతాలక్షణము, వాతలాలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| పైత్తికయోనివ్యాపత్తులైదు, అందు లోహితక్షయాలక్షణము | 569 |
| వామినీలక్షణము | 570 |
| స్రంసినీపుత్రఘ్నీలక్షణములు | ,, |
| పిత్తలాలక్షణము | ,, |
| కఫజయోనివ్యాపత్తులైదు, అందు అత్యానందాదిలక్షణములు | 571 |
| శ్లేష్మలాలక్షణము | ,, |
| సాన్నిపాతికయోనివ్యాపత్తులు ఐదు, అందు షణ్డినీలక్షణము | ,, |
| అండలీలక్షణము | 572 |
| మహాయోనిసూచీముఖాలక్షణము | ,, |
| సర్వజాలక్షణము | 573 |
| అసాధ్యయోనివ్యాపత్తులు | ,, |
| **౬౩. యోనికందనిదానమ్** | |
| యోనికందము కల్గుటకు కారణములు సంప్రాప్తియు | 574 |
| వాతికాదియోనికందలక్షణము | ,, |
| **౬౪. మూఢగర్భనిదానమ్** | |
| గర్భపాతకారణములు | 575 |
| గర్భపాతగర్భస్రావకాలము | ,, |
| గర్భపాతమూఢగర్భముల స్వరూపభేదము | 576 |
| 8 విధములగు మూఢగర్భగతిభేదములు | ,, |
| మతాంతరమున నాల్గువిధములైన మూఢగర్భగతిభేదములు | 577 |
| అసాధ్యమూఢగర్భము | 578 |
| మృతగర్భలక్షణము | ,, |
| గర్భమునకువ్యాపత్తుగల్గుటకుకారణములు | ,, |
| మూఢగర్భాసాధ్యలక్షణములు | 579 |
| మక్కల్లలక్షణము | ,, |
| **౬౫. సూతికారోగనిదానమ్** | |
| సూతికారోగసామాన్యలక్షణము | 581 |
| సూతికారోగ విశేషలక్షణములు | ,, |
| **౬౬. స్తనరోగనిదానమ్** | |
| స్తనరోగసంప్రాప్తి, లక్షణములు | 582 |
| **౬౭. స్తన్యదుష్టినిదానమ్** | |
| స్తన్యస్వరూపము | 583 |
| స్తన్యము చెడుటకు కారణములు | 584 |
| వాతాదిదుష్టస్తన్యలక్షణము | ,, |
| అదుష్టస్తన్యలక్షణము | 585 |
| **౬౮. బాలరోగనిదానమ్** | |
| వాతదుష్టస్తన్యపానమునగల్గురోగము | 586 |
| పిత్తదుష్టస్తన్యపానమునగల్గురోగములు | ,, |
| కఫదుష్టస్తన్యపానమునగల్గురోగము | 587 |
| ద్విదోషత్రిదోషములచే దుష్టస్తన్యపానమునగల్గు రోగములు | ,, |
| శిశువురోగములను తెలిసికొనునుపాయము | ,, |
| కోష్ఠాదులరోగముల గమనించువిధము | ,, |
| కుకూణకలక్షణము | 588 |
| పారిగర్భికలక్షణము | 589 |
| తాలుకంటకలక్షణము, విసర్పలక్షణము | ,, |
| బాలురకు జనించు జ్వరాదిరోగములు | 590 |
| బాలగ్రహసామాన్యలక్షణము | ,, |
| బాలగ్రహవిశేషలక్షణము | 591 |
| స్కన్దాపస్మారలక్షణము | 592 |
| శకునిగ్రహలక్షణము | ,, |
| రేవతీగ్రహలక్షణము | 593 |
| పూతనాగ్రహలక్షణము | ,, |
| అంధపూతనాలక్షణము | ,, |
| శీతపూతనాలక్షణము | ,, |
| ముఖమండలికాలక్షణము | ,, |
| నైగమేయగ్రహలక్షణము | 594 |
| బాలగ్రహాసాధ్యలక్షణములు | ,, |
| **౬౯. విషరోగనిదానమ్** | |
| విష భేదములు | 595 |
| జంగమవిషసామాన్యలక్షణము | 596 |
| స్థావరవిషలక్షణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| విషముపెట్టినవానిలక్షణముల నెరుంగు విధము | 596 |
| స్థావరవిషబాధితునిలక్షణము | 597 |
| విషదిగ్ధశస్త్రాహతలక్షణము | 598 |
| విషమునుద్రావినవానిలక్షణము | ,, |
| సర్పభేదములు సర్పదష్టలక్షణములు | 599 |
| అసాధ్యసర్పవిషనిర్ణయము | 600 |
| కొన్ని యసాధ్యవిషలక్షణములు | ,, |
| దూషీవిషరూపము | 602 |
| దూషీవిషమునగల్గు లక్షణములు | ,, |
| అమపక్వాశయస్థదూషీవిషలక్షణము | ,, |
| రసాదిధాతుగతదూషీవిషలక్షణము | 603 |
| దూషీవిష మనుట కన్వర్థత | 604 |
| దూషీవిషసాధ్యాసాధ్యత్వములు | ,, |
| పెట్టుడుమందునగల్గు నుపద్రవము | ,, |
| లూతాలక్షణము; దానియుత్పత్తియు | 605 |
| లూతాదష్టసామాన్యలక్షణము | 606 |
| దూషీవిషలూతాదష్టలక్షణము | 607 |
| తీవ్రవిషలూతాదష్టలక్షణము | 608 |
| ఆఖు (ఎలుక) దష్టలక్షణము | ,, |
| కృకలాస (ఊసరవెల్లి) దష్టలక్షణము | 609 |
| తేలుకుట్టిన విషలక్షణము | ,, |
| అసాధ్యవృశ్చిక విషలక్షణము | ,, |
| కణిలిరిగెలు కుట్టినవిషము | ,, |
| ఉచ్చిటింగదష్టలక్షణము | 610 |
| కప్పకాటువిషము | ,, |
| మత్స్యజలౌకాదష్టలక్షణము | ,, |
| బల్లి, జెఱ్ఱి వీని విషలక్షణము | ,, |
| మశకవిషలక్షణము | ,, |
| మక్షికా (చీమలు) దష్టవిషము | 611 |
| వ్యాఘ్రాదిదష్టలక్షణము | ,, |
| పిచ్చికుక్కలక్షణములు | 612 |

| విషయము. | పుట. |
|---|---|
| పిచ్చికుక్కకరచిన విషలక్షణములు | 612 |
| పిచ్చికుక్కకరచినవిషమున నరిష్టము | 613 |
| శునకాదివిషమున జలత్రాసరూపారిష్టము | ,, |
| సామాన్యముగ జలత్రాసరూపారిష్టము | 614 |
| విషనిరుక్తలక్షణము | 615 |
| విషపరీక్షాపద్ధతి | 616 |
| **౨౦. విషయానుక్రమణిక** | |
| ఉపసంహారము | 618 |
| గ్రంథాంతమంగళము | 618 |
| **౨౧. నిదానపరిశిష్టమ్** | |
| **స్నాయుకనిదానము** | |
| స్నాయుకసంప్రాప్తి, లక్షణంబును | 620 |
| స్నాయుకరోగమునవాతికాదిభేదము | 621 |
| **ఫిరంగరోగనిదానమ్** | |
| ఫిరంగరోగసంప్రాప్తి | ,, |
| ఫిరంగరోగభేదములు, వానిలక్షణము | 622 |
| ఫిరంగరోగోపద్రవములు | 623 |
| ఫిరంగరోగసాధ్యాసాధ్యవిభాగము | ,, |
| **సోమరోగనిదానమ్** | |
| సోమరోగసంప్రాప్తి లక్షణము | ,, |
| సోమరోగమునగల్గువిశేషలక్షణములు | 624 |
| సోమరోగనిరుక్తి | ,, |
| **శీతలానిదానమ్** | |
| శీతలోత్పత్తి, వానిసంఖ్యాభేదము | ,, |
| బృహతీశీతలాలక్షణము | 625 |
| కోద్రవ యను శీతలాలక్షణము | 626 |
| పాణిసహా యను శీతలాలక్షణము | ,, |
| సర్షపిక యను శీతలాలక్షణము | ,, |
| రాజిక యను శీతలాలక్షణము | 627 |
| లోహిత యను శీతలాలక్షణము | ,, |
| చర్మజ యను శీతలాలక్షణము | ,, |

# నిదానోక్తరోగములు

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| జ్వరము | Pyrexia పైరెక్సియా. |
| | Fever ఫీవర్. |
| సామాన్యజ్వరము | Febricula ఫెబ్రిక్యులా. |
| సన్నిపాతజ్వరము | Typhoid state టైఫాయిడ్ స్టేట్. |
| విషమజ్వరము | Malarial fever మలేరియల్ ఫీవర్. |
| సంతతజ్వరము | Malarial Remittent fever మలేరియల్ రెమిటెంట్ ఫీవర్. |
| సతతజ్వరము | Double Quotidian fever డబల్ క్వాటిడియన్ ఫీవర్. |
| అన్యేద్యుష్కజ్వరము | Quotidian fever క్వాటిడియన్ ఫీవర్. |
| తృతీయకజ్వరము | Tertian fever టర్షియన్ ఫీవర్. |
| చతుర్థకజ్వరము | Quartan fever క్వార్టన్ ఫీవర్. |
| చాతుర్థకవిపర్యయము | Double Quartan fever డబల్ క్వార్టన్ ఫీవర్. |
| అభిఘాతజ్వరము | Traumatic fever ట్రామటిక్ ఫీవర్. |
| విదాహజ్వరము | Inflammatory fever ఇన్‌ఫ్లమేటరీ ఫీవర్. |
| సూతికాజ్వరము | Puerperal fever ప్యూఅర్‌పరల్ ఫీవర్. |
| స్తనోత్థజ్వరము | Milk fever మిల్క్ ఫీవర్. |
| | Fever of Lactation ఫీవర్ ఆఫ్ లాక్టేషన్. |
| ఆగంతుకజ్వరము | Adventitious fever అడ్వన్‌టిషిస్ ఫీవర్. |
| ఓషధిగంధజజ్వరము | Hay fever హే ఫీవర్. |
| కామ భయ-శోక-క్రోధజ్వరము | Pyrexia of emotions పైరెక్సియా ఆఫ్ ఇమోషన్స్. |
| భూతాభిషంగజ్వరము | Fever of evil spirits ఫీవర్ ఆఫ్ ఈవిల్ స్పిరిట్స్ |
| ప్రలేపకజ్వరము | Hectic fever హెక్టిక్ ఫీవర్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| అతిసారము | Diarrhoea డయరీయా. |
| ఆమాతిసారము | Mucus-colitis మ్యూకస్ కోలైటిస్. |
| ప్రవాహిక | Dysentery డిసెంట్రీ. [సూ౨] |
| గ్రహణీ | Chronic Diarrhoea, Sprue క్రానిక్ డయరియా, |
| అర్శస్సు | Piles, Haemorrhoids పయిల్స్; హెమరాయిడ్స్. |
| రక్తార్శస్సు | Bleeding piles బ్లీడింగ్ పయిల్స్. |
| అగ్నిమాంద్యము | Dyspepsia డిస్పెప్సియా. |
| అజీర్ణము | Indigestion ఇండైజెషన్. |
| విషూచిక | Cholera కలరా. |
| ఆధ్మానము | Tympanitis టింపనాయిటిస్. |
| | Metirism మీటయిరిస్మ్. |
| క్రిమి | Worms వరమ్స్. |
| పాండురోగము | Anaemia అనీమియా. |
| రక్తపిత్తము | Heamorrhagic diseases హెమరాజిక్ డిసీసెస్, Scurvy స్కర్వీ. |
| కామలా | Jaundice జాండిస్. |
| హలీమకము | Chlorosis క్లోరోసిస్. |
| రాజయక్ష్మ | Phthisis, Consumption, Pulmonary tuberoulosis థైసిస్, కన్సంప్షన్, పల్మనరీ ట్యూబరక్యులోసిస్. |
| ఉరఃక్షతము | Pulmonary cavitation పల్మనరీ కావిటేషన్. |
| కాసము | Cough కాఫ్. |
| హిక్కా | Hiccough హిక్కఫ్. |
| శ్వాసము | Dyspnoea డిస్ప్నియా. |
| తమకశ్వాసము | Asthma అస్థ్మా. |
| క్షుద్రశ్వాసము | Breathlessness బ్రెత్ లెస్ నెస్. |
| మహాశ్వాసము | Dyspnoea of failing heart or respiration డిస్ప్నియా ఆఫ్ ఫెయిలింగ్ హార్ట్ ఆర్ రెస్పిరేషన్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| స్వరభంగము | Hoarseness హోర్స్‌నెస్. |
| అరోచకము | Loss of taste & appetite లాస్ ఆఫ్ టేస్ట్ అండ్ అప్పిటైట్. |
| | Anorexia అనోరెక్సియా. |
| ఛర్ది | Vomiting వామిటింగ్. |
| తృష | Thirst థర్స్ట్. |
| మూర్ఛ | Cyncope, fainting సిన్‌కపీ, ఫెయిన్‌టింగ్. |
| భ్రమము | Giddiness గిడ్డినెస్. |
| సన్న్యాసము | Apoplexy అపాప్లెక్సి. |
| | Catalepsy కటలెప్సి. |
| మదాత్యయము | Alcoholism ఆల్కహాలిజమ్. |
| ఉన్మాదము | Insanity ఇన్సానిటీ. |
| అపస్మారము | Epilepsy ఎపిలెప్సి. |
| ఆక్షేపకము | Convulsions కన్‌వల్షన్స్. |
| ధనుః స్తంభము | Tetanus టిటనస్ |
| పక్షవధము | Hemiplegia హెమిప్లెజియా. |
| సర్వాంగవాతము | Diplegia డైప్లెజియా. |
| అర్దితము | Facial paralysis ఫేషల్ పరాలిసిస్. |
| మన్యాస్తంభము | Stiff-neck స్టిఫ్ నెక్. |
| | Torticolis, Wry-neck టార్టికాలిస్, రై నెక్. |
| జిహ్వాస్తంభము | Paralysis of the tongue, Glossal Palsy పరాలిసిస్ ఆఫ్ ది టంగ్; గ్లాసల్ పాల్సి. |
| పాదహర్షము | Numbness of feet నమ్‌నెస్ ఆఫ్ ఫీట్. |
| ఊరుస్తంభము | Paraplegia పారప్లెజియా. |
| అంతరాయామము | Emprosthotonos ఎమ్ప్రాస్థోటోనస్. |
| బాహ్యాయామము | Opisthotonos ఒపిస్థోటోనస్. |
| దండాపతానకము | Plenosthotonos ప్లినోస్థోటోనస్. |
| హనుగ్రహము | Trismus, Lock-jaw ట్రిస్మస్, లాక్ జా. |
| ఖంజము | Limp లిమ్ప్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| పంగు | Paraplegia పారప్లెజియా. |
| కలాయఖంజము | Lathyrism లాతిరిజమ్. |
| అంసశోషము | Osteoarthritis of the shoulder-joint ఆస్టియో ఆర్థ్రైటిస్ ఆఫ్ ది షోల్డర్ జాయింట్. |
| క్రోష్టుకశీర్షము | Inflamed knee ఇన్‌ఫ్లేమ్డ్ నీ. |
| వేపథువు | Paralysis Agitans పరాలిసిస్ అజిటెన్స్. |
| అపతంత్రకము | Hysteria హిస్టీరియా. |
| గృధ్రసి | Sciatica సయాటికా. |
| విశ్వాచి | Radio-ulnar paralysis రేడియో అల్నర్ పరాలిసిస్. |
| మూకత్వము | Aphasia అఫేసియా. |
| వాతరక్తము | Gout గవుట్. |
| ఓష్ఠభేదము | Cracks of the Lip క్రాక్స్ ఆఫ్ ది లిప్. |
| నఖభేదము | Onychia ఒనికియా. |
| అరసజ్ఞత | Loss of sensibility to taste లాస్ ఆఫ్ సెన్సిబిలిటీ టు టేస్ట్. |
| ఘ్రాణనాశము | Loss of Smell లాస్ ఆఫ్ స్మెల్. |
| జృంభ | Yawning యానింగ్. |
| అస్వప్నము (నిద్రానాశము) | Insomnia ఇన్సోమ్నియా. |
| అతిప్రలాపము | Delirium డెలిరియమ్. |
| ఆమవాతము | Rheumatism రూమటిసమ్. |
| శూల | Colic కాలిక్. |
| పరిణామశూల | Gastralgokenosis, Hunger pain గేస్ట్రల్ గోకెనోసిస్, హంగర్ పెయిన్. |
| హృద్రోగము | Diseases of the heart డిసీసెస్ ఆఫ్ ది హార్ట్. |
| | Angina Pectoris ఆంజినా పెక్టోరిస్. |
| అమ్లపిత్తము | Acidity ఆసిడిటీ. |
| ఆనాహము | Constipation కాన్‌స్టిపేషన్. |
| గుల్మము | Abdominal tumour అబ్‌డామినల్ ట్యూమర్. |

| తెనుగు | ఆంగ్లము |
| --- | --- |
| రక్తగుల్మము | Ovarian or uterine tumour ఒవేరియన్ ఆర్ యుటెరైన్ ట్యూమర్. |
| మూత్రకృచ్ఛ్రము | Dysuria డిస్యూరియా. |
| | Stranguary స్ట్రాంగ్యుయరీ. Painful micturition. పెయిన్ ఫుల్ మిక్ చ్యురిషన్. |
| మూత్రాఘాతము | Obstructed micturition అబ్ స్ట్రక్టెడ్ మిక్ చ్యురిషన్. |
| వాతకుండలిక | Spasmodic stricture స్పాస్మాడిక్ స్ట్రిక్చర్. |
| అష్ఠీల | Enlargement of Prostate ఎన్లార్జ్ మెంట్ ఆఫ్ ప్రాస్టేట్. |
| వాతబస్తి | Retention of urine రిటెన్షన్ ఆఫ్ యూరిన్. |
| మూత్రాతీతము | Incontinence ఇన్ కాన్ టినెన్స్. |
| మూత్రజఠరము | Distended bladder డిస్టెన్ డెడ్ బ్లాడర్. |
| మూత్రోత్సంగము | Stricture of Urethra స్ట్రిక్చర్ ఆఫ్ యురెత్రా. |
| మూత్రక్షయము | Suppression of Urine సప్రెషన్ ఆఫ్ యూరిన్. |
| మూత్రగ్రంథి | Tumour of the bladder ట్యూమర్ ఆఫ్ ది బ్లాడర్. |
| మూత్రసాధము | Cystitis సిస్టయిటిస్. |
| విడ్విఘాతము | Vesico-Intestinal Fistula వెసికో-ఇన్ టెస్టినల్ ఫిస్ట్యులా. |
| బస్తికుండలము | Atony of bladder ఎటనీ ఆఫ్ బ్లాడర్. |
| ఖల్లీ | Muscular Spasm of Hand and feet మస్క్యులర్ స్పాస్మ్ ఆఫ్ హ్యాన్డ్ అన్డ్ ఫీట్. |
| వాతకంటకము | Sprain Ankle స్ప్రెయిన్ ఆంకిల్. |
| అశ్మరి | Calculus కాల్క్యులస్. |
| వాతాశ్మరి | Uric acid calculus యూరిక్ ఆసిడ్ కాల్క్యులస్. |
| పిత్తాశ్మరి | Mixed calculus మిక్స్డ్ కాల్క్యులస్. |
| కఫాశ్మరి | Stone of Phosphates స్టోన్ ఆఫ్ ఫాస్ఫేట్స్. |
| శుక్రాశ్మరి | Seminal calculus సెమినల్ కాల్క్యులస్. |
| శర్కర | Gravel గ్రావెల్. |
| ప్రమేహము | Diseases of the urine డిసీసెస్ ఆఫ్ ది యూరిన్. |
| ఉదకమేహము | Diabetes Insipidus డయాబిటిస్ ఇన్సిపిడస్. |

| తెనుగు | ఆంగ్లము. |
|---|---|
| పిష్టమేహము | Chylurea కయ్‌ల్యూరియా. |
| హస్తిమేహము | Anuresis అన్యురేసిస్. |
| | Incontinence of urine ఇన్‌కాన్‌టినెన్స్ ఆఫ్ యూరిన్. |
| లాలా-వసా మజ్జా-మేహము | Albuminuria అల్‌బ్యూమిన్యూరియా. |
| రక్తమేహము | Haematuria హీమచ్యూరియా. |
| శుక్రమేహము | Spermatorrhoea స్పెర్మటోరియా. |
| ఇక్షుమేహము | Diabetes Mellitus డయాబిటిస్ మెలిటస్. |
| సాంద్రమేహము | Mucus in urine మ్యూకస్ ఇన్ యూరిన్. |
| సురామేహము | Phosphaturia ఫాస్ఫచూరియా. |
| సికతామేహము | Urates in urine యూరేట్స్ ఇన్ యూరిన్. |
| క్షారమేహము | Alkaline urine అల్కలైన్ యూరిన్. |
| హారిద్రమేహము | Bile in urine బైల్ ఇన్ యూరిన్. |
| ప్రమేహపిడక | Carbuncle కార్బంకల్. |
| మేదోవృద్ధి | Obesity ఒబేసిటీ. |
| ఊర్ధ్వవాతము | Eructation ఇరక్టేషన్. |
| ప్రత్యష్ఠీల | Ovaritis ఓవరిటీస్. |
| వాతాష్ఠీల | Typhlitis టిఫ్లైటిస్. |
| ప్లీహోదరము | Splenitis, splenic enlargement స్ప్లినైటీస్, స్ప్లీనిక్ ఎన్‌లార్జ్‌మెంట్. |
| యకృద్దాల్యుదరము | Hepatitis, Hepatic enlargement హెపటైటిస్, హెపాటిక్ ఎన్‌లార్జ్‌మెంట్. |
| జలోదరము | Ascites అసయిటీస్. |
| బద్ధగుదోదరము | Intestinal obstruction ఇన్‌టెస్టినల్ అబ్‌స్ట్రక్షన్. |
| శోథము | Swelling, Dropsy, Anasarca, Œdema స్వెల్లింగ్, డ్రాప్సి, అనాసార్కా, ఇడీమా. |
| క్షతోదరము | Ulceration of the bowel అల్సరేషన్ ఆఫ్ ది బవెల్. |
| వృద్ధి | Scrotal Enlargement స్క్రోటల్ ఎన్‌లార్జ్‌మెంట్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| మూత్రజవృద్ధి | Hydrocele హైడ్రోసీల్. |
| దోషజవృద్ధి | Orchitis ఆర్క్రయిటీస్. |
| రక్తజవృద్ధి | Haematocele హీమటోసీల్. |
| వాతజవృద్ధి | Chronic orchitis క్రానిక్ ఆర్క్రయిటీస్. |
| పిత్తజవృద్ధి | Acute orchitis అక్యూట్ ఆర్క్రయిటీస్. |
| కఫజవృద్ధి | Tubercle Testes ట్యుబర్క్యుల్ టెస్టీస్. |
| మేదోజవృద్ధి | Elephantiasis of Scrotum ఎలిఫెంటియాసిస్ ఆఫ్ స్క్రోటమ్. |
| అంత్రవృద్ధి | Inguinal Hernia ఇంగ్వయినల్ హెర్నియా. |
| గలగండము | Goitre, Bronchocele గాయిటర్, బ్రాంకోసీల్. |
| గండమాలా అపచి | Scrofula స్క్రొఫ్యూలా, Tubercle glands ట్యుబర్క్యుల్ గ్లాండ్స్. |
| మేదోర్బుదము | Fatty tumour ఫ్యాటీ ట్యూమర్. |
| మాంసార్బుదము | Myoma మయోమా. |
| రక్తార్బుదము | Cancer క్యాన్సర్. |
| అర్బుదము | Malignant Tumour మలిగ్నంట్ ట్యూమర్. |
| గ్రంథి | Enlarged lymphatic Gland ఎన్లార్జ్డ్ లింఫాటిక్ గ్లాండ్. |
| శ్లీపదము | Elephantiasis ఎలిఫెంటియాసీస్. |
| విద్రధి | Abscess అబ్సెస్. |
| వ్రణశోథము | Inflammation ఇన్ఫ్లమేషన్. |
| శారీరవ్రణము | Idiopathic Ulcer ఈడియోపథిక్ అల్సర్. |
| సద్యోవ్రణము | Traumatic Wound ట్రామటిక్ వూండ్. |
| ఛిన్నము | Slashed స్లాష్డ్. |
| భిన్నము | Punctured పంక్చర్డ్. |
| విద్ధము | Stab స్టాబ్. |
| క్షతము | Contused Wound కంట్యూస్డ్ వూండ్. |
| పిచ్ఛితము | Crushed క్రష్డ్. |
| ఘృష్టము | Excoriated ఎక్స్కోరియేటెడ్. |

| తెనుగు | ఆంగ్లము |
| --- | --- |
| అస్థిభగ్నము | Fracture ఫ్రాక్చర్. |
| సంధివిశ్లేషము | Dislocation డిస్లొకేషన్. |
| అశ్వకర్ణము | Spiral Fracture స్పైరల్ ఫ్రాక్చర్. |
| మజ్జాగతము | Impacted fracture ఇంపాక్టెడ్ ఫ్రాక్చర్. |
| అస్థిచ్ఛల్లికా | Green Stick fracture గ్రీన్ స్టిక్ ఫ్రాక్చర్. |
| నాడీవ్రణము | Sinus, Fistula సినస్, ఫిస్ట్యులా. |
| భగందరము | Fistula in Ano ఫిస్ట్యులా ఇన్ ఏనో. |
| లింగార్శము | Warts వార్ట్స్. |
| కుష్ఠము | Diseases of the skin డిసీసస్ ఆఫ్ ది స్కిన్. |
| మహాకుష్ఠము | Leprosy లెప్రసీ. |
| సిధ్మము | Cloasma క్లోజ్మా. |
| | Ptyriasis టిరియాసిస్. |
| చర్మకుష్ఠము | Zeroderma జీరోడర్మా. |
| కిటిభము | Psoriasis సోరియాసిస్. |
| వైపాదికకుష్ఠము | Rhagades రాగేడ్స్. |
| అలసకము | Lichen లికెన్. |
| కచ్ఛు | Scabies, Itch స్కేబీస్, ఇచ్. |
| విస్ఫోటకము | Impetigo ఇంపెటిగో. |
| శతారు | Rupia రుపియా. |
| విచర్చిక | Pemphigus పెంఫిగస్. |
| దద్రు | Ringworm రింగ్‌వరమ్. |
| కిలాసము | Leucoderma ల్యూకోడర్మా |
| పామా | Eczema ఎక్జిమా. |
| విసర్పము | Erysipelas ఎరిసిపేలస్. |
| గ్రంథివిసర్పము | Erythema-Nodozum ఎరిథిమా నోడోజమ్. |
| కర్దమవిసర్పము | Cellulitis సెల్యులైటిస్. |
| క్షతవిసర్పము | Traumatic erysipelas ట్రామటిక్ ఎరిసిపేలస్. |
| శీతపిత్తము | Urticaria అర్టికేరియా. |
| విస్ఫోటకము | Exenthymeta ఎక్సెంథిమేటా. |

| తెనుగు | ఆంగ్లము |
| --- | --- |
| మసూరిక | Small Pox స్మాల్ పాక్స్. |
| రోమాంతిక | Measles మీజిల్స్. |
| ఇంద్రలుప్తము | Falling of Hair, Baldness ఫాలింగ్ అఫ్ హేర్, బాల్డ్‌నెస్. |
| పాషాణగర్దభము | Mumps మంప్స్. |
| విదారిక | Bubo బ్యూబో. |
| పలితము | Premature grey hair ప్రిమేచ్యూర్ గ్రే హేర్. |
| ముఖదూషిక | Acne అక్నీ. |
| మషకము | Mole మోల్. |
| గుదభ్రంశము | Prolapsus Ani ప్రోలప్సస్ ఏనై. |
| చిప్పము | Whitlow విట్‌లో. |
| సన్నిరుద్ధగుదము | Stricture of the Rectum స్ట్రిక్చర్ అఫ్ ది రెక్టమ్. |
| కక్ష | Herpes Zoster హర్పిస్ జోస్టర్. |
| కదరము | Corn కారన్. |
| నిరుద్ధప్రకశము | Phimosis ఫయిమాసిస్. |
| పరివర్తిక | Paraphimosis పెరాఫయిమాసిస్. |
| అవపాటిక | Tear in the prepuce టియర్ ఇన్ ది ప్రెప్యూస్. |
| అహిపూతన | Pruritus ani ప్ర్యురిటస్ ఏనై. |
| ఉపదంశము | Soft chancre సాఫ్టు షంకర్. |
| ఫిరంగోపదంశము | Hard chancre, syphilis హార్డ్ షంకర్, సిఫిలిస్. |
| ఖలివర్ధనము | Extra Tooth ఎక్స్ట్రా టూత్. |
| దంతనాడి | Sinus in the Gums సినస్ ఇన్ ది గమ్స్. |
| క్రిమిదంతకము | Caries of Teeth కరీస్ అఫ్ టీత్. |
| దంతహర్షము | Irritation in the Tooth ఇరిటేషన్ ఇన్ ది టూత్. |
| దంతశర్కర | Tartar టార్టర్. |
| శ్యావదంతము | Black or Necrosed Tooth బ్లాక్ ఆర్ నెక్రోజ్డ్ టూత్. |

| తెనుగు | అంగ్లము |
|---|---|
| కంఠశుండి | Elongated Uvula ఇలాంగేటెడ్ ఉవ్యులా. |
| ఉపజిహ్వ | Ranulla రన్యులా. |
| ముఖరోగము (సర్వసరము) | Stomatitis స్టోమేటైటిస్. |
| శీతాదము | Spongy gums స్పాంజీ గమ్స్. |
| దంతవేష్టము | Pyorrhoea పయోరియా. |
| దంతపుప్పుటము, శౌషిరము | Gum boil గం బాయిల్. |
| అలాసము | Sublingual abscess సబ్లింగ్వల్ అబ్సెస్. |
| తాల్వర్బుదము | Palatal cancer పలెటల్ కాన్సర్. |
| కర్ణనాదము | Noises in the Ear నాయిసెస్ ఇన్ ది ఈయర్. |
| కర్ణస్రావము | Otorrhoea ఒటోర్హియా. |
| కర్ణశూలము | Otitis, Otalgia ఓటయిటిస్, ఓటల్జియా. |
| కర్ణపాకము | Suppuration in the ear సప్యురేషన్ ఇన్ ది ఈయర్. |
| పూతికర్ణము | Faetid discharge from the ear ఫెటిడ్ డిస్చార్జ్ ఫ్రం ది ఈయర్. |
| క్రిమికర్ణము | Worms in ear వరమ్స్ ఇన్ ఈయర్. |
| కర్ణశోథము | Inflammation of the ear ఇన్ఫ్లమేషన్ ఆఫ్ ది ఈయర్. |
| బాధిర్యము | Deafness డెఫ్నెస్. |
| అపీనసము | Ozoena ఓజీనా. |
| నాసాపాకము | Pustule in the Nose, Suppurative Rhinites పుస్ట్యుల్ ఇన్ ది నోస్, సప్యురేటివ్ రయినిటిస్. |
| క్షవథు | Sneezing స్నీజింగ్. |
| నాసాశోషము | Dryness of Nose డ్రైనెస్ ఆఫ్ నోస్. |
| ప్రతిశ్యాయము | Catarrah or Cold in the Nose కటర్ ఆర్ కోల్డు ఇన్ ది నోస్, |
| అభిష్యందము | Ophthalmia అఫ్థాల్మియా. |
| శిరోత్పాతము | Pannus పానస్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| శుక్లము | Corneal Ulcer కార్నియల్ అల్సర్. |
| పిత్తవిదగ్ధదృష్టి | Day Blindness డే బ్లయిండ్‌నెస్. Hermaralopia హిమరలోపియా. |
| పాదదారి | Cracks in the sole క్రేక్స్ ఇన్ ది సోల్. |
| పద్మినీకంటకము | Papilloma of the skin పెపీలోమా ఆఫ్ ది స్కిన్. |
| కర్ణగూథకము | Wax in the ear వాక్స్ ఇన్ ది ఇయర్. |
| తుండికేసరి అధ్రుషము | Abscess of the palate అబ్సెస్ ఆఫ్ ది పేలట్. |
| మాంసతానము | Diphtheria డిఫ్తీరియా. |
| శ్లేష్మవిదగ్ధదృష్టి | Night Blindness, Nyctalopia నైట్ బ్లయిండ్‌నెస్, నిక్టలోపియా. |
| అర్మము | Pterygium టెరిజియమ్. |
| నేత్రనాడి | Lachrymal Fistula లక్రిమల్ ఫిస్ట్యులా. |
| లింగనాశము | Cataract కాటరక్ట్. |
| క్రిమిగ్రంథి | Parasites on Suppurated glands పరసయిట్స్ ఆన్ సప్ప్యురేటెడ్ గ్లాండ్స్. |
| వర్త్మార్శము | Granular Conjunctivitis గ్రాన్యులర్ కంజక్టివైటిస్. |
| అంజననామిక | Stye స్టయి. |
| వాతహతవర్త్మము | Ptosis టోసిస్. |
| నిమేషము | Blepharosposm బ్లెఫేరోస్పసమ్. |
| కుంచనము | Atrophy అట్రోఫీ. |
| పక్ష్మకోపము, ఉపపక్షము | Trichiasis ట్రికియాసిస్. |
| పక్ష్మశాతము | Tinea Tarsi టీనియా టార్సి. |
| శిరశ్శూలము | Headache హెడేక్. |
| అర్ధావభేదము | Hemicrania హెమిక్రేనియా. |
| రక్తప్రదరము | Menorrhagia మెనోర్‌హేజియా. |
| శ్వేతప్రదరము | Leucorrhea ల్యుకోర్హియా. |
| వన్ధ్యాత్వము | Sterility, Barrenness స్టెరిలిటీ, బారన్నెస్. |
| యోనికందము | Vaginal Polypus వజైనల్ పాలిపస్. |

| తెనుగు | ఆంగ్లము |
|---|---|
| గర్భస్రావము | Abortion అబార్షన్. |
| మూఢగర్భము | Difficult labour డిఫికల్ట్ లేబర్. |
| మక్కల్లశూలము | After pains ఆఫ్టర్ పెయిన్స్ |
| స్తనరోగము-శోఫము | Mammary Inflammation మమ్మరీ ఇన్ఫ్లమేషన్ |
| స్తన్యదుష్టి | Diseased Milk డిసీజ్డ్ మిల్క్. |
| సూతికారోగము | Peurperal fever ప్యూర్పెరల్ ఫీవర్. |
| గతి | Presentation ప్రెసెంటేషన్. |
| సంకీలకము | Vertex వెర్టెక్స్. |
| ప్రతిఖురము | Hands and feet హాండ్స్ అండ్ ఫీట్. |
| బీజకము | Head with both hands హెడ్ విత్ బోత్ హాండ్స్. |
| పరిఘము | Transverse ట్రాన్స్వర్స్. |
| బాలరోగము | Diseases of Children డిసీజస్ ఆఫ్ చిల్డ్రన్. |
| కుకూణకము | Ophthalmia in Children ఆఫ్థాల్మియా ఇన్ చిల్డ్రన్. |
| పారిగర్భికము | Pining పైనింగ్. |
| తాలుకంటకము | Polypus on hard palate పాలిపస్ ఆన్ హార్డ్ పాలెట్. |
| మహాపద్మవిసర్పము | Cellulitis సెల్యులైటిస్ |
| యోనివ్యాపత్తు | Disease of Vagina డిసీజ్ ఆఫ్ వజైనా. |
| ఆర్తవము | Menstruation మెన్స్ట్రుయేషన్. |
| సర్పవిషము | Snake poisoning స్నేక్ పాయిజనింగ్. |
| ఆఖువిషము | Rat bite fever or poisoning రాట్ బైట్ ఫీవర్ ఆర్ పాయిజనింగ్. |
| వృశ్చికవిషము | Scorpion bite or poisoning స్కార్పియన్ బైట్ ఆర్ పాయిజనింగ్. |
| స్నాయుకము | Guinea worm గినీవర్మ్. |

శ్రీధన్వన్తరయే నమః

# మాధవనిదానే

## ఆన్ధ్రవ్యాఖ్యాసహితే

## ౧. పఞ్చలక్షణనిదానమ్.

ఓం నమః ప్రజాపత్యశ్విబలభిద్ధన్వన్తరిసుశ్రుతచరకవాగ్భట
ప్రభృతిభ్యో మహద్భ్యో మునిభ్యో గురుభ్యః.

శ్లో. నమామి ధన్వన్తరిమాదిదేవం సురాఽసురైర్వన్దితపాదపద్మమ్,
లోకే జరారుగ్భయమృత్యునాశం దాతారమీశం వివిధౌషధానామ్.

శ్లో. ప్రణమ్య జగదుత్పత్తిస్థితిసంహారకారణమ్,
స్వర్గాపవర్గయోర్ద్వారం త్రైలోక్యశరణం శివమ్. 1

### వ్యాఖ్యానప్రారంభము

శ్లో. కామాదీన్ వినివర్త్య రోగనిచయానాత్మానమవ్యాకృతం
ప్రాప్తుం జ్ఞానమహౌషధం దిశతి యస్సోఽవ్యాత్పురాణో భిషక్,
యత్పాదామ్బుజసేవనాసిలతయా చోన్మూల్య పాపాటవీం
ఘోరాం సంసృతిమావిలఙ్ఘ్య మునయోఽప్యానన్దమధ్యాసతే.
యశ్శబ్దజాలసలిలైర్విమలైర్వచోభిర్భాష్యం వ్యధత్త భువి పాణినిసూత్రరాశేః,
యేనేరితం చరకమాత్రచికిత్సితం చ సంస్తౌమ్యహం చరకరూపపతఞ్జలిం తమ్.
శ్రీధన్వన్తరిమాకలయ్య మనసా స్తుత్వా సదా వాగ్భటం
చాత్రేయం ప్రణిపత్య సుశ్రుతమపి ధ్యాత్వా హ్యనధ్యన్తరే,
ఆయుర్వేదమహోదధిం విమృశతామాద్యాం నిదానం త్వహం
వ్యాకుర్వేఽద్య తు మాధవేన రచితం శ్రీవిశ్వనాథాఽభిధః.

శ్రీమత్పరమకారుణికుండును, చరాచరాత్మక మగు ప్రపంచమునకు తొల్లింటి కారణభూతుండు నగు నాపరమేశ్వరుని సృష్టికి లోనగు మానవకోటికి మిథ్యాహారవిహార

మూలంజేసి శారీరమానసికవ్యాధులు జనించును. అట్టిరోగములు జనింపకుండుటకును, జనించినవాని నివర్తింపజేయుటకును తగినయుపాయం బొకటి యావశ్యకము. జరావ్యాధులచే బాధింపబడు మానవకోటి నీక్షించి, కరుణారసార్ద్రహృదయులగు త్రికాలవేత్తలైన యాత్రేయుడు, చరకుడు, సుశ్రుతుడు మున్నగు మునిపుంగవులు వారివారిపేర నాయుర్వేదసంహితల పలుదెరంగుల రచియించిరి. అయ్యవి హేతు-లక్షణ-ఔషధంబు లను మూడు స్కంధ(విభాగ)ములచే నిండియున్నవి. రోగములకు దగిన చికిత్స నరయుటకు వానికారణములను, లక్షణములను దెలియక వలనుపడదు. కావున దొలుత రోగములకు కల్గించు కారణములను, రోగలక్షణములను దెలుపుభాగమును హేతులక్షణస్కంధముల నుడివిరి. ఈయభిప్రాయమునే "రోగమాదౌ పరీక్షేత తతోఽనన్తరమౌషధమ్" అని ప్రాచీనులు నుడివిరి. చికిత్సాభాగమును ఔషధస్కంధమున సప్రపంచముగ నిరూపించిరి.

పైజెప్పబడిన హేతులక్షణస్కంధమునకే 'నిదాన' మనియు నామాంతరము కలదు. అయ్యవి వారివారిసంహితలయం దున్నను వానినన్నింటి నొక్కడ సంగ్రహించి చెప్ప పనిబూని మాధవకరుం డనునాయుర్వేదవిదగ్రేసరుండు 'మాధవనిదాన' మను గ్రంథమును రచియించె.

అందు 'శ్రేయాంసి బహువిఘ్నాని' అనునార్యోక్తిప్రకారము విఘ్నబాహుళ్యము నాలోచించి "మఙ్గళాదీని మఙ్గళమధ్యాని మఙ్గళాన్తాని చ శాస్త్రాణి ప్రథన్తే, వీరపురుషకాణ్యాయుష్మత్పురుషకాణి చ భవన్తి; అధ్యేతారశ్చ వృద్ధియుక్తా యథా స్యుః." అను భాష్యకారానుశాసనమును దలంచి తా జేయబూనినగ్రంథమునం దిష్టదేవతాప్రణామరూపంబగు మంగళమును "ప్రణమ్య......శివమ్" అనుశ్లోకముచే రచియించెను:—

సకలజగంబులను సృజియించుటకును, కాపాడుటకును, సంహరించుటకును కారణమై, యాగాదికర్మలచే బొందదగిన స్వర్గలోకసౌఖ్యమునకును, జ్ఞానముచే బొందగల పరమపురుషార్థ మగుమోక్షమునకును దాతయై, స్వర్గ మర్త్యపాతాళంబు లనుమూడు లోకంబులకు రక్షకుడై, సర్వోత్కృష్టమైన సుఖమును గల్గించు నప్పరమేశునకు నమస్కరించి గ్రంథమును రచించెద.

ఇచ్చట "ప్రణమ్య" అనుచోట అధిక్యార్థమును దెలుపు ప్రశబ్దముతో గూడిన నమధాతువును ప్రయోగించుటచే గ్రంథకర్తయొక్క భక్త్యతిశయము సూచింపబడుచున్నది. పరమశివవాచకమై మంగళార్థకమైన శివశబ్దమును ప్రయోగించుటంజేసి గ్రంథప్రవర్తకులకును, శిష్యులకును విఘ్నములేకుండునట్లు నిరంతరమంగళము ఆశాసింపబడినది.

## అనుబన్ధచతుష్టయము

నానామునీనాం వచనై రిదానీం సమాసతస్సద్భిషజాం నియోగాత్,
సోపద్రవారిష్టనిదానలిఙ్గో నిబధ్యతే రోగవినిశ్చయోఽయమ్. 2

పండితులగు వైద్యవరులు నా కానతి నొసంగుటంజేసి, మననశీలురై త్రికాలజ్ఞాన సంపన్నులగు చరకాదిమహర్షులవాక్యములను సాధనములుగ జేసికొని, ఉపద్రవములు (ఒకవ్యాధి ప్రధానముగ జనించినపిదప నప్రధానముగ గల్గు నితరవ్యాధులు), అరిష్టములు (మరణకాలమును నియతముగ సూచించులక్షణములు) నిదానములు (వ్యాధులు జనించుటకు హేతువులగు మిథ్యాహారవిహారాదులు), లింగములు (వ్యాధి యియ్యది యని తెలియంజేయు పూర్వరూపాదులు) అను నీనాల్గువిషయములతోగూడిన రోగ వినిశ్చయమును (రోగముల నిర్ణయమును దెలుపునట్టి గ్రంథమును) రచియించెద.

ఇచ్చట "నానామునీనాం వచనైః" అను వాక్యము చేత ప్రాచీనులగు మునిపుంగవుల గ్రంథములయందలి వాక్యములను ప్రమాణముగ దీసికొనుటంజేసి తన గ్రంథము మిక్కిలి ప్రామాణికమనియు; "సమాసతః" అనుటచే మందప్రజ్ఞులై గ్రంథవిస్తరమునకు భయంపడు నలసులకుంగూడ నీగ్రంథము సుబోధంబుగ నుండు ననియు నీగ్రంథమునకు తక్కినగ్రంథములకన్న ప్రాశస్త్యంబును, అభిరుచియు బోధితములు. "సద్భిషజాం నియోగాత్." అనువాక్యముచేత గొప్పపండితుల ప్రోత్సాహముచే నీగ్రంథము రచింపబడినదిగాని కేవలము పాండిత్యము నుద్ఘోషించుటకు గాదనియు; గ్రంథరచనకు పూర్వమే పండితులందరును; బద్ధకుతూహలులై యుండుటంజేసి, గ్రంథరచన చరితార్థమనియు విశేషములు సూచింపబడినవి.

"లిఙ్గ్యతే (జ్ఞాయతే) అనేన వ్యాధిః." అను వ్యుత్పత్తిచేత వ్యాధిని దెలుపునట్టి సాధనములగు పూర్వరూప - రూప - ఉపశయ - సంప్రాప్తులు నాల్గును లిఙ్గశబ్దముచే గ్రహింపబడును. ఈశ్లోకముచేత ఉపద్రవములు, అరిష్టములు, నిదానములు, లింగములు అనునవి యీగ్రంథమున ప్రతిపాదింపబడువిషయము లనియు, వీని కీగ్రంథము ప్రతిపాదకమగుటంజేసి విషయగ్రంథములకు ప్రతిపాద్యప్రతిపాదకభావసంబంధ మనియు, విషయము, సంబంధ మను నీరెండును దెలుపబడియె.

## గ్రంథప్రాశస్త్యము

నానాతన్త్రవిహీనానాం భిషజామల్పమేధసామ్,
సుఖం విజ్ఞాతుమాతఙ్కమయమేవ భవిష్యతి. 3

దీనికి మునుపు అనేకులైన ఋషివర్యులచే నాయుర్వేదతంత్రము లనేకములు నిబంధింపబడియున్నను, వానినన్నిటిని పరిశీలించి సిద్ధాంతమును దెలియంజాలని యల్పజ్ఞాను లగు వైద్యుల కీగ్రంథము రోగముల గుర్తెరింగి నిశ్చయింప సుఖబోధకముగ నుండగలదు.

ఆయుర్వేదీయతంత్రములయందు నిదానభాగములు పలుదెరంగుల నిరూపింపబడినను వానివాస్తవార్థము నరయంజాలని మందప్రజ్ఞులకు వానిసారాంశం బీగ్రంథమున తెలియునటుల రచియించుటంజేసి పూర్వగ్రంథములచే చరితార్థము గాక యియ్యది సఫలంబగు ననియు, రోగలక్షణముల దెలియగోరు సామాన్యవైద్యు లీగ్రంథమున కధికారు లనియు, రోగపరిజ్ఞానము ప్రయోజన మనియు నీశ్లోకమున నిరూపింపబడినది. పై రెండు శ్లోకములచే విషయము, సంబంధము, అధికారి, ప్రయోజనము లను ననుబంధ చతుష్టయము నిరూపింపబడె నని యెరుంగునది.

## వ్యాధిని దెలుపు నుపాయములు

నిదానం పూర్వరూపాణి రూపాణ్యుపశయ స్తథా,
సమ్ప్రాప్తి శ్చేతి విజ్ఞానం రోగాణాం పఞ్చధా స్మృతమ్. 4

సకలరోగముల దెలిసికొనుటకు నైదుపాయములు గలవు. అయ్యవి నిదానము, పూర్వరూపములు, రూపములు, ఉపశయము, సంప్రాప్తి యని పేర్కొనబడును. ఈయైదింటికి లక్షణము లీక్రింద వివరింపబడుగాన నీయైదిటిచే రోగం బియ్యది యని గుర్తించి నిర్ణయింప నగు నని భావము.

అందు నిదానాదు లన్నిటిచేనైనను, ప్రత్యేకముగనైనను వ్యాధుల నెరుంగునది. వీనిలో నొకదానిచేతనే రోగమును నిర్ణయింపదగియున్నను వానికి వేరువేరుగ ప్రయోజన ముండుటంజేసి నుడువంబడియె. "సంక్షేపతః క్రియాయోగో నిదానపరివర్జనమ్" అను సుశ్రుతవాక్యముచే నిదానమును వర్జించి మనుటయే సంగ్రహరూపమైన ప్రధాన చికిత్సయని తెలియుచున్నది. నిదానమన రోగములగల్గించు మిథ్యాహారవిహారాదులు. ఏరోగముల కెట్టి మిథ్యాహారవిహారాదులు కారణముగా జెప్పంబడియున్నవో అట్టి మిథ్యాహారవిహారాదుల జేయక విడిచియుండునెడ నావ్యాధులు కలసూపవుగాని వానిని తొలుతనే సేవింపకుండుట ముఖ్యమైనచికిత్స యని సుశ్రుతాభిప్రాయము. ఈవ్యాధికిది నిదాన మని తెలిసినందుకు వానిని వర్జించుటయే ముఖ్యమైన ప్రయోజనము. "నిశ్చిత్య దీయతే (ప్రతిపాద్యతే) వ్యాధిరనేనేతి నిదానం" అనువ్యుత్పత్తిచేనైనను, "నిర్దిశ్యతే (నిశ్చీయతే) వ్యాధిరనేనేతి నిదానం" అనువ్యుత్పత్తిచేనైనను వ్యాధిని నిర్ణయముగ నియ్యది యని గుర్తింప సాధకములగు మిథ్యాహారవిహారాదులు నిదానశబ్దముచే వ్యవహరింపబడును.

"జ్వరస్య పూర్వరూపే లఘ్వశనమపతర్పణం వా" (చరక. ని. అ. ౧.) అను చరకవచనముచే జ్వరమును గల్గింప సమర్థములగు పూర్వరూపములు గానం బడినచో యవాగుమున్నగులఘువులైన యాహారములసేవించుట, లేక లంకణము చేయుట మంచిదని తెలియుచున్నది. అట్టి యాహారనియమము పూర్వరూపావస్థ యందు చేసిననాడు జ్వరము కల్గబోదని చరకాభిమతము. దీనిచేత జ్వరాదిరోగములయందు పూర్వరూపావస్థ నెఱింగి యపతర్పణా(లంఘనా)దులజేయుట పూర్వరూపమునకు బ్రయోజనమని తెలిసెడిని.

"హేతవః పూర్వరూపాణి రూపాణ్యల్పాని యస్య వై, న చ తుల్యగుణో దూష్యో న దోషః ప్రకృతిర్భవేత్." (చరక. సూ. అ. ౧౦.) "నిమిత్తపూర్వరూపాణాం రూపాణాం మధ్యమే బలే" (చరక. సూ. అ. ౧౦) "సర్వసమ్పూర్ణలక్షణస్సన్నిపాత జ్వరోఽసాధ్యకః" (చరక. చి. అ. 3) అనియు చరకమున నున్నది. రోగకారణములగు మిథ్యాహారవిహారంబులును, పూర్వరూపంబులును, రోగలక్షణంబులును మిక్కిలి స్వల్పములై, దోషదూష్యములు సమానగుణములుగాక, రోగమును జనింపజేసిన దోషము శరీరప్రకృత్యారంభకము గాకయున్నచో నాజ్వరము సుఖసాధ్యం బనియు; నిమిత్తములు, పూర్వరూపములు, రూపములు మధ్యమబలములై యుండు నది కృఛ్రసాధ్యంబగుననియు; అన్నిలక్షణములను పూర్ణముగనుండు సన్నిపాత జ్వరము అసాధ్యం బగు ననియు పైవాక్యములచేత దెలియుచున్నది. నిమిత్తపూర్వరూపరూపముల బలాబలములబట్టి వ్యాధి సాధ్యాసాధ్యవ్యవస్థ నెఱుంగనగు నని రూపమునకుంగూడ ప్రయోజనము గన్పట్టుచున్నది.

"గూఢలిఙ్గం వ్యాధిం ఉపశయానుపశయాభ్యాం పరీక్షేత" (చరక. విమాన. అ.౪) అను చరకవాక్యముచేత వ్యాధియేదోషమునజనించినదియు నేవ్యాధియైనదియు దెలియనిసందర్భమునం దుపశయముచేతను అనుపశయముచేతను నిర్ణయింపనగు నని తెలియుచున్నది. (హేతువులకును వ్యాధులకును ఈరెంటికిని విపరీతగుణంబులును, విపరీతార్థకరంబులునగు నౌషధాన్నవిహారముల నుపయోగించుట యుపశయం బనియు; అటుకాక హేత్వాదుల కనుగుణంబులగు నౌషధాదుల నుపయోగించుట అనుపశయం బనియు నెరుంగునది.) దీనిచేత వ్యాధిలక్షణములు స్ఫుటముగ గానరాక నిర్ణయింప నలవిగాకుండుతరి యుపశయానుపశయమునకు ప్రయోజన మని స్ఫుటమగుచున్నది.

పైచూపెట్టిన నిదానాదులనాల్గిటిచే రోగమును నిర్ణయించినను, సంప్రాప్తి యందు జెప్పిన "సఙ్ఖ్యావికల్పప్రాధాన్యబలకాలవిశేషతః, సా భిద్యతే యథాత్రైవ వక్ష్యన్తేఽష్టౌజ్వరా ఇతి" అనుసంఖ్య (రోగములకు వాతాదిసంబంధమున గల్గు సంఖ్యాభేదము) వికల్పము (వాతాదిదోషముల సుసూక్ష్మాంశపరికల్పనము), ప్రాధా

స్యము (రోగసంకరమునందు వానిలో స్వతంత్రపరతంత్రరోగముల నిర్ణయించుట), బలము, (నిదానపూర్వరూపాదులచే రోగబలాబలము), కాలము (రాత్రి, పవలు మున్నగుకాలము), అను సంప్రాప్తిభేదముల నరయక చికిత్సల నిర్ణయింప వలను పడదు. కావున సంప్రాప్తియు నావశ్యకము.

ఇత్తెరంగున నిదానాదు లైదిటికిని వేర్వేర ప్రయోజనము నెరుంగునది. మరియు నిదానశబ్దమునకు పై జెప్పంబడిన వ్యుత్పత్తిచే వ్యాధిని దెలుపు నుపాయములు నిదానపూర్వరూపరూపఉపశయసంప్రాప్తులన్నియు నగుటం జేసి యన్నిటికిని నిదానము అనుపదముచే వ్యవహారము కలదు. అయినను విశేషవివక్షచే వ్యాధికి నుత్పత్తికారణములగు మిథ్యాహారవిహారాదులే ప్రాయికముగ నిదానపదముచే గ్రహింపనగును.

## నిదానలక్షణము

నిమిత్తహేత్వాయతనప్రత్యయోత్థానకారణైః,
నిదానమాహుః పర్యాయైః-

ఏరోగమైనను జనించుటకు మొట్టమొదట నెయ్యది కారణ మగునో, అయ్యది ఆయారోగములకు నిదాన మనబడును. అట్టి నిదాన మనునది నిమిత్తము, హేతువు, ఆయతనము, ప్రత్యయము, ఉత్థానము, కారణము ననుపర్యాయపదములచే నీశాస్త్రమున వ్యవహరింపబడును. లోకమున "ఇంద్రః, మరుత్వాన్, మఘవా" ఇవి మున్నగు పర్యాయపదములచే 'ఇంద్రుడు' అనేవ్యక్తి యెట్లు బోధింపబడునో, ఆరీతిగ పైచెప్పబడిన నిమిత్తాదిపర్యాయములచె నీశాస్త్రమున నిదానము బోధింపబడు నని భావము.

"ఇతికర్తవ్యతాకో రోగోత్పాదకహేతుర్నిదానమ్" అని *కొందరాచార్యులు నిదానలక్షణము నుడివిరి. ఇట్టి కారణమువలన బుట్టినవ్యాధి కిత్తెరంగున చికిత్సచేయ

* ఈ సంగ్రహలక్షణమును మధుకోశవ్యాఖ్యయందు విజయరక్షితుడు వ్రాసియుండెను.

దీనియర్థ మీక్రిందిరీతి నుండగలదని తెలియవలెను. "అజ్ఞాతమేవేత్థంభావ ఇతి, ఇతికర్తవ్యేతి చోచ్యతే" అని మీమాంసకవాక్యము. దానిని వారు "ఈవిధముగా నగునది" యను కార్యములో నట్టిది యేయే విధములతో గూడి యుండునో ఆవిధములైన యంగము లితికర్తవ్యత యనబడును అని వివరించిరి.

ప్రకృతమున నిదానలక్షణమును జెప్పుచు "ఇతికర్తవ్యతాకః" ఇట్టి యంగములు కలదగు "రోగోత్పాదకహేతుః" రోగోత్పత్తిని గలిగించుకారణము నిదాన మని యర్థము చెప్ప టుచితము. అట్టియంగము లెవ్వి యనగా నాహారవిహారాదికము, రోగ

వలె ననుజ్ఞానమును దెలుపుచు, వ్యాధిని బుట్టించు హేతు వగునది నిదాన మని యర్థము. ఎట్లు లన, నియతమైనపరిమాణమునకు న్యూనముగనైనను అధికముగనైనను భుజించినచో నజీర్ణవ్యాధి జనించునని అజీర్ణమునకు నిదానము చెప్పబడినది. అట్టివిషమాశనము అజీర్ణవ్యాధికి హేత్వాదివిపరీతములగు చికిత్సల దెలిసికొనుటకు కారణమై రోగమునకు గూడ హేతువగుటంజేసి యజీర్ణమునకు నిదాన మగును. ఇత్తెరంగుననే తక్కినరోగములందెల్ల నిదానలక్షణసమన్వయము నెరుంగునది.

పై విమర్శనముచేత రోగములను బుట్టించుకారణము నిదానమని యేర్పడినది. అదియే రోగములకు హేతువు. అయ్యది నానారూపములుగ నుండును. కావున దాని భేదముల నిరూపింప నలవికాదు. సంగ్రహముగ దానిముఖ్యభేదములుమాత్ర మిచ్చట జూపెద:—

హేతువు సన్నికృష్టము, విప్రకృష్టము, వ్యభిచారి, ప్రాధానికము నని నాల్గు విధముల నుండు నని హరిచంద్రుడు విభజించెను. అందు వాతాదిప్రకోపమునకైనను రోగములకైనను మిక్కిలి సన్నిహితమైనహేతువు సన్నికృష్ట మనబడును. వయస్సు, రాత్రి, పగలు, భోజనము ఇవి వాతాదిదోషప్రకోపమునకు సన్నికృష్టహేతువులు.

---

పూర్వస్వరూపనిర్వృత్తి, రోగవ్యక్తత, అట్లు వ్యక్త మగునప్పుడు శరీరములో గలుగుమార్పు, దుర్వివేచమగు రోగవ్యక్తిలో గూఢమగు కారణము అనునవి యైయుండును. అంగసముదాయమే అంగి యనుసిద్ధాంతము బహుశాస్త్రకారసమ్మతము కాన అట్టివానితోగూడిన సముదాయరూపమగు నంగియే యిచ్చట రోగోత్పాదక హేతు వగుచున్నది. ఇదియే మొత్తము నిదానపదార్థ మని లక్షణకారుని యాశయము.

కావుననే నిదానైకాంగ మగు సంప్రాప్తియందీలక్షణ మతివ్యాప్తము కాకుండుటకై యన్మతే దోషేతికర్తవ్యతాఖ్యా సమ్ప్రాప్తి రిష్యతే, తన్మతే సమ్ప్రాప్తివ్యుదాసాయ "సేతికర్తవ్యతాక ఇతి పదమ్" అనగా నెవరు దోషములు లోపల గలిగించు మార్పే సంప్రాప్తి యందురో వారిమతమునందు రోగోత్పాదకహేతుమాత్రమే నిదాన మన్నచో సంప్రాప్తి యగును గాన బాహ్యహేతు విశిష్ట మగు విశాలనిదానలక్షణము కుదరదు గాన దానినిగూడ క్రోడీకరించుకొనుటకై 'సేతికర్తవ్యతాక' యనుదళము వేయబడె నని సమర్థించి యుండెను.

కాబట్టి ఆంధ్రవ్యాఖ్యానమున వివరణము సమంజసము కాజాలదేమో విజ్ఞులు విచారింపవలెను. నిదానమునందు చికిత్సావిధానజ్ఞానము కూడియుండుటయనునది యెక్కువగా నుపపన్నము కాజాలదు.

తి. వ. రా.

ఏల యన "వయోఽహోరాత్రిభుక్తానాం తేఽన్తమధ్యాదిగాః క్రమాత్" (అ. హృ సూ. అ. ౧) అని చెప్పినప్రకారము వాతపిత్తకఫములు మూడిటికి వరుసగ పైజెప్పిన వయస్సు మున్నగువానిలో అంతమధ్యాది భాగములు మూడును ప్రకోపకారణములు. ఇవి సన్నిహితములగుటంజేసి సన్నికృష్టము లగును.

విప్రకృష్ట మన కాలవ్యవధిచేత కారణ మగునది విప్రకృష్టము.—హేమంత ఋతువున చయావస్థ (స్వస్థానమునవృద్ధి) నొందిన కఫము వసంతఋతువున ప్రకోపమునొంది కఫరోగముల గల్గించును. దక్షయాగమునం దీశ్వరునకు కల్గినకోపము జ్వరమునకు కారణ మగును. ఇచ్చట కాలాంతరమున కల్గినకారణముచేత కఫరోగంబును, యుగాంతరమునగల్గిన రుద్రకోపముచేత జ్వరంబును కల్గు నని చెప్పుటచేత అట్టి కారణములు విప్రకృష్టము లనబడును.

బలహీనమై రోగమును గల్గింప సమర్థముగా కుండు కారణము వ్యభిచారి యన దగు. ఈవిషయమును చరకాచార్యు డిట్లు చెప్పెను-"దోషాః అబలీయాంసో యదాను బధ్నన్తి, న తదా వికారాభినిర్వృత్తిర్భవతి" (చరక. ని. అ. ౮) బలిష్ఠములు కాని దోషములు ఎప్పుడు అనుబంధించియుండునో అప్పుడు రోగములు గల్గ వనుట.

ప్రాధానిక మన రోగములకైనను దోషప్రకోపమునకైనను ముఖ్యమైన కారణము; అయ్యది అసాత్మ్యేన్ద్రియార్థసంయోగము, ప్రజ్ఞాపరాధము, పరిణామము నని మూడు విధములు.

శ్రోత్రము, త్వక్కు, చక్షుస్సు, జిహ్వ, ఘ్రాణమునను ఇంద్రియములకుశబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము నునవి వరుసగ విషయములు. అవియే యింద్రియార్థములు. తనకు సుఖకరముగాని యింద్రియార్థములు అసాత్మ్యేన్ద్రియార్థములు. అట్టి యసాత్మ్యములగు నింద్రియార్థములతో కల్గు సంబంధము అసాత్మ్యేన్ద్రియార్థ సంయోగ మనబడును.

ప్రజ్ఞాపరాధ మన వాక్కు, మనస్సు, శరీరము—ఈమూడిటికి సంబంధించిన కర్మలు ప్రజ్ఞాపరాధము.

శీతోష్ణవర్షాభేదములైన ఋతుధర్మములతో గూడి సంవత్సరాత్మకమైన కాలము పరిణామ మనబడును.

పైజెప్పబడిన అసాత్మ్యేన్ద్రియార్థసంయోగము, ప్రజ్ఞాపరాధము, పరిణామము అను నీమూడును అయోగము, అతియోగము, మిథ్యాయోగము నను భేదములచేత నొక్కొకటి మూడేసివిధము లగును.

ఇంద్రియములకు తమకు సంబంధించినవిషయములందు బొత్తుగ సంబంధము కల్గకుండుట అయోగము. అధికముగ సంబంధము కల్గియుండుట అతియోగము, విరుద్ధముగ సంబంధము కల్గుట మిథ్యాయోగము.

అందు నేత్రములకు తనకు సంబంధించినరూపములను జూడకున్నచో నయోగము, రూపాదులను విశేషముగ నెడతెగక చూచుచున్న నతియోగము; మిక్కిలి సూక్ష్మంబును, భయంకరంబును మిక్కిలి కాంతియుక్తములు నగు సూర్యుడు మున్నగు రూపముల జూచుట ఇవి మున్నగునవి మిథ్యాయోగము. ఇది చక్షురింద్రియమునకు సంబంధించిన మిథ్యాయోగము. ఇత్తెరంగుననే తక్కిన యింద్రియములకు ఇంద్రియార్థములతో నయోగ - అతియోగ - మిథ్యాయోగముల నూహించునది. ఇదియ యసాత్మ్యేన్ద్రియార్థసంయోగభేదములు. ఈవిషయమును వాగ్భటాచార్యుడిట్లు చెప్పెను:—"హీనోఽర్థే నేన్ద్రియస్యాల్పస్సంయోగ స్స్వేన నైవ వా, అతియోగోఽతి సంసర్గః, సూక్ష్మభాసురభైరవమ్, అత్యాసన్నాతిదూరస్థం విప్రియం వికృతాది చ, యదక్ష్ణా వీక్ష్యతే రూపం మిథ్యాయోగస్స దారుణః, ఏవమత్యుచ్చపూత్యాదీ నిన్ద్రియార్థాన్ యథాయథం, విద్యాత్."

కాలము శీతము, ఉష్ణము, వర్షము అను మూడిటిచే మూడువిధముల నుండును. అందు హేమంతశిశిరములు శీతకాలములు. వసంతగ్రీష్మములు ఉష్ణకాలము. వర్షఋతువు వర్షాకాలము. ఇందు శీతకాలమున చల్లదన ముండవలెను. అట్టికాలమున శీతము స్వల్పముగ నున్నచో కాలమునకు హీనయోగము. శీతము మిక్కుటముగ నున్న నతియోగము. శీతము బొత్తుగలేక ఉష్ణం బధికముగనున్న మిథ్యాయోగము. (ఇదియే ఋతుధర్మవైపరీత్యము.) ఇత్తెరంగుననే తక్కినకాలములకును అయోగ - అతియోగ - మిథ్యాయోగముల నిర్ణయించునది. ఈ విషయమును వాగ్భటాచార్యుడిట్లు చెప్పెను:—"కాలస్తు శీతోష్ణవర్ష భేదాత్త్రిధా మతః, స హీనో హీనశీతాదిః అతియోగోఽతిలక్షణః, మిథ్యాయోగస్తు నిర్దిష్టో విపరీతస్య లక్షణః" ఇదియే పరిణామమునకు హీనమిథ్యాతియోగములు.

కర్మము, శరీరము, వాక్కు, మనస్సు అను మూడిటి సంబంధమునుబట్టి మూడువిధములు. ఈ మూడిటికిని సంబంధించినపనుల బొత్తుగ జేయకుండుట అయోగము. అట్టిపనులను మితిమీఱిచేయుట అతియోగము. విరుద్ధచేష్టలుచేయుట మిథ్యాయోగము. దేహపరిశ్రమము మున్నగు కృత్యములను బొత్తుగ జేయకుండుట శరీరకర్మకు అయోగము. వాని నధికముగ జేయుట యతియోగము. మలమూత్రాదులు వెడలనున్నపుడు వాని నిరోధించుట, వానివేగము లేనిసమయమున బలాత్కార

ముగ వెడలించుట మున్నగునవి మిథ్యాయోగము. ఇది కాయికకర్మలకు సంబంధించిన అయోగ - అతియోగ - మిథ్యాయోగములు. తక్కిన వాచిక మానసికకర్మలకును అయోగాదుల నిత్తెరంగుననే యూహించునది. మరియు లోకాంతరమున జేయబడిన కర్మకును మిథ్యాయోగాదుల నిట్లూహించునది. ఇదియే ప్రజ్ఞాపరాధమునకు సంబంధించిన అయోగ - అతియోగ - మిథ్యాయోగములు. దీనిని వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"కాయవాక్చిత్తభేదేన కర్మాపి విభజేత్త్రిధా, కాయాదికర్మణాం హీనా ప్రవృత్తిర్హీనసంజ్ఞితా, అతియోగోఽతిదీప్తస్తు వేగోదీరణధారణమ్."

ఇట్టి భేదములుకల నిదానముచే వాతాదిదోషములు ప్రకోపమునొంది యనేకవిధములగు రోగములఁ గల్గించును. ఈవిషయమును వాగ్భటాచార్యుఁ డిట్లు చెప్పెను:— "నిదానమేతద్దోషాణాం కుపితాస్తేఽపి నైకధా, కుర్వన్తి వివిధాన్ రోగాన్."

అట్టి నిదానము వాతాదిదోషప్రకోపమునకును వ్యాధికిని రెంటికిని కారణమగుటవలన మూడువిధము లగును. ఆయా ఋతువులయందు పుట్టిన మధురాదిరసములు దోషములయొక్క చయప్రకోపప్రశమములకు కారణములగును. ఇది కేవలము దోషములకే కారణము.

పాండురోగనిదానమున "పఞ్చమో భక్షణాన్మృదః" అని చెప్పుటచేత మృత్తును తిన్నప్పుడు పాండురోగము గల్గునని తెలియుచున్నది. ఇచ్చట పాండురోగమునకు మృద్భక్షణము కారణము. కావున నిది రోగమునకు నిదానము. మరియు "కషాయా మారుతం పిత్త మూషరా మధురా కఫమ్" (చరక. చి. అ. ౧౬) అను చరకవాక్యము ననుసరించి మృత్తు వాతాదిప్రకోపమునకుకూడ కారణమగునుగాని మట్టిని తినుటచే ప్రకోపించినదోషముచేత పాండురోగముదక్క వేరొండురోగము గల్గదు. కావున మృద్భక్షణము పాండురోగమునకు హేతువగుట నిక్కము.

మరియు "హస్త్యశ్వోష్ట్రైర్గచ్ఛతశ్చాశ్నతశ్చ...ఉచ్యతే వాతరక్తం" (సుశ్రుత. ని. అ. ౧.) అని వాతరక్తసంప్రాప్తి చెప్పబడినది. ఇచ్చట ఏనుగు గుఱ్ఱము మున్నగువానిపై నెక్కి సవారిచేయుటచే వాతరక్తము కల్గునని యర్థము. అట్టి సవారి చేయుటచేత వాతాదులు ప్రకోపించును. రక్తము చలించి పాదములయందు చేరును. కావున వాతాది ప్రకోపమునకును రక్తము పాదములజేరుస్వరూపము కలవ్యాధికిని అశ్వాదియానము కారణమగును. కావున నియ్యది దోషములకును వ్యాధికిని కారణమగు నిదానము. ఇట్టి స్థలములయందు హేతువునకు వ్యాధికినిగూడ శామకమగుచికిత్స జేయవలెను. దీనికే ఈవిషయము ముఖ్యముగగమనించుటకై యిచ్చట వివరింపబడినది.

మరియు పై జెప్పబడిన హేతువు ఉత్పాదకమనియు, వ్యంజకమనియు రెండు తెరంగులు. వ్యాధిని పుట్టించునది యుత్పాదకము. వ్యాధినిపుట్టించకున్నను సమీపగ

నుండునది వ్యంజకము. హేమంతమునబుట్టిన మధురరసము వసంతమున కఫరోగమును కల్గించును. ఇది కఫరోగమునకు ఉత్పాదకము. అట్టి వసంతఋతువున సూర్యునితాపముచే కఫము కరగును. ఈసూర్యతాపము వ్యాధిని కల్గించకున్నను వ్యాధికి కారణమైన కఫమును కరగించి సహకారి యగును కావున సూర్యతాపము వ్యంజక మగును.

మరియు నాహేతువు బాహ్యమనియు, ఆభ్యంతరమనియు రెండువిధములు. అందు ఆహారవిహారాచారాదులు బయటనుండి కల్గినకారణము లగుటంజేసి బాహ్యహేతువులు. అయ్యవి వాతాదుల ప్రకోపింపజేయు వ్యాయామాదులు.

వాతాదిదోషములును, రసరక్తాదిదూష్యములును శరీరాంతర్భాగమున నుండుటంజేసి యాభ్యంతర హేతువులు. అందు వసంతఋతువునందు శ్లేష్మంబును, శరదృతువునందు పిత్తంబును, వర్షఋతువునందు వాతంబును ప్రకోపించుట ప్రాకృతము. వసంతఋతువున ప్రకోపించిన వాతపిత్తంబులును, వర్షఋతువున ప్రకోపించిన పిత్తకఫంబులును, శరదృతువున ప్రకోపించిన వాతకఫంబులును వైకృతములు. అట్టి ప్రాకృతవైకృతభేదములచే సుఖసాధ్యత్వాదుల గమనించుట ప్రయోజనము. ఈవిషయమును చరకాచార్యం డిట్లు చెప్పెను:—"ప్రాకృతస్సుఖసాధ్యస్తు వసన్తశరదుద్భవః" (చరక చి. అ. 3) వసంతశరదృతువులబుట్టిన ప్రాకృతదోషము సుఖసాధ్య మని భావము.

మరియు వాతాదిదోషములు అనుబంధ్యములనియు, అనుబంధములనియు రెండువిధములు. అందు రోగమునకు ప్రధానకారణముగనుండునది అనుబంధ్యము. ప్రధానముగాక ప్రధానము ననుసరించి యుండునది అనుబంధము. ఈవిషయమును చరకాచార్యం డిట్లు చెప్పెను:—"స్వతన్త్రో వ్యక్తలిఙ్గో యథోక్తసముత్థానోపశమో భవత్యనుబన్ధ్యః, తద్విపరీతలక్షణస్త్వనుబన్ధః" (చరక. చి. అ. ౬) స్ఫుటములగు స్వలక్షణములతోఁగూడి యథావిధిగ నుత్పత్తియు, శాంతియు కల్గి స్వతంత్రముగ వ్యాధిని గల్గించునది యనుబంధ్యము. అటుగాక తనలక్షణములు స్ఫుటముగ తెలియక ప్రధానదోషమునకు సహకారిగనుండునది యనుబంధము. ఈయనుబంధ్యానుబంధములు దెలిసినచో దోషసంసర్గజనితవ్యాధులయందు అనుబంధముగ నుండు దోషమునకు విరోధము లేక యనుబంధ్యమునకు దగిన చికిత్స చేయుటకు సుకరముగ నుండును. ఇదియ దీని ప్రయోజనము.

మరియు ప్రకృతి వికృతి భేదముచే దోషములు రెండువిధములు. అందు వాతప్రకృతికలవానికి వాతరోగము జనించినచో నసాధ్యము. కఫప్రకృతికలవానికి కల్గిన వాతరోగము సుఖసాధ్యము. దూష్యములగు రసరక్తాదులును, దోషములగు వాతాదులును, మనుజులయొక్క ప్రకృతికి సమానగుణములుగాక యున్నచో నావ్యాధి సుఖసాధ్య మగు నని చరకాచార్యం డిట్లు చెప్పెను:—"స చ తుల్యగుణో దూష్యో న దోషః ప్రకృతిర్భవేత్" (చరక. సూ. అ. ౧౦.)

మరియు ననుబంధ్యానుబంధముల గమనించుతరి యాశయాపకర్షముచే నను బంధత్వమును గమనించవలెను. ఆశయాపకర్షమన.—వాతము ప్రకోపమునొందినపుడు తమతమ స్థానములయం దున్న కఫపిత్తములను వానిస్థానములనుండి తొలగించి శరీర మునందెల్ల వానిని దీసికొని వ్యాపించుతరి అచ్చటచ్చట పిత్తకఫములకు సంబంధించిన పోటు నొప్పి మంట మున్నగు నుపద్రవములు కల్గును. ఇచ్చట వాతము స్వస్థానమున ప్రకోపము లేకుండును. తక్కినదోషములను బలాత్కారముగ దీసికొని స్థానాంతర మునకు పోవుటచే బాధలు కల్గినవిగాని పిత్తాదులు ప్రకోపించలేదు. కావున నట్టి సమయమున వాతము ప్రధానమై తక్కిన పిత్తకఫములు అనుబంధము లని యూహించు నది. అట్టియెడ వాతమునకు దగినచికిత్స జేయవలెనుగాని తక్కిన దోషములకు భ్రమసి ప్రధానచికిత్స జేయజనదు ఇది ఆశయాపకర్షము. ఈవిషయమును చరకా చార్యు డిట్లు చెప్పెను:—"ప్రకృతిస్థం యదా పిత్తం మారుతః శ్లేష్మణః క్షయే, స్థానా దాదాయ గాత్రేషు యత్ర యత్ర ప్రసర్పతి, తదా భేదశ్చ దాహశ్చ తత్ర తత్రానవ స్థితః; గాత్ర దేశే భవత్యస్య శ్రమో దౌర్బల్యమేవ చ" (చరక. సూ. అ. ౧౭) ప్రకోపించినదోషము స్వస్థానమున నుండు దోషమును బలాత్కారముగ తొలగించి వ్యాపింపజేయుట యాశయాపకర్ష మని భావము.

మరియు వాతాదిదోషములకు గతివిశేషమున గల్గు భేదముల గమనించుట ముఖ్యమైనది. చరకాచార్యుడు దోషములగతిభేదమును ఇట్లు చెప్పెను:—"క్షయః స్థానం చ వృద్ధిశ్చ దోషాణాం త్రివిధాగతిః. ఊర్ధ్వంచాధశ్చ తిర్యక్చవిజ్ఞేయా త్రివి ధాపరా, త్రివిధాచాపరాకోష్ఠశాఖామర్మాస్థిసంధిషు" (చరక. సూ. అ. ౧౭) వాతాది దోషములయొక్క, గతులు క్షయము, స్థానము, వృద్ధియు నని మూడు విధములు. అందు క్షయ మన తగ్గియుండుట, వృద్ధిక్షయములు లేక తమతమస్థానములయంద యుండుట స్థానము, అధికముగ వృద్ధినందుట వృద్ధి. మరియు నవి శరీరమున పైకిని క్రిందికిని అడ్డముగను వ్యాపించునవి మూడు గతిభేదములు. శాఖల (రక్తాదులు త్వక్కులు) యందును, కోష్ఠమునందును, మర్మములయొక్కయు, అస్థులయొక్కయు, సంధులయందును సంచరించుగతిభేదములు మూడు. ఇత్తెరంగున వాతాదిదోషముల గతి భేదములు తొమ్మిదివిధముల నుండును. అట్టి గతిభేదములబట్టి చికిత్స భిన్నభిన్నముగ నుండును. కావున వాని గతిభేదముల గమనించుట యావశ్యకము. వీనికి ప్రత్యేక ప్రయోజనము ఆయాచికిత్సాప్రకరణముల విపులముగ నుండును గాన నిచ్చట విడువం బడును.

పై జెప్పబడిన రోగహేతువుయొక్క భేదములను, దోషములయొక్క భేదములను సంగ్రహముగ నొక్కెడ దెలియుటకై ప్రాచీనులు సంగ్రహశ్లోకముల నిట్లు చెప్పిరి:—

"చత్వారో దూర నికట ప్రాధానికత్వా త్పున స్తేఽసాత్మ్యేన్ద్రియార్థయోగః పరిణామ ప్రజ్ఞాపరాధా త్త్రిధా. రుగ్దోషోభయకారణాదపి తథా, ద్వౌ - వ్యఞ్జకోత్పాదకౌ బాహ్యాభ్యన్తరభేదతోఽపి కథితాః హేతోః ప్రభేదా అమీ. దోషస్య చ ప్రాకృతవైకృతాభ్యాం భేదోఽనుబన్ధ్యాదపి చానుబన్ధాత్, తథా ప్రకృత్యప్రకృతిత్వయోగా త్తథాశయాకర్షవశాద్గతేశ్చ." వ్యాధికి ఉత్పత్తికారణమైన హేతువు వ్యభిచారి, సన్నికృష్టము, విప్రకృష్టము, ప్రాధానికము నని నాల్గుభేదములు తొలుత జెప్పబడినవి. పిదప నసాత్మ్యేన్ద్రియార్థసంయోగము, ప్రజ్ఞాపరాధము, పరిణామము నని మూడుభేదములును; వ్యాధికిని, దోషమునకును, వ్యాధిదోషముల రెంటికిని కారణము లగుటంజేసి మూడుభేదంబులును, వ్యంజక, ఉత్పాదకము లను రెండు భేదంబులును బాహ్యాభ్యంతరభేదములచే రెండువిధంబులును చెప్పబడినవి. ఇత్తెరంగున నన్నియు కలిపి హేతువుయొక్క భేదములు పదునాల్గుతెరంగులు.

దోషములు ప్రాకృతవైకృతభేదములచే రెండువిధములును, అనుబన్ధ్య - అనుబన్ధ భేదములచే రెండుతెరంగులును ప్రకృతి వికృతిభేదములచే రెండుతెరంగులును, ఆశయాపకర్ష భేదం బొక్కటియు; చరకమున జెప్పిన గతిభేదములచే తొమ్మిది విధంబులును, అన్నియు కలిసి పదునారుభేదములు కల్గియుండును. (ఇదియ నిదాన లక్షణవివరణము.)

## పూర్వరూపలక్షణము

ప్రాగ్రూపం యేన లక్ష్యతే. 5
ఉత్పిత్సురామయో దోషవిశేషేణాఽనధిష్ఠితః,
లింగమవ్యక్తమల్పత్వాద్వ్యాధీనాం తద్యథాయథమ్. 6

వ్యాధి జనించుటకు తగిన మిథ్యాహారాదికారణములు గల్గియుండుటంజేసి రాను సిద్ధముగ నున్న రోగము దోషవిశేషలక్షణములు వ్యాపించకుండునపుడు, అట్టి రానున్నరోగమును తెలియపరచు శ్రమము, ఆలస్యము, అరతి మున్నగు లక్షణములు, అప్పుడు రానున్న వ్యాధికి పూర్వరూప మనంబడును. (దోషములచే పూర్తిగ వ్యాప్తి జెందక తనయొక్కలక్షణములు కొంచెముగ నుండు వ్యాధి ప్రారంభదశను దెలుపు లక్షణములు పూర్వరూప మనుట) అట్టి పూర్వరూపము రానున్నవ్యాధి బలిష్ఠముగా నుండుటంజేసి, అట్టివ్యాధికి సూక్ష్మమై స్ఫుటముగానుండు లక్షణమైయుండును. అయ్యది ఆయావ్యాధికి సంబంధించి వేరువేరుగనుండును. ఆయావ్యాధి సూక్ష్మలక్షణములబట్టి రానున్నవ్యాధి ఇయ్యది యని తెలియ వలనుపడుటకై పూర్వరూపము జెప్పబడినది.

అట్టి పూర్వరూపము సామాన్యమనియు విశేషమనియు రెండు తెరంగులు. రోగములు జనించుటకు మున్ను దోషములు రసాదులం జేరి వ్యాపించునపుడు వాతాదులకు సంబంధించిన లక్షణములుగాక జ్వరాదులకు సాధారణములైన శ్రమము, అరతి, ఆలస్యము మున్నగునవి సామాన్యపూర్వరూపము. అయ్యది "శ్రమోఽరతి ర్వివర్ణ త్వం" ఇది మున్నగు వాక్యములచే జెప్పబడినది.

మరియు జ్వరాదిరోగములు కల్గుటకుముందు రానున్న వ్యాధికి వాతాదిసంబంధములచే గల్గులక్షణములను మిగుల సూక్ష్మముగ దెలుపునది విశేషపూర్వరూపము. అయ్యది, "జృంభాత్యర్థం సమీరణాత్; పిత్తాన్నయనయోర్దాహః, కఫాదన్నారుచి స్తథా" ఇవి మున్నగువాక్యములచే జ్వరాదిప్రకరణములయందు మూలముననే స్ఫుటమగును.

వ్యాధి జనించుటకు సిద్ధముగ నున్నదనియు, రానున్న వ్యాధి యియ్యది యనియు సామాన్యముగ దెలుపునట్టి శ్రమము ఆలస్యము మున్నగునవి సామాన్యపూర్వరూప మనియు రానున్న వ్యాధియొక్క స్వభావమును, దానికింగల వాతాదిసంబంధ విశేషమును దెలుపునట్టి (కండ్లుమంట, అన్నారుచి, ఆవలింతలు మున్నగు) విశేషలక్షణములు విశేషపూర్వరూప మనియు నిర్ణయము. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"వ్యాధేర్జాతిర్బుభూషా చ పూర్వరూపేణ లక్ష్యతే, భావః కిమాత్మకత్వం చ లక్ష్యతే లక్షణేన హి."

## రూపలక్షణము

తదేవ వ్యక్తతాం యాతం రూపమిత్యభిధీయతే,
సంస్థానం వ్యఞ్జనం లిఙ్గం లక్షణం చిహ్నమాకృతిః. ౭

పైజెప్పబడిన పూర్వరూపము అవ్యక్తముగ గాక స్ఫుటముగ గానవచ్చినచో నయ్యది రూప మనంబడు. అయ్యది సంస్థానము, వ్యంజనము, లింగము, లక్షణము, చిహ్నము, ఆకృతియు నను పర్యాయశబ్దములచే నీ యాయుర్వేదతంత్రములయందు వ్యవహరింపబడును. వాతాదిజ్వరములను అస్ఫుటముగ దెలియంజేయులక్షణములు పూర్వరూప మనియు అట్టి వాతాదిసంబంధభేదముతో గూడిన జ్వరమును స్ఫుటముగ దెల్పు లక్షణములు రూప మనియు నీ రెంటికిని భేదము నెరుంగునది. మరియు రాబోవు వ్యాధిని దెల్పునది పూర్వరూపము. వ్యాపించిన వ్యాధిస్వరూపమును స్ఫుటముగ దెల్పునది రూపము నని కొందరాచార్యులు చెప్పిరి. ఎట్టులన—"ఉత్పన్నవ్యాధిబోధకమేవ లింగం రూపమ్" అను వాక్యమున చెప్పిరి.

పూర్వరూపమును జెప్పినపిదప, పూర్ణముగ లక్షణములతో గూడి జనించిన వ్యాధిస్వరూపలక్షణముల దెల్పు రూపమును జెప్పుటకుమున్ను వ్యాధిసంభవించు క్రమమును దెలుపు సంప్రాప్తిని చెప్పుట సమంజసము, అయినను వ్యాధిస్వరూపము పూర్తిగ దెలియుటకై రూపమును జెప్పెను.

## ఉపశయలక్షణము

హేతువ్యాధివిపర్యస్త విపర్యస్తార్థకారిణామ్,
ఔషధాన్నవిహారాణాం ఉపయోగం సుఖావహమ్. ౮
విద్యాదుపశయం వ్యాధేః సహి సాత్మ్యమితి స్మృతః,

ఆయావ్యాధికి జెప్పినహేతువునకు, వ్యాధికి హేతువ్యాధులకు రెండిటికిని విరుద్ధములై శరీరమునకు వ్యాధియొక్క శమనరూపమై సుఖమును గల్గించు ఔషధములయొక్కయు, అన్నములయొక్కయు, విహారములయొక్కయు నుపయోగము ఉపశయమనంబడును. మరియు అట్టిహేతువునకైనను, వ్యాధికినైనను, హేతువ్యాధుల రెండిటికైనను విపరీతములు గాకున్నను, విపరీతముల నుపయోగించినప్పుడు కల్గునట్టివ్యాధి శమనరూపకార్యమునుచేయు ఔషధములయొక్కయు, అన్నములయొక్కయు, విహారములయొక్కయు, శరీరమునకు సుఖకరమైన యుపయోగముగూడ నుపశయమనబడును ఇదియే సాత్మ్య మనియు జెప్పనగును.

ఈ సాత్మ్యలక్షణమునే ఇతరతంత్రకారు లిట్లు చెప్పిరి:—"దేశానామామయానాం చ విపరీతగుణం గుణైః సాత్మ్యమిచ్ఛన్తిసాత్మ్యజ్ఞాః చేష్టితం చాద్యమేవచ" జంగలాదిదేశములకును, జ్వరాదిరోగములకును విరుద్ధంబులైన గుణములుకల ఔషధములు, అన్నములు, విహారములు మున్నగునవి క్రమముగ దేశసాత్మ్యములనియు, వ్యాధిసాత్మ్యములనియు వచించెదరు.

పైజెప్పిన యుపశయలక్షణము నిట్లు విశదముగ నెరుంగునది:—వ్యాధిజనకంబులగు హేతువులకైనను, జ్వరాదిరోగములకైనను, ఈ రెంటికైనను విరుద్ధములగు గుణములు కల్గిన ఔషధములనైనను, అన్నములనైనను, విహారములనైనను ఉపయోగించుట ఉపశయము. అట్టి హేతు, వ్యాధి, హేతువ్యాధులు అను నీమూడిటికి విపరీతగుణములు కాకున్నను విపరీతగుణములు గలవానివలె వ్యాధినివృత్తిరూప కార్యము కల్గించు ఔషధ-అన్న-విహారముల నుపయోగించుట ఉపశయ మనబడును. అట్టి యుపయోగము వ్యాధి నివృత్తిరూపమైన సుఖమును గల్గించునదిగ నుండవలెను అని ముఖ్యభావము.


మరియు తంత్రాంతరమున "సుఖానుబన్ధో యో హేతుః వ్యాధ్యాదివిపరీతకః, దేశాదికశ్చోపశయః జ్ఞేయోఽనుపశయోఽన్యథా" అని చెప్పబడినది గాన నిచ్చట

“ఔషధాన్నవిహారాణాం” అనుపదము దేశకాలాదులకును ఉపలక్షణము. సుఖావహ మనుచోట వ్యాధిశమనరూపమగు సుఖమును గల్గించునది యని యర్థము. కావున జ్వరము మున్నగురోగములయందు ఒడలిమంటపుట్టియున్నపుడు చల్లనినీళ్లలో స్నానము చేయుట మున్నగునవి. తత్కాలమున మంటనణచి సుఖముకల్గించినను, అయ్యది వ్యాధిని వృద్ధి నొందించును కావున నది సాత్మ్య మనదగదు.

పైజెప్పిన వివరణముచేత నిట్లు నిర్ణయింపబడును—ఔషధ-అన్న-విహారములు, మూడును హేతువిపరీతము, వ్యాధివిపరీతము, హేతువ్యాధివిపరీతము, హేతువిపరీతార్థకారి, వ్యాధివిపరీతార్థకారి, హేతువ్యాధివిపరీతార్థకారియు నని ఒక్కొకటి యారేసి విధము లగును.

పైజెప్పినరీతిగ నుపశయము పదునెనిమిదివిధముల నుండును. వానివివరణము నీ క్రింది పటమున చూచునది:—

ఉపశయము




* ఔ-ఔషధము, ఆ-ఆహారము, వి-విహారము.

ఈ పదునెనిమిదిటికి నీక్రింద వరుసగ నుదాహరణములు చూపఁబడినవి:—

1. హేతువిపరీతౌషధము
2. హేతువిపరీతాహారము
3. హేతువిపరీతవిహారము
4. వ్యాధివిపరీతౌషధము
5. వ్యాధివిపరీతాహారము
6. వ్యాధివిపరీతవిహారము
7. హేతువ్యాధివిపరీతౌషధము
8. హేతువ్యాధివిపరీతాహారము
9. హేతువ్యాధివిపరీతవిహారము
10. హేతువిపరీతార్థకరౌషధము
11. హేతువిపరీతార్థకరాహారము
12. హేతువిపరీతార్థకరవిహారము
13. వ్యాధివిపరీతార్థకరౌషధము
14. వ్యాధివిపరీతార్థకరాహారము
15. వ్యాధివిపరీతార్థకరవిహారము
16. హేతువ్యాధివిపరీతార్థకరౌషధము
17. హేతువ్యాధివిపరీతార్థకరాహారము
18. హేతువ్యాధివిపరీతార్థకరవిహారము

అందు హేతువిపరీతములు:- శీతకఫములచే జనించిన జ్వరాదిరోగములయందు శీతకఫములకు విరుద్ధంబులగు నుష్ణగుణముకల శుంఠి మున్నగువాని సేవించుట హేతువిపరీతౌషధము. శ్రమముచే కల్గిన జ్వరమునందు శ్రమహరంబైన మాంసరసముతో గూడిన యన్నమును భుజించుట హేతువిపరీతాన్నము. పగలు నిద్రించుటచే గల్గిన రోగమునందు రాత్రి నిదుర మేల్కొంచుటయు, రాత్రి నిదుర మేల్కొనుటచే గల్గిన రోగమున పగలు నిదురించుటయు హేతువిపరీతములైన విహారములు. (ఇవి హేతువిపరీతములగు ఔషధ-అన్న-విహారములు.)

వ్యాధివిపరీతములు:-అతిసారమునకు చిరుబొద్దియు, విషమునకు దిరిసనంబును, కుష్ఠవ్యాధికి చండ్రయు వ్యాధివిపరీతములగు నౌషధములు. (ఈ యౌషధములు దోషములను లక్ష్యపెట్టక తమ ప్రభావమువలన వ్యాధిని నివర్తింపజేయును.) అతిసారమున స్తంభనకరములగు చిరుసెనగల నుపయోగించుట, వ్యాధి విపరీతమగు నన్నము. ఉదావర్తవ్యాధియందు ముక్కుట వ్యాధివిపరీతవిహారము. (ఇవి వ్యాధి విపరీతములగు ఔషధ-అన్న-విహారములు.)

హేతువ్యాధులకు విపరీతములు:—వాతమున జనించిన శోషరోగమునందు వాతశోషముల రెంటిని హరించు గుణములుగల దశమూలములు హేతువ్యాధి విపరీతమగు నౌషధము. వాతకఫములచే జనించిన గ్రహణీరోగమునందు మజ్జిగ నుపయోగించుట హేతువ్యాధులకు విపరీతమగునాహారము. స్నిగ్ధపదార్థముల సేవించుటచేతను, పగలు నిదురించుటచేతను, కల్గిన తంద్రయందు రాత్రి నిదుర మేల్కొంచియుండుట హేతువ్యాధులకు రెంటికిని విపరీతమైనవిహారము. మరియు "జ్వరేష్వేవాతిసారే చ యవాగూస్సర్వదా హితా" అను సుశ్రుతవాక్యమునుబట్టి యవాగువు (గంజి) జ్వరమునకు హితము. ఆయ్యది వాతజ్వరమున నుపయోగించిన నుష్ణవీర్యముచే వాతమును, ప్రభావముచే జ్వరమును హరించును కావున నయ్యది హేతువ్యాధులు రెంటికిని విపరీతమైనయన్నము. (ఇవి హేతువ్యాధులకు రెంటికిని విపరీతములైన ఔషధ-అన్న-విహారములు.)

హేతువిపరీతార్థకములు:—పిత్తమును ప్రధానముగ జేసి పుట్టిన వ్రణశోఫమున పాకావస్థ నున్న వ్రణశోఫమునకు పిత్తమును వృద్ధినొందించు నుష్ణవీర్యద్రవ్యములజేర్చి కట్టుగట్టుట హేతువిపరీతార్థకరమగు నౌషధము. పిత్తవ్రణమునందు విదాహకరములైన యన్నాదుల భుజించుట హేతువిపరీతార్థకరమగునన్నము. వాతమున జనించిన యున్మాదమున వాతమును వృద్ధినొందించు భయమును జూపుట హేతువిపరీతార్థకమగు విహారము. (ఇచ్చట పిత్తమునకల్గిన వ్రణమునందు, పిత్తవర్ధకములగు నౌషధాన్నవిహారముల నుపయోగించినను, హేతువైనపిత్తమును శమింపజేయుకార్యమును గల్గించును; కావున హేతువిపరీతార్థకరము లని యెరుంగునది.)ఇత్తెరంగుననే వ్యాధివిపరీతార్థకరములయందు గూడ నూహించునది. (ఇవి హేతువిపరీతార్థకరములగు ఔషధ-అన్న-విహారములు )

వ్యాధివిపరీతార్థకరములు:-అజీర్ణమున వమనములగునపుడు వమనములు గల్గించు మ్రంగకాయ నుపయోగించుట వ్యాధివిపరీతార్థకరమగు నౌషధము. విరేచనములగునపుడు పాలుద్రాగుట వ్యాధివిపరీతార్థకరాహారము. వమనములగునపుడు అజీర్ణరసమును వెడలించుటకై, వ్రేళ్లచే పెల్లగించి వమనములుచేయుట వ్యాధి విపరీతార్థకరమగు విహారము. (ఇవి వ్యాధివిపరీతార్థకరములగు ఔషధ-అన్న-విహారములు )

హేతువ్యాధులకు విపరీతార్థకరములు:—నిప్పున కాలిన వ్రణమునకు ఉష్ణగుణప్రధానములగు అగరు మున్నగునౌషధములను పట్టువేసి యుపయోగించుట ఉష్ణగుణము కల నిప్పునకును, దానగల్గిన వ్రణమునకును సమానగుణమైనను, ఆరెంటికి విపరీతార్థకర మగు నౌషధము. విషమునకు విషము నుపయోగించుట కూడ హేతువ్యాధులకు విపరీతార్థకరౌషధ మగును. మద్యపానమున జనించిన మదాత్యయమునందు మద్యము నాహారముజేయుట హేతువ్యాధి విపరీతార్థకరాన్నమగును. నీటియం దీదుటచే కల్గిన సమ్మూఢవాతమునందు నీటియందీదగొట్టుట హేతువ్యాధులకు విపరీతార్థకరమగు విహారము. (ఇవి హేతువ్యాధివిపరీతార్థకరములగు ఔషధ-అన్న-విహారములు.)

ఇచ్చట వమనాదులయందు మ్రంగకాయ మున్నగునవి హేతువ్యాధుల కనుగుణములుగ నుండుటచే వ్యాధిని వృద్ధినొందించవలసియున్నను, ఔషధాదులప్రభావముచేత హేత్వాదులకు విరుద్ధముగ వ్యాధిశమనరూపమైన కార్యమును కల్గించునని యెరుంగునది. ఇట్టియుపశయము వ్యాధిలక్షణములు స్ఫుటముగ గానమింజేసి వాతాది సంబంధమును నిర్ణయింప వలనుపడకుండుతరి హేత్వాదివిపరీతములగు ఔషధాన్నవిహారాదుల నుపయోగించినచో దానినా వ్యాధి శమించినయెడ అట్టివ్యాధి వాతికము పైత్తికము నని నిర్ణయింప వలనుపడును. కావున నీయుపశయము గూఢలింగవ్యాధిని నిర్ణయింప సాధనమగును. ఎట్లు లన—ఒకవ్యాధి జనించినది. అయ్యది పిత్తమున

గల్గినదియా? వాతమున గల్గినదియా? యని సందేహముగ నున్నప్పుడు పిత్తహరము లైన యౌషధాదుల నుపయోగించునది. అప్పుడు ఆవ్యాధి వృద్ధినొందక శమించినచో నియ్యది పైత్తిక మని నిర్ణయించునది. ఇదియ ప్రయోజనము. ఈ విషయమునే చరకాచార్యం డిట్లు చెప్పెను:—"గూఢలిఙ్గం వ్యాధిముపశయానుపశయాభ్యాం పరీక్షేత" అనుపశయమునగూడ పైజెప్పినవిధముగ నూహించునది.

## అనుపశయలక్షణము

విపరీతోఽనుపశయో వ్యాధ్యసాత్మ్యాభిసంజ్ఞితః. 9

పైజెప్పినరీతిగ హేతువ్యాధులకు విపరీతంబులును, విపరీతార్థకరంబులునగు ఔషధాదుల నుపయోగించునపుడు వ్యాధి శమించక వృద్ధినొంది శరీరమునకు కష్టమును గల్గించినయెడ నాయౌషధాదులు అనుపశయ మని చెప్పబడును. ఇదియే వ్యాధికి అసాత్మ్య మనియుం చెప్పనగును.

ఉపశయమునకు విరుద్ధమగునది అనుపశయము కావున నిదియు నుపశయము ననే గతార్థ మని తలచి వేరుగ లెక్కిడబడదయ్యె; కావున "విజ్ఞానం పఞ్చధాస్మృతి" మను పరిగణనము సంగతమగును.

## సంప్రాప్తిలక్షణము

యథా దుష్టేన దోషేణ యథా చానువిసర్పతా,
నిర్వృత్తిరామయస్యాసౌ సమ్ప్రాప్తిర్జాతిరాగతిః. 10

జ్వరాదిప్రకరణములయందు జెప్పినరీతిగ నాయాపద్ధతి ననుసరించి మిథ్యాహారాదులచే దుష్టమై (ప్రకోపమొంది) శరీరమునందలి యామాశయాది స్థానముల (ఆయాదోషమునకు జెప్పియుండుప్రకారము) వ్యాపించిన వాతాదులచేత, రోగమునకు జెప్పిన లక్షణములు సంపూర్ణములుగ గల్గి, రోగము సంభవించుట సంప్రాప్తి యనబడును. ఇయ్యది జాతి, ఆగతి యను శబ్దములచేగూడ నీయాయుర్వేదమునందు జెప్పంబడును.

దీని కుదాహరణము:-మిథ్యాహారాదులచేత వాతాదిదోషములు ప్రకోపము నంది యామాశయమున జేరి రసధాతువుతోఁగూడి శరీరమున నుండు కాయాగ్నిని వెడలించును. ఆకాయాగ్ని బైలువెడలి శరీరముపై వ్యాపించి శరీరమునంతెల్ల వేడిమి బుట్టించును. దానంజేసి రోమరంధ్రములన్నియు నడ్డగింపబడి చెమ్మట పట్టక శరీరమున సంతాపంబును అవయవములన్నిటియందు నొప్పియు కల్గును. పైజెప్పిన లక్షణములన్నియు సమకాలమున గల్గిన నయ్యది జ్వర మనబడును. ఇచ్చట దుష్టము లైన వాతాదులు పైజెప్పినరీతిగ నామాశయమున వ్యాపించి కోష్ఠాగ్నిని వెడలిం

ద్రోసినప్పుడు పైజెప్పిన సంతాపాదులు సమకాలమున గల్గి శరీరమున వేడి వ్యాపించుటయే జ్వరసంప్రాప్తి యని యెరుంగునది. ఈ సంప్రాప్తి జ్వరప్రకరణమున నిట్లు చెప్పబడినది:-"మిథ్యాహారవిహారాభ్యాం దోషా హ్యామాశయాశ్రయాః, బహిర్నిరస్య కోష్ఠాగ్నిం జ్వరదాస్స్యూరసానుగాః, స్వేదావరోధస్సంతాపస్సర్వాఙ్గగ్రహణం తథా, యుగపద్యత్ర రోగేచ స జ్వరో వ్యపదిశ్యతే." ఇత్తెరంగుననే తక్కిన వ్యాధులకెల్ల నాయాప్రకరణమున సంప్రాప్తి నెరుంగునది.

### సంప్రాప్తి భేదములు

సంఖ్యావికల్పప్రాధాన్యబలకాలవిశేషతః,
సా భిద్యతే యథాత్రైవ వక్ష్యన్తేఽష్టౌ జ్వరా ఇతి. 11

పైజెప్పబడిన సంప్రాప్తి, సంఖ్య, వికల్పము, ప్రాధాన్యము, బలము, కాలము అను నైదిటియొక్క విశేషమువలన ననేకవిధములుగ భేదము గల్గియుండును. అందు సంఖ్యావిశేషము జ్వరప్రకరణమున నీగ్రంథమునందే 'అష్టౌజ్వరాః' అని చెప్పబడినది.

అదియెట్టులన-"జ్వరోఽష్టధా పృథగ్ద్వన్ద్వసంఘాతాగంతుజస్స్మృతః" అని జ్వరముయొక్కసంఖ్య నిర్దేశింపబడినది. వాత-పిత్త-కఫములచే వేర్వేరుగను, రెండేసి దోషముల సంసర్గముచేతను, సన్నిపాతముచేతను, ఆగంతు కారణములచేతను గల్గుటం జేసి యెనిమిది విధములగును. ఇచ్చట వాతికాదిజ్వరముల సంప్రాప్తియు వేరు వేరుగ నుండును. అందు వాత జ్వరసంప్రాప్తియందు వణకు, గొంతెండుట, నిదురబట్టకుండుట, గాత్రస్తంభము మున్నగులక్షణములతో గూడి వాతజ్వరము వ్యాపించును. ఇదియ వాత జ్వరసంప్రాప్తి. ఇత్తెరంగుననే పిత్తాదిజ్వరములసంప్రాప్తి వేరు వేరుగ నుండును. ఇత్తెరంగుననే "పఞ్చ కాసాః, పఞ్చ శ్వాసాః, అష్టౌ గుల్మాః, అష్టావుదరాణి" ఇవి మున్నగు స్థలములయందు ఆయాసంఖ్యనుబట్టి వానిసంప్రాప్తియు ననేకవిధముల నుండును.

### వికల్పలక్షణము

దోషాణాం సమవేతానాం వికల్పోఽంశాంశకల్పనా,

ఆయావ్యాధులకు సంబంధించి చేరియుండు వాతాదిదోషములకు అవి చేయునట్టి కార్యములచేత వానికి స్వాభావికములగు రూక్షాదిగుణముల విభజించి నిర్ణయించుటయే వికల్ప మనబడును.

ఎట్టులన—వాతమునకు రూక్షత్వము, లాఘవము, శైత్యము, కాఠిన్యము, సూక్ష్మత్వము ననుగుణములు స్వభావసిద్ధములు. వాతము ప్రకోపించునపుడు పైజెప్పిన గుణములలో నొకగుణము వృద్ధినొందియైనను, రెండు మూడుగుణములు వృద్ధినొంది యైనను, అన్నియు సమకాలమున వృద్ధినొందియైనను ప్రకోపించును. అట్టిసమయమున వాతముచేయు పనులలో నేగుణమునకు సంబంధించిన కృత్యముల జేయునో ఆట్టికృత్య

ములబట్టి యియ్యది రూక్షగుణమునకు సంబంధించిన యుపద్రవమును గల్గించుచున్నది; కావున రూక్షగుణము వృద్ధినొంది వాతము ప్రకోపించినది యనియు, రెండు మూడు గుణముల కృత్యములు గనబడినపుడు ఆయాగుణములచే వృద్ధినొందినది యనియు, వాతమునకు సంబంధించిన గుణములనుబట్టి విభజించుట వికల్పమని నిష్కృష్టార్థము. అందు ఏయేగుణము లధికములై వాతము ప్రకోపించి జ్వరాదుల గల్గించునో ఆయా గుణములకు సంబంధించిన లక్షణములతోఁగూడి రోగము వ్యాపించును, గాన నట్టి యంశకల్పనముచేత సంప్రాప్తికిగూడ భేదము కల్గు నని భావము. గుణములలోఁ గొన్ని మాత్రము వృద్ధినొందుటకు దానికి నిదానమైన యాహారాదివస్తువుల గుణములు కారణము లగును.

కాషాయరసమున వాతమునకు జెప్పిన రూక్షశీతలఘుత్వాదిగుణము లన్నియు కలవు. కావున కషాయరసమును సేవించినపుడు రూక్షాదిగుణము లన్నిటిచే వాతము ప్రకోపము నొందును. ఇత్తెరంగుననే తక్కినవి యూహింపదగును. పిత్తాదులకు గూడ నిట్టులే యంశకల్పనము జేయందగును.

పైజెప్పిన విషయమును సుశ్రుతుం డిట్లు చెప్పెను:-"సర్వైర్భావై స్త్రిభిర్వాపి ద్వాభ్యామేకేన వా పునః, సంసర్గే కుపితః క్రుద్ధం దోషం దోషోఽనుధావతి." (సుశ్రుత. సూ. అ. ౨౧) ఆయావ్యాధులయందు వాతాదిదోషములు చేరినపుడు అన్నిగుణములచేతనైనను లేక ఒకటి-రెండు-మూడు గుణములచేనైనను ప్రకోపించిన దోషముననుసరించి తక్కినదోషము లుండు నని భావము.

### ప్రాధాన్యలక్షణము

స్వాతన్త్ర్యపారతన్త్ర్యాభ్యాం వ్యాధేః ప్రాధాన్యమాదిశేత్. 12

జ్వరాదిరోగములయందు నితరవ్యాధులు చేరియున్నపుడు అందు ప్రధానం బెద్ది? అప్రధానం బెద్ది? యను నాశంక కల్గినయెడ స్వతంత్రముగ నుండు వ్యాధి ప్రధానం బనియు, స్వతంత్రము కాక ప్రధానవ్యాధి ననుసరించి యుండునది యప్రధాన మనియు నెఱుంగునది.

వ్యాధి సంభవించునపుడు అనేకవ్యాధులు నాక్రమించును. అపుడు స్వతంత్ర పరతంత్రలక్షణములబట్టి స్వతంత్రమును నిర్ణయించి అది ప్రధానమనియు, వాని నాశ్రయించి పరతంత్రముగ నుండునది యప్రధాన మనియు నెరుంగునది. ఈభేదమునుబట్టి సంప్రాప్తిగూడ భిన్నముగ నుండును. అందు ప్రధానవ్యాధి అనుబంధ్య మనియు, అప్రధాన మనుబంధ మనియు జెప్పనగును. ప్రధానవ్యాధి నెరింగి దానికిదగిన చికిత్స జేసినచో నప్రధానమగువ్యాధియు, ప్రధానముతోఁగూడ శమించును. అప్రధానమునకు వేరుగ చికిత్స జేయ నవసరములేదు. ఈసౌకర్యమునకే దీని నరయుట యావశ్యకము.

ఇచ్చట ప్రధానమును జెప్పినచో దానికి విరుద్ధమైన యప్రధానము గూడ జెప్పినట్లగును గాన ఉద్దేశస్థలమున "సంఖ్యావికల్పప్రాధాన్యబలకాలవిశేషతః" అని ప్రాధాన్యము మాత్రము నిర్దేశింపబడినది.

### బలాబలలక్షణము

హేత్వాదికార్త్స్న్యావయవైః బలాఽబలవిశేషణమ్,

వ్యాధిజనించుటకు ఆయావ్యాధిననుసరించి చెప్పబడినహేతువు పూర్వరూపములు, రూపము, ఉపశయము అనువానియొక్క సంపూర్ణలక్షణములను కొన్నిటిని బట్టి వ్యాధియొక్కబలమును, బలహీనతను ఎరుంగునది. ఆయావ్యాధికి జెప్పినకారణము లన్నిటిచే వ్యాధికల్గినయెడ వ్యాధి బలిష్ఠం బనియు, కొన్ని కారణములచే మాత్రము కల్గినయెడ వ్యాధి బలహీన మనియు నెరుంగునది. ఇత్తెరంగుననే ఆయా వ్యాధికి జెప్పియుండు పూర్వరూపరూపలక్షణములన్నియు గాన్పించి వ్యాధిపుట్టిన నయ్యది బలవత్తర మనియు, అందు కొన్ని మాత్రము గానవచ్చినయెడ స్వల్పబలం బనియు నెరుంగునది. సంతర్పణమునకు జెప్పినవానిని పూర్తిగ నుపయోగించుటచే వ్యాధి శమించినయెడ వ్యాధి బలిష్ఠ మనియు, కొన్నిటిచేతనే వ్యాధి శమించిన వ్యాధి బలహీనం బనియు నుపశయముచే గూడ నెరుంగునది.

వ్యాధి సంభవించుసమయమున పైజెప్పిన హేత్వాదుల బలాబలమునుబట్టి సంప్రాప్తి గూడ భిన్నముగ నుండును గాన, సంప్రాప్తినిబట్టి వ్యాధుల బలాబలమును నిర్ణయించునది.

### కాలనిర్ణయము

నక్తం దినర్తుభుక్తాంశైః వ్యాధికాలో యథామలమ్. 13

రాత్రి పగలు, వసంతాదిఋతువులు భోజనసమయము అను కాలముల యొక్క భాగముల ననుసరించి వాతాదిదోషముల కాలమును విభజించి ఆయా వ్యాధులకాలములను నిర్ణయించునది.

వాగ్భటాచార్యుండు వాతాదులకు కాలముల నిట్లు చెప్పెను:—"వయోఽహోరాత్రిభుక్తానాం తేఽన్తమధ్యాదిగాః క్రమాత్" (అ. హృ. సూ. అ. ౧) మనుజులకు నిర్ణీతమైనవయస్సు, పవలు, రాత్రి, భోజనసమయము అనువానియొక్క అంతమునను, మధ్యమునను, ఆదియందును క్రమముగ వాత-పిత్త-కఫములు మూడును వృద్ధినొందును. (పైజెప్పిన వయస్సు, పగలు, రాత్రి భోజనసమయములను ఒక్కొక దానిని మూడుభాగములు జేయ, అందు అంతభాగమున వాతంబును, మధ్యభాగమున పిత్తంబును, ఆదిభాగమున కఫంబును బలముగ నుండు నని భావము.) ఈవాక్యము ననుసరించి రాత్రిని, పగటిని, భోజనసమయమును మూడుభాగములుగ నొక్కొక

దానిని భాగింప నందు అంతభాగమున జ్వరము వ్యాపించినయెడల వాతజ్వర సంప్రాప్తి యనియు, మధ్యభాగమున సంభవించినయెడ పిత్తజ్వరసంప్రాప్తి యనియు, ప్రథమకాలమున సంభవించుయెడ కఫజ్వరసంప్రాప్తి యనియు నూహించునది.

మరియు "వర్షా శరద్వసన్తేషు వాతాద్యైః ప్రాకృతః క్రమాత్" అను వచనప్రకారము వర్షాకాలమున వాతంబును, శరత్కాలమున పిత్తంబును, వసంత కాలమున కఫంబును ప్రబలములుగ నుండును. కావున వర్షఋతువున బుట్టిన వ్యాధి వాతిక మనియు, శరత్కాలమున బుట్టినది పైత్తిక మనియు, వసంతకాలమున బుట్టినది కఫజ మనియు, వాని సంప్రాప్తినిబట్టి యెరుంగనగును. ఇత్తెరంగున కాల భేదమునుబట్టియు సంప్రాప్తి భేదము కల్గు నని భావము.

ఇతి ప్రోక్తో నిదానార్థః తద్వ్యాసేనోపదేక్ష్యతే,

ఇత్తెరంగున నిదానపదముయొక్క అర్థము సంగ్రహరూపముగ వివరింపబడి నది. అయ్యది జ్వరాదిరోగముల ప్రకరణములయందు సవిస్తరముగ దెలుపబడును.

(ఇచ్చట సకలరోగములకును సామాన్యముగ నిదానము చెప్పబడెను. దానిని మరల నాయారోగప్రకరణములయందు ఆయారోగముల ననుసరించి విస్తరముగ దెలుపబడు నని భావము.)

## నిదానవిశేషము

సర్వేషామేవ రోగాణాం నిదానం కుపితా మలాః, 14
తత్ప్రకోపస్య తు ప్రోక్తం వివిధాఽహితసేవనమ్,

మనుజులకు సంభవించు సకలరోగములకును ప్రకోపమునొందిన వాత-పిత్త-కఫములు ప్రధానముగ కారణము లై యుండును. అట్టిదోషములు ప్రకోపించుటకు పథ్యములుకాని నానావిధములైన యాహారవిహారాదుల సేవించుట కారణమగును.

ఈవిషయమును సుశ్రుతాచార్యుం డిట్లు చెప్పెను:—*"నాస్తి రోగో వినా దోషైః యస్మాత్తస్మాద్విచక్షణః, అనుక్తమపి దోషాణాం లిఙ్గైర్వ్యాధిముపాచరేత్" (సుశ్రుత. సూ. అ. 35) వాతాదిదోషసంబంధములేక రోగ మొక్కటియైన పుట్టబోదు; కావున కొన్నిరోగములకు వాతాదిభేదములబట్టి లక్షణముల జెప్ప కున్నను, ఆ రోగములకు తత్కాలమున నుండు లక్షణములబట్టి దోషముల నిర్ణ యించి ఆయాదోషములు శాంతినొందునట్లు చికిత్స చేయునది.

* మధుకోశమున నీశ్లోకము చరకుడు చెప్పె నని వ్రాసెను. కాని సుశ్రుత మునం దీశ్లోకము కానబడియెడిని.

మరియు నాగంతుకారణము లగు అభిఘాతాదులచే నాకస్మికముగ గల్గిన రోగములయందు రోగములు జనించునపుడు ఆక్షణమున దోషసంబంధము లేకున్నను పిదప వాతాదులు ప్రకుపితములై వానికి సంబంధించిన యుపద్రవముల గల్గించును. ఎట్టులన-కత్తిచే నరికినపుడు ఆగంతుకవ్రణము కల్గును. నరుకు సమయమున దోషసంబంధము లేక యున్నను, ఉత్తరక్షణమున వాతాదులు ప్రకోపించి పోటు నొప్పిమున్నగు నుపద్రవముల గల్గించు నని భావము. ఈవిషయమునే చరకాచార్యు లిట్లు చెప్పిరి:— "ఆగన్తుర్హి *వ్యథాపూర్వసముత్పన్నో జఘన్యం వాతపిత్తశ్లేష్మణాం వైషమ్యమాపాదయతి." (చరక. సూ. అ. ౨౦)

మరియు వాతాది ప్రకోపకారణములు అనంతములు. కావునవానిని నిర్ణయించి చెప్ప నేరికిని శక్యముకాదు. అట్టికారణములను సామాన్యముగ వాగ్భటాచార్యుడు నిదానస్థానమున సంగ్రహముగ నిట్లు చెప్పెను:—'తిక్తోషణకషాయాల్పరూక్షప్రమితభోజనైః, ధారణోదీరణనిశాజాగరాత్యుచ్చభాషణైః, క్రియాతియోగభీశోకచింతావ్యాయామమైథునైః గ్రీష్మాహోరాత్రిభుక్తాన్తే ప్రకుప్యతి సమీరణః. పిత్తం కట్వమ్లతీక్ష్ణోష్ణ పటుక్రోధవిదాహిభిః, శరన్మధ్యాహ్న రాత్ర్యర్ధవిదాహ సమయేషు చ. స్వాద్వమ్లలవణ స్నిగ్ధ గుర్వభిష్యందిశీతలైః, ఆస్యాస్వప్నసుఖాజీర్ణదివాస్వప్నాఽతిబృంహణైః, ప్రచ్ఛర్దనాద్యయోగేన భుక్తమాత్రవసంతయోః, పూర్వాహ్ణే పూర్వరాత్రేచ శ్లేష్మా ద్వన్ద్వస్తు సంకరాత్, మిశ్రీభావాత్సమస్తానాం సన్నిపాతస్తథా పునః" (అ. హృ. ని. అ. ౧. శ్లో. ౧౪-౧౯) చేదు, కారము, వగరు అను నీరసములు గలపదార్థముల భుజించినను, మిక్కిలి కొంచెముగ భుజించినను, జిడ్డులేని పదార్థములు తిన్నను నియతమగుకాలము నతిక్రమించి భుజించినను, మలమూత్రాదులు వెడలుచున్నపుడు వానివేగమును నిరోధించినను, వానివేగము లేకుండునపుడు బలాత్కారముగ వాని వెడలించినను, రాత్రులయందు నిదుర మేల్కొంచినను, మిక్కిలి బిగ్గరగ మాట్లాడినను, వమనము, విరేచనము మున్నగు పంచకర్మములను వానివానికి నియతమైన ప్రమాణము నతిక్రమించి అధికముగజేసికొన్నను, భయపడినను, దుఃఖించినను, మనస్సున మిక్కిలి చింతించినను, దేహపరిశ్రమము నధికముగజేసినను, బలమును అతిక్రమించి సంభోగము జేసినను, ఇట్టికారణములచేత వాతము ప్రకోపము నొందును. మరియు గ్రీష్మకాలమునందును, పగటిచివర (మూడవ) భాగమునను, రాత్రి మూడవభాగమునను, భుజించిన యాహారము జీర్ణమైనకాలమునందును వాతము ప్రకోపము నొందును. కారము, పులుపు అను

* వ్యథాపూర్వః సముత్పన్నః = వ్యథాపూర్వసముత్పన్నః వ్యథాపూర్వా యస్య = వ్యథాపూర్వః. అని వ్యుత్పత్తి తెలియదగును.

రెండురసములు గలపదార్థములను భుజించినను, తీక్ష్ణగుణముగల ఆహారము మున్నగు వానిని ఉష్ణగుణముకల పదార్థములను భుజించినను, ఉప్పుకలపదార్థములను భుజించినను, పిత్తము ప్రకోపము నొందును. మరియు కోపపడినను, మంటబుట్టించు పదార్థములు తిన్నను, శరత్కాలమునందును, మధ్యాహ్నకాలమునందును, అర్ధరాత్రి కాలమునందును మిక్కిలి సంతాపము కల్గిన సమయములయందును పిత్తము ప్రకోపించును. తీపి, పులుపు, ఉప్పు అను రసములు కల పదార్థములనైనను, మిక్కిలి జిడ్డుగల పదార్థములనైనను స్రోతస్సులయందు ద్రవమును బుట్టించు పదార్థములనైనను, శీతలపదార్థములనైనను భుజించినను; విశేషముగ కూర్చుండియున్నను, ఎక్కువగా నిద్రబోవుచున్నను, భుజించినయాహారము జీర్ణము గాకున్నను, పగటియందు నిదురించినను, శరీరమును మిక్కిలి బలియజేయు పదార్థములు భుజించినను, వమనాదిక్రియలను వానివానికి నియమితమగుకాలమున జేసికొనకున్నను కఫము ప్రకోపించును. మరియు భోజనమున కుత్తరక్షణమునను, వసంతకాలమునందును, పగలు మొదటి (మూడవ) భాగమునందును, రాత్రి మొదటి (మూడవ) భాగమునందునుకూడ కఫము ప్రకోపించును. పైజెప్పిన యాహారవిహారాదులు మూడుదోషములకు జెప్పినవి సంకరముగ సేవింపబడిన యెడ రెండేసిదోషములు ప్రకోపమును నొందును. అన్నింటిని సంకరముగ సేవించుటచేత నన్నియు ప్రకోపము నొందును. ఇత్తెరంగున సామాన్యముగ త్రిదోషములయొక్క ప్రకోపకారణములు తెలియగునది.

## చరకోక్తనిదానము

నిదానార్థకరో రోగో రోగస్యాప్యుపజాయతే. 15
తద్యథా జ్వరసన్తాపాద్రక్తపిత్తముదీర్యతే,
రక్తపిత్తాజ్జ్వరః, తాభ్యాం శోషశ్చాప్యుపజాయతే. 16
ప్లీహాభివృద్ధ్యా జఠరం జఠరాచ్ఛోథ ఏవ చ,
అర్శోభ్యో జాఠరం దుఃఖం గుల్మశ్చాప్యుపజాయతే. 17
(దివాస్వాపాదిదోషైశ్చ ప్రతిశ్యాయశ్చ జాయతే,)
ప్రతిశ్యాయాదథో కాసః కాసాత్సఞ్జాయతే క్షయః,
క్షయో రోగస్య హేతుత్వే శోషస్యాప్యుపజాయతే. 18

ఒకసమయమున స్వకారణములగు మిథ్యాహారవిహారాదులచే గల్గినరోగము ఇంకొకరోగమును నిదానమువలె గల్గించును. అది యెట్లనగా:—జ్వరసంతాపము వలన రక్తపిత్తము కల్గును. రక్తపిత్తమువలన నొకవేళ జ్వరము కూడ కల్గును. ఆరెండిటిచేత శోషంబును కల్గును. ప్లీహము వృద్ధినొంది మహోదరమును కల్గించును.

ఉదరము వలన శోథము (వాపు) సంభవించును. అర్శోరోగముచేత జఠరము (ఉదరము) కల్గును. గుల్మముకూడ కల్గును. పగలు నిదురించుట మున్నగు కారణములచే గల్గిన పీనసము (పడిసెము) వలన కాసవ్యాధి కల్గును. కాసమువలన క్షయము కల్గును. అయ్యది శోషమునకు హేతువగును. (ఇది చరకమున జెప్పిననిదానము. మాధవకరుఁడు దానిని తన గ్రంథమున ననువదించి చెప్పె నని యెరుంగునది.)

రోగము రోగాంతరమును కల్గించు క్రమము

తే పూర్వం కేవలా రోగాః పశ్చాద్ధేత్వర్థకారిణః,
కశ్చిద్ధి రోగో రోగస్య హేతుర్భూత్వా ప్రశామ్యతి. 19
న ప్రశామ్యతి చాప్యన్యః హేతుత్వం కురుతేఽపి చ,
ఏవం కృచ్ఛ్రతమా నృణాం దృశ్యన్తే వ్యాధిసఙ్కరాః. 20
తస్మాద్యత్నేన సద్వైద్యైః ఇచ్ఛద్భిస్సిద్ధిముద్ధతామ్,
జ్ఞాతవ్యో వక్ష్యతే యోఽయం జ్వరాదీనాం వినిశ్చయః. 21

పైజెప్పబడినవిధముగ ఒకరోగము మరియొకరోగమును గల్గించునపుడు, తొలుత నారోగములు స్వతంత్రములుగ జనించి బాధించునపుడు వానికి దగిన చికిత్స చేయక యుపేక్షించినయెడ నవి బలిష్ఠములై యితరరోగములను గల్గించును. అట్టియెడ నారోగములు రోగహేతువుబోలి యుండును. అందు నొకరోగము మరియొకరోగమును గల్గించి తనకుతానే శమించును. మరియొకరోగము ఇంకొకరోగమునకు హేతువుగనుండి రోగమును కల్గించియు నంతట శమించక రెండవరోగముతో గలిసి బాధించుచుండును. ఇత్తెరంగున మనుజులకు వ్యాధులసాంకర్యము మిక్కిలి కష్టములు గల్గించుచుండును. ఇట్టి సంకరవ్యాధులు పలుతెరంగుల లోకమున గానంబడుచున్నవి. కావున వ్యాధినివృత్తిరూప మైన కార్యసిద్ధిని గోరు సద్వైద్యులు మిక్కిలి సూక్ష్మమైనబుద్ధిచేత పైన జ్వరాదిప్రకరణములయందు జెప్పంబడు రోగనిశ్చయనును గుర్తెరింగి ఆయావ్యాధుల గమనించి ప్రతివిధానముచేయుట ముఖ్యము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే పఞ్చలక్షణనిదానం సమాప్తమ్.

# ౨. జ్వర నిదానమ్

అవతారిక:— పైప్రకరణమున పఞ్చలక్షణనిదానము వివరింపబడినది. పఞ్చలక్షణ మనగా నిదాన - పూర్వరూప - ఉపశయ - సంప్రాప్తులయొక్క లక్షణములు. అయ్యవి జ్వరాదిరోగములయం దన్నిటియందును సామాన్యములు. ఈ విషయమునే వాగ్భటాచార్యులు "అథాతస్సర్వరోగనిదానం వ్యాఖ్యాస్యామః" అని నిదానారంభమున చెప్పెను. నిదానపూర్వరూపాదులు ఐదును సర్వరోగసామాన్యముగ నుండుటంజేసియే పంచలక్షణనిదాన మనుదానిని సర్వరోగనిదాన మని వాగ్భటాచార్యులు వ్యవహరించెను. మరికొంద రాచార్యులు సర్వరోగవిజ్ఞానీయ మనియును దీనిని వ్యవహరించిరి. ఎవ రెట్లు చెప్పినను సకలరోగములను గుర్తించుటకు ప్రధానములగు పూర్వరూపాదుల లక్షణములను తెల్పునది యను నర్థము సమానము. కావున, అట్టి సర్వరోగములకు వ్యాప్తమైన పఞ్చలక్షణనిదానమును నుడివినపిదప ఆయా రోగలక్షణములను ప్రత్యేకముగ వివరించుట యావశ్యకము. అందును జ్వరము ప్రధాన మగుటంజేసి జ్వరనిదానము తొలుదొలుత వివరింపబడును. ఇయ్యది సకలమానవులకును పుట్టుక మొదలు ఏవ్యాధి రానున్నను తొలుత ప్రాయికముగ వ్యాపించును. దేహము, ఇంద్రియములు, మనస్సు మున్నగువానిని తపింపజేసి వ్యాపించునది. జన్మమరణములయందు నియతముగ సంభవించునది. ఇంతియేకాక ఇయ్యది మనుజకోటికి మాత్రమేకాక సృష్టికి లోనైన స్థిరచరములకన్నిటికిని సంభవించు నని చరకాచార్యులు ఉపదేశించియున్నారు.

మరియు గ్రంథాంతరమున నీజ్వరము జంతుభేదముచే నామాంతరమున పేర్కొనంబడియున్నది. అందు ఏనుగులకు పాకల మనియు, గుఱ్ఱముల కభితాపం బనియు, ఆవుల కీశ్వర మనియు, ఎనుబోతులకు హారిద్రం బనియు, మేకలకును గొఱియలకును ప్రలాప మనియు, ఒంటెలకు అలసం బనియు, జింకలకు మృగరోగం బనియు, పక్షుల కభిఘాతం బనియు, చేపల కింద్రమదం బనియు, పాముల కతిక మనియు, నీటికి నీలిక మనియు, పతంగంబులకు పక్షహాతం బనియు, వృక్షజాతికి కోటరము (తొఱ్ఱ) అనియు, భూమికి ఊషరం బనియు, మనుజసామాన్యమునకు జ్వరం బనియు నామభేదముచే వ్యవహరించిరి. ఐనను వ్యాధి స్వరూపమున భేదము గానరాదు. ఇట్టి కారణములచేత జ్వరము తక్కిన రోగముల కన్నిటికిని ప్రధానం బని యార్షమత సిద్ధాంతము.

## జ్వరముయొక్క ప్రాగుత్పత్తియు, భేదంబులును

దక్షాపమానసంక్రుద్ధరుద్రనిశ్వాససమ్భవః,
జ్వరోఽష్టధా పృథగ్ద్వంద్వసంఘాతాగంతుజస్స్మృతః. 1

దక్షప్రజాపతిచేసిన యవమానముచేత కోపోద్దీపితు డగు రుద్రునియొక్క క్రూరమైన నిట్టూరుపువలన జ్వరము మొట్టమొదట పుట్టినది. అయ్యది మిథ్యాహార విహారములంజేసి ప్రకోపమునొందిన వాతపిత్తశ్లేష్మములలో నొక్కొకదానిచేతను రెండేసిదోషములచేతను, దోషములనన్నింటిచేతను, అభిఘాతము మున్నగు నాగంతు కారణములచేతను జనించుటంజేసి యెనిమిదితెరంగు లగును. అందు వాతప్రకోపమున జనించినజ్వరము వాతిక మనియు, పిత్తమున జనించినది పైత్తిక మనియు, కఫమున జనించినది శ్లైష్మిక మనియు, వాతపిత్తముల రెండిటిచే గల్గినది వాతపిత్తజ్వర మనియు, వాతకఫముల జనించినది వాతకఫజ్వర మనియు, పిత్తకఫముల జనించినది పిత్తకఫజ్వర మనియు, త్రిదోషములు నొక్కుమ్మడి ప్రకోపించుటచే గల్గినది సాన్నిపాతిక మనియు, ఆయుధములు మున్నగువాని దెబ్బచే గల్గినది యాగంతు కారణముల జనించుటంజేసి యాగంతుజ మనియు నెనిమిదిభేదముల నెరుంగునది.

ఇచ్చట దక్షప్రజాపతి యీశ్వరుని పిలువకయే యాగము సేయంబూన నప్పరమేశ్వరుం డట్టియవమానమున ప్రకోపమునంది దక్షునియాగమును ధ్వంసము చేసినపు డుద్భవించిన రుద్రకోపము జ్వరరూపముగ పరిణమించిన దను పౌరాణిక గాథ ననుసంధించునది.

రుద్రకోపము జ్వరమునకు మొట్టమొదట పుట్టుటకు కారణమగుటంజేసి అది విప్రకృష్టకారణము. వాతాదిదోషములు తాత్కాలికజ్వరమునకు కారణములుగాన సన్నికృష్టకారణములు. రుద్రకోపమున జనించుటంజేసి జ్వరము కేవలము తేజోరూపము. "పిత్తమగ్నిరితి స్మృతః" అని యుండుటంజేసి పిత్తము ఆగ్నేయముగాన జ్వరము లన్నిటియందును ప్రధానముగ నుండును. కావున జ్వరసామాన్యముగ చికిత్సజేయుతరి పిత్తములు ప్రకోపింపజేయక యితరదోషముల హరించు చికిత్సజేయుట సమంజసము. ఈవిషయమును వాగ్భటాచార్యుడు "ఊష్మా పిత్తాదృతే నాస్తి జ్వరో నాస్త్యూష్మణా వినా, తస్మాత్పిత్తావిరుద్ధాని త్యజేత్పిత్తాధికేఽధికమ్." (అ. హృ. చి. అ. ౧) అని చెప్పెను. పిత్తప్రకోపములేక వేడికలుగబోదు. వేడిలేక జ్వరము జనించుట లేదు. కావున పిత్తమునకు విరుద్ధములగు నౌషధాదులను జ్వరసామాన్యమున విడువవలె ననియు, అందును పిత్తాధికజ్వరమునందు విశేషముగ విడువవలె ననియు భావము. ఈ

యభిప్రాయముచేతనే తరుణ (ఆరంభదశనుండు) జ్వరమున నగ్నిదీప్తి కలిగి పాచనము గల్గుటకై కట్వమ్లలవణములు పాచకములైనను పిత్తవర్ధకము లగుటంజేసి వానిని విడిచి పిత్తహారమగు తిక్తరసమునే ప్రధానముగ చరకాచార్యులు నిర్దేశించెను.

మఱియు "జ్వరస్తు పూజనైర్వాపి సహసైవోపశామ్యతి" అని విదేహుడు చెప్పియుండుటచే జ్వరము రుద్రకోపసంభవమగుటంజేసి దైవస్వరూపముగ భావించి పూజన సల్పినచో శీఘ్రముగ శమించు ననియు విదేహప్రభృతులు నుడివిరి. *జ్వరము మూడు పాదములను, మూడు శిరంబులును, ఆరు భుజంబులును, తొంబది కన్నులను గల్గి, భస్మము నాయుధముగ ధరించి, లయకాలరుద్రుని యమునిబోలె క్రూరాకారమై యుండునని హరివంశమున జెప్పబడియున్నది. గాశ్వరునకును బాణాసురునకు యుద్ధము జరుగు నవసరమున నీశ్వరకోపజనిత మగు జ్వరము యుద్ధం బొనర్చినట్లుగ "మహేశ్వరో వైష్ణవశ్చ యుయుధాతే జ్వరావుభౌ", అని భాగవతమున నున్నది. ఇవి మున్నగువాక్యములచే జ్వరము దేవతాత్మక మనియు, రూపవంత మనియు స్ఫుటముగ దేలుచున్నయది.

## —— జ్వరసంప్రాప్తి ——

మిథ్యాహారవిహారాభ్యాం దోషాహ్యామాశయాశ్రయాః,
బహిర్నిరస్య కోష్ఠాగ్నిం జ్వరదాస్స్యూ రసానుగాః. 2

జాంగలాదిదేశము, రాత్రి పవలు మున్నగుకాలము, దేహప్రకృతి, శరీరము యొక్కయు జాఠరాగ్నియొక్కయు బలము, వయస్సు మున్నగువాని ననుసరించి, యాహారవిహారాదులు చరకమునందలి స్వస్థవృత్తప్రకరణమున ఋతుచర్యాధ్యాయము, అన్నపానరక్షాధ్యాయము మున్నగుచోట్ల వివరింపబడియున్నవి. అట్టినియమమునకు విరుద్ధములగు నాహారవిహారాచారాదులు మిథ్యాహారాదు లనబడును. అట్టి మిథ్యాహారవిహారాచారాదులచే వాతపిత్తకఫములు ప్రకోపమునంది యామాశయమున జేరి కోష్ఠాగ్నిని బయటద్రోసి రసధాతువుతో గలిసి జ్వరమును గల్గించును. దోషప్రకోపముచే బయలువెడలిన జాఠరానలోష్మము శరీరముపై వ్యాపించి జ్వరరూపముగ బరిణమించును. అట్టి యగ్నిసంబంధముచేత శరీరమునంతటను వేడి యుత్పన్నమగును. జాఠరానలము వెలువడుటంజేసి భుజింపబడిన యాహారపదార్థము జీర్ణింపదు. 'రసానుగాః' అనుట చేత రసధాతువు (ఆహారము జీర్ణించినపిదప దాని సారరూపమైన మొదటిధాతువు)ను చెరచి జ్వరమును గల్గించు నని భావము.

---

* "త్రిపాద్భస్మప్రహరణ స్త్రిశిరా రక్తలోచనః, స మే ప్రీతస్సుఖం దద్యా త్సర్వామయపతిర్జ్వరః." అను మంత్ర మీవిషయమును స్ఫుటపరచును.

ఇచ్చట జ్వరము కల్గుటకు వాత-పిత్త-కఫములు దోషము లనియు, రసధాతువు దూష్య మనియు దోషదూష్యవిభాగము నెరుంగునది.

## జ్వరసామాన్యలక్షణము

స్వేదావరోధస్సన్తాపస్సర్వాఙ్గగ్రహణం తథా,
యుగపద్యత్ర రోగే చ స జ్వరో వ్యపదిశ్యతే. 3

చెమట వెడలకుండుట, దేహమునందంతటను వేడి యధికముగ నుండుట, చక్షురాదీంద్రియములకును, మనస్సుకును తాపము గల్గుట. శరీరమునందంతట పట్టినట్లు నొప్పి కల్గుట. ఈలక్షణములన్నియు సమకాలమున కలిగెనేని అయ్యది జ్వరమని ముఖ్యముగ వ్యవహరింపబడును. (పైలక్షణములన్నియు జ్వరమున సంభవించుట) వాతము ప్రకుపిత్తమై చెమటవెడలు రంధ్రముల నన్నిటిని నిరోధించుటంజేసి జ్వరము వ్యాపించినపుడు చెమట బైట వెడలకుండు నని భావము.

## జ్వరసామాన్యపూర్వరూపము

శ్రమోఽరతిర్వివర్ణత్వం వైరస్యం నయనప్లవః.
ఇచ్ఛాద్వేషౌ ముహుశ్చాపి శీతవాతాతపాదిషు. 4
జృమ్భాఙ్గమర్దో గురుతా రోమహర్షోఽరుచిస్తమః,
అప్రహర్షశ్చ శీతఞ్చభవత్యుత్పత్స్యతి జ్వరే. 5
సామాన్యతః.

శరీరము బడలియుండుట, మనస్సు చంచలమై అన్నివిషయములందును ఆసక్తి లేకుండుట, దేహము మామూలుగ నుండురంగు మారి క్రొత్తరంగు కల్గియుండుట, నోటికి మధురాదిరసములు మామూలుగ దెలియకుండుట, కన్నులయందు నీరుగారుట, శీతోపచారములయందును, గాలియందును, ఎండ మున్నగువానియందును మాటిమాటికి ఇష్టము ద్వేషము మారిమారి యుండుట, ఒడలివిరుపులు, ఆవలింతలు కల్గుట, ఒడలి నొప్పులుగల్గి బరువుగ నుండుట, శరీరమునందు రోమములు నిట్రబొడిచియుండుట, నోటరుచి లేకుండుట, కన్నులు చీకటిగ్రమ్మినట్లు కనబడకుండుట, మనసు కుత్సాహము లేకుండుట, ఉండియుండి చలిగల్గుట ఈలక్షణములన్నియు జ్వరముగల్గుటకు మున్ను గాన్పించును. పైజెప్పిన యెనిమిదివిధములగు జ్వరము లన్నిటియందును సామాన్యముగ గనిపించును కావున ఇది జ్వరమునకు సామాన్య పూర్వరూపము.

## జ్వరవిశేషపూర్వరూపములు

విశేషాత్తు జృమ్భాత్యర్థం సమీరణాత్,
పిత్తాన్నయనయోర్దాహః, కఫాదన్నారుచిర్భవేత్. 6

రూపైరన్యతరాభ్యాన్తు సంసృష్టైర్ద్వన్ద్వజం విదుః,
సర్వలిఙ్గసమావాయస్సర్వదోషప్రకోపజే. 7

వాతజ్వరము కల్గుటకు పూర్వము (పైజెప్పబడిన సామాన్యరూపములు కనబడుటయకాక) యొడలివిరుపులు ఆవలింతలు విశేషముగ కల్గును. పిత్తజ్వరమున కన్నులు విశేషముగ మండును. నీరు అధికముగ వెడలును. కఫజ్వరమున నాహారపదార్థముల యందు రుచిపుట్టదు. వాతపిత్త వాతకఫ పిత్తకఫసంసర్గమున గల్గిన ద్వంద్వజ్వరముల యందు ఆయాదోషములకు ప్రత్యేకముగ జెప్పిన రెండేసి పూర్వరూపములు మిశ్రముగ గన్పించును. త్రిదోషప్రకోపముచే గల్గిన సన్నిపాతజ్వరమున మూడుదోషములకు ప్రత్యేకముగ జెప్పిన పూర్వరూపములన్నియు గాన్పించును.

దోషద్వయప్రకోపమున గల్గిన వాతపిత్తజ్వరము గల్గుటకు ముందు ఒడలివిరుపులును, కన్నులమంటయు విశేషముగ గల్గును. వాతకఫజ్వరమున ఒడలివిరుపును, అరోచకమును విశేషముగ గల్గును. పిత్తకఫజ్వరమున కండ్లమంటయు, అరోచకమును అధికముగ కల్గును. త్రిదోషసన్నిపాతమున జనించిన సాన్నిపాతికజ్వరమున పైజెప్పిన ఒడలివిరుపు, కండ్లమంట, అరోచకము ఈమూడును మిక్కుటముగ గాన్పించును గాని భావము.

### వాతజ్వరలక్షణము

వేపథుర్విషమో వేగః కణ్ఠౌష్ఠపరిశోషణమ్,
నిద్రానాశః క్షువస్తమ్భో గాత్రాణాం రౌక్ష్యమేవ చ. 8
శిరోహృద్గాత్రరుగ్వక్త్రవైరస్యం గాఢవిట్కతా,
శూలాధ్మానే జృమ్భణం చ భవత్యనిలజే జ్వరే. 9

శరీరము వడవడ వణకుట, జ్వరవేగము నియమములేక ఒకప్పు డధికముగను మరియొకప్పుడు తక్కువగను మారుచుండుట, గొంతుకయును పెదవులయందును తేమ్మ లేకయుండుట, నిదురబట్టకుండుట, తుమ్ములు విశేషముగ వచ్చుట, అవయవములు స్తంభించియుండుట, శరీరమున జిడ్డులేక గరగరమగు చుండుట, తల రొమ్ము తొక్కను శరీరము ఈచోట్ల నొప్పి, నోట రుచి తెలియకుండుట, మలము ప్రకాశించి గట్టిగ నుండుట, కడుపుబ్బరముతోడ గూడి నొప్పికలుగుట, ఒడలి విరుపులు ఇవి యన్నియు వాతజ్వరమున కలుగును.

కడుపులోని గుడగుడ యనుశబ్దముతోడ నొప్పికలిగి యుబ్బరించుటకు ఆధ్మానము. ఇచ్చట 'గాత్రరుక్' అనుటచేతనే శరీరమునంతట నొప్పిగల్గునని యున్నదుగు

చున్నను శిరస్సునందును హృదయమునందును అధికముగ నొప్పికల్గు నని తెలుపుటకై "శిరోహృద్గాత్రరుక్" అని ప్రత్యేకముగ గ్రహింపబడినది.

పైజెప్పినలక్షణములుగాక మరికొన్ని లక్షణములు గూడ వాతజ్వరమునందు కలుగు నని సుశ్రుతాచార్యుడు తెలిపెను. పలుదెరంగుల నొప్పులు, కాళ్లయందు తిమ్మిరి, పిక్కలనొప్పి, చెవిలో గుమ్మని ధ్వని, నోట వగరు, తొడలు చిక్కియుండుట, అంకిళ్లు పట్టుకొనియుండుట, సంధిబంధనములు సడలినట్లు బాధ, పొడిదగ్గు, వాంతి, ఒడలు జలదరించుట, బడలిక, చక్రభ్రమణమువలె ఒడలు తిరుగుట, మూత్రము నేత్రములు ఎఱ్ఱబడుట, దప్పి, అర్థములేక మాటలాడుట, ఉష్ణోపచారమును గోరుట ఇవి మున్నగు లక్షణములు వాతజ్వరమున కలుగు నని చరకంబున గానంబడియెడు. మరియు సర్వావయవములయందు పలుదెరంగులైన బాధలు; చెవులు వినబడకుండుట, మూత్రపురీషములు బైట సరళముగ వెడలక బద్ధగించియుండుట చర్మము గోళ్లు ముఖము కన్నులు మలము ఇవి స్వాభావికమైన రంగుమారి నల్లబడియుండుట, మూడున నొప్పి కలుగును. చెమటబట్టుట, ఆహారము జీర్ణము గాకుండుట ఈలక్షణములుగూడ గల్గు నని గ్రంథాంతరమున గనబడుచున్నది.

ఇచ్చట త్రిదోషములలో వాతము ప్రధానమైనది. "పిత్తం పఙ్గు కఫః పఙ్గుః పఙ్గవో మలధాతవః, వాయునా యత్ర నీయన్తే తత్ర గచ్ఛన్తి* చేతరే" అని యుండుటంజేసి పిత్తకఫములు రెండును స్వతంత్రతలేక వాత మెచ్చటికి గొనిపోయిన నచటి కేగుచుండు నని తెలియుచున్నది. వాతాదిరోగముల పరిగణనము చేయునపుడు వాతరోగంబు లెనుబది, పిత్తరోగములు నలువది, కఫరోగములు ఇరువదియు నని చరకాచార్యుడు పరిగణనము జేసియున్నాడు. పైవిషయములను పరిశీలించినచో కఫమునకన్న పిత్తము, ఈరెంటికన్న వాతము బలవత్తరమని తెలియుచున్నది గాన అట్టి తారతమ్యము ననుసరించి ఆయారోగములను వివరించుతరి తొలుత వాతికములను, పిమ్మట పైత్తికములను, కడపట శ్లైష్మికములను వరుసగాచెప్పుట యాయుర్వేదమున సమంజసపద్ధతిగా నున్నది.

### పిత్తజ్వరలక్షణము

వేగ స్తీక్ష్ణోఽతిసారశ్చ నిద్రాల్పత్వం తథా వమిః,
కణ్ఠౌష్ఠముఖనాసానాం పాకస్స్వేదశ్చ జాయతే. 10
ప్రలాపో వక్త్రకటుతా మూర్ఛా దాహో మద స్తృషా,
పీతవిణ్మూత్రనేత్రత్వం పైత్తికే భ్రమ ఏవ చ. 11

* "మేఘవత్" అని పాఠముగూడ గలదు.

జ్వరవేగము మిక్కిలి తీవ్రముగ నుండుట, పలుమరు ద్రవముగ మలము వెడలుట, నిదుర స్వల్పముగబట్టుట, పసరు వమనమగుట, కుత్తుకయందును, పెదవులయందును, నోటియందును, నాసారంధ్రములయందును పుండగుట, చెమటపట్టుట, సంబంధములేని భ్రమమాటల మాట్లాడుట, నోట చేదు గల్గుట, మతితప్పి మూర్ఛ కల్గుట, శరీరమునందెల్ల మంట, అధికముగ దప్పి, కల్లుసారాయి త్రాగినవిధముగ మత్తు గల్గియుండుట, మలము మూత్రము నేత్రములు పచ్చనైయుండుట, చక్రముబోలె శరీరము తిరుగుచున్నట్లుండుట, లేక యితరవస్తువులు తిరుగునట్లు గనబడుట, ఇవి యన్నియు పిత్తప్రకోపము గల్గిన జ్వరమున గనబడు లక్షణములు.

చరకమునందు శరీరముపై తీవ్రమైనవేడి, రక్తవర్ణముగల బొబ్బలు, చల్లని యుపచారములయందిచ్ఛగొనుట, అరుచి మున్నగులక్షణములుగూడ జెప్పబడినవి. ఇచ్చట చకారము అనుక్తసముచ్చయార్థంబు కావున పైజెప్పినలక్షణములగూడ గ్రహించును.

ఇచ్చట భ్రమము వాతరోగములలో పరిగణింపబడినదియైనను వాతసంబంధమునంజేసియే పిత్తజ్వరమునగూడ సంభవించును. "న రోగోఽప్యేకదోషజః" అను వచనాంతరముచే నొకదోషము ప్రధానముగనుండి యేర్పడిన నొకరోగము కల్గినను తక్కినదోషములు సహకారులై యుండు నని తెలియుచున్నది. కావున ప్రకృతమున పిత్తజ్వరమునందును వాతసంబంధమునంజేసి భ్రమము గల్గు నని యెరుగునది. ఇట్లేరంగుననే ఇతరదోషముల లక్షణములును ఆయారోగములయందు కనబడును. మరియును "రజఃపిత్తానిలాద్భ్రమః" (సుశ్రుత. శా. అ. ౪) అని సుశ్రుతులు చెప్పిరి గాన వాత పిత్తముల రెండిటిచేత భ్రమము కల్గు నని యెరుగునది.

## కఫజ్వరలక్షణము

స్తైమిత్యం స్తిమితో వేగః ఆలస్యం మధురాస్యతా,
శుక్లమూత్రపురీషత్వం స్తమ్భస్తృప్తిరథాపి చ. 12
(నాత్యుష్ణగాత్రతా ఛర్దిః అఙ్గసాదోఽవిపాకితా)
గౌరవం శీతముత్క్లేదో రోమహర్షోఽతినిద్రతా,
* (స్రోతోరోధో రుగల్పత్వం ప్రసేకో లవణాస్యతా,
నాత్యుష్ణగాత్రతా చ్ఛర్దిర్లాలాస్రావోఽవిపాకతా.)
ప్రతిశ్యాయో ఽరుచిః కాసః కఫజేఽక్ష్ణోశ్చ శుక్లతా. 13

మంచుచే దడిసినట్లు శరీరము మొద్దుబారియుండుట జ్వరము తీవ్రముగ వ్యాపింపక మందవేగముగ నుండుట, పనులు సేయుటయందు ప్రాలుమాలికచే సాహ

*ప్రక్షిప్తము. మధుకోశవ్యాఖ్యాకారుడు చెప్పలేదు.

లేకుండుట, నోటిలో తీపికల్గుట; మూత్రపురీషములు తెల్లనిరంగుతో వెడలుట, అవయవములు స్తంభించియుండుట, అప్పుడు భుజించినవానివలె నాహారములయం దిచ్ఛపొడమక తృప్తికల్గియుండుట, (శరీరమున వేడి కొంచెముగ నుండుట, కఫముతో గూడి వాంతియగుట, శరీరమున సంధిబంధములు శిథిలములై యుండుట, భుజించిన యాహారము జీర్ణముకాకుండుట), శరీరము బరువై యుండుట, చలిపట్టుట, ఓకిరింతలు వచ్చుట, రోమములు జలదరించుట, నిద్ర అకాలమునందును అధికముగ బట్టుట, పడిసెముపట్టుట, అరోచకము, దగ్గు, కన్నులు తెల్లగా నుండుట ఈ లక్షణములన్నియు కఫజ్వరమున కల్గును.

గ్రంథాంతరమున:—వెక్కిళ్లు, శ్వాసకాసములు, ఊర్ధ్వశ్వాసము, శరీరముపై జిల, నోట నీరూరుట, చల్లని పొక్కులు లేచుట, స్రోతస్సులు అడ్డగింపబడుట, కునికిపాటు (మైకము), హృదయమునందు జిగటగనుండుట, వేడినిగోరుట, జఠరాగ్ని మందగించియుండుట ఇవి మున్నగు లక్షణములు పేర్కొనంబడినవి. చకారమువలన వానిని గ్రహించునది.

## వాతపిత్తజ్వరలక్షణము

తృష్ణా మూర్ఛా భ్రమో దాహః స్వప్ననాశ శ్శిరోరుజా,
కణ్ఠాస్యశోషో వమథూ రోమహర్షోఽరుచి స్తమః. 14
పర్వభేదశ్చ జృమ్భా చ వాతపిత్తజ్వరాకృతిః,

దప్పి, చక్షురాదీంద్రియవ్యాపారముల మాని యొడలెరుంగకుండుట, భ్రమము (చక్రముపై నున్నవానివలె శరీరము దిరుగునట్లుండుట, లేక మతిభ్రమచేత నొకవస్తువును మరియొకవస్తువుగ గ్రహించుట), శరీరమునమంట, నిదురరాకుండుట, తలనొప్పి, కుత్తుకయు నోరును ద్రవములేక యెండుట, వాంతియగుట, రోమములు జలదరించుట, నోట అరుచి, చీకటిలో నున్నట్లు కన్నులు గానరాకుండుట, వ్రేళ్లు మొదలగువాని కణుపులయందు పగులదీయునట్లు నొప్పికల్గుట, ఒడలివిరుపులు ఈ లక్షణములన్నియు వాతపిత్తములచే గల్గిన జ్వరంబున గానంబడును.

## వాతకఫజ్వరలక్షణము

స్తైమిత్యం పర్వణాం భేద నిద్రాగౌరవమేవ చ. 15
శిరోగ్రహః ప్రతిశ్యాయః కాసస్స్వేదాప్రవర్తనమ్,
సన్తాపో మధ్యవేగశ్చ వాతశ్లేష్మజ్వరాకృతిః. 16

మంచున దడిసినరీతిగ శరీరము మొద్దుబారియుండుట, పర్వభేదము (కీళ్లనొప్పి), నిదుర అకాలమునందు నధికముగ వచ్చుట, శరీరము బరువుగ నుండుట, తల బరువై దిమ్ముపట్టియుండుట, పడిసెముచే నాసారంధ్రములు బిగిసియుండుట, దగ్గు, చెమ్మట, పట్టకుండుట, శరీరమునందెల్ల మంట, జ్వరవేగము తీవ్రముగాక మధ్యముగ నుండుట ఇవియన్నియు వాత కఫజ్వరమున కల్గును.

## పిత్తకఫజ్వరలక్షణము

లిప్తతిక్తాస్యతా తన్ద్రా మోహః కాసోఽరుచి స్తృషా,
ముహుర్దాహో ముహుశ్శీతం పిత్తశ్లేష్మజ్వరాకృతిః. 17

కఫము గ్రమ్మియుండుటంజేసి నోరు జిగటగల్గి పూయబడినట్లుండుట, చేదు గల్గియుండుట, మైకము గ్రమ్ముట, చిత్తభ్రమము గల్గుట, దగ్గు, అరోచకము, దప్పి జ్వర సంతాపంబును చలియును మార్చిమార్చి మాటిమాటికి వచ్చుట ఇవియన్నియు పిత్తకఫముల ప్రకోపమున గల్గిన జ్వరమున సంభవించును.

మరియు:—జడత, చెమట అధికముగ వెడలుట, నోట కఫంబును పిత్త పసరును వెడలుట మున్నగులక్షణములు చరకమున జెప్పంబడినవి.

## సన్నిపాతజ్వరలక్షణము

క్షణే దాహః క్షణే శీతమస్థిసన్ధిశిరోరుజా,
సాస్రావే కలుషే రక్తే నిర్భుగ్నే చాపి లోచనే. 18
సస్వనౌ సరుజౌ కర్ణౌ కణ్ఠశ్శూకైరివావృతః,
తన్ద్రా మోహః ప్రలాపశ్చ కాసశ్శ్వాసోఽరుచిర్భ్రమః. 19
పరిదగ్ధా ఖరస్పర్శా జిహ్వా స్రస్తాఙ్గతా పరమ్,
ష్ఠీవనం రక్తపిత్తస్య కఫేనోన్మిశ్రితస్య చ. 20
శిరసోలోఠనం తృష్ణా నిద్రానాశో హృది వ్యథా,
స్వేదమూత్రపురీషాణాం చిరాద్దర్శనమల్పశః. 21
కృశత్వం నాతిగాత్రాణాం ప్రతతం కణ్ఠకూజనమ్,
కోఠానాం శ్యావరక్తానాం మణ్డలానాం చ దర్శనమ్. 22
మూకత్వం స్రోతసాం పాకో గురుత్వముదరస్య చ,
చిరాత్పాకశ్చ దోషాణాం సన్నిపాతజ్వరాకృతిః. 23

వాతపిత్తకఫములు మూడును ప్రకోపించిన సన్నిపాతజ్వరమున క్షణకాలము జ్వరతాపము క్షణకాలమున చలి గల్గుచు మాటిమాటికి నొకటిమార్చి యొకటి కల్గుచుండును. ఎముకలయందును, కీళ్లయందును, శిరస్సునందును నొప్పికల్గును. కన్నులు కలకబారి యెఱ్ఱనై నీరు చొటచొట గారుచు లోనికిం బోయియుండును. చెవుల యందు అపూర్వమైన మ్రోతకల్గి పోటు పుట్టును. కుత్తుకయందు ముండ్లు గ్రుచ్చి నట్లు ససనసలాడుచుండును. కునికిపాటును, చిత్తభ్రమంబును కల్గి యసంబద్ధములుగ తన కిచ్చివచ్చినతెరంగున మాటలాడును. దగ్గు, శ్వాసము, అరుచియు కల్గును. చక్రముపై నుండువానివలె గిరగిరదిరుగున ట్లుండును. నాలుక కాలిన చందంబున చెమ్మలేక నల్లనై టేకాకుచందంబున పశ్వాదుల నాలుకబోలి కరకరలాడుచుండును. అవయవములన్నియు సడలి బిగిచెడి జారునట్లుండును. కఫమును రక్తమును కలిసిన పిత్తపసరు నోటనుమియునపుడెల్ల వెడలుచుండును. పరుండియున్నను శిరస్సును నానావిధముల ద్రిప్పుచుండును. నీళ్లు త్రాగుచున్నను దప్పి యణంగక వృద్ధియగుచుండును. నిదురపట్టదు. రొమ్ములో నొకవిధమైన నొప్పి పుట్టును. చెమటయు మూత్రపురీషంబులును బైట వెలువడవు. ఒకవేళ వెలువడినను చాలకాలమునకు కొంచెముకొంచెముగ వెడలును. శరీరమంతయు కొంచెముగ కృశించియుండును. కుత్తుకయందు బిగ్గరగ మూల్గుచుండును. నల్లనిరంగుతో కలసిన రక్తవర్ణంబులైన పొక్కులును కల్గును. మాట హీనస్వరమై మెలమెల్లగ మాటలాడును. ఒకసమయమున ఓపికలేక మూగవానివలె నేమియుం బలుకనేరకుండును. నాసారంధ్రములు చెవులు నోరు కన్నులు మున్నగు స్రోతస్సులు పుండగును. కడుపు మిక్కిలి స్థూలమై బరువుగ నుండును. వాతాదిదోషములు చిరకాలమునకు పరిపాకమునంది యథాపూర్వముగ నుండును. ఇట్టి లక్షణములన్నియు కల్గినది సన్నిపాతికజ్వర మని యెరుంగునది.

పైజెప్పినది సన్నిపాతజ్వరమునకు సామాన్యలక్షణములు. వాగ్భటాచార్యుడు కొన్నిలక్షణముల నధికముగా చెప్పియున్నాడు. ఎట్టు లనః—"తద్వచ్ఛీతం మహానిద్రా దివా జాగరణం నిశి, సదా వా నైవ వా నిద్రా మహాస్వేదోఽతి నైవ వా. గీతనర్తనహాస్యాది వికృతేహాప్రవర్తనమ్" (అ. హృ. ని. అ. ౨) చలి యధికముగా గలుగుట, పగటిపూట ఆపుటకు సాధ్యముగాక గాఢముగ నిదురవచ్చుట, రాత్రిపూట ఎంత ప్రయత్నపడినను ఇంచుకైనను నిదురపట్టకుండుట, రాత్రిపగలు అని నియమములేక నిరంతరముగ అధికముగ నిదురవచ్చుట, లేక నిదుర బొత్తుగ రాకుండుట, శరీరమున చెమట అధికముగ పట్టుట, లేక కొంచెమైనను చెమట పట్టకుండుట, సంబంధములేక తన కిచ్చవచ్చినట్లు సంగీతము పాడుచు నాట్యమాడుచు

వికారముగ నవ్వుచుండుట, మామూలు పద్ధతి నుండక విరుద్ధమైన చేష్టలు చేయుచుండుట, ఈలక్షణము లధికముగా వాగ్భటమున జెప్పంబడియె. పైలక్షణము లన్నియు త్రిదోషములు స్వప్రమాణమునకన్న నధికముగా వృద్ధినొంది ప్రకుపితములైన త్రిదోషములచే గలిగిన సన్నిపాతజ్వరమునందు కల్గు నని చరకాచార్యుడు నిర్ణయించెను.

మరియు సన్నిపాతజ్వరములయందు త్రిదోషములు ప్రకోపమునొందుట సాజము. అందు ఒక్కదోషమైనను, లేక రెండుదోషములైనను అధికముగా ప్రకోపించిన సన్నిపాతజ్వరములయందు కొన్నిలక్షణములు విశేషములుగ గానంబడును. దాన గల్గు సన్నిపాతజ్వరభేదములు పదిరెండువిధములై యుండును. వాని లక్షణములను చరకాచార్యులు విపులముగ నిట్లు వివరించిరి:—"భ్రమః పిపాసా దాహశ్చ గౌరవం శిరసోఽతిరుక్, వాతపిత్తోల్బణే విద్యాల్లింగం మందకఫే జ్వరే. శైత్యం కాసోఽరుచిస్తంద్రా పిపాసా దాహరుగ్వ్యథాః, వాతశ్లేష్మోల్బణే వ్యాధౌ లింగం పిత్తావరే విదుః. ఛర్దిశ్శైత్యమ్ముహుర్దాహస్తృష్ణా మోహోఽస్థివేదనా, మందవాతే వ్యవస్యంతి లిఙ్గం పిత్తకఫోల్బణే. సన్ధ్యస్థిశిరసాం శూలం ప్రలాపో గౌరవం భ్రమః, వాతోల్బణే స్యాద్ద్వ్యనుగే తృష్ణా కంఠాస్యశుష్కతా. రక్తవిణ్మూత్రతా దాహః స్వేద స్తృష్ణా బలక్షయః, మూర్ఛా చేతి త్రిదోషే స్యాల్లింగం పిత్తే గరీయసి. ఆలస్యారుచిహృల్లాసదాహవమ్యరతిభ్రమైః, కఫోల్బణం సన్నిపాతం తన్ద్రాకాసేన చాదిశేత్. ప్రతిశ్యాయశ్ఛర్దిరాలస్యం తన్ద్రాఽరుచ్యగ్నిమార్దవమ్, హీనవాతే పిత్తమధ్యే లింగం శ్లేష్మాధికే మతమ్. హారిద్రమూత్రనేత్రత్వం దాహస్తృష్ణా భ్రమోఽరుచిః, హీనవాతే మధ్యకఫే లింగం పిత్తాధికే మతమ్. శిరోరుగ్వేపథుశ్శ్వాసప్రలాపచ్ఛర్ద్యరోచకాః, హీనపిత్తే మధ్యకఫే లింగం వాతాధికే మతమ్. శీతతా గౌరవం తన్ద్రా ప్రలాపోఽస్థిశిరోఽతిరుక్, హీనపిత్తే వాతమధ్యే లిఙ్గం శ్లేష్మాధికే విదుః. వర్చోభేదోఽగ్నిదౌర్బల్యం తృష్ణా దాహోఽరుచిర్భ్రమః, కఫహీనే వాతమధ్యే లిఙ్గం పిత్తాధికే విదుః. శ్వాసః కాసః ప్రతిశ్యాయః ముఖశోషోఽతిపార్శ్వరుక్, కఫహీనే పిత్తమధ్యే లిఙ్గం వాతాధికే మతమ్." (చ. చి. అ. 3. శ్లో. ౯౧—౧౦౨)

1. త్రిదోషములు ప్రకుపితములై సన్నిపాతజ్వరము కల్గునని పైజెప్పబడినది. అందు దోషత్రయములో న్యూనాధికముగకూడ నొకసమయమున ప్రకోపము నొందును. అం దొకదోషము అధికముగను, తక్కిన రెండును దానికన్న తక్కువగను ప్రకోపము నొందినయెడల ఏకోల్బణ మనియు, రెండుదోషములు అధికముగ ప్రకోపించినపుడు ద్వ్యుల్బణ మనియు ప్రాచీనాచార్యులు నిర్ణయించిరి. ఆయుర్వేది

వాతాదిపరస్పర సంసర్గభేదముచేత పండ్రెండుగ నేర్పడును. వానిలో వాతపిత్త ములు రెండును అధికముగ ప్రకోపమునొంది కఫము వానికన్న తక్కువగ నుండు నపుడు కలిగిన జ్వరమున తిరుగుచున్న చక్రముపై నుండువానివలె ఒడలు తిరుగు నట్లుండును, దప్పి యధికమగును. శరీరమనస్సులకు తాప మధికమగును. తల మిక్కిలి బరువై యోరువరాని నొప్పి కలుగును.

2. వాతశ్లేష్మములు రెండు నధికమై పిత్తము తక్కువగా నుండునపుడు చలి వచ్చును. దగ్గు, అరోచకము, కునికిపాటు, అధికమైనదప్పి, సంతాపము, రొమ్మునొప్పి ఈ లక్షణములు కలుగును.

3. వాతము తక్కువయై పిత్తకఫములు రెండును ఎక్కుడుగా నుండు జ్వర మునం దధికముగ వాంతియగును. చలి, జ్వరము ఈ రెండును మార్చి మార్చి పలుమారు వచ్చుచుండును. దప్పి యధికమగును. చిత్తభ్రమము కలుగును. ఎముకల యందు నొప్పి పోట్లు మున్నగు బాధలు కలుగును.

4. వాతమధికమై పిత్తకఫములు రెండును తక్కువగా నుండు జ్వరమున కీళ్లయందును, అస్థులయందును, శిరస్సునందును నొప్పికలుగును. సంబంధము లేక మాట లాడును. శరీరము బరువుగా నుండును. శరీరము తిరుగునట్లుండును. దప్పి యధికమగును. నోరు, కంఠము, పెదవులు చెమ్మలేన యుండును.

5. పిత్తమధికమయి వాతకఫములు రెండును తగ్గియున్న జ్వరమునందు మల మూత్రములు ఎఱ్ఱనగును, శరీరతాపం బధికమగును. అధికముగ చెమట వెడలును. దప్పియు నధికమగును, శరీరబలము నశించును. మూర్ఛ కలుగును.

6. కఫమధికమయి వాతపిత్తములు తగ్గియున్న జ్వరమున పనులయందు ఉత్సాహము తగ్గును. అరోచకము, ఓకిరింతలు, అధికమైనతాపము, వాంతి, అన్ని విషయములయం దిచ్ఛలేకయుండుట, మతిభ్రమము, మైకము, దగ్గు ఇవి యన్నియు కలుగును.

7. వాతము హీనమై పిత్తము మధ్యమమై, కఫం బధికమైయున్న జ్వరమున, ప్రబలమైన పడిసెముపట్టును. వాంతి యధికమగును. పనులయం దుత్సాహము లేకుండును. మైగ్రమ్మను అరోచకము గల్గును. జఠరాగ్ని మందగించును.

8. వాతము హీనమై కఫము మధ్యమమై పిత్తమధికమైయుండు జ్వరమున, మలమూత్రనేత్రములు పసుపురంగు కలిగియుండును. తాపంబును దప్పియు నధిక మగును. చిత్తభ్రమము గలుగును. ఆహారపదార్థములయందు రుచి తప్పిపోవును.

9. పిత్తము హీనమై కఫము మధ్యమమై వాతం బుత్కటముగ నున్న జ్వరమున అధికముగ తలనొచ్చును, శరీరము వడకును. శ్వాసం బధికమగును. భ్రమ మాటలు మాటలాడును. వాంతియు నరోచకంబును కలుగును.

10. పిత్తము హీనమై వాతము మధ్యమమై కఫంబధికముగ నున్న జ్వరమున చలిపట్టును. శరీరము బరువుగా నుండును. నిదురపోవువానివలె కన్నులు కూరుక్కపట్టును. అనర్థకముగ మాటలాడును. అస్థులయందును శిరస్సునందును అధికముగ నొప్పి కలుగును.

11. కఫము హీనమై వాతము మధ్యమమై పిత్తం బధికముగ నుండు జ్వరమున ద్రవముతో మలము వెడలును. జఠరాగ్ని బలహీనం బగును. దప్పియు, తాపమును, అరోచకంబును కలుగును. ఒడలు తిరుగునట్లుండును.

12. కఫము హీనమై పిత్తము మధ్యమమై వాతమధికమైయున్న జ్వరమున తీవ్రముగ శ్వాసము వెడలును. దగ్గువచ్చును. పడిసెము తీవ్రమగును. నోరెండును. ఇరుప్రక్కలయందును తీవ్రమైన నొప్పి కలుగును.

పైచెప్పినది చరకమతము. భాలుకితంత్రమున నీపంద్రెండు నవ్యక్తోల్బణవిశేషోల్బణాది సన్నిపాతజ్వరములకు నామభేదముల జెప్పుచు వానిలక్షణములు విశేషముగ జెప్పబడినవి. ఎట్లనగా:—"వాతపిత్తాధికో యస్య సన్నిపాతః ప్రకుప్యతి, తస్య జ్వరోఽఙ్గమర్దస్తృట్ తాలుశోషప్రమీలకాః. ఆధ్మానతన్ద్రారుచయః శ్వాసకాస భ్రమశ్రమాః, పిత్తశ్లేష్మాధికో యస్య సన్నిపాతః ప్రకుప్యతి. అంతర్దాహో బహిః శ్శీతం తస్య తన్ద్రాచ బాధతే, తుద్యతే దక్షిణం పార్శ్వమురశ్శిరోగలగ్రహః. నిష్ఠీవేత్కఫపిత్తఞ్చ తృష్ణా కణ్ఠశ్చ దూయతే, విడ్భేదశ్వాసహిక్కాశ్చబాధంతే సప్రమీలకాః. విభుగ్నశ్చ తు నామ్నా సన్నిపాతౌవుదాహృతః; శ్లేష్మానిలాధికో యస్య సన్నిపాతః ప్రకుప్యతి, తస్య శీతజ్వరో నిద్రా క్షుత్తృష్ణా పార్శ్వసంగ్రహః. శిరోగౌరవమాలస్యమన్యాస్తంభ ప్రమీలకాః. ఉదరం దహ్యతే చాస్య కటీ వస్తిశ్చ దూయతే, సన్నిపాతస్స విజ్ఞేయో మకరీతి సుదారుణః. వాతోల్బణస్సన్నిపాతో యస్య జన్తోః ప్రకుప్యతి, తస్యతృష్ణా జ్వరగ్లాని పార్శ్వరుక్ [illegible] క్షయాః. పిండికోద్వేష్టనం దాహః ఊరుపాదౌ బలక్షయః, సర్వత్రక్షయశ్చాస్య [illegible] శూలంనిద్రావిపర్యయః. నిర్భిద్యతే గుదం చాస్య వస్తిశ్చ పరిగృహ్యతే, ఆయమ్యతే భిద్యతే చ హిక్కతే విలపత్యపి. మూర్ఛతి స్ఫాయతే [illegible] విస్ఫురక స్మృతః; పిత్తోల్బణస్సన్నిపాతో యస్య జన్తోః ప్రకుప్యతి. తస్య దాహో జ్వరో ఘోరో బహిరంతశ్చ వర్ధతే, శీతం చ సేవమానస్య కుప్యతః కఫమారుతౌ. తత స్త్యేనం ప్రధావన్తే హిక్కాశ్వాసప్రమీలకాః, తృష్ణాదికాః సర్వదోషాః ప్రలాపః గౌరవం క్లమః. నాభిపార్శ్వరుజా తస్య స్విన్నస్యాశు వివర్ధతే, స్విద్యమానస్య రక్తఞ్చ స్రోతోభ్యస్సంప్రవర్తతే. కాలేన పీడ్యమానస్య తృష్ణాదాహశ్చ వర్ధతే, అసాధ్యస్సన్నిపాతోఽయం శీఘ్రకారీతి కథ్యతే. స హి జీవత్యహోరాత్రం పఞ్చ నాఽఽవిష్టవిగ్రహః, కఫోల్బణస్సన్నిపాతో యస్య జన్తోః ప్రకుప్యతి. తస్య శీతజ్వ

స్వప్న గౌరవాఽఽలస్యతన్ద్రియః, ఛర్ది మూర్ఛా తృషా దాహ తృష్ట్యరోచక హృద్గ్రహాః. ష్ఠీవనం ముఖమాధుర్యం శ్రోత్రవాగ్ దృష్టినిగ్రహాః, శ్లేష్మణో నిగ్రహం చాస్యయదా ప్రకురుతే భిషక్. తదా తస్య భృశం పిత్తం కుర్యాత్సోపద్రవం జ్వరం, నిగృహీతే తు పిత్తే చ భృశం వాయుః ప్రకుప్యతి. నిరాహారస్య సోఽత్యర్థం మేదో మజ్జాస్థి బాధతే, అథాత్ర స్నాతి భుఙ్త్తే వా త్రిరాత్రం నహి జీవతి. మేదో గతస్సన్నిపాతః కష్టణస్స ఉదాహృతః, కామాన్మోహాచ్చ లోభాచ్చ భయాచ్చాఽయం ప్రవర్తతే. మధ్యహీనాధికైర్దోషైః సన్నిపాతో యదా భవేత్, తస్యరోగాస్తథోక్తాః ప్రాయో దోషబలాశ్రయాః.”

1. వాతపిత్తములు రెండు నుత్కటముగ ప్రకుపితములై పిత్తము తక్కువగా నుండి కలిగిన సన్నిపాతజ్వరము విఘు వనంబరగు. అట్టిజ్వరముచే పీడితునకు ఒడలంతయు విరుగగొట్టినట్లు నొప్పియు, దప్పియు కలుగును. తాలువులు ఎండిపోవును. రెప్పలల్లార్చును. కడుపుబ్బరము, అరుచి, మైకము, శ్వాసము, దగ్గు, మతిభ్రమము, శ్రమము కల్గును.

2. పిత్తశ్లేష్మము లధికములై వాతము హీనముగా నుండి కలిగిన సన్నిపాతము ఫల్గు వనంబడును. ఈజ్వరమునందు శరీరములోపల జ్వరతాపం బధికమై ఒడలిపైని చల్లగనుండును. అట్టిజ్వరము కలవానికి కునుకుపాటు కలుగును. కుడిప్రక్కన సూదుల బొడిచినట్లు పోటు బుట్టును. రొమ్మునందును శిరస్సునందును కంఠమునందును పట్టుపట్టినట్లు నొప్పిగల్గును. కఫముతో గూడిన పిత్తపసరు నోట వెడలుచుండును. దప్పియధికమగును. కంఠమున తాపము కలుగును. మలము ద్రవముతో కూడి వెడలును. శ్వాసము వెక్కిళ్లు మిక్కిలి బాధించును. రెప్పలార్చుచుండును.

3. కఫవాతము లధికములై పిత్తము తక్కువగా నుండి కలిగిన సన్నిపాతజ్వరము మకరి యనంబరగు. ఇయ్యది మిక్కిలి దారుణంబైనది. ఇందు చలితోకూడిన జ్వరము ప్రబలముగా వచ్చును. అకాలమున నిద్ర అధికముగా వచ్చును. తుమ్ము పలుమాఱు వచ్చుచుండును. దప్పి యధికమగును. ఇరుప్రక్కల పట్టినట్లు బాధకల్గును. తల బరువగును. పనులయం దుత్సాహము లేకుండును. వెనుకప్రక్క మెడనరములు ఇటునటు కదలనియ్యక స్తంభించి యుండును. రెప్పలార్చుచుండును. కడుపులో మంటపుట్టును. నడుములయందు వస్తి (మూత్రకోశము) నందును నొప్పి కల్గును.

4. వాతంబధికమై కఫపిత్తములు తగ్గి జనించిన సన్నిపాతజ్వరము విస్ఫురక మనంబరగు. ఇందు దప్పి, తీవ్రమైనజ్వరము, బడలిక ఇవి కలుగును. ఇరుప్రక్కల యందును నొప్పిపుట్టును. దృష్టికి వస్తువులజూచుశక్తి నశించును. ప్రేళ్లు కొంకరులు

పోవును. తాపమధిక మగును. తొడలయందు నొప్పిపుట్టును. శరీరబలము నశించును. మలమూత్రములు రక్తమునుబోలె ఎఱ్ఱనై యుండును. లేక రక్తముతోకూడి వెడలును. కడుపులో శూలనొప్పి కలుగును. రాత్రి నిదురపట్టక పగటియం దధికముగా నిదురవచ్చును. గుదస్థానము పగులనీయునటుల పోటుపుట్టును. పొత్తి కడుపు లాగిపట్టును. కాళ్లు చేతులు గుంజును. శరీరము పగులనీయునట్లు బాధ కలుగును. ఎక్కిళ్లు వచ్చును. బాధకోర్వజాలక ఏడ్చును. మూర్ఛనొందును. దిక్కు వాల్పక వికారముగ చూచును. పలువిధముల కూకలిడును.

5. పిత్తముత్కటమై కఫవాతములు తగ్గియుండు సన్నిపాతజ్వరము శీఘ్రకారి యనంబరగు. ఈ జ్వరమున ఒడలు మంటబుట్టును. జ్వరవేగము మిక్కిలి తీవ్రమై శరీరమునకు లోభాగమున వెలిప్రక్కను వ్యాపించి వృద్ధినొందును. శీతప్రధానమైన ఉపచారములును, ఔషధములును ఉపయోగించినచో కఫవాతములుగూడ నుత్కటము లగును. దానంజేసి ఎక్కిళ్లు, శ్వాసము, దిప్పలు దప్పుట, వమనవిరేచనములు, కీళ్ళనొప్పి, అసంబద్ధమగు మాటలాడుట, శరీరము బరువైయుండుట, కళ దప్పుట ఈ లక్షణములన్నియు కల్గును. వాతము శమించుటకై చెమట పుట్టించినచో నాభిస్థానమునందును ఇరుపార్శ్వములయందును ప్రబలమైన నొప్పికల్గును. చెమట వచ్చినపుడు రోమరంధ్రములనుండియు, ముక్కులు, చెవులు, కన్నులు మున్నగు స్రోతస్సులనుండియు చెమటతోకూడి రక్తము వెలువడును. పైజెప్పిన శూలనొప్పిచే బాధపడునప్పుడు, దప్పియు తాపంబును అధిక మగును. ఇది మిక్కిలి దుస్సాధ్యమైన సన్నిపాతజ్వరము. ఈ జ్వరముకల్గిన నొక యహోరాత్రమునకు గోపల కలిగి వృద్ధి నొందును. శీఘ్రముగ రోగిని చంపుటంజేసినగా ఇయ్యది శీఘ్రకారి యని యన్వర్థ నామముచే బేర్కొనం బడియె.

6. కఫం బధికముగను వాతపిత్తములు తక్కువగను ప్రకుపితములైన సన్నిపాతజ్వరము కఫ్ఘణ మనంబరగును. ఇందు చలితోగూడి తీవ్రముగ జ్వరమువచ్చును. గాఢముగ నిదురవచ్చును. శరీరము బరువుగ నుండును. తనువునం దుత్సాహము లేకుండును. మైకము గ్రమ్మును. వాంతి, మూర్ఛ, దప్పి, అధిక లాలాస్రావము, భుజించినవానివలె తృప్తి, అరోచకము, రొమ్మునొప్పి ఈ లక్షణములు కల్గును. నోట కఫము నుమియుచుండును. నోరు తీపుగల్గియుండును. చెవులు వినబడకుండును. నోట మాటరాకుండును. కన్నులు గానరాకుండును. అట్టి ఘోరసన్నిపాతమున కఫం బధికముగ ప్రకోపించెనని దాని శమింపజేయదగిన చికిత్స జేసినచో పిత్తమునంతకన్న నుత్కటముగ ప్రకోపించి పిత్తోపద్రవములతోగూడి జ్వరమును వృద్ధినొందించును. మరల పిత్తమును శమింప నుపాయముచేసినచో వాతము మిక్కిలి ప్రకోపము నంది లేనిపోని యుపద్రవముల బుట్టించును. మలములు దోషములు పక్వములగుటకై లంకణముచేసినచో మేదస్సును, అస్థులను, అస్థులలోనుండు మజ్జ (మూలగ)ను

మిక్కిలి బాధించును. అట్టియవస్థయందు రోగి స్నానముచేసినను, భుజించినను మూడు రాత్రులకన్న నధికముగ రోగి జీవింపడు. ఈకఫక్షీణ సన్నిపాతము మేదోధాతువున బుట్టును. ఇయ్యది కామక్రోధలోభములచేతను భయముచేతను దోషము లన్నియు ప్రకోపించిన దానంజేసి కల్గును. పైజెప్పిన యారువిధముల సన్నిపాత జ్వరములును ద్వ్యల్బణ ఏకోల్బణ భేదములు. మరియు దోషములయొక్క మధ్యహీనాధిక తారతమ్యమున ప్రకోపముచే గల్గు సన్నిపాతజ్వరములయందు ఆయా దోషలక్షణముల తారతమ్యమునుబట్టి వేర్వేరుగ గమనించి నిర్ణయించునది.

ఇచ్చట నీనిర్ణయముల నెఱుంగునది:—పై జెప్పబడిన సన్నిపాతజ్వరముల యందు వాతాదిదోషములు ఆయాదోషముల బ్రకోపింపజేయు మిథ్యాహారవిహారాదులవలన సమకాలమున ప్రకుపితములై ఆయాసన్నిపాతజ్వరముల గల్గించును. అందును మిథ్యాహారాదుల మూడుదోషములకును సమానములుగ నున్నచో దాన ప్రకోపము నందు దోషములు సమానములుగ నుండును. అటుగాక రెండుదోషముల బ్రకోపించు నాహారవిహారాదులు ప్రబలములై ఒకదోషమును ప్రకోపింపజేయునవి మాత్రము తక్కువగ నుండుతరి ద్వ్యల్బణ సన్నిపాతజ్వరము కల్గును. ఒక దోషమును ప్రకోపింప జేయునవి ప్రబలమైన తక్కిన రెంటికిని తక్కువగనుండు నపుడు ఏకోల్బణ సన్నిపాత జ్వరము కల్గును. హీనమధ్యాధికభేదముల గూడ నాయాకారణముల బలాబలముల బట్టియే తారతమ్యమును నిర్ణయించునది.

మరియు లోకమున పరస్పరవిరుద్ధధర్మములుగల వస్తువు లొకటిగ జేరవు; చేరి యొకకార్యమును జేయుననునది యనుభవమున నొకప్పుడును గానము, తేజస్సు, తిమిరము, అగ్నిజలములు, కలియుట వినియుంటిమా ? అవికలిసి యొకపనిజేయుట చూచితిమా ? ఎన్నడును లేదు. అట్లుండ వాతపిత్తకఫములు మూడును పరస్పర విరుద్ధగుణములు కలవి. అట్టి త్రిదోషములును ఏకకాలమున కలిసి ప్రకోపము నొంది సన్నిపాతికరోగముల నెత్తెరంగున గల్గింపనోపును ? అను నీశంక కల్గక మానదు. అయినను దోషత్రయవిషయమున నట్లు చెప్పంజనదు. వాతపిత్తకఫములు పరస్పరవిరుద్ధ గుణములను గల్గియున్నను ఒకదానిని విడచి యొకటి యుండదు. వాని స్వభావ మట్టిది. సర్పమునందుగల విషము సాత్మ్యంబగుటచే సర్పమును చంపకుండు భంగి ఒకదోషముయొక్క విరుద్ధగుణములచేత వేరొండుదోషము కొట్టబడదు. వానివానికి స్వభావికములగు గుణములతోగూడ వృద్ధినొంది యన్నియుకలిసి సాన్నిపాతికరోగముల గల్గింప సమర్థములగును. ఈవిషయమునే తంత్రాంతరమున "విరుద్ధైరపి న త్వేతే గుణైర్ఘ్నన్తి పరస్పరమ్, దోషాస్సహజసాత్మ్యత్వాద్ఘోరం

విషమహీనివ" అను వాక్యముచే దృఢబలుడు సయుక్తికముగ జెప్పెను. మఱియు గయదాసాచార్యుడు "దైవాద్దోషస్వభావాద్వా దోషాణాం సాన్నిపాతినీ, విరుద్ధైశ్చ గుణైః కశ్చిన్నోపఘాతః పరస్పరమ్" అని యీవిషయమునే బలపరచెను. దైవసంకల్పముచేతనైనను, దోషములు స్వభావముచేనైనను, పరస్పరవిరుద్ధగుణములచే నొండొంట కొట్టబడ వని భావము. ఇందుకు కారణముగూడ నిరూపింపబడినది.

మరియు ద్వ్యుల్బణ ఏకోల్బణ సన్నిపాతజ్వరముల విషయమై చరకాది మతములలో పరస్పరభేదము గనబడుచున్నది. కొన్నిటిలో లక్షణము లధికముగ నున్నవి. కొన్నిటిలో వానికే లక్షణములు స్వల్పములుగ నున్నవి. అట్టి లక్షణ భేదములు ఆయాదోషప్రకోపమునకు కారణములైన యూహాపోహాది భేదములంబట్టి యొకసమయమున నొకవిధముగను, మరియొక సమయమున వేఱొండువిధముగను ఉండును ; కావున మతములకు పరస్పరవిరుద్ధములే దని యెరుంగునది.

## సన్నిపాతజ్వరాసాధ్యలక్షణము

దోషే విబద్ధే నష్టేఽగ్నౌ సర్వసమ్పూర్ణలక్షణః,
సన్నిపాతజ్వరోఽసాధ్యః కృచ్ఛ్రసాధ్యస్తతోఽన్యథా. 24

వాతము బద్ధగించి మలమూత్రములు సకాలమున వెలువెడలక జఠరాగ్ని పూర్తిగ నశించి సన్నిపాతజ్వరములకు జెప్పబడిన లక్షణములన్నియు పూర్తిగ గలిగి యున్నచో అట్టి సన్నిపాతజ్వరము అసాధ్యంబగును. పైజెప్పిన విధమునకు వ్యతిరేకముగ వాతము సంచరించుచు మలమూత్రములు నియమితకాలమున విడలుచు జాఠరాగ్ని నశింపక సన్నిపాతజ్వరలక్షణములలో గొన్నిమాత్రము కల్గినవాడు అట్టి సన్నిపాతజ్వరము కృచ్ఛ్రసాధ్యంబగును. (అనగా ప్రబలప్రయత్నముతో నివర్తింప దగియుండు ననుట.)

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—అన్నివ్యాధులును సాధ్యము లనియు, అసాధ్యము లనియు రెండుతెరంగులై యుండును. అందు సాధ్యమనునది సాధింపదగినది, అయ్యది స్వల్పప్రతీకారముచే నివర్తించునది సుఖసాధ్య మనియు, ప్రబలప్రయత్నముచే నివర్తింపదగినది కృచ్ఛ్రసాధ్య మనియు రెండు తెరంగులు. అసాధ్య మనగా చికిత్సాదులచే నివర్తింపదగినది. అయ్యది యాప్య మనియు, ప్రత్యాఖ్యేయ మనియు రెండువిధములు. అందు చికిత్సచే నివర్తించకున్నను శరీరపాతముదనుక వ్యాపించి యుండునది యాప్యము. చికిత్సకు ఇంచుకయైన లొంగమియ్యక నివర్తింపసలవిగాక ప్రాణహారంబైనది ప్రత్యాఖ్యేయము. అనగా చికిత్సచేయక విడువందగినది యనుట. ఇట్టినిబంధన వ్యాధియొక్కయు వ్యాధులకు కారణములైన మిథ్యాహారవిహారములయొక్కయు బలాబలము ననుసరించి యేర్పడును. ప్రకృతమున త్రిదోషప్రకోప

ముచే గలిగిన సన్నిపాతజ్వరము పైజెప్పినరీతిగ నసాధ్యంబును కృచ్ఛ్రసాధ్యంబును నగుగాని ఒకప్పుడును సుఖసాధ్యం బగుటలేదు. ఈవిషయమునే చరకాచార్యులు 'సన్నిపాతో దుశ్చికిత్స్యానాం" (చరక. సూ. అ. ౨౫) అని వచించెను. చికిత్స చేయక విడువందగిన వ్యాధులలో సన్నిపాతము బలవత్తర మనుట. భాలుకియు "మృత్యునా సహ యోద్ధవ్యం సన్నిపాతం చికిత్సతా" అని శాసించెను. సన్నిపాతమునకు చికిత్సచేయబూను వైద్యుడు మృత్యువుతో నెదిరించి యుద్ధము జేయగల డని భావము.

## సన్నిపాతజ్వరమునకు కాలనియమము

సప్తమే దివసే ప్రాప్తే దశమే ద్వాదశేఽపి వా,
పునర్ఘోరతరో భూత్వా ప్రశమం యాతి హంతి వా. 25
సప్తమీ ద్విగుణా చైవ నవమ్యేకాదశీ తథా,
ఏషా త్రిదోషమర్యాదా మోక్షాయ చ వధాయ చ. 26

త్రిదోషప్రకోపముచే గలిగిన సాన్నిపాతికజ్వరము ఏడవదినమందైనను, పదియవనాడైనను, పండ్రెండవదినమునఁనైనను మిక్కిలి తీవ్రతరమై శాంతినైన నొందును; లేక రోగిని చంపును. పదునాల్గవ దినమునందును, పదునెనిమిదియవ దినమునందును, ఇరువదిరెండవ దినమునందైనను, ఘోరమై విడుచును; లేక రోగిని చంపును అని మరియొకపక్షము. సన్నిపాతజ్వరములయందు విడచుటకును, లేక అపాయముగలిగించుటకును ఇదియ కాలనియమము.

## సన్నిపాతజ్వరోపద్రవము

సన్నిపాతజ్వరస్యాంతే కర్ణమూలే సుదారుణః,
శోథస్సంజాయతే తేన కశ్చిదేవ ప్రముచ్యతే. 27

సన్నిపాతజ్వరము వ్యాపించి పైజెప్పిన దానియవధికాలమున చెవియొక్క మొదట క్రూరమైన వాపుపుట్టును. అయ్యది మర్మస్థానమున జనించుటంజేసి మిక్కిలి క్రూరమైయుండును గాన దానిచేత ఆయుశ్శేషముగల యొకానొకడు మాత్రము విడువబడునుగాని సాధారణముగ నిది కలిగినచో రోగి జీవింపజాలడు.

ఇయ్యది సన్నిపాతజ్వరమునకు దారుణమైన యుపద్రవము. ఉపద్రవ మనగా ప్రధానముగ తొలుత జనించిన వ్యాధికి పిమ్మట ఉపష్టంభకముగా జనించు రోగాంతర మని యెరుంగునది.

## అభిన్యాసలక్షణము

త్రయః ప్రకుపితా దోషాః ఉరస్స్రోతోఽనుగామినః,
ఆమాభివృద్ధ్యా గ్రథితా బుద్ధీంద్రియమనోగతాః. 28
జనయంతి మహాఘోరమభిన్యాసం జ్వరం దృఢమ్,
శ్రుతౌ నేత్రే ప్రసుప్తిస్స్యాత్ న చేష్టాం కాఞ్చిదీహతే. 29
న చ దృష్టిర్భవేత్తస్య సమర్థా రూపదర్శనే,
న ఘ్రాణం న చ సంస్పర్శం శబ్దం వా నైవ బుధ్యతే. 30
శిరో లోఠయతేఽభీక్ష్ణమాహారం నాభినందతి,
కూజతే తుద్యతే చైవ పరివర్తనమీహతే. 31
అల్పం ప్రభాషతే కిఞ్చిదభిన్యాసస్స ఉచ్యతే,
ప్రత్యాఖ్యాయస్సభూయిష్ఠః కశ్చిదేవాత్ర సిధ్యతి. 32

## అభిన్యాసలక్షణము

వాతపిత్తశ్లేష్మములు మూడును సమకాలమున ప్రకోపమునొంది హృదయమునందును నాసారంధ్రములు, చెవులు మున్నగు స్రోతోద్వారములయందును, ఆమరసముతో గూడి బుద్ధియందును, మనస్సునందును, చక్షురాది ఇంద్రియములందును చేరి అభిన్యాస మను సన్నిపాతజ్వరమును గలిగించును. ఇయ్యది మహాగ్రహస్తమైనది. ఈజ్వరమునందు చెవులు, కన్నులు నిదురబోవునట్లు తమవ్యాపారములను మాని యుండును. ఏవిధమైన చేష్టను రోగి చేయజాలకుండును. వాని దృష్టి రూపాదుల చూచుటకు సమర్థము గాకుండును. ఘ్రాణేంద్రియము గంధమును గ్రహింపకుండును. త్వగింద్రియమునకు స్పర్శజ్ఞానము లేకపోవును. శ్రోత్రేంద్రియము శబ్దమును గ్రహింపనోపదు. పలుమారు తల త్రిప్పుచుండును. ఆహారమునం దిచ్ఛబొడమదు. మూలుగుచు కూయుచుండును. సూదులబొడిచినట్లు శరీరమున బాధకలుగును. పడకయందు ఇటు నటు బొరలాడుచుండును. ఒకవేళ మాటలాడినను అతిస్వల్పముగ హీనస్వరముగ మాటలాడును. ఈక్రూరమైనవ్యాధిని వైద్యుడు గమనించి చికిత్స చేయకుండుట మంచిది, (అనగా ప్రత్యాఖ్యేయ మనుట.) ఒకవేళ ప్రబలముగ చికిత్స చేసినచో ఒకానొకడు మాత్రము జీవించుట యరుదు.

సుశ్రుతాచార్యుడు ఈయభిన్యాసజ్వరలక్షణమును మరియొకవిధముగ జెప్పియున్నాడు. ఎట్టు లన:—“నాత్యుష్ణశీతోల్పసంజ్ఞో భ్రాంతప్రేక్షీ హతప్రభః, ఖరజిహ్వాశ్శుష్కకంఠః స్వేదవిణ్మూత్రవర్జితః, సాశ్రునిర్భుగ్ననయనః భక్తద్వేషీ హతస్వరః, శ్వసన్నిపతితశ్శేతే ప్రలాపోపద్రవాన్వితః. అభిన్యాసం తు తం ప్రాహుః హతౌజసమథాపరే సన్నిపాతజ్వరం కృచ్ఛ్రమసాధ్యమపరే జగుః.”

శరీరము మిక్కిలి వేడియుం చలువయు లేక కొంచెముష్ణముగ నుండుట, ప్రజ్ఞదప్పుట, సకలపదార్థములును తిరుగుచున్నట్లు చూచుట, శరీరము కాంతిహీన మగుట, నాలుక పశువునాలుకబోలె చెమ్మలేక కరకుబారియుండుట, గొంతెండుట, చెమటయు, మలమూత్రములును వెడలక బంధించియుండుట, కన్నులలో నీరుగారుచు లోనికి బోవుట, అన్నద్వేషము, స్వరము హీనమగుట ఈలక్షణములతో గూడి తీవ్రముగ శ్వాసము విడుచుచు లేచుటకు శక్తిలేక పడియుండి తన కిచ్చవచ్చినట్లు అసంబద్ధముగ మాటలాడుచుండును. ఇయ్యది యభిన్యాస మను సన్నిపాతజ్వరము. దీనినే హతౌజస మని కొందరు వచించెదరు. దీనిని యసాధ్య మని కొందరును, కృచ్ఛ్రసాధ్య మని మరికొందరును చెప్పిరి. (ఇచ్చట యీసన్నిపాతలక్షణమున ప్రకృతగ్రంథమునకును, సుశ్రుతమునకును చాలభేదము గన్పట్టుచున్నది. అట్టిభేదము దోషముల యొక్కయు,దేశకాలాదులయొక్కయు అవస్థాభేదమునుబట్టి యుండు నని యూహింప దగియున్నది.)

## ఆంగతుజ్వరలక్షణము

అభిఘాతాభిచారాభ్యామభిశాపాభిషఙ్గతః,
అంగతుర్జాయతే దోషైః యథాస్వం తం విభావయేత్. 33

ఆయుధములు మున్నగువానిచే దెబ్బతగులుట, వ్యాయామాదుల నధికముగా జేయుట, తనబలమునకు మిక్కుటమగు పనిచేయుట మున్నగునవి యభిఘాతములు. ఇట్టి యభిఘాతములచేతను, శూలిని మున్నగు క్రూరదేవతల ప్రయోగముచేతను ఋషుల కపకారముజేయుటంజేసి వారిచేగల్గిన శాపాదులచేతను, కామక్రోధ భయాదులచేతను ఆగంతుజ్వరము కల్గును. ఈజ్వరమునందు తొలుత జ్వరము గల్గి పిమ్మట నాయాకారణములచేత వాతాదిదోషములు ప్రకోపము నొందును. ఆయాలక్షణములం బట్టి దోషనిర్ణయము చేయందగును.

## ఆగంతుజ్వరమునకు ప్రత్యేకలక్షణము

శ్యావాస్యతా విషకృతే తథాఽతిసార ఏవ చ,
భక్తారుచిః పిపాసా చ తోదశ్చ సహ మూర్ఛయా. 34
ఓషధీగంధజే మూర్ఛా శిరోరుగ్వమథుః క్షవః,
కామజే చిత్తవిభ్రంశ స్తన్ద్రాలస్యమభోజనమ్. 35
హృదయే వేదనా చాస్య గాత్రం చ పరిశుష్యతి,
భయాత్ప్రలాపశ్శోకాచ్చ భవేత్కోపాచ్చ వేపథుః. 36

అభిచారాఽభిశాపాభ్యాం మోహస్తృష్ణా చ జాయతే,
భూతాభిషంగాదుద్వేగో హాస్యరోదనగౌరవమ్. 37

విషము రెండువిధములు. సామాన్యము, దూషీవిషము. సర్పాదులయొక్కయు, పొత్తిగడ్డ మున్నగు మూలికలయొక్కయు విషము సామాన్యము. విషహరంబులగు నౌషధములచేనైనను, స్వభావముచేనైనను మందవీర్యమైనది దూషీవిషము. ఈ రెండు విధములైన విషముచేత కలిగిన జ్వరమున విశేషముగ విరేచనము లగును. అన్నమునందు రుచి తప్పిపోవును. దప్పిగల్గును. దేహమునందంతట పోటుపుట్టును. మూర్ఛవచ్చును. ఉగ్రమైన యోషధులను మూర్కొనుటచే గల్గినజ్వరమునందు మూర్ఛయును, తల నొప్పియును, వాంతియును, తుమ్ములును గల్గును. మదనవికారముచే గల్గిన తాపజ్వరమునందు చిత్తభ్రమము, మైకము, పనులయం దలసతయును కలుగును. ఆహారమునం దిచ్ఛబోద మదు. హృదయము నందు చెప్పనలవిగాని యొకవిధమైన వేదన గల్గును. శరీరము నానాట కృశతనొందును. భయముచే గల్గిన జ్వరమున అసంబద్ధముగ మాటలాడును. చిత్తభ్రమ గల్గును. శోకముచేతను, కోపముచేతను గల్గిన జ్వరమున శరీరకంపము పుట్టును. అభిచారముచేతను, శాపాదులచేతను గల్గిన జ్వరమునందు చిత్తభ్రమమును, దప్పియు విశేషముగ గల్గును. పిశాచాదులయావేశముచే గలిగిన జ్వరమునందు ఉద్వేగంబు గల్గును. శరీరము బరువుగ నుండును. కారణములేకయే తనలోదాను నవ్వుచు నేడ్చుచుండును.

## ఆగంతుజ్వరములయందు దోషసంబంధము

కామశోకభయాద్వాయుః, క్రోధాత్పిత్తం త్రయో మలాః,
భూతాభిషఙ్గాత్కుప్యంతి భూతసామాన్యలక్షణాః. 38

కామము (సంభోగాదులయం దిచ్ఛగలిగిన నయ్యది లభింపకుండుటచే గల్గు మనోవికారము), శోకము, (తనకిష్టమైనవస్తువు నశించుట మున్నగు కారణములచే గల్గినమనోవికారము), భయము (క్రూరమైనజంతువులు మున్నగువానిని చూచుట మున్నగు కారణములచే గల్గిన చిత్తవికారము), ఈమూడు కారణములచే వాతము ప్రకోపము నొందును. క్రోధము (శత్రుదర్శనాదులచే గలిగిన మనఃప్రజ్వలనము) చేత జనించిన జ్వరమునందు పిత్తము ప్రకోపించును. పిశాచములు మున్నగుభూతముల యావేశముచే గల్గు జ్వరమునందు వాతపిత్తకఫములు మూడును ప్రకోపము నొందును. ఆవేశించిన భూతముయొక్క లక్షణము లన్నియు కలిగి యుండును.

### విషమజ్వరసంప్రాప్తి

దోషోఽల్పోఽహితసంభూతో జ్వరోత్సృష్టస్య వా పునః,
ధాతుమన్యతమం ప్రాప్య కరోతి విషమజ్వరమ్. 39

తొలుత ఏదైననొకజ్వరముకలిగి శాంతినొందినపుడు దోషప్రకోపము కొంచెముగ ననుసరించియుండి అయ్యది యపథ్యములగు నాహారాదులచే ప్రబలమై రసాది ధాతువులలో నొకదాని నాశ్రయించి సంతతాది విషమజ్వరములను గలిగించును. ఇయ్యది జ్వరముచే విడువబడినవానికిగాక ప్రారంభమునందుకూడ వచ్చుట గలదు. కావుననే "ఆరమ్భాద్విషమో యస్తు" అని ప్రారంభముననే విషమముగ జనించిన జ్వరము అసాధ్యంబగు నని యసాధ్యలక్షణము జెప్పినది సంగతమగును. మరియు జ్వరమునకు విషమత్వము భాలుకి యిత్తెరంగున నుడివెను:—"యస్యాద నియతాత్కాలాచ్ఛీతోష్ణాభ్యాం తథైవ చ, వేగతశ్చాపి విషమో జ్వరస్స విషమస్స్మృతః" జ్వరమునకు నియతమైన కాలంబును, శీతోష్ణంబులును, వేగంబును నియమితప్రకారము కాక విషమముగనుండి యేజ్వరము కల్గునో అయ్యది విషమజ్వర మని యన్వర్థనామమై యుండు నని భావము.

### విషమజ్వరభేదములు

(సన్తతస్సతతోఽన్యేద్యుస్తృతీయకచతుర్థకౌ)
సన్తతం రసరక్తస్థస్సోఽన్యేద్యుఃపిశితాశ్రితః. 40
మేదోగతస్తృతీయేఽహ్ని అస్థిమజ్జగతః పునః,
కుర్యాచ్చతుర్థకం ఘోరం అన్తకం రోగసఙ్కరమ్. 41

### విషమజ్వరభేదములు

సంతతము, సతతము, అన్యేద్యుష్కము, తృతీయకము చతుర్థకము అను నీయైదును విషమజ్వరభేదములు. అందు సంతతజ్వరమును ప్రకోపమునొంది వాతాది దోషములు రసధాతువు నాశ్రయించి కల్గించును. త్రిదోషములు ప్రకోపము నొంది రక్తధాతువు నాశ్రయించి సతతజ్వరమును గల్గించును. వాతాదులు మాంసధాతువు నాశ్రయించి అనేకద్యుష్క మనుజ్వరమును గల్గించును. దోషములు మేదోధాతువు నాశ్రయించి తృతీయకజ్వరము గల్గించును. ఇయ్యది జ్వరము వ్యాపించిన నాటికి మూడవ దినమున మరల వ్యాపించును. (జ్వరము వ్యాపించిన దినమును మరుసటి దినమును విడచి మరల మూడవనాడు వ్యాపించు ననుట, ఇదియే వరుసజ్వర మని వాడంబడును.) దోషములు ప్రకుపితములై యస్థులయందును అస్థులలోని క్రొవ్వు (మూలగ) నందును వ్యాపించి చతుర్థక మను జ్వరమును గల్గించును. ఇయ్యది జ్వరము వ్యాపించిననాటికి నాల్గవ (నడుమ రెండుదినములు విడిచి యామరుసటి) దినము

వ్యాపించును. ఈ చతుర్థకజ్వరము యమునిబోలె మిక్కిలి క్రూరమై యుండును. ఇతర ములగు ననేకరోగముల గల్గించును.

ఇచ్చట జ్వరములకు ఆశ్రయమును చెప్పుతరి మూలమున సతతకమును ప్రత్యేక ముగ నిర్దేశించి చెప్పకున్నను "రక్తధాత్వాశ్రయః ప్రాయో దోషస్సతతకం జ్వరమ్" (చ. చి. అ. 3) అని చరకమున నిర్దేశించియుండుటంజేసి సంతతశబ్దముచేతనే సతతక మునుగూడ గ్రహించుట సమంజసము. రస, రక్త అని ధాతువులు మాత్రము రెండును గ్రహింపబడియున్నవి.

సంతతజ్వరసంప్రాప్తి

*(స్రోతోభిర్విసృతా దోషాః గురవో రసవాహిభిః,
సర్వదేహానుగా స్తబ్ధాః జ్వరం కుర్వన్తి సన్తతమ్.)

శరీరమునందలి రసవహంబులగు స్రోతస్సులచే మిక్కిలి వ్యాప్తినొంది బలిష్ఠము లైన వాతాదిదోషములు శరీరమునందెల్ల పూర్తిగ వ్యాపించి యెడతెగక నిరంతరముగ వ్యాపించు స్వభావముకల సంతతజ్వరమును కల్గించును.

సంతతజ్వరలక్షణము

సప్తాహం వా దశాహం వా ద్వాదశాహమథాపి వా,
సన్తత్యా యోఽవిసర్గీ స్యాత్సన్తతస్స నిగద్యతే. 42

ఏడుదినములైనను, పదిదినములైనను, పండ్రెండుదినములైనను నిరంతరముగ నొక త్రుటిమాత్రకాలమైనను విడుదలలేక వ్యాపించి రేయింబవలును బాధించు చున్నచో నయ్యది సంతతజ్వర మని యెరుంగునది.

పైజెప్పిన కాలనియమమునుగూర్చి తంత్రాంతరమున నిట్లిరంగున నిర్ణయింప బడినది:—"పిత్తకఫానిలవృద్ధ్యా దశదివస ద్వాదశాహ సప్తాహాత్, హన్తి విము ఞ్చతి వాశు త్రిదోషజో ధాతుమలపాకాత్" సంతతము మున్నగు విషమజ్వర ములయందు త్రిదోషంబులును ప్రకోపమునందును; అందు త్రిదోషములలో పిత్తం బుత్కటముగ వృద్ధినొంది వాతకఫములు రెండును తక్కువగ నుండు నెడ అట్టి సంతతజ్వరము పదిదినములవరకును నిరంతరముగ వ్యాపించి పదియవనాడు రోగిని చంపును, లేక విడచును. కఫ ముత్కటముగ ప్రకోపించి వాతపిత్తములు రెండును తగ్గియున్నచో పండ్రెండుదినములు ఎడలేక వ్యాపించి రోగిని చంపును, లేక విడచును. వాతము మిక్కిలి ప్రకోపించి పిత్తకఫములు రెండును తక్కువగ నుండునపుడు ఏడుదినములవరకు నెడతెరిపిలేక వ్యాపించి యేడవనాడు రోగిని చంపును,

*ప్రక్షిప్తము.
మాధవ—4

లేక విడచును. పై జెప్పినవిధముగ నాయాకాలముల రసరక్తాది ధాతువులు పరిపక్వంబు లైనచో రోగిని చంపును; లేక మలములు పరిపక్వములై తమతమస్థితియం దుండునెడ జ్వరము శాంతి నొందును.

మరియు నీసంతతజ్వరమున వాతపిత్తకఫములు మూడును రసాదిధాతువుల వ్యాపించుభంగి మలమూత్రములయందును సమకాలమున వ్యాపించును. ఇయ్యది సంతతజ్వరమున నియతముగ నుండును. ఈవిషయమును చరకాచార్యుండు "యథా ధాతూంస్తథా మూత్రం పురీషఞ్చానిలాదయః,యుగపచ్చానుపద్యన్తే నియమాత్సంతతే జ్వరే" (చ. చి. అ. 3) అను వచనముచే స్ఫుటముగ నుపదేశించెను. ఇత్తెరంగున సంతతజ్వరము విడచుటకును లేక చంపుటకును కాలనియమము సహేతుకముగఁ జెప్ప బడినది. కాని ఒకసమయమున నీజ్వరము పదిరెండవదినమున జ్వరముక్తలక్షణములు పూర్తిగ కనబడి శాంతినొంది మరల మిక్కిలి క్రూరమై చాలకాలమువరకు అనుసరించి యుండు ననియు చరకు లిట్లు నుడివిరి:— "విసర్గం ద్వాదశేకృత్వా దివసేఽవ్యక్త లక్షణః, దుర్లభోపశమః కాలం దీర్ఘమప్యనువర్తతే." (చ. చి. అ. 3)

ఈజ్వరము (సంతతజ్వరము) పైజెప్పిన కాలనియమప్రకారము విడిచి మరల చిరకాలమువరకు అనుసరించియుండునెడ ముక్తానుబంధిత్వము ఈసంతతజ్వరమునకు కూడ కల దని తెలిసెడి. అందువలననే దీనికి జ్వరోత్సృష్టస్య వా పునః" అను విషమ జ్వరలక్షణము ఒప్పియుండును.

వాగ్భటాచార్యుడుగూడ దీనికి ముక్తానుబంధిత్వము నంగీకరించి సకారణముగ నిట్లు చెప్పెను— 'శుద్ధ్యశుద్ధౌ జ్వరః కాలం దీర్ఘమప్యనువర్తతే" (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౬3) అని చెప్పెను. రసాదిధాతువులలో కొన్ని మలరహితములై శుద్ధముగ నుండి కొన్ని కొన్ని మలసహితములై యశుద్ధములుగ నుండి సంకరముగనున్నపుడు ఈ సంతతజ్వరము మరల చిరకాలమువరకును అనుసరించియుండు నని భావము.

ఖరనాథుడుమాత్రము సంతతజ్వరమునకు విషమజ్వరత్వములే దని "జ్వరాః పూర్వం మయోక్తా యే పఞ్చ సంతతకాదయః, చత్వారస్సంతతం హిత్వా జ్ఞేయా స్తే విషమజ్వరాః" అను వాక్యముచే దెలిపెను; గాని వారియభిప్రాయ మిట్టిది-'సతతకాది జ్వరములు నాల్గును పలుమారు విడచి విడచి వచ్చును. సంతతజ్వరముమాత్రము అటు కాక పైజెప్పినరీతిగ పండ్రెండవదినము విడచి మరల అనుబంధమై చాలకాల మను వర్తించియే యుండును. కావున సతతాదిజ్వరములబోలె సంతతమునకు ముక్తానుబంధి త్వము లే దని వారి యభిప్రాయము.

## సతతకజ్వరలక్షణము

అహోరాత్రే సతతకో ద్వౌ కాలవనువర్తతే,

సతతక మను విషమజ్వరము ఒక యహోరాత్రమునకు రెండుపర్యాయములు విడచి విడచి వచ్చును. (రాత్రియు పవలును జేరి యహోరాత్రము. అందు రాత్రి యందైనను పగటియందైనను రెండుమార్లు విడిచి విడిచి వచ్చును. లేక పగటియందు జ్వరముతగిలి విడిచి, మరల రాత్రియందు జ్వరముతగిలి విడచును. ముఖ్యమునకు ఎట్లైనను ఒక అహోరాత్రమునకు రెండుమార్లు విడచి రెండుసార్లు వ్యాపించునది సతతకజ్వర మని భావము. ఈ విషయమును వాగ్భటాచార్యుడు:-"అహోరాత్రస్య స ద్విస్స్యాత్" (వాగ్భట. ని. అ. ౨. శ్లో. ౬౫) అనువాక్యమున దెలిపెను.

## అన్యేద్యుష్కలక్షణము

అన్యేద్యుష్కస్త్వహోరాత్ర ఏకకాలం ప్రవర్తతే. 43

అన్యేద్యుష్క మను విషమజ్వరము ఒక యహోరాత్రమునకు లోపల ఒకతూరి వ్యాపించును. ఒక అహోరాత్రమున రాత్రియైనను పగలైనను ఒకతూరి వ్యాపించునది యన్యేద్యుష్క మని భావము. ఈ విషయమును వాగ్భటాచార్యుడు:- "సకృదన్యేద్యురాత్రితః" (అష్టాంగ. ని. అ. ౨. శ్లో. ౭౦) అనువాక్యముచేత తెలిపెను.

## తృతీయకచతుర్థకముల లక్షణములు

తృతీయకస్తృతీయేఽహ్ని చతుర్థేఽహ్ని చతుర్థకః,

తృతీయకజ్వరము జ్వరవేగ ముడిగిన దినమునకు మూడవదినమున మరల వ్యాపించును. (ఒకదినము జ్వరము వ్యాపించి నాడే వేగ ముడిగి మరునటినాడు జ్వరము వ్యాపింపకుండి మూడవనాడు మరల వ్యాపించుజ్వరము తృతీయకజ్వర మనుట.) ఈ విషయమును చరకాచార్యులు "దినం హిత్వా తృతీయకః" (చ. చి. అ. 3) అను వాక్యమున స్ఫుటముగ దెలిపిరి.

చతుర్థకజ్వరము జ్వరవేగ ముడిగిన దినమునకు నాలవనాడు మరల వ్యాపించును. (తొలుత నొకదినము జ్వరము వ్యాపించి నాడే వ్యాధిశ ముడిగి నడుమ రెండు దినములు జ్వరము వ్యాపించకుండి ఆ మరునటినాడు మరల వ్యాపించునది చతుర్థకజ్వర మనుట) ఈ విషయమును చరకాచార్యుడు "దినద్వయం యో విశ్రామ్య ప్రత్యేతి స చతుర్థకః" (చ. చి. అ. 3) అను వాక్యమున స్ఫుటముగ జెప్పెను.

పైజెప్పిన రీతిగ సతతాదిజ్వరములు నియతమైన కాలమున ప్రకోపించుటకు హేతువును చరకాచార్యు లిట్లు చెప్పిరి:-"అధిశేతే యథా భూమిం బీజం కాలే చ రో

హాతి, అధిశేతే తథా ధాతుం దోషః కాలే చ కుప్యతి" (చ. చి. అ. 3. శ్లో. ౬౮)
విత్తనము భూమియందుంచబడియు చెమ్మలేనినాడు మొలువక యెట్లు అణగియుండి జలసంబంధముకల్గిననాడు మరల నంకురించునో అదేరీతిగ వాతాదిదోషములు తమ తమ స్థానములయందు యణగియుండి తమకు ప్రకోపకాలమున ప్రకోపించి జ్వరమును గల్గించు నని భావము.

## మతాంతరమున విషమజ్వరలక్షణము

కేచిద్భూతాభిషఙ్గోత్థం బ్రువతే విషమజ్వరమ్. 44

కొందరాచార్యులు భూతములసంబంధముచే గల్గిన జ్వరము కూడ విషమ జ్వరమని చెప్పెదరు.

భూతములు పిశాచములు మున్నగునవి యావేశించుటవలన గల్గినజ్వరంబును కాలనియమంబును శీతోష్ణాది పరిస్థితులనియమంబును లేకుండును కావున నదికూడ విషమజ్వరముగనే యుండు నని వారి యభిమతము. విషమజ్వరలక్షణమును వాగ్భటాచార్యుం డిట్లు చెప్పెను:—"విషమో విషమారంభక్రియాకాలోఽనుషఙ్గవాన్" (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౬౮) జ్వరముయొక్క ప్రారంభము, ఆ జ్వరముచే గల్గు క్రియలు, జ్వరము జనించుకాలము, ఇవి నియతములుగ లేకయుండునది విషమజ్వరము అని భావము. అందు ఒకజ్వరము శరీరంబున నారంభించి వ్యాపించును. ఇంకొకటి వీపున నారంభ మగును. ఇది యారంభముచే విషమము. ఒకజ్వరము చలిని బుట్టించును. వేరొకటి తాపమును గల్గించును. ఇది క్రియచే విషమము. ఒకటి పూర్వాహ్ణకాలమున వ్యాపించును. ఒకటి మధ్యాహ్న కాలమునందును, ఒకటి రాత్రియందును వ్యాపించును. ఇది కాలముచే విషమము. ఇత్తెరంగున విషమజ్వరములకు ఆరంభక్రియాకాలములచేత విషమత్వమును గమనించునది.

## తృతీయకజ్వరభేదము

కఫపిత్తాత్త్రికగ్రాహీ పృష్ఠాద్వాతకఫాత్మకః,
వాతపిత్తాచ్ఛిరోగ్రాహీ త్రివిధస్స్యాత్తృతీయకః. 45

కఫపిత్తములచే జనించిన తృతీయకజ్వరము త్రిక (వెన్నెముకకు క్రిందిభాగ) మున తొలుత నారంభించును. వాతకఫములచే గల్గినయెడల తొలుత వీపున నారంభించి శరీరమునందెల్ల వ్యాపించును. వాతపిత్తములచే గల్గినయెడ తొలుత శిరంబున బుట్టి శరీరమునందెల్ల వ్యాపించును. తృతీయకజ్వరం బిత్తెరంగున మూడు విధముల నుండును.

ఇచ్చట నీ నిర్ణయము నెరుంగునది—సంతతక - సతత - అన్యేద్యుష్క-తృతీయక - చతుర్థకములను జ్వరములైదును విషమజ్వరములు. ఇవి యైదును త్రిదోష

సన్నిపాతముచేతనే కల్గును. అయినను అట్టి మూడుదోషములలో నేదిప్రబలముగ నుండునో దానిని ప్రధానముగజేసికొని వాతిక మనియు, పైత్తిక మనియు, కఫజ మనియు, ద్వంద్వ మనియు వ్యవహరింపబడును. ఈ విషయమును చరకాచార్యు డిట్లు చెప్పెను:—"ప్రాయశస్సన్నిపాతేన దృష్టః పఞ్చవిధో జ్వరః, సన్నిపాతే తు యో భూయాన్ స దోషః పరికీర్తితః." (చ. చి. అ. 3. శ్లో. ౭౮) పైజెప్పిన విషమజ్వరములైదును సన్నిపాతముచేత ప్రాయికముగ గల్గును. అయినను ఎందుఁ నేదోషము ప్రబలముగ నుండునో ఆ దోషమున నయ్యది పుట్టిన దని వ్యవహరింపబడును అని భావము. ఈ విషయముననే వాగ్భటాచార్యుడు నిట్లు చెప్పెను:—"ప్రాయశస్సన్నిపాతేన భూయసా తూపదిశ్యతే, సంతతస్సతతోఽన్యేద్యుస్తృతీయకచతుర్థకౌ."

పైనిర్ణయప్రకారము తృతీయకజ్వరము సన్నిపాతమున కల్గినను అందు కఫపిత్తములు ప్రబలముగనున్నపుడు త్రికస్థానమున ప్రారంభమగు ననియు, వాతకఫము లెక్కుడుగనున్నతరి వీపున మొట్టమొదట వ్యాపించుననియు, వాతపిత్తము లధికముగ నున్నపుడు శిరస్సున ప్రారంభించుననియు పైమూలమున కర్థము సమంజసముగ నుండును. ఇత్తెరంగుననే క్రింద జెప్పంబడు చతుర్థకజ్వరమునకుగూడ దోషదోషాధిక్యమునుబట్టి శ్లైష్మికము వాతికము నని భేదముల నెరుంగునది.

మరియు "ప్రాయశస్సన్నిపాతేన" అను ప్రాయశ్శబ్దస్వారస్యముచేత సన్నిపాతముననగాక కేవలము ఏకదోషముచేతను, ద్విదోషముచేతనుగూడ సంతతాది జ్వరములు కల్గు నని కొందఱాచార్యుల యభిమతము. వారిమతమునకుగూడ నేక దోషాధిక్యమునుబట్టియే ఏకదోషజత్వము సంగతమగును. కావుననే తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"సంతతో మారుతాత్ప్రాయః పిత్తాత్ప్రాయ స్తృతీయకః, అన్యేద్యుశ్చకఫాత్ప్రాయః సన్నిపాతాచ్చతుర్థకః, సన్నిపాతస్తృతీయస్తు దుశ్చికిత్స్యశ్చతుర్థకః" వాతప్రాబల్యముచే సంతతంబును, పిత్తప్రాబల్యమున తృతీయకంబును, కఫప్రాబల్యమున అన్యేద్యుష్కంబును, చతుర్థకజ్వరము త్రిదోషప్రాబల్యముచేతను కల్గు ననియు; సాన్నిపాతికమగుటంజేసియే చతుర్థకజ్వరము అసాధ్యం బనియు భావము.

మరియు ప్రకోపమునొందిన దోషములు శరీరమునందెల్ల తమతమ నెలవుల విడిచి వ్యాపించును గాన అట్లు వ్యాపించునపుడు కఫపిత్తాదులు పైజెప్పిన త్రికాది స్థానమున వ్యాపించి తొలుత నాప్రదేశముల బాధపుట్టించి జ్వరమును వ్యాపింపఁ జేయునని యెఱుంగునది. ఈ విషయమును సుశ్రుతాచార్యుడు ఇట్లు చెప్పెను:—'కుపితానాం హి దోషాణాం శరీరే పరిధావతామ్, యత్ర సఙ్గస్స్వవైగుణ్యా

ద్వా వ్యాధిస్తత్రోపజాయతే" (సు. సూ. అ. ౨౪.) ప్రకోపించినదోషములు శరీరమున వ్యాపించుతరి యెచ్చటచేరునో అచ్చట వ్యాధి జనించు నని భావము.

### చతుర్థకజ్వరభేదములు

చతుర్థకో దర్శయతి ప్రభావం ద్వివిధం జ్వరః,
జఙ్ఘాభ్యాం శ్లైష్మికః పూర్వం శిరస్తోఽనిలసమ్భవః. 46

చతుర్థకము సన్నిపాతమున గల్గినను కఫవాతాధిక్యముచే రెండువిధముల తన ప్రభావమును జూపును. అందు కఫము అధికముగనుండు సన్నిపాతమున గల్గినది తొలుత పిక్కలయందు వ్యాపించి, పిమ్మట శరీరమునందెల్ల వ్యాపించును. వాతం బధికముగ నుండు సన్నిపాతమున గల్గినపుడు తొలుత శిరస్సున ప్రారంభించి శరీరమునం దెల్ల వ్యాపించును.

పైజెప్పిన యానుపూర్వినే చరకాచార్యుడు చెప్పెను. వాగ్భటాచార్యుండును- "ప్రభావం స తు దర్శయేత్, ద్విధా ; కఫేన జఙ్ఘాభ్యాం స పూర్వం శిరసోఽనిలాత్" (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౭౨.) అనువాక్యముచేత చరకవచనము ననుసరించియే చెప్పెను. ఈమతములయందు చతుర్థకజ్వరమున కఫవాతముల ప్రాబల్యమును మాత్రముచెప్పి రెండువిధముల జెప్పిరి గాని పిత్తోల్బణభేదమును జెప్పియుండలేదు. చతుర్థకజ్వరమున వ్యాధిస్వభావమునంజేసి పిత్తోల్బణము కల్గుటలే దని వారి యభిప్రాయము. ఈమతము ననుసరించియే హారీతుం డిట్లు చెప్పెను. "చతుర్థకో నామ గదో దారుణో విషమజ్వరః, శోషణస్సర్వధాతూనాం బల వర్ణాగ్ని నాశనః, త్రిదోషజో వికారస్స్యాదస్థి మజ్జగతోఽనిలః, కుపితః పిత్తమేవం తు కఫశ్చైవం స్వకాలతః, శీతదాహకరస్తీవ్రః త్రికాలం చానువర్తతే, స సన్నిపాతసమ్భూతో విషమో విషమజ్వరః, ఊర్ధ్వం కాయస్య గృహ్ణాతి యః పూర్వం సోఽనిలాత్మకః, పూర్వం గృహ్ణాత్యధః కాయం శ్లేష్మపూర్వజ్వరస్స్మృతః." చతుర్థక మను జ్వరము మిక్కిలి క్రూరంబై రసాదిధాతువుల నన్నిటిని శోషింపజేసి, శరీరముయొక్క బలమును వర్ణమును కాయాగ్నిని నశింపజేయు విషమజ్వరము. ఇయ్యది త్రిదోషములచే గల్గును. మరియు వాతపిత్తకఫములు మూడును అస్థిమజ్జలయందుజేరి ప్రకుపితములై తమతమ కాలములయందు చలిని తాపమును బుట్టించి ఉదయ మధ్యాహ్న సాయం కాలముల మూటియందును వ్యాపించి యనుసరించియుండును. అట్టి విషమజ్వరమున వాతం బధికముగ నుండుతరి తొలుత నూర్ధ్వ శరీరమున వ్యాపించును. కఫం బధికముగ నుండునపుడు తొలుత క్రిందిశరీరమున వ్యాపించి పిదప శరీరమునందెల్ల వ్యాపించును అని యర్థము. ఈమతమునగూడ వాతకఫభేదములు రెండుమాత్రమే నిర్దేశింపఁబడినవి. పిత్తమునుకూడ జెప్పియున్నను వాతకఫములవలె పిత్తమునకు స్థానమును

నిర్దేశించియుండలేదు. కావున పిత్తము అప్రధానముగ తక్కినదోషముల గూడి యుండు నని యీగ్రంథకారుని యభిప్రాయము.

తంత్రాంతరమున చతుర్థకసంప్రాప్తి నిట్లు చెప్పెను:—"ఆమాశయస్థః పవనో హ్యస్థిమజ్జగతోఽపి వా, కుపితః కోపయత్యాశు శ్లేష్మాణం పిత్తమేవ హి" అస్థిమజ్జలయందలి వాతము ప్రకోపితమై యామాశయమును జేరి పిత్తకఫములు ప్రకోపింపజేసి చతుర్థకజ్వరమును గల్గించు నని భావము. ఈ వాక్యము వలన త్రిదోషములును చతుర్థకజ్వరమున ప్రకోపించు నని తెలియుచున్నది. సాగభర్తృ తంత్రమున నీచతుర్థకమునకు స్థాననిర్ణయము నిట్లు చేసెను:—"ఊర్ధ్వం కాయస్య యః పూర్వం గృహ్ణాతి సోఽనిలాత్మకః, మధ్యం కాయస్య గృహ్ణాతి పూర్వం యస్తు స పిత్తజః, పూర్వం గృహ్ణాత్యధః కాయం శ్లేష్మపృష్ఠశ్చతుర్థకః." ఈ వాక్యము వలన తొలుత నూర్ధ్వశరీరమున వ్యాపించునది వాతాధికచతుర్థకం బనియును, మధ్యశరీరమున తొలుత వ్యాపించునది పిత్తాధికం బనియును, అధశ్శరీరమున వ్యాపించునది కఫాధికచతుర్థకం బనియు నేర్పడుచున్నది. ఇచ్చట వాతకఫములతోబాటి పిత్తాధికమునకుగూడ స్థానము నిర్దేశింపబడినది. కావున పిత్తోల్బణచతుర్థకజ్వరంబును కల దని యీతంత్రకారుని యాశయము. వాతకఫాధికచతుర్థకములవలె, [illegible] వ్యాప్తిలేక పిత్తాధికము కాదాచిత్కముగ సంభవించు నని చరక వాగ్భటాదులు పిత్తాధికమునకు ప్రధానముగ స్థానమును నిర్దేశించలే దని యూహింపవలసియున్నది.

మరియు విషమజ్వరములు కాలభేదముచేత వ్యాపించువిషయమై ప్రకారము నిట్లు తెలియునది:—"అహోరాత్రా దహోరాత్రాత్ స్థానాత్ స్థానం ప్రపద్యతే, తతశ్చామాశయం ప్రాప్య కరోతి విషమజ్వరమ్, కఫస్థానవిభాగేన యథాసంఖ్యం కరోతి హి, సతతాన్యేద్యుష్కత్ర్యాఖ్యచతుర్థకాన్ సప్రలేపకాన్." (సు. ఉ. అ. ౩౯.) అమాశయము, హృదయము, కంఠము, శిరస్సు, సంధులు అను నైదును కఫస్థానములయందును వాతాదిదోషములు ఒక్కొకయహోరాత్రమునకు ఒక్కొక్క స్థానమున సంచరించును. అట్టియెడ పైజెప్పిన యైదుస్థానములలో సంచరించుటచే వరుసగ సతత - అన్యేద్యుష్క - తృతీయక-చతుర్థక - ప్రలేపకంబులను నైదుజ్వరంబులను కల్గును. ఎట్టు లన:—ఆమాశయమున నుండు దోషము సతతకజ్వరమును కల్గించును. అయ్యది "వయోఽహోరాత్రిభుక్తానాం తేఽన్తమధ్యాదిగాః క్రమాత్" (అ. హృ. సూ. అ. ౧. శ్లో. ౭.) అను వాగ్భటులు చెప్పిన ప్రకారము పగటి ప్రథమకాలంబును, రాత్రి ప్రథమకాలంబును కఫమునకు ప్రధాన మగుటంజేసి పగటిపూట నొకసారియు, రాత్రివేళ నొకసారియు వ్యాపించును. కావున నే "అహోరాత్రే సతతకో ద్వౌ కాలావనువర్తతే" అని కాలనియమము సంగతమగును. కఫస్థానమైన హృదయమునుండి ఒక్కయహోరాత్రమునకు ఆమాశయమున దోషము

జేరి అన్యేద్యుష్క మను జ్వరమును కల్గించును. ఇయ్యది దినమున కొకసారివంతున వ్యాపించును. ఈవిషయమునే "అన్యేద్యుష్కస్త్వహోరాత్ర ఏకకాలం ప్రవర్తతే" అని నిర్ణయించిరి. కఫస్థానమైన కంఠమునసుండు దోషము ఒక యహోరాత్రమునకు హృదయమునను రెండవయహోరాత్రమున కామాశయంబునను వ్యాపించి జ్వరమును కల్గించి నివర్తించినదినమునకు మూడవనాడు మరల జ్వరమును వ్యాపింపజేయును ఇది తృతీయకజ్వరము. ఇదియే "తృతీయకస్తృతీయేహ్ని" అని చెప్పబడినది. కఫస్థానమైన శిరమునందలిదోషము ఒకయహోరాత్రమునకు కంఠమునందును, రెండవయహోరాత్రమునకు హృదయమునందును, మూడవయహోరాత్రమునకు ఆమాశయమునందును వ్యాపించి జ్వరవేగదినమునకు నాల్గవనాడు మరల జ్వరమును వ్యాపింపజేయును. ఇదియ చతుర్థకజ్వరము. దీనినే "చతుర్థేఽహ్ని చతుర్థకః" అని చెప్పిరి. సంధులయందుండుదోషము ఆమాశయమునజేరి ప్రలేపక జ్వరమును గల్గించు ఆమాశయమునందును సంధు లుండుటంజేసి యాసంధులయందు నిరంతరముగ దోషములు ఆశ్రయించియుండును. కావున ప్రలేపకజ్వరము అహోరాత్రములయం దెడలేక వ్యాపించును. సుశ్రుతమున "ప్రలేపకస్తు విషమః ప్రాయః శ్లేశాయ శోషిణాం" (సు. ఉ. అ. ౩౯.) అని ప్రలేపకము విషమజ్వరము కాకున్నను స్థానసామ్యమునుబట్టి విషమజ్వర మనియే చెప్పిరి.

పై నిర్ణయప్రకారము సతతకజ్వరమునకు ఆమాశయంబును, అన్యేద్యుష్కమునకు హృదయంబును తృతీయకజ్వరమునకు కంఠంబును, చతుర్థకజ్వరమునకు సంధులును నియతములగుస్థానము లని తెలియుచున్నది. ఐనను "దోషా హ్యామాశయాశ్రయాః, బహిర్నిరస్య కోష్ఠాగ్నిం జ్వరదాస్యూ రసానుగాః" అని జ్వరసామాన్యసంప్రాప్తిని చెప్పియున్నది, గాన పైజెప్పిన నిర్ణయప్రకారము నియతస్థానమునసుండి యామాశయమున జేరియే సతతాదిజ్వరముల గల్గించును. ఈవిషయమునే పైవాక్యమున "తతశ్చామాశయం ప్రాప్య" అని స్ఫుటముగ జెప్పిరి.

మరియు పైజెప్పినప్రకారము నియతకాలముగ ప్రకోపమునొందిన దోషములు తమశక్తికొలది జ్వరమును తనకు సంబంధించిన యుపద్రవములు కల్గించి మరల తనకు నిరుద్ధములగు కారణములయొక్కబలముచే బలహీనములై తమనెలవుల జేరును. అప్పుడు జ్వరము వేగంబుడిగి రసాదిధాతువులయందు లీనమై యణగియుండును. ఈవిషయమును వాగ్భటాచార్యుం డిట్లు చెప్పెను:—"దోషః ప్రవర్తతే తేషాం స్వే కాలే జ్వరయన్ బలీ, నివర్తతే పునశ్చైషః, ప్రత్యనీకబలాబలః, క్షీణే దోషే జ్వరః సూక్ష్మో రసాదిష్వేవ లీయతే" (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౬౫.) (ఇదియ విషమజ్వరవ్యాప్తినియమము.)

## చతుర్థకవిపర్యయలక్షణము

విషమజ్వర ఏవాన్యశ్చతుర్థకవిపర్యయః,
మధ్యేఽహాని జ్వరయతి హ్యాదావన్తే చ ముఞ్చతి. 47

చతుర్థకవిపర్యయ మనునదికూడ ఇంకొక విషమజ్వరము. ఈజ్వరము నడుమను రెండు దినములు నిరంతరముగ జ్వరము వ్యాపించి, అమరుసటిదినము జ్వరము లేకుండును. మరల నామరుసటిదిన మారంభించి రెండుదినములు విడువక వ్యాపించును. ఇట్టి సమయమున నడుమ రెండుదినములు వ్యాపించి ముందొకదినంబును వెనుకనొకదినంబును జ్వరములేకుండును. కావున 'ఆదావన్తే చ ముంచతి' అని చెప్పబడినది. జ్వరవేగము జూపిననాటికి నాల్గవదినము మరల జ్వరము వ్యాపించునది చతుర్థజ్వరము. దానికి విరుద్ధముగ జ్వరదినమునాటికి నాల్గవదినము మరల జ్వరములేకుండి నడుమ రెండుదినములు వ్యాపించుటంజేసి చతుర్థకవిపర్యయ మనబడును.

ఈయర్థమునే తంత్రాంతరముల నిట్లు చెప్పిరి:— "అస్థిమజ్జోభయగతే చతుర్థకవిపర్యయః, త్ర్యహాత్ ద్వ్యహం జ్వరయతి హ్యాదావన్తే చ ముంచతి." ఈవాక్యము పై మూలమునకు సమానార్థకము.

పై విషయమునే వివరింపుచు నీ చతుర్థకవిపర్యయమునకు వాతాదిదోషభేదములచే గల్గు త్రైవిధ్యమును వాగ్భటాచార్యుం డిట్లు చెప్పెను —"అస్థిమజ్జోభయగతే చతుర్థక విపర్యయః, త్రిధా, ద్వ్యహం జ్వరయతి దినమేకం తు ముఞ్చతి." (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౭౩.) వాతాదిదోషములలో నేదైనను అస్థిమజ్జల రెండిటి నాశ్రయించినపుడు చతుర్థకజ్వరమునకు విరుద్ధమైనలక్షణము కల చతుర్థక విపర్యయ మను జ్వరము కల్గును. ఇయ్యది రెండుదినములు జ్వరమును వేగమును జూపి యొకదినము జ్వరవేగ ముడుగును. ఈజ్వరము వాతపిత్తకఫముల మూడిటిసన్నిపాతమున జనించినను, "సన్నిపాతే తు యోభూయాన్ స దోషః పరికీర్తితః" అను చరకవచనప్రమాణము ననుసరించి మూడుదోషములలో వాతము ప్రబలముగ నున్నపుడు వాతిక మనియు, పిత్తము ప్రబలముగనున్నపుడు పైత్తిక మనియు, కఫము బలిష్ఠమైనపుడు శ్లైష్మిక మనియు మూడువిధముల నుండు నని భావము. పై జెప్పినవిషయమును చరకాచార్యుం డిట్లు చెప్పెను:— "విషమజ్వర ఏవాన్యః చతుర్థకవిపర్యయః, త్రివిధో ధాతురేకైకో ద్విధాతుస్థః కరోత్యయమ్." (చ. చి. అ. 3. శ్లో. ౭3) మూడుదోషములలో నొకటొకటి అస్థిమజ్జలరూపము లగు రెండుధాతువుల జేరి చతుర్థకవిపర్యయమును కల్గించును. కావున నయ్యది వాతాదిభేదములచే మూడువిధముల నుండు నని యర్థము. (ఇచ్చట "ధాతురేకైకః" అనుచోట ధాతుశబ్దమునకు దోష మని యర్థము.)

మరియు చతుర్థకవిపర్యయ మనునది చతుర్థకజ్వరమునకు విరుద్ధముగనుండుట మాత్రమేగాని చికిత్సాదులు చతుర్థకమునకు సమములుగా నుండును. గాన నీ రెండును సమాన మని యెంచియే "జ్వరః పంచవిధః ప్రోక్తః......సంతతస్సతతోఽన్యేద్యుస్తృతీయకచతుర్థకౌ" (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౫౭.) అని యైదువిధములు విషమజ్వరము లని పరిగణనమును వాగ్భటాదులు చేసిరి.

ఈచతుర్థకవిపర్యయమునుబట్టియే తృతీయక - సతతక - అన్యేద్యుష్కవిపర్యయముల మూడిటి నూహించునది—నడుమనొకదినమున జ్వరము వేగముజూపి ఆద్యంతదినములయందు జ్వరమువ్యాపించకున్న నయ్యది తృతీయకవిపర్యయము. ఉదయకాలమునందును రాత్రి ప్రథమకాలమునందును జ్వరము లేకుండి తక్కినకాలమెల్ల వ్యాపించునది సతతకవిపర్యయము. రాత్రియందైనను పగటియందైనను ఒకకాలమున జ్వరము లేకుండి తక్కినకాలమున వ్యాపించునది అన్యేద్యుష్కవిపర్యయము.

ఈమూడువిపర్యయముల యుత్పత్తిక్రమమును సుశ్రుతుం డిట్లు చెప్పెను— "కఫస్థానేషు వా తిష్ఠన్ దోషా ద్విత్రిచతుర్షు చ, విపర్యయాఖ్యాన్ కురుతే విషమాన్ కృచ్ఛ్రసాధనాన్" (సు. ఉ. అ. ౩౯.) ఆమాశయము, హృదయము కంఠము, శిరస్సు అను నీనాల్గు కఫస్థానములలో ఆమాశయహృదయస్థానముల రెండిటియందును దోషముచేరి అన్యేద్యుష్కవిపర్యయమును గల్గించును. ఆమాశయ, హృదయ, కంఠస్థానములు మూటియందును దోషము చేరి తృతీయకవిపర్యయమును గల్గించును. ఆమాశయ, హృదయ, కంఠ, శిరస్సులు నాల్గింటియందును దోషము వ్యాపించి, చతుర్థకవిపర్యయమును గల్గించు నని భావము.

### వాతబలాసకజ్వరలక్షణము

నిత్యం మన్దజ్వరో రూక్షః శూనక స్తేన సీదతి,
స్తబ్ధాఙ్గశ్శ్లేష్మభూయిష్ఠో నరో వాతబలాసకీ. 48

వాతకఫములు రెండును ప్రకుపితములై పిత్తముతో గలిసి వాతబలాస మను జ్వరమును గల్గించును. ఈజ్వరమునందు జ్వరముపైకి మందవేగముగల్గి యెడతెరపి లేకుండును. వాతము ప్రబలముగ ప్రకోపించుటంజేసి శరీరము జిడ్డులేక గరగరలాడుచుండును. శరీరమున వాపుకల్గును. అవయవములు స్తంభించి పనులుచేయ సామర్థ్యము లేకుండును. కఫస్థానములగు శిరస్సు మున్నగుస్థానములయందు కఫము నిండి భారముగ నుండును. ఇయ్యది మిక్కిలి క్రూరంబగుటంజేసి దీనిచే రోగి నశించును.

ఇయ్యది త్రిదోషముల ప్రకోపముచే గల్గును. అందు తొలుత వాతము ప్రకోపించి తక్కిన కఫపిత్తముల రెండిటిని ప్రకోపింపజేసి జ్వరమును గల్గించును. అట్టి

వాతము శిరంబునజేరి ప్రబలమైన తలపోటును గల్గించును. ఈవిషయము తంత్రాంతరమున "వాయుః ప్రకుపితో దోషావృద్ధీరోభ్యర్థా ప్రధావతి. సశిరస్థస్శిరశ్శూలం." ఇది మున్నుగువాక్యములచే వివరింపబడినది.

### ప్రలేపకజ్వరము

ప్రలిమ్పన్నివ గాత్రాణి ఘర్మేణ గౌరవేణ చ,
మన్దజ్వరవిలేపీ చ సశీతస్స్యాత్ప్రలేపకః. 49

బంధనతో గూడినచెమట శరీరమునందెల్ల వ్యాపించి పట్టుపెట్టినవిధముగ ఛాయబడియుండుట, శరీరము మిక్కిలి బరువైయుండుట, గొలుసుగానములతోగూడి మందవేగముగ చలితోగూడి వ్యాపించినజ్వరము ప్రలేపక మనబరగును. ఇయ్యది కఫపిత్తములచే జనించును. శరీరముపై చెమటవ్యాపించి పూసినట్లుండుటచే ప్రలేపక మని యన్వర్థముగ జెప్పబడినది.

### మరికొన్నివిషమజ్వరములు

విదగ్ధేఽన్నరసే దేహే శ్లేష్మపిత్తే వ్యవస్థితే,
తేనార్ధం శీతలం దేహే చార్ధం చోష్ణం ప్రజాయతే. 50
కాయే దుష్టం యదా పిత్తం శ్లేష్మా చాన్తే వ్యవస్థితః,
తేనోష్ణత్వం శరీరస్య శీతత్వం హస్తపాదయోః. 51
కాయే శ్లేష్మా యదా దుష్టః పిత్తం చాన్తే వ్యవస్థితమ్,
శీతత్వం తేన గాత్రాణాం ఉష్ణత్వం హస్తపాదయోః. 52

విదగ్ధాజీర్ణముచే నన్నరసము దుష్టంబై కఫపిత్తములు రెండును ప్రకోపమునొంది శరీరమునం దర్ధభాగము పిత్తంబును, అర్ధభాగమున కఫంబును వ్యాపించి జ్వరమును గల్గించును. అందు పిత్తము వ్యాపించిన శరీరభాగమునం దుష్ణముగను, కఫము వ్యాపించిన భాగమున చల్లగను ఉండును. పిత్తకఫములు వ్యాపించువిషయమున వ్యవస్థలేదు గాన ఊర్ధ్వాధోభాగములయందైనను, అర్ధనారీశ్వరునిబోలి శరీరమునం దిరుప్రక్కలనైనను శీతోష్ణములు వ్యాపించును. ఇచ్చట శరీరమున సగపాలున శీతంబును సగపాలున నుష్ణంబును శీతోష్ణములు విరుద్ధధర్మములయ్యును సమకాలమున వ్యాపించుటచేతను ఈజ్వరము విషమ మని యెరుంగునది.

పిత్తము ప్రకోపమునొంది శరీరమునందును, కఫము ప్రకోపమునొంది కాళ్లు సేతులయందును సమకాలమున వ్యాపించును. దానంజేసి శరీరమునమాత్రము వేడి యధికముగను కాళ్లుసేతులయందుమాత్రము చలువయును కలుగును.

పైజెప్పినదానికి వ్యతిరేకముగ దుష్టమైనకఫము శరీరమునందును, పిత్తము కాళ్లు సేతులయందును. వ్యాపించినచో మధ్యశరీరముమాత్రము చల్లనై హస్తపాదములు వేడిగనుండును ఇచ్చటకూడ విరుద్ధధర్మములైన శీతోష్ణములు సమకాలమునం దొక్కొక భాగమున వ్యాపించుటచే నీజ్వరము విషమ మనబడును.

దాహపూర్వ - శీతపూర్వ జ్వరలక్షణములు

త్వక్స్థౌ శ్లేష్మానిలౌ శీతం ఆదౌ జనయతో జ్వరం,
తయోః ప్రశాన్తయోః పిత్తమన్తే దాహం కరోతి చ. 53
కరోత్యాదౌ తథా పిత్తం త్వక్స్థం దాహమతీవ చ,
తస్మిన్ప్రశాంతే త్వితరౌ కురుతశ్శీతమన్తతః. 54
ద్వావేతౌ దాహశీతాదీ జ్వరౌ సంసర్గజౌ స్మృతౌ,
దాహపూర్వః తయోః కష్టః కృచ్ఛ్రసాధ్యతమశ్చ సః. 55

కఫవాతములు రెండును ప్రకుపితములై త్వక్స్థానమున నుండు రసధాతువున జేరి తొలుత శరీరమున చలి పుట్టించును. అట్టి కఫవాతములు శమించి దాన గల్గిన చలి నివర్తించి తోడనే ప్రకోపమునొందిన పిత్తముచేత శరీరముపైనంతట సంతాపముగల్గి తీవ్రముగ జ్వరము వ్యాపించును. ఇయ్యది చలి మొదటవచ్చి పిదప జ్వరము వ్యాపించుటంజేసి శీతపూర్వజ్వర మని చెప్పనగును. తొలుత పిత్తము ప్రకోపించి త్వక్కున నుండు రసధాతువున వ్యాపించి శరీరమునందెల్ల సంతాపము గల్గించి జ్వరము తీవ్రముగ వచ్చును. ఆపిత్తము తనంతటనే శమించి దానంగల్గు జ్వరవేగము తగ్గినతోడనే కఫవాతములు రెండును ప్రకుపితములై యోరువరాని చలి బుట్టించును. ఇయ్యది తొలుత సంతాపపూర్వకమగు జ్వరము గల్గుటంజేసి దాహపూర్వకజ్వర మని చెప్పనంబడును. ఈ జ్వరములు రెండును వాతకఫములు రెండును ప్రకోపించుటచే గల్గును. కావున సంసర్గజములు. ఈరెంటిలో తొలుత తాపము గల్గి పిమ్మట చలివచ్చుజ్వరము శరీరమునకు మిక్కిలి కష్టమును గల్గించును. మిక్కిలి కృచ్ఛ్రసాధ్య మగును. చలివచ్చి పిమ్మట వ్యాపించు జ్వరముమాత్రము సాధ్యమైయుండును. (ఇదియే చలిజ్వర మని లోకమున పామరసాధారణముగ వాడంబడును.)

విషమజ్వరములయందు వాతపిత్తశ్లేష్మములు జ్వరము పూర్తిగ నివర్తించు వరకు బొత్తుగ శమించుటలేదు. ప్రకోపావస్థయందే యుండును. దానివలననే బడలిక, గురుత్వము, కృశత, ఇవి రోగిని విడువకయే అనుసరించియుండును. అయినను జ్వరవేగము తగ్గినపుడు త్రిదోషములు జ్వరమున కాశ్రయమైన ధాతువును వదలి తక్కిన ధాతువులలో నెద్దానియందైన దాగియుండును. దానంజేసి

మిక్కిలి సూక్ష్మముగ నుండుటవలన వానివేగము తెలియక శాంతినొందినవానివలె తెలియవచ్చును గాని బొత్తుగ శాంతినొందుట లేదు. ఈవిషయమును సుశ్రుతాచార్యుం డిట్లు తేటగను దెలిపెను. "స చాపి విషమో దేహం న కదాచిద్విముఞ్చతి। గ్లాని గౌరవకార్శ్యేభ్యః స యస్మాన్నవిముచ్యతే, వేగేతు సమతిక్రాన్తే గతోఽయమితి లక్ష్యతే। ధాత్వన్తరస్థో లీనత్వాత్సౌక్ష్మ్యాన్నైవోపలభ్యతే" (సు. ఉ. అ. 39.) ఈన్యాయము ననుసరించి ప్రకృతమున "ప్రశాంతగోపి" అన్నచోట వేగము దక్క శాంతము నొందినదానివలె ధాత్వంతరమున లీనములై యుండునపుడు అని యర్థముచేయుట సమంజసము.

మరియు విషమజ్వరములు ఏదోషములచే గలిగినను పిత్తకఫములు రెండును స్వతంత్రశక్తిలేనివి యగుటవలన వానిని వాతము ఆకర్షించి వానితోగూడి జ్వరమును గలిగించును, కావున వాతసంబంధములేక విషమజ్వరములు గలుగుటలేదు. దానంజేసియే ఈ జ్వరములయందు వాతము ప్రధానమైన కారణముగ నుండును. ఈ విషయమును "నర్తేనిలాద్భవ విషమజ్వరస్సముపజాయతే, గచ్ఛేత్తేపి నిశ్చేష్టే చేష్టయత్యనిలస్సదా" (సు. ఉ. అ. 39.) అనువాక్యముచే సుశ్రుతాచార్యులును, "పవనో గతివైషమ్యాద్విషమజ్వరకారణమ్" ఇది మున్నగువాక్యములచే నితర తంత్రకారులును శాసించియున్నారు.

పైజెప్పిన సంతతసతతకాది జ్వరములుగాక మరికొన్ని విషమజ్వరములు తంత్రాంతరములయందు గానంబడియెడు. అందు జేరినవి రాత్రిజ్వరము, పగటి జ్వరము. వీనిలక్షణములు గ్రంథాంతరమున నిట్లున్నవి:—"సమౌ వాతకఫౌ యస్య హీనపిత్తస్య దేహినః, ప్రాయో రాత్రౌ జ్వరస్తస్య దివాహీనకఫస్యచ." వాతకఫములు రెండును సమానములుగ ప్రకోపించి పిత్తహీనస్థితినుండుకరి రాత్రిజ్వరము కల్గుననియు, పిత్తము ప్రకోపించి కఫవాతములు హీనములై యుండునపుడు పగటి జ్వరము వచ్చుననియు భావము.

ఈ విషమజ్వరములలో ప్రారంభమున నొకటి రెండువిధములు కొన్నిదినములు వ్యాపించి అయ్యది వేరొండుజ్వరముగ కొంతకాలమునకు మారుటయును గలదు. సతతకజ్వరము ప్రారంభమై సంతతజ్వరముగను, తృతీయకజ్వరము చతుర్థకముగను, ఇట్లనేకవిధముల మారుచుండును. ఇట్టిమార్పుగలుగుటకు అదూరాలుగువృలు, అహోరాత్రములు, దోషములు, మనస్సు, కాలము, మిథ్యాహారవిహారాదులు మున్నగు వానిబలాబలములే కారణములై యుండును. ఈ విషయమును చరకాచార్యులు "ఋత్వహోరాత్రదోషాణాం మనసశ్చ బలాబలాత్, కాలమర్థవశాచ్చైవ జ్వరస్తం తం ప్రపద్యతే" (చ. చి అ. 3.) అని యుపదేశించిరి.

## —— రసగతజ్వరము ——

గురుతా హృదయోత్క్లేశః సదనం ఛర్ద్యరోచకౌ,

రసస్థే తు జ్వరే లిఙ్గం దైన్యం చాస్యోపజాయతే. 56

దోషములు ప్రకుపితములై రసధాతువున జ్వరమును కలిగించినచో శరీరము బరువుగా నుండును. రొమ్మున నొప్పిగలిగి ఓకరింతలు వచ్చును. అవయవములయందు నొప్పిపుట్టును. వాంతి యగును. నోటికి రుచి తెలియకుండును. మనస్సు మిక్కిలి చంచలమై దీనత నొందును.

పైజెప్పంబడిన వాతపిత్తకఫములచే జనించుజ్వరములలో నెద్దానియందైనను ఈలక్షణములు గానంబడినచో నయ్యది రసధాతువున జనించిన దని యెరుంగునది. అట్టిసమయమున జ్వరమున కాశ్రయమైన రసధాతువునకు విరోధము లేకుండునట్లు ఆయాజ్వరమునకు చికిత్సజేయుట ముఖ్యకర్తవ్యము. పైజెప్పంబడు రక్తాదిధాతుగత జ్వరములయందును ఈపద్ధతినే యవలంబించునది.

### రక్తగతజ్వరము

రక్తనిష్ఠీవనం దాహో మోహశ్ఛర్దనవిభ్రమౌ,
ప్రలాపః పిటకా తృష్ణా రక్తప్రాప్తే జ్వరే నృణామ్. 57

దోషములు ఆయాకారణములచే ప్రకోపమునొంది రక్తధాతువున జ్వరమును గలిగించినచో నోట రక్తము నుమియుచుండును. శరీరమున మంటపుట్టును, మూర్ఛ వచ్చును, వాంతియగును, ఒడలు తిరుగునట్లుండును, సంబంధములేక మాటలాడును, శరీరమునం దచ్చుటచ్చుట పొక్కులు లేచును, దప్పియగును.

### మాంసగతజ్వరము

పిణ్డికోద్వేష్టనం తృష్ణా సృష్టమూత్రపురీషతా,
ఊష్మాన్తర్దాహవిక్షేపౌ గ్లానిస్స్యాత్ మాంసగే జ్వరే. 58

మాంసధాతువు నాశ్రయించి జ్వరముకలిగినయెడ పిక్కలయందు మాంసమున విరుగగొట్టినట్లు నొప్పి గలుగును. దప్పిపుట్టును. మూత్రపురీషములు అప్పుడప్పుడు పలుమారు వెడలుచుండును. శరీరముపైవేడి యధికముగను, శరీరములోభాగము మిక్కుటమైన సంతాపము కలుగును. చేతులు కాళ్లును పలువిధములుగ కదలించుచుండును. శరీరము బడలియుండును.

### మేదోగతజ్వరము

భృశం స్వేదస్తృషా మూర్ఛా ప్రలాపశ్ఛర్దిరేవ చ,
దౌర్గన్ధ్యారోచకౌ గ్లానిర్మేదస్థే చాఽసహిష్ణుతా. 59

మేదోధాతువున జనించినజ్వరమునందు శరీరమున చెమట [illegible] దప్పి యధికమగును, మూర్ఛవచ్చును. అసంబద్ధముగ మాటలాడును. వాంతి యగును. శరీరమున అసహ్యమైన దుర్గంధము గలుగును. బడలికయుండును. బాధల [illegible] రోగి కష్టపడుచుండును.

అస్థిగతజ్వరము

భేదోఽస్థ్నాం కూజనం శ్వాసో విరేకశ్ఛర్దిరేవ చ,
విక్షేపణం చ గాత్రాణాం ఏతదస్థిగతే జ్వరే. 60

ఎముకల నాశ్రయించి కలిగినజ్వరమునందు అస్థుల విరుగగొట్టినట్లు నొప్పి పుట్టును. పలుమారు మూలుగుచుండును. శ్వాస మధికమగును. వాంతియును విరేచనములును పలుమారగుచుండును. అవయవములును పలువిధములుగ వణికిపోవుచుండును.

మజ్జగతజ్వరము

తమఃప్రవేశనం హిక్కా కాసశ్శైత్యం వమిస్తథా,
అంతర్దాహో మహాశ్వాసః మర్మభేదశ్చ మజ్జగే. 61

మజ్జాధాతువు నాశ్రయించిన జ్వరమున చీకటిలోనుండు విధముగ కన్నులు గానరాకుండును. ఎక్కిళ్లు దగ్గు అధికముగ వచ్చును. చలి పుట్టును. వాంతి యగును. శరీరమునకు లోభాగమున తాప మధికమగును. ఊపిరాడక శ్వాసమును దీర్ఘముగ విడుచును. కణతలు, భ్రూమధ్యము మున్నగు ప్రాణాధారములైన మర్మస్థానములయందు పగులగొట్టినట్లు నొప్పి కలుగును. (ఇచ్చట మజ్జ యనగా ఎముకలోనుండు క్రొవ్వు.)

శుక్రగతజ్వరము

మరణం ప్రాప్నుయాత్తత్ర శుక్రస్థానగతే జ్వరే,
శేఫసస్స్తబ్ధతా మోక్షః శుక్రస్య తు విశేషతః. 62

పైజెప్పిన ధాతువులకన్నిటికిని సారవంతమై జీవమునకు ముఖ్యాధారమైనధాతువు. అట్టిధాతువు నాశ్రయించిన జ్వరము కలిగినప్పుడు పురుషాంగము స్తంభించి యుండును. శుక్రము కారణములేకయే పలుమారు తనంతటనయును వెడలుచుండును. ఇయ్యది ప్రాణాధారమైన ధాతువును చెరచుటచేసి యీజ్వరమున మనుజుడు మృతిజెందును. పాలయందంతటను నెయ్యి వ్యాపించియుండువిధముగను, చెఱకురసమున బెల్లము కలసియుండు తెరంగునను శరీరమునందెల్ల శుక్రము వ్యాపించి లీనముగ నుండును. ఈవిషయమున తంత్రాంతరమునం దీరీతి నున్నది:—"యథా పయసి సర్పిస్తు గుడశ్చేక్షురసే యథా, శరీరేషు తథా నృణాం శుక్రం విద్యాద్భిషక్

గ్వరః" (సు. శా. అ. ౪. శ్లో. ౨౦.)పైజెప్పిన రీతిగ శరీరమునందెల్ల వ్యాపించి శరీర ధారణమునకు ముఖ్యముగనుండు శుక్రమున జ్వరము వ్యాపించినచో దానివలన పలుతెరంగులైన యుపద్రవములు సంభవించి యసాధ్యమై తుదకు ప్రాణములను హింసించును.

## ధాతుగతజ్వరములలో సాధ్యాసాధ్యములు

(రసరక్తాశ్రితస్సాధ్యో మాంసమేదోగతశ్చ యః,
అస్థిమజ్జగతః కృచ్ఛ్రః శుక్రస్థస్తు న సిధ్యతి.) 63

పైజెప్పిన ధాతుగతజ్వరములలో రసము, రక్తము, మాంసము, మేదస్సు అను నీ నాల్గుధాతువుల నాశ్రయించినజ్వరములు సాధ్యము లగును. అస్థులను మజ్జను ఆశ్రయించిన జ్వరములు కృచ్ఛ్రసాధ్యములగును. శుక్రధాతువున బుట్టినజ్వరము మిక్కిలి యసాధ్యము.

## జ్వరమునకు ప్రాకృతవైకృతభేదములు

వర్షాశరద్వసంతేషు వాతాద్యైః ప్రాకృతః క్రమాత్,
వైకృతోఽన్యస్స దుస్సాధ్యః ప్రాకృతశ్చానిలోద్భవః. 64

వర్షఋతువు వాతమునకును, శరదృతువు పిత్తమునకును, వసంతఋతువు కఫమునకును ప్రధానము లగును. (అనగా నాయాఋతువునకు జెప్పిన ధర్మములు ఆయాదోషమునకు సమానములుగ నుండు ననుట,) అందు వర్షర్తువునందు దానికి సమానములగు ధర్మములు గలవాతము ప్రకృతి యనంబరగు. అట్టివాతముచేత వర్షర్తువున గల్గినజ్వరము ప్రాకృతము నాబరగు. శరదృతువునకు సమానధర్మములు గల పిత్తము ప్రకృతి యనంబడును. ఆపిత్తముచేత శరదృతువున గల్గిన జ్వరము ప్రాకృతము నాబరగు. వసంతఋతువునకు సమానధర్మములు గల కఫము ప్రకృతి యనంబరగు. అట్టికఫముచే వసంతఋతువున గల్గినజ్వరము ప్రాకృత మనబడును. (అనగా వర్షర్తువున జనించిన వాతజ్వరంబును, శరదృతువున గల్గినపిత్తజ్వరంబును, వసంతఋతువున జనించిన కఫజ్వరంబును, ప్రాకృతము లనుట) హేమంత - శిశిర - గ్రీష్మఋతువులయందు వాతాదులకు విరుద్ధములగుధర్మములు గల్గియుండును. అట్టివిరుద్ధధర్మములుగల కాలమున ప్రకోపించిన వాతాదులు వికృతులు. వానిచే నాఋతువులయందు బుట్టినజ్వరములు వైకృతములు. అందు పైజెప్పిన ప్రాకృతజ్వరములలో శరద్వసంతములయందు పిత్తకఫములచే బుట్టిన ప్రాకృతజ్వరములు సులభప్రయత్నముచే సాధింపదగియుండును. వర్షర్తువున వాత ప్రకోపముచే బుట్టిన ప్రాకృతజ్వరంబును, హేమంతశిశిరగ్రీష్మములయందు వాతాదులచేగల్గిన వైకృతజ్వరంబులును కష్టసాధ్యము లగును.

ఇచ్చట ఋతువునకు జ్వరమునకు కారణమైన దోషమునకు ధర్మము సమముగ నుండుట సుఖసాధ్యమునకు కారణము. ఋతువునకును దోషమునకును ధర్మము విరుద్ధముగ నుండుట కష్టసాధ్యమునకు గారణము. వసంతఋతువున జనించిన వాతజ్వరము ఋతువునకు సమానధర్మమైనను వ్యాధిస్వభావమునంజేసి దుస్సాధ్యముగనే యుండును. సమాన ఋతుధర్మములుగల దోషముచే జనించిన జ్వరము సుఖసాధ్య మగుటకు గ్రంథాంతరమున నీరీతిగ నున్నది:—"జ్వరే తుల్యర్తుదోషత్వం ప్రమేహే తుల్యదూష్యతా, రక్తగుల్మే పురాణత్వం సుఖసాధ్యస్య లక్షణమ్" జ్వరమున ఋతువునకు సమానధర్మమైన దోషముచే జనించుటయు, ప్రమేహమున దోషదూష్యములు సమానగుణములుగ నుండుటయు, రక్తగుల్మమున చిరకాలము గడచుటయు సుఖసాధ్యత్వలక్షణము లని భావము. ఋతుదోషములు సమానగుణములై యుండుట సుఖసాధ్యత్వకారణ మనుట జ్వరమునకు దక్క తక్కినవ్యాధులయందు జెప్పం జనదు. రక్తగుల్మమునందు "మాసే వ్యతీతే దశమే చికిత్స్యః" అని కాలనియమము చరకమున గానంబడియెడు.

## ప్రాకృతజ్వరోత్పత్తిక్రమము

వర్షాసు మారుతో దుష్టః పిత్తశ్లేష్మాన్వితో జ్వరమ్,
కుర్యాత్పిత్తం చ శరది తస్య చానుబలః కఫః. 65
తత్ప్రకృత్యా విసర్గాచ్చ తత్ర నానశనాద్భయమ్,
కఫో వసంతే తమపి వాతపిత్తం భవేదను. 66

వర్షఋతువునందు మిథ్యాహారాదులచేతను, ఋతుస్వభావముచేతను, వాతము ముఖ్యమై ప్రకోపమునంది పిత్తకఫములం గలసి తీవ్రముగ జ్వరమును గల్గించును. ఇందు వాతము ప్రధానమై పిత్తకఫములు రెండును అనుబంధములై సహాయకములుగ నుండును. శరదృతువున మిథ్యాహారాదులచేతను, ఋతుస్వభావముచేతను పిత్తము ప్రకోపము నొంది కఫముతో గలిసి జ్వరమును బుట్టించును. ఇందు పిత్తము ప్రధానమై కఫమును బంధమై యుపబలముగ నుండును. ఈ రెండు జ్వరములయందును దోషముల ప్రకృతి చేతను, వర్షాశరదృతువులు రెండును విసర్గకాలం బగుటంజేసియును లంఘనముచే భయము లేదు. లంఘనము జ్వరములయందు ప్రధానమగు చికిత్స గనుక యట్టి లంఘనమునుపదికిత్సకు శరీరము తాళియుండునుగాన నీరెండు జ్వరములును సుఖసాధ్యంబు లగును. (సూర్యుడు వర్షా-శర-ద్హేమంతఋతువులయందు మనుజకోటికి బలమును గల్గించును గాన విసర్గకాల మనంబడును. వర్షాశరదృతువులు విసర్గకాల మగుటంజేసి ప్రకృతమున కాలమున మనుజులును స్వభావముచేతనే బలిష్ఠులుగ నుండుదురు గాన లంఘనమున కోర్వగల్గి యుందురు.) మరియు కఫపిత్తములు రెండును ప్రవరూపములైన ధాతువులుగాన లంఘ

ణమునకు ఓరువదగియుండు నని "కఫపిత్తే ద్రవే ధాతూ సహేతే లఙ్ఘనం మహత్, అమక్షయాత్ ఊర్ధ్వమతో వా యంర్న సహతే క్షణమ్" అనువాక్యముచే గ్రంథాంతరమున జెప్పబడియున్నది. వసంతఋతువున మిథ్యాహారవిహారములం జేసియు, ఋతుస్వభావముచేతను కఫము ప్రకోపమునొంది జ్వరమును గల్గించును. వాతపిత్తములు రెండును దాని కనుబంధములై సహకారులుగ నుండును. ఇదియ ప్రాకృతజ్వరోత్పత్తి క్రమము.

కాలే యథాస్వం సర్వేషాం ప్రవృత్తిర్వృద్ధిరేవ వా,
నిదానోక్తాఽనుపశయో విపరీతోపశాయితా. 67

వర్షా-శర-ద్వసంతఋతువులయందు ఋతుస్వభావమునుబట్టి వరుసగ వాతపిత్తకఫములు ప్రకుపితము లగును. దానంజేసి వర్షర్తువున వాతజ్వరమును, శరదృతువున పిత్తజ్వరమును, వసంతర్తువున కఫజ్వరమును పైజెప్పినరీతిగ వరుసగ జనించును. లేక కలిగిన జ్వరములు వృద్ధినొందును. పైఋతువులయందు త్రిదోషములకును నిదానములుగ జెప్పబడిన మిథ్యాహారవిహారాదులచేత ప్రకుపితములై జ్వరములకు పైజెప్పినరీతిగ కారణములు. అట్టిదోషములకు విరుద్ధగుణములైన ఔషధాన్నవిహారముల సేవించుటచేత దాన గలిగిన జ్వరము శాంతినొందును.

## అంతర్వేగజ్వరలక్షణము

అంతర్దాహోఽధిక స్తృష్ణా ప్రలాపశ్శ్వసనం భ్రమః,
సన్ధ్యస్థిశూలమస్వేదో దోషవర్చోవినిగ్రహః. 68
అన్తర్వేగస్య లిఙ్గాని జ్వరస్యైతాని లక్షయేత్,

శరీరమునందలి యంతర్భాగమునందుండు హృదయాద్యవయవములయందు వేగమును జూపు జ్వరము అంతర్వేగజ్వర మనబడును. ఈ జ్వరమునందు అంతరవయవములయందు తాపం బధికమగును. దప్పి తీవ్రముగ నుండును. అసంబద్ధముగ మాటలాడును. శ్వాసం బధికమగును. మతిభ్రమ గల్గును. కీళ్లయందును, అస్థులయందును నొప్పిగలుగును. శరీరముపై చెమట ఇంచుకేనియు బొడమదు. వాతాది దోషములును మలంబును బద్ధగించును.

## బహిర్వేగజ్వరలక్షణము

సంతాపో హ్యధికో బాహ్యః తృష్ణాదీనాం చ మార్దవమ్. 69
బహిర్వేగస్య లిఙ్గాని సుఖసాధ్యత్వమేవ చ,

శరీరమున త్వగింద్రియముపై వ్యాపించుజ్వరము బహిర్వేగజ్వర మనబడును. ఈజ్వరమునం దొడలి పైభాగమున విశేషముగ వేడియు, సంతాపమును గలుగును. దప్పి మొదలగునవి మిక్కిలి తీవ్రముగాక స్వల్పముగ నుండును. పైజెప్పిన ప్రలాపము, శ్వాసముగూడ సూక్ష్మముగనే యుండును.

## ఆమజ్వరలక్షణము

లాలాప్రసేకహృల్లాసహృదయాశుద్ధ్యరోచకాః. 70
తన్ద్రాలస్యావిపాకాస్యవైరస్యం గురుగాత్రతా,
క్షున్నాశో బహుమూత్రత్వం స్తబ్ధతా బలవాన్ జ్వరః. 71
ఆమజ్వరస్య లిఙ్గాని న దద్యాత్తత్ర భేషజం,
భేషజం హ్యామదోషస్య భూయో జ్వలయతి జ్వరమ్. 72

రసాదిధాతువులయందలి మలములును, వాతాదిదోషంబులును పక్వములు గాకుండునంతవరకును, జ్వరము ఆమ మనియు, పక్వములైన పిదప నిరామ మనియు చెప్పంబడును. అందు ఆమజ్వరమునందు నోట జొల్లుగారుచుండును. ఓకరింతలు వచ్చును. హృదయమున పసరు మున్నగునవి చెడి బరువుగ నుండును. నోటికి ఆహార పదార్థములయందు రుచిపుట్టదు. మైకము కల్గును. పనులయం దుత్సాహము లేకుండును. భుజింపబడిన యాహారము జీర్ణము కాకుండును. నోటికి మధురాదిరసములు స్వభావిక ముగ దెలియవు. శరీరము బరువుగ నుండును. ఆకలి బొత్తుగ గల్గదు. మూత్రము మాటిమాటికి కొంచెము కొంచెముగ వెడలుచుండును. సంధిబంధములు స్తంభించియుండును. జ్వర ముత్కటమై ప్రబలముగ నుండును. ఈలక్షణములబట్టి జ్వరము ఆమముగ నున్నదని యెరుంగునది. జ్వరము అట్టి యామావస్థయందున్న యౌషధము నుపయోగించి నచో నదియు జీర్ణముగాని జ్వరమును మిక్కుటముగ జ్వలింపజేయును. కావున ఆమావస్థయందు ఔషధము సేవింపంజనదు.

జ్వరమునందు దోషములును, మలములును పరిపాకము నొందుటకు కాలనియ మము గ్రంథాంతరమున నిట్లు కానంబడియెను:—"సప్తాహేన హి పచ్యన్తే సప్తధాతుగతా మలాః నిరామశ్చాప్యతః ప్రోక్తో జ్వరః ప్రాయోఽష్టమేఽహని." రసము, రక్తము, మాంసము, మేదస్సు, అస్థి, మజ్జ, శుక్రము నని ధాతువులు ఏడు. వానికి సంబంధించిన మలములు జ్వరమువచ్చిన నాటనుండి యేడు దినములకు వరుసగ పరిపక్వము లగును. ఏడుదినములు గడచినపిదప జ్వరంబును పరిపక్వంబగును, కావున ఎనిమిదవనాడు జ్వరమునకు చికిత్సచేయుట యుచితము. అటుగాక పొరపాటువశమైన ఆమావస్థ యందు ఔషధము నుపయోగించినచో నదియుకుండ జీర్ణముగాక జ్వరము వృద్ధి నొందుటకు దోడ్పడును.

జ్వరము పరిపక్వంబైన లక్షణముల సుశ్రుతాచార్యుం డిత్తెరంగున నుడివెను:- "మృదౌ జ్వరే లఘౌ దేహే ప్రచలేషు మలేష్వపి, పక్వం దోషం విజానీయాజ్జ్వరే దేయం తదౌషధమ్." (సు. ఉ. అ. ౩౯) జ్వరము తీవ్రత తగ్గి మిగుల స్వల్పమై శరీరము బరువుగా నుండక చులకనై మలములు ఆయాస్థానములనుండి చలించి యున్నచో జ్వరము పక్వావస్థయందున్న దని యెఱుంగదగు. అట్టియవస్థ నెఱింగి యౌషధము నుపయోగించునది.

మఱియు ఏడురాత్రులకు పిమ్మట ఔషధము నియ్యదగు నని కొందరును, పది దినములకు పిమ్మట ఔషధము నిచ్చుట మంచి దని మఱికొందరును అభిప్రాయపడిరి. ఇట్టి కాలభేదమును సుశ్రుతాచార్యుడు "సప్తరాత్రాత్పరం కేచిన్మన్యన్తే దేయ మౌషధం, దశరాత్రాత్పరం కేచిత్ దాతవ్యమితి నిశ్చితమ్" (సు. ఉ. అ. ౩౯) అని తెల్పియున్నాడు.

ఈవిషయమున వాగ్భటాచార్యుడును సమ్మతించి కొంచెము భేదమును కను బరచెను:—"సప్తాహాదౌషధం కేచిదాహురన్యే దశాహతః, కేచిల్లఘ్వన్న భుక్తస్య యోజ్యమామోల్బణేన తు, తీవ్రజ్వరపరీతస్య దోషవేగోదయే యతః, దోషే థవాఽతినిచితేద్రాప్తైమిత్యకారిణి, అపచ్యమానం భైషజ్య భూయో జ్వలయతి జ్వరమ్)" (అ. హృ. చి. అ. ౧. శ్లో. ౪౨) ఏడుదినములకు పిమ్మట ఔషధము నీయవలయు నని కొందరును, పదిదినములకు పిమ్మట మండ పేయ (గంజి) మొదలగు లఘువైనయాహారము చేయించి పిమ్మట నౌషధము నుపయోగించవలె ననియు నుడివిరి. అటుగాక జ్వరము తీవ్రముగా నుండునపుడు ఔషధము నుపయోగించినచో నయ్యది జీర్ణముగాక జ్వరమును వృద్ధినొందించును.

ఇచ్చట జ్వరమున కౌషధము నుపయోగించువిషయమైన కాలనియమమున మత భేదములు కానంబడుచున్నవి. అయ్యది దోషములయొక్కయు, మలముల యొక్కయు బలాబలములనుబట్టి కలిగినది. ముఖ్యమునకు దోషమలములు పరిపక్వములుగాక జ్వరము ఆమావస్థయందుండి మిక్కిలి తీవ్రముగా నుండునపుడు ఔషధంబించుకేనియు ఉపయోగింపజన దని యన్నిమతముల యభిప్రాయము, కొన్ని సమయములందు పై కాలనియమము నిరీక్షించక దోషమలములు పరిపక్వములై జ్వరము నిరామావస్థయందున్నపుడును, జ్వరము వచ్చిన కొద్దికాలముననే యౌషధము నుపయోగింపవచ్చును. ఈ యభిప్రాయమునే వాగ్భటాచార్యుడు "మృదుర్జ్వరో లఘుర్దేహః చలితాశ్చ మలా యదా, అచిరజ్వరితస్యాపి భేషజం కారయేద్బుధః" (అ. హృ. చి. అ. ౧. శ్లో. ౪౪.) అని కంఠోక్తిగ తనమత

మును సూచింపుచు సప్తాహాదికాలనియమమును కేచిత్పక్షముగా జెప్పెను. సుశ్రుతాచార్యుండును, "మృదౌ జ్వరే లఘౌ దేహే ప్రచలేషు మలేషు చ పక్వం దోషం విజానీయాత్, జ్వరే దేయం తదౌషధమ్" (సు. ఉ. అ. 39.) అను శ్లోకమున తనయభిమతము జెల్పుచు "సప్తరాత్రాత్పరం కేచిత్" అని మతాంతరముల నిర్దేశించెను. ఏమతమునందైనను జ్వరము పరిపక్వంబైనటులు లక్షణములు స్పష్టముగా గానవచ్చునపుడు ఔషధం బిచ్చుట యుక్త మనియు, కొంచెమైనను ఆమముగ నున్నపుడు ఉపయోగించుట అనర్థదాయక మనియు సమంజసమైన యభిప్రాయము.

### పచ్యమానజ్వరలక్షణము

జ్వరవేగోఽధికస్తృష్ణా ప్రలాపశ్శ్వసనం భ్రమః,
మలప్రవృత్తిరుత్క్లేశః పచ్యమానస్య లక్షణమ్. 7.3

దోషములును, మలంబులును పరిపాకము నొందుచు, జ్వరము పరిపాకావస్థ నొందుసమయమున జ్వరవేగము మిక్కిలి తీవ్రమగును. దప్పి యధికమగును. అసంబద్ధముగ మాటలాడును. శ్వాసమును తీవ్రముగ విడుచును. ఒడలు తిరుగుచున్నట్లుండును. మలములు ధారాళముగ వెడలును. ఓకిరింతలును వాంతులును వచ్చును.

### పక్వజ్వరలక్షణము

క్షుత్ క్షామతా లఘుత్వఞ్చ గాత్రాణాం జ్వరమార్దవం,
దోషప్రవృత్తిరష్టాహో నిరామజ్వరలక్షణమ్. 7.4

దోషములు మలములు పరిపక్వములై జ్వరము నిరామావస్థ నొందినపుడు శరీరము ఆకలిచే బడలియుండును. శిరస్సుమున్నగు అవయవములయందు నొప్పి మొదలగుబాధలు లేక తేలికగా నుండును. జ్వరవేగము తగ్గి సూక్ష్మముగ నుండును. మలములు సకాలమున సరళముగ వెడలును. ఇట్టిలక్షణములు ప్రాయికముగ జ్వరము వచ్చిననాటనుండి ఎనిమిదవనాడు గానంబడును.

### సాధ్యజ్వరలక్షణము

బలవత్స్వల్పదోషేషు జ్వరస్సాధ్యోఽనుపద్రవః,

రోగి శరీరమున బలముగలిగి, స్వల్పమైనకారణములచే ప్రకుపితములైన వాతాది దోషమువలన జ్వరము కలిగి, దగ్గు అరోచకము మొదలగు ఉపద్రవములు లేకయుండునెడ అయ్యది యౌషధములచే సుఖముగ సాధింపబడగ యుండును. ఉపద్రవము లనగా ఒకరోగము గలిగినపిదప దానికి ఉపష్టంభకములుగ కలిగిన

యితరరోగములు. అట్టి జ్వరోపద్రవములు గ్రంథాంతరమున నిట్లు నిర్దేశింపబడియె:— "కాసో మూర్ఛాఽరుచిశ్ఛర్దిః తృష్ణాఽతీసారవిడ్గ్రహః, హిక్కా-శ్వాసాఙ్గభేదాశ్చ జ్వరస్యోపద్రవాదశ" దగ్గు, మూర్ఛ, అరోచకము, వమనము, డప్పి, విరేచనములు, మలము బద్ధకము వెడలుట, ఎక్కిళ్లు, శ్వాసము, ఒడలినొప్పులు ఇయ్యవి జ్వరమున గల్గు నుపద్రవములు.

## అసాధ్యజ్వరలక్షణములు

హేతుభిర్బహుభిర్జాతో బలిభిర్బహులక్షణః. 75
జ్వరః ప్రాణాన్తకృద్యశ్చ శీఘ్రమింద్రియనాశనః,

పలుదెరంగులయిన మిథ్యాహారవిహారాదులచే నుత్కటముగ ప్రకోపమునొంది రసాదిధాతువులలో ననేకముల నాశ్రయించిన వాతాదిదోషములచే జ్వరము కలిగి, జ్వరలక్షణములు ఆయాజ్వరములకు చెప్పియున్నవియెల్ల కలిగి, చక్షురాదీంద్రియదశకమును, మనస్సును, ఆయావిషయములయందు ప్రవర్తింపనీయక వానిశక్తిని నశింపచేయుచున్న యెడ ఆట్టిజ్వరము మిక్కిలి క్రూరమై శీఘ్రముగ రోగిని చంపును.

ఇచ్చట వాతాదిదోషములు తమతమ కారణములచే బ్రకోపమునంది రసాది ధాతువులలో రెండుమూడుధాతువులగాని, లేక యనేకముల గాని యాశ్రయించినచో నాదోషములు బలిష్ఠము లని చెప్పందగును. వానిచే జనించిన జ్వరము మున్నగు రోగములు బహుహేతుకము లని వ్యవహరింపబడును. అటుగాక దూష్యములలో నొక్కదానినే యాశ్రయించి జనించినచో నల్పహేతుక మని చెప్పందగును. ఒకటి రెండు మూడు, లేక అనేకములగు ధాతువుల నాశ్రయించి దోషములు ఆయారోగములగల్గించు నని గ్రంథాంతరమున గానంబడియెడు:—"ఏకం ద్వౌ త్రీన్ బహూన్వాపి దేహే ధాత్వాదియోగతః దర్శయన్తి వికారాంశ్చ కుపితాః పవనాదయః."

జ్వరః క్షీణస్య శూనస్య గమ్భీరో దైర్ఘరాత్రికః. 76
అసాధ్యో బలవాన్ యశ్చ కేశసీమంతకృజ్జ్వరః,
గమ్భీరస్తు జ్వరో జ్ఞేయో హ్యంతర్దాహేన తృష్ణయా. 77

శరీరమున బలము క్షీణించి వాపుపుట్టిన వానికి కలిగియున్న జ్వరము అసాధ్యంబగును. వాతాదిదోషలక్షణములు స్ఫుటముగ గానరాక లీనముగ నుండు జ్వరంబును, అనేకరాత్రులయందు విడువక వ్యాపించియుండు జ్వరంబును, బలిష్ఠమై వెండ్రుకలను పాపట దీసినవిధముగ రేఖల నేర్పరించు జ్వరంబును అసాధ్యమగును. లోపల సంతాప మధికమై అధికముగ దప్పిగల్గిన జ్వరము గంభీరం బని కొందరి మతము.

ఆనద్ధత్వేన చాత్యర్థం శ్వాశకాసోద్గమేన చ,
ఆరంభాద్విషమో యస్తు యశ్చ వా దైర్ఘరాత్రికః. 78
క్షీణస్య వాఽతిరూక్షస్య గంభీరో యస్య హంతి తమ్,

మలము బంధించుటచేతను, శ్వాసకాసములు మిగుల తీవ్రములై విడలుట చేతను, విషమ మగు జ్వరంబును, విషమజ్వర సామాన్యలక్షణమున జ్వరము వచ్చిన కొన్నిదినములకు సంతతాది విషమజ్వరములు వచ్చు నని చెప్పియున్నది ; అటుగాక ప్రారంభముననే విషమజ్వరలక్షణములు గల్గి, వచ్చిన సంతతాది విషమజ్వరములును, చాలాదినములు అనుబంధముగ వ్యాపించియుండు జ్వరంబును అసాధ్యము లగును. రసాదిధాతువులును బలంబును క్షీణించినవానికిని, శరీరమున జిడ్డులేక మిగుల రూక్షమైనవానికిని జనించిన గంభీరజ్వరంబును రోగిని చంపును. (అసాధ్య మనుట.)

విసంజ్ఞస్తామ్యతే యస్తు శేతే నిపతితోఽపి వా. 79
శీతార్దితోఽన్తరుష్ణశ్చ జ్వరేణ మ్రియతే నరః,

ఏరోగి తీవ్రమగు జ్వరముచే పీడితుడై ప్రజ్ఞతప్పి సంతాపము నొందునో, ఎవ్వండు పరుండియు, లేక క్రిందపడియు నుండి చలిచేతను శరీరాంతర్భాగమున తీవ్రమైన తాపముచేతను తపించుచుండునో ఆరోగి మృతినొందును.

యో హృష్టరోమా రక్తాక్షో హృది సఙ్ఘాతశూలవాన్. 80
వక్త్రేణ చైవోచ్ఛ్వసితి తం జ్వరో హన్తి మానవమ్,

ఏరోగి తీవ్రమగు జ్వరవేగముచే పీడింపబడి పులకాంకితశరీరము గలవాడై కన్ను లెఱ్ఱవారి రొమ్మున పోటువొప్పి మున్నగు నానాబాధలచే కష్టపడుచు, ముక్కున శ్వాసము వెడలక నోటియందుమాత్రము నిశ్వాసము విడుచుచుండునో ఆ రోగిని జ్వరము తప్పక చంపును.

హిక్కా శ్వాసతృషాయుక్తం మూఢం విభ్రాన్తలోచనమ్, 81
సన్తతోచ్ఛ్వాసినం క్షీణం నరం క్షపయతి జ్వరః,

ఎక్కిళ్లచేతను శ్వాసముచేతను పీడితుడై తీవ్రముగ దప్పిగల్గి కన్నుల వికారముగ ద్రిప్పుచు ప్రజ్ఞదప్పియున్నను, శరీరబలంబును ధాతువులును క్షీణములై ఎడతెగని యూర్ధ్వశ్వాసముచే మిక్కిలి బాధపడుచున్నను జ్వరము రోగిని చంపును.

హతప్రభేన్ద్రియం క్షీణం అరోచకనిపీడితమ్, 82
గమ్భీరతీక్ష్ణవేగార్తం జ్వరితం పరివర్జయేత్,

జ్వరముచే బీడితుడగు నేరోగికి చక్షురాదీంద్రియములు కాంతి దక్కి ధాతువులు క్షీణించి అరోచకముచే సన్న ద్వేషము గల్గునో; ఎవడు గంభీరంబును మిక్కిలి తీవ్రవేగంబు నగు జ్వరముచే బీడింపబడునో అట్టిరోగిని కీర్తికాము డగు వైద్యుడు చికిత్సచేయక విడువవలెను.

ఇంతదనుక జ్వరమునం దసాధ్యలక్షణములు చూపెట్టబడెను. ఇవిగాక యసాధ్యలక్షణము లనేకములు కలవు. వానిని చరకవాగ్భటాదులయం దరయునది. ఏకోల్బణ సన్నిపాతజ్వరముల యసాధ్యత్వమునుగూర్చి కాలాదినియమము గ్రంథాంతరమున నీరీతి గానంబడియెడు:—"పిత్తకఫానిలవృద్ధ్యా దశదివసద్వాదశాహసప్తాహాత్, హన్తి విముఞ్చతి వాశు త్రిదోషజో ధాతుమలపాకాత్" (త్రిదోషముల ప్రకోపమునగల్గిన సన్నిపాతజ్వరములలో నొక్కదోషముమాత్రము మిక్కుటముగ ప్రకోపించి తక్కిన రెండును తగ్గియున్నచో నాజ్వరము ఏకోల్బణ సన్నిపాత మని పైజెప్పంబడెను; అట్టి యేకోల్బణసన్నిపాతములలో పిత్తం బధికముగ ప్రకోపించి వాతకఫములు తక్కువగ నుండు సన్నిపాతమున రసాదిధాతువులు పక్వంబులైనచో జ్వరము ప్రారంభించిననాటికి పదియవనాడు రోగిని చంపును; లేక మలములు పరిపాకమునందినచో జ్వరము విడచును. కఫం బధికముగ ప్రకోపించి వాతపిత్తములు తగ్గియున్న సన్నిపాతమున ధాతువులు పక్వములైనయెడ రోగిని పండ్రెండవనాడు చంపును; లేక మలములు పక్వములైనయెడ జ్వరము విడుచును. వాతం బధికముగ బ్రకోపించి కఫపిత్తములు రెండు తగ్గియుండు సన్నిపాతమున ధాతువులు పక్వములైనయెడ నేడవనాడు రోగిని చంపును. లేక మలములు పక్వము లయ్యేనేని జ్వరము విడుచును.)

మరియు ధాతువులును మలములును పక్వములైన వని కనిపెట్టుటకు వాని లక్షణములు తంత్రాంతరమున గానంబడియెడు:—"నిద్రానాశో హృది స్తమ్భో విష్టమ్భో గౌరవారుచీ, అరతిర్బలహానిశ్చ ధాతూనాం పాకలక్షణమ్; దోషప్రకృతివైశద్యం (వైచిత్ర్యం) లఘుతా జ్వరదేహయోః, ఇన్ద్రియాణాం చ వైమల్యం దోషాణాం పాకలక్షణమ్" (నిదురపట్టకుండుట, హృదయము పట్టుపట్టినట్టులు బాధకల్గుట, మలము బంధించియుండుట, శరీరము బరువుగ నుండుట, అరోచకము కల్గుట, దేనియందును మనసులేకుండుట, బలము నశించుట, ఈ లక్షణములన్నియు రసాదిధాతువులు పక్వంబులైనపుడు కానంబడును. మలములు (దోషములు) పరిపక్వములైనపుడు వాతాదిదోషంబులును, వాతాదిప్రకృతులైన శరీరంబులును విశదములై నిర్మలములుగ నుండును. జ్వరము స్వల్పముగ నుండును. శరీరము బరువులేక చుల్కనగ నుండును. చక్షురాదీంద్రియములు నిర్మలములై వానివానిపనులయందు సమర్థములై యుండును. ఇట్టి లక్షణములనుబట్టి మలములు పరిపక్వంబులైన వని యెరుంగనగును.)

## జ్వరము విడుచుసమయమున గల్గు లక్షణములు

దాహస్స్వేదో భ్రమ_స్తృష్ణాకమ్పవిడ్భేదసంజ్ఞి కాః. 83
కూజనం చాస్యవైగన్ధ్యం ఆకృతిర్జ్వరమోక్షణే,

శరీరమున జ్వరము విడుచుటకు ముందుక్షణమున శిరమునందెల్ల మంటపుట్టి చెమటపట్టును. ఒడలు తిరుగునట్లుండును. దప్పి కల్గును. శరీరము వణకును. మలము పట్టువదలి సరళముగ బైటవెడలును, మైగ్రమ్మి యొడలు తెలియకుండును. గొంగురుగా మూలుగుచుండును. శరీరమున చెమటపుట్టుటంజేసి యొకవిధముగ వాసన పుట్టును. ఈ లక్షణములు గల్గినపుడు జ్వరము విడుచుట కభిముఖముగ నున్న దని యెఱుంగునది.

ఇచ్చట జ్వరము వేగముననున్నసమయమున వాతాదిదోషములు మిక్కిలి బలిష్ఠములుగ నుండును. గాన నాసమయమున వానితీవ్రతకు పూ_ర్తిగ నాపుట సాజము కాని, జ్వరముయొక్క_బలము పూ_ర్తిగ తగ్గి విడుచుటకు సిద్ధముగ నుండుతరి వాతాదిదోష ములు వానియౌద్ధత్యము నెందుకు జూపును? అను నాశంక గల్గక మానదు. జ్వరవిముక్తి సమయమున దోషములు బలహీనము లగుట నిక్కువమే! అయినను దీపము తైల మంతయు పూ_ర్తిగ నశించి యారిపోవుటకు సిద్ధముగ నుండు సమయమున మిక్కిలి దగ దగ వెలుంగుచు గప్పని యారిపోవుచందమున జ్వరము విడచుటకుముందు వాతాది దోషంబులును మిక్కిలి యుత్కటములై రసాదిధాతువులను కల్లోలముగ సంక్షోభము చేయును. దానంజేసి రోగి శ్వాసము నధికముగ విడుచును. చెమట ప్రబలముగ బట్టును. దానంజేసి బడలి రోగి మూల్గును. ఒకసమయమున నాంతితోను నగును. నానావిధము లగ చేష్టలుచేయును. ఇంకను పైజెప్పిన యుపద్రవంబులును గల్గును. దోషములు గి ట్లాకులత నొందించి జ్వరముపూ_ర్తిగ విడుచుసరికి దనచేష్టలన్నియును సక్క_ దుట్టుకొను దీపముభంగి శాంతినొందును. ఈయభిప్రాయమును వాగ్భటాచార్యుడు "ధాతూన్ ప్రక్షో భయన్ దోషా మోక్షకాలే బలీయ తే, తతో నరశ్శ్వసన్ స్విద్యన్ కూజన్ వమతి చేష్టతే." (అ. హృ. ని. అ. ౨. శ్లో. ౭౬.) అనువాక్యముచే నిరూపించెను.

## జ్వరవిముక్తలక్షణములు

స్వేదో లఘుత్వం శిరసః కణ్డూః పాకో ముఖస్య చ,
క్షవథుశ్చాన్నలిప్సా చ జ్వరము_క్తస్య లక్షణమ్. 84

జ్వరముచే విడువంబడినరోగికి శరీరమునందెల్ల జల్లని చెమటపట్టును. శరీర మునం దవయవము లన్నియు భారములేక తేలికగా నుండును. తలపై దురదకల్గును.

నోరు పుండగును. తుమ్ములు ధారాళముగ వెడలును. ఆకలిపుట్టి అన్నము తినుటయం దాస వొడమును. ఈలక్షణముల జూచి జ్వరము విడిచిన దని యెరుంగనగును.

పైజెప్పినలక్షణములన్నియు త్రిదోషమున గల్గిన సన్నిపాతజ్వరము, విషమ జ్వరములు మున్నగుజ్వరములయందు విడుచునపుడు విశేషముగ గల్గును. ధాతువుల నాశ్రయించి యంతర్వేగముగల జ్వరమునందును గానంబడును. తక్కిన వాతిక, పైత్తికాది జ్వరములయందును చెమటమాత్రము పట్టును. ఈవిషయము భాలుకి తంత్రమున "త్రిదోషజే జ్వరే హ్యేతదన్తర్వేగే చ ధాతుగే, లక్షణం మోక్షకాలే స్యాత్ అన్యస్మిన్ స్వేదదర్శనాత్" అను శ్లోకముచే స్ఫుటముగ దెలిపెను. మరియు విడిచి రెండుదినముల కొకసారి మూడుదినముల కొకసారి మాటిమాటికి నియతకాలమున వ్యాపించు తృతీయక చతుర్థకాది విషమజ్వరములయందు ఆయాదినమున జ్వరము విడుచుతరి పైజెప్పిన జ్వర ముక్తలక్షణములు కొన్నియైనను గనబడి విడుచును. ముఖ్యముగ చెమటమాత్రమైనను పట్టును. మరల దోషములు ప్రకోపించుటం జేసి నియమము దప్పక నియమకాలమున జ్వరము వ్యాపించును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే జ్వరనిదానం

సమాప్తమ్.

---

# ౩. అతిసారనిదానమ్

పూర్వప్రకరణమున రోగములన్నిటిలో ప్రధానం బగు జ్వరమునకు సంబంధించిన నిదానాదులు పూర్తిగ వివరింపబడెను. అట్టి జ్వరమున కుపద్రవములు "శ్వాస మూర్ఛా రతిశ్ఛర్దిస్తృష్ణాతీసారవిడ్గ్రహాః......జ్వరస్యోపద్రవా దశ." అని శ్వాసాదులు తంత్రాంతరమున జూపెట్టబడినవి. అయ్యవి జ్వరనిదానమున జెప్పిన పిదప జెప్పందగును. అందును అతిసారము జ్వరమునందపాయకరమగు నుపద్రవ మగుటంజేసి జ్వరనిదానానంతరము అతిసారనిదానము చెప్పంబడును:—

## అతిసారనిదానము

గుర్వతిస్నిగ్ధరూక్షోష్ణద్రవస్థూలాతిశీతలైః,
విరుద్ధాధ్యశనాజీర్ణైః విషమైశ్చాపి భోజనైః. 1

స్నేహాద్యైరతియుక్తైశ్చ మిథ్యాయుక్తైర్విషైర్భయైః,
శోకాద్దుష్టాంబుమద్యాతిపానైస్సాత్మ్యర్తుపర్యయైః. 2

జలాభిరమణైర్వేగవిఘాతైః క్రిమిదోషతః,
నృణాం భవత్యతీసారో లక్షణం తస్య వక్ష్యతే. 3

వస్తుస్వభావమునంజేసి యజీర్ణకరములగు మినుములు మున్నగుపదార్థములను భుజించుట, మిక్కిలి స్నిగ్ధములైన (జిడ్డు అధికముగకల) ద్రవ్యములను, మిక్కిలి రూక్ష (జిడ్డులేకుండు) పదార్థములను, గుణముచేతను స్పర్శముచేతను మిక్కిలి యుష్ణములైన వస్తువులను, అధికముగ ద్రవమైన పదార్థములను, మిక్కిలి స్థూలములైన దుంపలు మున్నగు ద్రవ్యములను, గుణాదులచేతను స్పర్శముచేతను మిగుల శీతలంబులగు ద్రవ్యములను భుజించుట; దేశకాలవస్తుసంయోగాదులచే విరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొక్కసమయమున భుజించుట, ముందు భుజింపబడిన యాహారపదార్థములు జీర్ణించకుండునపుడు మరల భుజించుట, స్వభావముచేత జీర్ణింపని వస్తువుల భుజించుట, అధికముగనైనను,అల్పముగనైనను, అకాలమునందైనను భుజించుట, స్నేహనము, స్వేదనము, వమనము, విరేచనము, అనువాసనవస్తికర్మ అను నీపంచకర్మముల నధికముగ నుపయోగించుట, లేక అట్టి పంచకర్మములను శాస్త్రమునకు విరుద్ధముగ న్యూనాధిక్యములుగ నుపయోగించుట, స్థావరరూపములగు విషపదార్థముల నుపయోగించుట, భయపడుట,

ప్రియమైన వస్తువు నశించుట మున్నగుకారణములచే దుఃఖపడుట, దుష్టములగు గాలి మున్నగువానిచే చెడిన నీళ్లను త్రాగుట, మద్యముల నధికముగ త్రాగుట, తనశరీరమున కలవాటులో నున్న దానికి వ్యతిరేకములగు పదార్థములను సేవించుట, ఋతుధర్మముల కనుగుణముగ జెప్పిన యాహారపదార్థములకు విరుద్ధముగ భుజించుట, నీటిలో నీతగొట్టుట, మలమూత్రాదివేగముల నిరోధించుట, క్రిములు పుట్టుట, ఈకారణముల చేత మానవుల కతిసారరోగము జనించును. వానిలక్షణములు విపులముగ నీక్రింద వివరింపబడును.

మున్ను భుజింపబడిన యన్నము సశేషముగ నుండునపుడు మరల భుజించుట యధ్యశనము. తాను భుజించుపరిమితికి అధికముగనైనను, స్వల్పముగనైనను, లేక అకాలమందైనను భుజించుట విషమాశనము. ఈవిషయము "భుక్తం పూర్వాన్న శేషే తు పునరధ్యశనం మతమ్" అని చరకమునందును; "బహు స్తోకమకాలే చ తజ్ఞేయం విషమాశనమ్" అని సుశ్రుతమునందును కానంబడియెడు.

## అతిసారసంప్రాప్తి

సంశమ్యాపాం ధాతురగ్నిం ప్రవృద్ధః
శకృన్మిశ్రో వాయునాఽధః ప్రణున్నః
సరత్యతీవాఽతిసారం తమాహుః
వ్యాధిం ఘోరం షడ్విధం తం వదన్తి
ఏకైకశస్సర్వశశ్చాపి దోషైః
శోకేనాన్యష్షష్ఠ ఆమేన చోక్తః. 4

శరీరమున ద్రవరూపములైన రసము, క్లేదము, (జలము) మూత్రము, చెమట, మేదస్సు, కఫము, పిత్తము, రక్తము మున్నగుధాతువులు మితిమీరి వృద్ధినొంది జాఠరాగ్నిని చల్లార్చును. పిమ్మట నాద్రవరూపమైన ధాతువులు, మలముతోగూడి యపానవాయువుచే నధోమార్గముగ ప్రేరేపింపబడి యధికముగ పలుమారు వెడలుచుండును. ఇయ్యది విశేషముగ స్రవించుటంజేసి యతిసార మని చెప్పంబడును. ఇయ్యది మిక్కిలి క్రూరమైనవ్యాధి. ఇయ్యది వాతపిత్తశ్లేష్మములలో నొక్కొక్క దానిచేతను, త్రిదోషసముదాయముచేతను, శోకముచేతను, ఆమము (అజీర్ణమగు నాహారము) చేతను జనించుటంజేసి యాఱువిధము లగును. *

* "ఆమపక్వక్రమం హిత్వా నాతిసారే క్రియాయతః, అతస్సర్వాతి సారేషు జ్ఞేయం పక్వామలక్షణమ్" అనగా అతిసారరోగమును జికిత్సింపవలె ననినచో నామపక్వక్రమమును గుర్తించుట ముఖ్యమైయుండును గాన సర్వాతిసారముల

వాతాదిదోషద్వయసంసర్గమునం జేసియు నతిసారము జనించుటం జేసి వాత
పిత్తము, వాతకఫము, పిత్తకఫము అను భేదముచే మూడువిధము లధికముగ నగు నని
మతాంతరమున గానంబడియెడు. ఈ పక్షమున వాతికము, పైత్తికము, శ్లైష్మికము,
వాతపిత్తజము, వాతకఫజము, పిత్తకఫజము, శోకజము, ఆమజము నని యతిసారము
లొమ్మిదివిధము లగును. చరకవాగ్భటాదులు వ్యాధిస్వభావమునం జేసి ద్వంద్వజాతి
సారములు లేవని తలంచి యారువిధములుగనే పరిగణనము చేసిరి.

"సామం శకృన్నిరామం వా జీర్ణే యేనాతిసార్యతే. సో౽తిసారో౽తి
సరణాదాశుకారీ స్వభావతః" అని వాగ్భటాచార్యుడు అన్వర్థముగ జెప్పెను.
జీర్ణకాలమున నేవ్యాధిచే పక్వముగాని మలమైనను, పక్వమైన మలమైనను గుద
మార్గమున వెడలింపబడునో అవ్యాధి యతిసారము. ఇవ్వ్యాధి యధికముగ మలము
వెడలుటం జేసి యతిసార మనంబడును. "సృగతౌ" అనుగత్యర్థకమైన ధాతువునకు
భావార్థకఘఞ్ ప్రత్యయముచే అతిసారశబ్దము నిష్పన్నమగును. ఈ రోగమున
తలచినమాత్రముననే అతిశీఘ్రముగ మలము వెడలును. కావున శీఘ్రకారి యగును.
ఇచ్చట ధాతు అని చెప్పక "అపాంధాతుః" అని విశేషముగ జెప్పుటవలన
శరీరమునందలి ద్రవరూపములగు స్వేదాదులుగూడ గ్రహింపబడును. ఇవియున్నయెడల
శరీరధారణమునకు సాధనము లగును గాన ధాతుశబ్దముచే వ్యవహరింపబడును.

## అతిసారపూర్వరూపము

హృన్నాభిపాయూదరకుక్షితోదగాత్రావసాదానిలసన్నిరోధాః,
విట్సఙ్గ ఆధ్మానమథావిపాకో భవిష్యతస్తస్య పురస్సరాణి. 5

అతిసారవ్యాధి కల్గుటకుమున్ను హృదయమునందును, నాభిస్థానమునందును, గుద
స్థానమునందును, క్రింది కడుపునందును మీదకడుపులోపలను పడపొడిచినట్లు నొప్పి

---

యందును ఆమసంబంధమును పక్వమలలక్షణమును కలిగియుండు నని ప్రాచీనులు
చెప్పిన నన్నివిధములగు నతిసారములందును నామసంబంధ ముండెను వాత
రక్తాదులవలె వ్యాధ్యారంభకమగు (అనగా స్వయముగా నతిసారమును కలుగ
చేయునట్టి) ఆమదోషమువలన గల్గునదియగు నతిసార మొకటి గలదని దీనియందు
వాతాదులు ప్రేరకములుమాత్రమై యనుబంధమాత్రముగా నుండును గనుక దీనికి
ఆమజ మని ప్రత్యేక మొకభేదము చెప్పబడె నని తెలియవలెను.

*ఉదర మనగా చిన్నప్రేవుండు (పచ్యమానాశయము) చోటు - కుక్షి యనగా
నామాశయముండు చోటు అని గ్రహింపవలెను.

పుట్టును. కాళ్లు చేతులు మున్నగు నవయవములన్నియు పడదీసినట్లు నొప్పికల్గి కృశత నొందును. అపానవాతము వెడలక నిరోధింపబడును. మలము సరళముగ వెడలక బద్ధగించును. కడుపులో గుడగుడ యనుశబ్దముగల్గి యుబ్బరించును. ఆహారపదార్థము జీర్ణము కాకుండును. ఇవియన్నియు నతిసారము గల్గుటకు ముందు జనించు పూర్వరూపములు.

## వాతాతిసారలక్షణము

అరుణం ఫేనిలం రూక్షం అల్పమల్పం ముహుర్ముహుః,
శకృదామం సరుక్ఛబ్దం మారుతేనాతిసార్యతే. 6

వాతప్రకోపమునబుట్టిన యతిసారమునందు కొంచెముగ నెఱ్ఱనిరంగుగల్గి నురుగుతోఁగూడి జిడ్డులేక రూక్షమగుమలము పక్వముగాక కొంచెము కొంచెముగ మాటిమాటికి వెడలును అట్టిమలము వెడలునపుడు నొప్పి యోరువరాకుండును. శబ్దము పుట్టును.

## పిత్తకఫాతిసారలక్షణము

పిత్తాత్పీతం నీలమాలోహితం వా
తృష్ణామూర్ఛాదాహపాకోపపన్నమ్,
శుక్లం సాన్ద్రం శ్లేష్మణా శ్లేష్మయుక్తం
విస్రం శీతం హృష్టరోమా మనుష్యః. 7

పిత్తప్రకోపమున బుట్టిన యతిసారమునందు పచ్చనిరంగు కల్గియైనను, లేక నల్లనిరంగు కల్గియైనను, లేక కొంచెము రక్తవర్ణము కల్గియైనను మలము మాటిమాటికి వెడలును. ఈ యతిసారమున దప్పియు, మూర్ఛయు, మంటయు కల్గును. గుదస్థానమున పుండగును. కఫము ప్రకోపించి కల్గిన యతిసారమున తెల్లనిరంగు కల్గి జిగురువలె ఘనీభవించి కఫముతో గూడిన మలము పలుమారు వెడలును. ఆ మలము దుర్గంధముకల్గి చల్లనై యుండును. రోగిశరీరముపై వెండ్రుకలు జలదరించును.

## సన్నిపాతాతిసారలక్షణము

వరాహస్నేహమాంసామ్బుసదృశం సర్వరూపిణమ్,
కృచ్ఛ్రసాధ్యమతీసారం విద్యాద్దోషత్రయోద్భవమ్. 8

దోషత్రయప్రకోపమున జనించిన యతీసారమున పందిచమురును మాంసమును కడిగిననీళ్లనుబోలె నీళ్లవలె పలుచనై మలము వెడలును. పైజెప్పిన యతిసారముల లక్షణములన్నియు కల్గును. ఇయ్యది త్రిదోషముల ప్రకోపమున కల్గును గాన చికిత్స వాతాదులకు పరస్పరవిరుద్ధముగ నుండును. కావున కృచ్ఛ్రసాధ్యముగ నుండును.

## శోకాతిసారసంప్రాప్తిలక్షణము

తైస్తైర్భావైశ్శోచతోఽల్పాశనస్య బాష్పోష్మా వై వహ్నిమావిశ్య జన్తోః,
కోష్ఠం గత్వా క్షోభయేత్తస్య రక్తం తచ్చాధస్తాత్కాకణన్తీప్రకాశమ్.

నిర్గచ్ఛేద్వై విడ్విమిశ్రం హ్యవిడ్వా నిర్గన్ధం వా గన్ధవద్వాతిసారః,
శోకోత్పన్నో దుశ్చికిత్స్యోఽతిమాత్రం రోగో వైద్యైః కష్టసాధ్యః ప్రదిష్టః.

మనుజునకు శోక మనునది మనోవైలక్ష్యమున గల్గును. ధనము ధ్వంసమగుట, బంధుగులు మిత్రులు మున్నగు నిష్టజనులు చనిపోవుట, తీరనివియోగము కల్గుట, మున్నగు కారణములచే మనసు వికృతిజెంది దుఃఖము కల్గును. అట్టిశోకముచే కన్నీరు వెడలునప్పుడు మనుజుడు ఆహారాదులయం దిచ్ఛబోదమక స్వల్పముగ భుజించును. అట్టి కన్నీటివేగముచే నైన యావిరి జాఠరాగ్ని బ్రవేశించి పిదప కోష్ఠమున (పెద్ద ప్రేవున) జేరి రక్తమును చెరచి స్వస్థానమునుండి చలింపజేయును. ఆరక్తము గురిగింజవలె నెఱ్ఱనిరంగు కల్గి మలములోగూడియైనను, లేక మలమున జేరకయైనను, దుర్గంధము కల్గియైనను, దుర్గంధములేకయైనను గుదద్వారమునుండి పలుమారు బైట వెడలుచుండును. ఇయ్యది శోకముచే గల్గిన యతిసారము. ఇది మిక్కిలి కష్టములైన యుపద్రవముల గల్గించును. కావున వైద్యులచే చికిత్సజేయ నలవికాదు. చికిత్స జేసినను మిక్కిలి కష్టసాధ్యమై యుండును.

## ఆమాతిసారసంప్రాప్తిలక్షణము

అన్నాజీర్ణాత్ప్రద్రుతాః క్షోభయన్తః కోష్ఠం దోషాధాతుసంఘాన్మలాంశ్చ,
నానావర్ణం నైకశస్సారయన్తి శూలోపేతం షష్ఠమేనం వదన్తి. 11

భుజింపబడిన యాహారపదార్థములు జీర్ణించక వాతపిత్తకఫములు ముందుగా కోష్ఠమును, రసరక్తాదిధాతువులను, చెమట మున్నగుమలములను వ్యాపించి ఆయా నెలవులనుండి చలింపజేసి నీలపీతరక్తాద్యనేక వర్ణములు కల మలమును మాటిమాటికిని వెడలించుచుండును. ఇందు పోటు నొప్పి మున్నగుబాధ లనేకములుగ నాభిగుదము మున్నగు స్థానములయందు కలుగును. ఇయ్యది యామాతిసార మని చెప్పబడును.

## ఆమమలలక్షణము

సంసృష్టమేభిర్దోషైస్తు న్యస్తమప్స్వవసీదతి,
పురీషం భృశదుర్గన్ధి పిచ్ఛిలం చామసంజ్ఞితమ్. 12

పైజెప్పిన దోషములతో జేరి మిక్కిలి దుర్గంధము కల్గి మునగబంకవలె బంకను కల్గి నీళ్లలోవేసిన పైకి తేలక భారముచే మునుగునట్టిమలము ఆమముగానున్నదని యెఱుంగునది. ఇదియే ఆమ మనియు చెప్పంబడును.

## పక్వమలలక్షణము

ఏతాన్యేవ తు లిఙ్గాని విపరీతాని యస్య వై,
లాఘవఞ్చ విశేషేణ తస్య పక్వం వినిర్దిశేత్. 13

మలము పక్వమై యున్నపుడు పైజెప్పినలక్షణమునకు విరుద్ధములైన లక్షణములు గానవచ్చును. (అనగా దుర్గంధములేక జిగురువలె బందనలేక తేలికయై నీళ్లలో వేసినపుడు మునుగక తేలుచున్నమలము పక్వ మని యెరుంగనగును.) మరియు పైజెప్పిన లక్షణము లన్నిటిలో తేలికగనుండుట మిగుల ప్రధానము.

### అసాధ్యాతిసారలక్షణము

పక్వజామ్బవసఙ్కాశం యకృత్పిణ్డనిభం తను,
ఘృతతైలవసామజ్జవేశవారపయోదధి. 14
మాంసధావనతోయాభం కృష్ణం నీలారుణప్రభమ్,
మేచకం స్నిగ్ధకర్బురం చన్ద్రికోపగతం ఘనమ్. 15
కుణపం మస్తులుఙ్గాభం సుగంధి కుథితం బహు,
తృష్ణాదాహతమశ్శ్వాసహిక్కాపార్శ్వాస్థిశూలినమ్. 16
సమ్మూర్ఛారతిసమ్మోహాయుక్తం పక్వవలీగుదమ్,
ప్రలాపయుక్తం చ భిషగ్వర్జయేదతిసారిణమ్. 17

చక్కగపండిన నేరేడుపండువలె నల్లగనైనను, శరీరమున కుడిప్రక్కనుండు నలుపు ఎరుపుకలిసిన కాంతిగల యకృత్తను మాంసఖండమువంటి రంగుకల్గి యైనను, మిక్కిలి కొంచెముగనైనను, నెయ్యి, నూనె, మాంసరసము, వేసవారము, పాలు, పెరుగు, మాంసమును కడిగిననీళ్లు వీనినిబోలియైనను, కృష్ణవర్ణంబుగ నైనను, కొంచెము నీలవర్ణము కలసిన యెరుపురంగుకల్గియైనను, మేచకవర్ణము (నెమిలి పురికన్నువంటిరంగు) కలిగి యైనను జిడ్డుకలిగి కర్బురవర్ణముగల్గియైనను నెమిలిపురివలె చిత్రవర్ణముకల్గియైనను కఠినముగనైనను, పీనుగువంటి దుర్గంధము కల్గియైనను, మస్తులుంగమునకు (పుర్రెలోని మెదడునకు) సమానముగనైనను, మలమునకు సహజమైన దుర్గంధములేక మంచిపరిమళము కల్గి యైనను, కుళ్లియైనను ప్రమాణమున కధికముగనైనను, మలము వెడలినచో అట్టి యతిసారము మిగుల క్రూరమై యసాధ్యమగును. మరియు, అతిసారరోగికి యధికమైన దప్పి శరీరము పైభాగమునను గుదస్థానమునను మంట, చీకటిలో నున్నట్టులు కన్నులు కానరాకుండుట, శ్వాసము, ఎక్కిళ్లు, పక్కటెముకలలో నొప్పి మూర్ఛ ముఖ్యములైన పనులయందు ఆసలేకుండుట, చిత్తభ్రమము, గుదస్థానమునందలి వళులుపుండగుట సంబంధములేక యధికముగ మాటలాడుట, ఇవియన్నియు నతిసారమున గల్గు నుపద్రవములు. ఈయుపద్రవములు కల్గినప్పుడు మిక్కిలి రోగ ముత్కటమై యసాధ్యమగును కావున చికిత్స చేయందగదు.

అసంవృతగుదం క్షీణం దూరాధ్మాతముపద్రుతమ్,
గుదే పక్వే గతోష్మాణం అతిసారకిణం త్యజేత్. 18

గుదరంధ్రము మూసికొనకయుండినను, శరీరబలము క్షీణించినను, కడుపులో గుడగుడయనుచు నుబ్బరము కల్గినను, వాపు మున్నగు నుపద్రవములు కల్గినను, గుద స్థానముపుండైనను, శరీరమున వేడిలేక చల్లబడినను, అతిసారము మిక్కిలి యసాధ్య మగును కావున చికిత్స జేయంజనదు.

అతిసారోపద్రవములు గ్రంథాంతరమున నిట్లు చెప్పబడినవి:—"శోథం శూలం జ్వరం తృష్ణాం శ్వాసం కాసమరోచకమ్, ఛర్దిం మూర్ఛాం చ హిక్కాం చ దృష్ట్వాతీసారిణం త్యజేత్." వాపు, నొప్పి, జ్వరము, దప్పి, శ్వాసము, దగ్గు, అరుచి, వాంతి, మూర్ఛ, ఎక్కిళ్లు ఇవియన్నియు నతిసారరోగమున గల్గు నుపద్రవములు, ఈయుపద్రవములు కల్గిననాడు అతిసారరోగికి చికిత్సచేయక విడువవలెను.

శ్వాసశూలపిపాసార్తం క్షీణం జ్వరనిపీడితమ్,
విశేషేణ నరం వృద్ధం అతిసారో వినాశయేత్. 19

శ్వాసము, కడుపులో శూల, దప్పి వీనిచే బాధింపబడి జ్వరముగల్గి శరీరబలము క్షీణించిన యతిసారరోగి బ్రతుకనేరడు. ముసలివానికి అతిసారరోగము కల్గినను అసాధ్యమగును.

## రక్తాతిసారలక్షణము

పిత్తకృన్తి యదాత్యర్థం ద్రవ్యాణ్యశ్నాతి పైత్తికే,
తదోపజాయతేఽభీక్ష్ణం రక్తాతిసార ఉల్బణః. 20

పిత్తప్రకోపమున జనించిన యతిసారము కల్గినపుడు పిత్తమును వృద్ధినొందించు ద్రవ్యములను తిన్నవానికి రక్తాతిసారము జనించును. ఇచ్చట పిత్తమునకును రక్తము నకును భేదములేదు కావున రక్తాతిసారమున పిత్తాతిసారలక్షణములే కానవచ్చును. కావున ప్రత్యేకముగ దానిలక్షణము జెప్పబడదయ్యె. దానంజేసియే షడ్విధం బను సంఖ్యానియమంబును సంగతమగును. *

## ప్రవాహికాలక్షణము

వాయుః ప్రవృద్ధో నిచితం బలాసం నుదత్యధస్తాదహితాశనస్య,
ప్రవాహతోఽల్పంబహుశోమలాక్తం ప్రవాహికాంతాంప్రవదన్తితజ్జ్ఞాః.

---

*రక్తాతిసార ముపద్రవ రూపముగా జనించును. కావున అతిసార భేదగణనమునం జేర్పలే దని యెఱుంగుట న్యాయ్యము.

మిథ్యాహారవిహారములచే వాతము మిక్కిలి ప్రకుపితమై స్వస్థానమున వృద్ధి నొందియుండు కఫమును మలముతోగూడ గుదస్థానమున జేర్చును. అయ్యది పెద్దప్రేవు వాపుచే నడ్డగింపబడునప్పుడు రోగి బలాత్కారముగ ముక్కినయెడ కొంచెముగనైనను, అధికముగ నైనను అపానద్వారమునుండి బైటవెడలును. ఇయ్యది ప్రవాహిక యని చెప్పబడును.

## ప్రవాహికాభేదములు, లక్షణములు

ప్రవాహికా వాతకృతా సశూలా పిత్తాత్సదాహా సకఫాకఫాచ్చ
సశోణితాశ్శోణితసమ్భవాచ తాస్స్నేహరూక్షప్రభవామతాస్తు,
తాసామతీసారవదాదిశేచ్చ లిఙ్గం క్రమం చామవిపక్వతాఞ్చ. 22

మిక్కిలి రూక్షములగు (జిడ్డులేని) పదార్థముల విశేషముగ భుజించుటచే వాతము ప్రకోపమునొంది ప్రవాహికను కల్గించును. ఈవాతప్రవాహికయందు నొప్పి విశేషముగ నుండును. తీక్ష్ణ (కారముగల) పదార్థములను విశేషముగ భుజించుట చేత పిత్తము ప్రకోపమునొంది ప్రవాహికను కల్గించును. ఈపిత్తజప్రవాహికయందు మంట విశేషముగ బుట్టును. స్నిగ్ధ (జిడ్డుకల) పదార్థముల విశేషముగ భుజించుట చేత కఫము ప్రకోపించి ప్రవాహికను కల్గించును. ఈకఫజప్రవాహికయందు కఫ మధికముగ ప్రవర్తియగును ఉష్ణవీర్యంబులును ఉష్ణస్పర్శంబులు నగు పదార్థముల నధికముగ భుజించుటచేత రక్తము ప్రకోపించి ప్రవాహికను కల్గించును. ఇందు రక్తము విశేషముగ వెడలును. ఇచ్చట "స్నేహరూక్షప్రభవామతాస్తు" అను తు శబ్దము అనుక్తసముచ్చయార్థకము కావున తీక్ష్ణోష్ణపదముల నధ్యాహారముచేసి తీక్ష్ణోష్ణ పదార్థములచే పిత్తరక్తప్రవాహికలు కల్గుననునర్థము సంగృహీతము. మరియు నీవాతాదిప్రవాహికల యందును వాతాద్యతిసారములకు ప్రత్యేకముగ జెప్పినలక్షణములు కనబడును. ఆమ పక్వభేదంబులును చికిత్సాభేదంబులును వానికి జెప్పిన లక్షణములబట్టియే యెరుంగునది.

## అతిసారనివృత్తిలక్షణము

యస్యోచ్చారం వినా మూత్రం సమ్యగ్వాయుశ్చ గచ్ఛతి,
దీప్తాగ్నేర్లఘుకోష్ఠస్య గతస్తస్యోదరామయః. 23

ఏరోగికి మలముగూడ వెడలక మూత్రము మాత్రము ధారాళముగ వెడలి అపానవాతము అడ్డులేక వెడలునో, జఠరాగ్ని ప్రజ్వలించి కోష్ఠము లఘువై యుండునో వానికి అతిసారరూపము నివర్తించిన దని యెరుంగునది.

అతిసారరోగికి మూత్రము వెడలునపుడెల్ల మలముకూడ వెడలుచుండును. అటుకాక మలము వెడలకయే మూత్రము ధారాళముగ వెడలుచోడ అతిసారము నివర్తించె నని యెరుంగవలెను. మఱియు నపానవాతము వచ్చినపుడెల్ల కొంచెము మలముగూడ వచ్చుచుండును. అదిలేకుండ ధారాళముగా నపానవాతము వెడలుట కూడ నతిసారనివృత్తికి లక్షణమగును.

## జ్వరాతిసారలక్షణము

జ్వరాతిసారయోరుక్తం నిదానం యత్పృథక్ పృథక్,
తత్సాజ్జ్వరాతిసారస్య తేన నాత్రోదితం పునః. 24

జ్వరంబును అతిసారంబును వానికి ప్రత్యేకనిదానలక్షణాదులతోఁగూడి సమకాల మున జనించినచో నయ్యది జ్వరాతిసార మని చెప్పంబడును. జ్వరములను అతిసారము లకు ప్రత్యేకములుగ జెప్పినలక్షణములే వానికి నుండును. కావున దీనిలక్షణము ప్రత్యేకముగ జెప్పబడదయ్యె.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అతిసారనిదానం సమాప్తమ్.

# ౪. గ్రహణీనిదానమ్

అతిసారరోగము కల్గినపుడు తగినచికిత్స జేయక యుపేక్షించుటచే గ్రహణీ రోగము కల్గు నని వాగ్భటాదులు వచించిరి. కావున అతిసారమునకును గ్రహణికిని పౌర్వాపర్యరూపమైన సంబంధము కలదు. దానంజేసి యతిసారనిదానమును జెప్పిన పిదప గ్రహణీరోగము చెప్పబడును.

## గ్రహణీరోగసంప్రాప్తి

అతీసారే నివృత్తేఽపి మన్దాగ్నేరహితాశినః,
భూయస్సన్దూషితో వహ్నిర్గ్రహణీమభిదూషయేత్. 1

అతిసారవ్యాధికల్గి నివర్తించినతోడనే జఠరాగ్ని మందగించియున్నపుడు జాఠ రాగ్నిని చెరచునట్టి యాహారముల భుజించినచో మందగించియుండు జఠరాగ్ని మరింత చెడి అన్నకోశములోని ఆహారమును లోనికి ప్రవేశింపజేయు గ్రహణి యను చిన్నప్రేవు మొదటిభాగమును బొత్తుగ జెరచును. దానంజేసి 'గ్రహణీ' యనురోగము కల్గును. (ఇచ్చట "నివృత్తేఽపి" అను నపిశబ్దముచేత అతిసారము కల్గకున్నను అగ్ని మందగించిన వారు అగ్నినాశకములగు నాహారాదులజేసినను గ్రహణీరోగము కల్గు నని బోధింప బడును.)

వాగ్భటాచార్యుడు "అతిసారేషు యో నాతియత్నవాన్ గ్రహణీగదః, తస్యస్యా దగ్నివిధ్వంసకరై రన్యస్య సేవితైః "(అ. హృ. ని. అ. ౮. శ్లో. ౧౫) అని గ్రహణీస్వరూపమును జెప్పియున్నాడు. (అతిసారములయందు ప్రబల ప్రయత్నముతో చికిత్సచేయక యుపేక్షించి యపథ్యముల నాచరించినను, అతిసారములేక స్వస్థతనున్నపు డును జఠరాగ్నిని ధ్వంసముచేయు నజీర్ణపదార్థముల సేవించినను గ్రహణీరోగము కల్గును.)

## గ్రహణీసామాన్యలక్షణము

ఏకైకశస్సర్వశశ్చ దోషైరత్యర్థమూర్ఛితైః,
సా దుష్టా బహుశో భుక్తమామమేవ ప్రముఞ్చతి. 2
పక్వం వా సరుజం పూతి ముహుర్బద్ధం ముహుర్ద్రవం,
గ్రహణీరోగమాహుస్తం ఆయుర్వేదవిదో జనాః. 3

మిథ్యాహారవిహారాదులచే మిక్కిలి ప్రకోపమునొందిన వాతపిత్తకఫములలో నొక్కొకటిచేనైనను అన్నింటిచేనైనను జాఠరానలమున కధిష్ఠానమైన గ్రహణి యను ప్రేవు దుష్టమై, భుజింపబడిన యాహారమును పక్వముగనైనను అపక్వముగ నైనను అపానద్వారము నుండి బైట వెడలించును. అట్టిమలము మిక్కిలి బాధతోగూడి దుర్గంధము కలిగి కొన్నిపర్యాయములు వాతముచే బద్ధగించియు, కొన్నిమార్లు నిస్స్రవముతో గూడియు వెడలును. ఇత్తెరంగున ననేక పర్యాయములు వెడలును. దీనిని గ్రహణీరోగ మని యాయుర్వేదవేత్తలు వచించెదరు.

గ్రహణి యనునది నాభికి పైభాగమున నుండును. ఇయ్యది జఠరాగ్నికి ముఖ్యస్థానమై మనుజులచే భుజియింపంబడు నాహారపదార్థముల గ్రహించి యగ్నిబలముగ తాను బలిష్ఠమై పక్వముగాని యాహారపదార్థమును ధరించుచు, పక్వమైన దాని నధోమార్గమునకు ద్రోయుచు నుండును. ఇదియె పచ్యమానాశయ మనియు చెప్పబడును. ఈవిషయమును చరకాచార్యు డిత్తెరగున నుడివెను:—"అగ్న్యధిష్ఠానమన్నస్య గ్రహణాద్గ్రహణీమతా, నాభేరుపరి సాహ్యగ్నిబలోపస్తమ్భబృంహితా, అపక్వం ధారయ త్యన్నం పక్వం సృజతి చాప్యధః." (చ. చి. అ. ౧౫.) మరియు గ్రహణి యనునది పక్వాశయమునకును, ఆమాశయమునకు నడుమనుండు కల యని సుశ్రుతాచార్యుడు ఇట్లు చెప్పెను. "షష్ఠీపిత్తధరా నామ యా కలా పరికీర్తితా, పక్వామాశయమధ్యస్థా గ్రహణీ సా పరికీర్తితా." (సు. ఉ. అ. ౪.)

## గ్రహణీపూర్వరూపము

పూర్వరూపన్తు తస్యేదం తృష్ణాలస్యం బలక్షయః,
విదాహోఽన్నస్య పాకశ్చ చిరాత్కాయస్య గౌరవమ్. 4

గ్రహణీరోగము కల్గుటకు మునుపు దప్పి యధికమగును. పనులయం దలసత గల్గును. శరీరబలము నశించును. సంతాపము కల్గును. భుజింపబడిన యాహారము చిరకాలమునకు జీర్ణించును. శరీరము చాలా బరువుగ నుండును. ఇవియన్నియు గ్రహణీరోగము జనించుటకు ముందు కలుగు పూర్వరూపములు.

## వాతికగ్రహణీ సంప్రాప్తి లక్షణము

కటుతిక్తకషాయాతిరూక్షసన్దుష్టభోజనైః,
ప్రమితానశనాత్యధ్వవేగనిగ్రహమైథునైః. 5
మారుతః కుపితో వహ్నిం సఞ్ఛాద్య కురుతే గదాన్,
తస్యాన్నం పచ్యతే దుఃఖం శుక్తపాకం ఖరాఙ్గతా. 6

కణ్ఠాస్యశోషః క్షుత్తృష్ణా తిమిరం కర్ణయోస్స్వనః,
పార్శ్వోరువఙ్క్షణగ్రీవారుగభీక్ష్ణం విసూచికా. 7
హృత్పీడా కార్శ్యదౌర్బల్యం వైరస్యం పరికర్తికా,
గృద్ధిస్సర్వరసానాఞ్చ మనసస్సదనం తథా. 8
జీర్ణే జీర్యతి చాధ్మానం భుక్తే స్వాస్థ్యముపైతి చ,
సవాతగుల్మహృద్రోగప్లీహాశఙ్కీ చ మానవః. 9
చిరాద్దుఃఖం ద్రవం శుష్కం తన్వామం శబ్దఫేనవత్,
పునః పునస్సృజేద్వర్చః కాసశ్వాసార్దితోఽనిలాత్. 10

కారముగలపదార్థములనైనను చేదుగలపదార్థములనైనను వగరుగలపదార్థములనైనను మిక్కుటముగ భుజించినను, జిడ్డులేక మిగుల రూక్షములగుపదార్థముల నధికముగ భుజించినను, దేశకాలవస్తుసంయోగములచే పరస్పరవిరుద్ధము లగుటంజేసి దుష్టములైన క్షీరమత్స్యాదుల నొకటిగజేర్చి భుజించినను, తాను మామూలుగ భుజించు పరిమాణమునకు మిక్కిలి తక్కువగ భుజించినను, లేక భుజించకయే యుపవాసముండినను, మితిమీరి భుజించినను, త్రోవ నధికముగ నడచినను, మలము మూత్రము అపాన వాతము శుక్రము మున్నగువానిని ఆయాకాలమున వెడలనియ్యక వానివేగమును నిరోధించినను, అధికముగ స్త్రీసంభోగము చేసినను వాతము మిక్కిలి ప్రకోపమునొంది జఠరాగ్నిని మందగించి గ్రహణీరోగమును గల్గించును. ఈవ్యాధియందు భుజింపబడిన యాహారపదార్థములు మిక్కిలి కష్టముచే జీర్ణమగును. జీర్ణమగు సమయమున నమ్లవిపాకము నొందును (పుల్లగ పులియు ననుట) శరీరమెల్ల గరగరలాడుచుండును. గొంతును నోరును ఎండును. ఆకలి దప్పియు నధికముగ నుండును. చీకటి యున్నట్టులు కండ్లు కనబడకుండును. చెవులలో గుమ్మని ధ్వని కల్గును. ఇరు ప్రక్కలయందును ఇరు తొడలయందును గజ్జలురెంటియందును కంఠముమీదను మిక్కిలి నొప్పికల్గును. జీర్ణము కాని యన్నరసము ఊర్ధ్వాధో మార్గములనుండి వాంతియు విరేచనములు నగును. ఒడలంతయు సూదులతో పొడిచినట్లు పోటుపుట్టును. రొమ్మునొప్పి గల్గును. శరీరము నానాట కృశించును. శరీరబలము నశించును. నోట రుచి తెలియదు. గుదస్థానమున కత్తెరతో కత్తిరించినవిధముగ బాధకలుగును. తీపి పులుపు మున్నగురసములన్నియు దినుటయందిచ్చ పొడమును. మనసునొచ్చి వేదనకల్గియుండును. అన్నము జీర్ణించినపుడును, జీర్ణించునపుడును కడుపుబ్బరించును. భుజించినపిదప సుఖముగ నుండును. వాతగుల్మము హృద్రోగము ప్లీహాభివృద్ధి అను నీరోగములు కలిగినట్లు బాధకల్గును. ఈబాధలతో గూడి ద్రవంబుగనైనను శుష్కించియైనను శబ్దముతోగూడి నురుగుతో జేరిన మలము మాటిమాటికి మిక్కిలి కష్టముతో కొంచెముగను ఆమరసముతోగూడి

వెడలును. దగ్గును శ్వాసంబును ఈ రోగిని బాధించుచుండును. ఇయ్యది వాతప్రకోప మున జనించిన గ్రహణీరోగ మని యెరుంగునది.

**పిత్తజగ్రహణీలక్షణము**

కట్వజీర్ణవిదాహ్యమ్లక్షారాద్యైః పిత్తముల్బణమ్,
ఆప్లావయద్ధన్త్యనలం జలం తప్త మివానలమ్. 11
సోఽజీర్ణం నీలపీతాభం పీతాభస్సార్యతే ద్రవమ్,
పూత్యమ్లోద్గారహృత్కణ్ఠదాహారుచితృడర్దితః. 12

కటురసంబులును, అజీర్ణకరంబులును, నోట మంటబుట్టించు నవియుం, ఆమ్లరసం బులును, మిక్కిలి *క్షారము కల్గినవియు మున్నగుపదార్థముల విశేషముగ భుజిం చుటచేత పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది మిక్కిలి వేడియైన నీళ్లనుండ నిప్పును చల్లార్చువిధముగ జాఠరాగ్నిని చల్లనార్చును. దానంజేసి రోగిశరీరము పచ్చగ పసుపురంగు కల్గి నీలవర్ణంబును పచ్చనిరంగు కలిగినదియు అమంబులైన ద్రవమైన మలమును మాటిమాటికిని గుదమునుండి విడచును. ఈ వ్యాధియందు దుర్గంధముతో గూడి పులిత్రేనుపులు మాటిమాటికిని వెడలును. రొమ్మునందును గంతమునందును మంటపుట్టును. నోట అరుచి కల్గును. దప్పి యధిక మగును. ఇయ్యది పిత్తముచే జనించిన గ్రహణి యనంబరగు.

**కఫజగ్రహణీలక్షణము**

గుర్వతిస్నిగ్ధశీతాదిభోజనాదతిభోజనాత్,
భుక్తమాత్రస్య చ స్వప్నాద్ధన్త్యగ్నిం కుపితః కఫః. 13
తస్యాన్నం పచ్యతే దుఃఖం హృల్లాసచ్ఛర్ద్యరోచకాః,
ఆస్యోపదేహమాధుర్యం కాసష్ఠీవనపీనసాః. 14
హృదయం మన్యతే స్త్యానం ఉదరం స్తిమితం గురు,
దుష్టో మధుర ఉద్గారః సదనం స్త్రీష్వహర్షణమ్. 15
భిన్నామశ్లేష్మసంసృష్టగురువర్చః ప్రవర్తనమ్,
అకృశస్యాపి దౌర్బల్యం ఆలస్యఞ్చ కఫాత్మకే. 16

చిరకాలమునకు జీర్ణించు స్వభావముకల పదార్థముల భుజించుటచేతను, మిక్కిలి జిడ్డుకల్గినవియు శీతగుణవీర్యములు నగు పదార్థములు మున్నగువానిని విశేష ముగ భుజించుటచేతను, తాను భుజించు మితమునకన్న నధికముగ భుజించుటచేతను, భుజించినతోడనే నిదురించుటచేతను కఫము ప్రకోపమునొంది జఠరాగ్నిని చల్లార్చును. దానంజేసి మనుజునకు భుజించిన య్యాహారము చాలకాలమునకు మిగుల

* క్షార మనగా కొక్కువగా దహింపజేయునట్టి యుప్పుకారపు రుచుల మిశ్రమ మని గ్రహింపవలెను.

కష్టముచే జీర్ణమగును. నోట నీరుగారును. వాంతియగును. అరోచకము కల్గును. నోట జిగటగల్గి తీపిగనుండును. దగ్గుకల్గి నోట కఫము నుమియును. పడిసెము పట్టును. హృదయమున కఫము నిండియుండుటంజేసి చిక్కనిపదార్థము ఘనీభవించి యున్నట్టు తోచును. కడుపు పెద్దదియై నీరు నిండినట్లుండును. చెడ్డనీటితోగూడి తీపిగల్గి త్రేనుపులు వెడలును. ఒడలు నొప్పికల్గును. స్త్రీసంభోగమునం దిచ్ఛ కొంచెమైనను బొడమదు. మలము పలుచబారి ఆమరసముతోను కఫముతోను కూడి భారముగలమలము పలుమారు వెడలుచుండును. శరీరము కృశత నొందక యున్నను మిక్కిలి బలహీనము కల్గును. శరీరము బడలి పనులయం దలసతజెంది యుండును. ఇయ్యది కఫమున జనించిన గ్రహణీరోగము.

### సన్నిపాతజగ్రహణీలక్షణము

పృథగ్వాతాదిభిర్దిష్ట హేతులిఙ్గసమాగమే,
త్రిదోషం నిర్దిశేదేనం, తేషాం వక్ష్యామి భేషజమ్. 17

త్రిదోషసన్నిపాతముచే గల్గిన గ్రహణీరోగమున వాతాదిగ్రహణులకు వేర్వేరుగ జెప్పబడిన లక్షణములన్నియు కల్గును. వాతాదులచే వేర్వేరుగ జనించిన గ్రహణుల యందు వేర్వేరుగ జెప్పబడిన నిదానము లన్నిటిచేత సన్నిపాతగ్రహణి జనించును. ఇచ్చట జఠరాగ్ని కాధారమైన గ్రహణి యనునాడి చెడిననాడు దానికి సంబంధించిన జఠరాగ్నియు బొత్తుగ చెడును. కావున అగ్నిమాంద్యము అజీర్ణము మున్నగు వ్యాధులన్నియు గ్రహణీభేదమున కల్గు నని యెరుంగునది. మరియు చికిత్సా ప్రసక్తి యీప్రకరణమున ననవసరమైనను శ్లోకపూరణమునకై "తేషాం వక్ష్యామి భేషజమ్" అని చెప్పబడెను.*

### సంగ్రహ-ఘటీయన్త్రగ్రహణీలక్షణములు

ఆన్త్రకూజనమాలస్యం దౌర్బల్యం సదనం తథా,
ద్రవం శీతం ఘనం స్నిగ్ధం సకటీవేదనం సకృత్. 18
ఆమం బహు సపైచ్ఛిల్యం సశబ్దం మన్దవేదనమ్,
పక్షాన్మాసాద్దశాహాద్వా నిత్యం వాప్యథ ముఞ్చతి. 19
దివా ప్రకోపో భవతి రాత్రౌ శాన్తిం వ్రజేచ్చ సా,
దుర్విజ్ఞేయా దుశ్చికిత్స్యా చిరకాలానుబన్ధినీ. 20
సా భవేదామవాతేన సఙ్గ్రహగ్రహణీ మతా,
స్వపతః పార్శ్వయోశ్శూలం గలజ్జలఘటీధ్వనిః. 21
తం వదన్తి ఘటీయన్త్రం అసాధ్యం గ్రహణీగదమ్,

* చరకమునందలి నిదాన శ్లోకములనే యీగ్రంథకర్త సేకరించి వ్రాయుచు శ్లోకపాఠమును విడువక వ్రాసెను.

ద్రవంబును, శీతంబును, నిబిడంబును, స్నిగ్ధంబును, ఆమంబును, పిచ్ఛిలంబునగు మలము నడుమునొప్పితోఁగూడి స్వల్పమైన వేదనకల్గి పరిమాణమునకన్న నధికముగ పక్షమున కొకసారియైనను, మాసమున కొకసారియైనను, పదిదినముల కొకసారి యైనను, లేక ప్రతిదినమునందైనను వెడలును. ఈవ్యాధియందు ప్రేవులలో శూలలు పుట్టును. పసులయం దలసత కల్గును. బలహీనము కల్గును. జఠరాగ్ని మందగించును. ఈవ్యాధి వ్యాధిస్వభావమునంజేసి పగలు ప్రకోపమునొంది రాత్రి శాంతినొందును. ఇయ్యది అపక్వమైనవాతముచే గల్గును. ఇదియే సంగ్రహగ్రహణి. దీనిని కనిపెట్టుట కష్టము, చికిత్సచేయుట మిగుల కష్టము. చాలాకాలమువరకును విడువక ననుసరించి బాధించుచుండును.

మరియు మనుజుడు నిదురించుసమయమున నిరుప్రక్కల నొప్పికల్గి, కదలుచున్న నీళ్లనిండిన కుండవలె గళబిళ మని శబ్దముతోఁగూడి కడుపుబ్బరించి యుండును. ఈవ్యాధి ఘటీయంత్రగ్రహణి యని చెప్పంబడును.

ఈగ్రహణీభేదములు రెండును సన్నిపాతభేదమున జేరినవి, కావున వీనిని ప్రత్యేకముగ పరిగణనము జేయలేదు.

### అసాధ్యగ్రహణీలక్షణము

దోషం సామం నిరామం చ విద్యాదత్రాతిసారవత్ । 22
లిఙ్గైరసాధ్యో గ్రహణీవికారో యైస్తైరతీసారగదో న సిద్ధ్యేత్,
వృద్ధస్యనూనం గ్రహణీవికారో హత్వాతనూం నైవ నివర్తతేచ.

ఈగ్రహణీరోగమునందు దోషముల ఆమనిరామలక్షణములను అతిసారమునను జెప్పినలక్షణములబట్టియే యెఱుంగునది. అతిసారవ్యాధికి అసాధ్యలక్షణము లెవ్వి చెప్పబడెనో ఆలక్షణములబట్టియే గ్రహణీరోగమునం దసాధ్యత్వమును నిర్ణయించునది. ఈవ్యాధి ముసలివారికి కల్గినచో శరీరమును బొత్తుగ జెరిచి ప్రాణాంతకమగును. కావున చికిత్సకు అలవికాజాలదు.

బాలకే గ్రహణీ సాధ్యా యూని కృచ్ఛ్రా సమీరితా,
వృద్ధే త్వసాధ్యా విజ్ఞేయా మతం ధన్వన్తరేరిదమ్. 24

పైజెప్పిన గ్రహణీరోగము బాలురకు కల్గినయెడ సుఖసాధ్యమగును. యౌవనవంతులకు కల్గినచో కృచ్ఛ్రసాధ్య మగును. వయసుచెల్లిన ముదుసలులకు కల్గెనేని ప్రాణాంతకమై యసాధ్యమగును. ఇయ్యది ధన్వంతరిమతము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
గ్రహణీరోగనిదానం సమాప్తమ్.

# ౫. అర్శోనిదానమ్

ఆర్శోరోగము అతిసారగ్రహణులబోలి యపానమార్గమునకు సంబంధించిన వ్యాధిగాన గ్రహణీనిదానమును జెప్పినపిదప అర్శోనిదానము జెప్పబడును.

అర్శోరోగసంఖ్య

పృథగ్దోషైస్సమస్తైశ్చ శోణితాత్సహజాని చ,
అర్శాంసి షట్ప్రకారాణి విద్యాద్గుదవళిత్రయే. 1

వాతపిత్తకఫములలో నొక్కొకదానిచేతను అన్నింటిచేతను రక్తముచేతను జనించుటంజేసియు, సహజంబును కలిసి యర్శోరోగము ఆరువిధములగును. (వాతజము, పిత్తజము, కఫజము, సాన్నిపాతకము, రక్తజము, సహజము నని యర్శోరోగము ఆరుతెరంగు లగు ననుట.) ఇయ్యవి గుదస్థానమునందలి మూడువళులలో జనించును.

మరియు సుశ్రుతమున "అర్శస్సు దృశ్యతే రూపం యదావై దోషయోర్ద్వయోః, సంసర్గం తం విజానీయాత్సంసర్గష్షడ్విధస్స్మృతః" (సు. ని. అ. ౨) అని ద్వంద్వజార్శస్సుల జూపియున్నారు. అర్శస్సులయందు రెండేసిదోషముల లక్షణములు దేనియందు కానవచ్చునో యారెండేసిదోషములచే నయ్యది జనించె నని యెరుంగునది. అట్టి సంసర్గమున జనించిన యర్శస్సులు ఆరువిధములు. అయ్యవి:—వాతపిత్తములు, వాతకఫములు, వాతరక్తములు, పిత్తకఫములు, పిత్తరక్తములు, కఫరక్తములు నను సంసర్గమునంజేసి యారువిధములు.

అయ్యవి రెండేసిదోషముల లక్షణములబట్టియే నిర్ణయింపదగుగాన ప్రకృతమున వేరుగ జెప్పబడవు. మరియు వాతపిత్తకఫములు మూడుదోషము లనియే ఆయుర్వేదసిద్ధాంతము. అయినను రక్తమునకుగూడ దోషమునకు జెప్పిన "దూషయన్తి ధాతూనితి దోషాః" అను వ్యుత్పత్తిచేత వాతాదులబోలె రక్తముగూడ తక్కిన ధాతువుల జెరచునుగాన దోషసంజ్ఞ యౌగికముగ సిద్ధించును. ఆయ్యది ప్రాయికముగ పిత్తమునకు సమానలక్షణము కావున వానిలక్షణములు ఆయావ్యాధిప్రకరణమున ప్రత్యేకముగ జెప్పుటలేదు. అర్శోరోగమునమాత్రము రక్తజ అర్శస్సులక్షణములు తక్కినవానికన్న విలక్షణముగ నుండుటంజేసి ప్రత్యేకముగ జెప్పబడెనని యెరుంగునది.*

* రక్తముగూడ దోషముగా సుశ్రుతుడు గ్రహించెను. రక్తము స్వయందూషకముకాక వాతాదిదుష్టమైన యితరధాతువులను చెరచుటచే దోషసంజ్ఞ దీనికి చెల్ల దని చరకాదులమతము.

'వళిత్రయే' అనుచోట గుదస్థానమున నుండు వళిత్రయ మని యర్థము. అయ్యవి ప్రవాహిణి, విసర్జని, సంవరణి యని మూడు. మలమును స్థూలాంత్రమునుండి క్రిందికి వెడలించునది ప్రవాహిణి. మలమును వెలికిం ద్రోయునది విసర్జని. విసర్జించిన పిదప గుదమును మూయునది సంవరణి. ఇవి గుదమున కవయవములై పైజెప్పిన పనులను జేయును. ముడుతల బోలె నుండును. ఈవిషయము సుశ్రుతాచార్యునిచే సవిస్తరముగ నిరూపితము.

"అరివత్ ప్రాణాన్ శృణాతి ఇతి = అర్శః" *అను వ్యుత్పత్తిచేత శత్రువును బోలి ప్రాణముల హింసించునది యర్శస్సని యన్వర్థముగ జెప్పబడును గాన మిగుల ప్రాణాపాయకరమైనది యర్శస్సని తేలినది.

—అర్శస్సంప్రాప్తిః—

దోషా స్త్వఙ్మాంసమేదాంసి సన్దూష్య వివిధాకృతీన్,
మాంసాఙ్కురానపానాదౌ కుర్వన్త్యర్శాంసి తాన్ జగుః. 2

వాతపిత్తకఫరక్తములు అనుదోషములు త్వక్కు, మాంసము, మేదస్సులను దూష్యములను మూటిని చెరిచి నానావిధములగు నాకారములు గల మాంసపు మొలకలను గుదము మున్నగుస్థలములయందు కల్గించును. అయ్యవి యర్శస్సు లని చెప్పనగును.

—వాతార్శోనిదానము—

కషాయకటుతిక్తాని రూక్షశీతలఘూని చ,
ప్రమితాల్పాశనం తీక్ష్ణం మద్యం మైథునసేవనమ్,
లఙ్ఘనం దేశకాలౌ చ శీతౌ వ్యాయామకర్మ చ,
శోకో వాతాతపస్పర్శో హేతుర్వాతార్శసాం మతః. 4

వగరు, చేదు, కారము ఈమూడిటిలో నేదైన నొకరసముగల ద్రవ్యమును భుజించుట, జిడ్డులేక రూక్షంబును, శీతంబును లఘువగుణము గలిగినట్టి యగు పదార్థములను భుజించుట, తాను నియతముగ భుజించు పరిమితికి న్యూనముగ భుజించుట, తీక్ష్ణపదార్థములను మద్యమును ఉపయోగించుట, అధికముగ సంభోగము చేయుట, లంకణముండుట, శీతగుణముగల ఆనూపాదిదేశములయందును, హేమంతాదికాలము నందును, సంచారము మున్నగు పనులచేయుట, దుఃఖపడుట, దేహపరిశ్రమము జేయుట, గాలి యెండ విశేషముగ తగులుట, ఈకారణములచేత వాతము మిక్కిలి ప్రకోపించి పైజెప్పినరీతిగ త్వఙ్మాంసమేదస్సుల చెరిచి యర్శస్సులను (మాంసాంకురములను) కల్గించును, అయ్యవి వాతార్శస్సు లని చెప్పబడును.

*పృషోదరాదిగణములో జేర్చుటచేత వర్ణలోపాదులు కలిగెనని యెరుగవలెను.

## పిత్తార్శోనిదానము

కట్వమ్లలవణోష్ణాని వ్యాయామాగ్న్యాతపప్రభాః,
దేశకాలావశిశిరౌ క్రోధో మద్యమసూయనమ్. 5
విదాహి తీక్ష్ణముష్ణం చ సర్వం పానాన్న భేషజమ్,
పిత్తోల్బణానాం విజ్ఞేయః ప్రకోపే హేతురర్శసామ్. 6

కారము, పులుపు, ఉప్పు అను రసములుకల పదార్థముల భుజించుట, గుణవీర్యములచేతను, స్పర్శముచేతను ఉష్ణంబులైన పదార్థముల భుజించుట, అధికముగ దేహపరిశ్రమముజేయుట, అగ్నియొక్కయు ఎండయొక్కయు కాంతిని (సెగను) నిరంతరముగ సేవించుట, ఉష్ణప్రధానమైన జాంగలప్రదేశమునందును, కాలమునందును సంచరించుట, మనఃప్రజ్వలనరూపమైన క్రోధము కల్గుట, మద్యమును పానముజేయుట, ఒరులసంపద చూచి మనస్సున ఖేదపడుట, నోటమంటబుట్టించునవియు, తీక్ష్ణగుణము గలవియు, గుణవీర్యములచే నుష్ణంబులును నగు అన్నపానములను ఔషధములను నిరంతరముగ నుపయోగించుట, ఈకారణములచేత పిత్తము మిక్కిలి ప్రకోపము నంది గుదాదిస్థానములయందు మాంసాంకురముల బుట్టించును. ఇది పిత్తార్శోరోగము.

## కఫజార్శోనిదానము

మధురస్నిగ్ధశీతాని లవణామ్లగురూణి చ,
అవ్యాయామో దివాస్వప్నః శయ్యాసనసుఖే రతిః. 7
ప్రాగ్వాతసేవా శీతౌ చ దేశకాలావచిన్తనమ్,
శ్లైష్మికాణాం సముద్దిష్టం ఏతత్కారణమర్శసామ్. 8

మధురరసముకలపదార్థములను, జిడ్డు అధికముగలపదార్థములను, రసగుణ వీర్య స్పర్శములచే శీతములగుపదార్థములను, లవణరసముకలపదార్థములను, పులుపు గలపదార్థములను, చాలాకాలమునకు జీర్ణించు స్వభావముకల పదార్థములను విశేషముగ నలవాటు చేసి భుజించుట; దేహపరిశ్రమమును బొత్తుగ జేయకుండుట, పగటిపూట కారణము లేకయే విశేషముగ నిదురించుట, పరుండియుండుటయందును కూర్చొనియుండుటయందును సుఖము నభిలషించి నిర్వ్యాపారముగ నుండుట, తూర్పుదిక్కునవచ్చుగాలిని విశేషముగ సేవించుట, శీతంబులగు అనూపదేశమునను హేమంతాది కాలమునందును విశేషముగ సంచరించుట, మనోవ్యాపారమును బొత్తుగ మానియుండుట, ఇవి యన్నియు కఫమును ప్రకోపింపంజేసి యర్శస్సుల గల్గించును. ఇది కఫజార్శోరోగము.

## ద్వంద్వజ సన్నిపాతజార్శోనిదానము

హేతులక్షణసంసర్గాద్విద్యాద్ద్వన్ద్వోల్బణాని చ,
సర్వో హేతుస్త్రిదోషాణాం సహజైర్లక్షణం సమమ్. 9

వాతాదిదోషములచే వేర్వేరుగ జనించిన అర్శోరోగములకు ప్రత్యేకముగ జెప్పిన రెండింటి కారణములచే జనించి, యారెండింటి లక్షణములతో గూడియున్న యెడ నయ్యవి ద్వన్ద్వజార్శస్సు లనియు, త్రిదోషములకు జెప్పిన హేతువు లన్నిటిచే గల్గి వాని లక్షణము లన్నియు గల్గియుండుకెడ సన్నిపాతజార్శస్సు లనియు జెప్పంగు నది. మరియు సన్నిపాతార్శస్సుకుకల లక్షణములే సహజార్శస్సుకును కల్గియుండును.

తల్లిదండ్రులకు అర్శోరోగము కల్గియున్నచో నట్టివారికి జనించినవారికి పుట్టుక తోనే యర్శోరోగముగూడ ననుసరించియుండును. అయ్యది సహజార్శోరోగ మని చెప్పంబడును. దీనిలక్షణములు సుశ్రుతాచార్యునిచే నిత్తెరంగున చెప్పంబడినవి:—"దుర్దర్శనాని పరుషాణి పాణ్డూని దారుణాన్యన్తర్ముఖాని; తైరుపద్రుతః కృశోఽల్పభుగ్ సిరాసంతతగాత్రః అల్పప్రజః క్షీణరేతాః క్షామస్వరః క్రోధనోఽల్పాగ్నిః, ఘ్రాణ శిరోఽక్షిశ్రవణరోగవాన్, సతతమన్త్రకూజనాటోపహృదయోపలేపారోచక ప్రభృతిభిః పీడ్యతే." (సు. ని. అ. ౨). పుట్టుకతోగూడ బుట్టిన యర్శోరోగమునందు గుదాంకురములు కంటికగపడక మిక్కిలి కఠినములై ద్వారములును లోపలికిమళ్లిన ముఖ ములును కల్గినవియై యుండును. అట్టి గుదాంకురములచే నుపద్రవమునంది రోగి మిక్కిలి కృశతనందును. మిక్కిలి స్వల్పముగ నాహారమును భుజించును. శరీరము కృశించుటంజేసి సన్ననినరములచే వ్యాపించిన శరీరము కల్గియుండును. జ్ఞానము తగ్గును. రేతస్సు నశించును. కంఠస్వరము మారి మాట్లాడ శక్తిలేకుండును. కారణములేకయే కోప మతిశయించును. జఠరాగ్ని స్వల్పమగును. నాసారంధ్రములయందును, శిరస్సు నందును, కన్నులయందును, చెవులయందును రోగములు గల్గును. ఎల్లప్పుడును ప్రేవులర చుచు కడుపులో గుడగుడయను శబ్దముకల్గి యుబ్బరించి రొమ్ము బరువై యరుచిచేత ముచే బీడింపబడును. ఇంకను ననేకోపద్రవములచే బాధింపబడుచు కష్టపడును.

మరియు నీసహజార్శోరోగమున గుదాంకురములు కొన్నిసమయములయందు మిక్కిలి సూక్ష్మములుగను, ఒకసమయమున గొప్పగను, కొన్ని దీర్ఘములుగను, కొన్ని హ్రస్వములుగను, కొన్ని గుండ్రములుగను, కొన్ని విషమములుగను, కొన్ని లోప్రక్క వక్రములుగను, కొన్ని వెలిప్రక్క వక్రములుగను, కొన్ని నిబిడములుగను నానావిధ ములై ఆయాదోషమునకు జెప్పినరంగులు కల్గియుండు నని చరకాచార్యులు నిర్దేశించిరి.

## వాతార్శోలక్షణము

గుదాఙ్కురా బహ్వనిలాశ్శుష్కాశ్చిమిచిమాన్వితాః,
మ్లానాశ్శ్యావారుణా స్తబ్ధా విశదాః పరుషాః ఖరాః. 10
మిథో విసదృశా వక్రా స్తీక్ష్ణా విస్ఫుటితాననాః,
బిమ్బ్యాకర్జూరకర్కన్ధుకార్పాసీఫలసన్నిభాః. 11
కేచిత్కదమ్బపుష్పాభాః కేచిత్సిద్ధార్థకోపమాః,
శిరఃపార్శ్వాంసకట్యూరువఙ్క్షణాద్యధికవ్యథాః. 12
క్షవథూద్గారవిష్టమ్భహృద్గ్రహారోచకప్రదాః,
కాసశ్వాసాగ్నివైషమ్యకర్ణనాదభ్రమావహాః. 13
తైరార్తో గ్రథితం స్తోకం సశబ్దం సప్రవాహికమ్,
రుక్ఫేనపిచ్ఛానుగతం విబద్ధముపవేశ్యతే. 14
కృష్ణత్వఙ్నఖవిణ్మూత్రనేత్రవక్త్రశ్చ జాయతే,
గుల్మప్లీహోదరాష్ఠీలాసమ్భవ స్తత ఏవచ. 15

వాతము ప్రకోపించుటచే గల్గిన యర్శోరోగమునందు గుదాంకురములు ద్రవము లేక యెండి చిమచిమ యని దురద కలిగి వాడినవియు, శ్యామలవర్ణంబులును, అరుణ వర్ణంబులునై యుండును. మఱియు నవి యొండొంట గలియక కొన్ని క్రిందికిని కొన్ని పైకిని వ్యాపించి పుల్లలవలె స్తంభించి, టేకాకువలె కరుకు కలిగియుండును. కఠినములై యొకటివలె నింకొకటి యుండక భిన్నరూపములై విల్లువలె వక్రములును, దర్భలకొనల వలె వాడియైన కొనలు కల్గినవియు, కొనలయందు చిట్లినవియునై యుండును. వానిలో కొన్ని దొండపండువంటి యాకారము కల్గి యెఱ్ఱనై యుండును. కొన్ని ఖర్జూరపు పండ్లబోలియు, కొన్ని రేగుపండ్లవలె గుండ్రముగను, కొన్ని ప్రత్తికాయలవలె నిడుపు గను, కొన్ని కడపపువ్వులబోలె రక్తవర్ణంబులుగను, కొన్ని యావగింజలబోలె సన్న వియునై యుండును అట్టి గుదాంకురములచేత తలయందును, ఇరు ప్రక్కలయందును, మూపులయందును, నడుమునందును, తొడలయందును, గజ్జలు మున్నగు నవయవవిశేష ములయందును మిక్కిలి తీవ్రమైననొప్పి మొదలగు బాధలు కల్గును. తుమ్ములును, త్రేపులును అధికముగ వెడలును. మలము బంధింపబడును. రొమ్మున పట్టినట్లు నొప్పి కల్గును. అరోచకము, దగ్గు, శ్వాసము కల్గును. జఠరాగ్ని యొకప్పుడు మిక్కిలి తీవ్రం బును మఱి యొకప్పుడు మందంబునై విషమముగ నుండును. చెవులయందు కారణము లేకయే ధ్వని పుట్టును. చక్రముపైనున్నవానివలె నొడలు తిరుగునట్లుండును. అట్టి

బాధలతోఁగూడిన మనుజునకు గుడగుడ యనుశబ్దముతోఁ గూడి కఠినంబై బంకతోఁగూడి మిక్కిలి బాధకల్గి కొంచెముగ మలప్రవర్తియగును. అపులంబును మిక్కిలి బలాత్కారముగ ముక్కినప్పుడు నురుగుతోఁగూడి కొంచెముగ వెడలును. మఱియు నాతనికి చర్మము గోళ్లు మలము మూత్రము నేత్రములు ముఖము ఇవియన్నియు నల్లగనుండును. ఇట్టి యర్శోరోగముచేత గుల్మము, ప్లీహాభివృద్ధి, ఉదరము, అష్ఠీల యను వాతరోగము ఇవియన్నియు కల్గును.

### పిత్తార్శోలక్షణము

పిత్తోత్తరా నీలముఖా రక్తపీతాఽసితప్రభాః,
తన్వస్రస్రావిణో విస్రాస్తనవో మృదవశ్శ్లథాః. 16
శుకజిహ్వాయకృత్ఖండజలౌకావక్త్రసన్నిభాః,
దాహపాకజ్వరస్వేదతృణ్మూర్ఛారుచిమోహదాః. 17
సోష్మాణో ద్రవనీలోష్ణపీతరక్తామవర్చసః,
యవమధ్యా హారిత్పీతహారిద్రత్వఙ్నఖాదయః. 18

పిత్తప్రకోపమున జనించిన యర్శోరోగమునందు గుదాంకురములు నల్లని కొనలు గల్గి రక్తవర్ణంబులును పీతవర్ణంబులును నల్లని కాంతిగల్గినవియునై యుండును. కొంచెము కొంచెముగ రక్తమును స్రవించును. దుర్గంధము కల్గి మిక్కిలి సన్ననివియు మెత్తనివియు సడలియుండును. చిలుకనాలుకను యకృత్తను మాంసఖండమును జలగనోటిని బోలి యుండును. అట్టి యంకురములు ఘోరమైనమంటతోఁగూడి పుండగును. శోషగలుగుచు ద్రవంబు నీలవర్ణంబును ఉష్ణంబును లేక పీతవర్ణంబును లేక రక్తవర్ణంబునునై పక్వము గాని మలము వెడలును. మరియు గుదాంకురములు యవలబోలిన మధ్యభాగము గల్గి యుండును. చర్మంబును గోళ్లను మున్నగునవి పచ్చగానైనను అతిపచ్చని వర్ణంబైన కల్గియుండును.

### కఫజార్శోలక్షణము

శ్లేష్మోల్బణా మహామూలా ఘనా మందరుజస్సితాః,
ఉత్సన్నోపచితస్నిగ్ధస్తబ్ధవృత్తగురుస్థిరాః. 19
పిచ్ఛిలాస్తిమితాశ్శ్లక్ష్ణాః కండ్వాఢ్యాస్స్పర్శనప్రియాః,
కరీరపనసాస్థ్యాభాః తథా గోస్తనసన్నిభాః. 20
వఙ్క్షణానాహినః పాయువస్తినాభివికర్షిణః,
సశ్వాసకాసహృల్లాసప్రసేకారుచిపీనసాః. 21

మేహాకృచ్ఛ్రశిరోజాడ్యశిశిరజ్వరకారిణః,
క్లైబ్యాగ్నిమార్దవచ్ఛర్దిరామప్రాయవికారదాః. 22
వసాభసకఫప్రాజ్యపురీషాస్సప్రవాహికాః,
న స్రవన్తి న భిద్యన్తే పాణ్డుస్నిగ్ధత్వగాదయః. 23

కఫప్రకోపముచే జనించిన యర్శస్సునందు మాంసపు మొలకలు మిగుల లోతున నాటికొనిన మొదళ్లుకల్గి తెల్లనిరంగుతో గూడి స్వల్పమైన బాధకల్గి దట్టముగ నుండును. మిక్కిలి పొడుపుకల్గి స్థూలములై స్నిగ్ధంబుగ (జిడ్డుకల్గి) గుండ్రములై మేకులవలె స్తంభించి యుండును. జిగటకల్గి నిశ్చలములై మణులవలె నిగనిగలాడుచు ప్రబలమై జిలగల్గి చేత తాకిన సుఖముగ నుండును. అందు కొన్ని వెదురుమొవ్వులబోలె కోమలంబులును, కొన్ని పనసవిత్తులబోలె నునుపుకల్గియు, కొన్ని ద్రాక్షపండ్లవలె గుండ్రములునై యుండును. ఈవ్యాధియందు గజ్జలలో నుబ్బియుండును. గుదస్థానమునందును పొత్తికడుపునను, బొడ్డుదగ్గరను లాగిపట్టినట్టులు బాధ కలుగును. శ్వాసము, దగ్గు, ఓకరింతలు, నోట జొల్లుకారుట, అరోచకము, పడిసెము, ప్రమేహము, మూత్రకృచ్ఛ్రము, శిరోభారము, చలిజ్వరము, ఈరోగము లుపద్రవరూపములుగ జనించును. వీర్యపాటవము చెడి నపుంసకత్వము కల్గును. జఠరాగ్ని బలహీనమగును. వాంతియగును. అజీర్ణము ప్రధానముగగల వ్యాధులు కల్గును. కఫముతో గూడి మాంసపు కొవ్వునకు సమానమైన మలము విశేషముగ వెడలును. పై యతిసారప్రకరణమున వివరింపబడిన ప్రవాహికయను వ్యాధి కల్గును. పైజెప్పిన లక్షణములతో గూడినయంకురములు పగులవు. అందుండి రక్తము స్రవించదు. మలము, మూత్రము, కన్నులు, చర్మము, గోళ్లు, ముఖము మున్నగునవి పాండువర్ణంబులును స్నిగ్ధంబులునై యుండును.

### సాన్నిపాతికార్శోలక్షణము

సర్వైస్సర్వాత్మకాన్యాహుర్లక్షణైస్సహజాని చ,

త్రిదోషములు సమకాలమున ప్రకోపించి కల్గిన యర్శోరోగమున త్రిదోషములకును వేర్వేరుగ జెప్పిన లక్షణములన్నియు గల్గియుండును. సహజార్శోరోగమున కూడ త్రిదోషలక్షణములు కల్గియుండును.

### రక్తార్శోలక్షణము

రక్తోల్బణాఃగుదే కీలాః పిత్తాకృతిసమన్వితాః. 24
వటప్రరోహసదృశాః గుఞ్జావిద్రుమసన్నిభాః,
తేఽత్యర్థం దుష్టముష్ణం చ గాఢవిట్కా ప్రపీడితాః. 25

స్రవన్తి సహసా రక్తం తస్య చాఽతి ప్రవృత్తితః,
భేకాభః పీడ్యతే దుఃఖైః శోణితక్షయసమ్భవైః. 26
హీనవర్ణబలోత్సాహో హతౌజాః కలుషేన్ద్రియః,
విట్ శ్యావం కఠినం రూక్షం అధో వాయుర్న వర్తతే. 27

రక్తము ప్రకోపించుటచే గల్గిన యర్శోరోగమున గుదస్థానమునందలి యంకురములు పిత్తమున జనించినవానికి జెప్పినలక్షణములు కల్గియుండును. మఱియు మఱ్ఱిచిగుళ్లనుబోలి కొన్నియు, పవడములను గురిగింజలనుబోలి కొన్నియు నుండును. మలము ద్రవములేక కఠినమై వెడలుటంజేసి దానియొరిపిడిచే మిక్కిలి దుష్టంబును ఉష్ణంబునైన రక్తము శీఘ్రముగ వెడలును. అట్టిరక్త మధికముగ వెడలుటవలన శరీరమునందలి రక్తము నశించి యొడలెల్ల కృశించి రక్తక్షయమున గల్గు నానావిధ బాధలచే పీడింపబడి శరీరవర్ణము, బలము, ఉత్సాహముం జెడి ప్రాణమునకు ముఖ్యాధారమగు నోజస్సు నశించి వ్యాకులములగు నింద్రియములు పాటవంబు చెడి, వర్షాకాలమునందలి కప్పవలె కృశతనొంది, పచ్చనిశరీరముకలవాడై బాధపడును. శ్యామవర్ణంబును, కఠినంబును, రూక్షంబును నగు మలమును విసర్జించును. అపానవాతము బైటవెడలక మలము మిగుల గష్టముచే వెడలును.

### దోషానుబంధమున కల్గిన రక్తార్శోలక్షణము

తను చారుణవర్ణం చ ఫేనిలం చాసృగర్శసామ్,
కట్యూరుగుదశూలం చ దౌర్బల్యం యది చాధికమ్. 28
తత్రానుబన్ధో వాతస్య హేతుర్యది చ రూక్షణమ్,
శిథిలం శ్వేతపీతం చ విట్స్నిగ్ధం గురు శీతలమ్. 29
యద్యర్శసాం ఘనం చాసృక్తన్తుమత్పాణ్డు పిచ్ఛిలమ్,
గుదం సపిచ్ఛం స్తిమితం గురు స్నిగ్ధం చ కారణమ్,
శ్లేష్మానుబన్ధో విజ్ఞేయః తత్ర రక్తార్శసాం బుధైః. 30

వాతము ప్రకోపించిన రక్తమునంగలిసి జనించిన యర్శోరోగమున అరుణవర్ణంబును నురుగుతో గూడినదియు నగు రక్తము స్వల్పముగ వెడలును. నడుమునందును, తొడలయందును, గుదస్థానమునందును నొప్పికల్గును. మిక్కిలి బలహీన మగును. ఇయ్యది మిక్కిలి రూక్షంబులగు పదార్థముల భుజించుటంజేసి ప్రకోపించిన వాతముచే గల్గును.

గురుపదార్థములను స్నిగ్ధపదార్థములను భుజించుటచే కఫము ప్రకుపితమై రక్తముతోగూడి యర్శోరోగమును కల్గించును. ఇందు కఫము అనుబంధంబును రక్తము ప్రధానంబు నగును. ఈవ్యాధియందు తెలుపుతోగూడిన పచ్చనిరంగుగల్గి స్నిగ్ధంబును, మిక్కిలి బరువు కల్గినదియు, చల్లనైనదియు నగు మలము బంధము లేక వెడలును. రక్తము చిక్కనై తీగవలె బంధనకల్గి పాండువర్ణంబును పిచ్ఛిలంబునై స్రవించును. గుదస్థానమున జిగటగల్గి గుడ్డచే గప్పినట్లు మొద్దుబారియుండును. ఇచట రక్తమునకును పిత్తమునకును లక్షణములు నొక్కటిగ నుండును. కావున పిత్తానుబంధ రక్తార్శస్సునకు ప్రత్యేకముగ లక్షణము చెప్పబడదయ్యె.

### అర్శోరోగపూర్వరూపములు

విష్టమ్భోఽన్నస్య దౌర్బల్యం కుక్షేరాటోప ఏవ చ,
కార్శ్యముద్గారబాహుళ్యం సక్థిసాదోఽల్పవిట్కతా. 31
గ్రహణీదోషపాణ్డ్వర్తేరాశఙ్కా చోదరస్య చ,
పూర్వరూపాణి నిర్దిష్టాన్యర్శసామభివృద్ధయే. 32

భుజింపబడిన యాహారపదార్థము వాతముచే నడ్డగింపబడియుండుట, బలహీనము, కడుపులో గుడగుడ యనుశబ్దముతో గూడి యుబ్బుట, శరీరము మిక్కిలి కృశించుట, త్రేనుపు లధికముగ వెడలుట, తొడలు విరిసినట్లు నొచ్చుట, మలము కొంచెముగ వెడలుట, గ్రహణి యనునాళము చెడియుండుట, పాండురోగంబును, ఉదరరోగంబును కల్గునేమో యని సందేహము జనించుట ఇవియన్నియును అర్శోరోగము జనించుటకు మున్ను కల్గు పూర్వరూపములు.

### అర్శోరోగప్రాబల్యకారణము

పఞ్చాత్మా మారుతః పిత్తం కఫో గుదవలిత్రయమ్,
సర్వ ఏవ ప్రకుప్యన్తి గుదజానాం సముద్భవే. 33
తస్మాదర్శాంసి దుఃఖాని బహువ్యాధికరాణి చ,
సర్వదేహోపతాపీని ప్రాయః కృచ్ఛ్రతమాని చ. 34

ప్రాణాదిభేదములచే నైదువిధములైన వాతంబును, ఆలోచకాదిభేదములచే నైదుతెరంగులగు పిత్తంబును, అవలంబకాదిభేదములచే నైదువిధములైనకఫంబును, మిథ్యాహారాదులచే ప్రకోపమునంది తమతమస్థానముల విడిచి గుదస్థానమునందలి వలిత్రయమున జేరి గుదాంకురముల గల్గించును. కావున నర్శోరోగము మిక్కిలి కష్టమును కల్గించునదియు, పలుతెరంగులైన యితరవ్యాధులను గల్గించునదియు

నగును. దేహమునందంతట వ్యాపించిన త్రిదోషముల ప్రకోపమునం జేసియే దేహమును విశేషముగ తపింపజేయును. మిక్కిలి కష్టసాధ్యములు నగును.

## సుఖసాధ్యార్శోలక్షణము

బాహ్యాయాన్తు వళౌ జాతాన్యేకదోషోల్బణాని చ,
అర్శాంసి సుఖసాధ్యాని న చిరోత్పతితాని చ. 35

గుదస్థానమున నుండు మూడువళులలో వెలిప్రక్కనుండు వళియందు జనించిన యర్శస్సును, త్రిదోషములలో నొక్కదోషముమాత్రము ప్రకోపించుటచే గల్గిన యర్శస్సును, స్వల్పకాలమున జనించిన యర్శస్సును సుఖముగ సాధింపఁబడగి యుండును.

## కృచ్ఛ్రసాధ్యార్శోలక్షణము

ద్వన్ద్వజాని ద్వితీయాయాం వళౌ యాన్యాశ్రితాని చ,
కృచ్ఛ్రసాధ్యాని తాన్యాహుః పరిసంవత్సరాణి చ. 36

రెండేసిదోషములసంసర్గమున జనించినవియు, రెండవవళియందు పుట్టినవియు, సంవత్సరకాలమునకు మునుపు జనించినవియు కృచ్ఛ్ర (కష్ట) సాధ్యము లగును.

## అసాధ్యార్శోలక్షణము

సహజాని త్రిదోషాణి యాని చాభ్యన్తరాం వళిమ్,
జాయన్తేఽర్శాంసి సంశ్రిత్య తాన్యసాధ్యాని నిర్దిశేత్. 37

పైజెప్పిన యర్శోరోగములలో పుట్టుకతోగూడ బీజదోషమునం గలిగిన యర్శస్సులును, త్రిదోషసన్నిపాతమున జనించినదియు, లోప్రక్కనుండు మూడవవళిలో జనించినవియు నసాధ్యములు.

ఇచ్చట నొకవిశేషమును తెలియంగునది:—బాహ్యప్రదేశమున నున్న వళి నాశ్రయించి వాతాదులలో నొక్కదోషము ప్రకోపించుటచే గల్గినయర్శస్సు సుఖసాధ్యము. ఆవళియందే దోషద్వయప్రకోపమున జనించిన యర్శస్సు కృచ్ఛ్రసాధ్యము. అచ్చటనే త్రిదోషప్రకోపమున జనించినది యాప్యము. రెండవవళి నాశ్రయించి వాతాదులలో నొక్కదోషమున జనించినను కృచ్ఛ్రసాధ్యము. అచ్చోటనే దోషద్వయప్రకోపమున జనించినది యసాధ్యము. మూడవవళి నాశ్రయించి వాతాదులలో నొక్కదోషమున జనించినను యాప్యం బగును. ద్విదోష ప్రకోపముచేతను త్రిదోషప్రకోపముచేతను మూడవవళి నాశ్రయించి జనించిన యర్శస్సు అసాధ్యము. ఇట్టి నిబంధనము దోషముల యొక్కయు స్థలముయొక్కయు బలాబలమునుబట్టి యేర్పడును.

### యాప్యార్శోలక్షణము

శేషత్వాదాయుషస్తాని చతుష్పాదసమన్వితే,
యాప్యన్తే దీప్తకాయాగ్నేః ప్రత్యాఖ్యేయాన్యతోఽన్యథా.

రోగికి ఆయువుండుటచే జఠరాగ్ని చెడక సమస్థితి జ్వలించుచుండి సద్వైద్యుడును మంచియౌషధములును, చక్కగ నుపచారములజేయు పరిచారకులును, బలిష్ఠుడగు రోగియు నున్నచో పైజెప్పబడిన యసాధ్యలక్షణములు కల యర్శస్సులును యాప్యములగును. అటుగాక రోగికి జఠరాగ్నిమందగించి వైద్యుడు మున్నగు సహాయసంపత్తి లేకుండునెడ ప్రత్యాఖ్యేయము. (చికిత్స చేయదగ దనుట.)

ఇచ్చట నీనిర్ణయము నెఱుంగునది:— రోగములన్నియు సాధ్యము లనియు, అసాధ్యము లనియు రెండుతెరంగులు. అందు సాధ్యములు స్వల్పచికిత్సచే సాధింపదగినవి సుఖసాధ్యము లనియు, పూనికతో చికిత్సజేసి కష్టముచే సాధింపదగినవి కృచ్ఛ్రసాధ్యము లనియు రెండుతెరంగులు. అసాధ్యములు ఆయుశ్శేష ముండునంతవరకును వైద్యాది సంపత్తియుండుటచే కాలము గడుపగలవి యాప్యములు, ఆయుశ్శేషంబును వైద్యాది చతుష్టయసంపత్తియు లేనినాడు అపాయము గల్గించునది ప్రత్యాఖ్యేయ మనియు రెండుతెరంగులు.

### ఉపద్రవవిశేషములచే నసాధ్యత్వము

హస్తే పాదే ముఖే నాభ్యాం గుదే వృషణయోస్తథా,
శోథో హృత్పార్శ్వశూలఞ్చ యస్యాసాధ్యోఽర్శసోహి సః. 39

అర్శోరోగము కల్గినవానికి హస్తములయందును, పాదములయందును, ముఖముపైనను, నాభిస్థానమునందును, గుదస్థానమునందును, వృషణములయందును వాపుకల్గి, హృదయమునందును ఇరుప్రక్కలయందును నొప్పికల్గినయెడ నారోగికి చికిత్సచేయంజనదు. (అసాధ్యమగు నని భావము.)

హృత్పార్శ్వశూలం సమ్మోహః ఛర్దిరఙ్గస్య రుగ్జ్వరః,
తృష్ణా గుదస్య పాకశ్చ నిహన్యుర్గుదజాతురమ్. 40
తృష్ణారోచకశూలార్తం అతిప్రస్రుతశోణితమ్,
శోథాతిసారసంయుక్తం అర్శాంసి క్షపయన్తి హి. 41

హృదయమునందును, ఇరుప్రక్కలయందును నొప్పి కల్గి, మూర్ఛయు, వాంతియు, శరీరమునందెల్ల నొప్పియు, జ్వరంబును, దప్పియు, గుదస్థానమున

పుండును కల్గినయెడ అర్శోరోగము రోగిని చంపును. మరియు దప్పి, అరోచకము, పోటును కల్గి, రక్తము అధికముగ స్రవించుచు శరీరమున వాపుకల్గి అతిసారము జనించినచో నర్శోరోగము తప్పక చంపును.

## స్థానవిశేషమున జనించు నర్శోలక్షణము

మేఢ్రాదిష్వపి వక్ష్యన్తే యథాస్వం నాభిజాని చ,
గణ్డూపదాస్యరూపాణి పిచ్ఛిలాని మృదూని చ. 42

మేఢ్రము నాసారంధ్రములు మున్నగుస్థలములయందును, నాభిస్థానము నందును మాంసపుమొలకలు జనించును. అయ్యవి యెఱ్ఱలముఖమువంటి యాకారము కల్గి జిగట కల్గి మెత్తనైయుండును. ఇయ్యవి ఆయాస్థానవిశేషమున తనురూపముగ మేఢ్రార్శస్సు, నాసార్శస్సు అను మున్నగునామములచే వ్యవహరింపబడును.

మరియు నీయర్శస్సు జనించు స్థానవిశేషములు చరకమున నీరీతి తెల్పఁబడియె:—"సర్వేషాఞ్చార్శసాం క్షేత్రం గుదస్యార్ధపఞ్చమాఙ్గులేఽవకాశే త్రిభాగాన్తరాస్తిస్రో గుదవళయః, (క్షేత్రమితి దేశః,) కేచిత్తు భూయాంసమేవ దేశము పదిశన్తి అర్శసాం; శిశ్నమపత్యపథం గళముఖ నాసికాకర్ణాక్షివర్త్మాని త్వక్చ, తదస్త్యధిమాంసదేశతయా, గుదవలిజానాం త్వర్శాంసీతి సంజ్ఞా తన్త్రే ఽస్మిన్ ; సర్వేషాఞ్చ అర్శసామధిష్ఠానం మేదో మాంసం త్వక్చ" (చ. చి. ౧౪. ౧౪. సూ. ౬.) మనుజసామాన్యముగ గుదస్థానము నాల్గున్నర అంగులపరిమాణము కల్గియుండును. అందు దానికి ఒకటిన్నరయంగుళపరిమాణము ఎడముకల్గి మూండువళులు (రేఖలు) ఉండును. అయ్యవి యర్శస్సులకన్నిటికిని ఆశ్రయముగ నుండును. ఇదియే యర్శోరోగము జనించుస్థలము. ఇవి గాక స్థలాంతరములుగూడ కొందరిచే నిర్దేశింపబడినవి. అవి శిశ్నము, ప్రసూతిమార్గము, కంఠము, నోరు, నాసారంధ్రములు, చెవులు, కనురెప్పలు, చర్మము అనునవి. అందు గుదస్థానమునందలి వళులయందు జనించినవానికి అర్శస్సులనియు శిశ్నాదులయందు జనించువాని కధిమాంస మని వాడుకకలదు. అర్శస్సుల కన్నింటికిని మేదస్సు, మాంసము, చర్మము ఈమూండును ముఖ్యమైన యధిష్ఠానము.

## చర్మకీలలక్షణము

వ్యానో గృహీత్వా శ్లేష్మాణం కరోత్యర్శ స్త్వచో బహిః,
కీలోపమం స్థిరఖరం చర్మకీలస్తు తద్విదుః. 43

వాతేన తోదపారుష్యం పిత్తాదసితవక్త్రతా,
శ్లేష్మణా స్నిగ్ధతా తస్య గ్రథితత్వం సవర్ణతా. 44

సర్వశరీరమున వ్యాపించియుండు వ్యానవాతము ప్రకోపించి కఫముతోఁగూడి చర్మమునకు పైభాగమున అర్శస్సును కల్గించును. అందు ఇనుపచీలలవలె కఠినములైన మొలక లుండును. అయ్యవి చర్మకీల మని చెప్పనగును. అందు పోటధికముగ నున్నచో వాతముచే జనించిన వనియు, నల్లనికొనలు కల్గియున్నచో పిత్తమున జనించె ననియు స్నిగ్ధమై గ్రంథివలె శరీరమునకు సమానవర్ణము కల్గియున్నచో కఫమున జనించె ననియు నెఱుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే అర్శోరోగనిదానం సమాప్తమ్.

# ౬. అగ్నిమాంద్యాజీర్ణవిసూచికాలసకవిలంబికా నిదానమ్.

అర్శోరోగమువలన అగ్నిమాంద్యము జనించును. అగ్నిమాంద్యమున నజీర్ణంబును, దానిచే విసూచియు, అలసకవిలంబికములును వరుసగ పరస్పర కారణములై జనించును. కావున అర్శోరోగనిదానమును జెప్పినపిదప అగ్నిమాంద్యాదినిదానము చెప్పబడును:—

### జాఠరాగ్ని భేదములు

మన్దస్తీక్ష్ణోఽథ విషమస్సమశ్చేతి చతుర్విధః,
కఫపిత్తానిలాధిక్యాత్తత్సామ్యాజ్జాఠరోఽనలః. 1

మనుజులకు జాఠరానలము భుజింపబడిన యాహారమును పచనము చేయును. అట్టి జాఠరాగ్ని మందము, తీక్ష్ణము, విషమము, సమము నని నాల్గువిధముల నుండును. శరీరమునందలి వాతపిత్తకఫములలో కఫము, స్వప్రమాణమునకన్న నధికముగ నుండునేని కాయాగ్ని మందగించును. కావున నయ్యది మందాగ్ని యనంబరగు. పిత్తము స్వప్రమాణమునకన్న నధికముగ నున్నపుడు పిత్తం బాగ్నేయం బగుటం జేసి కాయాగ్ని బలము వృద్ధినొందును. దానం జేసి తీక్ష్ణాగ్ని యనబడును. వాతము స్వప్రమాణమునకన్న నధికమగునపుడు అట్టివాతముచే జాఠరాగ్ని విషమగతిని (ఒకప్పుడు మందము నొకప్పుడు తీక్ష్ణమునగుగతి) నొందును. దానం జేసి విషమాగ్ని యనబడును. వాతపిత్తకఫములు మూడును వృద్ధిక్షయములు లేక సమతమపరిమాణమున నున్నచో కాయాగ్నియు వృద్ధిహ్రాసములు లేక సమానస్థితి నుండును. కావున నయ్యది సమాగ్ని యనంబరగు.

ఇచ్చట అజీర్ణము మున్నగువ్యాధులు జాఠరానలవైకల్యమున గల్గును కావున తొలుత నగ్ని భేదములును వాని లక్షణములును నిరూపింపబడినవి.

### మందాద్యగ్నికృత్యములు

విషమో వాతజాన్ రోగాన్ తీక్ష్ణః పిత్తనిమిత్తజాన్,
కరోత్యగ్నిస్తథా మన్దో వికారాన్ కఫసమ్భవాన్. 2
సమా సమాగ్నే రశితా మాత్రా సమ్యగ్విపచ్యతే,
స్వల్పాపి నైవ మన్దాగ్నేః విషమాగ్నేస్తు దేహినః. 3

కదాచిత్పచ్యతే సమ్యక్కదాచిచ్చ న పచ్యతే,
మాత్రాతిమాత్రాప్యశితా సుఖం యస్య విపచ్యతే,
తీక్ష్ణాగ్నిరితి విద్యాత్సమాగ్నిశ్శ్రేష్ఠ ఉచ్యతే. 4

పైజెప్పినరీతిగ విషమంబైన యగ్నివాతముచే విషమగతి నందినది కావున నెనుబదివిధములైన వాతరోగములలో నొకదానిని కల్గించును. లేక వాతప్రకోపమున జనించు వాతజ్వరాదిరోగములనైనను పుట్టించును. పిత్తాధిక్యమున ప్రబలమైన తీక్ష్ణాగ్ని నలువది భేదములుగల పిత్తరోగములనైనను, పిత్తజ్వరాదులనైనను కలుగ జేయును. శీతగుణ ప్రధానమైనకఫము అధికమగుటచే తనశక్తితగ్గి యుండు మందాగ్ని కఫనిమిత్తకములగు నిఱువది కఫరోగములనైనను, కఫజ్వరాదులనైనను కల్గించును. దోషసామ్యముచేత న్యూనాధిక్యములులేక సమస్థితి నుండు సమాగ్ని న్యూనాధిక పరిమాణముగాక సమప్రమాణముగ భుజింపబడిన యాహారపదార్థములను సకాలమున చక్కగ జీర్ణింపజేయును. ఎట్టి రోగములను గల్గించక శరీరమును సుస్థముగ నుంచును. మందాగ్ని తాను భుజించుపరిమితికన్న స్వల్పప్రమాణముగ భుజించినను దానినికూడ పచింప సామర్థ్యము లేకుండును. విషమాగ్నిచే మనుజునకు ఆహారపదార్థ మొకప్పుడు చక్కగ పక్వమగును. ఒకసమయమున చక్కగ పక్వముగానేరదు. (ఆగ్ని విషమగతిగ నుండుటచే న్యూనముగ నుండుసమయమున పచింపజేయుశక్తి తగ్గును. అగ్ని బలయుక్తముగ నున్నతరి చక్కగ పచనము నొందింప నోపును.) మనుజుడు సమప్రమాణముగ భుజించినను మామూలు పరిమితికన్న నధికముగ భుజించినను తీక్ష్ణాగ్ని అతిసులభముగ చక్కగ పచింపజేయును. పైజెప్పబడిన నాల్గువిధముల యగ్నులలో సమాగ్ని యాహారమును చక్కగ సకాలమున పచింపజేసి రోగముల గల్గనీయక సుస్థతను కాపాడుటంజేసి యిగుల శ్రేష్ఠమైనది. తక్కిన విషమమంద తీక్ష్ణాగ్నులు మూడును ఆహారమును చక్కగ పచింపక రోగముల గల్గించును; కావున నయ్యవి శ్రేష్ఠములు కావు.

ఇచ్చట "సమా సమాగ్నేరశితామాత్రా" అనుచోట సమమాత్ర యన ఎవ్వని కెంతపరిమితమైన యాహారము భుజించిన పిమ్మట సకాలమున చక్కగ పచనమగునో అట్టి పరిమాణ మని యెఱుంగునది. ఈవిషయము చరకమున "యావత్ యస్యాశన మశిత మనుపహత్య ప్రకృతిం యథాకాలం జరాం గచ్ఛతి; తావదస్య మాత్రా ప్రమాణం వేదితవ్యం భవతి" అను వాక్యముచే నుపదేశింపబడినది.

మఱియు తీక్ష్ణాగ్ని యగునది ప్రమాణమునకన్న నధికముగ భుజించినను, ముందు భుజింపబడిన యాహారము జీర్ణముకాకుండునపుడు మరల భుజించినను

జీర్ణముకాని గుణముకలపదార్థముల భుజించినను, భుజించిన పిదప పగటియందు నిదురించినను, అతిశీఘ్రముగ జీర్ణింపఁజేయును. ఈవిషయము తంత్రాంతరమున నీరీతి చెప్పబడినది:—"అతిమాత్రమజీర్ణేఽపి గురు చాన్నమథాశ్నతః, దివాపి స్వపతో యస్య పచ్యతే సోఽగ్నిరుత్తమః."

పై జెప్పబడిన తీక్ష్ణాగ్నియే మిక్కిలి యుత్కటముగ నున్నచో నత్యగ్ని యనియు, భస్మకాగ్ని యనియు చెప్పబడును. ఈ యగ్నిస్వరూపము చరకమున నిట్లు చెప్పబడినది:—"నరే క్షీణకఫే పిత్తం కుపితం మారుతానుగం, స్వోష్మణా పావకస్థానే బలమగ్నేః ప్రయచ్ఛతి. తదా లబ్ధబలో దేహం విరూక్షం సానిలోఽనలః, పరిభూయ పచత్యన్నం తైక్ష్ణ్యాదాశు ముహుర్ముహుః. పక్త్వాన్నం స తతో ధాతూన్ శోణితాదీన్ పచత్యపి, తతో దౌర్బల్యమాతఙ్కాన్ మృత్యుం చోపనయేన్నరమ్. భుక్తేఽన్నే లభతే శాన్తిం జీర్ణమాత్రే ప్రతామ్యతి, తృట్ప్రస్వేదదాహమూర్ఛాస్స్యుః వ్యాధయోఽత్యగ్నిసమ్భవాః." (చ. చి. అ. ౧౫) మనుజునకు కఫము క్షీణమైనపుడు పిత్తము ప్రకోపమునొంది బలిష్ఠమైన వాతమునం గలిసి జాఠరానలం బుండు స్థలమున జేరి తనకు స్వాభావికమైన వేడిచేత కాయాగ్నిని బలపరచును. దానంజేసి జాఠరాగ్నియు నుత్కటమగు బలమునొంది శరీరమునెల్ల బడలికనొందింపుచు వాతముచే ప్రేరితమై తనయందలి తీక్ష్ణగుణముచేత మాటిమాటికి నతిశీఘ్రముగ నాహారపదార్థమును జీర్ణింపజేయును. అంతటబోక తన తీవ్రతచే శరీరమునందలి రసరక్తాది ధాతువుల నెల్ల వరుసగ పచింపజేయును. పిమ్మట ధాతుశోషమువలన మనుజుడు మిక్కిలి బలహీనుడగును. నానావిధరోగములచే బాధితుడై తుదకు మృత్యుముఖమునకు గురియగును. అన్నమును భుజించినలోడనే కొంచెము సుఖము గల్గును. జీర్ణమైన వెంటనే మిక్కిలి బడలికచెందును. అట్టి తీవ్రగుణమువలన దప్పియు, దగ్గును, తాపంబును, మూర్ఛయు కల్గును. ఇవికాక అత్యగ్నివలన కలుగు రోగములన్నియు జనించును.

అత్యగ్ని యను పేరు దీనికే యని వారి యభిప్రాయము. దీనికే భస్మకాగ్ని యని గ్రంథాంతరముల వ్యవహరించిరి. ఆహారపదార్థములనెల్ల నతితీవ్రముగ భస్మం బొనరించుటంజేసి దీనికి భస్మకాగ్ని యని పేరిడిన ట్లున్నది.

## అజీర్ణ భేదములు

ఆమం విదగ్ధం విష్టబ్ధం కఫపిత్తానిలైస్త్రిభిః,
అజీర్ణం కేచిదిచ్ఛన్తి చతుర్థం రసశేషతః. ౫

అజీర్ణం పఞ్చమం కేచిన్నిర్దోషం దినపాకి చ,
వదన్తి షష్ఠఞ్చాజీర్ణం ప్రాకృతం ప్రతివాసరమ్. 6

కఫము ప్రకోపించి జఠరాగ్నిని తనయందలి శీతగుణముచేత చల్లార్చును. దాని వలన నాహారపదార్థము పక్వముకాకయుండును. ఇయ్యది ఆమాజీర్ణ మని చెప్పబడును. పిత్తము ప్రకోపమునంది జాఠరాగ్నిని యుత్కటముగజేసి తీక్ష్ణత నందించును. దాని చేత నాహారపదార్థము సక్రమముగ జీర్ణము నందకుండును. ఇయ్యది విదగ్ధాజీర్ణ మని చెప్పంబడును. వాతము ప్రకుపితమునై కాయాగ్నిని విషమముగ జేయును. దాన జనించు అజీర్ణము విష్టంభాజీర్ణం బని చెప్పందగును. ఇయ్యది మలమును బంధించును. కావున విష్టంభాజీర్ణం బని యెఱుంగునది. భుజింపబడిన యన్నము జీర్ణంబైనను దాని సారభూతమైన రసము సరిగా పక్వముకాక ఆహారములో శేషించియున్న యెడ నాల్గవది రసశేషాజీర్ణము నని కొందఱాచార్యులు వచించెదరు. తాను మామూలుగ భుజించు పరిమితికన్న నధికముగ భుజించినను, కాల నియమములేక భుజించినను, తన కలవాటు లేని పదార్థముల భుజించినను సకాలమున పక్వముకాక మరుసటిదినమున పక్వమైనయెడ దినపాకి యను నైదవయజీర్ణం బని మరికొందరును, ప్రతిదినంబునను స్వాభావికముగ కల్గు నజీర్ణము ప్రాకృతం బను నారవయజీర్ణం బని మరికొందరును చెప్పెదరు. (ఇందు కడపటి రెండజీర్ణములయందును రోగములు కల్గవు.)

ఇచ్చట నీవిశేషము నెరుంగునది:—మనుజులు భుజించు నాహారపదార్థములు తొలుత నామాశయమున జేరును. పిమ్మట జాఠరాగ్ని పాచకపిత్తసహాయమునం జేసి దానిని పచింపజేయును. పిదప పక్వమైన యాహారము సారకిట్టములు వేర్వేరుగ విభజింపబడును. అందు ఆహారసారరూపమైనరసము రంజకపిత్తముచే రక్తవర్ణము నొంది శరీరమునం డెల్ల నాడీమూలముగ వ్యాపించి ప్రాణాధారమైన ఉత్తరోత్తర ధాతు వర్ధకమై బలవర్ణముల గల్గించి పోషించుచుండును. ఇట్లుండ నామాశయమునజేరిన యాహారపదార్థమున త్రిదోషముల వైపరీత్యమునంజేసి జఠరాగ్ని సక్రమమార్గముతో జేరకయున్నచో నజీర్ణము కలుగును. ఇదియే త్రిదోషములచే జనించు ఆమవిదగ్ధవిష్టబ్ధాజీర్ణముల స్వరూపము. రసశేషాజీర్ణమున ఆహారపదార్థము జీర్ణంబైనను దాని సారభూతమైనరసము ఆంత్రములోనే నిలిచిపోయి రంజకపిత్తముచే పాకమునందక రసరూపముగనే నిలిచియుండును. ఇదియే వీని పరస్పరభేదము. మఱియు నీరసశేషాజీర్ణమున త్రేపులు శుద్ధముగ వచ్చుచున్నను అన్నమునం దిచ్చపొడమక రొమ్మున బరువుగనుండి నోట నీరు వెడలుచుండును. ఈ విషయమును సుశ్రుతాచార్యుం డిత్తెరంగున నుడివెను.—"ఉద్గారశుద్ధావపి భక్తకాంక్షా న జాయతే హృద్గురుతా చ యస్య, రసావశేషేణ తు సప్రసేకం చతుర్థమేతత్ప్రవదన్త్యజీర్ణమ్." (సు. సూ. అ. ४६)

అధ్యశన - విషమాశన - అసాత్మ్యాహారముచే నొక యహోరాత్రమునకు జీర్ణముకాక కడుపుబ్బరము మొదలగువ్యాధుల కెడమీయక తనంతన మరుసటి దినము జీర్ణించినచో నయ్యది యైదవయజీర్ణము దినపాకి యనబడును. దీనియందు జీర్ణమగు నంతకాలము భోజనాదుల వర్జించియుండుట కర్తవ్యము. భుజించిన వెంటనే తృప్తిగ నుండి మరల జీర్ణమగునంతదనుక అన్నాభిలాష లేకుండుట. ఇదియే ప్రతిదినమున సంభవించు ప్రాకృతాజీర్ణమను నారవది. ఇందు "భుక్త్వా శతపదం గచ్ఛేత్" ఇతి మున్నగుప్రమాణము ననుసరించి భుజించిన వెంటనే నూరడుగులవిహారము సంచరించుట, ఎడమప్రక్క నొత్తిగిలి పరుండుట మున్నగు నుపచారములు హితకరములు.

## అజీర్ణకారణములు

అత్యమ్బుపానాద్విషమాశనాచ్చ
సన్ధారణాత్స్వప్నవిపర్యయాచ్చ,
కాలేఽపి సాత్మ్యం లఘు చాపి భుక్తం
అన్నం న పాకం భజతే నరస్య. 7
(ఈర్ష్యాభయక్రోధపరిప్లుతేన లుబ్ధేన రుగ్దైన్యనిపీడితేన,
ప్రద్వేషయుక్తేన చ సేవ్యమానం అన్నం న సమ్యక్పరిణామమేతి.)*

నీళ్ల నధికముగ త్రావుట, తనకుగల జీర్ణశక్తికి అధికముగనైనను, తక్కువగ నైనను అకాలమునందును భుజించుట, మలము మూత్రము వాతము మున్నగువానిని విసర్జింపనవసరమైనపుడు విడువక వానివేగమును నిరోధించుట, రాత్రిపూట నిదురింపక పవలు నిదురించుట, ఈకారణములచేత సకాలమున నలవాటుగా నున్నవానినైనను భుజించినను, చులకనగ జీర్ణమగువానిని భుజించినను, అట్టి యాహారపదార్థము జీర్ణముకా నోపదు. మఱియు ఈర్ష్య (ఇతరుల యాధిక్యమును జూచి సహింపక మనోవికారము జెందుట) భయపడుట, క్రోధము, పొందసలవికాని విషయములపై నాశపడుట, రోగము, దీనతనొందుట, ద్వేషము, ఇట్టి మానసికవికారములచే పీడితుడైనపుడు భుజించినయాహారము చక్కగ జీర్ణము కానోపదు.

(మాత్రయాప్యభ్యవహృతం పథ్యం చాన్నం న జీర్యతి,
చిన్తాశోకభయక్రోధదుఃఖశయ్యాప్రజాగరైః)

మనుజుడు చింత, శోకము, భయము, క్రోధము, దుఃఖము, పగలు నిదురించుట, రాత్రిజాగరణము అను నీకారణములచేత పథ్యమైనయన్నమును యుక్తమైనపరిమాణముతో భుజించినను, అట్టి యాహారముకూడ జీర్ణముకానోపదు. (ఇది ప్రక్షిప్తము)

* కొందఱీ శ్లోకమును చేర్చి పఠింతురనియు, నిది మానసదోషజాజీర్ణమునకు హేతువు లనియు మధుకోశమున వ్రాయబడెను.

ఇచ్చట—'ఈర్ష్యాభయ' అని యుపక్రమించి చెప్పినకారణములు మానసిక దోషప్రకోపహేతువు లని యెరుంగునది.

## ఆమాజీర్ణలక్షణము

తత్రామే గురుతోత్క్లేదః శోథో గణ్డాక్షికూటగః,
ఉద్గారశ్చ యథా భుక్తం అవిదగ్ధః ప్రవర్తతే. 8

పై జెప్పిన యజీర్ణములలో నామాజీర్ణమునందు శరీరము బరువై యుండును. నోట నీరూరును. చెక్కిళులయందును కన్నులసంధులయందును వాపుకల్గును, భుజింపబడిన యాహారపదార్థములు పరిపాకమునందక వానిరసము మారక మధురాది రసముతో కూడియే త్రేపులు వచ్చును.

## విదగ్ధాజీర్ణలక్షణము

విదగ్ధే భ్రమతృణ్మూర్ఛాః పిత్తాచ్చ వివిధా రుజః,
ఉద్గారశ్చ సధూమామ్లః స్వేదో దాహశ్చ జాయతే. 9

విదగ్ధాజీర్ణమునందు చక్రముపై దిరిగినట్లు శరీరము తిరుగుచున్నట్లుండును. డప్పియధికముగ నగును. ఒడలెరుంగక మూర్ఛవచ్చును. నానారూపములైన పైత్తిక వ్యాధులు కల్గును. పొగతోగూడి పుల్లనిత్రేపులు వచ్చును శరీరముపై చెమటపట్టును. ఒడలెల్ల తాపమునొందును.

## విష్టబ్ధాజీర్ణలక్షణము

విష్టబ్ధే శూలమాధ్మానం వివిధా వాతవేదనాః,
మలవాతాప్రవృత్తిశ్చ స్తమ్భో మోహోఙ్గపీడనమ్. 10

విష్టబ్ధాజీర్ణమున కడుపులో నొప్పి పుట్టును. కడుపున గుడగుడమనుశబ్దము కల్గియుబ్బును. పలుదెరంగులయిన వాతమున గల్గుబాధలు పుట్టును, మలంబును అపాన వాతంబును బైటవెడలక నిరోధింపబడును. శరీరము కట్టెవలె స్తంభించును. మూర్ఛ వచ్చును. అవయవములయందెల్ల నొప్పికల్గును.

## రసశేషాజీర్ణలక్షణము

రసశేషేఽన్నవిద్వేషః హృదయాశుద్ధిగౌరవే,

రసశేషాజీర్ణమునందు అన్నముపై ద్వేషము పుట్టును. హృదయము పరిశుద్ధము కాక బరువుగ నుండును. అవయవములయందెల్ల భారముగ నుండును.

### అజీర్ణోపద్రవములు

మూర్ఛా ప్రలాపో వమథుః ప్రసేకస్సదనం భ్రమః,
ఉపద్రవా భవన్త్యేతే మరణం వాప్యజీర్ణతః. 11

మూర్ఛ, సంబంధములేనిమాటల మాట్లాడుట, వాంతియగుట, నోటనీరూరుట, అవయవముల సంధిబంధములు శిథిలములుగ నుండుట, ఒడలు తిరుగుట ఇవి యన్నియును నజీర్ణరోగమున సామాన్యముగ గల్గు నుపద్రవములు. మరియు నీయజీర్ణరోగ ముత్కృష్టముగ వృద్ధినొందినయెడ ప్రాణహానికూడ సంభవించును.

### అజీర్ణమునకు ముఖ్యకారణము

అనాత్మవన్తః పశువద్భుఞ్జతే యేఽప్రమాణతః,
రోగానీకస్య తే మూలం అజీర్ణం ప్రాప్నువంతి హి. 12

ఏమానవులు తనశరీరపరిస్థితిని అగ్నిబలమును గుర్తింపక తెలివితక్కువవారై పశువులబోలె మితిమీరి నియమము దప్పి భుజించెదరో అట్టి జ్ఞానహీనులు పలువిధములగు రోగములసముదాయమున కెల్ల కారణమైన ప్రబలమగు నజీర్ణమును బొందుదురు.

### విసూచ్యలసకవిలమ్బికానిదానములు

అజీర్ణమామం విష్టబ్ధం విదగ్ధఞ్చ యదీరితమ్,
విషూచ్యలసకౌ తస్మాద్భవేచ్చాపి విలమ్బికా. 13

ఆమాజీర్ణము, విష్టబ్ధాజీర్ణము, విదగ్ధాజీర్ణము నను మూడువిధములైన యజీర్ణములలో నెద్దానిచేనైనను విషూచి, అలసకము, విలమ్బికము నను మూడురోగములు కల్గును.

ఇచ్చట ఆమ, విష్టబ్ధ, విదగ్ధము లను నజీర్ణములు మూడును విసూచి, అలసక, విలంబికము లను వ్యాధులకు యథాసంఖ్యవివక్ష లేక కారణము లగును. యథాసంఖ్యము నపేక్షించినచో విదగ్ధాజీర్ణముచే విలంబిక మనువ్యాధి గల్గునని చెప్పవలసి వచ్చును. అట్టియెడ "దుష్టం తు భుక్తం కఫమారుతాభ్యాం" అని విలంబికాలక్షణమున కఫవాతములచే జనించు నని చెప్పినది విరోధించును. విదగ్ధాజీర్ణము పిత్తప్రకోపమున జనించును. కావున యథాసంఖ్యము హేతువులకును వ్యాధులకును జెప్పడగదు.

### విసూచియన్వర్థసంజ్ఞ

సూచీభిరివ గాత్రాణి తుదన్సన్తిష్ఠతేఽనిలః,
యత్రాజీర్ణేన సా వైద్యైః విసూచీతి నిగద్యతే. 14

న తాం పరిమితాహారా లభన్తే విదితాగమాః,
మూఢాస్తామజితాత్మానో లభన్తేఽశనలోలుపాః. 15

వాత ముత్కటముగ ప్రకోపమునొంది సూదుల గ్రుచ్చినవిధముగ శరీరమునం దెల్ల బాధగల్గించుచు జనించిన యజీర్ణవ్యాధి విసూచి యని యన్వర్థముగ జెప్పబడును. (ఇయ్యది మిక్కిలి క్రూరమై ప్రాణాంతకమగువ్యాధి.) వైద్యతంత్రమును జక్కగ దెలిసి తన జాఠరాగ్నిబలమును వస్తువులగుణములను చక్కగ గమనించి తన జాఠరాగ్ని కనుగుణమైన పరిమితితో భుజించువారు ఈవిషూచీపిశాచముఖమున బడకుందురు. అటుగాక తెలివిలేక యింద్రియముల జయింపలేక తమ కిచ్చవచ్చినటుల నమితముగ భుజించు మూఢులు తప్పక యీవిషూచిబారినిబడి కష్టపడి తుదకు ప్రాణముల గోల్పోవుదురు.

విసూచీశబ్దమున కన్వర్థమును దెలుపుతరి ఆయాగ్రంథములయందు పలుదెరంగుల గానంబడియెడు:—అందు వాగ్భటాచార్యుడు "వివిధైర్వేదనోద్భేదైః వాయ్వాది భృశకోపతః, సూచీభిరివ గాత్రాణి విధ్యతీతి విషూచికా" అని చెప్పెను. వాతపిత్తకఫములు మూడును మిక్కిలి ప్రకోపమునొంది నానావిధములుగ బాధల గల్గించుచు సూదులచేబొడిచినట్లు వేదనగల్గినచో నయ్యది విషూచి యని భావము. వీరిమతము "విశేషేణ సూచీభిరివ గాత్రాణి విధ్యతీతి—విసూచికా" అని వ్యుత్పత్తి నెరుంగునది. గ్రంథాంతరమున "విశేషేణ సూచయతి మృత్యుమితి విసూచికా" అని చెప్పబడినది. మృత్యువును విశేషముగ సూచించునది యని యర్థము. "విషు—నానారూపేణ అఞ్చతి గచ్ఛతీతి విసూచీ" అని యొక గ్రంథమునను, "విష్వక్-సర్వతః అఞ్చతీతి విసూచీ" అని వేరొకగ్రంథమునను కనబడుచున్నవి. అనేకరూపములుగ వ్యాపించునది యనియు, శరీరమునందెల్లను, దేశమునందెల్లను వ్యాపించునది యనియుం అర్థము. వ్యుత్పత్తి యెం దెట్లున్నను సముదితార్థముచేత నీవ్యాధి మిగుల క్రూరమై ప్రాణాంతకరమై దేశమునందెల్ల సంక్రమించు సాంక్రామిక వ్యాధి యని స్ఫుటముగ విసూచీశబ్దముచేతనే యేర్పడుచున్నది.

## విసూచీలక్షణము

మూర్ఛాతిసారో వమథుః పిపాసా
శూలో భ్రమోద్వేష్టనజృమ్భదాహాః,
వైవర్ణ్యకమ్పౌ హృదయే రుజశ్చ
భవన్తి తస్యాం శిరసశ్చ భేదః. 16

పైజెప్పిన విసూచివ్యాధియందు ఒడలెరుంగక మూర్ఛవచ్చును. పక్వముగాని మలము పలుమారు విరేచనము లగును. వాంతి మాటిమాటికిని వచ్చును. తీరని దప్పి కల్గును. కడుపులోను సర్వావయవములయందును సూదులతో బొడిచినట్లును ఓదుపరాని పోటుపుట్టును. ఒడలు తిరుగునట్లుండును. కాళ్లుచేతులు గుదుపుపుట్టి కొంకరపోవును. ఒడలు విరుపులు కల్గును. ఒడలెల్ల మంటపుట్టును. శరీరవర్ణము మారును. ఒడలు వణకును. రొమ్మున నొప్పిపుట్టును. తల పగులదీసినట్లు నొప్పి పుట్టును. ఈ లక్షణములుగల వ్యాధి విసూచి యని యెరుంగునది.

పైజెప్పినలక్షణములలో నూర్ధ్వాధోమార్గముల మూలముగా వమనవిరేచనము లగుట ప్రధానలక్షణ మీవ్యాధి కని యెరుంగునది. ఈయర్థమును చరకమున "ఊర్ధ్వం చాధశ్చ ప్రవృత్తా మామదోషాం విసూచీం విద్యాత్" (చ. విమాన. 2 అ.) అను వాక్యముచే బోధించిరి.

## అలసకలక్షణము

కుక్షిరానహ్యతేఽత్యర్థం ప్రతామ్యేత్పరికూజతి,
నిరుద్ధో మారుతశ్చైవ కుక్షావుపరి ధావతి. 17
వాతవర్చోనిరోధశ్చ యస్యాత్యర్థం భవేదపి,
తస్యాలసకమాచష్టే తృష్ణోద్గారౌ చ యస్య తు. 18

అలసక మను వ్యాధియందు కడుపు మిక్కిలి యుబ్బరించును. మాటిమాటికిని మూర్ఛగ్రమ్మును, బాధ కోరువజాలక రోగి మూల్గుచు విశ్వలముగ దొర్లుచుండును. మలము, అపానవాతము బైటవెడలక నిరోధింపబడును. అడ్డగింపబడినవాతము కుక్షియందు పైకి వ్యాపించును. పలుమారు నీళ్లు త్రాగుచున్నను దప్పి యడగక వృద్ధియగుచుండును. త్రేనుపులు మిక్కిలి తీవ్రముగ వెడలును.

మరియు అలసకలక్షణము తంత్రాంతరమున నీరీతి గానంబడియెడు:- "ప్రయాతి నోర్ధ్వం నాధస్తాదాహారో న చ పచ్యతే, ఆమాశయేఽలసీభూతస్తేన సోఽలసకః స్మృతః" భుజింపబడిన యాహారపదార్థము అమాశయమున జేరి జఠరాగ్ని బలహీనం బగుటంజేసి జీర్ణముకాక వాంతిరూపమున నూర్ధ్వమార్గమునగాని విరేచనమూలమున నధోమార్గమునగాని బైటవెడలక మంటిముంతవలె నామాశయమునందే శల్యరూపముగ నుండుటంజేసి యీవ్యాధి అలసక మనంబడును.

వాగ్భటమున అలసకమును దండకాలసకమును గూడ నీరీతి చెప్పియున్నారు:—
"అలసం క్షోభితం దోషైః శల్యత్వేనైవ సంస్థితమ్. శూలాదీన్ కురుతే తీవ్రాం ఛర్ద్యతీసారవర్జితాన్. సోఽలసోఽత్యర్థదుష్టాస్తు దోషాః దుష్టామబద్ధఖాః, యాంతి

స్థిరాంతసుం సర్వాం దణ్డనత్ స్తమ్భయంతి చేత్. దణ్డకాలసకం నామ తం త్యజే దాశు కారిణమ్." భుజింపబడిన యాహారము ప్రకుపితము లైనవాతాదులచేత మిక్కిలి క్షోభింపబడి యూర్ధ్వాధోమార్గముల వెడలక వాతముచే నిరోధింపబడి పక్వాశయముననే మందీభూతమై శల్యమునుబోలె నిలచి యుండును. వమనవిరేచనములు లేక మిక్కిలి తీవ్రములైనశూల మున్నగు నుపద్రవముల విశేషముగ బుట్టించును. ఇదియే అలసకము. మరియు దోషములు మిక్కిలి యుత్కటములుగ ప్రకోపమునంది జీర్ణముగాకున్న పదార్థముచే స్రోతస్సులు, మూత్రద్వారము, గుదము మున్నగుద్వారముల నిరోధించుటం జేసి శరీరము నందెల్ల వ్యాపించి చేతులుకాళ్లు మున్నగు నవయవముల నన్నింటిని స్తంభింప జేయును. ఇయ్యది దండకాలసక మను క్రూరమైనవ్యాధి. ఇయ్యది యతిశీఘ్రముగ రోగిని చంపును. కావున చికిత్స చేయవగదు.

పైగనబరచిన అలసకదండకాలసకములు రెండును విసూచికి రెండవయవస్థాంతర మనియు, ఈయవస్థయందు వ్యాధి యసాధ్యం బనియు జెప్పబడినది.

## విలంబికాలక్షణము

దుష్టన్తు భుక్తం కఫమారుతాభ్యాం, ప్రవర్తతే నోర్ధ్వమధశ్చ యస్య,
విలమ్బికాం తాం భృశదుశ్చికిత్స్యాం, ఆచక్షతే శాస్త్రవిదః పురాణాః.

కఫవాతములు రెంటిచేత భుజింపబడినయాహారము దుష్టమై యూర్ధ్వాధోమార్గముల వెడలక యామాశయముననే యడ్డగింపబడి యుండును. ఇయ్యది విలంబిక యను క్రూరమైనవ్యాధి. ఈవ్యాధి చికిత్స కనర్హమై మిక్కిలి యసాధ్యమగును.

అలసకవిలంబికావ్యాధులు రెంటియందును వమనవిరేచనములు నిలిచి యామము ఊర్ధ్వాధోమార్గముల బైట వెడలక శల్యప్రాయమై యామాశయముననే నిలిచి యుండును. ఇది రెండిటికిని సమానలక్షణము. అయినను విలంబికమునకంటె అలసకమున - శూల, దప్పి, త్రేనుపులు మున్నగు దీవ్రములైన యుపద్రవము లధిక మని పరస్పర భేదము నెరుంగునది.

## ఆమవిశేషకృత్యములు

యత్రస్థమామం విరుజేత్తమేవ దేశం విశేషేణ వికారజాతైః,
దోషేణ యేనావతతం శరీరం తల్లక్షణై రామసముద్భవైశ్చ.౧౧

ఏస్థలమునం దామము నిలిచియుండునో అట్టియామము తత్కాలమున ప్రసిద్ధమై శరీరమున వ్యాపించియుండు వాతాదిదోషమునకు సంబంధించిన లక్షణములతో గూడిన రోగములను ఆమము నిలిచిన ప్రదేశముననే కలుగజేసి బాధించును. (అనగా ఆమపదార్థ మెచ్చట నిలుచునో ఆస్థలమునందే, తత్కాలమున శరీరమున వ్యాపించిన దోషముయొక్క లక్షణములతో గూడిన వ్యాధుల గల్గించు ననుట.

## అసాధ్యవిసూచ్యలసకలక్షణములు

యశ్శ్యావదన్తోష్ఠనఖోఽల్పసంజ్ఞో
వమ్యర్దితోఽభ్యంతరయాతనేత్రః,
క్షామస్వరస్సర్వవిముక్తసన్ధి
ర్యాయాన్నరస్సోఽపునరాగమాయ. 21

విసూచ్యాదిరోగములచే బీడింపబడిన రోగికి దంతములును, పెదవులును, గోళ్లును నల్లబడి శరీరమున ప్రజ్ఞదప్పి విశేషముగ వమనము లగుటచే కన్నులు లోనికి బోయి కంఠస్వరము హీనమై కీళ్ళన్నియు సడలి బటుత్వములేక నిస్సారములై యున్న యెడ ఆరోగి బ్రతుకనోపడు. (విలంబిక మనునది స్వభావముచేతనే యసాధ్యము. కావున పైజెప్పిన యసాధ్యలక్షణములు విసూచ్యలసకములను సంబంధించినవని యెరుంగునది.)

విసూచ్యుపద్రవములు తంత్రాంతరమున నీరీతి నున్నవి:—"నిద్రానాశోఽరతిః కమ్పో మూత్రాఘాతో విసంజ్ఞతా, అమీ ఉపద్రవాః ఘోరాః విషూచ్యాం పఞ్చ దారుణాః" విసూచిరోగమునందు నిదురపట్టకుండుట, ఈ లోకమునకు సంబంధించిన విషయములయందెల్ల నాసలేకుండుట, శరీరము వణకుట, మూత్రము వెడలకుండుట, ప్రజ్ఞతప్పి మైకముగ్రమ్ముట ఈ యైదుపద్రవములు మిగుల ఘోరములైనవి. ఇవి గల్గి నప్పుడు రోగి జీవించుట కష్టము.

విసూచి వ్యాధిని గురించి యిచ్చట నీవివరము నెరుంగునది:—విసూచి వ్యాధియందు మూడవస్థాభేదములు కల్గును. అందు తొలియవస్థ వ్యాధిప్రారంభదశ. ఇందు తొలుత సాధారణముగ నజీర్ణవిరేచనము లారంభించి కొన్నిసమయములలో పసరును, కొన్నిసమయముల నురుగును విశేషముగ విరేచనము లగును. కొన్ని పర్యాయములు విరేచనములయిన పిదప పసరుతోగూడి జీర్ణముకాని యాహారపదార్థము విరేచనము లగును. పిమ్మట గంజివలె చిక్కనైన విరేచనములగుచు వాసనలేకుండ తడసుగుణముగ నగుచుండును. ఇత్తెరంగున వమనవిరేచనములగుచు కొంతకాలమునకు నీళ్లవంటివి రేచనములును, వాంతులునై తుట్టతుదకు వమనములైనను, విరేచనములైనను నిలుచును. లేక నొక్కపెట్టున రెండును నిలుచుట కలదు. ఇది క్షారము నిలిచినవెంటనే మూత్రము

కూడ నిలుచును. ఇది ప్రథమావస్థ పరమావధి. పిమ్మట రెండవయవస్థ:—ఇందు వమన విరేచనమాత్రములు నిలిచినతోడనే కడుపులో నొప్పిపుట్టును. ఆవులింతలు వచ్చును. భ్రమము, దప్పి, శరీరమున మంట, శరీరంబున కాంతిమారుట, వణకు, రొమ్మునొప్పి, తల తిరుగున ట్లుండుట, కాళ్లుచేతులు కొంకరలుపోయి లాగుట, ఈ లక్షణము లొకటొకటిగ గల్గును, ఇదియే అలసకము. పిమ్మట వాతకఫములు మిక్కిలి ప్రకుపితములై స్రోతోరంధ్రముల నన్నింటిని సడ్డగించుటంజేసి దుష్టమలము ఆమాశయమునంజేరి నిశ్శబ్ద ముగ స్తంభించియుండును. ఇదియే దండాలసకము. ఇది రెండవయవస్థ పరమావధి. మూడవయవస్థయందు తొలుత రెండవస్థిలలో గల్గిన యుపద్రవములన్నియు మితిమీరి నాడి మిక్కిలి బలముచెడి శరీరము మంచునీళ్ళవలె చల్లబడి విపరీతముగ చెమటబట్టును. కన్నులు లోనికి లాగికొనిపోవును. దప్పి ఎంత నీళ్లుత్రాగినను నిలువక యధికమగును. కడు పుబ్బర మధికమై వెక్కిళ్లు అధికమగును. శరీరమున బలము నశించుకొలది నిశ్చేష్టత వహించును. ఇట్టి లక్షణములు గాన్పించిననాడు రోగి క్షణమాత్రమైనను జీవింప జాలడు. ఇదియే మూడవయవస్థ పరమావధి.

ఈ మూడవస్థలలో మొదటి యవస్థయందే తగినచికిత్స మిక్కిలి జాగ్రత్తతో జేసినయెడ కొంతవరకు వ్యాధిని సాధింపనగును. అం దుపేక్షించినచో దక్కిన రెండవస్థలయందును వ్యాధి దుస్సాధ్యమగును. కావున నెంత శీఘ్రముగ తొలుదొలుత చికిత్సచేసిన నంత సులభముగ నుండును.

### జీర్ణాహారలక్షణము

ఉద్గారశుద్ధిరుత్సాహో వేగోత్సర్గో యథోచితః,
లఘుతా క్షుత్పిపాసా చ జీర్ణాహారస్య లక్షణమ్. 22

ఆమశేషసంబంధములేక త్రేనుపులు శుద్ధముగ వచ్చుట, శరీరమునకును మనస్సునకును ఉత్సాహము జనించుట, మలమూత్ర వాతములు బంధములేక కాలోచిత ముగ వెడలుట, శరీరము చుల్కనై యుండుట, ఆకలిదప్పులు వికారములేక యథోచిత ముగ జనించుట, ఈ లక్షణము లున్నచో నాహారము జీర్ణంబైన దని యెరుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అగ్నిమాంద్యాజీర్ణవిషూచ్యలసకవిలంబికా
నిదానం సమాప్తమ్.

# ౭. క్రిమినిదానమ్.

“అజీర్ణభోజీ మధురామ్లనిత్యః......సంలభతే క్రిమీంస్తు” అను వాక్యముచే నజీర్ణము క్రిమివ్యాధికి కారణముగ నీక్రింద చెప్పబడుచున్నది. కావున కారణరూపమైన యజీర్ణమును జెప్పినపిదప క్రిమినిదానము చెప్పబడును.

## క్రిమిభేదములు

క్రిమయశ్చ ద్వివిధాః ప్రోక్తాః బాహ్యాభ్యంతరభేదతః,
బహిర్మలకఫాసృగ్విడ్జన్మ భేదాచ్చతుర్విధాః. 1

క్రిములు బాహ్యము లనియు, అభ్యంతరము లనియు రెండు విధములు. అందు శరీరమునందు బాహ్యమలములైన చెమట మున్నగువాని నాశ్రయించి పుట్టినవి బాహ్యములు. కఫము, రక్తము, పురీషము నను శరీరము లోభాగమున నుండు *మలములబుట్టినవి యాభ్యంతరములు. బాహ్యాభ్యంతరమలముల జనించినవి మొత్తమున నాల్గువిధములుగ నుండు నని భావము. ఈవిషయమే చరకమున “తే పునః ప్రకృతిభిర్విభజ్యమానాః చతుర్విధాః. తద్యథా—పురీషజాః, శ్లేష్మజాః, శోణితజాః, మలజాశ్చేతి” అని చెప్పబడియున్నది. ఇచ్చట ‘మలజాః’ అను పదమునను బాహ్యమలములగు చెమట మున్నగునవి యని యర్థము.

## బాహ్యక్రిములలక్షణము

నామతో వింశతివిధా బాహ్యాస్తత్ర మలోద్భవాః,
తిలప్రమాణసంస్థానవర్ణాః కేశాంబరాశ్రయాః. 2
బహుపాదాశ్చ సూక్ష్మాశ్చ యూకా లిక్షాశ్చ నామతః,
ద్విధా తే కోఠపిటకా కండూగండాన్ ప్రకుర్వతే. 3

పైజెప్పబడిన నాల్గుతెరగులైన క్రిములు నామభేదముచే నిరువదివిధము లగును. అందు బాహ్యమలములైన చెమట మన్నగువానియందును బుట్టిన క్రిములు నువ్వులయంతటి పరిమాణంబును ఆకారంబును నల్లనిరంగును కల్గి మనుజుల వెండ్రుకలను (మాసిన) గుడ్డలను ఆశ్రయించి యుండును. అయ్యవి అనేకపాదములు కల్గి మిగుల సూక్ష్మాకారము కల్గియుండును. ఇందు వెండ్రుకల నాశ్రయించినవి

* ఛత్రిన్యాయముచే మలము లని యుచ్చట వాడబడెను. రక్తము ధాతుదోషము కఫము రసధాతుమలమగు కల్గినయట్టి పదార్థము గాని త్రిదోషములలోని కఫము కాదని యెరుగవలెను.

యూకలనియు (పేలు), లిక్ష లనియు (ఈళ్లు) చెప్పబడును. ఈ క్రిములవలన పొడలును, బొబ్బలును, దురదయు, కణుతులును కల్గును.

## క్రిములు కల్గుటకు సామాన్య కారణములు

అజీర్ణభోజీ మధురామ్లనిత్యః ద్రవప్రియః పిష్టగుడోపభోక్తా,
వ్యాయామవర్జీ చ దివా శయానో విరుద్ధభుక్ సంలభతే క్రిమీంస్తు. 4

భుజింపబడినయాహారము జీర్ణము కాకుండునపుడు మరల భుజించినను, అజీర్ణకరములగు పదార్థముల భుజించినను, విడువక పులుపు తీపికల పదార్థముల భుజించినను, ద్రవరూపములగు నాహారముల విడువక భుజించినను పిండితో జేయబడిన పదార్థములను, బెల్లమును తినుచుండినను, దేహపరిశ్రమమును జేయకున్నను, పవటి యందు నిదురించినను సంయోగాదులచే పరస్పరవిరుద్ధములైన క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించినను క్రిములు జనించును.

## అభ్యంతరక్రిములు జనించుటకు కారణములు

మాషపిష్టామ్లలవణగుడశాకైః పురీషజాః,
మాంసమత్స్యగుడక్షీరదధిశుక్తైః కఫోద్భవాః. 5
విరుద్ధాజీర్ణ శాకాద్యైః శోణితోత్థా భవన్తిహి,

మినుములపిండి, పులుపు ఉప్పు కల ద్రవ్యములు, బెల్లము, ఆకుకూరలు వీని నధికముగ భుజించుటచేత పురీషమున క్రిములు పుట్టును. మాంసము, మత్స్యములు, బెల్లము, పాలు, పెరుగు, పులిసినగంజి, పుల్లనీళ్లు వీనిని విశేషముగ నుపయోగించినచో కఫమునందు క్రిములు జనించును. పరస్పరవిరుద్ధంబులును అజీర్ణకరంబులును నగు కూరగాయల భుజించుటచే రక్తమునందు క్రిములు జనించును.

## క్రిమివ్యాధిలక్షణము

జ్వరో వివర్ణతా శూలం హృద్రోగస్సదనం భ్రమః. 6
భక్తద్వేషోఽతిసారశ్చ సఞ్జాతక్రిమిలక్షణమ్,

జ్వరము, శరీరము స్వాభావికవర్ణము మారియుండుట, కడుపులో నొప్పి, రొమ్మునొప్పి, శరీరము కృశించుట, ఒడలు దిరుగుట, అన్నద్వేషము, అతిసారము ఇవియన్నియు క్రిములుకలవానికి కల్గువ్యాధులు.

## కఫజక్రిమిలక్షణము

కఫాదామాశయే జాతాః వృద్ధాస్సర్పంతి సర్వతః. 7
పృథుబ్రధ్న నిభాః కేచిత్కేచిద్గణ్డూపదోపమాః,
రూఢధాన్యాఙ్కురాకారాః తనుదీర్ఘాస్తథాణవః. 8

శ్వేతాస్తామ్రావభాసాశ్చ నామతస్సప్తధా తు తే,
అన్త్రాదా ఉదరావేష్టాః హృదయాదా మహాగుదాః. 9
చురవో దర్భకుసుమాః సుగన్ధాస్తే చ కుర్వతే,
హృల్లాసమాస్యస్రవణం అవిపాకమరోచకమ్. 10
మూర్ఛాచ్ఛర్ది జ్వరానాహ కార్శ్యక్షవథుపీనసాన్,

కఫము నాధారముగ జేసికొని యామాశయమున పైజెప్పిన కారణముల చే క్రిములు జనించును. అవి నానాట వృద్ధినొంది దేహమునందెల్ల సంచరించును. అందు కొన్ని తోలుగొట్టమువలె పెద్దవియై నునుపుగల్గియుండును. ఇవి ప్రేవులను తినుటంజేసి అన్త్రాదము లని పిలువంబడును. కొన్ని యెఱ్ఱలవలె నున్నగ నిడుపలై యుండును. ఇవి కడుపును చుట్టికొనియుండుటవలన ఉదరావేష్టము లని చెప్పనగును. కొన్ని మొలిచిన ధాన్యపు మొలకలవలె సూక్ష్మాకారము కల్గియుండును. ఇవి హృదయమునకు వ్యాపించి హృదయమును తిని చెరచును; కావున హృదయాదము లని చెప్పబడును. కొన్ని సన్నని యాకారముకల్గి నిడుదలై యుండును. ఇవి గుదస్థానమును తినుచు రంధ్రమును పెద్దదిగ జేయును. కావున మహాగుదము లని చెప్పందగును. కొన్ని మిక్కిలి సూక్ష్మమైన యాకారముకల్గి శరీరమున వ్యాపించును. ఇయ్యవి దొంగలవలె దాగియుండును, కాన చురు అను పదముచే వ్యవహరింపబడును. *కొన్ని తెల్లని యాకారములు కల్గియుండును. ఇవి తెల్లుదర్భపువ్వులంబోలె యుండును. కావున దర్భకుసుమము లని చెప్పబడును. కొన్ని యెఱ్ఱనికాంతి గల్గియుండును. ఇయ్యవి కొంచెము సువాసనకల్గియుండుటంజేసి సుగంధము లని పేర్కొనంబడును. ఇత్తెఱంగున నేడువిధములైన క్రిములు కఫమున జనించును. ఇవియన్నియుం రొమ్మదరుట, నోటివెంట నీరు వెడలుట, అజీర్ణము, అరుచి, మూర్ఛ, వాంతి, జ్వరము, కడుపుబ్బరము, శరీరము కృశతనొందుట తుమ్ములు, పడిసెము అను నీరోగముల గల్గించును.

## రక్తజక్రిమిలక్షణము

రక్తవాహిసిరాస్థానరక్తజా జన్తవోఽణవః. 11
అపాదా వృత్తతామ్రాశ్చ సౌక్ష్మ్యాత్కేచిదదర్శనాః,
కేశాదా రోమవిధ్వంసా రోమద్వీపా ఉదుమ్బరాః,
షట్తే కుష్ఠైకకర్మాణః సహసౌరసమాతరః. 12

రక్తమును శరీరమున వ్యాపింపజేయు సిర (సన్నని నరము)లయందు జేరి రక్తముననే మిక్కిలి సూక్ష్మరూపములై కాళ్లులేక గుండ్రని యాకారముగల్గి

*చర స్తేయే అని ధాతువు. చోరయ న్తీతి = చురవః. ఔణాదికమగు కుప్రత్యయాంత మీ చురుశబ్దము.

యెఱ్ఱనిపురుగులు పుట్టును. ఇవి రక్తజక్రిములు. ఇందు కొన్ని మిక్కిలి పరమాణు రూపములుగ నుండుటంజేసి కన్నుల కగపడవు. వీనిలో కొన్ని తలవెండ్రుకలను నశింప జేయును దానంజేసి కేశాదము లని చెప్పబడును. కొన్ని శరీరమున నుండు రోమముల ధ్వంసముచేయుటవలన రోమవిధ్వంసము లని చెప్పబడును. కొన్ని రోమరంధ్రముల నాశ్రయించియుండుటవలన రోమద్వీపము లనియు, కొన్ని బొడ్డకాయలోని పురుగుల వలెనుండుటచే నుదుంబరము లనియు, కొన్ని తులసిగింజలవలెనుండుటచే సౌరసము లనియు, కొన్ని మఱి యనేక క్రిముల జనింపజేయుటచే జన్తుమాత లనియు నామభేద ములచే నాఱువిధములుగ జెప్పంబడును. ఈ యాఱువిధములైన క్రిములును రక్తమును చెరచి ప్రధానముగ కుష్ఠముల గల్గించును.

ఇచ్చట "సహసౌరసమాతరః" అనుచోట మాతృశబ్దమునకు జంతుమాత లని యర్థము. ఈ యర్థమును చరకాచార్యులు "నామాని కేశాదాః......ఔదుమ్బరా జన్తుమాతరః" అని చెప్పియున్నారు. మరియు నీక్రిములచే గల్గురోగములు చరకా చార్యులచే నిట్లు చెప్పబడినవి:—"ప్రభావః కేశశ్మశ్రునఖలోమపక్ష్మాపధ్వంసో, వ్రణగతానాఞ్చహర్ష కణ్డూతోదసంసర్పణాని, అతివృద్ధానాఞ్చత్వక్ సిరాస్నాయు మాంసతరుణాస్థిభక్షణమితి" ఇయ్యవి తలవెండ్రుకలు, మీసములు, శరీరమునందలి రోమములు, గోళ్లు, రెప్పవెండ్రుకలు వీనినన్నింటిని చెఱచి యూడించును. వ్రణముల యందు వ్యాపించిన క్రిములు హర్షము (జిల), దురద, పోటు ఈ బాధల గల్గించి లేని చోటకూడ వ్రణముల వ్యాపింపజేయును. అయ్యవి మిక్కిలి వృద్ధినొందినచో చర్మ మును, సిర (సన్ననినరము)లను, నరములను, మాంసమును, వెన్నెముకను నానాట తిని నశింపజేయును. (ఇదియంతయు కుష్ఠమున గల్గును కాన వీనికి కుష్ఠైకనిర్మాణః అని పేరిడబడెను.)

## పురీషజక్రిములలక్షణము

పక్వాశయే పురీషోత్థా జాయన్తేఽధోవిసర్పిణః,
వృద్ధాస్తే స్యుర్భవేయుశ్చ తే యదాఽఽమాశయోన్ముఖాః. 13
తదాస్యోద్గారనిశ్శ్వాసా విడ్గన్ధానువిధాయినః,
పృథువృత్తతనుస్థూలాః శ్యావపీతసితాఽసితాః. 14
తే పఞ్చ నామ్నా క్రిమయః కకేరుకమకేరుకాః,
సౌసురాదాస్సశాలూకాః లేలిహా జనయన్తి హి. 15
విడ్భేదశూలవిష్టమ్భకార్శ్యపారుష్యపాణ్డుతాః,
రోమహర్షాగ్నిసదనం గుదకణ్డూర్విమార్గగాః. 16

పురీషజక్రిములు పక్వాశయమున (మలకోశమున) బుట్టును. అయ్యవి క్రింది శరీరభాగమున సంచరించుచు నానాట వృద్ధినందుచుండును. అయ్యవి ఆమాశయమున కభిముఖములుగ సంచరించునపుడు ముఖమునుండి వెడలు త్రేనుపులును, నిశ్వాసంబును మలమునకు సమానమైన దుర్గంధము కల్గియుండును. అందు కొన్ని పొడవుగను, కొన్ని గుండ్రముగను, కొన్ని సన్నవిగను, కొన్ని లావుగను ఉండును. అయ్యవి కొన్ని శ్యామవర్ణంబులును, కొన్ని పచ్చనిరంగును, కొన్ని తెల్లని రంగును, కొన్ని నల్లని రంగును కల్గియుండును. వానికి కకేరుకములు, మకేరుకములు, సౌసురాదములు, శూలూరక ములు, లేలిహములు అని యైదు పేరులు కల్గియుండును. ఇట్టి యైదువిధములైన క్రిములును మలమును ఉండలుగ ద్రవము లేక చేయును. కడుపులో నొప్పి పుట్టించును. మలమును బైట వెడలనీయక అడ్డగించును. శరీరమును కృశింపజేయును. చర్మమును గరగర మని కరకు బుట్టించును. పాండురోగమును గల్గించును. అయ్యవి మార్గాంతర మున సంచరించుతరి రోమహర్షంబును, జఠరాగ్ని నాశంబును, గుదస్థానమున దురదయును కల్గును.

చరకమున వీని పేరులు చెప్పునపుడు "తేషాం నామాని కకేరుకమకేరు కాలేలిహాః శూలూరకా సౌసురాదాశ్చేతి" అని శూలూరకములను శూలూరకము లని వ్యవహరించిరి.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
క్రిమినిదానం సమాప్తమ్.

# ౮. పాండురోగకామలాకుంభకామలా హలీమకనిదానమ్.

---

క్రిమినిదానాంతమున "విడ్భేదశూలవిష్టమ్భకార్శ్యపారుష్యపాండుతాః" అని చెప్పియుండువాక్యముచేత మలమున బుట్టిన క్రిములవలన పాండురోగము కూడ పుట్టు నని తెలియుచున్నది. కావున క్రిమినిదానానంతరము పాండురోగనిదానము చెప్ప బడును.

### పాండురోగభేదములు

పాండురోగాస్స్మృతాః పఞ్చ వాతపిత్తకఫైస్త్రయః,
చతుర్థస్సన్నిపాతేన పఞ్చమో భక్షణాన్మృదః. 1

పాండురోగము వాతపిత్తకఫములచే వేర్వేరుగను, త్రిదోషముల సన్నిపాతము చేతను, మట్టిని తినుటచేతను కల్గుటవలన నైదుభేదములు కల్గియుండును.

### పాండురోగనిదానము సంప్రాప్తి

వ్యాయామమమ్లం లవణాని మద్యం
మృదం దివాస్వప్నమతీవ తీక్ష్ణం,
నిషేవమాణస్య ప్రదూష్య (సమేత్య) రక్తం
దోషాస్త్వచం పాండురతాన్నయన్తి. 2

దేహపరిశ్రమము నధికముగ జేసినను, పులుపు, ఉప్పు కలపదార్థముల విశేషముగ భుజించినను, మద్యమును త్రావినను, మట్టిని తిన్నను, పగటియందు నిదురించినను, మిక్కిలి తీక్ష్ణములగుపదార్థముల నధికముగ సేవించినను, వాతపిత్తకఫములు వేర్వేరుగ నైనను అన్నియు కలిసియైనను ప్రకోపమునంది శరీరమునందలి రక్తమును చెరిచి చర్మమున పాండువర్ణమును కల్గించును.

వాగ్భటాచార్యుడు "శ్లేష్మత్వగ్రక్తమాంసాని ప్రదూష్య" అని చెప్పియుండుట చేత శ్లేష్మము, త్వక్కు, రక్తము, మాంసము అను నీదూష్యముల నాల్గింటిని చెరిచి పాండురోగమును కల్గించు నని తెలియుచున్నది. దీని ననుసరించి ప్రకృతగ్రంథమున రక్తపదముచేత శ్లేష్మత్వఙ్మాంసములుగూడ గ్రహింపబడు నని యెరుంగునది. చరకము

నందు పాండురోగనిదానసంప్రాప్తులు విపులముగ నిట్లు చెప్పబడినవి:—"దోషాః పిత్తప్రధానాస్తు యస్యకుప్యన్తి ధాతుషు, శైథిల్యం తస్య ధాతూనాం గౌరవం చోపజాయతే. తతో వర్ణబలస్నేహా యే చాన్యే ప్యోజసో గుణాః, వ్రజన్తి క్షయమత్యర్థం దోషదూష్య ప్రదూషణాత్, సోఽల్పరక్తోఽల్పమేదస్కో నిస్సారశ్శిథిలేన్ద్రియః, వైవర్ణ్యం భజతే తస్య హేతుం శృణు సలక్షణమ్. క్షారామ్లలవణాత్యుష్ణవిరుద్ధాసాత్మ్యభోజనాత్, నిష్పావమాషపిణ్యాకతిలతైలనిషేవణాత్. విదగ్ధేఽన్నే దివాస్వప్నాద్వ్యాయామాన్మైథునాత్తథా, ప్రతికర్మర్తువైషమ్యాత్ వేగానాఞ్చ విధారణాత్. కామచిన్తాభయక్రోధశోకోపహతచేతసః, సముదీర్ణం యదా పిత్తం హృదయే సమవస్థితమ్, వాయునా బలినా క్షిప్తం స్రోతోభిర్దశభిస్సృతమ్, ప్రపన్నం కేవలం దేహం త్వఙ్మాంసాంతరమాశ్రితం, ప్రదూష్య కఫవాతాసృక్త్వఙ్మాంసాని కరోతి తత్. వర్ణాన్ హారిత హారిద్రాన్ పాండురాన్ బహువిధాన్ త్వచి. సపాండురోగ ఇత్యుక్తః" (చరక-చి. అ. ౧౬. శ్లో. ౩ ౧౧) పిత్తమును ప్రధానముగజేసి తక్కినవాతకఫములు రెండును జేరి ప్రకోపముజెంది రసరక్తాది ధాతువుల నాశ్రయించినయెడ ధాతువులు శిథిలము లగును. భారము గల్గును. ఓజస్సు ముఖ్యముగ చెడుటవలన శరీరవర్ణము. బలము, శరీరమునందలి జిడ్డు మున్నగు నోజోగుణములన్నియు క్షీణించును. వాతాదిదోషంబులును, రసాదిధాతువులును చెడుటంజేసి పై జెప్పిన యోజోగుణములన్నియు బొత్తుగ క్షీణించును. ఆట్టిరోగి రక్తంబును ఓజస్సును మిక్కిలి స్వల్పములై చక్షురాదీంద్రియముల పాటవము చెడి శరీరమున స్వాభావికమైన వర్ణముమారి వివర్ణతను బొందును. మరియు క్షారము, పులుపు, ఉప్పు ఈరసములు కలపదార్థముల నధికముగ భుజించినను, మిక్కిలి యుష్ణపదార్థములను పరస్పరవిరుద్ధములైన క్షీరమత్స్యాదులను, శరీరమున కనుదగి యలవాటులేనిపదార్థములను, అనుములను, ఉద్దులు, నువ్వుల తెలకపిండి, నువ్వుల నూనె వీనిని విశేషముగ సేవించినను, ఆహారము జీర్ణముకాకయుండు సమయమున పగటిపూట నిదురించినను, దేహపరిశ్రమమును స్త్రీసంగమమును అధికముగ జేసినను, శరీరోపచారముల వ్యత్యస్తముగ చేసికొనినను, ఆయాఋతువుల నుండవలసిన శీతోష్ణరూపఋతుధర్మములు మారియున్నను, మలము, మూత్రము, వాతము మున్నగు వానిని విసర్జింప నవసరమైనకాలమున విడువక వానివేగమును అడ్డగించి విడువకుండినను, కామము, (స్త్రీలవిషయమైన యభిలాష) చింత, భయము, క్రోధము, దుఃఖము అను నీమానసిక వ్యాపారములచేత మనస్సు చెడినను, పిత్తము, ప్రకోపము నొంది హృదయస్థానమున జేరి ప్రబలమైనవాతముచే నడ్డగింపబడి పది స్రోతోమార్గములనుండి ప్రవించుచు దేహమునందెల్ల వ్యాపించి చర్మమునకును మాంసమునకును మధ్యమున జేరి కఫమును, వాతమును, రక్తమును, చర్మమును, మాంసమును చెరిచి, చర్మమున ఆకుపచ్చనిరంగును, పసుపురంగును, పాండువర్ణమును కల్గించును.

ఇంకను ననేకవర్ణముల గలుగంజేయును. అయ్యది పాండురోగ మని చెప్పబడును. ఇత్తెరంగున పాండురోగకారణములును దాని స్వరూపంబును అది సంభవించు క్రమంబును చరకమున విపులముగ నిరూపింపబడెను.

మరియు వాతపాండువునందు అరుణవర్ణము కలిసిన నలుపును, పిత్తపాండువునందు పచ్చనిరంగును కల్గియున్నను, పాండురోగసామాన్యముగ పాండువర్ణమధికముగ నుండును. కావున "దోషా స్త్వచం పాండురతాం నయన్తి" అని ప్రకృతగ్రంథమున జెప్పబడెను. ఈవిషయమును వాగ్భటాచార్యుడు "పాండుత్వం తేషుచాధికమ్, యతోఽతః పాండురిత్యుక్తః" అను వచనముచే నిర్ణయించి పాండురోగ మనుటకు పాండుత్వ మధికముగ నుండుటయే కారణ మని యన్వర్థముగ జెప్పిరి.

## పాణ్డురోగపూర్వరూపములు

త్వక్స్ఫోటనష్ఠీవనగాత్రసాదమృద్భక్షణప్రేక్షణకూటశోథాః,
విణ్మూత్రపీతత్వమథావిపాకో భవిష్యత స్తస్య పురస్సరాణి. 3

పాండురోగము కల్గుటకు ముందు చర్మము కొంచెము కొంచెము పగులును. నోట నీరు వెడలును. శరీరము కృశించును. మన్ను దినుటయం దాసపొడమును. కన్నురెప్పలసందులయందు వాపు కలుగును. మలమూత్రములు పచ్చనగును. జీర్ణశక్తి తగ్గును. ఇవియన్నియు పాండురోగము జనించుటకుముందు కల్గు పూర్వ రూపములు.

మరియు పూర్వరూపములు చరకమున విశేషముగ జెప్పబడినవి:—"తస్య లిఙ్గం భవిష్యతః, హృదయస్పన్దనం రౌక్ష్యం స్వేదాభావః శ్రమ స్తథా, సమ్భూతేఽస్మిన్ భవేత్సర్వః కర్ణక్ష్వేడీ హతానలః. దుర్బలస్సదనోఽన్నద్విట్ శ్రమభ్రమనిపీడితః, గాత్రశూలజ్వరశ్వాసగౌరవారుచిమాన్నరః. మృదితైరివ గాత్రైశ్చ పీడితోన్మథితైరివ, శూనాక్షికూటో హరితః శీర్ణలోమా హతప్రభః, కోపనశ్శిశిరద్వేషీ నిద్రాళుః ష్ఠీవనోఽల్పవాక్, పిండికోద్వేష్టకట్యూరుపాదరుక్సదనాని చ, భవన్త్యారోహణాయాసైః" (చరక. చి. అ. ౧౬. శ్లో. ౧౧-౧౬) రొమ్మదరుట, శరీరము జిడ్డులేక గరుకుపారుట, చెమటపట్టకుండుట, శ్రమము అనునవి పాండురోగ పూర్వరూపములు. మరియు—చెవులలో గుమ్మని ధ్వని పుట్టుట, జాఠరాగ్ని మందగించుట, శరీరబలము నశించుట, శరీరము కృశించుట, అన్నద్వేషము కల్గుట, శ్రమము, ఒడలు దిరుగుట, ఒడలినొప్పులు, జ్వరము, శ్వాసము, అరోచకము, అవయవములు విరుగగొట్టినట్లును పిసికినట్లును మర్దించినట్లును బాధకల్గుట, కన్నులసంధులలో వాపు పుట్టుట, శరీరము పచ్చగ నుండుట, వెండ్రుక లూడుట, శరీరమున కాంతి చెడుట, కోపము నిష్కారణముగ కల్గుట, చల్లనిస్పర్శముపై ద్వేషము

పుట్టుట, నోట నీరు వెడలుట, అధికముగ మాటలాడజాలకుండుట, మిద్దె మున్నగు నున్నతస్థలమున కెక్కినను, కొంచెము శరీరమున కాయాసము కల్గించుపనులు చేసినను పిక్కలయందును నడుమునను తొడలయందును పాదములయందును నొప్పిపుట్టుట, లేక విరుగగొట్టినట్లు బాధకల్గుట, ఇవియన్నియు పాండురోగమున గల్గురూపములు. పైజెప్పినవానిలో కొన్నియైనను అన్నియైనను దోషబలానుసారముగ గల్గును.

### వాతజపాండురోగలక్షణము

త్వఙ్మూత్రనయనాదీనాం రూక్షకృష్ణారుణప్రభాః,
వాతపాండ్వామయే తోదకమ్పానాహభ్రమాదయః. 4

చర్మము, మూత్రము, కన్నులు, మలము మున్నగునవి జిడ్డులేక నల్లని రంగుతో గూడిన యరుణవర్ణము కల్గి, పోటు, వణకు, కడుపుబ్బరము, భ్రమ కల్గి యున్నయెడ వాతము చే జనించిన పాండురోగ మని యెరుంగునది.

ఇచ్చట కృష్ణారుణాదివర్ణము కల్గినను పాండువర్ణము తక్కిన వర్ణములకన్న నధికముగ నుండును. ఈ విషయము సుశ్రుతాచార్యుడు "సర్వేషు చైతేష్విహ పాండుభావో యతోఽధికోఽతః ఖలు పాండురోగః" అను శ్లోకమున జెప్పెను.

### పిత్తజపాండురోగలక్షణము

పీతమూత్రశకృన్నేత్రో దాహతృష్ణాజ్వరాన్వితః,
భిన్నవిట్కోఽతిపీతాభః పిత్తపాండ్వామయీ నరః. 5

పిత్తపాండురోగమున మూత్రము, మలము, కన్నులు పచ్చనిరంగు గల్గి యుండును. తాపము, దప్పి, జ్వరమును కల్గును. మలము ద్రవములేక యుండలుగ నుండును. శరీరమంతయు మిక్కిలి పచ్చనై యుండును.

మరియు నీ పిత్తపాండువునందు దప్పి, మూర్ఛ, ఒడలిచెమట, చల్లనిస్పర్శము పై నిష్టము కల్గుట, అన్నద్వేషము, నోరు చేదుగ నుండుట నను లక్షణములు గల్గును. ఇంచుకైనను వేడికిని పులుపుకును ఓరుపజాలడు. అన్నము విదగ్ధాజీర్ణరూపముగ పరిణమించి త్రేపులు పుల్లగవచ్చును. కడుపులో మంటపుట్టును. మలమును నోరుప రాని దుర్గంధము పుట్టును. బలము నశించును. చీకటి గ్రమ్మిన ట్లుండును. ఈ విషయము చరకమున విశేషముగ నిరూపింపబడినది.

### కఫజపాండురోగలక్షణము

కఫప్రసేకశ్వయథుతన్ద్రాలస్యాతిగౌరవైః,
పాండురోగీ కఫాచ్ఛుక్లైః త్వఙ్మూత్రనయనాననైః. 6

కఫమును వృద్ధినొందించు కారణములచే నుత్కటముగ ప్రకోపమునొందిన కఫముచే గల్గిన పాండురోగమునందు నోట కఫము వెడలుచుండును. వాపు పుట్టును. మైకము గ్రమ్మును. పనులయం దుత్సాహము నశించును. శరీరము మిక్కిలి బరువై యుండును. చర్మంబును, మలమూత్రములును కన్నులును ముఖంబును తెల్లగ నుండును. మఱియు కఫజపాండువులందు ముఖ్యముగ శ్వాసకాసములు కల్గును. కటురసంబును రూక్షంబునైన యాహారమును ఉష్ణస్పర్శమును విశేషముగ కోరును. వాపు విశేషముగ జనించును. నోరు తీపిగనుండును. ఈలక్షణములు చరకమున చెప్పబడినవి.

## సన్నిపాతజపాండురోగలక్షణము

జ్వరారోచకహృల్లాసచ్ఛర్దితృష్ణాక్లమాన్వితః,
పాండురోగీ త్రిభిర్దోషైః త్యాజ్యః క్షీణో హతేంద్రియః. 7

త్రిదోషములను ప్రకోపింపజేయు నాహారవిహారాదులచేత వాతపిత్త కఫములు మూడును సమకాలమున ప్రకోపము నొంది పాండురోగమును కల్గించును. ఇందు జ్వరము కల్గును. నోట అరోచకము ఓకరింతలు వచ్చును. వాంతు లగును. దప్పి యధికముగ నగును. బడలిక పుట్టును. ఇయ్యది త్రిదోషసన్నిపాతజపాండువు. ఈ రోగమున రోగిశరీరబలము నశించి చక్షురాదీంద్రియముల పాటవముతప్పిననాడు అసాధ్య మగును. కావున చికిత్స చేయజనదు.

మరియు నీ సన్నిపాతపాండురోగమున వాతాదులకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములన్నియు కల్గియుండును. ఇయ్యది త్రిదోషములను ప్రకోపింపజేయు నానా విధాహారములవలన జనించును. ఈ విషయములు చరకమున నీరీతి చెప్పబడినది:—
"సర్వాన్నసేవినస్సర్వే దుష్టా స్త్రిదోషజమ్, త్రిలిఙ్గం సంప్రకుర్వన్తి పాణ్డురోగం సుదుస్సహమ్" (చ. చి. అ. ౧౬.)

## మృజ్జపాండురోగసంప్రాప్తి

మృత్తికాదనశీలస్య కుప్యత్యన్యతమో మలః,
కషాయా మారుతం, పిత్తమూషరా, మధురా కఫమ్. 8
కోపయేన్మృద్రసాదీంశ్చ రౌక్ష్యాద్భుక్తం చ రూక్షయేత్,
పూరయత్యవిపక్వైవ స్రోతాంసి నిరుణద్ధ్యపి. 9
ఇన్ద్రియాణాం బలం హత్వా తేజో వీర్యౌజసీ తథా,
పాణ్డురోగం కరోత్యాశు బలవర్ణాగ్నినాశనమ్. 10

మనుజుడు బుద్ధిజాడ్యమువలన నొకసమయమున మట్టి దినును. ఇట్లు చాల కాలము మట్టిని దినుచున్నయెడ త్రిదోషములలో నేదైననొకటి ప్రకోపించును. అందు కషాయ (వగరు) రసముకల మృత్తికను తిన్నచో వాతము ప్రకోపమందును. ఉప్పు మట్టి దిన్నయెడ పిత్తము ప్రకోపించును. తీపిగల మట్టిని తిన్నచో కఫము ప్రకోపించును. ఇత్తెరంగుననే యామృత్తిక రసరక్తాదిధాతువులను తనయందలి దుష్టగుణముచేత ప్రకోపింపజేసి యన్నమును గూడ రూక్షముగ జేయును. అమృత్తిక పక్వముకాకయే స్రోతస్సులనెల్ల నిండించి వానిమార్గముల నడ్డగించును. దానంజేసి చక్షురాదీంద్రియములు తమతమశక్తిని విడుచును. తేజస్సును వీర్యంబును ఓజస్సును బొత్తుగ చెడును. పిదప పాండురోగమును కల్గించును. దీనివలన బలము వర్ణము అగ్నియును నశించును.

## మృజ్జపాండురోగలక్షణము

శూనాక్షికూటగణ్డభ్రూః శూనపాన్నాభిమేహనః,
క్రిమికోష్ఠోఽతిసార్యేత మలం సాసృక్కఫాన్వితమ్. 11

మృత్తికాభక్షణముచే కల్గిన పాండువునందు కన్నులసంధియందును, గండస్థలములయందును, కనుబొమలయందును, పాదములయందును, నాభిస్థానమునందును, గుహ్యమునందును వాపు కల్గును. కోష్ఠమునందు క్రిములు విశేషముగ కల్గును. రక్తముతోను కఫముతోను కలిసిన మలము పలుమారు వెడలుచుండును.

## అసాధ్యపాండురోగలక్షణము

పాణ్డురోగశ్చిరోత్పన్నః ఖరీభూతో న సిధ్యతి,
కాలప్రకర్షాచ్ఛూనానాం యో వా పీతాని పశ్యతి. 12

పాండురోగమున సకాలమున చికిత్స చేయక యుపేక్షించినయెడ చిరకాలము అనుసరించియుండి స్థిరముగనుండును. కావున నియ్యది కుదురదు. మఱియు చాల కాలము గడచుటవలన ప్రబలముగ వాచి చూడబడు పదార్థములన్నియు పచ్చగ నగపడుచున్నయెడ పాండురోగము నివృత్తి కానేరదు.

బద్ధాల్పవిట్సహరితం సకఫం యోఽతిసార్యతే,
దీనశ్శ్వేతాతిదిగ్ధాఙ్గః ఛర్దిమూర్ఛాతృడర్దితః,
స నాస్త్యసృక్క్షయాద్యశ్చ పాణ్డుశ్శ్వేతత్వమాప్నుయాత్.
పాణ్డుదన్తనఖో యస్తు పాణ్డునేత్రశ్చ యో భవేత్,
పాణ్డుసఙ్ఘాతదర్శీ చ పాణ్డురోగీ వినశ్యతి. 14

పాండురోగముచే బీడితుడగు రోగి కఫముతోఁగూడి పచ్చనైనమలము బద్ధముగ కొంచెము కొంచెముగ పలుమారు వెడలుచున్నను; మిగుల బలము హీనమై తెల్లని రంగు చేత శరీరమునందంతట వ్యాపించి వాంతిచేతను మూర్ఛచేతను పీడింపబడినను; రక్తము నశించుటచేత శరీరంబును మలమూత్రాదులును తెల్లగ నుండినను అట్టిరోగి బ్రతుకడు. మరియు దంతముల కాధారమైన మాంసప్రదేశంబును గోళ్లును తెల్లబడినను; కనురెప్ప లో రక్తము బొత్తుగ నశించి తెల్లనైనను; వస్తువులన్నింటిని తెల్లనిరంగు కలవానినిగ జూచుచున్నను అట్టి పాండురోగి మృతిజెందును.

అన్తేషు శూనం పరిహీణమధ్యం మ్లానం తదాన్తేషు చ మధ్యశూనమ్,
గుదే చ శేఫస్యథ ముష్కయోశ్చ శూనం ప్రతామ్యన్తమసంజ్ఞకల్పమ్,
విసర్జయేత్పాణ్డుకినం యశోఽర్థీ తథాతిసారజ్వరపీడితం చ. 15

పాండురోగపీడితునకు దేహమునకు అంతములైన మీగాళ్లు మీజేతులు శిరస్సు వీనియందు మాత్రము వాపు కల్గి శరీరమధ్యమున వాపు లేక కృశించినను; కాళ్లు చేతులు శిరస్సులయందు కృశించి మధ్యభాగమునమాత్రము వాచియున్నను; గుదస్థానము నందును, గుహ్యప్రదేశమునను, వృషణముల యందును వాపు కల్గి చీకటిలో నున్నట్లు కన్నులు కానరాక మూర్ఛనొందినవానివలె నొడలెరుంగకయున్నను; అతిసారము చేతను జ్వరముచేతను బాధితుడైనను, అట్టిరోగిని తప్పక చంపును; కావున యశమును గోరు వైద్యుడు వానికి చికిత్సచేయక విడువదగును.

## కామలాలక్షణము

పాండురోగీ తు యోఽత్యర్థం పిత్తలాని నిషేవతే,
తస్య పిత్తమసృఙ్మాంసం దగ్ధ్వా రోగాయ కల్పతే. 16
హారిద్రనేత్రస్సభృశం హారిద్రత్వఙ్నఖాననః,
రక్తపీతశకృన్మూత్రో భేకవర్ణో హతేన్ద్రియః. 17
దాహావిపాకదౌర్బల్యసదనారుచికర్శితః,
కామలా బహుపిత్తైషా కోష్ఠశాఖాశ్రయా మతా. 18

పైజెప్పబడిన పాండురోగముచే బీడితు డగు రోగి మిక్కిలి పిత్తమును వృద్ధి నొందించు పదార్థములను సేవించినచో పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది, రక్త మాంసములను శోషింపజేసి కామలారోగము కల్గించును. అట్టిరోగికి కన్నులును, చర్మంబును, గోళ్లును, ముఖంబును పచ్చగ పసుపురంగు కల్గియుండును. మలమూత్ర

ములు రక్తమునుబోలె నెఱ్ఱగనుండును. లేక, పచ్చగనైన నుండును. శరీరము తెల్ల
కుష్కిలించి కప్పవలెనుండును. ఇంద్రియములన్నియు పాటవము దక్కి తమతమ
పనులజేయ నోపకుండును. అట్టిరోగి తాపముచేతను అజీర్ణముచేతను బలహీనము
చేతను ఒడలినొప్పులచేతను అరోచకముచేతను బాధింపబడి చాల కష్టదశ నొందును.
ఈకామలారోగము ప్రబలమైన పిత్తమున కల్గును. ఇయ్యది కోష్ఠమును, రక్తాదిధాతు
వులను, త్వక్కును ఆశ్రయించి రెండు విధముల నుండును.

మరియు నీకామలారోగము పాండురోగము లేనివాడుకూడ పిత్తప్రకృతిగల
వారు పిత్తవృద్ధికరములగు పదార్థముల విశేషముగ సేవించినచో వానికి పుట్టును
నని వాగ్భటాచార్యుడు "భవేత్పిత్తోల్బణస్యాసౌ పాండురోగాదృతేఽపి చ" అను
వాక్యమున జెప్పెను.

కుంభకామలాలక్షణము

కాలాన్తరాత్ఖరీభూతా కృచ్ఛ్రా స్యాత్కుమ్భకామలా,

కామలారోగము జనించినపుడు తగినచికిత్స జేయక యుపేక్షించినచో నయ్యది
చిరకాలమునకు కోష్ఠమున జేరి స్థిరముగ నిలచును. ఇయ్యది కుంభమువలె కోష్ఠమున
స్థిరముగ నుండుటంజేసి కుంభకామల యని యన్వర్థముగ జెప్పంబడును. ఇది చికిత్సకు
మిక్కిలి కష్టసాధ్యమై యుండును.

అసాధ్యకామలాలక్షణము

కృష్ణపీతశకృన్మూత్రో భృశం శూనశ్చ మానవః,
సరక్తాక్షిముఖచ్ఛర్దివిణ్మూత్రో యశ్చ తామ్యతి. 19
దాహారుచితృడానాహతన్ద్రామోహసమన్వితః,
నష్టాగ్నిసంజ్ఞః క్షిప్రం హి కామలావాన్వినశ్యతి. 20

కామలారోగపీడితునకు మలమూత్రములు నల్లనైనను పసుపుగనైనను కన్పడుచు
నుండి వాపు అధికమైయున్నను; కన్నులును, ముఖంబును, మలమూత్రములును, వమనంబు
ములును, ఎఱ్ఱగనుండి మూర్ఛకల్గినను; తాపము, అరుచి, దప్పి, కడుపుబ్బరము,
మైకము, మూర్ఛ ఈ యుపద్రవముల గూడియున్నను, జఠరాగ్ని పోయి స్మృతి
లేకుండనున్నను, అట్టికామలారోగి అతిశీఘ్రముగ నాపత్తునొందును.

అసాధ్యకుంభకామలాలక్షణము

ఛర్ద్యరోచకహృల్లాసజ్వరక్లమనిపీడితః,

నశ్యతి శ్వాసకాసార్తో విడ్భేదీ కుమ్భకామలీ. 21

కుంభకామలాపీడితునకు వాంతి, అరోచకము, ఓకరింతలు, జ్వరము, బడలిక శ్వాసము, దగ్గు, నీయుఃద్రవములు కల్గి మలము ద్రవములేక యుండలుగ కష్టముచే వెడలినయెడ మృతిజెందును.

### హాలీమకలక్షణము

యదా తు పాణ్డోర్వర్ణస్స్యాద్ధరితశ్శ్యావపీతకః,
బలోత్సాహక్షయ స్తన్ద్రా మన్దాగ్నిత్వం మృదుజ్వరః. 22
స్త్రీష్వహర్షోఽఙ్గమర్దశ్చ దాహ స్తృష్ణారుచిః భ్రమః,
హాలీమకం తదా తస్య విద్యాదనిలపిత్తతః. 23

పాండురోగమునందు శరీరవర్ణము ఆకుపచ్చని వర్ణముగనైనను, శ్యామవర్ణముగనైనను, పసుపురంగుగనైన నుండి; శరీరమునందలి బలంబును, ఉత్సాహంబును నశించి, యగ్ని మందగించి సూక్ష్మముగ జ్వరమువచ్చుచు మైకముగ్రమ్ముచున్న నయ్యది హాలీమక మని చెప్పబడును. మరియు నీవ్యాధియందు స్త్రీసంభోగమునం దిచ్ఛపొడమదు. శరీరమునం దెల్ల నొప్పి కలుగును. మంటపుట్టును. దప్పి యధిక మగును. నోటికి రుచి తప్పిపోవును. ఒడలు తిరుగుచుండును. ఈరోగము వాతపిత్తముల ప్రకోపమున కల్గును. మరియు నీవ్యాధిని *లాఘర మనియు, హాలీమక మనియు, అలస మనియు కొందరు చెప్పెద రని వాగ్భటు లిత్తెరంగున నుడివిరి:—"హరితశ్యావపీతత్వం......దస్త్రబలాఽనలభ్రంశః లాఘరం తం హాలీమకం, అలసం చేతి శంసంతి" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౧౮, ౧౯.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
పాండురోగ కామలాకుంభకామలా
హాలీమకనిదానం సమాప్తమ్.

---

* దీనినే లాఘవక మని విజయరక్షితుడు మధుకోశమున వ్రాసియుండెను.

# ౯. రక్తపిత్తనిదానమ్

రక్తపిత్తమున "పిత్తం విదగ్ధం స్వగుణైః" అను వాక్యముచేత పిత్తము ప్రధానమని తెలియుచున్నది. పాండురోగమునందు పిత్తప్రధానమగుటంజేసి ఈ రెండును సమానజాతీయములు. కావున పాండురోగనిదానము జెప్పిన పిదప రక్తపిత్తనిదానము చెప్పబడును:—

**రక్తపిత్తనిదానము, సంప్రాప్తి**

ఘర్మవ్యాయామశోకాధ్వవ్యవాయైరతిసేవితైః,
తీక్ష్ణోష్ణైః క్షారలవణైరమ్లైః కటుభిరేవ చ. 1

పిత్తం విదగ్ధం స్వగుణైర్విదహత్యాశు శోణితమ్,
తతః ప్రవర్తతే రక్తం ఊర్ధ్వం చాధో ద్విధాఽపి వా. 2
ఊర్ధ్వం నాసాక్షికర్ణాస్యైః మేఢ్రయోనిగుదైరధః,
కుపితం రోమకూపైశ్చ సమస్తైస్తత్ప్రవర్తతే. 3

ఎండలో నధికముగ సంచరించుట దేహపరిశ్రమము తన బలమునకు తగనంత మిక్కుటముగ జేయుట, అధికముగ వ్యసనపడుట, ఎడలేక త్రోవనడచుట, మిగిలి మీరి స్త్రీసంభోగము చేయుట, మిక్కిలి తీక్ష్ణములగు మిగియుష్ణములు మున్నగువానిని, ఉష్ణవీర్యంబులును ఉష్ణస్పర్శంబులు నైనపదార్థములను, క్షార-అమ్ల-కటురసములు గల పదార్థముల నధికముగ భుజించుట అనువానివలన పిత్తము ప్రకోపమునొంది తనయందలి స్వాభావికములైన తీక్ష్ణాదిగుణములచేత రక్తము నతిత్వరితముగ కలుషింపజేయును. ఇత్తెరంగున ప్రకోపించినరక్తము ద్రవముగ నుండు పిత్తముతో గలిసి యూర్ధ్వమార్గములనైనను, అధోమార్గములనైనను, లేక రెండుమార్గములనైనను బైటవెడల నారంభించును. అందు ఊర్ధ్వముగ వెడలునపుడు నాసారంధ్రముల నుండియు, నేత్రములనుండియు, చెవులనుండియు, నోటినుండియును వెడలును. అధో మార్గమున వెడలునపుడు మేఢ్రమునుండియు, యోనిమార్గమునుండియు, గుదమార్గము నుండియు వెడలును. రక్తము మిక్కుటముగ ప్రకోపించినయెడల రోమరంధ్రముల నుండియు స్రవించును.

మాధవ—9

రక్తపిత్తసంప్రాప్తి రక్తపిత్తప్రకోపక్రమము చరకమున నీరీతి నుపదేశింప బడినది:—"లోహితం చ స్వప్రమాణమతివర్తతే; తస్మిన్ ప్రమాణాతివృత్తే పిత్తం ప్రకుపితం శరీరమనుసర్పత్ యదైవ యకృత్ప్లీహప్రభవాణాం లోహిత వహానాం స్రోతసాం లోహితాభిష్యన్దగురూణి ముఖాన్యాసాద్య ప్రతిపద్యతే, తదైవ లోహితం దూషయతి. సంసర్గాల్లోహిత ప్రదూషణాల్లోహితగన్ధవర్ణాను విధానాచ్చ పిత్తం లోహితమిత్యాచక్షతే" (చరక. ని. అ. ౨) పైజెప్పిన కారణములచేత రక్తము తన ప్రమాణమునకన్న నధికమగునపుడు పిత్తము ప్రకోపము నంది శరీరమునం దెల్ల వ్యాపించుచు నెప్పుడు యకృత్తునందును, ప్లీహమందును పుట్టి శరీరమున రక్తమును ప్రవహింపజేయు రక్తనాళములయొక్క రక్తప్రవాహముచే పెద్దవిగనుండు రంధ్రములను జేరియుండునో; ఆసమయముననే రక్తమును జెరచును. పిత్తము రక్తముతోగూడి యంతర్భాగమున నుండు రక్తమును చెరచుటచేతను రక్తమునకు సమానమైన గంధంబును వర్ణంబును కల్గియుండుటం జేసి పిత్తముగూడ రక్త మని చెప్పబడును.

మరియు ద్రవరూపమైన పిత్తము ప్రకోపమునంది ప్రకుపితమైన రక్తమున గలిసి రెండును సమానరూపములై శరీరమున వ్యాపించుటం జేసి రక్తపిత్త మని వ్యవహరింపబడును. ఈవిషయము వాగ్భటాచార్యునిచే నిత్తెరంగున నూహింప బడెను;— "కుపితం పిత్తలైః పిత్తం ద్రవం రక్తం చ మూర్ఛితే, తే మిథస్తుల్య రూపత్వం ఆగమ్య వ్యాప్నుతస్తనుమ్."

మరియు రక్తపిత్తము ఊర్ధ్వాధోమార్గముల వెడలుటకు కారణములు చరకమున నీరీతి చెప్పబడినవి.—"మార్గౌ పునరస్య ద్వౌ, ఊర్ధ్వం చాధశ్చ; తద్బహు శ్లేష్మణి శరీరే శ్లేష్మసంసర్గాత్ ఊర్ధ్వం ప్రపద్యమానం కర్ణనాసికానేత్రాస్యేభ్యః ప్రచ్యవతే, బహువా తే తు శరీరే వాతసంసర్గాదధః ప్రతిపద్యమానం మూత్ర పురీషమార్గాభ్యాం ప్రచ్యవతే. బహువాతశ్లేష్మణి తు శరీరే శ్లేష్మవాతసంసర్గాత్ ద్వావపి మార్గౌ ప్రతిపద్యతే. తౌ మర్గౌ ప్రతిపద్యమానం సర్వేభ్య ఏవ యథోక్తేభ్యః ఖేభ్యః ప్రచ్యవతే శరీరస్య." (చరక. ని. అ. ౨) రక్తపిత్తము వెడలుమార్గములు ఊర్ధ్వాధోభాగములు రెండు. అందు కఫము ప్రబలముగనుండు శరీరమున రక్తపిత్తము కఫమున సంసర్గము కల్గుటవలన చెవులు మున్నగు నూర్ధ్వ మార్గములనుండి వెడలును. వాతము ప్రబలముగ నుండు శరీరమున వాతసంసర్గమునం జేసి మేఢ్రము మున్నగు నధోమార్గములనుండి వెడలును. కఫవాతములు రెండును అధికముగ నుండు శరీరమున ఊర్ధ్వాధోమార్గముల రెంటినుండియు వెడలును. అట్టి మార్గములు రెంటినుండి వెడలుతగి శరీరమునందలి రోమ రంధ్రములు మున్నగు నితర ద్వారములనుండియు రక్తపిత్తము వెడలును.

### రక్తపిత్త పూర్వరూపములు

సదనం శీతకామిత్వం కణ్ఠధూమాయనం వమిః,
లోహగన్ధిశ్చ నిశ్వాసః భవత్యస్మిన్ భవిష్యతి. 4

శరీరము కృశించుట, చల్లనియుపచారాదుల గోరుట, కుత్తుకయందు పొగ వెడలునట్లుండుటను, వమనమువచ్చుట, శ్వాసము లోహముయొక్క వాసనగల్గి వెడలుట, ఇవి యన్నియును రక్తపిత్తము జనించుటకు మున్ను కల్గును.

### కఫవాతములచే జనించిన రక్తపిత్తము

సాన్ద్రం సపాణ్డు సస్నేహం పిచ్ఛిలం చ కఫాన్వితమ్,
శ్యావారుణం సఫేనం చ తను రూక్షం చ వాతికమ్. 5

కఫముతోఁగూడిన రక్తపిత్తము చిక్కనై పాండువర్ణముతోఁగూడి జిడ్డు కలిగి పిచ్ఛిలముగ వెడలును. వాతముతోఁగూడిన రక్తపిత్తము శ్యామలవర్ణంబును అరుణ వర్ణంబును కల్గి నురుగుతోఁగూడి రూక్షంబునునై పలుచగ వెడలును.

### పిత్తముచే జనించిన రక్తపిత్తము

రక్తపిత్తం కషాయాభం కృష్ణం గోమూత్రసన్నిభమ్,
మేచకాగారధూమాభం అఞ్జనాభంచ పైత్తికమ్. 6

పిత్తముచే జనించిన రక్తపిత్తము కషాయముతో సమానమైన రంగు గల్గి యుండును. లేక కృష్ణవర్ణంబై యుండును, లేక గోమూత్రమునకు సమానమైన రంగు కల్గియుండును. లేక నల్లని రంగుకల్గి యైనను, కరిపొగపమునకు సమానవర్ణంబైనను, కాటుకవలె మిక్కిలి నల్లనిరంగు కల్గియైన నుండును.

రక్తపిత్తము పిత్తసంబంధములేక జనించుట లేదు. కనుక ఆలోచకాది పంచవిధ పిత్తములలో నొకటగు రంజకపిత్తము ప్రకోపించి రక్తపిత్తమును కల్గించును. అదిగాక తక్కినపిత్తములలో నొకదానితోఁగూడ జేసి రక్తపిత్తము వెడలినచో పిత్తజరక్త మని వ్యవహరింపబడును. లేక వాతశ్లేష్మ దోషానుబంధములేని రక్తపిత్తము రక్తపిత్త మని వ్యవహరింపబడును.

### ద్వన్ద్వజరక్తపిత్తలక్షణము

సంసృష్టలిఙ్గం సంసర్గాత్ త్రిలిఙ్గం సాన్నిపాతికమ్,
ఊర్ధ్వగం కఫసంసృష్టం అధోగం పవనానుగమ్.
ద్విమార్గం కఫవాతాభ్యాం ఉభాభ్యామనువర్తతే. 7

వాతాది దోషములకు వేర్వేరుగ జెప్పిన లక్షణములలో రెండేసి లక్షణములు కల్గియున్నచో ద్వంద్వజరక్తపిత్తమనియును, త్రిదోషముల లక్షణములు కల్గి యున్నచో

త్రిదోషజ మనియు నెరుంగునది. మరియు ఊర్ధ్వమార్గములగుండా వెడలు రక్తపిత్తము కఫముతోగూడి వెడలును. అధోమార్గముల వెడలు రక్తపిత్తము వాతముతోగూడి వెడలును. రెండు మార్గముల వెడలు రక్తపిత్తము కఫవాతములు రెండిటితోగూడ రక్తపిత్తము వెడలును. *

### రక్తపిత్తసాధ్యాసాధ్యనిర్ణయము

ఊర్ధ్వం సాధ్యమధో యాప్యం అసాధ్యం యుగపద్గతమ్,
ఏకమార్గం బలవతో నాతివేగం నవోత్థితమ్. 8
రక్తపిత్తం సుఖే కాలే సాధ్యం స్యాన్నిరుపద్రవమ్,
ఏకదోషానుగం సాధ్యం ద్విదోషం యాప్యముచ్యతే. 9
యత్త్రిదోషమసాధ్యం స్యాత్ మన్దాగ్నేరతివేగవత్,
వ్యాధిభిః క్షీణదేహస్య వృద్ధస్యానశ్నతశ్చ యత్. 10

ఊర్ధ్వమార్గమున వెడలు రక్తపిత్తము సాధింపదగియుండును. అధోమార్గమున వెడలునది యాప్యము. రెండుమార్గములయందును సమకాలమున వెడలు రక్తపిత్తము అసాధ్యము. ఇంతియకాక శరీరమున బలము క్షీణించక బలవంతుడైన వానికి మిక్కిలి వేగముచు జూపక ఉపద్రవములులేక సుఖమైనకాలమున నూతనముగ నేకదోషముచే జనించి యేకమార్గమున వెడలు రక్తపిత్తము సుఖసాధ్యముగ నుండును. పైజెప్పిన సంపత్తుతో గూడినను ద్విదోషములచే జనించినది యాప్య మగును. త్రిదోషములచే జనించినది యసాధ్యమగును. జాఠరాగ్ని మందగించినవానికి మిక్కిలి వేగముతో గూడిన రక్తపిత్తము అసాధ్యము. ఇతరరోగములచే శరీరబలములు క్షీణించినవానికి జనించిన రక్తపిత్త మెట్టిదైనను అసాధ్యము. ముసలివానికి జనించినదియు, ఆహారము భుజించని వానికి జనించినదియు నసాధ్యము.

### రక్తపిత్తోపద్రవములు

దౌర్బల్యశ్వాసకాసజ్వరవమథుమదాః పాండుతాదాహమూర్ఛాః
భుక్తే ఘోరో విదాహస్త్వధృతిరపి సదా హృద్యతుల్యా చ పీడా,
తృష్ణా కోష్ఠస్య భేదశ్శిరసి చ తపనం పూతినిష్ఠీవనత్వం
భక్తద్వేషావిపాకౌ వికృతరపి భవేత్ రక్తపిత్తోపసర్గాః. 11

* రక్తపిత్తమునందు పిత్తము ప్రధానముచు కఫవాతములు అనుబంధములునునై యుండును. కావున నూర్ధ్వాధోమార్గములనుండి వెడలు రక్తపిత్తములలో గఫవాతములు స్థానసంబంధమహిమచేగలసి బయలువెడలుచుండును. అందువలననే పిత్తజ రక్తపిత్త మార్గము ప్రత్యేకము చెప్పబడలేదు. "సంసృష్టలింగ" మను వాక్యము రక్తపిత్తరూప ముచు మాత్రము చెప్పవదియై యున్నది.

బలహైన్యము, శ్వాసము, దగ్గు, జ్వరము, వాంతి, మాదకద్రవ్యమున గల్గినట్లు తిక్కయెత్తుట, శరీరము తెల్లగ నుండుట, తాపము, మూర్ఛ, భుజించునపుడు మంట ధైర్యములేకుండుట, హృదయమున జెప్పనలవికాని వేదనకల్గుట, దప్పి, కోష్ఠము, పగుల దీయునట్లు బాధకల్గుట, తలపైన మంటబుట్టుట, ఉమ్మినీరు దుర్గంధముతో గూడి యుండుట, అన్నద్వేషము, అజీర్ణము, పిత్తపుకారము ఇవి యన్నియు రక్తపిత్తమున గల్గు నుపద్రవములు.

## అసాధ్యరక్తపిత్తము

మాంసప్రక్షాళనాభం క్వథితమివ చ యత్ కర్దమామ్భోనిభం వా
మేదః పూయాస్రకల్పం యకృదివ యది వా పక్వజమ్బూఫలాభమ్,
యత్కృష్ణం యచ్చ నీలం భృశమతికుణపం యత్ర చోక్తా వికారాః
తద్వర్జ్యం రక్తపిత్తం సురపతిధనుషా యచ్చ తుల్యం విభాతి. 12

రక్తపిత్తము మాంసమును కడిగిన నీళ్లవలె కొంచెము రక్తవర్ణముగ నున్నను, ఉడ్కిన విధముగ దుర్గంధము కల్గియున్నను బురదనీళ్లవలె నున్నను, మేదస్సును, చీమును, రక్తమును బోలియున్నను, యకృత్తు (నల్లదబ్బ)ను బోలియున్నను, చక్కగపండిన నేరేడుపండువలె నల్లనైయున్నను, నీలవర్ణమైనను, కృష్ణవర్ణమైనను, పీనుగవలె దుర్గంధము కల్గియున్నను, ఇంద్రధనుస్సునుబోలి చిత్రవర్ణము కల్గియున్నను, మిక్కిలి యసాధ్యమగును. మరియు పైనివివరించిన రక్తపిత్తోపద్రవములు కొన్ని కల్గినను మిక్కిలి యసాధ్యమగును.

యేన చోపహతో రక్తం రక్తపిత్తేన మానవః,
పశ్యేద్దృశ్యం వియచ్చాపి తచ్చాప్యసాధ్యమసంశయమ్. 13
లోహితం ఛర్దయేద్యస్తు బహుశో లోహితేక్షణః,
లోహితోద్గారదర్శీ చ మ్రియతే రక్తపైత్తికః. 14

రక్తపిత్తముచేత పీడితుం డగు నేమనుజునకు రక్తవర్ణముతో గూడినట్లు దృశ్య పదార్థములును ఆకసంబును అగపడునో వానికి అవ్యాధి యసాధ్యంబగును. మరియు రక్తపిత్త పీడితుడు ఎఱ్ఱని కన్నులుగలవాడై రక్తము వాంతి చేయుచున్నను, కన్పించు వస్తువు లన్నిటిని రక్తవర్ణంబులుగ జూచుచు రక్తపు వాసనతో త్రేన్చుచున్నను, అట్టి రక్త పిత్తము రోగిని తప్పకచంపును. మిక్కిలి యసాధ్యమని తెలియునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
రక్తపిత్తనిదానం సమాప్తమ్.

# ౧౦. రాజయక్ష్మనిదానమ్.

రాజయక్ష్మరూపములు జెప్పునపుడు "పిత్తాద్రక్తస్య చాగమః" అని పిత్తము వలన రక్తముకూడ వెడలు నని చెప్పుటచే రక్తపిత్తమునకును రాజయక్ష్మమునకును పౌర్వాపర్యసంబంధ మున్నది; కావున రక్తపిత్తనిదానమును చెప్పిన పిదప రాజయక్ష్మనిదానము చెప్పబడును:—

రాజయక్ష్మకారణములు

వేగరోధాత్క్షయాచ్చైవ సాహసాద్విషమాశనాత్,
త్రిదోషో జాయతే యక్ష్మా గదో హేతుచతుష్టయాత్. 1

లజ్జచేనైనను, భయముచేనైనను, సరియగు సంవిధానము కుదరకుండుటచే నైనను, మలమూత్రవాతాదులను సకాలమున విసర్జించక వానివేగమును నిరోధించుటచేతను, అధికముగ స్త్రీసంపర్కము చేయుట, వ్యాయామమును బలమున కధికముగ జేయుట మున్నగు కారణములచే రసరక్తాదిధాతువులు క్షీణించుటచేతను, తనబలమును గమనించక మిక్కిలి యధికబలము కలవారితో మల్లయుద్ధము జేయుట మున్నగు సాహసకృత్యములచేతను, తనకు గల కోష్ఠాదిబలమునకు తక్కువగనైనను అధికముగనైనను భుజించుటచేతను (ఈనాల్గు కారణములచేత) రాజయక్ష్మవ్యాధి కల్గును. ఇయ్యది త్రిదోషములును సమకాలమున ప్రకోపము నొందుటచే కల్గును. కావున సాన్నిపాతికము.

ఈ క్రూరమైనవ్యాధి శోష మనియు, రాజయక్ష్మ మనియు, క్షయ మనియు, నామభేదములచే వ్యవహరింపబడును. రసరక్తాదిధాతువుల నెల్ల శోషింపజేయుట వలన శోష మనబడును. ఈవ్యాధి తొలుత రాజైన చంద్రునకు కల్గినందుచే రాజయక్ష్మ మనియు, శరీరమును క్షీణింపజేయుటచేతను, మఱియు మిక్కిలి క్రూరంబగుటం జేసి సామాన్యచికిత్సల కవకాశమియ్యక క్షీణింపజేయుటచేతను క్షయ మనియు నన్వర్థముగ జెప్పబడును. ఈవిషయమును సుశ్రుతాచార్యుడు:—' సంశోషణాద్రసాదీనాం శోష ఇత్యభిధీయతే, క్రియాక్షయకరత్వాచ్చ క్షయ ఇత్యుచ్యతే బుధైః, రాజ్ఞశ్చన్ద్రమసో యస్మాదభూదేష కిలామయః, తస్మాత్తం రాజయక్ష్మేతి కేచిదాహుర్మనీషిణః" (సు. ఉ. అ. ౪౧) అను శ్లోకముచే వివరించెను. మరియు "యక్ష్మణాం రాజా రాజయక్ష్మా" అను వ్యుత్పత్తిచేత రోగములకన్నిటికన్న నియ్యది మిక్కిలి క్రూరంబగుటవలన రాజయక్ష్మ మనబడును. (ఇచ్చట "రాజదన్తాదిషు పరం" అను వ్యాకరణసూత్రముచే యక్ష్మశబ్దమునకు పరనిపాత మని

యెరుంగునది.) ఈ విషయము తంత్రాంతరమున—"అనేక రోగానుగతో బహురోగ పురోగమః, ఏతేన పరివారేణ రోగరాజో విరాజతే" అని రాజయక్ష్మము నుపక్రమించి చెప్పబడినది.

మరియు నీరోగము తొలుత చంద్రునకు కల్గిన సమయమును [illegible] చరకమున నిట్లు చెప్పబడియె.—అశ్విన్యాదినక్షత్రములను [illegible] చంద్రుడు రోహిణియందు మిక్కిలి మక్కువ కల్గి తక్కినవారల నాదరింపకుండెను. అనుప నశ్విన్యాదులకు జనకుం డగు దక్షుడు చంద్రుని దుర్న్యయంబులను కడు నసహించెను. ఆ దేవ దేవుని కోపము సాకారమై చంద్రుని రసరక్తాదిధాతువుల శోషింపజేసి శ్వాసకాసాది రూపముగ బాధింపం దొడంగె. అంత చంద్రుండు [illegible]రవ్యాధిచే నావానాటు [illegible] యోరువజాలక పితామహుని శరణంబువేడ నాజగజ్జనకుడు [illegible] యశ్వినీదేవతల చికిత్సజేయ నాజ్ఞాపింప వారును తగిన రసాయనాదులచే చంద్రునకు చికిత్సజేసిరి. చంద్రుడును ఆరోగ్యమునొంది యథాపూర్వముగ నశ్విన్యాది సప్తవింశతి కాంతలయందును సముద్రైయుండెను. అంత నాటంగోలె నీ రోగరాజము రాజయక్ష్మమని పేరొంది వేగరోధము, క్షయము, సాహసము, విషమాశనము, అను నీ నాల్గు కారణముల నాధారముగజేసికొని భూలోకంబున మనుజుల బాధింపు మని యశ్వినీదేవతలచే నాజ్ఞనొంది భూలోకమున కవతరించెనట! ఈ చారిత్రము నిదానమున చరకమున "దివౌకసాం కథయతాం" అని యుపక్రమించి "యస్మాత్స రాజ్ఞః ప్రాగాసీత్ రాజయక్ష్మా తతో మతః, సయక్ష్మాహుంకృతోఽశ్విభ్యాం మానుషం లోకమాగతః, లబ్ధ్వా స చతుర్విధం హేతుం సమావిశతి మానవాన్" అని యుండును. (దక్షునియొక్క కోపము రాజయక్ష్మమునకు విప్రకృష్టకారణము.)

మరియు:—"క్రోధో యక్ష్మా జ్వరో రోగ ఏకోఽర్థో దుఃఖసంజ్ఞకః" అని చరకమున నున్నది. కావున క్రోధము, యక్ష్మ, జ్వరము, రోగము అను పదములు నాల్గును సామాన్యవాచకములై దుఃఖము కల్గించునది యనునర్థమును బోధించునని తెలియం దగును.

## రాజయక్ష్మసంప్రాప్తి

కఫప్రధానై ర్దోషైస్తు రుద్ధేషు రసవర్త్మసు,
అతివ్యవాయినో వాపి క్షీణే రేతస్యనంతరాః,
క్షీయన్తే ధాతవస్సర్వే తతశ్శుష్యతి మానవః. 2

కఫము ప్రధానముగా గల వాతపిత్తములు ప్రకోపించి [illegible] రసధాతువును శరీరమున వ్యాపింపజేయు ధమనులమార్గములను మూసివేయగా [illegible] ధాతువు తనకు వ్యాపించుటకు మార్గములేమింజేసి స్వస్థానస్థమైన హృదయమునందు

అణగి తనయందలి వేడిచే తప్తంబయి క్షీణించును. అట్టి రసధాతువుయొక్క సాహాయ్యములేక తక్కిన రక్తమాంసమేదోఽస్థిమజ్జశుక్రము లను నారుధాతువులును వరుసగ నానాట శోషించును. [1]మరియు తనబలమునకు మిక్కుటముగ స్త్రీసంభోగముచేయు మానవునకు తొలుత శరీరమునకు జీవనమునకును ప్రధానమైన శుక్రధాతువు క్షీణంబగును. పిమ్మట మజ్జ, అస్థి, మేదస్సు, మాంసము, రక్తము, రసము అను నారుధాతువులును వరుసగ ప్రతిలోమముగ క్షీణించును. [2]దానంజేసి మానవుడు శోషించును. పైజెప్పిన అనులోమ ప్రతిలోమరూపముగ ధాతువులు క్షీణించుటచే మానవుడు శోషించిన నయ్యది క్షయ మని చెప్పబడును.

ఇచ్చట నీ నిర్ణయము నెరుంగునది:—క్షయము అనులోమ మనియు ప్రతిలోమ మనియు రెండువిధములు. అందు వాతపిత్తములు వేగరోగాదికారణములచే ప్రకోపము నొంది రసధాతువు ప్రవహించునాడుల నడ్డగించుటచే నయ్యది స్వస్థానముననే యుండి తక్కిన రక్తాది ధాతువులకు బలమును గల్గింపనేరకుండుటచే నయ్యవి వరుసగ శుక్రము వరకును క్షయమునొందును. ఇయ్యది అనులోమక్షయము. సంభోగాతిశయమున తొలుత శుక్రధాతువు క్షీణంబై తక్కిన ధాతువులన్నియు ప్రతిలోమముగ క్షీణించును, ఇయ్యది ప్రతిలోమక్షయము. ఇందు సంభోగాతిశయముచే తొలుత శుక్రము క్షీణించును. దానంజేసి వాతము కుపితంబై మజ్జను శోషింపజేయును. పిమ్మట మిక్కిలి వేడియైన వస్తుసంబంధమునంజేసి మరియొకవస్తువుకూడ వేడియగుచందంబున మజ్జ సంబంధమున అస్థులును, వానిసంబంధమున మాంసంబును, దానిసంబంధమున రక్తంబును, దానిస్పర్శమువలన రసంబును వ్యుత్క్రమముగ శోషించు నని యెరుంగునది.

మరియు శరీరమున రసాదిధాతువులు వరుసగ నొకధాతువుతో మఱియొక ధాతువు పుష్టినొందును. ఒకధాతువు విపన్నమై వికృతినొందినచో తక్కిన ధాతువులును వరుసగ విపన్నము లగును. ఈ విషయము చరకమున నిట్లు చెప్పబడినది:— "యథా స్వేనోష్మణా పాకం శారీరా యాంతి ధాతవః, స్రోతసాచ యథాస్వేన ధాతుః పుష్యతి ధాతునా, స్రోతసాం సన్నిరోధాచ్చ రక్తాదీనాం చ సంక్షయాత్, ధాతూష్మణాం చాపచయాత్ రాజయక్ష్మా ప్రవర్తతే." (చరక. చి. అ. ౮, శ్లో. ౩౯. ౪౦.) (రసరక్తాది ధాతువులు తనయందలి వేడిచే పక్వమై వానివాని స్రోతస్సుల యందు సంచరించుచు నేరీతిగ పుష్టినందియుండునో అదేవిధముగ నొక ధాతువు సాహాయ్యమున వేరొకధాతువు పుష్టినొందును. ఇట్లుండ ఒకధాతువు ఊష్మములేక తన మార్గమును అడ్డగింపబడినచో క్షీణమగును. దాని సహాయములేమింజేసి తక్కిన రక్తాది ధాతువులు వరుసగ క్షీణించును. ఈ క్రమముననే రాజయక్ష్మ వ్యాధి జనించును.)

---

1. ఇది అనులోమక్షయ యనబడును. 2. ఇది ప్రతిలోమక్షయ అనబడును.

ఈయభిప్రాయముచేతనే ప్రకృతమున "క్షీణే రేతస్యనన్తరాః, క్షీయన్తే ధాతవ స్సర్వే" అని మూలమున జెప్పబడినది. మరియు చరకమున క్షయరోగప్రాప్తి యిట్లుగా గున జెప్పబడినది.—"రసః స్రోతస్సు రుద్ధేషు స్వస్థానస్థో వివర్ధతే, సఊర్ధ్వం కాస వేగేన బహురూపః ప్రవర్తతే, జాయన్తే వ్యాధయశ్చాతః షడేకాదశధా పునః, యేషాం సంఘాతయోగేన రాజయక్ష్మేతి కథ్యతే." (చరక. చి. అ. ౮. శ్లో. ౮౩ ౮౪)
(రసవహస్రోతస్సును ప్రదోషము అడ్డగించినపుడు రసధాతువు వెడలతెరవులేక స్వస్థానముననే వృద్ధినందును. అయ్యది కాసముయొక్క వేగము చేత పైకి ఎగనెట్టబడి శిరస్సనజేరి యందుండి నోటనుండియు నాసాదిరంధ్రములనుండియుగూడ వెడలును. దానం జేసి క్రిందజెప్పంబడు పదునొకండువిధంబులును, లేక ఆరువిధంబులును నగురోగములు కల్గును. ఆరోగసముదాయమునకు రాజయక్ష్మ మని పేరు.)

## రాజయక్ష్మపూర్వరూపములు

శ్వాసాఙ్గమర్దకఫసంస్రవతాలుశోష
వమ్యగ్నిసాదమదపీనసకాసనిద్రాః,
శోషే భవిష్యతి భవన్తి; స చాపి జన్తుః
శుక్లేక్షణో భవతి మాంసపరో రిరంసుః.
స్వప్నేషు కాకశుకసల్లకినీలకణ్ఠా
గృధ్రాస్తథైవ కపయః కృకలాసకాశ్చ,
తం వాహయన్తి స నదీర్విజలాశ్చ పశ్యేత్
శుష్కాంస్తరూన్ పవనధూమదవార్దితాంశ్చ.

రాజయక్ష్మముకల్గుటకు పూర్వము క్రిందజెప్పంబడు పూర్వరూపములుజనించును. శ్వాసము, ఒడలినొప్పులు, నోట కఫమువెడలుట, చెక్కిళ్లు శుష్కించుట, వాంతి, జఠరాగ్ని మందగించుట, తిక్కయెత్తినట్లుండుట, పడిసెము, దగ్గు, నిద్ర ఇవి యన్నియు క్షయమునకు మున్ను కల్గును. మరియు నీరోగమునకు సుగిరైన మూర

* మఱియు "పూర్వరూపంప్రతి శ్యాయోదౌర్బల్యం దోషదర్శనమ్, అదోషేష్వపి భావేషు, కాయే బీభత్సదర్శనమ్. ఘృణిత్వమశ్నతశ్చాపి బలమాంసపరిక్షయః, స్త్రీమద్యమాంసప్రియతా ప్రియతాచావగుణ్ఠనే. మక్షికాఘుణకేశానాం తృణానాం పతనానిచ, ప్రాయోఽన్నపానే కేశానాం నఖానాఞ్చాతివర్ధనమ్. పతత్రిభిః పతఙ్గైశ్చశ్వాపదైశ్చాభిధర్షణమ్," అని (చ. చి. 8 అ. 31-35 శ్లో.) చరకమునందు జెప్పిన పూర్వరూపములుకూడ నిచ్చట తెలుగవలెను.

పుడు కన్నులు తెల్లబడి మాంసమునందును సంభోగమునందును మిక్కిలి యాసగొని యుండును. వాడు నిదురించుసమయమున కాకులు, చిలుకలు, ముండ్లపందులు, నెమిళ్లు, గద్దలు, కోతులు, తొండలు ఇవియన్నియు తన్ను యెత్తుకొనిపోవునట్లు స్వప్నము గాంచును. మరియు స్వప్నములయందు నీళ్లులేని నదులను, ఎండినచెట్లను గాలిచేతను పొగచేతను కార్చిచ్చుచేతను పీడింపబడిన చెట్లను జూచును. పైజెప్పినలక్షణములలో కొన్నియైన గానంబడినవాడు రాజయక్ష్మము రానున్నదని యెరుంగునది.

## రాజయక్ష్మసామాన్యలక్షణములు

అంసపార్శ్వాభితాపశ్చ సన్తాపః కరపాదయోః,
జ్వరస్సర్వాఙ్గగశ్చేతి లక్షణం రాజయక్ష్మణః. 5

మూపులపైనను, ఇరుప్రక్కలయందును, హస్తపాదములయందును మంటపుట్టుట. శరీరమునందెల్ల జ్వరము వ్యాపించియుండుట-ఈలక్షణములు రాజయక్ష్మయందు సామాన్యముగ కనుపించును.

పైజెప్పిన మూడులక్షణములు కల్గిన రాజయక్ష్మము త్రిలక్షణము. మరియు రాజయక్ష్మమునగల్గు షడ్రూపములు కోశాంతరమున నిట్లు అధికపాఠముగా కానంబడి యెడు.—"భక్తద్వేషో జ్వరః కాసః శ్వాసశ్శోణితదర్శనమ్, స్వరభేదశ్చ జాయేత షడ్రూపం రాజయక్ష్మణి" దీనివివరణ మీక్రింద జేయబడును.

## దోషత్రయముచే రాజయక్ష్మరూపము

స్వరభేదోఽనిలాచ్ఛూలం సఙ్కోచశ్చాంసపాదయోః,
జ్వరో దాహోఽతిసారశ్చ పిత్తాద్రక్తస్య చాగమః. 6
శిరసః పరిపూర్ణత్వం అభక్తచ్ఛన్ద ఏవ చ,
కాసః కణ్ఠస్య చోద్ధ్వంసో విజ్ఞేయః కఫకోపతః. 7

రాజయక్ష్మము సామాన్యముగ త్రిదోషప్రకోపమున జనించును. అందు వాతప్రకోపమున కంఠస్వరము మారును. శరీరమున పోట్లుపుట్టును. మూపులును పాదములు వంగును. పిత్తప్రకోపమున జ్వరముకల్గును. మంట పుట్టును. అతిసారము కల్గును. నోట నుమియునపుడును దగ్గునపుడును రక్తము వెడలును. కఫప్రకోపముచేత శిరస్సున కఫము చేరియుండుటంజేసి నిండినట్లుండును. అన్నమునం దిచ్ఛ పోడమదు. దగ్గువచ్చును. దగ్గునపుడు కల్గిన యభిఘాతమునంజేసి కంఠనాళము శిథిలముగ నుండును.

పైజెప్పిన పదునొకండును రాజయక్ష్మరూపములు. ఇవియన్నియు కల్గిన రాజయక్ష్మ ఏకాదశలక్షణంబనియు, ఇందు ఆరుమాత్రము కల్గియున్న షడ్లక్షణమనియు, మూడుమాత్రమున్నచో త్రిలక్షణమనియు చెప్పబడును. ఈవిషయము చరకమున నిట్లు

చెప్పబడినది.—కాసోఽంసతాపో వైస్వర్యం జ్వరః పార్శ్వశిరోరుజా, శోణిత శ్లేష్మణోశ్ఛర్దిః శ్వాసః కోష్ఠామయోఽరుచిః. రూపాణ్యేకాదశైతాని యక్ష్మణః; షడిమానివా, కాసో జ్వరః పార్శ్వశూలం స్వరవర్చోగదోఽరుచిః" (చరక. చి. అ. ౮. శ్లో. ౪౫, ౪౬.) ఇందు ఏకాదశరూపములు ప్రకృతమూలమున చెప్పబడినవి అందు దగ్గు, జ్వరము, ఇరుప్రక్కల నొప్పి, స్వరభేదము అతిసారము, అరుచి ఈయారులక్షణములు కలసి షడ్రూపము. మఱియు నీక్రింద జెప్పబడు "కాసశ్వాసాసృగామయైః" అను దగ్గు, ఒగర్పు, రక్తముమియుట అనునవి కలసి త్రిలక్షణము.

## అసాధ్యరాజయక్ష్మలక్షణము

ఏకాదశభిరేభిర్వా షడ్భిర్వాపి సమన్వితమ్,
కాసాతిసారపార్శ్వార్తిస్వరభేదారుచిజ్వరైః.
త్రిభిర్వా పీడితం లిఙ్గైః కాసశ్వాసాసృగామయైః,
జహ్యాచ్ఛోషార్దితం జన్తుం ఇచ్ఛన్ సువిపులం యశః. 9

పైజెప్పిన పదునొకండురూపములు కల్గియున్నక్షయము అసాధ్యమగును. మరియు దగ్గు, అతిసారము, ఇరుప్రక్కలనొప్పి, స్వరభేదము, అరుచి, జ్వరము అను నీయారురూపములు క్షయరోగమున గలవానికి కల్గినను; కాసము, శ్వాసము, రక్తము స్రవించుట ఈమూడురూపములు గల్గినను అసాధ్యమగును. కావున కీర్తిగోరువాడగు వైద్యుడు అట్టి రోగికి చికిత్సజేయక వదలియుండుట మంచిది.

సుశ్రుతాచార్యుడు రాజయక్ష్మమునకు షడ్రూపత్వము జెప్పుచోట్లను నిట్టి పరిగణనముజేసెను. "భక్తద్వేషో జ్వరః కాసః శ్వాసశ్శోణితదర్శనమ్, స్వరభేదశ్చ జాయేత షడ్రూపం రాజయక్ష్మణి" (సు. ఉ. అ. ౪౧) అన్నద్వేషము, జ్వరము, దగ్గు, శ్వాసము, దగ్గునపుడు రక్తము వెడలుట, స్వరభేదము ఈయారురూపములును రాజయక్ష్మమున గల్గినచో షడ్రూపమనబడును. ఈపరిగణనము విషయమున చరకసుశ్రుతములకును ప్రకృతగ్రంథమునకును పరస్పరభేదము కనబడుచున్నది. అయినను ప్రధానములగు బాధకములైన ఆరురూపములగూడినది బలవత్తరమని సమునితాభిప్రాయము.

## అసాధ్యత్వనియమము

సర్వైరర్ధైస్త్రిభిర్వాపి లిఙ్గైర్మాంసబలక్షయే,
యుక్తో వర్జ్యశ్చికిత్స్యస్తు సర్వరూపోఽప్యతోఽన్యథా. 10

రాజయక్ష్మరోగమున శరీరమాంసంబును బలంబును క్షీయించియున్నపుడు పైజెప్పిన పదునొకండురూపములన్నియును నున్నను, లేక వానిలో నారురూపములు

మూత్ర మున్నను, తుదకు మూడులక్షణములుమాత్రము కల్గియున్నను ఆవ్యాధి మిక్కిలి యసాధ్యమగును ; కావున చికిత్స జేయంజనదు. అటుగాక శరీరమున మాంసము బలము నశించక చికిత్సకు నోరువగల్గి యున్నచో పూర్ణముగ పదునొకండు రూపములన్నియు కల్గినను చికిత్స జేయదగును. (సాధ్యమగునని భావము.)

రాజయక్ష్మరోగమునందు శరీరబలంబును మాంసమును నశింపకుండు నెడ సాధ్యమగుననియు, బలమాంసములు నశించినవాడు తక్కిన సుగుణము లెన్నియున్నను అసాధ్యంబగు ననియు ముఖ్యాభిప్రాయము. ఈవిషయము చరకమున నిట్లు చెప్పబడినది:—"వాతవ్యాధిరపస్మారీ కుష్ఠీ బ్రధ్నీ చిరజ్వరీ, గుల్మీ చ మధుమేహీచ రాజయక్ష్మీ చ యో నరః. అచికిత్స్యా భవన్త్యేతే బలమాంసపరిక్షయాత్, స్వల్పేష్వపి వికారేషు భిషగేతాన్ వివర్జయేత్" (చరక. ఇం అ. ౧) వాతవ్యాధి, అపస్మారము, కుష్ఠము, అండరోగము, చిరకాలమునుండి వ్యాపించిన జ్వరము, గుల్మము, మధుమేహము, రాజయక్ష్మము ఈరోగములన్నియు శరీరమున మాంసబలములు క్షీణించిననాడు అసాధ్యము లగు నని భావము.

### అసాధ్యరాజయక్ష్మలక్షణములు

మహాశనం క్షీయమాణమతిసారనిపీడితమ్,
శూనముష్కోదరం చైవ యక్ష్మిణం పరివర్జయేత్. 11
శుక్లాక్షమన్న ద్వేష్టారం ఊర్ధ్వశ్వాసనిపీడితమ్,
కృచ్ఛ్రేణ బహుమేహన్తం యక్ష్మా హన్తీహ మానవమ్. 12

అధికముగ భుజించినను శరీరమున పుష్టికలుగక కృశించుచున్నను, అతిసారముచే పీడితుండయినను, వృషణములయందును ఉదరమునందును వాపుకల్గినను, అట్టి రాజయక్ష్మము కలరోగిని చికిత్సచేయక విడువనగును. మరియు కన్నులు తెల్లనైయున్నను, అన్నద్వేషముకల్గినను, ఊర్ధ్వశ్వాసము ఊపిరాడక వచ్చుచున్నను, మిక్కిలి కష్టముగ నధికముగ మూత్రము వెడలుచున్నను అట్టి క్షయరోగము రోగిని తప్పక చంపును.

### సాధ్యరాజయక్ష్మలక్షణము

జ్వరానుబన్ధరహితం బలవన్తం క్రియాసహమ్,
ఉపక్రమేదాత్మవన్తం దీప్తాగ్నిమకృశం నరమ్. 13

రాజయక్ష్మరోగమున జ్వరము అనుబంధముగ లేక చికిత్సాక్రియల కోరువజాలి, శరీరమున బలము పూర్తిగనుండి, శరీరము కృశించక, జాఠరాగ్ని చక్కగ జ్వలించుచు, రోగి పథ్యముదప్పక నటించువాడై యున్నయెడ రాజయక్ష్మరోగము సాధ్యమైయుండును. కావున అట్టి రోగికి చికిత్స చేయు టుచితము.

## వ్యవాయాదిశోషపరిగణనము

వ్యవాయశోకవార్ధక్య వ్యాయామాధ్వప్రశోషితాన్,
వ్రణోరః క్షతసంజ్ఞౌ చ శోషిణౌ లక్షణైశ్శృణు. 14

తన శక్తికన్న మిక్కుటముగ స్త్రీసంభోగముచేయుట, ఇష్టవస్తు నాశాది కారణములచే గల్గినశోకము, వయోవస్థచే గల్గిన ముసలితనము, తనశక్తికి మిక్కుటముగ దేహపరిశ్రమచేయుట, అధికముగ త్రోవనడుచుట, వ్రణము అను నీకారణములచేత కల్గిన ధాతుక్షయ రూపమైన శోషలక్షణములును, ఉరఃక్షతమున గల్గిన శోషలక్షణములును (ఆయాలక్షణములు) ఈక్రింద వివరింపబడును.

మరియు పైచెప్పినశోషములయందు త్రిదోషలక్షణములు గానంబడక కొన్ని లక్షణములు మాత్రముండును. కావున నియ్యవి ధాతుక్షయ మనదగును గాని రాజయక్ష్మమని చెప్పదగదు. ఈవిషయమును సుశ్రుతాచార్యు డిట్లీరంగున నిర్ణయించెను.—"కేషాఞ్చిదేవ శోషోహి లక్షణైశ్చైదమాగతః, న తు త్రిదోషలిఙ్గానాం సమస్తానాన్ని పాతనమ్, క్షయా ఏవ హి తేజ్ఞేయాః కేవలం ధాతుసంక్షయాత్" (సు. ఉ. అ. ౪౧.)

## వ్యవాయశోషలక్షణము

వ్యవాయశోషీ శుక్రస్య క్షయలిఙ్గైరుపద్రుతః,
పాణ్డుదేహో యథాపూర్వం క్షీయన్తే చాస్య ధాతవః. 15

అధికముగ నియమములేక స్త్రీసంభోగముచేయు మనుజునకు శరీరమున ప్రధానమైన శుక్రము క్షీణించును. దానంజేసి శుక్రక్షయమునకు జెప్పిన మేఢ్రవృషణములయందు వేదనయు, బలహీనంబును, చిరకాలమునకు సంభోగసమయమున శుక్రము స్రవించుటయు మున్నగు నుపద్రవములతోఁగూడి శరీరము తెల్లనై యుండును. మరియు శుక్రక్షయముచేత తక్కిన ధాతువులన్నియు వ్యుత్క్రమముగ మజ్జ, అస్థి మేదస్సు, మాంసము, రక్తము, రసము అనుధాతువులు నానాట క్షీణించును. శుక్రక్షయమున గల్గు లక్షణములు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—"శుక్రక్షయే మేఢ్రవృషణవేదనా, అశక్తిర్మైథునే, చిరాద్వా ప్రసేకః ప్రసేకే చాల్పరక్తదర్శనమ్ రక్తస్య శుక్రస్య వా" (సు. సూ. అ. ౧౫.)

## శోక-జరా-అధ్వశోషలక్షణములు

ప్రధ్యానశీలస్స్రస్తాఙ్గః శోకశోష్యపి తాదృశః,
జరాశోషీ కృశో మన్దవీర్యబుద్ధిబలేన్ద్రియః. 16

కమ్పనో౽రుచిమాక్షా భిన్నకాంస్యపాత్రహతస్వరః,
ష్ఠీవతి శ్లేష్మణా హీనం గౌరవారతిపీడితః. 17
సంప్రస్రుతాస్యనాసాక్షిః శుష్కరూక్షమలచ్ఛవిః,
అధ్వశోషీ చ స్రస్తాఙ్గః సంభృష్టపరుషచ్ఛవిః. 18
ప్రసుప్తగాత్రావయవః శుష్కక్లోమ గలాననః.

తనమనస్సు కింపై మిక్కిలి ప్రీతిపాత్రమైన వస్తువు నశించుట మున్నగు కారణములచే శోకము కల్గును. దానంజేసి ధాతువులు క్షీణించును. అట్టిమనుజుడు తనకు శోకమును కల్గించినకారణము విషయమై యెల్లప్పుడు చింతించుచుండును. అవయవములు అన్నియు శిథిలములగును. ఇదికాక శుక్రక్షయమున జెప్పినపాండుత్వము మున్నగు లక్షణముల గూడియుండును. (ఇది శోకముచే గల్గిన ధాతుక్షయము) వయో౽వస్థచే తనంతట కల్గిన ముసలితనమువలన క్షీణించిన ధాతువులు కలవాడు జరాశోషి యనంబడును. ఈక్షయమునందు శరీరము కృశించును. వీర్యము స్వల్పమగును. బుద్ధియు బలంబును ఇంద్రియంబులును పాటవముచెడి పనులయందలసములగును. శరీరము వడవడ వడంకును. నోట రుచి మామూలుగ లేక మారును. కంఠస్వరము పగిలినకంచుపాత్రమును వాయించినచో కల్గినస్వరమువలె నుండును కఫము లేక నోట నుమియుచుండును. శరీరము బరువుగ నుండును. పనులయందుత్సాహములేక యిచ్చబొడమకుండును. నోటనుండియు నాసారంధ్రములనుండియు కన్నులనుండియు నీరు వెడలుచుండును. ఎండి రూక్షమైన మలము వెడలును. దేహకాంతి చెడును. త్రోవ నడచుటచే గల్గినక్షయమందు అవయవములు శిథిలము లగును. వేపుడుగింజవలె కర్కశమైన కాంతి కల్గియుండును. శరీరమునందలి యవయవములు స్పర్శజ్ఞానము లేకుండును. దప్పికిస్థానమైన క్లోమంబును, కుత్తుకయు, నోరును ద్రవములేక యెండును.

### వ్యాయామశోషలక్షణము

వ్యాయామశోషీ భూయిష్ఠం ఏభిరేవ సమన్వితః,
లిఙ్గైరురః క్షతకృతైః సంయుక్తశ్చ క్షతం వినా. 19

తనబలమును జూడక మిక్కుటముగ నాయాసముకల్గుపరిశ్రమము జేసినచో క్షయము కల్గును. అయ్యది వ్యాయామశోష మనబడును. ఈశోషమునందును అధ్వశోషమున జెప్పిన లక్షణములే ప్రాయికముగ నుండును. మరియు నురఃక్షతమున క్రిందజెప్పబడు లక్షణములును కల్గును. ఉరఃక్షతము మాత్రము లేకున్నను దాని లక్షణములు కల్గునని భావము.

## వ్రణశోషలక్షణము

రక్తక్షయాద్వేదనాభిస్తథైవాహారయన్త్రణాత్,
వ్రణితస్య భవేచ్ఛోషః స చాసాధ్యతమో మతః. 20

వ్రణములచే బీడింపబడినవానికి ప్రణపూర్వకముగ రక్తము పోవుచుండుట చేతను, వ్రణమునకు సంబంధించిన పోటు మున్నగు బాధలచేతను తగినయాహారము లేకుండుట చేతను, ధాతువులు క్షీణించును. ఇయ్యది వ్రణశోష మనంబరగు. ఇయ్యది మిక్కిలి యసాధ్య మగును.

## ఉరఃక్షతలక్షణము

ధనుషాఽఽయస్యతోఽత్యర్థం భారముద్వహతో గురుమ్,
యుధ్యమానస్య బలిభిః పతతో విషమోచ్చతః. 21
వృషం హయం వా ధావన్తం దమ్యం చాన్యం నిగృహ్ణతః,
శిలాకాష్ఠాశ్మనిర్ఘాతాన్ క్షిపతో నిఘ్నతః పరాన్. 22
అధీయానస్య వాత్యుచ్చైః దూరం వా ద్రవతో ద్రుతమ్,
మహానదీర్వా తరతో హయైర్వా సహ ధావతః. 23
సహసోత్పతతో దూరం తూర్ణం వాపి ప్రనృత్యతః,
తథాన్యైః కర్మభిః క్రూరైః భృశమభ్యాహతస్య వా. 24
విక్షతే వక్షసి వ్యాధిః బలవాన్ సముదీర్యతే,
స్త్రీషు చాతిప్రసక్తస్య రూక్షాల్పప్రమితాశినః. 25
ఉరో విరుజ్యతేఽత్యర్థం భిద్యతేథ విభ(రు)జ్యతే,
ప్రపీడ్యతే తతః పార్శ్వే శుష్యత్యఙ్గం ప్రవేపతే. 26
క్రమాద్వీర్యం బలం వర్ణో రుచిరగ్నిశ్చ హీయతే,
జ్వరో వ్యథా మనోదైన్యం విడ్భేదోఽగ్నివధాదపి. 27
దుష్టశ్శ్యావస్సుదుర్గన్ధః పీతో విగ్రథితో బహుః,
కాసమానస్య చాభీక్ష్ణం కఫస్సాసృక్ప్రవర్తతే. 28
స క్షతీ క్షీయతేఽత్యర్థ తథా శుక్రౌజసోః క్షయాత్,

చాలాకాలము ధనస్సుచే బాణములను బ్రయోగించుట, తనశరీరబలమున కెక్కువగ భారము మోయుట, తనబలముకన్న నెక్కుడు బలముకలవారితో మల్లయుద్ధము (కుస్తీ) చేయుట, హెచ్చుతగ్గులయిన ప్రదేశమునుండియు ఎత్తైనస్థలమునుండియు క్రిందపడుట, పరువిడుచున్న యెద్దునైనను గుఱ్ఱమునైనను ఎదురించి బలాత్కారముగ

పట్టుట, మిక్కిలి మదించినయేనుగు మున్నగు బలవత్తరము లగు జంతువుల నెదిరించి పోట్లాడుట, రాళ్లను కట్టెలను ఒడిసెల రాళ్లను విసరుట, పరులను (శత్రువులను) కొట్టుట, మిక్కిలి బిగ్గరగ చదువుట, మిక్కిలి వేగముతో చాలదూరము నడచుట, గొప్ప నదీప్రవాహములను చేతులతో నీదుట, గుఱ్ఱములతోఁగూడ పరువిడుట, చాల దూరము శీఘ్రముగ నెగిరి గంతు లిడుట, అతివేగముతో నృత్యముచేయుట, ఇవిగాక యితరములైన క్రూరములగు పనులజేయుట ఇవి మున్నగు కారణములచేత మిక్కిలి యభిఘాతము నొందినవానికి వక్షఃస్థలమున నభిఘాతము కల్గి యురఃక్షత మను వ్యాధి కల్గును. మఱియు స్త్రీలవిషయమైన ప్రేమాతిశయముచేత నధికముగ సంభోగించినను, రూక్షమైన యాహారమును భుజించినను, తనకు కావలసిన పరిమాణముకన్న మిక్కిలి తక్కువగ భుజించినను, ఉరఃక్షతవ్యాధి జనించును. ఈవ్యాధియందు రొమ్ము పగులదీసిన విధముగ నొప్పిపుట్టును. చీలదీసినవిధముగ బాధకల్గును. ఇరుప్రక్కల గట్టిగ నొత్తి పట్టినవిధముగ బాధ జనించును. అవయవములన్నియు కృశించును. శరీరము వడకును. వీర్యము, బలము, శరీరవర్ణము, కాంతి, నోట రుచి, జఠరాగ్ని ఇవియన్నియు వరుసగ నానాట బలముతగ్గి క్షీణించును. జ్వరము, మనోవ్యథ, దైన్యము, మలము ద్రవములేక ఉండలుగ నుండుట, జఠరాగ్ని నశించుట ఈలక్షణము లన్నియు కల్గును. దగ్గినపుడు మిక్కిలి దుష్టంబును శ్యామవర్ణంబును దుర్గంధంబును పీతవర్ణంబునై చిక్కనైన కఫము రక్తముతోఁగూడి నోటనుండి విశేషముగ వెడలును. ఇట్టి క్రూరమైన యురఃక్షతముచే బీడితుడగురోగి నానాట శుక్రంబును ఓజస్సును నశించి మిక్కిలి క్షీణదశ నొందును. ఈయురఃక్షత మనువ్యాధి మిక్కిలి క్రూరమై ప్రాణాంతకమై యుండును.

### ఉరఃక్షతపూర్వరూపము

అవ్యక్తలక్షణం తస్య పూర్వరూపమితి స్మృతమ్. 29

పైజెప్పిన లక్షణములు స్ఫుటముగ గానరాక సూక్ష్మములుగ నున్నయెడ అట్టి యవస్థయే ఉరఃక్షతమునకు పూర్వరూప మని యెరుంగునది.

### క్షతక్షీణసామాన్యలక్షణము

ఉరోరుక్ శోణితచ్ఛర్దిః కాసో వైశేషికః క్షతే,
క్షీణే సరక్తమూత్రత్వం పార్శ్వపృష్ఠకటీగ్రహాః. 30

ఉరఃక్షతమున రొమ్మునొప్పియు, రక్తము వాంతి, దగ్గు ఈలక్షణములు కల్గును. ఉరఃక్షతముచే క్షీణుడైనవానికి మూత్రము రక్తముతోఁగూడి వెడలును. ఇరుప్రక్కలును వీపును నడుమును బిగిపట్టినవిధముగ బాధ కలుగును. ఈరెంటికిని నిదే పరస్పర భేదము.

## క్షతక్షయసాధ్యాసాధ్యనిర్ణయము

అల్పలిఙ్గస్య దీప్తాగ్నేః సాధ్యో బలవతో నవః,
పరిసంవత్సరో యాప్యః సర్వలిఙ్గం తు వర్జయేత్. 31

జఠరాగ్ని దీప్తి కల్గియుండి శరీరబలము చక్కగా నుండువానికి పైజెప్పిన లక్షణములన్నియు లేక కొన్నిమాత్రము కల్గి జనించిన ఉరఃక్షతక్షయము సాధ్యం బగును. అయ్యది కూడ సంవత్సరకాల మతిక్రమించినచో యాప్యాంబగును. ఈ వ్యాధికి జెప్పినలక్షణములన్నియు పూర్తిగ నుండినచో నసాధ్యమగును కావున చికిత్స చేయంజనదు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
రాజయక్ష్మక్షతక్షీణనిదానం సమాప్తమ్.

# ౧౧. కాసనిదానమ్

క్షయరోగమున కాసము ప్రధానలక్షణముగ జెప్పబడినది. కాసము నపేక్షించుటచే క్షయము కల్గు నని "క్షయాయోపేక్షితాస్సర్వే" అను వాక్యముచే నేర్పడినది. కావున క్షయమునకు కాసమునకును సన్నిహితసంబంధము కల్గియుండుటవలన క్షయమును జెప్పిన పిదప కాసనిదానము చెప్పబడును.—

### కాసోత్పత్తికారణములు : కాససంప్రాప్తి

ధూమోపఘాతాద్రసతస్తథైవ
వ్యాయామరూక్షాన్న నిషేవణాచ్చ,
విమార్గగత్వాచ్చ హి భోజనస్య
వేగావరోధాత్ క్షవథోస్తథైవ. 1
ప్రాణో హ్యుదానాఽనుగతః ప్రదుష్టః
సమ్భిన్నకాంస్యస్వనతుల్యఘోషః,
నిరేతి వక్త్రాత్సహసా సదోషో
మనీషిభిః కాస ఇతి ప్రదిష్టః. 2

ధూమపానముచేయునపుడు పొగను నోటియందును ముక్కునందును ప్రవేశింపజేసి వెడలనియ్యక శ్వాసము నడ్డగించినను, శరీరమునందలి యామరసము వాతవేగముచే నూర్ధ్వముగ వ్యాపించినను, దేహపరిశ్రమము నధికముగ జేసినను, మిక్కిలి కారము గల్గి మంటబుట్టించు నాహారపదార్థమును భుజించినను, భుజించినపుడు ఆహారపదార్థము సరియైన మార్గమున బోక యితర మార్గమున బ్రవేశించినను* మలమూత్రముల వేగమును, తుమ్ములవేగమును వెడలనీయక నిరోధించినను, ప్రాణవాయువు ఉదానవాతముతోగూడి మిక్కిలి ప్రకోపమునొంది, పగిలినకంచుపాత్రమును వాయించినచో మ్రోగువిధముగ ధ్వని కల్గి, ద్రవరూపమైన కఫపిత్తముల గూడి నోటినుండి అతిశీఘ్రముగ బైటవెడలును ఇయ్యది కాసరోగ మని పండితులచే జెప్పబడినది.

ఇచ్చట "కస గతౌ" అనుధాతువువలన "కసతి(కంఠాదూర్ధ్వం గచ్ఛతి) ఇతి కాసః" అను వ్యుత్పత్తిచేత కంఠమునకు పైభాగమున వ్యాపించునది కాస మని యన్వర్థముగ జెప్పబడును.

* ఇదియే పొరపోవుట యనంబడును.

## కాసరోగభేదములు

పఞ్చ కాసాస్స్మృతా వాతపిత్తశ్లేష్మక్షతక్షయైః,
క్షయాయోపేక్షితాస్సర్వే బలినశ్చోత్తరోత్తరమ్. 3

కాసము వాతముచేతను, పిత్తముచేతను, కఫముచేతను, క్షతముచేతను, క్షయము చేతను జనించుటవలన నైదువిధములై యుండును. ఈయైదిటిలో పైపైని నొకదాని కన్న నొకటి బలిష్ఠముగ నుండును. ఈకాసములను సకాలమున దగిన చికిత్స చేయక యుపేక్షించినచో క్షయమును గల్గించును.

## కాసపూర్వరూపము

పూర్వరూపం భవేత్తేషాం శూకపూర్ణగళాస్యతా,
కణ్ఠే కణ్డూశ్చ భోజ్యానాం అవరోధశ్చ జాయతే. 4

కాసరోగము జనించుటకుముందు కుత్తుక యందును, నోటియందును ముండ్లు గ్రుచ్చిన ట్లుండును. కుత్తుకయందు దురద కల్గును. తా భుజించుపదార్థముల లోనికి జోరనీయక యడ్డగించును. ఇవియన్నియు కాసము జనించుటకుమున్నుకల్గు పూర్వ రూపములు.

కాససంప్రాప్తి చరకమున విపులముగ నిట్లు చెప్పబడినది—"అధః ప్రతిహతో వాయురూర్ధ్వస్రోతస్సమాశ్రితః, ఉదానభావమాపన్నః కణ్ఠే సక్తస్తథోరసి. ఆవిశ్య శిరసః ఖాని సర్వాణి ప్రతిపూరయన్, ఆభఞ్జన్నాక్షిపన్ దేహం హనుమన్యే తథాక్షిణీ. నేత్రే పృష్ఠమురఃపార్శ్వే నిర్భుజ్య స్తమ్భయం స్తతః, శుష్కో వా సకఫో వాపి కసనాత్కాస ఉచ్యతే." (చరక. చి అ. ౧౮. శ్లో. ౬౮) మున్ను వచించిన ధూమోపఘాతము మున్నగుకారణములచే వాతము ప్రకుపితమై యధశ్శరీరమున ప్రతిఘాతము నొంది స్రోతోమార్గమునుండి యూర్ధ్వశరీరమున వ్యాపించుచు నుదానరూపమును దాల్చి కంఠమునందును, ఉరోభాగమునందును జేరుచు పిదప శిరస్సునందలి నోరు నాసారంధ్రములు మున్నగురంధ్రముల వ్యాపించి వానినన్నింటిని నిండించుచు శరీరమును ముందుకు వంచి మాటిమాటికి కదలించుచు, తాలువులను, మెడనరములను, కన్నులను, వీపును, రొమ్మును, ఇరుప్రక్కలను వీనినన్నింటిని సంకోచింపజేసి స్తంభింపజేయుచు క్రమముగ శుష్కముగనైనను, కఫముతో కూడియైనను నోటినుండి బైటవెడలును. ఇయ్యది యూర్ధ్వముగ వ్యాపించి బైటవెడలుటంజేసి కాస మనబడును ("కస-గతౌ" అను ధాతువువలన కాస మను శబ్దము నిష్పన్నమైనది, బైటవెడలునది గాన కాసశబ్దము అన్వర్థ సంజ్ఞకలది యని భావము.)

## వాతజకాసలక్షణము

హృచ్ఛంఖమూర్ధోదరపార్శ్వశూలీ క్షామాననః క్షీణబలస్వరౌజాః,
ప్రసక్తవేగస్తు సమీరణేన భిన్నస్వరః కాసతి శుష్కమేవ. 5

వాతప్రకోపమున జనించినకాసమునందు రొమ్మునందును, కణతలయందును, శిరస్సునందును, కడుపునందును, ఇరుప్రక్కలయందును నొప్పి కలుగును ముఖము కృశతనొందును. శరీరబలంబును, కంఠస్వరంబును, ఓజస్సును క్షీణించును. ఎల్లప్పుడును కాసవేగము అనుసరించియే యుండును. కంఠస్వరము మారియుండును. కఫము లేకయే పొడిదగ్గు వెడలును. ఇట్టి లక్షణములు కల్గినది వాతజకాస మని యెరుంగునది.

పైజెప్పినరీతిగ ధూమము మున్నగువాని యభిఘాతభేదము ననుసరించి కంఠస్వరంబును వేదనలును తత్తదనుగుణముగ మారుచుండును. కావున నిచ్చట స్వరభేద మిట్టిది యని నిరూపింపక సామాన్యముగ "భిన్నస్వరః" అని చెప్పంబడినది. ఈవిషయము చరకమున:—"ప్రతిఘాతవిశేషేణ తస్య వాయోస్స్వరంహసః, వేదనాశబ్దవైషమ్యం కాసానాముపజాయతే." (చరక. చి. అ. ౧౮. శ్లో. ౯.) మరియు వాతకాసనిదానము చరకమున నిట్లు చెప్పబడినది:—"రూక్షశీతకషాయాల్ప ప్రమితానశనం స్త్రియః, వేగధారణమాయాసో వాత కాసప్రవర్తకాః." (చరక. చి. అ. ౧౮. శ్లో. ౧౦.) రూక్షంబును, గుణవీర్యములచే శీతంబును, కషాయ రసంబును నగు పదార్థముల భుజించినను, తాను భుజింపవలసిన పరిమితికన్న స్వల్పముగ భుజించినను, లేక బొత్తుగ భుజించక యుపవాసమున్నను, తనబలమున కెక్కువగ స్త్రీసంభోగము చేసినను, మలమూత్రాది వేగముల నిరోధించినను, శరీరమున కాయాసమును గల్గించుపనుల జేసినను, వాతము ప్రకోపమునొంది కాసము (దగ్గు)ను గల్గించును.

మరియు నీవాతకాసమునందు కఫము తడిలేక యెండి కుత్తుకయందే చిక్కి యుండుటంజేసి శుష్కకాసము (పొడిదగ్గు) వెడలును. అట్లు ఎండిన కఫము కాసవేగమునంజేసి కష్టముచే బైటవెడలినప్పుడు దగ్గు కొంచెము తగ్గును. ఈవిషయము చరకమున "శుష్కకాసః కఫం శుష్కం కృచ్ఛ్రాన్ముక్త్వాల్పతాం వ్రజేత్." (చరక. చి. అ. ౧౮. శ్లో. ౧౨) అనువాక్యముచే జెప్పబడినది. మరియు నుపశయానుపశయములు చరకమున నిట్లు చెప్పబడినవి:—"స్నిగ్ధామ్లలవణోష్ణైశ్చ భుక్తమాత్రే (పీతైః) ప్రశామ్యతి, ఊర్ధ్వవాతస్య జీర్ణేఽన్నే వేగవాన్ మారుతో భవేత్" చరక. చి. అ. ౧౮. శ్లో. ౧౩) జిడ్డుకల్గిన పదార్థములను, పులుపు కల పదార్థములను, ఉప్పుగలపదార్థములను ఉష్ణగుణ వీర్యములు కల పదార్థములను భుజించినప్పుడును; భోజనము తృప్తిగ జేసినవెంబడిని వాతముచే జనించినకాసము శమించును.

(ఇది యుపశయము.) ఆహారము జీర్ణించినతోడనే మరల వాతము తనవేగమును జూపుట దగ్గను రేపెట్టును. (ఇదియ అనుపశయము.)

## పైత్తికకాసలక్షణము

ఉరోవిదాహజ్వరవక్త్రశోషైః అభ్యర్దిత స్తిక్తముఖ స్తృషార్తః,
పిత్తేన పీతాని వమేత్కటూని కాసేత్సపాణ్డుః పరిదహ్యమానః. 6

పిత్తముచే జనించిన కాసమునందు రొమ్మున మంట పుట్టును, జ్వరము వచ్చును, నోరెండును, చేదుగ నుండును, దప్పి యధికమగును, పచ్చనిరంగు కల్గి చేదుగనుండు పసరు వాంతియగును. శరీరము తెల్లనై మంటపుట్టును. ఇట్టిలక్షణములు కల్గి పుట్టిన కాసము పిత్తముచే జనించిన దని యెఱుంగునది.

పైజెప్పిన లక్షణములు కాక కన్నులు పచ్చనగుట, కంఠస్వరము మారుట, రొమ్మున పొగవెడలునట్లు వేదనగల్గుట, మూర్ఛ, భ్రమము, దగ్గునపుడు కండ్లు బూచులు గ్రమ్మినట్లుండుట, పిత్తపసరుతోగూడిన కఫము వెడలుట గాలక్షణములును కల్గు నని చరకమున జెప్పబడెను.

మరియు పిత్తకాసనిదానము చరకమున నిత్తెరంగున చెప్పబడినది:—"కటుకోష్ణ విదాహ్యమ్లక్షారాణామతి సేవనం, పిత్తకాసకరం క్రోధః సన్తాపశ్చాగ్ని సూర్యజః" కారముగల పదార్థముల నైనను, వీర్యగుణములచే నుష్ణములగు పదార్థములనైనను, మంటబుట్టించు పదార్థములనైనను, పులుపుకలపదార్థములనైనను, యవక్షారము మున్నగు క్షారములనైనను విశేషముగ నుపయోగించినను, కోపపడినను, నిప్పుయొక్కయు సూర్యునియొక్కయు వేడిమిలో నున్నను పిత్తము ప్రకోపించి కాసమును కల్గించును.

## శ్లైష్మికకాసలక్షణము

ప్రలిప్యమానేన ముఖేన సీదన్ శిరోరుజార్తః కఫపూర్ణదేహః,
అభక్తరుగ్గౌరవకణ్డుయుక్తః కాసేద్భృశం సాన్ద్రకఫః కఫేన. 7

కఫప్రకోపముచే గల్గినకాసమునందు నోరు జిగటగ నుండును. తల నొప్పి పుట్టును. శరీరమునందెల్ల కఫము నిండియుండును. నోటికి అన్నము రుచింపదు. అవయవములన్నియు భారముగ పనులయందు దలసము లగును. శరీరమున జిలపుట్టును. దగ్గి నప్పుడు చిక్కనైనకఫము నోటవెడలును.

మరియు నీకఫకాసమున జాఠరాగ్ని మందగించును. వాంతియగును. పడిశెముపట్టి నాసారంధ్రములు బిగదీసిన ట్లుండును. ఓకిరింతలు విశేషముగ వచ్చును.

శరీరమున పులకలు కలుగును. నోరు తీపికల్గియుండును తీపికల్గి స్నిగ్ధమై గట్టిగనుండు కఫము దగ్గినపుడు విశేషముగ బైటవెడలును. దగ్గువచ్చునపుడు రొమ్మున కఫమునిండి యుండుటచే భారమై మిక్కిలి నొప్పిపుట్టును. ఈలక్షణములన్నియు చరకమున జూపబడినవి. మరియు కఫజకాసము జనించుకారణములు చరకమున నిట్లు చెప్పబడినవి.—
"గుర్వభిష్యన్దిమధురస్నిగ్ధస్వప్నాఽవిచేష్టనైః, వృద్ధశ్లేష్మాఽనిలం రుద్ధ్వా కఫకాసం కరోతిహి." చిరకాలమునకు జీర్ణించు పదార్థములనైనను, స్రోతోరంధ్రముల ద్రవమును బుట్టించు పదార్థములనైనను, తీపికల పదార్థములనైనను, జిడ్డు విశేషముగగల పదార్థములనైనను భుజించుట, పవటియందు నిదురించుట, ఏవిధమైనపనియులేక కదలకుండ కూర్చొని యుండుట ఈకారణములచేత కఫము ప్రకోపమునంది శరీరమున సంచరించు వాతము యొక్కమార్గమును అడ్డగించి దగ్గును కల్గించును. ఇదియ కఫజకాస మనబడును.

## క్షతజకాసలక్షణము

అతివ్యవాయభారాధ్వయుద్ధాశ్వగజవిగ్రహైః,
రూక్షస్యోరఃక్షతం వాయుః గృహీత్వా కాసమాచరేత్. 8
స పూర్వం కాసతే శుష్కం తతష్ఠీవేత్సశోణితమ్,
కణ్ఠేన రుజతాఽత్యర్థం విరుగ్ణేనేవ చోరసా. 9
సూచీభిరివ తీక్ష్ణాభిస్తుద్యమానేన శూలినా,
దుఃఖస్పర్శేన శూలేన భేదపీడాభితాపినా. 10
పర్వభేదజ్వరశ్వాసతృష్ణావైస్వర్యపీడితః,
పారావత ఇవా కూజన్ కాసవేగాత్ క్షతోద్భవాత్. 11

శరీరమున జిడ్డు విశేషముగ లేక రూక్షమై యుండువాడు స్త్రీసంభోగము నధికముగ జేసినను, తనబలమునకన్న నధికముగ భారమును మోసినను, విశేషముగ త్రోవనడచినను, మల్లయుద్ధముచేసినను, గుఱ్ఱములను ఏనుగులను నిగ్రహించి వానితో పోట్లాడినను, హృదయమున నభిఘాతముకల్గి పుండగును. దానంజేసి వాతము ప్రకోపించి దగ్గును కల్గించును. అట్టిమనుజునకు తొలుత పొడిదగ్గుకల్గి పిమ్మట యెండినకఫము రక్తముతోగూడి నోటవెడలును. కంఠమునందు మిక్కుటముగ నోరువరాని నొప్పి కల్గును. రొమ్ము పగుల దీయునట్లు నొప్పిపుట్టును. మిక్కిలి వాడికల సూదులతో బొడిచిన విధముగ నొప్పియు, చేత స్పృశించినను నోరువజాలక పగులగొట్టినవిధముగ బాధయు రొమ్మున కల్గును. కీళ్లలో నొప్పికల్గును. జ్వరము శ్వాసము దప్పియు గల్గును. కంఠము స్వరము మారియుండును. కాసముయొక్క వేగమున నోరువజాలక గొంతులో పావుర

ములు కూసినట్లు కూతలు పుట్టును. ఇట్టి లక్షణములు కల్గినది క్షతజకాస మని యెఱుంగునది.

## క్షయకాసనిదానము

విషమాసాత్మ్యభోజ్యాతివ్యవాయాద్వేగనిగ్రహాత్,
ఘృణినాం శోచతాం నృణాం వ్యాపన్నేఽగ్నౌ త్రయో మలాః,
కుపితాః క్షయజం కాసం కుర్యుర్దేహక్షయప్రదమ్. 12

తాను భుజించుపరిమితికన్న న్యూనాధికములుగ భుజించినను, అకాలమున భుజించినను, తనశరీరతత్త్వమున కిముడని పదార్థముల భుజించినను, అధికముగ సంభోగము జేసినను, మలమూత్రాదివేగముల నిరోధించినను, మిక్కిలి కరుణకల్గి యుండుటం జేసి యొరులకష్టముల జూచి దుఃఖించుచున్నను జఠరాగ్ని మందగించి, వాతపిత్తకఫములు మూడును సమకాలమున ప్రకోపమునొంది, రసరక్తాదిధాతువులను క్షీణింపజేయును. దానంచేసి కాసము జనించును. దీనిచేత శరీరము మిక్కిలి క్షీణించును. ఇయ్యది క్షయజకాస మని చెప్పంబడును.

## క్షయకాసలక్షణము

సగాత్రశూలజ్వరదాహమోహాన్
ప్రాణక్షయం చోపలభేత కాసీ,
శుష్యన్వినిష్ఠీవతి దుర్బలస్తు
ప్రక్షీణమాంసో రుధిరం సపూయమ్,
తం సర్వలిఙ్గం భృశదుశ్చికిత్స్యం
చికిత్సితజ్ఞాః క్షయజం వదన్తి. 13

క్షయకాసమునందు శరీరమునందెల్ల నొప్పిపుట్టును. జ్వరము గల్గును. శరీరము మంటపుట్టును. మూర్ఛవచ్చును. శరీరబలము నానాట నశించును. రక్తమాంసము నానాట నశించును. ఇత్తెరంగున శరీరబలము మాంసము నశించి చీముతో గూడిన రక్తమును నోట వెడలించును. ఇట్టి క్షయకాసము త్రిదోషలక్షణములతో గూడి యుండును. కావున మిక్కిలి కష్టసాధ్యమై యుండు నని చికిత్సాపద్ధతి నెరింగిన పండితులు వచించెదరు.

## సాధ్యాసాధ్యకాసములు

ఇత్యేష క్షయజః కాసః క్షీణానాం దేహనాశనః,
సాధ్యో బలవతాం వా స్యాత్ యాప్యస్త్వేవం క్షతోత్థితః. 14

నవా కదాచిత్సిధ్యేతాం అపి పాదగుణాన్వితౌ,
స్థవిరాణాం జరాకాసః సర్వో యాప్యః ప్రకీర్తితః, [పయేత్.
త్రీన్ పూర్వాన్ సాధయేత్సాధ్యాన్,పథ్యైర్యాప్యాంస్తు యా

పైజెప్పబడిన క్షయకాసము శరీరమున రక్తమాంసములు క్షీణించియున్నచో నసాధ్యమై మరణము నొందించును. అటుగాక శరీరబలము పుష్టిగనుండి రసాది ధాతువులు క్షీణించకుండునపుడు ఒకసమయమున సాధ్యమైయుండును. క్షతముచే గల్గిన కాసము యాప్యంబగును. పైజెప్పబడిన రెండుకాసములు జనించినతోడనే కొలదికాలములో చికిత్సజేసినచో నొకసమయమున సాధ్యములగును. అట్టియెడ వైద్యుడు, ఔషధద్రవ్యములు, పరిచారకుడు, గుణవంతుడైనరోగి అను నీపాద చతుష్టయసంపత్తి కల్గియుండవలెను. మరియు ముసలివారికి వయోభేదముచే గల్గిన కాసము ఎట్టిదైనను యాప్యమగును కాని సాధ్యము కానోపదు. అందు తొలుత జెప్పిన వాత-పిత్త-కఫ కాసములు మాత్రము సాధ్యములు కావున వానికి తగిన చికిత్స జేసినచో నివర్తించును. తక్కిన మూడును యాప్యములు కావున వ్యాధికిని శరీర ప్రకృతికిని దగిన పథ్యాహార విహారాదులచే నుపచరించుచు జీవితకాలమువరకును కాలముగడుప నగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
కాసనిదానం సమాప్తమ్.

# ౧౨. హిక్కాశ్వాసనిదానమ్

"హిక్కాశ్వాసశ్చ కాసశ్చ నృణాం సముపజాయతే" అని హిక్కాశ్వాసము లకును కాసమునకును నిదానము ప్రాయికముగ సమానంబై యుండును. కావున కాసము ను నిరూపించిన పిదప హిక్కాశ్వాసముల నిదానము చెప్పబడును.

హిక్కాశ్వాసములు జనించుకారణములు

విదాహిగురువిష్టమ్భిరూక్షాభిష్యన్దిభోజనైః,
శీతపానాశనస్థానరజోధూమాతపానిలైః. 1
వ్యాయామకర్మభారాధ్వవేగాఘాతాపతర్పణైః,
హిక్కా శ్వాసశ్చ కాసశ్చ నృణాం సముపజాయతే. 2

నోట మంటబుట్టించు మిరపకాయలు మున్నగువానిని మద్యమును సేవించుట, చిరకాలమునకు జీర్ణించుగుణముకల పదార్థములను, మలమును బంధించు పదార్థములను, జిడ్డులేని పదార్థములను, నాసాదిరంధ్రములయందు ద్రవమును బుట్టించు పదార్థములను భుజించుట, చల్లనినీళ్లు మున్నగువానిని త్రాగుట, చల్లనైన పదార్థములను భుజించుట, శీతప్రదేశముల నివసించుట, ధూళియైనను పొగయైనను నాసారంధ్రాది మార్గమున బ్రవేశించుట, ఎండయందైనను గాలియందైనను సంచరించుట, దేహపరిశ్రమము నధికముగ జేయుట, భారమును మోయుట, త్రోవనడచుట, మలమూత్రాదివేగముల నిరోధించుట, ఆహారము భుజించక యుపవాసముండుట, ఈ కారణములచేత ఎక్కిళ్లును, శ్వాసంబును, కాసంబును మనుజులకు జనించును.

పైజెప్పిన హిక్కాశ్వాసములకును కాసమునకును కారణములు సమానములు. అయినను కాసము వాతపిత్తకఫములచే వేర్వేరుగ జనించును. హిక్కాశ్వాసములు కఫముతో గూడినవాతములచే జనించును. కావున పరస్పరభేదము కలుగునది. ఈవిషయము "వాయుః కఫేనానుగతః పఞ్చ హిక్కాః కరోతి హి" (సు. ఉ. అ. ౫౧) అను సుశ్రుతవాక్యముచేతను; "కఫవాతాత్మకావేతౌ పిత్తస్థానసముద్భవౌ" (చర. చి. అ. ౧౭. శ్లో. ౮.) అను చరకవాక్యమునను దెలియుచున్నది. కావుననే కాసనిదానము ప్రత్యేకముగ జెప్పబడినది.

## హిక్కాసంప్రాప్తి

ముహుర్ముహుర్వాయురుదేతి సస్వనో
యకృత్ప్లీహాన్త్రాణి ముఖాదివాక్షిపన్,
సఘోషవానాశు హినస్త్యసూన్యత
స్తతస్తు హిక్కేత్యభిధీయతే బుధైః. 3

కంఠస్థానముననుండు ఉదానవాతముతోఁగూడిన ప్రాణవాతము ధ్వనితోఁగూడి యకృత్తును ప్లీహములను ఆంత్రములను బైటవెడలించుచుమాడ్కి కదలింపుచు 'హిక్, హిక్.' అను శబ్దముతోఁగూడి మాటిమాటికి నోటినుండి బైటవెడలును. ఇయ్యది ప్రాణముల హింసించుటంజేసి హిక్క యని మునివరులచే నన్వర్థముగ జెప్పబడినది. ("హిసి-హింసాయాం" అను ధాతువునుండి. "హినస్తిహిక్కా" అను వ్యుత్పత్తిచేత ప్రాణముల హింసించునదియని యర్థము. కొందరు "కై గై-శబ్దే" అను ధన్యర్థకమైన కైయను ధాతువునకు "హిక్ ఇతి, కాయత ఇతి హిక్కా" అను వ్యుత్పత్తిచేత, హిక్కని ధ్వనిని కల్గించునది యని యర్థముచేసెదరు.)

మరియు హిక్కాసంప్రాప్తి చరకమున నిట్లు చెప్పబడినది:—"మారుతః ప్రాణవాహిని స్రోతాంస్యావిశ్య కుప్యతి, ఉరస్థః కఫముద్ధూయ హిక్కాశ్వాసాన్ కరోతిసః. ఘోరాన్ ప్రాణోపరోధాయ ప్రాణినాం పఞ్చ పఞ్చ చ" (చరక. చి. అ. ౧౩. శ్లో. ౧౭) వాతము ప్రాణములవహించు స్రోతస్సులఁజేరి ప్రకోపమునొంది ఉరస్థానమునఁజేరి కఫము నెగరగొట్టి ప్రాణాంతకములైన శ్వాసములను హిక్కల (వెక్కిళ్ళ)ను కల్గించును. అయ్యవి ప్రత్యేకముగ నైదేసివిధములై యుండును.

మరియు హిక్కాశ్వాసములు జనించుటకు కొన్నికారణములు చరకమున నిట్లు చెప్పబడినవి:—వ్యాయామము, అతిసంగమము, విషమాశనము, ఆమదోషము, కడుపుబ్బరము, బలహీనము, కణతలు మున్నగు మర్మస్థలములయం దభిఘాతము, వమన విరేచన రూపములగు శోధన చికిత్సల విశేషముగ జేసికొనుట, ఈ కారణములచేతఁగూడ హిక్కాశ్వాసములు జనించును. ఇవిగాక కొన్నిరోగములచేత శ్వాసహిక్కలు కల్గునని చరకమున నిట్లు చెప్పబడినది:—"అతిసారజ్వర చ్ఛర్దిప్రతిశ్యాయక్షతక్షయాత్, రక్తపిత్తాదుదావర్తా ద్విసూచ్యలసకాదపి. పాణ్డురోగాద్విషాచ్చైవ ప్రవర్తేతే గదావిమౌ" (చరక. చి. అ. ౧౭. శ్లో. ౧౩) అతిసారము, జ్వరము, వమనము, పీనసము, ఉరఃక్షతము, క్షయము, రక్తపిత్తము, ఉదావర్తము, విసూచి, అలసకము, పాండురోగము, విషము అను నీరోగములచేతఁగూడ హిక్కాశ్వాసములు జనించును.

మరియు నీవ్యాధులు జనించుటకు వాతకఫములు కారణములు. వాని ప్రకోప కారణములు చరకమున నిట్లుపదేశింపబడినవి.— "నిష్పావమాషపిణ్యాకతిలతైల నిషేవణాత్, పిష్టశాలూకవిష్టమ్భివిదాహిగురుభోజనాత్. జలజానూపపిశితదధ్యామ క్షీరసేవనాత్, అభిష్యన్ద్యుపచారాచ్చ శ్లేష్మలానాఞ్చ సేవనాత్: కణ్ఠోరసోః ప్రతీఘాతాత్ విబన్ధైశ్చ పృథగ్విధైః, మారుతః ప్రాణవాహీని స్రోతాంస్యావిశ్య కుప్యతి." (చరక. చి. అ. ౧౭. శ్లో. ౧౪, ౧౬) అనుములను, ఉద్దులను, తెలకపిండిని, నువ్వులనూనెను వీనిని విశేషముగ సేవించినను, పిండితో జేయబడిన భక్ష్యాదులను, తామర మొదలగువానిదుంపలను, మలమును బంధించు పదార్థములను, మంట బుట్టించు పదార్థములను, చిరకాలమునకు జీర్ణంబగు పదార్థములను, జలమున బుట్టిన మత్స్యాదులమాంసమును జలప్రాంతమున జనించిన జంతువుల మాంసమును, పెరుగును పచ్చిపాలను సేవించినను, స్రోతస్సుల ద్రవమునుబుట్టించు నుపచారముల చేసికొనినను, కఫమును వృద్ధినొందించు పదార్థములు సేవించినను, కంఠమునందును ఉరస్సునందును అభిఘాతము కల్గినను వాతము ప్రకోపించి ప్రాణవహములగు స్రోతస్సుల వ్యాపించి హిక్కాశ్వాసముల కల్గించు నని యర్థము.

ఈవ్యాధులు రెండును పైజెప్పినరీతి నతిసార జ్వరాదిరోగములయందే కాక రోగసామాన్యములచే పీడితులగువారికిని అంతమున జనించును. కావున నీ రెండు వ్యాధులు రోగసాధారణములై మిథ్యోపచారములంజేసి సర్పములంబోలె మిగుల క్రూరములై యుండును. ఈవిషయము చరకమున నిట్లు నిర్దేశింపబడినది:— "అన్యైరప్యుపసృష్టస్య రోగైర్జన్తోః పృథగ్విధైః, అన్తే సఞ్జాయతే హిక్కాశ్వాసో వా తీవ్రవేదనః..................తస్మాత్సాధారణావేతౌ మతౌ పరమ దుర్జయౌ మిథ్యోపచరితౌ క్రుద్ధౌ హాత ఆశీవిషావివ" (చరక. చి. అ. ౧౭. శ్లో. ౭౮) (ఇచ్చట 'హాతః' అనునది హనధాతువుకు లట్, ద్వివచనరూపము.)

## హిక్కా భేదములు

అన్నజాం యమలాం క్షుద్రాం గమ్భీరాం మహతీం తథా,
వాయుః కఫేనానుగతః పఞ్చ హిక్కాః కరోతి హి. 4

వాతము ప్రకుపితమై కఫముతోగూడి యైదుతెరంగులగు హిక్కావ్యాధిని కల్గించును. అయ్యవి అన్నజ (ఆహార వైపరీత్యమున గల్గినది), యమళ (జంటగ వచ్చునది), క్షుద్ర (మంద్రవేగము కల్గినది), గంభీర (నాభినుండి వేగముతో వచ్చునది), మహతి (మర్మస్థానముల బాధించుచు కల్గినది) అనునవి.

## హిక్కా-పూర్వరూపములు

కంఠోరసోర్గురుత్వం చ వదనస్య కషాయతా,
హిక్కానాం పూర్వరూపాణి కుక్షేరాటోప ఏవ చ. 5

హిక్కా-వ్యాధి కల్గుటకుమున్ను కంఠమునందును రొమ్మునందును బరువుగ నుండును. నోరు వగరై యుండును. కడుపులో గుడగుడ యనుశబ్దముతోకూడి గడబిడగా నుండును. ఇవి హిక్కా-వ్యాధి కల్గుటకు మున్ను జనించు పూర్వరూపములు.

## అన్నజహిక్కా-లక్షణములు

పానాన్నై రతిసంయుక్తైస్సహసా పీడితోఽనిలః,
హిక్కయత్యూర్ధ్వగో భూత్వా తాం విద్యాదన్నజాం భిషక్.6

వెక్కసముగ నన్నపానముల భుజించినచో శీఘ్రముగ వాతము పీడితమై యూర్ధ్వభాగమునజేరి ఎక్కిళ్లను కల్గించును. అయ్యది అన్నజహిక్క యని చెప్ప నగును.

మరియు నీహిక్క తక్కినహిక్కలవలె మర్మస్థానములను చక్షురాదీంద్రియ ములను బాధింపజాలదు. సామాన్యముగ నుదకమును ద్రావినను సూక్ష్మముగ నాహారము జేసినను శీఘ్రముగ సులభముగ శాంతినొందును. ఈవిషయము చరకమున నిట్లు చెప్ప బడినది:—"న మర్మబాధాజననీ నేన్ద్రియాణాం ప్రమాథినీ, హిక్కా పీతే తథా భుక్తే శమం యాతి చ సాన్నజా." (చరక. చి. అ. ౧౮. శ్లో. ౪౧.)

## యమళహిక్కా లక్షణము

చిరేణ యమళైర్వేగై ర్యా హిక్కా సమ్ప్రవర్తతే,
కమ్పయన్తీ శిరోగ్రీవాం యమలాం తాం వినిర్దిశేత్. 7

రెండేసి జంటజంటగ బైలుదేరి శిరస్సును కంఠమును కుదిలించినట్లు కదలింపుచు చాలాకాలమువరకును వేగమును ఎడతెంపిలేక వ్యాపించి బాధించునది యమళహిక్క యనబడును.

ఈయమళహిక్కను వ్యపేత యని నామాంతరముచే దానిలక్షణ మిట్లు చరకమున చెప్పబడినది:—"వ్యపేతా జాయతే హిక్కా యాన్నపానే చతుర్విధే, ఆహార పరిణామాంతే భూయశ్చ లభతే బలమ్, ప్రలాపవమ్యతీసారతృష్ణార్తస్య విచేతసః, సజృమ్భస్య ప్లుతాక్షస్య శుష్కాస్యస్య వినామినః. పర్యాధ్మాతస్య హిక్కా యా జత్రుమూలాదసన్నతా, సా వ్యపేతేతి విజ్ఞేయా హిక్కా ప్రాణోపరోధినీ" (చరక. చి. అ. ౧౭. శ్లో. ౩౧-౩౩) భక్ష్యము, భోజ్యము, చోష్యము, లేహ్యాము వను నాలుగువిధము లైన యన్నములును, పానములును జేసినపిదప నాయాహార

ములు జీర్ణించుసమయముల మిక్కిలి బలమునొంది వ్యాపించునది వ్యపేత యనబడును. ఈహిక్కయందు ప్రలాపము, వాంతి, అతిసారము, దప్పి, భ్రమగప్పుట, ఒడలి విరుపు, కన్నుల నీరుగ్రమ్ముట, నోరెండుట, ఒడలు వంగుట, కడుపుబ్బరము ఇట్టి లక్షణములతోఁగూడి కంఠమూలము నుండి యెడలేక రెండేసి జంటగ వెక్కిళ్లు వచ్చును. ఇయ్యది వ్యపేత యను హిక్క యని యెఱుంగునది. ఇయ్యది ప్రాణమును చాల బాధింపసాగును.

### క్షుద్రహిక్కాలక్షణము

వికృష్టకాలైర్యా వేగైర్మన్దైస్సమభివర్తతే,
క్షుద్రికా నామ సా హిక్కా జత్రుమూలాత్ప్రధావితా. 8

మందవేగముతో కంఠమూలమున జనించి బైలువెడలి చాలకాలమునకు వేగమును జూపుచు వెడలిన హిక్క క్షుద్రహిక్క యని చెప్పనగును.

ఈక్షుద్రహిక్క దేహపరిశ్రమము చేత క్షుద్రవాతము అభిఘాతమునొంది కంఠప్రదేశమున జేరుటచే గల్గును. ఇయ్యది మహాహిక్కవలె శిరస్సును మర్మస్థానములను బాధించి ఉచ్ఛ్వాసమును అన్నపానములను నిరోధింపదు. శరీరమున శ్రాయాసమును గల్గించు పనిని జేసినపుడు వృద్ధినొందును. తగినయాహారమును జేసినపుడు శమించును. ఏస్థలమున పుట్టునో అచ్చటనే శమించును.

### గంభీరహిక్కాలక్షణము

నాభిప్రవృత్తా యా హిక్కా ఘోరా గమ్భీరనాదినీ,
అనేకోపద్రవవతీ గమ్భీరా నామ సా స్మృతా. 9

నాభిస్థానమునుండి తీవ్రమైన ధ్వనితోఁగూడి పలువిధములైన యుపద్రవములు గలిగి బొడ్డువద్దనుండి మిక్కిలివేగముతో వెడలినహిక్క గంభీరహిక్క యనబడును.

మరియు నీహిక్కయందు అవయవములన్నియు వణకును. కాళ్లుసేతులు లాగును. శరీరబలంబును ప్రజ్ఞయు నశించును. ఉచ్ఛ్వాసవాతమును అడ్డగించును. ఇయ్యది "నాభేః పక్వాశయాద్వాపి హిక్కా చాస్యోపజాయతే" (చరక. చి. అ. ౧౭. శ్లో. ౭౯) అని చరకమునయున్నది కావున నాభిస్థానమునుండియైన, పక్వాశయమున నుండి యైనను కల్గు నని తెలియునది.

### మహాహిక్కాలక్షణము

మర్మాణ్యుత్పీడయన్తీవ సతతం యా ప్రవర్తతే,
మహాహిక్కేతి సా జ్ఞేయా సర్వగాత్రవికమ్పినీ. 10

హృదయము మున్నగు మర్మస్థానములను బాధించుచు శరీరమునెల్ల వడవడవణకింపుచు ఎడతెగక నిరంతరముగ వెడలునది మహాహిక్క యని చెప్పబడును.

మహాహిక్కాలక్షణము చరకమున విస్తరముగ నిట్లు చెప్పబడినది:—"క్షీణమాంస బలప్రాణ తేజసస్సకఫోఽనిలః,గృహీత్వా సహసా కణ్ఠం ఉచ్చైర్ఘోషవతీం భృశమ్. కరోతి సతతం హిక్కామేకద్విత్రిగుణాం తథా, ప్రాణస్రోతాంసి మర్మాణి సంరుధ్యోష్మాణ మేవ చ. సంజ్ఞాం ముష్ణాతి గాత్రాణాం స్తమ్భం సఞ్జనయత్యపి, మార్గఞ్చైవాన్నపానానాం రుణద్ధ్యుపహతస్మృతేః. సాశ్రు నిప్లుతనేత్రస్య స్తబ్ధశఙ్ఖచ్యుతభ్రువః. సక్తజల్ప ప్రలాపస్య నిర్వృతిం నాధిగచ్ఛతః. మహాతేజా మహావేగా మహాశబ్దా మహాబలా, మహాహిక్కేతి సాన్యూణాం సద్యఃప్రాణహరా మతా." (చరక-చి. అ. ౧౭. శ్లో. ౨౨ ౨౬) శరీరమునందలి మాంసము బలము సత్తువ తేజంబును క్షీణించినవానికి కఫముతోఁగూడిన వాతము ప్రకుపితమై కంఠమును పట్టి ప్రాణవహంబులగు నాడులను మర్మస్థానములను శరీరమునందలి కాయాగ్నిని నిరోధించి మిక్కిలి బిగ్గరగ ధ్వనించుచు ఒక్కొక్కటి లేక రెండేసి మూడేసి ఎక్కిళ్లు వరుసగ నెడతెగక వెడలును. దీనివలన ప్రజ్ఞ తప్పును. శరీరము స్తంభించును. అన్నపానముల లోనికిఁజేర్చు మార్గములను అడ్డగించును. కన్నుల నీరుగ్రమ్మును. కణతను స్తంభించును. కనుబొమలు బిగిచెడి సడలిపోవును. నోరుపట్టుకొని మాటదెలియక అవ్యక్తముగ వదరుచుండును. అట్టిరోగి కొకప్పుడును సుఖము లేశమాత్రమైనను కలుగదు. అట్టిహిక్క మిక్కిలి తీవ్రమైనవేగము గల్గి బలిష్ఠమై ప్రబలమైనశబ్దముతో గూడి వెడలును గానంజేసి యియ్యది మహాహిక్క యని మునివరులచే జెప్పఁనంబడినది. ప్రాణముల నతితీవ్రముగ హింసించి రోగిని తటాలున చంపును. (ఇచ్చట "ఏకద్విత్రిగుణాం" అనునది యుపలక్షణము కావున ఈసంఖ్యకు మిక్కుటముగ ననేకములుగూడ గుంపులుగుంపులుగ వెడలునని యెఱుంగునది.) యమళహిక్కయందును ఈలక్షణములే గానవచ్చినను దానికన్న నిది మిక్కిలి క్రూర మని భేదము గానబడును.

## అసాధ్యహిక్కాలక్షణము

ఆయమ్యతే హిక్కతో యస్య దేహః
దృష్టిశ్చోర్ధ్వం నామతే యస్య నిత్యమ్,
క్షీణోఽన్నద్విట్ క్షౌతి యశ్చాతిమాత్రం
తౌ ద్వౌ చాన్త్యౌ వర్జయేద్ధిక్కమానౌ. ॥

ఎక్కిళ్లు వచ్చుసమయమున శరీరములాగుచు నిలువుచూపులుబడి ఎక్కిళ్లవేగము చేత శరీరమువంగునో, రసరక్తాదిధాతువులు క్షీణించి అన్నద్వేషము పుట్టి పలుమారు

తుమ్ముచుండునో, అట్టి ఎక్కిళ్లు నివర్తి కానోపదు. పైజెప్పబడిన హిక్కలైదిటిలో తొల్లింటి అన్నజ-యమళ-క్షుద్రహిక్కల మూటియందును పైజెప్పిన లక్షణములు కల్గినయెడ నవిమూడును అసాధ్యములు. కడపటి గంభీరమహాహిక్కలు రెండును స్వభావము చేతనే అసాధ్యములు.

అతిసఞ్చితదోషస్య భక్తచ్ఛేదకృశస్య చ,
వ్యాధిభిః క్షీణదేహస్య వృద్ధస్యాఽతివ్యవాయినః. 12
ఆసాం యా సా సముత్పన్నా హిక్కా హన్త్యాశు జీవితమ్,
యమికా చ ప్రలాపార్తిమోహతృష్ణాసమన్వితా. 13

దోషము మిక్కిలి చేరియున్నవానికిని, అన్నద్వేషముచే కృశించినవానికిని వ్యాధులచే కృశతనొందినవానికిని, ముసలివానికిని, మిక్కుటముగ సంభోగము చేయువానికిని, పైజెప్పినహిక్కలలో నేదికల్గినను శీఘ్రముగ చంపును. యమళ హిక్కయందు ప్రలాపమును, బాధయు, మూర్ఛయు, దప్పియు కల్గినయెడ నదియు నసాధ్యమగును.

అక్షీణశ్చాప్యదీనశ్చ స్థిరధాత్విన్ద్రియశ్చ యః,
తస్య సాధయితుం శక్యా యమికా హన్త్యతోఽన్యథా. 14

యమళ యనుహిక్కయందు శరీరముకృశించక దీనభావమునందక రసాదిధాతువులును చక్షురాదీంద్రియములును బలముసెడక సరియైన స్థితి నుండినచో నయ్యది సాధింపం దగియుండును. అటుగాక శరీరముకృశించి దీనతనొంది ధాతువులును ఇంద్రియములును పటుత్వముసెడియున్నచో యమళహిక్క యసాధ్యమగును.

## శ్వాసభేదములు

మహోర్ధ్వచ్ఛిన్న తమకక్షుద్ర భేదైస్తు పఞ్చధా,
భిద్యతే స మహావ్యాధిః శ్వాస ఏకో విశేషతః
(వాతాధికో భవేత్ క్షుద్రః తమకస్తు కఫోద్భవః,
కఫవాతాధికశ్చైవ సంసృష్టశ్ఛిన్నసంజ్ఞికః,
శ్వాసో మారుతసంసృష్టో మహానూర్ధ్వస్తతో మతః.)

శ్వాసవ్యాధి మహాశ్వాసము, ఊర్ధ్వశ్వాసము, ఛిన్నశ్వాసము, తమకశ్వాసము, క్షుద్రశ్వాసము, నని యైదువిధముల భేదించును. అందు వాతం బధికముగనుండునది క్షుద్రశ్వాసము కఫం బధికముగ నున్నది తమకశ్వాసము, కఫవాతములు రెండు నధికములుగనుండి జనించునది ఛిన్నశ్వాసము, వాతముచే సంసృష్టమైనది మహాశ్వాసము,

శ్వాసము ఊర్ధ్వముగనే వెడలునది యూర్ధ్వశ్వాసము. (ఇచ్చట 'పంచధా' అని సంఖ్యా నియమముచే తమకశ్వాసము ప్రతమకముకూడ తమకశ్వాసమున నవాంతర భేద మనియే భావము.)

## శ్వాసవ్యాధిపూర్వరూపము

ప్రాగ్రూపం తస్య హృత్పీడా శూలమాధ్మానమేవ చ,
ఆనాహో వక్త్రవైరస్యం శఙ్ఖనిస్తోద ఏవ చ. 16

శ్వాసవ్యాధి జనించుటకుమున్ను రొమ్మునొప్పియు, కడుపుబ్బి పోటును, కడుపుబ్బరమును, నోట రుచి తెలియకుండుటయు, కణతలనొప్పియు కల్గును. (ఇవి యన్నియు శ్వాసమునకు ముందు జనించు పూర్వరూపము లని భావము.)

## శ్వాసవ్యాధిసంప్రాప్తి

యదా స్రోతాంసి సంరుధ్య మారుతః కఫపూర్వకః,
విష్వగ్వ్రజతి సంరుద్ధః తదా శ్వాసాన్ కరోతి సః. 17

వాతము కఫమును ముఖ్యముగ జేసికొని ప్రాణ, ఉదాన, అన్నవహాదులను మార్గముల నడ్డగించి, కఫముచే తా నడ్డగింపబడి, శరీరమున నల్గడల వ్యాపించిన సమయమున పైజెప్పిన శ్వాసవ్యాధులలో నేదైన జనించును. ఇచ్చట "ప్రాణోదానాన్నవాహీని దుష్టస్రోతాంసి దూషయన్" (అష్టాంగ-ని-అ. ౪. శ్లో. ౩) అను వాగ్భటవాక్యమునుబట్టి "స్రోతాంసి సంరుధ్య" అనుచోట ప్రాణోదానాన్నవహాదులగు స్రోతస్సుల నడ్డగించి యనునర్థము సమంజసము. మరియు "కఫోపరుద్ధగమనః" అను వాగ్భట వాక్యము ననుసరించి "సంరుద్ధః" అనుపదమునకు కఫముచే నడ్డగింపబడినవాయు వని యర్థముచేయుట సప్రమాణ మని యెరుంగునది.)

## మహాశ్వాసలక్షణము

ఉద్ధూయమానవాతో యః శబ్దవద్దుఃఖితో నరః,
ఉచ్చైః శ్వసితి సంరుద్ధో మత్తర్షభ ఇవానిశమ్. 18
ప్రణష్టజ్ఞానవిజ్ఞానః తథా విభ్రాన్తలోచనః,
వివృతాక్ష్యాననో బద్ధమూత్రవర్చా విశీర్ణవాక్. 19
దీనః ప్రశ్వసితం చాస్య దూరాద్విజ్ఞాయతే భృశమ్,
మహాశ్వాసోపసృష్టస్తు క్షిప్రమేవ విపద్యతే. 20

ప్రాణవాతము పైకెగరగొట్టబడి మిక్కిలి కష్టముతో శబ్దముతోఁగూడిన శ్వాసము విడుచును. అట్టిశ్వాసము మదించినయెద్దును అడ్డగించి నిర్బంధముగ నిరోధించినపుడు బుసకొట్టువిధముగ బుస్సుబుస్సని వెడలును. ఇయ్యది మహాశ్వాసము. మరియు నిందు సామాన్యవస్తుజ్ఞానంబును యుక్తాయుక్తవివేకంబును నశించును. కన్నులు వికృతరూపమునొంది మిడిచూపుల జూచును. కన్నులును నోరును మూయుటకు సాధ్యముగాక తెఱచికొనియుండును. మలమూత్రములు బైటవెడలక బంధింపబడును. మాటలు కొతుకు బుట్టును. అట్టిరోగి మిక్కిలి దీనుడుగ నుండును. వాడు శ్వాసము విడుచునని దూరమునకు వినబడును. ఈమహాశ్వాసముచే బీడింపబడినమనుష్యుడు శీఘ్రకాలముననే మృతినొందును.

### ఊర్ధ్వశ్వాసలక్షణము

ఊర్ధ్వం శ్వసితి యో దీర్ఘం న చ ప్రత్యాహరత్యధః,
శ్లేష్మావృతముఖస్రోతః క్రుద్ధగన్ధవహార్దితః. 21
ఊర్ధ్వదృష్టిర్విపశ్యంస్తు విభ్రాన్తాక్ష ఇతస్తతః,
ప్రముహ్యన్వేదనార్తశ్చ శుష్కాస్యోఽరతిపీడితః. 22
ఊర్ధ్వశ్వాసే ప్రకుపితే హ్యధశ్శ్వాసో నిరుధ్యతే,
ముహ్యతస్తామ్యతశ్చోర్ధ్వం శ్వాసస్తస్యైవ హన్త్యసూన్. 23

ఎగయూపిరిని అతిదీర్ఘముగ దీసికొని మరల క్రిందికి మరలింప లేకుండినచో నయ్యది యూర్ధ్వశ్వాస మనంబడును. దీనిచే పీడింపబడిన మనుజుడు కఫముచే నావరింపబడిన నాసాదిరంధ్రములు కలవాడై మిక్కిలి యుక్కటముగ ప్రకోపము నొందిన వాతముచే పీడింపబడి మీఁదుచూపులు గలవాడై నలుదెసల కన్నుల ద్రిప్పుచు వికారముగ జూచును. మూర్ఛ గ్రమ్మును. చెప్పశక్యముకాని బాధచే పీడింపబడి నోరు తెల్లనై యీ లోకమునకు సంబంధించిన విషయములయందెల్ల నిచ్ఛ లేకుండును. ఊర్ధ్వశ్వాసము ప్రకోపించినపుడు అధోభాగమునకు సంచరించు శ్వాసము అడ్డగింపబడును. చీకటిలో నున్నట్లు కన్నుమిన్ను గానక మూర్ఛనొందును. అట్టి యూర్ధ్వశ్వాసము రోగిని శీఘ్రముగ జంపును.

### ఛిన్నశ్వాసలక్షణము

యస్తు శ్వసితి విచ్ఛిన్నం సర్వప్రాణేన పీడితః,
న వా శ్వసితి దుఃఖార్తః మర్మచ్ఛేదరుగర్దితః. 24
ఆనాహస్వేదమూర్ఛార్తః దహ్యమానేన బస్తినా,

విప్లుతాక్షః పరిక్షీణః శ్వసన్ రక్తైకలోచనః. 25
విచేతాః పరిశుష్కాస్యో వివర్ణః ప్రలపన్ నరః,
ఛిన్నశ్వాసేన విచ్ఛిన్నః స శీఘ్రం విజహాత్యసూన్. 26

తనకు గల బలమునంతయు జూపి మిక్కిలి బాధతో గూడి విచ్ఛిన్నముగ శ్వాసమువిడుచుట(అప్పుడు విడిచిన శ్వాసమునకును, మరల వెంటనే విడుచు శ్వాసమునకును యాతాయాత సంబంధములేక శ్వాసమువిడుచుట), లేక మర్మముల ఛేదించిన విధముగ నొప్పికల్గి మిక్కిలి కష్టపడుచు శ్వాసమును విడువజాలక బాధించుట యూపిరాడకుండుట, కడుపుబ్బరము, చెమట, మూర్ఛ, వస్తి (మూత్రపుతిత్తి) యందు నిప్పున కాల్చినట్లుండుట, కన్నుల నీరు గ్రమ్ముట, శరీరము స్పందించుట, (వ్యాధి స్వభావముచే) ఒక కన్నుమాత్ర మెఱ్ఱగ నుండుట, జ్ఞానము నశించుట, నోరు ద్రవము లేక యెండుట, శరీరవర్ణము మారుట, అసంబద్ధముగ మాటలాడుట ఇట్టి లక్షణములతో గూడి పై జెప్పిన విధముగ శ్వాసమును విడిచినచో నయ్యది ఛిన్నశ్వాస మనబడును. ఈ శ్వాసముచేత సంబంధము లన్నియు శిథిలములై (అతిశీఘ్ర)ముగ మృతిచెందును.

## తమకశ్వాసలక్షణము

ప్రతిలోమం యదా వాయుస్స్రోతాంసి ప్రతిపద్యతే,
గ్రీవాం శిరశ్చ సంగృహ్య శ్లేష్మాణం సముదీర్య చ. 27
కరోతి పీనసం తేన రుద్ధో ఘుర్ఘురకం తథా,
అతీవ తీవ్రవేగం చ శ్వాసం ప్రాణప్రపీడకమ్. 28
ప్రతామ్యతి స వేగేన తృష్యతే సన్నిరుధ్యతే,
ప్రమోహం కాసమానశ్చ స గచ్ఛతి ముహుర్ముహుః. 29
శ్లేష్మణ్యముచ్యమానే తు భృశం భవతి దుఃఖితః,
తస్యైవ చ విమోక్షాన్తే ముహూర్తం లభతే సుఖమ్. 30
తథాస్యోద్ధ్వంసతే కణ్ఠః కృచ్ఛ్రాచ్ఛక్నోతి భాషితుమ్,
న చాపి లభతే నిద్రాం శయానశ్శ్వాసపీడితః. 31
పార్శ్వే తస్యావగృహ్ణాతి శయానస్య సమీరణః,
ఆసీనో లభతే సౌఖ్యం ఉష్ణం చైవాభినన్దతి. 32
ఉచ్ఛ్రితాక్షో లలాటేన స్విద్యతా భృశమార్తిమాన్,
విశుష్కాస్యో ముహుశ్శ్వాసో ముహుశ్చైవావధమ్యతే. 33

మేఘామ్బుశీతప్రాగ్వాతైః శ్లేష్మలైశ్చ వివర్ధతే,
స యాప్యస్తమకశ్వాసః సాధ్యో వా స్యాన్నవోత్థితః. 34

వాతము ప్రకుపితమై తనకు సంచారార్థములైన స్రోతస్సులయందు ప్రతిలోమముగ సంచరించుచు శిరస్సు కంఠముపట్టి కఫమును రేపెట్టును. దానివలన గాఢముగ పడిసెము పట్టును. అట్టి కఫముచే నాసారంధ్రంబులును కంఠనాళంబును అడ్డగింపబడి గొంతులో గుఱ్ఱుగుఱ్ఱుమను ధ్వనికల్గి ప్రాణములకు మిక్కిలి కష్టము కల్గి అతితీవ్రముగ శ్వాసము వెడలును. మనుజుడు అట్టిశ్వాసవేగముచే పీడితుడై మూర్ఛనొందును. దప్పి యధిక మగును. కఫముచే శ్వాసమార్గము అడ్డగింపబడును. మాటిమాటికిని దగ్గుకల్గి కళదప్పును. దగ్గువచ్చినప్పుడు కఫము నోటినుండి బైట వెడలనిచో మిక్కిలి కష్టపడును. కఫము వెడలినయెడ కొంతసేపు సుఖముగ బాధ తగ్గియుండును. కంఠమున నస కల్గి రాపుపుట్టి మిక్కిలి కష్టముచే మాటలాడ గల్గును. శయ్యపై పరుండినను శ్వాసముచే బాధింపబడి యించుకసేపైనను నిదుర పట్టకుండును. పరుండినసమయమున వాతముచేత నిరుపార్శ్వములును లాగబడును. కూర్చొనియున్నచో నించుక సుఖముగనుండును. వేడిగనుండు పదార్థములయందు మిక్కిలి యాసగొనును. కన్నులు పైకి బిక్కరించి నుదుట చెమటపట్టుచు మిక్కిలి బాధ కల్గి నోరెండి మాటిమాటికి శ్వాసమును పూరించుచు పలుమారు శ్వాసమును విడుచును. ఈ వ్యాధి మబ్బుగ్రమ్మినపుడును, వర్షముకురియు సమయమునను, మంచు కాలమునందును, తూర్పుగాలి వీచునప్పుడును, కఫమును వృద్ధినొందించు పదార్థముల సేవించినపుడును మిక్కిలి వృద్ధినొందును. ఈ లక్షణములు కల్గినది తమకశ్వాస మనబడును. ఇయ్యది పథ్యముగ నాహారాదుల సేవించుచున్నచో శరీరయాత్ర నడచునందాక కాలము గడుపుచుగియుండును. ఈ వ్యాధి జనించిన మొలటిదినములలోనే తగిన చికిత్స చేసినచో నొకవేళ సాధ్యముగ నుండును.*

## ప్రతమకసంతమకశ్వాసలక్షణములు

జ్వరమూర్ఛాపరీతస్య విద్యాత్ప్రతమకం తు తమ్,
ఉదావర్తరజోఽజీర్ణక్లిన్నకాయనిరోధజః. 35
తమసా వర్ధతేఽత్యర్థం శీతైశ్చాశు ప్రశామ్యతి,
మజ్జతస్తమసీవాస్య విద్యాత్సన్తమకం తు తమ్. 36

* "నవోదితః" అనుదానికి నవే = బాలే ఉదితః అని అర్థముగుండ చెప్పవచ్చును. బాలురకు గల్గు తమకశ్వాస యొకప్పుడు నివర్తించుట అనుభవసిద్ధము.

పైజెప్పిన తమకశ్వాసమున జ్వరమును, మూర్ఛయు కల్గినయెడ నదియే ప్రతమకశ్వాస మనబరగును. మరియు ఉదావర్తముచేతను, ధూళి మొదలగునవి శ్వాస ద్వారముల బ్రవేశించినను, అజీర్ణముచేతను, వాతమును నిరోధించుటచేతను సంతమక శ్వాసము కల్గును. ఇయ్యది తమోగుణముచే వృద్ధినొంది శీతోపచారములచే శీఘ్రముగ శాంతినొందును. ఈ వ్యాధి కల్గినరోగి చీకటియందు మునిగియున్నట్లు తోచుచుండునట్లుగ యుండును. కావున సంతమకశ్వాస మనబడును.

ఇచ్చట కొందరాచార్యులు "అజీర్ణక్లిన్నకాయనిరోధజః" అను వాక్యమును మూడుతెరంగుల విభజించి, అజీర్ణముచేతను, శరీరము తడిసియుండుటచేతను, మల మూత్రాదివేగముల వెడలనియ్యక నిరోధించుటచేతను సంతమకశ్వాసము జనించు నని వచించెదరు. మరికొందరు "క్లిన్నకాయ" అను పదమునకు "ముసలితనము" అని యర్థముచేసి, ముసలితనముచే నీశ్వాసము జనించునని వ్యాఖ్యానము చేసెదరు. ఈ రెండు పక్షములకన్న 'అజీర్ణక్లిన్నకాయనిరోధజః' అను సమస్తపదమును వ్యస్తముగ నన్వ యింపక జీర్ణముకాని యామరసముచే నార్ద్రమైన శరీరము కలవానికి సంతమకశ్వాస రోగము జనించు నని యర్థము చెప్పుట సమంజసముగ నుండును.

మరియు ప్రతమక సంతమకశ్వాసభేదములు రెండును తమకశ్వాసమునం దంతర్భూతము లగును కావున నీ రెంటిని వేరుగ పరిగణనము చేయలేదని తెలియుచున్నది.

## క్షుద్రశ్వాసలక్షణము

రూక్షాయాసోద్భవః కోష్ఠే క్షుద్రో వాత ఉదీరయన్,
క్షుద్రశ్వాసో న సోఽత్యర్థం దుఃఖేనాఙ్గప్రబాధకః. 37
హినస్తి న స గాత్రాణి న చ దుఃఖో యథేతరే,
న చ భోజనపానానాం నిరుణద్ధ్యుచితాం గతిమ్. 38
నేన్ద్రియాణాం వ్యథాం నాపి కాఞ్చిదాపాదయేద్రుజమ్,
స సాధ్య ఉక్తో బలినస్సర్వే చావ్యక్తలక్షణాః. 39

జిడ్డులేని పదార్థముల నుపయోగించినను శరీరమునకు ఆయాసమును కల్గించు పనులుచేసినను కోష్ఠమునందు వాతము ఊర్ధ్వముగ సంచరించును. ఇయ్యది క్షుద్ర శ్వాసము. శరీరమున తక్కిన మహాశ్వాసాదులవలె బాధజనించువిధముగ నీక్షుద్ర శ్వాసము కల్గబోదు. అవయవములను బాధింపజేరదు. ఆహారపదార్థములను, పానీయములను, వానిమార్గమును నిరోధింపక సరళముగ బోనిచ్చును. చక్షుస్సు మున్నగు నింద్రియముల కెట్టిబాధను కల్గింపదు. ఇయ్యది స్వల్పకారణముల జనించి శరీరమునకు బాధను తీవ్రముగ గల్గింపకుండుటంజేసియే క్షుద్రశ్వాస మని

పేర్కొనంబడును. ఇది సుఖముగ సాధింపందగును. తక్కిన మహాశ్వాసాదులు శరీరబలము చక్కగనున్నవానికి జనించి సంపూర్ణలక్షణములు గానకుండుసమయమున అవికూడ సాధ్యములుగనే యుండును. (అనగా మహాశ్వాసాదులు కడుదుస్సాధములైయున్నను, వాని పూర్వరూపదశయందు తగినచికిత్స చేసినచో సాధ్యములుగనే యుండు నని భావము.)

శ్వాసములలో సాధ్యాఽసాధ్యములు

క్షుద్రస్సాధ్యో మత స్తేషాం తమకః కృచ్ఛ్ర ఉచ్యతే,
త్రయశ్శ్వాసా న సిధ్యన్తి తమకో దుర్బలస్య చ. 40
కామం ప్రాణహరా రోగా బహవో న తు తే తథా,
యథా శ్వాసశ్చ హిక్కా చ హరతః ప్రాణమాశు చ. 41

పైజెప్పబడిన యైదుతెరంగులగు శ్వాసములలో క్షుద్రశ్వాసము సాధ్యముగ నుండును. తమకశ్వాసము మిగులకష్టముచే సాధింపందగినది; కావున కృచ్ఛ్రసాధ్యము. ఇవిగాక తక్కిన మహాశ్వాసము, ఊర్ధ్వశ్వాసము, ఛిన్నశ్వాసము నను మూడు శ్వాసరోగంబులును చికిత్సలచే సాధింపనలవికాదు. కావున నీమూడును అసాధ్యములు. తమకశ్వాసము బలహీనునకు కల్గినచో నదికూడ అసాధ్యస్థితినే పొందును. మరియు వ్యాధులలో ప్రాణములగొంపోవునవి సన్నిపాతజ్వరాదు లనేకములు కలవుగాని, శ్వాసమును వెక్కిళ్లనుబోలె నతితీవ్రముగ నివి ప్రాణముల హింసింపనోపవు. (మానవుల హింసించు వ్యాధులలో శ్వాసంబును, ఎక్కిళ్లను మిక్కిలి క్రూరములుగ నుండు నని భావము.)

మరియు చరకమున:—"ఏషాం ప్రాణహరా వర్జ్యాః రోగా స్తే వ్యాశుకారిణః, భేషజైస్సాధ్యయాప్యాంస్తు క్షిప్రం భిషగుపాచరేత్; ఉపేక్షితా దహేయుర్హి శుష్కం కక్షమివానలః" (చరక. చి. అ. ౧౭. శ్లో. ౬౮) అని యుండుటంజేసి ఊర్ధ్వ-ఛిన్న-మహాశ్వాసములు మూడును ప్రాణాంతకములు కావున వానిని చికిత్స చేయక వదలిపెట్టవలెననియు, సాధ్యయాప్యస్థితియందున్న క్షుద్రతమక శ్వాసములను అతిశీఘ్రముగ తగిన యౌషధములచే చికిత్స చేయవలెననియు, శీఘ్రముగ తగిన చికిత్సనొందక యుపేక్షింపబడిన పక్షమున నదికూడ నసాధ్యస్థితినొంది ఎండిన యడవిని కార్చిచ్చు తగులబెట్టురీతిని ప్రాణముల హరింపజూచు ననియు తెలియుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
హిక్కాశ్వాసనిదానం సమాప్తమ్.

# ౧౩. స్వరభేదనిదానమ్

ప్రాణవాయువును ఉదానవాయువును దుష్టములగుటచే గల్గినశ్వాసరోగమున కంఠస్వరముకూడ మారును. మఱియు శ్వాసలక్షణములలో "విశీర్ణ స్వరః" అని చెప్పియున్నందున స్వరభేదమునకును శ్వాసమునకును సంబంధము కలదు గాన శ్వాసనిదానమును జెప్పినపిదప దాని కుపద్రవరూపమైన స్వరభేదనిదానము చెప్పబడును:—

## స్వరభేదనిదానసంప్రాప్తులు

అత్యుచ్చభాషణవిషాధ్యయనాభిఘాతైః
సన్దూషణైః ప్రకుపితాః పవనాదయస్తు,
స్రోతస్సు తే స్వరవహేషు గతాః ప్రతిష్ఠాం
హన్యుస్స్వరం భవతి చాపి హి షడ్విధస్సః. 1

మిక్కిలిబిగ్గరగ మాటలాడుట, స్థావరజంగమరూపమైనవిషము, నిరంతరముగ వేదము చదువుట, భోజనసమయమున కఠినపదార్థ సంఘర్షణము చే దెబ్బతాకుట గల్గుట ఇవి మున్నగు కారణములచేత వాతపిత్తకఫములు ప్రకోపమునొంది కంఠస్వరమును వహించు రంధ్రములయందు ప్రవేశించి నానాట వృద్ధినొంది కంఠస్వరమును స్వభావసిద్ధమగుస్థితిని చెరిచి మార్పునొందించును. అయ్యది క్రింద జెప్పబడు వాక్యప్రకారము వాత-పిత్త-కఫములు మూడిటిచే వేరువేరుగను త్రిదోష సన్నిపాతము చేతను, మేదస్సుచేతను, ధాతుక్షయముచేతను జనించుటం జేసి యాఱువిధము లగును.

"స్రోతస్సు తే స్వరవహేషు" అనుచోట కంఠస్వరము వ్యాపించుట కాధారములగు నాల్గు నాడులని యెఱుంగనది. శరీరమునం దూర్ధ్వభాగములవ్యాపించు ముప్పది స్రోతస్సులలో కంఠమున వ్యాపించియుండు రెండునాడులచే మాటలాడుననియు, రెండునాడులచే శబ్దమును కల్గించుననియు సుశ్రుతమునందుని "ద్వాభ్యాం భాషతే, ద్వాభ్యాం ఘోషం కరోతి" (సుశ్రుత. శా. ౮, ౯) అనువాక్యముచే దెలియుచున్నది.

## స్వరభేదవిభాగము

(వాతాదిభిః పృథక్ సర్వైః మేదసా చ క్షయేణ చ)

వాతపిత్తకఫములచే ప్రత్యేకముగను, త్రిదోషసన్నిపాతము చేతను, మేదస్సుచేతను, ధాతుక్షయముచేతను స్వరభేదము జనించును.

## వాతిక-పైత్తికస్వరభేదలక్షణము

వాతేన కృష్ణనయనాననమూత్రవర్చాః
భిన్నం శనైర్వదతి గర్దభవత్స్వరం చ,
పిత్తేన పీతనయనాననమూత్రవర్చాః
బ్రూయాద్గలేన చ స దాహసమన్వితేన. 2

వాతము ప్రకోపించుటవలన జనించిన స్వరభేదమునందు కన్నులును, ముఖంబును, మూత్ర పురీషంబులును నల్లనిరంగు గల్గియుండును. కంఠస్వరము గాడిదస్వరమును బోలె వినుట కింపుగాక మెల్లగ వెడలును. పిత్తప్రకోపమున జనించిన స్వరభేదమునందు కన్నులును, ముఖంబును, మూత్ర పురీషంబులును పచ్చనిరంగు కల్గియుండును. కంఠమున మంటతోగూడి స్వరముమారి మాట్లాడును.

## శ్లైష్మిక-సాన్నిపాతికస్వరభేదలక్షణము

బ్రూయాత్కఫేన సతతం కఫరుద్ధకణ్ఠః
స్వల్పం శనైర్వదతి చాపి దివా విశేషాత్,
సర్వాత్మకే భవతి సర్వవికారసమ్పత్
తం చాప్యసాధ్యమృషయస్స్వరభేదమాహుః. 3

కఫప్రకోపమున జనించిన స్వరభేదమునందు ఎల్లప్పుడును కఫముచే నడ్డగింపబడిన కంఠబిలము కలవాడై మిక్కిలి సూక్ష్మముగ మెలమెల్లగ మాటలాడును. పవటియందు సూర్యతాపముచే కఫము కొంచెముగ పలుచనగు గాన నధికముగ మాటలాడనోపును. త్రిదోషము లొక్కుమ్మడి ప్రకోపించి స్వరభేదముగల్గెనేని వాతాదులకు వేర్వేరజెప్పబడిన లక్షణములన్నియును సమకాలమున గల్గును. ఇయ్యది విరుద్ధోపక్రమంబగుటంజేసి యసాధ్య మగును.

## క్షయజస్వరభేదలక్షణము

ధూప్యేత వాక్ క్షయకృతే క్షయమాప్నుయాచ్చ
వాగేష చాపి హతవాక్ పరివర్జనీయః,

రసాదిధాతువులు క్షీణించుటచే గల్గిన స్వరభేదమునందు నోట పొగవెడలునట్లు మాటలాడును. కంఠస్వరము మిక్కిలి క్షీణించియుండును. అట్టి హీనస్వరముగలరోగి చికిత్స కర్హుడుగాడు. (ఇయ్యది యసాధ్యం బనుట.)

### మేదోజస్వరభేదలక్షణము

అన్తర్గతస్వరమలక్ష్యపదం చిరేణ
మేదోఽన్వయాద్వదతి దిగ్ధగలస్తృషార్తః. 4

మేదస్సుచే జనించిన స్వరభేదమునందు కంఠస్వరము కుత్తుకయందే నిలచి పదములు స్ఫుటముగ దెలియక చాలకాలమునకు మిక్కిలి కష్టముతో మాటలాడును. కంఠమునందు తెమడ చుట్టుకొని యుండును. విశేషముగ దప్పిచే బాధింపబడును.

### అసాధ్య స్వరభేదలక్షణము

క్షీణస్య వృద్ధస్య కృశస్య వాపి
చిరోత్థితో యశ్చ సహోపజాతః,
మేదస్వినస్సర్వసముద్భవశ్చ
స్వరామయో యో న స సిద్ధిమేతి. 5

శరీరము కృశించినవానికిని వయసుచెల్లి ముసలియైన వానికిని రసరక్తాదిధాతువులు క్షీణించిన వానికిని జనించినస్వరభేదము అసాధ్యమగును. మరియు చాలకాలమునుండి యనుసరించియుండు స్వరభేదంబును, జననకాలమునుండి కూడ బుట్టి యనుసరించి యుండు స్వరభేదంబును, మేదస్సు వృద్ధినొందినవానికి బుట్టిన స్వరభేదంబును, త్రిదోష సన్నిపాతముగ గల్గిన స్వరభేదంబును అసాధ్యము లగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
స్వరభేదనిదానం సమాప్తమ్.

# ౧౪. అరోచకనిదానమ్

స్వరభేదమునుబోలె నరోచకంబును కంఠమునకు పైభాగమున జనించును కావున సమానస్థానసంభవమగుటంజేసి స్వరభేదమును జెప్పినపిదప అరోచకము చెప్పబడును.—

## అరోచకము జనించు కారణములు

వాతాదిభిశ్శోకభయాఽతిలోభక్రోధైర్మనోఘ్నాశనరూపగన్ధైః,
అరోచకాస్స్యుః

వాతపిత్తకఫములచే వేర్వేరుగను త్రిదోషసన్నిపాతముచేతను, శోకము, భయము, లోభము, క్రోధము నను మానసికవికారములచేతను, మనస్సునకు ఇంపుగాక ఉద్వేగమును బుట్టించు నన్నపానములు, రూపము, గంధము మున్నగువానిచేతను అరోచకము కల్గును. అరోచకమున నోటికి స్వాభావిక మగు రుచి చెడి మనసుకు ఆహారమునందు వాంఛ తప్పి రుచి తెలియంగకుండు వ్యాధివిశేషము.

"భక్తోపఘాత మిహ పఞ్చవిధం వదన్తి" (సు. ఉ. అ. ౫౭) అని సుశ్రుతమున నైదువిధములుగ నరోచకము విభజింపబడినది. తదనుసారముగ ప్రకృతగ్రంథమునకూడ వాతపిత్తకఫములు మూడును వేర్వేరుగను, సన్నిపాతంబును, శోకభయాదులన్నియు జేరి యాగంతువునునై యైదు కారణములచేత జనించుటంజేసి యైదువిధములనియే నిర్ణయింప నగును. భయాదులన్నియు నాగంతుకములో నంతర్భూతములైనను ఆయాహేతువులనకు విరుద్ధమైన హేతువిపరీతచికిత్స జేయవలెను కావున భయశోకాదులు వేర్వేరుగ నిచ్చుట జెప్పబడినవి.

## వాతాద్యరోచక లక్షణములు

పరిహృష్టదన్తః కషాయవక్త్రశ్చ మతోఽనిలేన. 1
కట్వమ్లముష్ణం విరసఞ్చ పూతి
పిత్తేన విద్యాల్లవణం చ వక్త్రమ్,
మాధుర్యపైచ్ఛిల్యగురుత్వశైత్య
విబన్ధసమ్బద్ధయుతం కఫేన. 2

వాతమునఁబుట్టిన యరోచకమునందు పండ్లు పులిసి నమలుటకు సాధ్యము గాకుం డును. నోరు వగరు కల్గియుండును. పిత్తమునఁగల్గిన యరోచకమునందు నోరు చేదుగను, పుల్లగను, వేడిగనుండి మధురాదిరసముల నెరుంగుశక్తిలేక దుర్గంధము కల్గియుండును. కఫముచే జనించిన యరోచకమునందు నోరు ఉప్పుగనైనను తీపిగనైన నుండును. నోట పిచ్ఛిలత్వంబును (జిగురుగ నుండుట), గురుత్వంబును (మొద్దుబారి రుచి తెలియక యుండుట), శైత్యంబును (చల్లనైయుండుట), గల్గి, పట్టినట్లుండి భుజింపఁబడిన యాహార పదార్థముల సరళముగ లోనికి జేరనీయక యడ్డుపడుచుండును.

అరోచక లక్షణమును జెప్పునపుడు విదేహుఁడు:—"ప్రతిన నిస్వాదాస్య... కృత్వాన్యత్, స్యాద్వాస్యహృల్లాసకరః కఫేన" అని చెప్పియుండుటంజేసి ప్రకృతమున "కట్వమ్లముష్ణం" అనుచోట కటుశబ్దమునకు చేదు అని యర్థము జేయు టుచితము. ఇత్తెరంగుననే "యశ్చ నిమ్బం పరశునా యశ్చైనం మధుసర్పిషా, యశ్చైనం గన్ధమాల్యాభ్యాం సర్వత్ర కటురేవ సః" అనుచోటనుండు కటుశబ్దమునకు చేదు అని అర్థముచేయుట కవిసమయసిద్ధముగ నున్నది.

అభిఘాత-సన్నిపాతములచే గల్గిన యరోచకలక్షణములు

అరోచకే శోకభయాతిలోభ
క్రోధాద్యహృద్యాశుచిగన్ధజే స్యాత్,
స్వాభావికం చాస్యమథారుచిశ్చ
త్రిదోషజే నైకరసం భవేత్తు. 3

దుఃఖము, భయము, అతిలోభము (వస్తువులయం దధికమైనయాస) క్రోధము (శత్రుదర్శనాదులచే గల్గిన మనోవికారము) మున్నగుకారణములచేతను; మనసు కింపు కానివియు, అపరిశుద్ధంబులును నగు గంధాదుల మూర్కొనుట మున్నగు కారణముల చేతను గల్గిన యాగంతుకం బైన యరోచకమునందు నోరు మామూలుగనుండు రసము చెడకయుండును గాని ఆహారమునందు మాత్రము రుచి (అభిలాష) తప్పిపోయి యరుచి కుండును. త్రిదోషసన్నిపాతమునఁగల్గిన యరోచకమున వాతాదులకు వేర్వేర జెప్పబడిన రసములన్నియు గలిగి యాహారము రుచింపకుండును.

వాతాద్యరోచకముల విశేషలక్షణములు

హృచ్ఛూలపీడనయుతం పవనేన, పిత్తా
త్తృడ్దాహచోషబహుళం, సకఫప్రసేకమ్,

శ్లేష్మాత్మకం, బహురుజం బహుభిశ్చ విద్యాత్,
వైగుణ్యమోహజడతాభిరథాపరం స్యాత్. 4

వాతమున గల్గిన యరోచకమునందు రొమ్మునొప్పి విశేషముగ నుండును. పైత్తికారోచకమున దప్పి విశేషముగ కల్గును; నోట మంటపుట్టును; నోట చెప్పు యొందును. కఫమున జనించిన యరోచకమున నోట కఫము విశేషముగ వెడలును. త్రిదోషసన్నిపాతమున గల్గిన యరోచకమున త్రిదోషములకు వేర్వేర జెప్పిన బాధలన్నియు సంకరముగ గల్గును. ఆగంతుకారోచకమునందు మనస్సు చంచలమై కలతనొందును. జ్ఞానము నశించును. బుద్ధి జడముగ నుండును.

మరియు అరోచకము, అన్నద్వేషము, అభక్తచ్ఛందము నని యాహారమును భంగము సేయువ్యాధులు మూడువిధములు. అందు బలాత్కారముగ నోట నన్నమును పెట్టినను రుచిలేక భుజింప నిచ్ఛ లేకుండునది యరోచకము. అన్నమును మనసున దలచినను కంట జూచినను మరియొకరు అన్నమని చెప్పగా వినినను సహింపక ద్వేషము కల్గి వాంతికల్గించునది యన్నద్వేషము. అన్నమునం దిచ్ఛకల్గియు రుచి మామూలుగ నుండియు కోపముచేనైనను, భయముచేనైనను, శోకాదులచేనైనను మనసు కలతనొంది భుజింప నిచ్ఛపొడమక యాహారము పట్టకుండునది అభక్తచ్ఛందము నని యెరుంగునది. ఈ విషయము గ్రంథాంతరమున నిట్లు చెప్పబడినది.—"ప్రక్షిప్తం తు ముఖే చాన్నం జన్తోర్న స్వదతేముహుః, అరోచకస్స విజ్ఞేయో భక్తద్వేషమతశ్శృణు, చిన్తయిత్వా తు మనసా దృష్ట్వా శ్రుత్వాపి భోజనమ్, ద్వేషమాయాతి యో జన్తుః భక్తద్వేషస్స ఉచ్యతే, యస్య నాన్నే భవేచ్ఛ్రద్ధా సోఽభక్తచ్ఛన్ద ఉచ్యతే, కుపితస్య భయార్తస్య యశ్చ భక్తనిరోధనః" (అని వృద్ధచోడు చెప్పెను.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అరోచకనిదానం సమాప్తమ్.

# ౧౫. ఛర్దినిదానము

అరోచకముచేత ఛర్ది (వాన్తి) గూడ గల్గును. కావున అరోచకమును జెప్పినపిదప ఛర్దినిదానము జెప్పబడును.—

## ఛర్దిసంఖ్య

దుష్టైర్దోషైః పృథక్ సర్వైః బీభత్సాలోచనాదిభిః,
ఛర్దయః పఞ్చ విజ్ఞేయాః తాసాం లక్షణముచ్యతే. 1

ప్రకుపితములైన వాతపిత్తకఫములచే వేర్వేరుగను, మూడుదోషముల సన్నిపాతముచేతను, తనమనసు కింపుగాని రక్తము మాంసము పురీషము మున్నగువాని జూచుటచేతను గల్గుటంజేసి ఛర్ది (వమన) రోగము పంచవిధములుగ నుండును. అందు బీభత్సములగు (మనసునకు ఏవగింపుకల్గించు వస్తువుల జూచుటచే గల్గినది) యాగంతుకము. తక్కినవి దోషజములు.

ఛర్ది యనుశబ్దము "ఛద-అపవారణే, అర్ద-హింసాయాం" అను రెండు ధాతువులచే బుట్టినది కావున, నోటియందు వ్యాపించి శరీరావయవముల బాధించుచు బైటవెడలునది యని యన్వర్థముగ జెప్పబడును. (పృషోదరాదిగణపాఠముచే 'ఛర్ది' యనురూపము సిద్ధించినది.)*

## ఛర్దిరోగకారణములు, సంప్రాప్తి

అతిద్రవైరతిస్నిగ్ధైరహృద్యైర్లవణైరపి,
అకాలే చాతిమాత్రైశ్చ తథాఽసాత్మ్యైశ్చ భోజనైః. 2
శ్రమాద్భయాత్తథోద్వేగాదజీర్ణాత్క్రిమిదోషతః,
నార్యాశ్చాపన్నసత్త్వాయాః తథాతిద్రుతమశ్నతః. 3
బీభత్సైర్హేతుభిశ్చాన్యైః ద్రుతముత్క్లేశితో బలాత్,
ఛాదయన్నాననం వేగైః అర్దయన్నఙ్గభఞ్జనైః,
నిరుచ్యతే చ్ఛర్దిరితి దోషో వక్త్రం ప్రధావితః. 4

మిక్కిలి ద్రవముగ నుండు నాహారమును భుజించినను, మిక్కిలి జిడ్డు గల్గిన యాహారమును భుజించినను, మనసు కింపుగాని పదార్థముల భుజించినను, ఉప్పు

*"ఛర్ద=వమనే" అను చురాదిధాతువువలన "ఛర్ది" శబ్దముత్పన్నమైనదని యనుట న్యాయ్యము.

మిక్కుటముగనుండు పదార్థమును భుజించినను, నియతకాలమును వదలి ముందుగనైనను వెనుకనైనను భుజించినను, తాను భుజించు పరిమితికి మిక్కుటముగ భుజించినను, తన కలవాటులేక శరీరమున కిముడని పదార్థముల భుజించినను, శ్రమనొందుటచేతను, భీతిచేతను, శోకము మున్నగు కారణములచే మనస్సు చంచలమై వికృతినొందుటచేతను, అజీర్ణమువలనను, ఆమాశయమున పురుగులు చేరుటచేతను ఛర్దిరోగము సంభవించును. మరియు గర్భిణిగానున్న స్త్రీకిని, మిక్కిలి శీఘ్రముగ భుజించువానికిని, మనసు కింపుగాని దుర్గంధమును మూర్కొనుట మున్నగు కారణములచేతను కోష్ఠమున నుండు [1]దోషము శీఘ్రముగ పైకి పెల్లగింపబడి నోటవ్యాపించి దానివేగముచే నొడలును వికృతముగ కదలించుచు అవయవముల బాధింపుచు బైటవెడలినచో నయ్యది ఛర్ది యని యన్వర్థముగ జెప్పంబడును.

### ఛర్దిపూర్వరూపము

[2]హృల్లాసోద్గారరోధౌ చ ప్రసేకో లవణస్తనుః,
ద్వేషోఽన్నపానే చ భృశం వమీనాం పూర్వలక్షణమ్. 5

నోట నోకిరింతలు వెడలుట, త్రేపులు బైట ధారాళముగ వెడలక రొమ్మునసే యడచికొనియుండుట, నోట నీరు విడలుట, నోరు కొంచెముగ నుప్పనై యుండుట, అన్నపానములయందు ఇచ్ఛలేక ద్వేషముబుట్టుట ఇవియన్నియు వమనరోగములకు ముందుగల్గు పూర్వరూపములు. (ఇచ్చట వ్యాధిప్రభావమునం జేసి నోరు ఉప్పగ నుండు నని యెఱుంగునది.)

### వాతికచ్ఛర్దిలక్షణము

హృత్పార్శ్వపీడా ముఖశోషశీర్ష
నాభ్యర్తికాసస్వరభేదతోదైః
ఉద్గారశబ్దప్రబలం సఫేనం
విచ్ఛిన్నకృష్ణం తనుకం కషాయమ్
కృచ్ఛ్రేణ చాల్పం మహతా చ వేగే
నార్తోఽనిలాచ్ఛర్దయతీహ దుఃఖమ్. 6

వాతప్రకోపమున గల్గిన ఛర్దిరోగమున రొమ్మునందును రెండుప్రక్కలయందును నొప్పికల్గును. నోటతడిలేక యెండును. తలపోటును, బొడ్డువద్దను నొప్పియు బుట్టును. దగ్గు కల్గును. కంఠస్వరము మారును. కుత్తుకయందును శరీరమునందు సూదులబొడిచినట్లులు పోటు పుట్టును. వాంతియగునపుడు మిక్కిలి తీవ్రమై బల

1. దోష మనగా కఫపిత్తాది దూషిత మగు నాహారద్రవ మని తెలియవలెను. 2. హృల్లాస మనగా గుండెలో కలియ బెట్టినట్లుండుట.

వత్తరమైన శబ్దముతోను నురుగుతోను గూడి నల్లనై పలుచనై నగరుగల్గిన దుష్ట జలము మిక్కిలి శ్రమతోగూడి కష్టముచే స్వల్పముగ వెడలును.

## పైత్తికచ్ఛర్దిలక్షణము

మూర్ఛాపిపాసాముఖశోషమూర్ధ
తాల్వక్షిసన్తాపతమోభ్రమార్తః,
పీతం భృశోష్ణం హరితం సతిక్తం
ధూమ్రం చ పిత్తేన వమేత్సదాహమ్. 7

పిత్తప్రకోపమున జనించిన ఛర్దిరోగమునందు మూర్ఛయు దప్పియు గల్గును, నోరెండును, తలయందును, తాలువులయందును, కన్నులయందును మంటపుట్టును. చీకటిలో నున్నట్టులు కన్నులు గానరాక యుండును. ఒడలు తిరుగునట్టుండును. పసుపురంగైనను ఆకుపచ్చని రంగైనను గల్గి చేదుగను ధూమ్రవర్ణముగనుండి మంటతోగూడి మిక్కిలి వేడియైనపసరు వాంతియగును.

## కఫజచ్ఛర్దిలక్షణము

తన్ద్రాస్యమాధుర్యకఫప్రసేకసన్తోషనిద్రాఽరుచిగౌరవార్తః,
స్నిగ్ధం ఘనం స్వాదుకఫాద్విశుద్ధం సరోమహర్షోఽల్పరుజం వమేత్తు.

కఫమున జనించిన ఛర్దిరోగమునందు మైకము గ్రమ్మును. నోరు తీపి గల్గి యుండును. నోట కఫము వెడలును. భోజనము చేయకున్నను భుజించినవానివలె నాకలి లేకుండును. నిదుర వచ్చును. నోట రుచి లేకుండును. శరీరము బరువుగ నుండును. జిడ్డుగల్గి ఘనీభవించి తెల్లగనుండు తియ్యనిరసము వాంతియగు నపుడు శరీరమున రోమాంచము గల్గును. స్వల్పముగ బాధ కల్గును.

## సన్నిపాతజచ్ఛర్దిలక్షణము

శూలాఽవిపాకాఽరుచిదాహతృష్ణా
శ్వాసప్రమోహప్రబలా ప్రసక్తమ్,
ఛర్దిస్త్రిదోషాల్లవణామ్లనీల
సాన్ద్రోష్ణరక్తం వమతాం నృణాం స్యాత్. 9

త్రిదోషములును సమకాలమున బ్రకోపించి కల్గిన ఛర్దిరోగమునందు కడుపులో నొప్పిపుట్టును. భుజింపబడిన యాహారము జీర్ణముకాదు. అరుచి, మంట, దప్పి, శ్వాసము, మైకమును బ్రబలముగా కల్గును. సంతతముగ ఉప్పగను పుల్లగను నల్లగను నున్న రక్తవర్ణమును గల్గి చిక్కనైన నీరు వాంతియగును.

విట్ స్వేదమూత్రామ్బువహాని వాయుః
స్రోతాంసి సంరుధ్య యదోర్ధ్వమేతి,
ఉత్పన్నదోషస్య సమాచితం తం
దోషం సముద్ధూయ నరస్య కోష్ఠాత్. 10

విణ్మూత్రయో స్తత్సమగన్ధవర్ణం
తృట్ శ్వాసహిక్కార్తియుతం ప్రసక్తమ్,
ప్రచ్ఛర్దయేద్దుష్టమిహాతివేగా
త్తయార్దితశ్చాశు వినాశమేతి. 11

వాతము ప్రకోపించి మలమును చెమటను మూత్రమును ప్రవహింపజేయు మార్గముల నడ్డగించి పైకి ఎప్పుడు వ్యాపించునో, అట్టిసమయమున శరీరమునందలి మలమూత్రస్వేదములు సంచితమైయుండును; అట్టిదోషమును మలమూత్రకోశముల నుండియు కోష్ఠమునుండియు పైకి నెగురగొట్టి మలమూత్రములకు సమానమైనవర్ణమును వాసనయును గల దుష్టజలమును వాంతి కల్గించును. విరామములేకుండ నుండు అట్టివాంతి మిక్కిలి వేగముతో గూడి దప్పిని, శ్వాసమును, ఎక్కిళ్లను కల్గించును. వాంతియగునపుడు ధారాళముగ వెడలక పట్టిన ట్లుండును. ఇట్టి ఛర్దిరోగముచే బీడింపబడినరోగి శీఘ్రముగ మృతినొందును.

## ఆగంతుకచ్ఛర్దిలక్షణము

బీభత్సజా* దౌర్హృదజాఽఽమజా చ
హ్యాసాత్మ్యజా చ క్రిమిజా చ యా హి,
సా పఞ్చమీ, తాం చ విభావయేచ్ఛ
దోషోచ్ఛ్రయేణైవ యథోక్తమాదౌ. 12

మనస్సున కింపుగాని రక్తమాంసాదుల దర్శనాదులచే గల్గిన ఛర్దిరోగమును, గర్భముగనుండు కాలమున దౌహదవారికి (వేవిళ్లచే) గల్గు ఛర్దియు, అజీర్ణమున గల్గు ఛర్దియు, తన కలవాటులేని పదార్థముల నుపయోగించుటచే గల్గినఛర్దియు, కోష్ఠమున క్రిములుగల్గి దాన జనించు ఛర్దియు, ఇవి యన్నియు నాగంతుకారణముల జనించుటం జేసి యాగంతుక మని చెప్పబడును. ఇట్టియైదవదియైన ఛర్దిరోగమునందు పైజెప్పిన వాతపిత్తకఫలక్షణములలో నేలక్షణము లక్షితముగ నుండునో దానింబట్టి నిర్ణయించి చికిత్స చేయనగును.

---

*గర్భము దౌహృద మని చెప్పుట న్యాయ్యము. దౌర్హృదజ మనినచో నిష్టము లేకుండుటచే జనించిన దని యర్థము వచ్చును.

మరియు పైజెప్పిన యాగంతుకములలో బీభత్సజఛర్ది జనించు కారణములను చరకమున నిట్లు నిర్దేశించియున్నది:—"ద్విష్టప్రతీపాశుచిపూత్య మేధ్యబీభత్సగంధాశనదర్శనైశ్చ యశ్ఛర్దయేత్తప్తమనాః మనోఘ్నైః ద్విష్టార్థసంయోగభవా మతా సా." (చరక. చి. అ. ౨౦. శ్లో. ౧౮.) తనమనసుకు విరుద్ధంబును, తనకు ప్రతికూలంబును అపరిశుద్ధంబును, దుర్గంధయుక్తంబును, అశుద్ధంబును, మనసుకు నుద్వేగము గల్గించు నదియు నగు ద్రవ్యములవాసనను మూర్కొనినను, అట్టి పదార్థములను తినినను, వానిని జూచినను, మనసున కింపుగామిం జేసి తపించుచుండ గల్గుపమనము మనసు కింపుగాని వానిసంబంధమున గల్గినది కావున బీభత్సజ మని చెప్పంబడు నని భావము.

## క్రిమిజచ్ఛర్దిలక్షణము

శూలహృల్లాసబహులా క్రిమిజా చ విశేషతః,
క్రిమిహృద్రోగతుల్యేన లక్షణేన చ లక్షితా. 13

క్రిములవలన గల్గిన ఛర్దిరోగమునందు కడుపులో పొడిచినట్లుగు నొప్పికల్గును. అకారణముగ నోట నీరూరి వోకిరింతలు వచ్చును. ఇదిగాక క్రిమిజహృద్రోగమున జెప్పబడిన లక్షణములును గల్గియుండును.

## అసాధ్యచ్ఛర్దిలక్షణము

క్షీణస్య యా ఛర్దిరతిప్రసక్తా
సోపద్రవా శోణితపూయయుక్తా,
స చంద్రికాం తాం ప్రవదేదసాధ్యాం
సాధ్యాం చికిత్సేన్నిరుపద్రవాం చ. 14

శరీరమున రసరక్తాదిధాతువులు క్షీణించినవానికి మిక్కిలి తీవ్రముగ నధికముగనైన ఛర్దిరోగంబును, ఉపద్రవముల గూడిన ఛర్దియు, రక్తముతోను చీముతోనుగూడి వెడలుఛర్దియు, మేదస్సు మొదలగువాని సారముతోగూడి వెడలు ఛర్దియు నసాధ్యము. కావున నుపద్రవములు లేక సాధింపదగిన ఛర్దిరోగమునకు దగినచికిత్స చేయుట యుచితము.

మరియు దగ్గు, శ్వాసము, జ్వరము, ఎక్కిళ్లు, దప్పి, చిత్తభ్రమము, రొమ్మునొప్పి, చీకటిలోనున్నవిధముగ కన్నులు గానరాకుండుట ఇవియు ఛర్దిరోగమున గల్గు నుపద్రవము లని యెరుంగునది. ఈవిషయము గ్రంథాంతరమునం దిట్లు నిర్దేశింపబడినది:—"కాసశ్శ్వాసో జ్వరో హిక్కా తృష్ణా వైచిత్త్యమేవ చ, హృద్రోగస్తమకశ్చైవ జ్ఞేయాః ఛర్దేరుపద్రవాః."

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఛర్దినిదానం సమాప్తమ్.

# ౧౬. తృష్ణానిదానమ్

ఛర్దిరోగమునకు తృష్ణ (దప్పి) యుపద్రవము కావున అట్టి సంబంధముచేత ఛర్దినిదానమును జెప్పినపిదప తృష్ణానిదానము చెప్పబడుచున్నది:—

## తృష్ణాసమ్ప్రాప్తి

భయశ్రమాభ్యాం బలసంక్షయాద్వా
హ్యూర్ధ్వం చితం పిత్తవివర్ధనైశ్చ,
పిత్తం సవాతం కుపితం నరాణాం
తాలుప్రపన్నం జనయేత్పిపాసామ్,
స్రోతస్స్వపాం వాహిషు దూషితేషు
* దోషైశ్చ తృట్సమ్భవతీహ జన్తోః. 1

భయముచేతను, శరీరమునకు శ్రమము గల్గించు పనులజేయుటవలన గల్గిన బడలికచేతను, శరీరబలము నశించుటచేతను ప్రకోపమందిన వాతముతో గూడి, పిత్తమును వృద్ధినొందించు కటూష్ణాద్యన్నపానములచేత ప్రకుపితమైన పిత్తము, తాలుభాగమున వ్యాపించి పిపాసను (దప్పిని) గల్గించును. మరియు వాతపిత్తకఫములు ప్రకుపితములై శరీరమున జలమును వహించు నాడులను చెరచినపుడును దప్పి గల్గును.

చరకమున తృష్ణానిదానసంప్రాప్తులు విపులముగ నిట్లు చెప్పంబడినవి:— "క్షోభాద్భయాచ్ఛ్రమాదపి శోకాత్ క్రోధాద్విలఙ్ఘనాన్మద్యాత్, క్షారామ్లలవణకటుకోష్ణరూక్షశుష్కాన్నసేవాభిః. ధాతుక్షయగదకర్షణవమనాద్యతియోగసూర్యసన్తాపైః, పిత్తానిలౌ ప్రవృద్ధౌ సౌమ్యాన్ధాతూంశ్చ శోషయతః. రసవాహినీశ్చ నాడీః జిహ్వామూలగలతాలుకక్లోమ్నః. సంశోష్య నృణాం దేహే కురుతస్తృష్ణాం మహాబలావేతౌ. పీతం పీతం హి జలం శోషయతస్తావతో న యాతి శమమ్, ఘోరవ్యాధికృశానాం ప్రభవత్యుపసర్గభూతా సా." (చరక. చి. అ. ౨౨. శ్లో. ౪-౭) మనసుకు క్షోభము కల్గుట, భయము, శ్రమము, శోకము, క్రోధము, లంఘనము, మద్యపానము, క్షారము - పులుపు - ఉప్పు - వగరురసములు గలపదార్థములను భుజిం

* "దోషైః = అన్నకఫాద్యైః" అని మధుకోశమున నర్థము వ్రాయబడెను. దోషదుష్టములై దూషకములుగా నుండుటచేత నన్నాదులును గూడ దోషము లనబడు నని వివరించెను.

చుట,వీర్యముచేతను స్పర్శముచేతను ఉష్ణమైన యాహారమును భుజించుట,ఎండి ద్రవము లేని యాహారమును భుజించుట, రసాదిధాతువులు కృశించుట, విషము, శరీరమును కృశింపజేయు (కర్షణ) చికిత్స నధికముగ జేసికొనుట, వమనవిరేచనాది శోధనములను ప్రమాణమునకన్న నధికముగ సేవించుట, ఎండలో సంతాపము నొందుట, ఇట్టి కారణములచేత పిత్తవాతములు రెండును వృద్ధినొంది ప్రకుపితములై శరీరమున నుండు రస ధాతువును వహించునాడులను సౌమ్యము లగు ధాతువులను తొలుత శోషింపజేసి, పిదప నాలుక మొదటిప్రదేశమును కుత్తుకను తాలువులను క్లోమమును చెమ్మలేనట్లు ఎండించి ఘోరమైన దప్పిని గల్గించును. మిక్కిలి బలిష్ఠములగు నీవాతపిత్తములు మాటిమాటికి నీళ్లుత్రాగుచున్నను ఎండింపజేయుచుండును. దానంజేసి యట్టిదప్పి నివర్తించక వృద్ధి యగుచునే యుండును అని యర్థము. మరియు నీవ్యాధి ఘోరములగు నితరవ్యాధుల యందును నుపద్రవరూపముగ సంభవించి బాధించును.

మరియు తృష్ణాసామాన్యమున గల్గు నుపద్రవములుకూడ చరకమున నిట్లు చెప్పం బడినవి:—"ముఖశోషస్వరభేదభ్రమసన్తాపప్రలాపసంస్తమ్భాః, తాల్వోష్ఠకణ్ఠ జిహ్వాకర్కశతాం చిత్తనాశశ్చ, జిహ్వానిర్గమమరుచిం బాధిర్యం మర్మదూయనం సాదమ్, తృష్ణోద్భూతా కురుతే." (చరక. చి. అ. ౨౨. శ్లో. ౯-౧౦) నోరెండుట, స్వరభేదము, ఒడలు దిరుగుట, సంతాపము, సంబంధములేక మాటలాడుట, శరీరము స్తంభించుట, తాలువులయందును పెదవులయందును కుత్తుకయందును నాలుకయందును చెమ్మలేక గరగరలాడుచుండుట, మైమరచుట నాలుక వెలుపలికి వ్రేలాడుట, నోట రుచి దెలియకుండుట, చెవుడు పుట్టుట, అవయవములు కృశించి వణకుట, వీనినన్నింటిని తృష్ణారోగము కల్గించు నని యర్థము. (ఇవియే తృష్ణారోగమున నుపద్రవములు నగును.)

## తృష్ణాభేదములు

తిస్రస్స్మృతాస్తాః క్షతజా చతుర్థీ
క్షయాత్తథా హ్యామసముద్భవా చ,
భక్తోద్భవా సప్తమికేతి తాసాం
నిబోధ లిఙ్గాన్యనుపూర్వశస్తు. 2

పైజెప్పబడిన తృష్ణావ్యాధి వాతపిత్తకఫములచే వేర్వేరుగ జనించినవి మూడును, ఆయుధములదెబ్బచే గల్గినది (క్షతజ)యు, ధాతుక్షయమున జనించినది (క్షయజ)యు, అజీర్ణమున గల్గినది (ఆమజ)యు, అన్నమును భుజించుటచే గల్గినది (అన్నజ)యు కలిసి యేడువిధములగు లగును. వానిలక్షణ మీక్రింద వేర్వేర వివరింప బడును.

### వాతజతృష్ణాలక్షణము

క్షామాస్యతా మారుతసమ్భవాయాం
తోదస్తథా శఙ్ఖశిరస్సు చాపి,
స్రోతోనిరోధో విరసం చ వక్త్రం
శీతాభిరద్భిశ్చ వివృద్ధిమేతి. 3

వాతమున జనించిన తృష్ణారోగమునందు నోట ద్రవములేక యెండును. కణతలయందును కపాలమునందును సూదులతో బొడిచినట్లు పోటు పుట్టును. ముక్కు మున్నగు స్రోతోరంధ్రములు అడ్డగింపబడియుండును. నోట రుచి దెలియకుండును. చల్లనినీళ్లు త్రాగుకొలది దప్పి యధికమగుచుండును.

మరియు నిదురపట్టకుండుట, తల దిరుగుట ఈలక్షణములు కూడ కల్గు ననియు, వాతము ప్రకోపమునంది ద్రవరూప మగు రసధాతువును శోషింపజేసి వాతజతృష్ణను కల్గించు ననియు చరకమున జెప్పబడినది.

### పైత్తికతృష్ణాలక్షణము

మూర్ఛాన్నవిద్వేషవిలాపదాహాః రక్తేక్షణత్వం ప్రతతశ్చ శోషః,
శీతాభినన్దా ముఖతిక్తతా చ పిత్తాత్మికాయాం పరిధూపనం చ. 4

పిత్తమున గల్గినదప్పియందు మూర్ఛవచ్చును. అన్నద్వేషము గల్గును. సంబంధములేనిమాటలు మాట్లాడును. శరీరమున మంటపుట్టును. కన్ను లెఱ్ఱనగును. నోట చెమ్మలేక విశేషముగ నెండును. చల్లనినీళ్లుత్రాగు నభిలాష గల్గును. నోరు చేదుగ నుండును. సంతాపము గల్గును.

మరియు చరకమున "పీతాక్షిమూత్రవర్చస్త్వమాకృతిః పిత్తతృష్ణాయాః" (చరక. చి. అ. ౨౨. శ్లో. ౧౮) అనియుండుటంజేసి పైత్తికతృష్ణయందు కన్నులును మలమూత్రంబులును పచ్చనై యుండు నని యెరుంగునది. పిత్తము అగ్నిస్వరూపము కావున నయ్యది ప్రకోపమునంది యద్ధాతువైన రసమును శోషింపజేసి తృష్ణను గల్గించు ననియు, దీనియందు తక్కినవానికన్న తాపమధికముగ నుండు ననియు నెరుంగునది. ఈవిషయము చరకమునందలి "పిత్తం మతమాగ్నేయం కుపితం చేత్ తాపయత్యపాం ధాతుమ్, సన్తప్తస్సహి జనయేత్తృష్ణాం దాహోల్బణాం నృణామ్" (చరక. చి. అ. ౨౨ శ్లో. ౧౩) అను [illegible].

### కఫమున జనించిన తృష్ణాలక్షణము

బాష్పావరోధాత్కఫసంవృతేఽగ్నౌ తృష్ణా బలాసేన భవేత్తథా తు,
నిద్రా గురుత్వం మధురాస్యతా చ తృష్ణార్దితశ్శుష్యతి చాతిమాత్రమ్.

కఫము తనకు దగిన కారణములచే మిక్కిలి వృద్ధినొంది జఠరానలమును ధారాళముగ వెడలనీయక నడగించును. దానంజేసి జాఠరాగ్ని వేడి యధోముఖముగ ప్రసరించి జలవహంబు లగు రసాది ధాతువులను శోషింపజేసి (ఎండించి) తృష్ణను గల్గించును. ఇయ్యది కఫజనితంబైన తృష్ణ యనంబడును. దీనియందు అధికముగ నిదురవచ్చును. అన్నము జీర్ణముగాక శరీరము భారముగల్గియుండును. నోరు తీపి గల్గియుండును. అధికముగ శోష కల్గును.

ఇచ్చట కఫము ద్రవరూపంబైనను అయ్యది వృద్ధినొంది జఠరాగ్నిమార్గమును నిరోధించుటంజేసి యధోముఖముగ ప్రసరించి జలవహంబులగు రసాదిధాతువుల శోషింపజేయుటచే దప్పికల్గును. కావున కఫముగూడ దప్పికి హేతువగునని యెరుంగునది. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"స్వాద్వమ్ల లవణాభ్యస్తైః ప్రవృద్ధశ్లేష్మా సహోష్మణా, ప్రపద్యామ్బువహాం స్రోతస్తృష్ణాం సఞ్జనయేన్నృణామ్, శిరసో గౌరవం తన్ద్రా మాధుర్యం వదనస్య చ. ధ్రాణద్వేషః ప్రసేకశ్చ నిద్రాధిక్యం తథైవ చ. ఏభిర్లిఙ్గైర్విజానీయాత్ తృష్ణాం కఫసముద్భవామ్" (హారీతసంహిత) మధురంబును ఆమ్లరసంబును లవణరసంబును అజీర్ణకరంబులును నగు పదార్థముల భుజించుటచేత కఫము ప్రకోపమునంది జాఠరాగ్ని యొక్క వేడితోగూడి జలవహంబులగు రసాదుల వ్యాపించి దప్పిని గల్గించును. ఈతృష్ణయందు తలబరువును, మైకంబును, నోరుతీపియు, అన్నద్వేషంబును కలుగును. నోట కఫము వెడలును. అధికముగ నిదురపట్టును. ఇట్టి లక్షణములచే కఫజతృష్ణ యెరుంగనగు నని భావము.

మరియు కఫమున జనించు తృష్ణయందును పిత్తము సంబంధించియుండును. పిత్తవాతములు రెండును శోషింపజేయు గుణముకలవి. కావున నీరెండిటిలో నొకదాని సంబంధములేక జలధాతువు శోషించి దప్పికలుగజేయదు. కావున వాతపిత్తములు తృష్ణకు ప్రధానకారణములు. ఈవిషయమును చరకాచార్యులు "నాగ్నిం వినా హి తర్షః పవనాద్వా తౌ హి శోషణే హేతూ" (చరక. చి. అ. ౨౨. శ్లో. ౧౫.) అను వాక్యముచే శాసించిరి.

### క్షతజ-క్షయజతృష్ణాలక్షణములు

క్షతస్య రుక్ శోణితనిర్గమాభ్యాం
తృష్ణా చతుర్థీ క్షతజా మతా తు,

రసక్షయాద్యా క్షయసమ్భవా సా
తయాభిభూతశ్చ నిశాదినేషు. 6
పేపీయతేఽమ్భః స సుఖం న యాతి
తాం సన్నిపాతాదితి కేచిదాహుః,
రసక్షయోక్తాని చ లక్షణాని
తస్యామశేషేణ భిషగ్వ్యవస్యేత్. 7

కత్తి మొదలగు నాయుధములచే దెబ్బతగిలినచో నొప్పిచేతను రక్తము పైట వెడలుటచేతను దప్పి కల్గును. ఇయ్యది క్షతజ (దెబ్బవలన గల్గిన) తృష్ణ యని చెప్పబడును. భుజింపబడిన యాహారరసము క్షయించుటచే గల్గినది క్షయజతృష్ణ యనబరగు. దీనిచే బాధింపబడిన మనుజుడు రేయింబవలును ఎడతేక మాటిమాటికిని నీళ్లు త్రాగుచుండును. ఒకప్పుడును లేశమాత్రమైన శరీరమునకు సుఖము లేకుండును. రసక్షయమున గల్గు లక్షణములన్నియు నీవ్యాధియందు గల్గును. ఇయ్యది త్రిదోషముల సన్నిపాతమున గల్గునని కొందరాచార్యులు చెప్పెదరు.

"సతతం యః పిబేత్తోయం న తృప్తిమధిగచ్ఛతి పునః కాంక్షతి తోయం చ తం తృష్ణార్దితమాదిశేత్" (సుశ్రుత. ఉ. అ. ౪౮.) అనువాక్యముచేత తృష్ణాసామాన్యమున మనుజుం డెడతేక పలుమారు నీళ్లు త్రాగుచున్నను తనివిదీరక దప్పియణగక మరల నీళ్లు గోరుచుండు నని సామాన్యలక్షణమును సుశ్రుతాచార్యు లుపదేశించిరి. పైజెప్పినరీతిగ తృష్ణాసామాన్యముగ నెడతెగని దప్పియున్నను, మరల నిచ్చట "పేపీయతేఽమ్భః" అని చెప్పుటవలన తక్కిన తృష్ణారోగములకన్న నీక్షయజతృష్ణయందు దప్పి మిక్కుటముగ నుండు నని యెరుంగునది.

### ఆమజతృష్ణాలక్షణము

త్రిదోషలిఙ్గాఽఽమసముద్భవా చ హృచ్ఛూలనిష్ఠీవనసాదకర్త్రీ,

ఆహారము జీర్ణము గాకుండుటచే గల్గినది ఆమసముద్భవతృష్ణ యనబడు. దీనియందు త్రిదోషములకు వేర్వేఱ జెప్పినలక్షణములు గల్గియుండును. మరియు రొమ్ము నొప్పికల్గును. నోట నీరు వెడలును. బడలిక కల్గును. ఇయ్యది యామాజీర్ణముచే గల్గును. కావుననే ఆమాజీర్ణమునకు జెప్పిన త్రిదోషలక్షణములును దీనియందు గల్గును.

### అన్నజతృష్ణాలక్షణము

స్నిగ్ధం తథామ్లం లవణం చ భుక్తం గుర్వన్న మేవాశు తృషాం కరోతి,

మిక్కిలి జిడ్డుకల్గిన యాహారమును భుజించినను, మిక్కిలి పులుపును ఉప్పును గలపదార్థముల భుజించినను, జిగురుపదార్థముల భుజించినను, అతిశీఘ్రముగ దప్పిని గల్గించును. ఇయ్యది అన్నజతృష్ణ యని చెప్పబడును. (ఆమజతృష్ణయందు ఆహారము జీర్ణముగాకుండు ననియు, అన్నజతృష్ణ యజీర్ణము లేకున్నను కేవలము స్నిగ్ధాదిపదార్థములచే గల్గు ననియు పరస్పరభేదము తెలియంగునది.)

### ఉపసర్గజతృష్ణాలక్షణము

దీనస్వరః ప్రతామ్యన్ దీనస్సంశుష్కవక్త్రగలతాలుః,
భవతి ఖలు యోపసర్గాత్ తృష్ణా సా శోషిణీ కష్టా. ౯

ప్రధానముగ నొకవ్యాధి జనించినపుడు దానికుపద్రవముగ జనించిన దప్పి యుపసర్గజతృష్ణ యనబడును. దీనియందు రోగి మిక్కిలి హీనమైన స్వరము కలవాడై మూర్ఛ నొందును. మిక్కిలి దీనుడై నోటియందును కంఠమునందును దౌలువుల యందును చెమ్మలేక యెండును. ఇయ్యది చాల కష్టతరమైనది.

ఈ తృష్ణారోగము మిక్కిలి క్రూరమైన ప్రసేహము మున్నగువ్యాధులయందు శరీరము కృశించియున్నవారికి కల్గును. కావునసే మిక్కిలి కష్టసాధ్యమగును. ఈ విషయమును చరకాచార్యులు "ఘోరవ్యాధికృశానాం ప్రభవత్యుపసర్గభూతా సా" (చరక. చి. అ. ౨౨. శ్లో. ౭.) అనువాక్యముచే నుపదేశించిరి. మరియు మద్యపాన మున గల్గు తృష్ణాలక్షణము చరకమున నిట్లు చెప్పబడినది:—"తీక్ష్ణోష్ణరూక్షభావాత్ మద్యం పిత్తానిలౌ ప్రకోపయతి, శోషయతి జలం ధాతుం తావేవ చ మద్యశీలా నామ్, తప్తాస్వివసికతాసు హితో యథాశు శుష్యతి తథాస్మిన్, తేషాం సంతప్తానాం హిమజలపానాద్భవతి శర్మ" (చరక. చి. అ. ౨౨. శ్లో. ౨౧, ౨౨) మద్యమున తీక్ష్ణంబును ఉష్ణంబును రూక్షంబు నను గుణములు గల్గియుండుటవలన వాతపిత్తముల రెంటిని ప్రకోపింపజేయును. అయ్యవి ప్రకుపితములై యుదకవహంబులగు రసధాతువులను శోషింపజేయును. అట్టియెడ నుదకము కొంత త్రావినను, కాలియుండు ఇసుకలో బోయబడిన నీరు ఎండిపోవువిధముగ, జలమంతయు నిగిరి దప్పియగుచుండును. అట్టి సంతాపము గల్గినవాడు చల్లనినీళ్లను, (మంచునీళ్లను) త్రావినచో కొంచెము సుఖము కల్గును.

### అసాధ్యతృష్ణాలక్షణము

జ్వరమోహక్షయకాసశ్వాసాద్యుపసృష్టదేహానామ్,

సర్వాస్వతిప్రసక్తా రోగకృశానాం వమిప్రయుక్తానామ్. 10
ఘోరోపద్రవయుక్తా స్తృష్ణాః మరణాయ విజ్ఞేయాః.

జ్వరము, మూర్ఛ, క్షయము, దగ్గు, శ్వాసము ఇవి మున్నగు నుపద్రవములచే బాధింపబడినవారికి కల్గినతృష్ణావ్యాధియు నసాధ్యమగును. ఏరోగమునందైనను దప్పి మిక్కిలి తీవ్రముగ నధికముగ గల్గినచో నయ్యదియు నసాధ్యమగును. ఇతరములగు క్రూరములైన వ్యాధులచే శరీరము కృశించినవారికి జనించిన దప్పియు, మిక్కిలి క్రూరములగు నుపద్రవములచే బీడింపబడినయపుడును తృష్ణావ్యాధి యసాధ్యంబగును. తుదకు మరణముగూడ నొందించును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
తృష్ణానిదానం సమాప్తమ్.

# ౧౭. మూర్ఛాభ్రమనిద్రాతంద్రాసన్న్యాస నిదానమ్.

—→(·)←—

"తృషితో మోహమాయాతి" అను వాక్యముచేత తృష్ణారోగమున మూర్ఛ యుపద్రవముగ నుండు నని తెలియుటచేత తృష్ణావ్యాధిని జెప్పినపిదప మూర్ఛానిదానమును, అందుకు సమానరూపంబులగు భ్రమము, నిద్ర, తంద్ర, సన్న్యాసము అను వీని నిదానంబులును వరుసగ జెప్పబడును:—

## మూర్ఛాసంప్రాప్తి

క్షీణస్య బహుదోషస్య విరుద్ధాహారసేవినః,
వేగాఘాతాదభిఘాతాత్ హీనసత్త్వస్య వా పుంసః. 1
కరణాయతనేషూగ్రాః బాహ్యేష్వాభ్యన్తరేషు చ,
నివిశన్తే యదా దోషాః తదా మూర్ఛన్తి మానవాః. 2
సంజ్ఞావహాసు నాడీషుపిహితాస్వనిలాదిభిః,
తమోఽభ్యుపైతి సహసా సుఖదుఃఖవ్యపోహకృత్. 3
సుఖదుఃఖవ్యపోహాచ్చ నరః పతతి కాష్ఠవత్,
మోహో మూర్ఛేతి తామాహుః షడ్విధా సా ప్రకీర్తితా. 4
వాతాదిభిశ్శోణితేన మద్యేన చ విషేణ చ,
షట్స్వప్యేతాసు పిత్తం తు ప్రభుత్వేనావతిష్ఠతే. 5

ధాతువులు క్షీణించినవానికిని, అధికముగ వాతాదిదోషములుగలవానికిని, పరస్పర విరుద్ధములగు క్షీరమత్స్యాదులజేర్చి యాహారము చేసినవానికిని, మలమూత్రాదివేగముల నిరోధించినవానికిని, యుద్ధాదులచే దెబ్బలుతగిలినవానికిని, సత్త్వగుణము నశించినవానికిని, వాతపిత్తకఫములు ప్రకోపమునంది బాహ్యంబులగు వాక్పాదపాణిపాయూపస్థములను నైదు కర్మేంద్రియస్థానములయందు త్వక్ చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములను నైదు జ్ఞానేంద్రియస్థానములను వ్యాపించినందువలన మూర్ఛ కలుగును. జ్ఞానమును వహించు నాడులయందు క్రూరములగు వాతపిత్తకఫములు వ్యాపించి మార్గము నడ్డగించినచో

జ్ఞానము తిరోధానమునంది యజ్ఞానము వ్యాపించును. అట్టియజ్ఞానముచేత సుఖదుఃఖముల నెఱుంగ నవకాశము లేకుండును. దానంజేసి మనుజుడు ఒడలెఱుంగక మైమఱచి శరీరమునకును మనస్సునకును సంబంధించిన చేష్టలదక్కి కొయ్యవలె క్రిందబడును. ఇయ్యది మోహ (అజ్ఞాన) మనియు, మూర్ఛ యనియు జెప్పబడును. ఇయ్యది వాతము, పిత్తము, కఫము, రక్తము, మద్యపానము, విషము అను కారణములచే జనించుటంజేసి యాఱువిధములగును. ఈయాఱువిధములగు మూర్ఛలయందును పిత్తము ప్రధానముగ రాజై యుండును.

### మూర్ఛాపూర్వరూపము

హృత్పీడా జృమ్భణం గ్లానిః సంజ్ఞాదౌర్బల్యమేవ చ,
సర్వాసాం పూర్వరూపాణి యథాస్వం చ విభావయేత్. ౬

రొమ్మునొప్పి, ఆవలింతలు, శరీరమునందలి నిరుత్సాహమైన బడలిక, తెలివి తక్కువగుట, ఇవియన్నియు మూర్ఛవచ్చుటకు మున్ను జనించు పూర్వరూపములు.

### వాతికమూర్ఛాలక్షణము

నీలం వా యది వా కృష్ణం ఆకాశమథవాఽరుణమ్,
పశ్యంస్తమః ప్రవిశతి శీఘ్రం చ ప్రతిబుధ్యతే. 7
వేపథుశ్చాఙ్గమర్దశ్చ ప్రపీడా హృదయస్య చ,
కార్శ్యం శ్యావారుణా ఛాయా మూర్ఛాయే వాతసమ్భవే. 8

మనుజుడు ఆకసమును నీలవర్ణముగనైనను, కృష్ణవర్ణముగనైనను, కొంచెము ఎఱ్ఱనిరంగు కల దానినిగనైనను జూచుచు, జ్ఞానము తప్పిపడి; మరల శీఘ్రముగనే మూర్ఛ దేరినచో నయ్యది వాతప్రకోపమున జనించిన మూర్ఛ యని తెలియునది. ఈమూర్ఛయందు శరీరము వడవడ వణంకును. ఒడలెల్ల నొప్పి కల్గును. రొమ్ము పట్టినట్లు నొప్పి కల్గును. శరీరము కృశించును, శరీరమున శ్యామవర్ణంబైనను అరుణవర్ణంబైనను కల్గును. (ఇచ్చట మూర్ఛాయ శబ్దము మూర్ఛాశబ్దమునకు పర్యాయనామమని యెఱుంగునది.)

### పిత్తజమూర్ఛాలక్షణము

రక్తం హారితవర్ణం వా వియత్పీతమథాపి వా,
పశ్యంస్తమః ప్రవిశతి సస్వేదశ్చ ప్రబుధ్యతే. 9
సపిపాసస్ససన్తాపో రక్తపీతాఽకులేక్షణః,
సమ్భిన్నవర్చాః పీతాభో మూర్ఛాయే పిత్తసమ్భవే. 10

ఆకసము ఎఱ్ఱనిరంగుకలదిగనైనను ఆకుపచ్చనిరంగు కలదిగనైనను పసుపురంగు కల్గినదిగనైనను కనబడి తెలివితప్పి మూర్ఛనొంది, మరల తెలివొంది మూర్ఛదేరినపుడు చెమటపట్టి లేచినచో నయ్యది పిత్తప్రకోపమున గల్గిన మూర్ఛ యని తెలియందగు. ఈ మూర్ఛయందు దప్పి కల్గును. ఒడలియందు తాపము కల్గును. కన్నులు రక్తవర్ణంబులును, లేక పచ్చనిరంగు గల్గినవియు, లేక అరుణవర్ణంబులు నై యుండును. మలము సడలును. శరీరము పచ్చనిరంగు కల్గియుండును.

### శ్లైష్మికమూర్ఛాలక్షణము

మేఘసఙ్కాశమాకాశం ఆవృతం వా తమోఘనైః,
పశ్యంస్తమః ప్రవిశతి చిరాచ్చ ప్రతిబుధ్యతే. 11
గురుభిః ప్రావృతైరఙ్గై ర్యథైవార్ద్రేణ చర్మణా,
సప్రసేకస్సహృల్లాసో మూర్ఛాయే కఫసమ్భవే. 12

ఆకసము మేఘముల (మబ్బు) తో సమముగనైనను, లేక చీకటిచేతనైనను, మబ్బుచేనైనను గ్రమ్మబడినదానినిగను జూచుచు, మే నెరుంగక పడి చిరకాలమునకు ప్రజ్ఞదెలిసినచో నయ్యది కఫప్రకోపమున గల్గిన మూర్ఛ యని యెరుంగునది. అట్టి మూర్ఛగల్గినపుడు శరీరముపై మోటుగుడ్డలనైనను దడిసిన చర్మముపైనను గప్పిన ట్లుండును. నోటనీరు వెడలును రొమ్ము అదరును.

### సాన్నిపాతికమూర్ఛాలక్షణము

సర్వాకృతిస్సన్నిపాతాదపస్మార ఇవాగతః,
స జన్తుం పాతయత్యాశు వినా బీభత్సచేష్టితైః. 13

త్రిదోషముల సన్నిపాతముచే గల్గిన మూర్ఛయందు వాతాదులకు వేర్వేరుగ జెప్పబడిన లక్షణములన్నియు గల్గును. చొంగగారుట మున్నగు బీభత్సకరములైన చేష్టలుదక్క తక్కిన యపస్మారలక్షణములు కల్గును. అట్టి లక్షణములతోగూడిన మనుజుడు అతిశీఘ్రముగ క్రిందపడును.

(ఇచ్చట మూర్ఛావ్యాధిని వివరించునపుడు ఆరువిధములుగ విభజించి సన్నిపాత భేదమును చెప్పియుండలేదు. అయినను సన్నిపాతమున త్రిదోషములకు జెప్పిన లక్షణములే కానవచ్చు నని పరిగణనము వేరుగ జేయలే దని యెరుంగునది.)

### రక్తజమూర్ఛాలక్షణము

పృథివ్యాపస్తమోరూపం రక్తగన్ధస్తదన్వయః,
తస్మాద్రక్తస్య గన్ధేన మూర్ఛన్తి భువి మానవాః. 14
ద్రవ్యస్వభావ ఇత్యేతే దృష్ట్వా యదభిముహ్యతి,

పంచమహాభూతములలో పృథివియు జలంబును తమోగుణము కల్గియుండును. రక్తమునందలి గంధము పృథివీభూతమున గల ప్రధానగుణమైన గంధమువలన గల్గినది. ద్రవము జలసంబంధమున గల్గినది కావున రక్తమున పృథివియొక్కయు జలము యొక్కయు గుణములు సంక్రమించును. కావున పృథివీజలములయందు గల తమోగుణంబును, పృథివికి ప్రధానమైన గంధంబును రక్తమును జేరియుండును. దానంజేసి రక్తముయొక్క గంధము (పరిమళము)ను మూర్కొనినంతమాత్రమున అందలి తమోగుణము వ్యాపించి జ్ఞానవహంబులగు ధమనుల జేరచి జ్ఞానమును పోగొట్టి యజ్ఞానము వ్యాపించి మనుజుడు మూర్ఛనొందును. రక్తము మూర్కొనకున్నను చూచినంత మాత్రమున గూడ మూర్ఛనొందుట కలదు. దీనికి ద్రవ్యముయొక్క స్వభావమే కారణముగాని వేరొండు కారణము గానరాదని కొందరు వచించెదరు.

మరియు రక్తమును జూచినను దానిగంధమును మూర్కొనినను మూర్ఛకల్గును. ఇదియే రక్తజమూర్ఛ. దీనియందు మనుజుడు చలనములేక నిలబడిన కన్నులుకలవాడై యూపిరియుండు సంగతి తెలియక శ్వాసము గూఢముగ నణగియుండును. ఈవిషయము భోజునిచే నిట్లు చెప్పబడినది:—"స్తబ్ధాఙ్గదృష్టిర్భవతి గూఢోచ్ఛ్వాసస్తథైవ చ, దర్శనాదసృజస్తజ్జాద్గన్ధాచ్చైవ ప్రముహ్యతి."

మరియు పంచభూతస్వరూపముల నిరూపించుతరి సుశ్రుతాచార్యుడు "సత్త్వతమోబహుళా ఆపః, తమోబహుళా పృథ్వీ" అని చెప్పియున్నాడు కావున పృథివీజలములయందు తమోగుణము వ్యాపించి యున్నదని తెలియనగును.

### విషజ-మద్యజమూర్ఛాలక్షణములు

గుణాస్తీవ్రతరత్వేన స్థితాస్తు విషమద్యయోః. 12
త ఏవ తస్మాత్తాభ్యాన్తు మోహౌ స్యాతాం యథేరితౌ,

విషమునందును మద్యమునందును లఘ్వాదిగుణములన్నియు తక్కినద్రవ్యములకన్న మిక్కిలి తీవ్రములైయుండును. కావున విషముచేతను మద్యపానముచేతను మూర్ఛ కల్గును. అందు స్థావరజంగమరూపమైనవిషముచే జనించినది విషజమూర్ఛ యనియు, మద్యపానమున జనించినది మద్యజమూర్ఛ యనియు పిలువంగునది. (విషము తనంతట జీర్ణమగునది కాదు. కావున విషమువలన బుట్టినమూర్ఛ తనంతట శమింపక చికిత్స నపేక్షించును. మద్యము శరీరమునందెల్ల వ్యాపించి తనంతట కొంతకాలమునకు జీర్ణమగును కావున మద్యము జీర్ణమై వేగం బుడిగినప్పుడు దాన గల్గుమూర్ఛయు తనంతటనే శమించును.)

మద్యమునందును విషమునందును లఘ్వాదిగుణములన్నియు సమములుగ నుండునుగాని అట్టి గుణములు మద్యమునందుకన్న విషమునందు మిక్కిలి బలిష్ఠములుగ

నుండును ఈవిషయము తంత్రాంతరమున "యే విషస్య గుణాః ప్రోక్తాః సన్నిపాత ప్రకోపనాః, త ఏవ మద్యే దృశ్యన్తే, విషే చ బలవత్తరాః" అను శ్లోకముచే చెప్పబడినది.

మరియు విషముయొక్కయు, మద్యముయొక్కయు గుణములు చరకమున నిట్లు చెప్పబడినవి:—"లఘు రూక్షమాశు విశదం వ్యవాయి తీక్ష్ణం వికాసి సూక్ష్మం చ, ఉష్ణమనిర్దేశ్యరసం దశగుణయుక్తం విషం తద్జ్ఞైః" (చరక. చి. అ. ౨౩) లఘుత్వము (తేలిక) రూక్షము (జిడ్డులేనిది), ఆశు (శీఘ్ర)ముగ పనిచేయునది). విశదము (విరళముగ నుండునది), వ్యవాయి (తొలుత శరీరమునందెల్ల వ్యాపించి కాలాంతరమున జీర్ణించునది), తీక్ష్ణము, వికాసి (నీటనుంచిన నూనెవలె విస్తీర్ణముగ వ్యాపించునది.) సూక్ష్మము (మిక్కిలి సన్నని ప్రదేశమున గూడ వ్యాపించుశక్తి) ఉష్ణము, నిర్ణయింప సాధ్యము కాని యవ్యక్తరసము గల్గియుండుట. అను నీపది గుణములును విషమునకుండునని ప్రాజ్ఞులు చెప్పిరి. "యేవిషస్య......త ఏవ మద్యే దృశ్యన్తే" అని చెప్పియుండుటంజేసి యీ పదిగుణంబులును మద్యమునందు నుండు నని యెరుంగునది.

### ర క్తజ-విషజ-మద్యజమూర్ఛలస్వరూపము

స్తబ్ధాదృష్టిస్త్వసృజా గూఢోచ్ఛ్వాసశ్చ మూర్ఛితః. 16
మద్యేన విలపం శ్శేతే నష్టవిభ్రాన్తమానసః,
గాత్రాణి విక్షిపన్ భూమౌ జరాం యావన్న యాతి తత్. 17
వేపథుస్వప్నతృష్ణాస్స్యుః తమశ్చ విషమూర్ఛితే,
వేదితవ్యం తీవ్రతరం యథాస్వం విషలక్షణైః. 18

రక్తమువలన గల్గిన మూర్ఛయందు కన్నులు కదలక స్తంభించియుండును, ప్రాణవాయువు సంచరించునది తెలియక జీవములేనివానికింబోలె లీనముగ నుండును. మద్యపానమున గల్గిన మూర్ఛయందు తెలివితప్పి మనసు చంచలమై తన కిచ్చవచ్చినట్లు సంబంధము లేని దుర్భాషల బలుకుచు, శరీరమునందలి అవయవముల నన్నిటిని నిర్వ్యాపారముగ భూమిపయిం బడవైచి మద్యము జీర్ణంబై వేగమడగునందాక పడియుండును. విషముచే జనించిన మూర్ఛయందు శరీరమెల్ల వణకును. నిదురవచ్చును. దప్పి యధికమగును. కన్నులకు చీకటి గ్రమ్మురీతిగ నేమియు దెలియకుండును. మరియు నీ విషజమూర్ఛయందు ఆయా విషముయొక్క స్వభావమునుబట్టి గాని తీవ్రలక్షణముల గుర్తించునది.

### మూర్ఛ-భ్రమ-నిద్రలకు కారణములు

మూర్ఛాపిత్తతమఃప్రాయా రజఃపిత్తానిలాద్భ్రమః,
తమో వాతకఫాత్తన్ద్రా నిద్రాశ్లేష్మతమోభవా. 19

(చక్రవద్భ్రమతో గాత్రం భూమౌ పతతి సర్వదా,
భ్రమరోగ ఇతి జ్ఞేయో రజః పిత్తానిలాత్మకః)

పిత్తప్రకోపముచేతను తమోగుణము వ్యాపించుటచేతను మూర్ఛ కలుగును. వాతపిత్తములు రెండును ప్రకోపించి రజోగుణము వ్యాపించునపుడు భ్రమకల్గును. వాతకఫములు ప్రకోపించి తమోగుణము వ్యాపించినపుడు *తన్ద్రి (ఏమరుపాటు) కల్గును. కఫము ప్రకోపించి తమోగుణము వ్యాపించిననాడు నిద్ర కల్గును. పైజెప్పిన వానిలో భ్రమ యనుదానియందు మనుజుడు తన శరీరమును చక్రమువలె తిరుగు చున్నట్లు గాంచుచు భూమిపై చేష్టల నుడిగి పడియుండును. ఇయ్యది రజోగుణము చేతను వాతపిత్తముల ప్రకోపముచేతను గల్గును.

## తన్ద్రాలక్షణము

ఇన్ద్రియార్థేష్వసంవిత్తిః గౌరవం జృమ్భణం క్లమః,
నిద్రార్తస్యేవ యస్యేహా తస్య తన్ద్రాం వినిర్దిశేత్. 20

శ్రోత్రత్వక్ చక్షుర్జిహ్వాఘ్రాణములను పఞ్చేన్ద్రియములును వానివానికి విషయములైన శబ్దస్పర్శరూపరసగంధ ములను వరుసగ నెరుంగక, శరీరము బరువై ఆవలింతలును బడలికయును గల్గి, మేల్కొనియుండు సమయమున నిదురించువానివలె నున్నచో నయ్యది తంద్రయనంబరగు.

నిద్రాస్వరూపము సుశ్రుతమున నిట్లు చెప్పఁబడియె:—"నిద్రాన్తు వైష్ణవీం మాయాం పాప్మానముపదిశన్తి; సా స్వభావత ఏవ సర్వప్రాణినోఽభిస్పృశతి...... హృదయం చేతనాస్థానముక్తం సుశ్రుతదేహినామ్ తమోభిభూతే తస్మింస్తు నిద్రా విశతి దేహినామ్, నిద్రాహేతుస్తమః" నిద్ర యనునది విష్ణుసంబంధమైన మాయ యని ప్రాచీనులు వచించెదరు. అయ్యది సర్వప్రాణులను స్వభావముగనే ప్రతిదినంబును ఆవహించుచుండును. సకలప్రాణులకును హృదయము జ్ఞానస్థానమై యుండును. అట్టి హృదయము తమోగుణముచే వ్యాపింపబడి యున్నపుడు ప్రాణులకు నిద్రవచ్చు నని యర్థము. మరియు మనస్సునకును శరీరమునకును ఇంద్రియములకును అభిఘాతాదులచే శ్రమగల్గి బడలికతోయినప్పుడు నిదురవచ్చును. ఈ విషయము చరకమున నిట్లుపదేశించెను:—"యదా తు మనసి క్లాన్తే కర్మాత్మా చ శ్రమాన్వితః విషయేభ్యో నివర్తేత తదా స్వపితి మానవః." (చరక. సూ. అ. ౨౧) ఇయ్యది ప్రతిదినంబును మానవులకు సాధారణముగ గల్గు నిదురకాదు దీనివలన కొన్నిరోగంబులును కల్గును. ఇదియే వైకారికీ నిద్రయనబడును.

---

* తంద్రనే "సోమ్నొలెన్స్" మని యింగ్లీషున వాడబడుచున్నది.

### సన్న్యాసమూర్ఛలకు పరస్పరభేదము

దోషేణ మదమూర్ఛాయా కృతవేగేషు దేహినామ్,
స్వయమేవోపశామ్యన్తి సన్న్యాసో నౌషధైర్వినా. 21

వాతాది దోషముల ప్రకోపమున గల్గిన మద మూర్ఛలయందు అట్టి వాత పిత్తకఫములు తమతమ వేగమును పూర్తిగ జూపి తమంతటనే శాంతి నొందినపుడు, దాన జనించిన మూర్ఛయు దనకుదానే శమించును సన్న్యాసంబను వ్యాధి యౌషధముల సేవించి తగిన చికిత్స నందక తనంతట శాంతి నొందదు. ఇదియే మూర్ఛారోగమునకును సన్న్యాసమునకును భేదము.

### సన్న్యాసలక్షణము

వాగ్దేహమనసాం చేష్టా మాక్షిప్యాతిబలా మలాః,
సన్న్యస్యన్త్యబలం జన్తుం ప్రాణాయతనమాశ్రితాః. 22
స నా సన్న్యాససన్న్యస్తః కాష్ఠీభూతో మృతోపమః,
ప్రాణైర్వియుజ్యతే శీఘ్రం ముక్త్వా సద్యఃఫలాం క్రియామ్. 23

తమతమ కారణములచే మిక్కిలి ప్రబలముగ వృద్ధినంది ప్రకుపితములైన వాతపిత్తకఫములు వాక్కుయొక్కయు, మనసుయొక్కయు, దేహముయొక్కయు చేష్టల మాన్పి, ప్రాణాధారమైన హృదయమున జేరి, బలహీనుడగు మనుజుని ప్రజ్ఞ దప్పించి, క్రిందపడవేయును. ఇదియ సన్న్యాస మనబడును. మనుజుడు గః వ్యాధిచే పీడితుడై కొయ్యవలె నిటునిటు చచ్చినవానివలెనే క్రిందపడియుండును. అట్టి సమయమునం దతిశీఘ్రముగ బనిసేయుచికిత్స నతిశీఘ్రముగ జేయనిచో మనుజుడు ప్రాణముల వదలి జముని కతిథి యగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
మూర్ఛా భ్రమ-నిద్రా-తన్ద్రా-సన్న్యాసనిదానమ్
సమాప్తమ్.

# ౧౮. పానాత్యయ—పరమద—పానాజీర్ణ— పానవిభ్రమ నిదానమ్.

మూర్ఛ జనించుటకు మద్యపానము గూడ నొక కారణ మని పై జెప్పబడినది. కావున మూర్ఛానిదానమును జెప్పినపిదప మద్యపానమువలన గల్గు పానాత్యయము మున్నగువాని నిదానమును జెప్పుట.

## మద్యపానమున మూర్ఛగల్గుటకు కారణములు

యే విషస్య గుణాః ప్రోక్తాః తేఽపి మద్యే ప్రతిష్ఠితాః,
తేన మిథ్యోపయుక్తేన భవత్యుగ్రో మదాత్యయః. 1
కిన్తు మద్యం స్వభావేన యథైవాన్నం తథా స్మృతమ్,
అయుక్తియుక్తం రోగాయ యుక్తియుక్తం యథాఽమృతమ్. 2
ప్రాణాః ప్రాణభృతామన్నం తదయుక్త్యా హినస్త్యసూన్,
విషం ప్రాణహరం తచ్చ యుక్తియుక్తం రసాయనమ్. 3

విషమునకుం గల లఘుత్వరూక్షత్వాది గుణములన్నియు మద్యమునకును గలవు. కావున నట్టిమద్యమును శాస్త్రవిధికి విరుద్ధముగ నధికప్రమాణముగ సేవించినచో మిక్కిలి క్రూరమగు మదాత్యయ మనువ్యాధి జనించును. స్వభావముచేత నన్నము మనుజులకు నెట్లు బలకరమును, శరీరమును పోషించునదియు నగునో అత్తెరంగుననే మద్యము గూడ శరీరమున నుత్సాహము గల్గించును. అయ్యది శాస్త్రము నెరుంగక మితిలేక సేవించినచో పలుతెరంగులైన రోగముల గల్గించును. మితమైన ప్రమాణము గల్పించి యుక్తియుక్తముగ సేవించినవానికి అమృతముతోడ బలమును గల్గించి శరీరమును పోషించును. అన్నము మనుజులకెల్ల బలకరమై ప్రాణముల కాధారముగ నుండును. అయినను, అట్టి యన్నమును యుక్తిదూరముగ ప్రమాణమునకు మీరి భుజించినచో ప్రాణములను హింసింపకమానదు. విషము స్వభావముచేతనే ప్రాణముల హరించునది. అయినను దానిని శాస్త్రోక్తప్రకారము మిక్కిలి తక్కువ యగు ప్రమాణము గల్పించి సేవించినచో ముసలితనమును వ్యాధులను బోనడచి యౌవనమును స్థిరపరచి శరీరమును పోషించును. (కావున విషమునకు సమానగుణములుగల మద్యమును గూడ

తగిన పరిమాణముచే సేవించినయెడ శరీరమును బోషించును. అటుగాక మితిమీరి సేవించిననాడు నానారోగముల కాధారంబగు నని భావము.)

"ద్వే యవాపత్రె హేమ్నస్తు తులం దద్యాద్విషస్య చ" (చరక. చి. అ. ౧) అను చరకవచనము ననుసరించి విషమునకు సువ్వగింజంత మాత్రము సామాన్యప్రమాణ మని తెలియనగును. అంతకన్న నధికముగ నుపయోగించు నెడ తప్పక ప్రాణముల హింసించును.

## యుక్తియుక్తమద్యసేవచే జనించుగుణములు

విధినా మాత్రయా కాలే హితైరన్నై ర్యథాబలమ్,
ప్రహృష్టో యః పిబేన్మద్యం తస్య స్యాదమృతోపమమ్. 4
స్నిగ్ధైస్తదన్నై ర్మాంసైశ్చ భక్ష్యైశ్చ సహ సేవితమ్,
భవేదాయుఃప్రకర్షాయ బలాయోపచయాయ చ. 5
కామ్యతా మనసస్తుష్టిః తేజోవిక్రమ ఏవ చ,
విధివత్సేవ్యమానే తు మద్యే సన్నిహితా గుణాః. 6

శాస్త్రవిధి ననుసరించి యుక్తమైన పరిమితి గల్పించి తగినకాలమున ప్రశస్తమైన మద్యమును శరీరబలానుసారముగ ద్రాగి, హితంబు (మద్యపానమున పథ్యకరంబు)లగు నన్నపానముల సేవించి సంతోషచిత్తుడై యున్నచో వానికి నామద్యము నమృత మునుంబోలె బలకరంబగును. మరియు మద్యమును మిక్కిలి స్నిగ్ధము (గిడ్డుగనున్నవి) లగు మంచి యన్నములతోనైనను, స్నిగ్ధంబులగు మాంసములతోనైనను, భక్ష్యము లతోనైనను గూర్చి సేవించినయెడ నయ్యది యాయువును వృద్ధినందించి శరీరమునకు బలమును పుష్టిని గల్గించును. మరియు శరీరసౌందర్యంబును, మనస్సునకు సంతోషంబును, తేజంబును, పరాక్రమంబును మిగుల వృద్ధినొందును. పై జెప్పంబడిన గుణములన్నియు శాస్త్రోక్తముగ పైజెప్పబడిన పరిమాణాదుల ననుసరించి మద్యపానము జేసిననాడు కల్గును.

పై జెప్పనరీతిగ స్నిగ్ధంబులైన యన్నాదుల భుజింపక కేవలము పరగడుపున మద్యపానము జేసినయెడ శరీరమున సౌందర్యాదులు నశించి యాయువుక్షీణించి యకాల మరణముగూడ సంభవించు నని భావము.

మరియు "మైరేయం మదిరా శీధు చతుర్థం మధు చోచ్యతే. ఏకైకం షడ్రసం త్వత్ర రసతశ్చామ్లమిష్యతే" అని తంత్రాంతరమున భోజుడు చెప్పెను. కావున మైరేయము, మదిర, శీధువు, మధువు నని మద్యము నాల్గువిధంబులగు లగును

ఈనాల్గిటిలో నొక్కొకటియు మధురాదిషడ్రసముల గూడి యుండుననియు, అందును పులుపు (అమ్లరసము) మిక్కుటముగ నుండుననియు నెరుంగునది. పై మద్యములు నాల్గిటికిని ప్రత్యేకలక్షణముల గ్రంథాంతరముల జూచునది. మరియు, "సర్వేషామమ్లజాతానాం మద్యం మూర్ధ్ని వ్యవస్థితమ్" అను తంత్రాంతరవచనముచే పులుపుకల ద్రవ్యములలో మద్యము ఉత్కృష్టముగ నుండు నని తెలిసెడిని.

మరియు మద్యపానముచే మదము జనించుక్రమము చరకమున నిట్లు చెప్పబడియె:—"మద్యం హృదయమావిశ్య స్వగుణైరోజసో గుణాన్, దశభిర్దశ సంక్షోభ్య చేతో నయతి విక్రియామ్, లఘూష్ణతీక్ష్ణసూక్ష్మామ్లవ్యవాయ్యాశుగమేవ చ, రూక్షం వికాసి విశదం మద్యం దశగుణం స్మృతమ్ గురు శీతం మృదు శ్లక్ష్ణం బహులం మధురం స్థిరం, ప్రసన్నం పిచ్ఛిలం స్నిగ్ధం ఓజో దశగుణం స్మృతమ్. గురుత్వం లాఘవాత్, శైత్యం చౌష్ణ్యాత్, అమ్లస్వభావతఃమాధుర్యం, మార్దవం తైక్ష్ణ్యాత్, ప్రసాదం చాశుభావనాత్, రౌక్ష్యాత్స్నేహం, వ్యవాయిత్వాత్స్థిరత్వం, శ్లక్ష్ణతామపి-వికాసిభావాత్, పైచ్ఛిల్యం వైశద్యాత్, సాన్ద్రతాం తథా సౌక్ష్మ్యాత్ మద్యం నిహన్త్యేవమోజసస్స్వగుణైర్గుణాన్, సత్వం తదాశ్రయత్వాచ్చ సంక్షోభ్య జనయేన్మదమ్" (చరక. చి. అ. ౨౪. శ్లో. ౨౯-౩౪) లఘుత్వము (తేలిక), ఉష్ణత్వము (వేడి), తీక్ష్ణత్వము (తీవ్రత్వము), సూక్ష్మత్వము (సూక్ష్మమైన యాకారము గల్గియుండుట), అమ్లత్వము (పులుపు), వ్యవాయిత్వము (మొదట శరీరమునందెల్ల వ్యాపించి పిదప జీర్ణం బగుట), ఆశుకారిత్వము (అతిశీఘ్రముగ పనిజేయుట), రూక్షత్వము (జిడ్డులేకుండుట), వికాసిత్వము (నీళ్లలో నుంచబడిన నూనెచుక్కవలె నల్లడల వ్యాపించుట) విశదత్వము (ఇతరవస్తువుల గలియకుండుట) అను నీ పదిగుణంబులును మద్యమున జేరియుండును. గురుత్వము (భారము), శీతము (చల్లదనము), మృదుత్వము (మెత్తన), శ్లక్ష్ణత్వము (నునుపు), మధురత్వము (తీపి), స్థిరత్త్వము (ఒకచోటనే నిల్కడకల్గి నిలిచియుండుట), ప్రసన్నత్వము, పిచ్ఛిలత్వము (మరొకదానితో గలయునది), స్నిగ్ధత్వము (జిడ్డు) అను నీపదిగుణంబులును ఓజస్సున నిమిడియుండును. మద్యము పైజెప్పిన వరుసప్రకారము తనయందలి పదిగుణముల చేతను ఓజస్సున నుండు పదిగుణములను బొత్తుగ జెరిచి హృదయమున జేరి మనసును చెడగొట్టి వికృతినందించును. ఎట్లనగ:—మద్యము తనకు సహజమైన లఘుత్వముచేత నోజస్సునందలి గురుత్వమును, ఉష్ణత్వముచేత శైత్యమును, పులుపుచేత తీపిని, తీక్ష్ణగుణముచేత మృదుత్వమును, ఆశుకారిత్వముచేత ప్రసన్నతను, రూక్షత్వముచేత స్నిగ్ధగుణమును, వ్యవాయిత్వము (వ్యాపించుగుణము) చేత స్థిరత్వమును, వికాసిత్వముచేత శ్లక్ష్ణతను, విశదముచేత పిచ్ఛిలత్వమును, సూక్ష్మత్వముచేత సాంద్రత్వమును, చెరచి అట్టి యోజస్సు నాశ్రయించియుండు సత్వగుణమును

భోత్తుగ నతి శీఘ్రముగ జెడగొట్టి, మదమును గల్గించును. ఇచ్చట నోజస్సునగల గురుత్వాదిగుణములకు మద్యమునగల లఘుత్వాది గుణములు పదియును స్వభావముచే విరుద్ధములు కావున నాయాగుణములకు విరుద్ధములగు గుణములను చెరచి మదాత్యయమును గల్గించు నని భావము.

మరియు మద్యమునందలి పదిగుణములచే గల్గు విశేషముల సుశ్రుతాచార్యులిత్తెరగున నిర్దేశించిరి:—"ఔష్ణ్యాచ్ఛీతోపచారం తత్ తైక్ష్ణ్యాద్ధంతి మనోగతిమ్, విశత్యవయవాన్ సౌక్ష్మ్యాత్ వైశద్యాత్కఫశుక్రనుత్. మారుతం కోపయేద్రౌక్ష్యాత్ ఆశుత్వాదాశుకర్మకృత్, హర్షణం చ వ్యవాయిత్వాత్ వికాసిత్వాద్విసర్పతి" మద్యము తనయందు స్వభావసిద్ధమగు నుష్ణగుణముచేత శీతోపచారముల పనిచేయనీయక చెడగొట్టును. తీక్ష్ణగుణముచేత మనోగమనమును చెరచును. సూక్ష్మగుణముచేత అవయవముల సూక్ష్మభాగములయందెల్ల వ్యాపించును. విశదత్వముచేత కఫమును శుక్రమును చెడగొట్టి నశింపజేయును. రూక్షత్వముచేత వాతమునగల స్నిగ్ధత్వమును నశింపజేసి వాతమును ప్రకోపింపజేయును. ఆశుకారిత్వముచేత నతిశీఘ్రముగ సత్వగుణమును జెరచి తమోగుణ ప్రధానములగు మోహాముర్ఛాదుల గల్గించును. వ్యవాయిత్వముచేత జీర్ణముగాకమునుపే శరీరమున వ్యాపించి రోమాంచమును గల్గించును. వికాసిత్వముచేత తైలబిందువు నీళ్లలో వ్యాపించువిధముగ శరీరమునందు నలుప్రక్కల నతిశీఘ్రముగ వ్యాపించును. ఈసుశ్రుత వాక్యమునందు చరకమున జెప్పబడిన పదిగుణములలో లఘుత్వము అమ్లత్వము నను రెండు గుణముల విడిచి తక్కిన యెనిమిదిగుణములు మాత్రము చెప్పబడినవి. మొత్తముపైన మద్యము విషమునులోలె ప్రాణాంతకమనుట యెల్లరి నందరి మతమున నిర్వివాదము.

## ప్రథమమదలక్షణము

బుద్ధిస్మృతిప్రీతికరస్సుఖశ్చ పానాన్ననిద్రారతివర్ధనశ్చ,
సంపాఠగీతస్వరవర్ధనశ్చ ప్రోక్తోఽతిరమ్యః ప్రథమో మదో హి.

పైజెప్పినరీతిగ మద్యపానముచే నోజస్సును, బుద్ధియు చెడుటచే గల్గినమత్తు మద మనబడును. అయ్యది యవస్థాభేదముచే గల్గు తారతమ్యముచే నాల్గువిధములు. అందు మొదటిమదమున బుద్ధికిని స్మృతికిని ప్రీతిని బుట్టించును. శరీరమునకు సుఖమును కల్గించును. అన్నపానములందును, నిద్రయందును మిక్కిలి యభిలాషను వృద్ధినొందించును. పాఠములు చదువుటకును, సంగీతము పాడుటకును, కంఠస్వరమును వృద్ధినొందించి యుత్సాహమును గల్గించును. ఇయ్యది, మద్యపానమున

జనించిన ప్రథమ మదము. మదము లన్నిటియందును మనోబుద్ధులు వికృతిజెందుట సామాన్యలక్షణం బైనను ప్రథమమదమున మాత్రము మదముత్కటముగాక యుత్సాహమును గల్గించుటంజేసి రమ్యముగనుండు నని యెరుంగునది.

ఇచ్చట గడచినవిషయమును స్మరించు మనశ్శక్తి స్మృతి యనియు, తాత్కాలికవిషయముల బర్యాలోచించు శక్తి బుద్ధి యనియు భేదము నెరుంగునది. ఈ విషయమును "స్మృతిర్వ్యపేతవిషయా బుద్ధిస్తాత్కాలికీ మతా" అని లాక్షణికులు వచించిరి.

## ద్వితీయమదలక్షణము

అవ్యక్తబుద్ధిస్మృతివాగ్విచేష్టస్సోన్మత్తలీలాకృతిరప్రశాన్తః,
ఆలస్యనిద్రాభిహతో ముహుశ్చ మధ్యేన మత్తః పురుషో మదేన.

రెండవస్థితియం దుండు మద్యపానమువలన జనించిన (మధ్యమమైన)మదముచే మత్తుగొనిన మనుజుడు బుద్ధియొక్కయు, స్మృతియొక్కయు, వాక్కుయొక్కయు బలము చెడి వానివానిపనులయందు తగినంత వ్యక్తత లేకయుండును. పిచ్చివాని వంటి యాకారముకల్గి పిచ్చిపనుల జేయుచుండును. శాంతము కొంచెమైనలేక యింద్రియము లకు లొంగి కోపము గల్గి యుండును. పనులయందు చురుకుదనములేక మందు డగును. ఒడలెరుంగక నిద్రచే మాటిమాటికి బాధింపబడును.

## తృతీయమదలక్షణము

గచ్ఛేదగమ్యాన్న గురూంశ్చ మన్యేత్
ఖాదేదభక్ష్యాణి చ నష్టసంజ్ఞః,
బ్రూయాచ్చ గుహ్యాని హృది స్థితాని
మదే తృతీయే పురుషోఽస్వతన్త్రః. 9

మూడవస్థితియందుండు మదముచే బీడితుడగు మనుజుడు తెలివిలేక యుక్తాయుక్తవివేకము బొత్తుగ చెడి పొందదగని గురుభార్య మున్నగు పూజ్యులతో రమింప గమకించును. గురువు, తండ్రి, దైవము మున్నగు పూజనీయుల గమనించక యవమానము సేయును. తినదగని యశుద్ధపదార్థముల భుజించును. తన మనస్సున నుండు రహస్యవిషయములనెల్ల వెల్లడిచేసి యందరకును చెప్పును. మనస్సు తన స్వతంత్రమున లేక యిచ్ఛవచ్చిన పనులనెల్ల నిరంకుశముగ జేయును.

## చతుర్థమదలక్షణము

చతుర్థే తు మదే మూఢో భగ్నదార్వివ నిష్క్రియః,
కార్యాఽకార్యవిభాగాజ్ఞో మృతాదప్యపరో మృతః. 10
కో మదం తాదృశం గచ్ఛేదున్మాదమివ చాపరమ్,
బహుదోషమివాఽమూఢః కాన్తారం స్వవశః కృతీ. 11

నాల్గవమదమున మనుజుడు మూర్ఛనొందినవానివలె నేమియు నెరుంగక, చెట్టునుండి విరిగిపడిన కొయ్యవలె చేష్టలుడిగి, కృత్యాకృత్యవివేకమును గోలుపోయి, తాను బ్రతికియున్నను చచ్చినవానివలె పుడమిపై బడియుండును. ఇంద్రియములను స్వవశమున నుంచుకొని తెలివికల యేమనుజుం డట్టి ఘోరమైన మదమును, (ముండ్లచెట్లు బెబ్బులులు మున్నగువానిచే సంచారశక్యముగాక ఘోరమైన యడవిలో జొరబడు నట్లు), ఉన్మాదమును బోలినదానిని పొంద నుద్యమించును? కావున నట్టి యనర్థదాయకమైన మదమును మానవు డెవ్వడును పొందగోర దనుట.

పైగనబరచిన నాల్గుమదభేదములును సుశ్రుత వాగ్భటులమతముల ననుసరించి చెప్పబడినవి. ఎట్టు లన:—సుశ్రుతమున ప్రథమ-మధ్యమ-అధమ భేదములచే మదము మూడువిధములు. అందు సత్వగుణము ప్రధానముగ గలవారికి ఉత్తమమైన ప్రథమ మదంబును, రజోగుణముకలవారికి మధ్యమమదంబును, తమోగుణప్రధానులగు మూఢమతులైన అధమమదంబును వరుసగ జనించును. ఇందు రజస్తమోగుణములు రెండును కలవారికి మధ్యమ తృతీయ మదములకు సంధిరూపమైన మదము జనించును. అని యిత్తెరంగున మదభేదములు మూడువిధముల నిరూపించుచు సంధిరూపమైన మదమును అధికముగ నిర్ణయించిరి. ఈ విషయమునే వాగ్భటాచార్యులు "మధ్యమోత్తమయోస్సన్ధిం ప్రాప్య రాజసతామసః, నిరఙ్కుశ ఇవ వ్యాళో న కిఞ్చిన్నాచరేజ్జడః" (అ. హృ. ని. అ. ౬ శ్లో. ౫) అనువాక్యముచే వివరించిరి. మధ్యమ తృతీయమదముల సంధిరూపమైన మదమును పొందిన మానవుడు అడ్డములేని సర్పమును బోలి కృత్యాకృత్యముల నెరుంగక తన యిచ్చ వచ్చినవిధముగ నానావిధస్వరూపములగు పనులను చేయు నని భావము. ప్రకృతగ్రంథమున సంధిరూపమగు మదమును మూడవదిగను మూడవ మదమును నాల్గవదిగను నిరూపింప బడినవి.

చరకమున "పీయమానస్య మద్యస్య విజ్ఞాతవ్యా స్త్రయో మదాః, ప్రథమో మధ్యమోఽన్త్యశ్చ లక్షణైస్తాన్ప్రవక్ష్యతే" (చరక. చి. అ. ౨౪. శ్లో. ౪౧) అను శ్లోకముచేత ప్రథమ-మధ్యమ-అంత్యభేదములచే మూడువిధములుగ మదమును

నిర్ణయించి వాని లక్షణములు ప్రత్యేకముగ జెప్పబడెను. మరియు, "మధ్యమం మదము త్క్రమ్య మదమప్రాప్యచోత్తమమ్, న కిఞ్చిన్నాశుభం కుర్యుర్నరారాజసతామసాః" (చరక. చి. అ. ౨౪. శ్లో. ౪౬) అని సంధిరూపమైన మదముకూడ జెప్పబడెను. పై వాక్యముచేత మధ్యమ మదమును వదలి తృతీయమదమును పూర్తిగ పొందకుండు అవస్థాంతరము సంధిరూపమైన యవస్థ యనియు, ఇందు మనుజులు ఎట్టికృత్యముల జేయుటకును వెనుదీయ రనియు, ఇయ్యది రజస్తమోగుణముల మిశ్రమున గల్గు ననియు దెలియుచున్నది.

చరకమునందలి—"ప్రధానాధమ (వర) మధ్యానాం రుక్మాణాం (రూపాణాం) వ్యక్తిదర్శకః, యథాగ్నిరేవం సత్వాదేర్మద్యం ప్రకృతిదర్శనమ్" (చరక. చి. అ. ౨౪. శ్లో. ౭౩) అను శ్లోకముచేత ప్రధానమధ్యమాధమ భేదములుగల బంగరుయొక్క గుణభేదమును నిప్పున నునిచి కాచినయెడ అగ్ని తెలియజేయువిధముగ మద్యము సత్వరజస్తమోగుణములు ప్రకృతిగా గల మనుజులప్రకృతులను దెలియజేయు నని తెలియుచున్నది.

సత్వరజస్తమోగుణములచే గల్గు నుత్తమమధ్యమ అధమమద భేదముల లక్షణములు తంత్రాంతరమున నిట్లు చెప్పబడినవి:—"సాత్వికే శౌచదాక్షిణ్య హర్షమణ్డన లాలసః, గీతాధ్యయన సౌభాగ్యసురతోత్సాహకృన్మతః. రాజసే దుఃఖశీలత్వం ఆత్మత్యాగం ససాహసమ్, కలహం సానుబంధం చ కరోతి పురుషేమదః. అశౌచనిద్రామాత్సర్యాఽగమ్యాగమనలోలతాః, అసత్యభాషణం చాపి కుర్యాద్దై తామసే మదే." సత్వగుణప్రకృతి కల మనుజున కుత్తమమైనమదము జనించును. ఇట్టి మదమునందు మనుజుడు పరిశుద్ధతనందును, పనులను జేయుటయందు సామర్థ్యము గల్గియుండును. సంతోషముతో గూడియుండును. అలంకారములయందుత్సాహము గల్గియుండును. సంగీతము బాడుటకును, చదువుటకును, సౌందర్యమునందును, రతిక్రీడలయందును ఉత్సాహము కలిగియుండును. రాజసగుణముకల మనుజునకు గల్గినది మధ్యమమదము. ఇందు మనుజుడు ఏడువసాగును. మిక్కిలి సాహసమునకు గడంగి ప్రాణహత్య జేసికొన నుద్యమించును. అనర్థమును గల్గించు కలహమును జేయును. తమోగుణము ప్రధానముగ గల మనుజునకు మూడవమదము కల్గును. ఈ మదమునందు మనుజుడు పరిశుద్ధత లేకుండును. నిద్రయందాసక్తి గల్గియుండును. ఇతరులయందు ద్వేషబుద్ధి కల్గియుండును. పొందవగని గురు భార్య మున్నగువారితో క్రీడింప నుద్యమించును. ఒక దాని యందును మనస్సు నిల్కడ లేక చంచలముగ నుండును. అబద్ధపుమాటలాడును.

## అయుక్త మద్యసేవచే గల్గు వికారములు

నిర్భక్తమేకాన్తత ఏవ మద్యం నిషేవ్యమాణం మనుజేన నిత్యమ్,
ఆపాదయేత్కష్టతమాన్వికారానాపాదయేచ్చాపి శరీరభేదమ్. 12

అన్నమును భుజింపక పరగడుపుననే మద్యమును నిరంతరముగ త్రావినచో మిక్కిలి కష్టతరంబు లగు రోగముల గల్గించును. శరీరమునుగూడ నశింపజేయును.

### మద్యపానమునకు దగనిసమయము

క్రుద్ధేన భీతేన పిపాసితేన శోకాభితప్తేన బుభుక్షితేన,
వ్యాయామభారాధ్వపరిక్షతేన వేగావరోధాభిహతేన చాపి. 13
అత్యమ్లభక్ష్యావతతోదరేణ సాజీర్ణభుక్తేన తథాబలేన,
ఉష్ణాభితప్తేన చ సేవ్యమానం కరోతి మద్యం వివిధాన్వికారాన్.

మనుజుడు మిక్కిలి కోపముగల్గి యున్నపుడును, మిక్కిలి భయమునంది యున్నపుడును, అధికముగ దప్పిగొని యున్నపుడును, మనసును కష్టముచే కల్గించు శోకముచే సంతాపము నొందినపుడును, మిక్కిలి యాకలిగొని యున్నపుడును, దేహపరిశ్రమము జేయుటచేతను మితిమీరి భారమును మోచుటచేతను, త్రోవనడచుటచేతను, గాయముచే దభిఘాతము కల్గియున్నప్పుడును మలమూత్రవాతాదులను సకాలమున విడువక వాని వేగమును నిరోధించినపుడును, అధికముగ నీళ్లు త్రాగి కడుపుబ్బియున్నపుడును, భుజింపబడిన యాహారము జీర్ణముగాకుండుతరి మరల భుజించినప్పుడును, కారణాంతరములచే బలము తగ్గియున్నపుడును, ఎండవేడిచే గొట్టుపడినప్పుడును, మద్యము త్రావినచో నానావిధరోగములను గల్గించును.

### మద్యమున గల్గురోగములు

పానాత్యయం పరమదం పానాజీర్ణమథాపి వా,
పానవిభ్రమముగ్రం చ తేషాం వక్ష్యామి లక్షణమ్. 15

మద్యమును అయుక్తముగ త్రాగినచో పానాత్యయము, పరమదము, పానాజీర్ణము, పానవిభ్రమము నను రోగములు కల్గును. వాని లక్షణముల నీక్రింద వేర్వేర వివరించెద.

### వాతాధిక మదాత్యయలక్షణము

హిక్కాశ్వాసశిరఃకమ్పపార్శ్వశూలప్రజాగరైః,
విద్యాద్బహుప్రలాపస్య వాతప్రాయం మదాత్యయమ్. 16

వాతము మిక్కిలి యధికమై త్రిదోషముల ప్రకోపమున జనించిన మదాత్యయమునందు ఎక్కిళ్లు విశేషముగ వచ్చును. శ్వాస మధికమగును. తల వణకును. పక్కలో నొప్పి కల్గును. నిదుర బొత్తుగపట్టదు. సంబంధములేనిమాటల నోటికివచ్చి నట్లెల్ల వదరును.

ఇచ్చట మద్యము విషమునుబోలె తీవ్రమైనది. కావున దానిని త్రాగుటంజేసి కల్గువ్యాధులన్నియు త్రిదోషసన్నిపాతముచేతనే కల్గును. అయినను అందు వాతము ఉత్కటముగ నున్నపుడును వాతికమదాత్యయ మనియు, పిత్త మధికముగ నున్నపుడు పైత్తికమదాత్యయ మనియు, కఫ మధికముగ నున్నచో కఫజమదాత్యయ మనియు, దోషములు మూడును సమముగ ప్రకోపించినపుడు సాన్నిపాతికమదాత్యయ మనియు వ్యవహరింపబడును. ఈ విషయము వాగ్భటాచార్యునిచే నిట్లు నిర్ణయింపబడినది:— "వాతాత్పిత్తా త్కఫాత్సర్వై శ్చత్వారస్స్యుర్మదాత్యయాః, సర్వేఽపి సర్వైర్జా యన్తే వ్యపదేశస్తు భూయసా." (అ. హృ. ని. అ. ౬. శ్లో. ౧౪)

## పిత్తాధికమదాత్యయలక్షణము

తృష్ణాదాహజ్వరస్వేదమోహాతీసారవిభ్రమైః,
విద్యాద్ధరితవర్ణస్య పిత్తప్రాయం మదాత్యయమ్. 17

పిత్త మధికముగనుండు మదాత్యయమున దప్పి యధికమగును. ఒడలు మంట బుట్టును. చెమట బుట్టును. జ్వరము వచ్చును. మూర్ఛ కల్గును. అతిసారము సంభవించును. చక్రముపైనున్నవానివలె నొడలు తిరుగును. శరీరము ఆకుపచ్చగ నుండును.

## కఫాధికమదాత్యయలక్షణము

ఛర్ద్యరోచకహృల్లాసతన్ద్రాస్తైమిత్యగౌరవైః,
విద్యాచ్ఛీతపరీతస్య కఫప్రాయం మదాత్యయమ్,

కఫ మధికముగనుండు మదాత్యయమునందు వాంతియగును. నోట రుచి తెలియదు. నోట జొల్లుగారును. మైకము గ్రమ్మును. శరీరముపై తడిబట్ట గప్పినట్లును బరువుగ నుండును. ఒడలెల్ల చల్లనై చలిబుట్టును.

## సాన్నిపాతికమదాత్యయలక్షణము

జ్ఞేయస్త్రిదోషజశ్చాపి సర్వలిఙ్గైర్మదాత్యయః. 18

మూడుదోషములును సమములుగ ప్రకోపించిన మదాత్యయమునందు వాతపిత్త కఫములుమూటికిని వేరువేరుగ జెప్పిన లక్షణములన్నియు కల్గును.

## పరమదలక్షణము

శ్లేష్మోచ్ఛ్రయోఽఙ్గగురుతా విరసాస్యతా చ
విణ్మూత్రసక్తిరథ తన్ద్రిరరోచకశ్చ,
లిఙ్గం పరస్య చ మదస్య వదన్తి తజ్జ్ఞాః
తృష్ణా రుజా శిరసి సన్ధిషు చేతి భేదః. 19

పరమద మను మద్యవికారమునందు నాసాదిరంధ్రములయందు కఫము గాగు చుండును. శరీరము బరువుగ నుండును. నోటికి తీపి మున్నగురసముల రుచి తెలియ కుండును. మలమూత్రములు సరళముగ వెడలక బద్ధగించును. మైకము గ్రమ్మును. అరుచి కల్గును. దప్పి యధికమగును. తలనొప్పి పుట్టును. కీళ్లు సడలును. ఈ లక్షణములు కల్గినది పరమద మని శాస్త్రవేత్తలు చెప్పెదరు.

## పానాజీర్ణపానవిభ్రమలక్షణములు

ఆధ్మానముగ్రమథ చోద్గిరణం విదాహః
పానేఽజరాం సముపగచ్ఛతి లక్షణాని,
హృద్గాత్రతోదకఫసంస్రవకణ్ఠధూమా
మూర్ఛావమిజ్వరశిరోరుజసంప్రదాహాః. 20
ద్వేషస్సురాన్నవికృతేష్వపి తేషు తేషు
తం పానవిభ్రమముశన్త్యఖిలేన ధీరాః,

మద్యమును త్రావినపుడు అయ్యది జీర్ణమునొందకుండుట వలన కడుపుబ్బును. త్రేపులు తీవ్రముగ వచ్చును. శరీరమంతయు మంటబుట్టును. ఈ లక్షణములు కల్గినచో పానాజీర్ణ మనబడును. పానవిభ్రమమునందు రొమ్మునందును, తక్కిన అవయవముల యందును సూదులతో బొడిచినట్లు పోటుకల్గును. నోట కఫము వెడలును. కుత్తుకయందు పొగ వెడలునట్లుండును. మూర్ఛవచ్చును. వాంతియగును. జ్వరము వచ్చును. తల నొప్పియు, మంటయు పుట్టును. పైష్టికము మున్నగు సురాభేదములయందును లడ్డు మున్నగు నన్నవికారములయందును ద్వేషము బుట్టును. ఇట్టి లక్షణములు కల్గినది పాన విభ్రమ మని యెరుంగునది.

## మదాత్యయాసాధ్యలక్షణములు

హీనోత్తరోష్ఠమతిశీతమమన్దదాహం
తైలప్రభాస్యమపి పానహతం త్యజేత్తు. 21
జిహ్వోష్ఠదన్తమసితం త్వథవాపి నీలం
పీతే చ యస్య నయనే రుధిరప్రభే వా,
హిక్కాజ్వరౌ వమథువేపథుపార్శ్వశూలాః
కాసభ్రమావపి చ పానహతం భజన్తే. 22

పైపెదవి క్రిందిపెదవికంటె తగ్గి దానితో జేరక పైకి సొద్దుకొనియుండుట, శరీరమునందెల్ల చలువగ్రమ్మి లోభాగమున తీవ్రమైన తాపముగల్గుట, నోటియందు నూనెబోసినవిధముగ జిడ్డుకల్గియుండుట, నాలుకయు పెదవులును పన్నులును నల్లగ

నైనను లేక నీలపురంగుకల్గియైననుండుట, కన్నులు పచ్చగనైనను రక్తమునుబోలె నెఱ్ఱ బాఱియైన నుండుట. ఈ లక్షణములు పానాత్యయమున గల్గినచో నసాధ్య మగును. వెక్కిళ్లు, జ్వరము, వాంతి, వణకు, ప్రక్కనొప్పి, దగ్గు, భ్రమము ఇవియన్నియు మద్యపానమున జనించు నుపద్రవములు. ఈ యుపద్రవములలో కొన్నికల్గినను మదాత్యయం బసాధ్య మని భావము.

వాగ్భటాచార్యుడు ధ్వంసకము విక్షయము నను రెండువ్యాధులు మద్యపానమున జనించు నని వాని లక్షణముల నిట్లు చెప్పెను:—“ముక్త్వా మద్యం పిబేత్తు యః, సహసానుచితం వాన్యత్ తస్య ధ్వంసకవిక్షయౌ, భవేతాం మారుతాత్కృష్టౌ దుర్బలస్య విశేషతః, ధ్వంసకే శ్లేష్మనిష్ఠీవః కణ్ఠశోషోఽతి నిద్రతా, శబ్దాసహత్వం తన్ద్రా చ, విక్షయేఽఙ్గశిరోఽతిరుక్, హృత్కణ్ఠరోగ స్సమ్మోహః కాస స్తృష్ణా వమిర్జ్వరః.” ఎవ్వడైనను తాను వాడుకగా మద్యమును త్రావుచుండి నడుమ కొంత కాలము విడిచి కాలాంతరమునం దామద్యమునే మరల తటాలున ప్రమాణాధికముగ సేవించినను, లేక తానొక మద్యమును అలవాటున ప్రతిదిన ముపయోగించుచుండి నడుమ తన కలవాటుగాని క్రొత్తమద్యమును తటాలున నతిప్రమాణముగ నుపయోగించినను వానికి ధ్వంసకము విక్షయము ననువ్యాధులు జనించును. ఈ రెండును వాత ప్రకోపమున గల్గును. మిక్కిలి కష్టసాధ్యములు. మరియు బలహీనుడు పైజెప్పినవిధముగ మద్యపానముచేసి వానికీవ్యాధులు గల్గెనేని యంతకన్న కష్టసాధ్యములగును. అందు ధ్వంసకమున కఫము నోట నుమియును. కుత్తుక ద్రవములేక యెండును. అధికముగ నిదురవచ్చును. ఏదైన నొక శబ్దము వినబడినచో విన సైపకుండును. మైకము గ్రమ్మును. విక్షయ మను రెండవరోగమునందు అవయవంబులును తలయు విశేషముగ నొచ్చును. రొమ్మునొప్పియు గొంతుకు సంబంధించిన వ్యాధులును కల్గును. మూర్ఛ గ్రమ్మును. దగ్గును వాంతియు జ్వరంబును కల్గును అని భావము.

చరకమున విక్షయ మనురోగమును విక్షేపక మని నామాంతరముచే జెప్పెను. ఎట్టులన:—“విచ్ఛిన్నమద్యః...ధ్వంసో విక్షేపకశ్చైవ రోగ స్తస్యోపజాయతే.” (చరక. చి. అ. ౨౪) అని చెప్పెనుగాని లక్షణభేదము గానరాదు. మరియు “తయోః కర్మ చికిత్సా చ వాతికే యన్మదాత్యయే” అని తంత్రాంతరమున నుండుటంజేసి యీరెంటికిని వాతమదాత్యయమునకు జెప్పిన చికిత్స జేయవలె నని యెఱుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
పానాత్యయ - పరమద - పానాజీర్ణ - పానవిభ్రమనిదానం
సమాప్తమ్.

# ౧౯. దాహనిదానమ్

పానాత్యయమునను దాహముప్రసంగముగాన పానాత్యయాదినిదానమును జెప్పినపిదప దాహనిదానము చెప్పబడుచున్నది.

### మద్యజదాహలక్షణము

త్వచం ప్రాప్తస్స పానోష్మా పిత్తరక్తాభిమూర్ఛితః,
దాహం ప్రకురుతే ఘోరం పిత్తవత్తత్ర భేషజమ్. 1

మద్యపానముచే జనించిన యాగ్నేయమైన యుష్ణము ప్రకుపితమై పిత్తము చేతను రక్తముచేతను మిళితమై చర్మమున వ్యాపించి మిక్కిలి తీవ్రమైన తాపమును గల్గించును. ఇయ్యది పిత్తమున జనించును. కావున పిత్తశామక మగు చికిత్స చేయు టుచితము.

### రక్తజదాహలక్షణము

కృత్స్నదేహానుగం రక్తముద్రిక్తం దహతి ధ్రువమ్,
స ఉష్యతే తృష్యతే చ తామ్రాభస్తామ్రలోచనః. 2
లోహగన్ధాఙ్గవదనో వహ్నినేవావకీర్యతే,

శరీరమునం దెల్ల వ్యాపించినరక్తము ప్రకుపితంబై శరీరమునం దెల్ల మంటను గల్గించును. అట్టితాపముచే మనుజుడు నిప్పును పైజల్లినవిధముగ బాధింపబడును. అధికముగ దప్పికల్గును. వానిశరీరంబును కన్నులును ఎఱ్ఱబారినట్లుండును. శరీరము నందును నోటియందును లోహమునుబోలిన వాసనగల్గియుండును.

### పైత్తిక-తృష్ణానిరోధజదాహలక్షణములు

పిత్తజ్వరసమః పిత్తాత్ (స చాప్యస్య విధిస్స్మృతః) 3
తృష్ణానిరోధాదబ్ధాతౌ క్షీణే తేజస్సముద్ధతమ్,
సబాహ్యాభ్యన్తరం దేహం ప్రదహేన్మన్దచేతసః. 4
సంశుష్కగలతాల్వోష్ఠో జిహ్వాం నిష్కృష్య వేపతే,

పిత్తప్రకోపమున జనించినదాహము పిత్తజ్వరమునకు జెప్పినలక్షణములు కల్గి యుండును. (అట్టిదాహమున పిత్తజ్వరమునకు జెప్పిన చికిత్స చేయవలయును) దప్పిగొన్నపుడు నీళ్లుత్రాగక నిరోధించినపుడు ఉదకమును వహించు ధాతువు క్షీణించి శరీరమునందలి

యోష్ణము వృద్ధినొంది శరీరముయొక్క లోభాగమును వెలిప్రక్కను తపింపజేయును. అట్టి తాపమునందు మనుజుండు కంఠంబును తాలువులును పెదవులును ద్రవములేక యెండి స్మృతితప్పి నాలుకను బైటవ్రేలవేసి వణకుచుండును.

## కోష్ఠజదాహలక్షణము

అసృజా పూర్ణకోష్ఠస్య దాహోఽన్యస్స్యాత్సుదుస్తరః. 5

కత్తి మొదలగునాయుధములచే దెబ్బతగిలినయెడ రక్తము స్రావమునొంది కోష్ఠమున నిండియున్నపుడు శరీరమున తీవ్రమైన తాపము కల్గును. ఇయ్యది మిక్కిలి దుస్సాధ్యముగ నుండును.

ఇచ్చట కోష్ఠశబ్దముచేత నామాశయంబును, కాయాగ్ని కాధారమగు స్థానంబును, పక్వాశయంబును, మూత్రాశయంబును, రక్తమున కాశ్రయమైన యకృత్ప్లీహంబులును, హృదయంబును, ఉండుకంబును, పుప్పుసంబును గ్రహింపబడును. ఈవిషయమును కోష్ఠశబ్దమును వివరించునపుడు సుశ్రుతాచార్యుం డిట్లు చెప్పెను:—"స్థానాన్యామాగ్నిపక్వానాం మూత్రస్య రుధిరస్య చ హృదుండుకః పుప్పుసశ్చ కోష్ఠ ఇత్యభిధీయతే" (సు. చి. అ. ౨.)

## క్షయజదాహలక్షణము

ధాతుక్షయోక్తో యో దాహ స్తేన మూర్ఛా తృడన్వితః,
క్షామస్వరః క్రియాహీనః స సీదేద్భృశపీడితః. 6

రసరక్తాదిధాతువులు కొన్నికారణములచే క్షీణించి దానగల్గు దాహమున మూర్ఛ గల్గును. దప్పి యధికమగును. కంఠస్వరము హీనమగును. ఘుప కట్టి మనుజుడు చేష్టలుడిగి అనేకబాధలచే పీడింపబడి తుదకు మృతినొందును.

## మర్మజదాహలక్షణము

మర్మాభిఘాతజోఽప్యస్తి సోఽసాధ్యస్సప్తమో మతః,
సర్వ ఏవ చ వర్జ్యాస్స్యుశ్శీతగాత్రస్య దేహినః. 7

శిరస్సు, హృదయము మున్నగుమర్మస్థానములయం దభిఘాతము కల్గినచో దానివలన తాపము జనించును. ఇయ్యది యేడవదాహము. మిక్కిలి యసాధ్యమగును. మనుజులకు శరీరమునందు పైభాగమునమాత్రము చల్లనై లోపలిభాగమున తీవ్రమైనతాపము కల్గినయెడ నది యేతాపమైనను అసాధ్యంబగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
దాహనిదానం సమాప్తమ్.

# ౨౦. ఉన్మాదనిదానమ్

మదాత్యయనిదానమున "ఉన్మాదమివ చాపరమ్" అని యున్మాదసాదృశ్యము జెప్పియుండుటంజేసి యున్మాదము జెప్పదగినది. అయినను మదాత్యయమున నుపద్రవరూపమగు దాహము మిగుల స్వల్పమగుటంజేసి సూచీకటాహన్యాయము ననుసరించి తొలుత నట్టి దాహనిదానమును జెప్పి పిమ్మట నున్మాదనిదానము చెప్పబడుచున్నది.

### ఉన్మాదశబ్దార్థము

మదయన్త్యుద్గతా దోషా యస్మాదున్మార్గమాగతాః,
మానసోఽయమతో వ్యాధిః ఉన్మాద ఇతి కీర్తితః. 1

వాతాదిదోషములు ప్రకోపమునంది యూర్ధ్వమార్గముగ వెడలి మనస్సుయొక్క వృత్తులను వహించు నాడులను చేరి మనసును నిల్కడ నియ్యక చెల్లుగ జెరచి భ్రమియింపజేయుటంజేసి యీవ్యాధి యున్మాద మని యన్వర్థముగ జెప్పబడును. కావుననే యీ వ్యాధి మనస్సంబంధమైనది.

"ఉన్మాద్యతే మనః అనేన ఇత్యున్మాదః" అనువ్యుత్పత్తిచేత మనసును చలనమొందించునది యని అవయవార్థము.

### ఉన్మాదభేదములు

ఏకైకశస్సర్వశశ్చ దోషైరత్యర్థమూర్ఛితైః,
మానసేన చ దుఃఖేన స చ పఞ్చవిధో మతః. 2
విషాద్భవతి షష్ఠశ్చ (యథాస్వం తత్ర భేషజమ్,)
స చాప్రవృద్ధస్తరుణో మదసంజ్ఞాం బిభర్తి చ. 3

ప్రకోపమునొందిన వాతపిత్తకఫములచే వేర్వేరుగ నొక్కొకగానిచేతను, అన్నిటిచేతను, మనస్సునకు సంబంధించిన దుఃఖముచేతను విషముచేతను జనించుటంజేసి యున్మాదరోగము ఆరువిధము లగును. మరియు నాయున్మాద ముత్కటముగ వృద్ధినందక ప్రారంభస్థితియం దుండెనేని మద మని చెప్పబడును.

### ఉన్మాదసామాన్యకారణములు

విరుద్ధదుష్టాశుచిభోజనాని ప్రధర్షణం దేవగురుద్విజానామ్,
ఉన్మాదహేతుర్భయహర్షపూర్వో మనోఽభిఘాతో విషమాశ్చ చేష్టాః.

పరస్పర విరుద్ధములగు క్షీరమత్స్యాదులను జేర్చి భుజించుట, విషము మున్నగు వానిచే దుష్టమైన యన్నమును అపరిశుద్ధమగు నన్నము భుజించుట, దేవతలను గురువులను బ్రాహ్మణులను ధిక్కరించుట, భయముచేనైనను, అధిక సంతోషముచే నైనను మనస్సు కభిఘాతము కల్గుట, వివిధములైన అవయవచేష్టలు ఇవియన్నియుం నున్మాదము జనించుటకు కారణము లగును.

### ఉన్మాద సామాన్య సంప్రాప్తి

తైరల్పసత్వస్య మలాః ప్రదుష్టాః
బుద్ధేర్నివాసం హృదయం ప్రదూష్య,
స్రోతాంస్యధిష్ఠాయ మనోవహాని
ప్రమోహయన్త్యాశు నరస్య చేతః. 5

పైజెప్పిన కారణములచేత వాతాదిదోషములు ప్రకోపమునొంది రజస్తమోగుణములచే వ్యాప్తమై మిక్కిలి స్వల్పముగనుండు సత్వగుణముకల మనుజునియొక్క బుద్ధికి నివాసస్థానమగు హృదయమును జెరచి అందలి మనోవృత్తివహంబులగు పదిస్రోతస్సుల వ్యాపించి మనస్సును బొత్తుగ జెడగొట్టి మోహమును కల్గించును. ఇయ్యది యున్మాద మనదగును.

### ఉన్మాద సామాన్యరూపము

ధీవిభ్రమస్సత్వ పరిప్లవశ్చ
పర్యాకులా దృష్టిరధీరతా చ,
అబద్ధవాక్త్వం హృదయం చ శూన్యం
సామాన్యమున్మాదగదస్య లిఙ్గమ్. 6

ఉన్మాదములయందు అన్నిటియందును సామాన్యముగ చిత్తభ్రమంబును మనస్సుకు సంచలనంబును కల్గును. చూపు చంచలమై వికృతముగ నుండును. మనోధైర్యము చెడి భీతి కల్గును. సంబంధములేక తన కిచ్ఛవచ్చినట్లు మాటలాడును. హృదయమున ముఖ్యముగ నుండు మనోబుద్ధులు చెడియుండుటవలన శూన్యప్రాయమగును. ఇవి యన్నియు నున్మాదరోగ సామాన్యముగ నుండు రూపములు.

### వాతికోన్మాదనిదాన-సంప్రాప్తి-లక్షణములు

రూక్షాల్పశీతాన్న విరేకధాతు
క్షయోపవాసైరనిలోఽతివృద్ధః,

చిన్తాదిదుష్టం హృదయం ప్రదూష్య
బుద్ధిం స్మృతిం చాప్యుపహన్తి శీఘ్రమ్. 7
అస్థానహాస్యస్మితనృత్యగీత
వాగఙ్గవిక్షేపణరోదనాని,
పారుష్యకార్శ్యారుణవర్ణతాశ్చ
జీర్ణే బలం చానిలజస్య రూపమ్. 8

జిడ్డులేక రూక్షమైన యన్నమును భుజించినను, తాను భుజించు పరిమాణమున కన్న తక్కువగ భుజించినను, చల్లనైన యన్నమును భుజించినను, వమనవిరేచనముల నధికముగ జేసికొనినను, రసాదిధాతువులు క్షీణించినను, నిరంతరముగ చాలకాలము ఉపవాస ముండినను వాతము ప్రకోపించి, చింత మున్నగు మనస్సంబంధములైన వ్యాపారములచే దుష్టమైన హృదయమును చెరిచి; బుద్ధిని స్మృతిని అతిశీఘ్రముగ నశింపజేయును. అట్టియెడ కారణములేకనే నగవు, చిరునగవు, నృత్యము, గానము, మాట్లాడుట, శరీరమును వికృతముగ ద్రిప్పుట, ఏడ్చుట అను నీపనులను చేయును. శరీరము పరుసమై కృశతనొంది అరుణవర్ణము కల్గియుండును. భుజింపబడిన యాహారము జీర్ణమైనపుడు పైజెప్పిన చేష్టలన్నియును నధికమగును. ఈ లక్షణములు కల్గినది వాతముచే జనించిన యున్మాదమని యెరుంగునది.

## పైత్తికోన్మాద నిదాన-సంప్రాప్తి-లక్షణములు

అజీర్ణకట్వమ్లవిదాహ్యశీతై-
ర్భోజ్యైశ్చితం పిత్తముదీర్ణవేగమ్,
ఉన్మాదమత్యుగ్రమనాత్మకస్య
హృది స్థితం పూర్వవదాశు కుర్యాత్. 9
అమర్షసంరమ్భవినగ్నభావాః
సన్తర్జనాతిద్రవణౌష్ణ్యరోషాః,
ప్రచ్ఛాయశీతాన్నజలాభిలాషః
పీతా చ భాః పిత్తకృతస్య లిఙ్గమ్. 10

మనుజుడు ఇంద్రియముల జయింపనేరక సకలదిక్కులు తీక్ష్ణముగాని స్వభావముగల పదార్థముల భుజించినను, కారము పులుపుగల పదార్థముల భుజించినను, మంటబుట్టించు వస్తువుల భుజించినను, మిక్కిలి వేడిగనుండు వస్తువుల దిన్నను, పిత్తము ప్రకోపము నొంది మిక్కిలి వేగముగ్గ వాతికమున జెప్పినరీతిగ

హృదయమును జేరిచి బుద్ధిని స్మృతిని బొత్తుగ బోగొట్టును. దానంజేసి మనుజుడు మిక్కిలి యోర్పులేక కారణములేకనే ఆర్భాటముచేయును. మొలను బట్టగట్టక దిగనాడి దిగంబరుడై సంచరించును. ఇతరుల భయపెట్టును. పనిలేకయే నల్గడల జరుగెత్తును. వాని శరీరము మిక్కిలి వేడికల్గియుండును. కారణములేక కోపపడును. నీడయందును, చల్లనినీళ్లయందును, అన్నమందును అభిలాష గల్గియుండును. శరీరము పసుపురంగు కల్గియుండును. ఈలక్షణములు కల్గినది పిత్తమున జనించిన యున్మాదమని యెరుంగునది.

### కఫజోన్మాదనిదాన - సంప్రాప్తి - లక్షణములు

సమ్పూరణై ర్మన్దవిచేష్టితస్య
సోష్మా కఫో మర్మణి సమ్ప్రవృద్ధః,
బుద్ధిం స్మృతిం చాప్యుపహత్య చిత్తం
ప్రమోహయ న్సఞ్జనయే ద్వికారమ్. 11
వాక్చేష్టితం మన్దమరోచకశ్చ
నారీవివిక్తప్రియతాఽతినిద్రా,
ఛర్దిశ్చ లాలా చ బలం చ భుక్తే
నఖాదిశౌక్ల్యం చ కఫాత్మకే స్యాత్. 12

మనుజుడు తనబలమునకు దగినంత దేహపరిశ్రమము జేయకుండునపుడు మిక్కిలి తృప్తిని గల్గించుపదార్థముల భుజించినచో కఫము ప్రకుపితమై పిత్తముతో గూడి హృదయమున జేరి బుద్ధిని జ్ఞాపకశక్తిని నశింపజేసి మనస్సును భ్రమింపజేసి యున్మాదమును కల్గించును. ఇయ్యది కఫప్రకోపమున కల్గిన యున్మాదము. ఈయున్మాదమునందు మాటలాడుట మున్నగువాగ్వ్యాపారము లుడుగును. అరుచి కల్గును. స్త్రీలతో గూడి ఏకాంతముగ నుండుటయందు గాసక్తి కల్గును. నిద్ర యధికముగ వచ్చును. వాంతియగును. నోట జొల్లుకారును. భుజించిన పిమ్మట వ్యాధి యధికమగును. గోళ్లు మలము మూత్రము మున్నగునవి తెల్లగ నుండును.

### సన్నిపాతజోన్మాదనిదాన - సంప్రాప్తి - సామాన్యలక్షణములు

యస్సన్నిపాతప్రభవోఽతిఘోర
స్సర్వైస్సమస్తైస్స చ హేతుభిస్స్యాత్,

సర్వాణి రూపాణి బిభర్తి తాదృ
గ్విరుద్ధభైషజ్యవిధిర్వివర్జ్యః. 13

వాతాదిప్రకోపమునకు వేర్వేరుగ పైజెప్పిన కారణము లన్నిటిచేతను వాత పిత్త కఫములు మూడును సమముగ ప్రకోపించి హృదయమునచేరి బుద్ధిని స్మృతిని మనస్సునుగూడ బొత్తుగ నశింపజేసి యున్మాదమును గల్గించును. ఈసాన్నిపాతికోన్మాదమునందు వాతాదిదోషముల మూడిటికిని వేరువేరుగ జెప్పబడిన లక్షణము లన్నియు గనబడును. ఇయ్యది మిక్కిలి ఘోరమైనది. ఉన్మాదమున వాతాదిదోషములకు విరుద్ధములైన హేతువిపరీతచికిత్సలు చెప్పబడియున్నవి. కావున నయ్యది త్రిదోషజోన్మాదముల పరస్పరవిరుద్ధములుగ నుండును. కావున అట్టి చికిత్సలు చేయ నొసగదు. దానంజేసి చికిత్స కసాధ్యముగ నుండునుగాన శ్రేయోభిలాషి యగువైద్యుడు దీనికి చికిత్సజేయ యత్నింపదగదు.

### శోకజోన్మాద నిదాన - సంప్రాప్తి - లక్షణములు

చోరైర్నరేన్ద్రపురుషైరరిభిస్తథాన్యై
ర్విత్రాసితస్య ధనబాన్ధవసంక్షయాద్వా,
గాఢం క్షతే మనసి చ ప్రియయా రిరంసోః
జాయేత చోత్కటతమో మనసో వికారః. 14
చిత్రం బ్రవీతి చ మనోఽనుగతం విసంజ్ఞో
గాయత్యథో హసతి రోదితి చాతిమూఢః,

దొంగలు రాజభటులు శత్రువులు మున్నగువారు బెదరించుటచే వెరగందినపుడును, ధనంబును, లేక బంధువులును నశించినపుడును, తనకు మిక్కిలి ప్రీతిపాత్రమగు స్త్రీతో సంభోగింపగోరియుండ నయ్యది లభింపకపోయినపుడును మనస్సు మిక్కిలి గాఢముగ నభిఘాతమునొంది చంచలమగును. దానంజేసి మిక్కిలి ప్రబలమైన యున్మాదము కల్గును. ఇయ్యది శోకమున జనించిన యున్మాదము. ఈవ్యాధి గల మనుజుడు తన మనంబునంగల రహస్యమును మిక్కిలి చిత్రముగ బైట వెల్లడి చేయును. ఒకప్పుడు తెలివిదప్పి మూర్ఛనొందును. ఒకప్పుడు వెల్లకిలనముగ సంగీతము బాడును. కారణములేకయే నవ్వును. ఏడ్చును. మనసున వివేకములేక మూఢచిత్తు డగును.

### విషజోన్మాదలక్షణము

రక్తేక్షణో హతబలేన్ద్రియభాస్సుదీనః
శ్యావాననో విషకృతేఽథ భవేద్విసంజ్ఞః. 15

విషముచే గల్గిన యున్మాదమునందు కన్నులెఱ్ఱవారును. శరీరబలంబును, ఇంద్రియములశక్తియు, శరీరకాంతియు చెడిపోవును. మిక్కిలి దీనత నొందును. ముఖమున ప్రజ్ఞ దప్పియుండును.

## అసాధ్యోన్మాదలక్షణము

అవాఙ్ముఖస్తూన్ముఖో వా క్షీణమాంసబలో నరః,
జాగరూకో హ్యసన్దేహమున్మాదేన వినశ్యతి. 16

ఉన్మాదముచే బాధితుడగు మనుజుడు తలవాంచి క్రింద జూచుచున్నను, లేక ముఖమును పైకెత్తి యాకసము జూచుచున్నను, శరీరమునందలి బలంబును మాంసంబును క్షీణించియున్నను అట్టిరోగి యావ్యాధిచే నవశ్యము మృతిజెందును.

## భూతోన్మాదసామాన్యలక్షణము

అమర్త్యవాగ్విక్రమవీర్యచేష్టః
జ్ఞానాదివిజ్ఞానబలాదిభిర్యః,
ఉన్మాదకాలోఽనియతశ్చ యస్య
భూతోత్థమున్మాదముదాహరేత్తమ్. 17

మనుజులకు భూతావేశముచే గల్గిన యున్మాదమునందు మనుష్యులకు సాధారణము కానివాక్కులును, బలంబును, శౌర్యంబును, చేష్టలును కల్గియుండును. తత్త్వజ్ఞానంబును, లేక శిల్పజ్ఞానంబును కల్గియుండును. ఉన్మాదము జనించుకాల మియ్యది యని నియతము గాకయుండును.

## దేవగ్రహోన్మాదలక్షణము

సన్తుష్టశ్శుచిరతిదివ్యమాల్యగన్ధః
నిస్తన్ద్రీరవితథసంస్కృతప్రభాషీ,
తేజస్వీ స్థిరనయనో వరప్రదాతా
బ్రహ్మణ్యో భవతి నరస్స దేవజుష్టః. 18

దేవగ్రహ మావేశించుటచే గల్గిన యున్మాదమునందు మనుజుండు నిరంతరము సంతసము గల్గియుండును. పరిశుద్ధుడై యుండును. దేవయోగ్యమైన పుష్పమాలికలకన్న నధికమైనపరిమళము శరీరమున గల్గియుండును. ఎల్లప్పుడును నిదురలేకయుండును. సత్యముగను అపశబ్దములులేక సంస్కృతమును స్ఫుటముగ మాటలాడును. ముఖమునందు

అమానుషమగు తేజస్సు కల్గియుండును. కన్నుల రెప్పవాల్చక స్థిరముగ దృష్టికల్గి యుండును. కోరినవరముల నియ్య సామర్థ్యము గల్గియుండును. బ్రాహ్మణులయందు మిక్కిలి ప్రీతికల్గి హితుడై యుండును.

మరియు గణమాతృక మున్నగు గ్రహములచే గల్గు లక్షణము లిట్లు తంత్రాంతరమున నిర్దేశింపబడినవి:—"ప్రధ్వస్తస్రగ్వసనసర్వాఙ్గో లాలాఫేనావిలాననః, నిద్రాళుః కమ్పనో మూకో గణమాతృభిరర్దితః" (విదేహ) గణమాతృకాదిగ్రహములచే పీడితుడగు మనుజుడు మిక్కిలి కోపము గల్గియుండును. అవయవములన్నియు సడలియుండును. నోట జొల్లును, నురుగును కారుచుండును. ఎల్లప్పుడును నిదురించుచుండును. వణకును, మూగవానివలె మాటలాడకుండును.

### అసురగ్రహోన్మాదము

సంస్వేదీ ద్విజగురుదేవదోషవక్తా
జిహ్మాక్షో విగతభయో విమార్గదృష్టిః,
సన్తుష్టో న భవతి చాన్నపానజాతైః
దుష్టాత్మా భవతి స దేవశత్రుజుష్టః. 19

దేవతలకు శత్రువులగు అసురగ్రహములచే పీడింపబడిన మనుజునకు శరీరమునం దెప్పుడు జూచిన చెమటగారుచుండును. బ్రాహ్మణులయొక్కయు, గురువులయొక్కయు, దేవతలయొక్కయు, దోషముల నెత్తి చెప్పుచుండును. కంటిచూపు సరిలేక వక్రముగ జూచుచుండును. భయ మించుకేనియు లేకుండును. శాస్త్రమునకును, ఆచారమునకును, విరుద్ధమైనమార్గమున గమనము గల్గియుండును. అన్నపానాదుల నెంత మిక్కుటముగ నుపయోగించినను మనసునకు దృప్తిలేకుండును. దుష్టమైనస్వభావము గల్గియుండును.

### గంధర్వగ్రహోన్మాదలక్షణము

హృష్టాత్మా పులినవనాన్తరోపసేవీ
స్వాచారః ప్రియపరిగీతగన్ధమాల్యః,
నృత్యన్వై ప్రహసతి చారు చాల్పశబ్దం
గన్ధర్వగ్రహపరిపీడితో మనుష్యః. 20

గంధర్వగ్రహ మావేశించుటచే గల్గినయున్మాదమునందు మనుజుడు ఎల్లప్పుడును సంతసించినమనస్సు కల్గియుండును. ఇసుకతిప్పలయందును, వనమధ్యమునందును సంచ

రింప నుత్సుకుడై యుండును. మంచియాచారము గల్గియుండును. సంగీతము పాడుట యందును, గంధము బూసికొనుటయందును, పూలసరముల ధరించుటయందును ఆసగొని యుండును. సుందరమైన సన్ననికంఠస్వరముతో నవ్వుచు నృత్యము జేయును.

### యక్షగ్రహోన్మాదలక్షణము

తామ్రాక్షగ ప్రియతనురక్తవస్త్రధారీ
గమ్భీరో ద్రుతగతిరల్ప వాక్సహిష్ణుః,
తేజస్వీ వదతి చ కిం దదామి కస్మై
యో యక్షగ్రహపరిపీడితో మనుష్యః. 21

యక్షగ్రహము ఆవేశించుటచే గల్గినయున్మాదమునందు మనుజుడు ఎఱ్ఱనికన్నులు కల్గియుండును. మిక్కిలి పలుచనై యెఱ్ఱనైనవస్త్రము ధరించును. మిక్కిలి త్వరితముగ నడచును. మితముగ మాటలాడును. కష్టమున కోర్చుస్వభావము కల్గియుండును. మంచి తేజస్సు కల్గియుండును. దానమునం దిచ్చగలవాడై యెవ్వని కేమికావలెను? దాని నిచ్చెద నని పల్కుచుండును.

### పితృగ్రహోన్మాదలక్షణము

ప్రేతానాం స దిశతి సంస్తరేషు పిణ్డాన్
శాన్తాత్మా జలమపి చాపసవ్యవస్త్రః,
మాంసేప్సుస్తిలగుడపాయసాభికామః
తద్భక్తో భవతి పితృగ్రహాభిజుష్టః. 22

పితృగ్రహముచే గల్గిన యున్మాదమునందు మనుజుడు క్రిందదర్భలబరచి తన పితృదేవతలకు పిండముల బెట్టును. మనస్సు మిక్కిలి శాంతినొంది యుండును. తనపైని యుత్తరీయమును అపసవ్యముగ నిడికొని పితృదేవతలకు నీళ్లు విడుచును. మాంసమునం దును, నువ్వులయందును, బెల్లముపైనను, పరమాన్నమునందును మిక్కిలి ప్రీతికల్గి కోరుచుండును ఎల్లప్పుడును పితృదేవతలయందు భక్తికల్గియుండును

### నాగగ్రహోన్మాదలక్షణము

యస్తూర్వ్యాం ప్రసరతి సర్పవత్కదాచిత్
సృక్విణ్యౌ విలిహతి జిహ్వయా తథైవ,

క్రోధాళుర్గుడమధుదుగ్ధపాయసేప్సుః
జ్ఞాతవ్యో భవతి భుజఙ్గమేవ జుష్టః. 23

నాగగ్రహముచే కల్గిన యున్మాదమున నొకప్పుడు సర్పమునబోలె నేలపైబడియుండి దోగాడును. నాలుకచేత పాములవలె పెదవుల నాకికొనును. ఎప్పుడు జూచినను మిక్కిలి కోపముతో గూడియుండును. బెల్లమును, తేనెను, పాలను, పాయసమును తినవలెనని యాసగల్గి యుండును.

## రాక్షసగ్రహోన్మాదలక్షణము

మాంసాసృగ్వివిధసురావికారలిప్సుః
నిర్లజ్జో భృశమతినిష్ఠురోఽతిశూరః,
క్రోధాళుర్విపులబలో నిశావిహారీ
శౌచద్విడ్భవతి స రాక్షసైర్గృహీతః. 24

రాక్షసగ్రహముచే గల్గునున్మాదమునందు మాంసమును రక్తమును పలువిధములగునట్టి మద్యములను సేవింపవలెనని యాసగొనును. సిగ్గు కొంచెమైనను లేకయుండును. మిక్కిలి నిష్ఠురముగ మాటలాడును. మిక్కిలి శూరుడై యుండును. కోపముగల స్వభావము గల్గియుండును. మిక్కిలి యధికమైన బలము గల్గియుండును. రాత్రులయందు సంచరించును. పరిశుద్ధతయందు ద్వేషబుద్ధి కల్గియుండును.

రాక్షసగ్రహములలో బ్రహ్మరాక్షసగ్రహ మనునది వేరొకటి గలదు. వేదముల జక్కగ జదివిన బ్రాహ్మణుడు శాపము మున్నగు కారణములచే రాక్షసత్వము నొందినయెడ బ్రహ్మరాక్షసగ్రహ మనబడును. ఆగ్రహముచేతనగు నున్మాదము గల్గును. ఆయున్మాదము నందు మనుజుడు దేవతలయందును, బ్రాహ్మణులయందును, గురువులయందును ద్వేషబుద్ధి కల్గియుండును. వేదములను వేదాంగములను చక్కగ నెరిగియుండును. పరిశుద్ధమైన స్వభావము కల్గియుండును. ఉపవాసాదులచే తనయాత్మను గష్టముల గల్గించుకొనును. అధికముగ నవ్వును. ఈవిషయము సంగ్రహగ్రంథమున వాగ్భటునిచే నిట్లు నిర్దేశింపబడినది:—"దేవవిప్రగురుద్వేషీ వేదవేదాఙ్గవిచ్ఛుచిః, ఆత్మపీడాకరో హాసీ బ్రహ్మరాక్షససేవితః."

## పిశాచగ్రహోన్మాదలక్షణము

ఉద్ధస్తః కృశపరుషో చిరప్రలాపీ
దుర్గన్ధో భృశమశుచిస్తథాఽతిలోలః,

బహ్వాశీ విజనవనాంతరోపసేవీ
వ్యాచేష్టన్ భ్రమతి రుదన్పిశాచజుష్టః. 25

పిశాచగ్రహము ఆవేశించుటచే గల్గిన యున్మాదమునందు మానవుడు చేతులుపైకెత్తి పైన జూచుచుండును. శరీరము మిక్కిలి కృశించియుండును. సంబంధములేని మాటల చాలకాలమువరకు నోటికివచ్చినట్లెల్ల వదరుచుండును. శరీరమునం దోరువరాని దుర్గంధము కల్గియుండును. మిక్కిలి యపరిశుద్ధమైన స్వభావము గల్గియుండును. మనసు చంచలమై యన్నపానాదులయం దాసగొని యుండును. మితిమీరి యాహారము చేయును. జనములేని ప్రదేశమునను, అడవిమధ్యప్రదేశమునను నివసింప నిచ్ఛగొని యుండును. పలువిధములుగ వికారచేష్టలజేయుచు దిరుగును. కారణములేకయే యేడ్చును.

మరియు చరకమున దీనిలక్షణము జెప్పునపుడు "నగ్నం విధావన్తం......పిశాచోన్మత్తం విద్యాత్" (చర. చి. అ. ౯. సూత్ర. ౨౨) అని చెప్పియుండుటచేత, ప్రకృతగ్రంథమున "ఊర్ధ్వస్తః" అనుచోట "ఉద్వస్త్రః" అనుపాఠ ముండుట మంచిది. కట్టుబట్టను విడిచి యని యర్థము. విదేహుడు గూడ "ఉద్వస్త్రః" అని పఠించి యున్నాడు.

## గ్రహముల అసాధ్యలక్షణము

స్థూలాక్షో ద్రుతమటనః సఫేనలేహీ
నిద్రాళుః పతతి చ కమ్పతే చ యో హి,
యశ్చాద్రిద్విరదనగాదివిచ్యుతస్స్యాత్
సోఽసాధ్యో భవతి తథా త్రయోదశాబ్దే. 26

పైజెప్పబడిన గ్రహములలో దేనిచే పీడింపబడినను మనుజుడు మిడిచూపులు చూచుచు, కారణములేక అతివేగముగ నలుప్రక్కల సంచరించుచుండినను, నోట నురుగు వెడలుచుండి నాలుకతో నాకుచు గాఢముగ నిదురించుచున్నను, పుడమిం బడి వణకుచున్నను, అట్టిగ్రహము అసాధ్యమగును. ఎవ్వండేని పర్వతమునుండియు, ఏనుగుపైనుండియు, చెట్టుమొదలగు నున్నతస్థలమునుండియు క్రిందపడునప్పుడు ఆవహించిన గ్రహం బేదైనను అయ్యది యసాధ్యమగును. మరియు పైజెప్పిన గ్రహములలో నెద్దియైనను మనుజులకు పదుమూడవయేట నావహించెనేని యయ్యదియు నసాధ్యమగును.

లోకమునం దెల్లగ్రహములు మనుజుల బట్టి బాధించుటకు రెండు కారణములు; అం దొకటి మనుజుల హింసించుట; రెండవది బలిపూజాదిసత్కారముల నందకోనసాస.

అందు బలిపూజాదులనొందగోరి మనుజుల నావేశించిన గ్రహములు కావలసినసత్కార ములనుమాత్రము కోవిదులు జేసిననాడు అంతట దృప్తినొంది వసలిపోవును. కేవలము మనుజుల ప్రాణహింస జేయగోరి యావేశించిన గ్రహములు పైజెప్పబడిన యసాధ్యలక్షణ ములు గల్గి యెన్నివిధముల చికిత్స జేసినను శాంతినొందక తుట్టతుదకు ప్రాణములను పో గొట్టును. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"అశుచిం భిన్నమర్యా దం క్షతం వా యదివాఽక్షతమ్, హింస్యుర్హింసావిహారార్థః సత్కారార్థమథాపి వా" (సు. ఉ. అ. ౬౦.)

మరియు చరకమున ని ట్లుపదేశింపబడినది:—"రత్యర్చనా ... దినా తు భిషక్ అభిప్రాయాచారాభ్యాం (అభిచారాభిశాపాభ్యాం) బుద్ధ్వా, గన్ధోపహారబలి మిశ్రేణ మన్త్రభైషజ్యవిధినా ఉపక్రమేత్" (చరక. చి. అ. ౯. శ్లో. ౩౧.) రతి క్రీడ ననుభవింప నిచ్చగోనియు, పూజాదిసత్కారముల నొంద నలచియు గ్రహము లావహించి యున్మాదమును గల్గించును. అట్టియెడ నా గ్రహములు అభిచారికగుణమగు తంత్రప్రయోగములచేతను, పెద్దల శాపముచేతను అట్టిగ్రహము ... దని కార ణము నెరింగి దాని కనుగుణముగ నుపహారముతు పూజలను జేసియు, మంత్రౌషధముల జేసియు వానిని నివర్తింప యత్నించవలెను.

## దేవాదిగ్రహము లావహించుకాలము

దేవగ్రహాః పౌర్ణమాస్యాం, అసురాస్సన్ధ్యయోరపి,
గన్ధర్వాః ప్రాయశోఽష్టమ్యాం, యక్షాశ్చ ప్రతిపద్యథ. 27
పిత్ర్యాః కృష్ణక్షయే హింస్యుః, పఞ్చమ్యామపి చోరగాః,
రక్షాంసి రాత్రౌ, పైశాచాః చతుర్దశ్యాం విశన్తి హి. 28

పైజెప్పిన గ్రహములలో దేవగ్రహములు పూర్ణిమనాడును, అసురగ్రహములు సంధ్య (ఉదయసాయంకాలము)లయందును, గంధర్వగ్రహములు అష్టమియందును, యక్షగ్రహములు పాడ్యమినాడును, పితృగ్రహములు అమావాస్యయందును, ఉరగ గ్రహములు పంచమినాడును, రాక్షసగ్రహములు రాత్రులయందును, పిశాచగ్రహ ములు చతుర్దశినాడును మనుజుల నావహించి వానివానిస్వభావము ననుసరించి బాధిం పందొడంగును.

## ఆవహించినగ్రహములు కనబడనికారణములు

దర్పణాదీన్ యథా ఛాయా శీతోష్ణం ప్రాణినో యథా,

స్వమణిం భాస్కరార్చిశ్చ యథా దేహం చ దేహధృత్,
విశన్తి చ న దృశ్యన్తే గ్రహాస్తద్వచ్ఛరీరిణః. 29

మనుజులశరీరము మున్నగువాని ప్రతిరూపము అద్దమున ప్రతిఫలించువిధంబుగను, శీతోష్ణగుణములు శరీరమున సంక్రమించు విధంబుగను, సూర్యుని తేజస్సు సూర్యకాంతపు మణిని జేరురీతిని, జీవుడు శరీరమున బ్రవేశించుభంగిని, పై జెప్పబడిన గ్రహము లన్నియు సమయమువచ్చినపుడు మనుజుల నావహించి తన స్వరూపము గన్పింపక లీనమై బాధించుచుండును.

సుశ్రుతమున "న తే మనుష్యైః సహ సంవిశన్తి న తే మనుష్యాన్ క్వచిదావిశన్తి. యే త్వావిశన్తీతి వదన్తి మోహాత్ తే భూతవిద్యావిషయాదపేతాః" (సుశ్రుత. ఉత్తర. అ. ౬౦) అనువాక్యముచేత దేవతలు మనుష్యులతోకూడ సమానముగ గూర్చుండుటలే దనియు, ఒకప్పుడైనను, మనుష్యుల నావేశింపవనియు, ఎవరు మనుజుల నావేశించు నని చెప్పెదరో వారు భూతవిద్య నెరుంగనివారనియు దెలియుచున్నది. ఈవాక్యముచేత దేవగ్రహములు మనుజుల నావహించుటలే దని తెలియుచున్నది. కావున ప్రకృతగ్రంథమున దేవగ్రహము లనగా దేవతల కనుచరులగు గ్రహము లని యెరుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఉన్మాదనిదానం సమాప్తమ్.

SHA NILAYAM

# ౨౧. అపస్మారనిదానమ్

ఉన్మాదమునుబోలె నపస్మారముగూడ మనస్సున జనించువ్యాధిగాన ఉన్మాదనిదానమును జెప్పినపిదప అపస్మారనిదానమును జెప్పుట.—

### అపస్మారసంప్రాప్తి

(చిన్తాశోకాదిభిర్దోషాః క్రుద్ధా హృత్స్రోతసి స్థితాః,
కృత్వా స్మృతేరపధ్వంసం అపస్మారం ప్రకుర్వతే.)

మనస్సునకు ప్రతికూలవిషయమునకు సంబంధించిదైన లేక గొప్పకార్యముల విషయమైనను నిరంతరముగ నాలోచించుట, ఇష్టమైనవస్తువు నష్టమగుట మున్నగు కారణములచే దుఃఖముకల్గుట మున్నగు మనోవ్యాపారములచేత వాతపిత్తకఫములు ప్రకుపితములై హృదయస్థానమునను మనస్సు సంచరించు మార్గమునందును జేరి స్మృతి(జరిగిన విషయమును జ్ఞప్తికి దెచ్చుశక్తి)ని నశింపజేసి యపస్మారమను రోగమును గల్గించును.

### అపస్మారసామాన్యలక్షణము

తమఃప్రవేశస్సంరమ్భో దోషోద్రేకహతస్మృతేః,
అపస్మార ఇతి జ్ఞేయో గదో ఘోరశ్చతుర్విధః. 1

పైజెప్పినకారణములచేత వాతపిత్తకఫములు ప్రకుపితములై మిక్కిలి వృద్ధినొంది స్మృతిని చెరచి మనుజుడు చీకటిలో మునిగినట్లు ఏమియు నెరుగక కన్నులను వికారముగ ద్రిప్పుచు కాలుసేతుల విదలించుచు క్రిందపడునట్లు చేయును. ఇయ్యది యపస్మారమను క్రూరమైనవ్యాధి. ఈవ్యాధి వాత - పిత్త - కఫ - సన్నిపాత భేదములచే నాల్గువిధములుగ నుండును.

మరియు నపస్మారమనుపదమున కన్వర్థతను సుశ్రుతుండి ట్లుపదేశించెను:— "స్మృతిర్భూతార్థవిజ్ఞానమపస్తత్పరివర్జనే, అపస్మార ఇతి ప్రోక్తస్తతోఽయం వ్యాధిరన్తకృత్" (సుశ్రుత. ఉత్తర. అ.౬౧.) స్మృతి యన కడచినవిషయమును దెలిసికొను మనోవ్యాపారము. అప యన నివర్తింపజేయునదనుట. ఈరెండుపదములును జేరిన 'అపస్మార' అను శబ్దమునకు, కడచినవిషయము తలంచునట్టి శక్తినిపోగొట్టునది యని యర్థము. అట్టి యపస్మారమను నీవ్యాధి మిక్కిలి క్రూరంబును ప్రాణాంతకరంబు నగును అని భావము.

### అపస్మారపూర్వరూపము

హృత్కమ్పశ్శూన్యతా స్వేదో ధ్యానం మూర్ఛాప్రమూఢతా,
నిద్రానాశశ్చ తస్మింశ్చ భవిష్యతి భవత్యథ. 2

అపస్మారము జనించుటకుమున్ను హృదయమున కంపముకల్గును. మనస్సునకేమియు దోచక నిశ్చేష్టముగనుండును. ఒడలిపై చెమటపట్టును మనసు దేనినో యోచించుచున్నట్లుండును. మూర్ఛవచ్చును. చక్షురాదీంద్రియములు తమతమవ్యాపారముల నుడుగును. నిదురపట్టదు. ఈలక్షణములన్నియు నపస్మారమునకు పూర్వరూపనుగును.

### వాతాపస్మారలక్షణము

కమ్పతే ప్రదశేద్దన్తాన్ ఫేనోద్వామీ శ్వసిత్యపి,
పరుషారుణకృష్ణాని పశ్యేద్రూపాణి చానిలాత్. 3

వాతమునగల్గిన యపస్మారమునందు శరీరము గడగడ వణకును. పండ్లు కొరుకును. నోట నురుగు నుమియును. శ్వాసమును తీవ్రముగ విడుచును. కంటి కగపడువస్తువులను పరుషంబులుగను అరుణవర్ణంబులుగను నల్లనిరంగుకల్గినవానిగను జూచుచుండును.

### పిత్తాపస్మారలక్షణము

పీతఫేనాఙ్గవక్త్రాక్షః పీతాసృగ్రూపదర్శకః,
సతృష్ణోష్ణానలవ్యాప్తలోకదర్శీ చ పైత్తికః. 4

పిత్తమున గల్గినయపస్మారమున నోట పచ్చనినురుగు వెడలును. శరీరమును ముఖమును కన్నులును పచ్చనై యుండును. కంటికగపడునవియన్నియు పచ్చనివిగను రక్తవర్ణములుగను గానవచ్చును. దప్పియు నుష్ణమును అధికముగనుండును. లోకమును నిప్పుచే నావరింపబడినదానినిబోలె చూచుచుండును.

### కఫమున జనించిన యపస్మారలక్షణము

శుక్లఫేనాఙ్గవక్త్రాక్షః శీతహృష్టాఙ్గజో గురుః,
పశ్యేచ్ఛుక్లాని రూపాణి శ్లైష్మికో ముచ్యతే చిరాత్. 5

కఫముచే జనించిన యపస్మారమున నోట తెల్లనినురుగు వెడలును. శరీరమును ముఖమును కన్నులును తెల్లనైయుండును. శరీరము చల్లనై గగురుపాటుగల్గి బరువుగనుండును. వస్తువులనన్నిటిని తెల్లగ జూచుచుండును. ఒడలెరుంగక పడియుండి చాలకాలమునకు మరల ప్రజ్ఞదెలియును. కఫజాపస్మారమున విశేషవిధిగ "ముచ్యతే చిరాత్" అని చెప్పుటచేత వాత-పిత్తాపస్మారములయందు శీఘ్రముగ నొడలెరుంగు నని తెలియనగును.

### సాన్నిపాతికాపస్మారలక్షణము

సర్వైరేతైస్సమస్తైశ్చ లిఙ్గైర్జ్ఞేయస్త్రిదోషజః,
అపస్మారస్స చాసాధ్యః యః క్షీణస్యాఽనవశ్చయః. 6
ప్రస్ఫురన్తం సుబహుశః క్షీణం ప్రచలితభ్రువమ్,
నేత్రాభ్యాం చ వికుర్వాణం అపస్మారో వినాశయేత్. 7

త్రిదోషములును సమముగ ప్రకోపించి జనించినది సన్నిపాతాపస్మారము. దీని యందు వాతపిత్తకఫముల యపస్మారములకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములన్నియు కల్గి యుండును. ఈయపస్మారమును, శరీరము మిగుల కృశించినవానికి గల్గినదియు చిరకాలము నుండి యనువర్తించియుండు నపస్మారమును అసాధ్యములు. మరియు పలుదెరంగుల శరీరము వణకుచున్నను, శరీరముచిక్కి కనుబొమల వికారముగ ద్రిప్పుచున్నను, కన్నులను వికారముగ ద్రిప్పుచున్నను అపస్మారము మిక్కిలి క్రూరమై మనుజుని చంపును.

### అపస్మారప్రకోపకాలనియమము

పక్షాద్వా ద్వాదశాహాద్వా మాసాద్వా కుపితా మలాః,
అపస్మారాయ కుర్వన్తి వేగం కిఞ్చిదథాపరమ్. 8
దేవే వర్షత్యపి యథా భూమౌ బీజాని కానిచిత్,
శరది ప్రతిరోహన్తి తథా వ్యాధిసముచ్ఛ్రయాః. 9

వాతాదిదోషములు ప్రకోపమునంది ఒకపక్షమునకైనను, పండ్రెండుదినములకైనను, ఒకనెలదినములకైనను తమతమవేగమును జూపి యపస్మారరోగమును గల్గించును. పైజెప్పినకాలనియమమునకు కొంచెముముందైనను వెనుకనైనను కల్గించుట కూడ కలదు. భూమియందణగియున్న కొన్నివిత్తనములు దేవుడు చక్కగ వర్షర్తువున వర్షించుచున్నను అప్పుడు మొలకలెత్తక కాలాంతరమున శరదృతువునందు మొలచువిధముగ దోషములు ప్రకోపించుటకు తగినకారణము లున్నను, అట్టికారణములచే నొకవేళ ప్రకోపించినను వ్యాధిస్వభావమునంజేసి అట్టికాలమున బాధసూపక పైజెప్పబడిన కాలనియమమును ప్రతీక్షించి నియమితకాలమున తలయెత్తును. ఇట్టినియమము వ్యాధిస్వభావముచేతనే కల్గును.

మరియు పైజెప్పిన కాలనియమములో నొకపక్షకాలమునకు పిత్తాపస్మారమును, పండ్రెండుదినములకు వాతికంబును, నెలదినములకు శ్లైష్మికంబును జనించు నని తంత్రాంతరమున నిర్ణయింపబడినది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అపస్మారనిదానం సమాప్తమ్.

# ౨౨. వాతవ్యాధినిదానమ్

వాతవ్యాధియు నపస్మారమునుబోలె మిక్కిలి తీవ్రముగ వ్యాపించునది కావున నపస్మారనిదానమును చెప్పినపిదప వాతవ్యాధినిదానము చెప్పబడును.—

### వాతవ్యాధినిదానసంప్రాప్తులు

రూక్షశీతాల్పలఘ్వన్నవ్యవాయాతిప్రజాగరైః,
విషమాదుపచారాచ్చ దోషాసృక్స్రవణాదపి. 1
లఙ్ఘనప్లవనాత్యధ్వవ్యాయామాదివిచేష్టితైః,
ధాతూనాం సంక్షయాచ్చిన్తాశోకరోగాతికర్షణాత్. 2
వేగసన్ధారణాదామాదభిఘాతాదభోజనాత్,
మర్మాబాధాద్గజోష్ట్రాశ్వశీఘ్రయానాపతంసనాత్. 3
దేహే స్రోతాంసి రిక్తాని పూరయిత్వాఽనిలో బలీ,
కరోతి వివిధాన్ రోగాన్ సర్వాఙ్గైకాఙ్గసంశ్రయాన్. 4

జిడ్డులేక రూక్షగుణముకల యన్నమునైనను, గుణవీర్యములచే శీతంబైన యన్నమునైనను భుజించినను, తనకు కావలసిన పరిమితికన్న తక్కువగ భుజించినను, లఘుగుణంబైన యన్నమునుభుజించినను, తనశక్తికిమిక్కుటముగ స్త్రీసంభోగముజేసినను, రాత్రులయందు అధికముగ నిదురమేల్కాంచినను, తనప్రకృతి కిముడని యుపచారముల జేసికొనినను, కఫపిత్తములను రక్తమును అధికము వెడలించినను, అన్నము దినక లంకణ మొనరించినను, మిట్టపల్లములుగ నుండుప్రదేశముల దాటినను, నీటియం దీతకొట్టినను, అధికముగ త్రోవనడచినను, దేహపరిశ్రమము మున్నగు శరీరవ్యాపారముల నధికముగ జేసినను, రసరక్తాదిధాతువులు క్షీణించినను, చింతచేనైనను దుఃఖముచేనైనను వ్యాధిచే నైనను శరీరము మిక్కిలి కృశించినను, మలమూత్రవాతాదులను అవసరమైనప్పుడు విసర్జింపక వాని వేగమును నిరోధించినను, పక్వముగాని యన్నరసము వాతము సంచరించునాడుల బ్రవేశించి వాతమార్గమును నిరోధించినను, దెబ్బలు మున్నగు కారణములచే నభిఘాతము కల్గినను, ఆహారముజేయక యుపవాసమున్నను, హృదయముమున్నగు మర్మస్థానములయం దభిఘాతముచే బాధగల్గినను, ఏనుగులు ఒంటెలు గుఱ్ఱములు మున్నగువానిపై నెక్కి త్వరితముగ సవారిజేసినను, వానిపైనుండి క్రిందపడినను,

వాతము ప్రకోపమునొంది శరీరమున శూన్యములుగనుండు నాడులనెల్లనింపి మిక్కిలి బలమునొంది శరీరమునందలి యంగములన్నింటియందైనను, లేక కొన్నిటియందైనను నానావిధవాతరోగముల గల్గించును.

శరీరమునందలి దోషములలోను రసాదిధాతువులలోను మలములలోను వాతము ప్రధానముగ నుండును. పిత్తకఫములు ధాతువులు మలములును తమతమనెలవుల వదలి స్థలాంతరములకు బోవుసామర్థ్యములేక గాలి ననుసరించి మేఘములు సంచరించువిధముగ వాతం బెక్కడకు లాగికొనిపోవునో ఆస్థానములకు తాము పరాధీనములై పోవుచుండును. ఈవిషయమునే తంత్రాంతరమున నిట్లు చెప్పిరి:—"పిత్తం పఙ్గు కఫః పఙ్గుః పఙ్గవో మలధాతవః, వాయునా యత్ర నీయన్తే తత్ర గచ్ఛన్తి మేఘవత్."

పైజెప్పనరీతిగ దోషధాతు మలముల కన్నిటికి వాతము ప్రధానమును ఆజ్ఞాకారియు నైయుండుటంజేసి దానజనించు నాక్షేపకాదివ్యాధులు మిక్కిలి కష్టమును గల్గించునవి యగును; కావున ఆట్టివ్యాధులకు ప్రత్యేకచికిత్సల జేయుటకు సౌకర్యముగ నీవాతవ్యాధినిదానము ప్రత్యేకముగ జెప్పబడెను. సుశ్రుతాచార్యుడు నీయుద్దేశమునే వాతరోగాధ్యాయమును వేరుగ జెప్పియున్నాడు.

### వాతవ్యాధిపూర్వరూపము

అవ్యక్తం లక్షణం తేషాం పూర్వరూపమితి స్మృతమ్,
ఆత్మరూపం తు యద్వ్యక్తం అపాయో లఘుతా పునః. 5

ఈక్రింద జెప్పబడు నాక్షేపకాదివాతవ్యాధుల లక్షణములు స్ఫుటముగాక సూక్ష్మములై ప్రారంభదశయందున్నచో నయ్యవియే ఆయావ్యాధులకు పూర్వరూపము లగును. అట్టిలక్షణములే స్ఫుటములుగ గానంబడినయెడ నవియే రూపములగును. అట్టి లక్షణములు నానాట తగ్గియుండునెడ రోగము నివర్తించుచున్న దని యెరుంగునది.

(జ్వరాదిరోగములయందు "శ్రమోఽరతిర్వివర్ణత్వం" ఇదిమున్నగు వాక్యముల చేత నాయావ్యాధి ననుసరించి పూర్వరూపాదుల ప్రత్యేకము జెప్పినవిధముగ వాతవ్యాధియందు ప్రత్యేకముగ లేక ఆయావ్యాధిలక్షణములే అస్ఫుటములుగ నున్నచో పూర్వరూప మనియు, స్ఫుటములుగ గానవచ్చినచో రూప మనియు, వ్యాధిలక్షణములు తగ్గుట వ్యాధినివృత్తి యనియు ఇతరవ్యాధులకన్న విలక్షణముగ నుండు ననియు నెరుంగునది.)

### వాతవ్యాధిస్వరూపము

సఙ్కోచః పర్వణాం స్తమ్భో భఙ్గోఽస్థ్నాం పర్వణామపి,
రోమహర్షః ప్రలాపశ్చ పాణిపృష్ఠశిరోగ్రహః. 6

ఖాఞ్జ్యపాఙ్గుల్యకుబ్జత్వం శోషోఽఙ్గానామనిద్రతా,
గర్భశుక్రరజోనాశః స్పన్దనం గాత్రసుప్తతా. 7

శిరోనాసాక్షిజత్రూణాం గ్రీవాయాశ్చాపి హుణ్డనమ్,
భేదస్తోదోఽర్తిరాక్షేపో ముహుశ్చాయాస ఏవ చ. 8

ఏవం విధాని రూపాణి కరోతి కుపితోఽనిలః,
హేతుస్థానవిశేషాచ్చ భవేద్రోగవిశేషకృత్. 9

కీళ్లు ముడుచుకొని కదలక స్తంభించుట, శరీరమునందలి యెముకలును కీళ్లును విరుగుట, శరీరమునందలి-రోమములు జలబరించుట, సంబంధములేని మాటల మాట్లాడుట, చేతులును వీపును శిరమును పట్టినట్టు లాగియుండుట, గూను, కుంటి, శరీరము పొట్టిగనుండుట, ముఖము చేతులు కాళ్లు మున్నగు నవయవములు నానాట కృశించుట, నిదుర పట్టకుండుట, గర్భమును శుక్రమును ఆర్తవశోణితమును, నశించుట, శరీరమెల్ల వణకుట, శరీరమున స్పర్శము తెలియక మొద్దుపారియుండుట, శిరమును ముక్కులును కన్నులును కంఠమూలమును మెడయు లోపలికి నీడువబడుట, శూలముచే జీంవబడినట్లును సూదులతో బొడిచినవిధముగను పోటుకల్గుట, ఆక్షేపము (శరీరము మాటిమాటికి వణకుట), మోహము, శ్రమము ఇవిమున్నగు ననేకరోగములను ప్రకోపించినవాతము కల్గించును. మరియు ప్రకోపించినవాతము కారణభేదములనుబట్టియు, రోగములు జనించు స్థానభేదమునుబట్టియు తదనుగుణముగ నానావిధరోగముల గల్గించును.

### కోష్ఠగతవాతలక్షణము

తత్ర కోష్ఠాశ్రితే దుష్టే నిగ్రహో మూత్రవర్చసోః,
వర్ధ్మహృద్రోగగుల్మార్శః పార్శ్వశూలం చ మారుతే. 10

వాతము ప్రకుపితమై కోష్ఠము నాశ్రయించినపుడు మలమూత్రములు వెడలక బంధింపబడును. అండవృద్ధి యగును. రొమ్మునొప్పి పుట్టును. గుల్మమును, అర్శో (మూల) రోగమును, ప్రక్కనొప్పియు కల్గును.

### సర్వాఙ్గగతవాతలక్షణము

సర్వాఙ్గకుపితే వాతే గాత్రస్ఫురణభఞ్జనమ్,
వేదనాభిః పరీతశ్చ స్ఫుటన్తీవాస్య సన్ధయః. 11

వాతము ప్రకోపమునొంది శరీరమునంతల్ల వ్యాపించినపుడు శరీరము వణకును. పగులును. నానావిధవేదనలు కల్గి సంధిబంధములన్నియు శిథిలములై పగులును.

### గుదగతవాతలక్షణము

గ్రహో విణ్మూత్రవాతానాం శూలాధ్మానాశ్మశర్కరాః,
జఙ్ఘోరుత్రికపాత్పృష్ఠరోగశోషా గుదే స్థితే. 12

వాతము గుదస్థానమున జేరి ప్రకోపమునందినచో మలమూత్రవాతములు వెడలక బంధింపబడును. మలమూత్రములస్థానమున నొప్పిబుట్టును. కడు పుబ్బరించును. మూత్రనాళమునుండి రాయియు శర్కరయు వెడలును. పిక్కలయందును, తొడలయందును, వెన్నెముకకు క్రిందిభాగమునను, పాదములయందును, వీపునందును నొప్పికల్గి నానాట కృశించును.

### ఆమాశయగతవాతలక్షణము

రుక్పార్శ్వోదరహృన్నాభేః తృష్ణోద్గారవిషూచికాః,
కాసః కణ్ఠాస్యశోషశ్చ శ్వాసశ్చామాశయస్థితే. 13

వాతంబామాశయమున జేరి ప్రకోపమునొందినపుడు ఇరుప్రక్కలయందును, కడుపునందును, రొమ్మునందును, బొడ్డుదగ్గరను నొప్పికల్గును. దప్పి యధికముగ కల్గును. త్రేపులు వచ్చును. విషూచి (వాంతిభేది)యు, దగ్గును కల్గును. కుత్తుకయు నోరును ద్రవములేక యెండును. శ్వాస మధికముగ వెడలును.

మరియు "వ్యాధీనూర్ధ్వం చ నాభితః" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౮.) అని వాగ్భటులు చెప్పిరి కావున పై జెప్పినవి గాక యితరవ్యాధులుకూడ బొడ్డునకు పైభాగమున కల్గు నని యెరుంగునది.

### పక్వాశయగతవాతలక్షణము

పక్వాశయస్థోఽన్త్రకూజం శూలాటోపౌ కరోతి చ,
కృచ్ఛ్రమూత్రపురీషత్వం ఆనాహం త్రికవేదనామ్. 14

వాతము పక్వాశయమునజేరి ప్రకుపితమైనపుడు ప్రేవులలోకూతయు నొప్పియు బుట్టియుబ్బును. మలమూత్రములు మిక్కిలి కష్టముగ వెడలును కడు పుబ్బును. వెన్నెముకకు క్రింద జేరియుండుసంధిలో నొప్పికల్గును. మరియు "కరోత్యధరకాయేషు తాంస్తాన్ కృచ్ఛ్రానుపద్రవాన్" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౨.) అని వాగ్భటాచార్యులు చెప్పినప్రకారము పైజెప్పినవ్యాధులు గాక యితరములగు నానావిధవ్యాధులును నాభికి క్రింది అవయవములయందు కల్గించు నని యెరుంగునది.

## శ్రోత్రాదీన్ద్రియగతవాతలక్షణము

శ్రోత్రాదిష్విన్ద్రియవధం కుర్యాద్దుష్టసమీరణః,

చెవులు కన్నులు మున్నగు నింద్రియస్థానములనుండి వాతము ప్రకోపమునొంది నపుడు ఏయింద్రియమున జేరునో ఆయాయింద్రియములను చెరిచి దానిదానిశక్తిని నశింపజేయును.

## త్వగ్గతవాతలక్షణము

త్వగ్రూక్షా స్ఫుటితా సుప్తా కృశా కృష్ణా చ తుద్యతే. 15
ఆతన్యతే సరాగా చ పర్వరుక్ త్వగ్గతేఽనిలే,

శరీరమునందలి పైచర్మమున జేరి వాతము ప్రకోపించినపుడు చర్మమున జిడ్డులేక కఱకుబారియుండును. లేక పగులును. స్పర్శము నెరుంగజాలకుండును. నల్లనై నానాట కృశించును. సూదులతో బొడిచినరీతి పోటు పుట్టును. ఎఱ్ఱనిరంగు కల్గి ముడుచుకొని యుండును. కీళ్లలో నొప్పి కల్గును.

(ఇచ్చట త్వక్శబ్దముచేత రసధాతువు గ్రహింపబడును.)

## రక్తధాతుగతవాతలక్షణము

రుజస్తీవ్రాస్ససన్తాపా వైవర్ణ్యం కృశతాఽరుచిః. 16
గాత్రే చారూంషి భుక్తస్య స్తమ్భశ్చాసృగ్గతేఽనిలే,

రక్తమున వాతము చేరి ప్రకోపించినచో మంటయు మిక్కిలి తీవ్రములగు నొప్పులును కల్గును. శరీరమున వర్ణము మారును. కృశతనొందును. అరోచకము కల్గును. శరీరముపై బొబ్బలులేచి పుండ్లగును. భుజించినపిమ్మట శరీరము స్తంభించియుండును.

(ఇచ్చట వాతము రక్తమున జేరి ప్రకుపితమై పైగనబరుపబడిన బాధలగల్గించును. వాతరక్త మను వ్యాధియందు వాతమును రక్తమును సమకాలమున సమములుగ ప్రకోపించును. కావున వాతరక్తమునకన్న నీవ్యాధి వేరైన దని యెరుంగునది )

## మాంసమేదోగతవాతలక్షణము

గుర్వఙ్గం తుద్యతేఽత్యర్థం దణ్డముష్టిహతం యథా. 17
సరుక్ శ్రమితమత్యర్థం మాంసమేదోగతేఽనిలే,

మాంసమునందును మేదస్సునందును జేరినవాతము ప్రకోపించినయెడ శరీరము బరువుగ నుండును. కఱ్ఱలచేత కొట్టినట్లును పిడికిట బొడిచినట్లును నొప్పికల్గును. నొప్పితో గూడి శరీరముపై గుడ్డగప్పినవిధముగ మొద్దుబారియుండును.

సుశ్రుతమున మాంస మేదస్సుల నాశ్రయించినవాతమునకు వేరువేరుగ లక్షణ మిట్లు చెప్పబడినది:—"కర్కశాంస్తోదబహులాన్ గ్రంథీన్ మాంససమాశ్రితః, వాయుర్మేదోగతః కుర్యాత్ గ్రంథీన్నల్పరుజోఽవ్రణాన్." మాంసము నాశ్రయించి వాతము ప్రకోపించినయెడ మిక్కిలి పోటు కల్గి కఠినములైన గ్రంథులను గల్గించు ననియు, మేదోగతమైనవాతము స్వల్పమైన బాధతో గూడి వ్రణములు కాని గ్రంథుల గల్గించు ననియు భావము.

## అస్థిమజ్జగతవాతలక్షణము

భేదోఽస్థిపర్వణాం సన్ధిశూలం మాంసబలక్షయః. 18
అస్వప్నస్సన్తతారుక్చ మజ్జాస్థికుపితేఽనిలే,

అస్థిమజ్జల నాశ్రయించినవాతము ప్రకోపించినపుడు ఎముకలయొక్క కీళ్ల యందు నొప్పిగల్గి సడలియుండును. అవయవసంధులయందు శూలమున గ్రుచ్చినట్లు పోటు కల్గును. శరీరమునందలి మాంసమును బలమును క్షీణించును. నిదుర పట్టదు. ఎడ తెగనినొప్పి యెముకలలో కల్గును.

వాగ్భటాచార్యుడు అస్థిని మజ్జను ఆశ్రయించిన వాతలక్షణముల ప్రత్యేకముగ నిట్లు చెప్పెను:—"అస్థిస్థః సక్థిసన్ధ్యస్థిశూలం తీవ్రం బలక్షయమ్, మజ్జస్థోఽస్థిషు సౌషిర్యం అస్వప్నం స్తబ్ధతాం రుజమ్" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౧౨) అస్థి యందలివాతము ప్రకోపించినపుడు తొడలసంధులగు మోకాళ్లకీళ్లయందు తీవ్రమగు నొప్పి పుట్టును. శరీరబలము నశించును. మజ్జ (మూలగ) యందలి, వాతము ప్రకోపించినయెడ నెముకలలో రంధ్రముల గల్గించును. నిదురపట్టదు. ఎముకలు కీళ్లు కదలక స్తంభించును. తీవ్రముగ నొప్పిపుట్టును. అని భావము.

## శుక్రగతవాతలక్షణము

క్షిప్రం ముఞ్చతి బధ్నాతి శుక్రం గర్భమథాపి వా. 19
వికృతిం జనయేచ్చాపి శుక్రస్థః కుపితోఽనిలః,

శుక్రమునందలి వాతము ప్రకోపించినచో శుక్రమును గర్భమును అతిశీఘ్రముగ స్రవింపజేయును. లేక బైటవెడలనీయక బంధించును. అట్టి శుక్రమునకును గర్భమునకును సంబంధించినవ్యాధుల కల్గించును.

## సిరాగతవాతలక్షణము

కుర్యాత్సిరాగతశ్శూలం సిరాకుఞ్చనపూరణమ్. 20
స బాహ్యాభ్యన్తరాయామం ఖల్లీం కౌబ్జ్యమథాపి వా,

సిరల నాశ్రయించినవాతము ప్రకోపించినయెడ సిరల (దోషరక్త వాహినుల) యందు పోటును కల్గించును. అట్టి సిరలను ముడుచును, ఉబికించును. బాహ్యాయామము అభ్యంతరాయామము ఖల్వీ యను వాతరోగములను, కుబ్జత్వము (గుజ్జారితనము)ను కల్గించును.

తంత్రాంతరమున "సుప్తా స్తన్వ్యో బృహత్యో వా సిరాః వాతే సిరాగతే" అని యుండుటంజేసి సిరాగతవాతము ప్రకోపించినపుడు సిరలు నిశ్చేష్టములుగనైనను, సన్నవిగనైనను, స్థూలములుగనైన నుండు నని తెలియదగు.

స్నాయుసంధిగత వాతలక్షణము

సర్వాఙ్గైకాఙ్గరోగాంశ్చ కుర్యాత్ స్నాయుగతోఽనిలః. 21
హన్తి సన్ధిగతస్సన్ధీన్ శూలాటోపౌ కరోతి చ,

స్నాయువుల (సన్ననినరముల) నాశ్రయించినవాతము ప్రకోపించినచో సర్వాంగ (అవయవముల నన్నిటి నాశ్రయించిన) వాతరోగములను, లేక ఏకాంగ (అవయవములలో నొక్కదాని నాశ్రయించిన) వాతరోగములను బుట్టించును. కీళ్ల నాశ్రయించినవాతము ప్రకోపించినయెడ కీళ్ల యందు పోట్లను కల్గించి వాపును పుట్టించును. కీళ్ల నిటునటు కదలింప సాధ్యము కాదు. (మఱియు వాగ్భటాచార్యుడు సంధిగతవాతము నిట్లు చెప్పెను:— "వాతపూర్ణదృతిస్పర్శం శోఫం సన్ధిగతోఽనిలః, ప్రసారణాకుఞ్చనయోః ప్రవృత్తిం చ సవేదనామ్" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౧౪) సంధిగతమైన వాతము ప్రకోపించినపుడు గాలిచే నిండియున్న తోలుతిత్తివలె నుండు వాపును కల్గించును. కాలుసేతుల చాచునపుడును, ముడుచునపుడు మిక్కిలి బాధకల్గి కష్టముగ నుండును.)

పంచవిధ వాతభేదములు

(ప్రాణోదానౌ సమానశ్చ వ్యానశ్చాపాన ఏవ చ,
స్థానస్థాః మారుతాః పఞ్చ యాపయన్తి శరీరిణమ్). *

ప్రాణము, ఉదానము, సమానము, వ్యానము, అపానము నని వాతము అయిదు విధములుగ నుండును. అయ్యవి వానివానికి నియమితములగు హృదయాది స్థానముల యందు (ప్రకోపమునొందక సమస్థితిగ) ఉన్నపుడు శరీరమును కాపాడుచుండును.

పిత్తావృత-కఫావృత ప్రాణవాతలక్షణము

ప్రాణే పిత్తావృతే చ్ఛర్దిర్దాహశ్చైవోపజాయతే. 22
దౌర్బల్యం సదనం తన్ద్రా వైరస్యం చ కఫావృతే,

* ఇది ప్రక్షిప్తము. మధుకోశ వ్యాఖ్యయం దెత్తబడలేదు.

ప్రాణవాతము పిత్తముచే నావరింపబడినప్పుడు వాంతియగును. మంట పుట్టును. కఫముచే నావరింపబడినయప్పుడు బలహీనమగును. అవయవములు సత్తువ లేక నొచ్చును కునికిపాటు కల్గును. నోటికి మధురాదిరసములరుచి తెలియదు.

కఫపిత్తములతో గూడిన యుదాన వాతలక్షణము

ఉదానే పిత్తయుక్తే తు దాహో మూర్ఛా భ్రమః క్లమః. 23
అస్వేదహర్షౌ మన్దోఽగ్నిః శీతతా చ కఫావృతే,

ఉదానవాతము పిత్తముతో గూడియున్నచో మంటయు, మూర్ఛయు, చక్రము పైనున్నవానివలె నొడలు తిరుగుటయు బడలికయు కల్గును. అయ్యది కఫముతోగూడి యున్నపుడు శరీరముపై చెమట బొత్తుగపట్టదు. ఒడలియందలి రోమములు జలబరించును. జఠరాగ్ని మందమగును. శరీరమెల్ల చల్లగనుండును.

పిత్తకఫములతో గూడిన సమానవాతలక్షణము

స్వేదదాహౌష్ణ్యమూర్ఛాస్స్యుః సమానే పిత్తసంవృతే. 24
కఫేన సక్తే విణ్మూత్రే గాత్రహర్షశ్చ జాయతే,

సమానవాతము పిత్తముతో గూడియున్నపుడు శరీరమున చెమటపట్టును. మంట కల్గును. ఒడలెల్ల వేడికల్గి యుండును. మూర్ఛ గ్రమ్మును. కఫముతో గూడినపుడు మల మూత్రములు వెడలక బంధింపబడును. ఒడలెల్ల జలబరించును.

పిత్తకఫములతో గూడిన యపానవాతలక్షణము

అపానే పిత్తసంయుక్తే దాహౌష్ణ్యం రక్తమూత్రతా. 25
అధఃకాయే గురుత్వం చ శీతతా చ కఫావృతే,

అపానవాతము పిత్తముతో గూడియున్నపుడు శరీరమునందు బొడ్డుకు క్రింది భాగమున మంటబుట్టును. వేడి యధికముగ నుండును. మూత్రము రక్తమునుబోలె నెఱ్ఱనై వెడలును. కఫముతో గూడినపుడు బరువై చల్లగనుండును.

పిత్తకఫములతోగూడిన వ్యానవాత లక్షణము

వ్యానే పిత్తావృతే దాహః గాత్రవిక్షేపణం క్లమః. 26
స్తమ్భనో దణ్డకశ్చాపి శూలశోథౌ కఫావృతే,

వ్యానవాతము పిత్తముతో గూడినపుడు శరీరమున మంటబుట్టును. శరీరమును పలువిధములుగ విదర్చును. బడలిక కల్గును. కఫముతో గూడినపుడు శరీరము స్తంభించును కట్టెవలె నిగుడుకొని యుండును. నొప్పియు వాపును కల్గును.

## ఆక్షేపకవాతలక్షణము

యదా తు ధమనీస్సర్వాః కుపితోఽభ్యేతి మారుతః. 27
తదా క్షిపత్యాశు ముహుః ముహుర్దేహం ముహుశ్చరః,
ముహుర్ముహుశ్చాక్షేపణాదాక్షేపక ఇతిస్మృతః. 28

వాతము శరీరమునందలి ధమనులయం దన్నిటియందును వ్యాపించి ప్రకోపము నొందినపుడు మాటిమాటికి నిటునటు తిరుగుచుండును గాన శరీరము నేనుగుపైనెక్కిన వానిని బోలె మాటిమాటికి కదలించును. అయ్యది శరీరమును మాటిమాటికి కదలించుటంజేసి యాక్షేపక వాత మని యన్వర్థముగ జెప్పనగును.

## అపతంత్రకవాతలక్షణము

క్రుద్ధస్స్వైః కోపనైర్వాయుః స్థానాదూర్ధ్వం ప్రపద్యతే,
పీడయన్ హృదయం గత్వా శిరశ్శంఖౌ చ పీడయన్. 29
ధనుర్వన్నమయేద్గాత్రాణ్యాక్షిపేన్మోహయేత్తదా,
సకృచ్ఛ్రాదుచ్ఛ్వసేచ్చాపి స్తబ్ధాక్షోఽథ నిమీలకః. 30
కపోత ఇవ కూజేచ్చ నిస్సంజ్ఞస్సోఽపతంత్రకః,

వాతము తన ప్రకోపమునకు కారణములైన యాహారవిహారాదులచే ప్రకోపమునంది శరీరమునందలి తనస్థానమును వదలి పైకి వ్యాపించి హృదయమునజేరి యాస్థలమునను శిరస్సునందును కణతలయందును నొప్పికల్గించి అవయవముల నన్నిటిని వింటి దబ్బునువలె వంచి యవయవములనెల్ల నాక్రమించి మూర్ఛ నొందించును. అప్పుడు మనుజుడు చాలా కాలమునకు మిక్కిలి కష్టముతో నుచ్ఛ్వసమును విడుచును. కన్నులు చలింపక యరమోడ్పుగా మూసి కపోత (పావురి)మువలె కూయిడుచు నొడలెరుంగక క్రిందపడును. ఇయ్యది యపతంత్రక మనువాత రోగము.

## అపతానకవాతలక్షణము

దృష్టిం సంస్తభ్య సంజ్ఞాం చ హత్వా కణ్ఠేన కూజతి. 31
హృది ముక్తే నరస్స్వాస్థ్యం యాతి మోహం వృతే పునః,
వాయునా దారుణం ప్రాహుః ఏకే తదపతానకమ్. 32

పైజెప్పినరీతిగ వాతము ప్రకోపించి హృదయమున జేరి కన్నుల నిశ్చలముగ జేసి తెలివిని బొత్తుగ జెడగొట్టి కంఠమున ధ్వనిని బుట్టించును. అట్టివాతము హృదయస్థానమును విడిచినప్పుడు స్వస్థత కల్గును. మరల వాతము హృదయమున జేరునప్పుడు

పైలక్షణములన్నియు కల్గుచుండును. ఇత్తెరంగున మాటిమాటికిని అప్పుడప్పుడు విడిచి మరల బాధించుచున్నయెడ నయ్యది యపతానక మని కొంద రాచార్యులు చెప్పెదరు.

ఇచ్చట వాతము హృదయమున జేరి బాధించుచు మూర్ఛాదులు గల్గి, వాతము హృదయమునుండి తొలగినపుడు స్వస్థత కల్గుచు, పలుమారు నీరీతివచ్చుచు శాంతమగు చుండునది యపతానక మనియు, ఒకటేరీతిగ బాధించునది యపతంత్రక మనియు నీరెంటికిని భేద మెరుంగునది. ఈవిషయమును వాగ్భటాచార్యుడు ఇట్లు చెప్పెను:— "స ఏవ చాపతానాఖ్యో ముక్తే తు మరుతా హృది, అశ్నువీత ముహుస్స్వాస్థ్యం ముహురస్వాస్థ్యమావృతే" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౨౫)

### దండాపతానకలక్షణము

కఫాన్వితో భృశంవాయుస్తాస్వేవ యది తిష్ఠతి,
దండవత్ స్తమ్భయే ద్దేహం స తు దండాపతానకః. 33

వాతము ప్రకుపితమై కఫముతో గూడి పైజెప్పినరీతిగ హృదయము నాశ్రయించిన నాడులయందు వ్యాపించి శరీరమును చేష్టలుదక్కి కట్టెవలె నీల్గి (సాగి) యుండునట్లు స్తంభింపజేయును. ఇయ్యది దండాపతానక మని చెప్పబడును.

చరకమున దండాపతానకమును దండక మను నామాంతరమున జెప్పి లక్షణము ఇట్లుపదేశింపబడెను — "పాణిపాదశిరఃపృష్ఠశ్రోణీ స్తభ్నాతిమారుతః, దణ్డవత్ స్తబ్ధ గాత్రస్య దణ్డకస్సోఽనుపక్రమః" (చరక. చి. అ. ౨౮) కాలుసేతులను, శిరస్సును, వీపును, పిరుదులను వాతము కట్టెనువలె స్తంభింపజేసినచో నయ్యది దండకవాత మన బడును. ఇయ్యది యసాధ్యము.

### ధనుస్తమ్భవాతలక్షణము

ధనుస్తుల్యం నమే ద్యస్తు స ధనుస్తమ్భసంజ్ఞకః,

పైజెప్పినరీతిగ వాతము ప్రకోపించి విల్లువలె శరీరమును వంచినచో నయ్యది ధనుస్తంభవాత మనబడును.

(ఇయ్యది అంతరాయామ బహిరాయామములను వాతవ్యాధులు రెంటికిని సామాన్య లక్షణ మగును.)

### అంతరాయామలక్షణము

అఙ్గులీగుల్ఫజఠరహృద్వక్షోగలసంశ్రితః. 34
స్నాయు ప్రతానమనిలః యదా క్షిపతి వేగవాన్,

విష్టబ్ధాక్ష_స్తబ్ధహనుః భగ్నపార్శ్వః కఫం వమన్. 35
అభ్యంతరం ధనురివ యదా నమతి మానవమ్,
తదాస్యాభ్య_న్తరాయామం కురుతే మారుతో బలీ. 36

వాతము ప్రకోపమునొంది వ్రేళ్లను, చీలమండను, జఠరమును, హృదయమును, రొమ్మును, కంఠమును, సిరలను ఆశ్రయించి, శరీరమునందలి స్నాయువు (సన్నని నరము) లను, సిరలను, కండరములను మిక్కిలి వేగముతో కూడి వంగునట్లు చేయును. దానం జేసి శరీరమెల్ల విల్లువలె ముందుప్రక్కకు వంచబడును. అట్టియెడ కదలక కన్నులు స్తంభించి యుండును. తాలువులు బిగబట్టి మాటలాడ వలనుపడదు. ఇరుప్రక్కల నొప్పికల్గును. నోట నురుగు వాంతియగును. ఇయ్యది ప్రబలమైన వాతముచే గల్గిన యభ్యంతరాయామ మని చెప్పబడును.

ఇచ్చట అంతరాయామ బహిరాయామవాతములు రెంటియందును స్నాయు శబ్ద ముపలక్షణముగాన సిరలును, కండరములునుకూడ గ్రహింపనగును. ఈవిషయమై తంత్రాంతరమున "మహాహేతుర్బలీ వాయుస్సిరాస్సస్నాయుకండరాః, మన్యా పృష్ఠ శ్రితాబాహ్యాః సంశోష్యాయామయేద్బహిః" అని చెప్పబడెను.

## బాహ్యాయామలక్షణము

బాహ్యస్నాయుప్రతానస్థో బాహ్యాయామం కరోతి చ,
తమసాధ్యం బుధాః ప్రాహుః వక్షః కట్యూరుభఞ్జనమ్. 37

పైజెప్పినరీతిగ వాతము ప్రకోపించి శరీరమున వెనుకప్రక్క కంఠమున కిరు ప్రక్కలను వీపును ఆశ్రయించిన స్నాయువులను సిరలను కండరములను జేరి శోషింప జేసి రొమ్మును, నడుమును, తొడలను వెనుకప్రక్కకు వంచును. ఇది శరీరమున వెనుక ప్రక్కకు వంగునది కావున బాహ్యాయామ మని చెప్పబడును. ఇయ్యది ప్రబలమైన వాతముచే గుండె - మొల - తొడలు వీనిని విఱుచునది కావున యసాధ్యము.

బాహ్యాయామవ్యాధియందు "దన్తేష్వాస్యే చ వైవర్ణ్యం ప్రస్వేద, స్రస్త గాత్రతా, బాహ్యాయామం" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౨౬.) అని వాగ్భటమున జెప్పియున్నది కావున పండ్లును ముఖమును వివర్ణములై శరీరమున చెమటపుట్టి అవ యవములు శిథిలములగు నని యెఱుంగునది.

మరియు "హృదయం యది వా పృష్ఠం ఉన్నతం క్రమశస్సరుక్, క్రుద్ధో వాయుర్యదా కుర్యాత్తదాతం కుబ్జమాదిశేత్" అని తంత్రాంతరమున కుబ్జలక్షణము చెప్పబడినది. వాతము ప్రకుపితమై శరీరమునందలి సిరాస్నాయుకండరముల జేరి

రొమ్మును పైకున్నతముగ జేసినను, లేక వీపును పైకుబికినట్లుచేసినను కుబ్జవాత మని యర్థము. ఇచ్చట మొదటిది బాహ్యాయామమందును, రెండవది యంతరాయామ మందును జేరును గాన వేరుగ జెప్పబడలే దని యెరుంగునది.

—అభిఘాతజ ఆక్షేపకవాతవ్యాధి—

కఫపిత్తాన్వితో వాయుర్వాయు రేవ చ కేవలః,
కుర్యాదాక్షేపక న్త్వన్యం చతుర్థమభిఘాతజమ్. 33

వాతము కఫపిత్తముల గూడినదైయైనను వానినిగూడకయైనను శరీరమున వ్యాపించి అవయవముల పనులుచేయనీయక యాక్రమించును. ఇట్టి అభిఘాతమున జనించునది నాల్గవ యాక్షేపకవాతము. ఈ యాక్షేపకమున "యదాతు ధమనీస్సర్వాః" అని పై జెప్పబడిన ఆక్షేపక సామాన్యలక్షణములు కల్గియుండును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—ఆక్షేపకవాతము అనగ వాతము ప్రకుపితమై శరీరమునందలి స్నాయుసిరాకండరముల నాశ్రయించి ఆయా యవయవము జేయు కృత్యముల నడ్డగించి యాక్రమించునది యని యర్థము. దీని సామాన్యలక్షణము "యదాతు ధమనీస్సర్వాః" అని చెప్పబడినది. అట్టి యాక్షేపకవాతము అపతంత్రకము, అంతరాయామము, బాహ్యాయామము, ఆగంతుకము నని నాల్గు తెరంగుల నుండు. అపతానక దండాపతానకములు రెండును అపతంత్రక భేదములు. ధనుస్తమ్భ మనునది అంతరాయామ బాహ్యాయామములకు సామాన్యలక్షణముగాని వేరుకాదు. ఈ వ్యాధులయం దన్నిటియందును వాతము వ్యాపించి అవయవముల చేష్టల నిరోధించును కావున ఆక్షేపక మనునది యన్నిటికిని సామాన్యలక్షణ మగును. ఈ నియమమునుబట్టియే "కుర్యాదాక్షేపకం త్వన్యం చతుర్థమభిఘాతజమ్" అని ప్రకృతగ్రంథమున నిర్దేశింపబడెను.

వాగ్భటాచార్యుడు అంతరాయామ బాహ్యాయామములతోగూడ వ్రణాయామమను మూడవదాని నిట్లు చెప్పెను:—"వ్రణం మర్మాశ్రితం ప్రాప్య సమీరణ సమీరణాత్, వ్యాయచ్ఛన్తి తనుం దోషాః సర్వామాపాదమస్తకమ్, తృష్యతః పాణ్డుగాత్రస్య వ్రణాయామః స వర్జితః" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౨౭.) వాతాదిదోషములు కణతలు మున్నగు మర్మస్థానముల జనించిన వ్రణముచేరి, ప్రకుపితమైన వాతముచే పిత్తకఫములుగూడ ప్రేరితములై అన్నియు కలిసి పాదములు మొదలు శిరస్సువరకు శరీరమునంతట నాక్రమించి నిర్వ్యాపారముగ జేయును. అట్టి రోగమున మనుజుడు వెల్లనైనశరీరము గలవాడై మిక్కిలి దప్పిచే పీడింపబడినచో మిక్కిలి యసాధ్య మగును అని భావము. ఇది యాయామభేదములో జేరినదని ప్రకృతగ్రంథమున వేరుగ జెప్పబడదయ్యెను.

## అసాధ్యాక్షేపక లక్షణము

గర్భపాతనిమిత్తశ్చ శోణితాతిస్రవాచ్చ యః,
అభిఘాతనిమిత్తశ్చ న సిధ్యత్యపతానకః. 39

గర్భము అకాలమున స్రవించి చెడినప్పుడును, రక్తము అధికముగ స్రవించినప్పుడును కల్గిన యపతానక మను నాక్షేపకవాతమును, దండప్రహారము మున్నగు నభిఘాతములచే గల్గిన యాగంతుకంబగు నాక్షేపకంబును అసాధ్యమగును. ఇచ్చట గర్భపాత నిమిత్తమైనది అసాధ్యమును, రక్తస్రావమున గల్గినది యింతకన్న నసాధ్యమును, అభిఘాతమున జనించినది దానికన్న మిక్కిలి యసాధ్యము నగు నని వ్యాఖ్యాతల యభిప్రాయము.

(ఇచ్చట వాతము పిత్తముతో గూడియైనను, కఫముతో గూడియైనను, వానిం గూడక కేవలవాతమైనను ఆక్షేపకవాతమును గల్గించును కావున పైచెప్పిన రీతిగ మూడు విధంబులును, దండతాడనము ముష్టిప్రహారము మున్నగు కారణములచే జనించిన యాగంతుక మొకటియు గలిసి నాల్గు విధము లగును. గర్భపాత-రక్తస్రావములచే గల్గిన యాక్షేపకము కేవల వాతముచే గల్గును అను నిర్ణయము గదాధరుడు చూపియున్నాడు.)

## ఏకాఙ్గ సర్వాఙ్గవాత లక్షణము

గృహీత్వార్ధం తనోర్వాయుః సిరాస్స్నాయూర్విశోష్య చ,
పక్షమన్యతరం హన్తి సన్ధిబన్ధాన్విమోక్షయన్. 40
కృత్స్నోఽర్ధకాయ స్తస్య స్యాత్ అకర్మణ్యో విచేతనః,
ఏకాఙ్గరోగం తం కేచిదన్యే పక్షవధం విదుః. 41
సర్వాఙ్గరోగ స్తద్వచ్చ సర్వకాయాశ్రితేఽనిలే,

వాతము ప్రకోపమునొంది శరీరమునం దర్ధభాగమున వ్యాపించి సిరలను స్నాయువులను శోషింపజేసి సంధిబంధముల (కీళ్ల)ను సడలించి శరీరమున కుడిభాగము నందైనను ఎడమభాగము నందైనను కదలించుట మున్నగు చేష్టలయందు సామర్థ్య ముడిగించును. అట్టి యర్ధశరీరమునం దంతటను పనులుచేయ సామర్థ్యము లేక స్పర్శ నెఱుంగజాలక యుండును. దీనిని యేకాంగవాత మని కొందరును, పక్షవధ మని మరి కొందరును వచించెదరు. పైజెప్పిన రీతిగ వాతము ప్రకుపితమై శరీరమునందెల్ల రెండు భాగములయందును పూర్తిగ వ్యాపించి ఇరుప్రక్కలనుండు సిరాస్నాయువుల శోషింపజేసి సంధిబంధము లన్నింటిని శిథిలములుగజేసి క్రియాసామర్థ్యములేక చేసినచో నయ్యది సర్వాంగవాత మనబడును.

## ఏకాంగవాత సాధ్యాసాధ్య లక్షణములు

దాహసన్తాపమూర్ఛాస్స్యుః వాయౌ పిత్తసమన్వితే. 42
శైత్యశోథగురుత్వాని తస్మిన్నేవ కఫాన్వితే,
శుద్ధవాతహతం పక్షం కృచ్ఛ్రసాధ్యతమం విదుః. 43
సాధ్యమన్యేన సంయుక్తం అసాధ్యం క్షయహేతుకమ్,

వాతము ప్రకుపితమై పిత్తముతోఁగూడి పైజెప్పిన పక్షవధమును గల్గించి నపుడు మంటయు సంతాపంబును మూర్ఛయు గలుగును. అట్టివాతము కఫముతోఁ గూడి పక్షవధమును గల్గించినపుడు వ్యాధికల్గిన యర్ధశరీరము చల్లబడియుండును. వాపు కల్గును. బరువుగ నుండును. కఫపిత్తములలోఁ నొకదానితోఁ కలియక కేవలము వాతముమాత్రము గల్గించెనేని అట్టి పక్షవధము మిక్కిలి కష్టసాధ్య మగును. అటుగాక పిత్తకఫములతోఁ గలసిన వాతమున గల్గినయెడ సాధ్యమగును. ధాతువులు క్షీణించుటచే గల్గిన పక్షవధము ఎట్టిదైనను అసాధ్యమగును.

## అర్దిత వాతలక్షణము

ఉచ్చైర్వ్యాహరతోఽత్యర్థం ఖాదతః కఠినాని వా. 44
హసతో జృమ్భతో వాపి భారాద్విషమశాయినః,
శిరో నాసౌష్ఠచుబుకలలాటేక్షణసన్ధిగః. 45
అర్దయత్యనిలో వక్త్రం అర్దితం జనయత్యతః,
వక్రీభవతి వక్త్రార్ధం గ్రీవా చాప్యపవర్తతే. 46
శిరశ్చలతి వాక్సఙ్గః నేత్రాదీనాం చ వైకృతమ్,
గ్రీవాచుబుకదన్తానాం తస్మిన్పార్శ్వే చ వేదనా. 47
(యస్యాగ్రజో రోమహర్షో వేపథుర్నేత్రమావిలమ్,
వాయురూర్ధ్వం త్వచి స్వాపః తోదో మన్యాహనుగ్రహః.)
తమర్దితమితి ప్రాహుః వ్యాధిం వ్యాధివిచక్షణాః,

మిక్కిలి బిగ్గరగ మాటలాడుట, మిక్కిలి కఠినములైన పదార్థముల నమలుట, ఎక్కువ నవ్వుట, వైనములేక యొడలు మెలికలుగ నీల్గి యావలించుట, తన బలమునకు మిక్కుటముగ భారమును మోయుట, మిట్టపల్లముగ నుండుప్రదేశమున బరుండుట, ఈ కారణములచేత శిరస్సునందును, ముక్కునందును, పెదవుల యందును, దవుడలయందును, నుదుటియందును, కన్నులసంధులయందు నుండు

వాతము ప్రకోపమునొంది పై జెప్పిన స్థలములయందు బాధగల్గించుచు నర్దితవాతమును బుట్టించును. ఈవ్యాధిచేత మనుజుని నోటియందు అర్ధభాగము వంకరగ నగును. మెడ వంకరగ నొకప్రక్కకు నొరుగును. తల కదలుచుండును. నోటమాట పట్టినట్లు వెడలును. కన్నులు కనుబొమలు మొదలగునవి వంకరగ నగును. ఈవ్యాధి జనించిన ప్రక్కమెడ యందును, దవుడలయందును, దంతములయందును నొప్పికల్గును. ప్రారంభముననే శరీరము నందలి వెండ్రుకలు జలదరించి వణకుపుట్టును. కన్నులు కలకబారును. వాతము ఊర్ధ్వముగ వెడలును. చర్మము స్పర్శము నెరుంగక మొద్దుబారి యుండును. సూదులతో బొడిచినట్లు పోటు పుట్టును. మెడకు వెనుప్రక్క నిరుపార్శ్వముల నుండునరములు లాగిపట్టినట్లుండును. అంకిళ్లు పట్టుకొని యుండును. ఈలక్షణములన్నియు గల్గినది యర్దితవాత మని చెప్పబడును.

మరియు నీవ్యాధియందు పండ్లు కదలుట, కంఠస్వరము మారుట, చెవుడు, తుమ్ములు వెడలకుండుట, ఘ్రాణేంద్రియము వాసన నెరుంగకుండుట, స్మృతితప్పుట, నిదురించునపుడు నోట జొల్లుకారుట, ఉమిసినప్పుడు ఒకప్రక్కనబడుట, ఒక కన్ను మూసికొనుట ఈలక్షణములుకూడ కల్గు నని వాగ్భటాచార్యుడు చెప్పెను.

మరియు:—"జత్రోరూర్ధ్వం రుజా తీవ్రా శరీరార్ధేఽధరేఽపి వా, తమాహు రర్దితం కేచిదేకాయామమథాపరే" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౩౬) అని వాగ్భటాచార్యుడు చెప్పెనుగాన నీవ్యాధియందు మెడకును మూపులకు సంధిస్థలము పైభాగమున నైనను, శరీరమునందు నిలువుగ నర్ధభాగమునందైనను, లేక శరీరమున బొడ్డుకు క్రింది యర్ధశరీరమునందైనను మిక్కిలి తీవ్రమైన నొప్పికల్గు ననియు, దీనిని అర్దితవాత మని కొందరు తంత్రకారులును ఏకాయామవాత మని మరికొందరును జెప్పెద రనియు నెరుంగునది.

మరియు—"అర్ధే తస్మిన్ ముఖార్ధే వా కేవలే స్యాత్తదర్దితమ్" (చరక. చి. అ. ౨౮) అను వాక్యముచేత ఈవ్యాధి అర్ధశరీరమునందైనను, ముఖములో సగపాలు నందైనను కల్గు నని చరకులు చెప్పిరి. ఈపక్షమునందు అర్ధాంగవాతమున నెల్లప్పుడును శరీరమునం దర్ధభాగమున బాధగలుగు ననియు, అర్దితవాతమున వాతాదివేగముల నను సరించి అప్పుడప్పుడును బాధ జనించు ననియు నీరెండిటికిని భేదము నెరుంగునది.

సుశ్రుతమునందు:—"అర్దయత్యనిలో వక్త్రమర్దితం జనయత్యతః" అను వాక్యముచేత నర్దితవాతము ముఖమునందు మాత్రము జనించు నని చెప్పబడెను. ఈ సుశ్రుతమతము ననుసరించి ప్రకృతగ్రంథకారుడును "అర్దయత్యనిలో వక్త్రమర్దితం జనయత్యతః" అని చెప్పెను.

### అర్దితవాతాఽసాధ్యలక్షణములు

క్షీణస్యానిమిషాక్షస్య ప్రసక్తావ్యక్తభాషిణః. 48
న సిధ్యత్యర్దితం గాఢం త్రివర్షం వేపనస్య చ,

అర్దితవాతముచే పీడితుడగు మనుజుడు శరీరమును రసాదిధాతువులును క్షీణించి, కన్ను రెప్ప వాల్చకుండ నోటమాట శరళముగ రాక కొంతుకుగ మాట్లాడుచున్నయెడ నసాధ్యంబగును. మరియు మూడుసంవత్సరములవరకును అర్దితవాతము వ్యాపించి తల వణకుచున్నయెడ నయ్యాదియు నసాధ్యమగును.

### ఆక్షేపకాదివాతముల వేగకాలనియమము

గతే వేగే భవేత్స్వాస్థ్యం సర్వేష్వాక్షేపకాదిషు. 49

ఆక్షేపకవాతము మొదలుచేసి పైజెప్పబడిన వ్యాధులన్నిటియందు వాతము వేగముచూపినంతదనుక బాధించి అయ్యాది వేగ ముడిగినపుడు వ్యాధిగూడ శమించును.

వాగ్భటాచార్యుడు "గతే వేగే భవేత్స్వాస్థ్యం సర్వేష్వాక్షేపకేషు చ" (అ. హృ. ని. అ. ౧౫ శ్లో. ౨౮) అని చెప్పిరి. ఆక్షేపకవాతము లన్నిటియందు మాత్రము వేగ ముడిగినపుడు వ్యాధి శమించు నని వారి యభిప్రాయముగ నున్నది. వ్యాఖ్యాతలు గూడ నీయభిప్రాయమునే వెల్లడించిరి.

### హనుగ్రహవాతలక్షణము

జిహ్వాతిలేఖనాచ్ఛుష్కభక్షణాదభిఘాతతః,
కుపితో హనుమూలస్థః స్రంసయిత్వాఽనిలో హనూ. 50
కరోతి వివృతాస్యత్వం అథవా*ఽవివృతాస్యతామ్,
హనుగ్రహస్స తేన స్యాత్కృచ్ఛ్రాచ్చర్వణభాషణమ్. 51

నాలుకను పలుమారు అధికముగ గీచినను, ఎండిన వస్తువులను కఠినములగు వస్తువులను నమలినను, అభిఘాతము కల్గినను వాతము కుపితమై తాలువులకీళ్లయందు చేరి యాకీలును సడలించి నోటిని తెరచుకొనునట్లు చేయును. లేక మూసికొనునట్లు చేయును. ఇదియే హనుగ్రహవాత మని చెప్పబడును. ఈవ్యాధియందు మాటలాడుటకును నమలుటకును మిక్కిలి కష్టముగ నుండును.

వాగ్భటాచార్యుడు "హనుస్రంసస్స తేన స్యాత్" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౩౦) అని హనుస్రంస మను పేరు చెప్పిరి. ఈవ్యాధియందు 'స్రంసయిత్వానిలో హనూ" అని చెప్పియుండుటచేత దవుడకీళ్ళను సడలించి పటుత్వమును తప్పించును కావున హనుస్రంస మనుటయే సమంజసము.

---

*"సంవృతాస్యతామ్" అని పాఠాంతరము.

### మన్యాస్తమ్భవాతలక్షణము

దివా స్వప్నాసమస్థానవివృతోర్ధ్వనిరీక్షణైః,
మన్యాస్తమ్భం ప్రకురుతే స ఏవ శ్లేష్మణాఽఽవృతః. 52

పగటిపూట నిద్రపోయినను, మిట్టపల్లములుగ నుండు స్థలమున బరుండినను, కన్నులం మిక్కిలి తెఱచి చూచినను, కన్నులు పైకెత్తి చూచినను వాతము ప్రకోపించి కఫముతోగూడి మెడకు వెనుప్రక్కనుండు ఇరుపార్శ్వముల పెద్దనరములను లాగిపట్టి యిటు నటు కదలనీయక స్తంభింపజేయును. ఇయ్యది మన్యాస్తంభ వాత మని చెప్పబడును.

### జిహ్వాస్తంభవాతలక్షణము

వాగ్వాహినీసిరాసంస్థో జిహ్వాం స్తంభయతేనిలః,
జిహ్వాస్తమ్భస్స తేనాన్నపానవాక్యేష్వనీశతా. 53

వాక్కును గలిగించు సిరల (ధమనుల) యందు జేరి ప్రకోపించిన వాతము నాలుకను స్తంభింపజేయును. దానివలన నన్నము పానము లోనికి బోవుట కష్టమగును. మాటలాడ నశక్యమగును. ఇది జిహ్వాస్తంభ వాత మనబడును.

### సిరాగ్రహవాతలక్షణము

రక్తమాశ్రిత్య పవనః కుర్యాన్మూర్ధధరాస్సిరాః,
రూక్షాస్సవేదనాః కృష్ణాః సోఽసాధ్యస్స్యాత్సిరాగ్రహః. 54

వాతము ప్రకోపమునంది రక్తమున జేరి శిరస్సును ధరించు సిరలను జిడ్డులేక రూక్షములుగను నల్లని రంగుకలవానినిగను చేసి మిక్కిలి బాధ గల్గించును. ఇదియే సిరాగ్రహవాత మనబడును. ఇయ్యది మిక్కిలి యసాధ్యముగ నుండును.

### గృధ్రసీవాతలక్షణము

స్ఫిక్పూర్వా కటిపృష్ఠోరుజానుజఙ్ఘాపదం క్రమాత్,
గృధ్రసీ స్తమ్భరుక్తోదైః గృహ్ణాతి స్పన్దతే ముహుః. 55
వాతాద్వాతకఫాత్తన్ద్రీ గౌరవారోచకాన్వితా,

వాతము ప్రకోపించి పిరుదుల పైభాగమునను, నడుమునను, వీపునను, తొడల యందును, మోకాటియందును, పిక్కలయందును, పాదమునందును వరుసగ వ్యాపించి కదలింప వీలుగానట్లు పట్టి నొప్పిని సూదులతో గ్రుచ్చినట్లు పోటును కల్గించి మాటి మాటికి కదలించును. ఇయ్యది గృధ్రసీ యనువ్యాధి. ఇది కేవల వాతప్రకోపమునను, వాతకఫముల రెండిటి ప్రకోపముచేతను కలుగును. అందు వాతకఫములచే జనించిన గృధ్రసీవాతమున మైకము గ్రమ్మును, శరీరము బరువుగ నుండును. అరోచకము కల్గును.

వాగ్భటమున—"సక్థ్న్యుత్క్షేపం నిగృహ్ణాతి గృధ్రసీం తాం ప్రచక్షతే" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౫౪) అని చెప్పియుండుటంజేసి యీ వ్యాధియందు తొడను పై కెత్తుటకు వలనుపడనీయక కాలు స్తంభించి యుండు నని యెరుంగునది.

## గృధ్రసీవాత విశేషలక్షణములు

(వాతజాయాం భవేత్తోదః దేహస్యాపి ప్రవక్రతా,
జానుకట్యూరుసన్ధీనాం స్ఫురణం స్తబ్ధతా భృశమ్.
వాతశ్లేష్మోద్భవాయాన్తు నిమిత్తం వహ్నిమార్దవమ్,
తన్ద్రాముఖప్రసేకశ్చ భక్తద్వేష స్తథైవ చ.)*

పై జెప్పినరీతిగ రెండువిధములైన గృధ్రసీవాతములలో కేవల వాతప్రకోపమున కల్గిన గృధ్రసీవాతమున శరీరమునందెల్ల పోటుపుట్టును. శరీరము వక్రమగును. మోకాళ్ల యందును, నడుమునందును, తొడలయందును, కీళ్లయందును అదరును. స్తంభించి యుండును; మరియు నయ్యది వాతకఫములచే గల్గినయెడ జఠరాగ్ని మందగించును. కునికిపాటు కల్గును. నోట జొల్లుకారును. అన్నముపై ద్వేషము పుట్టును.

## విశ్వాచీవాతలక్షణము

తలం ప్రత్యఙ్గులీనాం యాః కణ్డరా బాహుపృష్ఠతః. 56
బాహ్వోః కర్మక్షయకరీ విశ్వాచీ చేతి సోచ్యతే,

చేతులలో వెనుప్రక్కనుండి చేతివ్రేళ్లవరకు వ్యాపించియుండు కండరముల యందలి వాతము ప్రకుపితమై వ్యాపించి చేతులను ముడుచుట చాచుట మున్నగు వ్యాపారములయందు సామర్థ్యములేకుండజేసిన నయ్యది విశ్వాచీ యను వాతవ్యాధి యని యెరుంగునది.

వాగ్భటాచార్యుడు:—"బాహుచేష్టాపహరణీ, విశ్వాచీ నామ సా మతా" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౪౪.) అని చెప్పియుండుటచే 'విశ్వాచి' యనియు నీవ్యాధి చెప్పబడును. హస్తములయందలి కండరముల వ్యాపించి హస్తముల పటుత్వ మును చెడగొట్టి పనులచేయుట కసమర్థములుగ జేసినచో విశ్వాచి యనియు, కాళ్ల యందలి కండరముల వ్యాపించి పనులయం దసమర్థములుగ జేసినయెడ గృధ్రసి యనియు భేదము నెరుంగునది. మరియు నీరెంటియందును తీవ్రమైనబాధ కల్గి యున్నచో నయ్యది ఖల్లి యను వాతరోగ మని యెరుంగునది. ఈ విషయమును "విశ్వాచీ గృధ్రసీ చోక్తా ఖల్లీ తీవ్రరుజాన్వితా" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౫౫.) అనువాక్యముచే వాగ్భటాచార్యుడు చెప్పెను.

---

* ప్రక్షిప్తము, మధుకోశమున గానరాదు.

### క్రోష్టుకశీర్షలక్షణము

వాతశోణితజశ్శోథః జానుమధ్యే మహారుజః. 57
జ్ఞేయః క్రోష్టుకశీర్షస్తు జ్ఞేయః క్రోష్టుకశీర్షవత్,

వాతము ప్రకుపితమై రక్తమునజేరి మోకాలునందు నక్కతలవలె స్థూలమై మిక్కిలి బాధతో గూడినవాపు కలుగును. ఇయ్యది నక్కతలవలె నుండుటంజేసి క్రోష్టుక శీర్ష మని యన్వర్థముగ జెప్పబడిన వాతవ్యాధి యని యెరుంగునది.

### ఖంజ-పంగువాతలక్షణము

వాయుః కట్యాశ్రితః సక్థ్నః కణ్డరామాక్షిపేద్యదా. 58
ఖఞ్జస్తదా భవేజ్జన్తుః పఙ్గుస్సక్థ్నోర్ద్వయోర్వధాత్,

వాతము నడుముప్రదేశమున జేరి ప్రకుపితమై యొక తొడయందలి కండరమును స్తంభింపజేయును. అప్పుడు మనుజుడు కాలు లాగిపట్టియుండుటంజేసి కుంటి నడచును. ఇది ఖంజవాత మనబడును. పైజెప్పినరీతిగ వాతము ప్రకోపమునొంది రెండుతొడలయందును జేరి యందలి కండరములను సమకాలమున స్తంభింపజేసినచో నప్పుడు మనుజుడు నడువజాలక జరిగిళ్లతో సంచరించును. ఇయ్యది పంగువనువ్యాధి.

ఇచ్చట కండరములన లావుగ గుండ్రములై యస్థుల గ్రమ్మి శరీరముపై వ్యాపించి యుండు స్నాయువులు. ఈవిషయమును సుశ్రుతాచార్యుడు స్నాయుభేదముల వివరించునపుడు "వృత్తాస్తు కణ్డరాస్సర్వా విజ్ఞేయాః కుశలైరిహ" అనువాక్యముచే విశదముగ జెప్పెను.

### కలాయఖంజవాతలక్షణము

ప్రక్రామన్ వేపతే యస్తు ఖఞ్జన్నివ చ గచ్ఛతి. 59
కలాయఖఞ్జం తం విద్యాన్ముక్తసన్ధిప్రబన్ధనమ్,

సంధిబంధము సడలి నడచుట కారంభించునపుడు వణకుచు కుంటుచు నడచినచో ఇయ్యది కలాయఖంజ మను వాతవ్యాధి యని చెప్పబడును. దీనిని కడాయఖంజ మని వాగ్భటాచార్యులు నుడివెను.

### వాతకంటక వాతలక్షణము

రుక్పాదే విషమన్యస్తే శ్రమాద్వా జాయతే యదా. 60
వాతేన గుల్ఫమాశ్రిత్య తమాహుర్వాతకణ్టకమ్,

మిట్టపల్లముగ నుండు ప్రదేశమున పాదము నునిచి నడచుటచేనైనను, శ్రమముచేనైనను వాతము ప్రకుపితమై కాలిమడమయందు జేరి తీవ్రముగ నొప్పిని కల్గించును. ఇయ్యది వాతకంటక మను వాతవ్యాధి యని నుడివెదరు.

### పాదదాహలక్షణము

పాదయోః కురుతే దాహం పిత్తాసృక్సహితోఽనిలః. 61
విశేషతశ్చఙ్క్రమతః పాదదాహం తమాదిశేత్,

వాతము ప్రకుపితమై పిత్తరక్తములంగూడి పాదముల క్రిందిభాగమున (అరకాలునందు) మంట గల్గించును. ఇయ్యది పాదదాహ మను వాతవ్యాధి యని యెరుంగునది. ఈవ్యాధివిశేషము పాదసంచారముజేయువారికి సంభవించును.

### పాదహర్ష వాతము

హృష్యేతే చరణౌ యస్య భవేతాం చాపి సుప్తకౌ. 62
పాదహర్షస్స విజ్ఞేయః కఫవాతప్రకోపతః,

కఫముతోఁగూడి వాతము ప్రకోపించి పాదములయందు వ్యాపించి సూదులతోఁ బొడిచినవిధముగను, గజ్జలు గట్టినవిధముగనుండి స్పర్శజ్ఞానములేక తిమిరిబట్టి కాలు స్వాధీనము లేకున్నయెడ నియ్యది పాదహర్ష మను వాతవ్యాధి యని యెరుంగునది. (ఇది చిరకాలము కూర్చొనియుండి లేచునపుడు ప్రాయికముగ కల్గును.)

### అంసశోష అవబాహుక వాతలక్షణము

అంసదేశస్థితో వాయుః శోషయేదంసబన్ధనమ్. 63
సిరాశ్చాకుఞ్చ్య తత్రస్థో జనయేదవబాహుకమ్,

వాతము ప్రకుపితమై భుజశిరస్సులయందు జేరి చంకలోనుండు కీలును శోషింపజేసినచో నంసబంధన మనబడును. భుజసంధియందలి సిరలను ముడుచుకొనునట్లు చేసినయెడ నయ్యది అవబాహుక మనబడును.

వాగ్భటాచార్యుడు అవబాహుక మను వ్యాధి నొకటినే చెప్పుచు పైశ్లోకమును ప్రకారాంతరముగ నిట్లు పఠించెను..."అంసమూలస్థితో వాయుస్సిరాస్సంకోచ్య తత్రగాః, బాహుప్రస్పన్దితహరం జనయత్యవబాహుకమ్" భుజమూలమగు చంకకీలునందు వాతము చేరి యచ్చట వ్యాపించుసిరల సంకోచింపజేసినయెడ అవబాహుక మని చెప్పబడును. ఈవ్యాధియందు చేతిని కదలనీయక స్తంభింపజేయును. అని యర్థము.

### మూక-మిన్మిన-గద్గదవాతలక్షణములు

ఆవృత్య వాయుస్సకఫో ధమనీశ్శబ్దవాహినీః. 64
నరాన్కరోత్యక్రియకాన్ మూకమిన్మినగద్గదాన్,

శరీరమునం దూర్ధ్వభాగమున వ్యాపించుసిరలలో శబ్దముల వెడలించు సిరల యందు కఫముతో గూడిన వాతము వ్యాపించి మాటల సరళముగ వెడలనీయక వాని మార్గము నడ్డగించుటచేత మూగతనమును, ముక్కుడిని, గద్గద (డగ్గుత్తిక) స్వరము కలవారిగను జేయును.

### తూనీవాతలక్షణము

అధో యా వేదనా యాతి వర్చోమూత్రాశయోత్థితా. 65
భిన్దతీవ గుదోపస్థం సా తూనీ నామ నామతః,

మలమూత్రాశయములయందు తీవ్రమైనబాధ జనించి క్రిందికి వ్యాపించి గుదస్థానమును స్త్రీపురుషుల గుహ్యస్థలమును భేదించునట్లు పోటు కల్గినచో నయ్యది తూనీవాత మని చెప్పబడును.

### ప్రతితూనీవాతలక్షణము

గుదోపస్థోత్థితా యా తు ప్రతిలోమం ప్రధావితా. 66
వేగైః పక్వాశయం యాతి ప్రతితూనీతి సోచ్యతే,

గుదోపస్థలయందు తీవ్రమైనబాధ జనించి అయ్యది ప్రతిలోమముగ సంచరించు వాతము పైకి వ్యాపించి పక్వాశయమునకు మూత్రాశయమునకు జేరి బాధించినచో నయ్యది ప్రతితూనీవాత మనబడును. (అనులోమముగ క్రిందికి వ్యాపించునది తూనీవాత మనియు, అటుగాక అధోభాగమున జనించి ప్రతిలోమముగ పైకి వ్యాపించునది ప్రతితూని యనియు నీరెంటికిని భేదము నరయునది.)

### ఆధ్మానప్రత్యాధ్మానవాతలక్షణము

సాటోపమత్యుగ్రరుజం ఆధ్మానముదరం భృశమ్. 67
ఆధ్మానమితి తం విద్యాత్ ఘోరం వాతనిరోధజమ్,
విముక్తపార్శ్వహృదయం తదేవామాశయోత్థితమ్. 68
ప్రత్యాధ్మానం విజానీయాత్కఫవ్యాకులితానిలమ్,

కడుపులోనివాతమును బైటవెడలనీయక యడ్డగించినచో కడుపున గుడగుడమను శబ్దము గల్గి మిక్కిలి తీవ్రమైన వేదన గల్గి గాలి నిండియుండు తోలుతిత్తివలె నుబ్బియున్నచో నాధ్మానవాత మని చెప్పబడును. ఇది మిక్కిలి క్రూరమైనది. ఇది పక్వాశయమున గల్గును. వాతము కఫముతో గూడి యామాశయమున జేరి పైజెప్పిన విధముగ కడుపుబ్బరము కల్గినచో ప్రత్యాధ్మానవాత మనబడును. ఈవ్యాధియందు ఇరుప్రక్కలలోను హృదయమునందును బాధ కల్గును

### అష్ఠీలావాతలక్షణము

నాభేరధస్తాత్సఞ్జాతః సఞ్చారీ యది వాఽచలః. 69
అష్ఠీలావద్ఘనో గ్రన్థిః ఊర్ధ్వమాయత ఉన్నతః,
వాతాష్ఠీలాం విజానీయాత్ బహిర్మార్గావరోధినీమ్. 70
ఏతామేవ రుజోపేతాం వాతవిణ్మూత్రరోధినీమ్,
ప్రత్యష్ఠీలామితి వదేత్ జఠరే తిర్యగుత్థితామ్. 71
మారుతేఽవిగుణే వస్తౌ మూత్రం సమ్యక్ప్రవర్తతే,
వికారా వివిధాశ్చాత్ర ప్రతిలోమే భవన్తి చ. 72

వాతము ప్రకోపించుటచేత కంసాలవాని యినుపడాకలి (దాగలి)వలె కఠినరబును ఉన్నతంబునునై పొడవుకల గ్రంథి నాభిక్రిందిభాగమున కల్గును. ఇయ్యది వాతాష్ఠీల యని చెప్పబడును. ఇయ్యది వాతమూత్రపురీషములు వెడలు మార్గముల నడ్డుపరచును. పైచెప్పిన గ్రంథి కడుపులో నడ్డముగ కల్గి మిక్కిలి తీవ్రమైనవేదనతో గూడి మలమూత్రవాతముల త్రోవ నడ్డగించియున్నచో ప్రత్యష్ఠీల యని చెప్పబడును. ఈవ్యాధియందును వాతము వికృతిజెందక అనులోమముగ సంచరించునపుడు మలమూత్రాదులు సరళముగ వెడలును. అటుగాక విలోమముగ సంచరించుతరి మలమూత్రాదులు ధారాళముగ వెడలక యడ్డగింప బడును.

### కంపవాత-ఖల్వీవాతలక్షణములు

సర్వాఙ్గకమ్పశ్శిరసో వాయుర్వేపథుసంజ్ఞికః,
ఖల్వీతు పాదజఙ్ఘోరుకరమూలావమోటనీ. 73

వాతము ప్రకోపించి శరీరమునందలి సర్వావయవములను శిరస్సును గడగడ వణకించినచో నయ్యది కంపవాత మని చెప్పబడును. మరియు పాదములయందును పిక్కలయందును తొడలయందును మణికట్టునందును వ్యాపించిన సిరలను బంధించి పనులయందు సామర్థ్యములేక యుండునట్లుచేసినయెడ ఖల్వీవాత మని చెప్పబడును.

### అనుక్తవాతవ్యాధినిర్ణయము

స్థాననామానురూపైశ్చ లిఙ్గైశ్శేషాన్వినిర్దిశేత్,
సర్వేష్వేతేషు సంసర్గం పిత్తాద్యైరుపలక్షయేత్. 74

వాతవ్యాధిజనించు స్థానభేదములను నామభేదములనుబట్టి వానివాని లక్షణములచేత నాయావ్యాధిని నిర్ణయించునది. (కడుపులో వాతసంబంధమగు బాధ జనించినచో కుక్షిశూల మనియు, ఇరుప్రక్కలలో బాధకల్గినపుడు పార్శ్వశూల యనియు నీరీతి నిర్ణయింపవలె నని భావము.) మరియు వాతవ్యాధు లన్నిటియందును కఫపిత్తముల సంబంధముకల్గినప్పుడు వానిలక్షణములబట్టి సంసర్గము నెరుంగునది.

## వాతవ్యాధిసాధ్యాఽసాధ్యనిర్ణయము

హనుస్తమ్భార్దితాక్షేపపక్షాఘాతాఽపతానకాః,
కాలేన మహతా వ్యాధ్యానాం యత్నాత్సిధ్యన్తి వా న వా. 75
నరాన్బలవతస్త్వేతాన్ సాధయేన్నిరుపద్రవాన్,

పైజెప్పిన వాతవ్యాధులలో హనుస్తంభవాతంబును, అర్దితవాతంబును, ఆక్షేపకవాతంబును, పక్షాఘాతంబును, అపతానకంబును ఈ వ్యాధులు మిక్కిలి ధనవంతులైనవారు చాలకాలమువరకు ధనవ్యయమునకు విసువుచెందక మిక్కిలి పూనికతో తగిన చికిత్స జేసికొనినచో నొకవేళ నివర్తించును ఒకసమయమున నివర్తింపదు. కావున వైద్యుడు రోగియొక్క శరీరమును చక్కగ గమనించి యుపద్రవములు లేకున్నచో నట్టిరోగికి చికిత్సజేయ బ్రయత్నించవలెను.

## వాతవ్యాధ్యుపద్రవములు

విసర్పదాహరుక్సఙ్గమూర్ఛారుచ్యగ్నిమార్దవైః. 76
క్షీణమాంసబలం వాతాః ఘ్నన్తి పక్షవధాదయః,
శూనం సుప్తత్వచం భగ్నం కమ్పాధ్మాననిపీడితమ్,
రుజార్తిమన్తం చ నరం వాతవ్యాధి ర్వినాశయేత్. 77

విసర్పము (పాకుచుండువాపు), తీవ్రమైన మంట, నొప్పి, మలమూత్రబంధము, మూర్ఛ, అరోచకము, అగ్నిమాంద్యము అను నీయుపద్రవములచేత శరీరమునందలి బలమును మాంసమును క్షీణించినచో పైజెప్పబడిన పక్షవధము మున్నగు వాతవ్యాధులు రోగిని తప్పక చంపును. మరియు శరీరమునం దంతట వాపు, చర్మమున స్పర్శము నెరుంగజాలకుండుట, విరుగుట, వణకు, కడుపుబ్బరము, తీవ్రమైననొప్పి, మంట అను నీయుపద్రవములచే పీడింపబడినచో వాతవ్యాధి రోగిని చంపును.

అవ్యాహతగతిర్యస్య స్థానస్థః ప్రకృతిస్థితః,
వాయుస్స్యాత్సోఽధికం జీవేద్వీతరోగస్సమాశ్శతమ్. 78

వాతము తనకు నియతమగుస్థానముననే వృద్ధిక్షయములు లేక సమస్థితినుండి, శరీరమునందెల్ల నిరాటంకముగ వ్యాపించుచు వికృతిచెందకుండునెడ రోగములు లేక నూరువత్సరములకన్న నధికముగ జీవించును.

"సమాష్షష్టిర్ద్వి ఘ్నామనుజకరిణాం పఞ్చ చ నిశాః" అను ప్రమాణవచనము చేత మనుజులకును ఏనుంగులకును నూటయిరువది సంవత్సరములును ఐదుదినములును పరమాయుష్య మని తెలియుచున్నది. కావున, వాతము పైజెప్పిన స్థితి నుండునెడ పరమాయుష్యమునకుపై నధికముగగూడ జీవించు నని భావము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
వాతవ్యాధినిదానం సమాప్తమ్.

# ౨౩. వాతరక్తనిదానమ్

వాతవ్యాధుల నిదానము జెప్పుచు క్రోష్టుశీర్ష వాతమునందు "వాతశోణితజ శోథః" అని చెప్పియుండుటంజేసి వాతవ్యాధి నిదానానంతరము వాతవ్యాధి విశేషమగు వాతరక్తనిదానము చెప్పబడును —

వాతరక్తము జనించుటకు కారణములు

లవణామ్లకటుక్షారస్నిగ్ధోష్ణాజీర్ణభోజనైః,
క్లిన్నశుష్కాంబుజానూపమాంసపిణ్యాకమూలకైః. 1
కులుత్థమాషనిష్పావశాకాదిపలలేక్షుభిః,
దధ్యారనాలసౌవీరశుక్తతక్రసురాసవైః, 2
విరుద్ధాధ్యశనక్రోధదివాస్వప్నప్రజాగరైః,
ప్రాయశస్సుకుమారాణాం మిథ్యాహారవిహారిణామ్.
స్థూలానాం సుఖినాం చాపి కుప్యతే వాతశోణితమ్. 3

ఉప్పు, పులుపు, చేదు, కారము అను నీ రసములు కలపదార్థముల భుజించినను; స్నిగ్ధపదార్థములనైనను, గుణవీర్యములచే నుష్ణములగు పదార్థములనైనను, అజీర్ణమును కల్గించు పదార్థములనైనను విశేషముగ భుజించినను; కుళ్లినట్టియు, ఎండినట్టియు, మత్స్యములు మున్నగు జలజంతువుల మాంసమునైనను, జలప్రాంతమున సంచరించు చక్రవాకములు నీరుకోడి మున్నగు జంతువుల మాంసమునైనను; గానుగపిండి, ముల్లంగి, ఉలవలు, మినుములపప్పు, అనుములు, ఆకుగూరలు, సాధారణమగు మాంసము, చెరకు రసము అను నీ పదార్థములనైనను, విశేషముగ భుజించినను; పెరుగు, గంజి, సౌవీరంబను గంజి, శుక్తము, మజ్జిగ, సారాయి, మద్యము అను నీద్రవద్రవ్యముల విశేషముగ సేవించినను; పరస్పర విరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగజేర్చి భుజించినను; భుజింపబడిన యాహారము జీర్ణముగాకముందు మరల భుజించినను, అధికముగ కోపపడినను, పగలు నిద్రించినను, రాత్రి నిదురమేల్కొంచినను వాతరక్తవ్యాధి జనించును. మిక్కిలి సుకుమారముగ నుండువారికిని, తరుచుగ నపథ్యములగు నాహారవిహారముల జేయువారికిని, మేదోవృద్ధిచేత శరీరము స్థూలముగ నుండువారికిని, పుట్టిన నాటనుండి కష్టమెరుంగక సుఖమునే యనుభవించువారికిని ఈవ్యాధి తరుచుగ జనించును.

("యశ్చ నింబం పరశునా యశ్చైనం మధుసర్పిషా, యశ్చైనం గన్ధమాల్యాద్యైస్సర్వత్ర కటురేవ సః." ఇది మున్నగుచోట్ల కటుశబ్దమునకు చేదు అను నర్థమున ప్రయోగముండుటంజేసి ప్రకృతమున 'కటుక్షార' అనుచోట కటు శబ్దమునకు చేదు అను నర్థముచేయుట సమంజసము.)

## వాతరక్తసంప్రాప్తి

హస్త్యశ్వోష్ట్రైర్గచ్ఛతశ్చాశ్నతశ్చ
విదాహ్యన్నం సవిదాహాశనస్య
కృత్స్నం రక్తం విదహత్యాశు తచ్చ
దుష్టం స్రుతం పాదయోశ్చీయతే తు,
తత్సంపృక్తం వాయునా దూషితేన
తత్ప్రాబల్యాదుచ్యతే వాతరక్తమ్. 4

ఏనుగులు గుఱ్ఱములు ఒంటెలు మున్నగు వానిపై నెక్కి సవారిజేసినను, విదాహమును కల్గించు మదము సుర మున్నగు నన్నపానముల విశేషముగ నుపయోగించినను శరీరమునందలి రక్తమంతయు తపింపబడి మిక్కిలి వృద్ధినొందును. పిదప వాతమును వృద్ధినొందించు నాహారవిహారములచేత వాతము వృద్ధినంది పైజెప్పిన విధముగ దుష్టమైన రక్తమును చెరిచి దానితోఁగూడి యట్టిరక్తమును పాదములయందు స్రవింపజేయును. అయ్యది గడ్డకట్టియుండును. అట్టిరక్తమును స్రవింపజేయుటకు కారణమై ప్రబలముగ నుండుటంజేసి వాతరక్తమని చెప్పబడును.

ఈ వాతరక్త సంప్రాప్తి వాగ్భటమున నింతకన్న విశదముగ నిట్లు చెప్పబడినది:—"విదాహ్యన్నం విరుద్ధంచ తత్తాచ్చాసృక్ప్రదూషణమ్, భజతాం విధిహీనం చ స్వప్నజాగరమైథునమ్. ప్రాయేణ సుకుమారాణాం అచఙ్క్రమణశీలినామ్, అభిఘాతాదశుద్ధేశ్చ నృణామసృజి దూషితే. వాతలైశ్శీతలైర్వాయుర్వృద్ధః క్రుద్ధో విమార్గగః, తాదృశేనాఽసృజా రుద్ధః ప్రాక్తదేవ ప్రదూషయేత్. ఆఢ్యరోగంఖుడం వాతబలాసం వాతశోణితమ్, తదాహుర్నామభిస్తచ్చ పూర్వం పాదౌ ప్రధావతి, విశేషాద్యానయానాద్యైః ప్రలమ్బౌ" (అ. హృ. ని. అ. ౧౬. శ్లో. ౧-౪) మద్యము పుల్లనిమజ్జిగ పెరుగు జలచర మాంసము ఉలవలు మున్నగు విదాహకరంబులైన పదార్థముల విశేషముగ సేవించినను, పరస్పర విరుద్ధములగు అనూపమాంస మత్స్యాదులను క్షీరము మున్నగువానిని ఒకటిగజేర్చి భుజించినను, శాస్త్రమునకు విరుద్ధముగ నిద్రను జాగరమును సంగమమును జేసినను, సుకు

మారులై నడువక యొకచోటనే కూర్చొనియుండినను, శస్త్రాదులచే నభిఘాతము కల్గినను, శోధనచికిత్సచే శరీరమునందలి మలమును బైట వెడలింపకున్నను, ఇట్టి కారణములచే మనుజుల శరీరమునందలి రక్తము చెడును. పిదప వాతమును వృద్ధి నొందించు చేదు మున్నగు రసములను శీతపదార్థములను సేవించుటచే వాతము మిక్కిలి వృద్ధినంది ప్రకుపితమై యున్మాదమునొంది సంచరించుతరి పై జెప్పిన ప్రకారము దుష్టమైన రక్తముచే సడ్డగింపబడును; పిదప తనకు సమీపించిన రక్తమును తొలుత చెరచి పిమ్మట మాంసాదుల చెరచి రక్తమును తొలుత పాదముల యందు వ్యాపింపజేయును. అయ్యది వాహనములపై నెక్కి సవారిచేయుటవలన పాదములు వ్రేలాడవేయుటచే చాల వృద్ధి నందును. ఈరోగము ఆఢ్యవాతము, ఖుడ వాతము, వాతబలాసము, వాతరక్తము నను నామభేదములచే వ్యవహరింపబడును అని యర్థము. ఈ విషయమునే చరకాచార్యుడును "వాయుః ప్రవృద్ధో వృద్ధేన రక్తేనా వారితః పథి, క్రుద్ధస్సన్దూషయేద్రక్తం తత్ జ్ఞేయం వాతశోణితమ్, ఖుడం వాత బలాసాఖ్యం ఆఢ్య వాతం చ నామభిః" (చరక. చి. అ ౨౯. శ్లో. ౧౦,౧౧.) అను వాక్యముచే సూచించె.

## వాతరక్త పూర్వరూపము

స్వేదోఽత్యర్థం న వా కార్ష్ణ్యం స్పర్శాఽజ్ఞత్వం క్షతేఽతిరుక్,
సన్ధిశైథిల్యమాలస్యం సదనం పిడకోద్గమః. 5
జానుజఙ్ఘోరుకట్యంసహస్తపాదాఙ్గసన్ధిషు,
నిస్తోదస్స్ఫురణం భేదో గురుత్వం సుప్తిరేవ చ. 6
కణ్డూస్సన్ధిషు రుగ్భూత్వా భూత్వా నశ్యతి చాఽసకృత్,
వైవర్ణ్యం మణ్డలోత్పత్తిః వాతాసృక్పూర్వలక్షణమ్. 7

వాతరక్తవ్యాధి జనించుటకుముందు శరీరముపై చెమట యధికముగ బట్టును. లేక చెమట బొత్తుగ పట్టక యుండును. శరీరమెల్ల నల్లపడును. శరీరమును తాకినచో స్పర్శమును దెలిసికొన జాలకుండును. దెబ్బతగిలినచో నధికముగ నొప్పికల్గును. కీళ్లు సడలిన ట్లుండును. పనులు చేయుటయందు ఉత్సాహము లేకుండును. శరీరము కృశించును. శరీరముపైని సన్నని బొబ్బలు లేచును. మోకాళ్లు పిరుతొడలు (పిక్కలు) పెందొడలు నడుము మూపులు హస్తములు పాదములు అను నవయవముల కీళ్లయందు సూదులతో బొడిచినట్లు పోటుకల్గును. శరీరము అదరుచు పగులుచు. బరువుగ నుండును. స్పర్శము తెలియకుండును. దురదపుట్టును. కీళ్లయందెల్ల పలుమారు నొప్పి కల్గి తనంతటనే శాంతి

నొందును. శరీరమున స్వాభావికవర్ణము మారును. పొడలు పుట్టును. ఇవియన్నియు వాతరక్తవ్యాధికి పూర్వరూపములై జనించును.

### వాతాధిక వాత రక్త లక్షణము

వాతాధికేఽధికం తత్ర శూలస్ఫురణభఞ్జనమ్,
శోథస్య రౌక్ష్యం కృష్ణత్వం శ్యావతా వృద్ధిహానయః. 8
ధమన్యఙ్గులిసన్ధీనాం సఙ్కోచోఽఙ్గగ్రహోఽతిరుక్,
శీతద్వేషానుపశయౌ స్తమ్భవేపథుసుప్తయః. 9

వాతము రక్తముతో జేరి వాతరక్తమును కల్గించు నని పైని చెప్పబడినది; ఆ రెంటిలో వాత మధికముగ నున్నపుడు ఎడలేని నొప్పి, అదరుట, కొరడాతో కొట్టినట్లు ఉండుండి నొచ్చుట ఇవి యధికములుగ నుండును. మిక్కిలి రూక్షమై గరగరలాడుచు నల్లనిరంగైనను, లేక శ్యామలవర్ణంబైనను కల్గిన వాపుపుట్టి అయ్యది తనంతటనే వృద్ధి నందుచు తగ్గుచునుండును. ధమనులును, వేళ్లకీళ్లును ముడుచుకొనును. అవయవము లన్నియు నీడ్చిపట్టిన ట్లుండును. నొప్పి యధికముగ నుండును. చల్లని యుపచారాదుల యందు ద్వేషము కల్గును. అట్టి శీతోపచారములను జేసినచో శరీరమునకు సుఖములేక ప్రతికూలముగ నుండును. శరీరము స్తంభించియుండును. లేక వణకును. శరీరమున స్పర్శజ్ఞానము బొత్తుగ చెడును.

### రక్తాధిక వాతరక్త లక్షణము

రక్తే శోథోఽతిరుక్తోదః తామ్రశ్చిమిచిమాయతే,
స్నిగ్ధరూక్షైశ్శమం నైతి కణ్డూక్లేదసమన్వితః. 10

రక్తం బధికమైన వాతరక్తమునందు వాపు అధికముగనుండి మిక్కిలి నొప్పి గల్గి సూదులతో బొడిచిన విధముగ పోటుపుట్టి ఎఱ్ఱనై చిమచిమ యనున ట్లుండును. స్నిగ్ధంబులును రూక్షంబులు నగు చికిత్సలచేత శాంతినొందక దురదయు చెమ్మయు కల్గియుండును.

### పిత్తాధిక వాతరక్త లక్షణము

పిత్తే విదాహస్సమ్మోహః స్వేదో మూర్ఛామదస్తృషా,
స్పర్శాసహత్వం రుగ్రాగః శోథః పాకో భృశోష్మతా. 11

వాతరక్తమునందు పిత్త మధికముగ నుండునెడ మంట అధికముగ నుండును. మైకము గ్రమ్మును. చెమట పట్టును. మూర్ఛ వచ్చును. తిక్కయెత్తిన ట్లుండును. దప్పి యధికమగును. శరీరమును తాకినచో నోరువలేకుండును. వాపు ఎఱ్ఱనిరంగు కల్గియుండును. అచ్చటచ్చట పుండగును. శరీరముపైని వేడి యధికముగ నుండును.

## కఫాధిక-ద్వంద్వజ-సన్నిపాతజవాతరక్తలక్షణములు

కఫే స్తైమిత్యగురుతా సుప్తిస్స్నిగ్ధత్వశీతతాః,
కణ్డూర్మన్దా చ రుక్ ద్వన్ద్వం సర్వలిఙ్గం చ సఙ్కరాత్. 12

కఫం బధికముగ నుండు వాతరక్తమున శరీరముపై తడిబట్ట గప్పినట్లు మొద్దుబారియుండును. శరీరము బరువుగ నుండును. చర్మముపై స్పర్శము దెలియదు. స్నిగ్ధమై చల్లగ నుండును. దురద కల్గును. కొంచెముగ నొప్పియుండును. త్రిదోషములలో రెండేసిదోషము లధికముగ నుండు వాతరక్తవ్యాధియందు వాతపిత్తకఫములకు పైజెప్పినలక్షణములు మిశ్రములుగ నుండును. త్రిదోషసంకరమున జనించిన వాతరక్తమున త్రిదోషములకు వేరువేర జెప్పిన లక్షణములన్నియు కల్గును.

## వాతరక్తగమన భేదములు

పాదయోర్మూలమాస్థాయ కదాచిద్ధస్తయోరపి,
ఆఖోర్విషమివ క్రుద్ధం తద్దేహముపసర్పతి. 13

పైజెప్పబడిన వాతరక్తవ్యాధి యొకప్పుడు పాదమూలమునందును, మరి యొకప్పుడు హస్తములమూలమునందును స్థిరముగ కొంతకాల మణగియుండి, కాలాంతరమున ఎలుక విషము శరీరమున డాగియుండి సమయమున వ్యాపించువిధముగ శరీరమునందెల్ల నానాట వ్యాపించును.

చరకాచార్యుడు ఈ వ్యాధిని రెండువిధములుగ నిట్లు విభజించెను.—"ఉత్తానమపి గమ్భీరం ద్వివిధం వాతశోణితమ్, త్వఙ్మాంసాశ్రయముత్తానం గమ్భీరన్త్వన్తరాశ్రయమ్" (చరక. చి. అ. ౨౯. శ్లో. ౧౯) వాతరక్తము ఉత్తానమనియు గంభీరమనియు రెండుతెరంగులు. అందు చర్మమాంసముల నాశ్రయించినది యుత్తానము. మేదస్సును అస్థిమజ్జల నాశ్రయించి జనించినది గంభీరము.

పైజెప్పబడిన రెండువిధములైన వాతరక్తములకు విశేషలక్షణములను వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"కణ్డ్వాదిసంయుతోత్తానే త్వక్తామ్రశ్యావ లోహితా, సాయామా భృశదాహోషా; గమ్భీరేఽధికపూర్వరుక్, శ్వయథుర్గ్రథితః పాకీ వాయుస్సన్ధ్యస్థిమజ్జసు, ఛిన్దన్నివ చరత్యన్తర్వక్రీకుర్వంశ్చ వేగవాన్, కరోతి ఖఞ్జం పఙ్గుం వా శరీరే సర్వతశ్చరన్" (అ. హృ. ని. అ. ౧౬. శ్లో. ౯. ౧౧) చర్మమాంసముల నాశ్రయించి జనించిన (ఉత్తాన) వాతరక్తమునందు చర్మము దురద మొదలగుబాధలు కల్గి తామ్రవర్ణంబైనను, శ్యామవర్ణంబైనను, లేక రక్తవర్ణంబైనను కల్గియుండును. అధికమైనమంటయు నిప్పురగిలినవిధముగ తాపంబును గల్గి యీడువబడి

నట్లుండును. గంభీరవాతరక్తమునందు వాతము సంధులయందును, అస్థులయందును మజ్జ(మూలగ)యందును ప్రకోపించి సంచరించుచు మిక్కిలి తీవ్రమైననొప్పిని, ఘనీభవించినవాపును కల్గించును. శరీరమునం దెల్ల పుండగును. అట్టివాతము పైజెప్పినస్థానముల లోభాగమున ఛేదించువిధముగ సంచరించుచు మిక్కిలి వేగముతో గూడి యంతటను వ్యాపించి అవయవముల వక్రములుగ జేయును. అవయవములన శిథిలముగ జేయును. ఒకకాలిని కుంటిగనైనను, లేక రెండుకాళ్లను స్వాధీనములేని మొండివానిగనైనను రోగిని చేయును. సుశ్రుతుడు మాత్రము "ద్వివిధం వాతశోణితముత్తానమవగాఢం చేత్యేకేభాషన్తే ; తత్తున సమ్యక్. కుష్ఠవదుత్తానమ్ముభూత్వా కాలాన్తరేణావగాఢీభవతి, తస్మాన్నద్వివిధమ్" (సు. చి. అ. 5 వా 1) అనగా వాతరక్త ముత్తాన మనియు నవగాఢ మనియు నిరుతెగలుగా నుండు నని కొంద అందురు ; అది సరికాదు. కుష్ఠము వలెనే మొదట నుత్తానమునుండి పిమ్మట కాలాంతరమున నవగాఢమగును. కావున నీవ్యాధి రెండువిధములుకాదు అని స్పష్టముగా జెప్పెను. అయితే చరకాదులు చెప్పిన ద్వైవిధ్యమాయా అవస్థలనుబట్టి వాతరక్తస్థానలక్షణములు స్పష్టపఱచినదిగా సమన్వయింపవచ్చును. లేకపోయినచో సుశ్రుతమునందు చెప్పిన ఏకీయమతముగా జెప్పిన చరకవచనము ఖండితమగు నని యెఱుంగనగును.

## వాతరక్తాసాధ్యలక్షణము

ఆజానుస్ఫుటితం యచ్చ ప్రభిన్నం ప్రస్రుతం చ యత్,
ఉపద్రవైశ్చ యజ్జుష్టం ప్రాణమాంసక్షయాదిభిః. 14
వాతరక్తమసాధ్యం స్యాత్ యాప్యం సంవత్సరోత్థితమ్,

మోకాలివరకు వ్యాపించినదియు, పగిలినదియు, పగిలి నీరుగారుచున్నదియు, క్రిందజెప్పబడు నుపద్రవముల గూడినదియు, శరీరమునందలి బలమాంసములు క్షీణించినదియు నగు వాతరక్తము అసాధ్యమగును. అట్టి యసాధ్యలక్షణములు లేక సంవత్సరకాలమునకు పైబడిన వాతరక్తము యాప్యము (ప్రాణాంతముగాక వ్యాధి యుత్కటముగాకుండునట్లు చికిత్సచేయదగినది)గ నగును. సంవత్సరకాలమునకు లోబడి పైజెప్పిన యసాధ్యచిహ్నములు లేనిచో ప్రయత్నముచే సాధింపదగి యుండు నని భావము.

## ఉపద్రవములచే వాతరక్తాసాధ్యత్వము

అస్వప్నారోచకశ్వాసమాంసకోథశిరోగ్రహాః. 15
మూర్ఛాతిమదరుక్తృష్ణాజ్వరమోహప్రవేపకాః,
హిక్కాపాఙ్గుల్యవీసర్పపాకతోదభ్రమక్లమాః. 16

అంగులీవక్రతాస్ఫోటదాహమర్మగ్రహార్బుదాః,
ఏతైరుపద్రవైర్వర్జ్యం మోహేనైకేన వాపి యత్. 17
అకృతోऽన్యుపద్రవం యాప్యం, సాధ్యం స్యాన్నిరుపద్రవమ్,
ఏకదోషానుగం సాధ్యం నవం, యాప్యం ద్విదోషజమ్,
త్రిదోషజమసాధ్యం స్యాత్ యస్య చ స్యురుపద్రవాః. 18

నిద్రపట్టకుండుట, అరుచి, శ్వాసము, శరీరమునందలి యీవ్యాధి వ్యాపించినచోట మాంసము కుళ్లియుండుట, తల లాగిపట్టినట్లుండుట, మూర్ఛ, అధికముగ తిక్కయెత్తినట్లుండుట, అధికమైన నొప్పి, తీవ్రమైన దప్పి, జ్వరము, మైకము, వణకు, ఎక్కిళ్లు, కుంటితనము, విసర్పము, పుండగుట, సూదులబొడిచినవిధముగ పోటు, చక్రముపైనుండు వానివలె నొడలు తిరుగుట, బడలిక, వ్రేళ్లుముడిచికొనిపోవుట, లేక వంకరటింకరయగుట, పగులుట, మంట, మర్మస్థలములయందు పట్టినట్లుబాధ, అర్బుదం బను వ్రణము అనునివి యన్నియు వాతరక్తవ్యాధియందు జనించు నుపద్రవములు. ఈయుపద్రవములన్నింటిచేనైనను, లేక ఒక మోహమాత్రముచేనైనను కూడియున్న వాతరక్తవ్యాధి యసాధ్యంబగును. పై జెప్పిన యుపద్రవములన్నియు లేక కొన్నియుపద్రవములు మాత్రము కల్గినది యాప్యమగును. ఉపద్రవములలో నొకటైనను లేకున్న నయ్యదియు, వాతాదిదోషములలో నొక్కదోషముతో మాత్రము కూడి నవీనముగ జనించినదియు సాధింపందగియుండును. రెండుదోషముల సంసర్గమున గల్గినది యాప్య మగును. త్రిదోషసంకరమున గల్గినదియు, ఒక్కదోషసంబంధముండినను ఉపద్రవములన్నింటితో గూడినదియు నసాధ్యం బగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
వాతరక్తనిదానం సమాప్తమ్.

# ౨౪. ఊరుస్తమ్భనిదానమ్

ఊరుస్తంభవాతము వాతవ్యాధులలో నంతర్భూతమైనది కావున వాతరక్త నిదానమును జెప్పినపిదప నూరుస్తంభనిదానమును జెప్పుట:—

ఊరుస్తంభకారణము, సంప్రాప్తి

శీతోష్ణద్రవసంశుష్కగురుస్నిగ్ధైర్నిషేవితైః,
జీర్ణాజీర్ణే తథాఽఽయాససంక్షోభస్వప్న జాగరైః. 1
*సశ్లేష్మమేదఃపవనః సామమత్యర్థసఞ్చితమ్,
అభిభూయేతరం దోషం ఊరూ చేత్ప్రతిపద్యతే. 2
సక్థ్యస్థినీ ప్రపూర్యాన్తః శ్లేష్మణా స్తిమితేన చ,
తదా స్త (స్క) భ్నాతి, తేనోరూ స్తబ్ధౌ శీతావచేతనౌ. 3
పరకీయావివ గురూ స్యాతామతిభృశవ్యథౌ,
ధ్యానాఙ్గమర్దస్తైమిత్యతన్ద్రాచ్ఛర్ద్యరుచిజ్వరైః. 4
సంయుక్తౌ పాదసదనకృచ్ఛ్రోద్ధరణసుప్తిభిః,
తమూరుస్తమ్భమిత్యాహు రాఢ్యవాతమథాఽపరే. 5

పరస్పరవిరుద్ధగుణములు శీతోష్ణపదార్థములను, ఆర్ద్రశుష్కపదార్థములను, గురులఘుపదార్థములను, స్నిగ్ధరూక్షపదార్థములను నొకటిగఁగూర్చి మిక్కుటముగ నుపయోగించినను, భుజింపబడినయాహారము కొంచెము జీర్ణమై కొంచెము జీర్ణము కాకుండుసమయమున మరల భుజించినను, శరీరమున కాయాసమును గల్గించు పనులచేసినను, మనస్సుకు నిల్కడలేక క్షోభముకల్గినను, రాత్రివేళలయందు నిదుర మేల్కాంచియున్నను, పవటివేళ నిదురించినను, ఇట్టి కారణములచేత కఫముతోడను మేదస్సుతోడను గూడినవాతము మిక్కిలి ప్రకోపమునొంది, ఆమరసముతోఁగూడి మిక్కిలి వృద్ధినొందియున్న పిత్తమును జెరచి, తొడలయందు జేరి, తొడలలో నుండు ఎముకలలోని రంధ్రములను కఫముచేతను మేదస్సుచేతను నిండించి స్తంభింపజేయును. అట్టితొడలు చల్లబడి ప్రాణములేనిదానింబోలె స్పర్శమును కొంచెమైన నెరుంగక, మరియొకని యవయవములబోలె తనకు మోచుటకును మిక్కిలి కష్టముగను భారముగను మిక్కిలి నొప్పి మున్నగుబాధతోఁ గూడి యుండును. మరియుఁ చింత, ఒడలినొప్పులు, తడిగుడ్డ గప్పినవిధముగ శరీరము

---

* సశ్లేష్మమేదాశ్చాసౌపవనశ్చేతిసమాసః. ఇది సమస్తపదము.

జడముగనుండుటను, మైకము, వాంతి, అరోచకము, జ్వరము ఈలక్షణములతోగూడి పాదములు కృశత నొందును. కాళ్ల స్పర్శము నెరుంగజాలకుండును. కాళ్ల పైకెత్త వలెనన్న మిక్కిలి కష్టముచే నెత్తవలసియుండును. ఇట్టి లక్షణముగలది యూరుస్తంభ వాత మని చెప్పబడును. దీనినే ఆఢ్యవాత మనియు కొందరు తంత్రకారులు వచించెదరు. ఈవ్యాధియందు వాతము ప్రధానముగ నుండును

మరియు:—"ఊరూ శ్లేష్మా సమేదస్కో వాతపిత్తేఽభిభూయతు" అని చరకమున నున్నది కావున కఫము మేదస్సుతోగూడి వాతపిత్తముల తిరస్కరించి యూరువుల జేరి యూరుస్తంభమును గల్గించు నని తెలిసెడిని. వీరిమతమున కఫము ప్రధానముగ నుండు నని భావము. ఇయ్యది దేశకాలానుసరణముగ నొకసమయమున కఫప్రధానముగను ఒకసమయమున వాతప్రధానముగను కలుగు నని యుద్దేశించి యార్షమతమున పరస్పర భేదముగ నిర్దేశింపబడినది.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—ఈవ్యాధిని ప్రకృతగ్రంథకారుడు ఊరుస్తంభ మనియు, మతాంతరమున నాఢ్యవాత మనియు నామభేదములచే జెప్పెను. వాగ్భటాచార్యులును "శీతోష్ణ ద్రవసంశుష్క......తమూరుస్తమ్భ మిత్యాహుః ఆఢ్యవాతమథాపరే" (అ. హృ. ని. అ. ౧౫. శ్లో. ౪౭, ౫౧) అనుగ్రంథముచే పైయానుపూర్వినే పఠించిరి. ప్రకృతగ్రంథము సంగ్రహాత్మకముగాన వాగ్భటానుపూర్వినే సంగ్రహించి నట్లున్నది. వీ రిరువురును ఊరుస్తంభమునకు ఆఢ్యవాత మను నామాంతరమును మతాంతరముగ ననువదించిరి.

చరకమున:—"స్తమ్భయేత్ స్థైర్యశైత్యాభ్యాం ఊరుస్తమ్భస్తతస్తు సః" (చరక. చి. అ. ౨౭. శ్లో. ౧౪) అని చెప్పిరి. కాని యాఢ్యవాత మను నామాంతరము చెప్పి యుండలేదు. వాతరక్తమును చెప్పునపుడు — "ఖుడం వాతబలాసాఖ్యం ఆఢ్యవాతం చ నామభిః" (చరక. చి. అ. ౨౯. శ్లో. ౧౧) అని చరకులు వాతరక్తమునకు ఆఢ్యవాతమును నామాంతరమును మతాంతరమున జెప్పిరి.

వాగ్భటులు వాతరక్తమును ఆఢ్యరోగ మనియు, ఊరుస్తమ్భమును ఆఢ్యవాత మనియు నామాంతరములచే జెప్పిరి. ఈమూడు మతములయందును నామమాత్ర వ్యత్యాసము గానవచ్చినను లక్షణభేదము కానరాదు. కావున నిరోధము లేదు.

### ఊరుస్తంభప్రాగ్రూపాదులు

ప్రాగ్రూపం తస్య నిద్రాతిధ్యానం స్తిమితతా జ్వరః,
రోమహర్షోఽరుచిశ్ఛర్దిః జంఘోర్వోస్సదనం తథా. 6

వాతశఙ్కిభిరజ్ఞానా త్తస్యస్యాత్స్నేహనాత్పునః,
పాదయోస్సదనం సుప్తిః కృచ్ఛ్రాదుద్ధరణం తథా. 7
జఙ్ఘోరుగ్లానిరత్యర్థం శశ్వచ్చాదాహవేదనే,
పాదం చ వ్యథయేన్న్యస్తం శీతస్పర్శం న వేత్తి చ. 8
సంస్థానే పీడనే గత్యాం చాలనే చాప్యనీశ్వరః,
అన్యనేయా హి సంభగ్నౌ (అస్యస్యేవహి సంభగ్నౌ)
ఊరూ పాదౌ చ మన్యతే. 9

ఈయూరుస్తంభము జనించుటకుముందు అధికముగ నిదురవచ్చును. అధికముగ మనుజునకు చింత కలుగును. శరీరము మొద్దుబారియుండును. జ్వరమువచ్చును శరీరము నందలి రోమములు జలబరించును. అరోచకము కల్గును. వాంతియగును. పిక్కలును తొడలును కృశించును. ఇవియన్నియు నూరుస్తంభమునకు మున్ను జనించుపూర్వరూపములు. మరియు నీవ్యాధియందు కంపము సంకోచము మున్నగు లక్షణములబట్టి వాతవ్యాధి యని భ్రమసి వాతమునకు ప్రతికూలమగు స్నేహన (జిడ్డును కల్గించు) చికిత్స జేసినచో పాదములు కృశించి స్పర్శము నెరుంగజాలకుండును. పైకెత్తుటకు చాల కష్టముగ నుండును. (ఇది వ్యాధి విపరీతానుపశయము). మరియు నీవ్యాధియందు పిక్కలయందును తొడలయందును తీవ్రముగ బాధ కల్గును. కాళ్లయందు మాటిమాటికిని కొంచెముగ మంటయు నొప్పియు కల్గును. పాదము క్రిందనునిచినయెడ బాధకల్గును. చల్లని స్పర్శమును తెలియకుండును. కాళ్లను సమముగ క్రింద నుంచుటకును పీడనమునకును నడచుటకును కదలించుటకును సామర్థ్యము లేకుండును. కాళ్లను తొడలును తన శరీరమునకును సంబంధములేని యట్లును విరిగినట్లును స్వాధీనము తప్పియుండును.

### ఊరుస్తంభసాధ్యాఽసాధ్య నిర్ణయము

యదాదాహార్తితోదార్తో వేపనః పురుషో భవేత్,
ఊరుస్తమ్భస్తదా హన్యాత్ సాధయేదన్యథా నవమ్. 10

ఊరుస్తంభవ్యాధియందు మంటయు సూదుల గ్రుచ్చినట్లు పోటును వణకును కల్గినచో నీవ్యాధి రోగిని తప్పక చంపును. పైజెప్పిన లక్షణములులేక నూతనమై యున్నచో చికిత్సచే సాధ్యమగును. (ఈవ్యాధియందు దోషభేదముల ప్రత్యేకముగ జెప్పకుండుటచే నియ్యది త్రిదోషసన్నిపాతముచే జనించి యొకవిధముగనే యుండునని యెరుంగునది).

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఊరుస్తంభనిదానం సమాప్తమ్.

# ౨౫. ఆమవాత నిదానమ్

ఊరుస్తంభమున "సామమత్యర్థసంచితమ్" అని ఆమముగూడ జెప్పియుండుట వలన నూరుస్తంభనిదానమును జెప్పినపిదప ఆమవాత నిదానము జెప్పుట:—

### ఆమవాతము జనించుటకు కారణము-సంప్రాప్తి

విరుద్ధాహారచేష్టస్య మన్దాగ్నేర్నిశ్చలస్య చ,
స్నిగ్ధం భుక్తవతో హ్యన్నం వ్యాయామం కుర్వత స్తథా. 1
వాయునా ప్రేరితో హ్యామః శ్లేష్మస్థానం ప్రధావతి,
తేనాత్యర్థం విదగ్ధోఽసౌ ధమనీః ప్రతిపద్యతే. 2
వాతపిత్తకఫైర్భూయో దూషితస్సోఽన్నజో రసః,
స్రోతాంస్యభిష్యన్దయతి నానావర్ణోఽతిపిచ్ఛిలః. 3
జనయత్యాశు దౌర్బల్యం గౌరవం హృదయస్య చ,
వ్యాధీనామాశ్రయో హ్యేషః ఆమసంజ్ఞోఽతిదారుణః. 4
యుగపత్కుపితావన్తః త్రికసన్ధిప్రవేశకౌ,
స్తబ్ధం వా (చ) కురుతో గాత్రం ఆమవాతస్స ఉచ్యతే. 5

పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించినను, భుజించిన యాహారము జీర్ణముకాని సమయమున దేహపరిశ్రమము సంభోగమును చేయుట మున్నగాగల విరుద్ధచేష్టల జేసినను, కాయాగ్ని మందముగ నున్నను, శరీరవ్యాపారము లేక నిశ్చలముగనున్నను, స్నిగ్ధమగు నాహారమును భుజించినతోడనే వ్యాయామము జేసినను, వాతము ప్రకోపమునొంది శరీరమునందలి పక్వముగాని యాహారరసమును కఫస్థానమున జేర్చును. మరియు నావాతదూషితమైన యన్నరసము ధమనులయందు జేరును. మరల వాతపిత్తకఫముల మూటిచేత నామరసము దూషితమై మిక్కిలి పిచ్ఛిలంబును నానావిధవర్ణంబునై నాసారంధ్రములు మున్నగు స్రోతస్సులనుండి స్రవించును. దానంజేసి బలహీనతయు శరీరభారంబును కలుగును. రొమ్ముకూడ బరువుగ నుండును. వ్యాధుల కన్నిటికిని ముఖ్యకారణమైన యీయామరసము మిక్కిలి క్రూరమైనది. వాతకఫములు రెండును సమకాలమున ప్రకోపమునొంది వెన్నెముకకు క్రిందిభాగమున (త్రికసంధిస్థానమున) జేరి లోభాగమున ప్రవేశించి శరీరమునందలి అవయవములను

స్తంభింపజేయును. ఇయ్యది యపక్వమగు నన్నరసమున జనించుటంజేసి యామవాతమని మునివరులచే బేర్కొనంబడినది.

### ఆమవాత సామాన్య లక్షణములు

అఙ్గమర్దోఽరుచిస్తృష్ణా హ్యాలస్యం గౌరవం జ్వరః,
అపాకశ్శూనతాఙ్గానాం ఆమవాతస్య లక్షణమ్. 6

పైజెప్పబడిన యామవాతమున ఒడలినొప్పియు, అరోచకంబును, డప్పియు, పనులయందు ప్రాలుమాలికయు, శరీరమున బరువును, జ్వరంబును, అజీర్ణంబును, అవయవములయందు వాపును కల్గును. ఇవి యన్నియు నామవాతమున సామాన్యముగ గల్గు లక్షణము లని భావము.

### ఆమవాతస్వరూపము, ఉపద్రవములు

స కష్టస్సర్వరోగాణాం యదా ప్రకుపితో భవేత్,
హస్తపాదశిరోగుల్ఫత్రికజానూరుసన్ధిషు. 7
కరోతి సరుజం శోథం యత్ర దోషః ప్రపద్యతే,
స దేశో రుజ్యతేఽత్యర్థం వ్యావిద్ధ ఇవ వృశ్చికైః. 8
జనయేత్సోఽగ్నిదౌర్బల్యం ప్రసేకారుచిగౌరవమ్,
ఉత్సాహహానిం వైరస్యం దాహం చ బహుమూత్రతామ్. 9
కుక్షౌ కఠినతాం శూలం తథా నిద్రావిపర్యయమ్,
తృట్ఛర్దిభ్రమమూర్ఛాశ్చ హృద్గ్రహం విడ్విబన్ధతామ్,
జాడ్యాన్త్రకూజమానాహం కష్టాంశ్చాన్యానుపద్రవాన్. 10

అట్టి యామవాతము తక్కినరోగముల కన్నటికన్న మిక్కిలి కష్టతరమైనది. ఇయ్యది మిక్కిలి ప్రకోపము నొందినపుడు హస్తములు, పాదములు, శిరస్సు, చీలమండ, వెన్నెముకకు క్రిందిభాగము, మోకాళ్లు, తొడలు, కాళ్లు ఈస్థలములయందు వాపును పోటును పుట్టును వాతముచే ప్రేరితంబగు నామరసము శరీరమునం దేప్రదేశమున జేరునో ఆ స్థానమున తేలుకుట్టిన విధముగ తీవ్రమైన బాధ కల్గును.

ఈయామవాతమువలన జఠరాగ్ని బలహీనమగును. నోట నీరు వెడలును. అరుచి పుట్టును. శరీరము బరువుగ నుండును. పనులజేయుటం దుత్సాహము నశించును.

నోటికి మధురాదిరసములు దెలియకుండును. మంటపుట్టును. మూత్ర మధికముగ వెడలును. కడుపు గట్టిగనుండును. కడుపున నొప్పిపుట్టును. రాత్రులయందు నిదురపట్టక పగలు విశేషముగ నిదురపట్టును. దప్పి యధికమగును. వమనమగును. ఒడలు తిరుగును. మూర్ఛగ్రమ్మును. రొమ్ముపట్టినట్లు నొప్పియెత్తును. మలము బంధించును. శరీరము మొద్దుబారియుండును. వ్రేళ్లలో కూతపుట్టును. కడు పుబ్బును. ఇవి యన్నియును, ఇంక ననేకములైన యుపద్రవంబులును ఆమవాతమున బుట్టును.

## త్రిదోషప్రాబల్యముచేత ఆమవాతవిశేషలక్షణము

పిత్తాత్సదాహరాగం చ సశూలం పవనానుగమ్,
స్తిమితం గురుకణ్డూం చ కఫదుష్టం సమాదిశేత్. 11

పిత్తప్రకోపముచే గల్గినయామవాతమున మంటయు ఎరుపురంగును కలుగును. వాతముచే జనించిన యామవాతమున నొప్పి యధికముగ నుండును. కఫమున జనించినచో జడమై భారముకల్గి విశేషముగ దురదకల్గును. మూడుదోషములును సమములుగ ప్రకోపించినచో పైజెప్పినలక్షణములన్నియు మిశ్రములుగ నుండును.

## ఆమవాతసాధ్యాఽసాధ్యలక్షణములు

ఏకదోషానుగస్సాధ్యః ద్విదోషో యాప్య ఉచ్యతే,
సర్వదేహచరశ్శోథః సకృచ్ఛ్రస్సాన్నిపాతికః. 12

ఒకదోషమున జనించిన యామవాతము చికిత్సాసాధ్య మగును. రెండు దోషములచే గల్గినది యాప్యమగును. సన్నిపాతమున జనించినదియు, వాపు శరీరమునందెల్ల సంచరించుచున్నదియు కృచ్ఛ్రసాధ్య మగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఆమవాతనిదానం సమాప్తమ్.

# ౨౬. శూలపరిణామశూలాన్నద్రవశూల నిదానమ్.

ఆమవాతాంతమున "సశూలం పవనానుగమ్" అని చెప్పియుండుటచేసి యామవాతనిదానానంతరము శూలనిదానమును జెప్పుట.—

### శూలభేదములు

దోషైః పృథక్సమస్తామద్వన్ద్వైశ్శూలోఽష్టధా భవేత్,
సర్వేష్వేతేషు శూలేషు ప్రాయేణ పవనః ప్రభుః. 1

వాతపిత్తకఫములచే వేర్వేరుగను, రెండేసిదోషముల సంసర్గముచేతను, త్రిదోష సన్నిపాతముచేతను, ఆమము (పక్వముగాని యన్నరసము) చేతను జనించుటంజేసి శూలరోగము ఎనిమిదివిధము లగును. ఈయెనిమిది శూలభేదములయందును ప్రాయికముగ వాతము రాజై ప్రధానముగ నుండును.

(వాత-పిత్త-కఫ-వాతపిత్త-వాతకఫ-పిత్తకఫ-సన్నిపాత-ఆమ భేదములచే నెనిమిది విధములు.)

పైజెప్పిన త్రిదోషములును శూలవ్యాధికి సన్నికృష్టకారణములు. హారీతుండు తన తంత్రమున ఆద్యుత్పత్తి కారణమును ఇట్లు చెప్పెను:—"అనఙ్గనాశాయ హరస్త్రిశూలం ముమోచ కోపాన్మకరధ్వజశ్చ, తమాపతన్తం సహసానిరీక్ష్య భయార్దితో విష్ణుతనుం ప్రవిష్టః, స విష్ణుహుంకారవిమోహితాత్మా సపాతభూమౌ ప్రథిత స్సశూలః, స పఞ్చభూతానుగతం శరీరం ప్రదూషయత్యస్య హిపూర్వసృష్టిః" ము న్నొకసమయమున జగదీశ్వరుండు మదనునిపై నలిగి తనచేతనున్న త్రిశూలమును బ్రయోగింప, మన్మథుడు తీవ్రరూపముతో వచ్చు నాహరశూలమును జూచి వెరగంది చేయునది లేక జగద్వ్యాపకుడైన విష్ణుని శరీరమునందు డాగి యగపడకుండెను. అంత నార్తపరిత్రాణబద్ధదీక్షుండును శరణాగతవత్సలుండును నగు నాయాదిదేవుడు తనకెదుట మన్మథునకై వచ్చియున్న శూలమునుం గాంచి హుంకారముచే నిషేధింప, నయ్యది పుడమింబడి నారాయణుని యాజ్ఞచే భూమిలోనుండు ప్రాణులయొక్క పాంచభౌతిక శరీరములను నాటంగోలె బాధింప మొదలిడెను. దానంజేసి యియ్యది శూలశబ్దముచే

జెప్పబడుచున్నది. ఇది శూలవ్యాధి ప్రాథమికోత్పత్తి కారణము. సుశ్రుతుడు శూలశబ్దమున కన్వర్థత నిట్లు నిరూపించెను:—"శఙ్కుస్ఫోటన వత్తస్య యస్మాత్తీవ్రాతి వేదనా, శూలాసక్తస్య భవతి తస్మాచ్ఛూలమిహోచ్యతే" (సుశ్రుత. ఉ. అ. ౪౨.) (శూలవ్యాధిచే పీడితునకు శంకును (ఇనుపమేకును) నాటిన విధముగ మిక్కిలి తీవ్రమైన బాధ కల్గుచు కావున నియ్యది శూలవ్యాధి యని పిలువంబడును)

**వాతికశూల - నిదాన - లక్షణములు**

వ్యాయామయానాదతిమైథునాచ్చ
ప్రజాగరాచ్ఛీతజలాతిపానాత్,
కలాయముద్గాఢకికోరదూషా
దత్యర్థరూక్షాధ్యశనాభిఘాతాత్. 2
కషాయతిక్తాతివిరూఢజాన్న
విరుద్ధవల్లూరకశుష్కశాకాత్,
విట్ఛుక్రమూత్రానిలవేగరోధా
చ్ఛోకోపవాసాదతిహాస్యభాష్యాత్. 3
వాయుః ప్రవృద్ధో జనయేద్ధి శూలం
హృత్పార్శ్వపృష్ఠత్రికవస్తిదేశే,
జీర్ణే ప్రదోషే చ ఘనాగమే చ
శీతే చ కోపం సముపైతి గాఢమ్. 4
ముహుర్ముహుశ్చోపశమప్రకోపీ
విడ్వాతసంస్తమ్భనతోదభేదైః,
సంస్వేదనాభ్యఞ్జనమర్దనాద్యైః
స్నిగ్ధోష్ణభోజ్యైశ్చ శమం ప్రయాతి. 5

తనబలమునకు మిక్కుటముగ దేహపరిశ్రమచేయుట, గుఱ్ఱములు మున్నగు వాహనములపై సవారిచేయుట, తన బలమును మీరి స్త్రీ సంభోగముచేయుట, రాత్రి వేళ చాలకాలము నిదుర లేకుండుట, చల్లనినీళ్లను విశేషముగ త్రాగుట, బటానులు పెసలు కందిపప్పు ఆరుకలు అను నీ ధాన్యములను విశేషముగ భుజించుట, మిక్కిలి రూక్షమైన (జిడ్డులేని) యన్నమును భుజించుట, భుజించిన యాహారము జీర్ణము కాకమునుపే మరల భుజించుట, శస్త్రాదులచే నభిఘాతము గల్గుట, వగరు చేదు రస

ములుగల వస్తువులను విశేషముగ భుజించుట, మొలకలెత్తిన ధాన్యములచే సిద్ధమైన యన్నమును భుజించుట, పరస్పర సంయోగ విరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించుట, నిప్పున కాలువబడిన మాంసమును ఎండినయాకుగూరలను భుజించుట, మలము శుక్రము మూత్రము వాతము అను నీ నాల్గిటిని సకాలమున విసర్జింపక వాని వేగమును నిరోధించుట, అధికముగ శోకించుట, ఉపవాస ముండుట, అధికముగ (కటికి నవ్వు) నవ్వుట, బిగ్గరగ మాటలాడుట, ఈకారణములచేత వాతము వృద్ధినొంది ప్రకుపితమై హృదయము నందైనను, ఇరుప్రక్కల యందైనను, వీపునందైనను, వెన్నెముకకును పిరుదులకును సంధి (త్రిక) స్థలము నందైనను పొత్తికడుపు నందైనను శూలవ్యాధిని కల్గించును. ఈ వాతజ శూలవ్యాధి భుజింపబడిన యాహారము జీర్ణమగు నప్పుడును, ప్రదోషకాలములయందును, మబ్బు వ్యాపించియుండు వర్షాకాలము నందును, మంచుకాలమునందును, మిక్కిలి ప్రకోపమునొంది తీవ్రముగ బాధింప సాగును. ఇయ్యది వాతమున జనించునుగాన మాటికి మాటికిని తనంతనే శమించి మరల బాధించును. మలమును వాతసంచారమును వెడలనీయక స్తంభించును సూదులతో పొడిచినట్టును భేదించినట్లును బాధ కల్గును. శరీరమున చెమట వెడలించుటచేతను, తైలాదులచే నభ్యంజనము జేయుటచేతను, మర్దనాదులచేతను, స్నిగ్ధంబులును ఉష్ణంబులు నగు పదార్థముల భుజించుటచేతను శాంతి నొందును. (సంస్వేదనాదులు వాతజ శూలరోగమున కుపశయ మని భావము.)

### పిత్తజశూలనిదాన - లక్షణములు

క్షారాతితీక్ష్ణోష్ణవిదాహితైల
నిష్పావపిణ్యాకకులుత్థయూషైః,
కట్వమ్లసౌవీరసురావికారైః
క్రోధానలాయాసరవిప్రతాపైః. 6
గ్రామ్యాతియోగాదశనైర్విదగ్ధైః
పిత్తం ప్రకుప్యాశు కరోతి శూలమ్,
తృణ్మోహదాహార్తికరం హి నాభ్యాం
సంస్వేదమూర్చ్ఛాభ్రమదోషయుక్తమ్. 7
మధ్యన్దినే కుప్యతి చార్ధరాత్రే
విదాహకాలే జలదాత్యయే చ,
శీతే చ శీతైస్సముపైతి శాన్తిం
సుస్వాదుశీతైరపి భోజనైశ్చ. 8

యవక్షారము మున్నగు క్షారద్రవ్యములనైనను, మిక్కిలి తీక్ష్ణ ఉష్ణగుణము కల మిరియాలు మున్నగువానినైనను, తాపకరంబు లైన వెదురుమోవులు మున్నగువానినైనను, నువ్వులచే సిద్ధములైన పదార్థములనైనను, శింబీ (చిక్కుడు మొదలగు) ధాన్యమునైనను, గానుగపిండినైనను, ఉలవకట్టునైనను, కారము పులుపుకల పదార్థములనైనను, కాంజికమునైనను, పలుదెరంగులైన మద్యములనైనను, విశేషముగ సేవించుట, కోపము, నిప్పుసెగనుండుట, శ్రమము, ఎండవేడి, అధికముగ స్త్రీసంభోగముచేయుట, *వేచినబియ్యముచే సిద్ధమైన యన్నము భుజించుట, ఇవి మున్నగు కారణములచేత పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది తోడనే శూలరోగము గల్గించును. అట్టిపిత్తమున గల్గిన శూలరోగమునందు దప్పి విశేషముగ నగును. చిత్తభ్రమము కల్గును. బొడ్డు దగ్గర మంటయు నొప్పియు కల్గును. శరీరముపై చెమటపట్టును. మూర్ఛగ్రమ్మును. చక్రముపై నుండు వానివలె నొడలు తిరుగును. ఈ పైత్తికశూల మధ్యాహ్నకాలమునను, అర్థరాత్రివేళయందును, ఎండకాలమునందును, శరత్కాలమునందును, విశేషముగ ప్రకోపమునొంది బాధింపసాగును. చల్లనికాలమునందును, గుణవీర్యములచే శీతములగు నుపచారములచేతను, మధురములును శీతవీర్యములు నగు భోజనములచేతను శాంతి నొందును.

### కఫజశూల నిదాన-లక్షణములు

ఆనూపవారిజకిలాటపయోవికారై
ర్మాంసేక్షుపిష్టకృసరాతిలశష్కులీభిః,
అన్యైర్బలాసజనకైరపి హేతుభిశ్చ
శ్లేష్మా ప్రకోపముపగమ్య కరోతి శూలమ్. 9
హృల్లాసకాసపదనాఽరుచిసంప్రసేకైః
ఆమాశయే స్తిమితకోష్ఠశిరోగురుత్వైః,
భుక్తే సదైవ హి రుజం కురుతేఽతిమాత్రం
సూర్యోదయేఽథ శిశిరే కుసుమాగమే చ. 10

జలప్రాంతమున నుండు హంసలు చక్రవాకములు మున్నగు జంతువులమాంసమును జలముననే సంచరించు మత్స్యములు మున్నగువాని మాంసమును తినుట, కిలాటము (పాలు విరిగినముక్కలు)ను పాలతో చేయబడిన భక్ష్యాదులను మాంసమును

---

* "అశనైర్విదగ్ధైః" అను మూలమునకు పిత్తప్రకోపోద్రేకముచే విశేష పాక మందిన యాహారముచేత నని మధుకోశమున గలదు.

చెరకురసమును పిండితో జేయబడిన పదార్థములను పులగమును నువ్వులను చక్కిలములను విశేషముగ తినుట, ఇట్టి కారణములచేతను, ఇతరములగు కఫవర్ధకములైన యాహార విహారాదులచేతను కఫము మిక్కిలి ప్రకోపమునొంది శూలను కల్గించును. ఇట్టి కఫజ శూలమునందు ఓకళింతలు విశేషముగ వచ్చును. దగ్గు కల్గును. జఠరాగ్ని మందగించును. నోట రుచి తప్పును. నోటివెంట నీరు వెడలును. కోష్ఠము బద్ధగించి మలబంధము కల్గును. తల బరువైయుండును. ఇట్టి యుపద్రవములతోగూడి ఆమాశయమున తీవ్రమగు నొప్పి కల్గును. ఇయ్యది కఫజ శూలస్వరూపము. ఈ కఫశూలము భుజించినవెంటనే మిక్కిలి తీవ్రమగును. మరియు సూర్యోదయ కాలమునందును, శిశిర ఋతువునందును, వసంత ఋతువునందును విశేషముగ నధికమగును.

కిలాటలక్షణము భావప్రకాశికయం దిట్లు వివరింపబడియె:—"పక్వం దధ్నా సమం క్షీరం విజ్ఞేయో దధికూర్చికా, తక్రేణ తక్రకూర్చా స్యాత్తయోః పిణ్డః కిలాటకః, గురుః కిలాటోఽనిలహా పుంస్త్వనిద్రాప్రదః స్మృతః" పాలను పెరుగును సమభాగములుగ నొకటిగ గూర్చి కాచిన నయ్యది దధికూర్చిక యనబడును. పాలను మజ్జిగను సమభాగములుగ నొకటిచేసి కాచినచో నయ్యది తక్రకూర్చిక నాబరగును. ఈ రెండు విధములైన పాకములయందును ఘనీభవించిన జున్ను కిలాట మనబడును. ఇయ్యది చిర కాలమునకు జీర్ణమగును. వాతమును హరించును. శుక్రమును వృద్ధినొందించి సంభోగ శక్తి నధికముగ జేయును. నిదుర నధికముగ జేయును.

## సాన్నిపాతిక శూలనిదాన లక్షణములు

సర్వేషు దోషేషు చ సర్వలిఙ్గం విద్యాద్భిషక్సర్వభవం హి శూలమ్,
సుకష్టమేనం విషవజ్రకల్పం వివర్జనీయం ప్రవదన్తి తజ్జ్ఞాః. 11

వాతాదిదోషములకు వేరువేరుగ జెప్పిన కారణము లన్నియు మిళితములైన యపుడు వాతపిత్తకఫములు మూడును సమకాలమున సమములుగ ప్రకోపమునొంది, దోషములు మూడిటికిని వేరువేరజెప్పిన లక్షణములన్నియు గల్గిన శూలరోగమును గల్గించును. ఇయ్యది మిక్కిలి కష్టతమమై విషమును వజ్రాయుధమునుబోలె ప్రాణాంత కరమగును. దీనికి వాతాదులకు పరస్పర విరుద్ధములైన చికిత్సల సమకాలమున జేయ వలనుపడదు. కావున వైద్యవరులు చికిత్స చేయ నుద్యమింపదగదు.

## ఆమజశూల లక్షణము

ఆటోపహృల్లాసవమీగురుత్వస్తైమిత్యకానాహకఫప్రసేకైః,
కఫస్య లిఙ్గేన సమానలిఙ్గ ఆమోద్భవం శూలముదాహరన్తి. 12

భుజించినయాహారము జీర్ణముగాక దాన జనించిన శూలవ్యాధి ఆమజమనబడును. ఈవ్యాధియందు కడుపులో గుడగుడమను కూతలు పుట్టును. ఓకలింతలు వచ్చును. వమన మగును. శరీరము బరువుగ నుండును. శరీరము జడముగ నుండును. కడు పుబ్బరించును. నోట కఫము గారును. ఇవిగాక కఫజశూలమునకు చెప్పిన లక్షణములు జనించును.

ద్విదోషజశూల లక్షణము

వస్తౌ హృత్పార్శ్వపృష్ఠేషు స శూలః కఫవాతికః,
కుక్షౌ హృన్నాభిమధ్యేషు స శూలః కఫపైత్తికః. 13
దాహజ్వరకరో ఘోరో విజ్ఞేయో వాతపైత్తికః,

కఫవాతములసంసర్గమున వస్తియందును, హృదయమునందును, ఇరుప్రక్కల యందును, వీపునందును శూల జనించును. కుక్షియందును, హృదయమునందును, బొడ్డు దగ్గరను, శరీరమధ్యభాగమునందును జనించినశూల కఫపిత్తసంసర్గమున జనించినది. వాత పిత్తముల సంసర్గమున జనించిన శూలరోగమున తాపజ్వరములు గల్గి, మిగుల క్రూరంబై యుండును. "సర్వేషు దేశేషు చ సన్నిపాతాత్" అని తంత్రాంతరమున నుండుటచే సన్నిపాతముచేత పైజెప్పినస్థలములన్నిటియందు శూల జనించు నని యెరుంగునది.

శూలవ్యాధిసాధ్యాऽసాధ్య లక్షణములు

ఏకదోషోత్థితస్సాధ్యః కృచ్ఛ్రసాధ్యో ద్విదోషజః. 14
సర్వదోషోత్థితో ఘోరస్త్వసాధ్యో భూర్యుపద్రవః,

పైజెప్పిన శూలవ్యాధులలో నొక్కదోషముచే గల్గినది సాధ్యమగును. రెండేసిదోషముల సంసర్గముచే గల్గినది కృచ్ఛ్రసాధ్యము. త్రిదోషసన్నిపాతముచే గల్గినదియు అనేకంబులగు నుపద్రవంబుల గూడినదియు మిక్కిలి క్రూరముగ నుండి యసాధ్య మగును.

శూలోపద్రవములు తంత్రాంతరమున నిట్లు చెప్పబడినవి:— "వేదనా చ తృషా మూర్ఛా ఆనాహో గౌరవారుచీ, కాసశ్శ్వాసశ్చ హిక్కా చ శూలస్యోపద్రవా స్స్మృతాః" వేదన, దప్పి, మూర్ఛ, కడుపుబ్బరము, మందాగ్ని, అరోచకము, శ్వాసము, దగ్గు ఎక్కిళ్లు ఇవియన్నియు శూలవ్యాధిచే గల్గు నుపద్రవములు.

పరిణామ శూలసామాన్య లక్షణము

స్వైర్నిదానైః ప్రకుపితో వాయుస్సన్నిహితస్తదా. 15
కఫపిత్తే సమావృత్య శూలకారీ భవేద్బలీ,
భుక్తే జీర్యతి యచ్ఛూలం తదేవ పరిణామజమ్. 16

వాతమును ప్రకోపింపజేయు నాహారవిహారాదులచే సన్నిహితమైన వాతము మిక్కిలి ప్రకోపించి కఫపిత్తములంగలసి బలిష్ఠమై భుజింపబడినయాహారము జీర్ణమగు సమయమున క్రూరమైన నొప్పిని కడుపులో పుట్టించును. ఇయ్యది జీర్ణకాలమున జనించు శూలవ్యాధి గనుక పరిణామశూల యని యన్వర్థముగ జెప్పనగును.

పరిణామశూలలక్షణము తంత్రాంతరమున నిట్లు విస్తరముగ జెప్పబడినది:—
"బలాసః ప్రచ్యుతస్థానాత్ పిత్తేన సహమూర్ఛితః. వాయుమాదాయ కురుతే శూలం జీర్యతి భోజనే. కుక్షౌ జఠరపార్శ్వేషు నాభౌ వస్తౌ స్తనాన్తరే, పృష్ఠమూలప్రదేశేషు సర్వేష్వేతేషు వా పునః. భుక్తమాత్రేఽథవా వాన్తే జీర్ణేఽన్నే చ ప్రశామ్యతి, షష్టిక వ్రీహిశాలీనామోదనేన వివర్ధతే. తత్పరిణామజం శూలం దుర్విజ్ఞేయం మహాగదమ్, తమాహూ రసవాహానాం స్రోతసాం దుష్టిహేతుకమ్. కేచిదన్నద్రవం ప్రాహూ రన్యే తత్పక్తిదోషతః, పక్తిశూలం వదన్త్యేకే కేచిదన్న విదాహజమ్." కఫము ప్రకుపితమై తనస్థానమును వదలి పిత్తముతోగూడి వృద్ధినొంది వాతమునగూడ కలిసికొని మనుజుడు భుజించిన యాహారము జీర్ణమగుసమయమున కడుపునందైనను కుక్షికిరుప్రక్కలయందైనను, బొడ్డుదగ్గరనైనను, పొత్తికడుపుననైనను, స్తనములనడుమ హృదయస్థానమునందైనను, వీపు క్రిందిభాగముననైనను, మిక్కిలి తీవ్రమైనశూల గల్గించును. లేక పైజెప్పబడిన స్థానములన్నిటియందును సమకాలమున శూల గల్గించును. ఇయ్యది భుజించిన యుత్తరక్షణముననను, భుజింపబడినయాహారమును వాంతి జేసినప్పుడును, ఆహారము జీర్ణమైనపిమ్మటను తనంతనే శమించును. ఇది పరిణామశూల యని చెప్పబడును. ఈవ్యాధి అరువదినాళ్లసంబావులు, వ్రీహి, రాజములను ధాన్యములచే సిద్ధమైన యన్నమును భుజించినయెడ మిక్కిలి వృద్ధినొందును. ఈపరిణామశూల మిక్కిలి క్రూరమై దానిని తెలిసికొనుటకుగూడ నసాధ్యమైయుండును. ఇయ్యది శరీరమునందలి యన్నరసమును వహించు స్రోతస్సులు దుష్టములగుటచే గల్గు నని వచించెదరు. కొందరు అన్నరసము దుష్టమగుటచే గల్గుటచే నన్నద్రవశూల యనియు, మరి కొందరు ఆహారము జీర్ణము కాకుండుటచే గల్గునదగుట పక్తిశూల యనియు జెప్పెదరు. మఱికొందఱు అన్నము విరుద్ధపాక మందుటచే నీశూల కలుగునందురు. (ఇట్టికారణభేదము శరీరప్రకృతినిబట్టి కాలాద్యనుగుణముగ గల్గు నని యెరుంగునది.)

## వాతజపరిణామశూలలక్షణము

తస్య లక్షణమప్యేతత్సమాసేనాభిధీయతే,
ఆధ్మానాటోపవిణ్మూత్రవిబన్ధాఽరతివేపనైః. 17
స్నిగ్ధోష్ణోపశమప్రాయం వాతికం తద్వదేద్భిషక్,

పరిణామశూల వాతప్రకోపమున జనించినయెడ కడుపులో శబ్దముపుట్టి యుబ్బును. మలమూత్రముల బంధించును. ఏపని చేయుటకు నిచ్చ లేకుండును. శరీరమున కంపము పుట్టును. జిడ్డుకల్గిన పదార్థములను ఉష్ణగుణముకల పదార్థములను భుజించి నపుడు కొంచెము శమించినట్లు కనబడును.

పిత్తజపరిణామశూల లక్షణము

తృష్ణాదాహారతిస్వేదం కట్వమ్లలవణోత్తరమ్.  18
శూలం శీతశమప్రాయం పైత్తికం లక్షయేద్బుధః,

పిత్తమునగల్గిన పరిణామశూలయందు డప్పి యధికమగును. కడుపులో మంట పుట్టును. పనులయం దిచ్ఛ పొడమదు. శరీరముపై చెమటపుట్టును. చేదు పులుపు ఉప్పు అను నీ రసములు కలపదార్థముల నుపయోగించినచో మిక్కిలి వృద్ధినొందును. గుణ వీర్యములచే శీతలమునగు పదార్థములచేత కొంచెము శాంతినొంది నట్లుండును.

కఫజపరిణామశూల లక్షణము

ఛర్దిహృల్లాససమ్మోహం స్వల్పరుగ్దీర్ఘసన్తతి.  19
కటుతిక్తోపశాన్తం చ తచ్చ జ్ఞేయం కఫాత్మకమ్,

కఫమున జనించిన పరిణామశూలయందు వాంతియగును. ఓకలింతలు వచ్చును. చిత్తము స్వాధీనము లేకుండును. బాధ (నొప్పి) కొద్దిగనుండి చాలకాలమువరకు వ్యాపించియుండును. కారమును చేదును గల పదార్థములచే నించుక శమించును.

సంసర్గజ పరిణామ శూలలక్షణము

సంసృష్టలక్షణం బుద్ధ్వా ద్విదోషం పరికల్పయేత్.  20
త్రిదోషజమసాధ్యం తు క్షీణమాంసబలానలమ్,

వాతాదిదోషములకు పై జెప్పబడిన లక్షణములలో రెండేసి దోషలక్షణములు కల్గియున్నయెడ నయ్యది దోషద్వయ సంకరమున కల్గినది యని యెరుంగునది. మూడు దోషములకు జెప్పబడిన లక్షణము లన్నియు కల్గి శరీరమునందలి మాంసంబును బలంబును క్షీణించియున్నయెడ సన్నిపాతజనిత పరిణామశూల యని యెరుంగునది. ఇయ్యది మిక్కిలి యసాధ్యము.

అన్నద్రవ శూలలక్షణము

జీర్ణే జీర్యత్యజీర్ణే వా యచ్ఛూలముపజాయతే.  21
పథ్యాపథ్యప్రయోగేణ భోజనాభోజనేన చ,

న శమం యాతి నియమాత్ సోఽన్నద్రవ ఉదాహృతః. 22
అన్నద్రవాఖ్యశూలేషు న తావత్స్వాస్థ్యమశ్నుతే,
వాన్తమాత్రే జరత్పిత్తం శూలమాశు వ్యపోహతి. 23

భుజింపబడిన యాహారము జీర్ణంబైనపుడును, జీర్ణంబగుచున్న సమయమునను, జీర్ణము కాకుండు సమయమునను, కాలనియమములేక నిరంతరము బాధించునది యన్నద్రవశూల యని యెరుంగునది. ఇయ్యది పథ్యాహారాదుల సేవించినను, అపథ్యముల నుపయోగించినను, భోజనముచేసినను, చేయక యుపవాసమున్నను, ఒకప్పుడైన శాంతినొందక బాధించుచునే యుండును. ఇది అన్నద్రవమున జనించును కావున అన్నద్రవశూల యనబడును. దీనియందు ఒకప్పుడును రోగికి స్వస్థత కలుగదు. వాంతి జేసినచో పిత్తము కొంచెము జీర్ణించి క్షణకాలము అప్పటికి శాంతినొంది నట్లుండును. కాని మరల బాధింప సాగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శూల-పరిణామశూల-అన్నద్రవ శూలనిదానం
సమాప్తమ్.

# ౨౭. ఉదావర్తానాహనిదానమ్

ఉదావర్తనిదానమున శూలము కూడ జనించును కావున శూలనిదానమును జెప్పిన పిదప నుదావర్తనిదానమును జెప్పుట.—

## ఉదావర్తకారణములు

వాతవిణ్మూత్రజృమ్భాశ్రుక్షవోద్గారవమీన్ద్రియైః,
క్షుత్తృష్ణోచ్ఛ్వాసనిద్రాణాం ధృత్యోదావర్తసమ్భవః. 1

వాతము, మలమూత్రములు, ఆవలింతలు, కన్నీళ్లు, తుమ్ములు, త్రేపులు, వమనము, శుక్రము, ఆకలి, దప్పి, ఉచ్ఛ్వాసము, నిద్ర, ఇవి వానివాని వేగమును జూపనుండునపుడు వానిని ధారాళముగ వెడలనీయక బిగబట్టి వానివేగమును అడ్డగించినచో నుదావర్త మను వ్యాధి జనించును.

పై జెప్పిన కారణములలో నొక్కొకటిచే నొక్కొక యుదావర్తము జనించును. వీని యన్నింటియందును వాతము ప్రకుపితమై తన సంచారమార్గమును వదలి మార్గాంతరమును బొందును. కావున అన్నిటియందును వాతమును శమింపజేసి స్వస్థానమున జేర్చునట్టి చికిత్సలు చేయవలెను. ఈ విషయమును సుశ్రుతాచార్యుడు ఇట్లు నిరూపించెను:— "సర్వేష్వేతేషు విధివదుదావర్తేషు కృత్స్నశః, వాయోః క్రియా విధాతవ్యా స్వమార్గ ప్రతిపత్తయే" (సుశ్రుత. ఉ. అ. ౫౫.)

"వాయోః ఊర్ధ్వమావర్తః—ఉదావర్తః" అను వ్యుత్పత్తిచేత వాతము ఊర్ధ్వమార్గమున సంచరించునది యుదావర్త మని యేకరీతిని చెప్పదగినను పై జెప్పబడిన వాతాదివేగముల నిరోధమున జనించుటంజేసి పదుమూడు భేదములు కల్గియుండును. దీనికి సుశ్రుతాచార్యులు "త్రయోదశ విధశ్చాసౌ భిన్న ఏతైస్తుకారణైః" అని చెప్పిరి.

## వాతనిరోధజోదావర్తలక్షణము

వాతమూత్రపురీషాణాం సఙ్గాఽఽధ్మానం క్లమో రుజా,
జఠరే వాతజాశ్చాన్యే రోగాస్స్యుర్వాతనిగ్రహాత్. 2

శరీరము నందంతట సంచరించువాతమును నిరాతంకముగ సంచరింపనీయక దానివేగమును అడ్డుచేసినచో వాతము ప్రతిహతమై తన మార్గమును వదలి సంచ

రించుచు నుదావర్తమును గల్గించును. ఇది * వాతనిరోధజనిత ఉదావర్తము. (ఈ వ్యాధియందు పైజెప్పబడు పురీష నిరోధాదులయందు నిట్లె సమన్వయము జేయునది) దీనియందు వాతంబును మూత్రంబును మలంబును సరళముగ వెడలక బంధింపబడును. కడుపుబ్బును. బడలిక కల్గును. కడుపులో నొప్పి పుట్టును. ఇవియేగాక వాతముచే గల్గు శూల మున్నగు రోగములును కల్గును.

## పురీషనిరోధజోదావర్తలక్షణము

ఆటోపశూలౌ పరికర్తికా చ సఙ్గః పురీషస్య తథోర్ధ్వవాతః,
పురీషమాస్యాదథవా నిరేతి పురీషవేగేఽభిహతే నరస్య. 3

పురీషముయొక్క వేగమును నిరోధించుటచే గల్గిన యుదావర్తమున కడుపులో గుడగుడ యను శబ్దముతో నొప్పి పుట్టును. కడుపులో కోతగా వికారము కల్గును. మలము వెడలక బద్ధగించును. అపానవాతము పైకివ్యాపించును. మలము ఒక సమయమున ప్రతిలోమముగ సంచరించు వాతముచే పైకి నెగగొట్టబడి నోటి నుండియు వెడలును.

## మూత్రనిరోధజోదావర్తలక్షణము

వస్తిమేహనయోః శూలం మూత్రకృచ్ఛ్రం శిరోరుజా,
వినామో వఙ్క్షణానాహః స్యాల్లిఙ్గం మూత్రనిగ్రహే. 4

మూత్రము నడ్డుపరచుటచే గల్గిన యుదావర్తమునందు వస్తి (మూత్రపుతిత్తి యందును గుహ్యమునందును పోటుపుట్టును. మూత్రము మిక్కిలి కష్టముచే వెడలును. తలనొప్పి కలుగును. శరీరము వంగును. గెజ్జలయం దుబ్బి బిగించిన ట్లుండును.

## జృంభానిరోధజోదావర్తము

మన్యాగలస్తమ్భశిరోవికారాజృమ్భోపఘాతాత్పవనాత్మకాస్స్యుః,
తథాక్షినాసావదనామయాశ్చ భవన్తి తీవ్రాస్సహకర్ణరోగైః. 5

ఆవలింతలు రానున్నపుడు దానిని ధారాళముగ రానీయక యడ్డుపరచినచో నుదావర్తము కల్గును. ఈ వ్యాధియందు మెడకు వెనుకప్రక్కనుండు మెడనరములు స్తంభించును. కంఠమున స్వరము వెడలక స్తంభించును. వాతముచే తనలోన శిరోరోగములు కల్గును. కన్నులకును నాసికకును ముఖమునకును సంబంధించిన రోగములు కల్గును. మిక్కిలి తీవ్రములగు కర్ణరోగంబులును జనించును.

## అశ్రునిరోధజోదావర్తము

ఆనన్దజం వాప్యథశోకజం వా నేత్రోదకంప్రాప్తమముఞ్చతో హి,
శిరోగురుత్వం నయనామయాశ్చ భవన్తి తీవ్రాస్సహపీనసేన. 6

---

* వాతనిరోధ మనగా నపానవాతము నడ్డుట యనుట సమంజసము; కాని శరీరమునందు సంచరించు వాత మనుట దురూహ్యము.

సంతోషముచేనైనను దుఃఖముచేనైనను కన్నీరువెడల నారంభించినపుడు దానిని బైట వెడలనీయక యడ్డగించినచో నుదావర్తము కల్గును. ఈ రోగమున తల బరువుగ నుండును. నేత్రరోగంబును పడిసెంబును మిక్కిలి తీవ్రముగ జనించును.

### తుమ్మును నిరోధించుటచే గల్గు నుదావర్తము

మన్యాస్తమ్భశ్శిరశ్శూలం అర్దితాఽర్ధావభేదకౌ,
ఇన్ద్రియాణాం చ దౌర్బల్యం క్షవథోస్స్యాద్విధారణాత్. 7

తుమ్ము రానున్నపుడు దానిని వెడలనియ్యక అణచినచో నుదావర్తము కలుగును. దీనియందు మెడనరములు బిగదీసియుండును. తలనొప్పియెత్తును. అర్దితవాతంబును అర్ధావభేదక మను వాతవ్యాధియుం కలుగును. చక్షురాదీంద్రియములు తను తమ వ్యాపారముల సాగింప సమర్థములుగాక బలహీనము లగును.

### ఉద్గారనిరోధజోదావర్తము

కణ్ఠాస్యపూర్ణత్వమతీవ తోదః
కూజశ్చ వాయోరథవాఽప్రవృత్తిః,
ఉద్గారవేగేఽభిహతే భవన్తి
ఘోరా వికారాః పవనప్రసూతాః. 8

త్రేపును రానీయక నిరోధించుటచే గల్గిన యుదావర్తమునందు కంఠంబును నోరును నిండిన ట్లుండును. మిక్కిలి పోటు కల్గును. కడుపులో కూతలు పుట్టును. వాతము ఏప్రక్కను వెడలక స్తంభించియుండును. ఇవిగాక మిక్కిలి క్రూరములగు వాత వ్యాధులును కల్గును.

### ఛర్దినిరోధజోదావర్తలక్షణము

కణ్డూకోఠారుచివ్యఙ్గశోథపాణ్డ్వామయజ్వరాః,
కుష్ఠవీసర్పహృల్లాసాః చ్ఛర్దినిగ్రహజా గదాః. 9

వాంతిని నిరోధించుటచేత కల్గిన యుదావర్తమున శరీరముపైన విశేషముగ దురదయు, పొడలును, అరోచకంబును, ఒడలిపైన మంగును, వాపును, పాండురోగం బును, జ్వరంబును, కుష్ఠంబును, విసర్పంబును, ఓకరింతలును కల్గును.

### శుక్రనిరోధజోదావర్త లక్షణము

మూత్రాశయే వై గుదముష్కయోశ్చ
శోథో రుజా మూత్రవినిగ్రహశ్చ,

శుక్రాశ్మరీ తత్స్రవణం భవేచ్చ
తేతే వికారాః విహతే చ శుక్రే. 10

యుక్తవయసున శుక్రము విసర్జింపవలసినపుడు సందర్భపడక విసర్జింపకున్నను, లేక సంభోగకాలమున శుక్రము వెడలనున్నపుడు దాని నడ్డుపరచినను ఉదావర్తము కల్గును. ఈ వ్యాధియందు మూత్రాశయమునందును గుదస్థానమునందును వృషణముల యందును తీవ్రమైనవాపుకల్గి ఓరువరాని నొప్పి కల్గును. మూత్రము ధారాళముగ వెడలక బాధించును. శుక్రాశ్మరి (గడ్డకట్టిన శుక్రముతో మూత్రము కలిసి వెడలుట)యు కల్గును. కారణములేకనే మూత్రము తనంతట స్రవించును.

### క్షుత్తును నిరోధించుటచేనైన యుదావర్తము

తన్ద్రాఙ్గమర్దావరుచిశ్శ్రమశ్చ
క్షుధాభిఘాతాత్కృశతా చ దృష్టేః,

తీవ్రముగ నాకలియెత్తునపుడు తగినయాహారము సేయక ఆకలిని నిరోధించి యుపవాస ముండునెడ నుదావర్తము కల్గును. అందు మైకము గ్రమ్మును. ఒడలెల్ల నొప్పిపుట్టును. అరుచి కల్గును. శ్రమము (బడలిక) కల్గును. చూపు మందమైపోవును.

### దప్పిని నిరోధించుటచే గల్గు నుదావర్తము

కణ్ఠాస్యశోషశ్శ్రవణావరోధః
తృష్ణాభిఘాతాద్ధృదయే వ్యథా చ. 11

దప్పిని బిగబట్టుటచే గల్గిన యుదావర్తమున గొంతును నోరును ద్రవములేక యెండును. చెవులు వినబడవు. రొమ్మున బాధ జనించును.

### శ్వాసనిద్రల నిరోధించుటచేనైన యుదావర్తము

శ్రాన్తస్య నిశ్వాసవినిగ్రహేణ
హృద్రోగమోహావథ వాపి గుల్మః,
జృమ్భాఙ్గమర్దోఽక్షిశిరోఽతిజాడ్యం
నిద్రాభిఘాతాదథవాపి తన్ద్రా. 12

దేహపరిశ్రమము పరువిడుట భారమును మోచుట. మున్నగుపనులచే శరీరము శ్రమనొంది యూపిరి తీవ్రముగ (రొజు) వచ్చునపుడు (దానిని సరళముగ వెడల నియ్యక) బిగబట్టుటచే నుదావర్తము కల్గును. దానంజేసి హృదయమున నొప్పియు, మ[illegible]మంబును (మూర్ఛ), గుల్మవ్యాధియు కల్గును. నిదురవచ్చునపుడు దానిని నిరోధించినచో నావలింతలు విశేషముగ గల్గును. ఒడలు పీకు పుట్టును. కనురెప్పలు బరువుగ నుండును. తల భారముగ నుండును. తంద్ర (ఏమరిక) వచ్చును.

—॥ వాతప్రకోపమున గల్గిన యుదావర్తము ॥—

వాయుః కోష్ఠానుగో రూక్షైః కషాయకటుతిక్తకైః,
భోజనైః కుపితస్సద్య ఉదావర్తం కరోతి చ. 13
వాతమూత్రపురీషాసృక్కఫమేదోవహాని వై,
స్రోతాంస్యుదావర్తయతి పురీషం చాతివర్తయేత్. 14
తతో హృద్వస్తిశూలార్తో హృల్లాసారతిపీడితః,
వాతమూత్రపురీషాణి కృచ్ఛ్రేణ లభతే నరః. 15
శ్వాసకాసప్రతిశ్యాయదాహమోహతృషాజ్వరాన్
వమిహిక్కాశిరోరోగమనశ్శ్రవణవిభ్రమాన్,
బహూనన్యాంశ్చ లభతే వికారాన్ వాతకోపజాన్. 16

జిడ్డులేనిపదార్థములను, వగరు కారము చేదు అను నీరసములు గలపదార్థములను భుజించినచో కోష్ఠగతమగు వాతము ప్రకోపమునొంది యాక్షణముననే యుదావర్తమును గల్గించును. దానంజేసి వాత - మూత్ర - పురీష - రక్త - కఫ - మేదస్సుల వహించుస్రోతస్సుల మార్గమును నిరోధించి ప్రతిలోమముగ సంచరించుచు పురీషమును ద్రవములేక శుష్కింపజేయును. దానివలన హృదయమునందును వస్తియందును తీవ్రమైనశూలము కల్గును. రొమ్మున నదరుపాటు కల్గును. పనులయందు నిరుత్సాహమగును. అపానవాతంబును మూత్రపురీషంబులును మిక్కిలి కష్టముచే వెడలును. మరియు శ్వాసము, దగ్గు, పడిసెము, తాపము, మోహము, దప్పి, జ్వరము, వాంతి, ఎక్కిళ్లు, తలనొప్పి, మనస్సున భ్రమంబును, చెవులలో ధ్వనియు ఇవి మున్నగు వాతప్రకోపమున జనించు ననేకరోగములు కల్గును.

ఉదావర్తాఽసాధ్యలక్షణములు సుశ్రుతమున నిట్లు చెప్పబడెను:—"తృష్ణార్దితం పరిక్లిష్టం క్షీణం శూలైరుపద్రుతమ్, శకృద్వమన్తం మతిమాన్ ఉదావర్తినము త్సృజేత్" (సుశ్రుత. ఉ. అ. ౫౫.) తీవ్రమైనదప్పి, క్లేశము, కృశత్వము, శూల అను నీయుపద్రవములు కల్గినను, నోట మలము వాంతి యగుచున్నను ఉదావర్తము మిక్కిలి క్రూరమగును. గాన చికిత్సజేయంజనదు

—॥ ఆనాహలక్షణము ॥—

ఆమం శకృద్వా నిచితం క్రమేణ
భూయో విబద్ధం విగుణానిలేన,
ప్రవర్తమానం హి యథాస్వమేనం
వికారమానాహముదాహరన్తి. 17

పక్వముగాని యామ (ఆహారద్రవ్యం) బైనను, పక్వమైన మలంబైనను ప్రకోపము నొందిన వాతముచే బంధింపబడి యథాకాలమున బైటవెడలక తనస్థానమునందే నానాట వృద్ధినొంది మామూలుప్రకారము వెడలకుండును. ఇయ్యది యానాహ మని చెప్పబడును.

—— ఆమజన్యాఽఽనాహలక్షణము ——

తస్మిన్ భవన్త్యామసముద్భవే తు
తృష్ణాప్రతిశ్యాయశిరోవిదాహాః,
ఆమాశయే శూలమథో గురుత్వం
హృత్స్తమ్భ ఉద్గారవిఘాతనం చ. 18

ఆనాహము ఆమముచేతను పురీషముచేతను జనించుటంజేసి రెండు విధములు. అందు ఆమజన్యంబైన యానాహమున దప్పి విశేషముగ కల్గును. పడిసెము, తల మంటయుం బుట్టును. ఆమాశయమునందు నొప్పియు గురుత్వంబును కల్గును. రొమ్ముపట్టినట్లుండును త్రేపులు బైటవెడలక యడ్డగింపబడును. (ఇయ్యది యామాశయమున జనించిన యానాహము.)

—— పురీషజన్యానాహ లక్షణము ——

స్తమ్భః కటీపృష్ఠపురీషమూత్రే
శూలోఽథ మూర్ఛా శకృతశ్చ చ్ఛర్దిః*,
శోథశ్చ పక్వాశయజే భవన్తి
తథాఽలసోక్తాని చ లక్షణాని. 19

పురీషముచే జనించు ఆనాహము పక్వాశయమున కల్గును. ఈవ్యాధియందు నడుము వీపును స్తంభించును. పురీషమూత్రములు మామూలుగ వెడలక బద్ధగించును. మలమూత్రాశయములయందు నొప్పి కల్గును. మూర్ఛ వచ్చును. నోట మలము వాంతి యగును. వాపు కల్గును. ఇవికాక అలసకరోగమున జెప్పిన లక్షణములు కూడ కల్గును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఉదావర్త-ఆనాహనిదానం
సమాప్తమ్.

---

* "శకృతో వమిశ్చ" అని యుండినచో ఛందోభంగము కలుగదు.

# ౨౮. గుల్మనిదానమ్

గుల్మమునకు ఆనాహము పూర్వరూపము కావున అట్టి యానాహమును జెప్పిన పిదప గుల్మనిదానమును జెప్పుట:—

### గుల్మము జనించుటకు కారణములు

దుష్టా వాతాదయోఽత్యర్థం మిథ్యాఽఽహారవిహారతః,
కుర్వంతి పఞ్చధా గుల్మం కోష్ఠాన్తర్గ్రన్థిరూపిణమ్,
తస్య పఞ్చవిధం స్థానం పార్శ్వహృన్నాభివస్తయః. 1

పథ్యములుకాని యాహార విహారములచేత వాతపిత్తకఫము లుత్కటముగ ప్రకోపమునొంది కోష్ఠముయొక్క లోభాగమున గ్రంథి (గడ్డ)వలెనుండు గుల్మమును కల్గించును. ఇయ్యది వాతము, పిత్తము, కఫము, సన్నిపాతము, రక్తము నను నైదిటిచే వేరువేర జనించుటంజేసి యైదువిధంబుల నుండును. అట్టి గుల్మమునకు ఇరుప్రక్కలును, హృదయంబును, నాభియు, వస్తియు నీయైదును స్థానములు.

### గుల్మముయొక్క రూపము

హృన్నాభ్యోరన్తరే గ్రన్థిః సఞ్చారీ యది వాఽచలః,
వృత్తశ్చయాఽపచయవాన్ స గుల్మ ఇతి కీర్తితః. 2

హృదయమునకు నాభికిని మధ్యప్రదేశమున గ్రంథివలె పుట్టి, అయ్యది సంచరించుచునైనను, కదలక రాయివలెనైనను అప్పుడప్పుడు వృద్ధినొందుచు తగ్గుచునుండు స్వభావము గల్గియుండును. ఇయ్యది గుల్మ మని చెప్పబడును.

ఇచ్చట "చయాపచయవాన్" అనుచోట "చయోపచయవాన్" అని పాఠాంతరము కొన్నిచోట్ల నున్నది. ఈ పాఠమున వాతాదిదోషములు చయావస్థ (స్వస్థానవృద్ధి) నొందియుండుటచే నీ గ్రంథియు వృద్ధినొంది యుండు నని యర్థము జేయుట యుక్తము. ఇయ్యది పిండాకారముగ పుట్టియుండుటంజేసి గుల్మ మని చెప్పబడును. ఈ విషయము చరకమున "పిణ్డితశ్చావతిష్ఠతే, సపిణ్డితత్వాద్గుల్మ ఇత్యుచ్యతే" అని చెప్పబడినది.

స వ్యస్తైర్జాయతే దోషైః సమస్తై రపి చోచ్ఛ్రితైః,
పురుషాణాం తథా స్త్రీణాం జ్ఞేయో ర క్తేన చాపరః. 3

పైజెప్పబడిన గుల్మవ్యాధి ప్రకోపమునొందిన వాతపిత్తకఫములచే వేర్వేరుగను అన్నింటిచేతను (సన్నిపాతముచేతను స్త్రీ పురుష సామాన్యముగ జనించును. స్త్రీలకు దోషజన్యములగు నాల్గు గుల్మములుగాక ఋతురక్తము వాతముచే సద్దగింపబడి ప్రతి మాసమునందును మామూలుగ బైలువెడలక నిలచి గ్రంథిరూపముదాల్చి గుల్మ మగు. ఇది పురుషునకు రాను వీలుపడదు. ఇవియన్నియుం గలిసి యైదువిధము లగును. కావున "కుర్వన్తి పఞ్చధా గుల్మం" అని పైజెప్పిన సంఖ్యానియమము సంగతమగును.

వాగ్భటాచార్యుడు దోషసంసర్గమున జనించు వాతపిత్తజ-వాతకఫజ-పిత్తకఫజ గుల్మముల మూడిటినికూడ జేర్చి యెనిమిది గుల్మము లని పరిగణనము జేసెను. ఎట్టు లనః—"గుల్మోఽష్టధా పృథగ్దోషైః సంసృష్టై ర్నిచయం గతైః, ఆర్తవస్య చ దోషేణ నారీణాం జాయతేఽష్టమః" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౩౨) ఇచ్చట "నిచయం గతైః" అనుదానికి ఒక్కటిగ కలిసిన సన్నిపాతముచేత నని యర్థము. చరకాచార్యులు గూడ "సంసృష్ట (వ్యామిశ్ర) లిఙ్గానపరాంశ్చ గుల్మాం స్త్రీనాదిశేదౌషధకల్పనార్థమ్" (చరక. చి. అ. ౫. శ్లో. ౧౬) అను వాక్యముచేత ద్విదోష గుల్మ భేదముల మూడిటిని పరిగణనము చేసెను.

ప్రకృత గ్రంథ మూలకారుడు ద్విదోష సంసృష్టములకు ఆయాదోషములకు వేర్వేర చెప్పిన లక్షణములలో రెండేసి దోషముల లక్షణములు కలసియుండుటయే లక్షణముగాని వేరుగ లక్షణములే దను యభిప్రాయమున సంసృష్టముల వేరుగ పరిగణనము జేయలేదు. సంసర్గజలక్షణములను వాగ్భటులుగూడ "ప్రాయస్త్రయస్తు ద్వన్ద్వోత్థా గుల్మాస్సంసృష్ట లక్షణాః" (అ. హృ. ని. ౧౧. శ్లో. ౪౭) అని చెప్పెనుగాని విశేష లక్షణములను జెప్పలేదు. చికిత్సలో మాత్రము సంసర్గజములకు విశేషముండుటంజేసి చరకాదులు పరిగణనము జేసిరి. ఈ గ్రంథకర్తయు "త్రీనాదిశేదౌషధ కల్పనార్థం" అను వాక్యమున నీవిషయమును కంఠోక్తిగనే చెప్పియుండెను.

ఇచ్చట కొందరాచార్యులు ఆర్తవరక్తముచేత స్త్రీలకుమాత్రము గుల్మము జనించు ననియు, రెండవధాతువైన రక్తముచే గల్గుగుల్మము పురుషులకును స్త్రీలకును గూడ జనించు ననియు విశేషమును నిర్ణయించెదరు. ఈ విషయము తంత్రాంతరమున నిట్లున్నది:—"స్త్రీణామార్తవజో గుల్మో న పుంసాముపజాయతే, అన్యస్త్వసృగ్భవో

గుల్మః స్త్రీణాం పుంసాం చ జాయతే." (చక్రపాణి) వాతాదిగుల్మములు నాల్గును పైజెప్పిన పార్శ్వాదిస్థానములయం దైదింటియందును జనించును. రక్తగుల్మము మాత్రము స్త్రీలకు గర్భాశయమునందు జనించును అని యెరుంగునది.

## గుల్మవ్యాధి పూర్వరూపములు

ఉద్గారబాహుల్యపురీషబన్ధ
తృప్త్యక్షమత్వాన్త్రవికూజనాని,
ఆటోపమాధ్మానమపక్తిశక్తి
రాసన్నగుల్మస్య వదన్తి చిహ్నమ్. 4

గుల్మవ్యాధి జనించుటకు మునుమున్ను ఓకిలింత లధికముగ వచ్చును. మలము బంధించును. కడుపునిండుకొని భుజింప సాధ్యము గాకుండును. ప్రేవులలో కూతలు పుట్టును. కడుపులో నారాటము పుట్టి నొప్పిగల్గి యుబ్బును. ఆహారము జీర్ణింపశక్తి లేకుండును. ఈ లక్షణములు కానుపించినపుడు గుల్మవ్యాధి రానున్నదని యెరుంగునది.

చరకమునందు గుల్మపూర్వరూపముల జెప్పునపుడు "వాతమూత్రపురీష వేగానా మప్రాదుర్భావః, ప్రాదుర్భూతానాం చ అప్రవృత్తిః, సఙ్గః, ఈషదాగమనం వా" (చరక. ని. అ. 3. సూత్ర. ౨౪.) అని చెప్పియుండుటంజేసి యపానవాత మూత్ర పురీషముల వేగము కల్గదనియు, ఒకవేళ కల్గినను అయ్యవి బైటవెడల వనియు, ఒకవేళ వెడలినచో కొంచెముగ వెడలు ననియు విశేషముల నెరుంగునది.

## గుల్మసామాన్యరూపము

అరుచిః కృచ్ఛ్రవిణ్మూత్ర వాతతాఽఽన్త్రవికూజనమ్,
ఆనాహశ్చోర్ధ్వవాతత్వం సర్వగుల్మేషు లక్షయేత్. 5

అరోచకము, మలమూత్ర అపానవాతములు మిక్కిలి కష్టముగ వెడలుట, ప్రేవులలో కూతలు, కడుపుబ్బరము, శ్వాసము పైకి వెడలుట ఇవియన్నియు గుల్మము లన్నింటియందును సామాన్యముగ గల్గు లక్షణములు.

## వాతికగుల్మము జనించుటకు కారణములు

రూక్షాన్నపానం విషమాతిమాత్రం
విచేష్టనం వేగవినిగ్రహాశ్చ,
శోకోఽభిఘాతోఽతిమలక్షయశ్చ
నిరన్నతా చాఽనిలగుల్మహేతుః. 6

జిడ్డులేని యన్నపానముల సేవించుట, తాను భుజించు పరిమితికన్న న్యూనాధికములుగ నైనను మిక్కిలి యధికముగనైనను భుజించుట, విషమముగ శరీరమునకు సంబంధించిన చేష్టలచేయుట, మలమూత్ర వాతాదివేగమును నిరోధించుట, దుఃఖపడుట, ఆయుధాదులచే నభిఘాతము కల్గుట, విరేచనాదులచే మలమును విశేషముగ క్షీణింపజేయుట, అన్నమును భుజింపక యుపవాసముండుట ఈ కారణములచేత వాతము మిక్కిలి ప్రకోపమునొంది గుల్మమును కల్గించును.

## వాతికగుల్మలక్షణము

యస్థానసంస్థానరుజావికల్పం
విడ్వాతసఙ్గం గలవక్త్రశోషమ్,
శ్యావారుణత్వం శిశిరజ్వరం చ
హృత్కుక్షిపార్శ్వాంసశిరోరుజం చ. 7
కరోతి జీర్ణే త్వధికం ప్రకోపం
భుక్తే మృదుత్వం సముపైతి యశ్చ,
వాతాత్సగుల్మో న చ తత్ర రూక్షం
కషాయతిక్తం కటు చోపశేతే. 8

వాతప్రకోపమున జనించిన గుల్మమున గ్రంథిరూపమైన గుల్మముండు స్థానంబును, దాని యాకృతియు, దానగల్గు బాధయు నొక నియమములేక యుండును. (అయ్యది నిల్కడ లేక యొకప్పుడు నాభియందును, ఇంకొకప్పుడు పార్శ్వముల యందును, మరి యొకప్పుడు వస్తియందును సంచరించు ననియు, ఆకారమున నియమము లేక ఒక సమయమున గుండ్రముగను, ఒక సమయమున నిడుపుగను, ఒక కాలమున సన్నగను, ఒకవేళ స్థూలముగను నుండు ననియు, దానగల్గుబాధ నియతి లేక ఒకప్పుడు తీవ్రముగను, మరియొకప్పుడు కొంచెము శాంతముగను ఉండు ననియు భావము.) మలము అపానవాతము బంధింపబడి వెడలకుండును. గొంతును నోరును ద్రవములేక యెండును. శరీరము శ్యామవర్ణముగనైనను, అరుణవర్ణంబుగనైన నుండును. చలితోగూడిన జ్వరమువచ్చును. హృదయమునందును కుక్షియందును ఇరుప్రక్కలయందును మూపుల యందును నొప్పి కల్గును. తలనొప్పి కల్గును. భుజింపబడిన యాహారము జీర్ణంబైనపుడు మిక్కిలి ప్రకోపమునొందును. భుజించినతోడనే కొంచెము శాంతినొందును. ఇట్టి లక్షణములు కల్గినది వాతగుల్మ మని చెప్పబడును. ఈ వ్యాధియందు రూక్షపదార్థములును కషాయ (వగరు) తిక్త (చేదు) కటు (కారము) రసములు గలపదార్థములు భుజింపబడినచో నీ వ్యాధి యధికముగ ప్రకోపించును. పైజెప్పిన పదార్థములు వాతమును వృద్ధినొందించునవి కావున దానంజేసి వ్యాధి బలమగు నని భావము. (వాతమునకు పైజెప్పబడినవి యనుపశయంబు లని యెరుంగునది.)

వాగ్భటులు "పిపీలికావ్యాప్త ఇవ గుల్మస్స్ఫురతి తుద్యతే" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౪౩) అని చెప్పియున్నారు. కావున నీవాతగుల్మమున చీమలువ్యాపించిన విధముగ పలువిధముల వదరుచు చెప్పశక్యముగాని బాధకల్గియుండు నని యెరుంగునది.

### పైత్తికగుల్మ కారణములు

కట్వమ్లతీక్ష్ణోష్ణవిదాహిరూక్ష
క్రోధాతిమద్యార్కహుతాశసేవా,
ఆమాభిఘాతో రుధిరం చ దుష్టం
పైత్తస్య గుల్మస్య నిమిత్తముక్తమ్. 9

కారము పులుపు గలపదార్థములనైనను, దీక్ష్ణంబులైన మిరియములు ఆవాలు మున్నగువానినైనను, గుణవీర్యములచే నుష్ణములైన పదార్థములనైనను, విదాహకరములగు వెదురుమోవులు మున్నగువానినైనను, జిడ్డులేనిపదార్థములనైనను విశేషముగ నుపయోగించుట, క్రోధము, మద్యమును విశేషముగ ద్రావుట, ఎండయందును నిప్పుసెగయందును చాలకాల ముండుట, పిత్తమున కల్గు విదగ్ధాజీర్ణముచే బీడింపబడుట, రక్తము చెరచు కారణములచే రక్తముచెడుట, ఈకారణములచేత పిత్తము ప్రకోపము నొంది గుల్మమును కల్గించును. ఇదియు పిత్తగుల్మమునకు నిమిత్తము.

### పైత్తికగుల్మ లక్షణములు

జ్వరః పిపాసా వదనాఙ్గరాగః
శూలం మహజ్జీర్యతి భోజనే చ,
స్వేదో విదాహః వ్రణవచ్చ గుల్మ
స్స్పర్శాసహః పైత్తికగుల్మరూపమ్. 10

జ్వరము, డప్పి, ముఖమునందును శరీరమునందును ఎఱ్ఱరంగుకల్గుట, భుజింపబడిన యాహారము జీర్ణమగు సమయమునందును భోజనముసేయు కాలమునందును శూలము మిక్కుటమగుట, శరీరముపై చెమటపట్టుట, మంట, గుల్మ ముండుప్రదేశమున తాకినచో పుండును తాకినట్లుండుట, ఈ లక్షణములు కల్గినది పిత్తమున జనించినగుల్మ మని యెరుంగునది.

### కఫజ-సాన్నిపాతికగుల్మ కారణములు

శీతం గురు స్నిగ్ధమచేష్టనం చ
సమ్పూరణం ప్రస్వపనం దివా చ,

గుల్మస్య హేతుః కఫసమ్భవస్య
సర్వస్తు దుష్టో నిచయాత్మకస్య. 11

శీతపదార్థములను గురుపదార్థములను జిడ్డుగల పదార్థములను విశేషముగ భుజించుట, పనులనేమియు సేయక నిశ్చేష్టముగ నుండుట, మితిమీరి పొట్టనిండ భుజించుట, పవటియందు నిదురపోవుట, ఈ కారణములచేత కఫము ప్రకోపమునొంది గుల్మమును కల్గించును. వాతాదులకు పైజెప్పినకారణము లన్నింటిచేత వాతపిత్తకఫములు మూడును ప్రకోపించి సాన్నిపాతికగుల్మమును కల్గించును.

## కఫజగుల్మ లక్షణము

స్తైమిత్యశీతజ్వరగాత్రసాద
హృల్లాసకాసారుచిగౌరవాణి,
శైత్యం రుగల్పా కఠినోన్నతత్వం
గుల్మస్య రూపాణి కఫాత్మకస్య. 12

కఫమున జనించిన గుల్మమునందు శరీరము నీళ్లచే తడిసినట్లు మొద్దుబారియుండును. చలిజ్వరము వచ్చును. శరీరము కృశించును. రొమ్ము అదరుచుట్లుండును. దగ్గువచ్చును. అరోచకము కల్గును. శరీరము బరువై యుండును. శరీరమెల్ల చల్లనై యుండును. నొప్పి కొంచెముగ నుండును. గ్రంథి కఠినమై యున్నతముగ నుండును.

## సంసర్గజగుల్మ లక్షణములు

నిమిత్తరూపాణ్యుపలభ్య గుల్మే
ద్విదోషజే దోషబలాఽబలం చ,
వ్యామిశ్రలిఙ్గానపరాంశ్చ గుల్మాం
స్త్రీనాది శేదౌషధకల్పనార్థమ్. 13

పైజెప్పిన వాతాది గుల్మకారణములలో రెండేసిదోషముల కారణముల సంసర్గమును, రెండేసిదోషముల లక్షణములను చక్కగ గమనించి రెండుదోషములచే బుట్టిన గుల్మమును దోషములయొక్క బలాబలమును గమనించి నిర్ణయించునది. (రెండేసిదోషముల లక్షణములు మిశ్రములుగ నున్నపుడు ఆయా లక్షణములచే వాతపిత్త, వాతకఫ, పిత్తకఫగుల్మములను నిర్ణయించవలె నని భావము.) అట్టి సంసర్గమున జనించినవ్యాధికి హేత్వాది విపరీతచికిత్సల నిర్ణయించుటకై కారణములను లక్షణములను చికిత్సాకల్పనమునకు నిర్ణయించుట యావశ్యక మని భావము. (అష్టవిధగుల్మపక్షమున నీమూడును చేర్చబడెను.)

### సాన్నిపాతికగుల్మలక్షణము

మహారుజం దాహపరీతమశ్మవత్
ఘనోన్నతం శీఘ్రవిపాకి దారుణమ్,
మనశ్శరీరాగ్ని బలాపహారిణం
త్రిదోషజం గుల్మమసాధ్యమాదిశేత్. 14

పైజెప్పిన మూడుదోషముల కారణములచేత త్రిదోషములును సమకాలమున సమములుగ ప్రకోపించి సాన్నిపాతికగుల్మమును కల్గించును. ఈవ్యాధియందు గుల్మపు గడ్డ తీవ్రమైన బాధకల్గి మంటతో గూడి రాయివలె మిక్కిలి కఠినమును ఉన్నతమునై శీఘ్రముగ పరిపక్వమగును. మిక్కిలి దారుణమైనది. మనస్సుయొక్కయు శరీరముయొక్కయు కాయాగ్నియొక్కయు బలమును బొత్తుగ నశింపజేయును. ఇట్టి త్రిదోషజ గుల్మము మిక్కిలి యసాధ్య మగును.

ఇచ్చట "శీఘ్రవిదాహిదారుణమ్" అను పాఠము కొన్నిప్రతులలో గానంబడుచున్నది. 'దాహపరీతం' అను విశేషణముచేతనే అర్థమగుచుండ మరల 'విదాహి' యనుట పునరుక్తముగాన పైజెప్పినపాఠము సమంజసముకాదు. వాగ్భటమునందు "సర్వజస్తీవ్రరుగ్దాహః శీఘ్రపాకీ ఘనోన్నతః. సోఽసాధ్యః" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౪౮.) అని యున్నది. కావున "శీఘ్రవిపాకి" యను పాఠమే సమంజసము.

సన్నిపాతమున జనించినగుల్మంబును నవీనముగ నున్నచో నొకవేళ చికిత్సాసాధ్య మగును. ఈయభిప్రాయమునే సుశ్రుతమున "సన్నిపాతోత్థితే గుల్మే త్రిదోషఘ్నో విధిర్హితః" (సుశ్రుత. ఉ. అ. ౪౨.) అని సూచించబడియున్నది.

### రక్తగుల్మనిదానసంప్రాప్తులు

నవప్రసూతాఽహితభోజనా యా
యా చామగర్భం విసృజేదృతౌ వా,
వాయుర్హి తస్యాః పరిగృహ్య రక్తం
కరోతి గుల్మం సరుజం సదాహమ్. 15

స్త్రీ ప్రసవించినకాలమునందు నపథ్యాహారాదుల జేసినను, గర్భము పరిపూర్ణముగాకముందు అకాలమున గర్భస్రావము గల్గినప్పుడును, ఋతుమతియైనప్పుడును, అపథ్యాహారము (వాతమును ప్రకోపింపజేయు నాహారము)ల సేవించినను వాతము మిక్కిలి ప్రకోపమునంది ప్రతిమాసమున బైట వెడలు ఋతురక్తమును నిరో

ధించి బైటవెడలనీయకుండును. అట్టిరక్తము నానాట సంచితమై గడ్డకట్టి గుల్మ రూపము దాల్చును. అట్టి గుల్మము తీవ్రమైన నొప్పియు కల్గియుండును.

### రక్తగుల్మలక్షణములు

పైత్తస్య లిఙ్గేన సమానలిఙ్గం
విశేషణం చాప్యపరం నిబోధ,
యస్స్పన్దతే పిణ్డిత ఏవ నాఙ్గై
చిరాత్సశూలస్సమగర్భలిఙ్గః,
స రౌధిరస్స్త్రీప్రభవ ఏకగుల్మో
మాసే వ్యతీతే దశమే చికిత్స్యః. 16

అట్టిరక్తగుల్మము పిత్తగుల్మమున జెప్పబడిన జ్వరము పిపాస మున్నగులక్షణములు గల్గియుండును. ఇంతియకాక క్రింద వివరింపబడు లక్షణములుకూడ విశేషముగ నుండును:—గర్భమునకు గల్గు చిహ్నములైన వేవిళ్లు మున్నగులక్షణములు కల్గి, గర్భము వలె నవయవచలనము లేక, నొప్పితో గూడి చిరకాలమునకు పిండముగనే చలించుచుండును. అట్టిరక్తగుల్మము స్త్రీలకు మాత్రము జనించును కాని పురుషుల కొకప్పుడును కలుగ బోదు. ఇట్టి రక్తగుల్మమునకు పదిమాసములు కడచినపిదప చికిత్స జేయవలెను.

రక్తగుల్మము వాతప్రకోపముచేత ఋతురక్తమున గల్గును. కావున రక్తము పిత్తమునకు సమానలక్షణ మగుటంజేసి వాతపిత్తసంసర్గమున గల్గులక్షణములు కల్గు నని యెరుంగునది. ఈవిషయమును వాగ్భటాచార్యులు ఇట్లు చెప్పిరి:—"క్రమేణ వాయుసంసర్గాత్పిత్తయోనితయా చ తత్, శోణితం కురుతే తస్యా వాతపిత్తోత్థ గుల్మజాన్, రుక్స్తంభ దాహాతీసార తృట్ జ్వరాదీనుపద్రవాన్, గర్భాశయే చ సుతరాం శూలం దుష్టాసృగాశ్రయే, యోన్యాశ్చ స్రావదౌర్గన్ధ్యం తోదస్పన్దన వేదనాః" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౫౦. ౫౩) తీవ్రమైన నొప్పి, రక్తము వెడలక స్తంభించుట, మంట, అతిసారము, దప్పి, జ్వరము, (ఇవిమున్నగు నుపద్రవములు వాతపిత్త సంసర్గమున గల్గునవి) దుష్టరక్తమున కాధారమైన గర్భాశయమున తీవ్రమైన శూలమును, యోనినుండి చెడ్డనీరు స్రవించుచు దుర్గంధముతో గూడి వేదనయు గల్గును.

ఈరక్తగుల్మము ఋతుశోణితమును ప్రధానము జేసి కల్గు ననియు, గర్భమునకు సమానలింగముగ నుండు ననియు చెప్పుటచేత ప్రతిమాసమునను ఋతుమతి కాగల యౌవనవతులగు స్త్రీలకు జనించును గాని పుష్పవతికాకుండు కన్యకను, ఏబది

వత్సరములకు పైబడిన వయసుకల్గి ఋతురక్తము క్షీణించి గర్భమగుటకు వలనుపడని వృద్ధ స్త్రీలకును కలుగ దనియు నెరుంగునది. మరియు:—"రక్తగుల్మే పురాణత్వం సుఖసాధ్యస్యలక్షణం" అని తంత్రాంతరవచనముచేత రక్తగుల్మము చాలకాలము గడచినచో సుఖసాధ్యమగు నని తలంచి యిచ్చట "మాసే వ్యతీతే దశమే చికిత్స్యః" అని చికిత్సకు కాలనియమము చేసెను. మరియు రక్తగుల్మమున పదిమాసములకు మునుపు రక్తము గర్భాశయమున జేరి లోపలనే యుండును; కావున నట్టికాలమున చికిత్స జేసినచో గర్భాశయమునకు అపాయము కల్గును. కావున పదిమాసములకు లోపల చికిత్స చేయ జనదు. పదునొకండవమాసము మొదలు జేసి రక్తము ఘనీభవించియుండును. కావున నట్టి సమయమున వాతహరములగు స్నేహనాదిచికిత్సల జేసినచో నిరపాయముగ నుండును. ఈ యభిప్రాయము నుంచుకొని మూలమున "మాసే వ్యతీతే దశమే చికిత్స్యః" అని కాలనియమమును చెప్పెను.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—"రక్తగుల్మము గర్భమునకు సమానములగు లక్షణముల గల్గియుండును కావున గర్భమా? లేక రక్తగుల్మమా? యని నిర్ణయింప వీలు లేకుండును; కావున ప్రసవమునకు నియమితకాలమైన పదియవమాసము కడచిన పిదప రోగనిశ్చయమును పూర్తిగ నెరింగి చికిత్స చేయవలె నని యభిప్రాయముతో చికిత్సకు కాలనియమ మేర్పరుపబడెను" అని కొందరు సిద్ధాంతము చేసెదరు. ఇయ్యది యుక్తి దూరము:-గర్భమున గల దౌహృదము, స్తనాగ్రనైల్యము, స్తన్యోత్పత్తి మున్నగు లక్షణములుకూడ రక్తగుల్మమున కానబడును కాని అంతమాత్రమున నీరెంటికి నభేద మని చెప్పజనదు. గర్భము కరచరణాది భేదముల చలనముతోగూడి యప్పుడప్పుడు బాధలేక కదలుచుండును. రక్తగుల్మము అవయవభేదములేకయే కేవలము పిండాకారమై నొప్పితో గూడి చిరకాలమునకు కదలుచుండును. గర్భమున గర్భము (కడుపు) నానాట వృద్ధి నొందును. రక్తగుల్మమున గుల్మము మాత్రము వృద్ధినొందును. ఇట్టి పరస్పరభేదములను పట్టి పదిమాసములకు మునుపు కూడ రోగనిర్ణయము చేయ సాధ్యమగును. ఈ భేదమునే వాగ్భటమున నిట్లు చెప్పిరి:—"నచాంగైర్గర్భవద్గుల్మః స్ఫురత్యపితు శూలవాన్, పిండీభూతస్సఏవాస్యాః కదాచిత్ స్పన్దతే చిరాత్. న చాస్యా వర్ధతే కుక్షిః గుల్మ ఏవతు వర్ధతే" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౫౪.) ఇంతియకాక చరకమున ప్రసవకాలనిర్ణయమును చెప్పునపుడు "తం స్త్రీప్రసూతే, సుచిరేణ గర్భం పుష్టో యదా వర్షగణైరపి స్యాత్" (చరక. శా. అ. ౨) అని చెప్పిరి. (గర్భము కొన్ని కారణములచేత చక్కగ వృద్ధినొందకుండునెడ పదిమాసములకు నిమ్మటకూడ ననేకవత్సరములకు క్రమముగ గర్భము వృద్ధినొంది యెన్ని సంవత్సరములకైన ప్రసవించు నని యర్థము.) ఈ ప్రమాణమునుబట్టి కొన్నివత్సరములకుకూడ కాల నియమములేక స్త్రీలు ప్రసవించెద రని

యేర్పడుచున్నది. ప్రకృతకాలమున ననుభవముకూడ కొన్నిచోట్ల స్త్రీలు మూడువత్సరములకు ప్రసవమగుట కాననగును. కావున రక్తగుల్మరోగనిశ్చయమునకై పదిమాసముల కాలనియమము చెప్పబడినది యని చెప్పుట యనాలోచితము.

### గుల్మసాధ్య లక్షణములు

సఞ్చితః క్రమశో గుల్మో మహావాస్తుపరిగ్రహః,
కృతమూలస్సిరానద్ధః యదా కూర్మ ఇవోత్థితః. 17
దౌర్బల్యారుచిహృల్లాసకాసచ్ఛర్ద్యరతి జ్వరైః,
తృష్ణాతన్ద్రాప్రతిశ్యాయైః యుజ్యతే స న సిధ్యతి. 18
గృహీత్వా సజ్వరం శ్వాసచ్ఛర్ద్యతీసారపీడితమ్,
హృన్నాభిహస్తపాదేషు శోథః కర్షతి గుల్మినమ్. 19
శ్వాసశ్శూలం పిపాసాన్న విద్వేషో గ్రన్థిమూఢతా,
జాయన్తే దుర్బలత్వం చ గుల్మినో మరణాయవై. 20

పైజెప్పఁబడిన గుల్మములలో నెద్దియైనను నానాట వృద్ధినొంది యుదరమునందంతట వ్యాపించి రూఢమూలమై సిరలచే నావరింపబడి తాబేలువలె గట్టిపడి బలహీనము, అరోచకము, ఓకరింతలు, దగ్గు, వాంతి, పనులయందు నిరుత్సాహము, జ్వరము, దప్పి, మైకము, పడిసెము అను నుపద్రవముల గూడియున్నచో నయ్యది యసాధ్యమగును. మరియు జ్వరము, శ్వాసము, వమనము, అతిసారము, రొమ్మునందును నాభిస్థానమునను కాలుసేతులయందును వాపు అను నీయుపద్రవములు కల్గినయెడ గుల్మవ్యాధిపీడితుని మృతినొందించును. శ్వాసము, తీవ్రమైననొప్పి, దప్పి, అన్నద్వేషము, గుల్మరూపమైన గ్రంథి కానంబడక కదలకుండుట, బలహీనము అను నీలక్షణములు కల గుల్మము రోగిని మరణము నొందించును. (పైజెప్పబడిన మూడువిధములైన లక్షణములుకల గుల్మరోగము అసాధ్యంబని భావము.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
గుల్మనిదానం సమాప్తమ్.

# ౨౯. హృద్రోగనిదానమ్

హృద్రోగము గుల్మమునుబోలె హృదయమున జనించునది కావున గుల్మమును జెప్పినవిధమ హృద్రోగనిదానమును జెప్పుట:...

అత్యుష్ణగుర్వన్న కషాయతిక్తశ్రమాభిఘాతాధ్యశనప్రసఙ్గైః,
సఞ్చిన్తనైర్వేగవిధారణైశ్చ హృదయః పఞ్చవిధః ప్రదిష్టః. 1

మిక్కిలి యుష్ణగుణముగల పదార్థములను అజీర్ణకరములగు నన్నపానములను, కషాయతిక్తరసముకల పదార్థములను సేవించుటచేతను, దేహపరిశ్రమము చేతను, అభిఘాతముచేతను, భుజింపబడినయన్నము జీర్ణముగాకుండునపుడు మరల భుజించుటచేతను, విశేషముగ స్త్రీసంభోగముచేయుట, విశేషముగ మనస్సున యోచించుట, మలమూత్రవాతాదివేగముల నిరోధించుట, ఇట్టికారణములచేతను హృద్రోగము జనించును. ఇయ్యది వాత-పిత్త-కఫ-సన్నిపాత-క్రిములచే జనించుటవలన నైదువిధములగు నని యెరుంగునది.

## హృద్రోగసంప్రాప్తి

దూషయిత్వా రసం దోషాః విగుణా హృదయం గతాః,
హృది బాధాం ప్రకుర్వన్తి హృద్రోగం తం ప్రచక్షతే. 2

పై జెప్పినకారణములచేత వాత-పిత్త-కఫములు ప్రకోపమునొంది భుజించిన యాహారరసమును దుష్టముగజేసి హృదయమున బాధకల్గించును. ఇయ్యది హృద్రోగమని చెప్పబడును.

## వాతజహృద్రోగలక్షణము

ఆయమ్యతే మారుతజే హృదయం తుద్యతే తథా,
నిర్మథ్యతే దీర్యతే చ స్ఫోట్యతే పాట్యతేఽపి చ. 3

వాతప్రకోపమున కల్గినహృద్రోగమున హృదయమును లాగినట్టుండును. సూదుల గ్రుచ్చినవిధముగ పోటుపుట్టును. పిడిసానపట్టినవిధముగ లేక చిలికినట్లు వేదనకల్గును. చీల్చినట్లును, రంపముచే కోసినట్లును, గొడ్డలిచే పగులదీసినవిధముగను బాధకల్గును.

### పైత్తికహృద్రోగ లక్షణము

తృష్ణోష్ణదాహచోషాస్స్యుః పైత్తికే హృదయక్లమః,
ధూమాయనం చ మూర్ఛా చ స్వేదశ్శోషో ముఖస్య చ. 4

పిత్తప్రకోపమున జనించిన హృద్రోగమునందు దప్పియు,శరీరముపై వేడియును, మంటయు కల్గును. ద్రవము శుష్కించును. హృదయమున కలతనొంది బడలిక కల్గును. పొగవెడలునట్లుండును. మూర్ఛగ్రమ్మును. చెమటపట్టును. నోటద్రవములేక యెండును.

### కఫజహృద్రోగ లక్షణము

గౌరవం కఫసంస్రావో రుచి స్తమ్భోఽగ్నిమార్దవమ్,
మాధుర్యమపి చాస్యస్య బలాసావతతే హృది. 5

కఫము ప్రకోపించి జనించిన హృద్రోగమున రొమ్ము బరువుగ నుండును. నోటివెంట కఫముగారును. ఆహారము రుచింపదు. శరీరము స్తంభించును. కాయాగ్ని మందగించును. నోరు తీపిగల్గియుండును.

### సాన్నిపాతిక-క్రిమిజ హృద్రోగ లక్షణములు

విద్యాత్త్రిదోషం త్వపి సర్వలిఙ్గం
తీవ్రార్తితోదం; క్రిమిజం సకణ్డుమ్,
ఉత్క్లేదః ష్ఠీవనం తోదః శూలం హృల్లాసక స్తమః
అరుచిశ్శ్యావనేత్రత్వం శోథశ్చ క్రిమిజే భవేత్. 6

వాతపిత్తకఫములు మూడును సమములుగ ప్రకోపించుటచే గల్గినసన్నిపాత హృద్రోగమునందు వాతాదులు వేరువేర జెప్పినలక్షణము లన్నియు కలిగియుండును. బాధ మిక్కిలి తీవ్రమై సూదులబొడిచిన విధముగ పోటును కల్గియుండును. క్రిములచే గల్గిన హృద్రోగమున దురద విశేషముగ నుండును, నోట నీరూరును. నోట నుమ్మివచ్చుచుండును. పోటును నొప్పియు కల్గును. రొమ్మదరునట్లుండును. మైకము గ్రమ్మును. అరోచకము కల్గును. కన్నులు నల్లపడును. వాపు పుట్టును.

క్రిమిజహృద్రోగసంప్రాప్తి చరకమున నిట్లు చెప్పబడెను:— "త్రిదోషజేతు హృద్రోగే యో దురాత్మా నిషేవతే, తిలక్షీరగుడాదీని గ్రన్థిస్తస్యోపజాయతే, మర్మైకదేశే సంక్లేదం రసశ్చాస్యోపగచ్ఛతి, సంక్లేదాత్క్రిమయశ్చాస్య భవన్త్యుపహతాత్మనః" (చరక. సూత్ర. అ. ౧౭. శ్లో. ౩౭. ౩౮.) (సన్నిపాతమున గల్గిన హృద్రోగమునందు రోగి మనస్సు నిలుపజాలక చపలచిత్తుడై నువ్వులు పాలు బెల్లము

మున్నగు నపథ్యముల సేవించినయెడ హృదయమర్మమునం దొకచోట గ్రంథి జనించును. అచ్చట చెమ్మకల్గి రస మక్కడకు చేరును. అట్టిద్రవము కల గ్రంథియందు సూక్ష్మరూపములగు పురుగులు పుట్టును. దానంజేసి దురద మున్నగుబాధలు కల్గినచో నయ్యది క్రిమిజహృద్రోగము) పైవాక్యమునుబట్టి సాన్నిపాతికహృద్రోగమునం దపథ్యాహారముల జేసినయెడ గ్రంథియు క్రిములును బుట్టి దానివలన క్రిమిజ హృద్రోగము కల్గు నని తెలియుచున్నది.

## హృద్రోగోపద్రవములు

క్లమస్సాదో భ్రమశ్శోషో జ్ఞేయా స్తేషాముపద్రవాః,
క్రిమిజే క్రిమిజాతీనాం శ్లైష్మికాణాం చ యే మతాః. 7

బడలిక, కృశత్వము, భ్రమము, శోషము ఇవి హృద్రోగమున గల్గు నుపద్రవములు. క్రిమిజహృద్రోగమునందు కఫమున కల్గిన క్రిమివ్యాధికి జెప్పిన యుపద్రవములెల్ల కల్గును. (అయ్యవి హృల్లాసము, నోట నీరుకారుట, ఆహారము జీర్ణము కాకుండుట, అరోచకము, మూర్ఛ, వమనము, జ్వరము, కడుపుబ్బరము కృశత్వము, తుమ్ముట, పడిసెము ఇవి యగును.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
హృద్రోగనిదానం సమాప్తమ్.

# ౩౦. మూత్రకృచ్ఛ్రనిదానమ్

సుశ్రుతాచార్యుండు మర్మముల పరిగణనము సేయునపుడు "సప్తోత్తరం మర్మ శతమ్" అని నూటయేడు మర్మముల గణనము జేసి అందు సద్యః ప్రాణహరమర్మముల జెప్పునపుడు "హృదయం వస్తి నాభీ చ" అని హృదయమర్మమును వస్తిమర్మమును జెప్పియున్నాడు. కావున హృదయమర్మమునకు సంబంధించిన హృద్రోగమును జెప్పిన పిదప దాని సమానబలము కల వస్తిమర్మమునకు సంబంధించిన మూత్రకృచ్ఛ్రనిదానము చెప్పబడెను:

## మూత్రకృచ్ఛ్రకారణములు, సంఖ్య

వ్యాయామతీక్ష్ణౌషధరూక్షమద్య
ప్రసఙ్గనిత్యద్రుతపృష్ఠయానాత్,
ఆనూపమాంసాధ్యశనాదజీర్ణా
త్స్యుర్మూత్రకృచ్ఛ్రాణి నృణాం తథాష్టౌ. 1

దేహపరిశ్రమము నధికముగ జేయుట, తీక్ష్ణంబులైన యౌషధములను రూక్షమగు మద్యమును సేవించుట, అధికముగ స్త్రీసంభోగము జేయుట, గుఱ్ఱములు ఏనుగులు మున్నగువాహనములపై కూర్చొని అధికముగ సవారిచేయుట, జలప్రాంతమున నుండు జంతువుల మాంసమును భుజించుట, భుజించినతోడనే మరల భుజించుట, జీర్ణముకాని వస్తువుల భుజించుట, ఇట్టికారణములచేత మనుజులకు మూత్రకృచ్ఛ్రము జనించును. ఈవ్యాధి వాత-పిత్త-కఫ-సన్నిపాతములచే జనించుటంజేసి నాల్గువిధంబులును, శల్యపురీష శుక్ర అశ్మరులచే జనించు నని నాల్గును, అన్నియు కలసి యెనిమిది విధము లగును.

## మూత్రకృచ్ఛ్రసంప్రాప్తి

పృథఙ్మలాస్స్వైః కుపితా నిదానైః
సర్వేఽథ వా కోపముపేత్య వస్తౌ,
మూత్రస్య మార్గం పరిపీడయన్తి
యదా తదా మూత్రయతీహ కృచ్ఛ్రాత్. 2

వాతపిత్తకఫములు వేరువేరుగ నైనను అన్నియు నొక్కతరి కలిపియైనను, వాని వానికారణములచే మిక్కిలి ప్రకోపమునొంది, వస్తి (మూత్రకోశము) యందు జేరి మూత్రము బైట వెడలుమార్గమును మిక్కిలి బాధనొంది (అడ్డగిం)చును. అట్టిసమయమున మనుజుడు మిక్కిలి కష్టముచేత మూత్రమును బైట వెడలించును. ఇయ్యది మూత్రము కష్టముగ వెడలుటంజేసి మూత్రకృచ్ఛ్రమని యన్వర్థముగ జెప్పబడును.

## వాతాదిజనితమూత్రకృచ్ఛ్రలక్షణములు

తీవ్రార్తిరుగ్వఙ్క్షణవస్తిమేఢ్రే
స్వల్పం ముహుర్మూత్రయతీహ వాతాత్,
పీతం సరక్తం సరుజం సదాహం
కృచ్ఛ్రం ముహుర్మూత్రయతీహ పిత్తాత్. 3
వస్తేస్సలిఙ్గస్య గురుత్వశోథా
మూత్రం సపిచ్ఛం కఫమూత్రకృచ్ఛ్రే,
సర్వాణి రూపాణి తు సన్నిపాతాత్
భవన్తి తత్కృచ్ఛ్రతమం హి కృచ్ఛ్రమ్. 4

వాతప్రకోపమున గల్గిన మూత్రకృచ్ఛ్రమునందు వస్తియందును, గెజ్జలయందును, గుహ్యమునందును మిక్కిలి తీవ్రమైన నొప్పియు పోటును కల్గి మూత్రమును మాటిమాటికి విసర్జించును. పిత్తమున కల్గిన మూత్రకృచ్ఛ్రమున పచ్చని రంగుకలిగి రక్తముతోకూడిన మూత్రము మిక్కిలి మంటతోడను నొప్పితోడను కూడినట్లు మిక్కిలి కష్టముగ మాటిమాటికి విసర్జించును. కఫమున జనించిన మూత్రకృచ్ఛ్రమునందు వస్తియు మేఢ్రమును మిక్కిలి బరువై వాపు కల్గియుండును. మూత్రము చిక్కనై కలకబారి వెడలును. త్రిదోషసన్నిపాతమున గల్గిన మూత్రకృచ్ఛ్రమున త్రిదోషములకును వేరువేర చెప్పబడిన లక్షణములన్నియు మిశ్రముగ గలసియుండును. ఇయ్యది మిక్కిలి కష్టసాధ్యముగ నుండును.

## శల్యజమూత్రకృచ్ఛ్రలక్షణము

మూత్రవాహిషు శల్యేన క్షతేష్వభిహతేషు వా,
మూత్రకృచ్ఛ్రం తదాఘాతాజ్జాయతే భృశదారుణమ్. 5
వాతకృచ్ఛ్రేణ తుల్యాని తస్య లింగాని నిర్దిశేత్,

మూత్రమును వహించు రెండు స్రోతస్సులమార్గమున ముల్లు మొదలగు శల్యములుజేరి పుండై మూత్రమార్గమును నిరోధించినను, అట్టిశల్యములచే నభిఘాతము కల్గినను, మిక్కిలి క్రూరమైన మూత్రకృచ్ఛ్రము కల్గును. ఈ కృచ్ఛ్రమునందు వాతిక మూత్రకృచ్ఛ్రమున జెప్పినలక్షణములు కల్గును.

మూత్రవహస్రోతస్సులస్వరూపము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"మూత్రవహేద్వే; తయోర్మూలం వస్తిర్మేఢ్రం చ. తత్ర విద్ధస్య ఆనద్ధవస్తితా, మూత్రనిరోధః, స్తబ్ధమేఢ్రతా చ." (మూత్రమును వహించు స్రోతస్సులు రెండు. ఈ రెంటికిని వస్తియు మేఢ్రమును మూలము. వీనికి శల్యాదులచే నభిఘాతము కల్గినయెడ వస్తి యుబ్బును. మూత్ర మడ్డగింపబడును. మేహనము స్తంభించియుండును.)

### పురీషజమూత్రకృచ్ఛ్రలక్షణము

శకృతస్తు ప్రతీఘాతాత్ వాయుర్విగుణతాం గతః. 6
ఆధ్మానం వాతశూలం చ మూత్రసఙ్గం కరోతి చ,

మలమును వేగము కల్గినపుడు విసర్జించక యడ్డుపరచినప్పుడు వాతము ప్రకోపమునొంది కడుపుబ్బరమును, వాతముచే నొప్పిని కల్గించి మూత్రమును నిరోధించును. ఇయ్యది మలనిరోధమున గల్గుటంజేసి పురీషజమూత్రకృచ్ఛ్ర మని చెప్పబడును.

### అశ్మరీజమూత్రకృచ్ఛ్రలక్షణము

అశ్మరీహేతు తత్పూర్వం మూత్రకృచ్ఛ్రముదాహరేత్. 7

* అశ్మరీరోగమునకు ముందు దానికి హేతువైన మూత్రనిరోధము కల్గినయ్యది అశ్మరీజమూత్రకృచ్ఛ్ర మనబడును. (అశ్మరి యను మూత్రమున జనించు రాయి మూత్రనాళమున కడ్డుపడి మూత్రమును రానియ్యక ఆపినచో పిమ్మట మిగుల కష్టముచేత ముందురాయి బైటవెడలి పిమ్మట మూత్రము మిక్కిలి బాధతో వెడలును. ఇయ్యది అశ్మరీజమూత్రకృచ్ఛ్ర మని యెరుంగునది.)

### శుక్రజమూత్రకృచ్ఛ్రలక్షణము

శుక్రే దోషైరుపహతే మూత్రమార్గే విధావితే,
సశుక్రం మూత్రయేత్కృచ్ఛ్రాద్వస్తిమేహనశూలవాన్. 8

శుక్రము వాతపిత్తకఫములచే దుష్టమయి తనస్థానమును వదలి మూత్రమార్గమున జేరి మూత్రముతో గలిసి మిక్కిలి కష్టముచే వెడలును. దీనివలన మూత్రము వెడలునపుడు వస్తియందును మేఢ్రమునందును నొప్పికల్గును ఇది శుక్రజమూత్రకృచ్ఛ్రము.

---

*అశ్మరీరోగము కారణముగా గల్గిన మూత్రకృచ్ఛ్రము అశ్మరీమూత్రకృచ్ఛ్ర మనబడు నని యర్థము చెప్పుట సమంజసమై యుండును.

### అశ్మరీశర్కరభేదము

అశ్మరీ శర్కరా చైవ తుల్యసమ్భవలక్షణే,
విశేషణం శర్కరాయాః శృణు కీర్తయతో మమ. 9
పచ్యమానాశ్మరీ పిత్తాత్ శోష్యమాణా చ వాయునా,
విముక్తకఫసన్ధానా క్షరన్తీ శర్కరా మతా. 10
హృత్పీడా వేపథుశ్శూలం కుక్షావగ్నిశ్చ దుర్బలః,
తయా భవతి మూర్ఛా చ మూత్రకృచ్ఛ్రం చ దారుణమ్. 11
మూత్రవేగనిరస్తాభిః ప్రశమం యాతి వేదనా,
యావదస్యాః పునర్నైతి గుటికా స్రోతసో ముఖమ్. 12

(వాతము ప్రకోపించి వస్తియందలి శుక్ర - మూత్ర-పిత్త - కఫములలో నొక దానిని శోషింపజేసినచో నయ్యది ఆవులకు గోరోచనపు గడ్డవలె నుండగట్టి కఠినమై యుండును. ఇదియే అశ్మరి యనబడును. అట్టి యశ్మరియే వాతవేగముచేత తునియలైనయెడ శర్కర యనబడును.) అట్టి అశ్మరి శర్కరలు రెండును ఒక చోటనేపుట్టి యొక్కటే విధమైన లక్షణములు కల్గియున్నను అందులో శర్కర యనుదానికి కొన్ని విశేషలక్షణములు కలవు. ఎట్టు లన:—పై జెప్పినప్రకారము పుట్టిన అశ్మరి తొలుతనే పిత్తముచే పక్వమగుచు వాతముచే శోషింపబడి కఫము సంబంధించ కుండుటంజేసి యుండవలె నుండక నిసుకవలె తునియలుగ నగును. ఇదియే శర్కర యనబడును. దీనియందు రొమ్మునొప్పియు, కంపంబును, కుక్షియందు శూలనొప్పియు, జఠరాగ్ని బలక్షీణంబును కలుగును. మూర్ఛవచ్చును. మిక్కిలి తీవ్రమైన మూత్రకృచ్ఛ్రము కలుగును. అట్టి శర్కర మూత్రమార్గము నడ్డగించినపుడు పై జెప్పిన బాధలు కల్గును. మూత్రవేగముచేత శర్కర బైట వెడలినచో మరల నింకొకటి యడ్డపడునందాక బాధలు కొంచెము శమించియుండును. మరల శర్కరతునియ మూత్రద్వారము నడ్డగించినపుడు యథాప్రకారముగ బాధ జనించును. ఇదియే శర్కర అశ్మరుల పరస్పర భేదము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
మూత్రకృచ్ఛ్రనిదానం సమాప్తమ్.

# ౩౧. మూత్రాఘాతనిదానమ్

మూత్రకృచ్ఛ్రమువలె మూత్రాఘాతంబును మూత్రమునకు జేరిన వ్యాధి యగుటంజేసి మూత్రకృచ్ఛ్రమునకు పిమ్మట మూత్రాఘాతమును జెప్పుట.—

## మూత్రాఘాతకారణంబులు - సంప్రాప్తియు

జాయన్తే కుపితైర్దోషైః మూత్రాఘాతాస్త్రయోదశ,
ప్రాయో మూత్రవిఘాతాద్యైః వాతకుణ్డలికాదయః. 1

మలమూత్రశుక్రవాతాదులయొక్క వేగమును నిరోధించుటచే వాతపిత్తకఫములు ప్రకుపితములై వాతకుండలిక మున్నగు మూత్రాఘాతముల పదుమూటిని కల్గించును.

(మూత్రకృచ్ఛ్రమునందును మూత్రాఘాతమునందును లక్షణములు సమానములుగ నుండును; అయినను మూత్రకచ్ఛ్రమున మూత్రబంధము కొంచెముగ నుండి బాధలు మిక్కిలి తీవ్రముగ నుండు ననియు, మూత్రాఘాతమున మూత్రము బాధలు స్వల్పముగ నుండి మూత్రబంధము మాత్ర మధికముగ నుండు ననియు నీ రెంటికి పరస్పరభేదము నెరుంగునది.)

## వాతకుండలికాలక్షణము

రౌక్ష్యాద్వేగవిఘాతాద్వా వాయుర్బస్తౌ సవేదనః,
మూత్రమావిశ్య చరతి విగుణః కుణ్డలీకృతః. 2
మూత్రమల్పాల్పమథవా సరుజం సమ్ప్రవర్తతే,
వాతకుణ్డలికాం తాన్తు వ్యాధిం విద్యాత్సుదారుణమ్. 3

మిక్కిలి రూక్షములైన (జిడ్డులేని) పదార్థముల భుజించుటచే నైనను, మల-మూత్ర-వాత-శుక్రములయొక్క వేగమును నిరోధించుటచే నైనను, వస్తియందలి వాతము ప్రకోపమునొంది మూత్రమునజేరి యనులోమమై వేదన పుట్టించును. సుడిగాలివలె మండలాకారముగ వస్తియందు సంచరించుచుండును. దానజేసి మూత్రము కొంచెము కొంచెముగ నైనను నొప్పితో గూడియైనను బైట వెడలును. ఇయ్యది వాతకుండలి యను క్రూరవ్యాధి యని యెరుంగునది.

### అష్ఠీలాలక్షణము

ఆధ్మాపయన్వస్తిగుదం రుద్ధ్వా వాయుశ్చలోన్నతమ్,
కుర్యాత్తీవ్రార్తిమష్ఠీలాం మూత్రవిణ్మార్గరోధినీమ్. 4

వాతము ప్రకోపించి వస్తియొక్కయు గుదముయొక్కయు మార్గము నడ్డగించు నష్ఠీలయను మూత్రసంబంధమైన రాయిని కల్గించును. అయ్యది చలించుచు నున్నతంబై తీవ్రమైనబాధ గల్గించును. అయ్యది యడ్డపడి మలమూత్రముల వెడలనీయక నిరోధించును. (ఈయష్ఠీల యనునదియు నశ్మరిబోలె మూత్రముననే జనించును.)

### వాతవస్తి లక్షణము

వేగం విధారయేద్యస్తు మూత్రస్యాఽకుశలో నరః,
నిరుణద్ధి ముఖం తస్య వస్తేర్వస్తిగతోఽనిలః. 5
మూత్రసఙ్గో భవేత్తేన వస్తికుక్షినిపీడితః,
వాతవస్తిస్స విజ్ఞేయో వ్యాధిః కృచ్ఛ్రప్రసాధనః. 6

మనుజుడు కొన్ని నిర్బంధకారణములచేత మూత్రమును దానివేగసమయమున విసర్జింపక యడ్డుపరచినచో వస్తియందలి వాతము ప్రకోపించి వస్తియొక్క ద్వారమును అడ్డగించును. దానివలన మూత్రము బైటరాక యుండును. వస్తియందును కుక్షియందును తీవ్రమైనబాధ కల్గును. ఇయ్యది వాతవస్తి యనువ్యాధి. మిక్కిలి కష్టసాధ్యముగ నుండును.

### మూత్రాతీతలక్షణము

చిరం ధారయతో మూత్రం త్వరయా న ప్రవర్తతే,
మేహమానస్య మన్దం వా మూత్రాతీతస్స ఉచ్యతే. 7

మూత్రవేగము కల్గినప్పుడు దానిని విసర్జింపక చాలకాలమువరకు బిగబట్టినచో మూత్రము సరళముగ శీఘ్రముగ వెడలక చాలకాలమునకు మెల్లమెల్లగ వెడలును. ఇయ్యది మూత్రాతీత మనబడును.

### మూత్రజఠరము

మూత్రస్య వేగేఽభిహతే తదుదావర్తహేతుకః,
అపానః కుపితో వాయుః ఉదరం పూరయేద్భృశమ్. 8

నాభేరధస్తాదాధ్మానం జనయే త్తీవ్ర వేదనమ్,
తన్మూత్ర జఠరం విద్యాదధోవ స్తినిరోధజమ్. 9

మూత్రముయొక్క వేగమున కభిఘాతము కల్గినయెడ వాతము విలోమముగ సంచరించును. దానివలన నపానవాతము ప్రకోపము నొంది యుదరమునెల్ల పూరించును. దానంజేసి నాభికి క్రిందిభాగము (క్రీగడుపు లేక పొత్తికడుపు)న నధికముగ నుబ్బరమును తీవ్రమైన బాధను కల్గించును. వస్తికి క్రిందిభాగ మడ్డగింపబడుటచే గలుగు దీనిని మూత్రజఠర మని వచించెదరు.

## మూత్రోత్సఙ్గలక్షణము

వస్తౌ వాప్యథవా నాలే మణౌ వా యస్య దేహినః,
మూత్రం ప్రవృత్తం సజ్జేత సరక్తం వా ప్రవాహతః. 10
స్రవేచ్ఛనైరల్పమల్పం సరుజం వాథ నీరుజమ్,
విగుణానిలజో వ్యాధిః స మూత్రోత్సఙ్గసంజ్ఞితః. 11

వస్తియందైనను, మూత్రనాళమునందైనను, లేక గుహ్యమున కగ్రభాగమున నున్న మణియందైనను మూత్రాశయమునుండి వెడలిన మూత్రము బంధింపబడి యున్నను; లేక బలాత్కారముగ ముక్కినప్పుడు రక్తముతోఁగూడి కొంచెము కొంచెముగ మెల్లమెల్లగ బాధయుండియో లేకయో వెడలినను, ఇయ్యది మూత్రోత్సంగ మని యెరుంగునది. ఈవ్యాధి వాతప్రకోపమున కల్గును.

## మూత్రక్షయలక్షణము

రూక్షస్య క్లాన్తదేహస్య వస్తిస్థౌ పిత్తమారుతౌ,
మూత్రక్షయం సరుగ్దాహం జనయేతాం తదాహ్వయమ్. 12

శరీరమునందలి జిడ్డు నశించి రూక్షశరీరము కలవానికిని, శరీరము కృశించిన వానికిని వస్తియందుండు పిత్తవాతములు రెండును ప్రకోపించి మూత్రమును క్షీణింప జేయును. దానంజేసి నొప్పియు మంటయు కల్గును. దీనిని మూత్రక్షయ మని వచించెదరు.

## మూత్రగ్రంథిలక్షణము

అన్తర్వస్తిముఖే వృద్ధః స్థిరోఽల్పస్సహసా భవేత్,
అశ్మరీతుల్యరుగ్గ్రన్థిః మూత్రగ్రన్థిస్స ఉచ్యతే. 13

వస్తియొక్క ముఖభాగమునకు లోప్రక్క వర్తులంబును కఠినంబును మిక్కిలి చిన్నదియు నగు గ్రంథి యతిశీఘ్రముగ జనించును. ఇయ్యది యశ్మరికి

సమానమైనబాధ కల్గియుండును. ఇది మూత్రద్వారమున జనించినది కావున మూత్ర గ్రంథి యని చెప్పబడును.

తంత్రాంతరమున దీనిలక్షణం బిట్లు కానంబడియెడు: "రక్తం వాతకఫాద్దుష్టం వస్తిద్వారే సుదారుణమ్, గ్రంథిం కుర్యాత్స కృచ్ఛ్రేణ సృజేన్మూత్రం తదావృతమ్. అశ్మరీసమమూలం తం రక్తగ్రంథిం ప్రచక్షతే." వాతకఫములు రక్తమును చెరిచి వస్తి యొక్క ద్వారమున మిక్కిలి దారుణమైన గ్రంథిని కల్గించును. అట్టిగ్రంథి మూత్ర మార్గము నడ్డగించియుండుటంజేసి మూత్రము మిక్కిలి కష్టముచేత వెడలును. ఇయ్యది యశ్మరిని బోలియుండును. రక్తము గ్రంథిరూపముగ నుండుటంజేసి యిది రక్తగ్రంథి యని చెప్పబడును. ఈ వ్యాధియందు రక్తము గ్రంథిరూపముగ నుండు ననియు, అశ్మరి యందు మూత్రశుక్రాదులు ఘనీభవించి యుండగనగు ననియు నీరెంటికిని పరస్పర భేదము నెరుంగునది.

### మూత్రశుక్రలక్షణము

మూత్రితస్య స్త్రియం యాతో వాయునా శుక్రముత్థితమ్,
స్థానాచ్చ్యుతం మూత్రయతః ప్రాక్పశ్చాద్వా ప్రవర్తతే. 14
భస్మోదకప్రతీకాశం మూత్రశుక్రం తదుచ్యతే,

మూత్రము వెడల వేగముకల్గియున్న సమయమున మూత్రమును విసర్జింపకయే స్త్రీలతో రతిసేయునెడ తనచోటినుండి చలించిన శుక్రము వాతముచేత ప్రేరితమై మూత్రమును విడుచునపుడు మూత్రమునకు ముందుగనైనను వెనుకనైనను బూది కలిపిన నీళ్లవలె వెడలును. ఇయ్యది మూత్రశుక్ర మని చెప్పబడును.

### ఉష్ణవాతలక్షణము

వ్యాయామాధ్వాతపైః పిత్తం వస్తిం ప్రాప్యానిలాన్వితమ్. 15
వస్తిం మేఢ్రం గుదం చైవ ప్రదహేత్స్రావయేదధః,
మూత్రం హారిద్రమథవా సరక్తం రక్తమేవ వా. 16
కృచ్ఛ్రాత్పునః పునర్జన్తోరుష్ణవాతం బ్రువన్తి తమ్,

దేహపరిశ్రమము నధికముగ జేసినను, అధికముగ త్రోవనడిచినను, అధికముగ నెండలో సంచరించినను పిత్తము ప్రకోపమునొంది వస్తియందు జేరి వాతముతో గూడి వస్తియందును గుహ్యమునందును గుదమునందును మంట బుట్టించి పచ్చనైన మూత్రమునైనను, లేక రక్తముతో గలిసిన మూత్రమునైనను, లేక కేవలము

రక్తమునైనను మూత్రమార్గమునుండి స్రవింపజేయును. అయ్యది మిక్కిలి కష్టముతో మాటిమాటికి కొంచెము కొంచెముగ వెడలును. ఇయ్యది యుష్ణవాత మని పిలువంబడును.

## మూత్రసాదలక్షణము

పిత్తం కఫో ద్వావపి వా సంహన్యేతేఽనిలేన చేత్. 17
కృచ్ఛ్రాన్మూత్రం తదా పీతం శ్వేతం రక్తం ఘనం సృజేత్,
సదాహం రోచనాశఙ్ఖచూర్ణవర్ణం భవేత్తు తత్. 18
శుష్కం సమస్తవర్ణం వా మూత్రసాదం వదన్తి తమ్,

పిత్తద్రవమైనను, కఫద్రవమైనను, లేక రెండును కలిసియైనను వాతముచే ఘనీభవించి వస్తియందు జేరినయెడ మూత్రము పచ్చగనైనను, తెల్లగనైనను, ఎఱ్ఱగనైనను, చిక్కనై మంటతోగూడి మిక్కిలి కష్టముతో వెడలును. అట్టి మూత్రమును విసర్జించిన పిదప భూమిపై నెండినచో గోరోచనవర్ణముగనైనను లేక, శంఖచూర్ణము వలెనైనను, లేక నానావర్ణములు కల్గియైన నుండును. దీనిని మూత్రసాద మని చెప్పెదరు.

## విడ్విఘాత లక్షణము

రూక్షదుర్బలయోర్వాతే నోదావర్తం శకృద్యదా. 19
మూత్రస్రోతోఽనుపద్యేత విట్సంసృష్టం తదా నరః,
విడ్గంధం మూత్రయేత్కృచ్ఛ్రాద్విడ్విఘాతం వినిర్దిశేత్. 20

శరీరము రూక్షమై బలహీనమైనవానికి వాతము ప్రకోపించి పక్వాశయమున నుండు మలమును విలోమముగ పైకి వ్యాపింపజేయును. అయ్యది మూత్రమార్గమున జేరును. అట్టియెడ మూత్రము మలముతోగూడి మలముతో సమానమైన దుర్గంధము కల్గి మిక్కిలి కష్టముగ వెడలును. ఇయ్యది విడ్విఘాత మను మూత్రాఘాతము.

## వస్తికుండలి లక్షణము

ద్రుతాధ్వలఙ్ఘనాయాసైరభిఘాతాత్ప్రపీడనాత్,
స్వస్థానాద్వస్తిరుద్వృత్తః స్థూలస్తిష్ఠతి గర్భవత్. 21
శూలస్పన్దనదాహార్తో బిన్దుం బిన్దుం స్రవత్యపి,
పీడితస్తు సృజేద్ధారాం సంస్తమ్భోద్వేష్టనార్తిమాన్. 22
వస్తికుణ్డలమాహుస్తం ఘోరం శస్త్రవిషోపమమ్,
పవనప్రబలం ప్రాయో దుర్నివారమబుద్ధిభిః. 23

తస్మిన్పిత్తాన్వితే దాహశ్శూలం మూత్రవివర్ణతా,
శ్లేష్మణా గౌరవం శోథః స్నిగ్ధం మూత్రం ఘనం సితమ్. 24

శీఘ్రముగ దారినడచినను, కాలువ మొదలగువానిని దాటినను, శరీరమునకు ఆయాసము కల్గించుపనుల జేసినను వస్తిప్రదేశమున నభిఘాతము కల్గినను, ఆట్టిస్థలమున పిసికికొనినను, మూత్రపుతిత్తి తనస్థానముదుండి పైకి వ్యాపించి గర్భమువలె స్థూలమై యుండును. అట్టియెడ వస్తిప్రదేశమున నొప్పియు పోటునుకలిగి అదరుచు మూత్రము బొట్టుబొట్టుగ కారును. అప్పుడు పొత్తికడుపును పిసికికొనినచో మూత్రము ధారగ వెడలును; కాని అపుడు వస్తిపట్టుకొని పొరలుచున్నట్లుండి నొప్పితోఁగూడి యుండును. ఇది వస్తికుండల మని చెప్పబడును. ఇయ్యది శస్త్రమును విషమునుబోలి మిక్కిలి క్రూరమై యుండును. ఈ వ్యాధియందు వాతము మిక్కిలి బలిష్ఠముగ నుండును. తెలివి తేట లేని వైద్యుల కనివార్యమగును. అయ్యది పిత్తముతోఁ గూడియుండునెడ మంటయు పోటును కల్గి మూత్రము వివర్ణముగ నుండును కఫమున జనించినచో బరువై వాపుకల్గి మూత్రము స్నిగ్ధంబును తెల్లనివర్ణంబును కల్గి చిక్కనై వెడలును.

## వస్తికుండల సాధ్యాసాధ్య లక్షణము

శ్లేష్మరుద్ధబిలో వస్తిః పిత్తోదీర్ణో న సిధ్యతి,
అవిభ్రాన్తబిలస్సాధ్యో న తు యః కుణ్డలీకృతః,
స్యాద్వస్తౌ కుణ్డలీభూతే తృణ్మోహశ్శ్వాస ఏవ చ. 25

పిత్త ముత్కటమై వస్తిరంధ్రము కఫముచే నడ్డగింపబడినయెడ నయ్యది నివర్తింపదు. వస్తిద్వారము అడ్డులేక వస్తి కుండలమువలె చుట్టుకొనక యుండినచో సాధ్యమగును. వస్తి కుండలమువలె చుట్టుకొనియున్నపుడు దప్పియు మూర్ఛయు శ్వాసమును కల్గును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
మూత్రాఘాతనిదానం సమాప్తమ్.

# ౩౨. అశ్మరీనిదానమ్

అశ్మరీవ్యాధి మూత్రాఘాతమువలెనే మూత్రమును నిరోధించి బాధలగల్గించు నది కావున మూత్రాఘాతమును జెప్పినపిదప నశ్మరీనిధానమును జెప్పుట.

## అశ్మరీకారణములు-సంఖ్య

వాతపిత్తకఫై స్తిస్రశ్చతుర్థీ శుక్రజాఽపరా,
ప్రాయః శ్లేష్మాశ్రయాస్సర్వా అశ్మర్యస్స్యుర్యమోపమాః. 1

అశ్మరి యనువ్యాధి వాతపిత్తకఫములచే వేర్వేరుగ జనించినది మూడువిధము లును, శుక్రమున జనించినదియు కలిసి నాల్గు విధము లగును. ఈనాల్గువిధములైన యశ్మరులయందును కఫము ప్రధానముగ రాజై యుండును. ప్రాయికముగ నీనాల్గును యమునిబోలె ప్రాణాంతకములై యుండును.

## అశ్మరీ సమ్ప్రాప్తి

విశోషయేద్వస్తిగతస్సశుక్రం
మూత్రం సపిత్తం పవనః కఫం వా,
యదా తదాశ్మర్యుపజాయతే తు
క్రమేణ పిత్తేష్వివ రోచనా గోః. 2

వాతము ప్రకోపమునొంది వస్తియందుజేరి (వస్తిద్వారము నడ్డగించి) శుక్ర ముతో గూడిన మూత్రమునైనను, ద్రవరూపమైన పిత్తముతో గూడిన మూత్రము నైనను, కఫముతోగూడిన మూత్రమునైనను, లేక కేవల మూత్రమునైనను శోషింప జేయును. అట్టి శోషింపబడిన మూత్రమున గోవుయొక్క పిత్తమున గోరోచనము కల్గు భంగి కఠినమై రాయివలెనుండు ఉండ పుట్టును. ఇయ్యది యశ్మరి యనబడును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:— వాతము వస్తిద్వారము నడ్డగించినపుడు కేవల మూత్రమునైనను, లేక పిత్తద్రవము - కఫద్రవము - శుక్రము అనువానిలో నొక్కొకదానితో గూడిన మూత్రమునైనను శోషింపజేసి యశ్మరిని కల్గించును. అందు కేవల మూత్రమున జనించినది మూత్రాశ్మరి యనియు, తక్కినవి మూడును క్రమముగ పిత్తాశ్మరి, కఫాశ్మరి, శుక్రాశ్మరి యనియు వరుసగ జెప్పబడును. ఈనాల్గును

వరుసగ నొకదానికన్న నొకటి క్రూరమై యుండును. అన్నిటియందును కఫము ప్రధానముగ నుండును. ఈ విషయమును వాగ్భటాచార్యు డి ట్లుపదేశించెను:—"యదా వాయుర్ముఖం వస్తేరావృత్య పరిశోషయేత్, మూత్రం సపిత్తం సకఫం సశుక్రం వా తదా క్రమాత్. సంజాయతేఽశ్మరీ ఘోరా పిత్తాద్గోరివ రోచనా, శ్లేష్మాశ్రయా చ సర్వా స్యాత్" (అ. హృ. ని. అ. ౯. శ్లో. ౬-౭) ఇచ్చట "క్రమాత్ సంజాయతే ఉశ్మరీఘోరా" అని చెప్పినందున నొకదానికన్న నొకటి క్రూరమైన దని తెలిసెడిని.

## అశ్మరీపూర్వరూపము

నైకదోషాశ్రయాస్సర్వాః; అథాసాం పూర్వలక్షణమ్,
వస్త్యాధ్మానం తదాసన్నదేశేషు పరితోఽతిరుక్. 3
మూత్రే బస్తసగన్ధత్వం మూత్రకృచ్ఛ్రం జ్వరోఽతిరుక్,

పైజెప్పిన యశ్మరీరోగములన్నియు త్రిదోషముల నాశ్రయించి జనించును. ఈ యశ్మరీవ్యాధి జనించుటకు మున్ను వస్తియుబ్బును. ఆ యశ్మరికి సమీపమున దానికి చుట్టును మిక్కిలి నొప్పికల్గును. మూత్రము గొఱ్ఱెలమూత్రముతో సమానమైన గంధము కల్గియుండును. మూత్రము మిక్కిలి కష్టముచే వెడలును. జ్వరమును అధికమైన బాధయు కల్గును. ఇయ్యవి యశ్మరీవ్యాధికి పూర్వరూపములు.

## అశ్మరీసామాన్యలక్షణములు

సామాన్యలిఙ్గం రుఙ్నాభిసేవనీవస్తిమూర్ధసు. 4
విశీర్ణధారం మూత్రం స్యాత్తయా మార్గే నిరోధితే,
తద్వ్యపాయాత్సుఖం మేహేదచ్ఛం గోమేధకోపమమ్. 5
తత్సంక్షోభాత్ క్షతే సాస్రమాయాసాచ్చాతిరుగ్భవేత్,

అశ్మరీవ్యాధు లన్నిటియందును నాభిస్థానము, సేవని యను గుహ్యమునందలి కుట్టువంటిభాగము, వస్తియగ్రభాగము అను నీప్రదేశములయందు మిక్కిలి బాధ కల్గును. అశ్మరి మూత్రమార్గము నడ్డగించినపుడు మూత్రము ధారగ వెడలక చీలికలై వెడలును. అయ్యది మూత్రమార్గమునుండి జారిపడినపుడు సుఖముగ గోమేధకమణివలె స్వచ్ఛముగ మూత్రము వెడలును. అశ్మరియొక్క సమ్మర్దముచేత వస్తియందు పుండైనపుడు రక్తముతోగూడి ప్రయాసమువలన మిక్కిలి బాధ కల్గును.

సుశ్రుతమున సేవనీ వివరణమున—"సప్తసేవన్యః,.........జిహ్వా శేఫ సోశే కైకా" అని గుహ్యమునందలి సేవనిని చెప్పియున్నారు.

## వాతజాశ్మరీలక్షణము

తత్ర వాతాద్భృశం చార్తో దన్తాన్ఖాదతి వేపతే. 6
గృహ్ణాతి మేహనం నాభిం పీడయత్యనిశం క్వణన్,
సానిలం ముఞ్చతి శకృత్ ముహుర్మేహతి బిన్దుశః. 7
శ్యావాఽరుణాశ్మరీ చాస్య స్యాచ్చి తాకణ్టకై రివ,

వాతాధికమైన యశ్మరియందు మూత్రమును విసర్జించునపుడు మిక్కిలి బాధ కల్గి యోరువలేక పండ్లు కొరుకును. వడవడ వణకును. గుహ్యమును చేతబట్టికొనును. ఎల్లప్పుడును బాధ కోరువజాలక బొడ్డుదగ్గిర చేత పిసికికొనుచు నరచుచుండును. అపాన వాతముతోగూడ మలమును విసర్జించును. మాటిమాటికిని బొట్టుబొట్టుగ మూత్రమును విడచును. అశ్మరి నీలవర్ణంబును అరుణవర్ణంబునై ముండ్లు గ్రుచ్చినవిధముగ బాధ కల్గి యుండును.

## పిత్తజాశ్మరీలక్షణము

పిత్తేన దహ్యతే వస్తిః పచ్యమాన ఇవోష్మవాన్. 8
భల్లాతకాస్థిసంస్థానా రక్తపీతాఽసితాశ్మరీ,

పిత్తమున జనించిన యశ్మరీవ్యాధియందు వస్తి నిప్పున కాల్చబడినవిధముగ వేడి కల్గి మంట బుట్టును. అశ్మరి రక్తవర్ణంబును, పీతవర్ణంబు, నీలవర్ణంబునై జీడిగింజలోపలి విత్తువలె నాకారము కల్గియుండును.

## కఫజాశ్మరీలక్షణము

వస్తిర్నిస్తుద్యత ఇవ శ్లేష్మణా శీతలో గురుః. 9
అశ్మరీ మహతి శ్లక్ష్ణామధువర్ణాఽథవా సితా,

కఫప్రకోపమున జనించిన యశ్మరియందు వస్తియందు సూదుల గ్రుచ్చినట్లు పోటు పుట్టును. చల్లనై బరువుగ నుండును. అశ్మరి మిక్కిలి గొప్పదియై నునుపుకల్గి తేనెవంటిరంగైనను తెల్లనిరంగైనను కల్గియుండును.

## బాలురకు జనించు అశ్మరీగుణము

ఏతా భవన్తి బాలానాం తేషామేవ చ భూయసా. 10
ఆశ్రయోపచయాల్పత్వాత్ గ్రహణాహరణే సుఖాః,

పైజెప్పబడిన వాత-పిత్త-కఫములచే వేరువేర గల్గు అశ్మరులు మూడును పసి వాండ్రకు తరుచుగ కల్గును పెద్దవాండ్రకు నొకసమయమున కలుగవచ్చును. పిల్ల వాండ్రకు అశ్మరి కాశ్రయమగు వస్తి మిక్కిలి చిన్నదిగ నుండుటవలనను, దానంజేసి మిక్కిలి వృద్ధినొందక స్వల్పముగ నుండుటచేతను దానిని గ్రహించుటకును శలాకలచే వెలికి దీయుటకును సులభముగ నుండును.

పసివాండ్ర కావ్యాధి కల్గుటకు కారణముల సుశ్రుతుం డిట్లు చెప్పెను:—"ప్రాయేణైతాస్తిస్రోఽశ్మర్యో దివాస్వప్న సమశనాధ్యశనశీతస్నిగ్ధ మధురాహార ప్రియత్వాద్విశేషేణ బాలానాం భవన్తి; తేషామేవాల్పవస్తి కాయత్వా దల్పమాంసోపచయాచ్చ వస్తేస్సుఖగ్రహణాఽఽహరణా భవన్తి" (సు. ని. అ. 3) పైజెప్పిన యశ్మరులు మూడును పిల్లవాండ్రు తరుచుగ పగటియందు నిదురించుటయందును, సమశనము (పథ్యాపథ్యములజేర్చి భుజించుట) నందును, అధ్యశనము (భుజించినతోడనే మరల భుజించుట) నందును, శీత - స్నిగ్ధ - మధురాహారములయందును మిక్కిలి ప్రీతి గల్గి వాని నలవాటున నుంచుకొనియుందురు కావున వారికి విశేషముగ కల్గుచుండును. వారికి శరీరంబును వస్తియు మిక్కిలి స్వల్పముగ నుండి శరీరమాంసము మిక్కుటముగ వృద్ధినొందక స్వల్పముగ నుండుటంజేసి అశ్మరిని పట్టుకొని శలాకచే వెలికిదీయుటకు మిక్కిలి సులభముగ నుండును.

### శుక్రాశ్మరీలక్షణము

శుక్రాశ్మరీ తు మహతాం జాయతే శుక్రధారణాత్. 11
స్థానాచ్చ్యుతమముక్తం హి ముష్కయోరన్తరేఽనిలః,
శోషయత్యుపసఙ్గృహ్య శుక్రం తచ్ఛుక్రమశ్మరీ. 12
వస్తిరుజాకృచ్ఛ్రమూత్రత్వముష్కశ్వయథుకారిణీ,
తస్యాముత్పన్నమాత్రాయాం శుక్రమేతి విలీయతే. 13
పీడితే త్వవకాశేఽస్మిన్................

పెద్దవారలకు శుక్రాశ్మరి కల్గును:—ఉద్రేకము కల్గినసమయమున శుక్రము స్వస్థానమునుండి చలించును. దానిని బైట విసర్జించకయున్నచో వాతము దానిని నిరోధించి వృషణముల మధ్యభాగమున నిల్పి శోషింపజేయును. అట్టిశుక్రము ఘనీభవించియుండవలె నేర్పడును. ఇదియే శుక్రాశ్మరి యనబడును. ఈవ్యాధియందు వస్తిలో పోటు పుట్టును. మూత్రము మిక్కిలి కష్టముచే వెడలును. అండములయందు వాపు పుట్టును. ఇయ్యది కల్గినతోడనే చేతితో మర్దనముచేసినచో శుక్రము బైటవెడలును, లేక శుక్ర మచ్చటనే కరగి యణగును.

### శర్కరాలక్షణము

................అశ్మర్యేవ తు శర్కరా,
అణుశో వాయునా భిన్నా; సా తస్మిన్ననులోమగే. 14
నిరేతి సహమూత్రేణ, ప్రతిలోమే నిరుధ్యతే,
మూత్రస్రోతః ప్రవృత్తా సా సక్తా కుర్యాదుపద్రవాన్. 15

దౌర్బల్యం సదనం కార్శ్యం కుక్షిశూలమథారుచిమ్,
పాణ్డుత్వముష్ణవాతం చ తృష్ణాం హృత్పీడనం వమిమ్. 16

పైజెప్పబడిన శుక్రాశ్మరి ప్రకోపమునొందిన వాతముచేత సన్న ముక్కలుగ భేదింపబడినయెడ నాయశ్మరియే శర్కర యనబడును. అట్టిశర్కర వాతము అనులోమముగ సంచరించునపుడు మూత్రముతో గలిసి వెలికి వచ్చును. వాతము ప్రతిలోమమైనపుడు బైటవెడలక యడ్డపడును. అట్లు లడ్డపడినయపుడు మూత్ర మార్గము నసే నిలచి దుర్బలత్వము, బడలిక, శరీరము కృశతనొందుట, కడుపులో శూల, అరుచి, శరీరము తెల్లబడుట, ఉష్ణవాతము, దప్పి, రొమ్మునొప్పి, వమనము అను నీయుపద్రవముల గల్గించును. (అట్టియశ్మరియే మిక్కిలి సన్నగ నిసుకవలె వాతప్రకోపముచేత భేదింపబడిననాడు అదియే సికత యనియు చెప్పబడును.)

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—కేవలము అశ్మరి యనునది మూత్రముతో గూడ ధారాళముగ నొకప్పుడైన బైట వెడలక మూత్రము నడ్డగించియే యుండును. శర్కర యనునది చిన్నముక్కలు కావున వాతము అనులోమ మగునపుడు మూత్రముతోగూడ బైట వెడలును. ప్రతిలోమముగ సంచరించుతరి వెడలక మూత్రము నడ్డుపరచును. కావున నీరెంటికి నిదియే పరస్పరభేదము. మరియు నశ్మరియందు దాని యాకార భేదంబును రంగుభేదంబును చెప్పబడినది. ఆకారభేదముచేత దాని కనుగుణమగు శలాకములచేత నాకర్షింప ననువుపడును. వర్ణభేదముచేత వాతపిత్తకఫభేదముల నిర్ణయించి యశ్మరివలనగల్గు వ్రణమునకు వాతాద్యనుగుణముగ చికిత్సచేయ ననుకూలమగును. కావున ఆకృతివర్ణభేదముల జెప్పినది నిష్ప్రయోజన మని యొకప్పుడును భ్రమింపవలదు.

## అసాధ్యశర్కరాశ్మరీలక్షణము

ప్రశూననాభివృషణం బద్ధమూత్ర రుజాయుతమ్,
అశ్మరీ క్షపయత్యాశు సికతా శర్కరాన్వితా. 17

అశ్మరీరోగమునందు నాభిస్థానమునందును, వృషణములయందును నెక్కువ వాపు కల్గినను, మూత్రము బంధింపబడి మిక్కిలి తీవ్రమైన నొప్పికల్గినను అశ్మరీరోగము అసాధ్యమగును. మరియు నయ్యది సికతతోడను శర్కరతోడను గూడిన నసాధ్యమగును. పైలక్షణములతోగూడిన యశ్మరి మనుజుని చంపును. కావున మిక్కిలి దుష్కరమగు నని భావము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అశ్మరీనిదానం సమాప్తమ్.

# ౩౩. ప్రమేహనిదానమ్

ప్రమేహంబును అశ్మరింబోలె వస్తియందు జనించునది కావున దేశసామ్యమును బట్టి యశ్మరీనిదానమును జెప్పినపిదప ప్రమేహనిదానమును జెప్పుట —

### ప్రమేహకారణములు

ఆస్యాసుఖం స్వప్నసుఖం దధీని గ్రామ్యౌదకానూపరసాః పయాంసి,
నవాన్నపానం గుడవైకృతం చ ప్రమేహహేతుఃకఫకృచ్చసర్వమ్.

పనులుచేయక యెల్లప్పుడును సుఖముగ కూర్చొనియుండుట, అధికముగ నిద్రాసుఖము ననుభవించుట, పెరుగును విశేషముగ నుపయోగించుట, గ్రామమున నుండు జంతువులయొక్కయు, జలమున నుండు జంతువులయొక్కయు, జలప్రాంతమున నుండు జంతువులయొక్కయు మాంసరసము నుపయోగించుట, పాలుద్రావుట, *నూతనములగు నన్నపానముల నుపయోగించుట, బెల్లముతో జేయబడిన భక్ష్యాదుల నుపయోగించుట, ఇవియన్నియు ప్రమేహము గల్గుటకు కారణములు. ఇవి గాక కఫమును వృద్ధి నొందించునవి యన్నియుగూడ ప్రమేహముల గల్గించును.

మరియు వాగ్భటాచార్యుడు "తేషాం మేదో మూత్రకఫావహమ్, అన్నపానక్రియాజాతం యత్ప్రాయస్తత్ప్రవర్తకమ్" (అ. హ. ని. అ. ౧౦. శ్లో. ౨) అని చెప్పియుండుటంజేసి మేదస్సును మూత్రమును కఫమును వృద్ధినందించు నన్నపానంబులును, నిద్రమున్నగు చేష్టారూపములగు వ్యాపారములును ప్రాయికముగ ప్రమేహముల గల్గించు నని తెలిపెడిని.

### ప్రమేహసంప్రాప్తి

మేదశ్చమాంసం చ శరీరజం చ క్లేదం కఫో వస్తిగతః ప్రదూష్య,
కరోతి మేహాన్;సముదీర్ణముష్ణైః తానేవ పిత్తం పరిదూష్య చాపి,
క్షీణేషు దోషేష్వపకృష్య ధాతూన్ సన్దూష్యమేహాన్ కురుతేఽనిలశ్చ. 2

కఫము ప్రకుపితమై వస్తియందు జేరి శరీరమునందలి మేదస్సును, మాంసమును, శరీరమునందలి జిడ్డుతోగూడి ద్రవరూపమైన†క్లేదమును చెరచి; మేహరోగ

---

* క్రొత్త బియ్యపన్నము బురదతో నుండు క్రొత్తనీరు అని భావము. † క్లేదమనగా శరీరమునకు లోపలిభాగమున నుండు నీరువంటి ద్రవము.

ముల గల్గించును. గుణవీర్యస్పర్శములచే నుష్ణంబులైన యన్నపానవిహారాదులచేత పిత్తము ప్రకుపితమై పైజెప్పిన మేదోమాంసక్లేదముల జెరచి ప్రమేహములగల్గించును. కఫము మున్నగు సౌమ్యధాతువులు క్షీణించినపుడు వాతము ప్రకుపితమై మాంస స్నేహరూపమగు వస, అస్థుల మధ్యనుండు స్నేహరూపమగు మజ్జ, శుక్రసారమైన యోజస్సు, చర్మాంతః సంచారియగు సస్నేహ జలరూపమగు లసీక అను గంభీరధాతువు లను కృశింపజేసి వస్తి సమీపస్థలమున కాకర్షించి ప్రమేహముల గల్గించును.

ఇచట నీవిమర్శము నెరుంగునది:—కఫము ప్రకుపితమై శరీరమునందలి మేద స్సును మాంసమును శరీరమునందలి క్లేదరూపమైన ద్రవమును చెరిచి ప్రమేహముల గల్గించును. ఇవి కఫప్రమేహములు. ఉష్ణపదార్థముల సేవించుటచే పిత్తము ప్రకుపితమై కఫము మున్నగు సౌమ్యధాతువులు క్షీణించినపుడు రక్తమును పైజెప్పిన మేదోమాంస క్లేదములనుకూడ జెరిచి ప్రమేహముల గల్గించును. ఇవి పిత్తప్రమేహములు. వాతము ప్రకుపితమై ధాతువులన్నిటిని చెరిచి వస్తిసమీపమున జేర్చి ప్రమేహముల గల్గించును. ఇవి వాతికప్రమేహములు. ఇచ్చట పిత్తప్రమేహములయందు "తానేవపిత్తం" అని మూలమునందున్నను "పిత్తం రక్తమపి క్షీణే కఫాదౌ మూత్రసంశ్రయం" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౫) అని వాగ్భటమున నుండుటంజేసి రక్తముకూడ దూష్యములలో జేరియుండు నని యెరుంగునది.

మరియు "ప్రమేహా వింశతిస్తత్ర శ్లేష్మతో దశ; పిత్తతః, షట్, చత్వారోఽనిలాత్" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౭) అని వాగ్భటమున పైజెప్పినప్రకారము కఫమున జనించు ప్రమేహములు పది యనియు, పిత్తమున జనించునవి యా రనియు, వాతమున జనించునవి నా ల్గనియు, అన్నియు గలిసి యిరువది ప్రమేహము లని యెరుంగునది.

## ప్రమేహసాధ్యాదివిభాగము

సాధ్యాః కఫోత్థా దశ, పిత్తజాష్షట్
యాప్యాః, న సాధ్యాః పవనాచ్చతుష్కాః,
సమక్రియత్వాత్ విషమక్రియత్వాత్
మహాత్యయత్వాచ్చ యథాక్రమం తే. 3

పైజెప్పిన ప్రమేహములలో కఫమున జనించిన పదియును సాధ్యములు. ఏల యన:—(కఫప్రమేహములకు మేదస్సును మాంసంబును శరీరక్లేదంబును దూష్యములు. కఫము దోషము. కటుతిక్తాదిపదార్థముల సేవించుటయు, అపతర్పణరూప చికిత్సయు పైజెప్పిన దూష్యములు మూటిని శమింపజేయును. ఇవియే కఫహారంబు లగును. కావున దోషదూష్యములకు సమానచికిత్స పొసగియుండును. దానంజేసి కఫజప్రమేహములు సాధ్యములు.) పిత్తజప్రమేహము లారును యాప్యములు.

ఎట్లులన.—(పిత్తప్రమేహములయందు పైజెప్పిన మేదో మాంసక్లేదంబులును రక్తంబును దూష్యములు. దోషము పిత్తము. దూష్యములు పిత్తముచే దూషితమగును. ఇచ్చట మేదోహరములగు కటుకాదిరసములు గల ద్రవ్యములు పిత్తమును వృద్ధినొందించును. పిత్తమును శమింపజేయు మధురాదిరసములు గల పదార్థములు మేదస్సును వృద్ధినొందించును. కావున నీదోషదూష్యములు పరస్పరవిరుద్ధములై యుండును. దానంజేసి దీనికి సరియైన చికిత్సచేయ వలనుపడదు. కావున పిత్తజప్రమేహములు యాప్యములు.) వాత ప్రమేహములయందు ధాతువులన్నియు దూష్యములు. వాతము దోషము. గంభీర ధాతువులగు వసామజ్జాదులను అపకర్షించుటచే నాశుక్రియాకారియగుటచేతను దోష దూష్యములు పరస్పరవిరుద్ధములగుటంజేసియు, వాతమున జనించు ప్రమేహములు అసాధ్యములు.

ఇట్టిసందర్భముచేతనే "జ్వరే తుల్యర్తుదోషత్వం ప్రమేహే తుల్యదూష్యతా, రక్తగుల్మే పురాణత్వం సుఖసాధ్యస్య లక్షణమ్" అని తంత్రాంతరమున ప్రమేహవ్యాధి యందు దోషదూష్యములు సమానగుణములుగ నుండుట సుఖసాధ్యలక్షణ మని చెప్ప బడినది. దోషములును దూష్యములును సమానగుణములైనచో నేకరూపమైన చికిత్స చేత రెండును శాంతినొంది వ్యాధి నివర్తించు ననియు, అటుగాక పరస్పర విరుద్ధగుణ ములైయున్ననాడు దూష్యముల శమింపజేయునది దోషవర్ధకంబును దోషమును శమించునది దూష్యవర్ధకంబునై యేకరూపచికిత్సకు వలనుపడక యాప్యఅసాధ్యస్థితి నుండు ననియు భావము. ఈ విషయమునే వాగ్భటాచార్యుడు "సాధ్య - యాప్య - పరిత్యాజ్యాః మేహాస్తేనైవ తద్భవాః, సమాఽసమక్రియతయామహాత్యయతయాపి చ" (అ. హృ. న. అ. ౧౦. శ్లో. ౬) అను వాక్యమున క్లప్తముగ సూచించెను.*

### ప్రమేహదోషదూష్యవిభాగము

కఫస్సపిత్తః పవనశ్చ దోషాః,
మేదోఽస్రశుక్రాంబువసాలసీకాః,
మజ్జారసౌజఃపిశితం చ దూష్యాః
ప్రమేహిణాం; వింశతిరేవ మేహాః. 4

ప్రమేహరోగమునందు కఫపిత్తములు మూడును దోషములు. మేదస్సు, రక్తము,శుక్రము,క్లేదము, మాంసారమగు స్నేహము, లసీక (మాంసమునకును చర్మమునకు నడుమనుండు నీరు) ఎముకలలోని క్రొవ్వు, రసధాతువు, అర్ధాంజలిపరిమితమై శ్లేష్మ

* ఇచ్చట వ్యాధిస్వభావమును బట్టి తుల్యదోషదూష్యతాదులు సుఖసాధ్య త్వాది హేతువు లగుచున్నవి. కాబట్టి "న చతుల్యగుణో దూష్యో న దోషః ప్రకృతి ర్భవేత్" అని చరకమునందు జెప్పబడినట్లు తుల్యదూష్యత్వము కృచ్ఛ్రతా హేతువు కాజాల దని యెరుగవలెను.

రూపమైన యోజస్సు, మాంసము ఇవియన్నియు దూష్యములు. ఈదోషదూష్యముల రెండింటిచే గల్గు ప్రమేహములు అన్నియుజేరి ఇరువది యగును.

### ప్రమేహపూర్వరూపములు

దన్తాదీనాం మలాఢ్యత్వం ప్రాగ్రూపం పాణిపాదయోః,
దాహశ్చిక్కణతా దేహే తృట్ స్వాద్వాస్యం చ జాయతే. 5

దంతములు కన్నులు మున్నగుస్థలములయందు మలము విశేషముగ జేరుట, అరచేతులయందు అరకాళ్లయందును మంట పుట్టుట, దేహముపై జిగురువలె బంధన కల్గియుండుట, దప్పి యధికమగుట, నోరు తీపిగ నుండుట ఈ లక్షణము లన్నియు ప్రమేహము జనించుటకుముందు కల్గు పూర్వరూపములు.

### ప్రమేహసామాన్యలక్షణము

సామాన్యం లక్షణం తేషాం ప్రభూతావిలమూత్రతా,
దోషదూష్యావిశేషేఽపి తత్సంయోగవిశేషతః. 6
మూత్రవర్ణాదిభేదేన భేదో మేహేషు కల్ప్యతే,

మూత్ర మధికముగ వెడలుటయు, కలకబారి వెడలుటయు ఈరెండును ప్రమేహము లన్నింటియందును సాధారణముగ నుండు లక్షణములు. క్రింద వివరింపబడు వింశతి మేహములయందును వాతాది దోషత్రయంబును రసరక్తాదిధాతువులును సమముగ నుండును. (త్రిదోషములలో నొక్కొకదానిచే పైజెప్పిన విభాగముల ననుసరించి మేదో మాంసాదిదూష్యముల నాశ్రయించి జనించు నని భావము.) అట్లుండునెడ దోషభేదములచే మూడుతెరగు లుండుట యుచితము. అయినను ఒక్కొకదోషమునందును అవాంతరభేదములు కల్గుటకుకారణము అట్టి దోషదూష్యసంయోగవిశేషమేకాని వేరొండు కారణము లేదు. ఈవిషయమును సుశ్రుతాచార్యు లి ట్లుపదేశించిరి:—
"యథా పఞ్చానాం వర్ణానాం ఉత్కర్షాపకర్షకృతేన సంయోగవిశేషేణ కపిలాది నానావర్ణోత్పత్తిః, ఏవం దోషాదిసంసర్గాత్ మేహానాం నానాత్వమ్." (సుశ్రుత. ని. అ. ౬) లోకమున తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు, శ్యామలము (పసరురంగు) అను ప్రధానములగు నైదు వర్ణములయొక్క సంసర్గతారతమ్యవిశేషమునంజేసి పాటలాది నానావర్ణభేదములు కల్గునట్లు ప్రమేహములకు కారణములైన వాతాదిదోషంబులును, మేదస్సుమున్నగు దూష్యంబులును నియతములుగనున్నను, వానిపరస్పర సంసర్గ విశేషమునంజేసి ప్రమేహములు పలుతెరంగులనుండు నని భావము. అట్టి భేదము మూత్రముయొక్క వర్ణము మున్నగువాని భేదముచే నిర్ణయింపవలెను. దోషదూష్య సంయోగముచే భేదము కల్గుటకు జన్మాంతరకర్మ వాసనావిశేషంబు కారణమగును.

1. కఫజమేహములు పది, అం దుదకమేహము

అచ్ఛం బహు సితం శీతం నిర్గన్ధముదకోపమమ్. 7
మేహత్యుదకమేహేన కిఞ్చిదావిలపిచ్ఛిలమ్,

ఉదకమేహమునందు మూత్రము మలినములేక స్వచ్ఛమై మిక్కిలి తెల్లనై చల్లనై ఎట్టిగంధంబును లేక జలమువలె వెడలుము. ఒకసమయమున కొంచెము కలకబారి పిచ్ఛిలముగ గూడ వెడలును.

2. ఇక్షుమేహలక్షణము

ఇక్షో రస ఇవాత్యర్థం మధురం చేక్షుమేహతః. 8

ఇక్షుమేహమునందు చెఱకురసమువలె మిక్కిలి మధురంబై మూత్రము వెడలును.

3. సాంద్రమేహలక్షణము

సాన్ద్రీభవేత్పర్యుషితం సాన్ద్రమేహేన మేహతి,

మూత్రమును ఒకపాత్రములో పట్టి యొకరాత్రియంతయు నునిచి మరుసటి దిన ముదయమున జూచినచో చిక్కనైయుండునెడ సాంద్రమేహ మని యెరుంగునది.

4. సురామేహలక్షణము

సురామేహీ సురాతుల్యం ఉపర్యచ్ఛమధో ఘనమ్. 9

మూత్రమును పట్టి యునిచి మరుదినము జూచినచో పైన తేటగను అడుగున మడ్డిగ కల్లువలెనుండునెడ సురామేహ మని చెప్పబడును.

5. పిష్టమేహలక్షణము

సంహృష్టరోమా పిష్టేన పిష్టవద్బహులం సితమ్,

పిండివలె తెల్లనైన మూత్రము నధికముగ విడచినచో, నది పిష్టమేహ మన బడును. మూత్రమును విడచునపుడు రోమాంచము కల్గును.

6. శుక్రమేహలక్షణము

శుక్రాభం శుక్రమిశ్రం హి శుక్రమేహీ ప్రమేహతి. 10

శుక్రముతో సమానమగు మూత్రమునైనను, శుక్రముతోగూడిన మూత్రము నైనను విసర్జించినచో శుక్రమేహ మనందగును.

7. సికతామేహలక్షణము

మూర్తాణూః సికతామేహీ సికతారూపిణో మలాన్,

మూత్రమునందలి కఫము ఘనీభవించి యిసుకవలె సూక్ష్మాకారమై కఫరూపమైన మలమును విసర్జించును. ఇది సికతామేహము. ఇచ్చట కఫరూపమైన మల మొక్కటియే సికతారూపము నొందును. కావున మలాన్ అను బహువచనము మవివక్షితము. లేక సికతాస్వరూపవిశేషములనుబట్టి బహువచనము చెప్పబడె నని గూడ చెప్పవచ్చును.

8. శీతమేహలక్షణము

శీతమేహీ సుబహుశో మధురం భృశశీతలమ్. 11

మధురంబును మిక్కిలి శీతలంబునైన మూత్రమును మిక్కిలి యధికముగ విసర్జించినచో శీతమేహ మనబరగు.

9. శనైర్మేహలక్షణము

శనైశ్శనైశ్శనైర్మేహీ మన్దం మన్దం ప్రమేహతి,

శనైర్మేహము కల మనుజుండు మెలమెల్లగ పలుమారు మూత్రము విసర్జించును.

10. లాలామేహలక్షణము

లాలాతన్తుయుతం మూత్రం లాలామేహేన పిచ్ఛిలమ్. 12

నోటకారు జొల్లువలె తీగెగా జిగురుకలమూత్రము వెడలునెడ లాలామేహ మనబడును. (ఈపదియును కఫమున జనించిన మేహములు.)

11. పైత్తికమేహము లారు, అందు క్షారమేహలక్షణము

గన్ధవర్ణరసస్పర్శైః క్షారేణ క్షారతోయవత్,

గంధము, వర్ణము, రసము, స్పర్శము ఈనాల్గిటిచేతను *క్షారమునకు సమానముగ నుండు మూత్రమును విసర్జించినయెడ క్షారమేహ మనబడును.

12, 13. నీల-కాలమేహలక్షణములు

నీలమేహేన నీలాభం కాలమేహీ మషీనిభమ్. 13

† నీలవర్ణమైనమూత్రము వెడలునెడ నీలమేహం బనియు, బొగ్గునీళ్లవలె నల్లని మూత్రము వెడలునెడ కాలమేహ మనియు నెరుంగునది.

14. హారిద్రమేహలక్షణము

హారిద్రమేహీ కటుకం హారిద్రాసన్నిభం దహాత్,

కారముకల్గి పసుపువలె పచ్చనిరంగుతో గూడి నిప్పునకాలిన విధముగ మండుచు మూత్రము వెడలినచో హారిద్రమేహ మనబడును.

---

*క్షార మనగా క్షారపాక విధానముగా సిద్ధపరచిన ద్రవరూప మగు తీక్ష్ణౌషధము † ఆకాశపురంగు.

## 15. మాంజిష్ఠమేహలక్షణము

విస్రం మాఞ్జిష్ఠమేహేన మఞ్జిష్ఠాసలిలోపమమ్. 14

మంజిష్ఠి కషాయమువంటి రంగుకల్గి దుర్గంధముతోఁగూడిన మూత్రము వెడలినచో మాంజిష్ఠమేహ మనదగును.

## 16. రక్తమేహలక్షణము

విస్రముష్ణం సలవణం రక్తాభం రక్తమేహతః,

ఉప్పనై రక్తవర్ణమై దుర్గంధముతో గూడి వేడిగ మూత్రము వెడలిన నది రక్తమేహము. (ఇవి యారును పైత్తిక మేహములు.)

## 17. వాతమేహములు నాల్గు; అందు వసామేహము

వసామేహీ వసామిశ్రం వసాభం మూత్రయే న్ముహుః. 15

మాంసవసతో గూడియైనను మాంసవసకు సమానముగనైనను నుండు మూత్రమును విసర్జించినచో నయ్యది వసామేహము.

## 18. మజ్జమేహలక్షణము

మజ్జాభం మజ్జమిశ్రం వా మజ్జమేహీ ముహుర్ముహుః,

మజ్జమేహము కల మనుజుడు మజ్జ (క్రొవ్వు)తో సమముగనైనను, మజ్జతో కలిసియైనను మూత్రమును విసర్జించును. (ఇచ్చట 'మజ్జాభం' అనుచోట 'మజ్జానం' అని వాగ్భటాచార్యుడు పఠించెను. అప్పుడు శరీరమునందలి మజ్జయైనను మజ్జతో గూడిన మూత్రమైనను వెడలు నని యర్థము. వసామేహమునందును 'వసాభం' అను చోట 'వసాం వా' అని పఠించిరి. అప్పుడు శరీరమునందలి వసయైనను, వసతోఁగూడిన మూత్రమైనను వెడలు నని భావము.)*

## 19. క్షౌద్రమేహలక్షణము

కషాయం మధురం రూక్షం క్షౌద్రమేహం వదేద్బుధః. 16

మూత్రము కషాయ మధురరసములు కల్గి రూక్షమై వెడలినయెడ క్షౌద్రమేహ మని వచించెదరు.

## 20. హస్తిమేహలక్షణము

హస్తీ మత్త ఇవాఽజస్రం మూత్రం వేగవివర్జితమ్,
సలసీకం విబద్ధం చ హస్తిమేహీ ప్రమేహతి. 17

---

* "శుద్ధమాంసస్య యః స్నేహః సా వసా పరికీర్తితా, స్థూలాస్థిషు విశేషేణ మజ్జాత్వభ్యంతరాశ్రితా. అథేతరేషు సర్వేషు సరక్తం మేదఉచ్యతే." (సు. శా. 4 అ.) అను సుశ్రుతవచనమునుబట్టి వస అనగా మాంసపు క్రొవ్వనియు, మజ్జ అనగా నెముకలలోని క్రొవ్వనియు గ్రహింపవలెను.

హస్తిమేహము కలమనుజుడు వేగములేక లసీక (త్వక్కు నాశ్రయించిన నీరు)తోకూడిన మూత్రమును మదించిన యేనుగువలె ఎడతెగక బద్ధగించినట్లు విసర్జించును. (ఈనాల్గును వాతజమేహములు, ఇత్తెరంగున వాత-పిత్త-కఫములచే వేరువేర జనించు నిరువది ప్రమేహలక్షణములును వివరింపబడినవి.)

### కఫజప్రమేహోపద్రవములు

అవిపాకోఽరుచిశ్ఛర్దిర్నిద్రాకాసస్సపీనసః,
ఉపద్రవాః ప్రజాయన్తే మేహానాం కఫజన్మనామ్. 18

అజీర్ణము, అరోచకము, వమనము, అధికనిద్ర, దగ్గు పడిసెము ఈయుపద్రవములు కఫజప్రమేహములయందు సామాన్యముగ కల్గును.

### పైత్తికప్రమేహోపద్రవములు

వస్తిమేహనయోస్తోదో ముష్కావదరణం జ్వరః,
దాహస్తృష్ణామ్లికా మూర్ఛా విడ్భేదః పిత్తజన్మనామ్. 19

వస్తియందును గుహ్యమునందును సూదులు గ్రుచ్చినట్లు పోటు, వృషణములపై చర్మము పగులుట, జ్వరము, మంట, దప్పి, పులిత్రేపులు, మూర్ఛ, మలము ఉండలై వెడలుట ఇవియన్నియు పిత్తమున జనించిన ప్రమేహమున గల్గు నుపద్రవములు.

### వాతికప్రమేహోపద్రవములు

వాతజానాముదావర్తః కమ్పహృద్గ్రహలోలతాః,
శూలమున్నిద్రతా శోషః కాసశ్శ్వాసశ్చ జాయతే. 20

ఉదావర్తము, శరీరకంపము, రొమ్ముపట్టుట, అన్నిరసములయం దిచ్ఛబొడముట, శూలము, నిదుర బట్టకుండుట, శోఫ, శ్వాసము, దగ్గు ఇవియన్నియు వాతమేహముల యందు సామాన్యముగ గల్గు నుపద్రవములు.

### ప్రమేహాసాధ్యలక్షణములు

యథోక్తోపద్రవాఽరిష్టమతిప్రస్రుతమేవ చ,
పిడకాపీడితం గాఢః ప్రమేహో హన్తి మానవమ్. 21

త్రిదోషములకును ప్రత్యేకముగ పైజెప్పబడిన యుపద్రవములతో గూడి యరిష్ట (మరణసూచక) లక్షణములు కనుపించినను, అధికముగ మూత్రము స్రవించినను, క్రింద వివరింపబడు ప్రమేహపిడకలు జనించినను, గంభీరధాత్వనుగతమైనను ప్రమేహవ్యాధి మనుజుని చంపును.

మఱికొన్ని యసాధ్యలక్షణములు

జాతః ప్రమేహీ మధుమేహినో వా
న సాధ్య ఉక్తస్స హి బీజదోషాత్,
యే చాపి కేచిత్కులజా వికారాః
భవన్తి తాం స్తాన్ప్రవదన్త్యసాధ్యాన్. 22

* మధుమేహము కలవానికి బుట్టిన మనుజునకు ప్రమేహరోగము కల్గినచో నయ్యది వానితండ్రియొక్క శుక్రరూపమైన బీజముయొక్క దోషమున గల్గినది కావున నట్టిప్రమేహము సాధ్యము కాజాలదు. ఇదియేకాక తక్కిన రోగములలో నెద్దియైనను వంశపరంపరగ నాకులమున బుట్టినవారికెల్ల వచ్చుచున్నయెడ నా వ్యాధులుకూడ నసాధ్యము లగును. అట్టి వ్యాధులకెల్ల వంశక్రమముగ వచ్చు బీజదోషమే యసాధ్యకారణ మని భావము.

మధుమేహము జనించుటకు కారణము; లక్షణము

సర్వ ఏవ ప్రమేహాస్స్యుః కాలేనాఽప్రతికారిణః,
మధుమేహత్వమాయాన్తి తదాఽసాధ్యా భవన్తి హి. 23
మధుమేహే మధుసమం

పైజెప్పబడిన వింశతిప్రమేహములును సకాలమున తగిన చికిత్స జేయక యుపేక్షింపబడినయెడ మూత్రమున తీపి చేరి యవియన్నియు కొంతకాలమునకు మధుమేహములుగ పరిణమించును. మధుమేహత్వము నొందినచో నవి యసాధ్యము లగును. అట్టి మధుమేహమునందు మూత్రము తేనెవలె తీపికల్గి వెడలును.

మధుమేహ ద్వైవిధ్యము

జాయతే స కిల ద్విధా,
క్రుద్ధే ధాతుక్షయాద్వాయౌ దోషావృతపథేఽపి వా. 24
ఆవృతే దోషలిఙ్గాని సోఽనిమిత్తం ప్రదర్శయన్,
క్షణాత్క్షీణః క్షణాత్పూర్ణః భజతే కృచ్ఛ్రసాధ్యతామ్. 25

పైజెప్పబడిన మధుమేహము రెండు విధములు:—అందు శరీరమునంగల రసరక్తాదిధాతువులు క్షీణించుటచే వాతము ప్రకోపించి కల్గించునది యొకటి. వాతము సంచరించుమార్గమును దోషము లడ్డగించుటచే ప్రకోపమునొందిన వాతముచే గల్గినది రెండవ మధుమేహము. అందు దోషములు మార్గమును నిరోధించుటచే ప్రకుపితమైన

* ఇచ్చట మధుమేహ మనగా ప్రమేహ సామాన్యమే అర్థము. కాని పైని జెప్పబడు మధుమేహము కా దని మధుకోశము.

వాతమున గల్గిన మధుమేహమునందు వాతము తనమార్గము నడ్డగించినచో దోషము యొక్క లక్షణములను కారణములేకయే కనుపఱచును. (వాతము స్వభావముచేతనే చలనస్వభావము కలది కావున.) వస్తి పూర్ణము కాకుండునపుడు క్షణకాలము క్షీణించియు, వస్తి నిండియున్నపుడు క్షణకాలము పూరించియు నుండును. ఇయ్యది కృచ్ఛ్రసాధ్యము.

ఇచ్చట నీ నిర్ణయము నెఱుంగునది:-మధుమేహము కేవలము వాతప్రకోపమున జనించును. యట్టి వాతప్రకోపమునకు రెండు కారణములు:-అం దొకటి ధాతుక్షయము, రెండవది మార్గావరణము (వాతసంచారమార్గమును కఫపిత్తము లడ్డగించుట.) ఈ రెండు కారణములచే వాతము ప్రకోపించు నని 'వాయోర్ధాతు క్షయాత్కోపో మార్గస్యావరణేన చ' అను తంత్రాంతరవాక్యముచే తెలియుచున్నది. అట్టి వాతప్రకోపకారణముల భేదముచే మధుమేహంబును రెండు విధములు అందు మార్గావరణ ప్రకుపితవాతముచే గల్గిన మధుమేహమునందు వాతము నేదోషము అడ్డగించునో, అట్టి దోషముయొక్క లక్షణంబులు కనుపించును. ఇయ్యది కృచ్ఛ్రసాధ్యము. ధాతుక్షయమున గల్గిన మధుమేహము కేవలము అసాధ్యము కొందఱి మతమున ధాతుక్షయజ మధుమేహ మొక్కటియే కాని వాతమార్గనిరోధజ మధుమేహము లే దని నిర్ణయము. ఈ విషయము "స కిల ద్విధా" అను వాక్యమున కిలశబ్దముచే సూచితము.

### అన్ని ప్రమేహములు మధుమేహ మనుటకు కారణము

మధురం యచ్చ మేహేషు ప్రాయో మధ్వివ మేహతి,
సర్వేఽపి మధుమేహాఖ్యాః మాధుర్యాచ్చ తనోరతః. 26

ఏ కారణమువలన మేహరోగములయందు ప్రాయికముగ తేనెవలె తీపికల్గి మూత్రము వెడలునో, దానంజేసి మధుమేహము లని చెప్పబడును. శరీరమునకు సంబంధించిన తీపివలన మూత్రమున తీపికల్గును. (పై జెప్పిన మేహములలో నెద్దియైనను శరీరస్వభావముచేత తీపి కల్గియుండును. కాన నవియెల్ల మధుమేహములను పేరుచే పిలువబడు నని ముఖ్యాభిప్రాయము.)

### పిటికాభేదములు, వానికి కారణము

శరావికా కచ్ఛపికా జాలినీ వినతాఽలజీ,
మసూరికా సర్షపికా పుత్రిణీ సవిదారికా. 27
విద్రధిశ్చేతి పిటికాః ప్రమేహోపేక్షయా దశ,
సన్ధిమర్మసు జాయన్తే మాంసలేషు చ ధామసు. 28

శరావిక, కచ్ఛపిక, జాలిని, వినత, అలజి, మసూరిక, సర్షపిక, పుత్రిణీ, విదారిక, విద్రధి అను నివి పదివిధములైన ప్రమేహపిటికలు. ఇయ్యవి ప్రమేహవ్యాధికి తగిన చికిత్సను సకాలమున జేయనిచో నట్టియుపేక్షచేత సంధులయందును, మర్మముల యందును, మాంస మధికముగ బలసిన యవయవములయందును పుట్టును. (ఇవి రాచ పుండు అని లోకమున వ్యవహరింపబడును.)

భోజుడు పిటికల పరిగణించినపుడు ఇట్లు చెప్పెను:—"శరావికా సర్షపికా కూర్మికా జాలినీ తథా, కులుత్థికాఽలజీ పుత్రీ విదారీ విద్రధీ తథా, నవైతాః పిటికాః జ్ఞేయాః" ఇందు వినత యనుదాని నొక్కటి మాత్రము వదలి తక్కిన తొమ్మిదిని పైమూలగ్రంథము ననుసరించి చెప్పియున్నది; కాని అందును మసూరిక యనుదానిని కులుత్థిక యని చెప్పియున్నది. నామభేదమేకాని యాకారాదిభేదము కనబడదు. వాగ్భటాచార్యుడు పఠించిన యానుపూర్వినే ప్రకృత మూలమునకును ఇంచుకేనియు భేదము కనంబడదు.

చరకాచార్యులు కియంతశ్శిరసీయాధ్యాయమున నేడు పిటికాభేదముల పరిగణించెను:..."ఉపేక్షయాస్య జాయన్తే పిటికాస్సప్త దారుణాః................ ......శరావికా కచ్ఛపికా జాలినీ సర్షపీ తథా, అలజీ వినతాఖ్యా చ విద్రధీ చేతి సప్తమీ" (చరక. సూ. అ. ౧౭.) ఇందు మసూరిక, పుత్రిణి, విదారి యను మూడు భేదములను విడిచి తక్కిన యేడు పిటికలును పరిగణనము జేయబడినవి. అయినను వానిని సలక్షణముగ వివరించునపుడు పైజెప్పిన యేడిటికిని వివరము జెప్పి "తథాన్యాః పిటికాస్సన్తి రక్త పీతాసితారుణాః, పాణ్డురాః, పాణ్డువర్ణాశ్చ భస్మాభా మేచక ప్రభాః,.........తా బుద్ధ్వా మారుతాదీనాం యథాస్వైర్హేతులక్షణైః, బ్రూయా చ్చోప చరేచ్చాశు ప్రాగుపద్రవదర్శనాత్" (చరక. సూ. అ. ౧౭.) అను వాక్యముచేత ననేక పిటికాభేదము లున్న వనియు, వాని యుత్పత్తిని ఆకృతిని వర్ణమును స్థలమునుబట్టి వాతాది భేదములు నిర్ణయించి యుపద్రవములు జనించకమునుపే తగిన చికిత్స జేయవలె నని శాసించిరి.

మరియు పైజెప్పిన పిటికలకు స్థానాదినిర్ణయము చరకమున నిట్లు చెప్పబడినది:—"శరావికా కచ్ఛపికా జాలినీ చేతి దుస్సహాః, జాయన్తే తా హ్యతిబలాః ప్రభూతశ్లేష్మమేదసామ్. సర్షపీ చాలజీ చైవ వినతా విద్రధీ చయాః, సాధ్యాః పిత్తోల్బణాస్తాహి సమ్భవన్త్యల్ప మేదసామ్" (చరక. సూ. అ. ౧౭. శ్లో. ౧౦౩ ౧౦౪.) శరావిక, కచ్ఛపిక, జాలినీ యనునవి మూడును మిక్కిలి క్రూరములు,

ఇవి కఫమును మేదస్సును ప్రబలముగ నుండువారికి కల్గును. సర్షపి, అలజి, వినత, విద్రధి యను నాల్గు పిటికలును మిక్కిలి పిత్తాధికములై యుండును. ఇవి మేదస్సు స్వల్పముగ నుండువారికి పుట్టును.

### శరావికాది దశవిధ పిటికాలక్షణములు, అందు శరావిక

అన్తోన్నతా తు తద్రూపా నిమ్న మధ్యా శరావికా,

శరావిక యనునది అంచుచుట్టు నున్నతమై నడుమ పల్లమువలెనుండి మూకుడంత విస్తీర్ణంబును ఆకృతియు కల్గియుండును. వాగ్భటమున "శ్యావా క్లేదరుజాన్వితా" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౨౭.) అని యున్నది గాన నియ్యది శ్యామవర్ణము కల్గి స్రవముతో గూడి బాధ కల్గియుండు నని యెరుంగునది.

### సర్షపికాలక్షణము

గౌరసర్షపసంస్థానా తత్ప్రమాణా చ సర్షపీ. 29

తెల్లనియావాలవలె గుండ్రనియాకారమును, అంతియ పరిమాణంబును కల్గినది సర్షపిక యను పిటిక యనబడును. వాగ్భటమున "సర్షపామాన సంస్థానాక్షిప్రపాకా మహారుజా, సర్షపా సర్షపాతుల్య పిటికా పరివారితా" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౩౨.) అని యున్నది కాన ఇయ్యది యావాలవంటి సన్నని బొబ్బలచే వ్యాప్తమై మిక్కిలి తీవ్రమైనబాధ గలిగి శీఘ్రముగ పరిపక్వమగు నని యెరుంగునది.

### కచ్ఛపికాలక్షణము

సదాహా కూర్మసంస్థానా జ్ఞేయా కచ్ఛపికా బుధైః,

తాబేలువలె నాకారము కల్గి మంటతో గూడి యుండునది కచ్ఛపిక యనబడును.

ఈ పిటికయందు లోభాగమున నొప్పియు మంటయు కల్గి శరీరమునందు మాంసల ప్రదేశమున విశాలమైన స్థలమున జనించును. అయ్యది తాబేటి వీపువలె నున్నమై యెత్తుగ నుండును. ఈవిషయమున వాగ్భటమున "అవగాఢార్తి నిస్తోదామహావస్తు పరిగ్రహా శ్లక్ష్ణా కచ్ఛపపృష్ఠాభా పిటికా కచ్ఛపీ మతా" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౨౮.) అని చెప్పబడినది.

### జాలినీలక్షణము

జాలినీ తీవ్రదాహా తు మాంసజాలసమావృతా. 30

జాలిని యనునది తీవ్రమై మంటకల్గి మాంసమునందు జల్లెడ కంతలవంటి రంధ్రములు కల్గియుండును.

వాగ్భటమున "రుజానిస్తోదబహులా సూక్ష్మచ్ఛిద్రా చ జాలినీ" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. ౨౮.) యని యుండుటచే మిక్కిలి తీవ్రమైన నొప్పియు, సూదులు గ్రుచ్చినవిధముగ పోటును కల్గియుండును.

## వినతాలక్షణము

అవగాఢరుజాక్లేదా పృష్ఠే వాప్యుదరేఽపి వా,
మహతీ పిటికా నీలా వినతా నామ సా స్మృతాః. 31

వినత యనుపిటిక వీపునందైనను కడుపుపైనైనను పుట్టును. ఇయ్యది మిక్కిలి లోతులో నొప్పియు, చీము మొదలగుద్రవంబును కల్గి, నీలవర్ణమై గొప్పదిగ నుండును.

## పుత్రిణీలక్షణము

మహత్యల్పచితా జ్ఞేయా పిటికా చాపి పుత్రిణీ,

పుత్రిణి యనునది గొప్పదై సూక్ష్మాకారములగు బొబ్బలచే నావరింపబడి యుండును. ఇచ్చట మహతి యనుదానికి ఆవరించియుండు సన్ననిపిటికలకన్న గొప్పది యని యర్థము.

## మసూరికాలక్షణము

మసూరాకృతిసంస్థానా విజ్ఞేయా తు మసూరికా. 32

బటానులవంటి యాకృతియు నున్నతంబును కలది మసూరిక యను పిటిక యని యెరుంగునది.

## అలజీలక్షణము

రక్తాఽసితా స్ఫోటచితా దారుణా త్వలజీ మతా,

అలజి యనునది రక్తవర్ణంబును నీలవర్ణంబునునై స్ఫోటములచే నావరింపబడి యుండును. ఇయ్యది మిక్కిలి క్రూరమైనది.

దీనిలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"దహతి త్వచముత్థానే భృశం కష్టా విసర్పిణీ, రక్తకృష్ణాతితృట్ స్ఫోటదాహమోహాజ్వరాఽలజీ" (అ. హృ. ని. అ. ౧౦. శ్లో. 3౧.) అలజి యనునది పుట్టునపుడే చర్మము నిప్పున కాలినవిధముగ మంట బుట్టును. మిక్కిలి కష్టమును కల్గించుచు పలుదెరంగుల వ్యాపించును. రక్తవర్ణంబును కృష్ణవర్ణంబును నై యుండును. మిక్కిలి దప్పియు, పోటును, మంటయు, మూర్ఛయు, జ్వరమును కల్గును.

### విదారికావిద్రధిలక్షణములు

విదారీకన్దవద్వృత్తా కఠినా చ విదారికా. 33
విద్రధేర్లక్షణైర్యుక్తా జ్ఞేయా విద్రధికా తు సా,

నేలగుమ్మడుదుంపవలె గుండ్రనై కఠినముగ నుండునది విదారిక యనుపిటిక యని యెరుంగునది. విద్రధికి జెప్పబడిన లక్షణములు కల్గినది విద్రధి యనబడును.

ఇత్తెరంగున ప్రమేహపిటికలు పదియును నిరూపింపబడినవి.

### పిటికలకు దోషసంబంధనిర్ణయము

యే యన్మయాస్స్మృతా మేహాః తేషామేతాస్తు తన్మయాః. 34
వినా ప్రమేహమప్యేతా జాయన్తే దుష్టమేదసః,
తావచ్చైతా న లక్ష్యన్తే యావద్వాస్తుపరిగ్రహాః. 35

పైన వాతాదిభేదమునుబట్టి చెప్పబడిన ప్రమేహములలో నేవిధమైన ప్రమేహముచే నెవ్వడు బాధితుడై యుండునో, అట్టివానికి అట్టిదోషసంబంధము కల పిటికలే జనించును. (అనగా కఫమేహము కలవానికి కఫసంబంధమైన పిటికలును, పిత్తమేహికి పిత్తసంబంధముకల పిటికలును, వాతమేహికి వాతసంబంధములగు పిటికలును జనించు ననుట) ప్రమేహములకు చికిత్సచేయక యుపేక్షించుటచే ప్రమేహపిటికలు జనించు నని పైని చెప్పబడినది. అటుగాక ప్రమేహము లేకున్నను, శరీరమునందలి మేదస్సు వాతాదులచే దుష్టమైనపుడును పిటికలు మాత్రము పొడసూపును. మరియు నేపిటికలకు నేయే స్థానములు నెప్పబడినవో అట్టి (జఠరము వీపు మున్నగు) స్థలముల వ్యాపించునంతదనుక స్ఫుటముగ గానరాక, తగినస్థలమున జేరినపుడు చిరకాలమునకైనను పూర్ణమైన లక్షణముతోగూడి స్పష్టముగ గానబడును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—ప్రమేహము ఏదోష సంబంధమున గల్గునో అట్టి ప్రమేహము కలవానికిని జనించు పిటికలకును ఆ దోషసంబంధము కల్గునుగాని పిటికలకు మాత్రము వేరుగ దోషసంబంధము జ్వరాదులవలె నిర్ణీతమై యుండ దని పైని చెప్పబడినది. అట్లుండ భోజుడు జాలినీలక్షణమును జెప్పుతరి "పరస్పరాభిసన్ధానా పిటికాచైకదేశజా, పిత్తోత్కటాదాహవతీ భృశరుక్ జాలినీ మతా" అని జాలినీ సామాన్యలక్షణమున పిత్తోత్కటమైనది జాలిని యని చెప్పుట యసంగతమగును ; కావున పైజెప్పిన దోషనిర్ణయము ప్రాయికము ; కావున నొకప్పుడు స్వతంత్రముగ గూడ ప్రమేహము నపేక్షింపక దోష సంబంధము పిటికలకు కల్గును. ఇది ప్రాయికము కావుననే చరకాచార్యుడు

పిటికలకు దోషవిభాగము నిట్లు నిరూపించెను:—"శరావికా కచ్ఛపికా జాలినీ చేతి దుస్సహాః, జాయన్తే తా హ్యతిబలాః ప్రభూతశ్లేష్మమేదసామ్. సర్షపీ చాలజీ చైవ వినతా విద్రధీ చ యాః, సాధ్యాః పిత్తోల్బణా స్తా హి సమ్భవ న్త్యల్పమేదసామ్" (చరక. సూ. అ. ౧౭. శ్లో. ౧౦౩, ౧౦౪.) ఈవాక్యములచేత శరావిక - కచ్ఛపిక - జాలిని యనునవి మూడును కఫోల్బణము లనియు, సర్షపిక-అలజి - వినతా-విద్రధులు నాల్గును పిత్తోల్బణము లనియు దోషసంబంధము చెప్పబడినది.

## పిటికాఽసాధ్యలక్షణములు

గుదే హృది శిరస్యంసే పృష్ఠే మర్మసు చోత్థితాః,
సోపద్రవా దుర్బలాగ్నేః పిటికాః పరివర్జయేత్. 36

గుదస్థానమునందును, శిరస్సునందును, మూపులపైనను, వీపునందును, కణతలు మున్నగు మర్మస్థలములయందును జనించిన పిటికలు అసాధ్యములు. మరియు జఠరాగ్ని బలహీనమై యుండునపుడు ఉపద్రవములతో గూడియున్న పిటికలును అసాధ్యము లగును.

పిటికలయందు కలుగు నుపద్రవముల చరకాచార్యు లిట్లు చెప్పిరి:—"తృట్ శ్వాసమాంససంకోథ మేహహిక్కామదజ్వరాః. వీసర్పమర్మసంరోధాః పిటికానాముపద్రవాః" (చరక. సూ. అ. ౧౭.) అధికమైన దప్పి, శ్వాసము, వ్రణమునందలి మాంసము కుళ్లుట, పైజెప్పబడిన ప్రమేహము కూడ ననుసరించి యుండుట, ఎక్కిళ్లు తిక్కయెత్తిన ట్లుండుట, జ్వరము, విసర్పము, (వ్రణము లొక్కచోటను నిల్కడలేక నల్గడల సంచరించుట) హృదయాది మర్మస్థానములయందు జనించుట ఇవియన్నియు ప్రమేహపిటికలు అన్నిటియందును సామాన్యముగ గల్గు నుపద్రవములు.

మరియు స్థానవిశేషమునుబట్టి యసాధ్యలక్షణములు చరకమున నిట్లు చెప్పబడినవి:— 'మర్మస్వంసే గుదే పాణ్యోః స్తనే సన్ధిషు పాదయోః, జాయన్తే యస్య పిటికాః స ప్రమేహీ న జీవతి" (చరక. సూ. అ. ౧౭. శ్లో. ౧౦౭.) మర్మస్థలములు భుజములు, గుదము, చీలమండ, స్తనములు, కీళ్లు, పాదములు ఈస్థలములలో నెచ్చట నైన పిటికలు పుట్టినచో నట్టి ప్రమేహరోగము కలమనుజుడు బ్రతుకజాలడు.

వాగ్భటమున కృచ్ఛ్రసాధ్యముల నిట్లు నిర్ణయించెను:— "తత్రాద్యం పిటికాత్రయమ్, పుత్రిణీ చ విదారీ చ దుస్సహా బహుమేదసః" పది విధములైన ప్రమేహ పిటికలలో మొదటివి యగు శరావిక, కచ్ఛపిక, అలజి యను మూడును, పుత్రిణి విదారి యను రెండును, ఈయైదును మిక్కిలి మేదస్సు వృద్ధినొందినవారికి పుట్టును కావున నివి యోరువ నశక్యములై కృచ్ఛ్రసాధ్యము లగును.

*స్త్రీలకు ప్రతిమాసమునందును ఋతురక్తము సాధారణముగ వెడలును కావున వారికి శరీరమును వాతాదిదోషములును పరిశుద్ధముగ నుండును. దానంజేసి స్త్రీలకు ప్రమేహములు జనింపవు. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"రజః ప్రసేకాన్నారీణాం మాసిమాసి విశుద్ధ్యతి, సర్వం శరీరం దోషాశ్చ న ప్రమేహంత్యత స్త్రియః." ప్రకృతము కొందఱు స్త్రీలు ప్రమేహము పాలగుటకు అట్టి ఋతురక్తము విగుణమై తగినపద్ధతిననుసరించి వెడలక వైపరీత్యము నొందుటయే కారణము గానోపును. మరియు ప్రమేహవ్యాధినివృత్తిం దెలిసికొనుటకు సుశ్రుతాచార్యుడు ఇట్లు చెప్పెను:— "ప్రమేహిణో యదా మూత్రం అనావిలమపిచ్ఛిలమ్, విశదం తిక్తకటుకం తదా రోగ్యం ప్రచక్షతే." ప్రమేహపీడితునకు మూత్రము కలతలేక పిచ్ఛిలముగాక స్వచ్ఛమై తిక్తకటురసములు కల్గి వెడలినచో ప్రమేహము నివర్తించిన దని యెఱుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ప్రమేహ-ప్రమేహపిటకానిదానం సమాప్తమ్.

---

* స్త్రీలకు ప్రమేహవ్యాధి కలుగ దని చెప్పిన హేతువులు ప్రత్యక్షశాస్త్ర ప్రమాణదూరము లని 7-వ ని॥ భా॥ ఆయుర్వేద సమ్మేళనములో నేను వ్రాసిన వ్యాస మున నిరూపించి పండితామోదమును బొందితిని. కావున నిది యంగీకరింపరానిది. తంత్రాన్తరవచనము ప్రాయిక మని మధుకోశమున వ్రాయబడెను. (తి. ప. రా.)

# ౩౪. మేదోనిదానమ్

ప్రమేహపిటికలను జెప్పునపుడు "వినా ప్రమేహమప్యేతా జాయన్తే దుష్టమేదసః" అని మేదో దోషము కారణముగ చెప్పబడియున్నది కావున పిటికానిదానము జెప్పినపిదప దానికి కారణమైన మేదో దోషమును చెప్పుట.—

## మేదోవృద్ధి కారణములు

అవ్యాయామదివాస్వప్న శ్లేష్మలాహారసేవినః,
మధురోఽన్నరసః ప్రాయః స్నేహాన్మేదః ప్రవర్ధయేత్. 1

దేహపరిశ్రమము చేయకుండుట, పగటియందు విశేషముగ నిద్రపోవుట, కఫమును వృద్ధినొందించు నాహారముల సేవించుట, ఇట్టి కారణములచేత నన్నరసము మధురంబై దానియందలి స్నిగ్ధగుణములచేత మేదస్సును వృద్ధినొందించును.

## మేదస్సంప్రాప్తి

మేదసా వృతమార్గత్వాత్పుష్యన్త్యన్యే చ ధాతవః,
మేదస్తు చీయతే తస్మాదశక్తస్సర్వకర్మసు. 2

పైజెప్పినవిధముగ వృద్ధినందిన మేదస్సు తక్కిన రసరక్తాదులు ప్రవహించు స్రోతోమార్గముల నడ్డగించును. దానంజేసి రసరక్తాదులును వృద్ధినొంది పుష్టినొందును మేదస్సుమాత్రము మిక్కుటముగ వృద్ధినొందును. అట్టి కారణముచేత మానవుడు అన్నిపనులయందు శక్తిలేక యలసుడై యుండును.

## మేదోవృద్ధిచే గల్గు నుపద్రవము

క్షుద్రశ్వాసతృషామోహస్వప్నక్రథనసాదనైః,
యుక్తః క్షుత్స్వేదదుర్గన్ధైః అల్పప్రాణోఽల్పమైథునః. 3

మేదస్సు వృద్ధినొందినపుడు క్షుద్రశ్వాసము, దప్పి, మూర్ఛ, అధికముగ నిద్ర, తుమ్ములు ఈ యుపద్రవములు కల్గును. అధికముగ ప్రాలుమాలిక కల్గును. ఆకలి యధికమగును. చెమట పట్టును. దానంజేసి శరీరమున నసహ్యమైన దుర్గంధము పుట్టును. శరీరమున బలము క్షీణించును. సంభోగశక్తి మిక్కిలి తగ్గును.

పక్వాశయమునకు ఆమాశయమునకు మధ్యప్రదేశమున కాయాగ్నియుండును. అట్టి కాయాగ్నియొక్క అంశములు రసాదిధాతువులం దొక్కొకభాగమువంతున నాశ్రయించి యుండును. అట్టి కాయాగ్నియొక్క యేధాతువు నాశ్రయించినభాగము మందగించియుండునో ఆ ధాతువు మిక్కుటముగ వృద్ధినొందును. అయ్యది (కాయాగ్ని భాగము) మిక్కిలి వృద్ధినొందిననాడు ఆ ధాతువు క్షీణించును. ఈ విషయమును వాగ్భటాచార్యుడు ఇట్లు వివరించెను:—"స్వస్థానస్థస్య కాయాగ్నేః అంశా ధాతుషు సంశ్రితాః తేషాం సాదాతిదీప్తిభ్యాం ధాతువృద్ధిక్షయోఽద్భవః." పైజెప్పినప్రకారము దివాస్వప్నశ్లేష్మలాహారాదులచేత మేదస్సు నాశ్రయించిన జాఠరాగ్నిభాగము మందగించినపుడు మేదస్సు ఉత్కటముగ వృద్ధినొందును. మఱియు:—"పూర్వో ధాతుః పరం కుర్యాద్వృద్ధః క్షీణశ్చ తద్విధః" అని చెప్పియున్నప్రకారము మేదస్సు వృద్ధినొందినపుడు దానఁగనించు ధాతువులుకూడ వృద్ధినొందు నని యెరుంగునది.

## మేదస్థానములు

మేదస్తు సర్వభూతానాం ఉదరేష్వస్థిషు స్థితమ్,
అత ఏవోదరే వృద్ధిః ప్రాయో మేదస్వినో భవేత్. 4

ప్రాణికోటికెల్ల మేదస్సు ఉదరము (కడుపునను), అల్పాస్థులయందును ఆశ్రయించియుండును. కావుననే మేదస్సు వృద్ధినొందిననాడు కడుపు విశేషముగ పెద్దదియై పెరుగును.

## మేదోవృద్ధిచే గల్గువిశేషములు

మేదసావృతమార్గత్వాద్వాయుః కోష్ఠే విశేషతః,
చరన్ సన్ధుక్షయత్యగ్నిం ఆహారం శోషయత్యపి. 5
తస్మాత్స శీఘ్రం జరయత్యాహారమభికాంక్షతి,
వికారాంశ్చాశ్నుతే ఘోరాన్ కాంశ్చిత్కాలవ్యతిక్రమాత్. 6

పైజెప్పినప్రకారము వృద్ధినొందిన మేదస్సు వాతసంచారమార్గమును అడ్డగించును. దానంజేసి వాతము ధారాళముగ వెడలక కోష్ఠమునందే విశేషముగ సంచరించుచు జాఠరానలమును విశేషముగ రగులజేయును. దానంజేసి కాయాగ్ని యాహారమును అతిశీఘ్రముగ జీర్ణింపజేయును. మరల నప్పుడే యాహారమునందు అభిలాష కల్గును. అట్టి మేదోవృద్ధిని ఉపేక్షించి చాలకాలము చికిత్సజేయనినాడు క్రూరములగు ప్రమేహపిటిక మున్నగు నానారోగములు గల్గును.

### మేదోవృద్ధిచే రోగములు కల్గు క్రమము

ఏతావుపద్రవాకారౌ విశేషాదగ్నిమారుతౌ,
ఏతౌ తు దహతస్స్థూలం వనదావో వనం యథా. 7
మేదస్యతీవ సంవృద్ధే సహసైవానిలాదయః,
వికారాన్ దారుణాన్ కృత్వా నాశయంత్యాశు జీవితమ్. 8

జాఠరాగ్నియు వాతమును ఉపద్రవరూపములై యుండును. కావున నీ రెండును పరస్పర సహాయత నొంది కార్చిచ్చు అడవిని కాల్చుకరణి మేదోవృద్ధిచే బలిసియున్నవారిని దహించును. మరియు మేదస్సు మిక్కిలి వృద్ధినొందిననాడు వాత పిత్త కఫములు నప్పుడే వృద్ధినొంది తీవ్రములైన ప్రమేహము, పిటిక, విద్రధి మున్నగు రోగములను గల్గించి యతిశీఘ్రముగ మానవుల జంపును.

### స్థూలకాయలక్షణము

మేదోమాంసాతివృద్ధత్వాత్ చలస్ఫిగుదరస్తనః,
అయథోపచయోత్సాహో నరోఽతిస్థూల ఉచ్యతే. 9

శరీరమునందలి మేదస్సును మాంసంబును అధికముగ వృద్ధినందుటవలన పిఱ్ఱలును, ఉదరమును, స్తనములును మిక్కుటముగ బలిసి నడచునప్పుడు కదలుచుండి శరీరము మితిమీరి బలిసి యుత్సాహము మునుపటివలె లేక తగ్గియున్నచో నట్టి మనుజుడు స్థూలకాయుడని చెప్పబడును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
మేదోనిదానం సమాప్తమ్.

# ౩౮. ఉదరనిదానమ్

మేదోరోగమునందు "అత ఏవోదరే వృద్ధిః" అను వాక్యముచేత నుదరము వృద్ధినొందు నని చెప్పియుండుటంజేసి మేదోరోగమును జెప్పినపిదప, ఉదరమును వృద్ధినొందించు నుదరనిదానమును జెప్పుట:—

### ఉదరవ్యాధికి కారణములు

రోగాస్సర్వేఽపి మన్దేఽగ్నౌ సుతరాముదరాణి చ,
అజీర్ణాన్మలినైశ్చాన్నైః జాయన్తే మలసఞ్చయాత్. 1

మనుజులకు జఠరాగ్ని మందగించినపుడు నానావిధ రోగములును జనించును. అందు నుదరవ్యాధి ముఖ్యముగ కల్గును. మరియు భుజింపబడిన యాహారము జీర్ణము కాకుండినను పరస్పర విరుద్ధాదిదోషములచే దుష్టములైన యన్నాదుల భుజించినను, మలములును దోషములును చయావస్థనొంది ఉదరరోగము విశేషముగ జనించును.

ఇచ్చట మలశబ్దముచేత పురీషాదులును, దోషములును గ్రహింపబడును. "మలినీకరణాన్మలాః" అనుటచేత వాతాదులు వికృతి నొందినపుడు శరీరము నందలి ధాతువులను మలినములుగ జేయుటంజేసి మలము లని కూడ జెప్పబడును. కావున "మలసంచయాత్" అనుచోట పురీషాదులును వాతాదిదోషములు శోధనాదులచే పరిశుభ్రములుగాక వృద్ధి నొందినపు డుదరవ్యాధి జనించు నని యెరుంగునది. కావుననే తంత్రాంతరమున "అతిసంచిత దోషాణాం పాపం కర్మ చికీర్షతామ్, ఉదరాణ్యుపజాయన్తే మన్దాగ్నీనాం విశేషతః." అని చెప్పబడినది. ఇచ్చట దోషము లుపలక్షణములు కావున మలములుకూడ గ్రహింపబడును.

### ఉదరరోగ సంప్రాప్తి

రుద్ధ్వా స్వేదామ్బువాహీని దోషాస్స్రోతాంసి సఞ్చితాః,
ప్రాణాగ్న్యపానాన్ సన్దూష్య జనయన్త్యుదరం నృణామ్. 2

పై జెప్పినవిధముగ దోషములు వృద్ధినొంది శరీరమునందలి స్వేదము (చెమట)ను ఉదకమును వహించు (వ్యాపింపజేయు) స్రోతస్సులను ధారాళముగ వ్యాపింపనీయక యడ్డగించి, ప్రాణవాయువును జాఠరాగ్నిని అపానవాతమును చెఱచి యుదరమును కల్గించును.

సుశ్రుతమున "ఉదకవహే ద్వే; తయోర్మూలం తాలు క్లోమ చ" అని యుండుటచేత ఇచ్చట ఉదకవహస్రోతస్సులు తాలువులను క్లోమమును ఆశ్రయించినవి రెం డని యెరుంగునది. మఱియు "ఏతేషాం బహూని" అనియు నున్నదిగాన స్వేద వహములుకూడ స్రోతస్సులలో జేరినవి. అయ్యది మేదస్సును రోమకూపములను ఆశ్రయించియుండును.

స్రోతస్సు లన:—వర్తులాకారములై మిక్కిలి సూక్ష్మములగు నాకారముకల్గి నిడుదలై తామరకాడలో నుండు రంధ్రములవలె మిక్కిలి సూక్ష్మములైన రంధ్రమును కల్గి హృదయాదిస్థానములనుండి రసరక్తాదిధాతువుల శరీరమున వ్యాపింపజేయుచు శరీరమునందెల్ల వ్యాపించి యుండు సన్నని నాడులు. ఇవి సిరా ధమనుల కన్న నితరములై యుండును. ఈ విషయము—"మూలాత్ఖాదన్తరం దేహే ప్రసృతం త్వభివాహియత్, స్రోతస్తదితి విజ్ఞేయం సిరాధమనివర్జితమ్" అని సుశ్రుతమునందును "స్వధాతుసమవర్ణాని వృత్తస్థూలాన్యణూని చ, స్రోతాంసి దీర్ఘాణ్యాకృత్యా ప్రతానసదృశాని చ" అని తంత్రాంతరముననను చెప్పబడినది.

మరియు నుదరరోగ పూర్వరూపములను సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి:— "తత్పూర్వరూపం బలవర్ణ కాంక్షా వలీవినాశో జఠరే హి రాజ్యః, జీర్ణాపరిజ్ఞాన విదాహవత్యో వస్తౌరుజః పాదగతశ్చ శోఫః" (సుశ్రుత. ని. అ. 2.) అట్టి జఠరము జనించుటకు మునుమున్న శరీరబలమునందును వర్ణమునందును కోరిక కలుగును. కడుపుపై ముడతలు మరగిపోయి రేఖలు ఏర్పడును. భుజింపబడిన యాహారము జీర్ణమైనది తెలియక మంటతో కూడి వస్తియందు తీవ్రములగు బాధలు కల్గును. కాళ్లపై వాపు పుట్టును. ఇవియన్నియు నుదరరోగము జనించుటకు ముందు కల్గు పూర్వరూపము లని యర్థము.

## ఉదరవ్యాధిసామాన్యరూపము

ఆధ్మానం గమనేఽశక్తిః దౌర్బల్యం దుర్బలాగ్నితా,
శోథస్సదనమఙ్గానం సఙ్గో వాతపురీషయోః. 3
దాహస్తన్ద్రా చ సర్వేషు జఠరేషు భవన్తి హి,

కడుపుబ్బరము, నడచుటకు శక్తిలేకుండుట, బలహీనము, జఠరాగ్నికి బలహీనత, వాపు, అవయవములు కృశించుట, అపానవాతంబును మలంబును బైటవెడలక బద్ధగించుట, తాపము, మైకము ఇవియన్నియు నుదరవ్యాధు లన్నింటియందును సామాన్యముగ జనించును.

## ఉదరవ్యాధి భేదములు

పృథగ్దోషైస్సమస్తైశ్చ ప్లీహాబద్ధక్షతోదకైః. 4
సమ్భవన్త్యుదరాణ్యష్టౌ తేషాం లిఙ్గం పృథక్ఛృణు,

వాత-పిత్త-కఫములచే వేర్వేరుగను, అన్నింటి (సన్నిపాతము)చేతను, ప్లీహవృద్ధిచేతను జనించు నుదరములును, బద్ధోదరంబును, క్షతోదరంబును, జలోదరంబును జేరి యుదరవ్యాధి యెనిమిదివిధముల నుండును.

### వాతికోదరలక్షణము

తత్ర వాతోదరే శోథః పాణిపాన్నాభికుక్షిషు. 5
కుక్షిపార్శ్వోదరకటీపృష్ఠరుక్పర్వభేదనమ్,
శుష్కకాసోఽఙ్గమర్దోఽధో గురుతామలసఙ్గ్రహః. 6
శ్యావారుణత్వగాదిత్వమకస్మాద్వృద్ధిహ్రాసవత్,
సతోదభేదముదరం తనుకృష్ణసిరాతతమ్. 7
ఆధ్మాతదృతివచ్ఛబ్దమాహతం ప్రకరోతి చ,
వాయుశ్చాత్ర సరుక్శబ్దో విచరేత్సర్వతోగతిః. 8

వాతప్రకోపముచే జనించిన యుదరవ్యాధియందు మీఁజేతులయందును మీఁగాళ్లయందును నాభిస్థానమందును కడుపునందును వాపు కల్గును. [1]కుక్షియందును ఇరుప్రక్కలయందును [2]ఉదరమునందును నడుమునందును వీపునందును తీవ్రమైన నొప్పి కల్గును. కీళ్లయందు నొప్పి, పొడిదగ్గు వచ్చును. అవయవములన్నిటియందును నొప్పి కల్గును. శరీరమునం దధోభాగమున భారముగ నుండును. మలము యథాక్రమముగ వెడలక బద్ధగించును. చర్మంబును ముక్కును చెవులును శ్యామవర్ణంబైనను లేక అరుణవర్ణంబైనను కల్గియుండును. ఉదరము కారణములేకయే వృద్ధినొందును, తగ్గుచు నుండును. ఉదరమునందు సూదులుగ్రుచ్చినవిధముగ పోటును, గొడ్డలితో చీల్చినట్లు బాధయు కల్గి సన్ననై నల్లగనుండు సిరలచే నావరింపబడియుండును. పొట్టపై తట్టినయెడ గాలిచేనిండి యుబికియుండు తోలుతిత్తివలె శబ్దము కల్గియుండును. వాతము గుమ్మను శబ్దముతోను నొప్పితోను కూడి కడుపులో నంతట వ్యాపించును.

### పిత్తోదరలక్షణము

పిత్తోదరే జ్వరో మూర్ఛా దాహస్తృట్కటుకాస్యతా,
భ్రమోఽతిసారః పీతత్వం త్వగాదావుదరం హరిత్. 9
పీతతామ్రసిరానద్ధం సస్వేదం సోష్మదహ్యతే,
ధూమాయతే మృదుస్పర్శం క్షిప్రపాకం ప్రదూయతే. 10

---

1. కుక్షి యనగా మీదికడుపు. 2. ఉదర మనగా క్రిందికడుపు.

పిత్తప్రకోపమున కల్గిన యుదరమునందు జ్వరంబును, మూర్ఛయు, తాపంబును, దప్పియు, నోరుచేదును, భ్రమంబును, అతిసారంబును కల్గును. చర్మమునందును, ముక్కుపైనను, చెవులును పసుపురంగు కల్గియుండును. కడుపు ఆకు పచ్చనై పచ్చని రంగును, లేక యెఱ్ఱనిరంగైననుకల సిరలచే నావరింపబడి, చెమటకల్గి వేడియై మంటతో కూడియుండును. పొగవెడలు విధముగనుండును. తాకినపుడు మృదువై శీఘ్రముగ పాకమునొందును. కడుపులో వికారముగ నుండును.

## కఫోదరలక్షణము

శ్లేష్మోదరేఽఙ్గసదనం స్వాపశ్శ్వయథుగౌరవమ్,
నిద్రోత్క్లేఽరుచిశ్శ్వాసః కాసశ్శుక్లత్వగాదితా. 11
ఉదరం స్తిమితం స్నిగ్ధం శుక్లరాజీతతం మహత్,
చిరాభివృద్ధం కఠినం శీతస్పర్శం గురు స్థిరమ్. 12

కఫప్రకోపమున గల్గిన యుదరమునందు శరీరము కృశించును. స్పర్శము నెరుంగ లేకుండును. శరీరముపై వాపుకల్గును. బరువుగ నుండును. నిద్ర యధికమగును. వాంతి యగునట్లుండును. నోట రుచి తప్పును. శ్వాసంబును దగ్గును కల్గును. చర్మంబును ముక్కును చెవులును శుక్లవర్ణములుగ నుండును. ఉదరము నిండుకుండవలె జడమై స్నిగ్ధంబై తెల్లనిరేఖలుకల్గి మిక్కిలి గొప్పదిగ నుండును. అయ్యది చాలకాలమునకు వృద్ధినొంది కఠినంబై తాకినప్పుడు చల్లనై భారము గల్గి నిశ్చలమై యుండును.

## సన్నిపాతోదరలక్షణము

స్త్రియోఽన్నపానం నఖలోమమూత్ర
విడార్తవైర్యుక్తమసాధువృత్తాః,
యస్మై ప్రయచ్ఛన్త్యరయో గరాంశ్చ
దుష్టామ్బుదూషీవిషసేవనాద్వా. 13
తేనాశు రక్తం కుపితాశ్చ దోషాః
కుర్వన్తి ఘోరం జఠరం త్రిలిఙ్గమ్,
తచ్ఛీతవాతే భృశదుర్దినే చ
విశేషతః కుప్యతి దహ్యతే చ. 14
స చాతురో ముహ్యతి వా ప్రసక్తం

పాణ్డుః కృశశ్శుష్యతి తృష్ణయా చ,
దూష్యోదరం కీర్తితమేతదేవ

కొందరు దుష్టచారిణులగు స్త్రీలు పురుషుల దమవశమున నుంచుకొనుటకై యన్నపానములయందు గోళ్లు, వెండ్రుకలు, మూత్రము, మలము, ఋతురక్తము మున్నగు వానిని గూర్చి పెట్టెదరు. అట్టి యన్నాదులను పొరబాటుచే తిన్నను; శత్రువు లపాయమును గల్గింప సమకట్టి విషమును అన్నపానాదుల గూర్చిపెట్టినచో దానిని పొరబడి తిన్నను; విషము మున్నగువానిచే దుష్టమైనజలమును ద్రావినను; దూషీవిషమును సేవించినను; వాత పిత్త కఫములు మూడును సమకాలమున ప్రకోపమునొంది శరీరమునందలి రక్తమును పూర్తిగచెరిచి మిక్కిలి క్రూరమైన యుదరవ్యాధిని కల్గించును. ఇయ్యది వాతాదులకు వేర్వేర జెప్పిన లక్షణములన్నియు కల్గియుండును. ఇయ్యది మంచుకాలమునందును, గాలి విశేషముగ వీచునప్పుడును, మేఘములావరించి సూర్యరశ్మి సోకకుండునపుడును విశేషముగ ప్రకోపమునొంది, దహించునట్లు తాపమును కల్గించును. ఇట్టి యుదరముచే బాధితుడగు రోగి అప్పుడప్పుడు మూర్ఛనొందును. శరీరమున రక్తము చెడుటంజేసి తెల్లనై యుండును. శరీరము కృశించును. నోట ద్రవము లేక యెండి మిక్కుటముగ దప్పి కల్గును. ఇయ్యది సన్నిపాతోదరము. ఇదియే దూష్యమైన రక్తముచెడి దానివలన పుట్టుటంజేసి దూష్యోదర మనియు జెప్పంబడును.

దూషీవిషలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"జీర్ణం విషఘ్నౌషధిభిర్హతం వా దావాగ్నివాతాతపశోషితం వా, స్వభావతో వా గుణవిప్రహీణం విషం హి దూషీవిషతాముపైతి" (సుశ్రుత. కల్ప. అ. ౨. శ్లో. 30) ప్రసిద్ధమైన విషము ప్రాతదియైనను, విషహారంబులగు నౌషధముచే బలహీనంబైనను, కార్చిచ్చునందును గాలియందును ఎండయందును ఎండి యల్పవీర్యమైనను, లేక స్వభావముచేతనే గుణహీనంబైనను అట్టివిషము దూషీవిష మని చెప్పనగును.

### ప్లీహోదరయకృద్దాల్యుదరలక్షణము

ప్లీహోదరం కీర్తయతో నిబోధ. 15
విదాహ్యభిష్యన్దిరతస్య జన్తోః
ప్రదుష్టమత్యర్థమసృక్కఫశ్చ,
ప్లీహాభివృద్ధిం కురుతః ప్రవృద్ధౌ
ప్లీహోత్థమేతజ్జఠరం వదన్తి. 16

తద్వామపార్శ్వే పరివృద్ధిమేతి
విశేషతస్సీదతి చాతురోఽత్ర,
మన్దజ్వరాగ్నిః కఫపిత్తలిఙ్గైః
ఉపద్రుతః క్షీణబలోఽతిపాణ్డుః,
సవ్యాన్యపార్శ్వే యకృతి ప్రవృద్ధే
జ్ఞేయం యకృద్దాల్యుదరం తదేవ. 17

మిక్కిలి తాపమునుబుట్టించు పదార్థములనైనను ద్రవమునుగల్గించు పదార్థములనైనను నిరంతరముగ కొంతకాలము సేవించినచో రక్తంబును కఫంబును మిక్కిలి చెడి శరీరమునందలి ప్లీహమును వృద్ధినొందించును. ప్లీహము నానాట వృద్ధినొంది జఠరమును వృద్ధినొందించును. (ఇయ్యది ప్లీహవృద్ధివలన జనించుటంజేసి ప్లీహోదర మని చెప్పనగును.) ఈవ్యాధియందు మనుజుని శరీరమునం డెడమప్రక్క నుదరము విశేషముగ వృద్ధినొందును. శరీరమెల్ల కృశించును. జఠరాగ్ని మందగించి జ్వరము వచ్చును. కఫముచేతను పిత్తముచేతను గల్గు నుపద్రవములుగల్గి శరీరబలము క్షీణించి మిక్కిలి పాండువర్ణము కల్గియుండును. మరియు శరీరమున కుడిప్రక్కనుండు యకృత్తు (కారిజము) పైజెప్పినవిధముగ వృద్ధినొంది యుదరవ్యాధి జనించినచో యకృద్దాల్యుదర మని చెప్పబడును. (ఈవ్యాధియందు యకృత్తు, దోషములచే భేదింపబడును; కావున యకృద్దాల్యుదర మని యన్వర్థముగ జెప్పబడును.)

ప్లీహోదరమున దోషసంబంధముచే గల్గులక్షణములు

ఉదావర్తరుజానాహైః మోహతృడ్దహనజ్వరైః,
గౌరవాఽరుచికాఠిన్యైః విద్యాత్తత్ర మలాన్ క్రమాత్. 18

పైజెప్పబడిన ప్లీహోదరమునం దుదావర్తంబును, కడుపుబ్బరంబును, కడుపులో నొప్పియు కల్గినచో వాతప్రకోపమున జనించినది యనియు; మూర్ఛయు, దప్పియు, మంటయు, జ్వరంబును కలిగినచో పిత్తప్రకోపమున జనించినది యనియు; కడుపున భారంబును, అరోచకంబును కల్గి కడుపు గట్టిగ నున్నచో కఫప్రకోపమున జనించినది యనియు త్రిదోషభేదముల నెరుంగునది.

బద్ధగుదోదరలక్షణము

యస్యాన్త్రమన్నైరుపలేపిభిర్వా
వాలాశ్మభిర్వా పిహితం యథావత్,

సఞ్చీయతే యస్య మనస్సదోషః
శనైశ్శనైస్సఙ్కరవచ్చ నాడ్యామ్. 19
నిరుధ్యతే యస్య గుదే పురీషం
నిరేతి కృచ్ఛ్రాదపి చాల్పమల్పమ్,
హృన్నాభిమధ్యే పరివృద్ధిమేతి
తస్యోదరం బద్ధగుదం వదన్తి. 20

జిగట కల్గినయన్నము మున్నగు నాహారపదార్థముల భుజించుటచేనైనను, వెండ్రుకలతోను రాళ్లతోను కూడినయన్నాదుల భుజించుటచేనైనను ప్రేవు లడ్డగింపబడి వాని రంధ్రములు మూయబడును. దానంజేసి(భూమియందలి ధూళిని నానాట కొంచెము కొంచెముగ చీపురుతో నూడిచినపుడు నానాట ప్రోవగువిధముగ) మలము నానాట సంచితమై సరళముగ వెడలక నాడీద్వారము నడ్డగించును. దానివలన మలమును వెడలించు నాళమునుండి మలము బొత్తుగ వెడలకుండును. లేక కొంచెముగ వెడలును. లేక మిక్కిలి కష్టముచేత కొంచెముగ వెడలును. దానంజేసి మలము నానాట సంచితమై హృదయమునకును బొడ్డుకును మధ్యభాగమున నుదరము వృద్ధినొందును. దీనిని మలబద్ధకమున (గుదద్వారము బద్ధమగుటంజేసి) జనించుటచే బద్ధగుదోదరమని తంత్రకారులు చెప్పెదరు.

మరియు "వర్చః పిత్తకఫాన్ రుద్ధ్వా కరోతి కుపితోఽనిలః" (అ. హృ. ని. అ. ౧౨. శ్లో. ౪౯.) అని వాగ్భటాచార్యుడు చెప్పెను. కావున వాతము ప్రకోపము నొంది మలమును పిత్తకఫములను నిరోధించి యీవ్యాధిని కల్గించునని యెరుంగునది. అట్టివాతము పైజెప్పబడినరీతిగ వెండ్రుకలు రాళ్లు మున్నగునవి యాహారముతో గలిసి లోపల ప్రవేశించి వాతసంచారమార్గము నడ్డగించుటచే ప్రకోపము నొందును.

### పరిస్రావ్యుదరలక్షణము

శల్యం తథాన్నోపహితం యదన్త్రం
భుక్తం భినత్త్యాగతమన్యథా వా,
తస్మాత్స్రుతోఽన్త్రాత్సలిలప్రకాశః
స్రావస్స్రవేద్వై గుదతస్తు భూయః. 21
నాభేరధశ్చోదరమేతి వృద్ధిం
నిస్తుద్యతే దాల్యతి చాతిమాత్రమ్,
ఏతత్పరిస్రావ్యుదరం ప్రదిష్టం

ఎముకముక్కలు తృణములు ముండ్లు రాళ్లు కొయ్యముక్కలు మున్నగు శల్యములు భుజింపబడు అన్నము మున్నగు సాహారపదార్థములం గలిసి యామాశయమున జేరి ప్రేవును భేదించును. లేక పైజెప్పిన శల్యములు మఱియొకవిధముగా బ్రవేశించియైనను ప్రేవును భేదించి రంధ్రముల గల్గించును. అట్టి రంధ్రమునుండి యపక్వమైన నీరు వెడలి గుదమునుండి మాటిమాటికి ప్రక్కలకు చిమ్మి వెడలును. అట్టి నీరు వెడలుట చేత నాభికి క్రిందిభాగమున నుదరము వృద్ధినొందును. ఈయుదరమున సూదులతో బొడిచినవిధముగ పోటును, పగులదీయునట్లు నొప్పియు కల్గును. ఇయ్యది స్రావముచే గల్గినది కావున పరిస్రావ్యుదర మని చెప్పంబడును.

వాగ్భటమున "ఛిద్రోదరమిదం ప్రాహుః పరిస్రావీతి చాపరే" (అ. హృ. ని. అ. ౧౨. శ్లో. ౩౫.) అని యున్నది కావున నియ్యది ప్రేవున రంధ్రము కల్గి జనించినది కావున ఛిద్రోదర మని కొంద రాచార్యులు నుడివెద రని తెలియుచున్నది. మరియు "వర్ధయేత్తదధోనాభేః ఆశు చైతి జలాత్మతామ్" (అ. హృ. ని. అ. ౧౨. శ్లో. ౩౫.) అని వాగ్భటమున నున్నది కావున నీయుదరము అతిశీఘ్రముగ జలోదరముగ పరిణమించు నని తెలియుచున్నది.

జలోదరసంప్రాప్తిలక్షణము

దకోదరం కీర్తయతో నిబోధ. 22
యస్స్నేహపీతోఽప్యనువాసితో వా
వాన్తో విరిక్తోఽప్యథవా నిరూఢః,
పిబేజ్జలం శీతలమాశు తస్య
స్రోతాంసి దూష్యన్తి హి తద్వహాని. 23
స్నేహోపలిప్తే ష్వథవాపి తేషు
దకోదరం పూర్వవదభ్యుపైతి,
స్నిగ్ధం మహత్తత్పరివృత్తనాభి
సమాతతం పూర్ణమివామ్బునా చ,
యథా దృతిః క్షుభ్యతి కమ్పతే చ
శబ్దాయతే చాపి దకోదరం తత్. 24

ఉదకోదరము క్రింద జెప్పంబడును:—మనుజుడు స్నేహపానము జేసినప్పుడును, అనువాసన వస్తికర్మ చేసికొనినప్పుడును, వమనవిరేచనములనైనను నిరూఢ వస్తినైనను జేసికొనినప్పుడును వెంటనే చల్లనినీళ్లను త్రాగినయెడ శరీరమునందలి యుదక

వహాంబులగు స్రోతస్సులను చెరిచి యుపస్నేహన్యాయమున నానాట జలమువృద్ధినొంది యుదరమును పెద్దదిగ జేయును. లేక యుదకవహాంబులగు స్రోతస్సులయందు స్నేహము చేరియున్నను జలము నానాట వృద్ధినంది యుదరమును కల్గించును. అట్టియుదరము నూనెపూసిన విధముగ జిడ్డుకలిగియుండును. నానాట గొప్పదియై గుండ్రనైన బొడ్డు కలిగి నరములచే వ్యాప్తమగును. జలమునిండియున్న తోలుతిత్తివలె కదలినపుడెల్ల కడుపులో గడబిడ యని కదలుచు గళబిళ యను శబ్దము కల్గియుండును. (ఇయ్యది యుదకము కడుపులో వృద్ధినొందుటచే గల్గును. కావున జలోదర మని చెప్పబడును.)

మరియు వాగ్భటాచార్యుడు:—"అత్యమ్బుపానాన్మన్దాగ్నేః క్షీణస్యాతి కృశస్య వా, రుద్ధ్వామ్బుమార్గాననిలః కఫశ్చ జలమూర్ఛితః. వర్ధయేతాం తదే వామ్బు తత్స్థానాదుదరాశ్రితౌ, తతస్స్యాదుదరం తృష్ణాగుదస్రుతి రుజాయుతమ్. కాసశ్వాసారుచియుతం నానావర్ణసిరాతతమ్" (అ. హృ. ని. అ. ౧౨. శ్లో. ౩౭. ౩౮.) అని జలోదరమున కొన్నివిశేషముల జెప్పెను. జఠరాగ్ని మందగించినపుడును, కొన్ని కారణములచేత రసాదిధాతువులు క్షీణించినపుడును, శరీరమునందలి మేదస్సు నశించి శరీరము కృశించియున్నపుడును, అధికముగ జలమును త్రాగినచో వాతము ప్రకోపమునొంది జలవహాంబులగు స్రోతస్సుల నడ్డగించును. కఫము ప్రకుపితమై యుదకముతో గూడ కలియును. అట్టి వాతకఫములు రెండు నుదరమున జేరి యుదకమునకు స్థానమైన క్లోమమున జలమును మిక్కుటముగ వృద్ధినొందించును. అట్టి జలవృద్ధిచేత నుదరము నానాట వృద్ధినొందును. ఈయుదరమున డప్పి యధికమగును. నానావిధ వర్ణములతో గూడిన సిరలు వ్యాపించును. కాసశ్వాసంబులును అరుచియు గల్గును అని యర్థము. ఈవాక్యముచేత జలోదరమున వాతకఫములు రెండును ప్రకోపించి జలమును వృద్ధినొందించి యుదరమును వృద్ధినొందించు నని తెలియుచున్నది.

ఉదకవహస్రోతోలక్షణము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"ఉదకవహేద్వే, తయోర్మూలం తాలు క్లోమ చ" (సుశ్రుత. శా. అ. ౯. సూ. ౧౨.) ఉదకమును వహించునాడులు రెండుతాపులయందు క్లోమమునందు జేరియుండును. (మూలమున దకోదర మనుచోట నుదకపర్యాయ వాచకమైక దకశబ్ద మని యెరుంగునది. "పయోదకం" ఇత్యాదిస్థలములయందు ఉదకశబ్దపర్యాయమైన దకశబ్ద మని మహాభాష్యకారులు శాసించియున్నారు.)

## సాధ్యాఽసాధ్య ఉదరనిర్ణయము

జన్మనైవోదరం సర్వం ప్రాయః కృచ్ఛ్రతమం మతమ్,
బలినస్తదజాతామ్బు యత్నసాధ్యం నవోత్థితమ్. 25

పై జెప్పబడిన యుదరము లన్నియు నైసర్గికముగనే కృచ్ఛ్రసాధ్యములై యుండును. మిక్కిలి బలశాలికి నూతనముగ జనించి జలములేకుండు నుదరము తగిన ప్రయత్నముతో చికిత్స చేసినయెడ నొకసమయమున సాధ్యమగును.

## మరికొన్ని యసాధ్యలక్షణములు

పక్షాద్బద్ధగుదం తూర్ధ్వం సర్వం జాతోదకం తథా,
ప్రాయో భవత్యభావాయ ఛిద్రాన్త్రం చోదరం నృణామ్. 26

బద్ధగుదోదరము పదునైదుదినములు గడచినపిదప నసాధ్య మగును. పై జెప్పిన యుదరములలో నెద్దియైనను జలపూరితమైనచో నదియు నసాధ్య మగును. ఛిద్రాంత్రోదరము. (పరిస్రావ్యుదరము) స్వభావముగనే ప్రాయికముగ నసాధ్యముగ నుండును. (ఇచ్చట "ప్రాయో భవత్యభావాయ" అని ప్రాయశ్శబ్ద ముండుటచేత బద్ధోదర - జలోదర - ఛిద్రోదరములు మూడును కాలాంతరమున నొకవేళ శస్త్రకర్మచే సాధ్యములగు ననియు జెప్పదగియున్నది.)

## మరికొన్ని యసాధ్యలక్షణములు

శూనాక్షం కుటిలోపస్థముపక్లిన్నతనుత్వచమ్,
బలశోణితమాంసాగ్నిపరిక్షీణం చ వర్జయేత్. 27

కన్ను లుబ్బియున్నను, గుహ్యము వక్రముగ నున్నను, శరీరముపై చర్మము చెమటబట్టినట్టు లార్ద్రమైయున్నను, శరీరమునందలి మాంసంబును రక్తంబును బలంబును జఠరాగ్నియు నశించియున్నను అట్టి యుదరవ్యాధి యసాధ్య మగును. కావున చికిత్స చేయజనదు.

## ఉపద్రవములు, అసాధ్యత్వము

పార్శ్వభంగాన్న విద్వేషశోథాఽతీసారపీడితమ్,
విరిక్తం చాప్యుదరిణాం పూర్యమాణం విసర్జయేత్. 28

ఇరుప్రక్కల పగులదీసినవిధముగ నొప్పి, అన్నద్వేషము, వాపు, అతిసారము అను నీయుపద్రవములు కల యుదరవ్యాధి యసాధ్యము. మరియు విరేచనము జేయించినను ఉదరము తగ్గక మరల నీటిచే నిండుచున్నను అట్టి యుదరము మిక్కిలి యసాధ్యమగును. కావున చికిత్స జేయక విడువందగును.

మరియు జలములేని యుదర లక్షణంబులును జలముతోగూడిన యుదరలక్షణంబులును చరకమున నిట్లు చెప్పబడినవి:—"అశోథమరుణాభాసం సశబ్దం నాఽతి

భారికమ్, సదా గుడగుడాయన్తం సిరాజాలగవాక్షితమ్. నాభిం విష్టభ్య పాయౌ తు వేగం కృత్వా ప్రణశ్యతి. హృద్వఙ్క్షణకటీనాభి గుదప్రత్యేకశూలినః, కర్కశం సృజతో వాతం నాతిమందే చ పావకే. లాలయా (లోలస్యా) విరసే చాస్యే మూత్రే ఒల్పే సంహతే విశి, అజాతోదకమిత్యేతైః యుక్తం విజ్ఞాయ లక్షణైః, ఉపక్రమేద్భిషగ్దోష బలకాలవిశేషవిత్" (చరక. చి. అ. ౧౩. శ్లో. ౫౫, ౫౮.) "అనన్నకాంక్షా పిపాసా గుదస్రావ శూలశ్వాసకాస దౌర్బల్యాని; అపి చోదరం నానావర్ణరాజిసిరాసన్తతముదక పూర్ణదృతి క్షోభసంస్పర్శం భవతి; ఏతదుదకోదరం విద్యాత్." (చరక. చి. అ.౧౩. సూత్రం. ౪౮.) జలములేని యుదరమున వాపులేక అరుణవర్ణము కల్గి భారము అధికముగ లేక శబ్దముతో గూడియుండును. గుడగుడయను శబ్దముకలిగి సిరలచే నావరింపబడియుండును. అపానవాతము ప్రకుపితమై బొడ్డుదగ్గర పట్టినట్లు బాధ కల్గించి గుదస్థానమున వేగము చూపి హృదయమునందును గజ్జలయందును నడుమునందును నాభియందును గుదమునందును నొప్పిని కల్గించి కర్కశముగ బైటవెడలును. జఠరాగ్ని కొంచెముగ మందగించును. నోట జొల్లుకారుచు నరుచి విశేషముగ నుండును. మూత్రము స్వల్పముగ వెడలును. మలము కఠినమైయుండును. ఇట్టిలక్షణములబట్టి యుదరమున జలములేదని యెరింగి దోషముల బలాబలమును గమనించి తదనుసారముగ చికిత్సచేయదగును. మరియు జలము పూర్తిగకల యుదరమునందు అన్నమును భుజింప నిచ్చబొడమదు. దప్పి యధికమగును. గుదముచుండి నీరు స్రవించును. కడుపులో నొప్పియు శ్వాసకాలంబులును కల్గి బలము నశించును. ఉదరము నానావిధ వర్ణములుకల్గిన రేఖలును సిరలును కల్గి నీటిచే నిండియున్న తోలుతిత్తివలె గళబిళ మను శబ్దముకల్గి యుబికియుండును. (ఇత్తెఱంగున జలోదరమునకును జలములేని యుదరమునకును పరస్పరభేదము నెఱుంగునది.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఉదరనిదానం సమాప్తమ్.

# ౩౬. శోథనిదానమ్

ఉదరవ్యాధి సామాన్యముగ శోథ యుపద్రవరూపముగ నుండును. కావున నుదరనిదానమును జెప్పినపిదప శోథనిదానమును జెప్పుట.—

**శోథ సంప్రాప్తి భేదములు**

రక్తపిత్తకఫాన్ వాయుర్దుష్టో దుష్టాన్ బహిస్సిరాః,
నీత్వా రుద్ధగతి స్తైర్హి కుర్యాత్త్వఙ్మాంససంశ్రయమ్. 1
ఉత్సేధం సంహతం శోథం; తమాహుర్నిచయాదతః,
సర్వం; హేతువిశేషైస్తు రూపభేదాన్నవాత్మకమ్. 2
దోషైః పృథగ్ద్వయైస్సర్వై రభిఘాతాద్విషాదపి,

వాతము స్వవర్ధకములైన కారణములచే ప్రకోపమునొంది తమతమ కారణములచే దుష్టములైన రక్త - పిత్త - కఫములను శరీరమునందలి బాహ్యసిరలను బొందించి, యట్టి రక్తపిత్త కఫములచే నడ్డగింపబడిన మార్గము కలదియై, చర్మ మాంసముల నాశ్రయించి, నిశ్చలముగ నుండు వాపును కల్గించును. ఇయ్యది శోథ మనంబడును. ఇయ్యది పై జెప్పినరీతిగ త్రిదోషములచే జనించును కావున త్రిదోషజన్య మగును. అయినను వాతపిత్తకఫములచే వేర్వేరుగ నొక్కొక దోషము చేతను, రెండేసి దోషముల సంసర్గముచేతను, అన్నింటిచేతను, అభిఘాతముచేతను, విషముచేతను జనించుటంజేసి తొమ్మిదివిధము లగును. (వాతికము, పైత్తికము, శ్లైష్మికము, వాతపిత్తజము, వాతకఫజము పిత్తకఫజము, సాన్నిపాతికము, అభిఘాతజము, విషజము నని తొమ్మిదివిధములు అని భావము.)

ఇచ్చట "నిచయాదతః, సర్వం" అని చెప్పుటచే దోషత్రయప్రకోపమున శోథ లన్నియు జనించు నని తెలియుచున్నది. అయినను అట్టి త్రిదోషములలో నేదోష మధికముగ ప్రకోపించునో దాన జనించినశోథము అట్టిభేదము కల్గిన దనియు, దోషములు మూడును సమములుగ ప్రకోపించినది సాన్నిపాతిక మనియు, రెండేసి దోషము లధికముగ నున్నది ద్విదోష మనియు భేదము తెలియంగునది.

మరియు నీ సామాన్య శోథమునకును వ్రణశోథమునకును లక్షణస్వరూపాదు లొక్కటిగ నున్నను ఆశ్రయభేదముచే భేదము గల్గినది. ఎట్టు లన—శోథకు సామా

న్యముగ త్వఙ్మాంసములు రెండుమాత్రము స్థానములు. వ్రణశోథమునకు త్వక్కు, మాంసము, సిరలు, స్నాయువులు, అస్థులు, సంధులు, కోష్ఠము, మర్మములు అను నీ యెనిమిదియు స్థానములు కావున పరస్పరము భిన్నములై యుండును. వ్రణస్థానములు సుశ్రుతమున నిట్లు చూపబడినవి:—"త్వఙ్మాంస సిరాస్నాయ్వస్థి సన్ధికోష్ఠమర్మాణీ త్యష్టౌ వ్రణవాస్తూని భవన్తి." (సు. సూ. అ. ౨౨.) మఱియు "ఏకదేశస్థితః శోథో వ్రణానాం పూర్వలక్షణం" అని యుండుటచే నొక్క స్థలమున జనించునది వ్రణశోథ యగును.

### శోథ పూర్వరూపము

తత్పూర్వరూపం దవథుః సిరాయామోఽఙ్గగౌరవమ్. 3

శోథ జనించుటకు మునుమున్ను కన్నులు మొదలగువానినుండి యావిరి వచ్చునట్లుండును. వాపు కల్గు స్థలమున నరములు బిగిసి దీర్ఘములుగ నుండును. అట్టి స్థలమున బరువుగనుండును. ఇవి యన్నియు శోథము జనించుటకుమున్ను కల్గు పూర్వరూపములు.

ఇచ్చట దవథు వనగ "దవథుశ్చక్షురాదిభ్యస్తీవ్రమూష్మప్రవర్తనమ్" అను తంత్రాంతరవాక్యమునుబట్టి కన్నులు నాసాదిరంధ్రములు మున్నగు స్థలములనుండి తీవ్రముగ వెడలు ఆవిరి యని యెరుంగునది.

### శోథ జనించుటకు కారణము

శుద్ధ్యామయాభుక్తకృశాబలానాం
క్షారామ్లతీక్ష్ణోష్ణగురూపసేవా,
దధ్యామమృచ్ఛాకవిరోధిదుష్ట
గరోపసృష్టాన్ననిషేవణం చ. 4
అర్శాంస్యచేష్టా న చ దేహశుద్ధిః
మర్మోపఘాతో విషమా ప్రసూతిః,
మిథ్యోపచారః ప్రతి కర్మణాం చ
నిజస్య హేతుః శ్వయథోః ప్రదిష్టః. 5

వమనవిరేచనాదులచే శరీరశోధనము నధికముగ జేసికొనుటచేనైనను, రోగములచేనైనను, వేళకు ఆహారము దినక యుపవాసముల జేయుటచేనైనను శరీరము కృశించి శరీరబలము నశించినవారికి శోథ జనించును. మరియు క్షారము (కారము)ను, పులుపుగల వస్తువులను, తీక్ష్ణ - ఉష్ణగుణములుగల ద్రవ్యములను, చిరకాలమునకు జీర్ణించు గురుపదార్థములను విశేషముగ నుపయోగించినను; పెరుగును, పక్వముగాని

పదార్థములను, మట్టిని, ఆకుగూరలను, పరస్పరవిరుద్ధములగు క్షీర మత్స్యాదులను, కీటాదులచే దుష్టమైన యన్నమును, విషముచే దుష్టమైన యన్నమును భుజించినను శోథ కల్గును. మరియు అర్శోరోగము, పనిలేక నిర్వ్యాపారముగ నుండుట, వమనవిరేచనాదులచే దోషముల వెడలింపకుండుట, మర్మస్థలములయం దభిఘాతము కల్గుట, విధివిహిత కాలమునగాక విరుద్ధముగ నకాలాది ప్రసవము కల్గుట, వమనాది కర్మలయందు అపథ్యముల నాచరించుట, లేక శాస్త్రమునకు విరుద్ధముగ వమనాది కర్మల జేసికొనుట, ఇవి మున్నగు కారణములచే నైనను నిజ (దోషజ) శోథ జనించును.

### శోథ సామాన్యలక్షణములు

సగౌరవం స్యాదనవస్థితత్వం
సోత్సేధమూష్మాథ సిరాతనుత్వమ్,
సలోమహర్షశ్చ వివర్ణతా చ
సామాన్యలిఙ్గం శ్వయథోః ప్రదిష్టమ్. 6

వాపు మిగుల భారమై యొక్కచోనైనను నిల్కడలేక చంచలముగ నుండుట, మిగుల నున్నతంబై వేడిగనుండుట, సిరలు పైకి కనబడక నుండుట, రోమములు నిట్ర బొడిచియుండుట, వాపుకల్గినస్థలమున శరీరవర్ణము మారియుండుట, ఇవి యన్నియు వాపు లన్నిటియందును సామాన్యముగ నుండు లక్షణములు.

### వాతికశోథలక్షణము

చల స్తనుత్వక్పరుషోఽరుణోఽసిత
స్సుషుప్తిహర్షార్తియుతోఽనిమిత్తతః,
ప్రశామ్యతి ప్రోన్నమతి ప్రపీడితో
దివా బలీ చ శ్వయథు స్సమీరణాత్. 7

వాతప్రకోపమున జనించిన శోథమునందు వాపు ఒక్కచోనైన నిల్కడలేక చంచలమైయుండును. వాపుకల్గినచోట చర్మము పలుచనై పరుషంబును అరుణవర్ణంబును లేక నల్లనిరంగు కల్గినదియు నైయుండును. చర్మమున స్పర్శము దెలియక వెండ్రుకలు జలదరించుకొని నొప్పియు కల్గియుండును. కారణములేక తనంతనే శమించును. చేత నదిమినయెడ గుంటపడి మరల తనంతనే శీఘ్రముగ పైకి నుబుకును. రాత్రియందు స్వల్పముగ నుండి పగటిపూట విశేషముగ నుండును.

మరియు వాగ్భటమున కొన్నిలక్షణము లిట్లు చెప్పబడినవి.—"స్నిగ్ధోష్ణమర్దనై శ్శామ్యేద్రాత్రావల్పో దివా మహాన్, త్వక్చ సర్షపలిప్తేవ తస్మిం శ్చిమిచిమాయతే"

(అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౩౨.) స్నిగ్ధంబును ఉష్ణంబునగు ఔషధములచేతను, మర్దనముచేతను వాపు శాంతినొందును. రాత్రులయందు స్వల్పముగనుండి పగటియందు ప్రబలమగును. వాపుకల్గినచోట చర్మము ఆవాలు నూరి పూసినవిధముగ చిమచిమ లాడుచుండును.

## పైత్తికశోఫలక్షణము

మృదుస్సగన్ధోఽసితపీతరాగవాన్
భ్రమజ్వరస్వేదతృషామదాన్వితః,
య ఉష్యతే స్పృష్టరుగక్షిరాగకృత్
స పిత్తశోథో భృశదాహపాకవాన్. 8

పిత్తప్రకోపమున జనించినశోఫ మెత్తనై విస్రమైన వాసనగల్గి నీలవర్ణంబైనను పచ్చనిరంగైనను ఎఱ్ఱనిరంగైనను కల్గియుండును. భ్రమంబును జ్వరంబును చెమటయు కల్గును. దప్పి యధిక మగును. ఉన్మత్తకాయ తిన్నవానివలె తిక్క యెత్తును. మంటయు నొప్పియు కల్గును. కన్ను లెఱ్ఱవారును. మిక్కిలి మంటతోగూడిన పుండగును.

వాగ్భటమున "శీతాభిలాషీ విడ్భేదీ గన్ధీ స్పర్శాఽసహో మృదుః" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౩౪.) అని యుండుటచేత శీతోపచారముల గోరు ననియు, మలము ఉండలై వెడలు ననియు, ఆమగంధముకలిగి స్పర్శము నోరువజాలక మిక్కిలి మృదువై యుండు ననియు నెరుంగునది.

## శ్లైష్మికశోఫలక్షణము

గురుస్స్థిరః పాణ్డురరోచకాన్వితః
ప్రసేకనిద్రావమివహ్నిమాన్ద్యకృత్,
సకృచ్ఛ్రజన్మప్రశమో నిపీడితో
న చోన్నమేద్రాత్రిబలీ కఫాత్మకః. 9

కఫప్రకోపమున కల్గినశోఫ మిక్కిలి బరువుకల్గి కదలనిదై పాండువర్ణము కల్గి యుండును. అరోచకము కల్గి నోట నీరు గార్చును. నిదుర విశేషముగ బట్టును. వాంతి యగును. జఠరాగ్ని మందగించును. అవ్యాధి మిక్కిలి కష్టముచే గల్గి కష్టముచేతనే శమించును. వాపుకల్గినచోట వేలితో నదిమినచో గుంటపడి అవ్యాధి మరల వెంటనే పూడకయుండును. రాత్రులయందు బలిష్ఠమై యుండును.

వాగ్భటమున "స్పర్శోష్ణకాంక్షీ చ కఫాత్" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౩౬.) అని యుండుటచేత నీశోఫమున నుష్ణస్పర్శమును విశేషముగ గోరుచుండు నని తెలియునది.

మరియు రాత్రులయందు స్రోతస్సులన్నియు మూయబడి చేష్టల దక్కియుండు టంజేసి కఫము మిక్కిలి యుత్కటంబై వృద్ధినొందును. కావున దాన జనించిన శోఫంబును రాత్రివేళల బలిష్ఠమగును. పగటియందు స్రోతస్సులన్నియు దెరువంబడియుండుటచేతను, మనుజులు సంచారాదివ్యాపారములయం దాసక్తులగుటంజేసియు కఫము కరగి వృద్ధినొందకుండును. కావున దానివలన కల్గుశోఫయు పగటిపూట యుత్కటము గాక తగ్గియుండును కావున "రాత్రిబలీ కఫాత్మకః" అని మూలమున జెప్పబడినది.

### ద్వన్ద్వజ-సన్నిపాతజశోఫలక్షణములు

నిదానాకృతిసంసర్గాచ్ఛ్వయథుస్స్యాద్ద్విదోషజః,
సర్వాకృతిస్సన్నిపాతాచ్ఛోథో వ్యామిశ్రలక్షణః. 10

రెండేసిదోషముల నిదానంబులును లక్షణంబులును సంసర్గమైయున్నయెడ ద్విదోషజములని, అన్నియు జేరియున్నయెడ సాన్నిపాతిక మనియు నెరుగునది. (అనగా పై జెప్పబడినప్రకారము వాతాదిదోషములకు వేరువేర నేర్పడిన నిదానలక్షణములలో రెండేసిదోషములయొక్క కారణముల సంసర్గముచే జనించి, రెండేసిదోషముల లక్షణములు మిశ్రముగ నున్నచో ద్వంద్వజము లనియు, అన్నిటికిని జెప్పినకారణములచే జనించి అన్నింటి లక్షణము లన్నియు కల్గినది సన్నిపాతజ మనియు నెఱుంగునది.)

### ఆగంతుకశోఫలక్షణము

అభిఘాతేన శస్త్రాదిచ్ఛేదభేదక్షతాదిభిః,
హిమానిలోదధ్యనిలైః భల్లాతకపికచ్ఛుజైః. 11
రసైశ్శూకైశ్చ సంస్పర్శాత్ శ్వయథుస్స్యాద్విసర్పవాన్,
భృశోష్మా లోహితాభాసః ప్రాయశః పిత్తలక్షణః. 12

దండప్రహారాదులచే నభిఘాతము కల్గినను, శస్త్రాదులచేనైన ఛేదనభేదనాదులచే గాయము లయినను, మంచుగాలియు సముద్రపుగాలియు సోకినను, జీడిగింజలరసము గాని పొగగాని సోకినను, దురదగొండినూగు తగిలినను వాపు కల్గును. ఇయ్యది యొక్కచో నిల్కడలేక శరీరమునందెల్ల వ్యాపించును. మిక్కిలి వేడికల్గి యెఱ్ఱని కాంతికల్గి ప్రాయికముగ పిత్తలక్షణములు కల్గియుండును [ఇయ్యది యాగంతుకములగు కారణములచేత జనించుటంజేసి యాగంతుకశోఫ మని చెప్పనగును.]

### విషజశోఫలక్షణము

విషజస్సవిషప్రాణిపరిసర్పణమూత్రణాత్,
దంష్ట్రాదన్తనఖాఘాతాత్ అవిషప్రాణినామపి. 13
విణ్మూత్రశుక్రోపహతమలవద్వస్త్రసఙ్కరాత్,
విషవృక్షానిలస్పర్శాత్ గరయోగావచూర్ణనాత్. 14
మృదుశ్చలోఽవలమ్బీ చ శీఘ్రో దాహరుజాకరః,

విషముతోఁగూడిన సర్పాదిజంతువులు శరీరముపై పాకులాడినను, అట్టిజంతువుల మూత్రము శరీరముపై సోకినను, వాని కోరలచేనైనను దంతములచేనైనను గోళ్లచేనైనను అభిఘాతము కల్గినను, విషములేని జంతువులయొక్క *దంష్ట్రాదంతనఖముల యభిఘాతముకల్గినను, పైజెప్పిన విషజంతువులయొక్క మలమూత్రశుక్రములతో కలిసిన వస్త్రములనైనను కేవలము మలినములైన వస్త్రములనైనను స్పృశించినను, విషవృక్షములను విషసంగతమైన గాలిని స్పృశించినను, విషముతో గూడిన యౌషధముల శరీరముపై బూసికొనినను శరీరమున వాపు కల్గును. ఇయ్యది విషసంబంధమున గల్గుటంజేసి విషజశోఫమని చెప్పనగును. ఈశోఫమునందు వాపు మెత్తగను చంచలముగనుండి వ్రేలాడుచు శీఘ్రముగ శరీరముపై వ్యాపించును. మంటయు నొప్పియు విశేషముగ కల్గును.

### ఆయాభాగములందు శోఫము జనించుక్రమము

దోషాశ్శ్వయథుమూర్ధ్వం హి కుర్వన్త్యామాశయస్థితాః. 15
పక్వాశయస్థా మధ్యే తు వర్చస్థానగతాస్త్వధః,
కృత్స్నం దేహమనుప్రాప్తాః కుర్యుస్సర్వసరం తథా. 16

వాతపిత్తకఫము లామాశయమున జేరినపుడు శరీరమునం దూర్ధ్వభాగ (రొమ్ము పైభాగ)మున శోఫమును కల్గించును. పక్వాశయమున జేరినపుడు మధ్యశరీర (రొమ్మును పక్వాశయమునకును మధ్యభాగ)మున వాపును గల్గించును. మలాశయమున నున్న యెడ పక్వాశయమునకు క్రిందిభాగమున శోఫమును కల్గించును. త్రిదోషములు శరీరమునం దెల్ల వ్యాపించినపుడు శరీరమునందంతటను శోఫమును కల్గించును.

### అసాధ్యశోఫలక్షణము

యో మధ్యదేశే శ్వయథుస్సకష్టస్సర్వగశ్చ యః,
అర్ధాఙ్గేఽరిష్టభూతస్స్యాత్ యశ్చోర్ధ్వం పరిసర్పతి. 17

*దంష్ట్రా=కోరలు. దంత=పండ్లు.

శరీరమునందు మధ్యభాగమున జనించిన శోఫము, సర్వాంగముల వ్యాపించిన శోఫంబును, అర్ధశరీరమునం దరిష్ట (మరణసూచక లక్షణముగ జనించిన శోఫంబును అసాధ్యమగును. మరియు శరీరమున పాదముల జనించి పైకివ్యాపించు శోఫంబును అసాధ్య మగును.

తంత్రాంతరమున పైకి వ్యాపించు శోఫమునుగూర్చి యిట్లు నిర్ణయము గానం బడియెడు:—"యస్తు పాదాభినిర్వృత్తః శోథస్సర్వాఙ్గగో భవేత్, పురుషం హన్తి, నారీంచ ముఖజో గుహ్యజో ద్వయమ్" తొలుత పాదములయందు బుట్టి శరీరమునం దెల్ల పైకి వ్యాపించుశోఫము పురుషుని చంపును. స్త్రీలకు ముఖమునబుట్టి క్రిందిశరీరమునం దెల్ల వ్యాపించినవాపు వారిని చంపును. గుహ్యమున జనించిన శోఫము స్త్రీలనైనను పురుషులనైనను తప్పక చంపును.

### ఉపద్రవములచే నసాధ్యత్వము

శ్వాసగ పిపాసా ఛ్ఛర్దిశ్చ దౌర్బల్యం జ్వర ఏవ చ,
యస్య చాన్నే రుచిర్నాస్తి శ్వయథుం తం విసర్జయేత్. 18

శ్వాసము, దప్పి, వాంతి, బలహీనము, జ్వరము, అన్నము రుచింపకుండుట ఈ యుపద్రవములు శోఫరోగమున గల్గినచో నయ్యది యసాధ్యమగును కావున చికిత్స చేయజనదు.

### వేరొండసాధ్యలక్షణము

అననోప్యపద్రవకృతశ్శోథః పాదసముత్థితః,
పురుషం హన్తి నారీం చ ముఖజో గుహ్యజో ద్వయమ్.

పాండురోగము మున్నగు వ్యాధుల కుపద్రవరూపము గాక స్వతంత్రముగ జనించుశోఫము మొట్టమొదట పాదములయందు పుట్టి పైకి వ్యాపించినచో నయ్యది పురుషుని చంపును. ఆరీతిగనే స్వతంత్రమగుశోఫ మొదట ముఖమునబుట్టి క్రిందిశరీరమున వ్యాపించినయెడ స్త్రీలను తప్పక చంపును. గుహ్యస్థలమున స్వతంత్రముగ బుట్టిన శోఫము స్త్రీలనైనను పురుషులనైనను చంపకమానదు.

పైజెప్పిన విషయమే తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"ఊర్ధ్వగామీ నరం పద్భ్యాం అధోగామీ ముఖాత్ స్త్రియమ్, ఉభయం వస్తిజాతః శోథో హంతి న సంశయః" ఇచ్చట "వస్తి సంజాతః" అనగా పొత్తికడుపున పుట్టినవాపు స్త్రీ పురుష సామాన్యముగ నసాధ్యం బని భావము.

### మరికొన్ని సాధ్యాఽసాధ్యలక్షణములు

నవోఽనుపద్రవశ్శోథః సాధ్యోఽసాధ్యః పురేరితః. 19
విసర్జయేత్కుక్ష్యుదరాశ్రితం చ
తథా గలే మర్మణి సంశ్రితం చ,
స్థూలః ఖరశ్చాపి భవేద్విసర్జ్యో
యశ్చాపి బాలస్థవిరాబలానామ్. 20

నూతనముగ జనించి యుపద్రవములు లేకుండు శోఫము సాధ్యమగును. పైజెప్పబడిన లక్షణములు కలది యసాధ్యమగును. మరియు కుక్షిని ఉదరమును కంఠమును మర్మస్థలములను ఆశ్రయించి పుట్టిన శోథము అసాధ్యము. మిక్కిలి స్థూలంబై కర్కశమైయుండు శోఫంబును, బాలురకును ముదుసలులకును బలహీనులకును జనించిన శోఫంబును అసాధ్యము; కావున చికిత్సజేయంజనదు.

పైజెప్పిన శ్లోకములలో "నవోనుప...పురేరితః" అను అర్ధశ్లోకము వాగ్భటమున నున్నది. "పురేరితః" అనుదానికి, ముందు వికృతి విజ్ఞానీయాధ్యాయమున జెప్పబడిన "అనేకోపద్రవయుతః పాదాభ్యాం ప్రసృతో నరమ్, నారీం శోఫోముఖాద్ధంతి కుక్షిగుహ్యాదుభావపి" (అ. హృ. శా. అ. ౫. శ్లో. ౯౨. ౯౩.) "అను శ్లోకమున జెప్పిన లక్షణములుగల శోఫ యసాధ్యమని యర్థము" అని సర్వాంగసుందరీ వ్యాఖ్యానమున నున్నది.

చరకమున శోఫోపద్రవము లిట్లు చెప్పబడినవి:—"ఛర్దిస్తృష్ణాఽరుచిశ్శ్వాసః జ్వరోఽతీసార ఏవ చ, సప్తకోఽయం సదౌర్బల్యః శోథోపద్రవసంగ్రహః" (చరక. చి. అ. ౧౨.) వమనము, దప్పి, అరోచకము, శ్వాసము, జ్వరము, అతిసారము, దౌర్బల్యము అను నీయేడును శోఫరోగమున గల్గు నుపద్రవములు. సుశ్రుతమున కొన్నియుపద్రవము లధికముగ చెప్పబడినవి:—"శ్వాసః పిపాసా దౌర్బల్యం జ్వరశ్ఛర్దిరరోచకః, హిక్కాఽతీసారకాసాశ్చ శోథినం క్షపయన్తి హి" (సుశ్రుత. చి. అ. ౨౩.) శ్వాసము, దప్పి, దౌర్బల్యము, జ్వరము, వాంతి, అరోచకము, ఎక్కిళ్ళు, అతిసారము, దగ్గు ఇవి యన్నియు శోఫమున జనించు నుపద్రవములు. ఈ యుపద్రవములు కల్గిన శోఫవ్యాధి మనుజుని చంపును. ఈ సుశ్రుతమున కాసము ఎక్కిళ్ళును అధికముగ జెప్పబడినవి.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శోథనిదానం సమాప్తమ్.

# ౩౭. వృద్ధినిదానమ్

శోథనిదానమును జెప్పినపిదప దానికి సమానజాతీయ మైన వృద్ధినిదానమును జెప్పుట.—

### వృద్ధిసంప్రాప్తి

క్రుద్ధోఽనూర్ధ్వగతిర్వాయుశ్శోథశూలకరశ్చరన్,
ముష్కౌ వఙ్క్షణతః ప్రాప్య ఫలకోశాభివాహినీః. 1
ప్రపీడ్య ధమనీర్వృద్ధిం కరోతి ఫలకోశయోః,

వాతము ప్రకోపమునొంది శరీరమునం దధోభాగమున సంచరించుచు వృషణములయందును గజ్జలయందును వ్యాపించి, అండకోశములయందును అండములయందును వ్యాపించియుండు సిరలను చెఱచి, అండకోశమునందును అండములయందును వాపును కల్గించి పోటును నొప్పిని పుట్టించును. పై జెప్పినవిధముగ నండకోశములయందలి సిరల నానాట వృద్ధినొందించును. ఇయ్యది వృద్ధిరోగ మని చెప్పబడును.

### వృద్ధిరోగ సంఖ్య

దోషాస్రమేదోమూత్రాన్త్రైః సంవృద్ధిస్సప్తధా గదః. 2
మూత్రాన్త్రజావప్యనిలాద్ధేతుభేదస్తు కేవలమ్,

పై జెప్పిన వృద్ధిరోగము వాత - పిత్త - కఫములచేతను, రక్తముచేతను, మూత్రముచేతను, ఆంత్రము (ప్రేవుల) చేతను వేరువేర జనించుటంజేసి యేడువిధములు. ఇందు మూత్ర - ఆంత్రములచే జనించు వృద్ధియందును వాతము ప్రధానముగ నున్నను చికిత్సాభేదము నిర్ణయించుటకై త్రిదోషములకన్న కారణములు వేరుగ జెప్పబడినవి.

### త్రిదోషవృద్ధిలక్షణములు

వాతపూర్ణదృతిస్పర్శో రూక్షో వాతాదహేతురుక్. 3
పక్వోదుమ్బరసఙ్కాశః పిత్తాద్దాహోష్మపాకవాన్,
కఫాచ్ఛీతో గురుస్స్నిగ్ధః కణ్డూమాన్ కఠినోఽల్పరుక్. 4

వాతప్రకోపమున జనించిన యండవృద్ధియందు చేత తాకినచో గాలిచే నిండియున్న తోలుతిత్తివలె నుండి రూక్షముగ నుండును. కారణము లేకనే నొప్పికలుగును. పిత్తప్రకోపమున జనించిన వృద్ధిరోగమున చక్కగ పండిన యత్తిపండువలె నుండి మంటకల్గి వేడితోగూడి పుం డగును. కఫప్రకోపమున గల్గిన యండవృద్ధియందు

చల్లనై భారముకల్గి స్నిగ్ధమై దురదతో గూడి మిక్కిలి కఠినముగ నుండును. నొప్పి స్వల్పముగ నుండును.

### రక్తజ - మేదోజవృద్ధిలక్షణములు

కృష్ణస్ఫోటావృతః పిత్తవృద్ధిలిఙ్గశ్చ రక్తజః,
కఫవన్మేదసా వృద్ధిర్మృదుస్తాలఫలోపమః. 5

రక్తమున జనించిన వృద్ధియందు నల్లనిబొబ్బలచే నావరింపబడి పైత్తికవృద్ధి లక్షణములు కల్గియుండును. మేదస్సుచే జనించిన యండవృద్ధియందు మెత్తనై తాటి పండువలె గుండ్రనై కఫజవృద్ధికి చెప్పినలక్షణములు కల్గియుండును.

### మూత్రజవృద్ధిలక్షణము

మూత్రధారణశీలస్య మూత్రజః స తు గచ్ఛతః,
అమ్భోభిః పూర్ణదృతివత్ క్షోభం యాతి స రుఙ్మృదుః. 6
మూత్రకృచ్ఛ్రమధస్స్యాచ్చ చాలయన్ ఫలకోశయోః,

మూత్రమును విసర్జించవలసినకాలమున విడువక దానివేగమును నిరోధించుట చేత యండము వృద్ధినొందును. ఇయ్యది మూత్రజాండవృద్ధి యని చెప్పబడును. అయ్యది మనుజుడు నడచునప్పుడు నీళ్లనిండియుండు తోలుతిత్తివలె కదలుచుండును. మెత్తనై నొప్పితో గూడియుండును. అండకోశమునకు క్రింద కదలుచు మూత్రకృచ్ఛ్రబాధను కల్గించును.

### అంత్రజవృద్ధిలక్షణము

వాతకోపిభిరాహారైః శీతతోయావగాహనైః. 7
ధారణేరణభారాధ్వవిషమాఙ్గప్రవర్తనైః,
క్షోభణైః క్షోభితోఽన్యైశ్చ క్షుద్రాన్త్రావయవం యదా. 8
పవనో విగుణీకృత్య సనివేశాదధో నయేత్,
కుర్యాద్వఙ్క్షణసన్ధిస్థో గ్రన్థ్యాభం శ్వయథుం తదా. 9

వాతమును ప్రకోపింపజేయు నాహారముల సేవించినను, చల్లనినీళ్లయందు తరుచు మునిగినను, మలమూత్రాదివేగము గల్గినపుడు వానిని వెడలింపక బిగబట్టినను, మలమూత్రాదులు రానినాడు వానిని బలాత్కారముగ వెడలించినను, భారమును మోచినను, విశేషముగ త్రోవనడచినను, అవయవముల విషమములుగ నునిచి పొరలాడినను, ఇవిగాక బలవంతులతో మల్లయుద్ధము, ధనుర్యుద్ధము మున్నగు పనుల శరీరావయవములకు కష్టముగల్గునట్లు చేసినను, వాతము ప్రకుపితమై సన్నటిప్రేగును స్వస్థానము నుండి చలింపజేసి అధోభాగమున జేర్చును. అయ్యది గజ్జలసంధియందు జేరి గ్రంథివలె నుండు శోఫమును కల్గించును. (అట్టిశోఫ కాలాంతరమున నండకోశమున జేరి నొప్పిని కల్గించి పెద్దదిగ వృద్ధినొందించును.) ఇయ్యది ఆంత్రజవృద్ధి యని చెప్పబడును.

ఇచ్చట మూలమున గ్రంథిరూపమువరకు చెప్పియున్నది గాని తక్కిన విష యము చెప్పలేదు. అయినను ఈసంప్రాప్తిని భోజునితంత్రమున "ఆంత్రం విగుణ మాదాయ జన్తోర్నయతి వంక్షణమ్, వంక్షణాత్తద్రుజాయుక్తం ఫలకోశం ప్రపద్యతే" అని విశదముగ జెప్పియున్నది. పై జెప్పిన లక్షణములో గ్రంథిరూపమున నున్నపుడు సాధ్యంబును, అండకోశమున జేరునపుడు శస్త్రసాధ్యంబు నగును; లేక నసాధ్యమైన నగును.

బ్రధ్నలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"అత్యభిష్యన్ది గుర్వన్న సేవనాన్నిచయం గతః, కరోతి గ్రంథివచ్ఛోఫం దోషో వంక్షణసన్ధిషు. జ్వరశూలాఙ్గ సాదాఢ్యం తం బ్రధ్నమితి నిర్దిశేత్" మిక్కిలి యభిష్యన్ది (స్రోతస్సుల ద్రవమును బుట్టించు) పదార్థములను, అజీర్ణకరములగు పదార్థములను విశేషముగ సేవించుటచే దోషము ప్రకుపితమై గజ్జలసందులయందు గ్రంథిని బోలిన వాపును గల్గించును. ఇయ్యది బ్రధ్న మని చెప్పబడును. దీనియందు జ్వరము, శూల, శరీరము కృశించుట ఈలక్షణములు కల్గును. ఈవ్యాధి ఆంత్రవృద్ధినిబోలె కొంచెము భేదముకల్గి యుండును. కావున ప్రకృత గ్రంథమున వేరుగ జెప్పియుండలే దని యెరుంగునది.

**అండవృద్ధి నుపేక్షించుటచే గల్గుబాధలు**

ఉపేక్ష్యమాణస్యచ ముష్కవృద్ధిం
ఆధ్మానరుక్ స్తమ్భవతీం సవాయుః,
ప్రపీడితోఽన్తస్స్వనవాన్ ప్రయాతి
ప్రధ్మాపయన్నేతి పునశ్చ ముక్తః. 10

పై జెప్పిన వృద్ధిరోగమునందు అండకోశ ముబికి నొప్పికల్గి స్తంభించియుండు నపుడు తగిన యుద్యమముతో చికిత్సచేయక యుపేక్షించినచో కాలాంతరమున మిక్కిలి ప్రకోపము నొంది చేత గట్టిగ బిగబట్టినపుడు లోపల గుడగుడ మనుధ్వనికల్గి వాతము లోనికిపోవును. పట్టివిడిచినపుడు మరల వాతముచేరి మునుపటివలె నుబుకును. (ఇట్టి పరిస్థితియందు అసాధ్యమగును.)

**ఆంత్రవృద్ధికసాధ్యలక్షణము**

ఆన్త్రవృద్ధిరసాధ్యోఽయం వాతవృద్ధిసమాకృతిః.

పై జెప్పిన యాంత్రవృద్ధి వాతజాండవృద్ధితో సమానలక్షణములు గల్గియున్న యెడ నసాధ్యంబై యుండును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
వృద్ధినిదానం సమాప్తమ్.

# ౩౮. గలగండ-గండమాలాఽపచీగ్రంథ్యర్బుద నిదానమ్

గలగండము అండవృద్ధినిబోలె వృద్ధిరూపమైనది కావున వృద్ధినిదానమును జెప్పినపిదప గలగండాదినిదానము చెప్పుటః—

### గలగండసామాన్యలక్షణము

నిబద్ధశ్శ్వయథుర్యస్య ముష్కవల్లమ్బతే గలే,
మహాన్వా యది వా హ్రస్వో గలగణ్డం తమాదిశేత్. 1

కంఠమునందు క్రిందిభాగమున వాపుకల్గి అయ్యది నిలిచి యండమువలె వ్రేలుచున్నయెడ నయ్యది గలగండ మని చెప్పనగును. ఇది చిన్నదిగనైనను గొప్పదిగనైన నుండును.

### గలగండసంప్రాప్తి

వాతః కఫశ్చాపి గలే ప్రదుష్టో మన్యే చ సంశ్రిత్య తథైవ మేదః,
కుర్వంతి గణ్డం క్రమశస్స్వలిఙ్గైః సమన్వితం తం గలగణ్డమాహుః.

వాతంబును కఫంబును మేదస్సును వేరువేరుగ దుష్టములై మెడనరముల నాశ్రయించి వానివానిలక్షణములతో గూడిన వాపును గడ్డమునకు దిగువ కంఠస్థలమున గల్గించును. ఇయ్యది కంఠస్థానమున జనించునది కావున గలగండ మని యన్వర్థముగ జెప్పబడును.

ఇయ్యది వాత-కఫ-మేదస్సుల జనించుటంజేసి మూడువిధములు. క్రమముగ వాతకఫమేదో లక్షణములు కల్గియుండును.

### వాతికగలగండలక్షణము

తోదాన్వితః కృష్ణసిరావనద్ధః
శ్యావోఽరుణో వా పవనాత్మకస్తు,
పారుష్యయుక్తశ్చిరవృద్ధ్యపాకో
యదృచ్ఛయా పాకమియాత్కదాచిత్. 3

వైరస్యమాస్యస్య చ తస్య జన్తోః
భవేత్తథా తాలుగలప్రశోషః,

వాతప్రకోపమున జనించిన గలగండమునందు సూదులతో బొడిచినవిధముగ పోటుకల్గి నల్లని నరములు వ్యాపించియుండును. శ్యామవర్ణంబైనను అరుణవర్ణంబైనను కల్గియుండును. మిక్కిలి పరుషమై చిరకాలమునకు వృద్ధినొందును. అది పరిపక్వము గాక పగులక యుండును. లేక కారణము లేకయే యొకానొకప్పుడు తనంతనే పరిపక్వమై పగులును. ఈవ్యాధి కల రోగికి నోరు రుచి తెలియదు. తాలువులు కుత్తుకయు నెండి తడి లేకుండును.

### కఫజగలగండలక్షణము

స్థిరస్సవర్ణో గురురుగ్రకణ్డూ
శ్శీతో మహాంశ్చాపి కఫాత్మకస్తు. 4
చిరాభివృద్ధిం భజతే చిరాద్వా
ప్రపచ్యతే మన్దరుజః కదాచిత్,
మాధుర్యమాస్యస్య చ తస్య జన్తోః
భవేత్తథా తాలుగలప్రలేపః. 5

కఫప్రకోపమున జనించిన గలగండము కఠినమై శరీరసమానమైన వర్ణము గల్గి మిక్కిలి గొప్పదై బరువు కల్గి యుండును. మిక్కిలి తీవ్రమైన జిల కల్గి యుండును. చల్లగ నుండును. చిరకాలమునకు నానాట వృద్ధినొంది చాలకాలమునకు పరిపక్వమగును. ఒకప్పుడు స్వల్పముగ బాధ కల్గియుండును. ఈగలగండము కల రోగికి నోరు తీపిగ నుండును. తాలువులును కంఠమును కఫముచే పూయబడినట్లుండును.

### మేదోజగలగండలక్షణము

స్నిగ్ధో గురుః పాణ్డురనిష్టగన్ధః
మేదోభవః కణ్డుయుతోఽల్పరుక్చ,
ప్రలమ్బతేఽలాబువదల్పమూలో
దేహానురూపక్షయవృద్ధియుక్తః. 6
స్నిగ్ధాస్యతా తస్య భవేచ్చ జన్తో
ర్గలేఽనుశబ్దం కురుతే చ నిత్యమ్,

మేదస్సుచే జనించిన గలగండము నూనె పూసినవిధముగ నిగనిగలాడుచు మిక్కిలి బరువై పాండువర్ణము కల్గియుండును. సహింపరాని దుర్గంధము గల్గియుండును. కొంచెముగ నొప్పియు అధికమైన దురదయు గల్గియుండును. దీని మొదట తొడిమవలె సన్నమై సొరకాయవలె వ్రేలాడుచుండును. ఇయ్యది శరీరము కృశించినప్పుడు కృశతనొంది, శరీరము బలిసియున్నపుడు మిక్కిలి వృద్ధినొందును. ఈవ్యాధి కలరోగికి నోరు నూనెపూసిన విధముగ జిడ్డు కల్గి మాటలాడునపుడు కంఠమున ప్రతిధ్వని కల్గియుండును.

### అసాధ్యగలగండలక్షణము

కృచ్ఛ్రాచ్ఛ్వసన్తం మృదుసర్వగాత్రం సంవత్సరాతీతమరోచకార్తమ్.
క్షీణం చ వైద్యో గలగణ్డయుక్తం భిన్నస్వరం చాపి వివర్జయేచ్చ,

గలగండవ్యాధికలమనుజుడు మిక్కిలి కష్టముచే శ్వాసమువిడుచుచున్నను, శరీరమెల్ల మెత్తవడియున్నను, ఒక సంవత్సరకాలము గడచినను, అరోచకముచే బీడింపబడినను, శరీరము కృశించినను, కంఠస్వరము మారియున్నను అట్టి గలగండరోగము అసాధ్యము; కావున చికిత్స చేయజనదు.

### గండమాలాలక్షణము

కర్కన్ధుకోలామలకప్రమాణైః కక్షాంసమన్యాగలవఙ్క్షణేషు. 8
మేదఃకఫాభ్యాం చిరమన్దపాకైః స్యాద్గణ్డమాలా బహుభిశ్చగణ్డైః,

మేదస్సును కఫంబును ప్రకుపితములై చంకలయందైనను, మూపునందైనను, మెడనరములయందైనను, మెడ ముందుభాగమునందైనను, గజ్జలయందైనను, రేగుకాయ కమ్మరేగుకాయ ఉసిరికకాయలంతేసి ప్రమాణముగల గ్రంథులను కల్గించును. అయ్యది వరుసగ నొకటివెంబడి యింకొకటి పుట్టి చిరకాలమునకు మెల్లమెల్లగ పరిపక్వమై పగులును. ఇయ్యవి పై జెప్పిన స్థలములయందు వరుసగ మాలికవలె జనించుటంజేసి గండమాల యని చెప్పబడును. (గండము లనగ గ్రంథులు; అయ్యవి మాలారూపముగ వరుసగ పుట్టుటంజేసి గండమాల యని యన్వర్థముగ జెప్పబడును.)

### అపచీలక్షణము

తే గ్రన్థయః కేచిదవాప్తపాకాః స్రవన్తి నశ్యన్తి భవన్తి చాన్యే. 9
కాలానుబన్ధం చిరమాదధాతి సైవాఽపచీతి ప్రవదన్తి తత్జ్ఞాః,

పై జెప్పబడిన గ్రంథులు చిరకాలమునుండి యనుసరించి వ్యాపించి వానిలో కొన్ని పక్వములై పూయాదుల స్రవించుచు, తనంతనే పుట్టి తనకుతానే నశించుచు చాలకాలమువరకు విడువక యనుబంధముగ బాధించుచున్నయెడ నదియే అపచి యని వైద్యవేత్తలు చెప్పెదరు.

సుశ్రుతమున "చయప్రకర్షాదపచీం వదన్తి" (సుశ్రుత. ని. అ. ౧౧.) అని చెప్పియుండుటంజేసి ఒకటి వెంబడి మరియొకటి పొడమి, అది మాని దాని ప్రక్కన వేరొండు బొడముచు చాలకాల మనుసరించునది యపచి యని యన్వర్థముగ నెరుంగునది.

ఇచ్చట నీ నిర్ణయము నెరుంగునది:—వాతపిత్త కఫములు మూడును ప్రకోపమునొంది తనకు వృద్ధిని కల్గించుకారణముచే వృద్ధినొందిన మేదస్సుతోగూడి కాలి పిక్కలయందలి కండరములజేరి చేపగ్రుడ్లవలె నొండొంట చేరువగ నుండుగ్రంథుల ననేకముల గల్గించును. అట్టి గ్రంథులచే వాతము ప్రకుపితమై తక్కిన దోషములను కూడి శరీరమున పైకివ్యాపించి రొమ్ము, చంకలు, మెడయందలి వెనుప్రక్కనరములు, కంఠము అను నీ స్థలములయందు నానావిధములైన గ్రంథుల గల్గించును. ఇయ్యది అపచి యని చెప్పబడును. ఈ గ్రంథులలో కంఠమునందును, మెడకు వెనుకప్రక్కను, ముందుప్రక్కను, చంకలయందును, గజ్జలయందును కల సంధిస్థలములలో మాలికవలె వరుసగ నొకటివెంబడి యొకటిచేరి జనించినయెడ నవియే గండమాలయని చెప్పబడును. ఈ వివరణమును భోజు డిట్లు చెప్పెను:—"వాతపిత్తకఫా వృద్ధాః మేదశ్చాపి సమాచితమ్, జఙ్ఘయోః కండరాం ప్రాప్య మత్స్యాణ్డసదృశాన్ బహూన్. కుర్వన్తి గ్రథితాన్ తేభ్యః పునః ప్రకుపితోఽనిలః, తాన్ దోషానూర్ధ్వగో వక్షః కక్షమన్యాగలాశ్రితః. నానాప్రకారాన్ కురుతే గ్రన్థీన్ సా త్వపచీ మతా, అపచీ కంఠమన్యాసు కక్షవఙ్క్షణసన్ధిషు, గణ్డమాలాం విజానీయాత్ అపచీతుల్య లక్షణామ్." ఈ వాక్యములబట్టి కక్షములు మెడనరములు కంఠము గజ్జలు ఈ స్థలములనుండు సంధుల యందు మాలికవలె వరుసగ జనించునది గండమాలయనియు, పైజెప్పిన స్థలములయందు సంధినియమము లేక మాలారూపముగాక పలుదెరంగుల జనించుగ్రంథులు అపచి యనియు పరస్పరభేదము తెలియుచున్నది. "అపచీతుల్యలక్షణామ్" అని చెప్పుటచేత అపచీగండమాలలకు స్థలభేదమునుబట్టియు ఆకృతిని (మాలారూపమును) బట్టియుం భేద మేర్పడినదిగాని లక్షణములలో నీ రెండిటికి నేమాత్రము భేదము కానరాదని యెరుంగునది. ఇట్టిభేదము చికిత్సాసౌకర్యమునకై కల్పింపబడినది కాని వేరొండు ప్రయోజనము కానరాదు.

మరియు—"వాతపిత్త కఫావృద్ధా మేదశ్చాపి సమాచితమ్" అని చెప్పి యుండుటవలన వాతపిత్తకఫములు మూడుదోషములు దూష్యరూపమైన మేదస్సును కలిసి యీ రెండువ్యాధులను గల్గించునని తెలిసెడిని. అందు మేదస్సు కఫము ఈ రెండును ప్రధానముగ నుండు నని యుద్దేశించి ప్రకృత మూలగ్రంథమున "మేదఃకఫాభ్యాం" అని కఫమేదస్సులు రెండుమాత్రము నిర్దేశింపబడినవి.

చరకమున—"మేదఃకఫాత్ శోణిత సంచయోత్థో గలస్య మధ్యే గలగండ ఏకః, స్యాద్గండమాలా బహుభిశ్చ గండైః" అని చెప్పియున్నది. మేదస్సుచేతను కఫముచేతను రక్తము వృద్ధినొంది కంఠమునందు మధ్యభాగమున నొక్క గ్రంథిని కల్గించినయెడ నయ్యది గలగండ మనియు, అనేకగ్రంథులు మాలాకారముగ జనించెనేని అదియే గండమాల యనియు నర్థము. ఈ వాక్యముచేత కంఠమున నొక్క గ్రంథి మాత్రము జనించెనేని గలగండ మనియు, అనేక గ్రంథులు జనించినయెడ గండమాల యనియు గలగండ గండమాలలకు భేద మేర్పడుచున్నది. రక్తము మేదస్సును దూష్యములుగ జెప్పబడినవి. గండమాలకు కంఠమే ముఖ్యస్థానముగ నేర్పడుచున్నది. ఋషి మతముల నిట్టిభేదములు గల్గుటకు ఆయాదేశ కాలాదిస్థితిగతుల మార్పులే కారణమైన ట్లూహింపదగియున్నది.

## అపచీసాధ్యాసాధ్యనిర్ణయము

సాధ్యాస్స్మృతాః, పీనసపార్శ్వశూల
కాసజ్వరచ్ఛర్దియుతా స్త్వసాధ్యాః. 10

పైజెప్పిన యపచీగ్రంథులు సామాన్యముగ సాధ్యములు. అపచియందు పీనసము, ఇరుప్రక్కల నొప్పి, దగ్గు, జ్వరము, వమనము అను నీయుపద్రవములు కల్గినచో నసాధ్యమగును.

## గ్రంథిసంప్రాప్తి

వాతాదయో మాంసమసృక్ప్రదుష్టాః
సన్దూష్య మేదశ్చ తథా సిరాశ్చ,
వృత్తోన్నతం విగ్రథితం చ శోథం
కుర్వన్త్యతో గ్రన్థిరితి ప్రదిష్టః. 11

వాతపిత్తకఫములు తమ తమ కారణములచే దుష్టములై మాంసమును రక్తమును మేదస్సును సిరలను చెరిచి, గుండ్రనై యున్నతంబై కఠినమైనశోథము కల్గించును. ఇయ్యది గ్రంథి యని చెప్పబడును.

వాగ్భటమున "స గ్రన్థిర్గ్రథనాత్ స్మృతః" (అ. హృ. ఉత్తర. అ. ౨౯. శ్లో. ౧.) అని చెప్పియుండుటంజేసి ముడివలె కఠినమై యుండుటంజేసి గ్రంథి యని చెప్పబడును.

## వాతజగ్రంథిలక్షణము

ఆయమ్యతే వృశ్చ్యతి తుద్యతే చ
ప్రత్యస్యతే మథ్యతి భిద్యతే చ,
కృష్ణో మృదుర్వ స్తిరివాతతశ్చ
భిన్నస్స్రవేచ్చానిలజోఽస్రమచ్ఛమ్. 12

వాతప్రకోపమున జనించిన గ్రంథియందు పైకి లాగబడినట్లును, కత్తిచే నరకబడినట్లును, సూదులతో గ్రుచ్చినట్లును, చీల్చినట్లును, తరిచినట్లును, పగులగొట్టబడినట్లును నానావిధబాధలు కల్గి గ్రంథి నల్లనై మెత్తనై వస్తివలె విస్తీర్ణమైయుండును. అయ్యది పగిలినచో శుద్ధమైనరక్తము స్రవించును.

## పైత్తికగ్రంథిలక్షణము

దన్దహ్యతే ధూప్యతి వృశ్చ్యతే చ
పాపచ్యతే ప్రజ్వలతీవ చాపి,
రక్తస్సపీతోఽప్యథవాపి పిత్తా
ద్భిన్నస్స్రవేదుష్ణమతీవ చాపి. 13

పిత్తప్రకోపమున గల్గిన గ్రంథియందు నిప్పున కాల్చబడినట్లును, లోపలినుండి పొగ వెలికివచ్చువిధముగను, ఛేదింపబడిన విధముగను, ఉడుకుచున్నట్లును, ధగధగమండువిధముగను బాధలు కలుగును. అయ్యది పగిలినపుడు పచ్చనిరంగుకల్గినరక్తము మిక్కిలి వేడిగ నధికముగా స్రవించును.

## కఫజగ్రంథిలక్షణము

శీతో వివర్ణోఽల్పరుజోఽతికణ్డూః పాషాణవత్సంహననోపపన్నః,
చిరాభివృద్ధశ్చ కఫప్రకోపాత్ భిన్నస్స్రవేచ్ఛుక్లఘనంచపూయమ్.

కఫము ప్రకోపించి కలిగిన గ్రంథియందు చల్లనై శరీరమునకు విరుద్ధమైనరంగు కలదై మిక్కిలి నొప్పియు దురదయు కలిగి రాయివలె కఠినముగ నుండును. అయ్యది చాలకాలమునకు వృద్ధినొంది పగిలినప్పుడు తెల్లనై గట్టిగ నుండు చీము కారును.

## మేదోజగ్రంథిలక్షణము

శరీరవృద్ధిక్షయవృద్ధిహానిః స్నిగ్ధోమహాన్ కండుయుతోఽరుజ(జ)శ్చ,
మేదఃకృతో గచ్ఛతి చాత్ర భిన్నే పిణ్యాకసర్పిఃప్రతిమస్తుమేదః. 15

మేదస్సుచే జనించినగ్రంథి శరీరము వృద్ధినొందునపుడు వృద్ధినొంది, కృశించునపుడు క్షీణించును. నూనెపూసినవిధముగ నిగనిగలాడుచు గొప్పదై దురదతోఁగూడి యరుణవర్ణముగ లేక నెక్కువ బాధలేనిదిగ నుండును. ఇయ్యది పరిపక్వమై పగులునప్పుడు గానుగపిండివలెను పేరిన నెయ్యివలె నుండు మేదస్సు స్రవించును.

మరియు నీమేదోగ్రంథిసంప్రాప్తి భోజునిచే నిట్లు చెప్పబడెను:—"మేదో వాయుర్యదా మాంసే విక్షిపేదథవా త్వచి, తత్ర మేదోభవగ్రన్థిః శ్యావో భవతి పాండురః. కృశః కృశే మహాన్ స్థూలే గ్రన్థిర్భిన్నశ్చ పీడితః, తిలకల్కనిభస్రావో ఘృతవచ్చాస్య జాయతే" వాతము ప్రకుపితమై మేదస్సును మాంసముననైనను చర్మముననైనను చేర్చినచో నచ్చట శ్యామవర్ణంబైనను పాండువర్ణంబైనను గల గ్రంథి పొడమును. ఇయ్యది మేదస్సును కలిగినగ్రంథి యనబడును. ఈగ్రంథి శరీరము కృశించిననాడు కృశించి, శరీరము స్థూలమగునపుడెల్ల పెద్దదియగుచుండును. అయ్యది పగిలినపుడు బలవంతముగ నలిపినయెడ నువ్వుల గానుగపిండిని, పేరిన నేతిని బోలిన మేదస్సు దానినుండి స్రవించును.

## సిరాజగ్రంథిలక్షణము

వ్యాయామజాతైరబలస్య తైస్తైః
ఆక్షిప్య వాయుస్తు సిరాప్రతానమ్,
సఙ్కుచ్య సంపిణ్డ్య విశోష్య చాపి
గ్రన్థిం కరోత్యున్నతమాశు వృత్తమ్. 16
గ్రన్థిస్సిరాజస్స తు కృచ్ఛ్రసాధ్యో
భవేద్యది స్యాత్స రుజశ్చలశ్చ,
స చారుజశ్చాప్యచలో మహాంశ్చ
మర్మోత్థితశ్చాపి వివర్జనీయః. 17

బలహీనుడగు మనుజుడు శరీరమున కాయాసమును కల్గించు దేహపరిశ్రమము మున్నగుపనులజేసినచో వాతము ప్రకుపితమై నరముల నడ్డగించి ముడుచుకొనునట్లు చేయును. అయ్యది యుండవలె శరీరమునం దచ్చటనైన చుట్టుకొని శోషించియున్న

తమై గుండ్రనైనగ్రంథిరూపముగ నగును. ఇయ్యది సిరాజగ్రంథి యనంబడును. ఇయ్యది నొప్పితోఁగూడి యొక్కచోటనే నిల్కడలేక చంచలమై యుండునెడ కృచ్ఛ్రసాధ్యమగును. మరియు నిది నొప్పిలేక స్థిరముగ నొక్కచోటనే నిల్కడగ నుండినను, మర్మస్థానముల జనించినను విడువందగును. (అసాధ్య మనుట.)

భోజుండు అసాధ్యగ్రంథుల నిట్లు చెప్పెను.—"పక్షౌచ తానరుజో గ్రన్థిః మర్మజానచలాం స్త్యజేత్. కపోలగలమన్యాసు దుశ్చికిత్స్యాశ్చ సన్థిషు" పైజెప్పబడిన యైదువిధములైన గ్రంథులును మర్మస్థానముల జనించినను, చంచలములుగాక స్థిరములుగ నున్నను అసాధ్యము లగును. మరియు చెక్కిళ్లక్రిందిభాగమున జనించినవియు, తొడయందును మెడనరములయందును జనించినవియు, కీళ్లయందు జనించినవియు నసాధ్యములు కావున విడువదగునని భావము.

వాగ్భటమున నసాధ్యము లిట్లు నిర్దేశింపబడినవి.—"సాధ్యా దోషాస్ర మేదోజాః న తు స్థూలఖరాశ్చలాః, మర్మ కణ్ఠోదరస్థాశ్చ" (అ. హృ. ఉత్తర. అ. ౨౯. శ్లో. ౧౪.) వాత-పిత్త-కఫ-రక్త-మేదోభేదములచే నైదువిధములైన గ్రంథులును సామాన్యముగ సాధ్యములు. అయ్యవి స్థూలములైయున్నను, కఠినములుగనున్నను, చంచలములైనను, మర్మస్థానములయందును మెడయందును ఉదరముపైనను జనించినను అసాధ్యములగును. (ఇచ్చట గ్రంథి సామాన్యముగ సాధ్యమగునని చెప్పబడినది. చంచలమైనది యసాధ్య మని చెప్పబడినది. భోజాదితంత్రకారులును ప్రకృతగ్రంథకర్తయు అచలమైనది యసాధ్యమని చెప్పిరి. ఇట్టి భేదాభిప్రాయము గ్రంథకర్తలకు కల్గుటకు వారి వారియనుభవమునుబట్టి కల్గెనని యూహింపదగినది.)

## అర్బుదసంప్రాప్తి

గాత్రప్రదేశే క్వచిదేవ దోషాః
సమ్మూర్ఛితా మాంసమసృక్ప్రదూష్య,
వృత్తం స్థిరం మన్దరుజం మహాన్త
మనల్పమూలం చిరవృద్ధ్యపాకమ్. 18
కుర్వన్తి మాంసోచ్ఛ్రయమత్యగాధం
తదర్బుదం శాస్త్రవిదో విదన్తి,

వాతాదిదోషములు స్వకారణములచే వృద్ధినొంది మాంసమును రక్తమును చెరిచి శరీరమునం దొకానొకచోట వర్తులమై కఠినమైయుండునట్లు మాంసము నున్నతముగ కాయవలె వృద్ధినందించును. ఇయ్యది స్వల్పమైనబాధకల్గి గొప్పదియై

గాఢమైనమూలముకల్గి చిరకాలమునకు నానాటవృద్ధినొందును. పరిపక్వముగాక పగులదు. ఇయ్యది శరీరమునందు మిక్కిలి లోతులో జనించును. దీనిని అర్బుద మని శాస్త్రవేత్తలు నుడివెదరు.

ఇయ్యది మేదస్సును కఫంబును ప్రబలముగ నుండుటంజేసి ప్రాయికముగ పగుల దని వాగ్భటాచార్యుడు "ప్రాయో మేదఃకఫాఢ్యత్వాత్ స్థిరత్వాచ్చ న పచ్యతే" అను వాక్యముచే దెలిపెను. మరియు "మహత్తుగ్రంథితోఽర్బుదమ్" (అ. హృ. ఉత్తర. అ. ౨౯. శ్లో. ౧౪.) అని వాగ్భటమున చెప్పినట్లు గ్రంథియే పెద్దదిగ నున్నచో నర్బుద మని తెలియుచున్నది.

## అర్బుదభేదములు

వాతేన పిత్తేన కఫేన చాపి రక్తేన మాంసేన చ మేదసా చ. 19
తజ్జాయతే తస్య చ లక్షణాని గ్రన్థేస్సమానాని తదా భవన్తి,

పైజెప్పిన యర్బుదము వాత-పిత్త-కఫ-రక్త-మాంస-మేదస్సులచే వేర్వేరుగ జనించుటంజేసి యారువిధముల నుండును. అందు వాత-పిత్త-కఫ-మేదస్సులచే జనించి నవి నాల్గు వాతాదులచే గల్గగ్రంథులకు వేరువేర జెప్పినలక్షణముల గల్గియుండును.

## రక్తార్బుదసంప్రాప్తిలక్షణము

దోషః ప్రదుష్టో రుధిరం సిరాశ్చ,
సఙ్కుచ్య సంపీడ్య తత స్త్వపాకమ్. 20
సాస్రావమున్నహ్యతి మాంసపిణ్డం
మాంసాఙ్కురై రాచితమాశు వృద్ధిమ్,
కరోత్యజస్రం రుధిరప్రవృత్తిమ్
అసాధ్యమేతద్రుధిరాత్మకన్తు. 21
రక్తక్షయోపద్రవపీడితత్వా
త్పాణ్డుర్భవేదర్బుదపీడితస్తు,

వాతాది దోషములలో నేదైన నొకటి ప్రకోపమునొంది రక్తమును చెరిచి సిరలను సంకోచమునొందించి మాంసపుముద్ద నున్నతముగ పైకుబికించును. అయ్యది గ్రంథిరూపమై నానాట శీఘ్రముగ వృద్ధినొంది మాంసపుమొలకలతోగూడి రక్తమును గార్చుచుండును. రక్తము నెడతెగక కార్చుటంజేసియు రక్తమున జనించుటంజేసియు నిది రక్తార్బుద మని యన్వర్థముగ జెప్పబడును. ఇయ్యది యసాధ్యము. ఈవ్యాధియందు రక్తము మిక్కుటముగ స్రవించి శరీరమునందలి రక్తము క్షీణించును. కావున రోగి పాండువర్ణము కల్గియుండును.

## మాంసార్బుదలక్షణము

ముష్టిప్రహారాదిభిరర్దితేఽఙ్గే
మాంసం ప్రదుష్టం జనయేద్ధి శోథమ్. 22
అవేదనం స్నిగ్ధ మనన్యవర్ణం
అపాకమశ్మోపమ మప్రచాల్యమ్,
ప్రదుష్టమాంసస్య నరస్య గాఢం
ఏతద్భవేన్మాంసపరాయణస్య. 23
మాంసార్బుదం త్వేతదసాధ్యముక్తం

పిడికిళ్లతోఁగొట్టుట మున్నగుకారణములచే మాంసమునందు మిక్కిలి యభిఘాతము కల్గించెడి దానంజేసి వాపు కల్గును. అయ్యది మాంసముచెడి గట్టిగ రాయివలె గడ్డకట్టియుండును. నొప్పిలేక నూనెపూసినవిధముగ జిడ్డుకల్గి శరీరవర్ణమునకు సమానమైన వర్ణముకల్గి పరిపక్వముగాక పగులక రాయివలె కఠినమై నిశ్చలముగ నుండును. ఇయ్యది మాంసార్బుద మని చెప్పబడును. ఈవ్యాధి పైజెప్పినకారణములచే మాంసము చెడినవానికిని, మాంసము నెల్లపుడు తినువానికిని విశేషముగ సంభవించును. ఈయర్బుదము మిక్కిలి యసాధ్యమైనది.

ఈవ్యాధియందు రక్తార్బుదమున పిత్తమును, మాంసార్బుదమున వాతమును కారణములుగ నుండును. మరియు నర్బుదసామాన్యముగ రాక్తమాంసములు చెడినను రక్తార్బుదమున రక్తమును, మాంసార్బుదమున మాంసమును విశేషముగ చెడును. కావున రక్తార్బుద మనియు మాంసార్బుద మనియు చెప్పబడునని యెరుంగునది.

## అర్బుదసాధ్యాసాధ్యనిర్ణయము

సాధ్యేష్వపీమాని తు వర్జయేచ్చ,
సంప్రస్రుతం మర్మణి యచ్చ జాతం
స్రోతస్సు వా యచ్చ భవేదచాల్యమ్. 24

(పైజెప్పినప్రకారము రక్తార్బుదమును మాంసార్బుదమును అసాధ్యములు. తక్కిన వాత - పిత్త - కఫ - మేదోర్బుదములు సాధ్యములు. ఈవిషయమునే వాగ్భటాచార్యుడు "తేష్వసృఙ్మాంసజే వర్జ్యే చత్వార్యన్యాని సాధయేత్" (అ. హృ. ఉత్తర. అ. ౨౯. శ్లో. ౧౮.) అని చెప్పెను. అట్టి సాధ్యములగు నాల్గునుకూడ మర్మస్థలములయందు బొడమి చర్మము పగిలి స్రవించుచుండునదియు, నాసారంధ్రము

మున్నగు స్రోతోమార్గముల జనించునదియు, చలనము లేక కఠినముగ నుండునదియు నసాధ్య మగును.

## అధ్యర్బుద ద్విరర్బుదలక్షణములు

యజ్జాయతేఽన్యత్ఖలు పూర్వజాతే
జ్ఞేయం తదధ్యర్బుదమర్బుదజ్ఞైః,
యద్ద్వన్ద్వజాతం యుగపత్క్రమాద్వా
ద్విరర్బుదం తచ్చ భవేదసాధ్యమ్. 25

పై జెప్పబడిన యర్బుదము జనించినపుడు మరల వేరొండు అర్బుదము దాని యందే దానితో సమానలక్షణముగల్గి జనించినయెడ నయ్యది అధ్యర్బుద మని చెప్ప బడును. మరియు సమకాలమున రెండర్బుదములు జంటకల్గినను, లేక ఒకటి జనించి కొంతకాలమునకు పిమ్మట వేరొండు అర్బుదము దానిచేరువనే జనించినను అయ్యది ద్విరర్బుద మని చెప్పబడును. ఈ రెండర్బుదములు అసాధ్యములు.

## అర్బుదములు పక్వములు కానందుకు కారణము

న పాకమాయాన్తి కఫాధికత్వా
న్మేదోబహుత్వాచ్చ విశేషతస్తు,
దోషస్థిరత్వాద్గ్రథనాచ్చ తేషాం
సర్వార్బుదాన్యేవ నిసర్గతస్తు. 26

పై జెప్పబడిన యర్బుదము లారిటియందును కఫమేదస్సులు మిక్కిలి యధికము లుగ నుండుటచేతను, వానియందలి పూయాదులు మిగుల చిక్కనై యుండుటచేతను, వ్యాధిస్వభావముచేతను, గ్రంథిరూపమై మిక్కిలి కఠినముగ నుండుటచేతను అర్బుదము లన్నియు సామాన్యముగ పరిపక్వముగాక పగులుటకు వలనుపడక యుండును

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
గలగణ్డ-గణ్డమాలా-అపచీ-గ్రన్థి-అర్బుద
నిదానం సమాప్తమ్.

# ౩౯. శ్లీపదనిదానమ్

శ్లీపదము (బోదకాలు) అర్బుదమునుబోలె నున్నతముగ జనించునది కావున అర్బుదనిదానమును చెప్పినపిదప శ్లీపదనిదానమును జెప్పుట:—

## శ్లీపద సంప్రాప్తి

యస్స జ్వరో వఙ్క్షణజో భృశార్తి
శ్శోథో నృణాం పాదగతః క్రమేణ,
తచ్ఛ్లీపదం స్యాత్కరకర్ణనేత్ర
శిశ్నౌష్ఠనాసాస్వపి కేచిదాహుః. 1

తొలుత జ్వరము తీవ్రముగ నారంభించి గజ్జలయందు మిక్కిలి బాధతో గూడినవాపు (బిళ్ల) కట్టి నానాట కాళ్లకు దిగి, మీగాళ్లకు మెల్ల మెల్లగ దిగబారును. ఇయ్యది శ్లీపదము (బోదకాలు) అని చెప్పబడును. ఇట్టి శోఫరూపమైనవ్యాధి హస్తములయందును, చెవులయందును, కన్నుఱెప్పలయందును, శిశ్నమునందును, పెదవుల యందును, నాసికయందునుకూడ కల్గు నని కొంద రాచార్యులు చెప్పెదరు.

ఇయ్యది కర్ణనాసాది స్థానములయందు ఈవ్యాధికి జెప్పినవిధముగ సంప్రాప్తితో కల్గుటలేదు. *కావున "కేచిదాహుః" అని పక్షాంతరమున జెప్పబడినది. (ఇచ్చట "శిలావత్ పదమ్-శ్లీపదమ్"అను వ్యుత్పత్తిచేత రాఱువలె కఠినమై పాదములయందు వ్యాపించునది శ్లీపద మని యన్వర్థముగ జెప్పబడినది.)

## వాతజాదిశ్లీపదలక్షణము

వాతజం కృష్ణరూక్షం చ స్ఫుటితం తీవ్రవేదనమ్,
అనిమిత్తం రుజం తస్య బహుశో జ్వర ఏవ చ. 2
పిత్తజం పీతసఙ్కాశం దాహజ్వరయుతం మృదు,
శ్లైష్మికం స్నిగ్ధవర్ణం చ శ్వేతం పాణ్డు గురుస్థిరమ్. 3

వాతప్రకోపమున జనించిన శ్లీపదము కృష్ణవర్ణంబును, రూక్షంబును, మిగుల తీవ్రమైన వేదనగల్గినదియునై చర్మము పగులును. అయ్యది కారణములేకయే నొప్పి కల్గి తీవ్రముగ జ్వరము కల్గియుండును. పిత్తమున జనించిన శ్లీపదము పచ్చనిరంగుకల్గి యుండును. తీవ్రమైనమంటయు జ్వరమునుకల్గి మెత్తగానుండును. కఫమున జనించిన శ్లీపదము స్నిగ్ధవర్ణంబును, † శ్వేతవర్ణంబును, పాండువర్ణంబునై భారముకల్గి కఠినముగ నుండును.

---

* జ్వరము, ఆయాకీళ్లయందు ఎక్కువపీడ కల్గుచుండుట కలదు. ప్రాయికముగా నీవ్యాధి కరాదులయందు కల్గుటచే కొందఱి మత మని వ్రాసె నని తోచెడిని.

† స్నిగ్ధ వర్ణ మనగా నిగనిగ లాడుచుండుట. శ్వేతవర్ణ మనగా శరీరముకంటె గొంచెము తెలుపు. పాండువర్ణ మనగా బిండిపూసినట్లుండుట.

## అసాధ్యశ్లీపదలక్షణము

వల్మీకమివ సఞ్జాతం కణ్టకై రుపచీయతే,
అబ్దాత్మకం మహ త్తచ్చ వర్జనీయం విశేషతః. 4

చెదలు పుట్టవలె ననేక శిఖరములుకల్గి కోపులుబోసినట్లు మాంసపు ముండ్లు కల్గిన శ్లీపదము అసాధ్యము. సంవత్సరకాలముగడచి మిక్కిలి గొప్పదియైన శ్లీపదముకూడ నసాధ్యమగును.

## శ్లీపదమున కఫప్రాధాన్యము

త్రీణ్యప్యేతాని జానీయాత్ శ్లీపదాని కఫోచ్ఛ్రియాత్,
గురుత్వం చ మహత్వం చ యస్మాన్నాస్తి కఫం వినా. 5

భారముగల్గి గొప్పదియగుటకు కఫము దక్క వేరొండు కారణములేదు; కావున పైజెప్పిన వాత-పిత్త-కఫభేదములుకల శ్లీపదములు మూడిటియందును కఫము మిక్కిలి యధికముగ నుండును.

## శ్లీపదము జనించుదేశములు

పురాణోదకభూయిష్ఠాః సర్వర్తుషు చ శీతలాః,
యే దేశాః తేషు జాయన్తే శ్లీపదాని విశేషతః. 6

ఏదేశములయందు జలము నియతముగ ననేక సంవత్సరములవరకును బైటవెడలక నిలిచియుండు గుంటలు బావులు కలుగుచుండునో, ఏ ప్రదేశమున వసంతాదిఋతువు లన్నిటియందు మిక్కిలి శీతలముగ నుండునో, అట్టి దేశములయందు శ్లీపదములు విశేషముగ జనించును. (ఈదేశనిర్ణయము ప్రాయికము. అన్వయ వ్యతిరేకములచే నిట్టి నిర్ణయమునకు వీలుకాలే దని అనుభవ సిద్ధము.)

## కొన్ని యసాధ్యశ్లీపద లక్షణములు

యచ్ఛ్లేష్మలాహారవిహారజాతం పుంసః ప్రకృత్యా చ కఫాత్మకస్య,
సాస్రావమత్యున్నతసర్వలిఙ్గం సకణ్డురం శ్లేష్మయుతం వివర్జ్యమ్. 7

కఫప్రకృతి కలమనుజునకు కఫము వృద్ధినొందించు ఆహార విహారాదులచే కల్గిన శ్లీపదంబును, వాతాదులకు వేరువేర జెప్పిన లక్షణములన్నియుకల్గి మిక్కిలి యున్నతమై నీరుగారుచుండు శ్లీపదంబును, కఫముతోగూడి మిక్కిలి దురదకల శ్లీపదంబును అసాధ్యమగును. కావున చికిత్స చేయదగదు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శ్లీపదనిదానం సమాప్తమ్.

# ౪౦. విద్రధినిదానమ్

శ్లీపదమున జనించువిధముగ విద్రధియందును శోఫ మిక్కిలి యధికముగ ఘనీభవించియుండును. కావున శ్లీపదనిదానమును జెప్పినపిదప విద్రధినిదానమును జెప్పుట.

## విద్రధిసంప్రాప్తి

త్వగ్రక్తమాంసమేదాంసి సన్దూష్యాఽస్థిసమాశ్రితాః,
దోషాశ్శోథం శనైర్ఘోరం జనయన్త్యుచ్ఛ్రితా భృశమ్. 1
మహామూలం రుజావన్తం వృత్తం వాఽప్యథవాయతమ్,
సవిద్రధిరితి ఖ్యాతః

వాత-పిత్త-కఫములు వానివానిప్రకోపకారణములచేత మిక్కిలి ప్రకోపము నొంది చర్మము (రసధాతువు)ను, రక్తమును, మాంసమును, మేదస్సును పూర్తిగ చెరిచి శరీరమునందలి యెముకల నాశ్రయించి మిక్కిలి క్రూరమై శోఫమును శరీరమునందు మాంసలప్రదేశమున మెలమెల్లగ నానాట కల్గించును. ఇయ్యది రసరక్తమాంసమేదస్సులనుదాటి అస్థుల నాశ్రయించి జనించుటంజేసి బలవత్తరమైన మూలము కల్గి మిక్కిలి తీవ్రమైనబాధ కల్గియుండును. ఇయ్యది వర్తుల (గుండ్ర) ముగనైనను నుండును. దీనిని విద్రధి యని చెప్పెదరు.

## విద్రధిసంఖ్య-భేదములు

విజ్ఞేయష్షడ్విధశ్చ సః. 2
పృథగ్దోషైస్సమస్తైశ్చ క్షతేనాప్యసృజా తథా,
షణ్ణామపి హి తేషాం తు లక్షణం సమ్ప్రచక్ష్యతే. 3

పైజెప్పబడిన విద్రధి వాత-పిత్త-కఫములచే వేరువేరుగను, అన్నింటి సన్నిపాతముచేతను, గాయముచేతను, రక్తముచేతను జనించుటంజేసి యారువిధము లగును. అట్టి యారింటికిని వేరువేరుగ లక్షణము లీక్రింద వివరింపబడును.

## వాతవిద్రధి లక్షణము

కృష్ణోఽరుణో వా విషమో భృశమత్యర్థవేదనః,
చిరోత్థానప్రపాకశ్చ విద్రధి ర్వాతసమ్భవః. 4

వాతము ప్రకోపించుటచే గల్గిన విద్రధి కృష్ణవర్ణముగనైనను, అరుణ వర్ణముగనైనను దాని యాకృతి విషమముగ నుండును. మిక్కిలి తీవ్రమైన వేదనకల్గి చిరకాలమునకు పుట్టి (పైకితేలి) చాలకాలమునకు పరిపక్వమగును.

### పైత్తికవిద్రధి లక్షణము

పక్వోదుమ్బరసఙ్కాశః శ్యావో వా జ్వరదాహవాన్,
క్షిప్రోత్థానప్రపాకశ్చ విద్రధిః పిత్తసమ్భవః. 5

చక్కగ మాగిన మేడిపండువంటి రంగుకల్గియైనను, లేక శ్యామవర్ణము కల్గియైనను, జ్వరమును మంటయు కల్గి జనించినది పిత్తప్రకోపమున బుట్టిన విద్రధి యని యెరుంగునది. ఇయ్యది అతిశీఘ్రముగబుట్టి శీఘ్రముగనే పరిపక్వ మగును.

### కఫజవిద్రధి లక్షణము

శరావసదృశః పాణ్డుః శీతస్స్నిగ్ధోఽల్పవేదనః,
చిరోత్థానప్రపాకశ్చ విద్రధిః కఫలక్షణః. 6

మూకుడువలె గుండ్రనై పాండువర్ణముకల్గి చల్లనై నూనెపూసిన విధముగ స్నిగ్ధమై స్వల్పమైన బాధ కల్గి చిరకాలమునకు బుట్టి చాలకాలమునకు పక్వమగునది కఫజవిద్రధి యని యెరుంగునది.

### విద్రధియందు దోషభేదముచే స్రావభేదము

తనుపీతసితాశ్చైషామాస్రావాః క్రమశస్స్మృతాః,

పై జెప్పబడిన విద్రధులుమూటిలో వాతవిద్రధియందు చీము మొదలగునవి పలుచనై స్వల్పముగ స్రవించును. పిత్తవిద్రధియందు పచ్చనై స్రవించును. కఫవిద్రధియందు తెల్లనై స్రవించును. ఇత్తెరంగున వాతపిత్తకఫభేదములను స్రావభేదమును బట్టియుం నిర్ణయింప దగు నని భావము.

### సాన్నిపాతికవిద్రధిలక్షణము

నానావర్ణరుజాస్రావో ఘుంటాలో విషమో మహాన్. 7
విషమం పచ్యతే చాపి విద్రధి స్సాన్నిపాతికః,

కృష్ణపీతశుక్లాదిభేదములచే పలుతెరంగులైనవర్ణములు సంకరముగ కలసి, నొప్పిపోటు మున్నగుబాధలును పైజెప్పబడిన తనుపీతాద్యాస్రావంబులును కలసి యున్న యెడ సన్నిపాతమున జనించినవిద్రధి యని యెరుంగునది. ఇయ్యది గంటవలె నున్నతమై ఒకచోటున్నతంబును, ఒకచోట తగ్గనై గొప్పదిగనుండును. ఒక్కప్రక్క శీఘ్రముగ పరిపాకమునొందును. వేరొక్కప్రక్క చాలకాలమునకు పక్వమగును.

## ఆగంతుకవిద్రధిలక్షణము

తైస్తై ర్భావై రభిహతే క్షతే వాఽపథ్యకారిణః. 8
క్షతోష్మా వాయువిసృతః సరక్తం పిత్తమీరయేత్,
జ్వరస్తృష్ణా చ దాహశ్చ జాయతే తస్య దేహినః, 9
ఆగన్తుర్విద్రధిర్జ్ఞేయః పిత్తవిద్రధిలక్షణః,

ఆయుధములు మట్టిపెళ్లలు తాలు మున్నగువానిచేనైన ప్రహారాదులచే నభిఘాతము కల్గినను, లేక వ్రణాదులవలన పుండైనపుడు పథ్యములుకాని యాహారాదుల సేవించినను, వాయువు వృద్ధినొంది క్షతముచేతను అభిఘాతముచేతను కల్గినయావిరిని (పిత్తోష్మ) వ్యాపింపజేయును. అట్టి యూష్మము రక్తముతో గూడిన పిత్తమును ప్రకోపింపజేయును. అట్టి రక్తపిత్తములు ప్రకుపితములై విద్రధిని కల్గించును. ఈ విద్రధి యాగంతుకకారణములచే గల్గుటంజేసి యాగంతుక విద్రధియని చెప్పనగును. దీనియందు జ్వరము, దప్పి, మంటయు కల్గును. పిత్తవిద్రధిలక్షణములు కల్గియుండును.

వాగ్భటమున "పిత్తాసృగ్లక్షణం కుర్యాద్విద్రధింభూర్యుపద్రవమ్" (అ. హృ. ని. అ. ౧౧. శ్లో. ౧౨.) అని చెప్పియున్నది కావున నీయాగంతుక విద్రధియందు రక్తముయొక్కయు పిత్తముయొక్కయు లక్షణములు కల్గియుండు ననియు, ఉపద్రవములు అనేకములుగ నుండు ననియు నెఱుంగునది. ఈవిషయము ప్రకృతగ్రంథమున "సరక్తం పిత్తమీరయేత్" అను వాక్యమునపిత్తరక్తప్రకోపము ఆగంతుకవిద్రధియందు చెప్పుటచే సూచితము.

## రక్తజవిద్రధిలక్షణము

కృష్ణస్ఫోటావృతశ్శ్యావ స్తీవ్రదాహరుజాకరః. 10
పిత్తవిద్రధిలిఙ్గస్తు రక్తవిద్రధిరుచ్యతే,

రక్తప్రకోపమున గల్గినవిద్రధియందు నల్లనిబొబ్బలు ఆవరించియుండును. మిక్కిలి తీవ్రమైనమంటయు నొప్పియు కల్గియుండును. ఇంతియకాక పిత్తవిద్రధియందు జెప్పబడినలక్షణములు కల్గియుండును. (ఈపై నుదాహరించిన యారును బాహ్యవిద్రధు లనబడును. అనగా శరీరముపైకి గానబడునవి.)

## అంతర్విద్రధిసంప్రాప్తి స్థానములు

పృథక్సంభూయ వా దోషాః కుపితా గుల్మరూపిణమ్. 11
వల్మీకవత్సమున్నద్ధం అన్తః కుర్వన్తి విద్రధిమ్,
గుదే వస్తిముఖే నాభ్యాం కుక్షౌ వంక్షణయోస్తథా. 12
వృక్కయోః ప్లీహ్ని యకృతి హృది వా క్లోమ్ని వాప్యథ,

వాతపిత్తకఫములు వేరువేరుగనైనను అన్నియు కలసియైనను ప్రకుపితములై శరీరమున లోభాగమున గల స్థానములయందు విద్రధిని కల్గించును. ఇయ్యది గుల్మము వంటి యాకారముకల్గి చెదలుపుట్టవలె నున్నతమై యుండును. గుదము, వస్తి(మూత్రపు తిత్తి) యొక్క ద్వారము, నాభి, కుక్షి, గజ్జలు, వృక్కములు, ప్లీహము, యకృతు (కారిజము), హృదయకమలము, క్లోమము అను నీయవయవములలో నెచ్చోటనైన జనించును. (ఇది శరీరమునందలి యంతర్భాగమున నుండుస్థానముల జనించుటంజేసి యంతర్విద్రధి యని చెప్పబడును)

## అంతర్విద్రధి సామాన్య విశేషలక్షణములు

తేషాముక్తాని లిఙ్గాని బాహ్యావిద్రధిలక్షణైః. 13
అధిష్ఠానవిశేషేణ లిఙ్గం శృణు విశేషతః,
గుదే వాతనిరోధశ్చ వస్తౌ కృచ్ఛ్రాల్పమూత్రతా. 14
నాభ్యాం హిక్కా తథాఽఽటోపః కుక్షౌ మారుతకోపనమ్,
కటిపృష్ఠగ్రహస్తీవ్రో వంక్షణోత్థే తు విద్రధౌ. 15
వృక్కయోః పార్శ్వసంకోచః ప్లీహ్ని ఉచ్ఛ్వాసావరోధనమ్,
సర్వాంగప్రగ్రహస్తీవ్రః హృది కాసశ్చ జాయతే. 16
శ్వాసో యకృతి హిక్కాచ క్లోమ్ని పేపీయతే పయః.

అంతర్విద్రధులన్నింటియందును వాతాదులకు బాహ్యావిద్రధియందు జెప్పిన లక్షణములు కల్గియుండును (బాహ్యావిద్రధులలో వాతాదిభేదములకు వేరువేర జెప్పిన లక్షణములు అంతర్విద్రధిలో గల్గువాతాదిభేదములకు గల్గు ననుట.)అయినను అయ్యది జనించు స్థానవిశేషముబట్టి కొన్ని విశేషలక్షణములు కల్గును. ఎట్లులన:—అంతర్విద్రధి గుదస్థానమున జనించినయెడ నపానవాతము బంధింపబడును. వస్తియందు కల్గినపుడు మూత్రము మిక్కిలి కష్టముగ కొంచెముకొంచెముగ వెడలును. నాభిస్థానమున జనించినపుడు ఎక్కిళ్లు అధికముగ వెడలును. (కుక్షిలో మీగడుపున)జనించినయెడ కడుపులో వాతము ప్రకుపితమై గడబిడగా నుండును. గజ్జలలో గల్గినపుడు నడుమునందును వీపునందును తీవ్రమైన నొప్పికల్గును. వృక్కములయందు కల్గినపుడు రెండు ప్రక్కలును ముడిచికొనియుండును. ప్లీహమున గల్గెనేని ఉచ్ఛ్వాసము వెడలక అడ్డగింపబడును. హృదయస్థానమున గల్గెనేని సర్వావయవములయందును పట్టును. తీవ్రమైన దగ్గును జనించును. యకృత్తున గల్గినపుడు శ్వాసంబును వెక్కిళ్లును కల్గును. క్లోమమున గల్గినపుడు దప్పి యధికమగును. (మాటిమాటికి నీళ్లుద్రాగుచున్నను నివర్తించక బాధించును.)

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—అంతర్విద్రధి శరీరమునందలి లోభాగములనుండు అవయవముల జనించును. గుల్మంబును శరీరాంతర్భాగమున జనించును.

కావున నీ రెండిటికిని భేదము నెట్లు గుర్తింపవలెను? అను నాశంక సాధారణముగ జనించును. కావున వాని పరస్పరభేదము నిట్లెరుంగునది:—గుల్మము దూష్యములగు రసరక్తాది సంబంధములేక కేవలము వాతపిత్తకఫములమాత్ర మాశ్రయించి జనించును; కావున నిది కేవలము పిండాకారముగ దోచుటమాత్రమే కాని యాకారములేదు. కావుననే యిది పరిపక్వమై పగులుట కవకాశములేదు. విద్రధి మాంసరక్తముల నాధారములుగ జేసికొని వాతాదిదోషములచే గ్రంథిరూపముగ జనించును కావున ఆధారమగు దూష్యము నాశ్రయించి జనించుటవలన నాకార విశిష్టమై కాలమున పరిపక్వమై పగులుట కవకాశము కల్గియుండును. ఇట్టి విషయమునే సుశ్రుతాచార్యులు ఇట్లు చెప్పెను—"న నిబన్ధోఽస్తి గుల్మస్య విద్రధిస్సనిబన్ధనః, గుల్మస్తిష్ఠతి దోషే స్వే విద్రధిర్మాంస శోణితే. విద్రధిః పచ్యతే తస్మా ద్గుల్మః క్వాపి న పచ్యతే" పైజెప్పిన విమర్శనము ప్రకారము గుల్మము రసరక్తాది సంబంధములేక జనించుటంజేసి పక్వమై పగులకుండుననియు, విద్రధి మాంసరక్తముల నాశ్రయించి జనించును. కావున పగులుననియు నీ రెంటికిని పరస్పరభేద మెరుంగ నగునని ముఖ్యాభిప్రాయము. (పిత్తగుల్మముమాత్రమొకప్పుడు వ్యాధి స్వభావముచే బగులు నని చెప్పబడెను.)

## విద్రధిసాధ్యాసాధ్యవిచారము

నాభేరుపరిజాః పక్వాః యాన్త్యూర్ధ్వమితరే త్వధః,
అధస్స్రుతేషు జీవేత్తు స్రుతేషూర్ధ్వం న జీవతి. 17
హృన్నాభివస్తివర్జ్యా యే తేషు భిన్నేషు బాహ్యతః,
జీవేత్కదాచిత్పురుషో నేతరేషు కదాచన. 18

నాభికి పైభాగమున నుండు వృక్కములు ప్లీహము మున్నగు స్థానముల జనించు విద్రధులు పగిలినయెడ చీము రక్తము ఊర్ధ్వమార్గము (నోట) నుండి వెడలును. నాభికి క్రింద నుండు వస్తిగుదము మున్నగు స్థానముల జనించినవి యధోమార్గము (గుదము) నుండి చీమును రక్తంబును వెడలును. అందు క్రిందిమార్గమున స్రవించు విద్రధులయందు మనుజుడు బ్రతుకును, ఊర్ధ్వమార్గమున స్రవించినచో బ్రతుకడు. మరియు హృదయము, నాభి, వస్తి ఈ మూడు స్థలములుదక్క తక్కిన స్థలములయందు జనించి పగిలి బైట పూయాదుల స్రవించునెడ నొక సమయమున రోగి బ్రతుకునేమో, కాని అటుగాక హృన్నాభివస్తుల జనించినది యొకవేళ పగిలి చీము మొదలగునవి బైటిమార్గమున వెడలినను రోగి యొకప్పుడును బ్రతుకనేరడు.

మరియు తంత్రాంతరమున—"ఊర్ధ్వ ప్రభిన్నేషు ముఖాన్తరాణాం ప్రవర్తతేఽసృక్సహితోఽపి పూయః, అధఃప్రభిన్నేషు చ పాయుమార్గాత్ ద్వాభ్యాం ప్రవృత్తిస్త్విహ నాభిజేషు" అని యుండుటంజేసి నాభిస్థానమున జనించిన విద్రధి

నోటనుండియు, గుదమునుండియు పూయాదుల స్రవించునని తెలియుచున్నది. ఇయ్యది మిక్కిలి యసాధ్యము.

### బాహ్యావిద్రధి సాధ్యాసాధ్యనిర్ణయము

సాధ్యా విద్రధయః పఞ్చ; వివర్జ్యస్సాన్నిపాతికః,
ఆమపక్వవిదగ్ధత్వం తేషాం శోథవదాదిశేత్. 19

పైజెప్పబడిన విద్రధులలో వాత-పిత్త-కఫ-రక్త-ఆగంతుకారణములచే జనించిన యైదు విద్రధులు సాధ్యములగును. సన్నిపాతమున జనించినదిమాత్రము అసాధ్యము. విద్రధుల యామపక్వాదిభేదములను శోఫమువలె నెరుంగునది.

### కొన్ని యసాధ్యలక్షణములు

ఆధ్మాతం బద్ధనిష్యన్దం ఛర్దిహిక్కాతృషాన్వితమ్,
రుజాశ్వాససమాయుక్తం విద్రధిర్నాశయేన్నరమ్. 20

విద్రధి పగిలినను, చీము మొదలగునవి బైటరాక యుబికియున్నను, వాంతియు ఎక్కిళ్లును దప్పియు కలిగియున్నను, మిక్కిలి తీవ్రమైనబాధయు శ్వాసంబును కలిగి యున్నను మనుజుని చంపును.

మరియు తంత్రాంతరమున సాధ్యాసాధ్యనిర్ణయ మిట్లు చెప్పబడినది.— "అసాధ్యో మర్మజో జ్ఞేయః పక్వోఽపక్వశ్చ విద్రధిః, సన్నిపాతోత్థితోఽప్యేవం పక్వ ఏవతు వస్తిజః, త్వగ్గో నాభేరధో యశ్చ సాధ్యో మర్మసమీపజః, అపక్వశ్చైవ పక్వశ్చ సాధ్యో నోపరినాభిజః" మాంసము, సిగలు, స్నాయువులు, అస్థులు, సంధులు (కీళ్లు) ఈయైదిటియందును కొన్నిస్థానములు మర్మములు; అట్టి మర్మస్థానములయందు బుట్టిన విద్రధి పక్వంబైనను పక్వము గాకున్నను అసాధ్యమగును. త్రిదోషసన్నిపాతమున జనించిన విద్రధియు పక్వమైనను పక్వముగాకున్నను అసాధ్యము. వస్తియందు బుట్టినవిద్రధి పక్వమైనచో నసాధ్యమగును. నాభికి దిగువ చర్మము నాశ్రయించి జనించిన విద్రధియు, మర్మములకు సమీపస్థానమున జనించి పక్వముగాకుండు విద్రధియు సాధ్యములు. నాభికి పైభాగమున జనించిన విద్రధి పక్వంబైనను పక్వము గాకున్నను అసాధ్యము. ఇత్తెరంగున విద్రధి సాధ్యాసాధ్యముల నెరుంగునది. (మర్మస్థానములు నూటయేడు విధములుగ విభజింపబడి అన్నియు సుశ్రుతమున విపులముగ వివరించబడియున్నవి. విస్తరభీతిచే నియ్యెడ వివరింపబడవయ్యె.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
విద్రధినిదానం సమాప్తమ్.

# ౪౧. వ్రణశోథనిదానమ్

విద్రధినిదానమును జెప్పినపిదప వ్రణసామాన్యమునకు సంబంధించిన వ్రణశోథ నిదానమును జెప్పుట.—

**వ్రణశోథసంప్రాప్తిసంఖ్య**

ఏకదేశోత్థితశ్శోథో వ్రణానాం పూర్వలక్షణమ్,
షడ్విధస్స్యాత్పృథక్సర్వరక్తాగన్తునిమిత్తజః. 1
శోథాష్షడేతే విజ్ఞేయాః ప్రాగుక్తైశ్శోథలక్షణైః,

శరీరమునం దెచ్చటనైన నొకస్థలమున శోఫ జనించిన వ్రణముపుట్టుటకు పూర్వ రూపమగు నయ్యది వ్రణశోథ మని చెప్పబడును. ఈవ్రణశోఫము వాత-పిత్త-కఫము లచే వేరువేరుగను, మూడిటి సన్నిపాతముచేతను, రక్తముచేతను, ఆగంతుకారణము చేతను జనించుటంజేసి యారువిధములగును. ఈ యారువిధములగు శోఫలయందు శోథ సామాన్యమునకు శోఫనిదానమున "చలస్తనుత్వక్ పరుషోఽరుణోఽసితః" అని యుపక్రమించి చెప్పినప్రకారము అరుణాదివర్ణభేదంబులును తక్కినలక్షణంబులును వాతాదిదోషానుసారముగ కల్గియుండును.

**వ్రణశోఫపరిపాకభేదములు**

విశేషః కథ్యతే చైషాం పక్వాపక్వాదినిశ్చయే. 2
విషమం పచ్యతే వాతాత్ పిత్తోత్థశ్చాచిరాత్ చిరం,
కఫజగ పిత్తవచ్ఛోథో రక్తాగన్తుసముద్భవః. 3

పైజెప్పిన వ్రణశోఫపక్వాపక్వభేదముల నిర్ణయించుటకై అట్టి విశేషలక్షణము లీక్రింద వివరింపబడును. అందు వాతమున జనించిన వ్రణశోఫము కాలనియమములేక విషమముగ పరిపక్వమగును. పిత్తమున జనించిన వ్రణశోఫము శీఘ్రముగ పరిపక్వ మగును. కఫమున గల్గిన వ్రణశోఫము చాలకాలమునకు పక్వమగును. రక్తముచేతను ఆగంతుకారణములచేతను గల్గిన వ్రణశోఫము పిత్తమునబోలె నతిశీఘ్రముగ పక్వ మగును.

**అపక్వశోథలక్షణము**

మన్దోష్మతాఽల్పశోథత్వం కాఠిన్యం త్వక్సవర్ణతా,
మన్దవేదనతా చైతచ్ఛోథానామామలక్షణమ్. 4

పక్వముగాక ఆమస్థితినుండుశోథము కొంచెము వేడికల్గి, శోథము స్వల్పముగ నుండును. అయ్యది కఠినమై చర్మమునకు సమానమగు వర్ణముకల్గి స్వల్పమైనబాధ కల్గియుండును.

## పచ్యమానవ్రణశోథలక్షణములు

దహ్యతే దహనేనేవ క్షారేణేవ చ పచ్యతే,
పిపీలికాగణేనేవ దశ్యతే ఛిద్యతే తథా. 5
భిద్యతే చేవ శస్త్రేణ దణ్డేనేన చ తాడ్యతే,
పీడ్యతే పాణినేవాన్తః సూచీభిరివ తుద్యతే. 6
సోషాచోషా వివర్ణస్స్యాదఙ్గుళ్యే వావఘట్యతే,
ఆసనే శయనే స్థానే శాన్తిం వృశ్చికవిద్ధవత్. 7
న గచ్ఛేదాతతశ్శోథో భవేదాధ్మాతవస్తివత్,
జ్వరస్తృష్ణాఽరుచిశ్చైవ పచ్యమానస్య లక్షణమ్. 8

వ్రణశోథము పరిపాకమునొందుసమయమున నిప్పున కాలువబడినట్లును, క్షారము చేత పచింపబడినట్లును, చీమలగుమిచే కరవబడినట్లును, కత్తితో కోయబడినట్లును, పగుల గొట్టబడినట్లును, కఱ్ఱచే గొట్టబడినవిధముగను, చేత బిసికినవిధముగను, సూదులచే లోపల గ్రుచ్చినట్లును, నానావిధములైన బాధలు కల్గును. మరియు నిప్పునకాలినట్లు మంటయు, నిప్పుసెగను కాచినట్లు వేడియుకలిగి వివర్ణమై వ్రేలిచే గట్టనముచేసి (నొక్కి)నట్లు నొప్పిపుట్టును. అట్టి వ్రణముచే బాధ నొందు మనుజుడు కూర్చుని యున్నను, పరుండియున్నను, నిలబడియున్నప్పుడును. తేలుకుట్టినవానివలె బాధ కొంచెమైన శాంతినొందక కష్టపడుచుండును. వాపు మిక్కిలి యున్నదమై గాలిచే నిండి యుండు తిత్తివలె నుబికియుండును. జ్వరము, డప్పి, అరుచియు కల్గును. ఇవియన్నియు పరిపాకమునొందుచుండు వ్రణలక్షణములు.

## పక్వవ్రణశోథలక్షణము

వేదనోపశమశ్శోథో లోహితోఽల్పో న చోన్నతః,
ప్రాదుర్భావో వలీనాం చ తోదః కణ్డూర్ముహుర్ముహుః. 9
ఉపద్రవాణాం ప్రశమో నిమ్నతా స్ఫుటనం త్వచామ్,
వస్తావివామ్బుసఞ్చారః స్యాచ్ఛోథేఽఙ్గులిపీడితే. 10

పూయస్య పీడయత్యేకమన్తమన్తే చ పీడితే,
భక్తాకాఙ్క్షా భవేచ్చైతత్ శోథానాం పక్వలక్షణమ్. 11

వ్రణశోఫము పరిపక్వమైనపుడు నొప్పి, మంట మున్నగుబాధలు శమించి, వాపు ఎరుపురంగు తగ్గి, స్వల్పముగ నుండును. అట్టివాపునందు ముడుతలేర్పడి మాటిమాటికిని సూదులబొడిచినట్లు పోటుపట్టి దురద కల్గియుండును. ఉపద్రవములన్నియు శమించును. వాపు ఉన్నతముగాక యణగి చర్మము పగులును. వాపును వ్రేల నొత్తినపుడు లోపల నుండు చీము ఒకప్రక్క నొత్తినపుడు వేరొండుప్రక్కకు తోలుతిత్తిలో నీర్లు సంచరించువిధముగ నిటునటు దిరుగుచుండును. అన్నము భుజించుట కిచ్ఛబొడమును. (ఈ లక్షణములబట్టి వ్రణము పరిపక్వమైన దని యెరుంగనగు ననుట.)

పాకకాలమున దోషత్రయప్రకోపమునకు కారణములు

నర్తేఽనిలాద్రుజ్న వినా చ పిత్తం
పాకః కఫం చాపి వినా న పూయః,
తస్మాద్ధి సర్వే పరిపాకకాలే
పచన్తి శోథాః త్రిభిరేవ దోషైః. 12

వాతప్రకోపములేక బాధకలుగ నేరదు. పిత్తము ప్రకుపితముగాక పాకము నొందజాలదు. కఫము ప్రకోపించక చీము కలుగబోదు; కావున వ్రణము పరిపక్వము నొందునపుడు వాతపిత్తకఫములు మూడును ప్రకోపము నొందియుండును.

కఫముచే జనించిన వ్రణశోఫము పరిపాకదశయందు వ్రణమున లోతున పరిపక్వమగును; కావున కేవలము పైజెప్పిన లక్షణములబట్టియే పరిపక్వత నెరుంగుట దుస్సాధ్యము. కొన్ని యభిఘాతవ్రణములయందును ఇట్టి గంభీరపాకము గల్గును. అట్టియెడ పరిపక్వముకానిదానిని పక్వ మని భ్రమసి ఛేదనాదిశస్త్రచికిత్సల జేసినను, పక్వమైనదానిని పక్వముకాలే దని యేమరి యుపేక్షించినను వ్రణము దుష్టస్థితినొందును; కావున అట్టి గంభీరపాకవ్రణములయందు వ్రణప్రదేశము చర్మమునకు సమానవర్ణంబై యుండుటను, చల్లగ నుండుటను, స్వల్పమైన బాధగల్గియుండుటను, కాఠిన్యమును గమనించి పక్వమైన దని తెలిసి తగినచికిత్స తోడనే చేయనగును; కాని భ్రమసి యుపేక్షింప దగదు. ఈవిషయము సుశ్రుతాచార్యునిచే నిట్లు వివరింపబడినది:—
"కఫజేషు ఖలు శోథేషు గమ్భీరగతిత్వాత్ అభిఘాతజేషు వా కేషుచిద సమస్తం పక్వలక్షణం దృష్ట్వా పక్వమపక్వమితి భిషఙ్మోహముపైతి;తత్ర హి త్వక్సవర్ణతా,శీతశోథతా, అల్పరుజతా, అశ్మవద్ఘనతా చ; న తత్ర మోహముపేయాత్." (సు. సూ. అ. ౧౭.)

### చీమును వెడలించనియెడ గల్గుదోషము

కక్షం సమాసాద్య యథైవ వహ్నిః
వాయ్వీరితః సన్దహతి ప్రసహ్య,
తథైవ పూయో హ్యవినిస్సృతో వా
మాంసం సిరాః స్నాయు చ ఖాదతీహ. 13

వ్రణము పక్వమై చీము నిండియుండు సమయమునం దాచీమును బైటవెడలించక యుపేక్షించినచో, గాలిచే ప్రేరితమైనయగ్ని యెండిన యడవిని చుట్టి కాల్చువిధముగ శరీరమునందలి మాంసమును సిరలను స్నాయువులను చీము వ్యాపించి తిని నశింపజేయును. కావున వ్రణము పక్వముగ నున్నపుడు వెంటనే దానినుండి చీమును వెడలించుట ముఖ్యకర్తవ్యము.

### పక్వాపక్వజ్ఞానావశ్యకత

యశ్ఛినత్త్యామమజ్ఞానాత్ యో వా పక్వముపేక్షతే,
శ్వపచావివ మన్తవ్యౌ తావనిశ్చితకారిణౌ. 14
ఆమం విదహ్యమానం చ సమ్యక్పక్వం చ యో భిషక్,
జానీయాత్స భవేద్వైద్యః శేషాస్తస్కరవృత్తయః. 15

ఏవైద్యుడు తన యజ్ఞానముచేత పక్వముగాని వ్రణమును పక్వమైనదని భ్రమసి ఛేదించునో, ఏవైద్యుడు పక్వమైన వ్రణమును పక్వముకాలేదని పొరపాటుబడి ఛేదింపక యుపేక్షించునో, అట్టి నిశ్చయజ్ఞానము లేక పనిచేయువారిరువురును మాదిగవారివలె క్రూరకృత్యములజేయువా రని యెరుంగునది. కావున వ్రణములయొక్క ఆమపచ్యమానసమ్యక్పక్వావస్థల వానివానిలక్షణముల జక్కగ గమనించి తెలిసి నిర్ణయించుకొను వైద్యుడు మిక్కిలి గణనీయుడు. అటుగాక నిశ్చయజ్ఞానములేక లేనిపోని యుపాధుల గొనితెచ్చిపెట్టి రోగిని హింసించు వైద్యులు కేవలము ద్రవ్యమును దోచికొను దొంగలుగాని వైద్యులని చెప్పదగరు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
వ్రణశోథనిదానం సమాప్తమ్.

# ४७. శారీరవ్రణనిదానమ్

వ్రణశోథనిదానమును జెప్పినపిదప దాని నుపేక్షించుటచే గల్గు వ్రణముల యొక్క నిదానమును జెప్పుట.—

## వ్రణద్వైవిధ్యము

ద్విధా వ్రణస్స విజ్ఞేయః శారీరాగంతుభేదతః,
దోషైరాద్యస్తయోరన్యశ్శస్త్రాదిక్షతసమ్భవః. 1

వ్రణము శరీరం బనియు, ఆగంతు వనియు రెండు విధములు. అందు ప్రకుపితము లైన వాతాదిదోషములచేత శరీరమునందలి రక్తమాంసాదుల నాశ్రయించి జనించునది శారీరవ్రణము. కత్తి మొదలగు నాయుధాదులచేనైన ప్రహారాదులవలన గల్గిన వ్రణము ఆగంతు వనబడును.

సుశ్రుతమున వ్రణశబ్దనిష్పత్తి యిట్లు చెప్పబడినది:—"వృణోతి యస్మాద్రూఢేఽపి వ్రణవాస్తు న నశ్యతి, ఆదేహధారణాజ్జన్తోః వ్రణ స్తస్మాన్నిరుచ్యతే" (సు. సూ. అ. ౨౧.) పుండు మానినను దాన గల్గుమచ్చ శరీరముండునంతకాలము వ్యాపించి యుండును. కావున వ్రణ మని చెప్పబడును. "వృఙ్ వరణే" అను ధాతువువలన వ్రణ శబ్ద మేర్పడియె నని భావము. కొందరు "వ్రణసంచూర్ణనే" అను చౌరాదిక ధాతువు వలన వ్రణశబ్దనిష్పత్తి జెప్పి శరీరమునందలి రక్తమాంసాదులను చెరిచి మారురూపు నొందించుటం జేసి వ్రణ మని చెప్పెదరు.

## వాతికవ్రణలక్షణము

స్తబ్ధః కఠినసంస్పర్శః మన్దస్రావో మహారుజః,
తుద్యతే స్ఫురతి శ్యావో వ్రణో మారుతసమ్భవః. 2

వాతప్రకోపమున గల్గినవ్రణము స్తంభించి చేత తాకినచో కఠినమై కొంచెముగ పూయాదులు కల్గి మిక్కిలి బాధకల్గియుండును. సూదుల బొడిచినట్లు పోటుకల్గి యదరుచు శ్యామవర్ణంబై యుండును.

## పైత్తికవ్రణలక్షణము

తృష్ణామోహజ్వరక్లేదదాహదుష్ట్యవదారణైః,
వ్రణం పిత్తకృతం విద్యాత్ గన్ధైస్స్రావైశ్చ పూతికైః. 3

పిత్తప్రకోపమున గల్గినవ్రణమునందు దప్పి విశేషముగ నగును; మూర్ఛగ్రమ్మును; జ్వరమువచ్చును: వ్రణముపై చెమ్మగల్గును; విశేషముగ మంటపుట్టును; రక్తమాంసాదులు చెడి పగులదీయునట్లు బాధకల్గును; వ్రణము దుర్గంధముపట్టి దుర్గంధమైన చీము మొదలగునవి స్రవించును. ఇట్టి లక్షణములు కల్గినది పిత్తవ్రణ మని యెరుంగునది.

## శ్లైష్మికవ్రణలక్షణము

బహుపిచ్ఛో గురుః స్నిగ్ధః స్తిమితో మన్దవేదనః,
పాండువర్ణోఽల్పసంక్లేదః చిరపాకీ కఫవ్రణః. 4

కఫప్రకోపమున గల్గినవ్రణము మిక్కిలి జిగటగల్గి బరువై నూనె పూసిన విధముగ జిడ్డు కల్గి నిశ్చలమై స్వల్పమైన వేదన గల్గియుండును. పాండువర్ణముకల్గి స్వల్పముగ చీము గార్చుచుండును. చిరకాలమునకు పరిపక్వమగును.

## రక్తజ-సంసర్గ-సన్నిపాతవ్రణలక్షణములు

రక్తోరక్తస్రుతీ రక్తాత్ ద్విత్రిజస్స్యాత్తదన్వయైః,

రక్తముచే జనించిన వ్రణము రక్తవర్ణంబై నెత్తురు గారుచుండును. వాతపిత్తకఫములలో రెండేసిదోషములు ప్రకోపము నొందుటచే గల్గినవ్రణము ఆరెండు దోషములకు వేరువేర చెప్పినలక్షణములు మిశ్రములై యుండును. సన్నిపాతమున గల్గినవ్రణము త్రిదోషములకు వేర్వేరుగ జెప్పినలక్షణములు మిశ్రములై యుండును.

## సాధ్యాసాధ్యవ్రణనిర్ణయము

త్వఙ్మాంసజస్సుఖే దేశే తరుణస్యానుపద్రవః. 5
ధీమతోఽభినవః కాలే సుఖే సాధ్యస్సుఖం వ్రణః,
గుణైరన్యతమైర్హీనః తతః కృచ్ఛ్రో వ్రణస్స్మృతః. 6
సర్వైర్విహీనో విజ్ఞేయస్త్వసాధ్యో భూర్యుపద్రవః,

యుక్తాయుక్తవివేకముకల్గి పథ్యము దప్పకుండు యౌవనవంతునకు సౌమ్యమగు శిశిరవసంతకాలమున దుష్కరములగు మర్మస్థలములుగాక యితర స్థలములయందు చర్మమాంసములమాత్రము నాశ్రయించి జనించి, జ్వరము మున్నగు నుపద్రవములులేక నూతనముగ గల్గినవ్రణము సుఖసాధ్యమగును. పైజెప్పినగుణములలో కొన్నిమాత్రము లేకయుండువ్రణము కృచ్ఛ్రసాధ్యమగును. పైజెప్పిన సుగుణము లొక్కటైన లేక అట్టి గుణములకు విరుద్ధములైన గుణములు గల్గిన వ్రణమును, ప్రబలములైన యుపద్రవములు కల వ్రణంబును అసాధ్యము.

### దుష్టవ్రణలక్షణము

పూతిపూయాతిదుష్టాసృక్స్రావ్యుత్సఙ్గీచిరస్థితిః. 7
దుష్టో వ్రణోఽతిగన్ధాదిగ శుద్ధలిఙ్గవిపర్యయః,

మిక్కిలి దుర్గంధము కలిగినచీమును మిక్కిలి దుష్టమైన రక్తమును స్రవించుట, వ్రణము మిక్కిలి యున్నతముగ నుండుట, చిరకాలమునుండియు మానక యనువర్తించి యుండుట, గంధము వర్ణము బాధలు మున్నగునవి మిక్కిలి యధికములుగ నుండుట ఇవి కలవియు, ఈక్రింద చెప్పబడు శుద్ధవ్రణలక్షణములు కలవియు, శుద్ధవ్రణమునకు విరుద్ధములైనవియు దుష్టవ్రణ లక్షణములు.

### శుద్ధవ్రణలక్షణము

జిహ్వాతలాభోఽతిమృదుశ్శ్లక్ష్ణస్స్నిగ్ధోఽల్పవేదనః. 8
సువ్యవస్థో నిరాస్రావః శుద్ధో వ్రణ ఇతి స్మృతః,

వ్రణము పగిలిన పుండు నాలుక కడుగుభాగమువంటి వర్ణముకల్గి, మిక్కిలి మెత్తనై నునుపుకల్గి, కొంచెముగ జిడ్డుకల్గి, బాధలు (నొప్పి పోటు మున్నగునవి) తగ్గి, ఒడ్డు మిట్టలేక చదరమై, చీము నెత్తురునుగారక యుండు వ్రణము శుద్ధమైనది. ఇయ్యది సుఖముగ మానుపందగియుండును.

శుద్ధవ్రణ లక్షణము చరకమునం దిట్లు చెప్పబడినది:—"నాతిరక్తో నాతిపాణ్డుః నాతిస్రావో న చాతిరుక్, న చోత్సన్నో నచోత్సఙ్గీ శుద్ధో రోప్యః పరం వ్రణః" (చరక. చి. అ. ౨౫.) వ్రణము మిక్కిలి రక్తవర్ణంబు మిక్కిలి పాండువర్ణంబును గాక యుండి, మిక్కిలి చీము మొదలగునవి స్రవించక, అధికమైన బాధలేక మితముగనుండి, మిక్కిలి పల్లమును ఉన్నతంబును గాకయుండు వ్రణము శుద్ధమైనది. ఇట్టి శుద్ధమైన వ్రణము మాన్పదగియుండును.

### మానుచుండు వ్రణములయొక్క లక్షణము

కపోతవర్ణప్రతిమాః యస్యాన్తాః క్లేదవర్జితాః. 9
స్థిరాశ్చిపిటికావన్తో రోహతీతి తమాదిశేత్,

ఏ వ్రణమునకు అంచులు పావురమువంటి రంగుకల్గి చీము మొదలగునవి స్రవించక స్థిరమైన ఆంపపు పండ్లవంటి గరుకులు కలిగియుండునో, ఆవ్రణము మానుచున్నదని యెరుంగునది.

### మానిన వ్రణముయొక్క లక్షణము

రూఢవర్త్మానమగ్రంథిమశూనమరుజం వ్రణమ్. 10
త్వక్సవర్ణం సమతలం సమ్యగ్రూఢం వినిర్దిశేత్,

వ్రణమార్గము మాంసముచే గ్రమ్ముకొని, దుర్మాంస మెరుగక, వాపులేక, శరీర ముపై చర్మమునకు సమానమగు రంగుకల్గి మిట్టపల్లములుగాక యరచేతివలె చదరమై మచ్చపడి యుండు వ్రణము మానిన దని యెరుంగునది.

## కష్టసాధ్య వ్రణములు

కుష్ఠినాం విషజుష్టానాం శోషిణాం మధుమేహినామ్. 11
వ్రణాః కృచ్ఛ్రేణ సిధ్యన్తి యేషాం చాపివ్రణే వ్రణాః,

కుష్ఠరోగము వ్యాపించినవారికిని, స్థావరజంగమ భేదము కల విషము వ్యాపించిన వారికిని, ధాతువులు క్షీణించినవారికిని, మధుమేహముచే బాధపడువారికిని కల్గినవ్రణ ములు మిక్కిలి కష్టముచే మాన్పదగియుండును. మరియు పైజెప్పినవ్యాధులు లేకున్నను ఒక్కతూరి వ్రణములేచి మాని, కొంతకాలమున కామచ్చలోనే మరల వ్రణము లేచిన యెడ నయ్యదియు కష్టముచే మానుపదగియుండును.

## స్రావభేదముచే సాధ్యాసాధ్యత్వము

వసాం మేదోఽథ మజ్జానం మస్తులుఙ్గం చ యస్స్రవేత్. 12
ఆగన్తుజో వ్రణస్సిధ్యేత్ న సిధ్యేద్దోషసమ్భవః,

వ్రణమునుండి క్రొవ్వైనను, మేదస్సైనను, ఎముకలలోని మూలగయైనను, మస్తు లుంగము (శిరమునందలి మెదడు) అయినను కారుచున్నయెడ, ఆవ్రణము ప్రహారము మున్నగు నాగంతుకారణములచే గల్గియుండునెడ మాన్పదగును; కాని దోష (వాత-పిత్త-కఫ)ములచే జనించియుండి పైజెప్పబడిన వస మున్నగునవి స్రవించుచున్నయెడ మాన్ప నలవి గా కుండును.

## గంధవిశేషముచే నసాధ్యత్వము

మద్యాగుర్వాజ్యసుమనఃపద్మచమ్పకచన్దనైః. 13
సగన్ధా దివ్యగన్ధాశ్చ ముమూర్షూణాం వ్రణాస్స్మృతాః,

మద్యము, అగరు, నెయ్యి, జాజిపువ్వు, తామరపువ్వు, సంపెంగపువ్వు, గంధము వీనితో సమానమైన పరిమళముకల వ్రణంబును,దేవలోకమునందలి పారిజాతము మున్నగు వానికిం గల పరిమళముకల్గిన వ్రణంబును చావసిద్ధముగ నుండువారికి కల్గును. (పై జెప్పిన విధముగ పరిమళించు చీముకారుచు అట్టి పరిమళము కలవ్రణములు అసాధ్యము లనుట.)

## కొన్ని యసాధ్యవ్రణ లక్షణములు

యే చ మర్మస్వసమ్భూతాః భవన్త్యత్యర్థవేదనాః. 14
దహ్యన్తే చాన్తరత్యర్థం బహిశ్శీతాశ్చ యే వ్రణాః,
దహ్యన్తే బహిరత్యర్థం భవన్త్యన్తశ్చ శీతలాః. 15
ప్రాణమాంసక్షయశ్వాసకాసారోచకపీడితాః,
ప్రవృద్ధపూయరుధిరాః వ్రణా యేషాం చ మర్మసు. 16
క్రియాభిస్సమ్యగారబ్ధాః న సిధ్యన్తి చ యే వ్రణాః,
వర్జయేదపి తాన్ వైద్యః సంరక్షన్నాత్మనో యశః. 17

మర్మస్థానములగాక యితర స్థలములయందు బుట్టినవ్రణములు మిక్కిలి తీవ్రమైన బాధలు కల్గియున్నచో నవియన్నియు, వ్రణము పైభాగమున చల్లగ నుండి లోపల తీవ్రమైన మంటకలిగిన వ్రణంబులును, లోపల చల్లగనుండి పైభాగమున మిక్కిలి మంటగల వ్రణంబులును, శరీరమున బలంబును మాంసపుష్టియు నశించి శ్వాసము దగ్గు అరోచకము నను నీయుపద్రవములచే పీడింపబడినవానికిం గల్గిన వ్రణంబులును, మిక్కిలి యెక్కువగా చీమును నెత్తురును స్రవించువ్రణంబులును, మర్మస్థలములబుట్టిన వ్రణంబులును, పలువెరంగుల యుక్తియుక్తముగ దగినచికిత్సల జేయుచున్నను కొంచెమైన శాంతి నొందక నానాట వృద్ధినొందుచుండు వ్రణంబులును ఇవియన్నియు మిక్కిలి యసాధ్యములు; కావున తనకు యశంబునుగోరు వైద్యవరుడు పైజెప్పినవ్రణములకు చికిత్స జేయక మానియుండుట చాలమంచిది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శారీరవ్రణనిదానం సమాప్తమ్.

# ౪౩. సద్యోవ్రణనిదానమ్

శారీర-ఆగంతుభేదములచే రెండు విధములగు వ్రణములలో శారీరవ్రణనిదానమును జెప్పినపిదప, దెబ్బలు మొదలగు నాగంతుకారణములచే గల్గిన యాగంతువ్రణరూపంబులైన సద్యోవ్రణములనిదానమును జెప్పుట:—

సద్యోవ్రణసంప్రాప్తి, వాని భేదములు

నానాధారముఖైశ్శస్త్రైర్నానాస్థాననిపాతితైః,
భవన్తి నానాకృతయో వ్రణాస్తాంస్తాన్నిబోధ మే. 1
ఛిన్నం భిన్నం తథా విద్ధం క్షతం పిచ్చితమేవ చ,
ఘృష్టమాహుస్తథా షష్ఠం తేషాం వక్ష్యామి లక్షణమ్. 2

పలుదెరంగులైన వాదర(దారు)కల్గి నానావిధముఖములుకల కత్తి మున్నగు నాయుధములచే శరీరమునందలి యవయవవిశేషములయందు దెబ్బలు కలిగినయెడ దానంజేసి నానావిధములగు వ్రణములు పలుదెఱంగులైన యాకారభేదముగల్గి పుట్టును; అయ్యవి ఛిన్నము, భిన్నము, విద్ధము, క్షతము, పిచ్చితము, ఘృష్టము నని యారు విధములు. వానిస్వరూపలక్షణంబు లీక్రింద విశదముగ వివరింపబడును.

ఛిన్నవ్రణలక్షణము

తిర్యక్ఛిన్న ఋజుర్వాపి యో వ్రణస్త్వాయతో భవేత్,
గాత్రస్య పాతనం తద్ధి చ్ఛిన్నమిత్యభిధీయతే. 3

కత్తి మొదలగు నాయుధములచే శరీరమునందు అడ్డముగనైనను నిడుపుగనైనను తెగగొట్టబడినచో నయ్యది ఛిన్నవ్రణ మని చెప్పబడును.

భిన్నలక్షణము

శక్తికున్తేషుఖడ్గాగ్రవిషాణైరాశయో హతః,
యత్కిఞ్చిత్ప్రస్రవే తద్ధి భిన్నలక్షణముచ్యతే. 4

పీనిత * శక్తి, కుంతము, బాణము, కత్తికొన, కొమ్ము అను నీయాయుధముల కొనలచే శరీరమునందలి మూత్రాశయము మున్నగు అంతరావయవములు భేదింపబడి గాయము నుండి ఎట్టి ద్రవమైనను స్రవించుచున్నయెడ నట్టివ్రణము భిన్న మని చెప్పబడును.

---

* శక్తి యనగా నొక యగ్రముకల శూలము.

### భిన్నవ్రణసామాన్యలక్షణము

స్థానాన్యామాగ్నిపక్వానాం మూత్రస్య రుధిరస్య చ,
హృదుణ్డుకశ్చః ఫుప్ఫుసకోష్ఠ ఇత్యభిధీయతే. 5
తస్మిన్ భిన్నే రక్తపూర్ణే జ్వరో దాహశ్చ జాయతే,
మూత్రమార్గగుదాస్యేభ్యః రక్తం ఘ్రాణాచ్చ గచ్ఛతి. 6
మూర్ఛాశ్వాసస్తృషాధ్మానం అభక్తచ్ఛన్ద ఏవ చ,
విణ్మూత్రవాతసఙ్గశ్చ స్వేదాస్రావోఽక్షిరక్తతా. 7
లోహగన్ధిత్వమాస్యస్య గాత్రదౌర్గన్ధ్యమేవ చ,
హృచ్ఛూలం పార్శ్వయోశ్చాపి

పక్వముగాని యాహారమునకు స్థానమైన యామాశయంబును, కాయాగ్ని కాధారమైనస్థానంబును, పక్వమైన యాహారపదార్థమునకు స్థానమైన పక్వాశయంబును, మూత్రమునకు స్థానమైన మూత్రాశయంబును, రక్తమునకు స్థానములగు యకృత్ప్లీహంబులును; హృదయకమలంబును, రక్తముయొక్క మలరూపమైన* ఉండుకంబును, ఎడమప్రక్క రక్తమున కాధారమై రక్తముయొక్క నురుగు వలన బుట్టిన ఫుప్ఫుసంబును,ఇవియన్నియు జేరి కోష్ఠ మనంబడును. అట్టికోష్ఠము పైజెప్పినవిధముగ శక్తి మున్నగు నాయుధవిశేషంబులచే భిన్నమైనపుడు రక్తముచే నిండియుండును. అట్టియెడ జ్వరంబును తాపంబును కల్గును. మూత్రము వెడలుమార్గమునుండియు, గుదద్వారము నుండియు, నోటినుండియు, ముక్కులనుండియు నెత్తురు గారును. మూర్ఛగ్రమ్మును. శ్వాస మధిక మగును. దప్పియగును. కడుపుబ్బును. అన్నమునం దిచ్ఛపోడమదు. మలమూత్రంబులు అపానవాతంబును వెడలక బంధింపబడును. చెమట విశేషముగ గారును. కన్ను లెఱ్ఱవారును. నోరు ఇనుమువాసన గల్గియుండును. శరీరమంతయు దుర్గంధభూయిష్ఠముగ నుండును. రొమ్మునందును ఇరుప్రక్కలయందును నొప్పి కల్గును. ఇవి యన్నియు భిన్నవ్రణసామాన్యముగ గల్గు లక్షణములు.

### భిన్నవ్రణవిశేషలక్షణములు

విశేషం చాత్ర మే శృణు. 8
ఆమాశయస్థే రుధిరే రుధిరం ఛర్దయత్యపి,
ఆధ్మానమతిమాత్రం చ శూలం చ భృశదారుణమ్. 9

*। ఉండుక మనగా జిన్నపేగుకును బెద్దపేగుకును సంధిలో నుండు రోలువంటి భాగ మని గణనాథసేనుగారు వ్రాయుచున్నారు. ఫుప్ఫుస మనగా నూపిరితిత్తు లని గూడ వ్రాసిరి.

పక్వాశయగతే చాపి రుజా గౌరవమేవ చ,
అధఃకాయే విశేషేణ శీతతా చ భవేదిహ. 10

భిన్నవ్రణమున స్థానవిశేషములబట్టి విశేషలక్షణముల నీరీతి నెరుంగునది.—పైనిజెప్పిన విధముగ కోష్ఠము భిన్నమై యామాశయమున రక్తము నిండియున్నప్పుడు నోటినుండి రక్తము వాంతి యగును. కడుపు మిక్కుటముగ నుబ్బి యోరువరాని పోటు పుట్టును. అట్టిరక్తము పక్వాశయమున నిండియున్నపుడు అచ్చట తీవ్రమైననొప్పి గల్గి మిక్కిలి బరువుగ నుండును. బొడ్డుకు క్రిందిశరీరభాగమున విశేషముగ చల్లబడి యుండును.

## విద్ధవ్రణలక్షణము

సూక్ష్మాస్యశల్యాభిహతం యదఙ్గం త్వాశయం వినా,
ఉత్తుణ్డితం నిర్గతం వా తద్విద్ధమితి నిర్దిశేత్. 11

మిక్కిలి సూక్ష్మమైనకొనలు కలముండ్లు, ఇనుపమేకులు మున్నగునవి పైజెప్పబడిన యామాశయపక్వాశయాదులయందుగాక తక్కిన స్థానములయం దెచ్చోటనైన తీవ్రముగ నాటి, అయ్యది (శల్యము) విరిగి బైలువెడలినను, బైటవెడలక యచ్చోటనే నిలిచియున్నను, దాన జనించినవ్రణము విద్ధము (ముల్లుమొదలగునవి గ్రుచ్చుకొనుటచే గల్గినది) అని చెప్పబడును.

విద్ధలక్షణము జెప్పునప్పుడు తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—'విద్ధముత్తుండిత మనుత్తుండితం భిన్నమభిన్నమ్'' విద్ధ మనునది నాల్గు విధములు—ముల్లు మొదలగునవి అవయవమున గ్రుచ్చుకొని విరిగినయెడ నుత్తుండిత మనియు, విరుగక బైట వెడలినయెడ అనుత్తుండిత మనియు, అవయవమున నడ్డముగ గ్రుచ్చుకొనినది నిర్భిన్న మనియు చెప్పబడును.

## క్షతవ్రణలక్షణము

నాతిచ్ఛిన్నం నాతిభిన్నం ఉభయోర్లక్షణాన్వితమ్,
విషమం వ్రణమఙ్గే యత్తత్క్షతం త్వభిధీయతే. 12

మిక్కిలి ఛిన్నంబును భిన్నంబునుకాక ఆరెండిటిలక్షణములును మిక్కిలి సూక్ష్మముగనుండి మిట్టపల్లములుగ గాయమైనది క్షతవ్రణ మని చెప్పనగును.

## పిచ్చితవ్రణలక్షణము

ప్రహారపీడనాభ్యాం తు యదఙ్గం పృథుతాం గతమ్,
నాస్థి తత్పిచ్చితం విద్యాన్మజ్జరక్తపరిప్లుతమ్. 13

ఇనుపగుదియ మున్నగువాని దెబ్బలచేనైనను, బండిమున్నగునవి యొరయుట

టచేసైనను ఏదైన నవయవము నలిగి యెముకలు మజ్జరక్తములచే తడిసి యణగి విశాలముగ నున్నయెడ నియ్యది పిచ్చితవ్రణ మని చెప్పబడును. ఇది యెముకలు నలుగుటచే గల్గును.

### ఘృష్ట లక్షణము

ఘర్షణాదభిఘాతాద్వా యదఙ్గం విగతత్వచమ్,
ఉషాస్రావాన్వితం తచ్చ ఘృష్టమిత్యభిధీయతే. 14

కర్కశములగు నాయుధాదు లొరయుటచేసైనను, అభిఘాతముచేసైనను, అవయవమునందు తోలుతొలగి మంటతోఁగూడ నీరైనను, రక్తమైనను స్రవించుచున్న యెడ నయ్యది ఘృష్టవ్రణ మని చెప్పబడును.

### శల్యముతోఁగూడిన వ్రణలక్షణము

శ్యావం సశోథం పిటికాచితం చ
ముహుర్ముహుశ్శోణితవాహినం చ,
మృదూద్గతం బుద్బుదతుల్యమాంసం
వ్రణం సశల్యం సరుజం వదన్తి. 15

వ్రణమున ముల్లు మొదలగు శల్యములు విరిగి బైటరాక యుండునెడ శ్యావవర్ణంబై వాపుతోఁగూడి సన్నని బొబ్బలచే నావరింపబడి మాటిమాటికి రక్తమును స్రవించును. వ్రణమునందు మెత్తనై నీటిబుగ్గవలె పైకుబికి యుండుమాంసము కనబడుచుండును. తీవ్రమైననొప్పి కల్గియుండును.

### కోష్ఠభేదము

త్వచోఽతీత్య సిరాదీని భిత్వా వా పరిహృత్య వా,
కోష్ఠే ప్రతిష్ఠితం శల్యం కుర్యాదుక్తానుపద్రవాన్. 16

బాణము ఇనుపమేకులు మున్నగుశల్యములు శరీరముపై చర్మమున దూరి యతిక్రమించి సిరలు మున్నగువానిని భేదించియైనను లేక వాని నంటక తొలగియైనను లోపలనుండు పై జెప్పబడిన కోష్ఠమున బ్రవేశించినచో ననేకోపద్రవముల గల్గించును. ఇదియే కోష్ఠభేదక్రమము.

అట్టి కోష్ఠభేదమున గల్గు నుపద్రవములు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—
"కోష్ఠగతే త్వాటోపానాహౌ మూత్రపురీషాహారదర్శనం చ వ్రణముఖాద్భవతి" (సు. సూ. అ. ౨౬.) శల్యము శరీరముపై చర్మము మున్నగువాని నతిక్రమించి కోష్ఠమున జేరినపుడు కడుపులో గడబిడయై యుబ్బరించి వ్రణద్వారమునుండి మూత్రంబును, పురీషంబును, ఆహారంబును బైటవెడలం జొచ్చును.

### కోష్ఠభేదమునం దసాధ్యలక్షణములు

తత్రాన్తర్లోహితం పాణ్డుశీతపాదకరాననమ్,
శీతోచ్ఛ్వాసం రక్తనేత్రం ఆనద్ధం చ వివర్జయేత్. 17

పై జెప్పబడిన కోష్ఠభేదమునందు కోష్ఠమున రక్తము నిలిచి శరీరము తెల్లబడి, హస్తపాదంబులును ముఖంబును చల్లబడి, కన్ను లెఱ్ఱనై నిశ్శ్వాసము చల్లగా వెడలుచు కడు పుబ్బరించియున్నచో నసాధ్యమగును. కావున చికిత్స జేయంజనదు.

### మర్మక్షత సామాన్యలక్షణము

భ్రమః ప్రలాపః పతనం ప్రమోహో
విచేష్టనం గ్లానిరథోష్ణతా చ,
స్రస్తాఙ్గతా మూర్ఛనమూర్ధ్వవాత
స్తీవ్రా రుజా వాతకృతాశ్చ తాస్తాః. 18
మాంసోదకాభం రుధిరం చ గచ్ఛే
త్సర్వేన్ద్రియార్థోపరమ స్తథైవ,
దశార్ధసంఖ్యేష్వథ విక్షతేషు
సామాన్యతో మర్మసు లిఙ్గము క్తమ్. 19

శరీరమున నుండు మర్మములు నూటయేడు. అవ్వాని శరీరమునందలి మాంసము, సిరలు, స్నాయువులు, అస్థులు, సంధులు అను నీ యైదిటి నాశ్రయించి యుండును. అట్టి యైదిటి నాశ్రయించియుండు మర్మస్థానములయందు గాయములు తగిలినపుడు భ్రమము-(మైగ్రమ్ముట.) ప్రలాపము (అసంబద్ధముగ వదరుట), ఒడలెరుంగక క్రిందపడుట, మతిభ్రమము గ్రమ్ముట, కాలుసేతుల విదలించుట, బడలిక, శరీరము వేడిగ నుండుట, సంధిబంధములు సడలియుండుట, మూర్ఛ గ్రమ్ముట, ఊర్ధ్వశ్వాసము ఈలక్షణములు కల్గును. మరియు వాతము ప్రకోపించినప్పుడు కలుగు పలుతెరంగులైన బాధలు కల్గును. మాంసముకడిగిన నీళ్లవలెనుండు రక్తంబును గార్చును. ఇంద్రియములు ఆయావిషయ పరిజ్ఞానము నెరుంగనోపకుండును. ఇవియన్నియు మర్మములయందు గాయములు తగిలినపుడు సామాన్యముగగల్గు లక్షణములు.

పైజెప్పిన మర్మస్థానముల సంఖ్యాస్థానాది వివరము సుశ్రుతమున నిట్లు చెప్పబడినది:—"సప్తోత్తరం మర్మశతం; తాని మర్మాణి పఞ్చాత్మకాని. తద్యథా... మాంసమర్మాణి, సిరామర్మాణి, స్నాయుమర్మాణి, అస్థిమర్మాణి, సన్ధిమర్మాణి చేతి"

(సుశ్రుత. శా. అ. ౬. సూ. ౨.) ఈనూటయేడుమర్మముల వివరమంతయు సుశ్రుతమున 'తత్రైకాదశమాంసమర్మాణి' అని యుపక్రమించి వివరింపబడినది. కావున నచ్చట జూచునది.

### సిరావిద్ధలక్షణము

సురేన్ద్రగోపప్రతిమం ప్రభూతం రక్తం స్రవేత్ తత్క్షతజశ్చవాయుః,
కరోతిరోగాన్వివిధాన్ యథోక్తాన్ సిరాసు విద్ధాస్వథవా క్షతాసు.

మర్మములుగాక తక్కిన సిరలయందు క్షతము గలిగినప్పుడు ఇంద్రగోపపు(ఆర్ద్రి) పురుగువలె నెఱ్ఱనైన రక్తము అధికముగ నెడతెగక స్రవించును. అట్టి క్షతమువలన ప్రకోపమునొందిన వాతము ఆక్రమ సిరావ్యధనమున గల్గు తలనొప్పి మున్నగు నానావిధ రోగముల గలిగించును. లేక సిరలు తెగినందువలన గలుగు మోహము మొదలగు వానిని గలిగించును.

### స్నాయువిద్ధలక్షణములు

కౌబ్జ్యం శరీరావయవావసాదః క్రియాస్వశక్తిస్తుములా రుజశ్చ,
చిరాద్వ్రణో రోహతియస్యచాపితంస్నాయువిద్ధంపురుషంవ్యవస్యేత్.

స్నాయువులయందు శల్యాదులచే క్షతము కలిగినపుడు కుబ్జత్వంబును, శరీరమునందలి యవయవములకృశతయు కల్గును. పనులుచేయుటకు శక్తిలేకుండును. పోటుమంట మున్నగు నానావిధములైన బాధలు కల్గును. దాన గల్గువ్రణము చిరకాలమునకు మానును. ఇట్టిలక్షణములు కలిగినది స్నాయువిద్ధవ్రణ మని యెరుంగునది.

### సంధిక్షతలక్షణము

శోఫాభివృద్ధిస్తుములా రుజశ్చ బలక్షయః పర్వసు భేదశోథా,
క్షతేషు సన్ధిష్వచలాచలేషు స్యాత్సర్వకర్మోపరమశ్చ లిఙ్గమ్. 22

చలించునవియు చలనములేక స్థిరంబులు నని రెండువిధములైన సంధులయందును ముల్లు మున్నగుశల్యములు గ్రుచ్చికొనినప్పుడు అధికముగ వాపు కల్గును. మంట పోటు మున్నగు నానావిధ వేదనలు కల్గును. శరీరబలము కృశించును. గాయము తగిలిన సంధిస్థలమున పగులదీయునట్లు బాధయు వాపును కల్గును. అన్ని పనులయందును పాటవము లేక విరక్తి కల్గును.

సంధులు చంచలము లనియు స్థిరము లనియు రెండు విధములు. అందు హస్తపాదములయందును, తాలువులయందును, నడుమునందును కల కీళ్లు కదులుచుండునుగాన నవి

చంచలములు. వెన్నెముక ప్రక్కటెముకలు రొమ్ము మున్నగుస్థలములయందలి సంధులు కదలకయుండును కావున నవి స్థిరములు. ఈవిషయము సుశ్రుతమున నిట్లు చెప్పబడి నది:—"సన్ధయస్తు ద్వివిధాః; చేష్టావన్తస్స్థిరాశ్చ; శాఖాసు హన్వోః కట్యాం చ చేష్టావంతస్తు సన్ధయః, శేషాస్తుసన్ధయస్సర్వే విజ్ఞేయా హి స్థిరా బుధైః" (సు. శా. అ. ౫.) పై వివరించిన రెండువిధములగు సంధులయందుగల యవాంతరభేదములు కలిసి మొత్తమున తొంబదివందల సంధులు సుశ్రుతమున వివరింపబడినవి అట్టి యుభయాత్మకములగు సంధులయందు శల్యము గ్రుచ్చుకొనినయెడ శోఫవృద్ధి మున్నగు నుపద్రవములు కల్గునని ప్రకృతమూలమునకు భావము.

## అస్థివిద్ధలక్షణము

ఘోరారుజోయస్యనిశాదినేషు సర్వాస్వవస్థాసు చ నైతి శాన్తిమ్,
భిషగ్విపశ్చిద్విదితార్థసూత్రః తమస్థివిద్ధం పురుషం వ్యవస్యేత్. 23

శరీరమునందలి యస్థులయందు శల్యాదులు గ్రుచ్చుకొని వ్రణమైనయెడ రేయిం బవలును సర్వకాలసర్వావస్థలయందును మిక్కిలి యోరువరాని బాధలు కల్గి యెకప్పుడైన శాంతినొందక బాధించుచుండునని శాస్త్రజ్ఞుడగు వైద్యవరుండు తెలిసికొనవలెను.

## సిరాదిమర్మవిద్ధలక్షణము

యథాస్వమేతానివిభావయేచ్చ లిఙ్గాని మర్మస్వభితాడితేషు,
పాణ్డుర్వివర్ణస్స్పర్శతం స వేత్తియోమాంసమర్మణ్యభిపీడితస్స్యాత్.

పై జెప్పబడిన సిరా-స్నాయు-సంధి అస్థులనాల్గిటియొక్క మర్మస్థానములయందు క్షతమైనపుడు సిరాదుల నాల్గిటికిని వేరువేర జెప్పినలక్షణముగాక మర్మక్షత సామాన్యముగ జెప్పబడిన భ్రమ ప్రలాపాదులుకూడ గల్గును. మరియు మాంసమర్మస్థానముల క్షతము కల్గినపుడు పాండువర్ణమై శరీరవర్ణము చెడి స్పర్శము నెరుంగజాలకుండును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—వ్రణములు నిజ - ఆగంతు భేదములచే రెండు తెరంగులు. అందు వాతపిత్తకఫముల సంబంధముకల్గి హానివలననే జనించినవి నిజములు. కత్తి పరశు మున్నగునాయుధములచేతను, బాణములు ముండ్లు మున్నగుశల్యములచేతను దెబ్బతగిలి దాన జనించిన వ్రణములు ఆగంతుకములు. ఇవియే సద్యోవ్రణములని చెప్పనగును. (శరీరమునందలి వాతాదిదోషప్రకోపమున గాక తాత్కాలికములగు ప్రహారాదులచే తటాలున గల్గినవ్రణములు సద్యోవ్రణము లని భావము.) ఈ విషయము చరకమున నిట్లు చెప్పబడినది:—"నిజశ్శరీరదోషోత్థః ఆగన్తుర్బాహ్య

హేతుజః" వాగ్భటాచార్యు డిట్లని చెప్పెను:—"వ్రణాద్విధా నిజాగన్తు దుష్ట శుద్ధ విభేదతః, నిజో దోషై శ్శరీరోత్థః ఆగన్తుర్బాహ్యహేతుజః, దోషైరధిష్ఠితో దుష్టః శుద్ధస్తైరనధిష్ఠితః" (అ. హృ. ఉ. అ. ౨౫. శ్లో. ౧.) పైవాక్యమున వాగ్భటులు నిజాగన్తు భేదములచే రెండువిధము లనియు, ఈ రెండును దుష్టశుద్ధభేదములచే వేరువేర రెండేసివిధములనియు, అందు దోషసంబంధముచే గలుగు "పూతిః పూయాతి...... ...........విపర్యయః" అను శ్లోకమున జెప్పిన లక్షణములు కల్గినది దుష్టవ్రణం బనియు "జిహ్వాతలాభః..................శుద్ధో వ్రణ ఇతి స్మృతః"అని చెప్పిన లక్షణములు కలిగినది శుద్ధవ్రణంబనియు వివరించియున్నారు.

మరియు ఆగంతువ్రణములయందు వ్రణము జనించుటకు త్రిదోషసంబంధము లేక బాహ్యహేతువులు కారణములైనను, వ్రణోత్పత్తిమాత్రమునకు బాహ్యములగు నభిఘాతాదులు కారణములు. అట్టి కారణములచే తటాలున వ్రణము కలిగిన యుత్తర క్షణముననే వాతాదులు ప్రకోపమునొందును. దానంజేసియె నొప్పి, మంట, చీము పట్టుట, స్రవించుట మున్నగు దోషలక్షణములు కానబడును. కావున ఆగంతువ్రణములయందును పైజెప్పిన దుష్టలక్షణము లున్నచో దుష్టవ్రణ మనియు, అవి లేక శుద్ధవ్రణ మగుననియు నెరుంగునది.

## వ్రణోపద్రవములు

విసర్పః పక్షఘాతశ్చ సిరాస్తమ్భోఽపతానకః,
మోహోన్మాదవ్రణరుజో జ్వరస్తృష్ణా హనుగ్రహః. 25
కాసశ్ఛర్దిరతీసారః హిక్కా-శ్వాసస్స వేపథుః,
షోడశోపద్రవాః ప్రోక్తాః వ్రణానాం వ్రణచింతకైః. 26

విసర్పము, పక్షఘాతము, సిరలు స్తంభించుట, అపతానక వాతరోగము, మూర్ఛ, ఉన్మాదము, వ్రణమున తీవ్రమైననొప్పి, జ్వరము, దప్పి, దౌడలు పట్టియుండుట, దగ్గు, వాంతి, అతిసారము, ఎక్కిళ్లు, శ్వాసము, వణకు ఈపదునా రుపద్రవంబులును వ్రణము లన్నిటియందును సంభవించు నుపద్రవములు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
సద్యోవ్రణనిదానం సమాప్తమ్.

# ౪౪. భగ్ననిదానమ్

భగ్నము లన నెముక విరుగుట. ఇదియు నాగంతువ్రణములబోలె ప్రహారాదు లయిన బాహ్యకారణములచే గల్గును. కావున నాగంతువ్రణముల జెప్పిన పిదప భగ్న నిదానము జెప్పుట.—

## భగ్న భేదములు

భగ్నం సమాసాద్ద్వివిధం *హుతాశ !
కాణ్డే చ సంధౌ చ హి తత్ర సన్ధౌ,
ఉత్పిష్టవిశ్లిష్టవివర్తితం చ
తిర్యగ్గతం క్షిప్తమధశ్చ షట్చ. 1

భగ్నము రెండు విధములు. అందొకటి యెముకలయందును, రెండవది కీళ్ల యందును కల్గును. ఈ రెంటిలో సంధిగతభగ్నము ఉత్పిష్టము, విశ్లిష్టము, వివర్తితము తిర్యగ్గతము, క్షిప్తము, అథోగత (క్షిప్త)ము నని యారు విధములు.

## సంధిభగ్నసామాన్యలక్షణములు

ప్రసారణాకుఞ్చనవర్తనోగ్రా
రుక్స్పర్శవిద్వేషణమేతదుక్తమ్,
సామాన్యతస్సన్ధిగతస్య లిఙ్గమ్

కాళ్లుచేతులు మున్నగు నవయవములయందలి సంధులు (కీళ్లు) విరిగిన నయ్యది సంధిభగ్నము. అట్టి సంధిభగ్నమున సామాన్యముగ కాలుసేతులు మున్నగు నవయవముల ముడుచునప్పుడును చాచునప్పుడును కదలించునప్పుడును మిక్కిలి తీవ్రంబైన నొప్పికల్గును. తాకినచో నోరువశక్యముకాని బాధ కల్గుటంజేసి తాకిన సహింపనేర కుండును. ఇవి పైజెప్పిన సంధిగతభగ్నము లారిటియందును సామాన్యముగ గల్గు లక్షణములు.

## ఉత్పిష్టాదిభగ్నవిశేషలక్షణములు

ఉత్పిష్టసన్ధేశ్శ్వయథుస్సమన్తాత్. 2
విశేషతో రాత్రిభవా రుజా చ

---

* హుతాశ ! అనునది యగ్నివేశు డను శిష్యుని నాత్రేయుడు సంబోధించిన పదము. ఈశ్లోకము చరకోద్ధృతము.

విశ్లిష్టజేతౌ తు రుజా చ నిత్యమ్,
వివర్తితే పార్శ్వరుజశ్చ తీవ్రాః
తిర్యగ్గతే తీవ్రరుజో భవన్తి. 3
క్షిప్తేఽతిశూలం విషమత్వమస్థ్నః
క్షిప్తే త్వధో రుక్ విఘటశ్చ సన్ధేః,

కీళ్ల యందలి యెముకలు ఒకటితో నొకటి యొరుసుకొని నలిగినది యుత్పిష్ట మనం బరగు. దీనియందు నలిగినకీళ్లయం దంతటను వాపు కల్గును. రాత్రులయందు వాతము ప్రకుపితమై మిక్కిలి తీవ్రమైనబాధ గల్గించును. కీలు కొంచెము పట్టు వదలి శిథిలమైనయెడ విశ్లిష్టంబనదగును. దీనియందు పైజెప్పినవిధముగ వాపును, పగటి యందును రాత్రియందును ఓరువ శక్యముకాని బాధయును కల్గును. కీలు వీడి క్రిందు మీదుగ వ్యత్యస్తమై ఒండొంటకలియక యున్నయెడ వివర్తిత మనబడును. దీనియందు కీళ్ల కిరుప్రక్కలయందును మిక్కిలి తీవ్రమైన బాధ కలుగును. కీలు సడలి యందొకటి యడ్డముగ తిరిగియున్నయెడ తిర్యగ్గతం బనబడును. దీనియందు మిక్కిలి తీవ్రములగు బాధలు జనించును. కీలు పట్టుతప్పి యెముకలలో నొకటి పైకి వ్యత్యస్తముగ పోయినది అతిక్షిప్త మనంజను. అట్టి యతిక్షిప్తమునందు ఎముకలు రెండును వ్యత్యస్తములై పోటు కల్గును. కీళ్లయందు ఎముకలు విరిగి క్రిందికి జారినయెడ నధఃక్షిప్తము. ఇందు తీవ్రమైన నొప్పికలిగి మరల కీళ్లొండొంట కలియక వేరువేరుగ నుండును.

## కాండభగ్న భేదములు

కాణ్డే త్వతః కర్కటకాఽశ్వకర్ణ
విచూర్ణితం పిచ్చితమస్థి * చ్ఛల్లికా. 4
కాణ్డేషు భగ్నం హ్యతిపాతితం చ
మజ్జాగతం చ స్ఫుటితం చ వక్రమ్,
ఛిన్నం ద్విధా ద్వాదశధాపి కాణ్డే

నిడుపుగనుండు ఎముకలు సంధులయందుగాక యితర స్థలములయందు విరిగిన నయ్యది కాండభగ్నము. ఇయ్యది †కర్కటకము, అశ్వకర్ణము, విచూర్ణితము,

---

* "అస్థిచ్ఛల్లితమ్" అని పాఠాంతరము. ఇచ్చట "అస్థిచ్ఛల్లికా" అను పాఠమునగాని యీ పాఠాంతరమునగాని ఛందోభంగము కవనగును. వృత్తపాదము భేదించును కూడను.

† కర్కటికాది ద్వాదశవిధ కాండభగ్నముల స్వరూపములను మధుకోశ వ్యాఖ్యయం దిట్లు విజయరక్షితుడు వివరించెను. 1. కర్కటిక = ఒక యెముక రెండు ప్రక్కల పట్టువదలి కొనలు వంగిపోయి మధ్యముడివలె గడ్డగా నమనది. ఇది ఎంత్ర

పిచ్చితము, అస్థిచ్ఛల్లిక, కాండభగ్నము, అతిపాతితము, మజ్జాగతము, స్ఫుటితము, వక్రము అనేక విధములుగ ముక్కలగుటచేతను, రెండుచీలికలుగ చీలుటచేతను, రెండు విధములైన ఛిన్నము నని పండ్రెండువిధముల నుండును.

## కాండభగ్న సామాన్య లక్షణము

ప్రస్తాజ్గతా శోథరుజాతివృద్ధిః. 5
సమ్పీడ్యమానే భవతీహ శబ్ద
స్స్పర్శాసహం స్పన్దనతోదశూలాః,
సర్వాస్వవస్థాసు న శర్మలాభః
భగ్నస్య కాండే ఖలు చిహ్నమేతత్. 6

పై జెప్పబడిన కాండభగ్నమునందు ఏస్థలమున ఎముక విరిగియుండునో ఆ యంగము సడలి సంబంధములేక జారియుండును. వాపు మిక్కుటమై తీవ్రమైన బాధ వృద్ధినొందును; విరిగినచోట చేతబట్టిచూచినయెడ నట నట యను శబ్దము కల్గును. చేత మెల్లగ తాకినను ఓరువజాలకుండును. విరిగినయెముక యిటునటు కదలుచు సూదులు గ్రుచ్చినవిధముగ పోటును, తీవ్రమైన నొప్పియు కల్గును. సర్వ

---

పీత యాకార మగును. 2. అశ్వకర్ణ = గుఱ్ఱపుచెవివలె విరిగిన యెముక పైకితోసుకొని నిక్కపొడుచుకొనునది. 3. విచూర్ణిత = ఎముక నలిగిపోయి ముక్కముక్క లగుట (ఇది చేతితో తాకినగాని రోగియొక్క అవయవము కదలినప్పుడు కలిగిన శబ్దము విన్నగాని తెలియును.) 4. పిచ్చిత = ఎముక చితికిపోయి ఎక్కువ వాపుకలిగియుండు నది. 5. అస్థిచ్ఛల్లిక = ఛిల్ల మనగా చెట్టునారతో నల్లబడిన గుడ్డవంటిది. అట్టిది పెద్ద ఎముక ప్రక్కనుండు చిన్నయెముక కొనలు ఎడబడినప్పుడు మధ్యను పట్టుండునట్లు చేయుచుండునది. 6. కాండభగ్న = చాచినప్పుడు వడకుచుండునది. (కాండభగ్న మనునది అన్నిటికిని పేరయినను చాల యెముకలకాండము లొక్కసారి విరిగిపోయిన దీభేద మని చెప్పవలెను.) 7. అతిపాతిత=ఎముక పూర్తిగా తెగిపోయినది. 8. మజ్జాగత = విరిగిన యెముకముక్క బోలు యెముక లోనికిబోయి అందుండు మూలగను స్రవింపచేయుచుండునది. 9. స్ఫుటిత = ఎముక చిట్లినట్లయినది. (ఇందు చిన్నచిన్న ముండ్లవలె నెముక కొనలుదేరి బాధించును.) 10. వక్ర=ఎముక విరుగక వంగిపోయినది. 11. అణుచ్ఛిన్న = కొంత బ్రద్దలైపోయి కొంత పట్టుకలిగి యుండునది. 12. అతిచ్ఛిన్న = ఎముక పూర్తిగా బ్రద్దలైపోయినది. (సుశ్రుతమున నీరెండును పాటిత మని చెప్పబడును.) N. B. "విచూర్ణితం పిచ్చితమస్థిచ్ఛల్లి" అను పాదమునందు ఛందోభంగము వృత్తభేదము రాకుండ నీక్రిందవిధముగా పాఠముండు టుచితమని తోఁచెడిని. "విచూర్ణితంపిచ్చితమస్థిచేలమ్" అని. చేల మనగా గుడ్డ. ఎముకకు గుడ్డవంటిది పట్టుండి వ్రేలాడునది యని యర్థము వచ్చును.

కాల సర్వావస్థలయందు నొకప్పుడైన సుఖ మించుకేనియు లేక బాధపడుచుండును. ఇవి యన్నియు పై జెప్పబడిన పండ్రెండు విధములైన కాండభగ్నము లన్నిటియందును సామాన్యముగ గల్గు లక్షణములు.

## కాండభగ్న విశేషలక్షణము

భగ్నంతుకాణ్డేబహుధా ప్రయాతి సమాసతో నామభిరేవ తుల్యమ్.

పై జెప్పబడిన కాండభగ్నములు పండ్రెండును ఆయాసంకేతితనామమున కన్వర్థముగ వానివాని విన్యాసము కలిగియుండును; కావున వాని నామభేదమును బట్టియే వాని లక్షణమును స్వరూపమును నిర్ణయించుకొనునది.

## కృచ్ఛ్రసాధ్య భగ్నలక్షణములు

అల్పాశినోఽనాత్మవతో జన్తోర్వాతాత్మకస్య చ,
ఉపద్రవైర్వా జుష్టస్య భగ్నం కృచ్ఛ్రేణ సిధ్యతి. 7

అన్నమునం దిచ్ఛలేక స్వల్పముగ భుజించువానికిని, ఇంద్రియముల నిగ్రహించక చపలుడై పథ్యము ఉండనివానికిని, వాతప్రకృతి కలవానికిని కల్గిన భగ్నము కృచ్ఛ్రసాధ్యము. జ్వరము మున్నగు నుపద్రవములు కల్గినను భగ్నము కృచ్ఛ్రసాధ్యమగును.

## భగ్నాసాధ్యలక్షణము

భిన్నం కపాలం కట్యాన్తు, సన్ధిముక్తం తథా చ్యుతమ్,
జఘనం ప్రతిపిష్టం చ, వర్జయేద్ధి విచక్షణః. 8

కపాలాస్థులు భిన్నములైనను కటిస్థలమునందలి యెముకలు ఛిన్నంబులైనను, కీళ్ల యందలి యెముకలు సంధులువీడి జారిపోయినను, కటిపురోభాగమునగల యెముకలు పొడిగ నలిగినను అసాధ్యమగును; కావున చికిత్స జేయజనదు.

కపాలాస్థులు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—"జానునితమ్బాంసగణ్డ శఙ్ఖ శిరస్సు కపాలాని" మోకాళ్లయందును, పిరుదులయందును, భుజశిరస్సుల యందును, చెక్కిళ్ల యందును, కణతలయందును, తలయందు నుండు అస్థులు కపాలము లని చెప్పదగును.

## మరికొన్ని యసాధ్యలక్షణములు

అసంశ్లిష్టకపాలం చ లలాటే చూర్ణితం చ యత్,
భగ్నం స్తనాన్తరే పృష్ఠే శఙ్ఖే మూర్ధ్ని చ వర్జయేత్. 9

కపాలాస్థి రెండుగ పగిలి యొకటితో వేరొకటి చేరకున్నను, నుదుటియందలి యెముక నలిగి పొడియైనను, స్తనమధ్యమున రొమ్మునందును వీపునందును కణతల యందును శిరస్సునందును కల యెముకలు విరిగినను అసాధ్యము. కావున చికిత్స చేయం జనదు.

## విన్యాసభేదముచే నసాధ్యత్వము

సమ్యక్సన్ధి తమప్యస్థి దుర్నిక్షేపనిబన్ధనాత్,
సంక్షోభాద్వాపి యద్గచ్ఛేద్విక్రియాం తచ్చ వర్జయేత్. 10

కారణాంతరములచే విరిగిన యెముకలను మరల మునుపటివలె నొకటిగ జేర్చి కట్టుగట్టినపిదప సమముగాక మిట్టపల్లములుగనుండు స్థలములయందు వ్యత్యస్తముగ నునిచి నను, కట్టుగట్టునపుడు రెండు అస్థిఖండముల నొకటిగ సమముగ జేర్చకున్నను, అభిఘాతము కలిగినను, భయపడినను తిరిగి వికారమును పొందినచో విరిగిన యస్థులు ఒండొంట గలియక తిరిగి యతుకనేరవు. అట్టు చెడిపోయినది మరల చక్కబడజాలదు కావున నయ్యది యసాధ్యంబు.

## అస్థివిశేషముల గల్గు భగ్నభేదములు

తరుణాస్థీని నమ్యన్తే భిద్యన్తే నలకాని చ,
కపాలాని విభజ్యంతే స్ఫుటన్తి రుచకాని చ. 11

తరుణాస్థులు వంగును. నలకములను నస్థులు పగులును. కపాలాస్థులు తునియలుగ విరుగును. రుచకములు చిట్లును.

అస్థులభేదములు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—“ఏతాని పఞ్చవిధాని భవన్తి. తద్యథా.—కపాల-రుచక-తరుణ-వలయ-నలకసంజ్ఞాని. తేషాంజానునితమ్బాంస గణ్డశఙ్ఖ శిరస్సు కపాలాని. దశనాస్తు రుచకాని. ఘ్రాణకర్ణగ్రీవాక్షికోశ కర్ణనాడీషు తరుణాని. పాణి పాదపార్శ్వపృష్ఠోరస్సు వలయాని. శేషాణి నలక సంజ్ఞాని” (సుశ్రుత. శా. అ. ౫. సూ. ౨౧.) కపాలములు, రుచకములు, తరుణములు, వలయములు, నలకములు నని అస్థులు ఐదు విధములు. అందు మోకాటి చిప్పలు, పిరుదులయందలి యెముకలు, మూపులయందలి యెముకలు, చెక్కిళుల యందలి యెముకలు, కణతల యెముకలు, తలపుఱ్ఱెనుండు చిప్పవంటి యెముకలు ఇవియన్నియు కపాలాస్థులు. దంతములు రుచకములు. ముక్కు, చెవులు, నేత్రగోళము, కంఠనాళము అను నీ స్థలములయందుండునవి తరుణాస్థులు. అరచేతులు, అరకాలులు, ఇరుప్రక్కలు, వీపు, ఎదురురొమ్ము ఈ స్థలముల నుండు ఎముకలు వలయములు. ఇవిదక్క తక్కిన స్థలములయం దెచ్చటనున్నను అవి యన్నియు నలకాస్థు లని చెప్పబడును. ఈ యస్థులన్నియు వ్యాపన్నము లగునపుడు పై జెప్పిన నిబంధనప్రకారము చెడు నని యెరుంగునది. “రుచికానిచ” అని చ కారము అనుక్తసముచ్చాయకము కావున వలయాస్థులును రుచకములబోలె చిట్లు నని యెరుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
భగ్ననిదానం సమాప్తమ్.

# ౪౫. నాడీవ్రణనిదానమ్

నాడీవ్రణము భగ్నము నుపేక్షించుటచేగూడ గల్గును కావున భగ్ననిదానానంతరము నాడీవ్రణనిదానమును జెప్పుట.—

## నాడీవ్రణసంప్రాప్తి

యశ్శోథమామమితి పక్వముపేక్షతేఽజ్ఞో
యో వా వ్రణం ప్రచురపూయమసాధువృత్తః,
అభ్యంతరం ప్రవిశతి ప్రవిదార్య తస్య
స్థానాని పూర్వవిహితాని తతస్సపూయః. 1
తస్యాఽతిమాత్రగమనాద్గతిరిష్యతే తు
నాడీవ యద్వహతి తేన మతా తు నాడీ,

తెలివి తక్కువయైన వైద్యుడు పక్వమైన వ్రణముయొక్క శోఫను పక్వము కాలేదని భ్రమసి దానినిపాటన శోధనముల నొనరింపక యుపేక్షించినను, పరిపక్వమై విశేషముగ చీముబట్టియుండు గంభీరవ్రణమును ఛేదింపకయున్నను, అట్టివ్రణమునందు ఛేదనాదిచికిత్సల జేసికొనక యపథ్యముల సేవించినను ఆవ్రణమునందలి చీము వెడలు మార్గము లేమింజేసి వ్రణములకు స్థానములైన చర్మము, మాంసము, సిరలు, స్నాయువులు, సంధులు, ఎముకలు, కోష్ఠము, మర్మములు అనువానినన్నింటిని ఛేదించి, శరీరములోనికి జొరబడును. ఇయ్యది చీము మిక్కిలి లోనికిబోవుటవలన గతి యనియు, తీగవలె శరీరమున లోనికి వ్యాపించుటంజేసి నాడి యనియు జెప్పబడును. (దీనినే నారికురుపందురు.)

వాగ్భటాచార్యుడు "గతిస్సా దూరగమనాత్ నాడీ నాడీవ సంస్రుతేః, నాడ్యేకాఽనృజురన్యేషాం సైవానేకగతిర్గతిః" (అ. హృ. ఉత్తర. అ. ౨౯. శ్లో. ౨౭.) అని నాడీవ్రణమును జెప్పిరి. చీము శరీరమునందు మాంసాదుల దాటి మిక్కిలి లోతునకు బోవుటంజేసి గతి యనియు, నాడివలె వ్యాపించుటంచేసి నాడి యనియు నీవ్రణము చెప్పబడును. మరియు ఒక రూపముగనే శరీరమున వ్యాపించునది నాడి యనియు, అట్టి చీము అనేకమార్గముల పలువిధములై లోనికి వ్యాపించినయెడ గతి యనియు కొందరాచార్యులు సెప్పెదరు.

## నాడీవ్రణభేదములు

దోషైస్త్రిభిర్భవతి సా పృథగేకశశ్చ
సమ్మూర్ఛితైరపి చ శల్యనిమిత్తతోఽన్యా. 2

పైజెప్పిన నాడీవ్రణము ప్రకుపితములైన వాతపిత్తకఫములచే వేర్వేరుగను, మూడిటిచేతను, శల్యముచేతను జనించుటంజేసి యైదువిధములు.

ఇచ్చట "ఏకశః" అను పదమునకు మూడును జేరి యను నర్థము జేసి మూడిటి సన్నిపాతమున జనించునది యనియు, "దోషైస్త్రిభిః" అను వాక్యమునకు మూడు దోషములచే వేరువేరుగ జనించునది యనియు, "సమ్మూర్ఛితైః" అనుదానికి రెండేసి కలిసిన దోషద్వయముచే జనించినవనియు నర్థముజేసి, దోషసంసర్గమునగల్గు నాడీవ్రణ భేదముల మూడిటిని పరిగణనముజేసి కొందరు చెప్పెదరు. ఆపక్షమున వాత-పిత్త-కఫములచే మూడును, వాతపిత్త-వాతకఫ-పిత్తకఫములచే మూడును, సన్నిపాతమున నొకటియు, శల్యజ మొకటియు కలిసి నాడీవ్రణములు ఎనిమిదివిధము లని యెఱుంగునది. ఈపక్షము ననుసరించియే ప్రత్యేక లక్షణముల జెప్పుతరి తంత్రాంతరమున—"దోషద్వయాభిహిత లక్షణదర్శనేన తిస్రో గతీర్వ్యతికర ప్రభవాస్తువిద్యాత్" (సు. చి. అ. ౧౭.) అని సంసర్గ నాడీలక్షణములు చెప్పబడినవి. రెండేసి దోషముల లక్షణములు మిశ్రములుగ గనుపించు నాడీవ్రణములు సంసర్గజము లని యెరుంగునది యని యర్థము.

వాతికనాడీవ్రణలక్షణము

తత్రానిలాత్పరుషసూక్ష్మముఖీ సశూలా
ఫేనానువిద్ధ మధికం స్రవతి క్షపాసు,

వాతప్రకోపమున బుట్టిన నాడీవ్రణము మిక్కిలి సూక్ష్మమై పరుషమైన మొన గల్గి మిక్కిలి నొప్పికల్గి యుండును. రాత్రులయందు శీతం బధిక మగుటచే వాతము మిక్కిలి యుత్కటముగ నుండునుగాన రాత్రులయందు పోటధికమై నురుగుతోగూడిన చీము అధికముగ గారుచుండును.

పైత్తికనాడీవ్రణము

పిత్తాత్తృషాజ్వరకరీ పరిదాహయుక్తా
పీతం స్రవత్యధికముష్ణమహస్సు చాపి. 3

పిత్తప్రకోపమున గల్గిన నాడీవ్రణమున మిక్కుటమైన దప్పియు, జ్వరంబును, మంటయు కల్గును. పగటియం దుష్ణముచే చిత్తముత్కట మగును. కావున పచ్చనై వేడియైన చీము నధికముగ పగటియందు గార్చును.

కఫజనాడీవ్రణలక్షణము

జ్ఞేయా కఫాద్బహుఘనార్జునపిచ్ఛిలాస్రా *
స్తబ్ధా సకణ్డురరుజా రజనీ ప్రవృద్ధా,

కఫప్రకోపమున గల్గిన నాడీవ్రణమున మిక్కిలి చిక్కనై తెల్లనై జిగురువలె బందనకల చీము గారును. మృదువుగలేక స్తంభించి యధికమైన జిలకల్గి నొప్పి కొంచెముగ నుండును. ఈలక్షణము లన్నియు రాత్రివేళల మిక్కిలి యధికము లగును.

---

* అస్రావశబ్దముయొక్క ఏకదేశమే అస్రశబ్ద మని మధుకోశము - కావున నిచ్చట అస్రమన చీ మని అర్థము.

## సాన్నిపాతికనాడీవ్రణలక్షణము

దాహజ్వరశ్వసనమూర్ఛనవక్త్రశోషాః
యస్యాం భవన్త్యభిహితాని చ లక్షణాని. 4
తామాది శేత్ప్రవనపిత్తకఫప్రకోపాత్
ఘోరామసుక్షయకరీమివ కాళరాత్రిమ్,

వాత పిత్త కఫములు మూడును సమకాలమున ప్రకోపించుటచే గల్గిన (సన్నిపాత) నాడీవ్రణమున మిక్కిలి తీవ్రమైన మంటయు, జ్వరంబును, శ్వాసంబును, మూర్ఛయుం గల్గును. నోరు తడిలేక యెండును. ఇవిగాక వాతాదులకు ప్రత్యేకముగ జెప్పినలక్షణము లన్నియు కల్గును. ఈనాడీవ్రణము ప్రళయకాలమునందలి రాత్రిబోలె మనుజుల ప్రాణముల నతిక్రూరముగ హరించును.

## శల్యజనాడీవ్రణలక్షణము

నష్టం కథఞ్చిదనుమార్గముదీరితేషు
స్థానేషు శల్యమచిరేణ గతిం కరోతి. 5
సా ఫేనిలం కుథితముష్ణమసృగ్విమిశ్రం
స్రావం కరోతి సహసా సరుజా చ నిత్యమ్,

ముల్లు ఇనుపమేకు మున్నగుశల్యములు చర్మము, మాంసము మొదలగువాని యందుజేరి, బైటదీయుట కగపడక కొంతకాలమువరకు మాంసాదులయందే నిలచి యున్నచో నయ్యది అతిశీఘ్రముగ లోపలిమాంసాదుల జెరిచి, నాడీవ్రణమును కల్గించును. ఈవ్రణమునందు నురుగుతోగూడి కుళ్లి మిక్కిలి వేడియై రక్తముతోగూడిన చీము స్రవించును. రేయుంబవలును మిక్కిలి తీవ్రమైన బాధకల్గించుచుండును. ఇయ్యది శల్యముచే జనించిన నాడీవ్రణంబని యెరుంగునది.

## సాధ్యాసాధ్యనాడీవ్రణలక్షణము

నాడీ త్రిదోషప్రభవా న సిధ్యేత్
శేషాశ్చతస్రః ఖలు యత్నసాధ్యాః. 6

పైజెప్పిన నాడీవ్రణములలో సన్నిపాతమున జనించిన నాడీవ్రణము మిక్కిలి యసాధ్యము. తక్కిననాల్గు నాడీవ్రణంబులును మిక్కిలి పూనికతో యుక్తియుక్తముగ తగిన చికిత్స చేసినచో నొకవేళ సాధ్యము లగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
నాడీవ్రణనిదానం సమాప్తమ్.

# ౪౬. భగందర నిదానమ్

నాడీవ్రణనిదానమును జెప్పినపిదప నాడీవ్రణమునకు సమానముగ దుస్సాధమగు భగందరముయొక్క నిదానమును జెప్పుట.—

**భగందరసామాన్యలక్షణము**

గుదస్య ద్వ్యఙ్గులే దేశే పార్శ్వతః పిటికార్తికృత్,
భిన్నో భగన్దరో జ్ఞేయస్స చ పఞ్చవిధః స్మృతః. 1

గుదమునకు రెండంగుళములదూరమున మూత్రనాళమునకు ప్రక్కన బొబ్బలేచి అయ్యది పగిలి మిక్కిలి బాధగల్గించును. ఇయ్యది భగందర మని చెప్పబడును. ఈభగందరము వాత-పిత్త-కఫ-సన్నిపాత-ఆగంతుకారణములచే జనించుటంజేసి యైదువిధముల నుండును.

భగందరనిదానసంప్రాప్తులు వాగ్భటమున నిట్లు చెప్పబడెను:— "హస్త్యశ్వపృష్ఠ గమన కఠినోత్కటకాసనైః, అర్శోనిదానభిహితైరపరైశ్చ విషేవితైః. అనిష్టాదృష్టపాకేన సద్యో వా సాధుగర్హణైః, ప్రాయేణ పిటికాపూర్వో యోఽఙ్గులేద్వ్యఙ్గులేఽపి వా. పాయోర్వ్రణోన్తర్బాహ్యో వా దుష్టాసృఙ్మాంసగోభవేత్, వస్తిమూత్రాశయాభ్యాశగతత్వాత్ స్యన్దనాత్మకః. భగన్దరస్సః" (అ. హృ. ఉత్తర. అ. ౨౮. శ్లో. ౧-౨) ఏనుగులు గుఱ్ఱములు మొదలగువాని వీపుపై నెక్కి సవారిచేయుటచేతను, కఠినంబును ఉన్నతంబును నగు నాసనముపై గూర్చుండుటచేతను, అర్శోనిదానమున జెప్పిన యితర కారణములచేతను, పూర్వజన్మమున చేసిన దుష్టకర్మపరిపాకముచేనైనను, లేక తత్కాలమున సాధువుల నిందించుటచేనైనను, ప్రాయికముగ తొలుత పిటికారూపముగ జనించి పిదప పగులును. ఇయ్యది గుదస్థానమునకు ఒకటి రెండంగుళముల దూరమున బైట నైనను, అంతర్భాగమున నైనను, దుష్టమైన మాంసరక్తముల నాశ్రయించి జనించును. మరియు నిది వస్తికిని మూత్రాశయమునకును సమీపమున జనించును; కావున నీవ్రణమునుండి ద్రవము స్రవించును. ఇయ్యది భగందర మని యర్థము.

ఇయ్యది తొలుత మూలము తెలియక వాపు బొబ్బవలెకల్గి మిక్కిలి తీవ్రమైన బాధతోగూడి జనించినయెడ కొంతకాలమునకు పగిలి భగందర మగుననియుం, అటుగాక

సామాన్యముగ బొబ్బవలె పగలకున్నచో పిటిక యనియు చెప్పబడును. ఈవిషయమును వాగ్భటాచార్యుడు "అపక్వం పిటికామాహుః పాకప్రాప్తం భగన్దరం" (అ. హృ. ఉత్త. అ. ౨౮. శ్లో. ౬.) అను వాక్యముచే జెప్పెను. తంత్రాంతరమున భగందర శబ్దమున కన్వర్థ సంజ్ఞ యిట్లు చెప్పబడియున్నది:—"భగం పరిసమంతాచ్చ గుదం వస్తిం తథైవ చ, భగవద్దారయేద్యస్మాత్తస్మాజ్జ్ఞేయో భగన్దరః" (భోజుడు) భగమును వస్తిని గుదమును పగులదీసి మలమూత్రాదుల బైటవెడలించుటంజేసి భగందర మని చెప్పబడును. "భగందారయతీతి భగందరః" అను వ్యుత్పత్తిచేత పైయర్థము లభించును. ఈ యన్వర్థతను సుశ్రుతు లిట్లు చెప్పిరి:—"గుద భగవస్తిప్రదేశదారణాత్ భగన్దరాః" (సు. ని. అ. ౪.)

మరియు నీయది భగమును పగులదీసినప్పుడు వాతంబును, వస్తిని పగులదీసినప్పుడు మూత్రంబును, గుదమును పగులదీసినప్పుడు మలమును, శుక్రమును వరుసగ సన్నని రంధ్రములనుండి వెడలును. ఈ విషయము వాగ్భటమున నిట్లు చెప్పబడియె:— "సర్వశ్చ దారయత్యక్రియావతః, భగవస్తిగుదాంస్తేషు దీర్యమాణేషు భూరిభిః, వాత మూత్రశకృచ్ఛుక్రం సైవసూక్ష్మైర్వమతి క్రమాత్." (అ.హృ. ఉ. అ. ౨౮. శ్లో.౪.)

ప్రకృతమూలమున వాతాదిభేదములచే నైదువిధముల నీవ్యాధిని జెప్పియున్నది. కాని వాగ్భటాచార్యుడు మాత్రము ద్వన్ద్వజములు మూడునుజేరి యెనిమిది విధము లగునని యిట్లు చెప్పిరి:—"దోషైః పృథగ్యుతైస్సర్వై రాగన్తుస్సోఽష్టమస్స్మృతః" (అ. హృ. ఉ. ఆ. ౨౮. శ్లో. ౫).

### వాతిక (శతపోనక) భగందరము

కషాయరూక్షైస్త్వతికోపితోఽనిల
స్త్వపానదేశే పిటికాం కరోతి యామ్,
ఉపేక్షణాత్పాకముపైతి దారుణం
రుజా చ భిన్నాఽరుణఫేనవాహినీ. 2
తత్రాగమో మూత్రపురీషరేతసాం
వ్రణైరనేకైశ్శతపోనకం వదేత్,

కషాయరసంబులును మిక్కిలి రూక్షంబులు నగు పదార్థముల సేవించుటచే వాతము మిక్కిలి ప్రకోపమునొంది గుదప్రదేశమున పైజెప్పినరీతిగ పిటికను కల్గించును. దానిని తొలుత ప్రారంభముననే చికిత్సజేయక యుపేక్షించినచో నయ్యది

పక్వమై మిక్కిలి క్రూరమైన బాధలతోఁగూడి పగిలి యెఱ్ఱని నురుగును స్రవించును. అయ్యది నానాట ననేక వ్రణద్వారములుకల్గి, ఆవ్రణములనుండి మూత్రంబును పురీషంబును శుక్రంబును స్రవించును. ఇయ్యది వాతప్రకోపమున జనించిన శతపోనకం బను భగందరము. (శతపోనక మన జల్లెడ, దానివలె ననేకరంధ్రములు కల్గియుండుటం జేసి యీవాతికభగందరము శతపోనక మని చెప్పబడును.)

## పైత్తిక (ఉష్ట్రగ్రీవ) భగందరము

ప్రకోపనైః పిత్తమతిప్రకోపితం
కరోతి రక్తాం పిటికాం గుదాశ్రితామ్,
తదా(తామా)ఽఽశుపాకాఽహిమపూతివాహినీం
భగందరం తూష్ట్రశిరోధరం వదేత్. 3

పిత్తమును ప్రకోపింపజేయు కారణములచేత పిత్తము మిక్కిలి ప్రకోపమునొంది, గుదస్థానము పైజెప్పినరీతిగ రక్తవర్ణమైన పిటికను కల్గించును. అయ్యది అతిశీఘ్రముగ పక్వమై పగిలి వేడియైన చీము గార్చును. (ఇయ్యది పిత్తమున జనించిన భగందరము, ఇది ఒంటెమెడవలె వంగిన యాకారము కల్గియుండును; కావున నుష్ట్రగ్రీవం బని చెప్పబడును.)

## కఫజ (పరిస్రావి) భగందరము

కణ్డూయనో ఘనస్రావీ కఠినోఽమన్దవేదనః,
శ్వేతావభాసః కఫజః పరిస్రావీ భగన్దరః. 4

కఫము స్వకారణములచే మిక్కిలి ప్రకోపమునొంది, పైజెప్పినవిధముగ గుదస్థానమున బొబ్బను కల్గించును. అయ్యది పగిలి మిక్కిలి దురదకల్గి కఠినమైయుండును. దానినుండి మిక్కిలి చిక్కనై తెల్లగనుండు చీము నిరంతరముగ కారుచుండును. (ఇయ్యది యధికముగ స్రావము కలిగియుండును; కావున పరిస్రావి యను భగందర మని చెప్పబడును.)

## సాన్నిపాతిక (శంబూకావర్త) భగందరము

బహువర్ణరుజాస్రావా పిటికా గోస్తనోపమా,
శమ్బూకావర్తవన్నాడీ శమ్బూకావర్తకో మతః. 5

ఆయాకారణములచే మూడుదోషంబులు నొక్కుమ్మడి ప్రకోపించి గుదస్థానమున ద్రాక్షపండువలె నుండదయైన బొబ్బలేచును. ఇయ్యది పలువెరంగులైన రంగులు

కల్గిన చీము మొదలగు ద్రవమును స్రవించును. (దీనిరంధ్రము నీళ్లలో నుండు గుల్లల యందలి సుడివలె నావర్తము కల్గియుండును. కావున నియ్యది శంబూకావర్త మని చెప్పబడును.) ఈ భగందరము సన్నిపాతమున జనించును.

ఆగంతుక (ఉన్మార్గి) భగందరము

క్షతాద్గతిః పాయుగతే వివర్ధతే
హ్యుపేక్షణాత్స్యుః క్రిమయో విదార్యతే,
ప్రకుర్వతే మార్గమనేకధా ముఖైః
వ్రణై స్తదున్మార్గి భగందరం వదేత్. 6

ముల్లు ఇనుపమేకులు మున్నగునవి గుదస్థానమున గ్రుచ్చుకొని పుండైనపుడు, దానిని చికిత్సజేయక యుపేక్షించినచో నందు క్రిములు జనించును. అయ్యవి వాని ముఖములచేత గుదస్థానమును అనేకరంధ్రములు కల్గునట్లు తొలచి వ్రణమును కల్గించును. ఇయ్యది యాగంతుకారణములచే జనించుటంజేసి యాగంతుజ మనియు,మిక్కిలి యసాధ్యమైన మార్గము నవలంబించుటచేత ఉన్మార్గిభగందర మనబడును.

అర్శోభగందరము వాగ్భటమున నిట్లు చెప్పబడినది:—"కఫపిత్తే తు పూర్వోత్థం దుర్నామాశ్రిత్య కుప్యతః, అర్శోమూలే తతశ్శోఫం కణ్డూదాహార్తిమాన్ భవేత్. స శీఘ్రం పక్వభిన్నోఽస్య క్లేదయన్ మూలమర్శసః, స్రవత్య జస్రం గతిభిః అయమర్శో భగన్దరః" (అ. హృ. ఉ. అ. ౨౮. శ్లో. ౧౫, ౧౬.) కఫపిత్తములు రెండును ప్రకోపించి గుదస్థానమునజేరి యంతకుమునుపు జనించిన యర్శస్సులమూలమున శోథము (వాపు)ను కల్గించును. అయ్యది దురదయు మంటయు నొప్పియు కల్గి శీఘ్రముగ పక్వమై పగిలి యర్శస్సుయొక్క మూలమునుండి చీము నెత్తురు నెడతెగక సంతతము స్రవించును. ఇయ్యది కఫపిత్తములచే జనించిన యర్శోభగందర మని చెప్పబడును. ఇత్తెరంగుననే వాతపిత్త వాతకఫములచే జనించిన భగందరములును వాగ్భటమున నిట్లు చెప్పబడినవి:—"వాతపిత్తాత్పరిక్షేపీ పరిక్షిప్య గుదంగతిః, జాయతే పరితస్తత్ర ప్రాకారపరిఖేవ చ, ఋజుర్వాతకఫాదృజ్వ్యాగుదో గత్యాతు దీర్యతే" (అ. హృ. ఉ. అ. ౨౮. శ్లో. ౧౮.) వాతపిత్తములు రెండు ప్రకోపించి గుదస్థానమునకు చుట్టును ప్రాకారమువలె నుండునట్లు భగందరమును కల్గించును. ఇయ్యది గుదస్థానమునకు పరిఖ (అగడ్త) వలె మండలముగ చుట్టియుండుటంజేసి పరిక్షేపి యని చెప్పనగును. వాతకఫములు రెండును ప్రకుపితములై గుదస్థానమున ఋజువుగ (వక్రములేక నిడుపుగ)

నుండు భగందరమును కల్గించును. ఇయ్యది వక్రత లేక ఋజువుగ నుండుటంజేసి ఋజుశబ్దముచే జెప్పంబడును. ఇత్తెరంగున వాతపిత్తములచే పరిశ్రేపి యనియు, వాతకఫములచే ఋజు వనియు, కఫపిత్తములచే నర్శోభగందర మనియు చెప్పబడు ద్విదోషజ భగందరములును వాగ్భటమున జెప్పంబడినవి.

### భగందర సాధ్యాసాధ్యనిర్ణయము

ఘోరాస్సాధయితుం దుఃఖాః సర్వ ఏవ భగన్దరాః,
తేష్వసాధ్యస్త్రిదోషోత్థః క్షతజశ్చ విశేషతః. 7
వాతమూత్రపురీషాణి క్రిమయశ్శుక్రమేవ చ,
భగన్దరాత్స్రవన్తస్తు నాశయన్తి తమాతురమ్. 8

భగందరము లన్నియు స్వభావముచేతనే మిక్కిలి కష్టసాధ్యంబులును క్రూరంబులు నగును. వానిలో త్రిదోషములవలన గల్గిన భగందరంబును, ఆగంతుకారణములచే జనించిన యున్మార్గి భగందరంబును మిక్కిలి యసాధ్యములు. మరియు వాత - మూత్ర - పురీషంబులును క్రిములును, శుక్రంబును భగందరమునుండి స్రవించుచున్న యెడ రోగిని తప్పక చంపును.

వాగ్భటాచార్యుడు సాధ్యాసాధ్యముల నిట్లు పరిగణించెను:—"షట్ కృచ్ఛ్రసాధనాః తేషాం నిచయక్షతజౌ త్యజేత్, ప్రవాహినీం వలీం ప్రాప్తం సేవనీం వా సమాశ్రితమ్" (అ. హృ. ఉ. అ. ౨౮. శ్లో. ౨౧.) పై జెప్పబడిన యెనిమిదివిధములైన భగందరములలో ఏకదోషజములును, ద్విదోషజములు నైన ఆరు భగందరములు కృచ్ఛ్రసాధ్యములు. సన్నిపాతముచే జనించినదియు, ఆగంతుజంబును అసాధ్యములు కావున చికిత్స జేయంజనదు. గుదస్థానమునందలి మూడువళులలో ప్రవాహిని యను వలియందు బుట్టినదియు, గుహ్యమునందలి సేవనినాశ్రయించి పుట్టినదియు కేవలము అసాధ్యములు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
భగందరనిదానం సమాప్తమ్.

# ౪౭. ఉపదంశనిదానమ్

భగందరనిదానమును చెప్పినపిదప భగందరమునుబోలె దాని స్థానమునకు సమీపమున బుట్టు ఉపదంశ నిదానమును చెప్పుట.—

## ఉపదంశము జనించుటకు కారణములు, వానిసంఖ్యయు

హస్తాభిఘాతాన్నఖదంతపాతాదధావనాదత్యుపసేవనాద్వా,
యోనిప్రదోషాచ్చభవన్తిశిశ్నే పఞ్చోపదంశా వివిధాపచారైః. 1

చేతులచే శిశ్నమును మర్దనాదుల జేసినను, రతిసేయుకాలమున ననురాగాధిక్యముచే నొడలెరుంగక నఖములచేతను దంతములచేతను గిచ్చినను, సంభోగమును జేసిన పిదప నీళ్లచే కడగకున్నయెడ దానంజేసి మలినము చేరినను, సంభోగము నధికముగ జేసినను, స్త్రీల యోనిదోషమువలనను పురుషుని లింగమునందు ఉపదంశ మను వ్యాధి కల్గును. ఇయ్యది వాత-పిత్త-కఫ-రక్త-సన్నిపాతములచే వేరువేర జనించుటంజేసి యైదు విధము లగును.

## వాతిక ఉపదంశలక్షణము

సతోదభేదైస్స్ఫురణైస్సకృష్ణైస్స్ఫోటైర్వ్యవస్యేత్పవనోపదంశమ్,

సూదుల గ్రుచ్చినవిధముగ పోటును, పగులదీయునట్లు నొప్పియు కల్గి యదరుచు నల్లనైనబొబ్బలు వ్యాపించి బాధించుచున్నయెడ వాతప్రకోపమున జనించిన యుపదంశ మని యెరుంగునది.

## పిత్తరక్తములచేనైన యుపదంశలక్షణములు

పీతైర్బహుక్లేదయుతైస్సదాహైః పిత్తేన, రక్తాత్ పిశితావభాసైః, 2
స్ఫోటైస్సకృష్ణై రుధిరం స్రవన్తం రక్తాత్మకం పిత్తసమానలిఙ్గమ్,

మిక్కిలి చెమ్మకల్గి మంట పుట్టించు పచ్చని బొబ్బలు కల్గినయెడ పిత్తమున జనించిన యుపదంశ మని యెరుంగునది. మాంసమువలె నుండునట్టియు నల్లనిరంగు గలట్టియు బొబ్బలుకల్గి రక్తముగారుచు పిత్తమునకు జెప్పిన మంట పోటు మున్నగు బాధలు కల్గినది రక్తమున గలిగిన యుపదంశ మని యెరుంగునది.

కఫజ ఉపదంశలక్షణము

సకండురై శ్శోథయుతై ర్మహద్భిః శుక్లైర్ఘనై స్స్రావయుతైః కఫేన. 3

దురదయు వాపును తెల్లనివర్ణమును గల్గిన గొప్ప బొబ్బలుకల్గి వానినుండి చీము మున్నగునవి స్రవించుచున్న, నయ్యది కఫమున గలిగిన యుపదంశ మని యెరుంగునది.

సాన్నిపాతికోపదంశలక్షణము

నానావిధస్రావరుజోపపన్న మసాధ్యమాహు స్త్రిమలోపదంశమ్,

పలుదెరంగులైన స్రావంబులును పోటు మున్నగు నానావిధబాధలును కల్గినది త్రిదోష (సన్నిపాత) మున గల్గిన యుపదంశము. ఇయ్యది మిక్కిలి యసాధ్యము.

అసాధ్యోపదంశ లక్షణము

విశీర్ణమాంసం క్రిమిభిః ప్రజగ్ధం ముష్కావశేషం పరివర్జయేచ్చ. 4

పైజెప్పిన యుపదంశములయందు గుహ్యమునందలి మాంసము ఖండములుగ నూడుచున్నను, లింగమును పురుగులుచేరి వృషణములు మాత్రము మిగులునట్లు బొత్తుగ తినిపోయినను నయ్యది యసాధ్యము ; కావున చికిత్సజేయదగదు.

ఉపదంశము నుపేక్షించుటచే గల్గు విశేషములు

సఞ్జాతమాత్రేన కరోతి మూఢః క్రియాంనరో యోవిషయేప్రసక్తః,
కాలేన శోథక్రిమిదాహపాకైః విశీర్ణశిశ్నో మ్రియతే స తేన. 5

పైజెప్పిన యుపదంశరోగము పుట్టినతోడనే దానికి దగిన చికిత్సజేయక యుపేక్షించి విషయాసక్తుడై మరల స్త్రీ ప్రసక్తిం దగిలియున్నచో కొంతకాలమునకు క్రిములును వాపును మంటయుకల్గి పుండై శిశ్నమునందెల్ల మాంసము శిథిలమగును. అంతియే గాక దానివలన మనుజుండు మరణము నొందును.

లిఙ్గార్శో లక్షణము

అఙ్కురైరివ సఞ్జాతై రుపర్యుపరి సంస్థితైః,
క్రమేణ జాయతే వర్తిస్తామ్రచూడశిఖోపమా. 6
కోశస్యాభ్యంతరే సన్ధౌ సర్వస్సన్ధిగతాపి వా,
* (సవేదనా పిచ్ఛిలా చ దుశ్చికిత్స్యా త్రిదోషజా,)
లిఙ్గవర్తిరితి ఖ్యాతా లింగార్శ ఇతి చాపరే.

---

* ఈశ్లోక పాదములు రెండును మధుకోశ వ్యాఖ్యాకారుడు వివరింపనందున ప్రక్షిప్తములు.

శిశ్నముపై చర్మమునకు లోభాగమునం దైనను, చర్మసంధియం దైనను, లేక గుహ్యముననుండు సంధులన్నిటియందైనను కోడిపుంజు నెత్తిపైనుండు జుట్టువలె నెట్టి నైన మాంసాంకురములు వరుసగ నొకటివెంబడి వేరొకటివంతున గుమిగూడి కలిగి నానాట వృద్ధినొంది వత్తివలె నుండును. (ఇయ్యది మిక్కిలి తీవ్రమైన వేదనకల్గి జిగురువలె బందనతో గూడియుండును.) దీనిని లింగవర్తి యనియు, లింగార్శ స్సనియు జెప్పెదరు. ఇది త్రిదోషములు నొక్కటిగ ప్రకోపించుటచే గల్గును. కావున నిది చికిత్సాసాధ్యము కానేరదు.

సుశ్రుతమున:—"స్త్రీణాం పుంసాం చ జాయన్తే ఉపదంశా స్సుదారుణాః" అని చెప్పియున్నది; కావున ఉపదంశము స్త్రీలకును పురుషులకును సంభవించు నని యెరుంగునది. *

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ఉపదంశనిదానం సమాప్తమ్.

# ४౮. శూకదోషనిదానమ్

శూకదోష మనునది యుపదంశమునుబోలె గుహ్యస్థలమున జనించును ; కావున నుపదంశమును జెప్పినపిదప శూకదోషనిదానమును జెప్పుట.—

అక్రమాచ్ఛేఫసో వృద్ధిం యోఽభివాఞ్ఛతి మూఢధీః,
వ్యాధయ స్తస్య జాయన్తే దశ చాఽష్టౌ చ శూకజాః. 1

మందమతియగు మనుజుడు లింగమును వృద్ధినొందింపగోరి లింగమునకు *కొన్ని యౌషధముల బూయుటచే గల్గువ్యాధులు శూకదోష మని చెప్పబడును. ఇయ్యవి పదు నెనిమిదివిధము లగును. అవియన్నియు నీక్రింద వివరింపబడును.

జలమునందు కప్పవలె నుండు నూగుతో గూడిన విషజంతువు శూకము. దానిని చేర్చి చేయబడిన యౌషధమును లింగవృద్ధికొరకు పూసి యుపచరించెదరు. అయ్యది విషసంబాధ మగుటంజేసి వ్యాధులను గుహ్యమున గలిగించును. ఇది శూకమువలన గల్గిన వ్యాధి కావున శూకదోష మనబడును. ఇయ్యది పదునెనిమిది విధములు. (ఇవియే పొక్కుసవాయి మున్నగు పేర్లచే లోకమున వాడబడును.)

## 1. సర్షపికా లక్షణము

గౌరసర్షపసంస్థానా శూకదుర్భగ్నహేతుకా,
పిటికా శ్లేష్మవాతాభ్యాం జ్ఞేయా సర్షపికా తు సా. 2

పైజెప్పినవిధముగ లింగమును వృద్ధినొందింప దలచి శూకసంబంధమైన యౌషధ మును శాస్త్రవిరుద్ధముగ నుపయోగించుటచే కఫవాతములు ప్రకోపించి, తెల్లావాలవంటి యాకారముకల్గిన సన్నని బొబ్బలు గుహ్యమునకు లోపల మణికిచుట్టు కల్గును. ఇయ్యది ఆవాలనుబోలి యుండుటంజేసి సర్షపిక యని చెప్పబడును.

ఇచ్చట "శూకదుర్భగ్నహేతుకా" అనుదానికి అక్రమమైన విధముగా బ్రయోగింపబడిన శూకలేపమువలన గల్గిన దని తాత్పర్యము. అనగా శాస్త్రోక్తవిధికి విరుద్ధమైన క్రమముగా బ్రయోగించుట యని భావము, మఱియు "శూకదుర్భగ

* వాత్స్యాయనమున శిశ్నవృద్ధికి శూకప్రధానమగు లేపములు చెప్పబడెను. అట్టివానిని సక్రమముగా సిద్ధముచేయక పూసినచో నీ వ్యాధులు వచ్చును అని తెలియ వలెను.

హేతుకా" అని పాఠాంతర మున్నది. అప్పుడు శూకదోషముచేతను దుష్టమైన భగము గల స్త్రీలతో భోగించుటచేతను ఈవ్యాధి కల్గునని యర్థము చెప్పనగును.

2-3. అష్ఠీలికా గ్రథితంబులను శూకదోషముల లక్షణము

కఠినా విషమైర్భగ్నై ర్వాయునాఽష్ఠీలికా భవేత్,
శూకై ర్యత్పూరితం శశ్వద్గ్రథితం నామ తత్కఫాత్. 3

అప్రశస్తము లగు శూకముల గూడిన యౌషధమును లేపనము చేయుటవలన వాతము ప్రకోపింప గుహ్యమునందు కఠినములైన ఇనుపగుండ్లవంటి బొబ్బలు కల్గించును. ఇవి మిక్కిలి కఠినములై గుండ్లవలె నుండుటంజేసి అష్ఠీలిక యని చెప్పబడును. శూకలేపములు మాటిమాటికిని బూయుచుండుటచే కఫము ప్రకోపించి ముడివంటి బొబ్బలను గుహ్యమున గల్గించినయెడ గ్రథిత మని చెప్పబడును.

4. కుంభికాలక్షణము

కుమ్భికా రక్తపిత్తోత్థా జామ్బవాస్థినిభాఽశుభా,

రక్తపిత్తములు ప్రకోపించి నేరేడుపండులోని గింజవలె నుండు కురుపు గుహ్యమున గల్గినయెడ కుంభిక యనబడును. ఇయ్యది మిక్కిలి కష్టమును గలిగించును.

5. అలజీలక్షణము

తుల్యజాస్త్వలజీం విద్యాత్ యథా ప్రోక్తాం విచక్షణః. 4

అలజి యను శూకదోషము అలజీ యను వ్రణములకు సమానలక్షణము కల్గియుండును.

ఇచ్చట "రక్తాసితాస్ఫోటచితా దారుణాప్యలజీ భవేత్" అని చెప్పబడిన అలజీ లక్షణము నెరుంగునది. కొంచెము రక్తవర్ణంబును కొంచెము తెల్లనివర్ణంబును కలిగిన పొక్కులు కల్గినది అలజి యని యర్థము.

6-7. మృదిత - సమ్మూఢ పిటికాలక్షణములు

మృదితం పీడితం యచ్చ సంరబ్ధం వాతకోపతః,
పాణిభ్యాం భృశసమ్మూఢే సమ్మూఢపిటికా భవేత్. 5

శూకలేపము జేసినపిదప లింగమును మర్దనము జేసినచో వాతము ప్రకోపించి వాపును కల్గించును. ఇయ్యది మృదిత మనబడును. రెండుచేతులతో నలిపినయెడ వాతము ప్రకోపించుటచే మొన యేర్పడని బొబ్బ లేచును. ఇయ్యది సమ్మూఢ పిటిక యని చెప్పబడును.

### 8. అధిమంథలక్షణము

దీర్ఘా బహ్వ్యశ్చ పిటికా దీర్యన్తే మధ్యతస్తు యాః,
సోఽధిమన్థః కఫాసృగ్భ్యాం వేదనా రోమహర్షకృత్. 6

శూకలేపనమువలన కఫరక్తములు రెండును ప్రకోపము నొంది మిగుల నిడుదలై నడుమ పగిలియుండు బొబ్బలు అనేకములు లేచును. అయ్యది మిక్కిలి తీవ్రమైన బాధను రోమహర్షమును కల్గించును. ఈవ్యాధి అధిమంథ మను శూకదోషము.

### 9. పుష్కరికాలక్షణము

పిటికా పిటికావ్యాప్తా పిత్తశోణితసమ్భవా,
పద్మకర్ణికసంస్థానా జ్ఞేయా పుష్కరికా సతా. 7

శూకలేపము జేసినపిదప ప్రకోపించిన రక్తపిత్తములచేత సన్నని బొబ్బలు అనేకములు వ్యాపించిన పెద్దకురు పోకటి గుహ్యమున బొడమును. ఇయ్యది తామరపువ్వు లోని కర్ణికబోలి యుండుటంజేసి పుష్కరిక యనబడును.

### 10. స్పర్శహానిలక్షణము

స్పర్శహానిం తు జనయేచ్ఛోణితం శూకదూషితమ్,

శూకలేపనమువలన రక్తముచెడి గుహ్యమున స్పర్శము దెలియకుండును. దీనిని స్పర్శహాని యని చెప్పెదరు.

### 11. ఉత్తమాలక్షణము

ముద్గమాషోపమా రక్తా రక్తపిత్తోద్భవా తు యా. 8
వ్యాధిరేషోత్తమా నామ శూకాజీర్ణనిమిత్తతః,

శూకలేపనమును నియమములేక పలుమరు చేయుటవలన పెసలను ఉద్దులను బోలిన యాకారంబును పరిమాణంబును కల్గి రక్తవర్ణంబైన కురుపు గుహ్యమున కల్గును. ఇది కఫ పిత్తములచే కల్గును. ఇది ఉత్తమ యను శూకదోషము.

### 12. శతపోనకలక్షణము

ఛిద్రైరణుముఖైర్లిఙ్గం చితం యస్య సమన్తతః. 9
వాతశోణితజో వ్యాధిః స జ్ఞేయశ్శతపోనకః,

శూకలేపమును విరుద్ధముగ జేసినయెడ గుహ్యమునందెల్ల సన్నని రంధ్రములచే వ్యాపించియుండును. ఇయ్యది వాతరక్తముచే గల్గును. జల్లెడవలె ననేకరంధ్రములు కల్గి యుండుటంజేసి శతపోనక మనందగును. ఈవ్యాధిచేత గుహ్యము ఛిన్నభిన్నముగ నుండును.

### 13. త్వక్పాకలక్షణము

వాతపిత్తకృతో జ్ఞేయః త్వక్పాకో జ్వరదాహకృత్. 10

వాతపిత్తములు ప్రకుపితములై గుహ్యముపై చర్మమును పుండుగ జేయును. దానంజేసి మంటయు జ్వరంబును కల్గును. ఇది త్వక్పాక మని చెప్పబడును.

### 14. రక్తార్బుదలక్షణము

కృష్ణైస్స్ఫోటైస్సరక్తాభిః పిటికాభిర్నిపీడితమ్,
యస్య వాస్తు రుజశ్చోగ్రాజ్ఞేయం తచ్ఛోణితార్బుదమ్. 11

నల్లనిపొక్కులతోగూడి రక్తపూరితమైన పిటికబొబ్బలు గుహ్యమున గల్గి వ్రణస్థలమున మిక్కిలి తీవ్రమైనబాధ కల్గినచో నయ్యది రక్తార్బుద మను శూకదోషము.

### 15. మాంసార్బుదలక్షణము

మాంసదోషేణ జానీయాదర్బుదం మాంససమ్భవమ్,

శూకలేపమునంజేసి మాంసము దుష్టమై గుహ్యమున మున్నుజెప్పిన యర్బుదమునువోలె వ్రణము జనించును. ఇయ్యది మాంసార్బుద మని చెప్పనగును.

### 16. మాంసపాకలక్షణము

శీర్యన్తే యస్య మాంసాని యస్య సర్వాశ్చ వేదనాః. 12
విద్యాత్తం మాంసపాకం తు సర్వదోషకృతం భిషక్,

గుహ్యమున శూకలేపనముచేత మాంసము బొత్తుగ చెడి కుళ్లి నానాట నూడిపడిపోవుచు, వాతపిత్తకఫములచే గల్గు నొప్పి పోటు జిల మున్నగు నానావిధ బాధలు కల్గినయెడ నయ్యది మాంసపాక మనబడును. దీనిని త్రిదోషప్రకోపమున గల్గినదిగా వైద్యు డెరుంగునది.

### 17. విద్రధిలక్షణము

విద్రధిం సన్నిపాతేన యథోక్తమితి నిర్దిశేత్. 13

శూకలేపనముచేత గుహ్యమునందు మున్ను వచించిన సన్నిపాతవిద్రధింబోలె లక్షణములు గల్గి వ్రణము జనించును. ఇయ్యది విద్రధి యను శూకదోషము. ఇది త్రిదోషసన్నిపాతముచే గల్గును.

ఇయ్యది "నానావర్ణరుజాస్రావో ఘంటాలో విషమో మహాన్, విషమం పచ్యతే చాపి విద్రధిస్సాన్నిపాతికః" అని సన్నిపాతవిద్రధికి జెప్పిన నానావర్ణంబులును త్రిదోషములగల్గు బాధలన్నియు, చీము రక్తము మున్నగు స్రావంబులును గల్గి విషమంబై గంటవలె పైకుబికి విషమముగ పాకము నొందు నని యెరుంగునది.

## 18. తిలకాలకలక్షణము

కృష్ణాని చిత్రాణ్యథవా శూకాని సవిషాణి వా,
పాతితాని పచన్త్యాశు మేఢ్రం నిరవశేషతః. 14
కాలాని భూత్వా మాంసాని శీర్యన్తే యస్య దేహినః,
సన్నిపాతసముత్థాంస్తు తాన్విద్యాత్తిలకాలకాన్. 15

నల్లనిరంగైనను లేక నానావర్ణంబులు కలిసియైన చిత్రవర్ణంబైన గల్గి, విషముతోఁగూడిన శూకములను గుహ్యమున బూసినచో గుహ్యమునెల్ల పచ్చిపుండుగ జేయును. మాంసము నువ్వులవలె నల్లనైన కణములుగ నానాట నూడిపోవును. కొంతకాలమునకు గుహ్యము బొత్తుగ లేకయే నానాట నూడిపోవును. (అయ్యవి నువ్వులవలె నల్లనై యూడిపడుటంజేసి ఈవ్యాధి తిలకాలకము లని చెప్పబడును. ఈరోగము సన్నిపాతమున గల్గును.

## అసాధ్యశూకదోషములు

తత్ర మాంసార్బుదం యచ్చ మాంసపాకశ్చ యస్స్మృతః,
విద్రధిశ్చ న సిధ్యన్తి యేచ స్యుస్తిలకాలకాః. 16

పైజెప్పబడిన శూకదోషములలోఁ మాంసార్బుదంబును, మాంసపాకంబును, విద్రధియు, తిలకాలకంబును మిక్కిలి క్రూరంబు లగుటంజేసి యసాధ్యములు. (ఇత్తెరంగున శూకదోషములు పదునెనిమిదియు వివరింపబడినవి.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శూకదోషనిదానం సమాప్తమ్.

# ౪౯. కుష్ఠనిదానమ్

శూకదోషనిదానమును జెప్పినపిదప వానితో సమానముగ పదునెనిమిది భేదములు కల కుష్ఠనిదానమును జెప్పుట.—

కుష్ఠకారణములు, సంప్రాప్తియు

విరోధీన్యన్నపానాని ద్రవస్నిగ్ధగురూణి చ,
భజతామాగతాం చ్ఛర్దిం వేగాం శ్చాన్యాన్ప్రతిఘ్నతామ్. 1
వ్యాయామమతిసన్తాపం అతిభుక్త్వా నిషేవిణామ్,
ఘర్మశ్రమభయార్తానాం ద్రుతం శీతామ్బుసేవినామ్. 2
అజీర్ణాధ్యశినాం చైవ పఞ్చకర్మాపచారిణామ్,
నవాన్నదధిమత్స్యాతిలవణామ్లనిషేవిణామ్. 3
మాషమూలకపిష్టాన్నతిలక్షీరగుడాశినామ్,
వ్యవాయం చాప్యజీర్ణేఽన్నే నిద్రాం చ భజతాం దివా. 4
విప్రాన్ గురూన్ ధర్షయతాం పాపం కర్మ చ కుర్వతామ్,
వాతాదయస్త్రయో దుష్టాః త్వగ్రక్తం మాంసమమ్బు చ. 5
దూషయంతి స కుష్ఠానాం సప్తకో ద్రవ్యసంగ్రహః,
అతః కుష్ఠాని జాయంతే సప్త చైకాదశైవ చ. 6

"న మత్స్యాన్ పయసాఽభ్యవహరేత్" (చ. సూ. అ. ౧౬.) అని యుపక్రమించి చెప్పబడినరీతిగ నొకటి నొకటి సంసర్గముచే విరుద్ధములైన క్షీరమత్స్యాదులనైనను, ద్రవంబులును స్నిగ్ధంబులును చిరకాలమునకు జీర్ణించునవియు నగు నన్నపానాదులనైనను విశేషముగ సేవించుట, వమనమగుట కున్ముఖమైనపుడు దానివేగమును నిరోధించుట, వాతము మూత్రము పురీషము మున్నగువాని వేగమును నిరోధించుట, ఎండచేతను శ్రమముచేతను భయముచేతను పీడితులైనపుడు వెంటనే చల్లనినీళ్లయందు స్నానముసేయుట, మిక్కుటముగ భుజించిన తోడనే దేహపరిశ్రమము చేయుట, లేక సంతాపకరములైన పనుల జేయుట, అజీర్ణ (పక్వముకాని) పదార్థముల భుజించుట, లేక భుజించినతోడనే మరల భుజించుట, వమన విరేచననిరూహానువాసనవస్తినస్యములను

పంచకర్మములను శాస్త్రోక్తపద్ధతి ననుసరింపక వ్యతిరేకముగ నాచరించుట, క్రొత్త బియ్యపు టన్నముసైనను పెరుగునైనను మత్స్యములనైనను సేవించుట, ఉప్పును పులుపును అధికముగ సేవించుట, ఉద్దులు, ముల్లంగిపిండితో జేయబడిన పదార్థములు, నువ్వులు, పాలు, బెల్లము వీనిని మిక్కుటముగ సేవించుట, భుజించిన యాహారము జీర్ణముకాని సమయమున స్త్రీ సంభోగము చేయుట, పవటియందు శాస్త్రవిరుద్ధముగ నిదురించుట, బ్రాహ్మణులనైనను గురువులనైనను ధిక్కరించుట, పాపకృత్యములను జేయుట, ఈకారణములచేత వాతపిత్తకఫములు ప్రకుపితములై శరీరమునందలి చర్మమును, రక్తమును, మాంసమును, రసమును చెరిచి కుష్ఠవ్యాధిని కల్గించును. వాతపిత్తకఫములు మూడు దోషములును, చర్మము రక్తము మాంసము రసము అను నీ దూష్యముల చెరిచి, ఏడు మహాకుష్ఠములను, పదునొకండు క్షుద్రకుష్ఠములను గల్గించును. (మొత్తమున పదునెనిమిది కుష్ఠములకును పైజెప్పిన దోషదూష్యము లేడును ముఖ్యకారణములని భావము.)

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—విసర్పనిదానమును జెప్పునపుడు "రక్తం లసీకా త్వఙ్మాంసం దూష్యం దోషాస్త్రయో మలాః, విసర్పాణాం సముత్పత్తౌ విజ్ఞేయాస్సప్తధాతవః" (చరక. చి. అ ౨౧) అను వాక్యముచేత రక్తము, లసీక (చర్మగతమైన నీరు), చర్మము, మాంసము అను నీనాల్గు దూష్యంబులును, వాతము, పిత్తము, కఫము నను దోషంబులు మూడును జేరి యేడును విసర్పములకు కారణము లని తెలియుచున్నది. కుష్ఠములకుగూడ నీయేడు దోషదూష్యములును కారణములు, కావున కుష్ఠవిసర్పముల రెంటికిని పరస్పర భేదమేమి? యను నాశంక కలుగవచ్చును; గాని చిరకాలమునకు నానాట బలపరచి కుష్ఠమును కల్గించును. కుష్ఠము పుట్టిన స్థలముననే యుండి వ్యాపించును. రక్తము పిత్తంబును బలిష్ఠములుగాక తక్కిన దోషములవలెనే యుండును. విసర్పము త్రుటికాలముననే తటాలునకల్గి శరీరమునం దొక చోటనైన నిల్కడలేక తలచిన స్థలమునకు క్షణకాలముననే మారి పరువిడుచుండును. విసర్పమున దోషదూష్యము లన్నిటికన్న రక్తపిత్తములు రెండు ప్రబలములై యుండును. మరియు కుష్ఠములకు జన్మాంతరమున జేసిన పాపకర్మయు, గురుతిరస్కారంబును, పరద్రవ్యాపహరణంబును మున్నగునవి విప్రకృష్టకారణములై యుండును. విసర్పమునకు ఇట్టి విప్రకృష్టకారణములు కన్పడవు. కావున నిట్టి భేదములు పరస్పర విలక్షణములుగ కుష్ఠవిసర్పములు రెంటికిని గానంబడుచున్నవి. కాన దోషదూష్యసామ్యమును మాత్రముబట్టి యీరెంటికిని అభేదమనుట భ్రమమాత్రము.

మరియు వాగ్భటాచార్యులు కుష్ఠకారణముల మరికొన్నింటిని నిట్లుపదేశించిరి:—"సాధునిందావధాన్యస్వహరణాద్యైశ్చ సేవితైః, పాప్మభిః కర్మభిస్సద్యః

ప్రాక్తనైః ప్రేరితా మలాః......కుష్ఠముశన్తితమ్" (అ. హృ. ని. అ. ౧౪. శ్లో.) పెద్దలను సాధువులను నిందించుట, అట్టివారిని వధించుట, పరద్రవ్యమును కపట కృత్యములచే నపహరించుట మున్నగు పాపకర్మములను పూర్వజన్మములయందైనను ఈజన్మమునందైనను చేసియున్నను కుష్ఠముల గల్గించును.

మరియు ఒరులతో కర్ణకఠినముగ సంభాషించినను, వ్యర్థముగ సంభాషించినను, గురుభార్యతో సంగమము జేసినను, ఆవులతో సంభోగించినను తప్పక కుష్ఠరోగము సంప్రాప్తమగును. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"పరుషం భాషతేఽత్యర్థం స త్వగ్దోషయుతో భవేత్" "గురుతల్పగదోషాచ్చ గవి మైథునదోషతః, దుశ్చర్మా స్యాదసౌ కుర్యాత్."

కుష్ఠమున కన్వర్థసంజ్ఞను వాగ్భటాచార్యు లిట్లు చెప్పిరి:—"కాలేనో పేక్షితం యస్మాత్ సర్వం కుష్ణాతి తద్వపుః, ప్రపద్యధాతూన్ వ్యాప్యాన్తః సర్వాన్ సంక్లేద్య చాపహేత్, సస్వేదక్లేదసంకోథాత్ కృమీన్ సూక్ష్మాన్ సుదారుణాన్, రోమత్వక్స్నాయు ధమనీతరుణాస్థిని యైః క్రమాత్, భక్షయే చ్ఛ్విత్ర మస్మాచ్చ కుష్ఠబాహ్యముదాహృతమ్" (అ. హృ. ని. అ. ౧౪. శ్లో. ౫.) ఈవ్యాధిని సకాలమున (ప్రారంభదశయందే) తగిన చికిత్స జేయక యుపేక్షించినయెడ రసరక్తాదిధాతువులను క్రమముగ నానాట ప్రవేశించి వానిలోపలి సూక్ష్మాంశములనెల్ల వ్యాపించి బొత్తుగ చెరిచి, చెమటయు చీము మొదలగు ద్రవంబుఁగలిగి, కుళ్లినట్లుచేసి మిక్కిలి క్రూరములగు సూక్ష్ములైన క్రిములను కల్గించును. అట్టి పురుగులు నానాట శరీరమునందలి రోమములను, చర్మమును, స్నాయువును, ధమనులను, తరుణాస్థులను తిని, నానాట శరీరమునందలి మాంసాదుల నూడదీయును. కావున నీవ్యాధి కుష్ఠ మనబడును. ఈవ్యాధి పై జెప్పిన విధముగ ధాతువులన్నిటిని వ్యాపించి బొత్తుగ చెరచును. శ్విత్రము కేవలము చర్మమును మాత్రము నాశ్రయించి జనించును, కావున కుష్ఠముకన్న శ్విత్రము బాహ్యము (బైటనుండు చర్మమున బుట్టినది.) ("కుష-నిష్కర్షే" అను ధాతువువలన కుష్ఠశబ్దము నిష్పన్నమైనది. రసాదిధాతువుల నానాట శిథిలముగ జేసి యూడునట్లు చేయు క్రూరవ్యాధిని కుష్ఠశబ్దమున కన్వర్థసంజ్ఞ యని ముఖ్యాభిప్రాయము.)

## కుష్ఠభేదములు

కుష్ఠాని సప్తధా దోషైః పృథగ్ద్వన్ద్వైస్సమాగతైః,
సర్వేష్వపి త్రిదోషేషు వ్యపదేశోఽధికత్వతః.

పై జెప్పిన కుష్ఠము వాత-పిత్త-కఫములచే వేరువేరుగను, సంసర్గముచేతను, మూఁడిటి సన్నిపాతముచేతను గల్గును. కావున నేడు తెరంగులై యుండును. కుష్ఠము లన్నియు త్రిదోషప్రకోపముచేతనే గల్గును. అయినను మూడుదోషములలో నేదోషము మిక్కిలి ప్రబలతరముగ నుండునో, అయ్యది యాదోషమున జనించిన దని వ్యవహారింప బడును. కావున వాతాది భేదములు దోషబలాధిక్యము ననుసరించి యుండును.

### కుష్ఠపూర్వరూపము

అతిశ్లక్ష్ణఖరస్పర్శః స్వేదాస్వేదవివర్ణతాః,
దాహః కణ్డూస్త్వచి స్వాపః తోదః కోఠోన్నతిర్భ్రమః. 8
వ్రణానామధికం శూలం శీఘ్రోత్పత్తిశ్చిరస్థితిః,
రూఢానామపి రూక్షత్వం నిమిత్తేఽల్పేఽపి కోపనమ్. 9
రోమహర్షోఽసృజః కార్ష్ణ్యం కుష్ఠలక్షణమగ్రజమ్,

కుష్ఠములు జనించుటకు మున్ను కుష్ఠము జనించుచోట హస్తమున స్పృశించిన యెడ నునుపుకల్గియుండును. లేక గరగర మని కఠినముగ నుండును. అచ్చోట చెమట యధికముగను బట్టును. లేక బొత్తుగ చెమట బట్టకుండును. స్వాభావికమైన వర్ణము మారును. మంటయుం దురదయు నధికముగ నుండును చర్మము చేత తాకిన స్పర్శము తెలియదు. సూదుల బొడిచినట్లు పోటు కల్గును. కణుదురీగెలు కుట్టినవిధముగ దద్దులు కల్గును. చిత్తము స్థిరముగాక భ్రమసియుండును. వ్రణము లతిశీఘ్రముగ బుట్టి యపారమైన బాధకల్గి చిరకాలముదనుక మానకుండును. ఒకవేళ వ్రణములు మానినను మచ్చలు మిక్కిలి రూక్షములై గరగరలాడుచుండును. స్వల్పకారణముచేనైనను కురుపులు మరల ప్రకోపము నొందును. అచ్చోట వెండ్రుకలు నిట్రబొడిచి యుండును. రక్తము నల్లనై యుండును. ఇవి యన్నియు కుష్ఠము జనించుటకు ముందుకల్గు పూర్వరూపములు.

### కపాలకుష్ఠము

కృష్ణాఽరుణకపాలాభం యద్రూక్షం పరుషం తను. 10
కపాలం తోదబహుళం తత్కుష్ఠం విషమం స్మృతమ్,

నల్లనిరంగు కల్గియైనను, లేక అరుణవర్ణముగనైనను, కుండపెంకువలె మిగుల రూక్షంబును పరుసంబునై కఠినముగనుండి, అధికమైన పోటుకల్గి, ఒకప్రక్క యెత్తును, ఒకప్రక్క పల్లమునై యున్నయెడ కపాలకుష్ఠ మనబడును. (ఇయ్యది వాతబాహుళ్యమున గల్గును )

### ఔదుంబరకుష్ఠము

రుగ్దాహరాగకణ్డూభిః పరీతం రోమపిఞ్జరమ్. 11
ఉదుమ్బరఫలాభాసం కుష్ఠమౌదుమ్బరం వదేత్,

మిక్కిలి తీవ్రములైన నొప్పియు మంటయు దురదయు కల్గి, రక్తవర్ణమై పీత రక్తవర్ణములు గల వెండ్రుకలతో గూడి, మేడిపండ్లవంటి యాకారంబును రంగును కల్గిన వ్రణములు జనించినచో నౌదుంబరకుష్ఠ మని యెరుంగునది. (ఇది పిత్తోత్కర్షమున జనించును.)

వాగ్భటమున "బహులం బహులక్లేదం రక్తం దాహరుజాధికం, ఆశూత్థానావదరణక్రిమిం విద్యాదుదుమ్బరమ్" (అ. హృ. ని. అ. ౧౪. శ్లో. ౧౬.) అని చెప్పియున్నది. వ్రణము పండిన మేడిపండువంటి యాకారము కల్గి ఘనమై అతిశీఘ్రముగ జనించి, త్వరితముగనే పగిలి, క్రిములు కల్గునదియు, అధికముగ చీము మొదలగువానిని స్రవించునదియు నుదుంబరకుష్ఠ మని భావము.

### మండలకుష్ఠము

శ్వేతం రక్తం స్థిరం స్త్యానం స్నిగ్ధముత్సన్నమణ్డలమ్. 12
కృచ్ఛ్రమన్యోన్యసంయుక్తం కుష్ఠం మణ్డలముచ్యతే,

శ్వేతవర్ణంబైనను రక్తవర్ణంబైనను కల్గి, కఠినంబును ఘనంబును స్నిగ్ధంబును ఉన్నతంబునై, మండలాకారముగ గుండ్రనై జనించి, యొకటితో నొకటి వరుసగ చేరి యున్నయెడ, మండలకుష్ఠ మనబడును. ఇది మిక్కిలి కృచ్ఛ్రసాధ్యము. (కఫోత్కర్షమున జనించును.)

వాగ్భటమున "బహుకణ్డూ స్రుతి క్రిమి" (అ. హృ. ని. అ. ౧౪. శ్లో. ౧౭.) అని యుండుటచే ఈకుష్ఠమున మితిమీరిన దురదయు స్రావంబును కల్గి క్రిము లధికముగ జనించు నని యెరుంగునది.

### ఋశ్యజిహ్వాకుష్ఠము

కర్కశం రక్తపర్యన్తం అన్తశ్శ్యావం సవేదనమ్. 13
యదృశ్యజిహ్వాసంస్థానం ఋశ్యజిహ్వం తదుచ్యతే,

మిక్కిలి గరగర మని కర్కశమై చుట్టు అంచు ఎఱ్ఱగను, నడుము శ్యామవర్ణముగనుండి తీవ్రమైన బాధకలిగి ఎలుగుబంటినాలుకవలె నాకారము కల్గియుండునది ఋశ్యజిహ్వాకుష్ఠము. ('ఋక్షజిహ్వ' అని పాఠాంతరము.) (ఇది వాతపిత్తోల్బణమున జనించును.)

## పుండరీకకుష్ఠ

స శ్వేతం రక్తపర్యన్తం పుండరీకదళోపమమ్. 14
సోత్సేధం చ సరాగం చ పుండరీకం తదుచ్యతే,

తామరాకువలె గుండ్రనై, నడుమ తెల్లగను చుట్టును అంచు రక్తవర్ణముగ నుండి, యున్నతమై *యెఱ్ఱగ నుండునది పుండరీకకుష్ఠము. (ఇది కఫపిత్తము లధికముగ నుండు సన్నిపాతమున గల్గును.

## సిధ్మకుష్ఠము

శ్వేతం సాస్రం తను చ యద్రజో ఘృష్టం విముఞ్చతి. 15
ప్రాయశ్శోరసి తత్సిధ్మమలాబుకుసుమోపమమ్,

కొంచెము రక్తవర్ణము కలిసిన తెలుపురంగు కల్గిన చిన్నచిన్నపొడలు శరీరముపై కల్గి, వానిని చేత రుద్దినపుడు పిండివలె నుండు పొడి రాలుచున్నయెడ సిధ్మకుష్ఠ మన బడును. ఇది శరీరముతో సమానముగ సొరపువ్వువలె బిళ్లలుగ వ్యాపించును. ఇది తరుచుగ రొమ్మున బుట్టును. దీనినే సిబ్బె మని లోకమున జెప్పెదరు. (ఇదికూడ కఫపిత్తముల యాధిక్యమున గల్గును.)

## కాకణకుష్ఠము

యత్కాకణన్తికావర్ణం సపాకం తీవ్రవేదనమ్. 16
త్రిదోషలిఙ్గం తత్కుష్ఠం కాకణం నైవ సిద్ధ్యతి,

గురిగింజవలె నడుమ నల్లనై చుట్టు రక్తవర్ణముకల్గి పుండై తీవ్రమైనబాధకల్గి యుండునది కాకణకుష్ఠము. ఈకుష్ఠము వాతపిత్తకఫములు మూడును సమకాలమున సమములుగ ప్రకోపమునొందుటచే కల్గును; కావున నియ్యది మిక్కిలి యసాధ్యము.

కుష్ఠము సామాన్యముగ త్రిదోషములచే జనించినను అన్నిటికన్న నీకుష్ఠము నందు త్రిదోషంబులును మిక్కుటముగ ప్రకోపించును. కావున నియ్యది త్రిదోషజ మని చెప్పబడును.

వాగ్భటాచార్యుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"కాకణం తీవ్రదాహరుక్, పూర్వం రక్తం చ కృష్ణం చ కాకణన్తీఫలోపమమ్, కుష్ఠలిఙ్గైర్యుతం సర్వైః నైకవర్ణం తతో భవేత్" ఈకుష్ఠము తొలుత పుట్టునపుడు నడుమ నలుపును, చుట్టు ఎరుపును గల్గి గురిగింజలను బోలినయాకారముకలిగి పుట్టును. తీవ్రమైన నొప్పియు మంటయు

* అప్పుడప్పు డెఱ్ఱబడుచుండునది యని భావము.

కల్గియుండును. పిదప కొంతకాలమునకు "ఖరం శ్యావారుణం......సాన్నిపాతికమ్" అను వాక్యముచే వాతాదులకు వేర్వేర జెప్పబడు లక్షణములన్నియు కలిగి శ్వేత పీతాది నానావర్ణములును సంకరముగ కలిగియుండు నని భావము.

ఏకకుష్ఠ - చర్మకుష్ఠములు

అస్వేదనం మహావాస్తు యన్మత్స్య శకలోపమమ్. 17
తదేకకుష్ఠం; చర్మాఖ్యం బహలం హస్తిచర్మవత్,

చెమటబట్టక విశాలమైనస్థానము నాశ్రయించి మత్స్యముయొక్క చర్మఖండము (చేపపొలుసు)వంటి యాకారముకల్గి వ్యాపించునది ఏకకుష్ఠము. ఏనుగు చర్మమును బోలె మిక్కిలి కర్కశమైనది చర్మకుష్ఠము. (ఈరెండును వాతకఫములచే జనించును) సుశ్రుతమునం దేకకుష్ఠము సర్వశరీరమునం దేకాకారముగ రక్తవర్ణంబైనను అరుణ వర్ణంబైనను కల్గియుండునది యని "కృత్స్నః దేహః యస్య రక్తోఽరుణో వా, తదే కాఖ్యం కుష్ఠమాహుః" అను వాక్యముచే జెప్పెను. ఖరనాదమున:—"మహదస్వే దనం మత్స్యశకలాకారమేకజమ్" అని చెప్పెను. సుశ్రుతమతమున శరీరమంతయు ఒకటేరంగుగ మారియుండునది యేకకుష్ఠ మని యన్వర్థముగ జెప్పబడినది. ఖరనాదమున ప్రకృతిమూలము ననుసరించి చెప్పబడినది.

కిటిభకుష్ఠము

శ్యావం కిణఖరస్పర్శం పరుషం కిటిభం స్మృతమ్. 18

శ్యామవర్ణముకల్గి మచ్చవలె తాకినచో గరగరలాడుచు పరుషముగ నుండునది కిటిభకుష్ఠము (ఇదియు వాతకఫములచే గల్గును.)

వైపాదికకుష్ఠము

వైపాదికం పాణిపాదస్ఫుటనం తీవ్రవేదనమ్,

కాళ్లుచేతులు మిక్కిలి పగిలి తీవ్రమైనబాధ కల్గియున్నయెడ వైపాదిక మను కుష్ఠము. (ఇదియు వాతకఫములచే జనించును.)

అలసకకుష్ఠలక్షణము

కణ్డూమద్భిస్సరాగైశ్చ గణ్డైరలసకం చితమ్. 19

మిక్కిలి తీవ్రమైన దురదకల్గి యెఱ్ఱనైన దద్దులు శరీరమునందెల్ల వ్యాపించినది యలసకకుష్ఠ మనబడును. (ఇది వాతకఫములచే గల్గును.)

### దద్రుకుష్ఠము

సకణ్డూరాగపిటికం దద్రుమండలముద్గతమ్,

మొదట దద్దువలె కల్గి పిమ్మట దురదతోగూడి ఎఱ్ఱని సన్నబొబ్బలు కల్గి గుండ్రముగ శరీరమునంతెల్ల నల్లునది దద్రుకుష్ఠ మని చెప్పదగును. (దీనిని తామరపాద యని లోకమున జెప్పెదరు. ఇది కఫపిత్తోల్బణమున కల్గును.)

### చర్మదలకుష్ఠము

రక్తం సశూలం కండూమత్ సస్ఫోటం యద్దలత్యపి,
తచ్చర్మదలమాఖ్యాతం సంస్పర్శాసహముచ్యతే. 20

రక్తవర్ణమై తీవ్రమైన నొప్పియు, దురదయుకల్గి సన్నని బొబ్బలతోగూడి బద్దలుగ శరీరము పగిలి నీరుగారుచు చేతతాకిన నోరువరాని బాధకల్గియుండునది చర్మదల కుష్ఠము. (ఇదియు కఫపిత్తములచే గల్గును.)

### పామాకుష్ఠము

సూక్ష్మా బహ్వ్యః పిటికాః స్రావవత్యః
పామేత్యుక్తాః కణ్డుమత్యస్సదాహాః,
సైవ స్ఫోటైస్తీవ్రదాహైరుపేతా
జ్ఞేయా పాణ్యోః కచ్ఛురుగ్రాస్ఫిచోశ్చ. 21

మిక్కిలి సన్నని యాకారముకల్గిన పొక్కులు అనేకములు శరీరమున కల్గి తీవ్రమైన దురదకల్గి గోకినప్పుడు తీవ్రమై యోరువరానిమంటయు కల్గిన నయ్యది పామ యను కుష్ఠము. అవియే కొంచెము పెద్దవియగుబొబ్బలై తీవ్రమైన మంటయు, దురదయు కల్గి చేతులయందైనను రొంటియందైనను కలిగిన నయ్యది కచ్ఛు వనబడును.(ఈరెంటిని తీట (గజ్జి) యని చెప్పెదరు.) శరీరమునం దెచ్చటనైన కలిగిన నది పామ యనియు, చేతులయందును రొంటియందును కలిగినపుడు అదియే కచ్ఛు వనియు స్థలభేదముచేత నామభేదముగ చెప్పబడును గాని రూపమున భేదము కానరాదు. (ఇదియు కఫపిత్తములచే గల్గును.)

### విస్ఫోటకుష్ఠము

స్ఫోటాశ్శ్యావారుణాభాసాః విస్ఫోటాస్స్యుస్తనుత్వచః,

పలుచని చర్మముతోగూడి శ్యామవర్ణంబును అరుణవర్ణంబును కల్గిన బొబ్బలు శరీరమున బుట్టినయెడ నయ్యది విస్ఫోటకుష్ఠ మని చెప్పనగును.(ఇదియు కఫపిత్తములచే గల్గును.)

### శతారుకుష్ఠము

రక్తం శ్యావం సదాహార్తి శతారుస్స్యాద్బహువ్రణమ్. 22

రక్తవర్ణంబును శ్యామవర్ణంబునై యనేకవ్రణములతోఁగూడి తీవ్రమైనమంటయు నొప్పియు కల్గినది శతారుకుష్ఠము. (ఇదియు కఫపిత్తములచే గల్గును.)

### విచర్చికాకుష్ఠము

సకండూః పిటికా శ్యావా బహుస్రావా విచర్చికాః,

మిక్కిలి తీవ్రమైనమంట కలిగి శ్యామవర్ణంబై విశేషముగ చీము నెత్తురుకారుచుండు అనేక ద్వారములు కలిగినది విచర్చిక యను కుష్ఠము. (ఇది వాతపిత్తోల్బణమున కల్గును.)

భోజుండు విపాదికా విచర్చికలకు భేదములేదని యిట్లు నిరూపించెను:— "దోషాః ప్రదూష్య త్వఙ్మాంసం పాణిపాదసమాశ్రితాః, పిటికాం జనయన్త్యాశుదాహకణ్డూ సమన్వితామ్. దాల్యతే త్వక్ఖరా రూక్షా పాణ్యోర్జ్ఞేయా విచర్చికా, పాదే విపాదికాజ్ఞేయా స్థానాన్యత్వాద్విచర్చికా" దోషములు మూడును శరీరమునందలి చర్మమాంసములను చెరిచి హస్తములయందైనను పాదములయందైనను చేరి మిక్కిలి మంటయు దురదయు కలబొబ్బను కలిగించును. దానంజేసి యచ్చోట చర్మము మిక్కిలి కర్కశంబును రూక్షంబునై పగులును. ఇయ్యది హస్తములయందు బుట్టినచో విచర్చిక యనియు, పాదములయందు పుట్టినయెడ విపాదిక యనియు చెప్పబడును. ఈరెండును స్థానభేదముచే రెండుపేరుల బిలువబడును గాని వీనికి రూపభేద మించుకేనియు లేదు.

### వాతికాదికుష్ఠముల ప్రత్యేకలక్షణములు

ఖరం శ్యావారుణం రూక్షం వాతకుష్ఠం సవేదనామ్. 23
పిత్తాత్ప్రకుపితం దాహరాగస్రావాన్వితం మతమ్,
కఫాత్క్లేది ఘనం స్నిగ్ధం సకండూశైత్యగౌరవమ్. 24
ద్విలిఙ్గం ద్వన్ద్వజం కుష్ఠం త్రిలిఙ్గం సాన్నిపాతికమ్,

వాతమున గల్గినకుష్ఠము కఠినమై శ్యామారుణవర్ణములు కలిగి రూక్షమై బాధతోఁ గూడియుండును. పిత్తమున జనించినది కుళ్లి మంటయు ఎరుపురంగును కలిగి చీము మున్నగునవి విశేషముగ స్రవించును. కఫమున జనించినది ద్రవముతోఁగూడి మిగుల ఘనంబై నునుపుకల్గి మిక్కిలి దురదతోఁగూడి చల్లనై బరువుగనుండును. రెండేసి దోషముల సంసర్గముచే గలిగిన కుష్ఠములు ఆ రెండేసి దోషములకు వేరువేర జెప్పబడిన

లక్షణములు కలిసియుండును. త్రిదోషములచే గలిగిన కుష్ఠమున మూడుదోషములకు వేర్వేరుగ జెప్పిన లక్షణము లన్నియు సంకరముగ జేరియుండును.

ఇచ్చట వాతాదికుష్ఠముల భేదమును గమనించునప్పుడు; వాతాదులకు వేరువేర చెప్పిన ఖరశ్యావాది భేదములబట్టి వాతికాది కుష్ఠ భేదములను, ఆయాకుష్ఠములకు వేరు వేరుగ జెప్పబడిన ప్రత్యేకలక్షణములబట్టి వాతాదిదోష సంబంధమును గమనించి నిర్ణయించవలెను. ఈ విషయము చరకమున ని ట్లుపదేశింపబడెను:—"కుష్ఠవిశేషైర్దోషాః దోషవిశేషైః పునశ్చ కుష్ఠాని, జ్ఞాయన్తే తే హేతుం హేతుస్తాంశ్చ ప్రకాశయతి', (చరక. చి. అ. 2) కుష్ఠవిశేషములచే దోషవిశేషములను, దోషవిశేషములచే కుష్ఠభేదములను జ్ఞాప్యజ్ఞాపక సంబంధము ననుసరించి నిర్ణయింపవలె నని ముఖ్యభావము.

### రసాదిసప్తధాతుగతకుష్ఠములు; అందు రసగతకుష్ఠము

త్వక్స్థే వైవర్ణ్యమఙ్గేషు కుష్ఠే రౌక్ష్యం చ జాయతే. 25
త్వక్స్వాపో రోమహర్షశ్చ స్వేదస్యాఽతిప్రవర్తనమ్,

కుష్ఠము చర్మమునందలి రసధాతువున జేరినపుడు అవయవముల యందెల్ల వర్ణము మారును. చర్మముపై జిడ్డులేక రూక్షముగ నుండును. చర్మమున స్పర్శజ్ఞానము చెడి పోవును. వెండ్రుకలు నిక్కబొడిచి యుండును. చెమ్మట విశేషముగ గారుచుండును.

### రక్తగత కుష్ఠము

కండూర్విపూయకశ్చైవ కుష్ఠే శోణితసంశ్రితే. 26

కుష్ఠము రక్తము నాశ్రయించినపుడు అధికముగ చీము గారుచు ఓరువరాని దురద కల్గియుండును.

### మాంసగత కుష్ఠము

బాహుల్యం వక్త్రశోషశ్చ కార్కశ్యం పిటికోద్గమః,
తోదః స్ఫోటస్థిరత్వం చ కుష్ఠే మాంససమాశ్రితే. 27

కుష్ఠము మాంసము నాశ్రయించినపుడు శరీరమునందెల్ల విశేషముగ వ్యాపించును. నోరు చెమ్మలేక యెండును. చేత తాకినపుడు కర్కశముగ నుండును. బొబ్బలు కలుగును. సూదుల బొడిచినట్లు పోటుపుట్టును. పగులును. కఠినముగ నుండును.

### మేదోగత కుష్ఠలక్షణము

కౌణ్యం గతిక్షయోఽఙ్గానాం సమ్భేదః క్షతసర్పణమ్,
మేదస్స్థానగతే లిఙ్గం ప్రాగుక్తాని తథైవ చ. 28

కుష్ఠము మేదస్సు నాశ్రయించినపుడు హస్తపాదాదులు వక్రములై చేష్టలయందసమర్థములై యుండును. పగులును. వ్రణములు బైలుదేరును. ఇవిగాక పై జెప్పబడిన లక్షణములన్నియు కల్గును.

### అస్థి-మజ్జగతకుష్ఠము

నాసాభఙ్గోఽక్షిరాగశ్చ క్షతేషు వ్రణసమ్భవః,
స్వరోపఘాతశ్చ భవేదస్థిమజ్జసమాశ్రితే. 29

కుష్ఠము అస్థులను మజ్జను ఆశ్రయించినపుడు ముక్కు నానాట చెడి యణగి రూపుచెడును. కన్నులెఱ్ఱనగును. చిన్నదెబ్బ తగిలినను వ్రణములగును. కంఠస్వరము బొత్తుగచెడి మారును.

### శుక్రగత కుష్ఠము

దమ్పత్యోః కుష్ఠబాహుల్యాద్దుష్టశోణితశుక్రయోః,
యదపత్యం తయోర్జాతం జ్ఞేయం తదపి కుష్ఠితమ్. 30

దంపతుల కిద్దరికైనను ఒకరికైనను కుష్ఠవ్యాధి కల్గియుండునెడ వారి శుక్రశోణితములు రెండును చెడియుండును. కావున వారికి జనించిన సంతతికి కుష్ఠవ్యాధి పుట్టుకతోనే యనుసరించియుండును. కావున శుక్రగతకుష్ఠము సంతానమువలన దెలియు నని భావము.

ఇచ్చట అపిశబ్దమువలన శుక్రమున కుష్ఠము జేరియున్నపుడు పైజెప్పిన రసరక్తాది ధాతుగత లక్షణములుకూడ కల్గు నని యెరుంగునది.

### సాధ్యాసాధ్య కుష్ఠనిర్ణయము

సాధ్యం త్వగ్రక్తమాంసస్థం వాతశ్లేష్మాధికం చ యత్,
మేదసి ద్వన్ద్వజం యాప్యం; వర్జ్యం మజ్జాస్థిసంశ్రితమ్. 31

చర్మమును రక్తమును మాంసమును ఆశ్రయించిన కుష్ఠంబులును, వాత కఫములధికముగనుండు కుష్ఠములును సాధ్యములు. మేదస్సున జనించిన కుష్ఠంబును, ద్విదోషోల్బణమున జనించిన కుష్ఠంబును యాప్యములు. మజ్జను అస్థులను ఆశ్రయించిన కుష్ఠములు మిక్కిలి యసాధ్యములు.

### కొన్ని యసాధ్యలక్షణములు

క్రిమ్యుస్తృడ్దాహమన్దాగ్నిసంయుక్తం యత్త్రిదోషజమ్,
ప్రభిన్నం ప్రస్రుతాఙ్గం చ రక్తనేత్రం హతస్వరమ్. 32
పఞ్చకర్మగుణాతీతం కుష్ఠం హన్తీహ మానవమ్,

పురుగులు కలిగి లోపల మంటబుట్టి జఠరాగ్ని మందగించియున్న కుష్ఠంబును, త్రిదోషప్రకోపమున గల్గిన కుష్ఠంబును, ఆయాయంగము పగిలి నీరుగారుచుండు కుష్ఠంబును, కన్నులెఱ్ఱనై కంఠస్వరము చెడియుండు కుష్ఠంబును, వమన విరేచనాది పంచకర్మల జేయ వలనుపడనిస్థితియందుండు కుష్ఠంబును రోగిని తప్పకచంపును. కావున నివి యన్నియు నసాధ్యములు.

వాగ్భటాచార్యుడు సాధ్యాసాధ్యముల నిట్లు నిర్దేశించెను:—"సర్వదోషోల్బణంత్యజేత్, రిష్టోక్తం యచ్చ యిచ్చాస్థిమజ్జ శుక్రసమాశ్రయమ్; యాప్యం మేదోగతం; కృచ్ఛ్రం పిత్తద్వన్ద్వాస్రమాంసగమ్; అకృచ్ఛ్రం కఫవాతాఢ్యం త్వక్థమేకమలం చ యత్" (అ. హృ. ని. అ. ౧౪. శ్లో. ౩౧, ౩౨.) త్రిదోష సన్నిపాతమున జనించిన కుష్ఠంబును వికృతివిజ్ఞానీయమున జెప్పిన అవయవము లూడిపడుట మున్నగు నరిష్టలక్షణములు కలిగిన కుష్ఠంబులును అస్థినైనను,మజ్జనైనను, శుక్రమునైనను జేరిన కుష్ఠంబును అసాధ్యములు; కావున చికిత్సజేయజనదు. మేదోగతమైన కుష్ఠము మాత్రము యాప్యము. పిత్తముతోగూడిన ద్వంద్వముల (పిత్తవాత, పిత్తకఫముల)చే గల్గిన కుష్ఠంబులును, రక్తమునైనను మాంసమునైనను జేరిన కుష్ఠంబులును కృచ్ఛ్రసాధ్యములు.కఫవాతముల యుల్బణమున జనించినకుష్ఠంబును, చర్మము నాశ్రయించిన కుష్ఠంబును; వాతాదులలో నొక్కొకదోష మధికముగనుండి జనించిన కుష్ఠములు మూడును సుఖసాధ్యములు అని భావము. వీరిమతమున దూష్యములలో త్వక్కు నాశ్రయించినది యొకటి మాత్రము సాధ్య మని చెప్పబడినది. ప్రకృతమూలకారుడు రక్తమాంసముల నాశ్రయించినవికూడ సాధ్యములని చెప్పెను. ఇట్టి భేదము ప్రకృతికాలాది భేదము ననుసరించియుండు నని యూహింపదగును.

## వాతికాదికుష్ఠవిభాగము

వాతేన కుష్ఠం కాపాలం, పిత్తేనౌదుమ్బరం, కఫాత్. 33
మణ్డలాఖ్యం, విచర్చి చ ఋశ్యాఖ్యం వాతపిత్తజమ్,
చర్మైకకుష్ఠం కిటిభం సిధ్మాలసవిపాదికాః. 34
వాతశ్లేష్మోద్భవాః; శ్లేష్మపిత్తాద్దద్రుశతారుషీ,
పుణ్డరీకం సవిస్ఫోటం పామా చర్మదలం తథా. 35
సర్వైస్స్యాత్ కాకణం

కపాలకుష్ఠము వాతముచేతను, ఔదుంబరకుష్ఠము పిత్తముచేతను, మండలకుష్ఠము కఫముచేతను జనించును. (ఇవి యేకదోషజములు.) విచర్చిక, ఋశ్యజిహ్వ

ములను రెండు కుష్ఠములును వాతపిత్తములచే గల్గును. చర్మకుష్ఠము ఏకకుష్ఠము, కిటిభ కుష్ఠము, సిధ్మకుష్ఠము, అలసకుష్ఠము విపాదిక కుష్ఠము అను నీయారును వాతకఫములచే జనించును. దద్రుకుష్ఠము, శతారుకుష్ఠము, పుండరీకము, విస్ఫోటము, పామ, చర్మదలము అను నీయారుకుష్ఠంబులును కఫపిత్తములచే గల్గును. (విచర్చిక మొదలు చర్మదలమువరకుం గల కుష్ఠములు పదునాల్గును ద్విదోషజములు.) కాకణకుష్ఠము మాత్రము త్రిదోషసన్నిపాతమున గల్గును.

## మహాకుష్ఠములు

పూర్వత్రికం దద్రుసకాకణమ్,
పుణ్డరీకర్శ్యజిహ్వే చ మహాకుష్ఠాని సప్త తు. 36

పైకుష్ఠములలో తొలుత జెప్పిన, కపాల-ఔదుంబర-మండలంబు లను మూడు కుష్ఠములును, దద్రు-కాకణ-పుండరీక-ఋశ్యజిహ్వాంబు లను నాల్గు కుష్ఠములును జేరి యేడు కుష్ఠంబులును మహాకుష్ఠము లని చెప్పబడును. (తక్కిన పదునొకండు కుష్ఠములును క్షుద్రకుష్ఠము లని భావము.)

మహాకుష్ఠము లన:—రసాదిధాతువులను శీఘ్రముగ వ్యాపించునవియు ననేక దోషములచే జనించి పలుతెరంగులైన చికిత్సలకు సాధ్యము కానివియు మహాకుష్ఠములు. దీనికి వ్యతిరేకమైనవి క్షుద్రకుష్ఠములు. (ఇత్తెరంగున పదునెనిమిది కుష్ఠంబులును సవిస్తరముగ జెప్పబడినవి.)

## శ్విత్రసామాన్యలక్షణము

కుష్ఠైకసంభవం శ్విత్రం కిలాసం దారుణం భవేత్,
నిర్దిష్టమపరిస్రావి త్రిధాతూద్భవసంశ్రయమ్. 37

కుష్ఠమునకు సమానమైన యుత్పత్తికల్గినది శ్విత్రము. ఇయ్యది కిలాసము దారుణము నని చెప్పబడును. ఇది కుష్ఠమువలె స్రావములేక యుండును. ఇదియ కుష్ఠములకన్న శ్విత్రమున విశేషము. వాతపిత్తకఫము లను మూడుదోషములచేత రక్తమాంసమేదస్సు లను ధాతువులమూడిటి నాశ్రయించి పుట్టును.

"త్రిధాతూద్భవసంశ్రయం" అన్నచోట ధాతుశబ్దముచేత వాతపిత్తకఫరూపము లైన మూడుదోషంబులు రక్తమాంసమేదోరూపములైన మూడుధాతువులును గ్రహింపబడును. అట్టి ధాతుశబ్దమును 'ఉద్భవ-సంశ్రయ' అను పదములతో

వేరు వేర గూర్చినచో ధాతురూపములగు వాత-పిత్త-కఫములచేత, ధాతురూపములగు రక్తమేదస్సుల మూడిటి నాశ్రయించి పుట్టునది శ్విత్రకుష్ఠమని ఫలితార్థము. "ధారణా ద్ధాతవస్స్మృతాః" అని చెప్పినప్రకారము శరీరమును ధరించుటంజేసి వాతపిత్తకఫ ములు గూడ ధాతుశబ్దముచే వాచ్యములు.

మరియు చరకమున శ్విత్రము జనించుట కారణము లిట్లు చెప్పబడినవి:— "వచాంస్యపథ్యాని కృతఘ్నభావః నిన్దా గురూణాం గురుధర్షణం చ, పాపక్రియా పూర్వకృతం చ కర్మ హేతుః కిలాసస్య, విరోధిచాన్నమ్" (చ. చి. అ. 2) వినసహింప రాని మాటలుమాట్లాడుట, ఇతరులు తమకుచేసిన యుపకారమును మరచి వారికి బదులుగ నపకారముచేయుట, గురువులు, తలిదండ్రులు, గుణాధికులు మున్నగు పెద్దల నిందించి ధిక్కరించుట; ఇతరములగు గోవధాదిపాపకర్మముల చేయుట, పూర్వజన్మకృతపాప కర్మవాసనాబలము అను నీకారణములచే శ్విత్రము జనించునని భావము. "కుష్ఠైకసంభవం శ్విత్రం" అని చెప్పుటచేత పైజెప్పబడిన యష్టాదశకుష్ఠములకును ఇవియే కారణములగు నని యెరుంగునది. మరియు—"వచాంస్యపథ్యాని" అని సామాన్యముగ జెప్పి "పూర్వ కృతంచ కర్మ" అని చెప్పుటచేత, అపథ్యవచనాదులు ఈజన్మమున జేయబడినను కుష్ఠ కారణములగునని యెరుంగునది. "అత్యుత్కటైః పుణ్యపాపైరిహైవ ఫలమశ్నుతే" అను వార్షవచనప్రకారము ఈజన్మమున జేసిన క్రూరకర్మము బలిష్ఠమైనచో నిప్పుడే దానిఫల మనుభవించక తప్ప దని యెరుంగునది.

### శ్విత్రములకు దోషదూష్యసంబంధమున గల్గు వర్ణభేదములు

వాతాద్రూక్షారుణం, పిత్తాత్తామ్రం కమలపత్రవత్,
సదాహం రోమవిధ్వంసి; కఫాచ్ఛ్వేతం ఘనం గురు. 33
సకండూరం క్రమాద్రక్తమాంసమేదస్సు చాదిశేత్,

వాతము ప్రకోపించి రక్తము నాశ్రయించిన శ్విత్రమును కల్గించును. ఇది జిడ్డు లేక గరగరలాడుచు, అరుణవర్ణంబై యుండును. పిత్తముచేత మాంసము నాశ్రయించిన శ్విత్రము కల్గును. ఇది తామరరేకువలె తామ్రవర్ణమై మంటతోగూడి యుండును. శరీరమునందలి రోమములను రాలునట్లు చేయును. కఫముచేత మేదస్సు నాశ్రయించిన శ్విత్రము కల్గును. ఇది తెల్లగ నుండును. ఘనమై బరువు గలిగి మిక్కిలి జిలతోగూడి యుండును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—"క్రమాద్రక్తమాంసమేదస్సు చాది శేత్" అను వాక్యముచేత వాతపిత్తకఫములకును, రక్తమాంసమేదస్సులకును యథా

సంఖ్యమును జెప్పియున్నది కావున వాతముచేత రక్తము నాశ్రయించి అరుణవర్ణమైన శ్విత్రము జనించుననియు, పిత్తముచేత మాంసము నాశ్రయించి తామ్రవర్ణమైన శ్విత్రము జనించు ననియు, కఫముచేత మేదస్సు నాశ్రయించి శ్వేతవర్ణమైన శ్విత్రము జనించు ననియు నెరుంగునది. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:— "దోషే రక్తాశ్రితే రక్తం, తామ్రం మాంససమాశ్రితే, శ్వేతం మేదస్థితే శ్విత్రం, గురు తచ్చోత్తరోత్తరమ్" (చరక. చి. అ. 2) దోషము రక్తము నాశ్రయించునపుడు రక్తవర్ణంబును, మాంసమును ఆశ్రయించినపుడు తామ్రవర్ణంబును, మేదస్సు నాశ్రయించినపుడు శ్వేతవర్ణంబును నైనశ్విత్రము జనించును. ఈమూటిలో నొకటికన్న నొకటి బలిష్ఠమై యుండును.

### శ్విత్రమునకు కృచ్ఛ్రత్వము

వర్ణేనై వేద్యృగుభయం, కృచ్ఛ్రం తచ్చోత్తరోత్తరమ్. 39

పైజెప్పిన శ్విత్రమునకు పైశ్లోకమున జెప్పిన పద్ధతి ననుసరించి దానివర్ణమును బట్టియే దోషదూష్యముల రెంటితో సంబంధమును నిర్ణయించునది. (శ్విత్రము రక్తవర్ణమైయుండునేని వాతముచేత రక్తమునాశ్రయించి పుట్టిన దనియు, తామ్రవర్ణమై యున్నచో పిత్తముచేత మాంసము నాశ్రయించి జనించిన దనియు, తెల్లగనుండునేని కఫముచేత మేదస్సు నాశ్రయించి పుట్టినదనియు నెరుంగవలెను గాని వర్ణాంతరము గల్గు ననిగాని, దోషదూష్యసంబంధముగ వేరువిధముగ మారు నని కాని యూహింపవల దని భావము.) పైజెప్పినరీతిగ జనించునవి మూడును ఒకదానికన్న నొకటి మిక్కిలి కృచ్ఛ్రసాధ్యములు. వాతముచే రక్తము నాశ్రయించి రక్తవర్ణమై జనించిన శ్విత్రమునకన్న, పిత్తముచే మాంసము నాశ్రయించి తామ్రవర్ణముగ జనించిన శ్విత్రంబును, దానికన్న కఫముచేత మేదస్సు నాశ్రయించి జనించిన శ్వేతవర్ణమైన శ్విత్రంబును మిక్కిలి కష్టసాధ్య మని భావము. శ్విత్రభేదములను భోజుం డిట్లు నిరూపించెను:— "శ్విత్రం తు ద్వివిధం ప్రోక్తం దోషణం వ్రణజం తథా, తత్రమిథ్యోపచారాద్ధి వ్రణస్య వ్రణజం స్మృతమ్. దోషజం తు ద్విధా ప్రోక్తం ఆత్మజం పరజం తథా, పరసంస్కారసంస్పర్శా ద్యత్తత్పరజముచ్యతే. తదాత్మజం విజానీయా ద్యద్దేహేష్వనిలాదిజమ్." దోషజము, వ్రణజమునని శ్విత్రము రెండు విధములు. అందు వ్రణముకల్గినపుడు తగిన కృష్ణకర్మ యను చికిత్స జేయకపోవుటచే కల్గినమచ్చ రక్తాదివర్ణములు కల్గియున్నచో నయ్యది వ్రణజము. దోషజము ఆత్మజ మనియు, పరజ మనియు రెండు విధములు. అందు శ్విత్రముకల్గినవాని కుపచారములను చేయుట మున్నగుకారణములచే వాని సంబంధమునంజేసి సాంక్రామికముగ గల్గినది పరజము. తన శరీరమున వాతాది దోషములచే జనించిన శ్విత్రము ఆత్మజము.

### సాధ్యాసాధ్యశ్విత్రనిర్ణయము

అశుక్లరోమాఽబహులమసంశ్లిష్టం మిథో నవమ్,
అనగ్నిదగ్ధజం సాధ్యం శ్విత్రం; వర్జ్యమతోఽన్యథా. 40
గుహ్యపాదతలౌష్ఠేషు జాతమప్యచిరన్తనం,
వర్జనీయం విశేషేణ కిలాసం సిద్ధిమిచ్ఛతా. 41

శ్విత్రపుమచ్చయందలి వెండ్రుకలు తెల్లబడక నల్లనైయున్నను, చర్మము స్థూలముగాక పలుచనైయున్నను, మచ్చలు ఒకటితో నొకటి కలియక విడివిడిగ నున్నను, నిప్పున కాలినపుండువలన గల్గినది కాకున్నను, సంవత్సరకాలమునకు లోపుగ బుట్టినను, అట్టి శ్విత్రము చికిత్సచే సాధింపందగియుండును. ఈపేర్కొనంబడిన లక్షణములకు వ్యతిరేకముగ మచ్చయందు వెండ్రుకలు తెల్లబడినదియు, ఘనమైనదియు, మచ్చలొండొంట గలిసినదియు, చిరకాలము ననుసరించినదియు, నిప్పున కాలినదియు నగుశ్విత్రము అసాధ్యము. మరియు గుహ్యమునందును, అరకాలునందును, పెదవుల యందును పుట్టిన శ్విత్రము నవీనముగ జనించినదైనను నివర్తికానేరదు ; కావున యశమును గోరువైద్యుడు చికిత్సచేయక విడుచుట మంచిది. ఇచ్చట పాదతల అనునది హస్తములకుగూడ నుపలక్షకముగాన అరచేతులయందు గల్గుశ్విత్రముకూడ నసాధ్యము. 'వర్జ్యమతోఽన్యథా' అనుదానికి సరియైన లక్షణములను తంత్రాంతరమున నిట్లు చెప్పియున్నది.—"యచ్ఛుక్లరోమబహులం యత్సంలగ్నం పరస్పరమ్, యచ్చ వర్షగణోపేతం తచ్ఛ్విత్రం నైవసిధ్యతి" దీని యర్థమునే పైన జెప్పియున్నది.

### సాంక్రామికవ్యాధులు

ప్రసఙ్గాద్గాత్రసంస్పర్శాన్నిశ్వాసాత్సహభోజనాత్,
ఏకశయ్యాసనాచ్చైవ వస్త్రమాల్యాఽనులేపనాత్. 42
కుష్ఠం జ్వరశ్చ శోషశ్చ నేత్రాభిష్యన్ద ఏవ చ,
ఔపసర్గికరోగాశ్చ సఙ్క్రామన్తి నరాన్నరమ్. 43

కుష్ఠము, జ్వరము, క్షయము, నేత్రరోగములు, *పిశాచ బ్రహ్మరాక్షసాదులచే గల్గువ్యాధులు ఇవి యన్నియు ఈవ్యాధులు కలవారితో సంభోగముచేసినను, వారిశరీరమును స్పృశించినను, వారి నిశ్వాసపుగాలి సోకినను, వారితో సపఙ్క్తిగ

*ఔపసర్గికము లనగా నింకను రెండర్థములు చెప్పెదరు. అందు 1. మహామారి, విషూచి మొదలగు నుపద్రవకరములు. 2. స్త్రీపురుష సంసర్గదోషమువలన గల్గు నుపదంశాది సుఖవ్యాధులు.

భుజించినను, వారితో నొక శయ్యపై బరుండినను, ఒక యాస్తరణమున గూర్చున్నను, వారు ధరించువస్త్రములు పుష్పమాలికలు చందనము మున్నగువాని నుపయోగించినను, పైజెప్పిన వ్యాధులు తప్పక యొకరినుండి మరియొకరికి పరంపరగ వచ్చుచుండును. (కావున పైజెప్పిన వ్యాధులు కలవారితో నేలాటిసంబంధమును జేయక మానియుండుట ముఖ్యకర్తవ్యము.)

మరియు "అక్షిరోగోఽప్యపస్మారః క్షయః కుష్ఠం మసూరికా, దర్శనాత్ స్పర్శనాద్దానాత్సంక్రామన్తి నరాన్నరమ్" అని తంత్రాంతరమున జెప్పియున్నది కావున, నేత్రరోగము, అపస్మారము, క్షయము, కుష్ఠము, మసూరిక ఈవ్యాధులు కలవారితో దర్శన స్పర్శన దానాదిసంబంధములు చేయుట యనర్థదాయకము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
కుష్ఠనిదానం సమాప్తమ్.

# ౫౦. శీతపిత్త-ఉదర్ద-కోఠనిదానమ్

శీతపిత్తాదులు మూడును కుష్ఠమువలెనే త్రిదోషములచే జనించి, చర్మమును చేరచునవి కావున కుష్ఠమును చెప్పిన పిదప శీతపిత్త-ఉదర్ద-కోఠనిదానముల చెప్పుట:—

### శీతపిత్తసంప్రాప్తి

శీతమారుతసంస్పర్శాత్ప్రదుష్టౌ కఫమారుతౌ,
పిత్తేన సహ సంభూయ బహిరన్తర్విసర్పతః. 1

మంచును చల్లనిగాలియు విశేషముగ శరీరమునకు సోకుటచేత కఫంబును వాతంబును ప్రకోపమునొంది, ప్రకోపమునొందిన పిత్తముతో గలిసి, శరీరమున లోభాగమునను పైప్రక్కను అంతట వ్యాపించును. దానంజేసి చర్మము వర్ణము మారి చెడును. ఇది శీతపిత్త మని చెప్పబడును.

### శీతపిత్తాది పూర్వరూపములు

పిపాసాఽరుచిహృల్లాసదేహసాదాఙ్గగౌరవమ్,
రక్తలోచనతా తేషాం పూర్వరూపస్య లక్షణమ్. 2

దప్పి, అరోచకము, ఓకరింతలు, శరీరము కృశించుట, శరీరము బరువుగ నుండుట, కన్ను లెఱ్ఱనై యుండుట ఇవి యన్నియుం శీతపిత్తాదుల మూడిటియందును గల్గు పూర్వరూపము.

### శీతపిత్తోదరలక్షణములు

వరటీదష్టసంస్థానః శోథస్సంజాయతే బహిః,
సకణ్డూస్తోదబహుళః ఛర్దిజ్వరవిదాహవాన్. 3
ఉదర్దమితి తం విద్యా చ్ఛీతపిత్తమథాపరే,
వాతాధికం శీతపిత్తముదర్దస్తు కఫాధికః. 4

కణుదురీగెలు కుట్టినవిధముగ శరీరమునందు దద్దులుగ వాపుకల్గి, అధికమైన దురదయు సూదులబొడిచినవిధముగ పోటును కల్గి, వాంతియు జ్వరంబును మిక్కిలి మంటయు కల్గినయెడ నుదర్ద మనియు, శీతపిత్త మనియు చెప్పబడును. ఇవి త్రిదోష

ముల ప్రకోపమున జనించినను దోషములు మూడిటిలో వాతం బధికముగనున్నచో శీత పిత్త మనియు, కఫం బధికముగ నున్నచో నుదర్ద మనియు నెరుంగునది. (దీనినే కొన్ని ప్రాంతములలో సలితె మందురు.)

ఉదర్దవిశేషలక్షణములు

సోత్సఙ్గైశ్చ సరాగైశ్చ కణ్డూమద్భిశ్చ మణ్డలైః,
శైశిరః కఫజో వ్యాధిః ఉదర్ద ఇతి కీర్తితః. 5

గుండ్రనై చుట్టును ఉన్నతమై నడుమ పల్లమై యుండుదద్దులు కల్గిన నుదర్ద మనబడును. ఈవ్యాధి మంచుకాలమున కఫము ప్రకోపించుటచే గల్గును.

కోఠలక్షణము

అసమ్యగ్వమనోదీర్ణ పిత్తశ్లేష్మాన్ననిగ్రహైః,
మణ్డలాని సకణ్డూని రాగవన్తి బహూని చ,
ఉత్కోఠస్సానుబన్ధశ్చ కోఠ ఇత్యభిధీయతే. 6

వమనరూపమైన శోధనచికిత్స జేసికొనునపుడు పిత్తద్రవము - కఫము. అప క్వాన్నము వమనము చక్కగ కాక దోషము సశేషముగ నుండునపుడు, దానంజేసి ప్రకోపించిన కఫపిత్తంబులచే దురదతోకూడి యెఱ్ఱనై మండలాకారములుగ నుండు దద్దు లనేకములు శరీరముపై బుట్టుచు. ఇది యుత్కోఠ మనబడుచు. ఇవియే అప్పు డప్పుడుకల్గి తనంతనే శమించుచున్నయెడ కోఠమనబడును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శీతపిత్త - ఉదర్ద - కోఠనిదానం సమాప్తమ్.

# ౫౧. అమ్లపిత్తనిదానమ్

కోఠనిదానమున కఫపిత్తములు ప్రధానములుగ జెప్పబడినవి. కావున అట్టి కఫపిత్తముల సంసర్గమున గల్గు అమ్లపిత్తనిదానము కోఠనిదానానంతరము జెప్పుట:—

### అమ్లపిత్తసంప్రాప్తి

విరుద్ధదుష్టామ్లవిదాహిపిత్త
ప్రకోపిపానాన్నభుజో విదగ్ధమ్,
పిత్తం స్వహేతూపచితం పురా య
త్తదమ్లపిత్తం ప్రవదన్తి సన్తః. 1

పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగ జేర్చి భుజించుట, చెడిన యన్నమును భుజించుట, పులుపుకలపదార్థముల భుజించుట, మంట పుట్టించు అవాలు మున్నగు పదార్థముల భుజించుట, పిత్తమును ప్రకోపింపజేయు నన్నపానముల సేవించుట, ఈకారణములచేత అంతకుమునుపే వర్షాకాలమున ఋతుస్వభావమునం జేసి స్వస్థానముననే వృద్ధినొందియున్న పిత్తమును ప్రకోపింపజేయును. ఇది యమ్లపిత్త మని చెప్పబడును.

### అమ్లపిత్తసామాన్యలక్షణము

అవిపాకక్లమోత్క్లేశతిక్తామ్లోద్గారగౌరవైః,
హృత్కణ్ఠదాహారుచిభిశ్చామ్లపిత్తం వదేద్భిషక్. 2

ఆహారము జీర్ణము గాకుండుట, బడలిక, ఓకలింతలు వచ్చుట, చేదుగను పుల్లగను త్రేపులు వచ్చుట, ఒడలు బరువుగ నుండుట, రొమ్మునందును గొంతునందును మంట బుట్టుట, అరోచకము. ఈలక్షణము కల్గినది యమ్లపిత్త మని యెరుంగునది.

### అధోగతామ్లపిత్తలక్షణము

తృడ్దాహమూర్ఛాభ్రమమోహకారి
ప్రయాత్యధో వా వివిధప్రకారమ్,

హృల్లాసకోఽథానలసాదహర్ష
స్వేదాఙ్గపీతత్వకరం కదాచిత్. 3

దప్పి, తాపము, మూర్ఛ, ఒడలుదిరుగుట, మైకము, గుండెలో కలియబెట్టినట్లుండి నోట నీరూరుట, శరీరముపై దద్దులు పుట్టుట, అగ్నిమాంద్యము, రోమాంచము కల్గుట, ఒడలిపై చెమటపుట్టుట, శరీరము పచ్చగ నుండుట ఇట్టిలక్షణముల గల్గించుచు మలాదు లొకప్పుడు నానావిధములుగ వెడలినచో నధోగతామ్లపిత్తమని యెరుంగునది.

## ఊర్ధ్వగతామ్లపిత్తము

వాన్తం హరిత్పీతకనీలకృష్ణమారక్తరక్తాభమతీవ చామ్లమ్,
మాంసోదకాభం త్వతిపిచ్ఛిలాచ్ఛం శ్లేష్మానుజాతం వివిధం రసేన. 4
భుక్తే విదగ్ధే త్వథవాప్యభుక్తే కరోతి తిక్తామ్లవమిం కదాచిత్,
ఉద్గారమేవం విధమేవ కణ్ఠహృత్కుక్షిదాహం శిరసోరుజం చ. 5
కరచరణదాహమౌష్ణ్యం మహతీమరుచిం జ్వరం చ కఫపిత్తమ్,
జనయతి కణ్డూమండలపిటికాశతనిచితగాత్రరోగచయమ్. 6

అమ్లపిత్తము ఊర్ధ్వగత మగునపుడు ఆకుపసరురంగుగనైనను, పసుపురంగుగనైనను, నీలవర్ణముగ నైనను, కృష్ణవర్ణముగ నైనను, కొంచెము ఎరుపు కలిసియైనను, రక్తము వలె నెఱ్ఱగనైనను, మాంసమును కడిగిన నీటివలెనైనను రంగుకల్గి, మిక్కిలి పులిసి, పులుపెక్కిన రసము వాంతి యగును. ఒక సమయమున మిక్కిలి పిచ్ఛిలమైన జిగటకల కఫముతో పులుపును తీపియు మున్నగు నానావిధ రసములు కల్గిన రసము వమనమగును. ఒకప్పుడు భుజించిన ఆహారపదార్థము జీర్ణంబైనను, భోజనము సేయకున్నను, చేదును పులుపును కలరసము వాంతి యగును. చేదును పులుపును కలత్రేపులు వచ్చును. మరియు కంఠమునందును హృదయమునందును కుక్షియందును మంటపుట్టును. తలనొప్పి కల్గును. అరకాళ్లయందును, అరచేతులయందును మంటపట్టును. లేక వేడి కల్గును. అధికముగ నరోచకము కల్గును. జ్వరము వచ్చును. దేహముపైని దురదయు పొడలును బొబ్బలును మున్నగు ననేకరోగములు కల్గును. ఇవి యన్నియు కఫపిత్తముల ప్రకోపమున గల్గును.

## అమ్లపిత్త సాధ్యాదినిర్ణయము

రోగోఽయమమ్లపిత్తాఖ్యో యత్నాత్సంసాధ్యతే నవః,
చిరోత్థితో భవేద్యాప్యః కృచ్ఛ్రసాధ్యస్స కస్యచిత్. 7

ఈ యమ్లపిత్త మను రోగము నూతనముగ జనించినచో మిక్కిలి ప్రయత్నముతో దగినచికిత్స జేసినయెడ సాధ్యమగును. చిరకాలమునుండి యనుసరించియున్నచో యాప్యమగును. అట్టి యాప్యముగూడ దగిన చికిత్సజేసి పథ్యాదుల నియమము దప్పకుండినను కొందఱకు కృచ్ఛ్రసాధ్యముగ నగును.

అమ్లపిత్తమున వాతకఫ సంబంధము

సానిలం సానిలకఫం సకఫం తస్య లక్షయేత్,
దోషలిఙ్గేన మతిమాన్ భిషఙ్మోహకరం హి తత్. 8

పై జెప్పిన యమ్లపిత్తము వాతముతోనైనను, వాతకఫములతోనైనను, కేవలము కఫములతోనైనను సంబంధముకల్గి జనించును. బుద్ధిమంతుడగు వైద్యుడు ఆయాదోషముల లక్షణమునుబట్టి గుర్తించి నిర్ణయించవలెను. ఈ యమ్లపిత్తము వమనరూపముగ నూర్ధ్వభాగమునను, విరేచనరూపముగ నధోభాగమునను వ్యాపించును. కావున వైద్యుడు గుర్తింపలేక పొరపాటుపడును. కావున నట్టిపొరపాటులేక చక్కగ నీక్రింది లక్షణములచే గుర్తింపవలె నని భావము.

వాతజామ్ల పిత్తలక్షణము

కమ్పప్రలాపమూర్ఛాచిమిచిమిగాత్రావసాదశూలాని,
తమసో దర్శనవిభ్రమప్రమోహహర్షాణ్యనిలకోపాత్. 9

వాతప్రకోపమునగల్గిన యమ్లపిత్తమున శరీరము వణకును. సంబంధములేక మాటలాడును. మూర్ఛగ్రమ్మును. శరీరము చిమచిమలాడుచుండును. కృశతనొందును. అచ్చటచ్చట నొప్పిపుట్టును. చీకటిలో నున్నవిధమున కన్నులు గానరాకుండును. చిత్తవిభ్రమము కల్గును. మిక్కిలి మోహము కల్గును. గగురుపాటు పుట్టును. (ఈ లక్షణము లన్నియును కల్గును.)

కఫజనితామ్ల పిత్తలక్షణము

కఫనిష్ఠీవనగౌరవజడతారుచిశీతసాదవమిలేపాః,
దహనబలసాదకణ్డూనిద్రా చిహ్నం కఫానుగతే. 10

కఫమున జనించిన యమ్లపిత్తమున నోటకఫము నుమియును. శరీరము బరువై మొద్దు బారియుండును. నోటికి రుచి తెలియదు. ఒడలెల్ల చల్లనై యుండును. శరీరము కృశించును. వమనమగును. నోట కఫము పూసినట్లు బందనగల్గియుండును. కాయాగ్నిబలంబును శరీరబలంబును నశించును. దురదపుట్టును. నిదుర విశేషముగ బట్టును.

### వాతకఫజామ్లపిత్తలక్షణము

ఉభయమిదమేవ చిహ్నం మారుతకఫసమ్భవే భవత్యమ్లే,

వాతకఫములకు వేరువేరుగ పైజెప్పినలక్షణములన్నియు మిశ్రముగ నుండునది వాతకఫముల జనించిన యమ్లపిత్త మని యెరుంగునది.

### శ్లేష్మపిత్తలక్షణము

తిక్తామ్లకటుకోద్గారహృత్కుక్షికణ్ఠదాహకృత్. 11

భ్రమో మూర్ఛాఽరుచిశ్ఛర్దిరాలస్యం చ శిరోరుజా,

ప్రసేకో ముఖమాధుర్యం శ్లేష్మపిత్తస్య లక్షణమ్. 12

* శ్లేష్మపిత్తమునందు త్రేపులు చేదుగను పుల్లగను కారముగను వెడలును. హృదయమునందును కడుపునందును కంఠమునందును మంటపుట్టును. చక్రముపై నున్న వానివలె నొడలు తిరుగును. మూర్ఛ గ్రమ్మును. నోట నరుచి కల్గును. వాంతి యగును. పనులు చేయుటయం దలసముగ నుండును. తలనొప్పి కల్గును. నోట నీరు వెడలును. నోరు తీపిగ నుండును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అమ్లపిత్తనిదానం సమాప్తమ్.

---

* అమ్లపిత్తమునకును శ్లేష్మపిత్తమునకును నీషద్భేద ముండును; కాన చక్కగా లక్షణములనుబట్టి గురుతింపవలెను.

# ౫౨. విసర్పనిదానమ్

విసర్ప మను రోగము ముఖ్యముగ శరీరమునందలి రక్తము చెడుటచే గల్గును. "ఛర్ది వేగప్రతీఘాతాత్ కాలే చానవసేచవాత్, శరత్కాలప్రభావాచ్చ శోణితం సంప్రదూష్యతి" (చ. సూ. అ. ౨౪) అను చరకవచనమువలన వమనవేగమును నిరోధించుటచేత శరీరమునందలి రక్తము చెడు నని తెలియుచున్నది. అమ్లపిత్తమున వాంతి ప్రబలముగ గల్గు నని చెప్పబడినది. కాన అట్టి వమననిరోధమున గల్గు రక్తదుష్టిచే జనించు విసర్పరోగమును అమ్లపిత్తనిదానమునకు పిమ్మట చెప్పుట.—

విసర్పము జనించుటకు కారణములు : అన్వర్థత

లవణామ్లకటూష్ణాదిసంసేవాదోషకోపతః,
విసర్పస్సప్తథా జ్ఞేయః, సర్వతః పరిసర్పణాత్. 1

ఉప్పు, పులుపు, కారము అను నీరసములు కలపదార్థములను, ఉష్ణముగ నుండు పదార్థములను విశేషముగ సేవించుట మున్నగుకారణములచేత వాత పిత్త కఫములు ప్రకోపమునొంది యేడువిధములైన విసర్పములను కల్గించును. ఇయ్యది శరీరమున స్థాననియమములేక పలుదెరంగుల సంచరించుటంజేసి విసర్ప మని చెప్పబడును.

చరకమున నీవిసర్ప మనువ్యాధికి రెండువిధముల వ్యుత్పత్తిచే రెండు నామముల నిట్లు చెప్పెను:—"వివిధం సర్పతి యతో విసర్పస్తేన స స్మృతః, పరిసర్పోఽథ వానామ్నా సర్వతః పరిసర్పణాత్" (చరక. చి. అ. ౨౧. శ్లో. ౧౧.) ఈవ్యాధి పలు తెరంగుల శరీరమున వ్యాపించుటంజేసి విసర్ప మనియు, శరీరమున స్థాననియమ లేక అంతటను తన కిచ్చవచ్చినట్లు వ్యాపించుటంజేసి పరిసర్పం బనియు జెప్పంబడును. 'వివిధం సర్పతీతి—విసర్పః' 'పరితః (సర్వతః) సర్పతి (గచ్ఛతి) ఇతి—పరిసర్పః' అను వ్యుత్పత్తులచే పైజెప్పబడిన రెండువిధములగు అర్థంబులును, నామంబులును ఏర్పడును శరీరముల స్థాననియమములేక నానావిధములుగ వ్యాపించు క్రూరమైనవ్యాధి విసర్ప మను సామాన్యలక్షణము ఈవ్యాధికి పేరుచేతనే యేర్పడును.

విసర్పభేదములు

పృథక్త్రయస్త్రిభిశ్చైకః విసర్పాః ద్వన్ద్వజాస్త్రయః,
వాతికః పైత్తికశ్చైవ కఫజస్సాన్నిపాతికః. 2

చత్వార ఏతే వీసర్పాః వక్ష్యన్తే ద్వన్ద్వజాస్త్రయః,
ఆగ్నేయో వాతపిత్తాభ్యాం గ్రన్థ్యాఖ్యః కఫవాతజః. 3
యస్తు కర్దమకో ఘోరః సపిత్తకఫసమ్భవః,

వాతపిత్తకఫములు మూడును వేర్వేరుగను, అన్నియు కలిసియు రెండేసి దోషము లొకటిగ జేరియు విసర్పముల గల్గించును. అందు వాతమున గల్గినది వాతికము, పిత్తమున గల్గినది పైత్తికము, కఫమున గల్గినది శ్లైష్మికము, మూడుదోషములును సమములుగ ప్రకోపించి కల్గినది సాన్నిపాతికము, ద్వంద్వజములలో వాత పిత్తములచే గల్గినది ఆగ్నేయము, (అగ్నివిసర్పము) కఫవాతములచే జనించినది గ్రంథివిసర్పము, పిత్తకఫములచే జనించినది కర్దమము నని చెప్పబడును. ఇత్తెరంగున ఏకదోషజములు మూడును, సాన్నిపాతక మొకటియు, ద్వంద్వజములు మూడును గలిసి విసర్పము ఏడు విధముల నుండును.

బాహ్యకారణములైన శస్త్రప్రహారాదులచే జనించినది క్షతజవిసర్ప మొండు అధికముగ గానవచ్చును. అయినను ఈవిసర్పలక్షణమును జెప్పునపుడు భోజుడు "పిత్తవిసర్పవల్లిఙ్గం తస్య శేషం వినిర్దిశేత్" అనువాక్యముచేత పిత్తవిసర్పలక్షణములు కల్గియుండునని చెప్పెను. కావున క్షతజవిసర్పము పైత్తిక విసర్పాంతర్భూతమని తలంచి ప్రకృతగ్రంథకారుడు "విసర్పస్సప్తధా జ్ఞేయః" అని యేడువిధములుగ పరిగణనము జేసెను.

## విసర్పమున దోషదూష్యసంబంధము

రక్తం లసీకా త్వఙ్మాంసం దూష్యం దోషాస్త్రయో మలాః, 4
విసర్పాణాం సముత్పత్తౌ విజ్ఞేయాస్సప్తధాతవః,

రక్తము, లసీక (త్వగ్గతమైననీరు), చర్మము, మాంసము అను నీనాల్గు దూష్యములును, వాతపిత్తకఫము లను మూడుదోషములును జేరి విసర్పములు జనించుటకు కారణము లగును. (అనఁగా వాతపిత్తకఫములు మూడును రక్తలసీకాచర్మమాంసములను నట్టి నాల్గుధాతువుల నాశ్రయించి విసర్పముల గల్గించు నని భావము.)

ఇచ్చట దోషములు మూడునుగూడ శరీరమును ధరించుటకు (సమస్థితినున్నపుడు) కారణములగుటంజేసి ధాతుశబ్దముచే జెప్పబడునుగాన దోషములగూడ జేర్చి "సప్తధాతవః" అని చెప్పబడెను. ఆదోషములే వికుణములైనపుడు శరీరమును మలినముగ (రోగాదుల గల్గించి) చేయునుగాన, మలము లనియు జెప్పబడును; కావున "త్రయోమలాః" అని చెప్పబడెను.

మరియు విసర్పములసంప్రాప్తిని శ్రుతు లిట్లుపదేశించిరి:—"త్వఙ్మాంసశోణితగతాః కుపితాస్తు దోషాః సర్వాఙ్గసారిణమవాస్థితమాత్మలిఙ్గమ్, కుర్వన్తి యం విస్తృతమున్నతమాశు శోఫం తం సర్వతో విసరణాచ్చ విసర్పమాహుః" దోషములు ఆయా కారణములచేత ప్రకుపితములై త్వఙ్మాంసరక్తముల నాశ్రయించి, శరీరమున నొక్కచోటనైన నిల్కడలేక సకలావయవములయందును సంచరించు స్వభావముగల్గి వ్యాపించునదియు, నున్నతంబునై ఆయాదోషముల లక్షణములతో గూడిన వాపును అతిశీఘ్రముగ తటాలున గల్గించును. ఇది నల్గెడల వ్యాపించు స్వభావము గల్గుటంజేసి విసర్పమని చెప్పబడును.

మరియు విసర్పములకు బాహ్యాంతర్భేదముల నిట్లు చరకాచార్యులు చెప్పిరి:—"బహిశ్శ్రితః శ్రితశ్చాంతస్తథా చోభయసంశ్రితః, విసర్పో బలమే తేషాం జ్ఞేయం గురు యథోత్తరమ్" (చరక. చి. అ. ౨౧. శ్లో. ౨౩) ప్రకుపితము లగుదోషములు శరీరమునందలి బాహ్యస్థానము నాశ్రయించి విసర్పమును గల్గించినది బాహ్యావిసర్పము. శరీరమునందలి లోభాగము నాశ్రయించి ప్రకుపితములై విసర్పమును గల్గించిన నది అంతర్విసర్పము. బాహ్యాంతర్భాగముల రెండిటి నాశ్రయించి విసర్పమును గల్గించిన నది యుభయాశ్రితము. ఈమూటిలో బాహ్యమునకన్న నాంతరవిసర్పంబును, దానికన్న నుభయాశ్రితంబును బలవత్తరమైయుండును.

బాహ్యాది విసర్పలక్షణములు వాగ్భటునిచే నిట్లు చెప్పబడియె:—"విద్యాత్తత్రాంతరాశ్రయం, మర్మోపతాపాత్సంమోహాదయనానాం విఘట్టనాత్, తృష్ణాతియోగా ద్వేగానాం విషమం చ ప్రవర్తనాత్, ఆశు చాగ్నిబలభ్రంశాత్ అతో బాహ్యం విపర్యయమ్" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౪౫-౪౬) హృదయము మున్నగు మర్మములయందు సంతాపముగల్గుట, మూర్ఛజనించుట, చెవులు ముక్కులు మున్నగుస్థానములయందు విశేషముగ నదరుపాటుకల్గుట, అధికముగ దప్పికల్గుట, మలమూత్రవాతాదివేగము సరళముగ ప్రవర్తింపక విషమముగ వెడలుట, జఠరాగ్నియు శరీరబలంబును అతిశీఘ్రముగ నశించుట ఈలక్షణములు గానవచ్చినయెడ విసర్పము అంతరాశ్రయమని యెరుంగునది. పైజెప్పినలక్షణముల కన్న విపరీతములగు లక్షణములు కల్గిననాడు బాహ్యాశ్రయ మనియు నెరుంగునది. పైజెప్పిన లక్షణములన్నియు వ్యామిశ్రములుగ నున్ననా డుభయాశ్ర మని భావము.

మరియు చరకమున "బహిర్మార్గాశ్రితం సాధ్యం అసాధ్యముభయాశ్రితమ్, విసర్పం దారుణం విద్యాత్సుకృచ్ఛ్రం త్వన్తరాశ్రయమ్" (చరక. చి. అ. ౨౧. శ్లో. ౨౪.) అని చెప్పియుండుటంజేసి బాహ్యమార్గము నాశ్రయించిన విసర్పము సాధ్యమనియు, బాహ్యాంతర్భాగముల రెంటి నాశ్రయించినది యసాధ్య మనియు, అంతరాశ్రితము కృచ్ఛ్రసాధ్య మనియు నెరుంగునది.

### వాతికవిసర్పలక్షణము

తత్ర వాతాత్స వీసర్పో వాతజ్వరసమవ్యథః. 5
శోథస్ఫురణనిస్తోదభేదాయాసార్తిహర్షవాన్,

వాతప్రకోపమున జనించిన విసర్పమునందు వాతజ్వరమున గల్గు బాధలు కల్గును. మరియు నెచ్చట విసర్పము వ్యాపించునో అచ్చట వాపు కల్గును. ఆ వాపు అదరుచుండును. సూదుల బొడిచినట్లును పగులదీయునట్లును పోటును నొప్పియు కల్గును. ఆయాసము కల్గును. నొప్పి పుట్టును. అచ్చోట రోమములు నిక్కబొడిచియుండును.

### పైత్తికవిసర్పలక్షణములు

పిత్తాద్ద్రుతగతిః పిత్తజ్వరలింగోఽతిరోహితః. 6

పిత్తప్రకోపమున జనించిన విసర్పమున వాపు అతిశీఘ్రముగ నొకచోటినుండి యింకొకచోటికి బోవుచుండును. పిత్తజ్వరమునకు సమానములగు లక్షణములు కలిగి యుండును. మిక్కిలి యెఱ్ఱనై యుండును.

### కఫజవిసర్పలక్షణము

కఫాత్కండూయుతః స్నిగ్ధః కఫజ్వరసమానరుక్,

కఫప్రకోపమున గల్గిన విసర్పమున దురదకల్గి స్నిగ్ధముగ (నిగనిగలాడుచు) నుండును. కఫజ్వరమునకు సమానలక్షణములు కల్గును.

ఇచ్చట జ్వరప్రకరణమున జెప్పిన వాతాది జ్వరలక్షణములు ఆయావిసర్పమున గూడ జనించును. అవిగాక పైజెప్పబడిన విశేషలక్షణములుగూడ కల్గును అని యెఱుంగునది.

### సాన్నిపాతికవిసర్పలక్షణము

సన్నిపాతసముత్థశ్చ సర్వలింగసమన్వితః. 7

త్రిదోషములును సమములుగ ప్రకోపించి కల్గిన విసర్పమున వాతికాది విసర్పములకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములన్నియు కల్గియుండును.

### అగ్నివిసర్ప (వాతపిత్తజ) లక్షణము

వాతపిత్తాజ్జ్వరచ్ఛర్దిమూర్ఛాతీసారతృడ్భ్రమైః,
అస్థిభేదాగ్నిసదనతమకారోచకైర్యుతః. 8

కరోతి సర్వమఙ్గం చ దీప్తాంగారావకీర్ణవత్,
యం యం దేశం విసర్పశ్చ విసర్పతి భవేత్స సః. 9
శాంతాఙ్గారాసితో నీలో రక్తో వాశు చ చీయతే,
అగ్నిదగ్ధ ఇవ స్ఫోటైః శీఘ్రగత్వాద్ద్రుతం స చ. 10
మర్మానుసారీ వీసర్పః స్యాద్వాతోఽతిబల స్తతః,
వ్యథేతాఙ్గం హరేత్సంజ్ఞాం నిద్రాం చ శ్వాసమీరయేత్. 11
హిక్కాం చ స గతోఽవస్థాం ఈదృశం లభతే న నా,
క్వచిచ్ఛర్మారతిగ్రస్తో భూమిశయ్యాసనాదిషు. 12
చేష్టమాన స్తతః క్లిష్టో మనోదేహప్రమోహవాన్,
దుష్ప్రబోధోఽశ్నుతే నిద్రాం సోఽగ్ని వీసర్ప ఉచ్యతే. 13

వాతపిత్తజములు రెండును ప్రకోపించుటచే గల్గిన విసర్పమునందు జ్వరంబును, మూర్ఛయు, వాంతియు, అతిసారంబును, డప్పియు, భ్రమంబును, అస్థిభేదంబును (అస్థులలో నొప్పి), అగ్నిమాంద్యంబును కల్గును. చీకటి గ్రమ్మినట్లుండును. అరోచకము కల్గును. మరియు శరీరమునం దేయే స్థలమునకు విసర్పముపోవుచుండునో, ఆయాస్థలమున జ్వలించుచుండు నిప్పుకణముల జల్లినవిధముగ మంటబుట్టును. మరియు నాయా ప్రదేశములయందు నిప్పుచల్లారిన బొగ్గులవలె నల్లగనైనను, లేక రక్తవర్ణముగనైనను నిప్పున కాలిన బొబ్బలవంటి బొబ్బలు వ్యాపించియుండును. విసర్పము అతిశీఘ్రముగ వ్యాపించు స్వభావముకలదిగాన అతిత్వరితముగ హృదయాదిమర్మములను వ్యాపించును. దానంజేసి వాతము మిక్కిలి ప్రబలమై అవయవముల నన్నిటిని బాధించును. ప్రజ్ఞ దప్పించును. నిద్రను బోగొట్టును. శ్వాసమును బుట్టించును. ఎక్కిళ్లు కలుగును. ఈ విసర్పముచే బీడింపబడిన మనుజుడు ఇట్టి దురవస్థనుబొంది భూమియందు పరుండినను కూర్చుండినను నిలిచినను సుఖము లేశమైన లేక, పుడమిపయింబడి పొరలాడుచు మిక్కిలి కష్టమునొంది, మనస్సుయొక్కయు శరీరముయొక్కయు శ్రమముచే గలిగిన తీవ్రమైన నిద్రను బొంది బలవంతముగనైన మేల్కొనజాలకయుండును. (తుట్టతుదకు మరణరూపమైన గాఢనిదుర యని భావము)

### గ్రంథి (వాతకఫ) విసర్పలక్షణము

కఫేన రుద్ధః పవనః భిత్వా తం బహుధా కఫమ్,
రక్తం వా వృద్ధరక్తస్య త్వక్సిరాస్నాయుమాంసగమ్. 14

దూషయిత్వా తు దీర్ఘాణువృత్తస్థూలఖరాత్మనామ్,
గ్రన్థీనాం కురుతే మాలాం సరక్తాం తీవ్రరుగ్జ్వరామ్. 15
శ్వాసకాసాతిసారాస్యశోషహిక్కావమిభ్రమైః,
మోహవైవర్ణ్యమూర్ఛాఙ్గభఙ్గాగ్నిసదనైర్యుతామ్. 16
ఇత్యయం గ్రన్థివీసర్పః కఫమారుతకోపజః,

కఫము ప్రకోపమునొంది తొలుత వాయుసంచారమార్గము నడ్డగించును. దానం జేసి వాతము ప్రకుపితమై తన కడ్డమైన కఫమును పలువిధములుగ భేదించి, మిక్కిలి వృద్ధినొందిన రక్తముకల మనుజునియొక్క త్వక్కును సిరలను స్నాయువును మాంసమును ఆశ్రయించియుండు రక్తమును బొత్తుగ చెరిచి, దీర్ఘంబులును సన్నవియు స్థూలంబులును వర్తులంబులును కఠినంబులునగు గ్రంథులను మాలికవలె వరుసగ నుండునట్లు గలిగించును. అయ్యది రక్తవర్ణంబై తీవ్రమైన నొప్పియు జ్వరంబును కల్గియుండును. మరియు నీ వ్యాధియందు శ్వాసంబును, దగ్గును, అతిసారంబును కల్గును. నోరు తడిలేక యెండును. ఎక్కిళ్లు తీవ్రముగ వచ్చును. వాంతి యగును. ఒడలు తిరుగును. చిత్తభ్రమము గ్రమ్మును. శరీరవర్ణము మారియుండును. మూర్ఛ గ్రమ్మును. అవయవములు నొచ్చును. జఠరాగ్ని నశించును. ఇయ్యది కఫవాతముల ప్రకోపముచే గల్గిన గ్రంథి విసర్పం బని యెరుంగునది.

### కర్దమ (కఫపిత్త) విసర్పలక్షణము

కఫపిత్తాజ్జ్వరస్స్తమ్భో నిద్రాతన్ద్రా శిరోరుజా. 17
అఙ్గావసాదవిక్షేపౌ ప్రలేపారోచకభ్రమాః,
మూర్ఛాగ్నిహానిర్భేదోఽస్థ్నాం పిపాసేన్ద్రియగౌరవమ్. 18
ఆమోపవేశనం లేపః స్రోతసాం స చ సర్పతి,
ప్రాయేణామాశయం గృహ్ణన్ ఏకదేశం న చాతిరుక్. 19
పిటకైరవకీర్ణోఽతిపీతలోహితపాణ్డురైః,
స్నిగ్ధోఽసితో మేచకాభో మలినశ్శోథవాన్ గురుః. 20
గమ్భీరపాకః ప్రాజ్యోష్మా స్పృష్టః క్లిన్నోఽవదీర్యతే,
పఙ్కవచ్ఛీర్ణమాంసశ్చ స్పష్టస్నాయుసిరాగణః. 21
శవగన్ధీ చ వీసర్పః కర్దమాఖ్యముశన్తి తమ్,

కఫపిత్తములు రెండును ప్రకోపించుటచే గల్గిన విసర్పమునందు జ్వరము కల్గును. శరీరము స్తంభించును. నిద్రయు మైకంబును కల్గును. తల నొచ్చును. శరీరము కృశించును. కాలుసేతులను పలుమారు విదలించును. శరీరము జిగట కలిగియుండును. అరోచకంబును, భ్రమంబును, మూర్ఛయు కల్గును. జఠరాగ్ని నశించును. అస్థులలో పగుల దీయునట్లు నొప్పిపుట్టును. దప్పి యధికమగును. చక్షురాదీంద్రియములు బరువుగ నుండును. భుజింపబడిన యాహారము జీర్ణముకాకయే వెడలును. నాసికాదిస్రోతోరంధ్రములయందు జిగట కల్గియుండును. మరియు కఫ పిత్తములకు ఆమాశయము స్థానముకావున నాభికిని స్తనములకును నడుమ నుండు ఆమాశయమున నొకచోట తొలుత నీవిసర్పము వ్యాపించి పిదప శరీరమున వ్యాపించును. మిక్కిలి బాధలేక స్వల్పముగ నొప్పి కలిగియుండును. మిక్కిలి పీతవర్ణంబైనను రక్తవర్ణంబైనను పాండువర్ణంబైనను కల బొబ్బలచే నావరింపబడి యుండును. ఈవిసర్పము స్నిగ్ధంబును కృష్ణవర్ణంబును లేక నెమిలిమెడవలె చిత్రవర్ణంబును మలినంబును నగువాపు కలిగి, అయ్యది మిక్కిలి బరువుగనుండును. మిక్కిలి లోభాగమున పరిపక్వమగును. చేత తాకిన మిక్కిలి వేడిగ నుండును. మాంసము కుళ్లి బురదవలె మాంస మూడిపోవును. మాంస మూడుటచేత లోపలనుండు స్నాయువులును సిరలును స్పష్టముగ గానంబడుచుండును. పీనుగవంటి దుర్గంధముకల్గి యోరువశక్యము గాకుండును. (ఇచ్చట మాంసము కుళ్లుటచేత నొప్పి తీవ్రముగ నుండదు కావున "న చాతిరుక్" అని చెప్పబడినది. ఇయ్యది కఫపిత్తములచే గల్గిన కర్దమవిసర్ప మని చెప్పబడును.)

### క్షతజవిసర్పలక్షణము

బాహ్యహేతోః క్షతాత్క్రుద్ధః సరక్తం పిత్తమీరయన్. 22
విసర్పం మారుతః కుర్యాత్కులత్థసదృశై శ్చితమ్,
స్ఫోటైశ్శోథజ్వరరుజాదాహాఢ్యం శ్యావశోణితమ్. 23

శస్త్రప్రహారము మున్నగు బాహ్య (శరీర సంబంధములేక యాగంతుకములైన) కారణములచేత వాతము ప్రకుపితమై రక్తముతోగూడిన పిత్తమును ప్రకోపింపజేసి విసర్పమును గలిగించును. ఈ విసర్పమున ఉలవలవంటి యాకారముకల బొబ్బ లనేకములతోగూడి శోఫ జనించును. జ్వరంబును, మంటయు విశేషముగ నుండును. వాపు ఎఱ్ఱనిరంగైనను శ్యామవర్ణంబైనను కలిగియుండును. ఇయ్యది దెబ్బలచేనైన గాయములవలన కల్గును కావున క్షతజవిసర్ప మని చెప్పబడును.

రక్తపిత్తములు క్షతవిసర్పమున ప్రకోపించు నని క్షతజవిసర్పలక్షణము నిట్లు భోజుడు చెప్పెను:—"శస్త్రప్రహారైస్తైస్తైస్తు వ్యాళదన్తనఖైరపి, క్షతేనాప్యథవా భగ్నే బహుదోషస్య దేహినః. రక్తం పిత్తం చ కుపితం వ్రణమాశు ప్రపద్యతే, కురుతస్తే సమేతే తు వ్రణశోథం సుదారుణమ్. ఆచితం తనువిస్ఫోటైః కృష్ణైః పీతకసన్నిభైః, పిత్తవీసర్పవల్లింగం తస్య శేషం వినిర్దిశేత్." (భోజుడు) శస్త్రప్రహారాదులచే నైనను, పులి మొదలగు క్రూరములైన మృగములయొక్క కోరలు గోళ్లు మున్నగు వానిచేనైనను గాయములు కల్గినను, లేక యితరకారణములచే విరిగినను, రక్తము పిత్తంబును ప్రకోపించి, పైజెప్పిన కారణముచే గలిగిన వ్రణస్థానమున జేరి మిక్కిలి క్రూరమగువాపును కలిగించును; అయ్యది నల్లనిరంగును; పచ్చనిరంగును కల బొబ్బలచే వ్యాప్తమై శరీరమున వ్యాపించును. ఇయ్యది పిత్త విసర్పమున జెప్పిన లక్షణములు కల్గియుండును.

మరియు పై జెప్పిన వాతాది విసర్పము లన్నిటియందును ప్రారంభముననే తగిన చికిత్సచేయక యుపేక్షించినచో నవి కొంతకాలమునకు పక్వములై పగిలి వాతాదులచే గల్గు వ్రణములకు జెప్పిన ఆయాలక్షణములతోగూడి వ్రణరూపము నొందును. (వాత విసర్పవ్రణమున వాతిక వ్రణలక్షణములు కల్గును. ఇవ్విధముగనే తక్కినవి యూహించునది) ఈవిషయమును వాగ్భటాచార్యులు ఇట్లు చెప్పిరి:—"స్వదోషలింగైశ్చీయంతే సర్వే స్ఫోటైరుపేక్షితాః, తే పక్వభిన్నాః స్వం స్వం చ బిభ్రతి వ్రణలక్షణమ్" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౪౯.)

### విసర్పోపద్రవములు

జ్వరాతిసారౌ వమథుస్త్వఙ్మాంసదళనం క్లమః,
అరోచకాఽవిపాకౌ చ విసర్పాణాముపద్రవాః. 24

జ్వరము, అతిసారము, వమనము, చర్మమాంసములు పగిలి యూడుట, బడలిక, అరోచకము, అజీర్ణము ఇవియన్నియు విసర్పములయందు కల్గు నుపద్రవములు.

### విసర్పసాధ్యాసాధ్యనిర్ణయము

సిధ్యన్తి వాతకఫపిత్తకృతా విసర్పాః
సర్వాత్మకః క్షతకృతశ్చ న సిద్ధిమేతి,
పిత్తాత్మకోఽఞ్జనవపుశ్చ భవేదసాధ్యః
కృచ్ఛ్రాశ్చ మర్మసు భవన్తిహి సర్వ ఏవ. 25

పైజెప్పిన విసర్పములలో వాతపిత్త - కఫములచే వేరువేర జనించిన విసర్పములు మూడును సాధ్యములు. త్రిదోషసన్నిపాతమున జనించినదియు, క్షతముచే గల్గినవిసర్పంబును, పిత్తోల్బణముచే గల్గి కాటుకవలె నల్లనైయుండు అగ్నివిసర్పంబును నసాధ్యములు. మరియు పైజెప్పిన విసర్పములలో నెద్దియైన హృదయాది మర్మస్థానముల జనించెనేని అవి యన్నియు కృచ్ఛ్రసాధ్యము లగును.

అష్టాంగహృదయమున—"అసాధ్యా క్షతసరోత్థా సర్వే చాక్రాన్తమర్మకాః" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౬౭) అనియున్నది కావున మర్మస్థలముల జనించిన విసర్పములన్నియు నసాధ్యము లని తెలియుచున్నది. ప్రకృత గ్రంథమున కృచ్ఛ్రసాధ్యము లని చెప్పునది యవస్థాభేదము ననుసరించి యని యెరుంగునది. మరియు "శీర్ణస్నాయు సిరామాంసాః ప్రక్లిన్నాశ్శవగన్ధయః" (అ. హృ. ని. అ. ౧౩. శ్లో. ౬౭) అని వాగ్భటాచార్యుడు చెప్పియుండుటంజేసి యేవిసర్పంబైన సిరాస్నాయు మాంసము లూడి కుళ్ళి శవమునుబోలె దుర్గంధముగ నున్నచో నన్ని విసర్పములును అసాధ్యము లగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే

విసర్పనిదానం సమాప్తమ్.

# ౫౩. విస్ఫోటనిదానమ్

* విస్ఫోటమునకు విసర్పములబోలె దోషదూష్యములు సమములుగ నుండును కావున విసర్పనిదానమును జెప్పినపిదప విస్ఫోటనిదానమును జెప్పుట.—

విస్ఫోటము జనించుకారణములు, సంప్రాప్తియు

కట్వమ్లతీక్ష్ణోష్ణవిదాహిరూక్షక్షారైరజీర్ణాధ్యశనాతపైశ్చ,
తథర్తుదోషేణ విపర్యయేణ కుప్యన్తి దోషాః పవనాదయస్తు. 1
త్వచమాశ్రిత్య తే రక్తమాంసాస్థీని ప్రదూష్య చ,
ఘోరాన్కుర్వన్తి విస్ఫోటాన్ సర్వాన్ జ్వరపురస్సరాన్. 2

కారము పులుపు అను రసములు కలపదార్థముల సేవించినను, తీక్ష్ణంబులును ఉష్ణంబులును మంటబుట్టించునవియు జిడ్డు లేక రూక్షంబులును నగుపదార్థముల నైనను, క్షారములనైన భుజించినను, భుజించిన యాహారము జీర్ణముకాకమునుపు మరల భుజించినను, ఎండలో సంచరించినను, భుజించినతోడనే మరల భుజించినను, ఋతుధర్మంబులైన శీతోష్ణపరిస్థితులు దుష్టములుగ నుండినను, ఆయా ఋతుధర్మములైన శీతోష్ణాదులు మారియుండినను, వాతకఫపిత్తములు మిక్కిలి ప్రకోపమునొంది చర్మము నాశ్రయించి రక్తమును మాంసమును అస్థులను చెరిచి మిక్కిలి క్రూరములైన విస్ఫోటముల (బొబ్బలను) కల్గించును. ఆట్టి విస్ఫోటములు ముందు జ్వరముకల్గి పిదప పొడసూపును.

ఇచ్చట "జ్వరపురస్సరాన్" అని చెప్పుటచేత నీవ్యాధి తొలుత జ్వరము కల్గి పిమ్మట సంప్రాప్త మగునని తెలియుచున్నది. (విస్ఫోటముల కన్నిటికిని జ్వరము పూర్వరూప మని భావము.) భోజుడు విస్ఫోటసంప్రాప్తి నిట్లు చెప్పెను:—"యథారక్తం చ పిత్తం చ వాతేనానుగతం త్వచి, అగ్నిదగ్ధనిభాన్ స్ఫోటాన్ కురుతస్సర్వదేహగాన్. సజ్వరాన్ సపరీదాహాన్ విద్యాద్విస్ఫోటకాంస్తు తాన్" రక్తపిత్తములు రెండును ప్రకుపితములై వాతముతో గలిసి చర్మమునందు నిప్పున కాలినబొబ్బలవంటి బొబ్బల శరీరమునందెల్ల కల్గించును. అయ్యవి జ్వరముతోగూడి మిక్కిలి మంటకల్గి యుండును. ఈవ్యాధి విస్ఫోట మని చెప్పబడును.

ఈవాక్యమునుబట్టి వాతికాది విస్ఫోటములయందును రక్తపిత్తములు ప్రధానములై యుండు ననియు, బొబ్బలు నిప్పునకాలిన బొబ్బలబోలి మంటకల్గి యుండు ననియు తెలిసెడిని.

---

* విస్ఫోట మనగా కొన్నిప్రాంతములయందు "సర్పి" యని వాడబడునది గాని "ఆటలమ్మ" యని వాడబడు సాంక్రామికవ్యాధిగాని కావచ్చును.

### విస్ఫోటసామాన్యలక్షణము

అగ్నిదగ్ధనిభాస్స్ఫోటాః సజ్వరా రక్తపిత్తజాః.
క్వచిత్సర్వత్ర వా దేహే విస్ఫోటా ఇతి తే స్మృతాః. 3

శరీరమం దొకచోటనైనను, దేహమునందంతటనైనను రక్తపిత్తములచేత నిప్పున కాలినవిధముగ బొబ్బలు కల్గి జ్వరముతో కూడియుండునెడ నయ్యది విస్ఫోట మని చెప్పబడును.

### వాతికవిస్ఫోటలక్షణము

శిరోరుక్శూలభూయిష్ఠం జ్వరస్తృట్పర్వభేదనమ్,
సకృష్ణవర్ణతా చేతి వాతవిస్ఫోటలక్షణమ్. 4

వాతప్రకోపమున గల్గిన విస్ఫోటమునందు తలనొప్పియు, ప్రబలమైన శూలనొప్పియు, జ్వరంబును, దప్పియు కీళ్లనొప్పియు కల్గును. బొబ్బలు నల్లనిరంగు కల్గియుండును.

### పైత్తికవిస్ఫోట లక్షణము

జ్వరదాహరుజాస్రావపాకతృష్ణాభిరన్వితమ్,
పీతలోహితవర్ణం చ పిత్తవిస్ఫోటలక్షణమ్. 5

పిత్తప్రకోపమునగల్గిన విస్ఫోటమునందు జ్వరమువచ్చును. మంటయు నొప్పియు కల్గి నీరు స్రవించును. పుండగును. దప్పి యధికమగును. స్ఫోటములు పీతవర్ణంబులును, రక్తవర్ణంబులు నైయుండును.

### కఫజ విస్ఫోట లక్షణము

ఛర్ద్యరోచకజాడ్యాని కణ్డూకాఠిన్యపాణ్డుతాః,
అవేదనశ్చిరాత్పాకీ స విస్ఫోటః కఫాత్మకః. 6

కఫమున గల్గిన విస్ఫోటమునందు వాంతియు, అరోచకంబును, జడత్వంబును గల్గును. బొబ్బలు దురదకల్గి కఠినములై పాండువర్ణంబు కల్గియుండును. నొప్పిలేక చిరకాలమునకు పరిపక్వమగును.

### ద్వన్ద్వజ విస్ఫోట లక్షణము

వాతపిత్తకృతో యస్తు కురుతే తీవ్రవేదనామ్,
కణ్డూస్తైమిత్యగురుభిర్జానీయాత్కఫవాతికమ్. 7
కణ్డూర్దాహో జ్వరశ్ఛర్ది రేతైస్తు కఫపైత్తికః,

వాతపిత్తములరెండిటి సంసర్గమున గల్గినవిస్ఫోటము మిక్కిలి తీవ్రమైన బాధ కల్గియుండును. కఫవాతముల సంసర్గమున గల్గిన విస్ఫోటమునందు దురదయు, జడత్వం

బును, ఘోరంబును గలిగియుండును. కఫపిత్తముల సంసర్గమున గల్గిన విస్ఫోటమునందు దురదయు, మంటయు, జ్వరంబును కల్గియుండును. వాంతి యధికముగ నగును.

### సాన్నిపాతికవిస్ఫోటలక్షణము

మధ్యే నిమ్నోన్నతోఽన్తే చ కఠినోఽల్పప్రపాకవాన్. 8
దాహరాగతృషామోహచ్ఛర్దిమూర్ఛారుజాజ్వరాః,
ప్రలాపో వేపథుస్తన్ద్రా సోఽసాధ్యస్స్యాత్త్రిదోషజః. 9

సన్నిపాతమున జనించిన విస్ఫోటమున బొబ్బలు నడుమ పల్లమై కొనలయం దున్నతముగనై మిక్కిలి కఠినములై కొంచెముగ పాకము నొందును. విశేషముగ మంట కల్గి యెఱ్ఱనై యుండును. దప్పి కల్గును. చిత్తభ్రమము కల్గును. వాంతి యగును. మూర్ఛ గ్రమ్మును. నొప్పి తీవ్రమగును. జ్వరము వచ్చును. అసంబద్ధములుగ మాటలాడును. వణకుపుట్టును. కునికిపాటు కల్గును. ఇయ్యది మిక్కిలి యసాధ్యము.

### రక్తవిస్ఫోటలక్షణము

రక్తాః రక్తసముత్థానాః గుఞ్జావిద్రుమసన్నిభాః,
వేదితవ్యాస్తు రక్తేన పైత్తికేన చ హేతునా. 10
న తే సిద్ధిం సమాయాన్తి సిద్ధైర్యోగశతైరపి,

రక్తమున కల్గిన విస్ఫోటములు గురిగింజలను పవడములనుబోలె రక్తవర్ణంబులై యుండును. ఇయ్యది రక్తముచేతను పిత్తముచేతను జనించును. (రక్తమునకును పిత్తమునకును గుణములు సమానములుగ నుండును. కావున రక్తము ప్రధానమై పిత్తము అనుబంధముగ నుండు నని భావము.) ఈరక్తవిస్ఫోటములు పలువిరంగులైన సిద్ధౌషధముల నుపయోగించినను నిమ్మళించుట మిక్కిలి దుస్తరము.

### విస్ఫోటసాధ్యాసాధ్యనిర్ణయము

ఏకదోషోత్థితస్సాధ్యః, కృచ్ఛ్రసాధ్యో ద్విదోషజః,
సర్వదోషోత్థితో ఘోరస్త్వసాధ్యో భూర్యుపద్రవః. 11

పై జెప్పబడిన విస్ఫోటములలో నొక్కొకదోషముచే గల్గిన మూడును సాధ్యములు. ద్విదోషసంసర్గమున గల్గినవి మూడును కృచ్ఛ్రసాధ్యములు. త్రిదోషసన్నిపాతమున గల్గిన విస్ఫోటములు మిక్కిలి క్రూరములైయుండును; కాన నసాధ్యములగును. మరియు జ్వరము మున్నగు ననేకోపద్రవములు ఏవిస్ఫోటమున కల్గినను నవి యన్నియు నసాధ్యము లగును. (విసర్పమున జెప్పినజ్వరము అతిసారము మున్నగు నుపద్రవములు విస్ఫోటములకు గూడ నుపద్రవములుగ నెరుంగునది.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
విస్ఫోటనిదానం సమాప్తమ్.

# ౫౪. మసూరికానిదానమ్

*మసూరిక యను వ్యాధి విస్ఫోటభేదమై దానికి సమానకారణములచే గల్గునది కావున విస్ఫోటనిదానమును జెప్పిన పిదప మసూరికానిదానమును జెప్పుట:—

## మసూరికాకారణములు, సంప్రాప్తియు

కట్వమ్లలవణక్షారవిరుద్ధాధ్యశ (నేనతు) నాశనైః,
దుష్టనిష్పావశాకాద్యైః ప్రదుష్టపవనోదకైః. 1
క్రూరగ్రహేక్షణాచ్చాపి దేశే దోషాస్సముత్థితాః,
జనయన్తి శరీరేఽస్మిన్ దుష్టరక్తేన సఙ్గతాః,
మసూరాకృతిసంస్థానాః పిటికాస్స్యుర్మసూరికాః,

చేదు, పులుపు, ఉప్పు, కారము అను నీరసములుగల పదార్థముల విశేషముగ భుజించుటచేతను, పరస్పరవిరుద్ధములగు క్షీరమత్స్యాదుల నొకటిగజేర్చి భుజించుటచేతను, భుజించినతోడనే మరల భుజించినను, విషాదులచే దుష్టమైన పదార్థములు అనుములు, ఆకుకూరలు మున్నగువానిని భుజించుటచేతను, విషవృక్షములయొక్క పుష్పములు మున్నగువాని సంబంధమునంజేసి దుష్టమైన గాలిని సేవించుటచేతను, విషాదుల సంబంధమున దుష్టమగు నుదకము త్రాగుటచేతను, దేశమున క్రూరములగు శని అంగారకుడు మున్నగు గ్రహముల క్రూరదర్శనము కల్గుటచేతను, వాతపిత్తకఫములను దోషములు చెడి ప్రకుపితములై, పైకారణములచే చెడియున్న రక్తమున గలసి మనుజుల శరీరమునందు బటానులవంటి గుండ్రని యాకారంబును పరిమితియును కల బొబ్బలను కలిగించును. ఇవ్వ్యాధి మసూరము (బటాను)ల బోలియుండుటంజేసి మసూరిక యని చెప్పబడును.

మసూరికాసంప్రాప్తి తంత్రాంతరమున నిట్లు చెప్పబడెను—"పిత్తం శోణితసంసృష్టం యదా దూషయతి త్వచమ్ తదా కరోతి పిటికాః సర్వగాత్రేషు దేహినామ్. మసూరముద్గమాషాణాం తుల్యాః కోలోపమా అపి, మసూరికాస్తు తాః జ్ఞేయాః పిత్తరక్తాధికా బుధైః" పిత్తము ప్రకుపితమై రక్తముతో గలిసి చర్మమును చేరినపుడు మనుజుని సకలావయవములయందును బొబ్బల గలిగించును. అవ్వి బటానులనైనను పెసలనైనను మినుములనైనను పోలినపరిమితియు ఆకారంబు కలిగియుండును. ఒకప్పుడు రేగుపండంతేసి పరిమాణము కలిగియుండును. ఈబొబ్బలు మసూరిక లనబడును.

---

*మసూరిక యనగా మశూచికము లేక స్ఫోటకము అని వాడబడు సాంక్రామిక వ్యాధికావచ్చును, కాని సంపూర్ణముగ నదియే అని చెప్పవీలులేదు.

ఈవ్యాధి వాతాదులచే ప్రత్యేకముగ జనించినపుడు పిత్తరక్తములుమాత్రము మిక్కుటముగ నుండును.

## మసూరికాపూర్వరూపములు

తాసాం పూర్వం జ్వరః కండూః గాత్రభఙ్గోఽరతిర్భ్రమః. 3
త్వచి శోథస్స వైవర్ణ్యో నేత్రరాగశ్చ జాయతే,

మసూరికావ్యాధి కల్గుటకు మునుమున్న జ్వరంబును, శరీరమున జిలయు, కాలు సేతులు మున్నగు నంగములయందు నొప్పియు, వ్యాపారములయం దిచ్ఛలేకుండు టయు, భ్రమంబును కల్గును. చర్మము మామూలుగ నుండువర్ణము మారి వాచియుండును. కన్ను లెఱ్ఱగ నుండును. (ఇవియన్నియు మసూరికావ్యాధి జనించుటకు ముందు కల్గు పూర్వరూపములు.)

## వాతికమసూరికాలక్షణము

స్ఫోటాశ్శ్యామారుణా రూక్షాః తీవ్రవేదనయాన్వితాః. 4
కఠినాశ్చిరపాకాశ్చ భవన్త్యనిలసమ్భవాః,
సన్ధ్యస్థిపర్వణాం భేదః కాసః కమ్పోఽరతిః క్లమః. 5
శోషస్తాల్వోష్ఠజిహ్వానాం తృష్ణా చారుచిసంయుతా,

వాతప్రకోపమున జనించిన మసూరికయందు బొబ్బలు శ్యామవర్ణంబును, అరుణ వర్ణంబును కలిసి జిడ్డు లేక మిక్కిలి తీవ్రమైనబాధ కల్గియుండును. అయ్యవి కఠినములై చాలకాలమునకు పక్వము లగును. మరియు నీవ్యాధియందు అవయవసంధులయందును కీళ్లయందును నొప్పి పుట్టును. దగ్గు వచ్చును. వణకు పుట్టును. పనులయందు నిరుత్సాహముగ నుండును. బడలిక కల్గును. తాలువులును పెదవులును నాలుకయు తడిలేక యెండి తీవ్రమైన దప్పి కల్గును. నోటికి రుచి తెలియదు.

## పైత్తికమసూరికాలక్షణము

రక్తాః పీతాస్సితాః స్ఫోటాః సదాహాస్తీవ్రవేదనాః. 6
భవన్త్యచిరపాకాశ్చ పిత్తకోపసముద్భవాః,
విడ్భేదశ్చాఙ్గమర్దశ్చ దాహస్తృష్ణాఽరుచిస్తథా. 7
ముఖపాకోఽక్షిరాగశ్చ జ్వరస్తీవ్రస్సుదారుణః,

పిత్తప్రకోపమున గలిగిన విస్ఫోటమునందు బొబ్బలు రక్తవర్ణంబులైనను, పీతవర్ణంబులైనను, తెల్లనిరంగు కలవియైన నగును. మిక్కిలి తీవ్రమైనమంటయు నొప్పియు కల్గి శీఘ్రకాలమున పరిపక్వ మగును. మలము ఉండలై వెడలును. ఒడ

ఱెల్ల నొప్పి కల్గును. దప్పి కల్గును. తాపమును అరుచియు కల్గును. నోరు పుండగును. కన్ను లెఱ్ఱనగును. మిక్కిలి తీవ్రమై కష్టము గల్గించు జ్వరము వచ్చును.

రక్తజమసూరికాలక్షణము

రక్తజాయాం భవన్త్యేతాః వికారాః పిత్తలక్షణాః. 8

రక్తమున జనించిన మసూరికావ్యాధియందు పిత్తజవిస్ఫోటములకు గల్గు లక్షణము లన్నియు గల్గును.

కఫజమసూరికాలక్షణము

కఫప్రసేక స్తైమిత్యం శిరోరుగ్గాత్రగౌరవమ్,
హృల్లాసస్సారుచిర్నిద్రా తన్ద్రాలస్యసమన్వితాః. 9
శ్వేతాస్స్నిగ్ధాః భృశం స్థూలాః కండూరా మన్దవేదనాః,
మసూరికాః కఫోత్థాశ్చ చిరపాకాః ప్రకీర్తితాః. 10

కఫమున గలిగిన మసూరికయందు నోట కఫము వెడలును. శరీరము జడముగ నుండును. తలనొప్పి కల్గును. శరీరము బరువుగ నుండును. ఓకలింతలు వచ్చును. నోట అరోచకము కల్గును. నిదురపట్టును. కునికిపాటు కల్గును. పనులయం దుత్సాహము లేకుండును. బొబ్బలు శ్వేతవర్ణంబులును, స్నిగ్ధంబులును మిక్కిలి స్థూలంబులునై మిక్కిలి దురదయు స్వల్పమైననొప్పియు కల్గి చాలకాలమునకు పక్వము లగును.

సాన్నిపాతికమసూరికాలక్షణము

నీలాశ్చిపిటవిస్తీర్ణాః మధ్యే నిమ్నా మహారుజః,
చిరపాకాః *పూతిస్రావాః ప్రభూతాస్సర్వదోషజాః. 11

సన్నిపాతమున గలిగిన మసూరికలు నల్లనిరంగు కలిగి అటుకులవలె శరీరము పై చర్మమున వెడలుపుగ నణగి నడుమ పల్లమై మిక్కిలి తీవ్రమైన నొప్పికలిగియుండును. చిరకాలమునకు పక్వములై దుర్గంధముతో గూడిన నీరు స్రవించును. శరీరమున సందు లేక బొబ్బలు వ్యాపించును.

చర్మదలపిటికాలక్షణము

కణ్ఠరోధారుచి స్తమ్భప్రలాపారతిసంయుతాః,
దుశ్చికిత్స్యాః సముద్దిష్టాః పిటికాశ్చర్మసంజ్ఞితాః. 12

పైజెప్పిన సన్నిపాతమసూరికయందు కంఠము అడచియుండుట, అరోచకము, స్తంభము, ప్రలాపము (అసంబద్ధముగ మాటలాడుట), పనులయం దిచ్ఛలేకుండుట అను నీ లక్షణములు కల్గినచో మిక్కిలి దుస్సాధ్యములై యుండును. ఇవి చర్మపిటిక లనబడును.

* "పూతినీరాః" అని యుండినచో ఛందోభంగమురాదు. వీనినే చర్మదలము లని యందు రని మధుకోశమున గలదు.

### రోమాంతికలక్షణము

రోమకూపోన్నతిసమాః రాగిణ్యః కఫపిత్తజాః,
కాసారోచకసంయుక్తాః రోమాన్త్యో జ్వరపూర్వికాః. 13

శరీరమునంగల రోమకూపములయం దున్నతంబులును సమంబులునై యెఱ్ఱనైన బొబ్బలు జనించును. దగ్గును అరోచకంబును కలిగిన నవి రోమాంతికము లనబడును. ఇవి కఫపిత్తములచే గల్గును. ఇవి జనించుటకు మున్ను తీవ్రమైన జ్వరము కలుగును.

### త్వగ్గతమసూరికాలక్షణము

తోయబుద్బుదసఙ్కాశాః త్వగ్గతాస్తు మసూరికాః,
స్వల్పదోషాః ప్రజాయన్తే భిన్నాస్తోయం స్రవన్తి చ. 14

బొబ్బలు నీటిలోపుట్టు బుడగలవలె నున్నతములై వాతాదిదోషలక్షణములు స్వల్పముగ గల్గి పగిలినప్పుడు నీరుగారుచుండిన నవి (రసధాతువున) చర్మమున గల్గిన మసూరిక లని యెరుంగునది.

### రక్తగతమసూరికాలక్షణము

రక్తస్థా లోహితాకారాః శీఘ్రపాకా స్తనుత్వచః,
సాధ్యా నాత్యర్థదుష్టాశ్చ భిన్నారక్తం స్రవన్తి చ. 15

రక్తమున జనించిన మసూరికలు రక్తవర్ణములై యతిశీఘ్రముగ పక్వము లగును. ఆబొబ్బలపై చర్మము మిక్కిలి పలుచనై యుండును. వీనియందు దోషలక్షణములు స్వల్పముగ నుండును. అవి పక్వములై పగిలినయెడ రక్తము స్రవించును. (ఇవియు పై జెప్పిన త్వగ్గతంబులును సాధ్యములు.)

### మాంసగతమసూరికాలక్షణము

మాంసస్థాః కఠినాస్స్నిగ్ధాః చిరపాకా ఘనత్వచః,
గాత్రశూలతృషాకణ్డూజ్వరారతిసమన్వితాః. 16

మాంసము నాశ్రయించి జనించిన మసూరికలు మిక్కిలి కఠినంబులును స్నిగ్ధంబులును లావుగనుండు పైచర్మముకల్గినవియునై చాలకాలమునకు పక్వము లగును. వీని యందు ఒడలినొప్పులును, దప్పియు, జిలయు, జ్వరంబును, అరతియు విశేషముగ గల్గును ఇవి శరీరమునం దంతర్ధాతువగు మాంసమున జనించును. కావున కృచ్ఛ్రసాధ్యములు.

### మేదోగతమసూరికాలక్షణము

మేదోజా మణ్డలాకారాః మృదవః కిఞ్చిదున్నతాః,
ఘోరజ్వరపరీతాశ్చ స్థూలాస్స్నిగ్ధాస్సవేదనాః. 17

సమ్మోహారతిసన్తాపాః కశ్చిదాభ్యో వినిస్తరేత్,

మేదస్సున జనించిన మసూరికలు గుండ్రనియాకారముకల్గి మెత్తనై కొంచెము పొడవుగ నుండును. మిక్కిలి క్రూరమైన జ్వరము వ్యాపించును. బొబ్బలు స్థూలంబులును స్నిగ్ధంబులునై మిక్కిలి బాధ గల్గించును. శరీరమున మైకము గ్రమ్మును. ఏపని యందు నిచ్ఛ పొడమదు. తాప మధిక మగును. ఇయ్యది క్రూరమైనది గనుక దీనిచే నొకానొకడుమాత్రము విడువబడును. (అసాధ్యంబు గాన చంపు నని భావము.)

**మజ్జగతమసూరికాలక్షణము**

క్షుద్రా గాత్రసమా రూక్షాశ్చిపిటాః కిఞ్చిదున్నతాః. 18
మజ్జోత్థా భృశసమ్మోహాః వేదనాఽరతిసంయుతాః,
ఛిన్దన్తి మర్మధామాని ప్రాణానాశు హరన్తి చ. 19
భ్రమరేణేవ విద్ధాని కుర్వన్త్యస్థీని సర్వతః,

మజ్జ (ఎముకలలో నుండు క్రొవ్వు)ను ఆశ్రయించి జనించిన మసూరికలు చిన్నవిగను, శరీరమునకు సమములై కొంచె మున్నతముగను, అటుకులవలె నుండు బొబ్బలు కల్గును. మిక్కిలి మూర్ఛ కల్గును. అధికముగ వేదనయు అరతియు కల్గును. మర్మస్థానముల నన్నిటిని ఛేదించును. అస్థులను ఒండుపురుగులు (తుమ్మెదలు) కొయ్యలను తొలిచి రంధ్రముల జేయుభంగి తొలిచి రంధ్రముల నంతట గల్గించును. ఇయ్యది ప్రాణముల నతిశీఘ్రముగ హరించును. (అసాధ్యమనుట.)

ఇచ్చట మజ్జ కాధారమైన యస్థుల జెరచుటం జేసి యాలక్షణముచేతనే యస్థిగతమసూరికాలక్షణంబును గతార్థ మగు నని ప్రత్యేకలక్షణము చెప్పబడదయ్యె నని యెరుంగునది.

**శుక్రగతమసూరికాలక్షణము**

పక్వాభాః పిటికాః స్నిగ్ధాః సూక్ష్మాశ్చాత్యర్థవేదనాః. 20
స్తైమిత్యాఽరతిసమ్మోహదాహోన్మాదసమన్వితాః,
శుక్రజాయాం మసూర్యాన్తు లక్షణాని భవన్తి హి. 21
నిర్దిష్టం కేవలం చిహ్నం దృశ్యతే న తు జీవితమ్,
దోషమిశ్రాస్తు సప్తైతాః ద్రష్టవ్యా దోషలక్షణైః. 22

శుక్రము నాశ్రయించి కల్గిన మసూరికలు పక్వములైనవానిం బోలె మృదువుగ నుండును. స్నిగ్ధములును మిక్కిలి చిన్నవిగను మిక్కిలి తీవ్రమైన వేదన గల్గినవిగ నుండును. శరీరము జడముగ నుండును. అరతియు మూర్ఛయు మంటయు

ఉన్మాదంబును కల్గును. ఈ శుక్రజనిత మసూరికావ్యాధియందు పైజెప్పబడిన చిహ్నములు మాత్రము గానవచ్చును గాని జీవితముమాత్రము గానబడదు. (మిక్కిలి క్రూరమై ప్రాణముల గొంపోవు ననుట.) మరియు రసాదిధాతువుల నేడిటి నాశ్రయించి జనించిన మసూరికలకు పైజెప్పబడిన వేరువేరు లక్షణములతోఁగూడ, వాతాదులకు వేరువేరుగ జెప్పిన లక్షణములు కలిసియున్నపుడు, ఈ ధాతువు నాశ్రయించి యీ దోషమున జనించిన దని నిర్ణయించునది. (అనగా రసాదిధాతువులలో నొక్కొక్క ధాతువు నాశ్రయించి వాతాదులచేత వేరువేరుగ మసూరిక జనించును. అట్టియెడ ధాతుగత మసూరికలకు వేరువేర జెప్పిన లక్షణముల నెద్దాని లక్షణము గానసగునో అట్టి ధాతువు నాశ్రయించినదనియు, వాతాదిలక్షణములలో నేదాని లక్షణములు కల్గియుండునో అట్టి దోషముచే జనించిన దనియు నిర్ణయింప నగు నని భావము.)

### సుఖసాధ్య మసూరికలు

త్వగ్గతాః రక్తజాశ్చైవ పిత్తజాశ్శ్లేష్మజాస్తథా,
శ్లేష్మపిత్తకృతాశ్చైవ సుఖసాధ్యా మసూరికాః. 23

ధాతువులలో రస - రక్తధాతువుల నాశ్రయించిన మసూరికలును, దోషములలో పిత్త - కఫ - కఫపిత్త సంసర్గములచే జనించు మసూరికలు మూడును జేరి యీ యైదును సుఖసాధ్యములు.

### కృచ్ఛ్రసాధ్య మసూరికలు

వాతజా వాతపిత్తోత్థాః శ్లేష్మవాతకృతాశ్చ యాః,
కృచ్ఛ్రసాధ్యా మతాస్తస్మాద్యత్నాదేతా ఉపాచరేత్. 24

వాతముచే గల్గిన మసూరికయు, వాతపిత్తములచే గల్గిన మసూరికయు, కఫవాత సంసర్గమున గల్గిన మసూరికయు మిక్కిలి కృచ్ఛ్రసాధ్యము లగును. కావున వీనిని మిక్కిలి ప్రయత్నముతో చికిత్సచేయనగును.

### అసాధ్య మసూరికలు

అసాధ్యాస్సన్నిపాతోత్థాస్తాసాం వక్ష్యామి లక్షణమ్,
ప్రవాళసదృశాః కాశ్చిత్కాశ్చిజ్జమ్బూఫలోపమాః. 25
లోహజాలసమాః కాశ్చిదతసీఫలసన్నిభాః,
ఆసాం బహువిధా వర్ణాః జాయన్తే దోషభేదతః. 26

పైజెప్పిన మసూరికలలో సన్నిపాతమున జనించినవి మిక్కిలి యసాధ్యములు. సాన్నిపాతిక మసూరికలు కొన్ని పగడములఁబోలిన రంగు కల్గియుండును. కొన్ని నేరేడుపండువలె నల్లనైయుండును. ఇనుపయుండలంబోలి కొన్ని నల్లగ నుండును. నల్ల

అవిసికాయలరంగు కల్గి కొన్ని యుండును. త్రిదోషముల సంబంధము కల్గియుండుటం బట్టి సన్నిపాతముచే గల్గిన మసూరికలయందు పై జెప్పినరీతిగ నానావిధ వర్ణములు కల్గియుండును.

## మసూరికాసామాన్యముగ నసాధ్యలక్షణములు

కాసో హిక్కా ప్రమోహశ్చ జ్వర స్తీవ్రస్సుదారుణః,
ప్రలాపశ్చారతిర్మూర్ఛా తృష్ణా దాహోఽతిఘూర్ణతా. 27
ముఖేన ప్రస్రవేద్రక్తం తథా ఘ్రాణేన చక్షుషా,
కణ్ఠే ఘుర్ఘురకం కృత్వా శ్వసిత్యర్థవేదనమ్. 28
మసూరికాభిభూతస్య యస్యైతాని భిషగ్వరైః,
లక్షణాని చ దృశ్యన్తే న దద్యాత్తత్ర భేషజమ్. 29

దగ్గు, ఎక్కిళ్లు, మైకము, మిక్కిలి తీవ్రమైన జ్వరము, భ్రమతమాటల మాట్లాడుట, మూర్ఛగ్రమ్ముట, ఈ లోకవ్యవహారములయం దిచ్ఛ లేకుండుట, తీవ్రమైన దప్పి, పడకపొసగక పొరలాడుట, నోటిసుండియు ముక్కులనుండియు కన్నుల నుండియు రక్తముగారుట, కుత్తుకయందు గుఱ్ఱుగుఱ్ఱనుచు ధ్వనికల్గి శ్వాసము విడుచుట, బాధలు మిక్కిలి తీవ్రములుగ నుండుట, ఈ లక్షణములు మసూరికా వ్యాధికల్గినవానికి కనబడినయెడ వానిని చక్కగ వైద్యవరుడు గుర్తించి యౌషధము నియ్యక మానుట మంచిది. (అసాధ్యము కావున చికిత్స చేయజన దనుట.)

## కొన్ని యసాధ్యలక్షణములు

మసూరికాభిభూతో యో భృశం ఘ్రాణేన నిశ్వసేత్,
స భృశం త్యజతి ప్రాణాన్ తృషార్తో వాయుదూషితః. 30

మసూరికలచే బీడింపబడిన మనుజుడు మిక్కిలి తీవ్రముగ ముక్కునసే శ్వాసము విడుచుచున్నను, డప్పిచే బీడితుడై వాతవ్యాధికూడ కల్గియున్నను వాడు బ్రతుకజాలడు.

## ఉపద్రవములచే నసాధ్యత్వము

మసూరికాన్తే శోథస్స్యాత్కూర్పరే మణిబన్ధకే,
తథాంసఫలకే చాపి దుశ్చికిత్స్యస్సుదారుణః. 31

మసూరిక జనించి శాంతపడు సమయమున మోచేలియందును, చేతి మణికట్టు నందును, మూపులపైనను మిక్కిలి క్రూరమైనవాపు కల్గినయెడ మిక్కిలి యసాధ్య మగును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
మసూరికానిదానం సమాప్తమ్.

# ౫౫. క్షుద్రరోగనిదానమ్

మహారోగములు, క్షుద్రరోగములు నని రోగములు రెండు తెరగులు. అందు ప్రబలములగు లక్షణంబులును కారణంబులును కల్గి, ప్రబలములైన చికిత్సలచే నివర్తింప దగినవి మహారోగములు. స్వల్పకారణములచే జనించి, స్వల్పలక్షణములు కల్గి, స్వల్ప చికిత్సలచే నివర్తింపకల్గినవి క్షుద్రరోగములు. అందు మహారోగములలోజేరిన జ్వరాది రోగముల నిదానమును జెప్పినపిదప క్షుద్రరోగములైన అజగల్లికా మున్నగువాని నిదానమును వివరించుట.

### అజగల్లికా లక్షణము

స్నిగ్ధాస్సవర్ణా గ్రథితాః నీరుజా ముద్గసన్నిభాః,
కఫవాతోత్థితా జ్ఞేయా బాలానామజభల్లకాః. 1

స్నిగ్ధంబులును, శరీరమునకు సమానములగు వర్ణంబులు కల్గినవియు, నొప్పియు పోటును మున్నగు బాధలేనివియునై పెసలవంటి యాకారంబును పరిమాణంబును కల బొబ్బలు దట్టముగ జనించినచో నజగల్లిక యని చెప్పబడును. ఇయ్యది కఫవాతముల చేత పసిబాలురకు జనించును.

(ఈ క్షుద్రరోగ ప్రకరణమునం దగ్నిరోహిణి వల్మీకము మున్నగు సాన్నిపాతికములైన క్రూరవ్యాధులను జెప్పుట యసంగతముగ దోచును; కాని యీ ప్రకరణమున ప్రాయికముగ క్షుద్రరోగములే జెప్పబడుటంజేసి ఛత్రిన్యాయము ననుసరించి చెప్పబడినది. కావున కొన్ని క్రూరవ్యాధులున్నను దోషము లేదని యెరుంగునది.)

### యవప్రఖ్యాలక్షణము

యవాకారా సుకఠినా గ్రథితా మాంససంశ్రితా,
పిటికా కఫవాతాభ్యాం యవప్రఖ్యేతి సోచ్యతే. 2

యవలవంటి (అనగా మధ్య నెత్తుగను కొనలయందు పల్లముగనుండు) యాకారముకల్గి కఠినంబైన బొబ్బ మాంసము నాశ్రయించి జనించును. ఇది మాంసమున గ్రంథిరూపముగ కల్గును. దీనిని యవప్రఖ్య యని చెప్పెదరు.

### అంత్రాలజీ లక్షణము

ఘనామవక్త్రాం పిటికామున్నతాం పరిమండలామ్,
అన్త్రాలజీమల్పపూయాం తాం విద్యాత్కఫవాతజామ్. 3

మిక్కిలి కఠినంబును, వక్రముగానిదియు, ఉన్నతంబును, మండలాకారముగ గుండ్రనైనదియు నగు బొబ్బ కఫవాతములచేత కల్గును. ఇయ్యది అంత్రాలజీ యని చెప్పనగును దీనియందు చీము కొంచెముగ నుండును.

ఈ యంత్రాలజీ లక్షణమును భోజు డిట్లు చెప్పెను:—"శ్లేష్మానిలాశ్రితా స్నాయుం పిటికాం పరిమండలామ్, దుష్టౌ జనయతోఽవక్త్రా మల్పపూయామకండురామ్, అమోదుమ్బరసఙ్కాశాం విద్యాదన్త్రాలజీం తు తామ్" కఫవాతములు రెండును శరీరమునందలి స్నాయువులజేరి దుష్టములై మండలాకారమగు పిటికను కలిగించును. ఇయ్యది కొంచెము చీముకలిగి వక్రముగాక దురదలేక అత్తికాయవలె నుండును. దీనిని అంత్రాలజీ యని చెప్పెదరు.

### వివృతా లక్షణము

వివృతాస్యాం మహాదాహాం పక్వోదుమ్బరసన్నిభామ్,
వివృతామితి తాం విద్యాత్పిత్తోత్థాం పరిమండలామ్. 4

విశాలమైన రంధ్రముకల్గి అధికమైన మంటతోగూడి పండిన మేడిపండువంటి యాకారముకల్గి గుండ్రనై యుండునది వివృత యన బరగును. ఇయ్యది పిత్తమున బొడమును. దీనిరంధ్రము మిక్కిలి విశాలముగ నుండును. కావున నిది వివృత యని యన్వర్థముగ జెప్పబడును.

### కచ్ఛపికాలక్షణము

గ్రథితాః పఞ్చ వా షడ్వా దారుణాః కచ్ఛపోపమాః,
కఫానిలాభ్యాం పిటికా జ్ఞేయా కచ్ఛపికా బుధైః. 5

కఫవాత సంసర్గముచేత మిక్కిలి కఠినంబులును, మిక్కిలి దారుణంబులును, తాబేటి వీపువలె నడుమ నున్నతంబులైన యైదారు బొబ్బలు కల్గును. ఇయ్యది తాబేటినిబోలె నున్నతమై యుండుటంజేసి కచ్ఛపిక యని చెప్పబడును.

### వల్మీకలక్షణము

గ్రీవాంసకక్షాకరపాదదేశే సన్ధౌ గలే వా త్రిభిరేవ దోషైః,
గ్రన్థిస్స వల్మీకవదక్రియాణాం జాతః క్రమేణైవ గతః ప్రవృద్ధిమ్. 6

ముఖై రనేకై స్స్రుతితోదవద్భిః విసర్పవత్సర్పతి చోన్నతాంగైః,
వల్మీకమాహుర్భిషజో వికారం నిష్ప్రత్యనీకం చిరజం విశేషాత్. 7

కంఠము, మూపులు, చంకలు, చేతులు, పాదములు, కీళ్లు, కుత్తుక అను నీయవయవములం దెచ్చటనైన చెదలు పుట్టవలె నిడుపుగ ప్రోవులుపోసినట్లు గ్రంథు లనేకములు జనించును. ఇయ్యవి చికిత్సజేయనిచో నానాట వృద్ధినొంది అనేక ముఖములతోగూడి అన్నిద్వారములనుండి స్రవించును. పోటు మున్నగు నానావిధబాధలుకల్గి విసర్పమునుబోలె శరీరమునందెల్ల వ్యాపించును. ఇది సన్నిపాతమున జనించును; కావున స్వభావముచేతనే యసాధ్యము. చాలకాలము చికిత్సలేక గడచినచో మిక్కిలి యసాధ్యమై చికిత్సకే అవకాశము లేకుండును. ఇయ్యది చెదలుపుట్టవలె నుండుటంజేసి వల్మీక మని చెప్పనగును.

## ఇంద్రవిద్ధ లక్షణము

పద్మకర్ణికవన్మధ్యే పిటికాభి స్సమాచితామ్,
ఇన్ద్రవిద్ధాం తు తాం విద్యాద్వాతపిత్తోత్థితాం భిషక్. 8

తామరపువ్వుకు నడుమ గుండ్రముగనుండు కర్ణికవలె మధ్యభాగమునం దనేకములగు సన్ననిబొబ్బలు కల్గి పెద్దబొబ్బ యొకటి వాతపిత్తముల సంసర్గముచే గల్గును. ఇయ్యది యింద్రవిద్ధ మని చెప్పబడును.

## గర్దభికాలక్షణము

మణ్డలం వృత్తముత్సన్నం సరక్తం పిటికాచితమ్,
రుజాకరీం గర్దభికాం తాం విద్యాద్వాతపిత్తజామ్. 9

మండలాకారంబును, ఉన్నతంబును, రక్తవర్ణంబును, సన్ననిబొబ్బలచే వ్యాప్తంబును నగు గొప్ప బొబ్బలేచి మిక్కిలి తీవ్రమైన బాధకల్గియున్నచో నయ్యది గర్దభిక యని చెప్పబడును. ఇది వాతపిత్త సంసర్గమున గల్గును.

## పాషాణ గర్దభ లక్షణము

వాతశ్లేష్మసముద్భూతః శ్వయథుర్హనుసన్ధిజః,
స్థిరో మన్దరుజస్స్నిగ్ధో జ్ఞేయః పాషాణగర్దభః. 10

వాతకఫములు కలిసి ప్రకుపితములై తాలువుల సంధియందు కఠినమైన వాపును కల్గించును. ఇయ్యది స్నిగ్ధంబై స్వల్పమైన బాధ కల్గియుండును. ఇది రాయివలె మిక్కిలి కఠినమైయుండుటవలన పాషాణగర్దభ మని చెప్పబడును.

### పనసికాలక్షణము

కర్ణస్యాభ్యన్తరే జాతాం పిటికాముగ్రవేదనామ్,
స్థిరాం పనసికాం తాం తు విద్యాద్వాతకఫోత్థితామ్. 11

వాతకఫములు రెండును కలిసి చెవులలోపల మిక్కిలి తీవ్రమైన వేదనతోగూడి కఠినముగ నుండు బొబ్బను కల్గించును. ఇది పనసిక యని చెప్పనగును.

దీనిలక్షణమును భోజు డిట్లు చెప్పెను:—"కఫవాతౌ ప్రకుపితౌ మాంస మాశ్రిత్య కర్ణయోః, సమన్తతః పరిస్తబ్ధాం కురుతః పిటికాం స్థిరామ్. విషమాం దాహ సంయుక్తాం విద్యాత్పనసికాం తు తామ్" కఫవాతములు రెండునుం గలిసి ప్రకుపిత ములై మాంసము నాశ్రయించి చెవులయందు కఠినంబును స్తంభించినదియు విషమంబును నగు బొబ్బను కల్గించును. ఇయ్యది పనసిక యని చెప్పనగును. ఈవాక్యమునుబట్టి యీ వ్యాధి మాంసమున జనించు నని తెలియుచున్నది. ఇది చెవి లోభాగమున జనించును. (పనసకాయముండ్లవలె నుండును) గాన నిది పనసిక యని చెప్పబడును.

### జాలగర్దభ లక్షణము

విసర్పవత్సర్పతి యశ్శోథస్తనురపాకవాన్,
దాహజ్వరకరః పిత్తాత్ స జ్ఞేయో జాలగర్దభః. 12

శరీరమునం దెచ్చటనైన నొకస్థలమున సూక్ష్మమగు వాపుకల్గి పక్వముగాక విసర్ప మువలె నిచ్చవచ్చినట్లు శరీరమునందంతట సంచరించుచు మంటయు జ్వరంబును కల్గించు నేని నయ్యది జాలగర్దభ మని చెప్పనగును. ఇది పిత్తప్రకోపమున కల్గును.

ఈజాలగర్దభ మను వ్యాధిలక్షణమును భోజు డిట్లు విస్తరించెను:—"పిత్తోత్క టాస్త్రయో దోషాః జనయన్తి త్వగాశ్రితాః, శ్యావం రక్తం తనుం శోథమపాకం బహు వేదనమ్. విసర్పిణం సదాహం చ తృష్ణాజ్వరసమన్వితమ్, విసర్ప మాహుస్తం వ్యాధిం అపరే జాలగర్దభమ్" పిత్త మధికముగనుండి మూడుదోషములును సమకాలమున ప్రకో పమునొంది చర్మము నాశ్రయించి శ్యామవర్ణంబును, లేక రక్తవర్ణంబును సూక్ష్మంబు నైన శోఫను కల్గించును. ఇయ్యది పాకమునొందక నానావిధబాధలతోగూడి శరీరము నందెల్ల వ్యాపించును. తీవ్రమైన మంటకల్గును. దప్పియు జ్వరంబును తీవ్రముగ నుండును. ఈవ్యాధిని విసర్ప మనియు, జాలగర్దభమనియు చెప్పెదరు. ఈవాక్యము నను సరించి ప్రకృతమూలమున పిత్తశబ్దముచేత పిత్తోత్కటంబగు త్రిదోషసన్నిపాతముచే జనించు నని యర్థము చేయు టుచితము. పిత్తోత్కటంబగు నీవ్యాధియందు పాకము

### పనసికాలక్షణము

కర్ణస్యాభ్యన్తరే జాతాం పిటికాముగ్రవేదనామ్,
స్థిరాం పనసికాం తాం తు విద్యాద్వాతకఫోత్థితామ్. 11

వాతకఫములు రెండును కలిసి చెవులలోపల మిక్కిలి తీవ్రమైన వేదనతోగూడి కఠినముగ నుండు బొబ్బను కల్గించును. ఇది పనసిక యని చెప్పనగును.

దీనిలక్షణమును భోజు డిట్లు చెప్పెను:—"కఫవాతౌ ప్రకుపితౌ మాంసమాశ్రిత్య కర్ణయోః, సమన్తతః పరిస్తబ్ధాం కురుతః పిటికాం స్థిరామ్. విషమాం దాహసంయుక్తాం విద్యాత్పనసికాం తు తామ్" కఫవాతములు రెండునుం గలిసి ప్రకుపితములై మాంసము నాశ్రయించి చెవులయందు కఠినంబును స్తంభించినదియు విషమంబును నగు బొబ్బను కల్గించును. ఇయ్యది పనసిక యని చెప్పనగును. ఈవాక్యమునుబట్టి యీ వ్యాధి మాంసమున జనించు నని తెలియుచున్నది. ఇది చెవి లోభాగమున జనించును. (పనసకాయముండ్లవలె నుండును) గాన నిది పనసిక యని చెప్పబడును.

### జాలగర్దభ లక్షణము

విసర్పవత్సర్పతి యశ్శోథస్తనురపాకవాన్,
దాహజ్వరకరః పిత్తాత్ సజ్ఞేయో జాలగర్దభః. 12

శరీరమునం దెచ్చటనైన నొకస్థలమున సూక్ష్మమగు వాపుకల్గి పక్వముగాక విసర్పమువలె నిచ్చవచ్చినట్లు శరీరమునందంతట సంచరించుచు మంటయు జ్వరంబును కల్గించుచుండ నయ్యది జాలగర్దభ మని చెప్పనగును. ఇది పిత్తప్రకోపమున కల్గును.

ఈజాలగర్దభ మను వ్యాధిలక్షణమును భోజు డిట్లు విస్తరించెను:—"పిత్తోత్కటాస్త్రయో దోషాః జనయన్తి త్వగాశ్రితాః, శ్యావం రక్తం తనుం శోథమపాకం బహువేదనమ్. విసర్పిణం సదాహం చ తృష్ణాజ్వరసమన్వితమ్, విసర్ప మాహుస్తం వ్యాధిం అపరే జాలగర్దభమ్" పిత్త మధికముగనుండి మూడుదోషములును సమకాలమున ప్రకోపమునొంది చర్మము నాశ్రయించి శ్యామవర్ణంబును, లేక రక్తవర్ణంబును సూక్ష్మంబునైన శోఫను కల్గించును. ఇయ్యది పాకమునొందక నానావిధబాధలతోగూడి శరీరమునందెల్ల వ్యాపించును. తీవ్రమైన మంటకల్గును. దప్పియు జ్వరంబును తీవ్రముగ నుండును. ఈవ్యాధిని విసర్ప మనియుం, జాలగర్దభమనియు జెప్పెదరు. ఈవాక్యము ననుసరించి ప్రకృతమూలమున పిత్తశబ్దముచేత పిత్తోత్కటంబగు త్రిదోషసన్నిపాతముచే జనించు నని యర్థము చేయు టుచితము. పిత్తోత్కటంబగు నీవ్యాధియందు పాకము

మాంసమును పగులదీయును. బొబ్బల లోప్రక్క విశేషముగ మంటకల్గును. తీవ్రమైన జ్వరము వచ్చును. ఇయ్యది త్రిదోషమున జనించును కావున మిక్కిలి తీవ్రమై యేడుదినములకు పిమ్మటనైనను, పదిదినములకు పిమ్మటనైనను, పదునైదుదినములకు పిమ్మటనైనను మనుజుని తప్పక చంపును. ఇది అగ్నిరోహిణి యను క్రూరమైన వ్యాధి.

ఈవ్యాధి సన్నిపాతమున జనించును. అందు వాత-పిత్త-కఫములు మూడును ప్రకుపితములై యున్నను, వానిలో వాతం బుత్కటముగ నున్నయెడ ఏడుదినముల కాలము చికిత్సచేయక యుపేక్షించినచో పిమ్మట మిక్కిలి యసాధ్యంబై మరణము నొందించును. పిత్తం బధికముగ నుండునెడ పదిదినములకు లోపల చికిత్సజేయనినాడు పిమ్మట క్రూరమై చంపును. కఫం బధికముగ నుండునపుడు పదునైదుదినములలోపల చికిత్సజేయనిచో పిమ్మట చంపును. అని కాలనియమము నెరుంగునది. మొత్తమున నీవ్యాధి యసాధ్య మని భావము.

చరకమునందు—"సన్తి హ్యేవంవిధా రోగాస్సాధ్యా దారుణసమ్మతాః, యే హన్యురనుపక్రాన్తాః మిథ్యారమ్భేణ వా పునః" (చరక. సూ. అ. ౧౮) అని చెప్పి యుండుటంజేసి యీయగ్నిరోహిణి మున్నగు క్రూరవ్యాధులుకూడ తగినకాలమున యుక్తియుక్తమయిన చికిత్సజేసినచో సాధ్యములగు ననియు, సకాలమున దగిన చికిత్స చేయకున్నను, లేక యననుగుణమైన చికిత్సచేసినను చంపుననియు దెలిసెడిని.

మరియు—"పిత్తరక్తోత్కటా దోషాః ప్రదీప్తాఙ్గారసన్నిభాన్, కక్షభాగేషు కుర్వన్తి తీవ్రదాహరుజాజ్వరాన్. మాంసావదారణాన్ స్ఫోటాన్ యే హన్యురనుపక్రమాత్, పక్షాద్దశాహాదర్వాగ్వా సా జ్ఞేయా వహ్నిరోహిణీ" అని తంత్రాంతరమున నగ్నిరోహిణీలక్షణము చెప్పబడినది. ఈవాక్యమునుబట్టి యగ్నిరోహిణీవ్యాధియందు సన్నిపాతము కారణమైనను రక్తపిత్తములు మాత్ర ముత్కటములుగ నుండు ననియు, చికిత్సజేయనినాడు పైజెప్పినరీతిగ ఏడుదినములు, పదిదినములు, పదునైదుదినములు అను కాలనియమప్రకారము చంపుననియు స్ఫుటముగ దెలియుచున్నది.

అష్టాంగహృదయమున—"పక్షాచ్ఛాహాత్సప్తరాత్రాద్వా పక్షాద్వా హన్తి జీవితమ్" (అ. హృ. ఉత్తర. అ. ౩౧. శ్లో. ౧౫) అని కాలనియమము చెప్పబడినది. ఐదుదినములకు పిమ్మటనైనను, ఏడురాత్రులకు పిదపనైనను, పదునైదునాళ్ళకు పిమ్మటనైనను అగ్నిరోహిణి చంపు నని భావము. కాలనియమములోని మతభేదము కల్గుటకు వ్యాధియొక్క బలాబలములనుబట్టి యేర్పడునని యూహింపదగియున్నది.

### చిప్యలక్షణము

నఖమాంసమధిష్ఠాయ వాయుః పిత్తం చ దేహినామ్,
కుర్వాతే దాహపాకౌ చ తం వ్యాధిం చిప్యమాదిశేత్. 18

వాతపిత్తములు రెండును ప్రకుపితములై గోళ్ల యందలి మాంసమున జేరి గోరుకు చేరినట్లు బొబ్బను కల్గించును. ఇది మిక్కిలి మంటకల్గి పుండగును. దీనిని చిప్య మని చెప్పెదరు. (ఇదియే గోరుచుట్టు అని లోకమున వాడబడును.)

### కునఖలక్షణము

తదేవాల్పతరైర్దోషైః పురుషం కునఖం వదేత్,

పైజెప్పిన వ్యాధియే స్వల్పదోషములతో గూడియున్నయెడ కునఖ మని చెప్ప నగును. ఈవ్యాధి కల మనుజుడు కునఖి యనబడును. (ఇదియే పుప్పిగో రనబడును.)

### అనుశయాలక్షణము

గమ్భీరామల్ప*సమ్భారాం సవర్ణాముపరిస్థితామ్,
పాదస్యానుశయాం తాం తు విద్యాదంతః ప్రపాకినీమ్. 19

మీగాలి పైభాగమున చర్మమునకు సమానవర్ణము కలిగినవాపు లోలంత బుట్టి మిక్కిలి లోతున పక్వమైయుండునది అనుశయ యనబడును.

### విదారికాలక్షణము

విదారీకన్దవద్వృత్తా కక్షావంక్షణసన్ధిషు,
విదారికా భవేద్రక్తా సర్వజా సర్వలక్షణా. 20

చంకల సంధులయందైనను గజ్జల సంధులయందైనను నేలగుమ్ముడు గడ్డవలె వర్తులంబై రక్తవర్ణమై కఠినమయిన గడ్డకల్గును. ఇది త్రిదోషముచే బుట్టి త్రిదోష లక్షణములు కల్గియుండును. దీనిని విదారి యని చెప్పెదరు.

అష్టాఙ్గహృదయమున "విదారీకందకఠినా విదారీ కక్షవఙ్క్షణే" (అ. హృ. ఉత్త. అ. ౩౧. శ్లో. ౧౬) అనియున్నది గాన నేలగుమ్ముడుదుంపవలె గుండ్రనై కఠినమైన గడ్డ చంకలయందైనను గజ్జలయందైనను కల్గిన నయ్యది విదారి యనబడునని యెరుంగునది.

"రక్తా సర్వజా సర్వలక్షణా" అనుచోట అకారమును ప్రశ్లేషముచేసి, "అసర్వజా, అసర్వలక్షణా" అని పదముల విభజించి యీవిదారిక యనునది సన్నిపాతం బొక్కటిదక్క తక్కిన ఏకదోష ద్విదోష భేదములచేత నారువిధము

---

* "సంరమ్భా" మని మధుకోశకార సమ్మతమైన పాఠము. స్వల్పమైన శోఫ కల్గునది యని యర్థము వ్రాయబడెను.

లగు నని యర్థము చెప్పెదరు. ఇది క్షుద్రరోగలక్షణమునకు విరుద్ధము కావున సమంజసము కాజాలదు. వాతాది దోషముల ప్రత్యేక సంబంధములచే నవాంతర భేదము లనేకములు లేక, ఒక్క దోషముచేతనో లేక సంసర్గముచేతనో లేక సన్నిపాతముచేతనో జనించి యొక్కటే భేదము కల్గినది క్షుద్రరోగము. అట్లుండ ఏకదోష ద్విదోషములచే విదారికావ్యాధికి ఆరుభేదముల జెప్పినపుడు క్షుద్రరోగ లక్షణము పైజెప్పినరీతిగ దీని కెట్లు పొసగును ? పొసగదు. కావున నట్టియెడ దీనిని క్షుద్రరోగములలో బఠించుటయే పొరబాటగును.

మరియు చరకమున దీనిలక్షణ మిట్లు చెప్పబడినది:—"జ్వరాన్వితా వక్షణకక్షసన్ధా వర్తిర్నిరార్తిః కఠినా మతాయూ, విదారికా సా కఫమారుతాభ్యాం" (చరక. చి. హ. ౧౨) ఈశ్లోకముచేత విదారికయందు జ్వరము కల్గునని చెప్పబడినది. ఊష్మా పిత్తాదృతే నాస్తిజ్వరో నాస్త్యూష్మణా వినా." (అ. హృ. చి. అ. ౧) అను వాగ్భట వచనముచేత జ్వరమున పిత్తసంబంధమైన వేడియుండును ; కావున జ్వరముకల్గి నపుడు పిత్తము అవశ్యముగ నుండితీరును. "కఫమారుతాభ్యాం" అనుటచేత కఫవాతముల సంబంధము చెప్పబడినది ; కావున జ్వరకారణంబగు పిత్తంబును కఫవాతములును (మూడును) కలిసి యీ విదారికా వ్యాధిని కల్గించు నని చరకాచార్యాశయము. పైవిమర్శనముచేత చరకమతమున నీవ్యాధి సన్నిపాత జనితం బొక్కటే యని స్ఫుటమగుచున్నది. కావున ప్రకృత మూలమునకు విశేషార్థ కల్పనముచేసి విదారికావ్యాధికి ఆరుభేదముల గల్పించుట యనార్షము.

మరియు మాధవకరున కీషడ్విధ్యము సమ్మతమైనచో "షడ్విధా ద్వ్యేక దోషజా" అనియే స్పష్టముగ నేల చెప్పియుండకూడదు. కావున మూలకారునకు షడ్విధము అనభిమతము.

### శర్కరా-శర్కరార్బుదలక్షణము

ప్రాప్య మాంససిరాస్నాయూః శ్లేష్మా మేద స్తథానిలః,
గ్రన్థిం కరోత్యసౌ భిన్నో మధుసర్పిర్వసానిభమ్. 21
స్రవత్యాస్రావమనిలః తత్ర వృద్ధిం గతః పునః,
మాంసం సంశోష్య గ్రథితాం శర్కరాం జనయే త్తతః. 22
దుర్గన్ధి క్లిన్నమత్యర్థం నానావర్ణం తతస్సిరాః,
స్రవన్తి రక్తం సహసా తం విద్యాచ్ఛర్కరార్బుదమ్. 23

కఫంబును వాతంబును ప్రకుపితములై మాంసమును సిరలను స్నాయువులను మేదస్సునుజేరి గ్రంథిని కల్గించును. ఇయ్యది పక్వమై పగిలి తేనెను నేతిని వసను

బోలిన పూయాదుల స్రవించును. పిదప వాతము ధాతుక్షయముం జేసి ప్రబలముగ ప్రకోపమునొంది మాంసమును తన గుణముచే శోషింపజేసి గ్రంథిరూపమైన శర్కరను కల్గించును. దానినుండి దుర్గంధము కలిగి కుళ్లి నానావర్ణములు కల రక్తము సిరలనుండి స్రవించును. దానిని శర్కరార్బుద మని వచించెదరు.

ఇచ్చట కఠినమై గ్రంథిరూపమయినది శర్కర యనియు, అదియే పగిలి లోపల నుండి సిరలనుండి దుర్గంధాదిలక్షణములు కల రక్తము స్రవించునెడ శర్కరార్బుదం బనియు జెప్పబడును; కావున వ్యాధిభేదము లేదు. ఈయర్థమునే భోజు డిట్లు చెప్పెను:—"తమేవ భిన్నం దుర్గన్ధం ఘృతమేదోనిభం సిరాః, స్రవన్తి స్రావమనిశం తదా స్యాచ్ఛర్కరార్బుదమ్."

### పాదదారీలక్షణము

పరిక్రమణశీలస్య వాయురత్యర్థరూక్షయోః,
పాదయోః కురుతే దారీం పాదదారీం తమాదిశేత్. 24

ఎప్పటికి నెడతెగక సంచరించు స్వభావముకల మనుజునకు పాదములు మిక్కిలి రూక్షంబులై యుండును. అట్టిపాదములయందు వాతము ప్రకుపితమై యరకాళ్ల యందు చీలికలుగ పగులదీయును; దీనిని పాదదారి యని చెప్పెదరు.

క్షుద్రకుష్ఠములలోజేరిన విపాదికా కుష్ఠమున పాదములయందు బొబ్బలు లేచి పగులును. ఈవ్యాధియందు బొబ్బలులేకయే పగులును. కావున నీరెండిటికిని, పరస్పర భేదము నెరుంగునది.

### కదరలక్షణము

శర్కరోన్మథితే పాదే క్షతే వా కణ్టకాదిభిః,
గ్రన్థిః కోలవదుత్సన్నో జాయతే కదరం హి తత్. 25

గులకరాయి(సూదిమొనలు గలది) మున్నగునవి యరకాలున గ్రుచ్చుకొని యభి ఘాతముకల్గి మాంసము నలిగినను, ముండ్లు మొదలగునవి గ్రుచ్చుకొని గాయమైనను, అచ్చోట రేగుకాయవలె నుండు గ్రంథి కఠినముగ జనించును. ఇయ్యది కదర మని చెప్పబడును.

ఇయ్యది హస్తములయందును జనించు నని దీనిలక్షణమును భోజు డిట్లు చెప్పెను.—"హస్తయోః పాదయోశ్చాపి గమ్భీరానుగతం ఖరమ్, మాంసకీలం జనయతః కుపితౌ కఫమారుతౌ. సశల్యమివ తం దేశం మన్యతే తేన పీడితః, శర్కరా కదరం కేచి న్మన్యన్తే వాతకణ్టకమ్" కఫవాతములు రెండును ప్రకుపితములై మిక్కిలి

లోతున జేరి కఠినమైన మాంసపుమేకు (గట్టిగానుండుగడ్డ)ను అరకాళ్లయందైనను అరచేతులయందైనను కల్గించును. అయ్యది గ్రంథివలె కఠినమై చేతనెత్తినపుడెల్ల లోపల నాగపడిగెముల్లు నాటినవిధముగ నామాంస కీలముచే కలుకు కలుక్కుమను బాధ కల్గియుండును. దీనిని శర్కరాకదర మనియు, వాతకంటక మనియు చెప్పెదరు.

ఈవాక్యముచేత నీవ్యాధి వాతకఫ సంసర్గమున గల్గుననియు, అరకాళ్లయందు మాత్రము కాక అరచేతులయందును కల్గు ననియు, దీనికి వాతకంటక మను నామాంతర మును కల దనియు తెలియుచున్నది. (దీనినే 'ఆణి' అను పేరుచే లోకమున వాడెదరు).

## అలసకలక్షణము

క్లిన్నాఙ్గుల్యన్తరౌ పాదౌ కణ్డూదాహరుజాన్వితౌ,
దుష్టకర్దమసంస్పర్శాదలసం తం విభావయేత్. 26

దుష్టమైన బురదయందు సంచరించుటవలన కాలివ్రేళ్ల నడుమ బురదచే చెమ్మ కలిగి మిక్కిలి తీవ్రమైన దురద కల్గును. దానంజేసి చేత రుద్దినచో పుండై మంటయు నొప్పియు కలుగును. ఇది అలస మని చెప్పనగును. (ఇది తరుచుగ వర్షకాలమునందు చెమ్మలో విశేషముగ తిరుగువారికి కల్గును. దీనినె అడుసుపుండ్లనియు ఒరుపుడుపుండ్లనియు లోకమున జెప్పెదరు.)

ఇది కఫరక్తములచే గల్గును. అందు కఫముచేత దురదయు రక్తముచేత మంటయు నొప్పియు గల్గు నని యెరుంగునది.

## ఇంద్రలుప్తలక్షణము

రోమకూపానుగం పిత్తం వాతేన సహ మూర్ఛితమ్,
ప్రచ్యావయతి రోమాణి తతశ్శ్లేష్మా సశోణితః. 27
రుణద్ధి రోమకూపాంస్తు తతోఽన్యేషామసమ్భవః,
తదిన్ద్రలుప్తం ఖాలిత్యం రుహ్యేతి చ విభావ్యతే. 28

పిత్తము వాతముతోగూడ జేరి ప్రకోపమునొంది రోమముల మొదళ్లయందలి సన్నని రంధ్రములంజేరి యారోమముల నూడించును. పిమ్మట కఫము రక్తముతోగూడి యారోమరంధ్రముల నడ్డగించును. దానంజేసి మరల నూడినవెంద్రుకల రంధ్రముల యందు వెంద్రుకలు మొలువవు. ఈవ్యాధిని యింద్రలుప్తమనియు, ఖాలిత్య మనియు, రుహ్యా యనియు చెప్పెదరు.

గడ్డమునందలి వెంద్రుకలును మీసములును పైజెప్పినవిధముగ రాలినచో నింద్రలుప్తం బనియు, తలవెంద్రుక లూడినయెడ ఖాలిత్య మనియు, శరీరమున తక్కిన

చోట్ల నుండు వెండ్రుక లూడిన రుహ్యా యనియు పైజెప్పిన మూడునామములకును విషయభేదమును కొందరు చెప్పుదురు. ఈవిభాగమునకు ప్రమాణము గానమింజేసి యనార్ష మని తోచుచున్నది.

మరియు నిచ్చట నీనిర్ణయము నెరుంగునది—పైజెప్పిన యింద్రలుప్త మనునది ప్రాయికముగ పురుషులకుమాత్రము కల్గునుగాని స్త్రీలకు కలుగదు. ఏల యన:—పురుషులు సామాన్యముగ వ్యాయామాదుల జేయుటచేతను, కేశసంస్కారము మున్నగు కృత్యముల విశేషముగ జేసికొనకుండుటచేతను వాతపిత్తములు ప్రకుపితములై పైజెప్పిన రీతిగ రోమకూపముల నాశ్రయించి, వానిపట్టు సడలించి వాని నూడించును. స్త్రీలు సామాన్యముగ స్వభావముచేతనే మిక్కిలి సుకుమారులై యుండుటచేతను, దుష్టమైన రక్తము ప్రతిమాసమునందును బైటవెడలుచుండుటచేతను, దేహపరిశ్రమము జేయకుండుటచేతను వాతపిత్తములు ప్రకోపమునొందవు. కావున వారికి పైజెప్పిన యింద్రలుప్తము కలుగదు. (ఇట్టి కారణములచేత వారి తలవెండ్రుక లూడవు.) ఒకవేళ స్వల్పముగ నుండినను ప్రతిమాసమున దుష్టరక్తము వెడలుటంజేసి కఫరక్తములు రోమరంధ్రముల నడ్డగింపవు; కావున మరల మొలచుచుండును. ఈవివరణము తంత్రాంతరమున విదేహుం డిట్లు నుడివెను—"అత్యన్తసుకుమారాఙ్గ్యో రజో దుష్టం స్రవన్తిచ, అవ్యాయామరతా యస్మాత్తస్మాన్న ఖలతి స్త్రియాః." *

**దారుణకలక్షణము**

దారుణా కణ్డురా రూక్షా కేశభూమిః ప్రపాట్యతే,
కఫమారుతకోపేన విద్యాద్దారుణకం తు తమ్. 29

తలయందు చర్మము మిక్కిలి రూక్షంబును కఠినంబునై తీవ్రమైన దురదతో గూడి పగులును. ఈవ్యాధి దారుణక మని చెప్పందగును. ఇయ్యది కఫవాతముల ప్రకోపమున జనించును.

మరియు తంత్రాంతరమునం దీదారుణకలక్షణము వేరువిధముగ జెప్పబడినది—"యదత్ర పటలాభాసం సరుజస్కం శిరస్త్వచి, పరుషం జాయతే జన్తోస్తస్య రూపం విశేషతః. తోదైస్సమన్వితం వాతాత్ సకణ్డూగౌరవం కఫాత్, సపిపాసం సదాహార్తి రాగం పిత్తాస్రజం తథా" (విదేహుడు) శిరస్సున చర్మము పైన మిక్కిలి బాధతోగూడి సూదులతో బొడిచినవిధముగ పోటుకల్గి పరుసంబైన పటలము జనించును. దీనియందు వాతప్రకోపమున పోట్లును, కఫము ప్రకోపించుటచేత దురదయు, గురుత్వంబును, పిత్త

* స్త్రీలకుగూడ నీవ్యాధికలుగుట ప్రత్యక్షసిద్ధముగాన విదేహవచనము ప్రాయికమని విజయరక్షితుని సిద్ధాన్తమైయున్నది.

రక్తములచేత దప్పియు నొప్పియు రక్తవర్ణంబులును గల్గును. ఈవాక్యమున కేకవాక్యత గ పైమూలవాక్యమునకు కఫవాతములతోగూడ పిత్తరక్తము లనుబంధములుగ నుండు నని యర్థము జేయుట సమంజసము.

### అరూంషికాలక్షణము

అరూంషి బహువక్త్రాణి బహుక్లేదీని మూర్ధ్ని తు,
కఫాసృక్క్రిమికోపేన నృణాం విద్యాదరూంషికామ్. 30

కఫంబును, రక్తంబును, క్రిములును ప్రకోపమునొంది శిరస్సున నానాముఖములై యనేకవిధములుగ చీము నెత్తురు మున్నగువానిని స్రవించుచుండు కురుపులను కల్గించును. ఇయ్యది యరూంషికా వ్యాధి యని చెప్పబడును.

### పలితలక్షణము

క్రోధశోకశ్రమకృత శరీరోష్మా శిరోగతః,
పిత్తం చ కేశాన్పచతి పలితం తేన జాయతే. 31

శరీరమునందలి యూష్మంబును పిత్తంబును క్రోధముచేతను దుఃఖముచేతను శ్రమముచేతను శిరస్సునజేరి తలవెండ్రుకలను పచింపజేయును. దానంజేసి వెండ్రుకలు తెల్లపడును. ఇది పలితరోగ మని చెప్పబడును.

ఇచ్చట నీవిమర్శనము గమనించునది.—దర్శనం పక్తిరుష్మా చ క్షుత్తృష్ణా దేహమార్దవమ్, ప్రభాప్రసాదౌ మేధా చ పిత్తకర్మాఽవికారజమ్" (చరక. సూ. అ. ౧౮) అనునట్టి చరకవాక్యముచేత కన్నులకు చూచుశక్తియు, శరీరమునందలి వేడియు, ఆకలి దప్పులును, శరీరమృదుత్వంబును, కాంతియు, ప్రసన్నతయు, బుద్ధియు ఇవియన్నియు వికృతముగాక సమస్థితినుండు పిత్తముచే గల్గునని తెలియుచున్నది. ఇచ్చట "పక్తిరుష్మాచ" అను పదముచేతను, "నవినాచపిత్తంపాకః" అను సుశ్రుతవాక్యముచేతను పాకమునొందించుశక్తి పిత్తమున గల దని దృఢముగ దెలియుచున్నది. సామాన్యముగ పాకక్రియాశక్తి యగ్నియందు కలదు; ఇదికాక వేడిని కల్గించుగుణము అగ్నియందు స్థిరముగ నున్నది. అట్టివేడి పిత్తమున కల్గునని పైవాక్యమున జెప్పబడినది కావున అగ్నికిని పిత్తమునకును గుణములు సమానము లగుటచే నీరెండిటికిని భేదము కానరాదు. ఇంతియేకాక—జాఠరానలము మందీభూతమగునపుడు పిత్తవర్ధకంబులైన ద్రవ్యముల సేవించినచో నగ్ని దీపించును. అగ్ని మిక్కిలి తీవ్రంబైయున్నపుడు పిత్తమును శమింపజేయు శీతమధురాదిద్రవ్యములసేవించినచో అగ్ని శాంతినొందును; కావున పిత్తమునకును అగ్నికిని భేదము లే దని యనుభవమునగూడ స్ఫుటముగ దెలియుచున్నది.

"సమదోషస్సమాగ్నిశ్చ" (సు. సూ. అ. ౧౫) "సమప్రకోపా దోషాణాం సర్వేషామగ్నిసంశ్రయా" ఇవి మున్నగు వాక్యములయందు వాతపిత్తకఫరూపము లగు దోషములకు సమస్థితియు, ప్రకోపంబును అగ్నిననుసరించియుండునని చెప్పుటచేత వాత పిత్తకఫములకన్న నగ్ని వేరుగనుండునని తెలియుచున్నది. కావున కొన్ని వాక్యములచే నభేదత్వంబును, కొన్నివచనములచే పార్థక్యంబును చెప్పుటచేత పైవాక్యములకు తేజ స్తిమిరములబోలె పరస్పరవిరోధము కల్గును; కావున నసంగతము; అన్నచో పరిహారం బిట్లు తెలియునది.—

పిత్తమున ద్రవరూపంబును తేజోరూపంబును కలదు. అందు తేజోరూపము అగ్ని. అయ్యది యాహారాదిపదార్థముల పచించును. వేడిని కల్గించును. ఇదియే జాఠ రాగ్ని యనంబరగు. ఇదియే ప్రాణాధారంబైయుండును. ఇయ్యది త్రిదోషముల సామ్య ప్రకోపములకు కారణము. ఈవిషయమును భోజు డిట్లు చెప్పెను.—"దృథ ముష్ణో చితం హ్యేతత్ పిత్తోష్మా పచతీతి యత్, మూర్ఛితో రసవీర్యాభ్యాం సమానవ్యాన సంహితః" "తస్మాత్తేజోమయం పిత్తం పిత్తోష్మా యస్స పక్తిమాన్, స కాయాగ్నిస్స కాయోష్మా స పక్తా స చ జీవనః" పైవివరణముచేత పిత్తమునం దొకభాగము అగ్ని యని నిర్ణయ మేర్పడినది. అట్టి యగ్నిభాగముతోగూడిన పిత్తములేక పాకముగాదను నభిప్రాయముననే "న వినా చ పిత్తం పాకః" అను సుశ్రుతాది వాక్యములచే జెప్పుట సంగతము.

మరియు కఫము వృద్ధినొందించుపదార్థముల సేవించునపుడు శుక్రము వృద్ధి నొంది, కఫహారంబుల సేవించుతరి శుక్రము క్షీణమగుభంగి, పిత్తవర్ధకంబులగు పదార్థ ముల సేవించుటచేత పిత్తమునందలి యగ్నిభాగము వృద్ధినొందుననియు, పిత్తశామకముల సేవించుటచేత నగ్నిదీప్తి శమించుననియు నెరుంగునది. ఈవిమర్శనముచేత పిత్తమునందలి యగ్నిభాగమును వేరుగజేసి "సమదోషస్సమాగ్నిశ్చ" ఇది మున్నగువాక్యముల రెండుగ జెప్పబడినది. కాన పై జెప్పినపక్షములకు పారస్పరికవిరోధము గానరాదు.

ఈపక్షము నవలంబించియే ప్రకృతగ్రంథమున "శరీరోష్మా శిరోగతః, పిత్తం చ కేశాన్ పచతి" అని పిత్తమును ఊష్మమును వేరుపరచి చెప్పియున్నది. పిత్తము తన యందలి యూష్మభాగముతోగూడి పచింపజేసి వెండ్రుకల నెరయునట్లు చేయునని భావము. ఇచ్చట 'పిత్తంచ' అను చకారముచేత వాతకఫములు గూడ గ్రహింపబడును. కావున క్రోధముచే పిత్తము ప్రకుపితమై శరీరమునందలి (తన భాగమైన)యుష్ణముతో గూడి, శోకభయములచే జనించిన వాతముచే ప్రేరితంబై శిరంబునజేరి కఫముతోగలసి పలితమును కల్గించునని నిష్కృష్టార్థము. ఈవిషయము చరకమున నిట్లు చెప్పబడినది.—

"తేజోఽనిలాద్యైస్సహ కేశభూమిం దగ్ధ్వా తు కుర్యాత్ఖలతిం నరస్య, కిఞ్చిత్తు దగ్ధ్వా పలితాని కుర్యాత్ హరిత్ప్రభత్వం చ శిరోరుహాణామ్" (చరక. చి. అ. ౨) శరీరమునందలి యుష్ణము వాతాదిదోషములు మూటితోఁగూడి వెండ్రుకల ప్రదేశమును దహింపజేసి వెండ్రుకల నూడ్చి ఖలతిత్వము (బట్టతల)ను కల్గించును. ఆదోషములతోఁ గూడిన యుష్ణమే కొంచెముగ సోకిననాడు వెండ్రుకలు నెఱయును. లేక పింగళవర్ణము కల్గియుండును అని యర్థము.

## యువానపిటికాలక్షణము

శాల్మలీకణ్టకప్రఖ్యాః కఫమారుతరక్తజాః,
యువానపిటికా యూనాం విజ్ఞేయా ముఖదూషికాః. 32

మంచి యౌవనముననుండు స్త్రీలకైనను పురుషులకైనను ముఖముపైన బూరుగ ముండ్లవలె కఠినములైన పొక్కులు కల్గును. ఇవి కఫము వాతము రక్తము ఈమూడును ప్రకోపించుటచే గల్గును. దీనిని యువానపిటిక యని వచించెదరు.

ఇవి ప్రాయికముగ స్త్రీపురుషులకు యౌవన మంకురించుకాలమున కల్గి యౌవనముతోఁగూడ వృద్ధినొందును. లోకమున దీనిని మటిమ లని వాడెదరు.

## పద్మినీకంటకలక్షణము

కణ్టకై రాచితం వృత్తం మణ్డలం పాణ్డుకణ్డురమ్,
పద్మినీకంటకప్రఖ్యైః తదాఖ్యం కఫవాతజమ్. 33

తామరకాడలపైనుండు సన్నని ముండ్లవలె కఠినములగు సన్నని మాంసపు ముండ్లతోఁగూడి జిలకల్గి తెల్లనైన పొడలు (శరీరమున నెచ్చటనైనను విశేషించి తుంట్ల యందును) కల్గును. దీనిని పద్మినీకంటక మని చెప్పెదరు. ఇయ్యది కఫవాతములవలన కల్గును.

## జతుమణిలక్షణము

సమముత్సన్న మరుజం మణ్డలం కఫరక్తజమ్,
సహజం లక్ష్మ చైతేషాం లక్ష్యో జతుమణిస్తు సః. 34

శరీరమున నునుపై కొంచెముగ నున్నతమై బాధలేకుండుమచ్చ పుట్టుకతోఁనే కూడ పుట్టును. ఇది లక్ష్మ యనియు, లక్ష్య మనియు, జతుమణి యనియు చెప్పబడును. (ఇదియే పుట్టుమచ్చ) ఇది కఫరక్తములచే గల్గును.

వాగ్భటాచార్యుడు 'జతుమణిస్సహజో లోహితస్తు సః' అని చెప్పెను; కావున నీ మచ్చ యెఱ్ఱనిరంగు కల్గియుండును. ఈమచ్చలయందు ఏవిధమైన బాధయునుండదు. దీని లక్షణములబట్టి మానవుల శుభాశుభములు తెలియు నని సాముద్రికవేత్తలు వచించెదరు.

చరకమున దీనిలక్షణము జెప్పనపుడు వేరువిధముగ జెప్పుచు లక్ష్మకును దీనికిని వైలక్షణ్యము నిట్లు చెప్పెను. కృష్ణస్స్నిగ్ధో జతుమణిర్జ్ఞేయో వాతోత్తరైస్త్రిభిః, అరుజం త్వపరైర్వ్యక్తం లక్ష్మేత్యాహుర్భిషగ్వరాః.” నల్లనిరంగుకల్గి నునుపైన మచ్చ జతుమణి యని చెప్పనగును. ఇయ్యది వాతముత్కటముగ గల మూడు దోషములచే గల్గును. అదియే దానికి సమానములగు కొన్నిమచ్చలతో గూడియుండునెడ లక్ష్మ యని చెప్పబడును. ఈ రెంటియందును బాధ యించుకేనియు గల్గదు.

## మషకలక్షణము

ఆవేదనం స్థిరం చైవ యస్మిన్ గాత్రే ప్రదృశ్యతే,
మాషవత్కృష్ణముత్సన్నం అనిలాన్మషకం తు తత్. 35

వాతము ప్రకుపితమై యెట్టిబాధయు లేక కొంచెముగ కఠినంబును, ఉన్నతంబును, మినుములబోలె నల్లనిరంగు కల్గినదియు నగు మచ్చ జనించిన, నయ్యది మషక మనబడును. (మినుపగింజంత యున్నతమును దానివలె నలుపును గల్గినమచ్చ మాష సాదృశ్యమునుబట్టి మషక మనబడు నని యెరుంగునది.)

మషకలక్షణమును చరకాచార్యు లిట్లు చెప్పిరి:—“వాతేరితే త్వచి యదా దూష్యేతే కఫమేదసీ శ్లక్ష్ణం మృదు సవర్ణం చ కురుతే మషకం వదేత్.” వాతము ప్రకుపితమై కఫముతో గూడి మేదస్సును జెరిచి నునుపుకల్గి మృదులమై మినుములతో సమానమైన వర్ణముగల మచ్చను చర్మముపై గల్గించును. ఇయ్యది మషక మని చెప్పబడు నని యర్థము. ఈ వాక్యముచేత వాతకఫములు మేదస్సును చెరిచి యీ వ్యాధికి కల్గించు నని తెలిసెడిని.

మరియు మషక మనునదియే మిక్కిలి యున్నతముగ నున్నచో చర్మకీల మని వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను —“మాషేభ్యస్తూన్నతతరాం శ్చర్మకీలాన్ సితాఽసితాన్” (అ. హృ. ఉ అ. ౩౧. శ్లో. ౨౬.) చర్మకీల మనునది తెలుపు నలుపు కలిసిన రంగుకల్గియుండు నని భావము. (ఇవియే పిటిపిటికాయ లనబడును.)

## తిలకాలక లక్షణము

కృష్ణాని తిలమాత్రాణి నీరుజాని సమాని చ,
వాతపిత్తకఫోచ్ఛోషాత్తాన్విద్యాత్తిలకాలకాన్. 36

వాతపిత్తములచే కఫము శోషించి నల్లనిరంగుకల్గి నువ్వులగింజలంతేసి పరిమాణము కల్గి ఏ విధమైన బాధయు లేకుండు మచ్చలు శరీరముపైన పుట్టును. ఇయ్యవి నువ్వులంత పరిమితికల్గి వానివలె నల్లనై యుండుటంజేసి తిలకాలకము లనబడును.

మరియు తంత్రాంతరమున వీనిలక్షణము లిట్లు చెప్పబడినవి—"మారుతః పిత్త మాదాయ కఫరక్తసమాశ్రితః, చినోతి తిలమాత్రాణి త్వచి తే తిలకాలకాః" వాతము ప్రకుపితమయి పిత్తమున కలిసి కఫరక్తముల నాశ్రయించి చర్మముపై నువ్వులంతేసి నల్లని మచ్చల గల్గించును. ఇవి తిలకాలకము లని చెప్పబడును అని భావము. ఈవాక్యము చేత రక్తమును చెరిచి తిలకాలకముల గల్గించునని తెలిసెడిని. (పైజెప్పబడిన జతుమణి, మషకము, తిలకాలకము ననుమూడును పుట్టుకతోఁగూడ పుట్టుటంజేసి పుట్టుమచ్చ లని లోకమున వాడబడును.)

## న్యచ్ఛలక్షణము

మహద్వా యది వా చాల్పం శ్యావం వా యది వాఽసితం,
నీరుజం మణ్డలం గాత్రే న్యచ్ఛమిత్యభిధీయతే. 37

శరీరమునందు గొప్పదిగనైనను, చిన్నదిగనైనను శ్యామలవర్ణంబైనను, కృష్ణ వర్ణంబైనను కల్గి బాధలేనిమచ్చ కల్గిన నయ్యది న్యచ్ఛ మనబడును.

మరియు—"రక్తపిత్తాశ్రితో వాయుః త్వక్ప్రదేశాశ్రితో యదా, జనయే న్మణ్డలం కృష్ణం శ్యావం వా న్యచ్ఛమాదిశేత్" అను భోజవాక్యమువలన వాతము రక్త పిత్తములతోఁగూడి యీ వ్యాధిని కల్గించు నని తెలిసెడిని.

ఈమచ్చ జననకాలమునందే జనించు ననియు, పుట్టుమచ్చ యనియు, ఇదియే లాంఛన మని చెప్పబడు ననియు తంత్రాంతరమున గానంబడియెడు. లాంఛనలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను—"కృష్ణం సితం వా సహజం మండలం లాంఛనం సమమ్." (అ హృ. ఉత్త. అ. ౩౧. శ్లో. ౨౭.) పుట్టుకతోనే నల్లగనైనను తెల్లగ నైనను శరీరమున బుట్టిన మచ్చ లాంఛన మని యర్థము. ఈవాక్యమునుబట్టి లాంఛన మనునది న్యచ్ఛమునకన్న భిన్నమైన దని తెలియుచున్నది; కాని ఇదికూడ బాధలేని పుట్టుమచ్చ యనుటకు సందియములేదు. *

## వ్యంగలక్షణము

క్రోధాయాసప్రకుపితో వాయుః పిత్తేన సంయుతః,
ముఖమాగత్య సహసా మణ్డలం విసృజత్యతః. 38
నీరుజం తనుకం శ్యావం ముఖే వ్యఙ్గం తమాదిశేత్,

* పైభోజవాక్యానుసారముగా న్యచ్ఛము మధ్యకాలమునందు పుట్టు నని స్పష్ట పడుటచే నీ విషయము చింత్యము.

క్రోధముచేనైనను, ఆయాసముగల్గించు పనులచేనైనను వాతము ప్రకుపితమై పిత్తముతో గలిసి ముఖమున జేరి మచ్చను శీఘ్రముగ ముఖమున గల్గించును. ఇయ్యది బాధలేక సూక్ష్మాకారంబై శ్యామవర్ణము గల్గియుండును. దీనిని వ్యంగ మని చెప్పనగును. (దీనిని లోకమున మంగు అని వాడెదరు.)

## నీలికాలక్షణము

కృష్ణమేవం గుణం గాత్రే ముఖే వా నీలికాం విదుః. 39

వ్యంగమున మిక్కిలి నల్లనై పై జెప్పిన వ్యంగలక్షణములు కల్గినమచ్చ శరీరమునందైనను ముఖమునందైనను కల్గినయెడ నయ్యది నీలిక యని చెప్పబడును.

ఇచ్చట శ్యామవర్ణమై ముఖమున మాత్రము కల్గుమచ్చ వ్యంగ మనియు, అంతకన్న మిక్కిలి కాటుకవంటి నలుపుకల్గి ముఖమునందైనను శరీరమునందైనను కల్గినది నీలిక యనియు పై గనబరచిన లక్షణములచే దెలియుచున్నది.

వాగ్భటాచార్యులుమాత్రము శ్యామలమైనమచ్చ ముఖమున కల్గినచో వ్యంగ మనియు, అదియే ముఖమునగాక శరీరమునం దెచ్చటకల్గినను నీలిక యనియు నిట్లు చెప్పిరి—"శోకక్రోధాదికుపితా ద్వాతపిత్తాన్ముఖే తను, శ్యామలం మణ్డలం వ్యఙ్గం; వక్త్రాదన్యత్ర నీలకా" (అ. హృ. ఉ. అ. ౩౧. శ్లో. ౨౮.) ఈవాక్యమునుబట్టి వ్యంగమునకును నీలికకును దేశభేదమేకాని వర్ణాదులలో లక్షణభేదము గానంబడదు.

భోజుడు ఈరెంటికిని దేశభేదమును వర్ణభేదమును సూచించుచు లక్షణము నిట్లు చెప్పెను.—"మారుతః క్రోధహర్షాభ్యాం ఊర్ధ్వగోముఖమాశ్రితః, పిత్తేన సహ సంయుక్తః కరోతి వదనత్వచి. నీరుజం తనుకం శ్యావం వ్యఙ్గం తమితి నిర్దిశేత్, కృష్ణమేవం గుణం గాత్రే నీలికాం తాం వినిర్దిశేత్." (భోజుడు) శరీరమునం దూర్ధ్వగతమైనవాతము కోపముచేతను హర్షముచేతను ప్రకోపమునొంది ముఖమునజేరి పిత్తముతోగూడి ముఖమునందలి చర్మమున నొప్పిలేక సూక్ష్మమైన శ్యామవర్ణంబైన మచ్చ పుట్టును. ఇది వ్యంగ మనబడును. ఇదియే నల్లనిరంగుకల్గి ముఖముదక్క తక్కిన శరీరమునం దెచ్చటకల్గినను నీలిక యని చెప్పబడును.

## పరివర్తికాలక్షణము

మర్దనాత్పీడనాద్వాపి తథైవాప్యభిఘాతతః,
మేఢ్రచర్మ యదా వాయుః భజతే సర్వతశ్చరన్. 40
తదా వాతోపసృష్టత్వాత్తచ్చర్మ పరివర్తతే,
మణేరధస్తాత్కోశశ్చ గ్రన్థిరూపేణ లమ్బతే. 41

సరుజాం వాతసముత్థాం తాం విద్యాత్పరివర్తికామ్,
సకణ్డూః కఠినా వాపి సైవ శ్లేష్మసముత్థితా. 42

మేఢ్రమును మిక్కిలి మర్దించినను, పిసికినను లేక యితరములగు కారణములచే నభిఘాతము కల్గినను, శరీరమునందంతట సంచరించు స్వభావముకల వ్యాన వాతము ప్రకోపమునొంది, మేఢ్రము నావరించియుండు చర్మమున జేరును. అట్టి వాతసంబంధమునం జేసి యాచర్మము వెలకిలంబడును. మేఢ్రమునందలి మణికి క్రింద నుండు చర్మకోశము వాచి గ్రంథిరూపముగ పరిణమించి యంటగ వ్రేలాడుచుండును. అయ్యాది మిక్కిలి తీవ్రమైన నొప్పికల్గియుండునేని కేవలము వాతముచే జనించిన దనియు,దురద కల్గి కఠినమై యుండునెడ కఫమున జనించె ననియు నెరుంగునది. ఇయ్యాది పరివర్తిక యని చెప్పబడును.

ఈవ్యాధిలక్షణమును భోజు డిట్లు చెప్పెను:—"మణేరధో మేఢ్రచర్మ వ్యానస్థు పరివర్తయేత్, సశూలతోదదాహాద్యైః విజ్ఞేయా పరివర్తికా. శ్లైష్మికీ కఠినా స్నిగ్ధా కణ్డూమత్యల్పవేదనా" వ్యానవాతము ప్రకుపితమై మేఢ్రము నందలి మణికి క్రింది భాగమున నుండు చర్మమును వెలికిల మరలించును. అయ్యాది నొప్పి పోటు మంట మున్నగుబాధలు కల్గియుండును. ఇయ్యాది పరివర్తిక యని చెప్పనగును అని భావము. (ఈవాక్యముచేత పోటు మంట మున్నగుబాధలు కల్గు నని తెలిసెడి) ఇది వాతికము. కఫమున జనించినది కఠినమై స్నిగ్ధగుణము కల్గి తీవ్రమైన దురదకల్గి స్వల్పమైన బాధతో గూడియుండును.

## అవపాటికా లక్షణము

అల్పీయసఃఖాం యదా హర్షాద్బలాద్గచ్ఛేత్ స్త్రియం నరః,
హస్తాభిఘాతాదపి వా చర్మణ్యుద్వర్తితే బలాత్. 43
యస్యావపాట్యతే చర్మ తాం విద్యాదవపాటికామ్,

పుష్పవతి గాకుండుటవలన మిక్కిలి సూక్ష్మమైన భగద్వారముకల కన్యకను మనుజుడు కామాంధకారమున కన్నుమిన్నెరుంగక బలాత్కారముగ రమించినను, మేఢ్రమున హస్తాదులచే నభిఘాతము కల్గించినను చర్మము వెలికిలంబడి ఊల్లుదర్భచే గీచినట్లు చీలును. దీనిని అవపాటిక యందురు.

భోజు డీవ్యాధికి వాతాదిసంబంధముచే లక్షణముల వేరువేర నిట్లు నిరూపించెను:—"మర్దనాదభిఘాతాద్వా కన్యాయోనిప్రపీడితాత్, లక్ష్యతే యది మేఢ్రస్య చర్మ దర్భైరివక్షతమ్. (అ)వపాటికేతి తామాహుః పృథగ్దోషై

స్సమన్వితామ్. వాతాత్సా పరుషా రూక్షా శూలనిస్తోదకారిణీ. పిత్తాత్సదాహా రక్తా ద్వా దాహతృష్ణాసమన్వితా, శ్లైష్మికీ కఠినా స్నిగ్ధా కణ్డూమత్యల్పవేదనా." మర్దనము అభిఘాతము కన్యకతో సంభోగించుట అను నీకారణములచేత మేఢ్రముపై చర్మము దర్భలచే గీచినవిధముగ చీలికగ చీలును. దీనిని యవపాటిక యందురు. ఇయ్యది వాతాదులచే వేరువేరులక్షణములు గల్గియుండును. అందు వాతమున పరుషంబును రూక్షంబునై నొప్పియు పోటును కల్గియుండును. పిత్తరక్తములచేత గల్గినది మంటయు దప్పియు కల్గియుండును. కఫమున జనించినది కఠినంబును స్నిగ్ధంబునై తీవ్రమైన దురద కల్గియుండును. (ఇచ్చట వాతాదులచే ననేక భేదముల జెప్పినచో క్షుద్రరోగలక్షణ మునకు విరోధమగును కావున దోషభేదముల గల్పించుట చింత్యము).

## నిరుద్ధప్రకశ లక్షణము

వాతోపసృష్టే మేఢ్రే వై చర్మ సంశ్రయతే మణిమ్. 44
మణిశ్చర్మోపనద్ధస్తు మూత్రస్రోతో రుణద్ధి చ,
నిరుద్ధప్రకశే తస్మిన్ మన్దధారమవేదనమ్. 45
మూత్రం ప్రవర్తతే జన్తోః మణిర్వివ్రియతే న చ,
నిరుద్ధప్రకశం విద్యాత్సరుజం వాతసమ్భవమ్. 46

వాతము ప్రకుపితమై మేఢ్రమున జేసి మేఢ్రముపై నుండు చర్మము మణికి చుట్టును వ్యాపించి మూత్రద్వారమును మూసి మూత్రమును ధారాళముగా వెడల నీయక యడ్డగించును. దానంజేసి మూత్రము బాధలేకనే స్వల్పస్వల్పముగ వెడలును; మణిమాత్రము చర్మముచే మూయబడి కనబడక యుండును. కాని పగలదు. ఇయ్యది వాతముచే గల్గినపుడు బాధకలిగి యుండును. దీనిని నిరుద్ధప్రకశ మని చెప్పెదరు.

మరియు నీవ్యాధియందలి లక్షణముల గొన్నిటి వివరించి యన్వర్థసంజ్ఞను భోజు డిట్లు చెప్పెను:—"మేఢ్రాస్తే చర్మణి యదా మారుతః కుపితో భృశమ్. ద్వారం రుణద్ధిసశనైః ప్రకాశశ్చ ముహుర్భవేత్. వాతోపసృష్టమేఢ్రస్తు మణిర్న చ విదీర్యతే, నిరుద్ధం చ ప్రకాశం చ వ్యాధిం విద్యాత్సుదారుణమ్" మేఢ్రము యొక్క చివరనుండు చర్మమున వాతము మిక్కిలి ప్రకోపమునొంది యచ్చోట చర్మమున వాపును కల్గించును. అట్టిచర్మము మణినంతట వ్యాపించి మెల్లగ మణిని అగపడ నీయక మూయును. ఒకప్పుడు మూయకుండును. మూయబడకయున్నపుడు మూత్రము బాగుగా వెడలును. మూసికొనియున్నపుడు మూత్రము బొత్తుగ నడ్డపడియుండకున్నను బాగుగా వెడలకుండును. కాని మణిమాత్రము చీలుటలేదు. ఈవ్యాధియందు చర్మముచే

గప్పబడినపుడు మణి కనబడకయు, వాపు గ్రమ్మకున్నపుడు మణి కనబడుచు నుండుటం జేసి యీవ్యాధి నిరుద్ధప్రకశ మని యన్వర్థముగ చెప్పబడును.

### సన్నిరుద్ధగుదలక్షణము

వేగసన్ధారణాద్వాయుర్విహతో గుదసంశ్రితః,
నిరుణద్ధి మహాస్రోతః సూక్ష్మద్వారం కరోతి చ. 47
మార్గస్య సౌక్ష్మ్యాత్కృచ్ఛ్రేణ పురీషం తస్య గచ్ఛతి,
సన్నిరుద్ధగుదం వ్యాధిం ఏతం విద్యాత్సుదారుణమ్. 48

వాత మూత్ర పురీషాదుల వేగమును అడ్డగించి వెడలనీయక వాని నిరోధించుట చేత నపానవాతము ప్రకోపమునొంది గుదద్వారము నడ్డగించి దానిని మిక్కిలి సూక్ష్మముగ జేయును. దానివలన పురీషము మిక్కిలి కష్టముచే కొంచెము కొంచెముగ వెడలును. ఇయ్యది మిక్కిలి క్రూరమైన సన్నిరుద్ధగుద మను వ్యాధి.

### అహిపూతన లక్షణము

శకృన్మూత్రసమాయుక్తేఽధౌతేఽపానే శిశోర్భవేత్,
స్విన్నే వాఽస్నాప్యమానే వా కండూరక్తకఫోద్భవా. 49
కండూయనాత్తతః క్షిప్రం స్ఫోటస్స్రావశ్చ జాయతే,
ఏకీభూతం వ్రణైర్ఘోరం తం విద్యాదహిపూతనమ్. 50

శిశువులు మలమూత్రముల విసర్జించినపుడు గుదస్థానంబున మలంబును మూత్రంబును పోవునట్లు నీళ్ళతో శుభ్రముగ కడుగకున్నయెడ గుదస్థానమున మలమూత్రములు అంటియుండును. లేక నీళ్లుపోసి స్నానముచేయింపకున్నను చెమట పట్టును. దానంజేసి తీవ్రమైన దురద కలుగును. అట్టి దురద కోరువజాలక గోళ్ళచే గోకినయెడ తోడనే యచ్చోట బొబ్బలులేచి చితికి చీము నీరు రక్తము మున్నగునవి కారుచుండును. ఆ బొబ్బలన్నియు నొండొంటంగలిసి యొకటే వ్రణముగ నగును. ఇయ్యది యహిపూతన యను వ్యాధి యని యెరుంగునది. ఇది రక్తకఫములచే గల్గును. ఇయ్యది వ్యాధిస్వభావముచేత పసిపిల్లవాండ్రకు మాత్రము కల్గు నని యెరుంగునది.

మరియు:—దుష్టస్తన్యస్య పానేన మలస్యాక్షాళనేన చ, కణ్డూదాహరుజావద్భిః పిటికైశ్చ సమాచితా. సమ్భవన్తి యథాదోషం దారుణా హ్యహిపూతనా." అని భోజుడు చెప్పెను. ఈవాక్యమునుబట్టి చెడిన చనుబాలను త్రాగుటచేగూడ నీవ్యాధి జనించు ననియు, కఫ-పిత్త-వాతములచే క్రమముగ దురదయు మంటయు నొప్పియు దోషానుసారముగ గల్గు ననియు తెలిసెడిని.

వృషణకచ్ఛూలక్షణము

స్నానోత్సాదనహీనస్య మలో వృషణసంస్థితః,
యదా ప్రక్లిద్యతే స్వేదాత్కణ్డూం జనయతే తదా. 51
కణ్డూయనాత్తతః క్షిప్రం స్ఫోటాస్స్రావశ్చ జాయతే,
ప్రాహుర్వృషణకచ్ఛూం తాం శ్లేష్మరక్తప్రకోపజామ్. 52

శరీరమును సున్ని (పిండి) మొదలగు వానిచే చక్కగ తోమి స్నానముచేయని వానికి వృషణములయందు మురికిచేరి చెమటపుట్టుటచే చెమ్మగల్గి దురదను పుట్టించును. అప్పుడు గోకినచో శీఘ్రముగ బొబ్బలుకల్గును. అయ్యది చితికియందుండి నీరుగారును. ఇయ్యది వృషణకచ్ఛు వనబడును. కఫరక్తప్రకోపముచే నీవ్యాధి కల్గును.

కుష్ఠప్రకరణమున జెప్పిన కచ్ఛూవ్యాధి శరీరమునం దెచ్చటనైన కల్గు ననియు ఇయ్యది వృషణములయందు మాత్రము కల్గుననియు నీరెండిటికిని భేదము నెరుంగునది.

గుదభ్రంశలక్షణము

ప్రవాహణాతిసారాభ్యాం నిర్గచ్ఛతి గుదం బహిః,
రూక్షదుర్బలదేహస్య గుదభ్రంశం తమాదిశేత్. 53

మలవిసర్జనము చేయునపుడు మిక్కిలి బలాత్కారముగ ముక్కినను; * అతిసార విరేచనములు (ఆమవిరేచనములు) అయినను గుదమునందలి లోభాగము ఆసనమునకు బైట వెడలును. ఈవ్యాధి జిడ్డులేక మిక్కిలి రూక్షులై బలహీనమైన శరీరముకలవారికి విశేషముగ జనించును. దీనిని గుదభ్రంశ మని చెప్పెదరు.

సూకరదంష్ట్రికలక్షణము

సదాహో రక్తపర్యన్తస్త్వక్పాకీ తీవ్రవేదనః,
కణ్డూమాన్ జ్వరకారీ చ స స్యాత్సూకరదంష్ట్రకః. 54

చర్మమున పుండై రక్తముగారుచు మంటయు తీవ్రమైన నొప్పియు దురదయు జ్వరంబును కల్గిన నయ్యది సూకరదంష్ట్రక మనబడును. (ఈవ్యాధికూడ గుదస్థానమున గల్గును.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
క్షుద్రరోగనిదానం సమాప్తమ్.

---

* సులికడుపులేక జిగటి విరేచనములయం దిది కలుగుట ప్రసిద్ధము.

# ౫౯. ముఖరోగనిదానమ్

శరీరమునం దచ్చటచ్చట జనించు సామాన్యరోగముల నింతవఱుక జెప్పి పిమ్మట ముఖమున మాత్రము జనించు రోగముల మాత్రము వివరించుచు ముఖరోగనిదానమును చెప్పుట.—

## ముఖరోగసామాన్యకారణములు

అనూపపిశితక్షీరదధిమత్స్యాతిసేవనాత్,
ముఖమధ్యే గదాన్కుర్యుః క్రుద్ధా దోషాః కఫోత్తరాః. 1

"ఓష్ఠౌ చ దన్తమూలాని దన్తా జిహ్వా చ తాలు చ, గలో ముఖం చ సకలం సప్తాఙ్గం ముఖముచ్యతే" అను ప్రమాణమును బట్టి పెదవులు, దంతమూలములు, దంతములు, నాలుక, తాలువులు, కుత్తుక, ఇవియును, తక్కిన ముఖమునందలి భాగమును, (నోరంతయు) ఈయేడు అంగములుగూడిన భాగము ముఖ మనబడును. ఈముఖమున గల్గువ్యాధులు అరువదియైదు. ఎట్లు లనః—"దన్తేష్వష్టౌ ఓష్ఠయోశ్చ మూలేషు దశ పఞ్చ చ, నవ తాలుని జిహ్వాయాం పఞ్చ సప్త దశామయాః. కంఠే త్రయస్సర్వసరాః ఏకషష్టిః చతుఃపరాః" అను భోజోక్త ప్రమాణమునుబట్టి దంతరోగము లెనిమిది విధంబులును, పెదవులయందు రోగము లెనిమిది విధంబులును, దంతమూలములయందు పదునైదు విధంబులును, తాలువులయందు తొమ్మిది విధంబులును, నాలుకయందు ఐదు విధంబులును, కంఠమునందు పదునేడును, ముఖమందంతటను మూడు విధంబులును రోగములు కల్గును. ఇవి యన్నియుం గలిసి యఱువదియైదు ముఖరోగము లగును.

జలప్రాంతమున బుట్టిన జంతువులమాంసమును, క్షీరమును, పెరుగును, మత్స్యములను వీని నధికముగ సేవించినచో వాతపిత్తకఫములు ప్రకోపించి ముఖమున నాయాదోషముల గల్గించును. దోషములు మూటిలో కఫము మిక్కిలి యెక్కుడై ప్రధానముగ నుండును.

## ఓష్ఠగతవ్యాధు లెనిమిది, అందు వాతికలక్షణము

కర్కశౌ పరుషౌ స్తబ్ధౌ సంప్రాప్తానిలవేదనౌ,
దాల్యేతే పరిపాట్యేతే ఓష్ఠౌ మారుతకోపతః. 2

వాతప్రకోపముచేత పెదవులు కఠినములై కరకరయగుచు పరుషంబులై స్తంభించి వాతమున గల్గుబాధలు కల్గి పగులును. మఱియు నెక్కువగా వ్రక్కలగును.

### పైత్తికఓష్ఠవ్యాధిలక్షణము

చీయతే పిటికాభిశ్చ సరుజాభిస్సమన్తతః,
సదాహపాకపిటికౌ పీతాభాసౌ న పిత్తతః. 3

పిత్త ప్రకోపముచేత పెదవులయందు చిన్నచిన్న బొబ్బలు లేచి మిక్కిలి నొప్పియు మంటయుకల్గి పచ్చనై యుండును. అది పుండగును.

### కఫజఓష్ఠవ్యాధిలక్షణము

సవర్ణాభిశ్చ చీయేతే పిటికాభిరవేదనౌ,
భవతస్తు కఫాదోష్ఠౌ పిచ్ఛిలౌ శీతలౌ గురూ. 4

కఫము ప్రకోపించి పెదవులయందు పెదవులకు సమానముగ వర్ణముకల్గిన బొబ్బల కల్గించును. అయ్యవి బాధలేకుండును. పెదవులు జిగురుకల్గి చల్లనైయుండును. మిక్కిలి బరువుగల్గి యుండును.

### సాన్నిపాతికఓష్ఠవ్యాధి

సకృత్కృష్ణౌ సకృత్పీతౌ సకృచ్ఛ్వేతౌ తథైవ చ,
సన్నిపాతేన విజ్ఞేయా అనేకపిటికాచితౌ. 5

సన్నిపాతము (త్రిదోషముల ప్రకోపము) చేత పెదవులయం దనేకములగు బొబ్బలుకల్గి ఒకప్పుడు నల్లగను, ఒకప్పుడు పచ్చగను, మరియొకప్పుడు తెల్లగను ఉండును. ఇది సన్నిపాతమున గల్గిన ఓష్ఠవ్యాధి.

### రక్తజ ఓష్ఠవ్యాధి

ఖర్జూరఫలవర్ణాభిః పిటికాభిర్నిపీడితౌ,
రక్తోపసృష్టౌ రుధిరం స్రవతః శోణితప్రభౌ. 6

రక్తదోషముచేత పెదవులయందు ఖర్జూరపు పండ్లవలె రక్తవర్ణములైన బొబ్బలు కల్గును. అయ్యవి పుండై రక్తము గారుచుండును. దానంజేసి పెదవులు రక్తమునుబోలె నెఱ్ఱనైయుండును. ఇయ్యది రక్తముచేగల్గిన యోష్ఠవ్యాధి.

### మాంసజనితఓష్ఠవ్యాధి

గురూ స్థూలౌ మాంసదుష్టౌ మాంసపిండవదుద్గతౌ,
జన్తవశ్చాత్ర మూర్ఛన్తి నరస్యోభయతో ముఖాత్. 7

పెదవులయందు మాంసము చెడినపుడు మిక్కిలి స్థూలములై భారముకల్గి మాంసపుముద్దలవలె నున్నతంబులై యుండును. రెండు పెదవులసందులయందు నోటి కిరుప్రక్కల పురుగులు ఈగలు మొదలైనవి ముసురుచుండును. ఇయ్యది మాంసజనిత ఓష్ఠరోగము.

## మేదోజనితఓష్ఠరోగము

సర్పిర్మణ్డప్రతీకాశౌ మేదసా కణ్డురౌ గురూ,
అచ్ఛం స్ఫటికసంకాశం ఆస్రావం స్రవతో భృశమ్. 8
తయోర్వ్రణో న సంరోహేత్ మృదుత్వం చ న గచ్ఛతి,

మేదస్సు దుష్టమైనపుడు పెదవులు పేరిననేతివంటికాంతియు జిడ్డును కలిగి మిక్కిలి దురదతోగూడి భారముగ నుండును. ఆపెదవులనుండి స్ఫటికమువలె తెల్లనైన ద్రవము అధికముగ గారుచుండును. ఆపెదవులయందు కల్గుపుండ్లు మానవు ఒకవేళ మానినను పెదవులు బిరుసుగ నుండును కాని మెత్తపడవు. ఇది మేదోజనిత ఓష్ఠరోగము.

## ఆగంతుకఓష్ఠవ్యాధి

క్షతజాభౌ విదీర్యేతే పాట్యేతే చాభిఘాతతః. 9
గ్రథితౌ చ సమాఖ్యాతౌ ఓష్ఠౌ కణ్డూసమన్వితౌ,

ఆగంతుకములగు బాహ్యకారణములచే పెదవులయందు గాయమైనపుడు రక్తమువలె నెఱ్ఱనై పగులును. అభిఘాతము గాఢమైనవి యగునేని దానంజేసి వ్రయ్యలుగ చీలును. పిదప వ్రణము గ్రంథిరూపమై మిక్కిలి దురదగల్గియుండును. ఇది ఆగంతుకౌష్ఠవ్యాధి.

భోజుడు:—"క్షతావభిహతౌ వాపి రక్తావోష్ఠౌ సవేదనౌ, భవతస్సపరిస్రావౌ కఫరక్తప్రదూషితౌ" అని చెప్పియుండుటచేత నీవ్యాధియందు పెదవులు రక్తవర్ణములై తీవ్రమైన బాధకల్గి రక్తము మున్నగు ద్రవము గారుచుండు ననియు, ఇయ్యది రక్తకఫములచే గల్గు ననియు తెలిసెడిని. (ఇవి యెనిమిదియు నోష్ఠగతవ్యాధులు.)

## దంతమూలగతవ్యాధులు పదునైదు; అందు శీతాదము

శోణితం దన్తవేష్టేభ్యో యస్యాకస్మాత్ప్రవర్తతే. 10
దుర్గన్ధీని సకృష్ణాని ప్రక్లేదీని మృదూని చ,
దన్తమాంసాని శీర్యన్తే పచన్తి చ పరస్పరమ్. 11
శీతాదో నామ స వ్యాధిః కఫశోణితసమ్భవః,

దంతములకు కుదుళ్లై యాధారములుగనుండు చిగుళ్లనుండి కారణములేకయే యాకస్మికముగ రక్తముగార నారంభించును. అట్టి చిగుళ్లు కొంతకాలమునకు దుర్గంధము కల్గి నల్లపడి ద్రవముకల్గి మెత్తపడును. అట్టి దంతమాంసములు పుండై యొకటితో వేరొకటి కలియక నానాట నూడిపడును. ఇయ్యది శీతాదం బను వ్యాధి. కఫరక్తములచే నిది జనించును.

## దంతపుప్పుటకము

దన్తయోస్త్రిషు వా యస్య శ్వయథుర్జాయతే మహాన్. 12
దన్తపుప్పుటకో నామ స వ్యాధిః కఫరక్తజః,

దంతములలోఁ రెంటికైనను మూటికైనను సంబంధించిన మాంసమున వాపుకలిగినచోఁ నయ్యది దంతపుప్పుటక మను వ్యాధి యని చెప్పబడును. ఇయ్యది కఫరక్తములచే గల్గును.

## దంతవేష్టలక్షణము

స్రవన్తి పూయరుధిరం చలా దన్తా భవన్తి చ. 13
దంతవేష్టస్స విజ్ఞేయో దుష్టశోణితసమ్భవః,

దంతములు పట్టుతప్పి కదలి చిగుళ్లనుండి చీము నెత్తురు గారుచున్నయెడ దంతవేష్ట మనంబడును. ఇవి రక్తము చెడుటవలన సంభవించును.

## సౌషిరలక్షణము

శ్వయథుర్దన్తమూలేషు రుజావాన్కఫసమ్భవః. 14
లాలాస్రావీ స విజ్ఞేయః సౌషిరో నామ నామతః,

దంతముల మొదళ్ల యందలి మాంసమునందు వాపును తీవ్రమైన నొప్పియు కలిగి జొల్లుకారుచున్నయెడ సౌషిర మనదగును ఇయ్యది కఫప్రకోపముచే జనించును.

## మహాసౌషిరలక్షణము

దన్తాశ్చలన్తి వేష్టేభ్యస్తాలు చాప్యవదీర్యతే. 15
యస్మిన్ స సర్వజో వ్యాధిర్మహాసౌషిరసంజ్ఞితః,

దంతములు బిగిచెడి చిగుళ్లనుండి కదలుచు తాలువులును చిగుళ్లును పెదవులును పగులుచున్నయెడ మహాసౌషిరమనంబడును. ఇయ్యది త్రిదోషసన్నిపాతముచే గల్గును.

ఈమహాసౌషిరలక్షణమును భోజుడు సవిస్తరముగ నిట్లు చెప్పెను:—"సదా హో దంతమూలేషు శోథః పిత్తకఫానిలాత్, జాతః కఫం క్షపయతి క్షీణే తస్మింస్తు

శోణితమ్, వివృద్ధమనిశం దన్తాన్ తాలోష్ఠమపి దారయేత్, మహాసౌషిరమిత్యేతత్ సప్తరాత్రాన్నిహంత్యసూన్." పిత్తకఫవాతములు మూడును సమకాలమున ప్రకోపించి దంతములకు మొదళ్లనుండు మాంసపు చిగుళ్లయందు మంటతోగూడిన వాపును గలిగించును. వాపుకలిగిన పిదప కఫమును క్షీణింపజేయును. అయ్యది క్షీణించినతోడనే రక్తము మిక్కిలి వృద్ధినొంది దంతములను తాలువులను పెదవులను పగులునట్లు చేయును. దంతములు బిగిచెడి సడలును. ఇయ్యది మహాసౌషిర మని చెప్పబడును. ఇది సన్నిపాతజము కావున మిక్కిలి క్రూరమై యేడుదినములలో చంపును.

## పరిదరలక్షణము

దంతమాంసాని శీర్యన్తే యస్మిన్ ష్ఠీవతి వాప్యసృక్. 16
పిత్తాసృక్కఫజో వ్యాధిః జ్ఞేయః పరిదరో హి సః,

ఏవ్యాధియందు దంతముల కాధారములగు మాంసములు (చిగుళ్లు) శిథిలంబులై చీలి యుమియునపుడెల్ల రక్తము వెడలునో అయ్యది పరిదర మనబడును. ఈ వ్యాధి పిత్త-రక్త-కఫములచే గల్గును. చిగుళ్లను చీలుటంజేసి పరిదరం బని యన్వర్థముగ జెప్పంబడును.

## ఉపకుశలక్షణము

వేష్టేషు దాహః పాకశ్చ తాభ్యాం దన్తాశ్చలన్తి చ. 17
*(అవాకృతాః ప్రస్రవన్తి శోణితం మన్దవేదనాః,
ఆధ్మాయన్తే స్రుతే రక్తే ముఖే పూతిశ్చ జాయతే.)
యస్మిన్నుపకుశో నామ పిత్తరక్తకృతో గదః,

దంతముల కాధారములైన మాంసమునందు (చిగుళ్లయందు) మంటపుట్టి పుండగును. దానంజేసి దంతములు పట్టు సడలి కదలును. (మొగమును వంచి నోరు తెరచిన యెడ చిగుళ్లనుండి రక్తము కారును. రక్తమునెల్ల వెడలించినచో మరల చిగుళ్లు ఉబుకును. నొప్పిమాత్రము కొంచెముగ నుండును. ముఖమున కంపు కల్గును.) ఇట్టి లక్షణములు కల్గినది యుపకుశ మను వ్యాధి యని యెరుంగునది. ఇయ్యది పిత్తరక్తములచే గల్గును.

## వైదర్భలక్షణము

ఘృష్టేషు దన్తమాంసేషు సంరమ్భో జాయతే మహాన్. 18
చలా భవన్తి దన్తాశ్చ స వైదర్భోఽభిఘాతజః,

---

* ప్రక్షిప్తము. మధుకోశమునందు కానరాదు.

పుల్ల మొదలగువానితో పలుదోమునపుడు దంతముల కాధారములగు చిగుళ్లు అభిఘాతముకల్గి అధికముగ వాచును. దానంజేసి పన్నులన్నియు కదలును. ఇది వైదర్భ మను రోగము. ఇయ్యది యభిఘాతమున కల్గును.

ఖలివర్ధన లక్షణము

మారుతేనాధికో దన్తో జాయతే తీవ్రవేదనః. 19
ఖలివర్ధనసంజ్ఞోఽసౌ జాయతే రుక్చ శామ్యతి,

వాతము ప్రకుపితమై దంతమాంసమున జేరి తీవ్రమైన వేదనతో గూడిన దంతమును అధికముగ కల్గించును; ఇయ్యది ఖలివర్ధన మని చెప్పబడును. ఆ పల్లు పుట్టునపుడు మాత్రము తీవ్రమైనబాధ కల్గును. కాని పుట్టినపిమ్మట బాధ నివర్తించును.

కరాళ లక్షణము

*శనైశ్శనైః ప్రకురుతే వాయుర్దంతసమాశ్రితః. 20
కరాళాన్వికటాన్ దన్తాన్ కరాలో న స సిద్ధ్యతి,

వాతము దంతమూలముల నాశ్రయించి దంతములను వంకరటింకరగ వికృతాకారములుగ జేయును. ఇయ్యది కరాళ మనబడును. ఇయ్యది యసాధ్యము.

అధిమాంస లక్షణము

హానవ్యే పశ్చిమే దన్తే మహాన్ శోథో మహారుజః. 21
లాలాస్రావీ కఫకృతో విజ్ఞేయస్సోఽధిమాంసజః,

దంతముల వరుసకుకడన తాలువులయందు దంతపంక్తికి చేరువనుండు మాంసమున మిక్కిలి స్థూలముగ వాపుకల్గి తీవ్రమైన పోటుకల్గి యధికముగ జొల్లుకారుచుండును. ఇయ్యది కఫమున జనించిన యధిమాంస మని యెరుంగునది.

వాగ్భటాచార్యుడు:—"దన్తాన్తే కీలవచ్ఛోథో హనుకర్ణరుజాకరః, ప్రతిహంత్యభ్యవహృతిం శ్లేష్మణా సోఽధిమాంసకః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౨౭.) అని చెప్పెను. దీనిచేత నీ వ్యాధి దంతపంక్తికి కడన చీలగొట్టిన విధముగ వాపుకల్గి తాలువులయందును, కర్ణమూలములయందును మిక్కిలి తీవ్రమైన పోటుపుట్టి యాహారమును భుజించుటకైన వలనుపడకుండు ననియు తెలియుచున్నది.

దంతనాడీ లక్షణము

దంతమూలగతా నాడ్యః పఞ్చ జ్ఞేయా యథేరితాః. 22

* ఈ వ్యాధి దంతమూల వ్యాధులలో జేరదు. ఇచ్చట దీనిని జెప్పుట చింత్యము.

దంతమూలములయందు వాత-పిత్త-సన్నిపాత-ఆగంతుక భేదములచే నైదు విధములైన నాడీవ్రణంబులును జనించును. వాని లక్షణములను నాడీవ్రణ నిదానమున జెప్పిన ప్రకారముగ నెరుంగునది.

దంతనాడీవ్రణముల సంప్రాప్తిని వాగ్భటాచార్యుడి ట్లుపదేశించెను:—"దంత మాంసాశ్రితాన్ రోగాన్ యస్సాధ్యానప్యుపేక్షతే, అన్తస్తస్యా స్రవన్ దోషః సూక్ష్మాం సఞ్జనయేద్గతిమ్, పూయం ముహుస్సా స్రవతి త్వఙ్మాం సాస్థిప్రభేదినీ; తాః పునః పఞ్చ విజ్ఞేయాః లక్షణైస్స్వైర్యథోదితైః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౨౯. ౩౦.) పైజెప్పిన దంతమాంసగతరోగములలో సాధ్యములగు రోగములను తగిన కాలమున యుక్తమైన చికిత్సచేయక యుపేక్షించినయెడ అట్టి వ్రణములయందు దుష్టమైన చీము మున్నగునవి బైటవెడలక లోపలనే సూక్ష్మముగ త్రోవజేసికొని లోన ప్రవేశించి చర్మమును మాంసమును అస్థులను భేదించునదియై లోభాగమున వ్యాపించి నాడీరూపముగ బరిణమించును. ఇదియే దంతనాడి యనబడును. దానికి వాతాదిదోష సంబంధమున గల్గు నైదు భేదములను నాడీవ్రణ నిదానమున జెప్పిన లక్షణములనుబట్టి నిర్ణయించునది.

ఇచ్చట నీ నిర్ణయము నెరుంగునది:—భోజుడు ముఖరోగముల విభజించి పరిగణనము చేయుతరి "మూలే దశ చ పఞ్చ చ" అని దంతమూలవ్యాధులు పదునైదని పరిగణనముచేసెను. తంత్రాంతరమునందు దానివివరణ మి ట్లున్నది:—"శీతాదో గదితః పూర్వం దంతపుప్పుటకస్తథా, దంతవేష్టస్సౌషిరశ్చ మహాసౌషిర ఏవ చ. తతః పరిదరః ప్రోక్తః తతస్తూపకుశస్స్మృతః, వైదర్భశ్చ తతః ప్రోక్తో ఖలివర్ధన ఏవ చ, అధిమాంసకనామా చ దంతనాడ్యశ్చ పంచ చ, దంత విద్రధిరప్యత్ర దన్తవేష్టేషు షోడశ" శీతాదము, దంతపుప్పుటము, దంతవేష్టము, సౌషిరము, మహాసౌషిరము, పరిదరము, ఉపకుశము, వైదర్భము, ఖలివర్ధనము, అధిమాంసము, దంతనాడులైదు, దంత విద్రధి అను నీ పదునారును దంత మూలముల జనించు వ్యాధులు.

ఈతంత్రకారుడు పైజెప్పిన పేరుల వరుసలో దంతవిద్రధి నొకదాని నధికముగ జేర్చి పదునారుగ దంతమూలవ్యాధులను వివరించెను. ప్రకృత గ్రంథమున మాధవకరుడు పై యానుపూర్వి ననుసరించి శీతాదము మొదలుచేసి వరుసగ లక్షణముల నిరూపించుచు కడనుండు దంతవిద్రధిని చెప్పక మాని, కరాళ మనుదాని నొక్కటెని అధికముగజేర్చి పదునారు దంతమూలవ్యాధులకు లక్షణముల నుడివెను. ఇది కరాళము నధికముగ జేర్చుటచే భోజమతమునకు, దంతవిద్రధిని వదలుటచే తంత్రాంతర పరిగణనమునకు విరుద్ధముగ నున్నది.

మాధవకరుడు ప్రాయికముగ భోజమతము నవలంబించువాడు కావున పదునైదుదంతమూలవ్యాధులనే వివరించి యుండవలెను. పై జెప్పిన యానుపూర్విలో

కరాళమును విడిచి తక్కిన పదునైదింటిని చెప్పియుండవలెను. కరాళ మనునది లక్షణ మునుబట్టిజూడ దంతమూలమునకు సంబంధించిన వ్యాధిగ గనబడదు. కావున నయ్యది నవీనుల ప్రక్షేపకముగ నుండనోపును. లక్ష్యముకాని దానిని మాధవకరుడు నడుమదూర్చి చెప్పునా ? ఇది యసంభవము. కావున శీతాదము మొదలుజేసి యధిమాంసమునకు లోనగునవి (కరాళమును వదలి) పదియును, దంతనాడులైదును జేరి పదునైదుదంత మూలవ్యాధులను భోజమతానుసారముగ మాధవకరుడు చెప్పెననుట నిర్వివాదము. కరాళమును సుశ్రుతాచార్యుడుచేర్చి చెప్పియున్నాడు. లేక అధిదంత మను దానిని వాగ్భటాచార్యుడు దంతగతవ్యాధులలో జెప్పియున్నాడు. కావున అధిదంతము నిచ్చట జేర్పకున్నచో సంఖ్య సామంజస్యము కల్గును. అది యధికపాఠముగ నుండు నేమో.

వాగ్భటాచార్యులు పై జెప్పిన యానుపూర్విలో దంతవేష్టము, పరిదరము, ఖలివర్ధనము నను మూడిటిని వదలి, దంతవిద్రధి నధికముగ జేర్చి పదుమూడు దంతమూల వ్యాధులను జెప్పెను. ప్రకృతమూలగ్రంథము సంగ్రహరూపముగాన మాధవకరుడు వాగ్భటమునకన్న కొన్నింటి నధికముగ జేర్చి చెప్పె నని యెరుంగునది. వాగ్భటమున మాత్రము ఓష్ఠవ్యాధులను పదిటిని జెప్పిరి. ఇట్టి సంఖ్యాభేదము పలుచోట్ల వాగ్భటమున గానంబడియెడు.

వాగ్భటాచార్యులు దంతవిద్రధిలక్షణము నిట్లు చెప్పెను:—"దన్తమాంసే మలైస్సాస్రైః బాహ్యాన్తశ్శ్వయథుర్గురుః,సరుగ్దాహస్స్రవేద్భిన్నః పూయాస్రం దన్తవిద్రధిః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౨౩.) వాత, పిత్త కఫములు రక్తముతోగూడి దంతమాంసములయందును బైటను లోపలనుగూడ వ్యాపించి స్థూలముగనుండు వాపును కల్గించును. అయ్యది నొప్పియు మంటయుం కలిగి పగిలి చీము నెత్తురు కార్చుచుండును. ఇది దంతవిద్రధి యనబడును. (ఇత్తెరంగున పదునైదు దంతమూలవ్యాధులు వివరింపబడియె.)

### దంతరోగము లెనిమిది, అందు దాలనలక్షణము

దీర్యమాణేష్వివ రుజా యస్య దన్తేషు జాయతే,
దాలనో నామ స వ్యాధిః సదాగతినిమిత్తజః. 23

దంతములయందు పగులదీయునటుల తీవ్రమైన నొప్పి కల్గిన నయ్యది దాలన మను వ్యాధి యనబడును. ఇయ్యది వాతప్రకోపమున గల్గును.

### క్రిమిదంతకలక్షణము

కృష్ణచ్ఛిద్రశ్చలస్స్రావీ ససంరమ్భో మహారుజః,
అనిమిత్తరుజో వాతాద్విజ్ఞేయః క్రిమిదన్తకః. 24

పంటియందు నల్లనిరంధ్రము కల్గి పల్లు కదలుచు చిగుళ్లు వాచి చీము నెత్తురు గారుచు తీవ్రమైన నొప్పికల్గియున్నయెడ క్రిమిదంత మని చెప్పబడును. దీనియందు కారణములేకయే బాధ కల్గును. (దంతములయందు ద్రవముండదు కావున చిగుళ్లనుండి చీము నెత్తురు స్రవించును.

### భంజనకలక్షణము

వక్త్రం వక్రం భవేద్యస్య దన్తభఙ్గశ్చ జాయతే,
కఫవాతకృతో వ్యాధిః స భఞ్జనకసంజ్ఞితః. 25

నోరు వంకరగనై పండ్లూడిన నయ్యది భంజనక మను వ్యాధి యగును. ఇయ్యది కఫవాతములచే గల్గును.

### దన్తహర్ష లక్షణము

శీతరూక్షప్రవాతామ్లస్పర్శానామసహా ద్విజాః,
పిత్తమారుతకోపేన దన్తహర్ష స్స నామతః. 26

పండ్లు శీత (చల్లని వస్తువులయొక్కయు, జిడ్డులేని రూక్షపదార్థములయొక్కయు స్పర్శమునైనను, గాలియొక్కయు పులుపుగల వస్తువులయొక్కయు స్పర్శమునైన నోరువ జాలకుండి నిమ్మకాయ మొదలైనవాని పులుపు తగిలినప్పుడు జలబరించు విధముగ నుండిన నయ్యది దంతహర్ష మనబడును. ఇయ్యది పిత్తవాతముల ప్రకోపమున గల్గును.

మరియు "శీతముష్ణం చ దశనాః సహన్తే స్పర్శనం న చ, యస్య తం దన్త హర్షంతు వ్యాధిం విద్యాత్సమీరణాత్" అని తంత్రాంతరమున నున్నది. శీతంబును ఉష్ణంబును కల ద్రవ్యముల స్పర్శమును సహింపనోపక దంతములు పులిసియున్నచో నయ్యది దంతహర్ష మని చెప్పబడును అని యర్థము. ఇయ్యది వాతప్రకోపమున గల్గును. (ఈవ్యాధి వాతమున గల్గినను వ్యాధిస్వభావముచే నుష్ణస్పర్శమును సహింపకుండును.)

### దంతశర్కరాలక్షణము

మలో దన్తగతో యస్తు పిత్తమారుతశోషితః,
శర్కరేవ ఖరస్పర్శా సా జ్ఞేయా దన్తశర్కరా. 27

పండ్లపై నుండుపాచి దంతములను చక్కగ తోమకుండుటచేత నానాట చేరి పిత్త వాతములచే నెండి చెక్కగట్టి నున్నపుగారపలె తాకినచో కర్కశముగ నుండును. ఇది దంతశర్కర యనబడును.

వాగ్భటాచార్యులు :—"అథావసాన్మలో దన్తే కఫో వా వాతశోషితః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౧౬.) అని చెప్పిరి. కావున దంతములయందలి మలమైనను కఫమైనను వాతముచే శుష్కమై శర్కరవలె నగు నని తెలియుచున్నది.

### కపాలికాలక్షణము

కపాలేష్వివ దీర్యత్సు దన్తానాం సైవ శర్కరా,
కపాలికేతి విజ్ఞేయా సదా దన్తవినాశినీ. 28

పైచెప్పిన దంతశర్కర పెంకులవలె చెక్కలు చెక్కలుగ నూడి పండ్లనుండి రాలుచున్నయెడ కపాలిక యనబరగు. దీనివలన పండ్లు నానాట నశించును.

### శ్యావదంతకలక్షణము

అసృఙ్మిశ్రేణ పిత్తేన దగ్ధో దన్తస్త్వశేషతః,
శ్యావతాం నీలతాం వాపి గతస్స శ్యావదన్తకః. 29

పిత్తము రక్తముతోగూడి ప్రకోపించి పల్లును నిప్పునకాలిన కట్టెవలె కాల్చును. దానంజేసి యాపల్లు శ్యామలవర్ణముగనైనను బొగ్గువలె నల్లగనైన నుండును. ఇయ్యది శ్యావదంతక మనబడును.

### దంతవిద్రధిలక్షణము

దన్తమాంసే మలైస్సాస్రై ర్బాహ్యాన్తశ్శ్వయథుర్గురుః,
సదాహరుక్ స్రవేద్భిన్నః పూయాస్రం దన్తవిద్రధిః. 30

పండ్లకాధారమగు మాంసమున లోపలను బైటనుకూడ గొప్పవాపుకల్గి మంటయు, నొప్పియుంపుట్టి పగిలి చీమును, నెత్తురును కారును. ఇది దంతవిద్రధి యనబడును. ఇయ్యది వాత-పిత్త-కఫ-రక్తములచేత గల్గును.

(ఈవ్యాధి దంతమూలమున జనించునది; కావున దంతమూలవ్యాధులలో పఠించుట సమంజసము. ఈరీతిగనే అధిదంత మనునది కేవలము దంతవ్యాధికాని దంతమూలమున జనించునది కాదు; కావున దాని నిచ్చట పఠించి, దంతమూలవ్యాధులలో దీనికి బదులుగ దంతవిద్రధిని పఠించుట యుక్తము. వాగ్భటాచార్యులు ఈయభిప్రాయముచేతనే పైజెప్పినవిధముగ పఠించిరి. పైజెప్పిన యెనిమిదియు దంతరోగములు.

### నాలుకయందుగల్గు రోగము లైదు, అందు వాతాదులచే గల్గు మూడు భేదములు

జిహ్వాఽనిలేన స్ఫుటితా ప్రసుప్తా భవేచ్చ శాకచ్ఛదనప్రకాశా,

పిత్తేన దహ్యాత్యుపచీయతే చ దీర్ఘైస్సరక్తైరపి కణ్టకైశ్చ. 31
కఫేన గుర్వీ బహలా చితా చ మాంసోచ్ఛ్రయైశ్శాల్మలికంటకాభైః.

వాతము ప్రకోపించినచో నాలుక పగిలి రుచి నెరుంగజాలక టేకాకువలె కరకు కల్గియుండును. పిత్తప్రకోపముచేత మంటపుట్టి నిడుదలై యెఱ్ఱనైన సన్నని ముండ్లవలె నుండు అంకురములచే వ్యాప్తమై యుండును. కఫప్రకోపముచేత నాలుక స్థూలమై బూరుగముండ్లవంటి మాంసాకురములచేత దట్టముగ వ్యాప్తమై యుండును.

(ఇచ్చట 'దహ్యాతి' అనుచోట కర్మరూపార్థమున దహధాతువుకు యక్ ప్రత్యయము వచ్చినచో ఆత్మనేపదము వచ్చినయెడ 'దహ్యాతే' అని చెప్పవలెను గాని 'దహ్యాతి' అని పరస్మైపదప్రయోగము అసాధువు. కావున దహధాతువుకు కండ్వాది గణపాఠమును కల్పించి 'కణ్డ్వాదిభ్యో యక్' అని యక్ప్రత్యయమును అంగీకరించి పరస్మైపదమునకు అగతికగతికముగ సాధుత్వమును కల్పించవలెను.)

## అలాసలక్షణము

జిహ్వాతలే యశ్శ్వయథుః ప్రగాఢః
సోఽలాససంజ్ఞః కఫరక్తమూర్తిః,
జిహ్వాం స తు స్తమ్భయతి ప్రవృద్ధో
మూలే చ జిహ్వా భృశమేతి గాఢమ్. 32

మిక్కిలి క్రూరమైన వాపు కఫరక్తముల ప్రకోపముచేత నాలుక యడుగున కలుగును. అయ్యది నానాట వృద్ధినొంది నాలుక నిటునటు కదలనీయక స్తంభింపజేయును. నాలుకయొక్క మొదటు పుం డగును. ఇయ్యది అలాసక మనబడును.

ఈవ్యాధియందు వాతముచేత మొద్దుబారియుండుటయు, పిత్తప్రకోపమున పుండగుటయు కల్గును. కావున వాత-పిత్త-కఫ-రక్తములచే నీవ్యాధి కల్గును. కానసే యసాధ్యము.

వాగ్భటాచార్యుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"కఫపిత్తాదధశ్శ్వథః జిహ్వాస్తంభకృదున్నతః, మత్స్యగన్ధిర్భవేత్పక్వః సోఽలసో మాంసశాతనః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౨౫.) కఫ పిత్తముల ప్రకోపమువలన నాలుకకు క్రిందిభాగమునందున్నతమగువాపు కలుగును. ఇది నాలుకను కదలనీయక స్తంభింపజేయును. ఇది పక్వమై పుండగునపుడు చేపలకంపు కొట్టును. మాంసము ముక్కలై యూడిపడును. ఇయ్యది అలస మనబడును అని భావము. ఈవాక్యముచేత పగిలినపుడు చేపలకంపు కల్గు ననియు మాంస మూడిపడు ననియు తెలిసెడిని.

## ఉపజిహ్వికా లక్షణము

జిహ్వాగ్రరూపశ్శ్వయథుర్హి జిహ్వాముస్నమ్యజాతః కఫరక్తమూలః,
లాలాకరః కణ్డుయుతస్సచోషః సా తూపజిహ్వా పఠితా భిషగ్భిః. 33

నాలుకకు క్రింద నాలుకకొనవలె నుండు శోఫము జనించి, నాలుకను పైకిలాగి నట్లుండును. దీనిచేత నోట జొల్లుకారుచుండును. దురదయు నిప్పున కాలినట్లు మంటయు కల్గును. ఇయ్యది కఫరక్తములచే గల్గును. ఇది నాలుకవలె నుండుటంజేసి యుపజిహ్వ యనబడును. (ఇవి యైదును జిహ్వాగత రోగములు.)

వాగ్భటాచార్యుడు దీనిలక్షణమును:—"సాంకురః కఫపిత్తాస్రైః......వాక్యాహారవిఘాతకృత్" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. 38.) అని చెప్పియుండుటవలన ఇయ్యది కఫపిత్తరక్తములచే గల్గి మాంసాంకురములతో గూడి యుండు ననియు, మాటలాడుటకును, ఆహారమును భుజించుటకును, కదలించుటకును వలనుపడక స్తంభించి యుండు ననియు తెలిసెడిని. మరియు దీని నధిజిహ్వ మని చెప్పి, "తాదృగేవోపజిహ్వాస్తు జిహ్వాయా ఉపరి స్థితః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. 39) అను వాక్యముచేత పై లక్షణములతోగూడి నాలుకకు క్రింద బుట్టినది యధిజిహ్వ మనియు, అదియే నాలుకకు పైభాగమున బుట్టినది యుపజిహ్వ మనియు నిరూపించెను. వీరి మతమునం దధిజిహ్వ మధికము గావున జిహ్వాగత రోగభేదము లారగును. ఈరెంటికిని స్థానభేదమేకాని లక్షణభేదము లేదు. ప్రకృతగ్రంథమున నియ్యది కంఠగతరోగములలో చెప్పబడియె.

## తాలుగతవ్యాధులు తొమ్మిది: అందు కంఠశుండీలక్షణము

శ్లేష్మాసృగ్భ్యాం తాలుమూలే ప్రవృద్ధో
దీర్ఘశ్శోథో ధ్మాతవస్తిప్రకాశః,
తృష్ణాకాసశ్వాసకృత్తం వదన్తి
వ్యాధిం వైద్యాః కణ్ఠశుణ్డీతి నామ్నా. 34

కఫరక్తములు ప్రకోపమునొంది *తాలువుల మొదట నిడుపుగ వాపుకల్గి వృద్ధినొంది గాలిచే నిండియుండు తిత్తివలె నుబ్బియుండును. దానివలన దప్పియు, దగ్గును శ్వాసంబును కల్గును. ఇయ్యది కంఠశుండి యని చెప్పబడును.

దీని లక్షణము వాగ్భటమున నిట్లు చెప్పబడెను:—"తాలుమూలే కఫాత్సాస్రాత్ మత్స్యవస్తినిభో మృదుః, ప్రలంబః పిచ్ఛిలశ్శోఫో నాసయాఽఽహార మీరయన్. కంఠోపరోధ తృట్కాసవమికృద్గలశుణ్డికా" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో.

* తాలు వనగా నోటిలో నాలుకకు మీదభాగమున నుండు మృదురూపమగు మీదియంగు దని తెలియవలెను.

32) తాలుమూలమునందు రక్తముతోఁగూడిన కఫమువలన మత్స్యమును వస్తినిబోలిన యాకారముకల్గి మృదువై పిచ్ఛిలమై వ్రేలాడుచుండు వాపు కల్గును. ఈవాపు కంఠ బిలమును అడ్డగించి యాహారమును నాసారంధ్రములనుండి వెడలించును. దీనివలన దగ్గును వాంతియు కల్గును దీనిని గలశుండిక యని చెప్పుదురు అని యర్థము.

తుండికేరీ లక్షణము

శోథస్స్థూలస్తోదదాహప్రపాకీ
ప్రాగుక్తాభ్యాం తుండికేరీతి నామ్నా,

ప్రత్తికాయవలె స్థూలమైనవాపు తాలువులయందు కలుగును. ఇయ్యది పోటును మంటయు కల్గి పుండగును. ఇదికూడ కఫరక్తములచే గల్గును. దీనిని తుండికేరి యని చెప్పెదరు.

అధుష లక్షణము

మృదుశ్శోథో లోహితశ్శోణితోత్థో
జ్ఞేయోఽధుషస్సజ్వరస్తీవ్రరుక్చ. 35

తాలుమూలమునందు మెత్తనై రక్తవర్ణమైన వాపు కల్గును. దీనియందు తీవ్రమైనపోటును, జ్వరమును కల్గును. ఇయ్యది అధుష మనబడును. ఇది రక్తమున కల్గును.

కచ్ఛప లక్షణము

కూర్మోన్నతోఽవేదనోఽశీఘ్రజన్మా
రోగో జ్ఞేయః కచ్ఛపశ్శ్లేష్మణా తు,

తాలుదేశమున తాబేలువలె నున్నతంబై నొప్పిలేనివాపు కల్గును. ఇది కఫప్రకోపముచేత చాలకాలమునకు కల్గును. ఇయ్యది ఆకృతి సామ్యమునుబట్టి కచ్ఛప మనబడును.

తాల్వర్బుద లక్షణము

పద్మాకారం తాలుమధ్యే తు శోథం
విద్యాద్రక్తాదర్బుదం పూర్వలింగమ్. 36

తాలువులనడుమ తామరపువ్వువలె గుండ్రనైన వాపు కల్గును. ఇయ్యది తాల్వర్బుద మని చెప్పబడును. ఇది రక్తమువలన గల్గును. ఈ వ్యాధి మున్ను వచించిన రక్తార్బుదలక్షణములు కల్గియుండును.

భోజుండు దీనిలక్షణములలో కొన్నిటి నధికముగ నిట్లు చెప్పెను:—"ఉపర్యేవ భవేన్మధ్యే యథా పద్మస్య కర్ణికా, పార్శ్వతశ్చాఙ్కురై ర్దీర్ఘైర్నాసా చాప్యవదీర్యతే. శ్లేష్మరక్తసముత్థానం తత్తాల్వర్బుదలక్షణమ్." తామరపువ్వునకు నడమ నుండు కర్ణికవలె గుండ్రముగనుండి నడుమ నున్నతంబులు, చుట్టును నిడుదలునైన యంకురములు కల్గిన వాపు అంగిటియందు జనించును. ఇయ్యది కఫరక్తములచే గల్గును. దీనివలన నాసారంధ్రము చీలును.

### మాంససంఘాతలక్షణము

దుష్టం మాంసం నీరుజం తాలుమధ్యే
కఫాచ్ఛూనం మాంససంఘాతమాహుః,

తాలుమధ్యమునందు మాంసము దుష్టమై నొప్పిలేక వాపు కల్గును. ఇది కఫమున కల్గిన మాంససంఘాత మను వ్యాధి.

### తాలుపుప్పుట లక్షణము

నీరుక్ స్థాయీ కోలమాత్రః కఫాత్స్యాత్
మేదోయుక్తాత్పుప్పుటస్తాలుదేశే. 37

కఫప్రకోపమువలన తాలుప్రదేశమున నొప్పిలేక రేగుపండంత పరిమాణము కల్గిన వాపు పుట్టును. ఇది స్థిరముగ నుండును. దీనిని కఫమేదస్సులు రెండునుచేరి కల్గించును. ఇయ్యది తాలుపుప్పుట మనబడును.

### తాలుశోషలక్షణము

శోషోఽత్యర్థం దీర్యతే చాపి తాలు
శ్వాసశ్చోగ్రస్తాలుశోషోఽనిలాచ్చ,

వాతప్రకోపముచేత తాలువులు ఎండి మిగుల తీవ్రమైన శ్వాసము కల్గును. ఇయ్యది తాలుశోషం బనబడును.

సుశ్రుతాచార్యుడు "శ్వాసో ఽతాత్తాలుశోషస్స పిత్తాత్" అను వాక్యముచేత పిత్తముతోగూడిన వాతముచేత తాలుశోషము జనించు నని చెప్పెను. ప్రకృత గ్రంథమున "అనిలాచ్చ" అను చకారమువలన పిత్తముతోగూడిన వాత మని చెప్పదగును. భోజుడు మాత్రము "తాలుశోషో భవేద్వాతాత్" అని వాతమును మాత్రము చెప్పెను.

### తాలుపాక లక్షణము

పిత్తం కుర్యాత్పాకమత్యర్థఘోరం
తాలున్యేవం తాలుపాకం వదన్తి. 38

పి త్తము ప్రకోపమునొంది తాలువునందు మిక్కిలి క్రూరమైన పుండును కల్గించును. దీనిని తాలుపాక మని చెప్పెదరు.

ఇత్తెరంగున తొమ్మిదివిధములైన తాలుగత వ్యాధులు చెప్పబడినవి. అష్టాంగ హృదయమున నెనిమిది తాలుగతరోగములు మాత్రమే చెప్పబడినవి.

కంఠగతరోగములు పదునేడు; అందు రోహిణీసంప్రాప్తి

గలేఽనిలః పిత్తకఫౌ చ మూర్ఛితౌ
ప్రదూష్య మాంసం చ తథైవ శోణితమ్,
గలోపసంరోధకరై స్తథఙ్కురైః
నిహన్త్యసూ న్వ్యాధిరియం హి రోహిణీ. 39

వాత-పిత్త-కఫములు మూడును ప్రకోపమునొంది మాంసమును రక్తమును చెరిచి కంఠబిలమున మాంసపుమొలకల గల్గించును. అయ్యవి గళబిలమును అడ్డగించును. ఈ వ్యాధి రోహిణి యని చెప్పబడును. ఇయ్యది మిక్కిలి క్రూరమై ప్రాణములను తప్పక తీయును.

ఈవ్యాధి వాతపిత్తకఫములచే వేర్వేరుగను సన్నిపాతముచేతను, రక్తముచేతను జనించుటంజేసి ఐదువిధములుగ నుండును. ఈవిషయమును "పృథక్సమస్తాశ్చ తథైవ శోణితమ్" అని సుశ్రుతాచార్యుండును, "వాతః పిత్తం కఫో రక్తం చైకశస్సర్వశోఽపి వా, కణ్ఠం యదా నిషేవంతే" అని భోజుడును వివరముగ జెప్పిరి.

ఈ మూలగ్రంథమున త్రిదోషములచే జనించు నని చెప్పినను సుశ్రుతాదివాక్యములబట్టి ఇయ్యది సన్నిపాతమున జనించినను వాతపిత్తకఫములలో వాతం బధికముగ నున్నపుడు వాతికం బనియు, పిత్తం బధికముగ నున్నపుడు పైత్తికం బనియు, కఫం బధికముగ నుండుతరి కఫజ మనియు వ్యవహరింపబడు నని "వ్యపదేశస్తుభూయసా" అను న్యాయమునుబట్టి యెరుంగునది.

మరియు—"సద్యస్త్రిదోషజా హన్తి త్ర్యహాత్ శ్లేష్మసముద్భవా, పఞ్చాహాత్పిత్తసమ్భూతా సప్తాహాత్పవనోత్థితా" అను ఖరనాద వాక్యమునుబట్టి యీ రోహిణి యనునది వాతమున జనించెనేని యేడుదినములు గడచినపిదప చంపు ననియు, పిత్తమున గల్గినయెడ ఐదునాళ్ళకు పిదప చంపు ననియు, కఫమున కల్గినది మూడునాళ్ళకు పిదప చంపు ననియు, త్రిదోషసన్నిపాతమున గలిగినది అప్పుడే చంపు ననియు కాలనియమము నెరుంగునది. వాగ్భటాచార్యుడును "రోహిణీ శీఘ్ర

కారిణీ" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౪౧) అనువాక్యముచేత నీవ్యాధి మిక్కిలి క్రూరమై యతి శీఘ్రముగ చంపునని చెప్పెను.

### వాతికరోహిణీలక్షణము

జిహ్వాసమన్తాద్భృశవేదనాస్తు
మాంసాఙ్కురాః కణ్ఠనిరోధినో యే,
సా రోహిణీ వాతకృతా ప్రదిష్టా
వాతాత్మకోపద్రవగాఢయుక్తా. 40

వాతప్రకోపమున జనించిన రోహిణీవ్యాధియందు కంఠమున కల్గిన మాంసాంకురములు మిక్కిలి బాధ కల్గించుచు, నాలుకయందెల్ల వ్యాపించి కంఠనాళము నడ్డగించును మరియు వాతముచే గల్గు నుపద్రవములు కూడ మిక్కిలి గాఢములుగ నుండును.

మరియు భోజు డిట్లు చెప్పెను:—"తాలుశ్శుష్యతి కణ్ఠశ్చ వాతేనాయమ్యతే యదా, కంఠేఽస్యాన్నం ప్రసజ్జేత సప్తాహాత్స జహాత్యసూన్" వాతముచే జనించిన రోహిణీవ్యాధియందు తాలువులు గొంతును ద్రవము లేక యెండును. కంఠ మీడ్చినట్లుండును. భుజించిన యాహారపదార్థము మాంసాంకురములచే నడ్డగింపబడి కుత్తుకయందే నిలచును. ఈ వ్యాధియందు ఏడు దినములవరకు చికిత్సచేయక యుపేక్షించినచో నంతకుపైని చంపును.

### పైత్తికరోహిణీలక్షణము

క్షిప్రోద్గమా క్షిప్రవిదాహపాకా తీవ్రజ్వరా పిత్తనిమిత్తజా తు,

పిత్తమున జనించిన రోహిణియందు కంఠమున మాంసాంకురములు అతి శీఘ్రముగ బొడమి మిక్కిలి తీవ్రమైన మంటతో గూడి పుండును మిక్కిలి తీవ్రమైన జ్వరంబును కల్గును.

మరియు భోజు డీ పిత్తరోహిణియందు కలుగు విశేషోపద్రవముల నిట్లు చెప్పెను:—"ఉష్యతే చుష్యతే పిత్తాత్ ధూప్యతే పరిదహ్యతే, అఙ్గారైరివ జహ్యాత్స ప్రాణానాశు చతుర్దినాత్" మంటలో నున్నట్లు గబగబ మండును. గొట్టముచే పీలువబడినట్లు బాధకల్గును. పొగ వెడలునట్లుండును. నిప్పుకణముల జల్లినట్లు విశేషముగ మండును. ఈ యుపద్రవములు పిత్తముచే గల్గును. ఇయ్యది నాల్గుదినములలో చికిత్స చేయనినాడు అతిశీఘ్రముగ ప్రాణముల గొంపోవును.

### కఫజనితరోహిణీలక్షణము

స్రోతోనిరోధిన్యచలోద్గతా చ స్థిరాఙ్కురా యా కఫసమ్భవా సా.

కఫప్రకోపమున జనించిన రోహిణీవ్యాధియందు కంఠమునందు కఠినములగు మాంసాంకురములు కల్గి కంఠద్వారము నడ్డగించును.

భోజు డిట్లు చెప్పెను:—"కఫాదంతర్బహిశ్శోథః శ్వాసః కంఠశ్చ బాధ్యతే, యస్య సోఽసూన్ త్యజేద్రోగీ త్ర్యహాద్రోహిణిపీడితః" కఫమున కలిగిన రోహిణీ వ్యాధియందు కంఠమునకు లోపలను వెలుపలనుకూడ వాపుకలిగి శ్వాసము తీవ్రముగ వెడలుచు కంఠమున తీవ్రముగ బాధ కలుగును. ఈ లక్షణములు కల రోగికి మూడు దినములవరకు చికిత్సచేయనిచో తోడనే ప్రాణములు గోల్పోవును.

## సాన్నిపాతికరోహిణీలక్షణము

గమ్భీరపాకిన్యనివార్యవీర్యా త్రిదోషలిఙ్గా త్రితయోత్థితా చ,

త్రిదోషముల సన్నిపాతమున గలిగిన రోహిణీవ్యాధియందు మిక్కిలి లోతులో బరిపక్వమగును. దోషములు మూడిటికి వేరువేరుగ జెప్పిన లక్షణము లన్నియు నొక్కటిగ జేరి యుండును. దీనిశక్తి యెట్టి చికిత్సచే నైనను నివారింప నలవి కాకుండును.

భోజుడు సాన్నిపాతికము నిట్లు చెప్పెను:—"సర్వదోషకృతా యా తు సర్వలిఙ్గసమన్వితా, అసాధ్యాం తాం విజానీయాత్ రోహిణీం సన్నిపాతజామ్" సన్నిపాతజనిత రోహిణీవ్యాధి త్రిదోషములకు వేరువేర జెప్పిన లక్షణములు కలిగి మిక్కిలి యసాధ్యంబై యుండును.

## రక్తజ రోహిణీలక్షణము

స్ఫోటైశ్చితా పిత్తసమానలింగాఽసాధ్యా ప్రదిష్టా రుధిరాత్మికాతు,

కంఠమునందు బొబ్బలుకల్గి పిత్తజరోహిణికి చెప్పినలక్షణములు కలిగి యుండునది రక్తమున కల్గిన రోహిణి యని చెప్పనగును. ఇయ్యదియు నసాధ్యము.

## కంఠశాలూకలక్షణము

కోలాస్థిమాత్రః కఫసమ్భవో యో గ్రంథిర్గలే కంటకశూకభూతః,
ఖరస్స్థిరశ్శస్త్రనిపాతసాధ్యః తం కంఠశాలూకమితి బ్రువన్తి. 43

కఫము ప్రకోపించి కంఠమున రేగుపండులోని గింజంత పరిమితికల్గి, కఠినంబును స్థిరంబునైన గ్రంథిరూపమైన వాపును కల్గించును. ఇయ్యది జలశూకమును బోలియు ముల్లువలెను కుత్తుక కడ్డపడును. ఇయ్యది శస్త్రచికిత్సచే సాధింపదగు గాని కేవలము ఔషధములచే సాధ్యము కాజాలదు.

వాగ్భటాచార్యుడు:—"దోషైః కఫోల్బణైః శోఫః కోలవద్గ్రథితోన్నతః, శూకకంటకవత్కణ్ఠే శాలూకో మార్గరోధనః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౪౫.) అని చెప్పెను. దీనిచేత కఫము మిక్కుటముగ నుండు త్రిదోషముల సన్నిపాతముచేత నీవ్యాధి జనించు ననియు, ఇయ్యది కంఠమార్గము నడ్డగించు ననియు తెలిసెడిని.

## అధిజిహ్వాలక్షణము

జిహ్వాగ్రరూపశ్శ్వయథుః కఫాత్తు జిహ్వోపరిష్టాదపి రక్తమిశ్రాత్,
జ్ఞేయోఽధిజిహ్వః ఖలు రోగ ఏష వివర్జయేదాగతపాకమేనమ్. 44

నాలుకకు పైభాగమున నాలుక కొనవలె నిడుపైన వాపు రక్తముతో గూడిన కఫముచే గల్గును. ఇది అధిజిహ్వ మని చెప్పబడును. ఇది పక్వమైనచో మిక్కిలి యసాధ్య మగును. కావున చికిత్స చేయంజనదు.

నాలుకకుమీద జనించినది అధిజిహ్వ మనియు, అడుగుభాగమున బొడమునది యుపజిహ్వ మనియు నీరెంటికిని పరస్పరభేదము నెరుంగునది. క్రిందపుట్టునది అధి జిహ్వ మనియు, పైనపుట్టునది యుపజిహ్వ మనియు వాగ్భటాచార్యునిమతము. నామ మాత్రము వ్యత్యాసమేగాని లక్షణముల భేదము గానరాదు. ఈ రెండును సమానలక్షణములై నాలుకకు క్రిందను పైభాగమునను జనించునవి కావున ఈ యధిజిహ్వమును కూడ జిహ్వారోగములలో బఠించుట సమంజసము. కాని భిన్నముగ పఠించుట యుక్తి దూరము. వాగ్భటాచార్యుడు మాత్రము జిహ్వారోగములయందే రెండిటిని పఠించెను; కావున దానికి విరుద్ధముగ భిన్నస్థలముల బఠించుట యనార్షము.

## వలయలక్షణము

బలాస ఏవాయతమున్నతం చ శోథం కరోత్యన్నగతిం నివార్య,
తం సర్వథైవాఽప్రతికార్యవీర్యం వివర్జనీయం వలయం వదంతి. 45

కఫము ప్రకోపమునొంది కంఠమునందు నిడుదయు ఉన్నతంబునగు కడియము వంటి వాపును గలిగించును. అయ్యది యాహారమును లోనికి జొరనీయక కంఠబిలము నడ్డగించును. దీనిని వలయ మని చెప్పెదరు. ఇయ్యది యెదురులేని శక్తి కలదియై చికిత్సకు సాధ్యము గాకుండును. కావున చికిత్స చేయంజనదు.

## బలాసలక్షణము

గలే తు శోథం కురుతః ప్రవృద్ధౌ శ్లేష్మానిలౌ శ్వాసరుజోపపన్నమ్,
మర్మచ్ఛిదం దుస్తరమేనమాహుర్బలాససంజ్ఞం నిపుణా వికారమ్.46

కఫవాతములు రెండునుం గలసి ప్రకోపమునొంది శ్వాసముతోడను నొప్పి తోడను గూడినవాపును కుత్తుకలో గలిగించును. ఇయ్యది హృదయాది మర్మముల భేదించును. దీనిని బలాస మని చెప్పెదరు. ఈ వ్యాధి మిక్కిలి దుస్తరమై యసాధ్య ముగ నుండును.

## ఏకబృందలక్షణము

వృత్తోన్నతోఽన్తశ్శ్వయథుస్సదాహఃసకణ్డురోఽపాక్యమృదుర్గురుశ్చ,
నామ్నైకబృన్దః పరికీర్తితోఽసౌ వ్యాధిర్బలాసక్షతజప్రసూతః. 47

కంఠనాళమునకు లోపల నొకతట్టున వర్తులంబును, ఉన్నతంబును, మంటతో గూడినదియు, దురద కలిగినదియు, పక్వముకాని స్వభావము కలిగినదియు, కఠినంబును, పెద్దదియునగు వాపు కలుగును. ఇది యేకబృంద మని చెప్పబడును. ఇయ్యది కఫరక్త ములచే కల్గును.

## బృందలక్షణము

సమున్నతం వృత్తమమన్దదాహం తీవ్రజ్వరం బృన్దముదాహరన్తి,
తచ్చాపి పిత్తక్షతజప్రకోపాత్ జ్ఞేయం సతోదం పవనాత్మకం తు.48

ఉన్నతంబును, వర్తులంబును, తీవ్రమైన మంట కల్గినదియు, మిక్కిలి తీవ్రమైన జ్వరముకల్గినదియు నగు వాపు కంఠమున గల్గును. దీనిని బృందమని చెప్పెదరు. ఇయ్యది పిత్తరక్తములచే గల్గును. అదియే తీవ్రమైన పోటుకల్గియున్నచో వాతముచే జనించి నది యని యెరుంగునది.

పై జెప్పిన యేకబృందంబును, బృంద మను నీవ్యాధియు కంఠమునందు ఒక్క విధమైన యాకృతితో బుట్టును. జనించునట్టి స్థానంబును ఆకృతియు నొకటేరీతిగ నుండుటంజేసి యీ రెండిటికి నించుకేనియు భేదము గానరాదు; గాని ఏకబృందము కఫ రక్తములచే జనించును. బృందము పిత్తరక్తములచే జనించును. ఇదియ యీ రెండిటికిని భేదము. ఈవిషయమును భోజుం డిట్లు చెప్పెను:—శ్లేష్మరక్తసముత్థాన మేకబృన్దం విభావయేత్, తుల్యస్థానాకృతిర్బృన్దో బృందజో రక్తపిత్తజః'' ఏకబృందము కఫరక్త ముచే కల్గు ననియు, పిత్తరక్తములను కారణములుగజేసి ఏకబృందమువలెనే జనించునది బృంద మనియు, ఈ రెండిటికి ఆకృతియు స్థానంబును నొక్కటే యై యుండు ననియు భావము.

స్థానాకృతులచే భేదము లేదు కావున నీ రెండును ఒక్కటిగనే పరిగణింపబడును. కావుననే కంఠరోగములు పదునేడను సంఖ్య సమంజస మగును. లేనిచో ఏక బృందబృందములు రెండుగ లెక్కనిడిన పదునెనిమిది యగును.

## శతఘ్నీలక్షణము

వర్తిర్ఘనా కణ్ఠనిరోధినీ యా చితాఽతిమాత్రం పిశితప్రరోహైః,
అనేకరుక్ప్రాణహరీ త్రిదోషాత్ జ్ఞేయా శతఘ్నీవ శతఘ్నిరూపా.

అనేకములగు మాంసాంకురములచే నిండి ఘనంబును, పిరంగిగుండువలె కఠినంబై గుండ్రనియాకారంబును కల వాపు కంఠమునకల్గి, కంఠనాళమును అడ్డగించియున్నచో నయ్యది పిరంగిగుండును బోలియుండుటంజేసి శతఘ్ని యనబడును. ఇది త్రిదోషసన్నిపాతమున జనించును; కావున త్రిదోషములచే గల్గు నొప్పి పోటు మంట జిల మున్నగు బాధల గల్గియుండును.

వాగ్భటమున "శతఘ్నీవాతిరుక్కరీ" అని యుండుటచే నియ్యది పిరంగిగుండువలె మిక్కిలి తీవ్రమైనబాధ గల్గించునది యని యెరుంగునది. (శతఘ్నియన పిరంగి.)

## గలాయులక్షణము

గ్రంథిర్గలేత్వామలకాస్థిమాత్రః స్థిరోఽతిరుక్ యః కఫరక్తమూర్తిః,
సంలక్ష్యతే సక్తమివాశనం చ సశస్త్రసాధ్యస్తు గలాయుసంజ్ఞః. 50

ఉసిరికకాయలోపలి గింజమాత్రము పరిమాణముకల్గి కఠినమై మిక్కిలి తీవ్రమైనబాధతో గూడిన గ్రంథి కంఠబిలమున జనించిన నయ్యది గలాయు వనదగును. ఇయ్యది కఫరక్తములచే గల్గును. ఈగ్రంథి కంఠనాళమునందు అన్నపుముద్ద అడ్డుపడిన విధముగ కంఠమార్గము నడ్డగించును. ఇది కేవలము శస్త్రచికిత్సచే సాధింపదగును గాని ఔషధములు పని సేయవు.

ఈవ్యాధిస్వరూపమును వాగ్భటాచార్యుడు కొంచెము మార్పుతో నిట్లు చెప్పెను:—"మాంసకీలో గలే దోషైః ఏకోఽనేకోఽథవాల్పరుక్,కృచ్ఛ్రోచ్ఛ్వాసాభ్యవహృతిః పృథుమూలో గలాయుకః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౪౯.) వాతాది దోషములు మూడును ప్రకుపితములై కంఠమున మాంసపు చీల నొకటినైనను అనేకములనైనను కల్గించును. ఇది స్వల్పమైన బాధ కల్గియుండును. ఉచ్ఛ్వాసవాతంబు వెడలుటకును, ఆహారపదార్థము లోపల పోవుటకును ఇది యడ్డముగ నుండుటచే మిక్కిలి కష్టముగ నుండును. దాని మూలము చాలగొప్పదిగ నుండును అని భావము. ఈవాక్యమును బట్టి చీలవంటి యాకారముతో నొకటిగనైనను, అనేకములుగనైనను నుండు ననియు, త్రిదోషములచే జనించుననియు తెలిసెడిని. ప్రకృతమూలమున కఫరక్తములచే జనించు ననియు, ఉసిరికాయనుబోలె నుండగ నుండు ననియు చెప్పుటచే భేదము కనబడుచున్నది. కాలాద్యనుగుణముగ నిట్టి యాకారాదిభేదములు వ్యాధులయందు మారుచుండు నని యూహింపదగియున్నది.

## గలవిద్రధిలక్షణము

సర్వం గలం వ్యాప్య సముత్థితో యః శోథోరుజస్సన్తిచయత్రసర్వాః,
స సర్వదోషైః గలవిద్రధిస్తు తస్యైవ తుల్యః ఖలు సర్వజస్య. 51

మూడుదోషములును సమములుగ ప్రకోపించి గళబిలమునందంతట నిండియుండునట్లు వాపును కల్గించును. దీనియందు త్రిదోషములచే గల్గునొప్పి మంట జిల మున్నగు బాధలన్నియు కల్గియుండును. దీనిని గలవిద్రధి యని చెప్పెదరు. ఇయ్యది సన్నిపాత విద్రధికి జెప్పినలక్షణములు గల్గియుండును.

వాగ్భటమున:—"శీఘ్రజన్మపాకో మహారుజః, పూతిపూయనిభఃస్రావీశ్వయథుర్గలవిద్రధిః" (అ. హృ. ఉత్త. అ. ౨౧. శ్లో. ౫౧) అని చెప్పియుండుటంజేసి యియ్యది కంఠమునందు పూర్తిగ వ్యాపించి శీఘ్రముగపుట్టి శీఘ్రముగనే పండి పగిలి దుర్గంధమై చీముతో సమమైన నీరు గారు ననియు తెలిపెడిని.

## గలౌఘలక్షణము

శోథో మహానన్నజలావరోధీ తీవ్రజ్వరో వాయుగతేర్నిహన్తా,
కఫేన జాతో రుధిరాన్వితేన గలే గలౌఘః పరికీర్త్యతే తు. 52

గళబిలమున మిక్కిలి స్థూలముగ వాపుకల్గును. ఇది మిక్కిలి తీవ్రమైన జ్వరమును గల్గించి అన్నమును నీళ్లను లోపలపోనీయక ప్రాణవాతమును సంచరింపనీయక దానిమార్గము నడ్డగించియుండును. ఇది గలౌఘ మని చెప్పబడును. ఇయ్యది కఫరక్తములచే గల్గును.

దీనిలక్షణము వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను.—"బాహ్యేన్తశ్శ్వయథుర్ఘోరో గలమార్గార్గలోపమః, గలౌఘో మూర్ధగురుతా తంద్రాలాలాజ్వరప్రదః" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౪౮) ఈవాక్యముచేత నీరోగమునందు కుత్తుకలోప్రక్కను వెలిప్రక్కను క్రూరమైన వాపుకల్గి కంఠనాళమునకు గడియవేసిన విధముగ నడ్డముగనుండు ననియు, తలబరువై మైకముగూడ గ్రమ్ముననియు తెలిపెడిని.

## స్వరఘ్న లక్షణము

యస్తామ్యమానశ్శ్వసితి ప్రసక్తం భిన్నస్వరశ్శుష్కవిముక్తకణ్ఠః,
కఫోపదిగ్ధేష్వనిలాయనేషు జ్ఞేయస్సరోగశ్శ్వసనాత్ స్వరఘ్నః. 53

శరీరములో వాతము సంచరించునాడులయందు కఫముచేరినచో మనుజుండు గొంతెండి, చీకటనున్నవానివలె నేమియునెరుంగలేక, కంఠస్వరముమారి, గొంతులో

నడ్డుపడిన విధముగ, మిక్కిలి ఆయాసముతోఁగూడి శ్వాసము విడుచుచు. ఇది స్వరఘ్నమని చెప్పబడును. ఇది వాతప్రకోపమున జనించును.

### మాంసతానక లక్షణము

ప్రతానవాన్ యశ్శ్వయథుస్సుకష్టోగలోపరోధం కురుతే క్రమేణ,
స మాంసతానః కథితోఽవలమ్బీ ప్రాణప్రణుత్సర్వకృతో వికారః.

కంఠబిలమున మిక్కిలి క్రూరమయిన వాపుకల్గి నానాట వృద్ధినొంది కొంత కాలమునకు కంఠమార్గము నడ్డగించును. కుత్తుకయందు ఉంటబెట్టినవిధముగ వ్రేలాడు చుండును. ఇది సన్నిపాతమున జనించును. మిక్కిలి బాధగల్గించి తుదకు ప్రాణముల గొంపోవును. (మిక్కిలి యసాధ్య మనుట) ఇది మాంసతాన మని చెప్పబడును.

### విదారీ లక్షణము

సదాహతోదంశ్వయథుం సుతామ్ర మన్తర్గలే పూతివిశీర్ణమాంసమ్,
పిత్తేన విద్యాద్వదనే విదారీం పార్శ్వే విశేషాత్స తు యేన శేతే.

కుత్తుకలోపల మంటయు సూదుల బొడిచినట్లు పోటును గల్గి యెఱ్ఱనైన వాపు కల్గును. ఇయ్యది మిక్కిలి దుర్గంధముతోఁగూడి మాంసము శిథిలమైయుండును. ఇయ్యది పిత్తప్రకోపమున గల్గిన విదారి యనబడును. ఈరోగము మనుజు డేప్రక్క నొత్తగిలి పరుండునో ఆ ప్రక్కనే విశేషముగ గల్గును.

మరియు భోజుడు:—"పిత్తేన జాతో వదనే వికారః పార్శ్వే విశేషాత్ స తు యేన శేతే, స్నాయుప్రతానప్రభవో విశేషాత్ దాహప్రపాకప్రచురో విదారీ" అని చెప్పెను. ఈ వాక్యముచేత నీవాపు స్నాయువుల నాశ్రయించి పుట్టు ననియు, అధికమైన మంటపుట్టి పుం డగు ననియు తెలిసెడిని.

(ఇత్తెరంగున రోహిణీవ్యాధి వాతాదిభేదములచే నైదును, పిదప కంఠశాలూకము మొదలుచేసి విదారివరకుం గల పండ్రెండురోగంబులుం గలిసి పదునేడు విధములగు కంఠగతరోగములు వివరింపబడియె. ఏకబృంద-బృందములు రెండును జేరి యొక్కటి యని పైనఁ జెప్పియున్నది గాన సంఖ్యాభేదములే దని మరువకుండునది. వాగ్భటమున మాత్రము పదునెనిమిది భేదములు కానంబడియెడు.)

### సర్వసరములు మూడు, అందు వాతికము

స్ఫోటైస్సతోదైర్వదనంసమంతాత్ యస్యాచితంసర్వసరస్సవాతాత్,

నోటియంతటను వ్యాపించి కల్గురోగము సర్వసరము. అయ్యది వాత-పిత్త-కఫ భేదములచే మూడుతెరంగులు. అందు వాతప్రకోపముచేత నోటిలోపల అంతటను బొబ్బలుకల్గి పోటును నొప్పియు కల్గును.

### పైత్తికసర్వసర లక్షణము

రక్తైస్సదాహైస్తనుభిస్సపీతైర్వ్యాప్తంచితం చాపి సపిత్తకోపాత్,

పిత్తప్రకోపమువలన పీతవర్ణకంబులును రక్తవర్ణంబులు నై మంటతోగూడి మిక్కిలి సూక్ష్మములైన బొబ్బలు నోటిలోపల నంతట వ్యాపించును. ఇది పిత్తమున గల్గిన సర్వసరము.

### కఫజసర్వసర లక్షణము

ఆవేదనైః కణ్డుయుతైస్సవర్ణైర్వ్యాప్తంచితం చాపి సవై కఫేన. 56

నొప్పిలేక తీవ్రమైన దురద కల్గి నోటికి సమానమైన రంగు కల్గిన బొబ్బలు నోటిలో సంతట వ్యాపించిన నది కఫప్రకోపమున గల్గిన సర్వసరము.

రక్తమున జనించిన సర్వసరలక్షణమును భోజు డిట్లు చూపెను:—"రక్తేన పిత్తోదిత ఏవ చాపి కైశ్చిత్ప్రియుక్తో ముఖపాక సంజ్ఞః" రక్తముచే జనించిన సర్వసరం బను ముఖపాకము పిత్తమునకు జెప్పినలక్షణములు కల్గియుండునని కొందఱు వచించెదరు. అని యర్థము. ఇయ్యది పైత్తికమునకు సమానలక్షణము కావున చికిత్సయందును దీనికి భేదము కలుగబోదు. కావున మూడువిధములుగనే ప్రకృతమూలమున జెప్పబడినది. భోజుడును ఈ యభిప్రాయము చేతనే 'కైశ్చిత్ప్రియుక్తః' అని పరోక్షముగ నిర్దేశించెను.

పై జెప్పబడిన సర్వసరములు మూడును ముఖపాక మని కొందరాచార్యులు చెప్పిరి. (అనగా నోటిలో నంతటను వ్యాపించిన నోటిపుండు.) దీని సంప్రాప్తిని సామాన్యలక్షణమును వాగ్భటాచార్యు లిట్లు నిర్దేశించిరి:—"కరోతి వదన స్యాన్తః వ్రణాన్ సర్వసరోఽనిలః, సఞ్చారిణోఽరుణాన్ సూక్ష్మాన్ ఓష్ఠౌ తామ్రౌ చలత్వచౌ. జిహ్వాశీతాఽసహా గుర్వీ స్ఫుటితా కంటకాచితా, వివృణోతి చ కృచ్ఛ్రేణ ముఖం పాకోముఖస్య చ" (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౧౪-౧౫) వాతము ప్రకోపించి నోటియందంతటను వ్యాపించి నోటిలో నంతటను వ్రణములను కల్గించును. అయ్యవి యొకచోటనుండి వేరొకచోటికి నోటిలో వ్యాపించుచుండును. అరుణవర్ణంబై మిక్కిలి సూక్ష్మములైన యాకారము కల్గియుండును. పెదవులు ఎఱ్ఱనై చర్మమూడుచుండును. నాలుక చల్లని స్పర్శమును సహింపజాలక మొద్దుబారి యుండును. అచ్చటచ్చట పగిలి ముండ్లు నిండియుండునట్లు కరకర మని యుండును. అట్టి నోటిపుండుచేత నోరు తెరువజాలక మిక్కిలి కష్టముచే తెరచును. ఇయ్యది ముఖపాక మన బడును అని భావము. ఇత్తెరంగున "దన్తేష్వష్టౌ......ఏకషష్టిః చతుః పరా" అని భోజుడు నిర్దేశించిన ప్రకారము తన్మతానుసారముగ మాధవకరుడు అరువదియైదు ముఖరోగములను వివరించెను. వాగ్భటాచార్యులు "వక్త్రే సర్వత్ర చేత్యుక్తాః పంచ

సప్తతిరామయాః” (అ. హృ. ఉ. అ. ౨౧. శ్లో. ౬౫.) అని డెబ్బదియైదు ముఖరోగములను వివరించి చెప్పిరి. వాని వివరణమంతయు విపులంబగుటం జేసి విస్తరభీతిచే నిట వివరింపఁబడదయ్యె.

### ముఖరోగములలో సాధ్యాసాధ్యనిర్ణయము

ఓష్ఠప్రకోపే వర్జ్యాస్స్యుః మాంసరక్తత్రిదోషజాః,
దన్తమూలేషు వర్జ్యా చ త్రిలిఙ్గగతిసౌషిరౌ. 57
దన్తేషు చ న సిధ్యన్తి శ్యావదాలనభఞ్జనాః,
జిహ్వారోగే బలాసస్తు తాలవ్యేష్వర్బుదం తథా. 58
స్వరఘ్నో వలయో బృన్దో బలాసశ్చ విదారికా,
గలౌఘో మాంసతానశ్చ శతఘ్నీ రోహిణీగలే. 59
అసాధ్యాః కీర్తితా హ్యేతే రోగా నవదశైవ తు,
తేషు చాపి క్రియాం వైద్యః ప్రత్యాఖ్యాయ సమాచరేత్. 60

ఓష్ఠగతవ్యాధులలో మాంసగతంబును, రక్తగతంబును, సన్నిపాతజనితంబును అసాధ్యములు. దంతమూలవ్యాధులలో సన్నిపాతం బగు నాడీరోగంబును, మహాసౌషిరంబును అసాధ్యములు. దంతగతవ్యాధులలో శ్యావదంతంబును, దాలనంబును, భంజనంబును అసాధ్యములు. జిహ్వాగతరోగములలో బలాసం బొక్కటి యసాధ్యము. తాలుగతరోగములలో నర్బుదం బొకటి యసాధ్యము. కంఠగతవ్యాధులలో సర్వఘ్నంబును, వలయంబును, బృందంబును, బలాసంబును, విదారికయు, గలౌఘంబును, మాంసతానంబును, శతఘ్నియు, రోహిణియు అను నీతొమ్మిదియు నసాధ్యంబులు. ఇత్తెరంగున ముఖరోగములలో మొత్తమున పందొమ్మిదిరోగములు అసాధ్యములు. అయినను ఈవ్యాధులు కుదురుట దుర్ఘటమని వైద్యుడు తొలుతనే చెప్పి దేశకాలాద్యనుగుణముగ సముచితంబగు చికిత్సచేయుట శ్రేయోదాయకము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
ముఖరోగనిదానం సమాప్తమ్.

# ౫౭. కర్ణరోగనిదానమ్

ముఖరోగములను జెప్పునపుడు ముఖములో నొక యంగమైన జిహ్వాకు సంబంధించినరోగములు చెప్పబడినవి. అయ్యది యింద్రియములలో ప్రధానమైన రసనేంద్రియము. అట్టి రసనేంద్రియగతరోగముల జెప్పినపిదప ఇంద్రియత్వసామ్యముచే తక్కిన యింద్రియములరోగములను జెప్పదలచి అందు కర్ణరోగముల నిదానమును జెప్పుట.—

### కర్ణశూలలక్షణము

సమీరణశ్శ్రోత్రగతోఽన్యథా చరన్
సమంతతశ్శూలమతీవ కర్ణయోః,
కరోతి దోషైశ్చ యథాస్వమావృతః
స కర్ణశూలః కథితో దురాచరః. 1

వాతము ప్రకోపమునొంది చెవులయందంతట ప్రతిలోమముగ సంచరించుచు తక్కిన కఫపిత్తములం గలిసి చెవులయందు మిక్కిలి పోటును కల్గించును. ఇయ్యది కర్ణశూల మని చెప్పబడును. ఇది మిక్కిలి కష్టసాధ్యము.

ఇచ్చట వాతాదులబోలె రక్తముగూడ దుష్టమైనపుడు రోగముల గల్గించును. కావున దోషశబ్దముచే రక్తంబును గ్రహింపబడును. కావున వాతము కఫపిత్తముల తోడను, రక్తముతోడను కలిసి కర్ణశూలమును గల్గించు నని ఫలితార్థము. మరియు— "ఏకః ప్రకుపితో దోషః సర్వానేవప్రకోపయేత్" అను న్యాయమున ఒక దోషము ప్రకోపించి, పిదప తక్కిన దోషములనుగూడ ప్రకోపింపజేయును. అందు తొలుత ప్రకోపమునొందిన దోషము ప్రధానం బై, పిమ్మట ప్రకోపించిన దోషములు అనుబంధములుగ నుండును. అటుగాక రెండేసిదోషములు వానివాని కారణములచే సమములుగ ప్రకోపించి యొకటితో నొకటి చేరినచో సంసర్గ మనబడును. అన్నియుం ఆ కారణములచే ప్రకోపమునొందినచో సన్నిపాత మనబడును. కావున నీకర్ణశూలమున వాతము మొదట ప్రకుపితమై పిదప కఫపిత్తరక్తముల బ్రకోపింపజేసి రోగమును కల్గించును. కావున వాతమునకు తక్కిన దోషములు అనుబంధములై యుండు నని యెఱుంగునది.

మరియు:—విదేహుడు కర్ణశూలోపద్రవములో నిట్లు చెప్పెను.—"మూర్ఛా దాహో జ్వరః కాసో హృల్లాసోవమథుస్తథా, ఉపద్రవాః కర్ణశూలే భవన్త్యే తే

మరిష్యతః" మూర్ఛ, తాపము, జ్వరము, దగ్గు, హృల్లాసము, వాంతి అనునివి యన్నియు కర్ణశూలమున గల్గు నుపద్రవములు. ఈయుపద్రవములు కల్గినయెడ మనుజుడు తప్పక మరణము నొందును.

## —⊚ కర్ణనాదలక్షణము ⊚—

కర్ణస్రోతస్థితే వాతే శృణోతి వివిధాన్ స్వరాన్,
భేరీమృదఙ్గశఙ్ఖానాం కర్ణనాదస్స ఉచ్యతే. 2

శిరోగతంబైన వాతము కర్ణరంధ్రములయందలి శబ్దవాహినులగు సిరల జేరినపుడు భేరి, మద్దెల, శంఖము మున్నగువాని ధ్వనులబోలె నానావిధములగు ధ్వనులు వినబడును. ఇయ్యది కర్ణనాద మను రోగము.

వాతవాహినులగు సిరలలో నాల్గు కర్ణములయం దుండు నని 'కర్ణయోశ్చతస్రః' అని సుశ్రుతాచార్యులు చెప్పియున్నారు. అట్టి సిరలయందలి వాతము ప్రకుపితమై కర్ణరంధ్రముల వ్యాపించినపుడు పైజెప్పినరీతిగ కర్ణనాద మను రోగము కల్గు నని యెరుంగునది.

ఈకర్ణనాద సంప్రాప్తిలక్షణములు విదేహునిచే నిట్లు చెప్పబడియె—"శిరోగతో యదా వాయుః శ్రోత్రయోః ప్రతిపద్యతే, తదా తు వివిధాన్ శబ్దాన్ సమీరయతి కర్ణయోః. భృంగారుక్రౌఞ్చనాదం వా కాకమణ్డూకయో స్తథా, తన్త్రీమృదఙ్గశబ్దం వా సామతూర్యస్వనం తథా. గీతాధ్యయనవంశానాం నిర్ఘోషం క్ష్వేడనం తథా, అపామివ పతన్తీనాం శకటస్యేవగచ్ఛతః, శ్వసతామివ సర్పాణాం సదృశః శ్రూయతే స్వనః" శిరస్సునందలి వాతము చెవులయందలి శబ్దవహస్రోతస్సుల జేరి ప్రకుపితమైనపుడు చెవులకు పలుతెరంగులైన శబ్దములు వినబడును. అవి యెవ్వియనః—బంగరు గిన్నెను వాయించినపుడు మ్రోయుచందమునను, క్రౌంచము, కాకి, కప్ప ఇవి కూయు విధముగను ధ్వని వినబడును. తంబురతంతులయొక్కయు, మృదంగముయొక్కయు, సామగానముయొక్కయు, తూర్యాది వాద్యములయొక్కయు ధ్వనియైనను వినబడును. సంగీతముయొక్కయు, అధ్యయనముయొక్కయు, పిల్లనగ్రోవియొక్కయు ధ్వనియును, సింహనాదమువంటి ధ్వనియును, ఉన్నతస్థలమునుండి క్రిందికి దుముకు (ధారగాపడు) నీటిధ్వని విధముగ ధ్వనియును, పోవుచుండు బండివలన గల్గు ధ్వనియును, బుస్సని బుస కొట్టు సర్పములవంటి ధ్వనియును వినబడును.

## —⊚ బాధిర్య (చెవుడు) లక్షణము ⊚—

యదా శబ్దవహం వాయుః స్రోత ఆవృత్య తిష్ఠతి,
రుద్ధశ్శ్లేష్మాన్వితో వాపి బాధిర్యం తేన జాయతే. 3

కేవల వాతము ప్రకుపితమై చెవులయందలి శబ్దమును వహించు ధమనుల నడ్డగించినను, లేక వాతము కఫముతోఁగూడి శబ్దవహంబులగు ధమనుల నడ్డగించినను చెవులు శబ్దమును గ్రహించు శక్తిలేక వినబడకుండును. ఇది బాధిర్య మనబడును.

## కర్ణక్ష్వేడలక్షణము

వాయుః పిత్తాదిభిర్యుక్తో వేణుఘోషోపమం స్వనమ్,
కరోతి కర్ణయోః క్ష్వేడం కర్ణక్ష్వేడస్స ఉచ్యతే. 4

వాతము ప్రకోపమునొంది కఫపిత్తరక్తములతోఁగూడి పిల్లనగ్రోవి ధ్వనివంటి ధ్వనిని చెవులయందు కల్గించును. ఇయ్యది కర్ణక్ష్వేడ మని చెప్పబడును.

దీనిలక్షణమును విదేహుం డిట్లు చెప్పెను:—"మారుతః కఫపిత్తాభ్యాం సంసృష్టశ్శోణితేన చ, కర్ణక్ష్వేడం సంజనయేత్ క్ష్వేడనం వేణుఘోషవత్." వాతము ప్రకుపితమై కఫపిత్తరక్తములతోఁగలిసి చెవులయందు ధ్వనిని కల్గించును. ఇయ్యది కర్ణక్ష్వేడ మనబడు నని భావము. ఈవాక్యముచేత కర్ణక్ష్వేడమున రక్తము వాతముతో గూడి యుండు నని స్ఫుటముగ జెప్పబడినది.

కర్ణనాదమునందు భేరీమృదంగాది నానావిధధ్వనులు వినబడు ననియు, కర్ణక్ష్వేడమున వేణునాదముతో సమానమైన ధ్వని యొక్కటిమాత్రము వినబడు ననియు నీరెంటికిని భేదము నెరుంగునది.

## కర్ణస్రావలక్షణము

శిరోఽభిఘాతాదథవా నిమజ్జతో జలేప్రపాకాదథవాపి విద్రధేః,
ప్రవేద్ధి పూయం శ్రవణోఽనిలార్దితః స కర్ణసంస్రావ ఇతి ప్రకీర్తితః.

శిరస్సునం దభిఘాతము కల్గినను, (చెవులలోనికి నీరుపోవునట్లు) చల్లనినీళ్లయం దధికముగ మునిగినను, విద్రధి జనించి పగిలినను, ఈ కారణములచేత వాతము ప్రకుపితమై చెవినుండి చీమును గార్చును. ఇయ్యది కర్ణస్రావ మనబడును.

## కర్ణకండూ, కర్ణగూథలక్షణములు

మారుతః కఫసంయుక్తః కర్ణకండూం కరోతి చ,
పిత్తోష్మశోషితశ్శ్లేష్మా కురుతే కర్ణగూథకమ్. 6

వాతము ప్రకుపితమై కఫముతోఁగూడి చెవులయందు దురదను కల్గించును. ఇయ్యది కర్ణకండు వనబడును. పిత్తముయొక్క వేడిచేత కఫము శోషింపబడి చెవులయందు (ఎక్కువగా) గులిమిని కల్గించును. ఇయ్యది కర్ణగూథ మని చెప్పబడును. (ఇదియే కర్ణమలము.)

### కర్ణప్రతీనాహలక్షణము

స కర్ణగూథో ద్రవతాం గతో యదా
విలాయితో ఘ్రాణముఖం ప్రపద్యతే,
తదా స కర్ణప్రతినాహసంజ్ఞితో
భవేద్వికారః శిరసోఽర్ధ భేదకృత్. 7

పైజెప్పబడిన కర్ణమలము కరిగి ద్రవీభూతమై నాసారంధ్రమూలములలో జేరును. దానంజేసి తలలో సగభాగమున నొప్పి కల్గును. ఇయ్యది కర్ణప్రతీనాహమని చెప్పనగును.

ప్రతీనాహలక్షణమును వాగ్భటాచార్యుడు వేరువిధముగ నిట్లు చెప్పెను:—"వాతేన శోషితః శ్లేష్మా స్రోతో లింపేత్తతోభవేత్, రుగ్గౌరవం పిధానం చ స ప్రతీనాహసంజ్ఞితః" (అ. హృ. ఉ. అ. ౧౭. శ్లో. ౧౧.) చెవులయందలి శ్లేష్మము వాతముచేత శోషింపబడి కర్ణరంధ్రములను పూసినట్లు చేరియుండును. దానంజేసి నొప్పియు భారంబును కల్గియుండును. చెవిరంధ్రములను అడ్డగించియుండును. (ఈ లక్షణమునకును ప్రకృతగ్రంథమున జెప్పిన లక్షణమునకును భేదము కల్గి యున్నది.)

### క్రిమికర్ణలక్షణము

యదా తు మూర్ఛన్త్యథవాపి జన్తవః
సృజన్త్యపత్యాన్యథవాపి మక్షికాః,
తదవ్యఞ్జనత్వాచ్ఛ్రవణో*నిరుచ్యతే
భిషగ్భిరాద్యైః క్రిమికర్ణకో గదః. 8

చెవులయందు మాంసముకుళ్లి అందు సన్ననిపురుగులు జనించినను, లేక చెవులలో నీగలుచేరి గ్రుడ్లుపెట్టినచో నవి పిల్ల లయియున్నను అట్టి క్రిములకు చెవులు ఆధారమగుటంజేసి క్రిమికర్ణక మని చెప్పబడును.

దీనిలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"వాతాదిదూషితం శ్రోత్రం మాంసాసృక్క్లేదజా రుజమ్, ఖాదన్తో జన్తవః కుర్యుః తీవ్రాం సక్రిమికర్ణకః" (అ. హృ. ఉ. అ. ౧౭. శ్లో. ౧౩.) వాతాదిదోషములు ప్రకోపమునొంది చెవులకు చెరచును. దానంజేసి చెవియందు మాంసరక్తములు కుళ్లి యాద్రవమున క్రిములు పుట్టి చెవిని తినుచు తీవ్రమైన నొప్పిని కల్గించును. ఇయ్యది క్రిమికర్ణ మను రోగము. ఈ వాక్యమువలన నీ వ్యాధి త్రిదోషములచే జనించు ననియు, అట్టి క్రిములు చెవులను నానాట తినుచుండు ననియు తెలిసెడిని.

* "శ్రవణో" అని పాఠముండిన యుక్త మని తోచెడిని.

ఈవిషయమును తంత్రాంతరమున విపులముగ నిట్లు చెప్పెను:—"శ్లేష్మ పిత్త జలోన్మిశ్రే కోథే శోణితమాంసజే, జాయన్తే జంతవస్తత్ర కృష్ణాస్తామ్రాసితారుణాః. భక్షయన్తీవ తే కర్ణం రుజన్తో వివిధా రుజః, క్రిమికర్ణ తు తం విద్యాత్సన్నిపాత ప్రకోపజమ్" (నిమి) మాంసరక్తములు కఫపిత్తముల ద్రవముతోఁగూడి కుళ్లి అందు క్రిములు పుట్టును. ఆ పురుగులు నల్లగనైనను, ఎఱ్ఱగనైనను, తెల్లగనైనను, అరుణవర్ణములుగనైన నుండును. ఆ పురుగులు చెవులను తినునట్లు గులగుల మని నానావిధబాధల గల్గించును. ఇయ్యది కృమికర్ణ మని చెప్పబడును. ఇది సన్నిపాతమున గల్గును. ఈవాక్యముచేత నీవ్యాధి సన్నిపాతముచే జనించు నని స్పష్టముగా తెలిసెడిని.

### చెవిలోఁ కీటకము చొచ్చిన దానిలక్షణము

పతఙ్గాశ్శతపద్యశ్చ కర్ణస్రోతః ప్రవిశ్య హి,
అరతిం వ్యాకులత్వం చ భృశం కుర్వన్తి వేదనామ్.
కర్ణో నిస్తుద్యతే తస్య తథా ఫరఫరాయతే,
కీటే చరతి రుక్తీవ్రానిష్పన్దే మన్దవేదనా. 10

మిడుతలు, జెఱ్ఱులు (చీమలు) మొదలగు కీటాదులు చెవిరంధ్రమున జొరబడిన యెడ అరతియు, మనోవ్యాకులంబును, మిక్కిలి తీవ్రమైన బాధయు గల్గును. చెవి యందు పోటుపుట్టి పరపరయనునట్లు ధ్వనితోఁ బాధ కల్గును. ఆపురుగు చెవిలోఁ గదలుచున్నపుడు బాధ మిక్కిలి తీవ్రముగ నుండును. కదలకయున్నచోఁ బాధ కొంచెము తక్కువగ నుండును.

### కర్ణవిద్రధిలక్షణము

క్షతాభిఘాతప్రభవస్తు విద్రధిః భవేత్తథా దోషకృతోఽపరః పునః,
సరక్తపీతారుణమస్రమాస్రవేత్ ప్రతోదధూమాయనదాహచోషవాన్.

క్షతము (పుల్ల మున్నగునవి గ్రుచ్చుకొనుట) చేనైనను, అభిఘాతము చేనైనను, వాతాదిదోషములచేనైనను చెవులయందు విద్రధి (పుండు) కల్గును. అట్టి విద్రధి యందు రక్తవర్ణంబును పీతవర్ణంబును అరుణవర్ణంబునైన ద్రవము గారుచుండును. పోటు పుట్టును. పొగ వెడలునట్లు బాధయు, మంటయు, పీల్చబడినట్లు బాధయును కల్గును. ఇయ్యది కర్ణవిద్రధి యని చెప్పబడును.

ఇచ్చట వాతవిద్రధియందు రక్తవర్ణముగను, పిత్తవిద్రధియందు పీతవర్ణముగను, కఫవిద్రధియందు అరుణవర్ణంబుగను ద్రవము స్రవించు నని యథాక్రమముగ నెరుంగునది.

### కర్ణపాకలక్షణము

కర్ణపాకస్తు పిత్తేన కోథవిక్లేదకృద్భవేత్,
కర్ణవిద్రధిపాకాద్వా జాయతే చామ్బుపూరణాత్. 12

చెవియందు పిత్తముచేత పుండుకల్గి కుళ్లి ద్రవము గారుచుండునెడ కర్ణపాక మనబడును. ఇయ్యది పైజెప్పిన కర్ణవిద్రధి పగులుటచేనైనను, చెవిలో స్నానాదిసమయములయందు నీరు నిలుచుటచేనైనను గూడ కల్గును.

### పూతికర్ణలక్షణము

పూయం స్రవతి యః పూతి సజ్ఞేయః పూతికర్ణకః,

చెవిలో దుర్గంధమైన చీము కారుచున్నయెడ పూతికర్ణ మనబడును.

పూతికర్ణకలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"కఫో విదగ్ధః పిత్తేన సరుజం నీరుజం త్వపి, ఘనపూతి బహుక్లేదం కురుతే పూతికర్ణకమ్" (అ. హృ. ఉ. అ. ౧౭. శ్లో. ౧౨) కఫము పిత్తముచే దహింపబడి చిక్కనై మిక్కిలి దుర్గంధము కల్గి కుళ్లిన నీరుగారుచుండును. అట్టియెడ బాధ కల్గును. ఒకవేళ బాధ లేకుండును. ఇయ్యది పూతికర్ణక మనబడును. ఈవాక్యముచేత కఫము పిత్తముచే విదగ్ధమై ద్రవము స్రవించు నని తెలియనగును.

ఈవిషయమై సుశ్రుతాచార్యుడు వివరించి యిట్లు చెప్పెను:—"స్రోతస్థితే శ్లేష్మణి పిత్తతేజసా విలీయమానే భృశసంప్రతాపితే, అవేదనో వాథ సవేదనో వా ఘనం స్రవేత్పూతి చ పూతికర్ణః" (సుశ్రుత. ఉ. అ. ౨౦.) కర్ణరంధ్రములయందు శ్లేష్మము పిత్తముయొక్క వేడిచేత మిక్కిలి తపింపబడి కరిగి బాధయుండియైనను లేకయైనను చిక్కనైన దుర్గంధముతో గూడిన చీము కారుచుండును. ఈవ్యాధి పూతికర్ణ మని చెప్పబడును అని యర్థము. (ఈవాక్యముచేత పూతికర్ణమున చిక్కనైన చీము కారు ననియు, కర్ణస్రావమున నీనియమములేక పలుచని చీముగూడ స్రవించు ననియు నీ రెంటికి పరస్పరభేదము తెలియంగునది.)

### కర్ణశోథ - కర్ణార్బుద - కర్ణార్శోలక్షణములు

కర్ణశోథార్బుదార్శాంసి జానీయాదుక్తలక్షణైః. 13

చెవులయందు వాపుకల్గిన నయ్యది కర్ణశోథము. చెవులయందు అర్బుదవ్రణము కల్గిన నది కర్ణార్బుదము. చెవులయందు అర్శస్సుకలిగిన నయ్యది కర్ణార్శస్సు. ఈమూడిటి లక్షణములను ఆయానిదానమున జెప్పబడిన దాని దానిలక్షణములబట్టి నిర్ణయించునది.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది.—శోఫనిదానమున వాత-పి త్త-కఫ-ర క్తము లను వేర్వేరుగ జెప్పినలక్షణములతోఁగూడి చెవులయందును వాతాదులచే నాల్గువిధము లగు శోఫము జనించును. వాతపి త్తకఫర క్తములచే గల్గు అర్శస్సులను వేరువేరజెప్పిన లక్షణములతోఁగూడి నాల్గు అర్శస్సులును చెవులయందు కల్గును. వాత-పి త్త-కఫ-ర క్త-మాంస-మేద-స్సిరారూపములగు కారణములచే నేడువిధముల జెప్పిన యర్బుదంబులును వానివాని లక్షణములతోఁగూడి చెవులయందు జనించును. కావున వానివాని లక్షణము లను ఆయాప్రకరణముల జెప్పినప్రకారమును బట్టి నిర్ణయించునది. అర్శస్సులలో సహజ-సన్నిపాతార్శస్సులు రెండును, శోఫములలో సన్నిపాతాగంతుజశోఫములును చెవులయందు స్థానప్రభావమునం జేసి కలుగవు.

ఇత్తెరంగున కర్ణశూలము మొదలుజేసి పూతికర్ణరోగము వరకుంగల కర్ణరోగ ములు పదుమూడును, కర్ణశోథభేదములు నాల్గును, కర్ణార్బుదభేదము లేడును, కర్ణార్శో భేదములు నాల్గును చేరి యిరువదియెనిమిది కర్ణరోగములు సుశ్రుతమతము నవలం బించి మాధవకరునిచే జెప్పంబడియె.

వాగ్భటాచార్యుడు "పఞ్చవింశతి రిత్యుక్తాః కర్ణరోగా విభాగశః" (అ. హృ. ఉ. అ. ౧౭. శ్లో. ౨౬.) అని కర్ణరోగములను ఇరువదియైదుగ విభజించి వాని లక్షణములనెల్ల చెప్పెను. వానిపేర్లు కొన్నియు, లక్షణంబులును ఈగ్రంథమున గానం బడవు. విస్తరభయముచే నిట వానివిమర్శనము విడువబడియె.

మరియు చరకాచార్యుడు కర్ణరోగములను వాత-పి త్త-కఫ-సన్నిపాతభేదము లచే నాల్గు విధములుగ జెప్పిరి. ఆవరుస ననుసరించియు మాధవకరుడు ఈక్రింద వివరింప బడువిధముగ కర్ణరోగముల జెప్పెను.

### వాతికకర్ణరోగము

నాదోఽతిరుక్కర్ణమలస్య శోషః స్రావస్తనుశ్చాశ్రవణం చ వాతాత్,

వాతమున జనించిన కర్ణరోగమునందు కారణములేకయే చెవికి శబ్దము విన బడును. మిక్కిలి తీవ్రమైన పోటుపుట్టును. చెవులయందలి మలము ఎండును. చెవుల నుండి స్వల్పముగ ద్రవము స్రవించును. చెవులు ఒక సమయమున వినబడకుండును.

### పైత్తికకర్ణరోగలక్షణము

శోఫస్సరాగో దరణం విదాహః సపీతపూతిస్రవణం చ పిత్తాత్. 14

పిత్తమునగల్గిన కర్ణరోగమున ఎఱ్ఱనివాపు కల్గును. పగులును. తీవ్రమైనమంట పుట్టును. దుర్గంధమైన పచ్చని చీముకారును.

### కఫజకర్ణరోగలక్షణము

వైశ్రుత్యకణ్డూస్థిరశోథశుక్లస్నిగ్ధస్రుతిః స్వల్పరుజః కఫాచ్చ,

కఫప్రకోపమున కల్గిన కర్ణరోగమునందు చెవులకు ధ్వని విరుద్ధముగ వినబడును. దురద పుట్టును. గట్టిగనుండు వాపుకల్గును. తెల్లనై స్నిగ్ధమైన చీము కారుచుండును. నొప్పి స్వల్పముగ నుండును.

### సాన్నిపాతిక కర్ణరోగలక్షణము

సర్వాణి రూపాణి చ సన్నిపాతాత్ స్రావశ్చ తత్రాధికదోషవర్ణః.

పైజెప్పిన వాత పిత్త కఫ లక్షణములు మూడును కలిగినది సన్నిపాతమున జనించిన కర్ణరోగము. దీనియందు ఏదోషము అధికముగ నుండునో ఆదోషమునకు సంబంధించిన రంగుకలిగి ద్రవము స్రవించును. (ఈ నాల్గును చరకమున జెప్పబడిన కర్ణరోగములు.)

### కర్ణపాలియందు గల్గు రోగములు ఐదు, అందు పరిపోటకము

సౌకుమార్యాచ్చిరోత్సృష్టే సహసాతిప్రవర్ధితే,
కర్ణశోథో భవేత్పాల్యాం సరుజః పరిపోటవాన్,
కృష్ణారుణనిభ స్తబ్ధ స్సవాతాత్పరిపోటకః. 16

శరీరము మిక్కిలి సుకుమారముగ నుండువారు చెవులతమ్మెలకు కుట్లు చిరకాలమువరకు కుట్టించుకొనక వదలియుండి చాలకాలమునకు కుట్టించుకొని వెంటనే బెంప నారంభించి అతిశీఘ్రముగ (బెండు మొదలగువానినిబెట్టి) బెంచినయెడ చెవితమ్మెయందు పగిలి నల్లనిరంగును ఎఱ్ఱనిరంగును కల్గిన వాపుపుట్టి స్తంభించియుండును. దానివలన మిక్కిలి తీవ్రమైనబాధ కల్గును. ఇయ్యది వాతమువలన గల్గిన పరిపోటకమను వ్యాధి.

### ఉత్పాతలక్షణము

గుర్వాభరణసంయోగాత్ తాడనాద్ఘర్షణాదతి,
శోథః పాల్యాం భవేచ్ఛ్యావో దాహపాకరుజాన్వితః. 17
రక్తోవా రక్తపిత్తాభ్యాముత్పాతస్స నిగద్యతే, (గదో మతః)

గొప్పవి (బరువు) యగు నాభరణముల ధరించుటచేనైనను, దెబ్బ తగులుటచేనైనను, అధికముగ తోముటచేనైనను చెవితమ్మెయందు వాపుకల్గును. అయ్యది శ్యామలవర్ణంబైనను రక్తవర్ణంబైనను కల్గి, మంటయు నొప్పియు కల్గి వుండగును. ఈవ్యాధి ఉత్పాత మని చెప్పబడును. ఇయ్యది రక్తపిత్తములచే గల్గును.

### ఉన్మథకలక్షణము

కర్ణం బలాద్వర్ధయతః పాల్యాం వాయుః ప్రకుప్యతి. 18
కఫం సంగృహ్య కురుతే శోథం స్తబ్ధమవేదనమ్,
ఉన్మథకస్సకణ్డూకో వికారః కఫవాతజః. 19

సకాలమున చెవిని కుట్టినవెనుక బలాత్కారముగ పెంప ప్రయత్నించినయెడ వాతము ప్రకుపితమై కఫముతోఁగూడి వాపును కల్గించును. అయ్యది నొప్పిలేక స్తంభించి యుండును. ఇది కఫవాతములచే జనించిన యున్మన్థక మనబడును.

## దుఃఖవర్ధనలక్షణము

సంవర్ధ్యమానే దుర్విద్ధే కణ్డూదాహరుజాన్వితః,
శోథో భవతి పాకశ్చ త్రిదోషో దుఃఖవర్ధనః. 20

చెవులను *యుక్తముకానిస్థలమున కుట్టి పెంచినయెడ దురదయు మంటయు నొప్పియు కలిగి వాపుపుట్టును. పుండు నగును. ఇయ్యది త్రిదోషసన్నిపాతమున గల్గిన దుఃఖవర్ధనం బను వ్యాధి.

## పరిలేహిలక్షణము

కఫాసృక్క్రిమయః క్రుద్ధాః సర్షపాభా విసర్పిణః,
కుర్వన్తి పాల్యాం పిటికాః కణ్డూదాహరుజాన్వితాః. 21
కఫాసృక్క్రిమిసంభూతః సవిసర్పన్నితస్తతః,
లిహేత్స శష్కులీంపాలీం పరిలేహీతి సస్మృతః. 22

చెవియందు కఫము రక్తము రక్తమునుండు క్రిములును వృద్ధినంది దురదయు మంటయు నొప్పియుగల్గి ఆవాలవలె మిక్కిలి సూక్ష్మములైన సన్నని పొక్కులు లేచి కర్ణపాలియందె నానాట నల్లును. ఆయ్యది చెవియందు నాల్గు ప్రక్కల నల్లుచు చెవిని తమ్మెను తినును. ఇయ్యది కఫరక్తక్రిములచే కల్గుచు. పరిలేహి యని చెప్పబడును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
కర్ణరోగనిదానం సమాప్తమ్.

---

* యుక్తమగు స్థల మిట్లు సుశ్రుతమున జెప్పబడెను. “భిషగ్వామహస్తే నాకృష్యకర్ణం దైవకృతే చ్ఛిద్రే ఆదిత్యకరావభాసితే శనైశ్శనైర్దక్షిణహస్తేన ఋజు విధ్యేత్” (సు. సూ. 16 అ.) వైద్యుడు తన యెడమచేతితో బాలుని చెవితమ్మెను లాగిపట్టి ఎండవెలుతురు వెనుకనుండునట్లు పట్టినచో నందు దైవముచేత బుట్టుకతోనే చర్మమాత్రముచే గప్పబడి చక్కగా గనబడుచుండు రంధ్రము కానవచ్చును. దానియందు దార యను సూదితో రంధ్రమును చేయవలె నని.

# ౫౮. నాసారోగనిదానమ్

శ్రవణేంద్రియమున కాధారమైనవి చెవులు. వానికి సంబంధించిన కర్ణరోగములు జెప్పి, ఘ్రాణేంద్రియమున కాధారమగు నాసికకు సంబంధించిన నాసారోగముల జెప్పుట.

పీనసలక్షణము

ఆనహ్యతే యస్య విశుష్యతే చ ప్రక్లిద్యతే ధూప్యతి చాపి నాసా
నవేత్తి యో గన్ధరసాంశ్చ జన్తుర్జుష్టం వ్యవస్యేదిహ పీనసేన,
తం చానిలశ్లేష్మభవం వికారం బ్రూయాత్ప్రతిశ్యాయసమానలిఙ్గమ్.

ముక్కులలో వాతముచేత కఫము శుష్కించునపుడు నిశ్వాసము వెడలక బంధించియుండును. ముక్కులయందు ద్రవము కల్గియుండును. పొగ వెడలునట్లుండును. ఘ్రాణేంద్రియమునకు సుగంధమైనను దుర్గంధమైనను తెలియదు. రసనేంద్రియమున (నాలుక)కు మధురాది రసములు తెలియవు. ఇట్టిలక్షణములు కల్గినది పీనస (పడిసె)ము అనబడును. ఇయ్యది వాత కఫములచే గల్గును. మరియు నిది క్రింద జెప్పంబడు ప్రతిశ్యాయమునకు సమానలక్షణములు కల్గియుండును. (నాసారోగమునకు కారణమగు దోషముచేత రసనేన్ద్రియముకూడ చెడును. కావున మధురాదిరసముల నెరుంగుశక్తి రసనేంద్రియమునకు లేకపోవును.)

పీనసలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"మస్తుఙ్గోచితశ్లేష్మా యదా పిత్తాద్విదహ్యతే, తదా స్రుక్పిచ్ఛిలం నాసా బహుసింఖణకం స్రవేత్. స కణ్డూదాహపాకం చ తం తు విద్యాద్ధి పీనసమ్" శిరమునందలి మస్తులుంగము (మెదడు)నకు తగిన శ్లేష్మము పిత్తముచే దపింపబడినయెడ రక్తముతోగూడి పిచ్ఛిలంబైన యాశ్లేష్మము నాసారంధ్రములనుండి యెడతెగక స్రవించుచుండును. స్రవించునపుడు దురదయు మంటయును కల్గి పుండగును. ఇయ్యది పీనసం బని చెప్పబడు నని భావము. ఈ వాక్యముచేత రక్తముతో గూడి పిచ్ఛిలమై కఫరూపమైన ద్రవము స్రవించునని తెలియనగును. మరియు "యదాపిత్తాద్విదహ్యతే తదా" అని చెప్పుటచేత తొలుత సంప్రాప్తికాలమున పిత్తముచేత మస్తిష్కరూపమైన కఫము తపింపబడి కరిగి స్రవించు నని యర్థము. కావున ప్రకృతమూలమున "అనిల శ్లేష్మభవమ్" అను వాక్యమునకు పైజెప్పిన రీతిగ పిత్తముచే దపింపబడి కఫవాతములచే నీవ్యాధి జనించు నని యేకవాక్యతచేత పరస్పర విరోధము లే దని యెరుంగునది.

## పూతినస్యలక్షణము

దోషైర్విదగ్ధైర్గలతాలుమూలే సమ్మూర్ఛితో యస్య సమీరణస్తు,
నిరేతి పూతిర్ముఖనాసికాభ్యాం తం పూతినస్యం ప్రవదన్తి రోగమ్.

శరీరమునందలి యగ్నియొక్క వేడిచేత ద్రవరూపములగు పిత్తకఫరక్తములు తపింపబడి, దానంజేసి తాలువుల మొదటను గళమునందును వాతము ప్రకుపితమై దుర్గంధముతో గూడిన ద్రవము నోటనుండియు నాసారంధ్రములనుండియు స్రవించును. ఇయ్యది పూతినస్య మనబడును. (దుర్గంధముతో గూడిన ద్రవముతో గూడిన ద్రవము నాసారంధ్రములనుండి స్రవించునది యని యన్వర్థముగ పూతినస్య మనబడును.)

మరియు దీని సంప్రాప్తిని దీని లక్షణమును విదేహు డిట్లు చెప్పెను:—కఫ పిత్తమసృఙ్మిశ్రం సఞ్చితం మూర్ధ్ని దేహినామ్, విదగ్ధమూష్మణా గాఢం రుజాం కృత్వాఽక్షిశఙ్ఖజామ్. తతః ప్రస్యన్దతే ఘ్రాణాత్ సరక్తం పూతిపీతకమ్, పూతి నస్యం తు తం విద్యాత్ ఘ్రాణకణ్డూజ్వర ప్రదమ్" రక్తము ద్రవరూపములగు కఫపిత్తములతో గూడి శిరస్సునజేరి కాయాగ్నియొక్క వేడిచే తాపమునొంది కన్నుల యందును, కణతల యందు మిక్కిలి తీవ్రమైన నొప్పిని కల్గించును. పిమ్మట రక్తముతో గూడి పచ్చనిరంగు కల్గి దుర్గంధముకల ద్రవము నాసారంధ్రములనుండి స్రవించును. ముక్కునందు దురదయు, జ్వరంబును కల్గును. ఇయ్యది పూతినస్య మనబడు నని భావము.

## నాసికాపాకలక్షణము

ఘ్రాణాశ్రితం పిత్తమరూంషి కుర్యాద్యస్మిన్ వికారే బలవాంశ్చ పాకః,
తం నాసికాపాకమితి వ్యవస్యేత్ విక్లేదకోథావథవాపి యత్ర. 3

నాసిక నాశ్రయించిన పిత్తము ప్రకుపితంబై నాసారంధ్రములయందు అరుసు పుండ్లను గల్గించును. అయ్యవి పక్వములై చితికి ప్రబలముగ పుండగును. అయ్యవి కుళ్లి దానినుండి ద్రవము కారుచుండును. ఇయ్యది నాసికాపాక మని చెప్పబడును.

## పూయరక్తలక్షణము

దోషైర్విదగ్ధైరథవాపి జన్తోర్లలాటదేశేఽభిహతస్య తైస్తైః,
నాసాస్రవేత్పూయమసృగ్విమిశ్రంతంపూయరక్తంప్రవదన్తిరోగమ్.

వాతాదిదోషములు దుష్టము లగుటచేనైనను, నుదుటియందు దెబ్బతగులుట మున్నగు నభిఘాతములచేనైనను నాసారంధ్రములనుండి రక్తముతో గూడిన చీము స్రవించును. అయ్యది పూయరక్త మని చెప్పబడును.

### క్షవథులక్షణము

ఘ్రాణాశ్రితే మర్మణి సంప్రదుష్టో యస్యానిలో నాసికయా నిరేతి,
కఫానుజాతో బహుశోఽతిశబ్దస్తం రోగమాహుః క్షవథుం విధిజ్ఞాః. 5

నాసిక నాశ్రయించిన మర్మమునందు వాతము దుష్టమై కఫముతో గలిసి మిక్కిలి శబ్దముతోఁగూడి నాసారంధ్రమునుండి బైట వెడలును. దీనిని క్షవథు (తుమ్ము) రోగ మని వైద్యులు చెప్పెదరు. *

(నాసామధ్యముననుండి ఘ్రాణేంద్రియమునకు దృప్తిని గల్గించు సిరయందు ఇతరములగు సిరలు చేరునట్టి సంధిస్థానము శృంగాటక మను నాసామర్మ మని యెరుంగునది.)

### ఆగంతుకక్షవథులక్షణము

తీక్ష్ణోపయోగాదభిజిఘ్రతో వా భావాన్కటూనర్కనిరీక్షణాద్వా,
సూత్రాదిభిర్వాతరుణాస్థిమర్మణ్యుద్ఘాటితేఽన్యః క్షవథుర్నిరేతి. 6

మిక్కిలి తీక్ష్ణగుణముకల యావాలు మున్నగువాని తిన్నను, అట్టి ద్రవ్యములను మూర్కొన్నను, మిక్కిలి కారముకల ద్రవ్యముల మూర్కొన్నను, చిరకాలమువరకు సూర్యుని జూచుచున్నను, తరుణాస్థి (ముక్కుదూలము) యను మర్మము దారము, పుల్ల మున్నగువానిచే ముక్కులోపలనుండి పైకెత్తినను, ఇట్టి యభిఘాతముచేత పై జెప్పిన విధముగ తుమ్ములు వచ్చును. (ఇయ్యది బాహ్యకారణములచే గల్గునది కావున ఆగంతుక క్షవథు వని చెప్పదగును.)

### భ్రంశథులక్షణము

ప్రభ్రశ్యతే నాసికయా తు యస్య సాన్ద్రో విదగ్ధో లవణః కఫస్తు,
ప్రాక్సంచితో మూర్ధని సూర్యతప్తస్తం భ్రంశథుం రోగముదాహరన్తి.

కఫము తనకు స్థాన మగు శిరస్సున చయము (స్వస్థానముననె వృద్ధిని) నొంది పక్వమై ఘనీభవించి లవణరసముకల్గి యెండవేడిచే కరిగి నాసారంధ్రములనుండి జారును. ఇయ్యది భ్రంశథు వను రోగము. దోషములకు చయము, ప్రకోపము, ప్రశమము నని మూఁడు అవస్థలు కలవు. అందు వాతాదులకు వేరువేరుగ జెప్పిన స్థానములలో దాని దాని స్థానముననే వృద్ధిజెందినచో చయ మనబడును. ప్రకోప మన స్థానాంతరమున జేరుట, అందు దోషమును వృద్ధిఁబొందించు కారణములు స్వల్పములుగ నున్నచో స్వస్థానముననే వృద్ధరూపమైన చయావస్థనొంది, పిదప ప్రకోపము నొందును. కారణములు మిక్కిలి బలవత్తరములై యున్నపుడు చయావస్థనొందకయే ప్రకోపము నొందు

---

* తుమ్ములు ఎక్కువగా వచ్చునది క్షవథువ్యాధి యనబడును; కాని స్వాభావికముగా నప్పుడప్పుడు వచ్చు తుమ్ములు రోగము కాజాల వని యెరుగవలె.

టయు కలదు. ఈయర్థమునే తంత్రాంతరమున నిట్లు చెప్పిరి:—"న కేవలం చయం ప్రాప్యదోషాః కుప్యంతి దేహినామ్, అన్యథోఽపిహి కుప్యన్తి హేతుబాహుల్యతో బలాత్" వాతాది దోషములు చయము నొందియే ప్రకోపము నొందు నని నియమము లేదు. బలవత్తరములగు కారణము లున్నచో చయమునొందకయే ప్రకోపించుట కల దని యర్థము.

ఇట్టి ప్రమాణముచేత ప్రకృతమూలమున "ప్రాక్సఞ్చితోమూర్ధని సూర్యతప్తః" అని చెప్పబడినది. తొలుత కఫము తనకు స్థానమైన శిరస్సున వృద్ధిరూప చయావస్థ నొంది, పిదప సూర్యసంతాపముచే ప్రకుపితమై పై జెప్పినవిధముగ స్రవించునని భావము.

## దీప్తలక్షణము

ఘ్రాణేభృశం దాహసమన్వితేతు వినిస్సరేద్ధూమఇవేహ వాయుః,
నాసా ప్రదీప్తేవ చయస్యజన్తోఃవ్యాధింతు తం దీప్తముదాహరంతి. 8

నాసికయందు మిక్కిలి మంటపుట్టి పొగవెడలుచందంబున తీక్ష్ణముగ నిట్టూరుపు వెడలుచు నాసారంధ్రములయం దగ్నిజ్వాలవలె మండుచున్నయెడ నయ్యది దీప్త మను వ్యాధి యని యెరుంగునది.

## ప్రతీనాహలక్షణము

ఉచ్ఛ్వాసమార్గంతుకఫస్సవాతో రున్ధ్యాత్ప్రతీనాహముదాహరేత్తమ్,

కఫము వాతముతో గూడి ముక్కునుండి నిశ్వాసము వెడలు నాసారంధ్రముల నడచి శ్వాసమును వెడలనీయకున్నయెడ నయ్యది ప్రతీనాహ మనబడును.

## నాసాస్రావలక్షణము

ఘ్రాణాద్ఘనఃపీతసితస్తనుర్వాదోషస్స్రవేత్స్రావముదాహరేత్తమ్.

మిక్కిలి చిక్కనై పచ్చనిరంగైనను తెల్లనిరంగైనను కల్గి కొంచెముగ పలచని ద్రవము స్రవించిన నయ్యది నాసాస్రావ మనబడును. (భ్రంశథురోగమునందు పచ్చనై చిక్కని కఫముకారును. దీనియందు పలచనై పచ్చగలేక తెల్లగనుండు ద్రవము కారు నని భేదమును గమనింపవలెను.)

## నాసాపరిశోషలక్షణము

ఘ్రాణాశ్రితే స్రోతసి మారుతేన గాఢంప్రతప్తే పరిశోషితే చ,
కృచ్ఛ్రాచ్ఛ్వసేదూర్ధ్వ మధశ్చజంతుర్యస్మిన్ సనాసాపరిశోషఉక్తః.

నాసికారంధ్రములు వాతముచే మిక్కిలి తాపమునొంది యెండినచో నుచ్ఛ్వాస నిశ్వాసములు మిక్కిలి కష్టముచేత వెడలును. దీనిని నాసాపరిశోష మని చెప్పెదరు.

ఇచ్చట "పరిశోషితేచ" అనుచోట పిత్తోష్మసంబంధములేక ద్రవము ఎండుట లేదు; కావున వాతముతో పిత్తము అనుబంధముగ జేరి నాసారంధ్రముల శోషింప

జేరుం నని యర్థము చేయనగును. ఈ యర్థమున కనుగుణముగ "ఘ్రాణాత్ శ్రితే శ్లేష్మణి మారుతేన పిత్తేన గాఢం పరిశోషితేన" అని పాఠాంతరముగూడ గానంబడియెడు.

## ఆమపీనస లక్షణము

శిరోగురుత్వమరుచిర్నాసాస్రావస్తనుస్స్వరః,
క్షామః ష్ఠీవత్యథాభీక్ష్ణం ఆమపీనసలక్షణమ్. 11

పీనసము పక్వముగాక ఆమముగ నుండుతరి తల బరువుగ నుండును. అరోచకము కల్గును. నాసారంధ్రములనుండి ద్రవము స్వల్పముగ స్రవించును. మాటలు స్ఫుటముగ దెలియక కంఠస్వరము మారియుండును. నోట జొల్లు అధికముగ వెడలును. ఈ లక్షణములు కల్గినపుడు పీనసవ్యాధి పక్వముగాక ఆమావస్థ నున్న దని యెరుంగునది.

## పక్వపీనస లక్షణము

ఆమలిఙ్గాన్వితశ్శ్లేష్మా ఘనః ఖేషు నిమజ్జతి,
స్వరవర్ణవిశుద్ధిశ్చ పరిపక్వస్య లక్షణమ్. 12

కఫము గట్టిపడి నాసారంధ్రములయందే బైట వెడలక నిలిచి కంఠస్వరము మారక స్ఫుటముగ నున్నచో పీనసము పక్వమైన దని యెరుంగునది. ఇందు ఆమపీనసమున జెప్పిన తలబరువు, అరుచియు స్వల్పముగ నుండును. ఈ విషయమును సుశ్రుతాచార్యు లిట్లు చెప్పెను:—"తనుత్వమామలిఙ్గానామ్" అని.

## ప్రతిశ్యాయనిదానము, సంప్రాప్తియు

సన్ధారణాజీర్ణరజోఽతిభాష్య
క్రోధర్తువైషమ్యశిరోఽభితాపైః,
ప్రజాగరాతిస్వపనామ్బుశీతైః
అవశ్యయా మైథునబాష్పధూమైః,
సంస్త్యానదోషే శిరసి ప్రవృద్ధో
వాయుః ప్రతిశ్యాయముదీరయేత్తు. 13
చయం గతా మూర్ధని మారుతాదయః
పృథక్సమస్తాశ్చ తథైవ శోణితమ్,
ప్రకుప్యమాణా వివిధైః ప్రకోపణైః
తతః ప్రతిశ్యాయకరా భవన్తిహి. 14

మల-మూత్ర-వాత-పురీషాదుల వేగము నడ్డగించి యుచితకాలమున విసర్జింప కుండుట, అజీర్ణకరములగు పదార్థముల భుజించుట, ధూళిసంబంధము కల్గుట, అధికముగ మాటలాడుట, అధికముగ కోపపడుట, వసంతాది ఋతువులకు స్వాభావికములగు ఉష్ణ శీతాదిధర్మములు ఆయాఋతువుల కనుగుణముగ నుండక మారియుండుట (లేక ఋతు చర్యాధ్యాయమున ఆయాఋతువుల కనుగుణముగ జెప్పిన యాహారవిహారాదులను వ్యత్యస్తముగ నాచరించుట) పొగ ధూళి మొదలగునవి నాసారంధ్రములనుండి లోనికి జొచ్చి శిరంబున సంతాపమును కల్గించుట, రాత్రులయందు నియమితప్రకారము నిదుర పోక మేల్కాంచియుండుట, పగటిపూట విశేషముగ నిదురపోవుట, చల్లనినీళ్లను స్నాన పానాదుల కుపయోగించుట, మంచులో నుండుట, అధికముగ సంభోగము చేయుట, అధికముగ శోకాదులచే కన్నీరు గార్చుట, పొగలో నుండుట, ఈ కారణములచేత వాతము మిక్కిలి ప్రకుపితమై ఘనీభవించిన శ్లేష్మము కల శిరస్సున జేరి వృద్ధినొంది ప్రతిశ్యాయ మను వ్యాధిని కల్గించును.

మరియు వాత-పిత్త-కఫ-రక్తములు తొలుత తమతమ నెలవులయందే వృద్ధి నొంది పలుదెరంగులైన తమతమ కారణములచే ప్రకోపమునొంది శిరంబునజేరి పిదప ప్రతిశ్యాయం బను రోగమును గల్గించును.

ఇచ్చట నిర్ణయము నెరుంగునది:—ఈ ప్రతిశ్యాయమునకు నిదానము రెండు విధంబులు. అందు:-"స్వస్థానవృద్ధిర్దోషాణాం చయ ఇత్యభిధీయతే" అని చెప్పిన చయా వస్థ ననుసరించి వాతపిత్తకఫములు తమతమ నెలవులయందే వృద్ధినొంది పిదప తమతమ కారణములచే వేర్వేరుగ నైనను అన్నియు కలిసియైన ప్రకోపమునొంది ప్రతిశ్యాయ మును కల్గించును. ఇయ్యది చయాదిక్రమము ననుసరించిన నిదానము. అట్టి చయావస్థ నొందక ప్రబలములైన తమతమ కారణములచే ప్రకుపితములై ప్రతిశ్యాయమును గల్గించినచో నది సద్యోజనక నిదానము. ఇట్టి నిదానములలో సద్యోనిదానము "సన్ధా రణాజీర్ణ" అను గ్రంథముచే జెప్పబడినది. "చయంగతా" అను గ్రంథముచేత జెప్పి నది చయాదిక్రమము ననుసరించిన నిదానము.

నిదానమున కీ రెండు భేదముల నంగీకరించియే సుశ్రుతాచార్యుడు సద్యో నిదా నము నిట్లు చెప్పెను:-"నారీప్రసంగశ్శిరసోఽభితాపో ధూమో రజశ్శీతమతి ప్రతాపః, సన్ధారణం మూత్రపురీషయోశ్చ సద్యః ప్రతిశ్యాయనిదానముక్తమ్" (సుశ్రుత. ఉ. అ. ౨౪.) స్త్రీసంభోగము, శిరస్సంతాపము, పొగ, దుమ్ము, చల్లని నీళ్లు, మిక్కిలి సంతాపము, మూత్రపురీషాదుల వెడలనీయక నిరోధించుట ఇవి యన్నియు ప్రతి శ్యాయము నప్పుడే కల్గించు సద్యోనిదానము.

ఈరెండిటిలో చయాది క్రమముగ ప్రకుపితములైన కారణములచే కల్గిన ప్రతిశ్యాయము సకలశరీరము వ్యాపించినది యగుటం జేసి రూఢమూలమై బలిష్ఠముగ నుండును.

మరియు వాగ్భటాచార్యుడు కొన్ని నిదానముల నిట్లు చెప్పెను—"నీచాత్యుచ్చోపధానేన పీతేనాన్యేన వారిణా, అత్యంబుపానరమణచ్ఛర్ది బాష్పగ్రహాదిభిః, క్రుద్ధావాతోల్బణా దోషాః నాసాయాం స్త్యానతాం గతాః, జనయన్తి ప్రతిశ్యాయం వర్ధమానం క్షయప్రదమ్" (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౧, ౨) పరుండునపుడు మిక్కిలి తగ్గుగనైనను ఎత్తుగనైనను తలగడ నుంచుకొనుట, తాను మామూలుగ త్రాగునట్టి జలమును విడిచి వేరుగ క్రొత్తనీటిని త్రాగుట, అధికముగ నీళ్లు ద్రాగుట, అధికముగ (తన శక్తికి మిక్కుటముగ) సంభోగము చేయుట, వాంతిని కన్నీళ్లను వెడలనీయక నిగ్రహించుట, ఇట్టి కారణములచేత వాతం బధికముగ నుండు తక్కిన దోషములును ప్రకుపితములై, నాసారంధ్రములయందు ఘనీభవించి ప్రతిశ్యాయ మను వ్యాధిని కల్గించును. దీని నుపేక్షించి చికిత్సచేయకుండునెడ నానాటవృద్ధినొంది క్షయమును గల్గించును అని యర్థము. ఈవాక్యముచేత ప్రతిశ్యాయ మేదోషమున జనించినను వాతము ప్రబలముగ నుండు ననియు, దీని నుపేక్షించినచో కొంతకాలమునకు క్షయము కల్గు ననియు దెలిసెడి.

ప్రతిశ్యాయ మనగా ప్రతి అను నుపసర్గముచేరిన "శ్యైఙ్—గతౌ" అను ధాతువునకు "ప్రతిశ్యాయః" అని యేర్పడినది, గాన వాతపూరితమగు శిరస్సున వాతమునకు అభిముఖముగ నెదుర్కొని యడ్డగించునది ప్రతిశ్యాయ మని యన్వర్థముగ జెప్పబడును. ఈవిషయమును చరకాచార్యు లిట్లు చెప్పిరి:—"ఘ్రాణమూలే స్థితశ్శ్లేష్మా రుధిరం పిత్తమేవ వా, మారుతాధ్మాతశిరసః శ్యాయతే మారుతం ప్రతి" (చరక. చి. అ. ౨౬.) కఫపిత్తరక్తములలో నేదైన నాసాద్వారమునకు మొదటనుండి ప్రేరితమై వాతపూరితమగు శిరస్సున నుండు వాతమున కభిముఖముగ నడ్డగించునది ప్రతిశ్యాయ మని యర్థము.

## ప్రతిశ్యాయ పూర్వరూపము

క్షవప్రవృత్తిశ్శిరసోఽతిపూర్ణతా* స్తమ్భోఽఙ్గమర్దః పరిహృష్టరోమతా,
ఉపద్రవాశ్చాప్యపరేపృథగ్విధాఃనృణాంప్రతిశ్యాయపురస్సరాస్స్మృతాః

తా॥ ప్రతిశ్యాయము కల్గుటకు ముందు తుమ్ములు వెడలును. శిరస్సు నీళ్లతో నిండిన విధముగ బరు వగును. శరీరము స్తంభించియుండును. ఒడలెల్ల నొచ్చును. శరీరమునందలి రోమములు నిక్కపొడిచినట్లు స్తంభించును. ఇవిగాక ముక్కుల మంట మొదలగు నుపద్రవములుకూడ పూర్వరూపములుగ జనించును.

---

* "స్తమ్భోఽఙ్గమర్దః" అనియున్నచో వృత్త లక్షణము కుదరదు. "జ్వరోఽఙ్గమర్దః" అని యున్నచో యుక్తమగునని తోచెడిని.

విదేహుండు పూర్వరూపముల మరికొన్నిటి నిట్లు సెప్పెను:— పూర్వరూపాణి దృశ్యన్తే ప్రతిశ్యాయే భవిష్యతి. ఘ్రాణధూమాయనం మన్థః క్షవథుస్తాలు దారణమ్, కణ్ఠధ్వంసో ముఖస్రావః శిరసః పూరణమ్ తథా'' (విదేహుడు) ముక్కురంధ్రములనుండి పొగవెడలునట్లు బాధ, పుల్ల మొదలగువానితో కలియబెట్టినవిధముగ గురగురలాడు చుండుట, తుమ్ములు వెడలుట, తాలువులయందు పగిలి బాధగల్గుట, గొంతెండుట, నోట జొల్లుగారుట, శిరస్సు బరువగుట ఇవియన్నియు ప్రతిశ్యాయము కల్గుటకుముందు జనించు పూర్వరూపములు అని యర్థము.

## వాతికప్రతిశ్యాయము

ఆనద్ధా పిహితా నాసా తనుస్రావప్రసేకినీ,
గలతాల్వోష్ఠశోషశ్చ నిస్తోదశ్శఙ్ఖయో స్తథా. 16
క్షవప్రవృత్తిరత్యర్థం వక్త్రవైరస్యమేవ చ,
భవేత్స్వరోపఘాతశ్చ ప్రతిశ్యాయేఽనిలాత్మకే. 17

వాతప్రకోపమున గల్గిన ప్రతిశ్యాయమునందు ముక్కురంధ్రములు మూసినట్లు బిగిసి (నిశ్వాసము కష్టముగ వెడలుచు) స్వల్పముగ ద్రవము గారును. కంఠమును తాలువులును పెదవులును తడిలేక యెండును. కణతలయందు పోటుపుట్టును. తుమ్ములు ఎడలేక వెడలును. నోరు రుచి నెరుంగకుండును. గొంతు రాపుకలిగి కంఠస్వరము నడ్డగించునట్లు స్వరము వచ్చును.

వాగ్భటాచార్యుడు కొన్నిలక్షణముల నిట్లు సెప్పెను.—''ఘ్రాణోపరోధనిస్తోద దన్తశఙ్ఖశిరోవ్యథాః, కీటకా ఇవ సర్పన్తి మన్యతే పరితో భ్రువౌ. స్వరసాదశ్చిరాత్పాకః శిశిరాచ్ఛకఫస్రుతిః'' (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౪) నాసారంధ్రములు బిగదీసి శ్వాస నడ్డగించుట, సూదులబొడిచినవిధముగ నుండుట, పండ్లయందును కణతల యందును తలయందును నొప్పి కనుబొమలయందు పురుగులు పారాడువిధముగ గులగుల యనియుండుట, కంఠస్వరము నశించుట, చిరకాలమునకు జీర్ణమగుట, చల్లనై స్వచ్ఛముగ నుండు పలుచనిద్రవము స్రవించుట ఇవియన్నియు గల్గును.

## పైత్తిక ప్రతిశ్యాయ లక్షణము

ఉష్ణస్సపీతకస్స్రావో ఘ్రాణాత్స్రవతి పైత్తికే,
కృశోఽతిపాణ్డుః సన్తప్తో భవేదుష్ణాభిపీడితః. 18
సధూమమగ్నిం సహసా వమతీవ స మానవః,

పిత్తము ప్రకోపమునంది గల్గిన ప్రతిశ్యాయమున పచ్చనిరంగుగల్గి వేడియైన ద్రవము ముక్కునుండి స్రవించును. ఈవ్యాధిచే బీడింపబడిన మనుజుడు మిక్కిలి కృశించి తెల్లబడిన శరీరముకలవాడై యుష్ణముచే సంతాపమునొంది నోటనుండి పొగతోగూడిన నిప్పు వెడలువిధముగ వేడెక్కియుండును.

కఫజనితప్రతిశ్యాయలక్షణము

ఘ్రాణాత్కఫః కఫకృతే శీతః పాణ్డుస్స్రవేన్ముహుః,
శుక్లావభాసశ్శుక్లాక్షో భవేద్గురుశిరా నరః. 19
కణ్ఠతాల్వోష్ఠశిరసాం కణ్డూభిరభిపీడితః,

కఫప్రకోపమున జనించిన ప్రతిశ్యాయమునందు చల్లనై తెల్లనిరంగుకల్గిన కఫము ముక్కునుండి మాటిమాటికి కారుచుండును. అట్టివ్యాధిచే పీడితుడగురోగి కన్నులును శరీరంబును తెల్లనై తల బరువై గొంతునందును తాలువులయందును పెదవులయందును దురదచే బాధింపబడును.

సాన్నిపాతికప్రతిశ్యాయలక్షణము

భూత్వా భూత్వా ప్రతిశ్యాయో యస్యాకస్మాన్నివర్తతే. 20
సంపక్వో వాప్యపక్వో వా స సర్వప్రభవస్స్మృతః,

దోషములు మూడును సమకాలమున సమములుగ ప్రకోపించుటచే గల్గిన సన్నిపాతప్రతిశ్యాయమునందు అయ్యది పక్వంబైనను పక్వము గాకున్నను మాటిమాటికి కలుగుచు, మరల తనంతనే అకస్మాత్తుగా పోవుచుండును. (చికిత్సచేయకున్నను శమించి నట్లుండి మాటిమాటికి బాధించుచుండు ననుట.)

దుష్టప్రతిశ్యాయలక్షణము

ప్రక్లిద్యతే పునర్నాసా పునశ్చ పరిశుష్యతి. 21
పునరానహ్యతే వాపి పునర్వివ్రియతే తథా,
నిశ్వాసో వాతిదుర్గన్ధో నరో గన్ధాన్న వేత్తి చ. 22
ఏవం దుష్టప్రతిశ్యాయం జానీయాత్కృచ్ఛ్రసాధనమ్,

ప్రతిశ్యాయవ్యాధి కల్గినప్పుడు ఒకప్పుడు తడియై ముక్కునుండి స్రవించును. మరల నొకప్పుడు ద్రవములేక యెండును. ఒకప్పుడు ముక్కులు బిగిసి నిశ్వాసము వెడలుటకు మిక్కిలి కష్టముగ నుండును. ఒక సమయమున తనంతనె బిగువువదలి నిశ్వాసము

సరళముగ వెడలును. అట్టి నిశ్వాసము మిక్కిలి దుర్గంధము కల్గి వెడలును. మంచి పరిమళముసైనను దుర్గంధముసైనను ఎరుంగజాలడు. (ముక్కులు బిగిసియుండుటంజేసి గంధమును గ్రహించుశక్తి ఘ్రాణేంద్రియమున నుండ దనుట.) ఇట్టి లక్షణములు కల్గినది దుష్టప్రతిశ్యాయ మనబడును. ఇది మిక్కిలి కృచ్ఛ్రసాధ్యము.

పైజెప్పిన దుష్టప్రతిశ్యాయము కేవలము ఒక్క దోషముచేతనే కల్గినను అపథ్యములగు నాహారవిహారాదులంజేసి తక్కిన దోషములుకూడ ప్రకోపించి యొకవిధమైన వ్యవస్థ లేక పైజెప్పినవిధముగ పరస్పర విరుద్ధములగు లక్షణములు కల్గును. అట్టి విరుద్ధలక్షణములు కల్గియుండుటంజేసి దానికి చేయవలసిన చికిత్సయు పరస్పరవిరుద్ధముగ నుండవలయు గాన నిది చికిత్సకలవిగాక కృచ్ఛ్రసాధ్య మగును. ఇయ్యది యవస్థాభేదముచే వేరుగ గన్పట్టును గాని వాస్తవమగుభేదము లేదుగాన పైజెప్పినవానియందే యంతర్భూత మగును. కావున సంఖ్యాభేదము లేదు.

మరియు విదేహుండు "నృణాం దుష్టప్రతిశ్యాయస్త్వసాధ్యస్సర్వజః స్మృతః" అని చెప్పెను. కావున పైజెప్పిన సాన్నిపాతికప్రతిశ్యాయంబును దుష్టప్రతిశ్యాయంబును మిక్కిలి యసాధ్య మని యెరుంగునది. మరియు, "మూర్ఛన్తిచాత్ర క్రిమయో. దీర్ఘస్స్నిగ్ధసితాణవః" (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౧౨.) అని వాగ్భటమున నున్నది గాన నీదుష్టప్రతిశ్యాయమున పొడవై నిగనిగలాడెడి తెల్లనిరంగుగల్గి మిక్కిలి చిన్నవియగు పురుగులుగూడ కల్గు నని యెరుంగునది.

## రక్తప్రతిశ్యాయము

రక్తజే తు ప్రతిశ్యాయే రక్తస్రావః ప్రవర్తతే. 23
తామ్రాక్షశ్చ భవేజ్జన్తుః ఉరోఘాతప్రపీడితః,
దుర్గన్ధోచ్ఛ్వాసవదనో గన్ధానపి న వేత్తి సః. 24

రక్తము చెడుటవలన గల్గినప్రతిశ్యాయమునందు రక్తము ముక్కునుండి విశేషముగ స్రవించును. దీనియందు కన్నులెఱ్ఱనై రొమ్మునుపట్టినట్లు నొప్పికల్గి నోరు దుర్గంధము కల్గి నిశ్వాసము దుర్గంధముతోగూడి వెడలును. ఏవిధమైన వాసనయు ముక్కునకు తెలియదు.

మరియు నీరక్తప్రతిశ్యాయసంప్రాప్తిని, లక్షణములను వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"దుష్టం నాసాసిరాః ప్రాప్య ప్రతిశ్యాయం కరోత్యసృక్, ఉరసస్సుప్తతా తామ్ర నేత్రత్వం శ్వాసపూతితా, కణ్డూః శ్రోత్రాక్షినాసాసు పిత్తోక్తం చాత్ర లక్షణమ్" (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౮) రక్తము వాతాదులచే దుష్టమై నాసికయందలి సిరలజేరి ప్రతిశ్యాయమును కల్గించును. దీనియందు హృద

యమున బరువుగనుండును. కన్ను లెఱ్ఱనగును. శ్వాసము దుర్గంధముతో గూడి వెడలును. కన్నులయందును చెవులయందును ముక్కునందును దురదపుట్టును. ఇవిగాక పిత్తప్రతిశ్యాయమునకు జెప్పిన కృశత్వము మున్నగు లక్షణములును కల్గును అని భావము.

### అసాధ్యప్రతిశ్యాయలక్షణము

సర్వ ఏవ ప్రతిశ్యాయాః నరస్యాప్రతికారిణః,
దుష్టతాం యాన్తి కాలేన తదాఽసాధ్యా భవన్తి హి. 25
మూర్ఛన్తి చాత్ర క్రిమయః శ్వేతాస్స్నిగ్ధా స్తథాణవః,
క్రిమితో(జో)యశ్శిరోరోగః తుల్యం తేనాస్య లక్షణమ్. 26

మనుజులకు జనించు పైజెప్పిన ప్రతిశ్యాయము లన్నియు సకాలమున దగిన చికిత్సచేయక యుపేక్షించినచో కొంతకాలమునకు పైజెప్పినరీతిగ దుష్టప్రతిశ్యాయ రూపము నొంది దానిలక్షణములతో గూడియుండును. అట్టియెడ నసాధ్యము లగును. మఱియు నాసారంధ్రములయందు స్నిగ్ధంబులై మిక్కిలి సూక్ష్మములైన తెల్లనిక్రిములు కల్గును. క్రిములు కల్గినప్పుడు క్రిములచేగల్గిన శిరోరోగమునకు జెప్పినలక్షణములు దీని యందును కల్గును.

### పీనసముచే గల్గువ్యాధులు

బాధిర్యమాన్ధ్యమఘ్రాత్వం ఘోరాంశ్చ నయనామయాన్.
శోథాగ్నిసాదకాసాంశ్చ వృద్ధాః కుర్వన్తి పీనసాః. 27

పైజెప్పిన పీనసములు నానాట వృద్ధినొందినయెడ చెవుడు, అంధత్వము, గంధము నెరుంగకుండుట, మిక్కిలి క్రూరములగు నేత్రవ్యాధులు, శోఫ, అగ్నిమాంద్యము, దగ్గు అను నీవ్యాధులను కల్గించును.

"ఘోరాంశ్చ నయనామయాన్" అను వాక్యముచేతనే అంధత్వ మను నేత్రవ్యాధియు గ్రహింపబడును; అయినను మరల చెప్పుటచేత అంధత్వము ముఖ్యముగ గల్గునని యర్థము సూచింపబడును.

### నాసార్బుదాదిలక్షణము

అర్బుదం సప్తధా శోథా శ్చత్వారోఽర్శశ్చతుర్విధమ్,
చతుర్విధం రక్తపిత్తం ఉక్తం ఘ్రాణేఽపి తద్విదుః. 28

ఏడువిధములైన యర్బుదంబులును, నాల్గుతెరంగులగు శోఫంబులును, నాల్గువిధములైన యర్శస్సులును, నాల్గువిధములైన రక్తపిత్తంబులును ఈవ్యాధులన్నియు ముక్కుల

యందును కల్గును. వీని లక్షణములను ఆయానిదానమున జెప్పినవిధముగ దానిదాని లక్షణములబట్టి ఆయావ్యాధి సామాన్యవిశేషలక్షణముల నెరింగి నిర్ణయించునది. ఈ విషయమునే వాగ్భటాచార్యుడు "అర్శోఽర్బుదాని విభజేత్ దోషలింగైర్యథాయథమ్" (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౨౬.) అను వాక్యముచే స్ఫుటముగ జెప్పెను.

నాసార్బుదములయందును నాసార్శస్సులయందును కల్గు విశేషలక్షణములను వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"సర్వేషు కృచ్ఛ్రాచ్ఛ్వసనం పీనసః ప్రతతం క్షవః, సానునాసికవాదిత్వం పూతినాసః శిరోవ్యథా" (అ. హృ. ఉ. అ. ౧౯. శ్లో. ౨౭.) ముక్కులో కల్గు అర్బుదములయందును, అర్శస్సులయందును, ఆయావ్యాధికి ఆయాప్రకరణముల జెప్పిన లక్షణములు కాక కష్టముచే నిశ్వాసము వెడలుట, పీనసము (ముక్కుడచియుండుట), ప్రబలముగ తుమ్ముట, ముక్కున మాటలాడుట, నాసికా రంధ్రములయందు దుర్గంధము కల్గుట ఈలక్షణములుకూడ కల్గును అని భావము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
నాసారోగనిదానం సమాప్తమ్.

# ౫౯. నేత్రరోగనిదానము

BHASHA NILAYA

నాసికవలె నేత్రములును ఇంద్రియముల కధిష్ఠానము; కావున నాసారోగము లను జెప్పినపిదప నేత్రరోగనిదానమును జెప్పుట.—

## నేత్రరోగములు జనించుటకు కారణము

ఉష్ణాభితప్తస్య జలే ప్రవేశాద్దూరేక్షణాత్స్వప్నవిపర్యయాచ్చ,
స్వేదాద్రజోధూమనిషేవణాచ్చ ఛర్దేర్విఘాతాద్వమనాతియోగాత్.
ద్రవాత్తథాన్నాన్నిశి సేవితాచ్చ విణ్మూత్రవాతక్రమనిగ్రహాచ్చ,
ప్రసక్తసంరోదనకోపశోకాచ్ఛిరోఽభిఘాతాదతిమద్యపానాత్. 2
తథా ఋతూనాం చ విపర్యయేణ క్లేశాభిఘాతాదతిమైథునాచ్చ,
బాష్పగ్రహాత్సూక్ష్మనిరీక్షణాచ్చ నేత్రే వికారాఞ్జనయన్తి దోషాః. 3

ఎండ నిప్పుసెగ మున్నగువానిచే శరీరము మిక్కిలి వేడెక్కియున్నపుడు ఆ వేడి యారకమునుపు నీటిలో మునిగి చాలకాల ముండుట, మిక్కిలి దూరమున నుండు వస్తువుల జూచుట, రాత్రులయందు నిద్రపోకయుండుట, పవటిపూట అధికముగ నిద్రపోవుట, చెమటయు - దుమ్మును - పొగయు కన్నులలో జొరబడుట, వమనము గానున్నపుడు దానివేగమును నిరోధించుట, అధికముగ వమనరూపమగు శోధనము జేసికొనుట, లేక వమన మధికముగనగుట, రాత్రివేళల నీటియందున్న ద్రవాన్నమును తినుట, మల మూత్రవాతముల వెడలనీయక వాని వేగమును నిరోధించుట, ఎడతెగక యేడ్చు చుండుట, లేక కోపపడుట, శోకించుట, శిరంబున నభిఘాతము కల్గుట, మద్యము నధిక ముగ త్రాగుట, ఋతుధర్మములైన శీతోష్ణాది పరిస్థితులు మారియుండుట, ఆయాఋతు వుల ననుసరించి ఋతుచర్యాధ్యాయమున జెప్పినవిధి ననుసరింపక ఒక ఋతుచర్యలను వేరొక ఋతువున నాచరించుట, శరీరమున కాయాసము గల్గించుపనుల జేయుట, కన్నుల కభిఘాతము కల్గుట, అధికముగ (తన బలమునకు మీఱి) స్త్రీసంభోగము చేయుట, కన్నీళ్లను బైటవెడలనీక యడ్డగించుట, మిక్కిలి సూక్ష్మములగు వస్తువులనైనను సూది రంధ్రము మున్నగువానినైనను జూచుట ఇవి మున్నగు కారణములచేత వాతపిత్త కఫరూపములగు దోషములు ప్రకోపించి కన్నులయందు పలుతెరంగులగు రోగముల గల్గించును.

నేత్రరోగభేదములవిషయమై ఆయాతంత్రకారులు వారివారి కిచ్చవచ్చినట్లు పరిగణనము చేసియుండుటచే విప్రతిపత్తి కానంబడియెడు. అందు చరకాచార్యులు సామాన్యముగ వాతపిత్తకఫ సన్నిపాత భేదములచే నాల్గుతెరంగుల సూచనామాత్రముగ నిరూపించి "నేత్రామయాః షణ్ణవతిస్తు భేదాత్, తేషామభివ్యక్తిరభిప్రదిష్టా శాలాక్యతన్త్రేషు చికిత్సితం చ. పరాధికారేతు న విస్తరోక్తిః శస్తేతి తేనాత్ర న నః ప్రయాసః" (చరక. చి. అ. ౨౬. శ్లో. ౨౩౧) అను వాక్యముచేత నేత్రరోగములు తొంబదియారువిధముల భిన్నములైయుండును. అవియన్నియు శాలాక్యతంత్రమున జెప్ప నవసరముగాని కాయచికిత్సా ప్రధానమగు నీతంత్రమున జెప్పబడ వని చెప్పెను.

సుశ్రుతాచార్యుడు డెబ్బదియారు నేత్రరోగముల బరిగణించి వాని విభాగము ను ఆలక్షణములను సవిస్తరముగ జెప్పెను. సుశ్రుతమునందలి విభాగ మిట్లున్నది:—
"తైస్త్రిభిస్త్రింశదుక్తాస్తే కఫేనాత్యధికాస్త్రయః, రక్తజాష్షోడశ ప్రోక్తాః సర్వజాః పఞ్చవింశతిః. బాహ్యౌ పునర్ద్వౌ చ తథా రోగాష్షట్సప్తతిస్స్మృతాః, నవసన్ధ్యాశ్రయాస్తేషు వర్త్మజాస్త్వేకవింశతిః, శుక్లభాగే దశైకశ్చ చత్వారః కృష్ణభాగజాః, సర్వాశ్రయాస్సప్తదశ దృష్టిజాః ద్వాదశైవతు, ద్వౌచబాహ్యాశ్రయావన్యౌ రోగౌ పరమదారుణౌ, షట్సప్తతి ర్నేత్రరోగాః సఙ్గ్రహేణ ప్రకీర్తితాః" (సుశ్రుత. ఉ. అ. ౧) వాతపిత్తకఫములచే వేర్వేరుగ జనించునవి ముప్పది, మిక్కిలి కఫాధిక్యమున జనించునవి మూడు, రక్తముచే జనించునవి పదునారు, త్రిదోషముల సన్నిపాతమున జనించునవి యిరువదియైదు, నేత్రములకు వెలిప్రక్క పుట్టునవి రెండు, ఇవియన్నియు గలిసి నేత్ర రోగములు (76) డెబ్బదియారు. వానిలో కన్నులలోని సంధుల నాశ్రయించి పుట్టునవి (9) తొమ్మిది. రెప్పల నాశ్రయించి పుట్టునవి (21) ఇరువదియొకటి. కన్నులలో తెల్లగ్రుడ్డున గల్గునవి (11) పదునొకండు. నల్లగ్రుడ్డున పుట్టునవి (4) నాల్గు. నేత్రమును పూర్తిగ నన్నిప్రదేశముల వ్యాపించి కల్గునవి (17) పదునేడు. కంటిలో దృష్టి (చూపు) నాశ్రయించి పుట్టునవి (12) పండ్రెండు. కన్నులలో బాహ్యకారణములైన యాగంతుకారణములచే పుట్టునవి (2) రెండు. ఇవియన్నియు నాశ్రయభేదములచే గలుగు నేత్రరోగభేదములు. ఇవియన్నియు గలిసి పైజెప్పిన డెబ్బదియారు సంఖ్యకు సరిపోవును. ఇదియూ సుశ్రుతమతభేదము. ఈ భేదముల పరిగణనము నేత్రరోగ నిదాన ప్రకరణాంతమున వ్రాయబడెను.

ఈసుశ్రుతమతము నాశ్రయించియే మాధవకరుడు పైజెప్పిన విభేదప్రకారము డెబ్బదియారువిధములగు నేత్రరోగములను సమర్థకముగ నీక్రింద వివరించెను.

నేత్రరోగసంప్రాప్తిని సుశ్రుతాచార్యు డిట్లు చెప్పెను:—"సిరానుసారిభిర్దోషైః విగుణై రూర్ధ్వ మాశ్రితైః, జాయన్తే నేత్రభాగేషు రోగాః పరమదారుణాః."

(సుశ్రుత. ఉ. అ. ౧) వాతాదిదోషములు ప్రకోపమునొంది యూర్ధ్వగతములగు సిరలలో నేత్రముల నాశ్రయించిన ముప్పదియెనిమిదిసిరల నాశ్రయించి నేత్రముల యందలి ఆయాభాగములయందు మిక్కిలి క్రూరములైన ఆయానేత్రరోగములను గలిగించును. (నేత్రగతసిరలు "అష్టత్రింశ దుభయో ర్నేత్రయోః" (సుశ్రుత. శా. అ. ౭. సూత్ర. ౨౫) అని సుశ్రుతమున జెప్పబడినవి.)

మరియు నేత్రస్వరూపమును పరిమితిని సుశ్రుతాచార్యం డిట్లు చెప్పెను:— "విద్యాద్ద్వ్యఙ్గులబాహుల్యం స్వాఙ్గుష్ఠోదరసమ్మితమ్, ద్వ్యఙ్గులం సర్వతస్సార్ధం భిషఙ్నయనబుద్బుదమ్" (సుశ్రుత. ఉ. అ. ౧) రెండంగుళములపరిమితి విస్తారంబును, లోప్రక్కబొటనవ్రేలి పరిమాణంబును, చుట్టును రెండున్నర అంగుళముల పరిమితియు కల్గి నీటిబుడగవలె నున్నతముగ నుండునది నేత్రము. (అట్టినేత్రమునం దాయాస్థలముల జనించురోగములు నేత్రవ్యాధు లని చెప్పనగును.)

### సర్వగతరోగములు 17, అందు అభిష్యన్ద భేదములు

వాతాత్పిత్తాత్కఫా ద్రక్తాదభిష్యన్దశ్చతుర్విధః,
ప్రాయేణ జాయతే ఘోరః సర్వనేత్రామయాకరః. 4

కన్నులలో నీరు గారుటయే ప్రధానముగ గల్గినది యభిష్యంద మనబడును. అయ్యదివాతము, పిత్తము, కఫము, రక్తము నను నాలుగుకారణములచే జనించుటంజేసి నాలుగువిధములు. ఇయ్యది మిక్కిలి క్రూరమై ప్రాయికముగ తక్కినరోగముల కన్నిటికిని ప్రధానకారణ మగును.

ఈవిషయమునే సుశ్రుతాచార్యం డిట్లు చెప్పెను:—"ప్రాయేణ సర్వేనయనామయాస్తే, భవన్త్యభిష్యన్దనిమిత్తమూలాః" (సుశ్రుత. ఉ. అ. ౧ ) నేత్రరోగములన్నియు దరుచుగ నభిష్యందరోగమును మూలకారణముగజేసి జనించును అని భావము.

### వాతాభిష్యంద లక్షణము

నిస్తోదనస్తమ్భనరోమహర్షసఙ్ఘర్షపారుష్యశిరోఽభితాపాః,
విశుష్కభావః శిశిరాశ్రుతా చ వాతాభిపన్నే నయనే భవన్తి.

వాతప్రకోపమున గల్గిన యభిష్యందరోగమునందు కన్నులలో సూదులతో గ్రుచ్చినవిధముగ చురుకుచురుక్కని పోటుపుట్టును. కన్నులు స్తంభించి త్రిప్పుటకు కష్టముగ నుండును. రెప్పవెండ్రుకలు నిక్కబొడిచియుండును. కన్నులలో నిసుకగూరినట్లు మెరమెరలాడుచు మిగుల పరుషముగ నుండును. తలయందు మంట కలుగును. కండ్లు పుసులుగట్టక చల్లనికన్నీళ్లుగారును. ఈలక్షణములన్నియు కలిగినది వాతాభిష్యందము.

## పిత్తాభిష్యందలక్షణము

దాహప్రపాకౌశిశిరాభినన్దాధూమాయనంబాష్పసముచ్ఛ్రియశ్చ,
ఉష్ణాశ్రుతా పీతకనేత్రతా చ పిత్తాభిపన్నే నయనే భవన్తి. 6

కన్నులయం దొరువరానిమంట పుట్టి పుండగుట, చల్లనిస్పర్శమును గోరుట, కన్నులనుండి పొగవెడలునట్లు సెగపుట్టుట, కన్నీళ్లు మిక్కిలి వేడియై యధికముగ స్రవించుట, కన్నులు పచ్చనై యుండుట, ఇవియన్నియు పిత్తప్రకోపమున జనించిన యభిష్యందరోగమున గలుగును.

## కఫాభిష్యంద లక్షణము

ఉష్ణాభినన్దా గురుతాఽక్షిశోథః కణ్డూపదేహావతిశీతతా చ,
స్రావో ముహుః పిచ్ఛిల ఏవ చాపి కఫాభిపన్నే నయనే భవన్తి.

నేత్రములు కఫప్రకోపమున దూషితములై కలిగిన యభిష్యందమున కన్నులు వేడియైన స్పర్శము గోరుచు బరువుగ నుండును. కను రెప్పలు వాచును. విశేషముగ దురదకలిగి కన్నులయందు పుసులు పెరుగును. కన్నులు చల్లనైన జిగురువలె చిక్కనైన కన్నీరు పలుమారు గారును. ఇట్టిలక్షణములు గలిగిన అభిష్యందరోగము కఫజము.

## రక్తాభిష్యంద లక్షణము

తామ్రాశ్రుతా లోహితనేత్రతా చ నాడ్యస్సమన్తాదతిలోహితాశ్చ,
పిత్తస్య లిఙ్గాని చ యాని తాని రక్తాభిపన్నే నయనే భవన్తి. 8

రక్తముచే గలిగిన యభిష్యందరోగమునందు కన్నులు మిక్కిలి యెఱ్ఱనై యెఱ్ఱని కన్నీరు గారుచు, కన్నులపై వ్యాపించియుండు సన్ననినాడులు మిక్కిలి యెఱ్ఱనై యుండును. ఇవిగాక పిత్తాభిష్యందమునకు పైజెప్పబడిన మంట పుండగుట మున్నగు లక్షణములన్నియు కలుగును.

## అధిమంథసంప్రాప్తి సామాన్యలక్షణము

వృద్ధై రేతై రభిష్యన్దైర్నరాణామక్రియావతామ్,
తావన్తస్త్వధిమన్థాస్స్యుః నయనే తీవ్రవేదనాః. 9
ఉత్పాట్యత ఇవాత్యర్థం నేత్రం నిర్మథ్యతే తథా,
శిరసోఽర్ధం చ తం విద్యాదధిమన్థం స్వలక్షణైః. 10

పైజెప్పిన యభిష్యందము కలిగినప్పుడు సకాలమున దగినచికిత్స చేయక యుపేక్షించినచో నధిమంథంబు లను వ్యాధులు కలుగును. ఈవ్యాధులయందు కన్నులలో మిక్కిలి తీవ్రముగ బాధ కలిగి కన్ను పెల్లగింపబడినవిధముగ నొప్పియు, ఫుల్లచేత కలియబెట్టబడినవిధముగ పోటును కలుగును. శిరస్సునందు సగమున మిక్కిలి తీవ్రమైన నొప్పి కలుగును. ఇది అధిమంథము లన్నిటియందు సామాన్యముగ గల్గులక్షణము. అట్టి యధిమంథము అభిష్యందము లెన్నియో అన్ని భేదములు కలిగియుండును. ఈలక్షణములుగాక వాతాద్యభిష్యందములకు వేరువేర జెప్పిన లక్షణములుగూడ గల్గియుండును. (వాతాభిష్యందము నుపేక్షించినయెడ వాతాభిష్యందలక్షణంబులును, అధిమంథ సామాన్యమునకు పైజెప్పబడిన లక్షణంబులును కలిగియున్నయెడ నయ్యది వాతాధిమంథము. ఇత్తెరంగుననే పిత్తాభిష్యందముచే పిత్తాధిమంథంబును, కఫాభిష్యందముచే కఫాధిమంథంబును, రక్తాభిష్యందముచే రక్తాధిమంథంబును కల్గు నని భావము)

### అధిమంథతీవ్రతకు దోషభేదముచే కాలనియమము

హన్యాద్దృష్టిం శ్లైష్మికస్సప్తరాత్రా*దధీమంథో రక్తజః పఞ్చరాత్రాత్,
షడ్రాత్రాద్వై వాతికో వా నిహన్యాత్ మిథ్యాచారాత్పైత్తికస్సద్య ఏవ.

కఫముచే గల్గిన యధిమంథమునందు తగినచికిత్సచేయక యపథ్యము లగు నాహారవిహారాదుల జేసినయెడ వ్యాధికల్గిననాటనుండి యేడురాత్రులలోపల చూపును చెరచును. రక్తమున గల్గిన యధిమంథము ఐదునాళ్లలో దృష్టిని చెరచును. వాతమున జనించు నధిమంథము ఆరుదినములలో దృష్టిని చెరచును. పిత్తమున జనించిన యధిమంథము నేమాత్ర ముపేక్షించినను †అప్పుడే దృష్టిని చెడగొట్టును. (ఇట్టి కాలనియతి కీవ్యాధి స్వభావమే కారణముగాని వేరొండు కారణము లేదు.)

### నేత్రరోగములయామత్వలక్షణము

ఉదీర్ణవేదనం నేత్రం రాగశోథసమన్వితం,
ఘర్షనిస్తోదశూలాశ్రుయుక్తమామాన్వితం విదుః. 12

నేత్రరోగము పరిపక్వముగాక ఆమావస్థనుండునపుడు కన్నులబాధ మిక్కిలి తీవ్రమై, కన్నులు మిక్కిలి యెఱ్ఱనై వాపుతోగూడి కరకరలాడుచు పోటుచు నొప్పియు కల్గి కన్నుల నీరుగారుచుండును. (ఇట్టిలక్షణములబట్టి నేత్రరోగము ఆమావస్థ నున్నదని తెలియదగును.)

---

* ఛందోభంగము చింత్యము - 'అధిమంథో'' అని అజ్ పూర్వకముగా నుండిన ఛందోభంగము రాదు. † మూడురోజు లని మధుకోశమున గలదు. సద్యశ్శబ్దము త్రిరాత్రపరముగా నాయుర్వేదశాస్త్రమున వాడుక కల దని వ్రాయబడెను.

### నేత్రరోగముల పక్వావస్థలక్షణము

మన్దవేదనతా కణ్డూః సంరమ్భాశ్రుప్రశాన్తతా,
ప్రశస్తవర్ణతా చాక్ష్ణోః సంపక్వం దోషమాదిశేత్. 13

నేత్రరోగములు పక్వావస్థ నుండునపుడు పోటు నొప్పి మున్నగుబాధలు తగ్గియుండును. జిలపుట్టును. వాపుతగ్గి కన్నీళ్లు కారక శాంతముగ నుండును. కన్నులయందు ఎరుపుపోయి మామూలుగ నుండు రంగుకల్గియుండును. (ఈలక్షణములను బట్టి నేత్రరోగము పక్వావస్థ నున్న దని యెరుంగునది.)

ఇచ్చట నేత్రరోగములయందు ఆయారోగలక్షణములు విశదముగ చెప్పుటకు మున్ను ఆమపక్వలక్షణముల జెప్పుట యేల ? ఆయాలక్షణములబట్టియే రోగనిర్ణయమేర్పడుచుండ ఆమపక్వలక్షణము లరయుట అనవసర మని యాశంక కలుగ వచ్చును; కాని నేత్రరోగముల యామపక్వావస్థల గమనించినచో నామావస్థయందు పాచన చికిత్స చేయుటకును, అట్టియవస్థయందు ఆహారాదినియమముల దెలియుటకును, ఆమ పక్వావస్థలరయుట యావశ్యకము. ఆమావస్థయందు చేయదగిన పాచనములను, నియమ విశేషములను తంత్రాంతరమున నిట్లు చెప్పిరి:—"స్వేదః ప్రలేపస్తిక్తాన్నం ధూమోదిన చతుష్టయమ్, లఙ్ఘనం చాక్షిరోగాణాం ఆమానాం పాచనాని తు, అఞ్జనం సర్పిషః పానం కషాయం గురుభోజనమ్, నేత్రరోగేషు సామేషు స్నానం చాపి వివర్జయేత్" వేడియన్నము మొదలగువానిచేత కన్నుల సుఖోష్ణముగ కాచి చెమటబుట్టించుట, తగిన యౌషధములచే పట్టువేయుట, చేదుగలపదార్థముల భుజించుట, పొగబట్టుట, లేక పొగపీల్చుట, లంకణ ముండుట, ఇట్టినియమముల నాల్గుదినములవరకు చేసినచో నేత్ర రోగములు పక్వావస్థనొందును. మరియు నేత్రరోగములు ఆమావస్థ నున్నపుడు కాటుక బెట్టుట, నెయ్యిత్రాగుట, వగరు గలపదార్థముల నుపయోగించుట, అజీర్ణకరపదార్థముల భుజించుట, స్నానముచేయుట వీని నన్నిటిని విడువ నగును.

### నేత్రపాకలక్షణము

కణ్డూపదేహాశ్రుయుతః పక్వోదుమ్బరసన్నిభః,
సంరమ్భా పచ్యతే యస్తు నేత్రపాకస్స శోథజః,
శోథహీనాని లిఙ్గాని నేత్రపాకే త్వశోథజే. 14

కన్నులయందు వాపువలన పుండైనపుడు మిక్కిలి దురద కల్గును. కనురెప్పల *లోభాగమున దుర్మాంసము పెరుగును. కన్నీళ్లు గారుచు పండినమేడిపండువంటి

* ఉపదేహ మనగా నంటుకొనుట యని యర్థ ముచితము.

రంగు కల్గి వాపుతో గూడి పుండగును. వాపులేకయే పుండగునపుడు వాపుకు సంబంధించిన లక్షణములు మాత్రము కనబడును.

### వాతాధిమంథలక్షణము

ఉపేక్షణాదక్షియథాధిమన్థో వాతాత్మకస్సాదయతి ప్రసహ్య,
రుజాభిరుగ్రాభిరసాధ్యఏష వాతాధిమన్థః ఖలు నామ రోగః. 15

పై జెప్పబడిన యధిమంథరోగములు నాల్గిటిలో వాతముచే గల్గిన యధిమంథమును చికిత్స చేయక యుపేక్షించినచో పోటు నొప్పి మొదలగు బాధలు మిక్కిలి తీవ్రములై చూపును చెరిచి నేత్రమును బొత్తుగ జెరచును. ఇయ్యది వాతాధిమంథంబను క్రూరమైనవ్యాధి. ఇది కంటిని నశింపజేయుటం జేసి యసాధ్యము.

విదేహుండు డీవాతాధిమంథమును రెండు విధములుగ జెప్పుచు దాని సంప్రాప్తిని లక్షణమును విశదముగ నిట్లు చెప్పెను:—“అంతర్గతస్సిరాణాం తు యథా తిష్ఠతి మారుతః, స ప్రభా నయనం ప్రాప్య శీఘ్రం దృష్టిం నిరస్యతి. తస్యాం నిరస్యమానాయాం నిర్మథన్నివ మారుతః, నయనం నిర్వమత్యాశుశూలతోదాధిమన్థనైః. అథవా శోషయే దక్షిక్షీణతేజోబలాదయమ్, తత్పద్మమివ సంశుష్కం అవసీదతి లోచనమ్. వాతాధిమన్థం తంవిద్యాదసాధ్యం వాతకోపతః” కన్నులలోపల వ్యాపించియుండు సిరలయందుండువాతము లోపలనుండి కన్నులయందు జేరి దృష్టిని పూర్తిగ జెరచును. పిదప గ్రుడ్డును అరణిని మథించువిధముగ లోపలనే కలియబెట్టి నొప్పిని పోటును కల్గించి కంటిని వెలికి (పైకుబికించి) ద్రోయును. లేక కంటిలో చూపు చెడుటంజేసి తేజోరూపమైనశక్తి నశించును. కావున ఎండిన తామరపువ్వుబోలె నశించి గ్రుడ్డులోపలనే యణగి కృశించును. ఇయ్యది వాతాధిమంతం బను వ్యాధి యనబడును. ఇది వాతప్రకోపమున గల్గును. మిక్కిలి యసాధ్యము. (ఇచ్చట తొలుత జెప్పబడినది నేత్రమును వెలికిద్రోయునది కావున దృష్ట్యుత్క్షేపకం బనియు, రెండవది కన్నుల నశింపజేయుటంజేసి నయనశోషం బనియు జెప్పంబడును.) ఈమూలమున జెప్పినది నయనశోషరూపం బగు వాతాధిమంథం బని యెరుంగునది.

### వాతపర్యయలక్షణము

వారంవారం చ పర్యేతి భ్రువౌ నేత్రే చ మారుతః,
రుజశ్చ వివిధాస్తీవ్రాః స జ్ఞేయో వాతపర్యయః. 16

వాతము ప్రకోపమునొంది కనుబొమలయందును, ఒకప్పుడు కన్నులయందును వ్యాపించి మిక్కిలి తీవ్రములగుబాధల గల్గించును. ఇయ్యది వాతము కన్నులయందును

కనుబొమలయందును మార్చి మార్చి బాధగల్గించుటంజేసి వాతపర్యయ మని యన్వర్థముగ జెప్పబడును. ఇది కేవలము వాతమున జనించును.

## శుష్కాక్షిపాకలక్షణము

యత్కూణితం దారుణరూక్షవర్త్మసన్దహ్యతే చావిలదర్శనం యత్,
సుదారుణం యత్ప్రతిబోధనే చ శుష్కాక్షిపాకోపహతం తదక్షి.17

కన్నుమూతపడి కనురెప్పలు మిక్కిలి కఠినంబులును రూక్షంబులునై కలకబారి మంటపుట్టి కన్నుల తెఱచుటకును, మిగుల క్రూరమై యెండి (ద్రవములేక) యుండగును. ఇది శుష్కాక్షిపాకం బని చెప్పబడును.

వాగ్భటమున 'వాతపిత్తోత్తరం' అని చెప్పియుండుటంజేసి పైజెప్పిన శుష్కాక్షిపాకం బనునది వాతపిత్తములచే గల్గు నని తెలిసెడి. తంత్రాంతరమున—"కూణితం ఖరపక్ష్మాక్షి కృచ్ఛ్రోన్మీలావిలేక్షణమ్, సదాహం సాసృజో వాతాల్ శుష్కపాకాన్వితం వదేత్" అని చెప్పబడినది. కనురెప్పలు కర్కశములై కన్నులు మూయుటకును తెరచుటకును మిక్కిలి కష్టమై దృష్టి కలకబారి మంటతో కూడియున్నచో శుష్కాక్షిపాకం బనబడును; ఇయ్యది రక్తముతో గూడినవాతమున గల్గును. ఈవాక్యముచేత రక్తముతో గూడినవాతముచే నీవ్యాధి కల్గు నని తెలియుచున్నది. పిత్తమునకును రక్తమునకును లక్షణములు సమానములు కావున వాగ్భటమునకును పైగ్రంథమునకు ఫలభేదము కలుగ దని యెఱుంగునది.

మరియు వాగ్భటాచార్యులు "శీతేచ్ఛాశూలపాకవత్" అని చెప్పిరి. కావున నీవ్యాధియందు శీతస్పర్శమునం దిచ్ఛ కల్గు ననియు, శూలముతో గూడి యుండగు ననియు తెలియునది.

## అన్యతోవాతలక్షణము

యస్యావటూకర్ణశిరోహనుస్థోమన్యాగతోవాప్యనిలోఽన్యతో వా,
కుర్యాద్రుజంవైభ్రువిలోచనేచ తమన్యతో వాతముదాహరన్తి.18

మనుజుని పెడతలయందైనను, చెవులు శిరస్సు అంకిళ్లు మెడవెనుప్రక్కనుండు మన్య యను నరములు, ఈస్థలములలో దేనియందైనను, లేక యితరస్థలములయందైననుండు వాతము ప్రకోపమునొంది, కన్నులయందైనను, కనుబొమలయందైనను తీవ్రమగుబాధ గల్గించును. ఇయ్యది అన్యతోవాత మని చెప్పబడును.

దీనిలక్షణమును విదేహుడు కొంచెము భేదముగ జెప్పెను:—"మన్యయోరన్తరేవాయుః ఉత్థితః పృష్ఠతోఽపి వా, కరోతి భేదం నిస్తోదం శఙ్ఖే చాక్ష్ణోర్భ్రువోస్తథా తమాహురన్యతోవాతం రోగం దృష్టివిదోజనాః." మెడవెనుకటి

ప్రక్కనుండు మన్య లను నరముల నడుమనైనను వీపునైనను వాతము ప్రకుపితమై కణ తలయందును కన్నులయందును కనుబొమలయందును నొప్పిని పోటును కల్గించును. దీనిని అన్యతోవాత మని నేత్రరోగముల దెలిసినవారు చెప్పెదరు అని యర్థము. (వాత మొకప్రదేశమున కుపితమై వేరొండుచోట బాధ గల్గించుటంజేసి యన్యతోవాత మని యీవ్యాధి యన్వర్థముగ జెప్పంబడును.)

## అమ్లాధ్యుషితలక్షణము

శ్యావం లోహితపర్యంతం సర్వం చాక్షి ప్రపచ్యతే,
సదాహశోథం సాస్రావం అమ్లాధ్యుషిత మమ్లతః. 19

భుజింపబడిన యాహారరసము అమ్లమై (పులుపెక్కి) సిరామూలముగ నేత్రమున జేరి కన్నులు శ్యామలవర్ణంబుగను, కొనలయందు ఎఱ్ఱగను నై కన్నంతయు పుండగును. మంటయు వాపునుకల్గి నీరుగారుచుండును. ఇది అమ్లాధ్యుషిత మనబడును. (అమ్లమైన యన్నరసము కన్నులయందు సిరామూలముగ జేరియుండినందున జనించు వ్యాధి గాన నన్వర్థముగ నమ్లాధ్యుషిత మనబడు నని యెరుంగునది.)

దీనిసంప్రాప్తిని లక్షణమును వాగ్భటాచార్యుడు ఇత్తెరంగున విపులముగ జెప్పెను:—"అన్నసారోఽమ్లతాం నీతః పిత్తరక్తోల్బణైర్మలైః, సిరాభిర్నేత్రమారూఢః కరోతి శ్యామలోహితమ్. సశోఫదాహపాకాశ్రు భృశం చావిలదర్శనమ్, అమ్లోషితోఽయమ్" (అ. హృ. ఉ. అ. ౧౫. శ్లో. ౨౧, ౨౨.) భుజింపబడిన యన్నము యొక్క సారరూపమైన రసము పిత్తరక్తము లధికములుగ గల దోషములచేత పులుపెక్కి నేత్రమునందలి సిరామూలమున గన్నులయందు జేరి కన్నులను శ్యామవర్ణము గను రక్తవర్ణముగను జేయును. దానంజేసి కనురెప్పలు వాచి మంటతో గూడి పుండై కన్నీరు కారును. కంటిచూపు కలకబారియుండును. ఇయ్యది అమ్లోషితము అని యర్థము. (ఈవాక్యముచేకూడ నమ్లరసమే యీవ్యాధికి ముఖ్యకారణ మని తెలియుచున్నది.)

## సిరోత్పాతలక్షణము

అవేదనా వాపి సవేదనా వా
యస్యాక్షిరాజ్యో హి భవన్తి తామ్రాః,
ముహుర్విరజ్యన్తి చ యాస్సతాదృ
గ్వ్యాధిః సిరోత్పాత ఇతి ప్రదిష్టః. 20

కన్నులయందు వేదనతో గూడినదైనను, బాధలేకయైనను సన్నని నరములు ఎఱ్ఱనై వ్యాపించును. ఇత్తెరంగున మాటిమాటికిని యెఱ్ఱనై వ్యాపించుచున్న నయ్యది సిరోత్పాత మని చెప్పబడును.

### సిరాప్రహర్ష లక్షణము

మోహాత్సిరోత్పాత ఉపేక్షితస్తు జాయేత రోగస్తు సిరాప్రహర్షః,
తామ్రాభమస్రం స్రవతి ప్రగాఢం తథా న శక్నోత్యభివీక్షితుం చ.

పైజెప్పబడిన సిరోత్పాత మను వ్యాధికి తగిన కాలమున యుక్తమైన చికిత్స చేయక యజ్ఞానముచే నుపేక్ష చేసినచో సిరాప్రహర్ష మను వ్యాధి పుట్టును. ఈవ్యాధి యందు కన్నీరు ఎఱ్ఱనిరంగుకల్గి స్రవించును. కన్నులుచూడ శక్తములు గాకుండును.

(ఇత్తెరంగున అభిష్యందములు నాల్గును, అధిమంథములు నాల్గును, ఆమనేత్రంబును, పక్వనేత్రంబును, వాతాధిమంథంబును, వాతపర్యయంబును, శుష్కాక్షిపాకంబును, అన్యతోవాతంబును, అమ్లాధ్యుషితంబును, సిరోత్పాతంబును, సిరాప్రహర్షంబును కలిసి అక్షిరోగములలో పదునేడు సర్వగతరోగములు చెప్పంబడియె. పైజెప్పిన వ్యాధులు కన్నులయంతంతట వ్యాపించునవి యగుటంజేసి సర్వగతము లనబడును.)

### నల్లగ్రుడ్డున జనించురోగములు నాల్గు, అందు సవ్రణశుక్ల లక్షణము

నిమగ్నరూపం తు భవేద్ధి కృష్ణే సూచ్యేవ విద్ధం ప్రతిభాతి యద్వై,
స్రావం స్రవేదుష్ణమతీవ యచ్చ తత్సవ్రణం శుక్లముదాహరన్తి. 22

కంటిలో నల్లనిగ్రుడ్డునందు సూదితో బొడిచినవిధముగ లోపలనే యణగి పైకి గానబడక ఆవగింజంత వ్రణము కల్గి దానంజేసి తెల్లని మచ్చపడును. మిక్కిలి వేడిగ కన్నీరు గారుచుండును. ఇది వ్రణముతోగూడిన శుక్లముగాన సవ్రణశుక్లం బనబడును.

ఈయర్థమునే విదేహుం డిట్లు చెప్పెను:—"రక్తరాజీనిభం కృష్ణే ఛిన్నాభం యచ్చ లక్ష్యతే, సూచ్యగ్రేణేవ తచ్ఛుక్లం ఉష్ణాశ్రుస్రావి సవ్రణమ్" ఈవాక్యము చేత ఎఱ్ఱని యావగింజంత పరిమాణముగల్గి గుండ్రమైన శుక్లము కల్గు నని తెలియుచున్నది.

### సాధ్యాసాధ్యశుక్ల నియమము

దృష్టేస్సమీపే న భవేత్తు యచ్చ న చావగాఢం న చ సంస్రవేద్ధి,
అవేదనం వా న చ యుగ్మశుక్లం తత్సిద్ధిమాయాతి కదాచిదేవ. 23

కంటిలో చూపునకు సమీపమునగాక కొంచెము ఎడమున గల్గిన శుక్లంబును, మిక్కిలి లోతునగాక పైభాగమున బుట్టినశుక్లంబును, అధికముగ నీళ్లు గారకుండు

శుక్లంబును, మిక్కిలి వేదనలేకుండు శుక్లంబును, జంటగలేక యొకటిగనుండు శుక్లంబును, తగినచికిత్స సకాలమునజేసి వైద్యాదిపాదచతుష్టయము యుక్తముగ నున్నచో నొకవేళ సాధింపదగియుండును. అటుగాక యున్నను, రెండు జంటగ జనించిన శుక్లంబు మిక్కిలి యసాధ్యముగ నుండును. (ఈ శుక్లములో కష్టసాధ్యమైనదేగాని సుఖసాధ్యము లే దని భావము.)

### అవ్రణశుక్లలక్షణము

స్యన్దాత్మకం కృష్ణగతం సచోషం శఙ్ఖేన్దుకున్దప్రతిమావభాసమ్,
వైహాయసాభ్రప్రతనుప్రకాశమథావ్రణం సాధ్యతమం వదన్తి. 24

కంటియొక్క నల్లగ్రుడ్డునందు చోషముతోగూడి శంఖమునకును చంద్రునకును మొల్లమొగ్గకును సమానమైన తెల్లనికాంతి గల్గి, ఆకసమునడుమ సూక్ష్మముగ నుండు మబ్బువలె కంటికి సూక్ష్మముగ నగపడు తెల్లనిచుక్క కల్గిన, నయ్యది యభిష్యందమున జనించిన శుక్లము. (దీనియందు వ్రణము లేకుండును. కావున నిది అవ్రణశుక్ల మని చెప్పబడును.) ఇట్టి లక్షణములు కల్గినది మిక్కిలి సుఖసాధ్యము.

నేత్రరోగము లన్నియు నభిష్యందముచేతనే జనించినను, ఈవ్యాధికి అభిష్యందము ముఖ్యకారణ మని నియమించుటకై 'స్యన్దాత్మకం' అని విశేషవిధిగ జెప్పబడినది.

### అసాధ్యావ్రణశుక్లములు

గమ్భీరజాతం బహుళం చ శుక్లం చిరోత్థితం చాపి వదన్తికృచ్ఛ్రమ్,
విచ్ఛిన్నమధ్యం పిశితావృతం వా చలం సిరాసూక్ష్మమదృష్టికృచ్చ,
ద్విత్వగ్గతం లోహితమన్తతశ్చ చిరోత్థితం చాపి వివర్జనీయమ్. 25

మిక్కిలి లోతున (రెండు మూడు పొరలకు లోభాగమున) జనించిన శుక్లంబును, మిక్కిలి ఘన(దళ)ముగ నుండు శుక్లంబును, చాలకాలముగ ననుసరించిన శుక్లంబును కృచ్ఛ్రసాధ్యము. నడుమ మాంసముకరిగి రంధ్రముపడినదియు,మాంసము గ్రమ్మియుండు శుక్లంబును, చంచలమైన శుక్లంబును, సిరలచే గప్పబడి మిక్కిలి సూక్ష్మముగ నగపడు శుక్లంబును, చూపు కడ్డమగు శుక్లంబును, కంటిలో రెండు పొరలయందును వ్యాపించిన శుక్లంబును, చుట్టును ఎఱ్ఱనైన శుక్లంబును, చాలకాలమునకు ముందు జనించిన శుక్లంబును అసాధ్య మగును.

### కొన్నియసాధ్యలక్షణములు

ఉష్ణాశ్రుపాతః పిటికా చ నేత్రే యస్మిన్ భవేన్ముద్గనిభం చ శుక్లమ్,
తదప్యసాధ్యం ప్రవదన్తి కేచిదన్యచ్చ యత్తిత్తిరిపక్షతుల్యమ్. 26

కంటియందు కల్గిన శుక్లము పెసలగింజంత యాకారము కల్గి బొబ్బలతో గూడి మిక్కిలి వేడిగ కన్నీళ్లు గారుచున్నయెడ నయ్యది మిగుల నసాధ్యము. మరియు తీతుక పిట్టయీకవంటి రంగు కల్గినదియు నసాధ్యం బని కొందరు వచించెదరు.

పైశ్లోకమున జెప్పిన యసాధ్యలక్షణములు గల రెండు శుక్లంబులును కంటిలో రెండుపొరల నాశ్రయించి జనించినవి. (వేడిగ నీళ్లు గారుచు పిటికలతోగూడి జనించిన శుక్లమును, పెసలగింజలవలెనుండు శుక్లంబును రెండుపొరలను ఆశ్రయించి కల్గునవి.) ఈవిషయమును విదేహుం డిట్లు చెప్పెను:—ద్విత్వగ్గతమిదం భవేత్, చోష్ణస్రావ దాహాస్తు ధృష్టా చ పిటికోద్గమః, వ్యక్తముద్గఫలాకారం శుక్లం ద్విత్వగ్గతం భవేత్" ఈవాక్యములచేత పైజెప్పిన యసాధ్యశుక్లములు రెండును రెండుపొరలలో బుట్టిన వని స్ఫుట మగుచున్నది.

## అక్షిపాకాత్యయలక్షణము

శ్వేతస్సమాక్రామతి సర్వతో హి దోషేణ యస్యా సితమణ్డలం చ,
తమక్షిపాకాత్యయమక్షిరోగం సర్వాత్మకం వర్జయితవ్యమాహుః.27

నల్లగ్రుడ్డుచుట్టును తెల్లగ పొరవలె నారంభించి దోషసంబంధముచేత నల్లగ్రుడ్డుపై నంతటను వ్యాపించును. ఇది అక్షిపాకాత్యయరోగము. ఇయ్యది సన్నిపాతము (త్రిదోషములచే) గల్గును; కావున మిక్కిలి యసాధ్యము.

## అజకాజాతలక్షణము

అజాపురీషప్రతిమో రుజావాన్
సలోహితో లోహితపిచ్ఛిలాస్రః,
విగృహ్య కృష్ణం ప్రచయోఽభ్యుపైతి
తచ్చాజకాజాతమితి వ్యవస్యేత్. 28

నల్లగ్రుడ్డులోని మేదస్సు నాశ్రయించి మేకపెంటికవలె నాకారంబును ఉన్నతంబును కల్గి మిక్కిలి నొప్పితో గూడి రక్తవర్ణము కలిసిన తెల్లనిమచ్చ కల్గి, నల్లనిగ్రుడ్డు నంతెల్ల వ్యాపించును. అట్టియెడ రక్తవర్ణంబును పిచ్ఛిలంబునైన కన్నీళ్లు గారుచుండును. ఇయ్యది అజకాజాత మనురోగ మని యెరుంగునది.

విదేహుడు దీనిలక్షణము నిట్లుచెప్పెను:—"కృష్ణేఽక్ష్ణోర్యదభవేచ్ఛుక్లం ఛాగ లీవిట్సమప్రభమ్, సాన్ద్రపిచ్ఛిలరక్తాస్రం త్రిత్వగ్గమజకేతిసా" ఈవాక్యముచేత నీవ్యాధి కంటిలో మూడవపొరయందు కల్గు నని తెలిసెడి. (పైజెప్పిన నాల్గును నల్లగ్రుడ్డులో గల్గు నేత్రవ్యాధులు.)

[దృష్టిగతరోగములు పండ్రెండు. దృష్టి యన—"పఞ్చభూతాత్మికాదృష్టిః మసూరార్ధ దలోన్మితిః" (నిమి) అను తంత్రాంతరమునందలి వాక్యముచేత నల్లగ్రుడ్డు నడుమ చిరుసెనగలో నర్ధభాగమంతటి పరిమితికల్గి పృథివి, అప్పు (జలము), తేజస్సు, వాయువు, ఆకాశము అను పంచభూతముల సారభూత మగు రూపము గలది యని తెలిసెడి. (పంచభూతాత్మకమై ప్రపంచమునందలి రూపములను గ్రహించుశక్తికల అవయవ విశేషము దృష్టి యని ఫలితార్థము.) అట్టిదృష్టియందు నాలుగంతస్థభాగము లుండును. అవియే పటలము లనబడును. అందొక్కొకటి చిరుసెనగలో నర్ధపరిమితికల దృష్టి పరిమాణములో సైదవపాలు పరిమాణము కల్గియుండును. ఆనాల్గు పటలములలో బాహ్యాశ్రితపటలము తేజోజలముల కాధార మగు చర్మము నాశ్రయించి యుండును. రెండవపటలము నేత్రమునందలి మాంసము నాశ్రయించి యుండును. మూడవ పటలము నేత్రము నందలి మేదస్సు నాశ్రయించి యుండును. నాల్గవపటలము అస్థి నాశ్రయించి యుండును. ఈవిషయమును సుశ్రుతాచార్యు డిట్లు వివరించెను:— "తేజోజలాశ్రితం బాహ్యం తేష్వన్యత్పిశితాశ్రితమ్, మేదస్తృతీయం పటలమాశ్రితం త్వస్థి చాపరమ్, పఞ్చమాంశసమం దృష్టేస్తేషాం బాహుల్యమిష్యతే" (సుశ్రుత. ఉ. అ ౧) అట్టి పటలములో వాత-పిత్త-కఫ-రక్తము లను దోషములు చేరునపుడు దృష్టిలో మార్పులు కల్గుచుండును. అందు దోషములు తొలుతదృష్టిలో నాంతరముననుండు అస్థిగతంబైన పటలము మొదటిదిగాన దానిలో ప్రవేశించి, పిదప వరుసగ నొక్కొకపటలము వంతున నాశ్రయించి వికృతిని కల్గించును. ఈవిషయమును విదేహు డిట్లు చెప్పెను:—"దృష్టేరన్తరమాద్యం తు పటలం సమభిద్రుతాః, ఏకైకమనుపద్యన్తే పర్యాయా త్పటలాన్తరమ్" అట్టి పటలములయందు వాతాదిదోషములు చేరినపుడు కల్గు దృష్టిదోషము లీక్రింద వరుసగ జెప్పబడును. పటలములందు దోషము లాశ్రయించినపుడు గల్గులక్షణములు తొలుత వేర్వేరుగ (ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్థ పటలములకు ప్రత్యేకముగ) జెప్పబడును. కావున నివి దృష్టిగత రోగములకు సామాన్య లక్షణము లగును.]

### ప్రథమపటలగతదోషలక్షణము

ప్రథమే పటలే దోషాః యస్య దృష్ట్యాం వ్యవస్థితాః,
అవ్యక్తాని సరూపాణి కదాచిదథ పశ్యతి. 29

పైజెప్పబడిన నాల్గుపటలములలో మొదటిపటలమున వాతాదిదోషములలో నొకదోషము ఆశ్రయించియున్నపుడు రూపవంతములైన వస్తువులను వాని సుసూక్ష్మాంశముల స్ఫుటముగ దెలియక యస్ఫుటముగ నొకప్పుడు చూచును.

వాతాదిదోషములలో వాతము మొదటిపటలము నాశ్రయించినపుడు వస్తుజాలములు అరుణవర్ణంబులై భ్రమించుచున్నట్లు కనబడును. పిత్తము చేరినయెడ ప్రకాశవంతములగు సూర్యుడు మున్నగువస్తువులు నీల పీతవర్ణంబులుగ గనపడును. కఫము చేరినపుడు తెల్లగ గానవచ్చును. రక్తము చేరినపుడు రక్తవర్ణముగ గానవచ్చును. దోషములన్నియు చేరినపుడు పలుదెరంగులగు రంగులు కలిసి చిత్రవర్ణముగ గనబడును.

మరియు వాగ్భటాచార్యుడు ప్రథమపటలదోషము నిట్లు చెప్పెను:—"సిరానుసారిణిమలే ప్రథమం పటలం శ్రితే, అవ్యక్తమీక్షతే రూపం వ్యక్తమప్యనిమిత్తతః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౧) వాతాదులలో నేదైన నొక దోషము నేత్రమునందలి సిరలమూలమున దృష్టియందలి మొదటిపటలమున జేరినపుడు స్ఫుటముగ గనబడు రూపముగలవస్తువు గూడ కారణము లేకయే అవ్యక్తముగ జూచును అని భావము. సర్వాంగసుందర మను వ్యాఖ్యలో "దోషే వాతాద్యన్యతమే ప్రథమం బాహ్యం పటలం ఆశ్రితే సతి" అని యున్నది. ఈ వ్యాఖ్యనుబట్టి మొదటిపటలము దృష్టియందు పైనుండుపటల మని యర్థమగుచున్నది. విదేహుడు "దృష్టేరన్తరమాద్యం తు పటలం సమభిద్రుతాః, ఏకైకమను సద్యంతే పర్యాయాత్పటలాంతరమ్" అని చెప్పెను. ఈవాక్యముచేత వాతాది దోషము తొలుత దృష్టియందలి లోపలనుండు మొదటిపటలము నాశ్రయించి, పిదప నొక్కొక్కపటలముగ నానాట నాశ్రయించుచు నాయాదోషముల గల్గించు నని దృష్టిలో నభ్యంతరము నుండు పటలము తొల్లింటిది యని తేలుచున్నది.

ప్రకృత మూలగ్రంథమునకు మధుకోశవ్యాఖ్యానమున నిట్లున్నది:—తేషు పటలేషు బాహ్యాది భేదేనాధిష్ఠానవిశేషప్రభావాత్ దోషాణాం లిఙ్గవిశేషమాహ:—ప్రథమే పటల ఇత్యాది:—ప్రథమే పటలే-సర్వాభ్యన్తరే, పటలే కాలకాస్థిసంశ్రయే; న తు బాహ్యే, తత్ర ప్రథమం దోషలిఙ్గానుపలబ్ధేః; యది తు కుష్ఠాదివత్ బాహ్యం ప్రథమం ప్రదూష్య, అభ్యన్తరే దోషాను ప్రవేశః స్యాత్, తదా ప్రాగేవ రోగస్తత్రోపలభ్యేత, న చైవం దృశ్యతే, తథా చ విదేహః—దృష్టేరన్తరమాద్యం తు పటలం సమభిద్రుతాః...ఏకైకమను పద్యన్తే పర్యాయాత్పటలాన్తరమ్. ఇతి" ఈ వ్యాఖ్యానమునుబట్టి ప్రకృతమూలగ్రంథమునకు విదేహసమ్మతమగు నాభ్యంతరపటలము ప్రథమపటల మని యర్థము చేయవలసియున్నది. విజ్ఞులు గమనించెదరుగాక!

### రెండవపటలమునందలి దోషముచే గల్గు లక్షణములు

దృష్టిర్భృశం విహ్వలతి ద్వితీయం పటలం గతే,
మక్షికామశకాంశ్చాపి జాలకాని చ పశ్యతి. 30

మణ్డలాని పతాకాంశ్చ మరీచిం కుణ్డలాని చ,
పరిప్లవాంశ్చ వివిధాన్ వర్షమభ్రం తమాంసి చ. 31
దూరస్థాని చ రూపాణి మన్యతే స సమీపతః,
సమీపస్థాని దూరే చ దృష్టేర్గోచరవిభ్రమాత్. 32
యత్నవానపి చాత్యర్థం సూచీపాశం న పశ్యతి,

వాతాదిదోషములలో నేదైనను దృష్టియందలి రెండవపటలమున జేరినపుడు ఆయారూపముల జూచుటకు దృష్టికి చాల శ్రమము కల్గును. ఈగలు, దోమలు, వలలోని రంధ్రములు, మండలములు, పతాకములు, కిరణములు, కుండలములు, కప్పలు, వర్షధారలు, మేఘములు, చీకటి ఇవియన్నియు లేకున్నను, ఉన్నట్లు కంటిచూపు కగపడునట్లుండును. మరియు దూరమున నున్న వస్తుజాలము సమీపమున నున్నట్లును సమీపమున నుండునవి దూరమున నున్నట్లును అగపడును. ఇట్టి దృష్టివిభ్రమము దృష్టిప్రసారము యొక్క భేదమున గల్గును. ఎంతప్రయత్నము జేసి చూచినను సూదిలోనిరంధ్రము నెరుంగజాలడు.

మరియు వాగ్భటాచార్యులు:—"ప్రాప్తే ద్వితీయం పటలం అభూతమపి పశ్యతి, భూతం తు యత్నాదాసన్నం దూరే సూక్ష్మం చ నేక్షతే" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౭.) అని చెప్పెను. దోషము సిరలమూలముగ దృష్టియందలి రెండవపటలము నాశ్రయించినపుడు, లేనివస్తువులుగూడ నున్నవానింబోలె జూచును. ఉన్నవస్తువులు మిక్కిలి సమీపమున నున్నచో మిక్కిలి ప్రయత్నముతో జూచిన గనబడును. దూరముగనుండు వస్తువు సూక్ష్మముగనున్నచో గనబడదు; అని భావము. మరియు "తిమిరాఖ్యోఽయమామయః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౯.) అని వాగ్భటులు చెప్పిరి. కావున పై జెప్పిన ప్రథమద్వితీయపటలగత దోషభేదములు తిమిర మనురోగ మని యెరుంగునది. ఈవిషయము సర్వాంగసుందరమున విశదముగ జెప్పబడినది.

## మూడవపటలమునందుగల దోషలక్షణము

ఊర్ధ్వం పశ్యతి నాధస్తాత్తృతీయం పటలం గతే. 33
మహాన్త్యపి చ రూపాణి చ్ఛాదితానీవ చామ్బరైః,
కర్ణనాసాక్షిహీనాని వికృతానీవ పశ్యతి. 34
యథాదోషం చ రజ్యేత దృష్టిర్దోషే బలీయసి,

దోషము మూడవపటలము నాశ్రయించినపుడు పైచూపు మాత్రము కనుబడును గాని క్రింది చూపు తెలియదు. మరియు గొప్పరూపముగలవానిని గూడ పలుచనిగుడ్డచే గప్పబడినదానినిగ జూచును. (చూపుకు గుడ్డ నడ్డమువేసినవిధముగ నగపడును) అవయవములన్నియు నుండు నాకారములు చెవులు ముక్కులు కండ్లు మున్నగు నవయవములు లేనిరీతిగ నగపడును. లేక మంచియాకారములెల్ల వికృతరూపములుగ గనబడును. మరియు దోషము రక్తమాంసమేదస్సులతోగూడి మిక్కిలి బలిష్ఠమై యున్నపుడు దృష్టి ఆయా దోషమున కనుగుణముగ అరుణ పీతసితాదివర్ణములు కల్గియుండును.

వాగ్భటాచార్యుడు దోషము తృతీయపటలమును ఆశ్రయించియున్నపుడు అదియే కాచ మను పేర జెప్పంబడునని యిట్లు చెప్పెను:—"ప్రాప్నోతి కాచతాం దోషే తృతీయపటలాశ్రితే" (అ. హృ. ఉ. అ.౧౨. శ్లో. ౬.) నిమి కూడ నీవిధముగ జెప్పెను:—"కాచ ఇత్యేష విజ్ఞేయో యాప్యస్త్రిపటలాశ్రితః" దోషము మూడవపటలము నాశ్రయించునపుడు కాచ మనబడుననియు, అయ్యది యాప్యమనియు భావము.

## దృష్టిలో నూర్ధ్వాదిస్థానములలో దోషము చేరినచో వానిలక్షణములు

అధస్స్థితే సమీపస్థం, దూరస్థం చోపరిస్థితే. 35
పార్శ్వస్థితే తథా దోషే పార్శ్వస్థం నైవ పశ్యతి,
సమంతతస్స్థితే దోషే సఙ్కులానివ పశ్యతి. 36
దృష్టిమధ్యస్థితే దోషే మహద్ధ్రస్వఞ్చ పశ్యతి,
ద్విధా స్థితే ద్విధా పశ్యేత్ బహుధా చానవస్థితే. 37
దోషే దృష్ట్యాశ్రితే తిర్యక్ స ఏకం మన్యతే ద్విధా,

దోషములలో నెద్దియైన దృష్టిలో క్రిందిభాగమున నున్నచో సమీపముననున్న వస్తుజాల మగపడదు. దృష్టిలో పైభాగమున దోషము చేరినయెడ దూరముననున్న వస్తువు గానంబడదు. దృష్టి కుభయపార్శ్వములయందు దోషమున్నపుడు ఇరుప్రక్కలనుండు నవి యగపడవు. దృష్టియందంతటను దోషము వ్యాపించి యున్నచో వస్తుజాలమెల్ల నొకటితో నొకటి చేరియున్నట్లు కానవచ్చును. దృష్టికి నడుమ దోషము చేరినయెడ గొప్పవస్తువు కూడ మిక్కిలి చిన్నదిగ గనపడును. దృష్టిలో రెండుభాగములయందు దోష ముండునేని ఒక వస్తువు రెండుగ గానంబడును. పలుదరంగుల దోషము వ్యాపించి యున్నచో ననేకరూపములుగ చంచలములై కానంబడును. దృష్టిలో నడ్డముగ దోష మున్నచో నొకటి రెండుగ నగపడును.

మరియును వాగ్భటాచార్యుడు:—"దోషే మణ్డలసంస్థానే మండలానీవ పశ్యతి" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. 3.) అని చెప్పెను. కావున దృష్టికిచుట్టు మండలాకారముగ దోషము చేరినపుడు వస్తువుల నన్నిటిని మండలములు (గుండ్రములు)గ జూచు నని తెలిసెడి.

## చతుర్థపటలగతదోషలక్షణము

తిమిరాఖ్యస్స వై దోషశ్చతుర్థం పటలం గతః. 38
రుణద్ధి సర్వతో దృష్టిం లిఙ్గనాశమథః పరమ్,
అస్మిన్నపి తమోభూతే నాతిరూఢే మహాగదే. 39
చన్ద్రాదిత్యౌ సనక్షత్రౌ అంతరిక్షే చ విద్యుతః,
నిర్మలాని చ తేజాంసి భ్రాజిష్ణూన్యథ పశ్యతి. 40

వాతాదిదోషములు దృష్టిలో నాల్గవపటలము నాశ్రయించి యున్నచో చీకటి గ్రమ్మినవిధముగ వస్తువులు గానరాక నానాట వృద్ధినొంది కంటిచూపును బొత్తుగ నడ్డగించి కంటియందు చూచుశక్తిని బొత్తుగ చెరచును. ఈవ్యాధి మిక్కిలి వృద్ధినొందక చీకటి గ్రమ్మినవిధముగ నుండునపుడు ఆకసమున మిక్కిలి తేజోవంతములగు చంద్రసూర్యులను, నక్షత్రములను, మెఱపులను, నిర్మలములైన కాంతిగల వస్తువులను, మిక్కిలి ప్రకాశించుమణులు మున్నగువస్తువులనుమాత్రము జూచును.

వాగ్భటమున నీలక్షణము నిట్లు చెప్పెను:—"తథాప్యుపేక్షమాణస్య చతుర్థం పటలం గతః, లిఙ్గనాశం మలః కుర్వ న్ఛాదయేద్దృష్టిమండలమ్" (అ. హృ. ఉ. అ. శ్లో. 2.) దోషము మూడవపటలమున జేరినపుడు తగినచికిత్స చేయక యుపేక్షించినయెడ చతుర్థపటలమున జేరును. చేరినదోషము కంటియందు చూపును చెరచుచు కంటిలో దృష్టిమండలమునెల్ల వ్యాపించును అని యర్థము. (ఈవాక్యముచేత దోషములు ఒక్కొకపటలమున జేరినపుడు తగిన చికిత్సచేయక యుపేక్షించినచో మరియొక పటలమును జేరి వేరొండు రోగమును గల్గించు నని తెలియుచున్నది.)

## లింగనాశసంజ్ఞ

స ఏవ లిఙ్గనాశస్తు నీలికా కాచసంజ్ఞితః,

మూడవపటలమున దోషము చేరినచో నయ్యది కాచ మనబడును. దానిని చికిత్సచేయక యుపేక్షించినచో నయ్యది నాల్గవపటలమున జేరి దృష్టిని పూర్తిగ చెరచును. కావున నయ్యది లింగనాశ మనియు, నీలిక యనియు జెప్పబడును.

లింగనాశ మన:—“లింగ్యతే జ్ఞాయతే, అనేనేతి—లింగం” ‘లింగం నాశయతీతి—లింగనాశః’ అను వ్యుత్పత్తిచేత లింగ మనగా ఘటపటాదుల దెలిసికొనుటకు సాధనమైనది (దృష్టి) లింగ మనబడును. దానిని నశింపజేయువ్యాధి లింగనాశ మని యన్వర్థముగ జెప్పబడును. నీలిక యన—దృష్టి చెడుటంజేసి నల్లగ చీకటి గ్రమ్మినట్లు నేదియు తెలియదు. కావున నీలిక యనియు చెప్పనగును.

మఱియు మూడవపటలమున దోషములు చేరినపుడు కాచ మనియు, అట్టిదోషములు నాల్గవపటలమున జేరినపుడు లింగనాశ మనబడుననియు నిమి యిట్లు చెప్పెను:—“కాచ ఇత్యేష విజ్ఞేయో యాప్యస్త్రిపటలోత్థితః, చతుర్థ పటలప్రాప్తే లిఙ్గనాశస్స ఉచ్యతే, ప్రత్యాఖ్యేయశ్చ, కఫజో వ్యాధిస్సాధ్యస్తు తద్విదా” మూడవపటలమున దోషముచేరిన కాచ మనబడును. ఇయ్యది యాప్యము. నాల్గవపటలమున దోషముచేరిన నయ్యది లింగనాశము. ఇది ప్రత్యాఖ్యేయము. (అసాధ్య మనుట.) కఫలిఙ్గనాశము కఫమున జనించినయెడ సాధ్య మగును.

ఇచ్చట నీనిర్ణయము తెలియంగునది:—దృష్టియందు పైజెప్పినరీతిగ నాల్గుపటలము లుండును. అందు వాతాదిదోషములు వేరువేరుగనైనను కలిసిగ్రానైనను జేరినపుడు ఆదృష్టియందు పైజెప్పినరీతిగ నాయాపటలముల భేదముచే మార్పులు కల్గును. అందు మొదటి రెండు పటలములయందు దోషములు చేరినపుడు కల్గులక్షణములకు తిమిరరోగ మని పేరు. మూడవపటలమున దోషములు చేరినపుడు కాచ మనబడును. నాల్గవపటలమున దోషములు చేరినపుడు లింగనాశ మనబడును. అట్టి పటలములను నాల్గిటి నాశ్రయించునపుడు కల్గు లక్షణములు పైవివరింపబడినప్రకారము వేరువేర తెలియంగునది. ఇయ్యవి ఆయాపటలములలో దోషములు చేరినపుడు గల్గు సామాన్యలక్షణములు. (అనగా దోషసామాన్యముగ నాయాపటలముల జేరినపుడు గల్గు లక్షణములు గాని వాతపిత్తాదులకు వేరువేరుగ జెప్పినవి కా దనుట). కావున “ప్రథమే పటలే” అని యుపక్రమించి, “సఏవ లిఙ్గనాశస్తు” అను వాక్యముపఱకు జెప్పినది దోషసామాన్యముగ నాయాపటలముల నాశ్రయించినపుడు గల్గు లక్షణము లని యెఱుంగునది. పటలముల నాశ్రయించిన దోషములకు లక్షణములు ప్రత్యేకముగ నీక్రింద జెప్పంబడును. అవి విశేషలక్షణములు. అందును పైజెప్పినరీతిగ తిమిర-కాచ-లింగనాశములను మూడిటికిని, క్రిందజెప్పంబడు వాతాదిప్రత్యేకలక్షణముల నన్వయించుకొనవలెను. తొలుత నాయాపటల భేదమునుబట్టి దోషసామాన్యముగ జెప్పినలక్షణముల గమనించి, లక్షణానుసారముగ దోషము లీపటలమున జేరియున్న వని నిశ్చయించి, పిదప వాతాదులకు ప్రత్యేకముగ జెప్పినలక్షణములబట్టి యీపటలమునం దీదోషము చేరియున్న దనియు నిర్ధ

యించునది. అందును మొదటి రెండుపటలముల వాతాదులు చేరినపుడు వాతాది తిమిరంబు లనియు, మూడవపటలమున జేరినపుడు వాతాదికాచరోగం బనియు, నాల్గవ పటలమున జేరినపుడు వాతాదిలింగనాశ మనియు నెఱుంగునది. ఇత్తెరంగున తిమిరాది రోగములకు సామాన్యవిశేషలక్షణముల గమనించునది.

## వాతికతిమిరరోగలక్షణము

వాతేన చాపి రూపాణి భ్రమన్తీవ చ పశ్యతి. 41
ఆవిలాన్యరుణాభాని వ్యావిద్ధానివ మానవః,

వాతమున జనించిన తిమిరరోగమునందు కంటి కగపడురూపములన్నియు కదలు నట్లు కనబడును. మఱియు మలినంబులును, అరుణంబులును, వక్రంబులు నైనవిధముగ కానబడును.

మరియు వాతజనితకాచ-లింగనాశలక్షణము లిట్లు వాగ్భటాచార్యునిచే జెప్పం బడియె:—"ఉపేక్షితేఽత్ర చ, కాచీభూతే దృగరుణా పశ్యత్యాస్యమనాసికం. చంద్రదీపాద్య నేకత్వం వక్రమృజ్వపి మన్యతే. వృద్ధః కాచో దృశంకుర్యాత్ రజో ధూమావృతామివ, స్పష్టారుణాభాం విస్తీర్ణాం సూక్ష్మం వా హతదర్శనామ్. స లింగ నాశః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౧౧.) మొదటి రెండు పటలముల నాశ్ర యించిన తిమిరము నుపేక్షించినయెడ మూడవపటలమున జేరి కాచరూప మగును. వాతమున జనించిన కాచమునందు దృష్టి యరుణవర్ణముగ నుండి ముఖమును ముక్కు లేనిదానిగ జూచును. చంద్రుడు దీపము మున్నగుజ్యోతిస్వరూపము నెల్ల నొకటి ననేకములుగ జూచును వంకరటింకరగనుండు రూపమును చక్కని రూపముగ జూచును అట్టి కాచమును చికిత్స చేయనినాడు వృద్ధినొంది నాల్గవపటలమున జేరి లింగనాశముగ పరిణమించును. అయ్యది వాతమున గల్గినదృష్టి పొగగ్రమ్మినవిధముగ నుండును. స్ఫుటముగ నరుణవర్ణముకల్గి విస్తీర్ణమై మిక్కిలి సూక్ష్మముగనుండి దృష్టి రూపాదుల గనుగొనలేకుండును.

## పైత్తికతిమిరరోగలక్షణము

పిత్తేనాదిత్యఖద్యోతశక్రచాపతటిద్గుణాన్. 42
నృత్యతశ్చైవ శిఖినః సర్వం నీలం చ పశ్యతి,

పిత్తమున గల్గిన తిమిరరోగమునందు సూర్యుడు మిణుగురుపురుగులు ఇంద్ర ధనుస్సు మెఱపు మున్నగువాని తేజస్సును జూచును. నృత్యము చేయుచుండు నెమళ్లను జూచును. సకలపదార్థంబులును నల్లగ నగపడును.

పైత్తికకాచ-లింగనాశలక్షణములు వాగ్భటునిచే నిట్లు చెప్పబడియె:— "కాచేదృక్కాచనీలాభా తాదృగేవ చ పశ్యతి, అర్కేన్దుపరివేషాగ్ని మరీచీన్ద్ర

ధనూంషి చ, భృంగనీలా నిరాలోకా దృక్స్నిగ్ధా లిఙ్గనాశతః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౧౪) పిత్తమున జనించిన కాచరోగమునందు దృష్టి నల్లనిగాజు పెంకు వలె నుండు రూపాదులనుగూడ నదేరీతిగ జూచును. సూర్యచంద్రుల జుట్టియుండుపరివేషములను అగ్నిని కాంతిని ఇంద్రధనుస్సును జూడగల్గును. పిత్తమున గల్గిన లింగనాశమున దృష్టి స్నిగ్ధమై తుమ్మెదలబోలె నల్లనై రూపాదులజూచుశక్తి బొత్తుగ నశించియుండును.

## కఫజతిమిరరోగలక్షణము

కఫేన పశ్యేద్రూపాణి స్నిగ్ధాని చ సితాని చ. 43
(పశ్యేదసూక్ష్మాణ్యత్యర్థం వ్యభ్రే మేవాభ్రసంప్లవం,)
సలిలప్లావితానీవ పరిజాడ్యాని మానవాః,

కఫమున గల్గిన తిమిరరోగమున సకలరూపములను స్నిగ్ధంబులుగను తెల్లని రంగు కల్గిన వానిగను జూచును. (సూక్ష్మములు గాక మిక్కిలి పెద్దవియగురూపముల మాత్రము జూచును. ఆకసమున మేఘములు లేకున్నను మబ్బుచే నావరింపబడినట్లు చూచును.) మఱియు వస్తుజాలమెల్ల నీట దడిసి జడములైనవిధముగ గనబడును.

కఫజనితకాచ-లింగనాశలక్షణము లిట్లు వాగ్భటులచే జెప్పబడియె:— "కాచేతు నిష్ప్రభేన్ద్వర్కప్రదీపాద్యైరివాచితమ్, సితాభాసా చ దృష్టిస్స్యాత్ లిఙ్గనాశేతులక్ష్యతే. మూర్తః కఫో దృష్టిగతః స్నిగ్ధో దర్శననాశనః, బిన్దుర్జలస్యేవ చలః పద్మినీపుట సంస్థితః. ఉష్ణే సంకోచమాయాతి ఛాయాయాం పరిసర్పతి, శఙ్ఖకున్దేన్దుకుముదస్ఫటికోపమశుక్లిమా." (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౧౭—౧౯.) కఫమున జనించిన కాచరోగమున దృష్టి తెల్లనై చంద్రుడు సూర్యుడు దీపములు మున్నగు వానిని కాంతిహీనములుగ జూచును. కఫమున కల్గిన లింగనాశముల దృష్టియందు శంఖమును మొల్లమొగ్గను చంద్రుని స్ఫటికమును బోలె స్వచ్ఛముగ తెల్లనైనమచ్చ (పువ్వు) ఆకారముగల్గి పుట్టును. అయ్యది స్నిగ్ధమై తామరాకునందు నీటిబిందువువలె చంచలమై కదలుచుండును. (కఫమే యీరూపముగ ఘనీభవించియుండును.) ఈబిందువు ఉష్ణము (ఎండ) తీవ్రముగ నుండునపుడు చిన్నదిగ నగును. నీడయందు పెద్దదిగ వ్యాపించును. ఇది దృష్టిని బొత్తుగ నశింపజేయును.

## రక్తజతిమిరరోగలక్షణము

పశ్యేద్రక్తేన రక్తాని తమాంసి వివిధాని చ. 44
స సితాన్యపి కృష్ణాని పీతాన్యపి చ మానవః,

రక్తముచే జనించిన తిమిరరోగమునందు చీకటిని రక్తవర్ణముగను, తెల్లగనుండు నానావిధవస్తువులను కృష్ణవర్ణములుగను, లేక పచ్చనిరంగుకల్గినవానిగను పలుమారు చూచును.

రక్తజకాచ-లింగనాశలక్షణములు వాగ్భటమున నిట్లున్నవి:—"కాచేన రక్తా కృష్ణా వా దృష్టిస్తాదృక్చ పశ్యతి, లింగనాశేఽపి తాదృగ్ద్రుక్ నిష్ప్రభాహతదర్శనా" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౨౧.) రక్తమున గల్గిన కాచరోగమున దృష్టి రక్తవర్ణముగనైనను కృష్ణవర్ణముగనైన నుండి రూపాదుల నట్టిరంగు కల్గినట్టులే జూచును. లింగనాశమునందును అట్టికాంతి నశించి చూచుశక్తి బొత్తుగ నశించును.

## సాన్నిపాతికతిమిరలక్షణము

సన్నిపాతేన చిత్రాణి విప్లుతానీవ పశ్యతి. 45
బహుధా చ ద్విధా వాపి సర్వాణ్యేవ సమంతతః,
హీనాధికాఙ్గాన్యపి వా జ్యోతీంష్యపి చ భూయసా. 46

సన్నిపాతమున (త్రిదోషప్రకోపమున) గల్గిన తిమిరరోగమునందు వస్తువులన్నియును పలువిధములగునైన రంగులుకల్గి చిత్రవర్ణములై యుండునట్లు కనబడును. మఱియు సకలవస్తువులును ఒక్కొకటి రెండేసిగను అనేకరూపములుగను కనబడును. ప్రతివస్తువును ఆవస్తువునందలి యేదైన నొకయంగము లేనట్లుగను, లేక ఒకయంగమధికముగ నున్నట్లును గనబడును మిక్కిలి తేజోవంతములైన వస్తువులు మాత్రము కనబడును.

వాగ్భటాచార్యుడు ద్విదోషసంసర్గలక్షణములను, సన్నిపాతలక్షణమును కూడ చెప్పి, కాచలింగనాశలక్షణముల గూడ నతిదేశించి యిట్లు చెప్పెను:—"సంసర్గ సన్నిపాతేషు విద్యాత్సంకీర్ణలక్షణమ్, తిమిరాదీనకస్మాచ్చ తైః స్యాద్వ్యక్తాకులేక్షణః, తిమిరే శేషయోర్దృష్టౌ చిత్రోరాగః ప్రజాయతే" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౨౨) రెండేసిదోషముల సంసర్గముచే గల్గిన తిమిరకాచలింగ నాశరోగములు మూటియందును, ఆయాదోషములకు వేరువేరుగ జెప్పిన లక్షణములు రెండేసి కలిసియుండును. మూండుదోషములచే గల్గిన తిమిర-కాచ-లింగనాశరోగములయందు దోషములు మూటికి వేరువేర జెప్పినలక్షణములన్నియు గల్గియుండును. మఱియు సంసర్గజత్రిదోషజనిత తిమిరమునందు ఒకప్పుడు కారణము లేకయే దృష్టి స్ఫుటముగనుండును. ఒకప్పుడు దోషోద్రేకమునంజేసి మలినముగ నుండును. కాచలింగనాశములయందు మాత్రము దృష్టిలో చిత్రవర్ణములు కలిసినరంగు కల్గియుండును.

ప్రకృతగ్రంథమున సంసర్గభేదములుమాత్రము చెప్పియుండలేదు. దోషద్వయ లక్షణములు కల్గినది సంసర్గజములు కావున విశేషలక్షణములు లేమింజేసి పరిగణనము చేయలేదు కాబోలు.

### పరిమ్లాయిలక్షణము

పిత్తం కుర్యాత్పరిమ్లాయి మూర్ఛితం పిత్తతేజసా,
పీతా దిశస్తు ఖద్యోతాన్ భాస్కరం చాపి పశ్యతి. 47
వికీర్యమాణాన్ ఖద్యోతైః వృక్షాం స్తేజోభిరేవ వా,

పిత్తముయొక్క తేజోరూపమైన రక్తముతో గూడిన పిత్తము పరిమ్లాయి యను వ్యాధిని గలిగించును. ఈవ్యాధియందు దిక్కులనెల్ల పచ్చగ జూచును. మిణుగురుపురుగులును సూర్యుడును పచ్చగ నగపడును. వృక్షములెల్ల మిణుగురు పురుగులచే నావరింపబడిన విధముగను, కాంతిచే నావరింపబడినయట్లును మినుకు మినుక్కు మని కానబడును.

మఱియు తంత్రాంతరమున "విదధాతి పరిమ్లాయి పిత్తరక్తేన సంగతమ్, తేన పీతా దిశః పశ్యేత్ ఉద్యంతమివ భాస్కరమ్" అని యున్నది. కావున నీవ్యాధి రక్తముతో గూడిన పిత్తమున జనించుటంజేసి దిక్కులన్నియు పచ్చగ నగపడు ననియు, సూర్యు డుదయకాలమున నుండుభంగి నెల్లపుడును కనబడుననియు తెలియునది.

మఱియు అవస్థాభేదముచే తిమిరరోగమునకు సాధ్యాసాధ్యత్వమును సాత్యకి యిట్లు చెప్పెను:—"తృతీయం పటలం ప్రాప్తం తిమిరం రాగి జాయతే, అరాగి తిమిరంసాధ్యమాద్యం పటలమాశ్రితమ్, కృచ్ఛ్రం ద్వితీయే రాగిస్యాత్ తృతీయే యాప్యముచ్యతే" మూడవపటలమున జనించిన తిమిర రోగమున నీలపీతాదివర్ణములు ఆయాదోషానుగుణముగ గల్గును. మొదటిపటలమునందు గల్గుతిమిరరోగమున నీవర్ణభేదము లేకుండును కావున నిది సాధ్యమగును. రెండవ పటలమునందలి తిమిరరోగమున వర్ణభేదము కలిగినచో కృచ్ఛ్రసాధ్యమగును. మూడవపటలమున గల్గు తిమిరరోగమున వర్ణభేద మవశ్యము గల్గును, కావున నిది యాప్యమగును.

ఈవాక్యముచేత పిత్తమున జనించిన పరిమ్లాయిరోగమున వర్ణభేదము కల్గుటంజేసి యాప్య మని యెఱుంగునది.

### లింగనాశమున వర్ణభేదముచే గల్గు నారు భేదములు

వక్ష్యామి షడ్విధం రాగైర్లింగనాశమతః పరమ్. 48
రాగోఽరుణో మారుతజః ప్రదిష్టఃమ్లాయీచనీలశ్చతథైవపిత్తాత్,
కఫాత్సితశ్శోణితజశ్చ రక్తః సమస్తదోషప్రభవో విచిత్రః. 49

లింగనాశమున వాతాదిదోషములచే కంటియందు గల్గు నారు రూపభేదము లీక్రింద జెప్పంబడును.—లింగనాశరోగము వాతముచే కల్గినయెడ కన్ను లరుణవర్ణముగ నుండును. పిత్తమున జనించిన పరిమ్లాయియును లింగనాశమున నీలవర్ణముగ నుండును. కఫమువలన గలిగిన లింగనాశమునందు తెల్లగ నుండును. రక్తమున జనించిన లింగనాశమున రక్తవర్ణముగ నుండును. త్రిదోషములచే గలిగిన లింగనాశమున చిత్రవర్ణము కలిగియుండును.

పరిమ్లాయియందు కల్గు దృష్టిభేదము

అరుణం మణ్డలం దృష్ట్యాం స్థూలకాచారుణప్రభమ్,
పరిమ్లాయిని రోగే స్యాత్ మ్లాయి నీలం చ మణ్డలమ్. 50
దోషక్షయాత్స్వయం తత్ర కదాచిత్స్యాత్తు దర్శనమ్,

పరిమ్లాయి యను యనురోగమునందు ఎఱ్ఱనై స్థూల(దళ)ముగ నుండు గాజు పెంకుపలెనుండు ఎఱ్ఱనిచుక్క దృష్టియందు కల్గును. ఒకప్పుడు వాడి నీలవర్ణముగనుండు మచ్చ పుట్టును. ఆచుక్క దోషములు ఔద్ధత్యము తగ్గినపుడు తనంతనే శమించి చక్కగ చూచుశక్తి మరల కల్గును. ('దోషక్షయాత్' అనుచోట జన్మాంతరసంచితమగుపాపము నశించినపుడు రోగమునందు శమించి దృష్టి కనబడు నని కొందరు అర్థము చెప్పెదరు.)

లింగనాశమున వాతాదిభేదముచే గల్గు దృష్టిమండల వర్ణభేదములు

అరుణం మణ్డలం వాతాచ్చఞ్చలం పరుషం తథా. 51
పిత్తాన్మణ్డలమానీలం కాంస్యాభం పీతమేవ చ,
శ్లేష్మణా బహుళం పీతం శంఖకున్దేన్దుపాణ్డురమ్. 52
చలత్పద్మపలాశస్థ శుక్లో బిందురివామ్భసః,
మృజ్యమానే చ నయనే మణ్డలం తద్విసర్పతి. 53
ప్రవాళపద్మపత్రాభం మణ్డలం శోణితాత్మకమ్,
దృష్టిభాగో భవేచ్చిత్రో లిఙ్గనాశే త్రిదోషజే
యథాస్వం దోషలిఙ్గాని సర్వేష్వేవ భవన్తి హి. 54

లింగనాశమునందు వాతముచేత దృష్టిమండలము అరుణవర్ణంబై చంచలంబును పరుషంబునై యుండును. పిత్తముచేత దృష్టిమండలము కొంచెము నీలవర్ణంబును కంచువంటి కాంతిగలదైనను పచ్చనిరంగైనను కలిగియుండును. కఫముచేత దృష్టిమండలము విశాలంబును పచ్చనిరంగుకల్గినదైనను, శంఖము మొల్లమొగ్గలు చంద్రుడువలెనె తెల్లని రంగైనను కల్గియుండును. మఱియు నాదృష్టిమండలము కదలుచుండు తామరాకుపై

నుండు నీటిబిందువువలె కంటిని చేత తుడిచినప్పుడెల్ల నిటునటు కదలుచుండును. రక్తమున గల్గిన లింగనాశమున దృష్టిమండలము పవడమును ఎఱ్ఱనితామరపువ్వురేకును బోలి యెఱ్ఱగ నుండును. త్రిదోషమున కల్గిన లింగనాశమునందు దృష్టిమండలము నానావర్ణములు కలిసిన చిత్రవర్ణము కలిగియుండును. మఱియు నీయాఱువిధములగు లింగనాశములయందును పైజెప్పిన దృష్టిమండలమునకు గలిగిన రంగుభేదములేకాక ఆయాదోషమునకు వేరువేరుగ జెప్పినలక్షణములు కూడ గలిగియుండును. కావున వానినెల్ల నెరుంగునది.

## దృష్టిగతరోగసంఖ్యాపరిగణనము

షడ్లిఙ్గనాశాష్షడిమే చ రోగాః దృష్ట్యాశ్రయాష్షట్ఛషడేన వాచ్యాః,

పైజెప్పబడిన వాత-పిత్త-కఫ-సన్నిపాత-రక్తభేదములచేతను, రక్తపిత్తములచే గలిగిన పరిమ్లాయి యనుభేదముచేతను, లింగనాశము ఆరు విధములు. క్రింద జెప్పంబడు పిత్తవిదగ్ధ-కఫవిదగ్ధ-ధూమదర్శి-హ్రస్వజాడ్య-నకులాన్ధ్య-గంభీరంబు లను భేదముచే నారు విధంబులును; ఇవియన్నియు కలిసి దృష్టిగతరోగములు పండ్రెండువిధములై యుండును.

ఇచ్చట నీనిర్ణయము నెఱుంగునది —దృష్టియందలి నాల్గుపటలములలో మొదటి రెండు పటలముల నుండు దోషములచే గల్గు దోషవిశేషములు తిమిరశబ్ద వాచ్యంబు లనియు, అట్టిదోషములు మూడవపటలమున జేరినపుడు కాచమనబడు ననియు, నాల్గవపటలమున జేరినపుడు లింగనాశమును కల్గించు ననియు మున్ను చెప్పియుంటిమి. ఇదియే వాగ్భటాచార్యసమ్మతము. వాగ్భటాచార్యుడు అట్టి తిమిరకాచలింగనాశముల మూటికిని వేర్వేరుగ వాతాదిభేదముల ననుసరించి ప్రత్యేకవిశేషలక్షణముల స్ఫుటముగ జెప్పిరి. ప్రకృతగ్రంథమున మాధవకరుడు మూడు పటలములవరకును వాతాదిభేదముల వివరింపక దోషసామాన్యమున లక్షణములను జెప్పి, "తిమిరాఖ్యస్సవై రోగశ్చతుర్థపటలం గతః..................స ఏవ లింగనాశస్తు నీలికాకాచసంజ్ఞితః" అను వాక్యముచేత మూడవపటలమున దోషములు వ్యాపించిన నయ్యది కాచ మనియు, అదియే నాల్గవపటలము నాశ్రయించినపుడు లింగనాశ మనబడు ననియు నతిదేశించిచెప్పి, పిమ్మట వాతాదిభేదములచే గల్గు లక్షణముల సామాన్యముగ జెప్పెను. గాని తిమిరాదిభేదముల ననుసరించి చెప్పియుండలేదు. కావున తిమిరకాచలింగనాశసామాన్యముగ నీవాతాది లక్షణముల నన్వయింపదగియున్నది. పిదప "రుణద్ధి సర్వతో దృష్టిం లింగనాశ మతః పరం......" ఇత్యాదివాక్యములచే లింగనాశసామాన్యలక్షణము జెప్పి, లింగనాశముల వాతాదిభేదముచే గల్గు దృష్టిమండలగతవిశేషలక్షణములను "అరుణం మండలంవాతాత్...లిఙ్గనాశే త్రిదోషజే" అను గ్రంథముచే జెప్పి, "యథాస్వం

దోషలింగాని సర్వేష్వేవ భవన్తి హి" అను వాక్యముచేత 'వాతేన చాపి రూపాణి' అని యుపక్రమించి చెప్పిన వాతాదిసామాన్యలక్షణముల నతిదేశించెను. ఇదియ మాధవ కరుని యభిప్రాయము.

ఈవిమర్శనమున నేర్పడిన దేమన, తిమిర - కాచ - లింగనాశములు నాల్గును, ఒకదాని నుపేక్షించుటచే నదియే బలిష్ఠమై రోగాంతరముగ పరిణమించును గాన తిమిర కాచములకన్న లింగనాశ మనురోగమును ప్రధానముగజేసి, తక్కిన రెంటిని సామాన్యముగజేసి, లింగనాశభేదము లైదింటితో పరిమ్లాయిని జేర్చి "షడ్లింగనాశాః" అని ఆరు విధములుగ పరిగణనము జేసిరి. వారి యభిప్రాయ మేమన, లింగనాశమనగ దృష్టిని చెఱచు నది యను నర్థముచేత తిమిరకాచములును దృష్టిని చెఱచునవియే గాన నవికూడ లింగనాశశబ్దవాచ్యము లనియే ఆశయము. అట్టి యభేదముచేతనే ఆరు లింగనాశము లను పరిగణనము సంగతమగును.

వాగ్భటాచార్యులు మాత్రము తిమిరకాచలింగనాశములు వేర్వేరుగ వాత పిత్త కఫ సన్నిపాత సంసర్గరక్తభేదములచే నారేసి విధములై పదునెనిమిదియు, గంభీర, హ్రస్వజ, నకులాంధ్య, పిత్తవిదగ్ధ, దోషాంధ్య, ఉష్ణవిదగ్ధ, విదగ్ధామ్ల, ధూమర, ఔపసర్గికములను తొమ్మిదియుం జేరి యిరువదియేడు రోగములు దృష్టిగతము లని "గదా దృష్టౌ నిర్దిష్టాస్సప్తవింశతిః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౩౨.) అనువాక్యముచే పరిగణము జేసి చెప్పిరి. ఈవిమర్శనము విస్తరభీతిచే నింతట విరమించెద. విద్వాంసులు గమనించెదరుగాత!

## పిత్తవిదగ్ధదృష్టిలక్షణము

పిత్తేన దుష్టేన సదా తు దృష్టిః పీతా భవేద్యస్య నరస్య కిఞ్చిత్ .55
పీతాని రూపాణి చ తేన పశ్యేత్ స వై నరః పిత్తవిదగ్ధదృష్టిః,
ప్రాప్తే తృతీయం పటలం తు దోషే దివా న పశ్యేన్నిశి చేక్షతే సః.
రాత్రౌ చ శీతానుగృహీతదృష్టిః పిత్తాల్పభావాదపి తాని పశ్యేత్,

ప్రకుపితమైన పిత్తముచే దృష్టి చెఱుపబడి కొంచెము పచ్చనిరంగు కల్గియుండును. దానంజేసి వస్తుజాలమునెల్ల పచ్చనిరంగుకలవానినిగ జూచెదరు. అట్టి మనుజుడు పిత్తవిదగ్ధదృష్టి యని చెప్పబడును. అట్టిదోషము మూడవపటలమున జేరినపుడు పగటి యందు పిత్తము తీవ్రమై స్వభావముచేతనే యుష్ణము మిక్కుటముగ నుండుటంజేసి పగటిపూట రూపములుగల వస్తువులెల్ల గనబడవు. రాత్రియందు స్వభావముచేతనే చల్లనై పిత్తము శాంతముగ నుండును. కావున రాత్రులయందు రూపాదులు చక్కగ నగపడును.

### కఫవిదగ్ధదృష్టిలక్షణము

తథా నరశ్శ్లేష్మవిదగ్ధదృష్టిః తాన్యేవ శుక్లాని తు మన్యతే సః. 57
త్రిషు స్థితోఽల్పః పటలేషు దోషో నక్తాంధ్యమాపాదయతి ప్రసహ్య,
దివా ససూర్యానుగృహీతదృష్టిః పశ్యేత్తురూపాణి కఫాల్పభావాత్.

కఫము దుష్టంబై దృష్టిమండలమున వ్యాపించినపుడు రూపాదులనెల్ల తెల్లగ జూచును. అట్టిదోషము మూడుపటలములయందును వ్యాపించినయెడ రాత్రుల యందు కఫం బధికముగ నుండుటంజేసి కన్నులు గానరాకుండును. పగటియందు అట్టి కఫము సూర్యుని వేడిచేత కరగి కొంచెము తగ్గియుండును. కావున పవటిపూట స్వల్పముగ గనబడును. ("త్రిషుస్థితోఽల్పః" అను వాక్యముచేత మూడుపటలములయందును కఫము స్వల్పముగ వ్యాపించినపుడు రాత్రివేళల మాత్రము రూపాదులు కనబడక రేజీకటి కల్గు ననియు, మూడుపటలములయందును కఫము ప్రబలముగ వ్యాపించినపుడు పగటియందును బొత్తుగ నగపడ దనియు భావ మేర్పడును. దీనిని దోషాంధ్య మని ప్రకారాంతముగ వాగ్భటాచార్యుడు చెప్పెను.)

### ధూమదర్శిలక్షణము

శోకజ్వరాయాసశిరోఽభితాపైః అభ్యాహతా యస్య నరస్య దృష్టిః,
ధూమ్రాంస్తథా పశ్యతి సర్వభావాన్ స ధూమదర్శీతి నరః ప్రదిష్టః.

దుఃఖము, జ్వరము, ఆయాసము, శిరోరోగము అను నీకారణములచేత పిత్తము ప్రధానముగా గల వాతాదిదోషములు ప్రకోపమునొంది మనుజుని దృష్టిని జెరచును. దానంజేసి సకలవస్తుజాలంబును పొగగ్రమ్మినవిధముగ నగపడును. ఈ వ్యాధికల మనుజుడు ధూమదర్శి యనబడును. ఈవ్యాధిని ధూమర మని వాగ్భటాచార్యుడు చెప్పెను. "సన్తప్తస్యానిలాదయః......కుర్యుస్సధూమరః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౨౯.) అని వాగ్భటుడు చెప్పెనుగాన దోషములన్నియు నీవ్యాధిని కల్గించు నని తెలిసెడి.

### హ్రస్వజాడ్యలక్షణము

యోహ్రస్వజాడ్యో దివసేషుకృచ్ఛ్రాత్ హ్రస్వానిరూపాణిచ తేనపశ్యేత్,

పగటివేళయందు మనుజుడు గొప్పరూపముల నన్నిటిని మిక్కిలి చిన్నయాకారముకల్గినవానిగ జూచును. అట్టిరూపములగూడ మిక్కిలి కష్టముచే జూడగల్గును.

ఇది హ్రస్వజాడ్య మనబడును. "దివసేషు." అనుటచేత పగటివేళ కనబడునుగాని రాత్రుల యందు బొత్తుగ గనపడదని భావము.

వాగ్భటాచార్యుడు —"దృష్టిః పిత్తేన హ్రస్వాఖ్యా సా హ్రస్వా హ్రస్వదర్శినీ" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౧౫) అని చెప్పెరుగాన నీరోగమున దృష్టికూడ మిక్కిలి హ్రస్వమై గొప్పరూపములెల్ల చిన్నవిగ గనబడు ననియు, ఈ రోగము పిత్తముచే జనించు ననియు తెలియుచున్నది. మరియు—"దృష్టిమధ్యగతే దోషే మహద్ధ్రస్వం చ పశ్యతి" అని సామాన్యలక్షణమున పైని చెప్పబడినది. కావున ఈ వ్యాధి దృష్టిమధ్యమున దోషము చేరినపుడు కల్గు నని యెరుంగునది.

## నకులాంధ్యలక్షణము

విద్యోతతే యస్య నరస్య దృష్టిః దోషాభిపన్నా నకులస్య యద్వత్.
చిత్రాణి రూపాణి దివా స పశ్యేత్ స వై వికారో నకులాన్ధ్యసంజ్ఞః,

మనుజునిదృష్టి వాతాదిదోషములచే దుష్టమై మిక్కిలి కాంతి గల్గి ముంగిస కన్నులవలె దేదీప్యమానముగ ప్రకాశించును. అట్టి దోషముచేత పగటియందు వస్తువులన్నియు చిత్రవర్ణములుగ గనబడును. ఇయ్యది నకులాంధ్యమను వ్యాధి యని యెఱుంగునది. (నకుల మన ముంగిస. దానికివలె దృష్టిచిత్రవర్ణమై వస్తువుల నన్నిటిని చిత్రవర్ణములుగ జూచుటంజేసి యిది నకులాంధ్య మని యన్వర్థముగ చెప్పనగును)

"దివా స పశ్యేత్" అనుటచేత పగలుమాత్రము కంటికి కగపడును గాని రాత్రి పూట బొత్తుగ నగపడదని భావము. ఇచ్చట చెప్పబడిన దృష్టిగత రోగములలో కఫవిదగ్ధదృష్టి, హ్రస్వజాడ్యము, నకులాంధ్యము అను నీ మూడు రోగములయందును రాత్రివేళ బొత్తుగ కన్నులు కానరావు; కావున నివి నక్తాంధ్యము (రేజీకటి)లో జేరిన రోగములు. వాగ్భటమున రాత్రి కనబడని జాడ్యమును ఉష్ణవిదగ్ధదృష్టి యనుదానిని "రాత్రావాన్ధ్యం చ జాయేత విదగ్ధోష్ణేన సా స్మృతా" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౨౭.) అని చెప్పిరి.

పై జెప్పబడిన నక్తాంధ్యముల (రేజీకటిని) నాల్గిటిని విదేహుడును నిరూపించి అందు నకులాంధ్యంబును, హ్రస్వజాడ్యంబును నాల్గవపటలము నాశ్రయించి జనించును. కావున నీరెండును రక్తవర్ణము కల్గియుండును. కావున మిక్కిలి యసాధ్యము లని చెప్పిరి. ఎట్లులన:—"నక్తమన్ధస్తు చత్వారో యే పురస్తాత్ప్రకీర్తితాః, తేషామసాధ్యో నకులో హ్రస్వజాడ్యస్తథైవచ, విశేషేణ భవేయాతాం ద్వౌ చతుఃపటలాశ్రితౌ, తౌ చ సంప్రాప్త రాగత్వాత్ అసాధ్యౌ పరికీర్తితౌ."

### గంభీరికా లక్షణము

దృష్టిర్విరూపా శ్వసనోపసృష్టా సఙ్కోచమభ్యన్తరతస్తు యాతి. 61
రుజాఽవగాఢా చ తమక్షిరోగం గమ్భీరికేతి ప్రవదన్తి తజ్జ్ఞాః,

వాతము ప్రకుపిత మగుటచేత కంటిలో దృష్టి వికృతరూపమై కంటికి సంబంధించిన సిరలు వాతముచే లాగబడుటంజేసి కన్నుగూడ లోపలికి బోవును. కంటి లోభాగమున మిక్కిలి తీవ్రమైన బాధ కల్గును. దీనిని గంభీరిక యని చెప్పెదరు. ఇయ్యది యసాధ్యము.

ఇత్తెరంగున నుద్దిష్టానుసారముగ దృష్టిగతరోగములు పండ్రెండును చెప్పబడినవి.

### బాహ్యనేత్రరోగములు రెండు; అందు నిమిత్తజ లక్షణము

బాహ్యౌ పునర్ద్వావిహ సంప్రదిష్టౌ నిమిత్తతశ్చాప్యనిమిత్తతశ్చ.62
నిమిత్తతస్తత్ర శిరోఽభితాపాత్ జ్ఞేయస్త్వభిష్యన్దనిదర్శనస్సః,

ఆగంతువులగు నేత్రరోగములు (లింగనాశములు) రెండు. అం దొకటి బహిర్వ్యాప్తములగు కారణములచే జనించునది (నిమిత్తజము.) రెండవది అట్టి దృశ్యములగు కారణములు లేక పుట్టునది (అనిమిత్తజము). అందు మొదటిది విషయుక్తమయినగాలి యొక్క స్పర్శము మున్నగుకారణములచే శిరస్సున సంతాపము కల్గి, ఆ యుష్ణము కన్నులయందుజేరి దృష్టియందలి తేజస్సును నశింపజేయును. దానివలన శిరోగత రక్తప్రకోపముకలిగి చూపునకు హాని కల్గును. ఈ వ్యాధియందు రక్తాభిష్యందమునకు జెప్పిన తామ్రాశ్రుపాతము మున్నగు లక్షణములు కల్గియుండును. ఇది శిరోఽభితాపరక్తప్రకోపాదినిమిత్తమువలన గలుగునదిగాన నిమిత్తజము.

### అనిమిత్తజ బాహ్యనేత్రరోగముయొక్క నిదానము

సురర్షిగన్ధర్వమహోరగాణాం సన్దర్శనే నాపి చ భాస్కరస్య. 63
హన్యేత దృష్టిః ర్మనుజస్య యస్య స లిఙ్గనాశస్త్వనిమిత్తసంజ్ఞః,

కన్నులకు గోచరములుకాని దేవతలు ఋషులు గంధర్వులు ఉరగులు మున్నగువారినైనను, తేజస్స్వరూపుడగు సూర్యునైనను జూడ బ్రయత్నించి అనిమేషముగ తదేకదృష్టిచే జూచుటవలన వేరే కారణాంతరము లేకయే కంటిలో చూపు బొత్తుగ నశించును. ఇయ్యది కారణములేకనే జనించును కావున అనిమిత్తజము.

(ఇచ్చట లింగనాశశబ్దమునకు దృష్టిని నశింపజేయునది యని యర్థముగాన పైజెప్పిన లింగనాశములలో జేరిన దని భ్రమింపవలదు.)

### అనిమిత్తజలక్షణము

తత్రాఽక్షివిస్పష్టమివావిభాతి వైడూర్యవర్ణా విమలా చ దృష్టిః. 64

పైజెప్పిన అనిమిత్తజబాహ్యరోగమున కన్నులు మిక్కిలి నిర్మలముగ బ్రకాశించును. దృష్టియందు రూపాదుల గ్రహించుశక్తి బొత్తుగ నశించినను దృష్టిమాత్రము వైడూర్యమణిబోలె నిగనిగలాడుచు ప్రకాశించును. (పైజెప్పిన రీతిగ దూరదీర్ఘదర్శనమునంజేసి దృష్టియందలి తేజోభాగము మాత్రము నశించినందున రూపగ్రహణశక్తి నశించును గాని దృష్టిమండలముమాత్రము చెడ దని భావము.) ఈవిషయమును చరకాచార్యుడు సదృష్టాంతముగ నిట్లు చెప్పెను:—"దేవాదయోఽప్యహి మహానుభావాః నదూషయన్తః పురుషస్యదేహం, విశన్త్య దృశ్యాస్తరసా యథైవ చ్ఛాయాతపౌదర్పణసూర్యకాన్తౌ" (చరక. చి. అ. ౯. శ్లో. ౧౮.) అచింత్యమహిమగల దేవదానవాదులు పురుషుని దేహము చెరుపకయే కన్నుల కగపడక బింబము అద్దమునను, సూర్యునికాంతి సూర్యకాంతమణిని ప్రవేశించుభంగి పురుషుల బ్రవేశించెదరు.) అత్తెరంగుననే సూర్యాదుల జూడఁ బ్రయత్నముజేయు పురుషులదృష్టి వైరూప్యము నొందించకయే దానియందలి చూచుశక్తిని నశింపజేయుదు రని యర్థము. ఈ రెండు వ్యాధులును బాహ్యనేత్రరోగములు.

(ఈశ్లోకము నవీనముద్రితకోశములయం దిట్లున్నది:—"అదూషయన్తః పురుషస్య దేహం దేవాదయః స్వైస్తు గుణప్రభావైః, విశన్త్యదృశ్యాః తరసా యథైవ ఛాయాతపౌ దర్పణసూర్యకాన్తౌ".)

వాగ్భటాచార్యుడు పైజెప్పిన బాహ్యనేత్రవ్యాధిని ఔపసర్గికలింగనాశ మను పేర నిట్లు చెప్పెను:—"సహసైవాల్పసత్వస్య పశ్యతో రూపమద్భుతమ్, భాస్కరం భాస్కరాదిం వా వాతాద్యా నయనాశ్రితాః, కుర్వన్తి తేజస్సంశోష్య దృష్టిం ముషితదర్శనామ్, వైడూర్యవర్ణాం స్తిమితాం ప్రకృతిస్థామివావ్యథామ్, ఔపసర్గిక ఇత్యేవ లిఙ్గనాశః" (అ. హృ. ఉ. అ. ౧౨. శ్లో. ౩౦, ౩౧.) మనుజుడు తెలివిలేక అద్భుతరూపముకల సూర్యుడు మున్నగు దేవతావిశేషముల జూచుచున్నయెడ, దానంజేసి నేత్రగతములగు వాతాదిదోషములు దృష్టియందలి తేజోభాగమును శోషింపజేసి దృష్టిని రూపముల గ్రహించుశక్తిని నశింపజేయుచు. దృష్టిమండలముమాత్రము వైడూర్యమునుబోలె నిగనిగయని యేవిధమైన బాధయులేక స్వాభావికముగ జూడ రమ్యముగ నుండును. ఇయ్యది ఔపసర్గికలింగనాశ మనబడును. (ఈ రెండును అసాధ్యములు.)

ఔపసర్గిక మన, వాతాదులకు జెప్పిన ప్రకోపకారణములు గాక యితరములగు కారణములచే జనించినవ్యాధి యని యర్థము. కావుననే దీనిని వాతాదిలింగ నాశముల

జేర్పక మాధవకరుడు బాహ్యరోగ మని వేరుగ జెప్పెను. వాగ్భటుడు మాత్రము దీనిని కూడ జేర్చి దృష్టిగతరోగములు ఇరువదియే డని పరిగణనము జేసిరి. పరిగణన మెట్లున్నను ఈరెండు మతములయందు కొంచెము మార్పుతో లక్షణములు మాత్రము సమముగనే యున్నవి. ఈవ్యాధులలోః ఏమత మెట్లున్నను, "ఊర్ధ్వజత్రువికారేషు విదేహాఃపరమోగురుః" అను ప్రమాణమునుబట్టి విదేహమతము ప్రమాణతమ మనుట నిర్వివాదము. ప్రాయికముగ నట్టిమతము నవలంబించియే మాధవకరుడును చెప్పినట్లున్నది.

(దృష్టిగతరోగముల జెప్పినపిదప శుక్లమండలగతరోగముల జెప్పుట. అయ్యవి పదునొకండు.)

## 1. అందు ప్రస్తార్యర్మలక్షణము

ప్రస్తార్యర్మతను స్తీర్ణం శ్యావం రక్తనిభం సితే,

కంటిలో తెల్లగ్రుడ్డుపైన మిగుల పలుచనై శ్యామవర్ణంబును, లేక రక్తవర్ణంబునైన పొరగ్రమ్మియున్న నయ్యది ప్రస్తార్యర్మ మను వ్యాధి యని యెరుంగునది.

దీనిస్వరూపము తంత్రాంతరమున స్పష్టముగ నిట్లు చెప్పబడినది:—"సమస్తాద్విస్తృతశ్శ్యావః రక్తో యో మాంససఞ్చయః, సన్నిపాతేన దోషాణాం ప్రస్తార్యర్మ తదుచ్యతే." శ్యామవర్ణంబైనను రక్తవర్ణంబునైన కలిగిన సన్నని మాంసపుపొర కంటియొక్క తెల్లగ్రుడ్డుపై నంతటను వ్యాపించిన నది ప్రస్తార్యర్మ మనబడును. ఇయ్యది త్రిదోషముల సన్నిపాతమున గల్గును. ఈవాక్యమునుబట్టి ఇయ్యది త్రిదోషసన్నిపాతమున గల్గునదియు, మాంససంచయరూపమైనది అర్మశబ్దవాచ్య మనియు తెలిసెడి. అయ్యది గ్రుడ్డును గప్పియుండుటంజేసి ప్రస్తార్యర్మ మని చెప్పబడును.

## 2. శుక్లార్మలక్షణము

సశ్వేతం మృదు శుక్లార్మ శుక్లే తద్వర్ధతే చిరాత్. 65

ఉల్లిపాయ పైపొరవలె కొంచెము తెల్లనై మృదువైన మాంసపుపొర తెల్లగ్రుడ్డుపైగల్గి, చిరకాలమునకు వృద్ధినొంది తెల్లగ్రుడ్డుపై వ్యాపించినయెడ నయ్యది శుక్లార్మ మనబడును.

## 3. రక్తార్మలక్షణము

పద్మాభం మృదు రక్తార్మ యన్మాంసం చీయతే సితే,

ఎట్టిని తామరరేకువలె రక్తవర్ణంబై మృదువైన మాంసపుపొర తెల్లగ్రుడ్డుపై బుట్టి వృద్ధినొంది గ్రుడ్డుపై గ్రమ్మియున్న నయ్యది రక్తార్మ మనబడును.

### 4. అధిమాంసార్మ లక్షణము

పృథుమృద్వధిమాంసార్మబహలం చ యకృన్నిభమ్,

విశాలంబును మృదువును మిక్కిలి ఘనంబునై యకృత్తునుబోలె రక్తవర్ణమై నలుపుకలసిన ఎరుపు) మాంసపు పొర తెల్లగుడ్డుపై బుట్టి గ్రమ్మిన వయ్యాది అధిమాంసార్మ మని చెప్పనగును.

సుశ్రుతమున దీని లక్షణ మిట్లు చెప్పబడినది:—"విస్తీర్ణం మృదు బహుళం యకృత్ప్రకాశం శ్యామం వా తమధిమాంసజార్మ విద్యాత్" ఈవాక్యమునుబట్టి యధిమాంసార్మము యకృత్తును బోలి రక్తవర్ణంబైనను, శ్యామవర్ణంబైనను కల్గియుండు నని తెలిసెడి. మరియు సుశ్రుతమున సన్నిపాతప్రకరణమున దీనిని పఠించిరి గాన నియ్యాది సన్నిపాతజనిత మని యెఱుంగునది.

### 5. స్నాయ్వర్మలక్షణము

స్థిరం ప్రస్తారి మాంసాఢ్యం శుష్కం స్నాయ్వర్మ పఞ్చమమ్.66

కఠినంబును, మాంసముతోఁగూడి యెండి ద్రవములేక యుండు మాంసపుపొరకల్గి గ్రుడ్డుపై వ్యాపించినయెడ నయ్యాది స్నాయ్వర్మ మని చెప్పబడును.

మరియు:—"ప్రస్తారిణోఽర్మణస్స్రావం నిరుణద్ధి యదానిలః; వినాస్రావంహి శుష్కంతత్ స్నాయ్వర్మేతి ప్రకీర్తితమ్" (నిమి) అని తంత్రాంతరమున నుండుటంజేసి పైజెప్పబడిన ప్రస్తార్యర్మ మను వ్యాధియందు వాతము స్రావమును అడ్డగించినపుడు ద్రవములేమింజేసి యెండినయెడ నదియే స్నాయ్వర్మం బని తెలిసెడి. (ఇయ్యాది సన్నిపాతమున జనించినను వ్యాధి స్వభావముచే సాధ్యంబై యుండును.)

### 6. శుక్తికాలక్షణము

శ్యావాస్స్యుః పిశితనిభాశ్చ బిన్దవో యే
శుక్త్యాభాః సితనియతాస్స శుక్తిసంజ్ఞః,

శ్యామవర్ణంబులును మాంసపు ఉండలవంటి యాకారమును గల్గి ముత్యపుచిప్పల వలె తళతళ మెరయు చుక్కలు తెల్లగ్రుడ్డున కల్గిన,నయ్యాది ముత్యపుచిప్పల లోభాగము బోలె మెరపుకల్గి యుండుటంజేసి శుక్తిక యని చెప్పబడును. ఈబిందువులు తెల్లగ్రుడ్డు ననే నియతముగ గల్గును.

వాగ్భటాచార్యు డీవ్యాధిని శుక్తిక యనుపేరజెప్పి లక్షణము నిట్లు చెప్పెను:—'పిత్తం కుర్యాత్సితే బిన్దూన్ అసితశ్యావపీతకాన్' మలాక్తాదర్శతుల్యం వా సర్వం శుక్లం సదాహరుక్, రోగోఽయం శుక్లికాసంజ్ఞః సశకృద్భేదతృడ్జ్వరః."

(అ. హృ. ఉ. అ. ౧౦. శ్లో. ౧౦, ౧౧.) కంటిలో తెల్లగ్రుడ్డున పిత్తము ప్రకోపించి నల్లనివర్ణంబైనను, శ్యామవర్ణంబైనను, పచ్చనిరంగైనను గల చుక్కలు అంతట వ్యాపించును. లేక అద్దముపైన ధూళిగ్రమ్మిన విధముగ తెల్లగ్రుడ్డుపైనంతట మలినము వ్యాపించును. ఇయ్యది శుక్లిక యను రోగ మని చెప్పనగును. ఈవ్యాధియందు మలము ఉండలు గట్టును. దప్పి యధికమగును. జ్వరము వచ్చును. అని భావము. (ఈవాక్యముచేత నీవ్యాధి పిత్తమున గల్గు ననియు అందువలన మలభేదాదు లీవ్యాధియందు కల్గు ననియు తెలిసెడి.)

## 7. అర్జునలక్షణము

ఏకో యశ్శశరుధిరోపమశ్చ బిందు
శ్శుక్లస్థో భవతి తమర్జునం వదన్తి. 67

కుందేటినెత్తురుంబోలె నెఱ్ఱనిచుక్క యొక్కటిమాత్రము తెల్లగ్రుడ్డుపై కల్గును. ఇయ్యది యర్జున మనబడును.

మరియు:—ర క్తం చ శుక్లభాగస్థం అర్జునం శోణితోద్భవమ్, శక్రగోపనిభం శుక్లేఽర్జునం రక్తప్రకోపతః" (కల్యాణనిశ్చయ) అను తంత్రాంతరవచనములబట్టి యీ యర్జున మను రోగమున ఇంద్రగోపపు (ఆర్ద్ర) పురుగుబోలె నెఱ్ఱనైన మచ్చ జనించు ననియు, ఈవ్యాధి రక్తమున జనించు ననియు తెలిసెడి. వాగ్భటమున "సీరుక్ శ్లక్ష్ణోఽర్జునోబిన్దుః" అని యుండుటచేత నీవ్యాధియందు నొప్పి మంట మున్నగుబాధ లుండ వని తెలిపెడి.

## 8. పిష్టకలక్షణము

శ్లేష్మమారుతకోపేన శుక్లేపిష్టం సమున్నతమ్,
పిష్టవత్పిష్టకం విద్ధి మలాక్తాదర్శసన్నిభమ్. 68

కఫవాతముల ప్రకోపముచేత తెల్లగ్రుడ్డుపైన ధూళిగ్రమ్మిన యద్దమునుబోలె పిండిపూసినవిధముగ గ్రమ్మియున్నయెడ నయ్యది పిష్టక మనబడును.

వాగ్భటాచార్యుడు ఈలక్షణమును శుక్లికావ్యాధికి రూపాంతరముగ జెప్పి పిష్టక లక్షణము నిట్లు చెప్పెను:—"బిన్దుభిః పిష్టధవళైరుత్సన్నైః పిష్టకం వదేత్" (అ. హృ. ఉ. అ. ౧౦. శ్లో. ౧౩.) పిండివలె తెల్లనై యున్నతములగు బిందువు లనేకములు తెల్లగ్రుడ్డుపై వ్యాపించిన నయ్యది పిష్టక మని భావము. (ఇట్టి లక్షణభేదము కాలానుగుణముగ నించుక కల్గుచుండు నని తోచెడి.)

### 9. సిరాజాలలక్షణము

జాలాభః కఠినసిరో మహాన్ సరక్తః
సన్తానస్స్మృత ఇహ జాలసంజ్ఞితస్తు,

తెల్లగ్రుడ్డుపైన సిరలు పలుదెరంగుల వ్యాపించి కంటియందు సన్నని నరములు కఠినములై వలవలె నున్నచో నయ్యది సిరాజాల మనబడును. ఈవ్యాధి రక్తముచే గల్గును.

### 10. సిరాజపిటికాలక్షణము

శుక్లస్థాస్సితపిటికాస్సిరావృతా యాః
స్తా బ్రూయాదసితసమీపజాస్సిరాజాః,

నల్లగ్రుడ్డునకు సమీపమున తెల్లగ్రుడ్డున సన్నని నరములు వ్యాపించి సన్నని బొబ్బలు కల్గిన నయ్యది సిరాజపిటిక యని చెప్పబడును.

(ఈవ్యాధిని సుశ్రుతాచార్యుడు సన్నిపాతప్రకరణమున సాధ్యములలో పరిగణించెను. కావున నియ్యది సన్నిపాతమునం జనించినను సాధ్యముగ నుండు నని యెరుంగునది.)

### 11. బలాసగ్రథితలక్షణము

కాంస్యాభోఽమృదురథ వారిబిందుకల్పః,
విజ్ఞేయో నయనసితే బలాససంజ్ఞః. 69

కంటిలో తెల్లగ్రుడ్డున కంచువలె నించుక పచ్చనిరంగుకల తెల్లని కాంతితోగూడి నీటిబిందువుబోలె నున్నదమై కఠినముగ నుండు గుండ్రని బొబ్బ కల్గిన నయ్యది బలాసగ్రథిత మనబడును.

ఈలక్షణమును విదేహు డిట్లు చెప్పెను:—"మారుతోత్పీడితశ్శ్లేష్మా శుక్లభాగే వ్యవస్థితః, జలబిన్దురివాచ్ఛాభో హ్యమృదుః కఫసమ్భవః, బలాసగ్రథితం నామ తం శోధం వృత్తమాదిశేత్" ఈవాక్యముచేత నీవ్యాధి కఫము వాతమునగూడి ప్రకోపించుటచే గల్గు నని తెలిసెడి.

ఇత్తెరంగున ప్రస్తార్యర్మము మొదలుజేసి పదునొకండు వ్యాధులును శుక్లగత నేత్రరోగములు సవిస్తరముగ జెప్పబడినవి. వాగ్భటాచార్యుడు సిరోత్పాతము, సిరాహర్షము నను రెండు రోగములజేర్చి శుక్లగతరోగముల పదుమూడువిధముల జెప్పెను. అందు సిరోత్పాత సిరాహర్ష లక్షణము లిట్లు వాగ్భటునిచే జెప్పబడియె:—"రక్త

రాజీతతం శుక్లముచ్యతే యత్సవేదనమ్, అశోఫాఽశ్రూపదేహం చ సిరోత్పాతస్స శోణితాత్. ఉపేక్షితస్సిరోత్పాతః రాజీస్తా ఏవ వర్ధయన్, కుర్యాత్సాస్రం సిరాహర్షం తేనాక్ష్యుద్వీక్షణాక్షమమ్" (అ. హృ. ఉ. అ. ౧౦. శ్లో. ౧౪, ౧౫.) కంటిలోని తెల్లగుడ్డుపైని ఎఱ్ఱనిచార లేర్పడి కంటియందు వాపును కన్నీళ్లును దుర్మాంసంబును లేకయే మంటయు నొప్పియు కల్గును. ఇయ్యది సిరోత్పాత మనబడును. ఈ వ్యాధిని చికిత్సచేయక యుపేక్షించినయెడ పైజెప్పినరేఖలు కంటిలో వృద్ధినొంది యెఱ్ఱనై రక్తముతోగూడి కన్నుల దెరచిచూడ వలనుపడక యుండును. ఇయ్యది సిరాహర్షమనబడును. ఈరెండువ్యాధులు గూడ శుక్లగతవ్యాధులు.

[శుక్లగతనేత్రరోగముల జెప్పినపిదప సంధిగతంబులగు నేత్రరోగములు చెప్పబడును. నేత్రములయందు సంధు లారు గలవు. అయ్యవి సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి:—"పక్ష్మవర్త్మగతస్సన్ధిః, వర్త్మ శుక్ల గతోఽపరః, శుక్లకృష్ణగతస్త్వన్యః, కృష్ణదృష్టిగతోఽపరః; తతఃకనీనికగతః, షష్ఠశ్చాపాంగగస్స్మృతః" (సుశ్రుత. ఉ. అ. ౧) రెప్పవెండ్రుకలకును రెప్పలోపలిభాగమునకును నడుమ నుండు సంధి మొదటిది. రెప్పలోప్రక్కకును తెల్లగుడ్డునకును నడుమనుండుసంధి రెండవది. తెల్లగుడ్డునకును నల్లగుడ్డునకును నడుమనుండు సంధి మూడవది. నల్లగుడ్డునకును దృష్టికిని నడుమనుండు సంధి నాల్గవది. కన్నులకొలుకులలో నుండుసంధి యైదవది. కన్కొలయందుండు సంధి యారవది. అట్టి యారువిధములగు నేత్రగతసంధులలో బుట్టురోగములు తొమ్మిది విధములు.]

## 1. అందు పూయాలసకలక్షణము

పక్వశ్శోథస్సన్ధిజోయస్సతోదః స్రవేత్పూయంపూతిపూయాలసాఖ్యః,

* కనీనికయందుండు సంధియందు వాపుపుట్టి పరిపక్వమై పోటుపుట్టి దుర్గంధముతోగూడిన చీముకారును. ఇది పూయాలసం బనువ్యాధి. ఇయ్యది కనీనికా సంధియందు కల్గును. ఈవిషయమును విదేహుడు "పూయాలసంతు తం విద్యాత్సన్ధౌ కానీనికే నృణామ్" అను వాక్యముచేత స్ఫుటముగ జెప్పెను.

(మరియు సుశ్రుతాచార్యుడు దీని త్రిదోషవ్యాధులలో సాధ్యముల నడుమ జెప్పియుండుటంజేసి యాపూయాలసకము సన్నిపాతముచే జనించు ననియు, సాధ్యం బనియు నెరుంగునది.)

## 2. శ్లేష్మోపనాహలక్షణము

గ్రన్థిర్నాల్పోదృష్టిసన్ధావపాకీకణ్డూప్రాయోనీరుజస్తూపనాహః. 70

---

* కనీనిక యనగా కంటికి ముక్కు వైపుననుండు కొన యని మధుకోశకారుడు వ్రాసెను.

కంటిలో నల్లగ్రుడ్డునకు *దృష్టికి సంధిస్థానమున గొడియగు గ్రంథికల్గి పుండగును. ఇయ్యది దురద విశేషముగ గల్గును. నొప్పి విశేషముగ నుండును. ఇయ్యది శ్లేష్మోపనాహ మని చెప్పబడును.

దీని సంప్రాప్తిని విదేహు డిట్లు చెప్పెను:—"వాయుశ్శ్లేష్మాణమాదాయ దృష్టిసన్ధౌ వ్యవస్థితః, అరుణం కఠినం గ్రన్థిం జనయేదల్పవేదనమ్. శ్లేష్మోపనాహం తం విద్యాత్." వాతము ప్రకోపమునొంది కఫముతోగలిసి నల్లగ్రుడ్డునకును దృష్టికిని నడుమనుండు సంధియందు ఎఱ్ఱనిరంగుకల్గి స్వల్పమైన బాధతోగూడి కఠినమైన గ్రంథిని కల్గించును. ఇది శ్లేష్మోపనాహ మని చెప్పబడును. ఈవాక్యముచేత నీవ్యాధి వాతకఫములచే జనించు ననియు, అందును కఫము ప్రబలముగ నుండుటంజేసి శ్లేష్మోపనాహ మని చెప్పబడు ననియు తెలిసెడి.

స్రావములు నాల్గు ; వాని సంప్రాప్తి

గత్వా సంధీనశ్రుమార్గేణ దోషాః
కుర్యుస్స్రావాన్ లక్షణైస్స్వైరుపేతాన్,
తం హి స్రావం నేత్రనాడీతి చైకే
తస్యా లింగం కీర్తయిష్యే చతుర్థా. 71

దోషములు వానివాని కారణములచే ప్రకుపితములై కన్నీళ్లవహించు ధమనులమార్గముగ †కంటిసంధులంజేరి ఆయాదోషముల లక్షణములతో గూడిన స్రావముల గల్గించును. అట్టి స్రావమును నేత్రనాడి యని కొందరాచార్యులు వచించెదరు. అయ్యది పిత్తకఫరక్త సన్నిపాతములచే వేరువేర గల్గుటంజేసి నాల్గు తెరగు లగును. వాని లక్షణములు ప్రత్యేకముగ నీక్రింద వివరింపబడును. వ్యాధి స్వభావమునంజేసి వాతజనితస్రావనుమాత్రము లేదు. ఈవిషయమును విదేహు డిట్లు చెప్పెను:—"సన్నిపాతాత్కఫాద్రక్తాత్పిత్తాత్స్రావోఽక్షి సంధిషు"

ఇచ్చట 'అశ్రుమార్గేణ' అనగా, కన్నీళ్లవహించు ధమనీమార్గముచేత నని యర్థము. ధమను లన గుండ్రనై స్థూలములుగను, సన్నగను, పొడుగుగ నుండి లోపల సన్నని రంధ్రము గల్గి వాతపిత్తాదుల వహించు నాడీరూపములైనవి. అందు "ద్వే చాశ్రువాహిన్యౌ" (సుశ్రుత. శారీర. అ. ౯) అని సుశ్రుతమున జెప్పిన ప్రకారము నేత్రములయందలి రెండు ధమనులు కన్నీళ్లువహించి స్రవింపజేయు చుండు నని యెఱుంగునది.

3. పూయాస్రావ లక్షణము

పాకస్సన్ధౌ సంస్రవేద్యస్తు పూయం పూయాస్రావోఽసౌగదస్సర్వజస్తు,

---

* దృష్టి యనగా నల్లగ్రుడ్డు మధ్య నుండు నల్లపూసవంటిభాగము. † ఇచ్చట సంధు లనగా నేత్రభాగమునం దంతట నుండు (కడపటి రెండుగాక) సంధులన్నియు జెప్పబడును.

కన్నులలోని సంధులయందు పుండై చీము గారుచున్నయెడ నయ్యది పూయా స్రావ మనబడును. ఈ రోగము త్రిదోషసన్నిపాతమున గల్గును. కావున మిక్కిలి యసాధ్యము.

## 4. శ్లేష్మాస్రావ లక్షణము

శ్వేతం సాన్ద్రం పిచ్ఛిలంయస్స్రవేత్తుశ్లేష్మాస్రావోఽసావికారోమతస్తు.

చిక్కనై పిచ్ఛిలంబును శ్వేతవర్ణంబు నగు కన్నీళ్లు స్రవించినయెడ నయ్యది శ్లేష్మాస్రావ మని చెప్పబడును.

## 5. రక్తాస్రావ లక్షణము

రక్తాస్రావశ్శోణితోత్థో వికారః స్రవేద్దుష్టం తత్ర రక్తం ప్రభూతమ్,

కన్నులయందలి సంధులనుండి రక్త మధికముగ దుష్టమై స్రవించినయెడ రక్తా స్రావ మనజను. ఈవ్యాధి రక్తమువలన గల్గును. ఇచ్చట వ్యాధియొక్క పేరు చేతనే ఈవ్యాధి రక్తమువలన గల్గిన దని తెలిసినను మరల "శోణితజః" అని చెప్పుటవలన నీ వ్యాధియందు రక్తము మిక్కిలి ప్రకోపమునొందు నని తెలిసెడి.

కొన్నిచోట్ల "రక్తస్రావః పిత్తలిఙ్గైరుపేతః" అని పాఠాంతరము గానవగును. ఈపక్షమున నీ రక్తస్రావరోగమున పిత్తలక్షణము లుండు నని తెలియుచున్నది.

## 6. పిత్తాస్రావము

హారిద్రాభం పీతముష్ణం జలాభం పిత్తాస్రావః సంస్రవేత్సన్ధిమధ్యాత్.

పీతరక్తవర్ణములు కలిసినరంగైనను పచ్చనిరంగైనను కల్గి నీళ్లవలె పలుచనై, వేడియైన స్రావము కంటిసంధులనుండి స్రవించిన నయ్యది పిత్తమున జనించిన స్రావ మని యెరుంగునది.

## 7. పర్వణికా లక్షణము

తామ్రా తన్వీ దాహశూలోపపన్నా
రక్తాజ్ఞేయా పర్వణీ వృత్తశోథా,
జాతా సన్ధౌ శుక్లకృష్ణే

నేత్రమునందలి శుక్లకృష్ణభాగముల (తెల్లగుడ్డునకును నల్లగుడ్డునకును నడుమ సంధిభాగమున) రక్తవర్ణంబును సూక్ష్మాకారంబును వర్తులంబునైన వాపుకల్గి నొప్పియు, మంటయు గల్గియుండును. ఇయ్యది పర్వణి యను వ్యాధి యనబడును.

దీని లక్షణమును విదేహుం డిట్లు చెప్పెను:—"శుక్లకృష్ణాంతసంధౌ తు చీయన్తేఽసృక్కఫానిలాః, పర్వణీ పిటికా తైస్తు జాయతే త్వఙ్కురోపమా,

తామ్రా సదాహచోషోష్ణపీతకాశ్రుసమాకులా" కంటిలో శుక్లకృష్ణభాగములకు నడుమనుండు సంధిలో రక్తకఫజాతములు సంచితములై యుండును. వానిచేత నచ్చోట అంకురమువలె నుండి తామ్రవర్ణమును కల్గిన బొబ్బ పుట్టును. దానంజేసి మంటయు చోషంబును కల్గును. వేడికల్గి పచ్చనిరంగుతోఁగూడిన కన్నీరుగారును. ఇయ్యది పర్వణి యనబడును అని భావము.

(ఈవాక్యముచేత పర్వణిక యనునది శుక్లకృష్ణభాగముల నడుమ నుండు సంధి మధ్యమున రక్తకఫవాతములచే గల్గు ననియు, మొలకలవలె సూక్ష్మాకారముగ నుండు ననియు తెలిసెడి.)

వాగ్భటాచార్యుడు దీనిలక్షణమును జెప్పునపుడు "తామ్రా ముద్గోపమా భిన్నా రక్తం స్రవతి పర్వణీ" (అ. హృ. ఉ. అ. ౧౦. శ్లో. ౫) అని చెప్పెను. ఈవాక్యమువలన నీవ్యాధి ఎఱ్ఱనికాంతికల్గి పెసలగింజవలె గుండ్రనైన బొబ్బకల్గుననియు, ఇది పగిలినపుడు రక్తము స్రవించు ననియు దెలిసెడి.

## 8. అలజీలక్షణము

అలజీ స్యాత్తస్మిన్నేవ ఖ్యాపితా పూర్వలిఙ్గైః. 74

పైజెప్పబడిన కృష్ణశుక్లసంధిభాగముననే బొబ్బకల్గి పైజెప్పబడిన పర్వణికా లక్షణముల గూడియున్నచో అలజి యనబడును.

విదేహు డలజీలక్షణము నిట్లు చెప్పెను:—"కఫపిత్తే తు సమ్మూర్ఛ్య సహ రక్తేనమారుత, శుక్లకృష్ణాంతసంధౌ తు జనయేద్గ్రోస్తనాకృతిమ్. పిటికా మలజీం తాం తు విద్ధి తోదాశ్రుసఙ్కులాం" (విదేహుడు) కఫపిత్తరక్తవాతములు నాల్గును ప్రకోపమునొంది నేత్రములలో తెల్లగ్రుడ్డునకును, నల్లగ్రుడ్డునకును నడుమ సంధిలో ద్రాక్ష పండువలె గుండ్రనైనబొబ్బ కల్గును. దానంజేసి పోటుపుట్టి కన్నీరువెడలును అని భావము. (దీనిచేత ద్రాక్షపండువలె గుండ్రముగ నుండుబొబ్బ కఫరక్తపిత్తవాతములచే గల్గిన నది అలజి యని యేర్పడుచున్నది.)

వాగ్భటాచార్యుడు—"కనీనస్యాంతరలజీ శోఫో రుక్తోదదాహవాన్" (అ. హృ. ఉ. ౧౦. శ్లో. ౮.) అని అలజీలక్షణమును జెప్పెను. ఈవాక్యముచేత కేవలము శోఫరూపమైనది అలజి యని తేలుచున్నది. పర్వణికాలజీలక్షణముల విషయమున మాధవకర-విదేహ-వాగ్భటమతములకు పరస్పరము కొంచెము భేదము గానవచ్చుచున్నది. కాని అన్నియు ప్రామాణికములగుటం జేసి మూడువిధములైన లక్షణములు వికల్పముగ గనబడునని యూహించునది.

## 9. క్రిమిగ్రన్థి లక్షణము

క్రిమిగ్రన్థిర్వర్త్మతః పక్ష్మతశ్చ కణ్డూం కుర్యుః క్రిమయస్సన్ధిజాతాః,
నానారూపావర్త్మశుక్లాన్తసన్ధౌ చరన్త్యన్తర్లోచనం దూషయన్తః. 75

కంటిలో రెప్పల లోభాగమునకు తెల్లగుడ్డునకును నడుమనుండు సంధియందు నానావిధములైన క్రిములుపుట్టి అమితముగ దురద బుట్టించును. అయ్యవి రెప్పవెండ్రుకలకును రెప్ప లోభాగమునకును నడుమనుండు సంధియందును వ్యాపించి కంటి లోభాగమును నానాట తినును. ఇయ్యది క్రిమిగ్రంథి యని చెప్పనగును. (ఇచ్చట 'చరన్తి' అనుచోట 'చర-భక్షణే' అను భక్షణార్థకమైన చరధాతువు కావున కంటి లోభాగమును తినుచుండు నని యర్థము.)

ఈవ్యాధిసంప్రాప్తిని లక్షణమును విదేహుడు సవిస్తరముగ నిట్లు చెప్పెను.—"వర్త్మశుక్లస్య సన్ధౌ తు గ్రన్థిః పిత్తకఫాత్మకః, ఊష్మణా పచ్యతే గాఢం తత్ర మూర్ఛన్తి జన్తవః. సుసూక్ష్మజాతచరణాః వర్త్మపక్ష్మసమాశ్రయాః, తతస్తే పూయసంసృష్టాః పతన్తి క్రిమయస్తథా. లక్షణైర్వివిధైర్యుక్తాః సన్నిపాతసముత్థితాః, క్రిమిగ్రన్థిం తు తం విద్యాత్ దేహినాం నేత్రదూషణమ్" కనురెప్ప లోభాగమునకును తెల్లగుడ్డునకు నడుమనుండు సంధిభాగమున పిత్తకఫములవలన గ్రంథిజనించి, శరీరమునందలి వేడిచే పచింపబడి యాగ్రంథియందు సూక్ష్మాకారములగు క్రిములు జనించును. అయ్యవి నానాట సూక్ష్మములగు కాళ్లుకల్గి కనురెప్పలకును, రెప్పవెండ్రుకలకును నడుమ సచరించుచు చీముతోగలిసి క్రిందబడును అయ్యవి సన్నిపాతమున జనించును. కావున నానావిధములగు త్రిదోషలక్షణములు కల్గియుండును. అయ్యది క్రిమిగ్రంథి యని చెప్పనగును. ఇది నానాట వృద్ధినొందినచో మనుజులనేత్రములను బొత్తుగ చెఱచును అని యర్థము.

(ఇత్తెరంగున పూయాలసము మొదలుజేసి చెప్పబడినరోగములు తొమ్మిదియు సంధిగత నేత్రరోగము లని యెఱుంగునది.)

## 1. వర్త్మగతరోగములు ఇరువదియొకటి, అందుత్సంగ పిటికాలక్షణము

అభ్యంతరముఖీ తామ్రా బాహ్యతో వర్త్మనశ్చ యా,
సోత్సఙ్గోత్సఙ్గపిటికా సర్వజా స్థూలకణ్డురా. 76

(వర్త్మ మన—నేత్రగోళమున కావరణమై కన్నుల దెరచుటకును మూయుటకును ఆశ్రయమైయుండు రెండుభాగములు వర్త్మములు (ఇవే కనురెప్పలు) దీని నాశ్రయించి సంభవించురోగములు వర్త్మరోగములు.)

కనురెప్పలలో నంతర్భాగముననే ముఖముకల్గి రక్తవర్ణంబై వెలుపలనున్నతంబైన బొబ్బ కలిగి మిగుల స్థూలంబై యమితముగ జిల కల్గియున్నయెడ నుత్సంగపిటిక యని చెప్పనగును. ఇయ్యది త్రిదోషసన్నిపాతమున గల్గును.

దీనిలక్షణమును విదేహు డింతకన్న విపులముగ నిట్లు చెప్పెను. "వర్త్మోత్సఙ్గే ధరేజన్తోస్సన్నిపాతాత్ప్రజాయతే, అభ్యంతరముఖీస్థూలా బాహ్యతశ్చాపి దృశ్యతే. పిటికా పిటికాభిశ్చ చితాన్యాభిస్సమన్తతః, ఉత్సఙ్గపిటికా నామ కఠినా మన్దవేదనా. సాప్రభిన్నా స్రవేత్స్రావం కుక్కుటాండరసోపమమ్" ఈవాక్యమువలన నుత్సంగ పిటిక యనునది కనురెప్పలోపల స్థూలంబును కఠినంబునై యొక బొబ్బలేచి ఇతరములగు సన్ననిబొబ్బలతో గూడియుండు ననియు, స్వల్పమైన వేదనకల్గి, కొంతకాలమునకు పగిలి కోడిగ్రుడ్డులోని రసమును బోలి చిక్కనైన చీముకారు ననియు దెలిసెడి.

మరియు వర్త్మరోగసామాన్యముగ గల్గు సంప్రాప్తి సుశ్రుతమున నిట్లు చెప్ప బడియె:—"పృథగ్దోషాస్సమస్తాశ్చ యదావర్త్మవ్యపాశ్రయాః, సిరా వ్యాప్యావతిష్ఠన్తే వర్త్మస్వధికముచ్ఛ్రితాః, వివర్ధ్య మాంసం రక్తం చ తదా వర్త్మవ్యపాశ్రయాన్, వికారాన్ జనయన్త్యాశు నామతస్తాన్నిబోధత." వాతాదిదోషములు వానివానికి ప్రత్యేకముగ జెప్పబడిన కారణములచేత ప్రకుపితములై వేరువేరుగనైనను, అన్నియు కలిసియైనను కనురెప్పలతో జేరిన సిరలయందు వ్యాపించి మిక్కిలి వృద్ధినొంది రక్తమాంసముల వృద్ధి నొందించి కనురెప్పల లోభాగము నాశ్రయించిన రోగముల గలిగించును అని యర్థము.

వాగ్భటాచార్యుడు దీనిసంప్రాప్తిని జెప్పుతరి—"ప్రాయః పిత్తానుసారిణః" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౧.) అని చెప్పెనుగాన నీవ్యాధులయందు పిత్తము ప్రధానముగ నుండునని యెరుంగునది.

## 2. కుంభికాలక్షణము

వర్త్మాన్తే పిటికా ధ్మాతాః భిద్యంతే చ స్రవన్తి చ,
*కుమ్భీకాబీజప్రతిమాః కుమ్భీకాస్సన్నిపాతజాః. 77

కనురెప్పల లోభాగమున కొనలయందు నేపాళపుగింజవలె నుబికియుండు బొబ్బలులేచి పగిలి చీము మొదలగునవి కారుచుండును. ఇయ్యవి కుంభీకము లనబడును.

* కుమ్భీకాబీజ మనగా—గచ్ఛదేశమునందుండెడి దానిమ్మపండ్లవంటి పండ్లు గల లతావిశేషము కుంభీక యనియు, దానిగింజకర్థ మనియు నది కొంచెము ఎచ్చు తగ్గుగా దానిమ్మగింజవలె నుండుననియు మధుకోశమున విజయరక్షితుడు వ్రాసెను.

ఇయ్యది సన్నిపాతముచే గల్గును. పగిలి లోపలిదోషము స్రవించి మరల తనంతనే యంటుకుచుండును.

## ౩. పోథకీలక్షణము

స్రావిణ్యః కణ్డురా గుర్వ్యో ర_క్తసర్షపసన్నిభాః,
రుజావత్యశ్చ పిటికాః పోథక్య ఇతి కీ_ర్తితాః. 78

కనురెప్పలలో నెఱ్ఱని యావాలవంటి సన్ననిబొబ్బలు లేచి జడములై మిక్కిలి నొప్పియు దురదయు కలిగి, చిక్కని కన్నీరు గార్చుచుండును. ఇయ్యది పోథకి యని చెప్పబడును.

వాగ్భటాచార్యుడు—"పోథక్యః పిటికాః శ్వేతాః సర్షపాభాః ఘనాః కఫాత్" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౯.) అని దీనిలక్షణమును జెప్పెను. కావున నీబొబ్బలు ఆవాలవలె సన్నవై తెల్లగ నుండు ననియు, అయ్యవి కఫమున గల్గు ననియు దెలిసెడి.

## ౪. వర్త్మశర్కరాలక్షణము

పిటికా యా ఖరా స్థూలా సూక్ష్మాభి రభిసంవృతా,
వర్త్మస్థా శర్కరా నామ స రోగో వర్త్మదూషకః. 79

కఠినంబై స్థూలమగుబొబ్బ పెద్దది యొకటి కంటిరెప్పలోపల లేచి, చిన్నవి యగు పొక్కు లనేకములతో గూడియుండును. ఇయ్యది వర్త్మ శర్కర యనబడును. ఇది కనురెప్పల బొత్తుగ జెరచును. (ఇది సున్నపురాయివలె కణకులు కలిగియుండుటం జేసి శర్కర యని చెప్పబడును.)

దీనిలక్షణమును విదేహు డిట్లు చెప్పెను:—"సుసూక్ష్మపిటికాకీర్ణా యా స్థూలా పిటికా ఖరా, జాయతే సన్నిపాతాత్తు వర్త్మ శర్కరికేతి సా" ఈవాక్యముచేత నీవ్యాధి సన్నిపాతమున గల్గు నని తెలిసెడి.

## ౫. అర్శోవర్త్మలక్షణము

ఏర్వారుబీజప్రతిమాః పిటికా మన్దవేదనాః,
శ్లక్ష్ణాః ఖరాశ్చ వర్త్మస్థాః తదర్శోవర్త్మ కీ_ర్త్యతే. 80

దోసవిత్తులవంటి యాకారముకలిగి నునుపుకల్గి కఠినంబులును, స్వల్పమైన బాధ కలిగినవియు నగు పొక్కులు కంటిరెప్పల లోపలకలిగిన నయ్యది యర్శోవర్త్మం బని చెప్పబడును.

"నీరుజా కఠినా వర్త్మపక్ష్మాన్తర్బాహ్యతోఽపి వా, పిటికా సన్నిపాతేనతదర్శో వర్త్మనిర్దిశేత్" (నిమి) అని తంత్రాంతరమునందుండుటంజేసి యీవ్యాధిసన్నిపాతముచే గల్గు నని తెలిసెడి. వాగ్భటాచార్యుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"అర్శోఽథి

మాంసం వర్త్మాన్తః స్తబ్ధం స్నిగ్ధం సదాహరుక్, రక్తం రక్తేన తత్స్రావి ఛిన్నంఛిన్నం చ వర్ధతే" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౧౩.) కనురెప్ప లోపలిభాగమున స్తంభించి స్నిగ్ధమైన దుర్మాంసము పుట్టి నొప్పియు, మంటయు కల్గును. రక్తముచే నిది కల్గును. రక్తమును గార్చుచుండును. అయ్యది మాటిమాటికి ఛేదించుచున్నను మరల నెదుగుచుండును. ఇయ్యది యర్శోవర్త్మ మనబడును అని యర్థము. ఈవాక్యముచేత నీవ్యాధి రక్తముచే గల్గు నని తెలిసెడి. (సన్నిపాతమున జనించు నని తంత్రాంతరమున జెప్పియున్నది గాన నీరెంటికి నేకవాక్యముచేత నీవ్యాధి సన్నిపాతముచే జనించినను రక్తము ప్రధానముగ నుండు నని యర్థము చెప్పుట సమంజసము)

### 6. శుష్కార్శోలక్షణము

దీర్ఘాఙ్కురః ఖరస్స్తబ్ధో దారుణోఽభ్యన్తరోద్భవః,
వ్యాధిరేషోఽభివిఖ్యాతః శుష్కార్శోనామ నామతః. 81

కనురెప్ప లోపలిభాగమున కఠినమై స్తంభించియుండు దీర్ఘమైన మాంసాంకురము కల్గును. ఇయ్యది శుష్కార్శస్సు అని చెప్పనగును. ఇది మిక్కిలి క్రూరమైనది.

"వర్త్మాభ్యన్తరగతం త్వర్శః శుష్కం స్థూలం చ దారుణమ్, జాయతే సన్నిపాతేన తచ్ఛుష్కార్శః ప్రకీర్తితమ్" అను విదేహవచనమునుబట్టి యీవ్యాధికూడ సన్నిపాతమున జనించు నని తెలియుచున్నది.

### 7. అఞ్జననామికాలక్షణము

దాహతోదవతీ తామ్రా పిటికా వర్త్మసమ్భవా,
మృద్వీ మన్దరుజా సూక్ష్మా జ్ఞేయా సాఽఞ్జననామికా. 82

కనురెప్పలోపల నెఱ్ఱనిరంగుకల్గి మెత్తనై చిన్నదియగు బొబ్బకల్గి, తీవ్రమైన మంటయు సూదులతో బొడిచినవిధముగ పోటును కల్గి, స్వల్పముగ నొప్పితో గూడియున్న నది అంజననామిక యనబడును.

దీనిలక్షణమును వాగ్భటాచార్యుడు విస్తరించి యిట్లు చెప్పెను:—"మధ్యే వా వర్త్మనోఽన్తే వా కణ్డూషారుగ్వతీ స్థిరా, ముద్గమాత్రాసృజా తామ్రా పిటికాఽఞ్జననామికా" (అ. హృ. ఉ. ౮. శ్లో. ౧౮.) కనురెప్పలోపల నడుమనైనను, కొనయందైనను పెసలగింజంత పరిమితికల యెఱ్ఱనిబొబ్బకల్గి దురదయు నొప్పియు మంటయుం కల్గి కఠినమై యున్నయెడ నయ్యది అంజననామిక యనబడును. ఈవ్యాధియు రక్త

ముచే గల్గును అని యర్థము. (ఈవాక్యముచేత నియ్యది పెసలగింజపరిమితికల్గి రక్తముచే గల్గు నని తెలిసెడి.)

### 8. బహులవర్త్మలక్షణము

వర్త్మోపచీయతే యస్య పిటికాభిస్సమన్తతః,
సవర్ణాభిస్థిరాభిశ్చ విద్యాద్బహులవర్త్మ తత్. 83

కనురెప్పలోపల దానికి సమానమైన రంగుకల్గి కఠినములైన బొబ్బ లనేకములు లేచి లోభాగమునం దంతట వ్యాపించిన నయ్యది బహుళవర్త్మ మనబడును. (ఈవ్యాధి సన్నిపాతమున గల్గును.)

### 9. వర్త్మబంధనలక్షణము

కణ్డూమతాల్పతోదేన వర్త్మశోథేన యో నరః,
న సమం ఛాదయేదక్షి యత్రాసౌ వర్త్మబన్ధనః. 84

కనురెప్పలో వాపు కల్గి మిక్కిలి దురదయు స్వల్పమైన పోటును కల్గి సాధారణముగ కన్నుమూయుటకు సాధ్యము కాకున్న యెడ నయ్యది వర్త్మబంధ మనబడును. (ఇదియు సన్నిపాతముచే గల్గును.)

### 10. క్లిష్టవర్త్మలక్షణము

మృద్వల్పవేదనం తామ్రం యద్వర్త్మ సమమేవ చ,
అకస్మాచ్చ భవేద్రక్తం క్లిష్టవర్త్మేతి తద్విదుః. 85

కంటియందలి క్రింది పైరెప్పలు రెండును సమకాలమున మృదువులును, కొంచెము బాధ కల్గినవియు, తామ్రవర్ణంబులును లేక రక్తవర్ణంబులునై యున్న యెడ నయ్యది క్లిష్టవర్త్మ మనబడును. (ఈవ్యాధి కారణము లేకయే తటాలున కల్గును)

దీనిలక్షణమును విదేహు డిట్లు చెప్పెను:—"శ్లేష్మ దుష్టేన రక్తేన క్లిష్టం మాంస మివోభయమ్, బన్ధుజీవనిభం వర్త్మ క్లిష్టవర్త్మ తదుచ్యతే" కఫరక్తములు రెండును ప్రకుపితములై కంటిలో రెప్పలరెంటి లోభాగమున మాంసమును మంకెన పువ్వులునుబోలె నెఱ్ఱనై మూయుటకును తెరచుటకును మిక్కిలి కష్టముగ నున్నయెడ క్లిష్టవర్త్మ మని చెప్పబడును.

ఈవచనమునుబట్టి యీవ్యాధి కఫరక్తములచే గల్గు ననియు, కనురెప్పలు రెండిటి యందును సమకాలమున గల్గు ననియు తెలిసెడి. దీనిని ఉత్క్లిష్టవర్త్మ మని వాగ్భటాచార్యులు చెప్పెను.

## 11. వర్త్మకర్దమ లక్షణము

క్లిష్టం పునః పిత్తయుతం శోణితం విదహేద్యదా,
తతః క్లిన్నత్వమాపన్నం ఉచ్యతే వర్త్మకర్దమః. 86

పైజెప్పిన క్లిష్ట మనువ్యాధియందు పిత్తము స్వకారణములచే వృద్ధినొంది రక్తమును పచింపజేసి కనురెప్పల లోభాగమున ద్రవము కల్గియుండును. ఇయ్యది వర్త్మకర్దమ మని చెప్పనగును.

వాగ్భటాచార్యుడు—"కృష్ణం తు కర్దమం కర్దమోపమమ్" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౧౮) అని చెప్పెను. పిత్తముచే రక్తము విదగ్ధమగుటంజేసి రెప్పల లోభాగము నల్లపడి బురదవలె చెమ్మగల్గియుండు నని యర్థము. ఈ యర్థము ననుసరించియే ప్రకృత మూలమున "తతః కృష్ణత్వమాపన్నం" అని పాఠాంతరమును కొందరు చెప్పెదరు.

## 12. శ్యావవర్త్మ లక్షణము

యద్వర్త్మ బాహ్యతోఽన్తశ్చ శ్యావం శూలం సవేదనమ్,
తదాహుశ్శ్యావవర్త్మేతి వర్త్మరోగవిశారదాః. 87

కనురెప్పల లోపలను వెలుపలను శ్యామవర్ణంబుకల్గి సూదులతో బొడిచినట్లు పోటును, నొప్పియు కల్గియున్నయెడ నయ్యది శ్యావవర్త్మ మనబడును.

వాగ్భటాచార్యుడు—"శ్యావవర్త్మ మలైస్సాస్త్రైః శ్యావం రుక్ క్లేదశోఫవత్" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౧౭.) అని చెప్పెను. కావున నీవ్యాధి రక్తముతో గూడిన త్రిదోషములచే గల్గు నని యెఱుంగునది. మరియు నీ వ్యాధియందు కనురెప్పలు వాచియుండు ననియు తెలిసెడి.

విదేహుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"దుష్టం శ్లేష్మ మరుత్పిత్తం వర్త్మనో శ్చీయతే యదా, అగ్నిదగ్ధనిభం శ్యావం శ్యావవర్త్మేతి తద్విదుః" ఈ వాక్యముచేత నీరోగమున కనురెప్పలు నిప్పున కాలినవిధముగ నల్లగ నుండుననియు, ఈవ్యాధి వాత-పిత్త-కఫములచే గల్గు ననియు తెలిసెడి.

## 13. ప్రక్లిన్నవర్త్మ లక్షణము

అరుజం బాహ్యతశ్శూనం వర్త్మ యస్య నరస్య హి,
ప్రక్లిన్నవర్త్మ తద్విద్యాత్ క్లిన్నమత్యర్థమన్తతః. 88

కనురెప్పల లోపలిభాగమున బాధలేకయే ఆర్ద్రమై రెప్పల పైభాగమున వాపు గల్గిన నయ్యది ప్రక్లిన్నవర్త్మ మని చెప్పబడును.

## 14. అక్లిన్నవర్త్మ లక్షణము

యస్య ధౌతాన్యధౌతాని సమ్బధ్యన్తే పునః పునః,
వర్త్మాన్యపరిపక్వాని విద్యాదక్లిన్నవర్త్మ తత్. 89

మనుజుల రెండు కండ్లయందలి రెప్పలన్నియు నీళ్ళ గడిగినను, గడగకున్నను ఒకటితోనొకటి మాటిమాటికి కరుచుకున్నయెడ నయ్యది యక్లిన్నవర్త్మ మని చెప్పబడును.

ఈ వ్యాధిలక్షణమును విదేహు డిట్లు చెప్పెను:—"ప్రక్షాళితేఽపి వాఽమృష్టే ఆనహ్యేత పునఃపునః, అపరిక్లిన్నవర్త్మేతి తత్పిల్లమితి నిర్దిశేత్." కనురెప్పలను కడిగినను కడగకున్నను, (పక్వములుగాక) మాటిమాటికి నొండొంట కరుచుకొనుచుండు నెడ నయ్యది అపరిక్లిన్నవర్త్మ మనియు, పిల్ల మనియు జెప్పబడును. ఈ వాక్యముచేత పిల్ల మనియు, నీ వ్యాధికి నామాంతరము కల దని తెలిసెడి. "వర్త్మాన్యపరిపక్వాని" అను బహువచన నిర్దేశముచేత నీ వ్యాధి రెండు కన్నులయందును సమకాలమున జనించు నని తెలిసెడి.

## 15. వాతహతవర్త్మ లక్షణము

విముక్తసన్ధినిశ్చేష్టం వర్త్మ యస్య న మీల్యతే,
ఏతద్వాతహతం వర్త్మ జానీయాదక్షిచిన్తకః. 90

కనురెప్పల లోభాగమునకు తెల్లగ్రుడ్డునకును నడుమ నుండు సంధియందలి సిరలు సడలి, రెప్పలు మూయుటకును తెరచుటకును కదలించుటకును వలనుపడక యుండును. అట్టియెడ కన్నుమూయుటకు బొత్తుగ సాధ్యము గాకుండును. ఈ వ్యాధి వాతహత వర్త్మ మని చెప్పబడును.

దీనిలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"వర్త్మ యత్తు నిమీల్యతే, విముక్తసంధినిశ్చేష్టం హీనం వాతహతం హి తత్" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౫) వర్త్మసంధి సడలి చలనాదివ్యాపారములు దక్కి నిశ్చేష్టంబై కన్ను మూతపడి తెరచుటకు సాధ్యముగాకున్నయెడ నయ్యది వాతహతవర్త్మ మనంబడు. ఈ వాక్యమునుబట్టి కన్ను మూతపడియుండునని తెలిసెడి. ఈ వచనానుసారముగ ప్రకృతగ్రంధమున "వర్త్మయస్య నిమీల్యతే" అను పాఠాంతరమును కొందరు పఠించెదరు. (ఈ పాఠాంతరము అనుభవమునకు సరిగనున్నది కావున సమంజసము.) దీనిని సుశ్రుతాచార్యుడు అసాధ్య ప్రకరణమున పఠించెనుగాన నియ్యది యసాధ్య మని తెలియునది.

## 16. అర్బుద లక్షణము

వర్త్మాన్తరస్థ విషమం గ్రన్థిభూతమవేదనమ్,
ఆచక్షీతార్బుదమితి సరక్తమవిలమ్బితమ్. 91

రెప్పల లోప్రక్క స్వల్పమైన బాధతో గూడి యెఱ్ఱనై గ్రంథివలె నున్నతమైన వాపు విషమముగ జనించినయెడ నయ్యది యర్బుద మని చెప్పబడును. ఇయ్యది అతిశీఘ్రముగ జనించును. "సాస్రైస్స్యాదర్బుదో దోషైః" (అ. హృ. ఉ. అ. ౧. శ్లో. ౨౮.) అని వాగ్భటుడు చెప్పెనుగాన నిది రక్తముతోగూడిన సన్నిపాతముచే జనించును.

## 17. నిమేషలక్షణము

నిమేషిణీస్సిరా వాయుః ప్రవిష్టః సన్ధిసంశ్రయాః,
చాలయత్యతివర్త్మాని నిమేషం నామ తద్విదుః. 92

కన్ను రెప్పలయందలి నిమేషమును కల్గించు సిరలను వాతము ప్రకుపితమై ప్రవేశించి కనురెప్పలను మాటిమాటికి చలింపజేయును. ఇయ్యది నిమేష మను వ్యాధి యని యెరుంగునది.

మరియు వాగ్భటాచార్యుడు "చాలయన్ వర్త్మనీ వాయుః నిమేషోన్మేషణాం ముహుః, కరోత్యరుక్ నిమేషోఽసౌ" (అ. హృ. ఉ. అ. ౧. శ్లో. ౫.) అని నిమేష లక్షణమును జెప్పెను. ఈ వాక్యముచేత వాతము ప్రకుపితమై కనురెప్పలయందలి సిరలను జేరి మాటిమాటికిని కదలించు ననియు, ఈ వ్యాధియందు ఏ విధమైన బాధయు కల్గదనియు తెలిసెడి. (ఈవ్యాధి వాతముచే గల్గును.)

మరియు "ఉన్మేషణీస్సిరావాయుః ప్రవిశ్యచావతిష్ఠతే, అత్యర్థం చాలయేద్వర్త్మ నిమేషస్స నిగద్యతే" అని చక్షుష్యుడు చెప్పెను. ఈవాక్యమునుబట్టి వాతము ఉన్మేషమును కల్గించు సిరలయందుచేరి నిమేషవ్యాధిని కల్గించు నని తెలిసెడి.

## 18. రక్తార్శోలక్షణము

యస్థ్సితో వర్త్మమధ్యే తు లోహితో మృదురఙ్కురః,
తద్రక్తజం శోణితార్శశ్ఛిన్నం ఛిన్నం ప్రవర్ధతే. 93

కనురెప్ప లోభాగమున నడుమ నెఱ్ఱనై మెత్తనై మాంసాంకురము పుట్టును. ఇది రక్తముచే జనించిన యర్శస్సని చెప్పబడును. దీనిని శస్త్రముచే మాటిమాటికి ఛేదించినను వృద్ధినొందును,

మరియు రక్తార్శోలక్షణమును, సంప్రాప్తిని విదేహు డిట్లు చెప్పెను.—"వాయు శ్శోణితమాదాయ సిరాణాం ప్రముఖే స్థితః, జనయత్యఙ్కురం తామ్రం వర్త్మని భిన్నరోహణమ్, తచ్ఛోణితార్శోఽసాధ్యం స్యాత్ రక్తస్రావ్యథ నీరుజమ్" వాతము రక్తమును కలిసి కన్నులలోని సిరలను వ్యాపించి యెఱ్ఱనైన మాంసాఙ్కురమును రెప్ప

లోపలి భాగమున కల్గించును. ఇయ్యది బాధలేక రక్తమును స్రవించును. దీనిని ఛేదించినను పలుమారు అంకురించుచుండును. ఇది యసాధ్యము. (ఈ వాక్యముచేత నీవ్యాధి వాత రక్తములచే గల్గు నని యెరుంగునది.)

## 19. నగణలక్షణము

అపాకీ కఠినస్థూలః గ్రన్థిర్వర్త్మభవోఽరుజః,
నగణో నామ స వ్యాధిః లిఙ్గతః పరికీర్తితః. 94

కనురెప్ప పైప్రక్క కఠినంబును, స్థూలంబును, పక్వముకాని స్వభావము కల్గినదియు నగు గ్రంథి జనించినచో నయ్యది నగణ మనబడును. ఈవ్యాధియందు ఏవిధమైన బాధయు కలుగదు.

మరియు—"వర్త్మోపరిష్టాద్యో గ్రన్థిః కఠినో న విపచ్యతే, నీరుజో నగణో నామ రోగః శ్లేష్మసముద్భవః" అని తంత్రాంతరమున నగణలక్షణము చెప్పబడినది. ఈ వాక్యముచేత నీవ్యాధి కఫముచే జనించు నని యెరుంగునది. కావుననే యిది పక్వముగాక కఠినమై బాధ లేకుండును. వాగ్భటాచార్యుడు "కోలమాత్రస్స లగణః" (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౧౧.) అని చెప్పెనుగాన, ఈవ్యాధికి లగణ మనియు నామాంతరము కలదు.

## 20. బిసవర్త్మలక్షణము

త్రయో దోషా బహిశ్శోథం కుర్యుశ్ఛిద్రాణి వర్త్మనోః,
ప్రస్రవన్త్యన్తరుదకం బిసవద్బిసవర్త్మ తత్. 95

వాత-పిత్త-కఫములు మూడును సమకాలమున ప్రకుపితములై కనురెప్పల పైభాగమున వాపుగల్గించును. ఆవాపువ క్రింద కనురెప్ప లోప్రక్క సన్నని రంధ్రములు తామరకాడలకువలె పుట్టును. తామరకాండలరంధ్రములనుండి నీరు కారువిధముగ నారంధ్రముల నుండి నీరు స్రవించును. ఇయ్యది బిసవర్త్మ మనబడును.

"బిసస్యాపాచితస్యేవ బహుమాంససిరాముఖమ్, బిసవర్త్మేతి జానీయాద్దుశ్చికిత్స్యం త్రిదోషజమ్" అని తంత్రాంతరమున నుండుటంజేసి యీవ్యాధి త్రిదోషమున జనించుటంజేసి చికిత్స కసాధ్యం బని యెరుంగునది. వాగ్భటాదులు కూడ దీనిని సన్నిపాతమున జనించినది యనియే చెప్పిరి.

## కుంచితలక్షణము

వాతాద్యా వర్త్మసఙ్కోచం జనయన్తి మలా యదా,
తదా ద్రష్టుం న శక్నోతి కుఞ్చితం నామ తద్విదుః. 96

వాత-పిత్త-కఫములు మూడును ప్రకోపమునొంది కనురెప్పల లోప్రక్క జేరి యాభాగమును ముడుచుకొనునట్లు చేయును. అట్టియెడ మనుజుడు చూచుటకు సాధ్యముగాక బాధపడుచుండును. ఇయ్యది కుంచిత మని చెప్పబడును.

సుశ్రుతమున నీవ్యాధిలక్షణంబును, క్రింద జెప్పబడు పక్ష్మశాతలక్షణంబును గానరాదు. పక్ష్మశాతలక్షణము మాత్రము వాగ్భటమున నున్నది. సుశ్రుతాచార్యుడు ఈరెంటిని దూరం బుచ్చియే "ఏకవింశతిరిత్యేతే వికారా వర్త్మసంశ్రయాః" అని వర్త్మగతరోగములు ఇరువదియొకటి యని పరిగణనముచేసి వానిలక్షణముల జెప్పెను. మాధవకరుడును సంగ్రహరూపమగు నీగ్రంథమున సుశ్రుతమతము నవలంబించియే యిరువదియొక వర్త్మగతరోగముల నిరూపించుతరి, సుశ్రుతమున జెప్పబడని యీరెండిటిని జెప్పుట సమంజసముగాక సంఖ్యాతీతముగ నుండును. ఐనను వాగ్భటాదులయం దుండుటంజేసి యీరెంటినిగూడ సంగ్రహించెనని యూహింపదగియున్నది.

## 21. పక్ష్మకోపలక్షణము

ప్రచాలితాని వాతేన పక్ష్మాణ్యక్షి విశన్తి హి,
ఘృష్యన్త్యక్షి ముహుస్తాని సంరమ్భం జనయన్తి చ. 97
అసితే సితభాగే చ మూలకోశాత్పతన్త్యపి,
పక్ష్మకోపస్స విజ్ఞేయో వ్యాధిః పరమదారుణః. 98

కనురెప్పవెండ్రుకలు వాతముచే స్వస్థానమునుండి చలింపఁబడి కంటిలో ప్రవేశించును. ఆవెంత్రుకలు కంటిలో తెల్లగ్రుడ్డునందును, నల్లగ్రుడ్డునందును పలుమారు ఒరయుటచేత వాపుకల్గును. ఆవెంట్రుకలు రెప్పలతో గూడి కంటిలో జారబడి గ్రుచ్చుకొనును. ఇయ్యది పక్ష్మకోప మని చెప్పనగును. ఈవ్యాధి మిక్కిలి క్రూరమైనది.

దీనిసంప్రాప్తిని లక్షణమును సుశ్రుతాచార్యుడు విస్తరముగ నిట్లు చెప్పెను:—"పక్ష్మాశయగతా దోషాః తీక్ష్ణాగ్రాణి ఖరాణి చ, నిర్వర్తయన్తి పక్ష్మాణి తైర్ఘృష్టం చాక్షి దూయతే. ఉత్పాటితైః పునశ్శాన్తిః పక్ష్మాభిశ్చోపజాయతే, వాతాతపానల ద్వేషీ పక్ష్మకోపస్స ఉచ్యతే." వాత-పిత్త-కఫములు ప్రకోపమునొంది కనురెప్పలకోశమున జేరి, వాడియైన కొసలుగల్గి కఠినములైన రెప్పవెండ్రుకలను రెప్పలలోనలయందు బుట్టించును. అవి కంటిలోపల ప్రవేశించి గ్రుచ్చుకొనుటచేత కంటిలో నొరసికొని నొప్పి మొదలగు బాధలు విశేషముగ గల్గును. గాలిని ఎండను నిప్పును కంటితో జూడ శక్యముగాక కష్టముగ నుండును. ఆరెప్పల నూడదీసినయెడ కొంచెము బాధ శమించును. ఇయ్యది పక్ష్మకోప మను క్రూరమైనవ్యాధి.

ఈవాక్యముచేత నీవ్యాధి సన్నిపాతమున జనించు నని తెలిసెడి. ప్రకృతమూలమున "ప్రచాలితాని వాతేన" అనుచోట వెండ్రుకల చలింపజేయుపని మాత్రము వాతమునకు సంబంధించిన దని యర్థము గాన, నొప్పి పోటు మున్నగునవి త్రిదోషములచే గల్గునని యర్థము. కావున పైవాక్యమునకు విరోధము లేదు.

మరియు పక్ష్మోపరోధము ఉపపక్ష్మము అను వ్యాధులలక్షణము కల్యాణవినిశ్చయంబున నిట్లు చెప్పబడెను:—"పక్ష్మోపరోధో వాతేన కోశోఽన్తర్ముఖ రోగవాన్, రోమైరన్తర్ముఖైరన్యైరుపపక్ష్మ మలైస్త్రిభిః" వాతముచేత కనురెప్ప లోభాగమునం దంతర్ముఖంబైన బొబ్బ కల్గి రెప్పవెండ్రుకల నడ్డగించిన నయ్యది పక్ష్మోపరోధము. కనురెప్పల లోప్రక్క క్రిందిముఖములుగ వెండ్రుకలు సూక్ష్మములుగ గల్గిన నయ్యది యుపపక్ష్మ మనంజను. ఇయ్యది త్రిదోషసన్నిపాతమున గల్గును. (దీనినే కంటిలో జుట్టు పెరిగిన దని లోకమున జెప్పెదరు.)

## పక్ష్మశాతలక్షణము

వర్త్మపక్ష్మాశయగతం పిత్తం రోమాణి శాతయేత్,
కణ్డూం దాహం చ కురుతే పక్ష్మశాతం తమాదిశేత్. 99

పిత్తము ప్రకోపమునొంది కనురెప్పల లోప్రక్కను రెప్పవెండ్రుకల మొదళ్ళయందును చేరి రెప్పవెండ్రుకల నూడించును. దానంజేసి దురదయు మంటయు విశేషముగ కల్గును. ఇయ్యది పక్ష్మశాతం బనఁజను.

పక్ష్మశాతలక్షణమును వాగ్భటాచార్యుడు ఇట్లు చెప్పెను:—"కరోతి కండూం దాహం చ పిత్తం పక్ష్మాంతమాస్థితమ్, పక్ష్మణాం శాతనం చాను పక్ష్మశాతం వదంతి తమ్." (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౮) ఇచ్చట "శాతనంచాను" అని చెప్పుటవలన రెప్పల యంచులయందు పిత్తముచేరి తొలుత మంటను జిలను కల్గించి, పిమ్మట వెండ్రుకల నూడించు నని తెలిసెడి.

ఇత్తెరంగున కుంచితపక్ష్మశాతంబు లను రెండు వ్యాధులుదక్క, తక్కినవన్నియుం గూడి యిరువదియొక్క వర్త్మగతరోగములును సుశ్రుతమతము ననుసరించి చెప్పబడియె. వాగ్భటాచార్యుడు మాత్రము పై జెప్పిన యానుపూర్విలో కొన్నిటిని కడకుంబుచ్చి కొన్నిటి నధికముగ జేర్చి "చతుర్వింశతి రిత్యేతే వ్యాధయో వర్త్మసంశ్రయాః". (అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౨౫.) అను వాక్యముచేత వర్త్మగతరోగములు ఇరువది నాల్గుగ చెప్పెను. అందు కృచ్ఛ్రోన్మీలన మిట్లు చెప్పబడియె:—"చలస్తత్ర ప్రాప్య వర్త్మాశయాన్సిరాః, సుప్తోత్థితస్య కురుతే వర్త్మస్తమ్భం సవేదనమ్, పాంసుపూర్ణాభనేత్రత్వం కృచ్ఛ్రోన్మీలనమశ్రు చ, విమర్దనాత్స్వాచ్చ శమః కృచ్ఛ్రోన్మీలం వదన్తి తమ్"

(అ. హృ. ఉ. అ. ౮. శ్లో. ౪) వాతము ప్రకుపితమై కనురెప్పల లోప్రక్కనుండు సిరలజేరి మనుజుడు నిదురమేల్కాంచినపుడు కనురెప్పల స్తంభింపజేయును. నొప్పితో గూడి రెప్ప లొండొంటి కరచుకొని కంటిలో నిసుక నిండియున్నట్లు మెరమెరలాడుచు బాధకల్గి, కన్నులు తెరువ శక్యముగాక నీరుకారుచుండును. కంటిని మర్దించిన శమించును. ఇయ్యది కృచ్ఛ్రోన్మీల మనబడు నని భావము. తక్కిన వ్యాధులలక్షణములు విస్తరభీతి చే నిట వివరింపబడవయ్యె.

## నేత్రరోగపరిగణనము

(నవ సన్ధ్యాశ్రయా స్తేషు, వర్త్మజా స్త్వేకవింశతిః;
శుక్లభాగే దశైకశ్చ, చత్వారః కృష్ణభాగజాః,
సర్వాశ్రయాస్సప్తదశ, దృష్టిజా ద్వాదశైవ తు,
బాహ్యజౌ ద్వౌ సమాఖ్యాతౌ రోగౌ పరమదారుణౌ;
భూయ ఏతాన్ ప్రవక్ష్యామి సంఖ్యారూపచికిత్సితైః.)

పైజెప్పిన నేత్రరోగములలో సంధిగతములు తొమ్మిది, వర్త్మగతములు ఇరువదియొకటి, శుక్లభాగమున జనించునవి పదునొకండు, కృష్ణభాగమున బుట్టునవి నాల్గు, సర్వగతరోగములు పదునేడు, దృష్టిలో బుట్టునవి పండ్రెండు, బాహ్యజ (ఆగంతుక) ములు రెండు ఇవియన్నియు కలిసి నేత్రరోగములు డెబ్బదియారు. (ఈపరిగణనము సుశ్రుతమున నున్నది. సుశ్రుతమతానుసారముగ మాధవకరుడును డెబ్బదియారు నేత్ర రోగముల లక్షణముల వివరించెను.)

పై జెప్పిన పరిగణనశ్లోకములకు వ్యాఖ్యాత లెవరును వ్యాఖ్య జేసియుండలేదు. కావున సుశ్రుతమునుండి సంగ్రహించి ప్రక్షిప్తముగ నుండునుగాని మాధవకరరచితముగ గాన్పింపదు.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
నేత్రరోగనిదానం సమాప్తమ్.

# ౬౦. శిరోరోగనిదానమ్

శిరస్సు నేత్రములకును, చెవులకును, ముక్కునకును, ముఖమునకును ఆశ్రయమై యుండును. కావున అట్టి నేత్రాదులకు సంబంధించినరోగముల జెప్పిన పిదప వానికి ప్రధానాశ్రయమైన శిరస్సుకు సంబంధించిన రోగముల నిదానమును జెప్పుట. (శిరోరోగ మన శిరస్సున గల్గు శూలరూప మైనబాధ.)

## శిరోరోగభేదములు

శిరోరోగాస్తు జాయంతే వాతపిత్తకఫైస్త్రిభిః,
సన్నిపాతేన రక్తేన క్షయేణ క్రిమిభిస్తథా,
సూర్యావర్తానన్తవాతార్ధావభేదకశఙ్ఖకైః. 1

శిరోరోగములు వాత-పిత్త-కఫములు మూడిటిలో నొక్కొకదానిచేతను, సన్నిపాతముచేతను, రక్తముచేతను, క్షయముచేతను, క్రిములచేతను వేర్వేర జనించుననియు; సూర్యావర్తము,అనంతవాతంబును, అర్ధావభేదకంబును, శంఖకంబును కలిసి పదునొకండు విధము లగును.

మరియు—"సర్వ ఏవ శిరోరోగా స్సన్నిపాతసముత్థితాః, ఔత్కట్యాద్దోషలిఙ్గైస్తే కీర్తితాస్తద్విదా దశ" అని తంత్రాంతరమున నున్నది. కావున శిరోరోగము లన్నియు సన్నిపాతముచేతనే కల్గును. కాని అందున త్రిదోషములలో నేదోష మెక్కుడుగ నుండునో ఆశిరోరోగము ఆదోషమున గల్గిన దని వ్యవహరింపబడును అని యెరుంగునది.

ప్రకృతగ్రంథమున "వాతపిత్తకఫైస్త్రిభిః, సన్నిపాతేన" అనుచోట వాతపిత్తకఫములు మూటిచే శిరోరోగము కల్గు ననియు, అందు వాతం బధికమగునెడ వాతికం బనియు, పిత్తం బధికమైనది పైత్తికం బనియు, కఫం బధికమైనది శ్లైష్మికం బనియు, మూడును సమములుగ ప్రకోపించి కల్గిన నది సాన్నిపాతిక మనియు నర్థము నెరుంగునది.

మరియు వాగ్భటాచార్యుడు శిరోరోగములు జనించుటకు కారణముల నిట్లు చెప్పెను:— "ధూమాతపతుషారామ్బుక్రీడాతిస్వప్నజాగరైః, ఉత్స్వేదాదిపురోవాత బాష్పనిగ్రహరోదనైః. అత్యంబుమద్యపానేన క్రిమిభిర్వేగధారణైః, ఉపధానమృజాభ్యఙ్గద్వేషాధః ప్రతతేక్షణైః, అసాత్మ్యగన్ధ దుష్టామ

భాష్యాద్యైశ్చ శిరోగతాః, జనయన్త్యామయాన్ దోషాః" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧-౩) పొగయందును, ఎండయందును విశేషముగ నుండుట, మంచులో నుండుట, ఉదకమునందు విశేషముగ మునుగుట, అధికముగ నిద్రపోవుట, లేక అధికముగ నిదుర మేల్కొంచియుండుట, శరీరమున చెమట నధికముగ వెడలించుట, తూర్పుగాలిని విశేషముగ సేవించుట, కన్నీళ్లు వెడల నున్నపుడు వెడలనీయక దాని నడ్డగించుట, అధికముగ నేడ్చుట, ఉదకమును మద్యమును అధికముగ త్రాగుట, క్రిములు పుట్టుట, మలమూత్రవాతాదివేగముల వెడలనీయక యడ్డుపరచుట, తలగడ నుంచుకొనుట యందును-శరీరమును శుభ్రపరచి తోముటయందును-అభ్యంజనము జేసికొనుటయందును ద్వేషముకల్గి వానిని చేయకుండుట, కన్నులచెరచి క్రింద విశేషముగ జూచుట, తన కలవాటులేని గంధమును మూర్కొనుట, చెడినయన్నమును పక్వముగాని యన్నమును భుజించుట, అధికముగ మాటలాడుట ఇవి మున్నగు కారణములచేత వాతాదిదోషములు ప్రకోపమునొంది శిరంబునజేరి శిరోరోగముల గల్గించును.

### 1. వాతికశిరోరోగ లక్షణము

యస్యానిమిత్తం శిరసో రుజశ్చ భవన్తి తీవ్రా నిశి చాతిమాత్రమ్,
బన్ధోపతాపైః ప్రశమశ్చ యత్ర శిరోఽభితాప స్స సమీరణేన. 2

వాతప్రకోపమున గల్గిన శిరోరోగమునందు కారణము లేకయే తలయందు మిక్కిలి తీవ్రమైన నొప్పికల్గి పగలు సామాన్యముగ నుండి రాత్రులయందు అంత కన్న తీవ్రముగ నుండును. కట్టుగట్టుటచేతను, వేడిగ కాచినను కొంచెము శాంతి నొందును. (రాత్రులయందు శీతం బధికమగుటంజేసి వాతము ప్రబలముగ నుండును; కావున అట్టివేళల బాధ యధికముగ నున్నచో వాతజ శిరోరోగ మని యెరుంగునది.)

మరియు "మార్దవం మర్దనస్నేహస్వేదబన్ధైశ్చ జాయతే" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౭.) అని వాగ్భటమున నున్నదిగాన పిసికినను, అభ్యంజనము చేసికొనినను, చెమటపుట్టించినను కొంచెము శాంతి నొందినచో నయ్యది వాతముచే గల్గిన శిరోరోగ మని యెరుంగునది. (ఇచ్చట మర్దనాదులు వాతజ శిరోరోగమున కుపశయం బని భావము.)

### 2. పైత్తిక శిరోరోగ లక్షణము

యస్యోష్ణమఙ్గారచితం యథైవ భవేచ్ఛిరో ధూప్యతి చాక్షినాసమ్,
శీతేన రాత్రౌ చ భవేచ్ఛమశ్చ శిరోఽభితాపస్స తు పిత్తకోపాత్. 3

పిత్తప్రకోపమువలన గలిగిన శిరోరోగమునందు నిప్పులచే గాచబడినవిధముగ తల మిక్కిలి వేడిగ నుండును. కన్నులనుండియు ముక్కులనుండియు పొగ వెడలునట్లు

వేడిగ నుండును. రాత్రులయందు స్వభావముచేతనే చల్లగ నుండును. కావున అట్టి చల్లదనముచేత నుష్ణప్రధానమైన పిత్తము శాంతమగుటంజేసి దానజనించిన శిరోరోగంబును కొంచెము శాంతముగ నుండును.

### 3. కఫజ శిరోరోగ లక్షణము

శిరో భవేద్యస్య కఫోపదిగ్ధం గురు ప్రతిష్టబ్ధమథో హిమం చ,
శూనాక్షికూటం వదనంచ యస్య శిరోఽభితాపస్స కఫప్రకోపాత్. 4

కఫప్రకోపమున గల్గిన శిరోరోగమునందు శిరస్సు కఫముచే నిండి చాల బరువుగ నుండును. తల స్తంభించి చల్లగ నుండును. రెండుకన్నుల నడుమను ముఖంబును ఉబ్బియుండును. (ఇట్టి లక్షణములు కల్గినది కఫమున జనించిన తలనొప్పి యని యెరుంగునది.)

మరియు వాగ్భటాచార్యుడు—"రుజ్మన్దాఽహ్న్యధికానిశి" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧౧.) అని చెప్పెను ; కావున పగలు నొప్పి కొంచెమై రాత్రులయందు మిక్కిలి తీవ్రముగ నుండు నని యెరుంగునది. (పగటిపూట సూర్యునితాపముచే కఫము కొంచెము శాంతమగును. కావున దానం జనించిన తలనొప్పి కొంచెము శాంతమగు ననియు, రాత్రులయందు చల్లదన మధికమగుటవలన కఫము ప్రబలముగ నుండును. కావున తలనొప్పియు బలిష్ఠముగ నుండు ననియు భావము.)

### 4. సాన్నిపాతిక శిరోరోగ లక్షణము

శిరోఽభితాపే త్రితయప్రవృత్తే సర్వాణి లిఙ్గాని సముద్భవన్తి,

వాత-పిత్త-కఫములు మూడును సమములుగ ప్రకోపించి కల్గిన తలనొప్పి సన్నిపాతజ శిరోరోగము. ఈవ్యాధియందు వాతాదులకు వేరువేరుగ జెప్పినలక్షణములన్నియు కల్గును.

సాన్నిపాతిక శిరోరోగ లక్షణములను తంత్రాంతరమునం దిట్లు వివరించెను:—
"వాతాచ్ఛూలం భ్రమః కమ్పః పిత్తాద్దాహో మదస్తృషా, కఫాద్గురుత్వం తన్ద్రా చ శిరోరోగే త్రిదోషజే." త్రిదోషములును ప్రకోపించుటచే గలిగిన శిరోరోగమున వాతముచేత నొప్పియు, భ్రమంబును, కఫంబును కల్గును. పిత్తముచేత వేడియు, ఉమ్మెత్తకాయ తిన్నవానివలె తిక్కయు, దప్పియు కల్గును. కఫముచేత తలబరువును కునికిపాటును (పైజెప్పిన లక్షణములన్నియు కల్గియున్నచో త్రిదోషజ శిరోరోగమని యెరుంగునది.)

### 5. రక్తజ శిరోరోగ లక్షణము

రక్తాత్మకః పిత్తసమానలిఙ్గః స్పర్శాసహత్వం శిరసో భవేచ్చ. 5

రక్తముచే గల్గిన శిరోరోగము పిత్తజశిరోరోగమున జెప్పిన శిరస్తాపము మున్నగులక్షణములు కలిగియుండును. మరియు తలను తాకిన నోరువజాలకుండును.

### 6. క్షయజశిరోరోగ సంప్రాప్తిలక్షణము

అసృగ్వసాశ్లేష్మసమీరణానాం శిరోగతానామిహ సంక్షయేణ,
క్షయప్రవృత్తశ్శిరసోఽభితాపః కష్టో భవేదుగ్రరుజోఽతిమాత్రమ్,
సంస్వేదనచ్ఛర్దనధూమనస్యైః అసృగ్విమోక్షైశ్చ వివృద్ధిమేతి. 6

శిరస్సున నుండు రక్తంబును, వసయు, శ్లేష్మంబును, వాతంబును క్షీణించినయెడ దానంజేసి తలనొప్పి కలుగును. ఇది క్షయమున జనించిన శిరోరోగము. ఈవ్యాధియందు మిక్కిలి తీవ్రమైననొప్పి కలుగును. కావున నిది మిక్కిలి కష్టమును కలిగించును. ఈతలనొప్పి చెమట దీయుటచేతను, వమనము చేయించుటచేతను, ధూమపానముచేతను, నస్యముచేతను, రక్తమోచనముచేతను మిక్కిలి ప్రబలముగ వృద్ధినొందును. (ఇది యీవ్యాధి కనుపశయ మని తెలియవలెను.)

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—రక్తము వస కఫము వాతము ఇవి నశించుటంజేసి కలిగినది క్షయజశిరోరోగము. కావున నట్టిరక్తాదుల వృద్ధినొందించు చికిత్స జేయుట యుచితము కాని, వానిని నశింపజేయు చికిత్స జేసినచో మిక్కిలి వ్యాధి వృద్ధినొందును. కావున నిచ్చట స్వేదనము వమనము ధూమము నస్యము అనువానిచేత కఫము క్షీణించును. ధూమముచేత వస క్షీణించును. రక్తమోచనముచేత రక్తము క్షీణించును. కావున రక్తాదులను క్షీణింపజేయు చికిత్సలన్నియు నీశిరోరోగమును వృద్ధినొందించును. ఈవిషయమునే సామాన్యముగ "క్షీణావర్ధయితవ్యాః" (సుశ్రుత. చి. అ. 33.) అని సుశ్రుతమున చెప్పబడినది.

మరియు తంత్రాంతరమున దీనిలక్షణ మిట్లున్నది:—"స్త్రీప్రసఙ్గాదభిఘాతాత్ అథవా దేహకర్మణా, క్షిప్రం సఞ్జాయతే కృచ్ఛ్రః శిరోరోగః క్షయాత్మకః, వాతపిత్తాత్మకం లిఙ్గం వ్యామిశ్రం తత్ర లక్షయేత్" (చతుష్ప్యుడు) తన బలమునకు మిక్కుటముగ సంభోగము చేయుట, ఆయుధాదులచే నభిఘాతము కలుగుట, బలమునకు మిక్కుటముగ శరీరపరిశ్రమము చేయుట, ఇట్టికారణములచేత శిరస్సునందలి రక్తాదులు క్షీణించినయెడ నట్టి క్షయ కారణమైన శిరోరోగము శీఘ్రముగ గలుగును. ఈవ్యాధియందు వాతపిత్తములచే గలిగిన శిరోరోగములకు జెప్పినలక్షణములు మిశ్రములై యుండును.

విదేహుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"శూన్యం భ్రమతి ఉద్యేత శిరోవిభ్రాన్తనేత్రతా, మూర్ఛాగాత్రావసాదశ్చ శిరోరోగే క్షయాత్మకే" క్షయమున గలిగిన శిరోరోగమున కన్నులకేమియు దెలియక తలదిరుగుచుండును. తల

యందు సూదులతో బొడిచినవిధముగ పోటుపుట్టును. తలయు కన్నులును తిరుగునట్లుండును. మూర్ఛకల్గును. అవయవములు శిథిలములై పనులుచేయుటకు సమర్థములు కాకుండును అని భావము.

## 7. క్రిమిజశిరోరోగలక్షణము

నిస్తుద్యతే యస్య శిరోఽతిమాత్రం
సమ్భక్ష్యమాణం స్ఫురతీవ చాన్తః,
ఘ్రాణాచ్చ గచ్ఛేత్సలిలం (రుధిరం) సపూయం
శిరోఽభితాపః క్రిమిభిస్స ఘోరః. 7

శిరస్సున సూదులతో బొడిచినవిధముగ తీవ్రముగ పోటుపుట్టుట, శిరస్సు లోపల మాంసాదులను పురుగులు తినునప్పుడు అదరుచుండుట, ముక్కులనుండి చీముతో గూడిన నీరు గారుచుండుట ఈలక్షణములు కలిగినది క్రిములచే గలిగిన శిరోరోగ మని యెరుంగునది. ఇది మిక్కిలి కష్టమును కలిగించును.

ఈవ్యాధియొక్క సంప్రాప్తిని లక్షణమును వాగ్భటాచార్యు డిట్లు వివరించి చెప్పెను:—"సఙ్కీర్ణైర్భోజనైః మూర్ధ్ని క్లేదితేరుధిరామిషే, కోపితే సన్నిపాతే చ జాయన్తే మూర్ధ్ని జన్తవః. శిరస స్తే పిబన్తోఽస్రం ఘోరాః కుర్వంతి వేదనాః, చిత్తవిభ్రంశజననీః జ్వరః కాసో బలక్షయః. రౌక్ష్యశోషౌ వ్యధచ్ఛేదదాహా స్ఫుటన పూతితాః, కపాలే తాలుశిరసోః కణ్డూశ్శోషః ప్రమీలకః. తామ్రాచ్ఛ సింఘాణకతా కర్ణనాదశ్చ జన్తుజే" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧౭-౧౮) మధురాదిరసములను మిశ్రములుగ జేర్చి భుజించుటచేత శిరస్సునందలి మాంసరక్తములు చెడి, వాతాది దోషములన్నియు ప్రకోపమునొంది శిరస్సున సన్ననిపురుగులు పుట్టును. అయ్యవి తలనుండురక్తమును త్రాగుచు, మిక్కిలి చిత్తభ్రాంతికరములై క్రూరములైనబాధల గల్గించును. ఇయ్యది క్రిమిజశిరోరోగ మనబడును. ఈ వ్యాధియందు జ్వరంబును దగ్గును కల్గును. బుద్ధిబలంబును శరీరబలంబును నశించును. శరీరము రూక్షమై (జిడ్డులేక) యుండును. వాపు కల్గును. తలయందు సూదులతో గ్రుచ్చినవిధముగను, కత్తిచే ఛేదించిన విధముగను బాధకల్గును. మంట పుట్టును. పగులునట్లు బాధకలుగును. దుర్గంధము కల్గును. కపాలమునందును తాలువుల యందును తలయందును దురదపుట్టి శుష్కించును. మైకము గ్రమ్మును. ముక్కులనుండి తామ్రవర్ణంబును స్వచ్ఛంబునైన ద్రవము కారును. చెవులయందు గుమ్మను ధ్వని పుట్టును. ఇయ్యది క్రిమిజశిరోరోగ మని భావము.

## సూర్యాపవర్తలక్షణము

సూర్యోదయం వా ప్రతిమన్దమన్దమక్షిభ్రువంరుక్ సముపైతిగాఢమ్,
వివర్ధతే చాంశుమతా సహైవ సూర్యాపవృత్తౌ వినివర్తతే చ,
సర్వాత్మకం కష్టతమం వికారం సూర్యాపవర్తం తముదాహరన్తి. 8

కంటియందును కనుబొమయందును సూర్యోదయకాలమున కొంచెము నొప్పి పుట్టి సూర్యుడు వృద్ధినొంది పొద్దెక్కుసరికి నొప్పియు మెల్లమెల్లగ కొంచెము కొంచెము వృద్ధినొందుచు మధ్యాహ్నకాలమునకు మిక్కిలి తీవ్రమై, సూర్యుడు పడమటి దెసకు వ్రాలి కొంచెము కొంచెముగ తీవ్రత నుడుగుచుండ నొప్పియు క్రమముగ కొంచెము కొంచెముగ తగ్గుచు, సూర్యుం డస్తమించుసరికి నొప్పియు నిశ్శేషముగ శాంతి నొందును. రాత్రియంతయు శాంతముగనే యుండును. మరల మరుసటినాడు మామూలుగ నొప్పి కల్గును. దీనిని సూర్యాపవర్త మని వచించెదరు. ఇయ్యది త్రిదోషములును సమములుగ ప్రకోపించిన సన్నిపాతముచే గల్గును. కావున మిక్కిలి బాధాకరంబై కష్టసాధ్యముగ నుండును.

మఱియు వాగ్భటమున:—"పిత్తానుబద్ధశ్శఙ్ఖాక్షిభ్రూలలాటేషు మారుతః, రుజాం సస్పన్దనాం కుర్యాత్ అనుసూర్యోదయోదయామ్" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧౦.) అని చెప్పబడినది. ఈవాక్యముచేత నీవ్యాధియందు వాతము పిత్తముతో గూడి సూర్యోదయకాలమునకు కణతలయందును కంటియందును కనుబొమయందును నుదుటియందును తీవ్రమైన బాధ కల్గించు నని తెలిసెడి. మఱియు "క్షుద్వ్యతస్సా విశేషతః, అవ్యవస్థితశీతోష్ణసుఖా" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧౧.) అని వాగ్భటుడు చెప్పెనుగాన నీబాధ ఆకలిగొనియుండు సమయమున మిక్కిలి తీవ్రముగ నుండు ననియు, సుఖోష్ణస్పర్శమునందు కల్గు సుఖము నియమము లేక యొకప్పుడు శీతోపచారములచేతను శీతస్పర్శముచేతను సుఖము కల్గు ననియు, మరియొకప్పు డుష్ణస్పర్శమున సుఖము కల్గు ననియు తెలిసెడి. ఈవిషయమునే సుశ్రుతాచార్యుడు విశదముగ నిట్లు చెప్పెను:—"శీతేన శాన్తిం లభతే కదాచిదుష్ణేన జన్తుస్సుఖమాప్నుయాచ్చ, తం భాస్కరావర్తముదాహరన్తి సర్వాత్మకం కష్టతమం వికారమ్" (సుశ్రుత. ఉ. అ. ౨౫.) సుశ్రుతవాగ్భటాదులు దీనిని సూర్యావర్త మని చెప్పిరి. (మాధవకరుడు మాత్రము సూర్యాపవర్త మని చెప్పెను. నామమాత్రభేదము కాని లక్షణభేదము కన్పట్టదు.)

మరియు ఈవ్యాధియందు మధ్యాహ్నమువరకు బాధ వృద్ధినొంది మధ్యాహ్నమునకుపై శాంతినొందుటకు కారణముల గ్రంథాంతరమునం దిట్లు చూపిరి:—

"సూర్యసోమాత్మకౌ నిత్యమహేతూ పిత్తమారుతౌ, కుర్వాతే వేదనాం తీవ్రాం దినా త్పూర్వాహ్ణ ఏవతు. ఆదిత్యతేజసా యుక్తే నివృత్తేఽపి చ భాస్కరే, స్రోతసాం వివృతత్వాచ్చ తత శ్లేష్మాది గచ్ఛతి. ఉద్గతో మాతరిశ్వాచ స్వమార్గం ప్రతిపద్యతే, తస్మాన్మధ్యన్దినాదూర్ధ్వం వేదనాత్ర ప్రశామ్యతి." పిత్తము స్వభావముచేతనే సూర్యాత్మకము. (ఉష్ణప్రధానము.) వాతము స్వభావముచేత సోమాత్మకము. (శీతప్రధానము.) కావున, నీరెండును కలిసి యీరోగము కల్గుటవలన తమతమ నైజప్రభావమున నీవ్యాధి యందు తీవ్రమైన బాధ కల్గించును. అందు మధ్యాహ్నకాలమునకు మున్ను సూర్యుని తాపముచేత పిత్త మప్పటప్పటికిని వృద్ధినొంది తీవ్రమైన బాధ గల్గించును. మధ్యాహ్నమునకు పిమ్మట సూర్యుని తేజ మప్పటప్పటికిని తగ్గుటంజేసి పిత్తము క్రమముగ శాంత పడును. కఫము వృద్ధినొందును. వాతము సంచరించు స్రోతస్సు తెరవబడి యుండుటం జేసి వాతము తన మార్గముల మూలముగ తన స్థానమున జేరును. శీతప్రధానమైన కఫము ప్రబలముగ నుండుటంజేసి పిత్తోద్రేకమున గల్గిన తీవ్రమైన బాధ మధ్యాహ్నమునకు పిదప క్రమముగ తగ్గి, అస్తమయమునకు శాంత మగును అని భావము.

ఈవ్యాధి "సర్వాత్మకం కష్టతమం వికారం" అను వాక్యముచేత కొందరు సన్నిపాతజ మని వచించిరి. 'పిత్తానుబద్ధ...మారుతః' అని వాగ్భటాచార్యుడును, "సూర్యసోమా...పిత్తమారుతౌ, కుర్వాతే" అను వాక్యములచే నితర తంత్రకారులును పిత్తవాతములచే గల్గు నని చెప్పిరి. అయినను ఈవ్యాధి సన్నిపాతముచే జనించినను పిత్తవాతములు రెండును ప్రబలములై యుండు నని వాగ్భటాదుల యభిప్రాయము గాన పరస్పరవిరోధము లే దని యెరుంగునది.

మరియు సూర్యావర్తవిపర్యయమును విదేహు డిట్లు చెప్పెను:—"తత్ర వాతానుగం పిత్తం చితం శిరసి తిష్ఠతి, మధ్యాహ్నే తేజసార్కస్య తద్వివృద్ధం శిరోరుజమ్. కరోతి పైత్తికీం ఘోరాం సంశామ్యతి దినక్షయే, అస్తంగతే ప్రభాహీనే సూర్యేవాయుర్వివర్ధతే. పిత్తం శాన్తిమవాప్నోతి తతశ్శామ్యతి వేదనా, ఏష పిత్తానిలకృతః సూర్యావర్తవిపర్యయః." పిత్తము వాతముతో గూడి శిరంబుననే యుండి మధ్యాహ్నకాలమునకు తీవ్రమైన సూర్యుని తేజస్సుచేత నుత్కటముగ వృద్ధినొంది మిక్కిలి తీవ్రమైన బాధను శిరస్సున కల్గించును. పిదప క్రమముగ సూర్యుడు ప్రభాహీనుడై యస్తమించిన పిదప వాతము వృద్ధినొంది పిత్తము శాంత మగును. దానంజేసి పిత్తమున తీవ్రముగ జనించిన తలనొప్పియు శాంతి నొందును. ఇయ్యది సూర్యావర్త విపర్యయ మనబడును అని భావము.

### 9. అనంతవాతసంప్రాప్తిలక్షణము

దోషాస్తు దుష్టాస్త్రయ ఏవ మన్యాం సంపీడ్య ఘాటాసు రుజాం సుతీవ్రామ్,
కుర్వన్తి యోఽక్షిభ్రువి శఙ్ఖదేశే స్థితిం కరోత్యాశు విశేషతస్తు. ౯
గణ్డస్య పార్శ్వే తు కరోతి కమ్పం హనుగ్రహం లోచనజాంశ్చ రోగాన్,
అనన్తవాతం తముదాహరన్తి దోషత్రయోత్థం శిరసో వికారమ్. 10

వాత-పిత్త-కఫములు మూడును సమములుగ ప్రకోపమునొంది మెడకు వెనుక ప్రక్కనుండు మన్య యను సిరలు రెండిటిని కదలనీయక బంధించి, పెడతలయందు మిక్కిలి తీవ్రమైన నొప్పిని కల్గించును. కన్నులయందును కనుబొమలయందును కణతలయందును విశేషముగ నతిత్వరలో వ్యాపించి మిక్కిలి తీవ్రమైన బాధ కల్గును. చెక్కిళ్లయందు కంపమును కల్గించును. అంకిళ్లను కదలక పట్టియుండును. కన్నులయందు పలుతెరగులైన నేత్రరోగములను గల్గించును. ఇయ్యది అనంతవాత మను శిరోరోగము. ఇది మూడుదోషముల ప్రకోపమున జనించును.

### 10. అర్ధావభేదకనిదాన సంప్రాప్తి, లక్షణము

రూక్షాశనాత్యధ్యశనప్రాగ్వాతావశ్యావ (య) మైథునైః,
వేగసన్ధారణాయాసవ్యాయామైః కుపితోఽనిలః. 11
కేవలస్సకఫో వార్ధం గృహీత్వా శిరసో బలీ,
మన్యాభ్రూశఙ్ఖకర్ణాక్షిలలాటార్ధేఽతివేదనామ్. 12
శస్త్రారణినిభాం కుర్యాత్తీవ్రాం సోఽర్ధావభేదకః,
నయనం వాథవా శ్రోత్రమతి వృద్ధో వినాశయేత్. 13

జిడ్డులేక రూక్షమైన పదార్థమును భుజించుట, తాను భుజించు పరిమితికన్న నెక్కువగ భుజించుట, భుజించినతోడనే మరల భుజించుట, తూర్పు గాలిని విశేషముగ సేవించుట, మంచులో నుండుట, తన బలమునకు మీరి స్త్రీసంభోగము జేయుట, వాతమూత్రపురీషాదివేగమును నిరోధించుట, శరీరమునకు శ్రమమునుబుట్టించు పనుల జేయుట, తన బలమునకు మిక్కుటముగ శరీరపరిశ్రమము జేయుట ఈకారణములచేత వాతము మిక్కిలి ప్రకోపమునొంది కేవలము వాతంబైనను, కఫముతో గలిసియైనను శిరస్సునం దర్ధభాగమున జేరి యాప్రక్కనుండు మన్య యను సిరలయందును, కనుబొమయందును, చెవియందును, కంటియందును, నుదుటియందును మిక్కిలి తీవ్రమైన నొప్పిని కల్గించును. అట్టి నొప్పి వాతము ఏప్రక్కజేరునో ఆప్రక్కనే (పైజెప్పిన

అవయవములలో నొక చెంపయందె సగభాగమున) కల్గును. ఆనొప్పి ఆయుధముచే పగులదీయునట్లును, అరణిలో నగ్నిని మధించువిధముగను మిక్కిలి తీవ్రమై యోరువ శక్యము గాకుండును. ఇయ్యది అర్ధావభేదక మను శిరోరోగము. ఇది నానాట మిక్కిలి వృద్ధినొందినయెడ నాప్రక్కనుండు నొక కంటినైనను చెవినైనను చెడగొట్టును.

మఱియు వాగ్భటాచార్యుడు:—"పక్షాత్కుప్యతి మాసాద్వా స్వయమేవ ప్రశామ్యతి" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౮.) అను వాక్యముచేత నీవ్యాధి పదునైదు దినములవఱకైనను నెలదినములవఱకైనను తీవ్రముగ బాధించి పిమ్మట చికిత్స లేకయే తనంతట శమించు నని చెప్పెను.

సుశ్రుతుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"యస్యోత్తమాఙ్గా రుజతే ఽర్ధమాత్రం సతోదభేదభ్రమమోహశూలైః, పక్షాద్దశాహాదథవాప్యకస్మాత్ స్యాదర్ధభేదం త్రితయాద్వ్యవస్యేత్" (సుశ్రుత. ఉ. అ. ౨౫.) మూడుదోషములు శిరంబునం దర్ధభాగమున జేరి సూదులతో బొడిచినట్లు పోటును, పగులదీయునట్లు నొప్పియు, తీవ్రమైన శూలంబును కల్గించును. దానంజేసి మూర్ఛయు కల్గును. ఇది యర్ధావభేదక మను శిరోరోగము. ఈవ్యాధి మిక్కిలి తీవ్రమై ఒక పక్షకాలమునకైనను పదిదినములకైనను చికిత్సచేయకున్నను తనంతనే శమించును అని యర్థము. ఈవాక్యముచేత నీవ్యాధి సన్నిపాతముచే గల్గు ననియు, ఒక పక్షకాలమునకైనను పదిదినములకైనను తనంతనే శమించుననియు తెలిసెడి.

ఈకాలనియమమును విదేహుడు ప్రకారాంతరముగ నిట్లు చెప్పెను:— "తథాత్ర్యహాత్పఞ్చాహాత్పక్షాన్మాసాచ్చ దేహినామ్" ఈవాక్యముచేత నీవ్యాధి మూడుదినములకైనను, ఐదుదినములకైన, పక్షకాలమునకైనను, ఒక మాసమునకైనను తనంతనే శమించు నని తెలిసెడి. వ్యాధి శమించుట కిట్టి కాలనియమము వ్యాధిస్వభావవైచిత్ర్యముచే గల్గును కాని వేరొండు కారణము లేదు. మఱియు సుశ్రుతమున సన్నిపాతమున నీవ్యాధి కల్గు నని చెప్పబడెను. కావున ప్రకృతమూలమున "కుపితోఽనిలః కేవలస్సకఫో వాపి" అను వాక్యమునకు నీవ్యాధి త్రిదోషములచే గల్గినను ఆ మూడు దోషములలో వాతం బొక్కటియైనను వాతకఫములు రెండైనను మిక్కిలి బలిష్ఠములుగ నుండునని యర్థము చెప్పుట సమంజసము. లేనిచో మతభేదము బాధించు నని యెఱుంగునది.

## 11. శంఖకలక్షణము

రక్తాపిత్తానిలా దుష్టాః శఙ్ఖదేశే విమూర్ఛితాః,
తీవ్రరుగ్దాహరాగం హి శోథం కుర్వంతి దారుణమ్. 14

స శిరో విషవద్వేగీ నిరుధ్యాశు గలం తథా,
త్రిరాత్రాజ్జీవితం హన్తి శఙ్ఖకో నామతః పరమ్,
త్ర్యహాజ్జీవతి భైషజ్యం ప్రత్యాఖ్యాయ సమాచరేత్. 15

రక్తంబును, పిత్తంబును, వాతంబును తమతమ స్థానములయందు తొలుత వృద్ధి నొంది, పిదప మిథ్యాహారాదులచే ప్రకోపమునొంది కణతలయందు జేరి యచ్చోట మిక్కిలి క్రూరమగువాపును గల్గించును. ఆ వాపు మిక్కిలి తీవ్రమైన నొప్పియు మంటయుకల్గి యెఱ్ఱనై యుండును. అవ్యాధి పామువిషమును బోలె నతిశీఘ్రముగ తల కెక్కి కుత్తుకలో నడ్డగించి, మూడురాత్రులు చికిత్సలేక గడపిన మనుజుని తప్పక చంపును. కావున వైద్యుడు ఈ వ్యాధి కుదురుట కష్ట మని చెప్పి మూడురాత్రులకు లోపల నతి శీఘ్రముగ దగినచికిత్స జేసినచో నొకవేళ జీవించును. ఇవ్యాధి మిక్కిలి క్రూరమైన శంఖక మను వ్యాధి.

ఈ చెప్పినప్రకారము ఈవ్యాధి రక్తపిత్తవాతముల మూడిటిచే గల్గు నని తెలిసెడి. సుశ్రుతాచార్యుడు "శంఖాశ్రితో వాయురుదీర్ణవేగః కృతానుతాపః కఫపిత్తరక్తైః" (సు. ఉ. అ. ౨౫) అని చెప్పెను. కావున వాతమును ప్రధానముగ జేసి కఫపిత్తరక్తములు మూడును కలిసి యీ వ్యాధిని కలిగించు నని యాశయము.

వాగ్భటాచార్యుడు దీనిలక్షణము నిట్లు చెప్పెను:—"పిత్తప్రధానై ర్వాతాద్యైః శఙ్ఖే శోఫస్సశోణితైః, తీవ్రదాహరుజారాగప్రలాపజ్వరతృడ్భ్రమైః. తిక్తాస్యః పీతవదనః క్షిప్రకారీ స శఙ్ఖకః, త్రిరాత్రాజ్జీవితం హన్తి సిధ్యత్యస్యాశుసాధితః" (అ. హృ. ఉ. అ. ౨౩. శ్లో. ౧౬-౧౮.) పిత్తమును ప్రధానముగ జేసి వాతకఫరక్తములు కణతలయందు జేరి వాపును కల్గించును. అవ్యాది రక్తవర్ణమై మిక్కిలి తీవ్రమైన నొప్పియు మంటయుం కల్గియుండును. ప్రలాపంబును (అసంబద్ధముగ మాటలాడుట), జ్వరంబును, దప్పియుం, మైకంబును, నోరు చేదుగ నుండును. ముఖము పచ్చనై యుండును. ఇట్టి లక్షణములు కల్గినది శంఖక మనబడును. ఇవ్యాది అతిశీఘ్రముగ మనుజుని చంపును. మూడుదినములలో రోగికి శీఘ్రముగ తగినచికిత్స జేసినచో నొకవేళ రోగి బ్రతుకును. (మూడు దినములు గడచినయెడ సాధ్యము కా దనుట.) ఈ వాక్యముచేత పిత్తము ప్రధానముగనుండి వాతకఫరక్తములును కలిసి శంఖకమును కల్గించునని వాగ్భటుని యాశయ మని యూహింపదగియున్నది.

విదేహు డిట్లు చెప్పెను:—"చీయతే తు యదా పిత్తం శఙ్ఖయో రనిలాచితమ్, నిరుణద్ధి తతో మర్మ పరిపూరితముల్బణమ్. తతశ్శఙ్ఖౌ ప్రరుజ్యేతే దహ్యేతే ఇవ

వహ్నినా, సూచీభిరివ తుద్యేతే నికృత్యేతే ఇవాసినా. శఙ్ఖకోనామ శిరసి వ్యాధి రేషసుదారుణః, తృష్ణా మూర్ఛా జ్వరకరః త్రిరాత్రాత్పరమంతకృత్, కుశలేన హ్యుపక్రాంతః త్రిరాత్రాదేవ జీవతి" పిత్తము వాతముతో గూడి కణతలయందు జేరి యందలి మర్మము పూర్తిగ వ్యాపించి యచ్చోట నిప్పున కాల్చినవిధముగ మంటయు, సూదులబొడిచిన విధముగ చురుకు చురుక్కుని పోటును, కత్తితో గోసిన విధమున తీవ్రమైన బాధయు కల్గును. ఇది మిక్కిలి తీవ్రమైనశంఖ మను వ్యాధి. ఈ వ్యాధియందు దప్పియు, మూర్ఛయు, జ్వరంబును కలుగును. ఈవ్యాధి మూడు రాత్రులు కడచిన యెడ తప్పక చంపును. కావున మూడురాత్రులకు లోపల సమర్థుడగు వైద్యుడు చికిత్స చేసినయెడ నొక వేళ నివ్మళించును అని యర్థము.

ఈ వాక్యముచే నీవ్యాధి పిత్తవాతముల రెండిటిచే గల్గు నని తెలిసెడి. దోష సంబంధమున నించుక భేదము పైమతములయందు కల్గినను, ఇది మిక్కిలి క్రూరమైనది యను నంశమున ఫలభేదము లే దని యెఱుంగునది.

(ఇత్తెరంగున నుద్దేశప్రకారము శిరోరోగభేదములు పదుకొకండును వివరింపబడినవి.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శిరోరోగనిదానం సమాప్తమ్.

వహ్నినా, సూచీభిరివ తుద్యేతే నికృత్యేతే ఇవాసినా. శఙ్ఖకోనామ శిరసి వ్యాధి రేషసుదారుణః, తృష్ణా మూర్ఛా జ్వరకరః త్రిరాత్రాత్పరమంతకృత్, కుశలేన హ్యుపక్రాంతః త్రిరాత్రాదేవ జీవతి" పిత్తము వాతముతో గూడి కణతలయందు జేరి యందలి మర్మము పూర్తిగ వ్యాపించి యచ్చోట నిప్పున కాల్చినవిధముగ మంటయు, సూదులబొడిచిన విధముగ చురుకు చురుక్కని పోటును, కత్తితో గోసిన విధమున తీవ్రమైన బాధయు కల్గును. ఇది మిక్కిలి తీవ్రమైనశంఖ మను వ్యాధి. ఈ వ్యాధియందు దప్పియు, మూర్ఛయు, జ్వరంబును కలుగును. ఈవ్యాధి మూడు రాత్రులు కడచిన యెడ తప్పక చంపును. కావున మూడురాత్రులకు లోపల సమర్థుడగు వైద్యుడు చికిత్స చేసినయెడ నొక వేళ నిమ్మళించును అని యర్థము.

ఈ వాక్యముచే నీవ్యాధి పిత్తవాతముల రెండిటిచే గల్గు నని తెలిసెడి. దోష సంబంధమున నించుక భేదము పైమతములయందు కల్గినను, ఇది మిక్కిలి క్రూరమైనది యను నంశమున ఫలభేదము లే దని యెఱుంగునది.

(ఇత్తెరంగున నుద్దేశప్రకారము శిరోరోగ భేదములు పదునొకండును వివరింప బడినవి.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
శిరోరోగనిదానం సమాప్తమ్.

శా. అ. ౨. శ్లో. ౨౨) 'మాసిమాసి రజః స్త్రీణాం' అని యుపక్రమించి చెప్పిన ప్రకారము ప్రతిమాసమునందును స్త్రీలకు ఋతురక్తము వెడలుచుండవలెను; అట్టియెడ నా ఋతురక్తము ప్రతిమాసమునందును పరిమితి కధికముగ వెడలినను, లేక నియతమగు ఋతుకాలమునగాక ఇతరకాలమునందును అధికముగ వెడలుచున్నను అయ్యాది రక్తప్రదర మనబడును. మఱియు "అసృక్ (రక్తం) దీర్యతే అస్మిన్నితి—అసృగ్దరమ్" అను వ్యుత్పత్తిచేత ఏవ్యాధియందు రక్తము భేదించి స్రవించునో అయ్యాది రక్తప్రదర మని యన్వర్థముగ నెఱుంగునది.

### కఫజరక్తప్రదరలక్షణము

ఆమం సపిచ్ఛాప్రతిమం సపాణ్డు పులాకతోయప్రతిమం కఫాత్తు,

కఫప్రకోపమున గల్గిన రక్తప్రదరమున ఋతురక్తము పక్వము గాక బూరుగ, వేప మున్నగుచెట్ల బంకవలె బందన కల్గి పాండువర్ణంబై వెడలును. లేక గంజినీళ్ళ (అన్నము నుండి వార్చినీళ్ల) వలె రంగుకల్గి వెడలును.

### పిత్తజరక్తప్రదరలక్షణము

సపీతనీలాసితరక్తముష్ణం పిత్తార్తియుక్తం భృశమేతి పిత్తాత్. 3

పిత్తమున గల్గిన రక్తప్రదరమునందు ఋతురక్తము పీతవర్ణంబైనను నీలవర్ణంబైనను నల్లనిరంగైనను రక్తవర్ణంబైనను కల్గి వేడిగ వెడలును. అట్టియెడ పిత్తమున జనించుపోటు మంట మున్నగు బాధలు కల్గును.

### వాతికరక్తప్రదరలక్షణము

రూక్షారుణం ఫేనిలమల్పమల్పం వాతార్తి వాతాత్పిశితోదకాభమ్.

వాతమున గల్గిన ప్రదరరోగమున రూక్షంబును, అరుణవర్ణంబును, నురుగుతోగూడినదియు నగు రక్తము వాతమున గల్గు నొప్పి మున్నగుబాధలతోగూడి కొంచెము కొంచెముగ స్రవించును. మరియు మాంసముకడిగిన నీరువలెగూడ స్రవించును.

### సన్నిపాతజరక్తప్రదరలక్షణము

సక్షౌద్రసర్పిర్హరితాలవర్ణం మజ్జాప్రకాశం కుణపం త్రిదోషాత్,
తంచాప్యసాధ్యంప్రవదన్తితజ్జ్ఞాః న తత్ర కుర్వీత భిషక్ చికిత్సామ్.

త్రిదోషసన్నిపాతమున గల్గిన రక్తప్రదరమునందు తేనెను నేతిని హరిదళమును బోలిన వర్ణముకల్గి, లేక క్రొవ్వువలె మిక్కిలి జిడ్డుకల్గి చిక్కనై దుర్గంధముతోగూడి రక్తము విశేషముగ వెడలును. ఇయ్యాది మిక్కిలి యసాధ్యము కావున చికిత్స చేయదగదు.

### అసాధ్యరక్తప్రదర లక్షణములు

శశ్వత్స్రవన్తీమాస్రావం తృష్ణాదాహజ్వరాన్వితామ్,
క్షీణరక్తాం దుర్బలాం చ తామసాధ్యాం వినిర్దిశేత్. 5

రక్తప్రదరము కల్గినస్త్రీ మాటిమాటికి రక్తము స్రవించుచు దప్పి, మంట, జ్వరమును కల్గియున్నను, రక్తము క్షీణించియున్నను, బలహీనంబైయున్నను అసాధ్యమగును.

### నిర్దుష్టార్తవ లక్షణము

మాసాన్నిష్పిచ్ఛదాహార్తిపఞ్చరాత్రానుబన్ధి చ,
నైవాతిబహులాత్యల్పం ఆర్తవం శుద్ధమాదిశేత్. 6
*శశాసృక్ప్రతిమం యచ్చ యద్వా లాక్షారసోపమమ్,
తదార్తవం ప్రశంసంతి యచ్చాప్సు న విరజ్యతే. 7

పిచ్ఛిలము గాక, మంటయు నొప్పియు లేక మాసమున కొకపరి యైదురాత్రులు మిక్కిలి యధికంబును స్వల్పంబునుగాక స్రవించు ఋతురక్తము శుద్ధమై దోషరహితమని యెఱుంగునది. మఱియు కుందేటి నెత్తురువలె రంగుకల్గి, లేక లత్తుకవర్ణమైన కల్గి బట్టకంటినపుడు నీళ్లతో కడిగినయెడ బట్టకు రక్తవర్ణము కలుగకుండునది దోషములేని ఋతురక్త మని యెఱుంగునది. తంత్రాంతరమున ఈ విషయము నిట్లు చెప్పబడినది:— "సురేన్ద్రగోప ప్రతిమం స్నిగ్ధం చ మధుగన్ధి చ, అపిచ్ఛిలమశీతం చ యద్వాసో న విరఞ్జయేత్." వర్షాకాలమున బుట్టు ఆర్ద్రపురుగువలె రక్తవర్ణంబై స్నిగ్ధమై తేనెవలె పరిమళము కలిగి పిచ్ఛిలంబును శీతంబునుగాక గుడ్డపై సోకినపుడు ఎఱ్ఱనిరంగు గుడ్డ కంటకుండునది దోషములేని యార్తవ మని యెఱుంగునది. మఱియు "స్త్రీణామృతుర్భవతి షోడశవాసరాణి" అని తంత్రాంతరమున స్త్రీలకు పదునారుదినములు ఋతుకాల మని చెప్పియున్నది. కావున రక్తము కొంచెముగ స్రవించుచున్నయెడ నైదుదినములకు పిమ్మటకూడ నార్తవము అనుసరించియుండు నని యెఱుంగునది.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
అసృగ్దరనిదానం సమాప్తమ్.

---

* ఋతుకాలమునందు గర్భకారణమై స్త్రీల కేదపధాతువుగా నుండునది ఆర్తవము. ప్రతిమాసమును ఋతుకాలమునకు సూచకముగా నుండి గర్భాశయశోధనమున కుపయోగపడు రక్తోపధాతురూపమైనది రజస్సు. ఇదియే అధికముగా దోషప్రకోపవశమున బ్రవర్తించినచో నసృగ్దర మనబడును. అందు "శశాసృక్" ఇత్యాది లక్షణము శుద్ధార్తవముయొక్క స్వరూపమునకు జెందిన దని "మాసాన్నిష్పిచ్ఛే" త్యాదిలక్షణము శుద్ధరజస్సునకు సంబంధించినదనియు వివేకమును గ్రహింపవలెను. ఆర్తవరజస్సులకభేదముగా శాస్త్రకారులు వ్యవహరించుటకు రెండును కలసియే బహిర్గతమగుచుండుట కారణమని తెలియవలెను.

# ౬౨. యోనివ్యాపన్నిదానమ్

ఆర్తవదోషమునకు సంబంధించిన రక్తప్రదరము జెప్పినపిదప దుష్టార్తవమున గల్గు యోనివ్యాపత్తు నిదానము చెప్పుట:—

### యోనివ్యాపత్సంఖ్యా కారణములు

వింశతిర్వ్యాపదో యోనౌ నిర్దిష్టా రోగసఙ్గ్రహే,
మిథ్యాచారేణ తాః స్త్రీణాం ప్రదుష్టేనార్తవేన చ. 1
జాయంతే బీజదోషాచ్చ దైవాచ్చ శృణు తాః పృథక్,

స్త్రీలకుమాత్రము జనించు యోనివ్యాపత్తు అను రోగము ఇరువదివిధము లని రోగసంగ్రహమున జెప్పబడినది. ఆయోనివ్యాపత్తులు అపథ్యములగు నాహారవిహారాదుల చేతను, ఋతురక్తము చెడుటచేతను, తల్లిదండ్రులయొక్క శుక్రార్తవరూపమైన బీజము యొక్క దోషముచేతను, దైవికమగు కర్మపరిపాకముచేతను స్త్రీలకు కల్గును. వానిలక్షణములు వేరువేరుగ నిట చెప్పబడును.

(చరక సూత్రస్థానమునందలి రోగసంగ్రహరూపమైన అష్టోదరీయా (౧౯) ధ్యాయమున "వింశతిః యోనివ్యాపదః" అని నిర్దేశించి, వాని భేదములు వివరింపబడినవి. ప్రకృతగ్రంథమునం దట్టి చరకమతమునే సంగ్రహింప దలచి యీవిషయమునే "నిర్దిష్టా రోగసంగ్రహే" అని సూచింపబడెను.)

మఱియు యోనిరోగములు కల్గుటకు ముఖ్యకారణము సుశ్రుతాచార్యు డిట్లు చెప్పెను:— "ప్రవృద్ధలిఙ్గం పురుషం యాత్యర్థముపసేవతే, రూక్షదుర్బల బాలాయాః తస్యాః వాయుః ప్రకుప్యతి. స దుష్టో యోనిమాసాద్య యోనిరోగాయ కల్పతే." మిక్కిలి రూక్షమైన శరీరముకల స్త్రీయును, బలహీనమైన స్త్రీయును, పసితనమున నుండు (ఋతుమతికాని) స్త్రీయును మిక్కిలి పెద్దదియగు లింగముకల పురుషునితో సంభోగముజేసిన క్రింద జెప్పబడు యోనిరోగములు సంభవించు నని యర్థము. అట్టి సంభోగముచేత వాతము మిక్కిలి ప్రకోపమునొంది యోనిలోజేరి రోగముల గలిగించును. ఈవాక్యముచేత యోనిరోగసామాన్యముగ వాతము మిక్కిలి ప్రబలమై ప్రధానముగ నుండు నని తెలిసెడి.

## వాతికయోనివ్యాపత్తులైదు, అందు ఉదావర్తలక్షణము

సాఫేనిలముదావర్తా రజః కృచ్ఛ్రేణ ముఞ్చతి. 2

ఆర్తవము నురుగుతోఁగూడి యోనిద్వారమునుండి మిక్కిలి కష్టముచే వెడలించిన నయ్యది యుదావర్తం బను యోనివ్యాపత్తు. ఈవ్యాధియందు వాతము ప్రతిలోమముగ పైకి సంచరించును. కావున నుదావర్త మని యన్వర్థముగ జెప్పబడును.

## వంధ్యావిప్లుతాలక్షణములు

వన్ధ్యాం నష్టార్తవాం విద్యాత్ విప్లుతాం నిత్యవేదనామ్,

ఋతురక్తము బొత్తుగ నశించి సంతతి గల్గకున్నయెడ నయ్యది వంధ్య యను యోనివ్యాపత్తు. వాతము ప్రకోపించుటంజేసి యెడతెగక వాతమున గల్గు పోటు నొప్పి మొదలగుబాధలు పీడించుచున్నయెడ నయ్యది విప్లుత యను యోనివ్యాపత్తు.

## పరిప్లుతాలక్షణము

పరిప్లుతాయాం భవతి గ్రామ్యధర్మేణ రుగ్భృశమ్. 3

యోనియందు వాతము వ్యాపించియుండుటంజేసి సంభోగకాలమున మిక్కిలి బాధకల్గును. ఇది పరిప్లుత యను యోనివ్యాపత్తు.

## వాతలాలక్షణము

వాతలా కర్కశా స్తబ్ధా శూలనిస్తోదపీడితా,
చతసృష్వపి చాద్యాసు భవన్త్యనిలవేదనాః. 4

యోని వాతముచే వ్యాపించియుండుటవలన నొప్పియు పోటును కల్గి కర్కశం బును కఠినంబునై యున్నచో వాతల యను యోనివ్యాపత్తు. పైజెప్పబడిన ఉదావర్త, వంధ్య, విప్లుత, పరిప్లుత యను నాల్గు యోనివ్యాపత్తులయందును, (వాతల యను నీవ్యాధి యందును) వాతమున గల్గు బాధలన్నియు విశేషముగ నుండును. (కావున నీయైదును వాతప్రకోపమున జనించు యోనివ్యాపత్తు లని యెఱుంగునది.)

## పైత్తికయోనివ్యాపత్తులైదు, అందు లోహితక్షయాలక్షణము

సదాహం క్షీయతే రక్తం యస్యాం సా లోహితక్షయా,

రక్తం బధికముగ స్రవించుటచేత యోనిలోమంటపుట్టి నానాట రక్తము నశించుచున్నయెడ లోహితక్షయ యను యోనివ్యాపత్తు అని యెఱుంగునది.

—౷ వామినీలక్షణము ౷—

సవాతముద్గిరేద్బీజం వామినీ రజసా యుతమ్. 5

గర్భధారణమునకు ముఖ్యకారణమై రజస్సుతోఁగూడిన శుక్రరూపమైన బీజము గ్రహించక, వాతసంబంధమునంజేసి బైట వెడలించిన నయ్యది వామిని యను యోనివ్యాపత్తు.

—౷ ప్రస్రంసినీపుత్రఘ్నీలక్షణములు ౷—

ప్రస్రంసినీ స్రంసతే చ క్షోభితా దుష్ప్రజాయినీ,
స్థితం స్థితం హన్తి గర్భం పుత్రఘ్నీ రక్తసంక్షయాత్. 6

యోనివాతముచే పీడింపబడి మిక్కిలి కష్టముచే ప్రసవించునదియై క్షోభకలిగి, రక్తమును స్వస్థానమునుండి స్రవించునది ప్రస్రంసిని యను యోనివ్యాపత్తు. గర్భము పలుమారు నిలిచిరక్తము క్షీణించినందున అప్పుడప్పుడును జారిపడుచున్నయెడ పుత్రఘ్నీ యను యోనివ్యాపత్తు. (ఈవ్యాధి రక్తక్షయమున గల్గును.)

—౷ పిత్తలాలక్షణము ౷—

అత్యర్థం పిత్తలా యోనిర్దాహపాకజ్వరాన్వితా,
చతసృష్వపి చాద్యాసు పిత్తలింగోచ్ఛ్రయో భవేత్. 7

యోనియం దధికముగ మంటకల్గి పుండై జ్వరము కల్గియున్నయెడ పిత్తల యను యోనివ్యాపత్తు. పైజెప్పిన లోహితక్షయ, వామిని, స్రంసిని, పుత్రఘ్నీ యను నాల్గు యోనివ్యాపత్తులయందును (పిత్తల యను నీవ్యాధియందును) పిత్తలక్షణములు విశేషముగ గానంబడును. (ఈయైదును పిత్తమున గల్గిన యోనివ్యాపత్తులు.)

పైత్తికయోనివ్యాపల్లక్షణము వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడియె:— "యథా స్వైర్దూషణైర్దుష్టం పిత్తం యోనిముపాశ్రితమ్, కరోతి దాహపాకోషాం పూతిగంధజ్వరాన్వితామ్. భృశోష్ణభూరికుణపనీలపీతాసితార్తవామ్, సా వ్యాపత్పైత్తికీ" (అ. హృ. ఉ. అ. 33. శ్లో. ౪౨.) పిత్తవర్ధకములగు నాయాకారణములచేత పిత్తము ప్రకుపితమై యోనిలోఁ జేరి మంటను బుట్టించి పుండు చేయును. దానంజేసి నిప్పుసెగలోనున్నవిధముగ మంటయు దుర్గంధంబును జ్వరంబును కల్గును. మిక్కిలి యుష్ణంబును, దుర్గంధంబును, నీలపీత కృష్ణవర్ణంబులైన యార్తవము స్రవించును. ఇది పిత్తమున గల్గిన యోనివ్యాపత్తు అని భావము.

### కఫజయోనివ్యాపత్తు లైదు, అందు అత్యానందాది లక్షణములు

అత్యానన్దా న సంతోషం గ్రామ్యధర్మేణ గచ్ఛతి,
కర్ణిన్యాం కర్ణికా యోనౌ శ్లేష్మాసృగ్భ్యాం ప్రజాయతే. 8
మైథునేఽచరణా పూర్వం పురుషాదతిరిచ్యతే,
బహుశశ్చాతిచరణా తయోర్బీజం న విన్దతి. 9

ఎంత సంభోగముచేసినను తృప్తిలేకుండునది అత్యానంద యను యోనివ్యాపత్తు. కఫ రక్తములచేత యోనిమధ్యమున మాంసగ్రంథి జనించినయెడ కర్ణిక యను యోని వ్యాపత్తు. సంభోగకాలమున పురుషునికన్న ముందుగ విరమించినయెడ అచరణ యను యోనివ్యాపత్తు. పురుషునికన్న నధికకాలము సంభోగమునుండి విరమించకుండునది అతిచరణ యను యోనివ్యాపత్తు. అచరణ, అతిచరణ యను రెండు వ్యాధులయందు స్త్రీ గర్భవతి కానోపదు.

### శ్లేష్మలా లక్షణము

శ్లేష్మజా పిచ్ఛిలా యోనిః కణ్డూగ్రస్తాఽతిశీతలా,
చతసృష్వపి చాద్యాసు శ్లేష్మలిఙ్గోచ్ఛ్రయో భవేత్. 10

యోనియందు జిగటగ ద్రవముకల్గి మిక్కిలి దురదకల్గి మిక్కిలి శీతలముగ నున్నయెడ శ్లేష్మల యను యోనివ్యాపత్తు. పైజెప్పబడిన అత్యానంద, కర్ణిని, అచరణ, అతిచరణ యను నాల్గు యోనివ్యాపత్తులయందును, (శ్లేష్మల యను నీవ్యాధియందును) కఫమునకు జెప్పిన లక్షణములు విశేషముగ గనబడును. (ఈ యైదును కఫమున గల్గిన యోనివ్యాపత్తులు.)

కఫజయోనివ్యాపల్లక్షణము వాగ్భటునిచే నిట్లు చెప్పబడినది:—"కఫోఽభిష్యన్దిభిః క్రుద్ధః కుర్యాద్యోనిమవేదనామ్, శీతలాం కణ్డురాం పాండుపిచ్ఛిలాం తద్విధస్రుతిమ్, సా వ్యాపత్ శ్లేష్మికీ" (అ. హృ. ఉ. అ. 33. శ్లో. ४४.) స్రోతస్సులయందు ద్రవమును బుట్టించు నాహారాదులచే కఫము ప్రకోపము నొంది యోనిలోజేరి యోనిని చల్లగ నుండునట్లు చేసి అధికముగ జిలపుట్టించి జిగటగ ద్రవమును కల్గించును. ఏవిధమయిన బాధయు నుండదు. ఇది కఫమున గలిగిన యోనివ్యాపత్తు అని భావము. (ఈ లక్షణములన్నియు పైజెప్పిన కఫజనితయోని వ్యాపత్తులయందును కల్గును.)

### సాన్నిపాతికయోనివ్యాపత్తులు ఐదు, అందు షణ్డీసీ లక్షణము

అనార్తవాఽస్తనీ షణ్డీ ఖరస్పర్శా చ మైథునే,

ఋతిమతి కాక, యౌవనము వచ్చినపుడును స్తనము లేర్పడక యున్నచో నయ్యది షండి యను యోనివ్యాపత్తు. ఈ వ్యాధియందు గుహ్యము కర్కశమై సంభోగమున కనువుపడకుండును.

మరియు దీనిలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"యోనౌ వాతోపతప్తాయాం స్త్రీ గర్భే బీజదోషతః, నృద్వేషిణ్యస్తనీ చ స్యాత్ షణ్ఢసంజ్ఞానుపక్రమా" (అ. హృ. ఉ. అ. ౩౩. శ్లో. ౩౯.) స్త్రీయొక్క (తన తల్లియొక్క) గర్భసమయమున యోని వాతముచే వ్యాప్తమైయున్నచో అట్టిగర్భమున జనించిన స్త్రీ స్తనములు కలుగక, ఋతిమతి కాక, పురుషునితో సంభోగింప నిచ్ఛగొనకయుండును. అయ్యది తల్లియొక్క బీజదోషమున గల్గిన షండిని యను యోనివ్యాపత్తు. ఇది చికిత్సకు అసాధ్యము అని యర్థము.

## అండలీ లక్షణము

అతికాయగృహీతాయా స్తరుణ్యా స్త్వణ్డలీ భవేత్. 11

యోనిప్రమాణమునకన్న నధికప్రమాణమైన లింగముకల పురుషునితో సంభోగము చేసిన అట్టి యభిఘాతమునంజేసి యోనిలోపలనుండి గ్రుడ్డువలెనుండు మాంసపిండము వెలికి వచ్చును. అయ్యది అండలి యను యోనివ్యాపత్తు.

## మహాయోనిసూచీముఖా లక్షణము

వివృతా చ మహాయోనిః, సూచీవక్త్రాఽతిసంవృతా,

యోనిద్వారము మిక్కిలి గొప్పదిగ నున్నచో మహాయోని యను యోనివ్యాపత్తు. యోనిద్వారము మిక్కిలి సూక్ష్మముగ నున్నయెడ సూచీముఖ మను యోనివ్యాపత్తు.

ఈరెండిటి లక్షణములను సుస్పష్టితోగూడ వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"దుష్టో విష్టభ్య యోన్యాస్యం గర్భకోష్ఠం చ మారుతః, కురుతే వివృతాం స్రస్తాం వాతికీమివ దుఃస్థితామ్, ఉత్పన్నమాంసాం తామాహుర్మహాయోనిం మహారుజమ్; వాతలాహారసేవిన్యాం జనన్యాం కుపితోఽనిలః. స్త్రియో యోనిమణుద్వారాం కుర్యాత్సూచీముఖీతి సా." వాతము మిక్కిలి ప్రకుపితమై యోనిద్వారమును గర్భాశయమును అడ్డగించి మిక్కిలి విశాలముగ చేయును. అయ్యది మాంసము కృశించి మిక్కిలి దుఃస్థితి నుండును. ఇయ్యది మహాయోని యను యోనివ్యాపత్తు. (ఈ వాక్యముచే నిది వాతమున కల్గు నని తెలిసెడి. సన్నిపాతమున గలిగినను వాతము ప్రబలముగ నుండునని వాగ్భటీయాశయము). మఱియు తల్లి గర్భవతిగ నున్న సమయమున వాతమును వృద్ధి నొందించు పదార్థములను సేవించినచో నట్టి గర్భమున బుట్టిన స్త్రీకి యోనిద్వారము మిక్కిలి చిన్నదిగ నుండును. ఇయ్యది సూచీముఖ మను యోనివ్యాపత్తు. (ఈవ్యాధి తల్లియొక్క బీజదోషమున గల్గును.)

### సర్వజా లక్షణము

సర్వలిఙ్గసముత్థానా సర్వదోషప్రకోపజా. 12
చతసృష్వపి చాద్యాసు సర్వలింగోచ్ఛ్రియో భవేత్,

దోషములన్నియు ప్రకోపించుటచే గల్గి, త్రిదోషములకు వేరువేర జెప్పిన లక్షణములు కలిగినది సర్వజ యను యోనివ్యాపత్తు. పైజెప్పిన షండిని, అండలి, మహాయోని, సూచీముఖ యను నాల్గు యోనివ్యాపత్తులయందును, (సర్వజ యను వ్యాధియందును) త్రిదోషములయొక్క లక్షణములు విశేషముగ గానంబడును. (ఈయైదును సన్నిపాతమున కలిగిన యోనివ్యాపత్తు లని యెఱుంగునది.)

### అసాధ్యయోనివ్యాపత్తులు

పఞ్చాసాధ్యా భవన్తీహ యోనయస్సర్వదోషజాః. 13

పైజెప్పిన యోనివ్యాపత్తులలో త్రిదోషసన్నిపాతమున గలిగిన షండ్యాది వ్యాపత్తు లైదును అసాధ్యములు.

మఱియు సుశ్రుతాచార్యుడు పైజెప్పబడిన యిరువది యోనివ్యాపత్తులను వాతాదిదోషసంబంధముచే నిట్లు విభజించెను:—"ఉదావర్తా తథా వన్ధ్యా విప్లుతా చ పరిప్లుతా, వాతలా చేతి వాతోత్థా; పిత్తోత్థా రుధిరక్షయా, వామినీ స్రంసినీ చాపి పుత్రఘ్నీ పిత్తలాచ యా; అత్యానందా చ యా యోనిః కర్ణినీ చరణాద్వయమ్, శ్లైష్మికీ సకఫా జ్ఞేయా;షణ్ఢీచ ఫలినీ తథా, మహతీ సూచివక్త్రాచ సర్వజేతి త్రిదోషజా."
ఉదావర్త, వంధ్య, విప్లుత, పరిప్లుత, వాతల యను నీ యైదు యోనివ్యాపత్తులు వాతప్రకోపమున గల్గును. రుధిరక్షయ, వామిని, స్రంసిని, పుత్రఘ్ని, పిత్తల యను నైదు యోనివ్యాపత్తులును పిత్తప్రకోపమున గల్గును. అత్యానంద, కర్ణిని, అచరణ, అతిచరణ, శ్లేష్మల అను నీయైదును కఫప్రకోపమున గల్గు యోనివ్యాపత్తులు. షండి, ఫలిని (అండలి), మహతి (మహాయోని), సూచీముఖ, సర్వజ యను నీయైదు యోనివ్యాపత్తులును సన్నిపాతమున గల్గునవి యని యర్థము. ఇచ్చట ఫలిని యనునది అండలి యని ప్రకృత గ్రంథమున జెప్పబడినది. (ఈ సుశ్రుతాచార్యుని యానుపూర్వి ననుసరించి మాధవకరుడును యోనివ్యాపత్తుల జెప్పెను. వాగ్భటాచార్యుడుమాత్రము వాతాదిసంబంధమును పైజెప్పినవిధముగ జెప్పియుండలేదు. వ్యత్యాసము కనపట్టుచున్నది.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
యోనివ్యాపన్నిదానం సమాప్తమ్.

# ౬౩. యోనికందనిదానమ్

యోనివ్యాపత్తును బోలె యోనికందంబును యోనిస్థానమున జనించునది గాన పిమ్మట యోనికందనిదానమును జెప్పుట.—

యోనికందము కల్గుటకు కారణములు; సంప్రాప్తియు

దివాస్వప్నాదతిక్రోధాద్వ్యాయామాదతిమైథునాత్,
క్షతాచ్చ నఖదన్తాద్యై ర్వాతాద్యాః కుపితా మలాః. 1
పూయశోణితసఙ్కాశం లికుచాకృతిసన్నిభమ్,
జనయన్తి యదా యోనౌ నామ్నా కన్దస్స యోనిజః. 2

పగటిపూట నిద్రపోవుట, మిక్కిలి కోపపడుట, తన బలమునకు మిక్కుటముగ బరిశ్రమముచేయుట, అధికముగ సంభోగముచేయుట, యోనిస్థానమున గోళ్లు దంతములు మున్నగువానిచే గాయమగుట, ఈకారణములచేత వాత - పిత్త - కఫములు ప్రకోపము నొంది చీము నెత్తురులతోగూడి గజనిమ్మకాయవలె గుండ్రనియాకారము కలిగిన గడ్డను యోనియందు గలిగించును. అయ్యది యోనికంద మని చెప్పబడును.

వాతికాదియోనికందలక్షణములు

రూక్షం వివర్ణం స్ఫుటితం వాతికం తం వినిర్దిశేత్,
దాహరాగజ్వరయుతం విద్యాత్పిత్తాత్మకం తు తత్. 3
నీలపుష్పప్రతీకాశం కణ్డూమన్తం కఫాత్మకమ్,
సర్వలిఙ్గసమాయుక్తం సన్నిపాతాత్మకం విదుః. 4

గఱుకకల్గి వికృతవర్ణంబై పగులుబారియుండునది వాతమునగల్గిన యోనికందము. మంటకల్గి యెఱ్ఱనై జ్వరము కల్గియుండునది పిత్తమున గల్గిన యోనికందము. నల్లని పువ్వుగల అగసిపువ్వుకు సమమైనరంగు కలిగి మిక్కిలి దురదకలిగి యుండునది కఫమున గలిగిన యోనికందము. వాతాదులకు వేరువేర జెప్పిన లక్షణములు అన్నియు గలిగినది సన్నిపాతమున జనించిన యోనికందము.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
యోనికన్దనిదానం సమాప్తమ్.

# ౬౪. మూఢగర్భనిదానమ్

మూఢగర్భ మనునదికూడ యోనిస్థానమునకు జెందినది కావున యోనికంద నిదానమును జెప్పి మూఢగర్భనిదానమును జెప్పుట.—

### * గర్భపాతకారణములు

భయాభిఘాతా త్తీక్ష్ణోష్ణపానాశననిషేవణాత్,
గర్భే పతతి రక్తస్య సశూలం దర్శనం భవేత్. 1

భయము, అభిఘాతము, తీక్ష్ణంబులును గుణవీర్యములచే నుష్ణంబులు నగు నన్నపానాదుల సేవించుట, ఈ కారణముల చేత గర్భము స్వస్థానమైన గర్భాశయమునుండి పట్టువదలి జారి వెలుపటికివచ్చి పడిపోవును. దానికి ముందుగనే యోనియందు నొప్పి కలిగి రక్తము స్రవించును.

ఇచ్చట సుశ్రుతమున జెప్పిన అతిసంగమము ఆయాసము మున్నగు గర్భపాతకారణములను గమనించునది. మఱియు మూఢగర్భలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది.—"సర్వావయవసమ్పూర్ణో మనోబుద్ధ్యాదిసంయుతః, విగుణా పానసమ్మూఢో మూఢగర్భోఽభిధీయతే" సకలమైనయంగప్రత్యంగములును పూర్తిగకల్గి మనస్సు బుద్ధి చిత్తము మున్నగునవి పూర్తిగ గల్గినగర్భము విలోమముగనుండు నపానవాతము చేత ప్రజ్ఞదప్పి నిశ్చేష్టముగ నుండిన నయ్యది మూఢగర్భ మని చెప్పబడును.

### గర్భపాతగర్భస్రావకాలము

ఆచతుర్థా త్తతోమాసాత్ప్రస్రవే ద్గర్భవిద్రవః,
తతః స్థిరశరీరస్య పాతః పఞ్చమషష్ఠయోః. 2

గర్భమును ధరించిన దినముమొదలు నాల్గుమాసములు పూర్తియగునందాక గర్భము ద్రవరూపముగ నుండును; కావున అట్టికాలమున పైజెప్పినకారణములు సంభవించిన నపుడు ద్రవరూపమైనగర్భము స్రవించును గాన నయ్యది గర్భస్రావ మనబడును. నాల్గుమాసములకు పిమ్మట గర్భమునందలిశిశువు ఘనీభవించి పిండాకారముగ నుండును. అట్టిసమయమున పైజెప్పినకారణములు సంభవించినచో గర్భము స్వస్థానమైన గర్భాశయమునుండి జారి యోనిద్వారమార్గమునుండి పడిపోవును;

---

* గర్భపాతగర్భస్రావములు యోనివ్యాపత్తులకు జెందినవి. అయినను మూఢగర్భమువలె ప్రమాదము నొకప్పుడు చేయునవగుటచే నిందుజేర్చి గ్రంథకర్త వ్రాసెను అని తోచెడిని.

కావున నయ్యది గర్భపాత మనబడును. ఈగర్భపాతము ఐదు ఆరు నెలలలో కలుగును. ఏడవమాసమునందు వ్యత్యస్తము గాక ప్రసవమైనపక్షమున శిశువు సజీవుండై బ్రతుకును. (ఈవిషయము "పాతః పఞ్చమ షష్ఠయోః" అను కాలనియమముచేత ధ్వనితము.)

మఱియు "సప్తమే సర్వాఙ్గప్రత్యఙ్గవిభాగః ప్రవ్యక్తతరః" (సుశ్రుత. శా. అ. 3. సూ. ౧౬) అని సుశ్రుతమున జెప్పినప్రకారము ఏడవమాసమున గర్భము సర్వావయవపూర్ణమై యుండునుగాన ఆట్టికాలమున ప్రసవము అయినచో శిశువు సజీవమై సుఖముగ నుండనోపును ; కావున నయ్యది గర్భపాత మనజనదు.

మఱియు భోజుడు గర్భపాతగర్భస్రావకాలము నిట్లు నిర్ణయించెను— "ఆతృతీయాత్తతో మాసాద్గర్భస్స్రవతి శోణితమ్, ఊర్ధ్వం సఙ్ఘాతభూతస్తు గర్భః పతతి యోషితామ్." స్త్రీలకు మూడవమాసమువఱకును గర్భము ద్రవరూపముగ నుండుటం జేసి స్రవించుననియు, నాల్గవమాసము మొదలు గర్భము ఘనీభవించి యుండుగాన అట్టియెడ గర్భము జారిపడును కావున అది గర్భపాత మనియు భావము.

## గర్భపాత మూఢగర్భముల స్వరూపభేదము

గర్భోఽభిఘాతవిషమాశనపీడనాద్యైః
పక్వం ద్రుమాదివ ఫలం పతతి క్షణేన,
మూఢః కరోతి పవనః ఖలు మూఢగర్భం
శూలం చ యోనిజఠరాదిషు మూత్రసఙ్గమ్. 3

అభిఘాతము, ప్రమాణమునకు న్యూనాధికముగ భుజించుట, చేతపిసుకుట ఇవి మున్నగు కారణములచేత గర్భము పండినపుడు చెట్టునుండి యూడిపడుభంగి తటాలున నూడిపడును. వాతము ప్రకోపమునొంది ప్రసవమార్గమున జేరి గర్భమును యోని, వస్తి జఠరము మున్నగుస్థలములయందు నొప్పి, మూత్రబంధము వీనిని బుట్టించి గర్భమును మూర్ఛ నొందించును. ఇది మూఢగర్భ మనబడును.(గర్భపాత మూఢగర్భముల స్వరూపం బిదియ.)

## ఎనిమిదివిధములగు మూఢగర్భగతి భేదములు

భుగ్నోఽనిలేన విగుణేన తతస్సగర్భః
సంఖ్యామతీత్య బహుధా సముపైతి యోనిమ్,
ద్వారం నిరుధ్య శిరసా జఠరేణ కశ్చి
త్కశ్చిచ్ఛరీరపరివర్తితకుబ్జదేహః. 4

ఏకేన కశ్చిదపరస్తు భుజద్వయేన
తిర్యగ్గతో భవతి కశ్చిదవాఙ్ముఖాస్యః,
పార్శ్వాపవృత్తగతిరేతి తథైవ కశ్చి
దిత్యష్టధా గతిరియం హి

ప్రతిలోమముగ సంచరించువాతముచేత గర్భము వ్యత్యస్తముగ జేయబడి లెక్క మీరి యనేకవిధములుగ యోనిద్వారమున జేరును. అందు ముఖ్యముగ గొప్పది యగు శిరస్సుచేత ద్వారము నడ్డగించునది యొకటి. ఉదరముచే యోనిద్వారము నడ్డగించునది రెండవది. శరీరమునంతటిని ఉండగ ముడుచుకొని యడ్డగించునది మూడవది. ఒక చేతిని బైటవెడలించి శరీరముచే నడ్డగించునది నాల్గవది. రెండుచేతులను వెలికి బుచ్చి శరీరముచే నడ్డగించునది యైదవది. శరీరమునెల్ల యోనిద్వారమున కడ్డముగ జేర్చి యడ్డగించునది యారవది. ముఖమును వంచి కంఠముచే యోని నడ్డగించునది యేడవది. పార్శ్వమును వంచి యడ్డగించునది యెనిమిదవది. ఈరీతిగ మూఢమైనగర్భము యోనిద్వారమును ఎనిమిదివిధములుగ నడ్డగించును. ఇవి ప్రధానమైన మూఢగర్భగమన భేదములు.

మతాంతరమున నాల్గువిధములైన మూఢగర్భగతి భేదములు

అపరా చతుర్ధా. 5

సంకీలితః ప్రతిఖురః పరిఘోఽథ బీజః
తేషూర్ధ్వబాహుచరణైశ్శిరసా చ యోనిమ్,
సఙ్గీ చ యో భవతి కీలకవత్సకీలో
దృశ్యైః ఖురైః ప్రతిఖురం స హి కాయసఙ్గీ
గచ్ఛేద్భుజద్వయశిరా స్స చ బీజకాఖ్యో
యోనౌ స్థిత స్స పరిఘః పరిఘేణ తుల్యః. 6

సంకీలితము, ప్రతిఖురము, పరిఘము, బీజకము నని మూఢగర్భగతి భేదములు నాల్గువిధముల నుండు నని కొందరాచార్యులు చెప్పెదరు. అందు—రెండు చేతులును కాళ్లురెండును శిరస్సును పైకి తిరిగి పిరుదులచేత మాత్రము ప్రసవమార్గము నడ్డగించి యుండునెడ నయ్యది చీలగొట్టినవిధముగ నుండుటంజేసి సంకీలిత మనబడును. చేతులు రెండును పాదములును శిరస్సును కొంచెముగ వెలికివచ్చి కంటి కగపడు చుండి, తక్కిన శరీరముచేత ప్రసవమార్గము నడ్డగించియున్నచో ప్రతిఖుర మనం దగు. రెండు చేతులును శిరమును కొంచెము వెలికి వచ్చి తక్కిన శరీరము ప్రసవ

మార్గము నడ్డగించియున్నచో నది బీజక మనబడును. శరీరమంతయు గడియవలె యోనిద్వారము నడ్డగించియున్న నది పరిఘ మనబడును. ఇవి నాల్గును కొందరాచార్యులు చెప్పిన మూఢగర్భగతిభేదములు.

మరియు "యస్తు నిర్గచ్ఛత్యేకశిరోభుజః స బీజకః" అని బీజకలక్షణమును కొందరు చెప్పిరి. ఒక చెయ్యి శిరస్సు బైటకువచ్చి తక్కిన శరీర మడ్డుపడియుండునది బీజక మని యర్థము.

### అసాధ్యమూఢగర్భము

అపవిద్ధశిరా యా తు శీతాంగీ నిరపత్రపా,
నీలోద్గతసిరా హన్తి సా గర్భం స చ తాం తథా. 7

మూఢగర్భము కల్గినస్త్రీకి తల మెడమీద నిలువక ఇటునటు వ్రేలబడి శరీరము చల్లబడి యించుకైన లజ్జలేకుండి, శరీరమున నున్న సిరలు నల్లనై కనుపట్టినయెడ అట్టి స్త్రీ గర్భమును చంపును. ఆగర్భముకూడ నాస్త్రీని తప్పక చంపును.

### మృతగర్భ లక్షణము

గర్భాస్పన్దనమావీనాం ప్రణాశశ్శ్యావపాణ్డుతా,
భవేదుచ్ఛ్వాసపూతిత్వం శూనతాంతర్మృతే శిశౌ. 8

శిశువు గర్భమునందే మృతిచెందినయెడ గర్భము కదల కుండును. ప్రసవసమయమున సాధారణముగ (ప్రసవనిమిత్తమై) గల్గు బాధలు నిలిచిపోవును. శరీరము నల్లగనైనను పాండువర్ణముగనైనను నుండును. నిశ్వాసము దుర్గంధముతో గూడి వెడలును. ఉదరము మిక్కిలి స్థూల మగును. (ఈలక్షణములబట్టి శిశువు లోపలనే మృతి జెందిన దని యెఱుంగునది.)

### గర్భమునకు వ్యాపత్తు గల్గుటకు కారణములు

మానసాగంతుభిర్మాతుః ఉపతాపైః ప్రపీడితః,
గర్భో వ్యాపద్యతే కుక్షౌ వ్యాధిభిశ్చ నిపీడితః. 9

మరియు మనస్సునందు ఏదోకారణములచే గల్గిన (మానసిక) దుఃఖముచేనైనను, బంధునాశాది ఆగంతుకకారణములచే గల్గిన దుఃఖముచేనైనను పీడింపబడినచో గర్భమునం గల శిశువు మృతిచెందును. ఇదిగాక శరీరసంబంధములైన జ్వరాదిరోగములచే బీడింపబడినను గర్భమునందలి శిశువు మృతిచెందును.

## మూఢగర్భాసాధ్యలక్షణములు

యోనిసంవరణం సఙ్గః కుక్షౌ మక్కల్ల ఏవ చ,
హన్యుస్స్త్రియం మూఢగర్భం యథోక్తాశ్చాప్యుపద్రవాః. 10

యోనిసంవరణము, సంగము, కుక్షిలో జనించు మక్కల్లము అను నీ మూటిలో నేదైన నొకటి మూఢగర్భము కల స్త్రీకి సంభవించినయెడ అట్టి స్త్రీ మృతిచెందును. మరియు ఆక్షేపకశ్వాసాద్యుపద్రవములు కల్గినను మృతిచెందును.

యోని సంవరణలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది—"వాతలాన్యన్నపానాని గ్రామ్యధర్మం ప్రజాగరమ్, అత్యర్థం సేవమానాయాః గర్భిణ్యా యోనిమార్గగః. మాతరిశ్వా ప్రకుపితో యోనిద్వారస్య సంవృతిమ్, కురుతే రుద్ధమార్గత్వా త్పునరంతర్గతోఽనిలః. నిరుణద్ధ్యాశయద్వారం పీడయన్ గర్భసంస్థితమ్, నిరుద్ధవదనోచ్ఛ్వాసో గర్భాశ్చాశు విపద్యతే. బద్ధాంసరుద్ధహృదయాం నాశయత్యేవ గర్భిణీమ్, యోనిసంవరణం విద్యాత్ వ్యాధిమేనం సుదారుణమ్, అంతక ప్రతిమం హ్యేతన్నారభేత చికిత్సితుమ్." గర్భిణియగు స్త్రీ వాతమును వృద్ధినొందించు నన్నపానముల నధికముగ సేవించినను, అధికముగ సంభోగము చేసినను, రాత్రులయందు విశేషముగ నిదుర మేల్కాంచినను, వాతము మిక్కిలి ప్రకోపించి యోనిద్వారమున జేరి యాద్వారమును మూయును. మార్గము నడ్డగించియుండుటంజేసి లోపల నిలిచియుండు వాతము గర్భాశయద్వారము నడ్డగించును. దానంజేసి గర్భమున నున్న శిశువు శ్వాసము వెడల నవకాశములేక మృతినొందును. తోడనే గర్భవతియైన స్త్రీకూడ మరణము నొందును. ఇయ్యది యోనిసంవరణ మను వ్యాధి. ఇయ్యది యమునిబోలె ప్రాణాంతకరమై యుండును. కావున వైద్యుడు దీనికి చికిత్స చేయు టుచితముగాదు అని యర్థము.

మరియు సంగ మనగా వాతము గర్భాశయమున జేరి ద్వారము నడ్డగించినయెడ గర్భము వెడలజాలక లోపలనే చిక్కియుండుట, కుక్షియందు రక్తము చేతను వాతము చేతను గల్గు శూల మక్కల్ల మనబడును. ఈమూడును మూఢగర్భము గల స్త్రీకి సంభవించిన బ్రతుకజాల దని భావము.

*(వాయుః ప్రకుపితః కుర్యాత్ సంరుధ్య రుధిరం స్రుతమ్,
సూతాయాః హృచ్ఛిరోవస్తి శూలం మక్కల్ల సంజ్ఞితమ్.)

* ప్రక్షిప్తము. మధుకోశమున వ్యాఖ్యానము చేయబడలేదు.

[స్త్రీ ప్రసవించిన వెంటనే గర్భాశయమున నుండు మలినరక్తమును వెడలించవలెను. లేనియెడ వాతము ప్రకుపితమై యారక్తము నడ్డగించి హృదయమునందును శిరస్సునందును వస్తియందును శూలమును కల్గించును. అయ్యది మక్కల్ల మనబడును.

మరియు నీమక్కల్లము ప్రసవము కాకుండు గర్భవతి యగు స్త్రీకిని సంభవించును. ఈవిషయము సుశ్రుతమున నీ వాక్యముచే సూచితము:—"ప్రజాతాయాశ్చ నార్యాః రూక్షశరీరాయాః తీక్ష్ణైరవిశోధితం రక్తం......గ్రంథిం కరోతి, తతశ్చ ......మూత్రసఙ్గశ్చ భవతీతి మక్కల్లలక్షణమ్" (సు. శా. అ. ౧౦. సూ. ౧౭.) ఇచ్చట 'ప్రసూతాయాశ్చ' అను చకారముచేత ప్రసవము కానప్పుడును ఈవ్యాధి కల్గునని తెలిసెడి. కావుననే యిచ్చట మూఢగర్భప్రస్తావమున 'మక్కల్ల ఏవ చ' అని చెప్పినది సంగతము.]

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే

మూఢగర్భనిదానం సమాప్తమ్.

# ౬౫. సూతికారోగనిదానమ్

సూతికారోగము మూఢగర్భమునుబోలె స్త్రీలకుమాత్రము కల్గు వ్యాధి కావున మూఢగర్భనిదానమును చెప్పిన పిదప సూతికారోగనిదానమును జెప్పుట:—

## సూతికారోగ సామాన్యలక్షణము

అఙ్గమర్దో జ్వరః కమ్పః పిపాసా గురుగాత్రతా,
శోథశ్శూలాతిసారౌ చ సూతికారోగలక్షణమ్. 1

ఒడలినొప్పులు, జ్వరము, వణకు, దప్పి, శరీరము బరువుగ నుండుట, వాపు, శూల, అతిసారము ఇవి సామాన్యముగ ప్రసవించిన స్త్రీలకు మిథ్యాహారాదులచేత గల్గును. కల్గినచో నవి సూతికారోగము లని చెప్పబడును.

## సూతికారోగనిదాన విశేషలక్షణములు

మిథ్యోపచారాత్సంక్లేశాద్విషమాజీర్ణభోజనాత్,
సూతికాయాశ్చ యే రోగా జాయంతే దారుణాస్స్మృతాః. 2
జ్వరాతిసారశోథాశ్చ శూలానాహబలక్షయాః,
తన్ద్రారుచిప్రసేకా*ద్యాః కఫవాతామయోద్భవాః. 3
కృచ్ఛ్రసాధ్యా హి తే రోగాః క్షీణమాంసబలాశ్రితాః,
తే సర్వే సూతికానామ్నా రోగాస్తే చాప్యుపద్రవాః. 4

ప్రసవించిన స్త్రీ అపథ్యములగు నుపచారములను జేసికొనినను, శరీరమునకు కష్టమును కల్గించుపనులుచేసినను, తాను భుజించుపరిమితికన్న న్యూనాధికముగ భుజించినను,జీర్ణము కాకుండునపుడు మరల భుజించినను, జ్వరము, అతిసారము, వాపు, శూల, కడుపుబ్బరము, బలహీనము, కునికిపాటు, అరోచకము, ప్రసేకము (నోట నీరు గారుట) ఇవి మున్నగువ్యాధులు సంభవించును. ఇవి ప్రసవించినస్త్రీకి ప్రాయికముగ కఫవాతముల ప్రకోపముచే గల్గును. బాలింతరాలికి కల్గునవిగాన సూతికారోగము లని చెప్పబడును. దానం జేసియే మిక్కిలి క్రూరము లగును. బాలింతరాలికి శరీరమునందలి మాంసంబును బలంబును క్షీణించినపుడు కల్గినచో మిక్కిలి క్రూరములై కృచ్ఛ్రసాధ్యము లగును. పైజెప్పిన వ్యాధులలో నొకటి ప్రధానముగ నున్నపుడు తక్కినవి సహకారులై యుపద్రవరూపములుగ నుండును.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
సూతికారోగనిదానం సమాప్తమ్.

---

* ఆద్యపదముచేత కరపాదదాహము శిరశ్శూలము ఆస్యపాకము మొదలగు వికారములకు సంగ్రహము.

# ౬౬. స్తనరోగనిదానమ్

ప్రాయికముగ ప్రసవించిన బాలింతరాలికి మిథ్యాహారాదులచే స్తనరోగములు కల్గును. కావున సూతికారోగనిదానమును జెప్పి స్తనరోగమును జెప్పుట:—

* స్తనరోగసంప్రాప్తి లక్షణములు

సక్షీరౌ వాప్యదుగ్ధౌ వా ప్రాప్య దోషాః స్తనౌ స్త్రియాః,
ప్రదూష్య మాంసరుధిరం స్తనరోగాయ కల్పతే. 1
పఞ్చానామపి తేషాం హి రక్తజం విద్రధిం వినా,
లక్షణాని సమానాని బాహ్యావిద్రధిలక్షణైః. 2

స్త్రీలయొక్క స్తనములు క్షీరముతోగూడియున్నను క్షీరము లేకున్నను, వాతాది దోషములు మిథ్యాహారాదులచే ప్రకోపమునొంది స్తనములయందుజేరి మాంసరక్తముల జెరిచి స్తనరోగములు గల్గించును. అయ్యవి వాత-పిత్త-కఫ-సన్నిపాత-ఆగంతు భేదములచే నైదు విధములు. అయ్యవి యైదును క్రమముగ వాతాదులచే ప్రత్యేకముగ గల్గిన బాహ్యావిద్రధి లక్షణములను గల్గియుండును. స్తనరోగములలో రక్తజనితము లేదు. కావున రక్తజ బాహ్యావిద్రధి లక్షణముమాత్రము కలుగదు. (వాతజస్తనరోగము వాతిక బాహ్యా విద్రధిలక్షణముల గల్గియుండు ననియు, పిత్తజస్తనరోగము పైత్తికబాహ్యా విద్రధిలక్షణములను గల్గియుండు ననియు, కఫజస్తనరోగము కఫజవిద్రధిలక్షణములను గల్గియుండు ననియు, సాన్నిపాతికాగంతుకములకూడ నిట్లే యూహింపదగుననియు భావము.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
స్తనరోగనిదానం సమాప్తమ్.

---

* స్తనరోగము లనగా "చనుకుదుర"ని వాడబడు స్తనవ్రణము లని గ్రహింపవలెను. ఇదియే స్తనకోప మనికూడ చెప్పబడును.

# ౬౭. స్తన్యదుష్టి నిదానమ్

స్తనరోగనిదానమును జెప్పినపిదప స్తనముల నాశ్రయించియుండు స్తన్యము (చనుబాలు) చెడుటకు కారణముల (నిదానమును) చెప్పుట.—

## స్తన్యస్వరూపము

(విశస్తేష్వపి గాత్రేషు యథా శుక్రం న దృశ్యతే,
సర్వదేహాశ్రితత్వాచ్ఛ శుక్రలక్షణముచ్యతే.
తదేవ చేష్టయువతేః దర్శనాత్ స్మరణాదపి,
శబ్దసంశ్రవణాత్ స్పర్శాత్ సంహర్షాచ్చ ప్రవర్తతే.
సుప్రసన్నం మనస్తత్ర హర్షణే హేతురుచ్యతే,
ఆహారరసయోనిత్వాత్ ఏవం స్తన్యమపి స్త్రియాః.
తదేవాపత్యసంస్పర్శాత్ దర్శనాత్ స్మరణాదపి,
గ్రహణాచ్చ శరీరస్య శుక్రవత్ సంప్రవర్తతే.
స్నేహో నిరన్తరస్తత్ర ప్రస్రవే హేతురుచ్యతే.)

[రసాదిధాతుసారాత్మకమైనది శుక్రము. అయ్యది పాలయందు నెయ్యియు, చెరకురసమునందు బెల్లంబును కంటికగపడక లీనమైయుండునట్లు పురుషుల శరీరమునం దంతటను వ్యాపించి కంటి కగపడకుండును. ఈవిషయమును సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి—"యథా పయసి సర్పిస్తు గుడ శ్చేక్షురసే యథా, శరీరేషు తథాశుక్రం నృణాం విద్యాద్భిషగ్వరః." (సుశ్రుత. శా. అ. ౪. శ్లో. ౧౯.)

శుక్రము సర్వశరీరమునందును (పైజెప్పినరీతిగ) వ్యాపించి లీనముగ నుండును. కావున అవయవములను చీల్చిచూచినను శుక్ర మగపడుటలేదు. అత్తెరంగుననే స్త్రీలకు స్తన్యంబును (చనుబాలును) శరీరమునందంతటను వ్యాపించి లీనముగనుండి అవయవములను చీల్చినను అగపడదు. కావున స్తన్యము శుక్రమునకు సమానలక్షణములు గల్గియుండును.

మరియు అట్టి శుక్రము తన మనసుకు మిక్కిలి ప్రీతిపాత్రమైన యౌవనవతి యగు స్త్రీని చూచుటవలనను, దానిరూపగుణాదుల స్మరించినను, ఆస్త్రీ కంఠస్వర

ముచు విన్నను, దానిని స్పృశించినను, సంకల్పవిశేషము మనస్సున గల్గి, దానంజేసి శుక్రము సర్వశరీరమునుండి వెడలి వస్తిద్వారమునకు క్రిందజేరి మూత్రమార్గమునుండి బైటవెడలును. అత్తెరంగుననే స్త్రీల శరీరమునందెల్ల వ్యాపించియుండు స్తన్యంబును, వారికి ప్రియమైనబిడ్డల స్పర్శన-దర్శన-స్మరణ-గ్రహణములవలన గల్గిన హర్షాతిరేకము చేత ప్రాదుర్భావమునొంది స్తనములంజేరి వెడలును.

మరియు మనసున శోకభయాది వికారసంబంధము లేకుండునెడ పైజెప్పిన కారణములచే హర్షము పొడసూపును. పుత్రులయందు అట్టి హర్షపూర్వకమైన నిరంతర స్నేహము స్తన్యము స్రవించుటకు కారణమగును.

మరియు శుక్రంబును స్తన్యంబును ఆహారరససారమువలన పుట్టుటంజేసి సమాన గుణములై పైజెప్పినరీతిగ ప్రాదుర్భవించి స్రవించును. ఇదియే స్తన్యముయొక్క స్వరూపము. *

(ఇచ్చట స్తన్యమునుగూర్చి "విశస్తేష్వపి...... హేతు రుచ్యతే" అని చెప్ప బడిన గ్రంథము ప్రాచీనకోశములయందు కానరాదు. వాచస్పతి విరచితమగు నాతంక దర్పణ మను వ్యాఖ్యానమున మాత్రము వ్యాఖ్యచేయబడినది. కావున స్వప్రమాణ మని గ్రహింపదగును.)

## స్తన్యము చెడుటకు కారణములు

గురుభిర్వివిధైః రన్నైః దుష్టైర్దోషైః ప్రదూషితమ్,
క్షీరం మాతుః కుమారస్య నానారోగాయ కల్పతే. 1

అజీర్ణకరములగు నానావిధములైన యాహారపదార్థముల సేవించుటచేత ప్రకోపమునొందిన వాతాదిదోషములు ప్రత్యేకముగనైనను రెండేసి కలిసియైనను అన్నియు కలిసియైనను స్త్రీలయొక్క చనుబాలను చెరచును. అట్టి చెడిన చనుబాలు బిడ్డలు త్రావిన పలుదెరంగులగు రోగములను బిడ్డలకు గల్గించును.

## వాతాదిదుష్టస్తన్యలక్షణము

కషాయం సలిలప్లావి స్తన్యం మారుతదూషితమ్,
కట్వమ్లలవణం పీతరాజీమత్పిత్తసంజ్ఞితమ్. 2
కఫదుష్టం ఘనం తోయే నిమజ్జతి సపిచ్ఛిలమ్,
ద్విలిఙ్గం ద్వన్ద్వజం విద్యాత్ సర్వలిఙ్గం త్రిదోషజమ్. 3

* "స్తన్యంరజశ్చనారీణాం కాలేభవతిగచ్ఛతి" ఇత్యాది వాక్యములచేత స్తన్యము రసధాతువున కుపధాతు వనియు, నదిప్రసూతస్త్రీలకు కొంతకాలము మాత్ర ముండి తిరిగి పోవుచుండు ననియు తంత్రాంతరములయందు చెప్పబడెను.

వాతముచే దుష్టమైన చనుబాలు వగరుకల్గి, నీళ్లలో బోసినయెడ పైకితేలును. పిత్తముచే చెడిన చనుబాలు చేదుగను, పులుపుగను, ఉప్పగ నుండి పచ్చని రేఖలు కల్గి యుండును. కఫముచే చెడిన చనుబాలు బరువుకల్గి బందనగల్గి నీళ్లలో బోసినపుడు మునుగును. వాతపిత్తకఫములలో రెండేసిదోషములచే చెడినయెడ రెండేసిదోషములకు జెప్పినలక్షణములు కలిసియుండును. త్రిదోషములచే చెడినపుడు త్రిదోషములకును వేరువేర జెప్పిన లక్షణములన్నియు కలిసియుండును.

## అదుష్టస్తన్యలక్షణము

అదుష్టం చామ్బునిక్షిప్తం ఏకీభవతి పాణ్డురమ్,
మధురం చాపి వర్ణం చ ప్రసన్నం తత్ప్రశస్యతే. 4

చనుబాలు మధురమై, పీతాదివర్ణములు లేక, తెల్లనిరంగుకల్గి, స్వచ్ఛమై, తేలికగనుండి, నీటిలో బోసినపుడు నీళ్ళలో కలిసి వేరుపడక యుండినయెడ నయ్యది పరిశుద్ధమై శ్లాఘ్యముగ నుండును.

స్తన్యస్వరూపము సుశ్రుతునిచే నిట్లు చెప్పబడియె.—— "రసప్రసాదో మధురః పక్వాహారనిమిత్తజః, కృత్స్నదేహాత్ స్తనౌ ప్రాప్తః స్తన్యమిత్యభిధీయతే" (సుశ్రుత. ని. అ. ౧౦.) భుజింపబడిన యాహారపదార్థములు జాఠరాగ్నిచే పక్వమై దాన జనించు శుద్ధమైన రసముయొక్క సారరూపమై స్వచ్ఛంబును, మధురంబునై శరీరమునందెల్ల వ్యాపించియుండి హర్షము గల్గినపుడు స్తనముల జేరునది స్తన్యము (చనుబాలు) అని చెప్పబడును (ఈవాక్యముచేత ఆహారము పరిపక్వమై దాన జనించు సారరూపమైన ద్రవము స్తన్య మని తెలిసెడి. కావున స్త్రీలు ఏవిధమైన యాహారము సేవించెదరో, అట్టి యాహారమునకు జేగినగుణము స్తన్యమున నుండును. కావున స్త్రీలు దోషముల వృద్ధినొందించు నాహారముల సేవింపక, ధాతుసామ్యమును కల్గించునాహారముల సేవించినచో స్తన్యము శుద్ధముగ నుండి బిడ్డల యారోగ్యమును కాపాడును. కావున బిడ్డ తల్లులుగ నుండు స్త్రీలు ఆహారవిషయమై మిక్కిలి జాగ్రత్తతో నుండుట ముఖ్య కర్తవ్యము.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
స్తన్యదుష్టినిదానం సమాప్తమ్.

# ౬౮. బాలరోగనిదానమ్

బాలురకు స్తన్యదోషమున సామాన్యముగ రోగములు సంభవించును; కావున స్తన్యదుష్టిని చెప్పిపిదప బాలరోగముల జెప్పుట:—

### వాతదుష్టస్తన్యపానమున గల్గురోగములు

వాతదుష్టం శిశుః స్తన్యం పిబన్ వాతగదాతురః,
క్షామస్వరః కృశాఙ్గస్స్యాద్బద్ధవిణ్మూత్రమారుతః. 1

వాతముచే దుష్టమైన చనుబాలను శిశువు త్రాగినచో వాతవ్యాధులచే బాధింపబడును. మరియు కంఠస్వరము నశించును. శరీరము కృశించును. మలమూత్రములు అపానవాతంబును బంధింపబడును.

బిడ్డలకు వ్యాధులు కల్గుకారణములు వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడినవి.— "త్రివిధః కథితో బాలః క్షీరాన్నోభయవర్తనః, స్వాస్థ్యం తాభ్యామదుష్టాభ్యాం దుష్టాభ్యాం రోగసమ్భవః" (అ. హృ. ఉ. అ. ౨. శ్లో. ౧.) బాలురు ఆహారభేదముచే మూడువిధముల జెప్పబడుదురు. పసితనమున కేవలము స్తన్యమును మాత్రము ఆహారముగ జేయుట మొదటిస్థితి. కొన్ని నెలలు గడచినపిదప చనుబాలను, అన్నమును రెంటిని ఆహారము జేయునది రెండవస్థితి. పాలను వదలి యన్నమును మాత్రము భుజించుస్థితి మూడవది. అట్టిబాలురకు ఆహారముగ నుండు చనుబాలైనను, చనుబాలు అన్నము రెండైనను అన్నముమాత్రమైన దుష్టముగ నున్నచో దానిని సేవించుటవలన బిడ్డలకు నానావిధరోగములుకల్గి స్వస్థత చెడును. అయ్యవి నిర్దుష్టములుగ నున్నచో రోగములు లేక స్వస్థత కల్గునని భావము.

### పిత్తదుష్టస్తన్యపానమున గల్గురోగములు

స్విన్నో భిన్నమలో బాలః కామలాపిత్తరోగవాన్,
తృష్ణాలురుష్ణసర్వాఙ్గః పిత్తదుష్టం పయః పిబన్. 2

పిత్తముచే దుష్టమైన చనుబాలు ద్రాగిన శిశువుకు శరీరముపై చెమటపుట్టును. మలము ద్రవములేక యెండి ఖండములుగ వెడలును. కామలారోగంబును, పిత్తరోగంబులును కల్గును. దప్పి విశేషముగ గల్గును. శరీరమంతయు వేడిగ నుండును.

కఫదుష్టస్తన్యపానమున గల్గురోగములు

కఫదుష్టం పిబ౯ క్షీరం లాలాలుశ్శ్లేష్మరోగవా౯,
నిద్రాన్వితో జడశ్శూనవక్త్రాక్షశ్ఛర్దన శ్శిశుః. 3

కఫముచేత దుష్టమగు చనుబాల ద్రాగినశిశువు విశేషముగ నోట జొల్లు గార్చును. కఫమున గల్గు రోగములచే బాధింప బడును. నిద్ర విశేషముగ వచ్చును. శరీరము జడమై యుండును. ముఖంబును కనురెప్పలును ఉబ్బియుండును. త్రాగిన పాలును విశేషముగ వాంతి యగును.

('లాలాలుః' అనుచోట ఆలుచ్ ప్రత్యయము అపాణినీయము; కావున సాధుత్వము చింత్యము.)

ద్విదోషత్రిదోషములచే దుష్టస్తన్యపానమున గల్గురోగములు

ద్వన్ద్వజే ద్వన్ద్వజం రూపం సర్వజే సర్వలక్షణమ్,

రెండేసి దోషములచే దుష్టమైన చనుబాలను ద్రావినశిశువునకు రెండేసి దోషములకు వేరువేర జెప్పినవ్యాధులు కల్గును. మూడుదోషములచే జెడిన స్తన్యమును త్రావిన శిశువుకు మూడుదోషములకును వేరువేర జెప్పిన వ్యాధులు సంభవించును.

శిశువుల రోగములను తెలిసికొను నుపాయములు

శిశో స్తీవ్రామతీవ్రాం చ రోదనాల్లక్షయేద్రుజమ్. 4
స యం స్పృశేద్భృశం దేశం యత్ర చ స్పర్శనాక్షమః,
తత్ర విద్యాద్రుజం మూర్ధ్ని రుజం చాక్షినిమీలనాత్. 5

శిశువునకు జనించినరోగము తీవ్రముగ నున్న దనియు, లే దనియు ఏడుపును బట్టి తెలియనగును. (ఏడు పధికముగ నున్న మిక్కిలి తీవ్ర మనియు, ఏడుపు తగ్గినపుడు కొంచెము నిమ్మళముగ నున్నదనియు సామాన్యముగ నెరుంగవలెననుట.) మరియు శిశువు ఏప్రదేశమును తనచేత పలుమారు తాకునో ఆస్థలమున నొప్పి బాధయు నున్నదనియు, ఏప్రదేశమున తాకినచో నోరువక యేడ్చునో ఆప్రదేశమున బాధకల్గిన దనియు నెరుంగునది. మరియు కన్నులు మూసికొనియున్నచో తలనొప్పి యున్న దని యెరుంగునది.

కోష్ఠాదులయందలి రోగముల గమనించువిధము

కోష్ఠే విబన్ధవమథుస్తనదంశాన్త్రకూజనైః,
ఆధ్మానపృష్ఠనమనజఠరోన్నమనైరపి. 6

వస్తౌ గుహ్యే చ విణ్మూత్ర సఙ్గోత్రాసదిగీక్షణైః,
స్రోతాంస్యఙ్గాని సన్ధీంశ్చ పశ్యేద్యత్నాన్ముహుర్ముహుః. 7

కోష్ఠమున బాధకలిగినపుడు మలబంధము, వాంతియు నగును. పాలుద్రావునపుడు తల్లియొక్క స్తనమును కొరుకును. ప్రేవులలో కూయుచు. కడు పుబ్బరించును. వీపును వంచును. కడుపును పైకెగవేయును. (ఈలక్షణములబట్టి కోష్ఠమున బాధ కల్గియున్నదని యూహించునది.)వస్తియందును గుహ్యమునందును బాధ కల్గినపుడు మలమూత్రములు బద్ధగించును. ఉలికిపడును. బెదరి దిక్కుల జూచును. మఱియు శిశువులకు ఆయా భాగముల జబ్బుకల్గినపుడు ముక్కు చెవులు మున్నగు రంధ్రములయందును అవయవములందును కీళ్ళయందును మిక్కిలి ప్రయత్నముతో పలుమారు పరీక్షించవలెను.

మరియు వాగ్భటాచార్యుడు:—"హృది జిహ్వోష్ఠదశనశ్వాసముష్టినిపీడనైః" అని చెప్పిరి. హృదయమున బాధకల్గినపుడు శిశువు నాలుకను పెదవులను కొఱుకును. శ్వాసము విడుచును. పిడికిటిని ముడుచుకొనును అని యర్థము.

## కుకూణకలక్షణము

కుకూణకః క్షీరదోషాత్ శిశూనామక్షివర్త్మని,
జాయతే తేన తన్నేత్రం కణ్డూరం చ స్రవేన్ముహుః. 8
శిశుః కుర్యాల్లలాటాక్షికూటనాసావఘర్షణమ్,
శక్తో నార్కప్రభాం ద్రష్టుం న వర్త్మోన్మీలనక్షమః. 9

దోషములు క్షీణంబులగుటవలన శిశువులకు కనురెప్పల లోభాగమున తీవ్రమైన దురదకల్గి విశేషముగ నీరుగారును. సూర్యునికాంతిని (ఎండను) చూచుటకును రెప్పల దెరచుటకును సాధ్యము కాకుండును ఆశిశువు నుదుటను, కన్నులయందును, ముక్కునందును చేత మర్దనము చేయును. ఇయ్యది కుకూణక మను రోగము.

మరియు నీవ్యాధిలక్షణమును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను:—"కుకూణకశ్శిశోరేవ దన్తోత్పత్తినిమిత్తజః, స్యాత్తేన శిశురుచ్ఛూనతామ్రాక్షో వీక్షణాక్షమః. స వర్త్మశూలపైచ్ఛిల్యకర్ణనాసాక్షిమర్దనః" కుకూణక మను వ్యాధి శిశువులకు పండ్లు మొలచుకాలమున గల్గును. ఈ వ్యాధియందు కన్నురెప్పలు వాచి కనులెఱ్ఱగ నుండును. కన్నుల దెరచి చూడ వీలుపడక మూసికొని యుండును. రెప్పలలో నొప్పియు పోటును కల్గి బందనగ నుండును. చెవులను ముక్కును కన్నులను చేత నలుచు చుండును అని యర్థము. ఈ వాక్యముచేత నీవ్యాధి పిల్లలకు పండ్లు మొలుచుసమయమున గల్గునని తెలిసెడి.

### పారిగర్భికలక్షణము

మాతుః కుమారో గర్భిణ్యాః స్తన్యం ప్రాయః పిబన్నపి,
కాసాగ్నిసాదవమథుతన్ద్రాకార్శ్యారుచిభ్రమైః. 10
యుజ్యతే కోష్ఠవృద్ధ్యా చ తమాహుః పారిగర్భికమ్,
రోగం పరిభవాఖ్యం చ యుఞ్జ్యాత్తత్రాగ్నిదీపనమ్. 11

శిశువు తన తల్లి గర్భవతిగ నున్నపుడును తల్లివద్ద పాలుద్రాగుచున్నయెడ దగ్గు, అగ్నిమాంద్యము, వాంతి, మైకము, శరీరము కృశించుట, భ్రమము ఇట్టి లక్షణములు కల్గును. కడుపు పెద్దది యగును. ఇయ్యది పారిగర్భిక మను వ్యాధి యనియు, శిశువుల బాధించుటంజేసి పరిభవాఖ్యం బనియు జెప్పబడు. ఈవ్యాధియందు అగ్నిని దీపింపజేయు చికిత్స చేయందగును.(పారిగర్భిక మన తల్లి గర్భవతియగుటవలన గలిగిన దని యర్థము.)

### తాలుకంటకలక్షణము

తాలుమాంసే కఫః క్రుద్ధః కురుతే తాలుకణ్టకమ్,
తేన తాలుప్రదేశస్య నిమ్నతా * మూర్ధ్ని జాయతే. 12
తాలుపాత స్తనద్వేషః కృచ్ఛ్రాత్పానం శకృద్ద్రవమ్,
తృడక్షికణ్ఠాస్యరుజా గ్రీవాదుర్వహతా వమిః. 13

తాలువులయందు మాంసమున కఫము ప్రకోపమునొంది తాలుకంటక మను వ్యాధిని కల్గించును. ఈవ్యాధిచేత తాలువులయందును, శిరస్సు (ఉచ్చి) నందును పల్లముగ నుండును. తాలువులయందు పటుత్వములేక పాలు ద్రాగుటయం దిచ్ఛలేకుం డును. ఒకవేళ పాలుద్రాగవలెనన్న మిక్కిలి కష్టముగ ద్రాగును. మలము ద్రవముగ వెడలును. దప్పి కల్గును. కన్నులయందును కంఠమునందును నోటియందును నొప్పి కలు గును. మెడ నిలువదు. వాంతి యగును.

### విసర్పలక్షణము

విసర్పస్తు శిశోః ప్రాణనాశనో వస్తిశీర్షజః,
పద్మవర్ణో మహాపద్మనామా దోషత్రయోద్భవః. 14
శఙ్ఖాభ్యాం హృదయం యాతి హృదయాద్వా గుదం వ్రజేత్,
క్షుద్రరోగే చ కథితే త్వజగల్ల్యహిపూతనే. 15

* మూర్ధ యనగా నోటిలో నుండు మీదిభాగము. ఇది పండ్లవరుసకు వెనుక నుండు గట్టిప్రదేశము. తాలు వనంబడు.

శిశువులకు పొత్తికడుపుపైనను తలయందును విసర్పమను వ్యాధి పుట్టును. ఇది యొకచోట బుట్టి పలుదెఱంగుల సంచరించునది కావున విసర్పమను గడ్డ. ఇయ్యది యెఱ్ఱ తామరరేకువలె నెఱ్ఱనిరంగుకలిగి త్రిదోష సన్నిపాతముచే గల్గును. మహాపద్మ మని చెప్పబడును. అందు తలలో కల్గు విసర్పము తొలుత కణతలయందు పొడసూపి హృదయమున జేరును. పొత్తికడుపున బుట్టునది హృదయమున జేరి యచ్చటనుండి గుదస్థానమున వ్యాపించును. ఇయ్యది శిశువులపాలిటి యమునిబోలె ప్రాణహరమై యుండును. ఇదిగాక క్షుద్రరోగమున చెప్పబడిన అజగల్లి, అహిపూతన యను రోగములును బాలురకు సంభవించును.

## బాలురకు జనించు జ్వరాదిరోగములు

జ్వరాద్యా వ్యాధయస్సర్వే మహాన్తోయే పురేరితాః,
బాలదేహేఽపితే తద్వద్విజ్ఞేయాః కుశలైస్సదా. 16

ఇవిగాక జ్వరము మొదలుచేసి పైజెప్పిన మహావ్యాధులును బాలురకు మిథ్యాహారాదులచేత శరీరమున సంభవించును. అవి యన్నియు వానివాని నిదానముల జెప్పబడిన లక్షణములబట్టి యెఱుంగునది.

## బాలగ్రహసామాన్యలక్షణము

క్షణాదుద్విజతే బాలః క్షణాత్త్రస్యతి రోదితి,
నఖైర్దన్తైర్దారయతి ధాత్రీమాత్మానమేవచ. 17
ఊర్ధ్వం నిరీక్షతే దన్తాన్ఖాదేత్కూజతి జృమ్భతే,
భ్రువౌ క్షిపతి దన్తౌష్ఠం ఫేనం వమతి చాసకృత్. 18
క్షామోఽతి నిశి జాగర్తి శూనాక్షో భిన్నవిట్స్వరః,
మాంసశోణితగన్ధిశ్చ న చాశ్నాతి యథా పురా. 19
సామాన్యం గ్రహజుష్టానాం లక్షణం సముదాహృతమ్,

బాలగ్రహములచే నావిష్టుడగు శిశువు క్షణకాలము ఉద్వేగము (ఉలికిపాటు) కలిగియుండును. ఒక క్షణమున కారణములేకయే భయపడును, ఏడ్చును. గోళ్ళచేతను దంతములచేతను పాలిచ్చు దాదినైనను తన శరీరమునైనను గీరును బిత్తరపోయినట్లు పైనజూచును. పండ్లు పటపట కొరుకును. వికారముగ కూయును. ఆవలించి యొడలు విరుచును. కనుబొమల వికారముగ గదలించును. పండ్లచే పెదవులు కొరికికొనును, మాటిమాటికిని నురుగును వాంతిచేయును. శరీరము మిక్కిలి కృశించి రాత్రులయందు నిదురపోకయుండును. కన్నుల రెప్ప లుబ్బియుండును. మలము ద్రవమై వెడలును. కంఠస్వరము మామూలుగలేక మారియుండును. తన శరీరము మాంసమును రక్తమునుబోలి

దుర్గంధము గలిగియుండును. మామూలుగ నాహారమును భుజింపకుండును. ఇవి యన్నియు బాలగ్రహసామాన్యముగ గలుగు లక్షణములు.

మరియు బాలగ్రహములయొక్క ప్రాగుత్పత్తియు వానిస్వరూపమును వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడియె:—"పురా గుహస్య రక్షార్థం నిర్మితా శ్శూలపాణినా, మనుష్యవిగ్రహాః పంచ సప్త స్త్రీవిగ్రహాః గ్రహాః. స్కన్దోవిశాఖో మేషాఖ్యః శ్వగ్రహః పితృసంజ్ఞితః, శకునిః పూతనా శీతపూతనా దృష్టిపూతనా ముఖమండలికా తద్వద్రేవతీ శుష్కరేవతీ" (అ. హృ. ఉ. అ. 3. శ్లో. ౧-౨.) పురాతనకాలమున కుమారస్వామి బాల్యమున నుండునపుడు వానిని కాపాడుటకై పరమేశ్వరుడు ఐదు పురుషాకారగ్రహములను, ఏడు స్త్రీరూప గ్రహములను సృజించెను. అందు స్కంద, విశాఖ, మేషాఖ్య, శ్వగ్రహ, పితృగ్రహము అను పేరులు కల్గినవి పురుషగ్రహములు. శకుని, పూతన, శీతపూతన, దృష్టిపూతన, ముఖమండలిక, రేవతి, శుష్కరేవతి యను పేరులు కలిగినవి స్త్రీగ్రహములు. అన్నియుజేరి పండ్రెండుగ్రహములు. ఇవి సత్కారము నొందుటకును, పూజలు, బలులు మున్నగువానిపై నభిలాషచేతను, సమయమును వేచి బాలురపై నావేశించును. ఈవిషయమున సుశ్రుతాచార్యుడిట్లు చెప్పెను:—'ధాత్రీమాత్రోః ప్రాక్ప్రదిష్టాపచారాత్, శౌచభ్రష్టాన్ మఙ్గలాచారహీనాన్, త్రస్తాన్ హృష్టాన్ తర్జితాన్ క్రందితాంశ్చ, పూజాహేతోః హింస్యురేతే కుమారాన్." (సుశ్రుత. ఉ. అ. ౨౭.) పాలిచ్చు దాదియొక్కయు, తల్లియొక్కయు నవజ్ఞతచేత బిడ్డలు పరిశుద్ధి లేకయున్నను, మంగళకరములైన యాచారములు లేకున్నను, తటాలున భయపడినను, మిక్కుటముగ సంతోషము కలిగియున్నను, బిడ్డల నెవ్వరేనియు భయపరచినను, అధికముగ నేడువబెట్టినను, అట్టి కారణముల నవకాశముగజేసికొని పైజెప్పబడిన బాలగ్రహములు తాము పూజల నొందుటకై బిడ్డలపై నావహించి బాధించుచుండును.

మరియు నీగ్రహము లావేశించుటకు మునుమున్ను బిడ్డలు మిక్కుటముగ నేడ్చెదరు. జ్వరము అధికముగ కల్గును. ఈవిషయమును వాగ్భటు లిట్లు చెప్పిరి —"తేషాం గ్రహీష్యతాం రూపం ప్రతతం రోదనం జ్వరః" (అ. హృ. ఉ. అ. 3. శ్లో. 3.)

### బాలగ్రహవిశేషలక్షణము

ఏకనేత్రస్య గాత్రస్య స్రావస్స్పన్దనకమ్పనమ్. 20
ఊర్ధ్వం దృష్ట్వా నిరీక్షేత వక్త్రాస్యో రక్తగన్ధికః,
దన్తాన్ఖాదతి విత్రస్తః స్తన్యం నైవాభినన్దతి. 21

పిల్లవాండ్రు భయపడి గ్రహ మావేశించినపుడు ఒక కంటిలో నీరు కారును. శరీరమునం దొక భాగమునమాత్రము చెమట గారుచుండును. ఒక అవయవము మాత్రము కొంచెముగ చలించుచు, లేక వణకును. కన్నుల నిక్క బెట్టి పైచూపు చూచును. నోరు వంకరగ నుండును. శరీరమున రక్తమువలె దుర్గంధము కలిగి యుండును. పండ్లుకొరుకును. ఒకప్పుడును పాలుద్రావ నిచ్ఛలేకుండును. (ఇట్టి లక్షణములు కలిగినప్పుడు బిడ్డ భయపడి గ్రహావిష్టుడై యున్నా డని గమనించునది.)

### స్కన్దాపస్మారలక్షణము

స్కన్దగ్రహగృహీతానాం రోదనం చాల్పమేవ చ,
నష్టసంజ్ఞోవమేత్ఫేనం సంజ్ఞావానతి రోదితి,
పూయశోణితగన్ధిత్వం స్కన్దాపస్మారలక్షణమ్. 22

బిడ్డలకు స్కందగ్రహ మావేశించినపుడు రోదనము తగ్గును. మూర్ఛగ్రమ్మి యొడలెరుంగక నురుగు వాంతి యగును. ప్రజ్ఞ దెలిసినప్పుడు మిక్కిలి యేడ్చును. శరీరము చీము నెత్తురులవలె దుర్గంధముకల్గియుండును. ఈలక్షణములు కల్గియున్నయెడ స్కందాపస్మారగ్రహం బని యెరుంగునది.

### శకునిగ్రహలక్షణము

స్రస్తాఙ్గో భయచకితో విహఙ్గగన్ధిస్స్రావవ్రణపరిపీడితస్సమన్తాత్,
స్ఫోటైశ్చ ప్రచితతనుస్సదాహపాకైర్విజ్ఞేయో భవతి శిశుః క్షతశ్శకున్యా.

బాలుడు శకునిగ్రహముచే పీడితుడైనపుడు అవయవములన్నియు సడలి శిథిలములుగ నుండును. కారణములేకయే భయపడును. పక్షులవంటి దుర్గంధము శరీరమున గల్గును. శరీరమునందెల్ల పుండ్లులేచి చీమును నెత్తురును గారుచుండును. శరీరమునందెల్ల పొక్కులులేచి మంటకల్గి పుండై దట్టముగ వ్యాపించియుండును.

మరియు వాగ్భటమున "స్ఫోటాస్సదాహరుక్పాకాః సన్ధిషు స్యుః పునః పునః, నిశ్యహ్ని ప్రవిలీయన్తే పాకో వక్త్రే గుదేఽపివా" (అ. హృ. ఉ. అ. 3. శ్లో. ౧౯.) అని చెప్పెను. ఈవాక్యమునుబట్టి కీళ్లయందు మంటతోగూడిన బొబ్బలులేచి పుండై రాత్రియందెల్లనుండి పగటియందు కనుబడక మరిగియుండు ననియు, నోటియందును గుదస్థానమునందును పుండగుననియు తెలిసెడి. (ఈ గ్రహమునే పక్షిదోషమని లోకమున జెప్పెదరు.)

### రేవతీగ్రహలక్షణము

వ్రణైస్స్ఫోటైశ్చితం గాత్రం పఙ్కగన్ధం స్రవేదసృక్,
భిన్నవర్చా జ్వరీ దాహీ రేవతీగ్రహలక్షణమ్. 24

రేవతి యను గ్రహము ఆవహించినపుడు శరీరమునందెల్ల బొబ్బలును, వ్రణంబులును వ్యాపించి బురదవంటి గంధముకలిగి నెత్తురు కారుచుండును. మలము ఉండలై ద్రవముగ వెడలును. జ్వరము కలిగి మంట పుట్టును. (ఈ లక్షణములు కలిగినపుడు రేవతీగ్రహ మావహించిన దని యెరుంగునది.)

### పూతనాగ్రహలక్షణము

అతీసారో జ్వరస్తృష్ణా తిర్యక్ప్రేక్షణరోదనమ్,
నష్టనిద్రస్తథోద్విగ్నో గ్రస్తః పూతనయా శిశుః. 25

పూతనాగ్రహము ఆవహించినపుడు అతిసారము, జ్వరము, దప్పియు కల్గును. అడ్డముగ జూచును. అధికముగ నేడ్చును. నిదుర పట్టదు. ఉడికియుండి యులికిపడును.

### అంధపూతనాలక్షణము

ఛర్దిః కాసో జ్వరస్తృష్ణా వసాగన్ధోఽతిరోదనమ్,
స్తన్యద్వేషోఽతిసారశ్చ అన్ధపూతనయా భవేత్. 26

అంధపూతనాగ్రహముచే బీడింపబడినపుడు వాంతియగును. దగ్గు కల్గును. దప్పి విశేషమగును. క్రొవ్వువలె దుర్గంధము కల్గును. అధికముగ నేడ్చును. పాలుత్రాగుటకు ఇచ్చ పొడమదు. అతిసారము గల్గును.

### శీతపూతనాలక్షణము

వేపతే కాసతే క్షీణో నేత్రరోగో విగన్ధితా,
ఛర్ద్యతీసారయుక్తశ్చ శీతపూతనయా శిశుః. 27

శీతపూతనాగ్రహముచేత బీడింపబడిన శిశువునకు వణకును, దగ్గునుకలిగి శరీరము క్షీణించును. నేత్రరోగములు కల్గును. శరీరమునందు దుర్గంధము కల్గును. వాంతియు అతిసారమును కల్గును.

### ముఖమండలికాలక్షణము

ప్రసన్నవర్ణవదనః సిరాభిరభిసంవృతః,
మూత్రగన్ధీచ బహ్వాశీ ముఖమండలికాగ్రహీ. 28
(ముఖమణ్డితయా భవేత్.)

ముఖమండలిక యను గ్రహము పూనినపుడు శిశువునకు ముఖము నిర్మలమై మంచికాంతి గల్గియుండును. సిరల (సన్ననినరముల) చే శరీర మావరింపబడి యుండును. శరీరమున మూత్రమువంటి దుర్గంధము కల్గియుండును. మామూలుకన్న నధికముగ నాహారమును భుజించును.

## నైగమేయగ్రహలక్షణము

ఛర్దిస్సృన్దనకణ్ఠాస్యశోషమూర్ఛావిగన్ధతాః,
ఊర్ధ్వం పశ్యేద్దశేద్దన్తానై గమేయం గ్రహం వదేత్. 29

నైగమేయ యను గ్రహము ఆవేశించినపుడు వాంతియగును. శరీరము వడకును. కుత్తుకయు నోరును ఎండును. మూర్ఛగ్రమ్మును. శరీరముపై దుర్గంధము పుట్టును. పైన చూచును. పండ్లు కొఱుకును. (ఈలక్షణములు కల్గినపుడు నైగమేయగ్రహం బావరించిన దని తెలియందగు.)

## * బాలగ్రహాసాధ్యలక్షణములు

ప్రస్తబ్ధాక్షః స్తనద్వేషీ ముహ్యతే చానిశం ముహుః,
తం బాలమచిరాద్ధన్తి గ్రహాః సంపూర్ణలక్షణాః. 30

బాలగ్రహావేశము కల బాలుడు కన్నులు రెప్పవాల్చక స్తంభించి, చనుపాలు ద్రావ నిచ్చలేక, ఎల్లప్పుడుగాని అప్పుడప్పుడుగాని మైకము గ్రమ్మి అయాగ్రహములకు జెప్పిన లక్షణములు పూర్తిగ కల్గియున్నయెడ నట్టి గ్రహపీడితుని ఆగ్రహము తప్పక చంపును.

(ఇచ్చట వాగ్భటమున జెప్పబడిన పండ్రెండు బాలగ్రహములలో కొన్ని మాత్రము చెప్పబడినవి. తక్కినవాని లక్షణముల వాగ్భటమున జూచునది.)

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
బాలరోగనిదానం సమాప్తమ్.

---

* ప్రక్షిప్తము-మధుకోశమున నిది లేదు.

# ౬౯. విషరోగనిదానమ్

ఇవ్విధంబున జ్వరాదిరోగముల నన్నిటికిని నిదానమును సవిస్తరముగ జెప్పి చికిత్సానిమిత్తము విషముచే గల్గు లక్షణముల దెల్పునట్టి విషనిదానమును జెప్పుట:—

## విష భేదములు

స్థావరం జఙ్గమం చైవ ద్వివిధం విషముచ్యతే,
మూలాద్యాత్మకమాద్యం స్యాత్పరం సర్పాదిసంభవమ్. 1

విషము సామాన్యముగ స్థావర మనియు, జంగమ మనియు రెండు తెరంగులు. అందు దుంపలు వేళ్లు మున్నగువానికి సంబంధించిన విషము స్థావరము. సర్పములు కుక్క నక్క మున్నగు జంతువులను సంబంధించిన విషము జంగమము. (ఒక చోట నుండి మరియొకచోటికి తనంతటపోవు శక్తిలేక, యున్నచోటన యుండునది స్థావరము అయ్యవి మూలకందాదులు వానికి సంబంధించిన విషము స్థావరము. నలుగడల స్వయముగ సంచరించు శక్తికల జంతువులు జంగమములు. అయ్యవి పాము, తేలు మున్నగునవి. వానికి సంబంధించిన విషము జంగమము.)

పై జెప్పిన విషములు రెండింటియందును గల యవాంతరభేదములను అవి యాశ్రయించియుండు అధిష్ఠానభేదములచే నిర్ణయించి సుశ్రుతాచార్యు లిట్లు చెప్పెను:— "స్థావరం జంగమం చైవ ద్వివిధం విషముచ్యతే, దశాధిష్ఠానమాద్యం తు ద్వితీయం షోడశాశ్రయమ్. మూలం పత్రం ఫలం పుష్పం త్వక్క్షీరం సార ఏవచ, నిర్యాసో ధాతవశ్చైవ కన్దశ్చ దశమస్స్మృతః" (సుశ్రుత. కల్ప. అ. ౨. శ్లో. ౧.) "తత్ర దృష్టి నిశ్వాస దంష్ట్రా నఖ మూత్ర పురీష శుక్ర లాలాఽర్తవ ముఖసందంశవశర్ధిత (పర్ధిత) గుదాస్థి పిత్తశూకశవానీతి" (సుశ్రుత. కల్ప. అ. 3. సూ. ౨.) స్థావరము జంగమము నని విషములు రెండు విధములు. అందు స్థావరవిషము పది విధములైన ద్రవ్యముల నాశ్రయించియు, జంగమవిషము పదునారింటి నాశ్రయించియు నుండును. ఎట్లనన—వృక్షాదులకు సంబంధించిన మూలము (వేళ్లు), ఆకులు, పండ్లు, పువ్వులు, పట్ట, పాలు, సారము (చేవ), నిర్యాసము (బంక), ధాతువులు (పాషాణము తాళకము మున్నగునవి), దుంపలు అను నీ పదియు స్థావర విషమునకు ఆశ్రయములై యుండును. (ఆయా ద్రవ్యము నాశ్రయించినవిషము ఆ యానామములచే (మూలవిషము పత్రవిషము మున్నగు పేరులచే) వ్యవహరింపబడి పది భేదములు కల్గియుండు ననుట.)

జంగమవిషము జంతువులకు సంబంధించిన దృష్టి (చూపు), నిశ్వాసము, కోరలు, గోళ్లు, మూత్రము, మలము, శుక్రము, నోట వెడలుజొల్లు, ఆల (తోక), ఆర్తవము (ఋతు సంబంధమైన రక్తము), ముఖసందంశము (నోటిపండ్లనుచేర్చి కొఱకబడిన కాటు), అపానవాతముతో చేరిన గుదము, అస్థి (ఎముకలు), పిత్తము (పిత్తకోశమునసుండు జిగురు), ముల్లు, శవము అను నీ పదునారింటి నాశ్రయించి యుండును. కావున పదు నారు విధముల నుండును. ఇవికూడ దృష్టివిషము, నిశ్వాసవిషము మున్నగు నామభేద ములచే వ్యవహరింపబడును. వీని కన్నిటికిని లక్షణములు సుశ్రుతమునందలి కల్పస్థాన మున విపులముగ గానంబడియెడు. అవియెల్ల విస్తరభీతిచే నిట వివరింపబడవయ్యె.

## జంగమవిషసామాన్యలక్షణములు

నిద్రాం తన్ద్రాం క్లమం దాహం అపాకం లోమహర్షణమ్,
శోథం చైవాతిసారం చ జఙ్గమం కురుతే విషమ్. 2

పైజెప్పిన జంగమవిషముచేత నిద్రయు మైకంబును కల్గును. బడలికయు తాపం బును పుట్టును. తిన్నయన్నము జీర్ణము కాదు. శరీరమున వెండ్రుకలు నిట్ట పొడిచి యుండును. వాపును అతిసారంబును కల్గును. (ఈ యుపద్రవము లన్నియు జంగమ విషమున గల్గు నని భావము.)

## స్థావరవిషలక్షణము

స్థావరం చ జ్వరః హిక్కాం దన్తహర్షగలగ్రహమ్,
ఫేనచ్ఛర్ద్యరుచిశ్వాసం మూర్ఛాంచ కురుతే విషమ్ (భృశం). 3

స్థావరవిషము జ్వరమును, ఎక్కిళ్ళను కల్గించును. పండ్లు పులుపై శీతోష్ణాది స్పర్శము నోరుపజాల కుండును. కుత్తుక పట్టియుండును. నురుగు వాంతి యగును. అరోచ కంబును శ్వాసంబును మూర్ఛయు కల్గును.

## విషముపెట్టినవానిలక్షణముల నెఱుంగువిధము

ఇంగితజ్ఞో మనుష్యాణాం వాక్చేష్టాముఖవైకృతైః,
జానీయాద్విషదాతారం ఏభిర్లిఙ్గైశ్చ బుద్ధిమాన్. 4
న దదాత్యుత్తరం పృష్టో వివక్షుర్మోహమేతి చ,
అపార్థం బహుసఙ్కీర్ణం భాషతే చాపి మూఢవత్. 5
హసత్యకస్మాత్స్ఫోటయేదఙ్గులీర్విలిఖేన్మహీమ్,

వేపథుశ్చాప్యస్య భవతి త్రస్తశ్చాన్యోన్యమీక్షతే. 6
వివర్ణవక్త్రో ధ్యామశ్చ నఖైః కిఞ్చిచ్ఛినత్త్యపి,
అలభేతాసనం దీనః కరేణ చ శిరోరుహమ్. 7
వర్తతే విపరీతశ్చ విషదాతా విచేతనః,

లోకమున మనుజుల మనస్సుల నుండు భావములను జక్కఁగ దెలిసికొను సమర్థుఁడగు వైద్యుఁడు ఇతరులకు విషమును బెట్టినవానిని చక్కఁగ గమనించి వానిమాటలచేతను చేష్టలచేతను, ముఖవికారమునుబట్టియు వీఁడు విషముపెట్టినవాఁ డని యూహింపవలెను. వానిలక్షణము లెవ్వియన—విషముపెట్టిన మనుజుని పలుమారు అడిగినను బదులు చెప్పఁడు. ఒకవేళ నిర్బంధముచేత బదులు చెప్ప దలచినను మూఢుఁడై యేమియు దోఁచక యూరకుండును. ఒక సమయమున సంబంధములేని మాటలుకలిపి మూఢునివలె వదరును. కారణములేకయే నవ్వును. వ్రేళ్లు మెటికలు విరుచును. పుడమిపై గీచును. అట్టివానికి వణకుపుట్టును. భయపడి చుట్టునున్నవారి ముఖముల పలుమారు చూచును. ముఖమున వర్ణము మారియుండును. ఏపనియు దోఁచక గోళ్లచేత తృణాదుల ద్రుంచుచుండును. మిక్కిలి దీనుఁడై యాసనముపై గూర్చుండును. చేత వెండ్రుకలను తలను దడవికొనును. అన్నివిషయములయందును విరుద్ధముగ నుండును. మతిలేకుండువాఁడుగా నుండును. ఇట్టి లక్షణములను చక్కఁగ గమనించి విషము పెట్టినవానిని నిర్ణయింపవలెనని భావము.

### స్థావరవిషబాధితుని లక్షణములు

ఉద్వేష్టనం మూలవిషైః ప్రలాపో మోహ ఏవ చ. 8
జృంభణం వేపనం శ్వాసః జ్ఞేయం పత్రవిషేణ తు,
*శు (ము)ష్కశోథః ఫలవిషైః దాహోఽన్నద్వేష ఏవ చ. 9
భవేత్పుష్పవిషైశ్ఛర్ది రాధ్మానం శ్వాస ఏవ చ,
త్వక్సారనిర్యాసవిషైరుపయుక్తైర్భవన్తి హి. 10
ఆస్యదౌర్గన్ధ్యపారుష్యశిరోరుక్కఫసంస్రవాః,
ఫేనాగమః క్షీరవిషైః విడ్భేదో గురుగాత్రతా. 11
హృత్పీడనం ధాతువిషైః మూర్ఛాదాహశ్చ తాలుని,
ప్రాయేణ కాలఘాతీని విషాణ్యేతాని నిర్దిశేత్. 12

మూలవిషములచేత మనుజునకు కాలుసేతులు కొంకరలుపోయి లాగుచుండుటచే బొరలును. సంబంధములేక యిచ్చవచ్చినటులు వదరును. మూర్ఛ గ్రమ్మును పత్ర(ఆకుల

* శుష్కశోథః అనుపాఠము చింత్యము-ముష్కశోథః అను పాఠమే మధుకోశ సమ్మతము-ముఖశోషః అని పాఠాంతరము.

యందలి) విషముచేత ఒడలి విరుపులతో నావలింతలు వచ్చును. శరీరము వణకును. శ్వాస మధికమగును. ఫల (పండ్లు కాయలయందలి) విషముచేత *శుష్కమైనవాపు (వృషణములయందు వాపు) కల్గును. తాపంబును అన్నద్వేషంబును కల్గును. పుష్ప (పువ్వులయందలి) విషముచేత వాంతి కల్గును. కడు పుబ్బరించును శ్వాస మధికమగును. త్వక్ (పట్టయొక్క) సార (చేవయొక్క) నిర్యాస (బంకయొక్క) విషములచేత నోట దుర్గంధము కల్గును. శరీరము కరకరలాడుచుండును. తలనొప్పి కల్గును. నోట కఫము వెడలును. క్షీర (చెట్టుపాల) విషముచేత నోట నురుగు వెడలును మలము ఉండలై ద్రవముగ వెడలును. శరీరము బరువై యుండును. తాళకము పాషాణము మున్నగు ధాతువుల విషముచేత రొమ్మునొప్పియు, మూర్ఛయు, తాలువులయందు మంటయు పుట్టును. పైజెప్పిన పదివిధములైన స్థావరవిషములు ఆయావిషముల బలమునుబట్టి కాల క్రమముగ వేగమునుజూపి ప్రాణముల హింసించును.

## విషదిగ్ధశస్త్రాహతలక్షణము

సద్యః క్షతం పచ్యతే యస్య జన్తోః స్రవేద్రక్తం పచ్యతే చాప్యభీక్ష్ణమ్,
కృష్ణీభూతం క్లిన్నమత్యర్థపూతి క్షతాన్మాంసం శీర్యతే చాపి యస్య. 13
తృష్ణామూర్ఛాజ్వరదాహాశ్చ యస్య దిగ్ధాహతం తం పుమాంస(ము)ం వ్యవస్యేత్, లిఙ్గాన్యేతాన్యేవ కుర్యాదమిత్రైర్వ్రణేవిషంయస్యదత్తం ప్రమాదాత్. 14

తనకు కానివారు (శత్రువులు) కత్తి మొదలగు నాయుధములకు విషముపూసి ప్రహారించిన, గాయము తగిలినయెడ దెబ్బతగిలినతోడనే గాయము పక్వమై రక్తము గారును. అధికముగ పుండగును. నల్లనై మిక్కిలి దుర్గంధముతోగూడి కుళ్ళి గాయమునుండి మాంస మూడిపడును. మరియు దప్పియు, మూర్ఛయు, జ్వరమును, తాపమును విశేషముగ గల్గును. మరియు శత్రువులు మాయచేసి వ్రణమునందు విషము నుంచినను పైజెప్పబడిన లక్షణములు గానవచ్చును.

## విషమును ద్రావినవాని లక్షణములు

సపీతం గృహధూమాచ్ఛం పురీషం యోఽతిసార్యతే,
ఫేనముద్వమతే చాపి విషపీతం తమాదిశేత్. 15

విషమును ద్రావినవానికి పురీషము పచ్చనిరంగుకలిసిన కరిదూమమును బోలిన రంగుతో విరేచనము లగును. నోట నురుగును వాంతిని జేయును.

---

* వాపు శుష్కమైయుండుట సంభవము. కాన నీపాఠము చింత్యము.

## సర్పభేదములు

వాతపిత్తకఫాత్మానః భోగిమణ్డలరాజిలాః,
యథాక్రమం సమాఖ్యాతాః ద్వ్యంతరాః ద్వన్ద్వరూపిణః. 16

సర్పములలో భోగి, మండలము, రాజిలము అను మూడు జాతులు ప్రధానములుగ నుండును. అందు భోగి యనునది ఫణము (పడగ) కల్గినది. ఇయ్యది వాత ప్రకృతి కల్గియుండును. వాతముచే గల్గు నుపద్రవముల గల్గించును. పొడలు కల్గి యుండునది మండలి యనబడును. ఇది పిత్తప్రకృతి కల్గి పిత్తప్రకోపమున గల్గు నుపద్రవముల గల్గించును. తెల్లనిచారలు గల్గినది రాజిలము. ఇయ్యది కఫప్రకృతి కల్గి కఫమున గల్గు నుపద్రవముల గల్గించును. పై జెప్పిన వాతాదిప్రకృతులు గల మూడు సర్పజాతులలో రెండేసి సర్పజాతుల సంపర్కమున బుట్టిన సర్పజాతులు ద్విదోష ప్రకృతి కల్గి యుండును. (భోగిమండలి యను సర్పముల రెండింటి సంపర్కముచే కల్గిన సర్పజాతి వాతపిత్తప్రకృతి కల్గియుండు ననియు, భోగి రాజిల సర్పముల సంబంధమున గల్గిన సర్పజాతి వాత కఫ ప్రకృతి కల్గియుండు ననియు, మండలరాజిల సర్పముల సంపర్కమున గల్గిన సర్పజాతి పిత్త కఫ ప్రకృతి కల్గియుండు ననియు భావము.)

## సర్పదష్టలక్షణము

దంశో భోగికృతః కృష్ణః సర్వవాతవికారకృత్,
పీతో మణ్డలిజశ్శోథో మృదుః పిత్తవికారవాన్. 17
రాజిలోత్థో భవేద్దంశః స్థిరశోథశ్చ పిచ్ఛిలః,
పాణ్డుస్స్నిగ్ధోఽతిసాన్ద్రాస్సృక్సర్వశ్లేష్మవికారకృత్. 18

భోగి యను సర్పము కరచినయెడ కాటు నల్లగ నుండును. ఇది కరచిన విషముచేత వాతమున గల్గు రోగములు అన్నియు కల్గును. మండలి యను సర్పము కరచినచో కాటు పచ్చనై యుండును. దీనివిషముచేత మెత్తని వాపు కల్గి పిత్తమున కల్గు నుపద్రవములన్నియు గల్గును. రాజిలం బను సర్పము కరచిన కాటు గట్టిగానుండు వాపు కలిగి, పాండువర్ణంబును స్నిగ్ధంబును మిక్కిలి చిక్కనైన రక్తము కల్గినదియు నై యుండును. ఈ విషమునందు కఫమున గల్గు రోగములన్నియు కల్గును.

(మఱియు పై జెప్పిన ద్వంద్వజాతి సర్పములు కరచినప్పుడు సంసర్గలక్షణమును గానవచ్చును.)

### అసాధ్యసర్పవిషనిర్ణయము

అశ్వత్థదేవాయతనశ్మశానవల్మీకసన్ధ్యాసు చతుష్పథేషు,
యామ్యేచ దష్టాః పరివర్జనీయాః ఋక్షేసి రామర్మసుయేచదష్టాః.
దర్వీకరాణాం విషమాశుఘాతి సర్వాణి చోష్ణే ద్విగుణీ భవన్తి,

రావిచెట్టుక్రిందను, దేవాలయములయందును, శ్మశానములయందును పుట్టదగ్గిరను, సంధ్యాకాలమునందును, నాల్గుత్రోవలు కలియు స్థలమునందును, పాము కరచినను; యమదేవతాకమైన భరణీ నక్షత్రమునాడును, సిరలయందును, మర్మస్థలములయందును పాము కరచినను విషము అసాధ్యమగును; కావున చికిత్స జేయంజనదు. పైజెప్పిన స్థలకాలవిశేషములచేత సర్పములకు విషము రెట్టింతయగును కావున నతిశీఘ్రముగ చంపును. మరియు నుష్ణకాలమునందును, ఉష్ణప్రధానములగు వస్తువుల సేవించినను, అన్ని విధములగు సర్పములయొక్క విషములును రెట్టింపు శక్తి కలవగును.

మఱియు కొన్ని యసాధ్యలక్షణములు తంత్రాంతరమున నిట్లు కానంబడియెడు:—"ఆర్ద్రాశ్లేషా మఘా మూలా కృత్తికాభరణీషు చ, పఞ్చమ్యాం సన్ధ్యయోర్దర్శే మర్మస్వాశుహరేషు చ, దష్టాః కష్టేన జీవంతి యది దూతాదిసమ్పదః" ఆర్ద్ర, ఆశ్లేష, మఖ, మూల, కృత్తిక, భరణి అను నీ నక్షత్రములయందును, పంచమినాడును, రెండు సంధ్యలయందును, అమావాస్యనాడును సర్పము కరచినయెడ దూతలు మొదలగు సంపత్తి యుండినచో మిక్కిలి కష్టముచే బ్రతుకుదురు. (వెంటనే విషవైద్యుని బిలుచు దూత లుండి త్వరగా చికిత్స జరిగిన బ్రతుకు ననుట.) మఱియు సద్యః ప్రాణహర మర్మములయందు కరచిన నయ్యది మిక్కిలి యసాధ్యమై శీఘ్రముగ జంపును. సద్యః ప్రాణహరమర్మములు సుశ్రుతమున నిట్లు చెప్పబడినవి.—"శృఙ్గాటకాన్యధిపతి శ్శఙ్ఖౌ కణ్ఠ సిరా గుదమ్, హృదయం వస్తి నాభీ చ ఘ్నన్తి సద్యోహతాని తు" (సుశ్రుత. శా. అ. ౬.) శృంగాటకము (కనుబొమల మధ్యదేశము), అధిపతి, కణతలు, కంఠమునందలి సిరలు, గుదము, హృదయము, వస్తి, నాభి అనునివి సద్యః ప్రాణహర మర్మములు.

### కొన్ని యసాధ్యవిషలక్షణములు

అజీర్ణపిత్తాతపపీడితేషు బాలేషు వృద్ధేషు బుభుక్షితేషు. 20
క్షీణక్షతే మేహిని కుష్ఠయుక్తే రూక్షేఽబలే గర్భవతీషు చాపి,

భుజింపబడిన యన్నము జీర్ణకాకుండునపుడును, పిత్తప్రకోపముచేతను ఎండచేతను బీడింపబడినపుడును. పాముకరచిన విషము మిక్కిలి క్రూరమగును. మఱియు

బాలురు, వృద్ధులు, ఆకలిగొన్నవారు, క్షతమువలన రసాదిధాతువులు క్షీణించినవారు, ప్రమేహవ్యాధిచే పీడితులు, కుష్ఠవ్యాధి కలవారు, శరీరమున జిడ్డులేక రూక్షమైనవారు, బలహీనులు, గర్భవతులైన స్త్రీలు వీరిని సర్పము కరచిన మిక్కిలి క్రూరమై ప్రాణముల హింసించును.

శస్త్రక్షతే యస్య న రక్తమేతి రాజ్యో లతాభిశ్చ న సమ్భవన్తి. 21
శీతాభిరద్భిశ్చ న రోమహర్షః విషాభిభూతం పరివర్జయేత్తమ్,

పాము కరచినప్పుడు కత్తిచే కాటువేసినయెడ రక్తము కాటునందు స్రవించకున్నను, తీగెలు మున్నగువానిచే గొట్టినచో రేఖలు (తట్లు) ఏర్పడకున్నను, చల్లని నీళ్ళు పై జల్లిన రోమాంచము గలుగకున్నను సర్పవిషముచే బీడితుడు మృతుడైనట్లు తలచి విడువవలెను.

జిహ్మం ముఖం యస్య చ కేశశాతః నాసావసాదశ్చ సకణ్ఠభఙ్గః. 22
కృష్ణస్సరక్తశ్శ్వయథుశ్చ దంశే హన్వోస్స్థిరత్వం చ వివర్జనీయః,

సర్పము కరచి విష మెక్కినపుడు నోరు వంకరగనున్నను, వెండ్రుక లూడినను, మెడ ప్రేలాడినను, ముక్కు కృశించినను, కాటునందు రక్తము నల్లనై వాపు కల్గినను, అంగిళ్ళు గట్టిగ పట్టుకొని బిగిసియున్నను విషము అసాధ్యమై చంపును.

వర్తిర్ఘనా యస్య నిరేతి వక్త్రాత్ రక్తం స్రవేదూర్ధ్వమధశ్చయస్య.
దంష్ట్రానిపాతాశ్చతురశ్చ యస్య తం చాపి వైద్యః పరివర్జయేచ్చ,

పాము విషమెక్కినపుడు చిన్నదై తంతివలె నుండు చొంగ నోట వెడలినను, నోరు ముక్కులు మొదలగు శరీరోర్ధ్వభాగమునం గల రంధ్రములనుండియు, గుదము మూత్రద్వారము మున్నగు నధోరంధ్రములనుండియు రక్తము గారుచున్నను, కాటున నాలుగు కోరలకాట్లు ఏర్పడినను విషము మిక్కిలి యసాధ్యమగును. కావున చికిత్స చేయజనదు.

ఉన్మత్తమత్యర్థ ముపద్రుతం వా హీనస్వరం వాప్యథవా వివర్ణమ్.
సారిష్టమత్యర్థమవేగినం చ జ్ఞాత్వా నరం కర్మ న తత్ర కుర్యాత్,

సర్పవిషము వ్యాపించినపుడు ఉన్మాదముపట్టి యుపద్రవము లధికముగ బాధించుచున్నను, కంఠస్వరము హీనమైనను, ముఖమున వర్ణముమారి నల్లబడియున్నను, నాసాభంగము మున్నగు నరిష్ట (మరణసూచక) లక్షణములు గాన్పించినను, మలమూత్రాది వేగములు అణగియున్నను విషము అసాధ్యమగును కావున విడువదగును.

(ఇత్తెరంగున సర్పవిషలక్షణములు సూచనామాత్రముగ నిచట జెప్పబడినవి. అగదతంత్రప్రధానమైన గ్రంథమునందును, సుశ్రుతమునందును విపులముగ జెప్పబడి యున్నవి. వాని నిట విస్తరశంకచే వ్రాయ విరమించినాడ.)

### దూషీవిషస్వరూపము

జీర్ణం విషఘ్నౌషధిభిర్హతం వా దావాగ్ని వాతాతపశోషితం వా.
స్వభావతో వా గుణవిప్రహీనం విషంహి దూషీవిషతాముపైతి,

విషహరంబులైన యౌషధాదులచే మందవీర్యముగా జేయబడినను, కార్చిచ్చు గాలి ఎండ మున్నగువానిచే నెండినను, విషము తన స్వాభావికమైన తీవ్రత నుడిగి జీర్ణమై (ప్రాతగిలి) తనకు స్వతస్సిద్ధములగు వ్యవాయి వికాసి మున్నగు గుణము తగ్గి యున్నను; లేక స్వభావముచేత వ్యవాయి మున్నగు గుణములలో కొన్ని లేకున్నను, అట్టి విషము దూషీవిష మని చెప్పబడును. (ఇది శరీరమునందు అణగియుండి నానాట రసరక్తాది ధాతువులను కాలక్రమమున జెరచును; కావున దూషీవిష మని చెప్పనగును.)

### దూషీవిషమున గల్గులక్షణములు

వీర్యాల్పభావాన్నవిపాతయేత్తత్కఫాన్వితం వర్షగణానుబన్ధి. 26
తేనార్దితో భిన్నపురీషవర్ణో వైగన్ధ్యవైరస్యయుతః పిపాసీ,[యాద్వా.
మూర్ఛాం భ్రమం గద్గదవాగ్వమిం చ విచేష్టమానోఽరతిమాప్నుయాత్

అట్టి దూషీవిషము మిక్కిలి సల్పమైన వీర్యము కల్గియుంటంజేసి మనుజుని జటాలున జంపక కఫముతోగూడి యనేకవత్సరముల పర్యంతము శరీరమునంద యణగి యుండును. అట్టి దూషీవిషముచే బాధితుడగు మనుజునకు పురీషము ఉండలై యొండి వెడలును. శరీరవర్ణము మారియుండును. శరీరమున నొక విధమైన దుర్గంధము కల్గి యుండును. నోట రుచి తెలియకుండును. దప్పి యధిక మగును. మూర్ఛ గ్రమ్మును. చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగున ట్లుండును. కంఠస్వరము డగ్గుత్తికతో వెడలును. వాంతి యగును. శరీరము వేదనసహింపక పొరలాడును. దేనియందును ఇష్టము లేకుండును.

### ఆమపక్వాశయస్థ దూషీవిషలక్షణము

ఆమాశయస్థే కఫవాతరోగీ పక్వాశయస్థేఽనిలపిత్తరోగీ,
భవేత్సముద్ధ్వస్తశిరోరుహాఙ్గో విలూనపక్షస్తు యథా విహఙ్గః. 28

అట్టి దూషీవిషము ఆమాశయమున జేరినపుడు కఫవాతరోగములచే బీడింపబడును. పక్వాశయమున జేరెనేని వాతపిత్తరోగములచే బాధింపబడును. మఱియు

తలయందును శరీరమునందును నున్న వెండ్రుకలన్నియు నూడి శరీరము కృశించి రెక్కలన్నియు నూడ బెరకబడిన పక్షియుంబోలె వికృతరూపము కల్గియుండును.

(మఱియును తంత్రాంతరమున "సీదన్తికేశా లోమాని తస్మిన్ పక్వాశయాశ్రితే" అని యున్నది. కావున, ప్రకృతమూలమున శిరోరుహాశబ్దము వెండ్రుకల సామాన్యమునకు వాచ్యము కావున తలవెండ్రుకలును శరీరమునందలి రోమంబులును ఊడు నని యర్థము జెప్పుట సమంజసము.)

### రసాదిధాతుగతదూషీవిషలక్షణము

స్థితం రసాదిష్వథవాయథోక్తాన్ కరోతిధాతుప్రభవాన్ వికారాన్,
కోపంచశీతానిలదుర్దినేషుయాత్యాశుపూర్వం;శృణుతస్యరూపమ్.29
నిద్రాగురుత్వంచ విజృమ్భణం చ విశ్లేషహర్షావథవాఙ్గమర్దమ్,
తతః కరోత్యన్నమదావిపాకౌ అరోచకం మణ్డలకోఠజన్మ. 30
మాంసక్షయంపాదకరప్రశోథంమూర్చ్ఛాంతథాఛర్దిమథాతిసారమ్,
దూషీవిషంశ్వాసతృషాజ్వరాంశ్చకుర్యాత్ప్రవృద్ధింజఠరస్యచాపి. 31
ఉన్మాదమన్యజ్జనయేత్తథాన్యదానాహమన్యత్ క్షపయేచ్చశుక్రమ్,
గాద్గద్యమన్యజ్జనయేచ్చకుష్ఠంతాంస్తాన్వికారాంశ్చబహూన్ప్రకారాన్.

దూషీవిషము రసరక్తాదిధాతువులకు జేరినపుడు ఏధాతువున జేరునో ఆధాతువునకు సంబంధించిన వ్యాధులు సంభవించును. శరీరమునం దణగియున్న దూషీవిషము మంచుకాలమునందును, గాలి విశేషముగ వీచునప్పుడును, మబ్బు గ్రమ్మియుండు వర్షాకాలమునందును తటాలున బ్రకోపము నొందును. అయ్యది ప్రకోపించుటకు మునుమున్ను నిద్ర విశేషముగ వచ్చును. శరీరము బరువై యుండును. ఒడలి విరుపులును ఆవలింతలును విశేషముగ వచ్చును. కీళ్లు సడలి యుండును. శరీరము గగురుపాటు గల్గియుండును. అవయవము లన్నియు నొచ్చును. పిమ్మట నానాట అన్నమును భుజించినపుడు తిక్కయెత్తినట్లుండి జీర్ణము కాకుండును. నోటి కరుచి కల్గును. శరీరముపైని పొడలును దద్దులును పుట్టును. శరీరమునందలి మాంసము నశించును. కాళ్లయందును చేతులయందును వాపుకల్గును. మూర్ఛగ్రమ్మును. వాంతియు విరేచనంబును గల్గును. శ్వాసం బధికమగును. డప్పి కల్గును. జ్వరము వచ్చును. కడుపు నానాట పెద్దది యగును. మఱియు నొక దూషీవిష మున్మాదమును గల్గించును. మరియొకటి కడుపుబ్బరమును బుట్టించును. వేరొకటి శుక్రమును నశింపజేయును. ఇంకొకటి గద్గదస్వరము (డగ్గుత్తిక)ను గల్గించును.

వేరొండు కుష్ఠమును బుట్టించును. ఇత్తెరంగున దూషీవిషము నానావిధములగు రోగములు దేశకాలానుగుణముగ శీతోష్ణపరిస్థితుల కనుగుణముగ గల్గించును. విసర్పము మున్నగు వ్యాధులు గూడ నీ దూషీవిషమున గల్గును.

### దూషీవిష మనుట కన్వర్థత

దూషితం దేశకాలాన్నదివాస్వప్నై రభీక్ష్ణశః,
యస్మాత్సన్దూషయేద్ధాతూ౯ తస్మాద్దూషీవిషం స్మృతమ్. 33

దేశముయొక్కయు కాలముయొక్కయు ఆహారముయొక్కయు వైపరీత్యము చేతను, పగలు నిదురించుటచేతను శరీరమునందు లీనమై యణగియుండు విషము దుష్టమై ప్రకోపమునొంది రసాదిధాతువుల జెరచును; కావున నియ్యది దూషీవిష మని యన్వర్థముగ జెప్పబడును.

### దూషీవిషసాధ్యాసాధ్యత్వములు

సాధ్యమాత్మవతస్సద్యో యాప్యం సంవత్సరోత్థితమ్,
దూషీవిషమసాధ్యం స్యాత్ క్షీణస్యాఽహితసేవినః. 34

ఇంద్రియముల నిగ్రహించి పథ్యము నాచరించువానికి తాత్కాలికమగు దూషీవిషము సాధింపందగియుండును. ఒక సంవత్సరకాలము అనుసరించుచుండు దూషీవిషము యాప్యము. శరీరమున ధాతువులు క్షీణించినవానికిని, అపథ్యముల సేవించువానికిని గల్గినది యసాధ్యము.

### పెట్టుడుమందున గల్గు నుపద్రవము

సౌభాగ్యార్థం స్త్రియస్స్వేదం రజో నానాఙ్గజాన్మలా౯,
శత్రుప్రయుక్తాంశ్చ గరా౯ ప్రయచ్ఛన్త్యన్నమిశ్రితాన్. 35
తైస్స్యాత్పాణ్డుః కృశోఽల్పాగ్నిః గరశ్చాస్యోపజాయతే,
మర్మప్రమథనాధ్మానం హస్తయోశ్శోథలక్షణమ్. 36
జఠరం గ్రహణీదోషో యక్ష్మాగుల్మః క్షయో జ్వరః,
ఏవంవిధస్య చాన్యస్య వ్యాధేర్లిఙ్గాని దర్శయేత్. 37

స్త్రీలు పురుషులను తమకు వశముచేసికొని సుఖము నధికముగ నొంద దలంచి, తమ శరీరమునందలి చెమట బుతురక్తము మున్నగు నానావిధమలములను ఔషధవిశేషములగూర్చి యన్నాదులతో జేర్చి పురుషులకు బెట్టెదరు. మరియు శత్రు

వులు చెడ్డతలంపులు ప్రేరేపించి విషపదార్థములను అన్నము మున్నగు నాహారపదార్థములగూర్చి పెట్టెదరు. అయ్యది జీర్ణముగాక శరీరమునందే యుండును. (ఇదియే గర మను విషభేద మని చెప్పబడును.) దానివలన పాండురోగంబును కృశత్వంబును, అగ్నిమాంద్యంబును కల్గును. మర్మస్థలములయందు మథించినవిధముగ బాధ కల్గును. కడుపుబ్బరము కల్గును. కాలుసేతులయందు వాపుతోగూడిన ఉదరవ్యాధియు, గ్రహణికి సంబంధించిన విరేచనాదివ్యాధులును, రాజయక్ష్మంబును, గుల్మంబును, ధాతుక్షయంబును, జ్వరంబును కల్గును. మరియు విస్ఫోటకము మున్నగు నితర వ్యాధులును కల్గును. పూర్తిగ నీవ్యాధులు కల్గకున్నను వానిలక్షణములుమాత్రమైన గానంబడును.

—లూతాలక్షణము ; దానియుత్పత్తియు—

యస్మాల్లూనం తృణం ప్రాప్తాః మునేః ప్రస్వేదబిన్దవః,
తస్మాల్లూతాస్తు భాష్యన్తే సంఖ్యయా తాశ్చ షోడశ. 38

చిరంతనకాలమున వసిష్ఠమహర్షికి కోపావేశము ముఖమున చెమట బట్టెను. ఆచెమటయొక్క బిందువులు క్రిందపడియున్న నొక తృణము పయింబడెను. కోపమున గల్గిన యగ్నితోగూడిన యాస్వేదబిందువులు పురుగులై యుండెను. అయ్యవి ఛేదింపబడిన తృణముపైబడి పుట్టుటంజేసి లూత అను శబ్దముచే పిలువంబడియె. కోపాగ్నివలన బుట్టుటంజేసి యయ్యవి యాగ్నేయమగు విషస్వరూపమును వహించెను. అవి పదునారు విధము లని చెప్పబడియె (లూత యన సాలెపురుగులు.)

(కోపప్రధానుడగు విశ్వామిత్రుడు మున్ను పెద్దకాలంబున వసిష్ఠుని హోమధేనువు నపహరింపబూనుటయు, నావసిష్ఠుడు కోపారుణితలోచనుండై సూర్యుని వీక్షింప తన మొగముపై జెమ్మటపొడమి బిందువులు చెంగటనున్న తృణములపయింబడ నవియెల్ల పురువులై లూత యను పేర ప్రసిద్ధంబులయ్యె. నాటంగోలె నవి విషముతో గూడి బాధింపందొడంగె నను పురాణగాథ నిచ్చట నెఱుంగునది.)

ఈపురాణగాథనే యనువదించి సుశ్రుతాచార్యులు లూతలప్రాగుత్పత్తి నిట్లు చెప్పెను:—"వక్ష్యామి లూతాప్రభవం పురాణమ్. సామాన్యతో దష్టమసాధ్య సాధ్యం చికిత్సితం చాపి యథావిశేషమ్.

విశ్వామిత్రో నృపవరః కదాచిదృషిసత్తమమ్, వసిష్ఠం కోపయామాస గత్వాశ్రమ పదంకిల. కుపితస్య మునేస్తస్య లలాటాత్ స్వేదబిన్దవః, అపతన్దర్శనాదేవ మథస్తాత్తీక్ష్ణవర్చసః. లూనే తృణే మహర్షీణాం ధేన్వర్థం సమ్భృతేఽపి చ, తతో

జాతాస్త్వేమాఘోరాః నానారూపా మహావిషాః అపకారాయ వర్తన్తే నృపసాధన వాహనే, యస్మాల్లూనం తృణంప్రాప్తాః మునేఃప్రస్వేదబిన్దవః, తస్మాల్లూతేతి భాష్యన్తే సంఖ్యయాతాశ్చషోడశ" (సు. క. అ. ౮.)

ఈకీటముల పదునారు భేదములు సుశ్రుతునిచే నిట్లు పేర్కొనబడియె —

"త్రిమణ్డలా తథా శ్వేతా కపిలా పీతకా తథా, లాలామూత్రవిషారక్తా కఠినా చాష్ట మీతథా. సౌపర్ణికా లాజవర్ణా జాలిన్యేకపదీ తథా, కృష్ణాగ్నివక్త్రా కాణ్డా చ మాలా గుణ్యష్టమీ మతా" (సుశ్రుత. కల్ప. అ. ౮.) త్రిమండల (మూడుమచ్చలు కల్గినది) శ్వేత (తెల్లనిది), కపిల (కోతిరంగు కల్గినది), పీతక (పచ్చని రంగు కలది), లాలావిష (నోటి చెమ్మ విషముగ గల్గినది), మూత్రవిష (మూత్రమున విషము కలది), రక్త (ఎఱ్ఱగ నుండునది), కఠిన (రాయివలె కఠినమైనది), సౌపర్ణిక (గరుడునిరంగు కల్గినది), లాజవర్ణ (పేలగింజవంటి మచ్చలు కలది), జాలిని (సన్ననిగళ్లవంటి మచ్చలు గలది), ఏకపది (ఒక్కటే కాలు కల్గినది), కృష్ణ (నల్లగ నుండునది), అగ్నివక్త్ర (నిప్పువుబోలె మంట పుట్టించు నోరు కలది), అగ్నికాండ (నిప్పువలె తీక్ష్ణమైన తుండము కలది), మాలాగుణి (తంతువులచే మాలికవలె నల్లునది) అను నీపదునారు పేర్లచే లూత యనునది భేదము గల్గియుండును. వానిపేర్లచేతనే వానిరూపభేదము లూహింపదగియున్నది గాన ప్రత్యేకలక్షణ మనవసరము.

మఱియు నీలూతావిషయమై కొందఱు ఇరువదియెనిమిది భేదము లనియు, కొందఱు వేయివిధము లనియు, కొందఱు లెక్కకు మీరిన వనియు చెప్పిరి. ఈవిషయ మును వాగ్భటాచార్యు డిట్లు చెప్పెను—'కీటేభ్యో దారుణతరాః లూతాః షోడశ తాః జగుః, అష్టావింశతిరిత్యేకే తతోఽప్యన్యే తు భూయసీః, సహస్రరశ్మ్యనుచరాః వదన్త్యన్యే సహస్రశః, బహూపద్రవరూపాతు లూతైకైవవిషాత్మికా" (అ. హృ. ఉ. అ.37. శ్లో. ౪౫-౪౬) ఈవాక్యమున మతాంతరముల జూపుచు, వానిలక్షణముల గమనింప శక్యములు కావు గాన అనేకోపద్రవముల గల్గించుచు, విషాకారమునొందిన లూత యొక్కటేవిధ మని వాగ్భటులు తమ సిద్ధాంతమును జూపిరి. మరియు అట్టి లూత వృశ్చికము మున్నగు కీటజాతికన్న క్రూరతర మైనవిషము కల్గియుండు ననియు చెప్పిరి. (ఇదియే పులికోస యని వాడబడును.)

## లూతాదష్టసామాన్యలక్షణము

తాభిర్దష్టే దంశకోథః ప్రవృత్తిః క్షతజస్యచ,
జ్వరో దాహోఽతిసారశ్చ గదాశ్చ స్యుస్త్రిదోషజాః. 39
పిటికా వివిధాకారా మణ్డలాని మహాన్తి చ,
శోథా మహాన్తో మృదవో రక్తశ్యావాశ్చలాస్తథా. 40

సామాన్యం సర్వలూతానాం ఏతద్దంశస్య లక్షణమ్,

పై జెప్పబడిన పదునారువిధములైన లూతలను కీటములు కుట్టినపుడును కాటునందు కుళ్లి రక్తము కారును. జ్వరము వచ్చును. మంట పుట్టును. అతిసారము (విరేచనములు) కల్గును. ఇవిగాక త్రిదోషములచే గల్గు రోగములును బుట్టును. పలురంగులైన బొబ్బలు పుట్టును గొప్ప పొడలు పుట్టును. మెత్తనై రక్తశ్యామవర్ణములుకల్గి చంచలములగు వాపులు పుట్టును. ఇవి యన్నియు పై జెప్పబడిన కీటములలో నేది కరచినను కల్గు సామాన్య లక్షణములు.

మరియు వాగ్భటాచార్యుడు—"సర్వాపి సర్వజా ప్రాయో వ్యపదేశస్తు భూయసా" (అ. హృ. ఉ. అ. 37. శ్లో. 48.) అని చెప్పెను గాన లూతజాతి సామాన్యముగ మూడుదోషముల ప్రకృతి కల్గియుండుననియు, అందు ఏదోష మెక్కుడుగ నుండునో ఆదోషమునుబట్టి వాత పిత్త కఫ భేదములచే వ్యవహరింపబడు ననియు నెరుంగునది. కావుననే ప్రకృతగ్రంథమున సామాన్యలక్షణమును చెప్పుతరి "గవాశ్చస్యు స్త్రిదోషజాః" అని చెప్పెను. త్రిదోషప్రకృతి యగుటంజేసి మూడుదోషములచే గల్గు రోగములును లూతాసామాన్యముగ గల్గు నని భావము.

దూషీవిషలూతాదష్టలక్షణము

దంశమధ్యే తు యత్కృష్ణం శ్యావం వా జాలకాచితమ్. 41
దగ్ధాకృతిర్భృశం పాకక్లేదశోథజ్వరాన్వితమ్,
దూషీవిషాభిర్లూతాభి స్తద్దష్టమితి నిర్దిశేత్. 42

కుట్టిన కాటునడుమ నల్లగనైనను, శ్యామలవర్ణముగనైనను మచ్చకల్గి వాచి దద్దుకట్టి పుండై చెమ్మకల్గి జ్వరము వచ్చిన నయ్యది దూషీవిషంబులగు కీటములచే కరువబడినది యని యెరుంగునది.

"స్వభావతోవా గుణవిప్రహీనం" అని పై జెప్పబడిన లక్షణమునుబట్టి స్వభావముచేత గుణహీనమై తీవ్రతతగ్గిన విషముకలవి దూషీవిషంబులైన లూతలని యెరుంగునది. అయ్యవి త్రిమండలాది పదునారుభేదములలో తొల్లింటి యెనిమిదియు దూషీవిషము లని సుశ్రుతాచార్యుడు ఇట్లు చెప్పెను:—"కృచ్ఛ్రసాధ్యా స్తథాఽసాధ్యాః లూతాస్తు ద్వివిధాః స్మృతాః, తాసామష్టౌ కృచ్ఛ్రసాధ్యాః వర్జ్యాః తావత్యఏవచ, త్రిమణ్డలా తథాశ్వేతా కపిలా పీతికా తథా, ఆలమూత్ర విషా రక్తా కశినా చాష్టమీ మతా" (సు. కల్ప. అ. ౮.) ఈ యెనిమిదియు కృచ్ఛ్రసాధ్య లనుట.

## తీవ్రవిషలూతాదష్టలక్షణములు

శోథశ్శ్వేతాసితా రక్తాః పీతా వా పిటికా జ్వరః,
ప్రాణాన్తకాశ్చ జాయన్తే శ్వాసహిక్కాశిరోగ్రహాః. 43

సౌపర్ణిక మొదలుచేసి యెనిమిది భేదములు కల లూతలు మిక్కిలి తీవ్రమైన విషము కలిగినవి.) అయ్యవి కుట్టినపుడు వాపు పుట్టును. కొంచెము తెల్లగనైనను, ఎఱ్ఱగనైనను, పచ్చగనైన నుండు పొక్కులు పుట్టును. జ్వరము వచ్చును. శ్వాసము ఎక్కిళ్లు తలనొప్పియు మిక్కిలి తీవ్రముగ బుట్టి ప్రాణముల హింసించును. (అసాధ్యము లని భావము.)

## ఆఖు (ఎలుక) దష్టలక్షణము

ఆదంశాచ్ఛోణితం పాణ్డుమణ్డలాని జ్వరోఽరుచిః,
లోమహర్షశ్చ దాహశ్చాప్యాఖుదూషీవిషార్దితే. 44
మూర్ఛాఙ్గశోథవైవర్ణ్యక్లేదశబ్దాశ్రుతిజ్వరాః,
శిరోగురుత్వం లాలాసృక్ఛర్ది శ్చాసాధ్యమూషికైః. 45

(ఎలుకలలో కొన్ని స్వల్పవేగము గలవిషముతో గూడియుండును. మరికొన్ని మిక్కిలి తీవ్రవేగము గలవిషము కల్గియుండును. అందు మందవేగము కల విషము కల్గినది దూషీవిషము) అట్టి విషముల యెలుకలు కరిచినప్పుడు కాటునుండి రక్తము కారుచుండును. శరీరముపైని తెల్లపొడలు కలుగును. జ్వరంబును, అరోచకంబును, రోమహర్షంబును కలుగును. మంట పుట్టును. తీవ్రమైన విషముకల యెలుకలు కరిచినపుడు మూర్ఛగ్రమ్మును. శరీరమెల్ల వాచును. వివర్ణమగును. విశేషముగ చెమట పుట్టును. చెవులకు శబ్దము వినబడక చెవుడు పట్టును. జ్వరము వచ్చును. తల బరువై యుండును. నోట జొల్లుకారును. రక్తము వాంతియగును.

మరియు వాగ్భటాచార్యుడు ఎలుకలు శుక్రమునగూడ విషముకలిగి యుండునని వానిలక్షణముల నిట్లు చెప్పెను—"శుక్రం పతతి యత్రైషాం శుక్రదిగ్ధైస్సృశన్తివా, యదఙ్గమఙ్గైస్తత్రాస్రే దూషితే పాణ్డుతాంగతే, గ్రన్థయః శ్వయథుశ్శోథో మణ్డలాని భ్రమోఽరుచిః, శీతజ్వరోఽతిరుక్సాదో వేపథుః పర్వభేదనమ్. రోమహర్షస్స్రుతి ర్మూర్ఛా దీర్ఘకాలానుబంధనమ్, శ్లేష్మానుబద్ధ బహ్వాఖుపోతకచ్ఛర్దనం సతృట్" (అ. హృ. ఉ. 38. శ్లో. 3-6) ఎలుకల శుక్రము అంగమున తగిలినను, అట్టి శుక్రము తగిలిన యంగములచే నే శరీరభాగమునైనను స్పృశించినను అచ్చట రక్తముచెడి శరీరమెల్ల తెల్లబడును. శరీరము వాచి గ్రంథులు కలుగును. అచ్చటచ్చట పొడలు కల్గును. భ్రమంబును, అరుచియు, చలిజ్వరంబును, మిక్కిలి తీవ్రమైన

నొప్పియు, ఒడలినొప్పులును, వణకును, కీళ్ళనొప్పియు, గగుర్పాటును, చెమటయు, మూర్ఛయు కలుగును. మరియు చాలకాలము కీవిషము అనుసరించి యుండును. ఎలుక పిల్లలవంటి యాకారముకల్గిన కఫము వాంతి యగును. డప్పి విశేషముగ కలుగును అని భావము.

### కృకలాస (ఊసరవల్లి) దష్టలక్షణము

కార్ష్ణ్యం శ్యావత్వమథవా నానావర్ణత్వమేవ వా,
మోహోఽథ వర్చసో భేదః దష్టేస్యాత్కృకలాసకైః. 46

ఊసరవల్లి (ముదురుతొండ) కఱచినయెడ శరీర మెల్ల నల్లగనైనను, శ్యామల వర్ణముగనైనను, లేక నానావిధములగు రంగుకల్గి చిత్రవర్ణముగనైన నుండును. మూర్ఛ గ్రమ్మును. మలము శుష్కించి యుండకలై ద్రవముకల్గి వెడలును.

### తేలుకుట్టిన విషలక్షణము

దహత్యగ్నిరివాదౌ చ భినత్తీవోర్ధ్వమాశు చ,
వృశ్చికస్య విషం యాతి దంశే పశ్చాత్తు తిష్ఠతి. 47

తేలుకుట్టినయెడ తొడనే నిప్పున కాలినవిధముగ బగబగ మండును. పిదప కుట్టినచోటనుండి పగులదీయువిధముగ నొప్పికల్గి పైకెక్కును. విషవేగము శాంత మైనపుడు మరల కుట్టినస్థలమునకు దిగి కొంతకాలము బాధించి శాంత మగును.

### అసాధ్యవృశ్చిక విషలక్షణము

దష్టోఽసాధ్యశ్చ హృద్ఘ్రాణరసనోపహతో నరః,
మాంసైః పతద్భిరత్యర్థం వేదనార్తో జహాత్యసూన్. 48

తేలుకుట్టినవానికి రొమ్మునందును, ముక్కురంధ్రంబును, కంఠంబును అడచి కొనినను, కుట్టినచోట మాంసము శిథిలమై యూడిపడుచు మిక్కిలి తీవ్రమైన బాధ కల్గియున్నను మనుజుడు ప్రాణములు విడచును. (తేలు వాలవిషములలో చేరిన దని యెరుంగునది.)

### కణితిరిగెలు కుట్టినవిషము

విసర్పశ్శ్వయథుశ్శూలం జ్వరశ్ఛర్దిరథాపి చ,
లక్షణం కణభైర్దష్టే దంశశ్చైవావసీదతి. 49

కణితిరిగెలు కుట్టినపుడు వాపుకల్గి యచ్చోట తీవ్రమైననొప్పి కలుగును. వాంతి యగును. కాటు తెలియకుండును. అట్టివాపు నిల్కడగ నొక్కచో నుండక పలుచెరంగుల వ్యాపించును.

### ఉచ్చిటింగదష్టలక్షణము

హృష్టరోమోచ్చిటింగేన స్తబ్ధలింగో భృశార్తిమాన్,
దష్టశ్శీతోదకేనేవ సిక్తాన్యఙ్గాని మన్యతే. 50

ఉచ్చిటింగమను కీటము కరచినయెడ రోమహర్షము కల్గును. లింగము స్తంభించును. మిక్కిలి నొప్పికలుగును. శరీరమునందెల్ల నీళ్లుచల్లిన విధముగ చల్లబడియుండును.

### కప్పకాటువిషము

ఏకదంష్ట్రార్దితశ్శూనః సరుజః పీతకస్సతృట్,
ఛర్దిర్నిద్రా చ సవిషైః మణ్డూకైర్దష్టలక్షణమ్. 51

(కప్పలకు సామాన్యముగ విష ముండదు. అందు కొన్ని మాత్రము విషము కల్గియుండును.) అట్టి విషయుక్తమగు కప్ప కరిచినయెడ నొప్పితోగూడి వాచును. దేహమంతయు పచ్చగ నుండును. దప్పి యధిక మగును. వాంతి యగును. నిద్ర యధిక మగును.(కప్పలు ఒకప్రక్కనుండు కోరలచేతనే కరచును కావున ఏకదంష్ట్ర యనబడును.)

### మత్స్యజలౌకాదష్టలక్షణము

మత్స్యాస్తు సవిషాః కుర్యుః దాహం శోఫం రుజం తథా,
కణ్డూం శోఫం జ్వరం మూర్ఛాం సవిషాస్తు జలౌకసః. 52

(జలముననే యుండు మత్స్యములు మున్నగు జంతువులలోకూడ కొన్ని విషము కల్గియుండును.) అందు విషముతోగూడిన చేపలు కఱచినయెడ మంటయు నొప్పియు కలిగి వాచును. ఇతరములగు (విషముతోగూడిన) జలగలు కఱచినప్పుడు విశేషముగ దురదయు వాపును జ్వరమును మూర్ఛయు కలుగును.

### బల్లి - జెఱ్ఱి వీనివిషలక్షణము

విదాహం శ్వయథుం తోదం స్వేదం చ గృహగోధికా,
దంశే స్వేదం రుజం దాహం కుర్యాచ్ఛతపదీవిషమ్. 53

బల్లి విషము తగిలినప్పుడు తీవ్రమైన మంటయు, వాపును,పోటునుబుట్టి చెమట పట్టును. జెఱ్ఱి కుట్టిన విషముచేత కాటునందు చెమట పట్టును. నొప్పియు మంటయు విశేషముగ కల్గును.

### మశకవిషలక్షణము

కణ్డూమాన్ శనకైరీష చ్ఛోథస్స్యాన్మందవేదనః,
అసాధ్యకీటసదృశ మసాధ్యం మశకక్షతమ్. 54

(దోమలలో సాధారణముగ కొన్ని స్వల్పవిషము కల్గి యుండును. కొన్ని మిక్కిలి క్రూరతరములై యుండును.) అందు సామాన్యములైన దోమలు కుట్టినయెడ దద్దులేర్పడి దురదయు స్వల్పముగ నొప్పియు కల్గియుండును. క్రూరములైన దోమలు కుట్టినయెడ నసాధ్యకీటములకు జెప్పినలక్షణములు కల్గి మిక్కిలి బాధ కల్గించును.

మరియు సుశ్రుతమున—"పార్వతీయైస్తు కీటైశ్చ ప్రాణహారై స్తుల్యలక్షణమ్" అని చెప్పబడినది కావున కొండప్రదేశమున నుండు దోమలు కొన్ని మిక్కిలి క్రూరమైన విషము కల్గియుండును. అట్టి దోమలు ప్రాణహారములగు కీటములలక్షణములు కల్గి తుదకు ప్రాణాంతకరంబు లగు నని యెరుంగునది.

### *మక్షికా (చీమలు) దష్టవిషము

సద్యః ప్రస్రావిణీ శ్యావా దాహమూర్ఛాజ్వరాన్వితా,
పిటికా మక్షికాదంశే తాసాం తు స్థగికాఽసుహృత్. 55

చీమలు కఱచినతోడనే కుట్టినచోట చెమటకారును. శ్యామవర్ణంబై మంటయు జ్వరంబును మూర్ఛయు కలిగి బొబ్బలేచును. వానిలో స్థగిక యను జాతి చీమలు కుట్టిన యెడ ప్రాణహారమగును.

### వ్యాఘ్రాదిదష్టలక్షణము

చతుష్పద్భిర్ద్విపద్భిశ్చ నఖదంతవిషం చ యత్,
శూయతే (పూయతే) పచ్యతే చాపి స్రవతి జ్వరయత్యపి. 56

పులులు మొదలగు నాల్గుకాళ్లు గల జంతువులయొక్కయు, రెండుకాళ్లు గల యడవి మనుష్యులు కోతులు మున్నగు జంతువులయొక్కయు గోళ్ళ గిచ్చుటచేతను, దంతములచే గరచుటచేతను గల్గిన విషమునందు కాటున వాచి (చీముపట్టి) పుండై చీమును నెత్తురును కారును. జ్వరము విశేషముగ గల్గును.

మఱియు కుక్క, నక్క మొదలగునవి కరచిన విషలక్షణములు వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడియె—"దంశస్తేన విదష్టస్య సుప్తః కృష్ణం క్షరత్యసృక్, హృచ్ఛిరోరుక్ జ్వరస్తమ్భః తృష్ణా మూర్ఛోద్భవోఽనుచ. అనేనాన్యేఽపి బోద్ధవ్యాః వ్యాళా దంష్ట్రాప్రహారిణః" (అ. హృ. ఉ. ౩౭. శ్లో. ౧౦, ౧౧.) కుక్కకరచిన కాటు స్పర్శము నెఱుంగజాలక మొద్దుబారి నల్లనిరక్తము గారుచుండును. దానివిషము చేత రొమ్మునందును, తలయందును తీవ్రమైన నొప్పి పుట్టును. జ్వరము వచ్చును. శరీరము స్తంభించును. దప్పివిశేష మగును. మూర్ఛక్రమ్మును. నక్కలు, పులులు మున్నగు కోరలు కల జంతువులు కఱచినప్పుడును పై జెప్పినలక్షణములే కనబడును గాన వాని నెరుంగునది.

---

*మక్షిక యనగా చీమ యనుట చింత్యము. ఈగలకు మక్షిక యని పేరు. అందు సవిషములగు ఈగలు కొన్ని కలవు.

మరియు పై జెప్పిన జంతువుల విషమునం దసాధ్యలక్షణంబును వాగ్భటాచార్యునిచే నిట్లు చెప్పబడియె —"దష్టో యేన తు తచ్చేష్టారుతం కుర్వన్వినశ్యతి, పశ్యం స్తమేవ చాకస్మాత్ ఆదర్శసలిలాదిషు." (అ. హృ. ఉ. అ. ౩౭. శ్లో. ౧౪.) పై జెప్పిన కుక్క, నక్క, పులి మున్నగుజంతువులు కఱచినప్పుడు ఏజంతువు కఱచునో దానివలె చేష్టలజేయుచు, దానివలె కూయుచున్నయెడ మనుజుడు బ్రతుకడు. మరియును జలమునందును, అద్దమునందును, స్వప్నాదులయందును ఆజంతువులు ఆకస్మికముగ కంటికి కనబడినను మనుజుడు బ్రతుకజాలడు.

పిచ్చికుక్కలక్షణములు

శ్వసృగాలతరక్ష్వృక్షవ్యాఘ్రాదీనాం యదానిలః,
శ్లేష్మప్రదుష్టో ముష్ణాతి తస్య సంజ్ఞావహాంఽశ్రితః. 57
తదా ప్రస్రస్తలాఙ్గూలహనుస్కన్ధోఽతిలాలవాన్,
అవ్యక్తబధిరాన్ధశ్చ సోఽన్యోన్య మభిధావతి. 58
ప్రమూఢోఽన్యతమస్త్వేషాం ఖాదన్ విపరిధావతి,

కుక్క, నక్క, తరక్షు (సివంగి), ఎలుగుబంటి, పులి మున్నగు కోరలు కల జంతువులను శ్లేష్మముతో కూడిన వాతము దుష్టమై ఆయాజంతువులను సాధారణముగ నుండవలసిన జ్ఞానమున కాశ్రయములగు స్రోతస్సులజేరినపుడు ఆజంతువులకు సంక్షోభము కల్గును. అట్టియెడ నాజంతువులకు తోకయు దవుడలును జబ్బలును జారి యధికముగ నోట చొంగకారును. అయ్యవి చెవులు వినబడక కన్నులు కానరాక పిచ్చిరేగి యొకదాని నొకటి కఱచుకొనుటకు పలువిధములుగ పరువిడుచుండును. అందొకటి కనబడిన దాని నెల్ల కఱచుచు పరుగెత్తును. (ఈ లక్షణములనుబట్టి యా జంతువులకు పిచ్చిబట్టినదని యెరుంగునది.) ఈ దుష్ట శునకలక్షణమునే వాగ్భటాచార్యులును "శునశ్లేష్మోల్బణా దోషాః...దుఃఖాహతాననః" (అ. హృ. ఉ. అ. ౩౭ శ్లో. ౧, ౯.) అను గ్రంథముచే జెప్పిరి.

పిచ్చికుక్క కఱచిన విషలక్షణములు

తేనోన్మత్తేన దష్టస్య దంష్ట్రిణా సవిషేణతు. 59
సుప్తతా జాయతే దంశే కృష్ణం చాతిప్రవత్యసృక్,
దిగ్ధవిద్ధస్య లిఙ్గేన ప్రాయశశ్చోపలక్షితః. 60

పై జెప్పినరీతిగ పిచ్చిబట్టినకుక్క మొదలగు జంతువులలో నేదైన కరచినయెడ కాటున స్పర్శజ్ఞానము తెలియక మొద్దుబారి నల్లనిరక్తము అధికముగ కారును. ఇంతియ గాక విషముపుబూసిన యాయుధముచే కొట్టబడినవానికి గల్గు లక్షణములు

కల్గియుండును. (ఇచ్చట "సద్యః క్షతం పచ్యతే......పురుషం వ్యవస్యేత్" (శ్లో. ౧౩, ౧౪.) అని చెప్పిన లక్షణముల సెరుంగునది.)

పిచ్చికుక్క కఱచినవిషమున నరిష్టలక్షణములు

యేన చాపి భవేద్దష్టస్తస్య చేష్టాం రుతం నరః,
బహుశః ప్రతికుర్వాణః క్రియాహీనో వినశ్యతి. 61

పై జెప్పిన జంతువులలో నేదైన కఱచినప్పుడు ఆజంతువు చేయుచేష్టల జేయుచు, దానివలెనే పలుమారు కూయుచు, దానినే యనుకరించి నటించుచు నితర వ్యాపారముల నన్నిటిని మానియున్నచో వాడు బ్రతుకజాలడు. (ఇది యరిష్ట (మరణసూచక) లక్షణము.)

దంష్ట్రిణా యేన దష్టశ్చ తద్రూపం యస్తు పశ్యతి,
అప్సు చాదర్శబిమ్బే వా తస్య తద్రిష్టమాదిశేత్. 62

మరియు పై జెప్పిన జంతువులలో నేదైన కఱచినపుడు ఆ జంతువుయొక్క రూపమును నీళ్ళయందైనను అద్దమునందైనను చూచినయెడ నదియు నరిష్టలక్షణ మగును. (అది వానిని తప్పక చంపు లక్షణ మని భావము.)

శునకాదివిషమున జలత్రాసరూపరిష్టలక్షణము

త్రస్యత్యకస్మాద్యోఽభీక్ష్ణం దృష్ట్వా స్పృష్ట్వాపి వా జలమ్,
జలత్రాసం తు తం విద్యాత్ రిష్టం తదపి కీర్తితమ్. 63

మరియు పై జెప్పిన జంతువులు కఱచినప్పుడు నీళ్ళను కంటజూచినను, చేత తాకినను, 'నీళ్ళు' అని యెవరైన జెప్పినపుడు ఆమాటవిన్నను భయపడవలసినంత కారణములేకయే భయపడినచో నయ్యది జలత్రాస మని చెప్పబడును. ఇయ్యది కుక్క మొదలగు జంతువులు కఱచినప్పుడు కల్గినచో నయ్యది యరిష్టలక్షణమగును. కాన రోగిని తప్పక చంపును. (ఇచ్చట 'స్పృష్ట్వాపి' అను అపిశబ్దమువలన అనుక్తమగు 'శ్రుత్వా' అను పదముకూడ గ్రహింపబడును. కావున జలశబ్దమును విన్నను భయపడి నప్పుడు జలత్రాసరూపమైన యరిష్ట మని యెరుంగునది.)

ఈ యరిష్టలక్షణము జంతువులచే కరవబడిన వాని నుద్దేశించి చెప్పబడినది. ఈ విషయము తంత్రాంతరమున నిట్లున్నది:—"వ్యాధితేన శ్వాదినా దష్టస్య శ్లేష్మా కుపితః స్రోతోవాహినీ ర్ధమనీరనుప్రవిశ్య సంజ్ఞానాశమాపాదయతి. తతో నరః స్పృష్ట్వా శ్రుత్వాచ జలం త్రస్యతి. తద్రిష్టం జానీయాత్" పైజెప్పినరీతిగ రోగ విశేషమునం జేసి పిచ్చిబట్టిన కుక్క మొదలగుజంతువులు కఱచినవానికి కఫము ప్రకోపమునొంది

స్రోతో (సంజ్ఞా) వహంబులగు ధమనులజేరి జ్ఞానమునకు వైపరీత్యమును కల్గించును. దానంజేసి జలమును తాకినను, జలము మాటవిన్నను భీతిజెందును. అయ్యది రిష్టమగును అని యర్థము.

### సామాన్యముగ జలత్రాసరూపరిష్టలక్షణము

అదష్టో వా జలత్రాసీ న కథంచన సిధ్యతి,
ప్రసుప్తో వోత్థితో వాపి స్వస్థస్త్రస్తో న సిధ్యతి. 64

మరియు పై జెప్పినవిధముగ పిచ్చికుక్క మున్నగునవి కఱవక స్వస్థత నున్నవాడును మేల్కాంచియున్నపుడైనను, నిదురపోవునప్పుడైనను జలమును చూచినను తాకినను విన్నను కారణములేకయే భయపడినయెడ నయ్యదియు జలత్రాస మను రిష్టలక్షణమగును. (మరణసూచక మని భావము.)

ఈవిషయమే తంత్రాంతరమున నిట్లున్నది:—"అదష్టస్యాపి జన్తోర్హి జలత్రాసో భవేద్యది, తస్యారిష్టం హి భిషజో బ్రువతే విషచింతకాః. జలం వినా జలత్రాసో జాయతే శ్లేష్మసఞ్చయాత్" (కుక్క మున్నగునవి కఱవకున్నను జలత్రాసముకల్గిన నియ్యదియు నరిష్ట మనియే విషవైద్యులు చెప్పెదరు. అట్టి జలత్రాసము కఫము వృద్ధి నొందినపుడు జలములేకున్నను కల్గును.

మరియు జలత్రాసము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"బుద్ధిస్థానం యదా శ్లేష్మా కేవలః ప్రతిపద్యతే, తదా బుద్ధౌ నిరుద్ధాయాం శ్లేష్మణాధిష్ఠితో నరః జాగ్రత్సుప్తోఽథవాత్మానం మజ్జన్తమివ మన్యతే, సలిలాత్త్రస్యతి తదా జలత్రాసం తు తం విదుః. శ్లేష్మఘ్నం తత్ర కర్తవ్యం శోధనం శమనాని చ, ఆహారస్య విధానేన యావత్స ప్రకృతిం వ్రజేత్" కేవలము కఫముమాత్రము ప్రకోపమునొంది బుద్ధిస్థానమున జేరి బుద్ధిని వ్యాపించనీయక యడ్డగించినచో మానవుడు కఫముచే నావరింపబడినవాడై మేల్కాంచియుండునపుడును నిదురించునప్పుడును తాను జలమున మునిగియున్నట్టు తలంచును. (జలస్వరూపమైన కఫము బుద్ధిస్థానము నాక్రమించియుండుటం జేసి జలసంబంధము లేకున్నను, సర్వకాలసర్వావస్థలయందును తాను నీటిలో మునిగియున్నట్లు బుద్ధివైపరీత్యముచే తలంచు నని భావము.) దానంజేసి జలప్రస్తావమునకూడ వాడు చాల భయపడును. ఇదియు జలత్రాస మని యాచార్యులు చెప్పెదరు. ఈ జలత్రాసము కేవలము కఫప్రకోపమున సంభవించినది, కావున కఫహారమగు వమనరూపమైన శోధనమును శమన చికిత్సలను, కఫహారములగు సాహారాదులను వానికి స్వస్థతకల్గునంతదాక చేయవలెను అని యర్థము.

ఈవిషయమున నీ నిర్ణయము నెఱుంగునది:—జలత్రాసము మూడు విధములు. అందొకటి కుక్క మొదలగువాని విషస్వభావమున కల్గునది. ఇది యరిష్టలక్షణ రూపము. ఇది "త్రస్యత్యకస్మాత్ ...కీర్తితమ్" అను శ్లోకముచే జెప్పబడినది. రెండవది ఏవిధమైన రోగమును లేక స్వస్థతనుండి జంతువులచే కఱపబడకుండువానికి కఫసంచయముచే నకస్మాత్తుగ గల్గు జలత్రాసము. ఇది స్వస్థునకు కారణములేకయే కల్గినదికావున నిదియును అరిష్టలక్షణమే యగును. ఇయ్యది "అదష్టోవా...న సిధ్యతి" అను శ్లోకముచే జెప్పబడినది. మూడవది కఫము ప్రకోపించి బుద్ధిస్థానమునజేరి సంభవించినది. కావున నియ్యది దోషప్రకోపమునంజేసి జనించిన వ్యాధి రూపమైన జలత్రాసముకాని రిష్టలక్షణరూపము కానేగదు. కావుననే కఫహరములగు నౌషధాదులు విధింపబడినవి. ఈజలత్రాసము "బుద్ధిస్థానం......యావత్స ప్రకృతిం వ్రజేత్" అను తంత్రాంతరవచనముచే జూపబడినది.

[ఇచ్చట "శ్వసృగాల—స్వస్థత్రస్తో న సిధ్యతి" అనునంతవరకుగల (యెనిమిది శ్లోకముల) గ్రంథము ప్రాచీన ముద్రితకోశములయందు గన్పట్టదు. నూతన కోశములయందు ఆతంకదర్పణవ్యాఖ్యానసహితముగ ముద్రితమై యున్నది. ఈ భాగమునకు మధుకోశవ్యాఖ్యానమును గానరాదు. ఏది యెట్లున్నను విషయసంగ్రహణము ప్రధాన మని యెంచి యాంధ్రవ్యాఖ్యతోగూడ చేర్చబడినది.]

### విషనిర్ముక్తలక్షణము

ప్రశాంతదోషం ప్రకృతిస్థధాతుం
అన్నాభికామం సమమూత్రవిట్కమ్,
ప్రసన్న వర్ణేన్ద్రియచిత్తచేష్టం
వైద్యోఽవగచ్ఛేదవిషం మనుష్యమ్. 65

మనుజునకు శరీరమున విషము వ్యాపించినపుడు వాతాదిదోషములన్నియు ప్రకోపములేక శాంతములై తమ తమ నెలవుల నుండును. రసాదిధాతువులు దోషముచే జెడక స్వభావస్థితి నుండును. అన్నమునందు అభిలాషకల్గి మలమూత్రములు యుక్తసమయమున వెడలుచుండును. శరీరవర్ణంబును, చక్షురాదీంద్రియములును, చిత్తంబును, చేష్టలును వికృతిజెందక స్వభావస్థితి నుండును.(ఇట్టి లక్షణములజట్టి మనుజుని శరీరమున విషసంబంధము లేదని యెఱుంగవలెననుట) విషముచే బాధగలిగినపుడు చికిత్సజేయుంతరి పైజెప్పినలక్షణములు గానవచ్చినచో విషము పూర్తిగ హరించెనని యెఱుంగవలెనని భావము.

మరియు "సమమూలజిహ్వామ్" అని కొన్ని తంత్రములయం దున్నది. అట్టియెడ నాలుకకు విషము వ్యాపించియున్నపుడు రుచి చక్కగ మామూలుగ నుండదనియు, విషము నిశ్శేషమైనపుడు మామూలుగ రసపరిజ్ఞానము కల్గుననియు భావము.

చరకమున "ప్రాయేణోపహతాగ్నిత్వాత్ సపిచ్ఛమతిసార్యతే, ప్రాప్నోతి చాస్య వైరస్యం నచాన్నమభినన్దతి" అని విషసామాన్యమున గల్గు లక్షణముల జెప్పెను. విషము వ్యాపించినపుడు జఠరాగ్ని మందగించియుండును. కావున అజీర్ణరసముతో గూడి విరేచనములగును. నోట రుచి తెలియక విరుద్ధరసము కలిగియుండును. అన్నమునం దభిలాషయు కల్గదు అని భావము. ఈవాక్యమునుబట్టి విషమునం దజీర్ణముచే నీలక్షణములు కల్గును. కాన, విషము హరించినపుడు జఠరాగ్ని సమస్థితినుండి బంక విరేచనములుగాక నోట రుచితెలియుచు నన్నమునం దిచ్ఛపొడమునని తెలిసెడి.

## విషపరీక్షాపద్ధతి

(దర్శనస్పర్శనప్రశ్నైః పరీక్షా త్రివిధా మతా,
వయోవర్ణశరీరాణాం ఇన్ద్రియాణాం చ దర్శనాత్.) (66)

విషముచే బీడింపబడియున్నపుడు ఆట్టిరోగిని చక్కగ గమనించి చూడవలెను. పిమ్మట, చేతతాకి చూడవలెను. పిమ్మట, శరీరమున నుండు పరిస్థితులను బాధలను ప్రశ్నచేసి తెలిసికొనవలెను. మరియు రోగివయస్సును శరీరవర్ణమును ఇంద్రియములను చక్కగ బరిశీలించి విషనిర్ణయము చేయవలెను.

ఇతి శ్రీమాధవకరవిరచితే మాధవనిదానే
విషరోగనిదానం సమాప్తమ్.

# ౭౦. విషయానుక్రమణిక

జ్వరోఽతిసారో గ్రహణీ చార్శోఽజీర్ణం విషూచికా,
అలసశ్చ విలమ్బీ చ క్రిమిరుక్పాణ్డు కామలాః. 1
హలీమకం రక్తపిత్తం రాజయక్ష్మా ఉ(ఫ్యు)రఃక్షతమ్,
కాసో హిక్కా సహశ్వాసైః స్వరభేదస్త్వరోచకః. 2
ఛర్దిస్తృష్ణాచమూర్ఛాద్యాదోషాః(రోగాః)పానాత్యయాదయః,
దాహోన్మాదావపస్మారః కథితోఽథానిలామయః. 3
వాతరక్త*మురుస్తంభ ఆమవాతోఽథ శూలరుక్,
పక్తిజం శూలమానాహః ఉదావర్తోఽథ గుల్మరుక్. 4
హృద్రోగో మూత్రకృచ్ఛ్రం చ మూత్రాఘాతస్తథాశ్మరీ,
ప్రమేహో మధుమేహశ్చ పిటికాశ్చ ప్రమేహజాః. 5
మేదస్తథోదరం శోథో వృద్ధిశ్చ గలగణ్డకః,
గణ్డమాలాపచీగ్రన్థిరర్బుదశ్లీపదం తథా. 6
విద్రధిః వ్రణశోథాచ ద్వౌ వ్రణౌ భగ్ననాడికే,
భగన్దరోపదంశౌ చ శూకదోషస్తథామయః. 7
శీతపిత్తముదర్దశ్చ కోఠశ్చైవామ్లపిత్తకమ్,
విసర్పశ్చ సవిస్ఫోటః సరోమాన్త్యో మసూరికాః. 8
క్షుద్రాస్యకర్ణనాసాక్షిశిరస్త్రీబాలకామయాః,
విషం చేత్యయముద్దిష్టో రుగ్వినిశ్చయసఙ్గ్రహః. 9

జ్వరము, అతిసారము, గ్రహణి, అర్శస్సు, అజీర్ణము, విషూచి, అలసకము, విలంబిక, క్రిమిరోగము, పాండురోగము, కామల, హలీమకము, రక్తపిత్తము, రాజయక్ష్మము, ఉరఃక్షతము, కాసము, హిక్క, శ్వాసము, స్వరభేదము, అరోచకము, ఛర్ది, తృష్ణ, మూర్ఛ భ్రమము, నిద్ర, తంద్ర, సన్న్యాసము, పానాత్యయము, పరమదము, పానాజీర్ణము, పానవిభ్రమము, దాహము, ఉన్మాదము, అపస్మారము, వాత

* ఛందస్సు చెడకుండుటకు "ఊరు" శబ్దము "ఉరు" అని హ్రస్వముతో పఠింపబడెనని గ్రహింపవలెను. "అపిమాషంమషంకుర్యాచ్ఛందోభంగం నకారయేత్."

వ్యాధి, వాతరక్తము, ఊరుస్తంభము, ఆమవాతము, శూలవ్యాధి, పరిణామశూల, అనాహము, ఉదావర్తము, గుల్మరోగము, హృద్రోగము, మూత్రకృచ్ఛ్రము, మూత్రాఘాతము, అశ్మరి, ప్రమేహము, మధుమేహము, ప్రమేహపిటిక, మేదోరోగము, ఉదరము, శోఫము, అండవృద్ధి, గలగండము, గండమాల, అపచి, గ్రంథి, అర్బుదము, శ్లీపదము, విద్రధి, వ్రణశోఫము, శారీరవ్రణము, సద్యోవ్రణము, భగ్నము, నాడీవ్రణము, భగందరము, ఉపదంశము, శూకదోషము, కుష్ఠము, శీతపిత్తము, ఉదర్దము కోఠము, అమ్లపిత్తము, విసర్పము, విస్ఫోటము, మసూరిక, క్షుద్రరోగము, ముఖరోగము, కర్ణరోగము, నాసారోగము, అక్షిరోగము, శిరోరోగము, స్త్రీరోగము, బాలరోగము, విషవ్యాధి అను నీరోగములన్నింటి నిదానములును సంగ్రహముగ నీగ్రంథమున జెప్పబడియె ననుట.

## ఉపసంహారము

సుభాషితం యత్ర యదస్తి కించి
త్తత్సర్వమేకీకృతమత్ర యత్నాత్,
వినిశ్చయే సర్వరుజాం నరాణాం
శ్రీమాధవేనేన్దుకరాత్మజేన. 10

లోకమున మనుజసామాన్యముగ జనించురోగముల నిర్ణయించుటకై ఇతర గ్రంథములయం దచ్చటచ్చట జెప్పబడిన రోగనిదానము లక్షణములు మున్నగు వాని నన్నింటిని సంగ్రహించి యొక్కెడ గ్రహింపదగునట్లు, ఇందుకరుని తనయుండగు మాధవకరునిచే నన్నింటి నొకటిగ జేర్చి యీరుగ్వినిశ్చయము గ్రంథరూపముగ జెప్పం బడియె.

(చరకసుశ్రుతాదిగ్రంథములయందు నిదానభాగమున రోగలక్షణాదులు చెప్పబడియున్నను కొన్నిగ్రంథములలో కొన్ని విశేషనిదానములు చెప్పబడినవి, కొన్ని విడువబడినవి. కావున ననేకగ్రంథముల జదివినగాని పూర్తిగ రోగలక్షణముల నరయుటకు వలనుపడదు. వానినన్నింటి నానాగ్రంథములనుండి సంగ్రహించి యీగ్రంథమున పొందుపరుపబడినవి ; కావున ననేకగ్రంథముల జదువు ప్రయాసము లేక యీగ్రంథమున నొక్కదానియందే నానావిధరోగలక్షణము లన్నింటిని గ్రహింప సౌకర్యముగ నుండును ; కావున నీగ్రంథము ప్రాచీనగ్రంథములలో గతార్థము కాజాలదని యెరుంగునది. మరియు చరకాదులు నిదానము నంతను నొక్కయెడ జేర్చి చెప్పక, పలురోగముల నిదానముల నాయాచికిత్సాభాగములతో జేర్చి చెప్పినందున నిదానభాగము నేరికొనుట కష్టమగును.)

### గ్రంథాంత మంగళము

యత్కృతం సుకృతం కిఞ్చిత్ కృత్వైవం రుగ్వినిశ్చయమ్,
ముఞ్చన్తు జంతవ స్తేన నిత్యమాతఙ్కసంతతిమ్. 11

ఈ గ్రంథమున జెప్పబడిన ప్రకారము యుక్తియుక్తముగ రోగముల నిర్ణయించి మున్ను కొంచెమైన పుణ్యము చేసియున్నచో, అట్టి పుణ్యపరిపాకమువలన మనుజులందఱును నానావిధ రోగములనుండి విముక్తులై సుఖించెదరుగాత!

ఇతి శ్రీమాధవకరవిరచితం మాధవనిదానం
సర్వం సమాప్తమ్.

# ౨౧. నిదాన పరిశిష్టమ్

## స్నాయుక నిదానమ్

### స్నాయుకసంప్రాప్తి, లక్షణంబులు

శాఖాసు కుపితో దోషః శోథం కృత్వా విసర్పవత్,
భినత్తి తత్క్షతే తత్ర సోష్మ స్నాయుం విశోష్య చ. 1
కుర్యాత్ తన్తునిభం జీవం వృత్తం శ్వేతద్యుతిం బహిః,
శనైశ్శనైః క్షతాద్యాతి ఛేదాత్ కోపముపైతి చ. 2
తత్పాతాత్ శోథశాన్తిస్స్యాత్ పునః స్థానాన్తరే భవేత్,
సస్నాయుకేతి విఖ్యాతః, క్రియోక్తాత్ర విసర్పవత్. 3
బాహ్వోర్యద్విప్రమాదేన త్రుట్యతే జఙ్ఘయోరపి,
సఙ్కోచం ఖఞ్జతాం చైవ ఛిన్నతన్తుః కరోత్యసౌ. 4

కాళ్లు చేతులు మున్నగు శరీరమునందలి శాఖలయందు వాతాదిదోషములు ప్రకోపమునొంది వ్యాపించి విసర్పముబోలె శరీరమునందెల్ల తీవ్రముగ వ్యాపించు స్వభావము కల వాపును కల్గించును. కొంతకాలమునకు అట్టి దోషము ఆ వాపును పగులజేయును. మరియు నాపుండు గాయమునందు నుండిన ఉష్ణముతోగూడిన స్నాయువును (సన్నని నరమును) శోషింపజేసి తంతువు (దారము) వంటిదియును వర్తులంబును తెల్లనిరంగు కల్గినదియు నగు జంతువును కల్గించును. అయ్యది పుండునుండి మెలమెల్లగ బైట వ్యాపించును. దానిని ఛేదించినను, కొన్ని కారణములచే నది తెగినను మిక్కిలి ప్రకోపము నొందును. అయ్యది మొదలంట పడిపోయినయెడ నచ్చోట నుండు వాపు శాంతి నొందును. అంతట నిలువక మరల వేరొండుస్థలమున మునుపటివలెనే పుట్టి బాధించు చుండును. ఈవ్యాధి స్నాయుక మని (నారికురు పని) చెప్పబడును.

ఈవ్యాధికి విసర్పమునకుజేయు చికిత్సాక్రమమును జేయవలెను. మరియు నీవ్యాధి బాహువులయందైనను పిక్కలయందైనను జనించినపుడు ప్రాటు వేడలు సమయమున ప్రమాదవశమునంజేసి యాతంతువునుబోలి నరముతోగూడిన జంతువు నడుమ తెగినయెడ కాళ్లుచేతులు ముడుచుకొనును. లేక కుంటి యగును. (ఇది స్నాయువు నాశ్రయించి పుట్టునది కావున స్నాయుకమని యన్వర్థముగ జెప్పబడును.)

### స్నాయుకరోగమున వాతికాదిభేదములు

వాతేన శ్యావరూక్షః సరు; గథదహనాన్నీలపీతః, సదాహః,
యః శ్వేతః శ్లేష్మణా స్యాత్ పృథుగరిమయుతో(ఽథ ద్విదోషో)
దోషయుగ్మాత్ ద్విలిఙ్గః;
రక్తేనాఽరక్తకాన్తిః (సమధికదహనో; ఽథాఖిలైః సర్వలిఙ్గః,)
సమధికదహనః, సర్వజస్సర్వలిఙ్గః;
రోగోఽసావష్టధేత్థం మునిభిరభిహితః స్నాయుకస్తన్తుకీటః. 5

(పైజెప్పిన స్నాయుకరోగము, వాత-పిత్త-కఫ-వాతపిత్త-వాతకఫ-పిత్తకఫ-రక్త-సన్నిపాతములచే వేరువేర జనించుటంజేసి యెనిమిదివిధములుగ నుండును.) అందు వాతమున కల్గిన స్నాయుకము శ్యామవర్ణంబును రూక్షంబునై నొప్పి కల్గియుండును. పిత్తమున జనించినది నల్లగనైనను పచ్చగనైనయుండి తీవ్రమైన మంట కల్గియుండును. కఫమున గల్గినది శ్వేతవర్ణంబై పెద్దదిగను లావుగను ఉండును. వాతాదిదోషముల మూంటిలో రెండేసిదోషముల సంసర్గముచే గల్గినది ఆయాదోషమునకు వేరువేరుగ జెప్పబడిన లక్షణములలో రెండేసిదోషముల లక్షణములు కల్గియుండును. రక్తముచే గల్గినది మిక్కిలి రక్తవర్ణంబై తీవ్రమైన మంట కల్గియుండును. మూడుదోషముల (సన్నిపాతముచే) గల్గినది మూడుదోషములకును వేరువేరుగ జెప్పిన లక్షణములన్నియు కల్గియుండును. ఇత్తెరంగున స్నాయుకరోగము ఎనిమిదివిధములుగ నుండునని మునివర్యులచే జెప్పబడినది. మరియు నీవ్యాధితంతువును (దారము)బోలిన కీటరూపముగ నుండునని యాయుర్వేదవేత్తలచే జెప్పబడినది.

ఇతి స్నాయుకనిదానమ్.

---

## ఫిరఙ్గరోగనిదానమ్

### ఫిరంగరోగసంప్రాప్తి

ఫిరఙ్గసంజ్ఞకే దేశే బాహుల్యేనైవ యద్భవేత్,
తస్మాత్ఫిరఙ్గ ఇత్యుక్తః వ్యాధిర్వ్యాధివిశారదైః. 1
గన్ధరోగః ఫిరఙ్గోఽయం జాయతే దేహినాం ధ్రువమ్,
ఫిరఙ్గిణోఽఙ్గసంస్పర్శాత్ ఫిరఙ్గిణ్యాః ప్రసఙ్గతః. 2
వ్యాధిరాగన్తుజో హ్యేషః, దోషాణామత్ర సఙ్క్రమః,
భవేత్తల్లక్షయేత్తేషాం లక్షణైర్భిషజాం వరః. 3

* ఫిరంగ మనుదేశమున తరుచుగపుట్టి వ్యాపించువ్యాధి విశేషము ఫిరంగరోగ మని వ్యాధిలక్షణముల దెలిసిన వైద్యులు చెప్పెదరు. ఫిరంగిదేశమున విశేషముగ పుట్టుటంజేసి యీఫిరంగ మనునది యన్వర్థముగ జెప్పబడునని భావము. (దీనిని లోక మున పరంగిరోగ మనియు వాడెదరు.) మరియు నీఫిరంగరోగము మనుజులకు సంబంధ విశేషమున సంభవించును. ఈఫిరంగరోగము కలవారి యంగస్పర్శమువలనను, ఈవ్యాధి కలస్త్రీతో సంభోగముచేయుటవలనను ఈరోగము కల్గును. లేక ఫిరంగదేశముననుండు వారి స్పర్శముచేతను, సంబంధముచేతను సంభవించును. కావున నిది సంసర్గరూపమగు నాగంతుకారణమున జనించును. అట్టి కారణమున కల్గినను వాతాదిదోషములు సంక్ర మించియే యుండును. అట్టి దోషలక్షణములబట్టి యీవ్యాధియందు వాతాదిదోష సంబంధము నూహించునది.

## ఫిరంగరోగభేదములు, వానిలక్షణములు

ఫిరఙ్గస్త్రివిధో జ్ఞేయః బాహ్యాభ్యన్తరస్తథా,
బహిరన్తర్భవశ్చాపి తేషాం లిఙ్గాని చ బ్రువే. 4
తత్ర బాహ్యః ఫిరఙ్గస్స్యాత్ విస్ఫోటసదృశోఽల్పరుక్,
స్ఫుటితో వ్రణవద్వైద్యైః సుఖసాధ్యోఽపి స స్మృతః. 5
సన్ధిష్వాభ్యన్తరస్స స్యాత్ ఆమవాత ఇవ వ్యథామ్,
శోఫం చ జనయేదేషః కష్టసాధ్యో బుధైః స్మృతః. 6

పైజెప్పిన ఫిరంగరోగము బాహ్య మనియు, అభ్యంతర మనియు, ఉభయజ మనియు మూడు విధములు. అందు బాహ్య మనునది స్ఫోటకములబోలె బొబ్బలై స్వల్పమైన బాధ కల్గియుండును. (ఇది శరీరముపై కేవలము చర్మము నాశ్రయించి జనించున ది కావున బాహ్య మనబడును. కావుననే నొప్పి కొంచెముగ నుండును.)పగిలినయెడ దీనికి వ్రణములకు చేయు చికిత్స చేయవలెను. ఇయ్యది సుఖసాధ్యముగ నుండును. (ఇదియే చిట్లు పిరంగి.)

అభ్యంతరమగు ఫిరంగరోగము శరీరమునందలి సంధుల (కీళ్ల) యందు పైజెప్పిన రీతిగ స్ఫోటకములవలె జనించును. (ఇది లోపల నుండు మాంసాదిధాతువులలోనుండి జనించునది కావున అభ్యంతర మనబడును.) ఈవ్యాధియందు కీళ్లలో నామవాతమును బోలె వాపును నొప్పియు కల్గియుండును. కావుననే యిది కష్టసాధ్యముగ నుండును.

(పైజెప్పినరీతిగ నంతర్బహిః ప్రదేశములు రెంటియందును వ్యాపించి సంభవించి యుభయలక్షణములును కల్గినది బహిరంతర్భవ మని యెరుంగునది. కావుననే దీనిలక్ష ణము ప్రత్యేకముగ జెప్పబడదయ్యె.)

* పరంగి యని గూడ వాడుక గలదు.

## ఫిరంగరోగోపద్రవములు

కార్శ్యం బలక్షయో నాసాభఙ్గో వహ్నేశ్చ మన్దతా,
అస్థిశోషోఽస్థివక్రత్వం ఫిరఙ్గోపద్రవా అమీ. 7

శరీరము కృశించుట, బలము నశించుట, ముక్కు వంకరయగుట, జాఠరాగ్ని మందగించుట, శరీరమునందలి యస్థులు శుష్కించుట, అయ్యవి వక్రములగుట ఇవి యన్నియుం ఫిరంగరోగమున గల్గు నుపద్రవములు.

## ఫిరంగరోగసాధ్యాసాధ్యవిభాగము

బహిర్భవో భవేత్సాధ్యః నవీనో నిరుపద్రవః,
ఆభ్యన్తరస్తు కష్టేన సాధ్యస్స్యాదయమామయః. 8
బహిరన్తర్భవశ్చాపి క్షీణస్యోపద్రవైర్యుతః,
వ్యాప్తో వ్యాధిరసాధ్యోఽయం ఇత్యాహుర్మునయః పురా. 9

బహిర్భవమై నవీనముగ జనించి యుపద్రవములు లేకుండు ఫిరంగరోగము సాధ్యమగును. (ఇయ్యది కేవలము చర్మగతము కావున సాధ్య మని భావము.) ఆభ్యంతరమైనది (లోభాగమునందుండు మాంసాదిధాతువుల నాశ్రయించియుండుటంజేసి) కష్టముచే సాధింపందగినదియైయుండును. బహిరంతఃప్రదేశముల రెంటినాశ్రయించి పుట్టినదియు, శరీరము క్షీణించినవానికి పుట్టినదియు, పైజెప్పిన యుపద్రవములతో గూడినదియు అసాధ్యమగును. ఇత్తెరంగున ప్రాచీనులగు ఋషిపుంగవులు చెప్పిరి.

ఇతి ఫిరఙ్గనిదానమ్.

---

# సోమరోగనిదానమ్

## సోమరోగసంప్రాప్తి, లక్షణము

స్త్రీణామతిప్రసఙ్గేన శోకాచ్చాపి శ్రమాదపి,
అతిసారకయోగాద్వా గరయోగాత్తథైవ చ. 1
ఆపస్సర్వశరీరస్థాః క్షుభ్యన్తి ప్రస్రవన్తి చ,
తస్యాస్తాః ప్రచ్యుతాః స్థానాత్ మూత్రమార్గం వ్రజన్తి హి. 2
ప్రసన్నా విమలాశ్శీతాః నిర్గన్ధా నీరుజస్సితాః,
స్రవన్తి చాతిమాత్రం తాః సా నశక్నోతి దుర్బలాః. 3
వేగం ధారయితుం తాసాం న విన్దతి సుఖం క్వచిత్,

తమ శక్తికిమీరి సంభోగముచేయుట, శోకము, శ్రమము, అతిసారము, గరము (పెట్టుడుమందు) అను నీ కారణములచేత స్త్రీలకు శరీరమునందెల్ల వ్యాపించియుండు

జలరూపమంతయు సంక్షోభమునొంది తమతమ స్థానములనుండి చలనమునొంది మూత్రాశయమునజేరి మూత్రమార్గమునుండి విశేషముగ స్రవించును. అట్లు స్రవించు నా జలము నిర్మలంబును చల్లనైనదియు, ఏవిధమైన వాసనయు లేనిదియు, తెల్లనిరంగుకల్గినదియునై వెడలును. అయ్యది యపరిమితముగ స్రవించుటవలన నాస్త్రీకి చాల బలము హీనమై దానివేగమును కొంచెమైన నిలుపజాలక యొకప్పుడైన సుఖములేక కష్టపడు చుండును. (గరలక్షణము విషనిదానమున, "సౌభాగ్యార్థం...గరశ్చాప్యుపజాయతే" (విష. శ్లో. 32.) అని చెప్పబడినది. ఇది పురుషుడు స్త్రీకి ప్రయోగించినప్పుడీరోగ మును కలుగచేయునని తెలియవలెను.)

## సోమరోగమునగల్గు విశేషలక్షణములు

శిరశ్శిథిలతా తస్యాః ముఖం తాలు చ శుష్యతి. 1
మూర్ఛా జృమ్భా ప్రలాపశ్చ త్వగ్రూక్షా చాతిమాత్రతః,
భక్ష్యైర్భోజ్యైశ్చ పేయైశ్చ న తృప్తిం లభతే క్వచిత్. 5

పైజెప్పిన విధముగ స్రవించుస్త్రీకి శిరస్సు శిథిలముగ నుండును. నోరును తాలువులును ఎండును. మూర్ఛ గ్రమ్మును. ఒడలి విరుపులును ఆవలింతలును కల్గును. అసంబద్ధముగ మాటలాడును. శరీరముపై చర్మము స్నిగ్ధభావమంతయు నశించి మిక్కిలి రూక్షముగ నుండును. భక్ష్యములను భోజ్యములను పేయములను విశేషముగ నుపయోగించు చున్నను ఒకప్పుడు తృప్తిలేకుండును.

## సోమరోగనిరుక్తి

సన్ధారణాచ్ఛరీరస్య తా ఆపః సోమసంజ్ఞితా,
తతః సోమక్షయాత్ స్త్రీణాం సోమరోగ ఇతి స్మృతః. 6

శరీరమునందలి ద్రవరూపమైన జలభాగమంతయు శరీరమును ధరించుట కాధారమై యుండును. కావున నాజలభాగము సోమ మని (సౌమ్యగుణవిశిష్ట మని) చెప్పబడును. పైజెప్పినరీతిగ నది క్షీణించునట్టి రోగము కావున సోమరోగమని చెప్పబడును.

ఇతి సోమరోగనిదానమ్.

---

# శీ త లా ని దా న మ్

## శీతలోత్పత్తి, దానిసంఖ్యాభేదము

దేవ్యా శీతలయాఽఽక్రాన్తా మసూర్యః శీతలా బహిః,
జ్వరయేయుః యథా భూతాధిష్ఠితో విషమజ్వరః. 1
తాశ్చ సప్తవిధాఃఖ్యాతాస్తాసాం భేదాన్ ప్రచక్ష్మహే,

శీతల యను నొక క్రూరదేవతచే నావహింపబడినవారికి మసూరములు స్ఫోటకములు కల్గును. ఆస్ఫోటకములు కల్గుటకుముందు భూతావేశమునగల్గు విషమజ్వరమును బోలిన లక్షణములతోఁగూడి జ్వరము సంభవించును. (ఇయ్యది శీతల యను క్రూరగ్రహావేశమున గల్గుటంజేసి శీతలారోగ మనియే చెప్పబడును) అట్టి శీతలావేశమున గల్గిన స్ఫోటకములు తాఁకినచోఁ చల్లగనుండును. ఈవ్యాధి యేడువిధములుగ భేదములు కల్గియుండును. అవియన్నియు నీక్రింద వివరింపబడును. (దీనిని అమ్మతల్లి యని లోకమున వ్యవహరించెదరు.)

### బృహతీ శీతలాలక్షణము

జ్వరపూర్వం బృహత్ స్ఫోటైః శీతలా బృహతీభవేత్. 2
సప్తాహాన్నిస్సరత్యేవం సప్తాహాత్పూర్ణతాం వ్రజేత్,
తత స్తృతీయే సప్తాహే శుష్యతి స్ఖలతి స్వయమ్. 3

తొలుత పైజెప్పినవిధముగ జ్వరము వ్యాపించి పిమ్మట పెద్దబొబ్బలతోఁగూడి వ్యాపించునది 'బృహతీశీతల' యని యన్వర్థముగ జెప్పబడును. (దీనిని 'పెద్దమ్మవారు' అని పైపదముయొక్క అర్థముననుసరించి లోకమున జెప్పెదరు) మరియు నిది ప్రారంభమున తొలుత జ్వరము ప్రారంభమై యేడుదినములవరకును (నిరంతరముగ) జ్వరము వ్యాపించును. పిదప నేడుదినములకు (స్ఫోటకములు) పరిపూర్ణములుగ నేర్పడును. పిమ్మట నేడుదినములకు స్ఫోటకములన్నియు నానాట తమంతటనె యెండి (చెక్కులు గట్టి) నానాట తమంతనే రాలును.

ఇచ్చట నీసంగ్రహము నెరుంగునది:—శీతలాదేవి యావేశించుటచే స్ఫోటకరూపమైనవ్యాధి సంభవించును. ఈవ్యాధి జనించుటకుముందు తీవ్రమైనజ్వరము ప్రారంభించును. ఈజ్వరము భూతావేశమునగల్గు నాగంతు విషమజ్వరమునుబోలె లక్షణములు కల్గి యేడుదినములవరకును విడుపక వ్యాపించియుండును. ఈజ్వరమునే "కేచిద్భూతాభిషంగోత్థం బ్రువతే విషమజ్వరమ్" (జ్వరనిదానము. శ్లో. 44) అని చెప్పిరి. మరియు నీజ్వరమునకు సామాన్యముగ జెప్పిన లక్షణములుగాక "భూతాభిషంగా దుద్వేగోహాస్య గారవ రోదనమ్" (మా. ని. శ్లో. 37) అని చెప్పిన యుద్వేగాదులును, తబ్బిబ్బు మాటలును, కలవరింతలును కల్గును. ఈప్రకారము ఏడహోరాత్రములు నిరంతరముగ జ్వరమువ్యాపించి ఎనిమిదవనాడు మొదలుజేసి స్ఫోటకములు పొడసూప నారంభించును. అట్టి స్ఫోటకము రేగుపండంతేసి యాకారముకల్గి నిగనిగలాడుచు నీటిబుడగలవలె పైకుబికి తాకినయెడ పైకి చల్లగను, లోపల నీటితోనిండియు నుండును. ఈస్ఫోటకములనే అమ్మవారి ముత్యము లని లోకమున జెప్పెదరు. అట్టి స్ఫోటకములు ఏడుదిన

ములకునిండి నిబిడితములై పూర్తియగును. పిదప మరుసటిదినమునుండి స్ఫోటకములు వాడు సూపనారంభించి నానాట తమంతనే యాథార్థ్యముతగ్గి యేడుదినములకు ఎండి చెక్కలై తమంతటనే పక్కుగట్టి రాలును. ఇది వాడు సూపనారంభమైన యవస్థనే యమ్మవారు దిగుచున్నదని లోకమున జెప్పెదరు. దీనిని 'బృహతీశీతల' యని ఋషి వరులు చెప్పిరి. ఈయర్థము ననుసరించియే లోకమున 'పెద్దమ్మవారు' అని చెప్పెదరు.

## కోద్రవ యను శీతలాలక్షణము

వాతశ్లేష్మసముద్భూతా కోద్రవా కోద్రవాకృతిః,
తాం కశ్చిత్ప్రాహ పక్వేతి సాతు సాకం నగచ్ఛతి. 4
జలశూకవదఙ్గాని సావిధ్యతి విశేషతః,
సప్తాహాద్ద్వాదశాహాద్వా శాన్తిం యాతి వినౌషధమ్. 5

వాతకఫములు ప్రకోపమునొంది *ఆరుకలయంత యాకారముకల స్ఫోటకముల కల్గించును. ఇది కోద్రవ యను శీతల యని చెప్పెదరు. ఇయ్యది పక్వమగునని కొందరు చెప్పెదరుగాని యియ్యది పక్వము కానేరదు. ఇది జలశూకములుబోలె (చుల్లచుండు వలె) సన్ననిబొబ్బలై శరీరమునందెల్ల వ్యాపించి చేతదాకినచో చురుకుచురుక్కు మని ముల్లుగ్రుచ్చినవిధముగ బాధకల్గును. ఇయ్యది యేడుదినములకు పిమ్మటనైనను, పండ్రెండు దినములకు పిదపనైనను చికిత్సజేయకున్నను తమంతనే శమించును.

## పాణిసహ యను శీతలాలక్షణము

ఉష్ణణా తూష్ణజా రూపా సకణ్డూః స్పర్శనప్రియా,
నామ్నా పాణిసహా ఖ్యాతా సప్తాహాచ్ఛుష్యతిస్వయమ్. 6

శరీరమునందలి (త్వగ్గతమైన) ఆవిరిచేత స్ఫోటకములు కల్గును వీనియందు విశేషముగ జిలకల్గి చేతచరుముచున్నచో హితముగ నుండును. దానంజేసి యిది పాణిసహ యని చెప్పబడు శీతల. ఇయ్యది యేడుదినములు కడచినవెంటనే తమంతట శమించును. ఎండును.

## సర్షపిక యను శీతలాలక్షణము

చతుర్థీసర్షపాకారా పీతసర్షపవర్ణినీ,
నామ్నా సర్షపికా జ్ఞేయాఽభ్యఙ్గమత్ర వివర్జయేత్. 7

నాల్గవశీతల పచ్చని యావాలవంటి యాకారంబును, రంగునుకల్గిన స్ఫోటకములు కల్గియుండును. దీనిని యాకారసాదృశ్యముచే సర్షపిక యని చెప్పెదరు. ఈ వ్యాధియందు అభ్యంగనమును విసర్జించనలెను.

* కోద్రవము లనగా కొఱ్ఱ లందురు.

### రాజిక యను శీతలాలక్షణము

కిఞ్చిదూష్మనిమిత్తేన జాయతే రాజికాకృతిః,
ఏషా భవతి బాలానాం ముఖం శుష్యతి చ స్వయమ్. 8

శరీరమునగల్గిన యూష్మచే రాజికల (సన్నని నల్లావాల) వంటి యాకారముకల్గిన స్ఫోటకములు కల్గును. ఇది యాకృతిసాదృశ్యమునుబట్టి రాజిక యని చెప్పబడును. ఇదియు చికిత్సలేక తనంతటనే ముఖమువాడి శమించును. ఇయ్యది పసిబిడ్డలకు కల్గును. (దీనిని నూకలమ్మ యని లోకమున జెప్పెదరు).

### లోహిత యను శీతలాలక్షణము

గోత్రవజ్జాయతే షష్ఠీ లోహితోత్తతమణ్డలా,
జ్వరపూర్వా వ్యథా యుక్తా జ్వరస్తిష్ఠేద్దినత్రయమ్. 9

ఎఱ్ఱనిరంగుకల్గి పైకుబికి మండలాకారములై దద్దులవలె శరీరముపై నంతట వ్యాపించును. ఇది యాఱవ శీతలాభేదము. ఇది సంభవించుటకు ముందు మూడుదినములు జ్వరము వ్యాపించి పిదప పొడసూపును. నవ మొదలగుబాధ కల్గియుండును. దీనిని 'తట్టమ్మవారు' అని లోకమున జెప్పెదరు.

### చర్మజ యను శీతలాలక్షణము

స్ఫోటానాం మేలనాదేషా బహుస్ఫోటాపి దృశ్యతే,
ఏకస్ఫోటా చ కృష్ణాచ బోద్ధవ్యా చర్మజాభిధా. 10

చర్మజ యను శీతల యేడవది. ఇయ్యది యనేకములగు స్ఫోటకములతో శరీరము నందెల్ల వ్యాపించును. అందు స్ఫోటకములు ఒకదానితో నొకటి కలిసి యనేకస్ఫోటకము లొకటిగ నొండొంట కలిసియుండును. వేరొకటి స్ఫోటకము లొండొంట కలియక విడివిడిగ నుండును. ఆస్ఫోటకములు నల్లనిరంగు కల్గియుండును. ఇయ్యది చర్మము నాశ్రయించి పుట్టుటంజేసి చర్మజ యని చెప్పబడును. (దీనిని ఆటలమ్మ యనియు, పైరమ్మ యనియు లోకమున వాడెదరు.)

ఈనిదానపరిశిష్టమున స్నాయు-ఫిరంగ-సోమరోగ-శీతల యను నాల్గు రోగములు చెప్పబడినవి. ఇవి మాధవనిదానాంతర్భూతములు కావు. దానంజేసియే పరిశిష్టమని చెప్పబడినవి. పైజెప్పిన నాల్గురోగములును ప్రాయికముగ సాంక్రామికములు (అంటు వ్యాధులు) అని తెలిసెడి. అందును శీతల యనునది యొక శక్తిరూపమైన దేవత యనియు, ఆశక్తి యావహించుటచే నీరోగము సంభవించుననియు తెలిసెడి. దీనిని అమ్మవారని లోకమున జెప్పునట్టి వాడుకకలదు. దేవతావేశమున గల్గుటచేతనే లోకమునగూడ తదనుగుణముగ అమ్మవారు అని వ్యవహారము వృద్ధపరంపరగ కల్గినది. ఈవ్యాధి సంభవించినపుడు ఏవిధమైన చికిత్సనుజేయక కేవలము బలిపూజా విధానమును ఉపాసనమును

శీతలాదేవి నుద్దేశించి చేయుటయు, దండకము మొదలగు శీతలాస్తుతి పాఠముల జదువుటయు కలదు. ఇంతియేకాక శీతలామంత్రము నుపాసనముచేసినవారు మంత్రమును జపించి శీతలాయంత్రమును కట్టుటయు కలదు. శీతలాధ్యానమున—"నమామి శీతలాం దేవీం...స్ఫోటకార్తిప్రశమనీం మారీ జ్వరనివారిణీమ్" అని యున్నది. పైజెప్పిన విధానములచే నీశీతలారూపమైన స్ఫోటకము నివర్తించుటయు ననుభవసిద్ధముగ నున్నది. ఈవిధానమును లక్ష్యపెట్టక చికిత్సచేసినచో దానివలన వ్యతిరేకము కల్గుటయు ననుభవసిద్ధముగ నున్నది. ఏది యెట్లున్నను ఈవ్యాధియందు తన నియమితకాలముపరకును స్వప్రభావముజూపి, తుదకు తనంతటనే శమించుస్వభావము సైజముగ నున్నది. ఈవిషయమున నేరికిని వివాదముండనేరదు. కావున విజ్ఞులు గమనించెదరుగాక !

నిదానపరిశిష్టమ్ సమాప్తమ్.

ఇతి విశ్వనాథరచితా వ్యాఖ్యా మాధవకృతేర్నిదానస్య,
పరిశిష్టస్య చ సేయం జీయాదాచన్ద్రతారమవనితలే.

ఇతి శ్రీ శ్రీ శ్రీ కాళహస్తిసంస్థాననాథిపాస్థానవిద్వదవతంస సర్వతన్త్రస్వతన్త్ర బ్రహ్మశ్రీ కుంభకోణము లక్ష్మీనృసింహశాస్త్రివరేణ్య చరణకమలసంసేవా సమాసాదిత పాణినీయాది శాస్త్రవిజ్ఞాన సముల్లసితుండును, సుశ్రుతచరకసంహితాష్టాఙ్గ హృదయ పరహితసంహితా ద్యాయుర్వేద తన్త్రాన్తర్వ్యాఖ్యాతయును, శ్రీవైఖానస కులతిలక - ఆయుర్వేదమార్తాణ్డ-భిషఙ్మణి-వైద్యరత్న పణ్డిత దీవి గోపాలాచార్య సంస్థాపితాయుర్వేదాశ్రమాస్థానవిద్వాంసుండును, ఉభయభాషాకవితా విరాజితుండును, శ్రౌత ప్రక్రియాధౌరేయుండును, ఆపస్తమ్బసూత్ర కౌణ్డిన్యగోత్రపవిత్ర నుదురుపాటివంశ పయఃపారావారసుధాకరుండును, వేదవేదాఙ్గశ్రౌతాభిజ్ఞ-బ్రహ్మశ్రీ అగ్నిచిత్ సీతారామవాజపేయయాజి-శ్రీమతీ సీతామ్మాసోమపీథినీ సాధ్వీమతల్లి గర్భసుధాకరుండును, ఉభయభాషా కవితాధురీణ-శ్రౌతాగమధౌరేయ-బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్యయాయజూకానుజుండును నగు వైయాకరణవిద్వాన్-పణ్డిత నుదురుపాటి విశ్వనాథశాస్త్రిచే విరచితంబగు "నిదానవివరణ" మను మాధవనిదానాన్తర్వ్యాఖ్యానము, నిదానపరిశిష్టము సర్వంబును సంపూర్ణము.

ఓం శాన్తిః శ్శాన్తిః శ్శాన్తిః.

చెన్నపురి : 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1965—1000 కాపీలు.